# మానవహక్కులు : పిజి డిప్లొమా

# మానవహక్కులు - తాత్విక భూమిక

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం

హైదరాబాదు - 2004

# పాఠ్య నిర్మాతలు

**సంపాదకులు**

ఆచార్య జి. హరగోపాల్

**రచయితలు**

ఆచార్య జి. హరగోపాల్

ఆచార్య శిశిర్ భట్టాచార్య

డా. ఎ. రఘురామరాజు

డా. ప్రకాష్ సారంగి

డా. తరుణ్ పట్నాయక్

డా. జి. సుదర్శనం

ఎ. సునీత

**కార్యక్రమ సమన్వయకర్త**

ఘంటా చక్రపాణి

**అనువాదం**

డాక్టర్ కె. బాలగోపాల్

డాక్టర్ జి. సుదర్శనం

ఘంటా చక్రపాణి

తల్లం నారాయణ

ఎ. శ్రీనివాస్

నాగసుందరి

శ్రీబాల

వేంకటరమణయ్య

టి. మల్లిఖార్జున

**ముఖచిత్రం**

చంద్ర

115095
29-4-05

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115095
Date 29-4-2005
Call No

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం,
హైదరాబాద్

ప్రథమ ముద్రణ, 2001

© 2000, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం.
అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నయినా ఉపయోగించదలచుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు : డైరెక్టర్ (అకడమిక్), డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
ప్రొ.జి. రాంరెడ్డిమార్గ్, రోడ్ నెం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాదు - 500 033.

Lr. No.629/Dr. BRAOU/DMP/PTG/F.No. 54/J.No. 401/2003-04, Dated: 30.4.2004, Copies: 100

Printed on behalf of the Dr. B.R. Ambedkar Open University, Hyderabad by the Registra
Printed at **M/s Mamata Printers.** Hyderabad.

# పరిచయం

ఇది మానవహక్కుల యుగం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో, అన్ని సమాజాల్లో ఇప్పుడు మానవ హక్కులు ఒక ప్రధానమైన చర్చనీయాంశం. ఒక రకంగా చెప్పాలంటే గడిచిన సహస్రాబ్దిని మనం మానవహక్కుల సహస్రాబ్దిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే మానవహక్కుల భావన వికసించింది, విస్తరించింది ఈ సహస్రాబ్దిలోనే.

మానవ జాతిలో హక్కుల భావన తొలిసారిగా మొలకెత్తిన 13వ శతాబ్ది తొలిరోజుల నుంచి ఈనాటి 21వ శతాబ్ది ఆరంభం దాకా 'మానవ హక్కుల ఉద్యమం' అనేక పరిణామాలకు గురి అయ్యింది. అనేక సిద్ధాంతాలు, అనేక ధోరణులు, దృక్పథాలు చారిత్రక భావనలు మానవహక్కుల భావనకు మరింత పదును పెట్టాయి. పరిపుష్టం చేశాయి. ఇప్పుడు మన దేశంలాంటి అనేక దేశాలు, ఆ దేశాల ప్రజల చేతుల్లో మానవ హక్కులు ఒక వజ్రాయుధం అయ్యింది. ఒక మహోజ్వల ఉద్యమంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఈ ఉద్యమంలో అగ్రభాగాన వుంది.

ఈ నేపథ్యంలో మానవ హక్కుల భావనను జనబాహుళ్యానికి తెలియపరచడం బాధ్యతగా భావించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మానవ హక్కుల విద్యా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఒక డిప్లొమాను ప్రవేశపెట్టాలని విశ్వవిద్యాలయం నిర్ణయించింది. మానవ హక్కుల సంఘం (NHRC) పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా విద్యా కార్యక్రమంలో చేర్చడంతోపాటు, దేశంలోనే తొలిసారిగా ఒక పూర్తిస్థాయి డిప్లొమాను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగులో మీ కందిస్తోంది.

BRAOU

ఐదు కోర్సులుగా వున్న డిప్లొమా కార్యక్రమంలో 'మానవ హక్కులు : తాత్విక భూమిక' ఒక కోర్సుగా చేర్చడం జరిగింది. ఈ కోర్సుకు ఒక సంపుటంగా మీకు అందిస్తున్నాం. ఇందులోని అధ్యయనాంశాలను మొత్తం ఐదు ఖండాలుగా విభజించడం జరిగింది.

అవి : 1. మానవ హక్కులు : మౌలిక భావనలు
2. ఉదారవాద దృక్పథం
3. మార్క్సిస్టు దృక్పథం
4. ప్రత్యామ్నాయ దృక్పథాలు
5. భారతీయ దృక్పథం

ఈ ఐదు ఖండాల్లో మొత్తం 17 అధ్యయన భాగాలు (యూనిట్లు) వున్నాయి. వీటిని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహకారంతో ఆయా రంగాల మేధావులు, మానవ హక్కుల ఉద్యమాలలో భాగస్వాములైన కార్యకర్తలు ఇతర వృత్తి నిపుణులు అధ్యాపకులతో రూపొందించడం జరిగింది. ఈ ప్రయత్నంలో మానవ హక్కులపై తొలిసారి ఒక డిప్లొమాను రూపొందించిన సార్వత్రిక విశ్వవిద్యాలయంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ పాఠ్యాంశాలు కూడా తెలుగులో మొదటిసారిగా వెలువడుతున్న సమాచారం. ఈ పాఠ్యాంశాల అధ్యయనం ద్వారా మానవ హక్కుల పట్ల అవగాహనతో పాటు విద్యార్థులకు ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడే అవకాశం వుంది. అలాగే మానవ హక్కుల కార్యకర్తలకు, ఆ ఉద్యమంలో మమేకమైన వారికి ఈ కార్యక్రమం మార్గ నిర్దేశం చేస్తుంది.

# విషయసూచిక


| | పేజీ. నెం. |
|---|---|
| **ఖండం-1 : మానవ హక్కులు - మౌలిక భావనలు** | |
| భాగం - 1 : మానవహక్కులు విద్య - పరిణామాత్మక దృక్పథం | 1 - 6 |
| భాగం - 2 : మానవ హక్కులు అంటే ఏమిటి | 7 - 15 |
| భాగం - 3 : మానవ హక్కులు - ప్రధాన భావనలు | 16 - 26 |
| భాగం - 4 : విశ్వమానవ హక్కులు - కొత్త కోణాలు | 27 - 35 |
| **ఖండం - 2 : ఉదారవాద దృక్పథం** | |
| భాగం - 5 : మానవ హక్కులు - పరిణామం | 36 - 45 |
| భాగం - 6 : జీన్ జాక్విన్ రూసో, థామస్ పెయిన్ | 46 - 55 |
| భాగం - 7 : లాక్, మిల్, డైసే, రస్సెల్, డ్వార్కిన్ | 56 - 65 |
| **ఖండం - 3 : మార్క్సిస్టు దృక్పథం** | |
| భాగం - 8 : కార్ల్‌మార్క్స్ - మావో | 66 - 75 |
| భాగం - 9 : రోసా లగ్జెంబర్గ్, అంటోనియో గ్రాంసీ | 76 - 86 |
| **ఖండం - 4 : ప్రత్యామ్నాయ దృక్పథాలు** | |
| భాగం - 10 : మూడవ ప్రపంచ దేశాలు - మానవ హక్కుల మీమాంస | 87 - 93 |
| భాగం - 11 : పాలో ఫ్రేయర్ భావాలు | 94 - 99 |
| భాగం - 12 : నోమ్ ఛామ్‌స్కీ | 100 - 107 |
| భాగం - 13 : స్త్రీవాద దృక్పథం | 108 - 115 |
| **ఖండం - 5 : భారతీయ దృక్పథం** | |
| భాగం - 14 : గాంధీ | 116 - 124 |
| భాగం - 15 : లోహియా | 125 - 137 |
| భాగం - 16 : పూలే, అంబేద్కర్ | 138 - 149 |


BRAOU

# ఖండం - I

# మానవ హక్కులు - మౌలిక భావనలు

అధునిక సాంఘిక జీవనంలో మానవ హక్కులకు విశిష్ట ప్రాధాన్యత ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విద్యయొక్క ఆవశ్యకతను నొక్కి చెప్పింది. పౌర రాజకీయ హక్కుల గురించి మరియు సాంఘిక ఆర్థిక సాంస్కృతిక హక్కుల గురించిన అవగాహనను ప్రతి పౌరుడు పెంపొందించుకోవాల్సిన అవసరంవుంది. ఇందుకు సంబంధించిన వివిధ దృక్పథాలు, ప్రధాన సిద్ధాంతాలు, మౌలిక భావాలు మొదటి ఖండంలో చర్చించబడ్డాయి. ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. అవి:


భాగం - 1 : మానవహక్కులు విద్య - పరిణామాత్మక దృక్పథం

భాగం - 2 : మానవ హక్కులు అంటే ఏమిటి

భాగం - 3 : మానవ హక్కులు - ప్రధాన భావనలు

భాగం - 4 : విశ్వమానవ హక్కులు - కొత్త కోణాలు


BRAOU

BRAOU

# భాగం - 1 : మానవ హక్కుల విద్య : పరిణామాత్మక దృక్పథం

**విషయక్రమం**


1.0 ఉద్దేశం

1.1 పరిచయం

1.2 సందర్భం

1.3 పరిధి

1.4 ముఖ్యమైన అంశాలు

1.5 మానవ హక్కుల అధ్యయనం యొక్క ఆవశ్యకత

- 1.5.1 అంచెల వారీ పద్ధతి
- 1.5.2 సంస్కరణాత్మక పద్ధతి
- 1.5.3 యునెస్కో పద్ధతి

1.6 పరివర్తనా దృక్పథం

1.7 హైదరాబాదు విశ్వవిద్యాలయం కోర్సు

1.8 ముగింపు

1.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 1.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- పోస్టు గ్రాడ్యుయేటు డిప్లొమా కోర్సు యొక్క ప్రయోజనం వివరించగలుగుతారు.
- మానవహక్కులపై అంతర్జాతీయ అవగాహన పొందుతారు.
- మానవహక్కుల అధ్యయనం యొక్క ఆవశ్యకత తెలుసుకుంటారు.

BRAOU

## 1.1 పరిచయం

1995 నుండి 2004 వరకు గల దశాబ్దాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విద్యా దశాబ్దంగా ప్రకటించింది. 1948 డిశంబరు 10న ప్రపంచ మానవ హక్కుల ప్రకటన వెలువడినప్పటి నుంచి భారత దేశం కూడ మానవ హక్కుల పరిరక్షణకు తన కృషిని కొనసాగిస్తోంది. పౌర, రాజకీయ హక్కుల గురించి మరియు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల గురించి రెండు సందర్భాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులలోను భారతదేశం చురుకైన పాత్ర నిర్వహించింది. మానవ హక్కుల అధ్యయనం విషయంలో ఐక్యరాజ్య సమితి నిర్ణయాన్ని కూడ భారతదేశం అంగీకరించింది. జాతీయ మానవ హక్కుల సంఘం కూడ ఈ కృషిని కొనసాగిస్తున్నది. జాతీయ మానవ హక్కుల సంఘంతో పాటు అనేక సంస్థలు, పరిశోధనా సంస్థలు, మరియు విశ్వవిద్యాలయాలు కృషి చేస్తున్నాయి.

## 1.2 సందర్భం

మానవ స్వేచ్ఛ మరియు ఆత్మగౌరవములకు సంబంధించి, మానవ జాతి గత చరిత్రలో మరే ఇతర శతాబ్దం చూడనన్ని ఎగుడుదిగుడులను ఇరవయ్యో శతాబ్దం అనుభవించింది. వలస దేశాల ప్రజల యొక్క స్వాతంత్ర్య పోరాటానికి ఈ శతాబ్దం నిలువెత్తు దర్పణం. వలస పాలనకు వ్యతిరేకంగా భారతీయులు సాగించిన పోరాటాలతో

పాటు అంతర్జాతీయంగా రష్యాలోనూ, చైనాలోనూ వచ్చిన విప్లవాలను, మరెన్నో దేశాల్లో పీడిత ప్రజల సాంఘిక, ఆర్థిక పోరాటాలను ఈ శతాబ్దం చూసింది. స్వేచ్ఛా జీవనం కోసం ఎంతోమంది వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ ఎన్నో త్యాగాలు చేసారు. థామస్ పైన్ మాటలలో చెప్పాలంటే భావితరాలు స్వేచ్ఛగా, సంతోషంగా సౌఖ్యంగా జీవించటానికి ప్రపంచవ్యాప్తంగా స్వాతంత్ర్య పిపాసతో ప్రజలు ఎన్నో త్యాగాలను సునాయాసంగా చేసారు. పైన పేర్కొన్న ఉత్తేజకర అంశాలతోపాటు మానవాళి చరిత్రలో అత్యంత భయంకరమైన రెండు ప్రపంచ యుద్ధాలను, అవి మిగిల్చిన విధ్వంసాన్ని, సామూహిక హత్యలను,అత్యాచారాలను, తీవ్రవాదాన్నీ, అన్నింటినీ మించి కనీవినీ ఎరుగని ఫాసిస్టు నిర్బంధాన్నీ, అణుబాంబులను, రసాయనిక ఆయుధాలను ఈ శతాబ్దం చూసింది. ఈ భయంకర వాతావరణంలో స్వేచ్ఛా జీవనం ఒక ప్రశ్నగానూ, పోరాటంగానూ మారినవి. ఈ పరిస్థితి మానవ హక్కుల అధ్యయనం యొక్క ఆవశ్యకతను బలోపేతం చేసింది.

## 1.3 పరిధి

మనుషులు తమ తోటివారిపట్ల సహజంగానే కొంత ఆసక్తి కనబరుస్తారని, స్పందిస్తారనే ప్రాథమిక భావన నుండి మానవ హక్కుల అధ్యయనం మొదలవుతుంది. మానవీయ దృక్పథం పునాదిగా ఒక అర్థవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణమే మానవ హక్కుల అధ్యయనం యొక్క లక్ష్యం. ప్రాచీన గ్రీకు లేదా రోమన్ కాలం నాటి బానిసల పోరాటాలలో మానవ హక్కుల ప్రస్తావన మనం చూడవచ్చు. మానవ నాగరికత ప్రారంభంలోనే స్పార్టకస్ తిరుగుబాటులో మనం మానవ హక్కుల స్ఫూర్తిని చూడవచ్చు. స్పార్టకస్ అందించిన స్ఫూర్తిని, అనేక ఐరోపా దేశాలు మరింత ముందుకు తీసుకుపోవటం, నాటి సంఘటనల ఫలితాలను మనం 1215 సం॥లో బ్రిటన్‌లో జరిగిన మాగ్నాకార్టా మరియు ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ చేసిన మానవ హక్కుల ప్రకటన రూపంలోనూ చూడవచ్చు. అనంతర కాలంలో వచ్చిన సామ్యవాద ఉద్యమం, మార్క్సిస్టు దృక్పథం మానవ హక్కుల అర్థాన్ని, పరిధినీ, మరింత పెంచాయి. మానవ హక్కుల కోసం ప్రపంచ మానవాళి చేసిన పోరాటాలకు, త్యాగాలకు పరాకాష్ఠగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనను చెప్పుకోవచ్చు.

BRAOU

మానవ హక్కుల విషయంలో గడచిన ఐదు దశాబ్దాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నవి. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రకటన, వలస దేశాల స్వాతంత్ర్య సముపార్జన, ఎన్నో అంతర్జాతీయ సమావేశాలు, ఒప్పందాల అనంతరం కూడా ఆ దేశాలు ఎన్నో ప్రాథమిక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దాదాపు అన్ని దేశాలలోనూ మానవ హక్కుల ఉల్లంఘన నిరాటంకంగా జరుగుతూనే ఉంది. ఇరవయ్యో శతాబ్దం చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా అత్యంత హింసాపూరిత అమానుష చర్యలు మరింత విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మానవ హక్కుల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావలసిన ఆవశ్యకత మరింత పెరిగింది.

## 1.4 ముఖ్యమైన అంశాలు

మానవ హక్కుల అధ్యయనం ముఖ్యంగా మూడు అంశాల పట్ల శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఉన్నది. అవి మొదటిది ప్రస్తుత నాగరిక ప్రపంచపు సమస్యల వివరణ, రెండవది ఒక తరం అనుభవాలను మరో తరానికి అందించటం. మూడవది మార్పు క్రమాన్ని వేగవంతం చేయటం. అనేక పరస్పర విరుద్ధమైన అంశాల కారణంగా ప్రస్తుత నాగరికత అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది. ఈ సవాళ్ళు వ్యక్తిగత స్థాయిలో, స్వార్థ - నిస్వార్థ పరతలోను, వ్యవస్థా స్థాయిలో, వ్యక్తిగత - సమిష్టి అంశాల మధ్య, మరి రాజ్యబలం - ప్రజాస్వామ్య అంశాల సంఘర్షణలలో ఈ వైరుధ్యాలని చూడవచ్చు. స్వలాభాపేక్ష వల్ల మాత్రమే అభివృద్ధి వేగవంతమవుతుందని కొన్ని ప్రగతి నమూనాలు భావిస్తున్నాయి.

సామ్యవాద వ్యవస్థలు బలహీనపడటం ఈ నమ్మకాన్ని మరింత దృఢపరచినట్లు అయింది. అయినప్పటికీ, మానవునిలో సహజంగా ఉండే మానవత్వాన్ని, నిస్వార్థతను గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇది సాధ్యపడాలంటే, చారిత్రాత్మక అంశాలను ఆధారంగా తీసుకుని వాటివలన కలుగు ప్రయోజనాలను గురించి భవిష్యత్తు తరాల వారికి తెలియచేయాలి. గతాన్ని విమర్శనాత్మక దృష్టితో పరిశీలించటం వలన మన చైతన్యం అభివృద్ధి చెందటమే కాక ప్రజాస్వామిక జీవితాన్ని నెలకొల్పటానికి తగిన స్పృహ ఏర్పడుతుంది. ఈ ప్రయత్నం వ్యక్తిగత, సామూహిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో నిరంతరం కొనసాగాలి. ఈ ప్రక్రియలో మానవ హక్కుల విద్య ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.

## 1.5 మానవ హక్కుల అధ్యయనం యొక్క ఆవశ్యకత

మానవ హక్కుల విద్య మూడు పద్ధతుల్లో ఉంటుంది.

(i) అంచల వారీ పద్ధతి (Incrementalist Approach)

(ii) సంస్కరణ పద్ధతి (Reformative Approach)

(iii) పరివర్తనా దృక్పథం (Transformative Approach)

### 1.5.1 అంచలవారీ పద్ధతి

మానవ హక్కుల అధ్యయనం విషయంలో ఈ పద్ధతి విస్తృత ప్రచారం పొందింది. ఈ పద్ధతిలో సాంఘిక, ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకోవటం జరుగుతుంది. దీనిని సమతుల్య నమూనాగా పేర్కొనవచ్చును. ఈ పద్ధతిలో కొద్దిపాటి మార్పును మాత్రమే అనుమతిస్తారు. అందువలన ఇది అభ్యాసకునికి తగిన సమాచారాన్ని మాత్రమే అందిస్తుంది. కానీ వారిలో పూర్తి పరివర్తన తీసుకురాదు. ఈ పద్ధతికి కొన్ని పరిమితులున్నాయి. విద్యార్థులకు కేవలం కొంత సమాచారాన్ని అందించినంత మాత్రాన వారిలో మానవ హక్కుల స్పృహ పెంపొందదు. అంతేకాక మానవ హక్కుల అధ్యయనం కేవలం హక్కుల వరకు పరిమితం చేయటం వలన ఆశించిన ఫలితాలు రావు. కాబట్టి మానవ హక్కుల అధ్యయన విషయాన్ని పరీక్ష విధానానికి అతీతంగా చూడాల్సిన అవసరం ఉంది.

BRAOU

### 1.5.2 సంస్కరణాత్మక పద్ధతి

ఈ పద్ధతిని అంచలవారీ పద్ధతికి ఒకింత మెరుగైనదిగా చెప్పవచ్చును. ఈ పద్ధతి విద్యార్థి ఆలోచనలను ప్రభావితం చేయగలదు. ఈ పద్ధతి విద్యార్థిలో మానవ హక్కుల స్పృహను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుంది. సామాజిక ఆర్థిక కారణాల మార్పు అనివార్యమని ఈ పద్ధతి వివరిస్తుంది. మానవ హక్కుల చారిత్రక పరిశీలన కూడా ఈ పద్ధతిలో ఉంటుంది. హక్కుల కోసం జరిగిన, జరుగుతున్న ప్రజాపోరాటాలను ఈ పద్ధతిలో చర్చించవచ్చు. మానవ హక్కుల పట్ల కనీస శ్రద్ధాసక్తులను, పరిశీలనా గుణాన్ని ఈ పద్ధతి ద్వారా వ్యక్తులలో కలిగించవచ్చును. ఈ పద్ధతిని యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి.

### 1.5.3 యునెస్కో పద్ధతి

మానవ హక్కుల పట్ల స్పృహను, చైతన్యాన్ని కలిగించి భావితరాలను ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత పాఠశాలలకే ఉన్నదని యునెస్కో తన మానవ హక్కుల పత్రంలో పేర్కొన్నది. మానవ హక్కుల అధ్యయనంలో సామాజిక ఉద్యమాలను, విప్లవాలను, స్వాతంత్ర్యపోరాటాలను, వలస దేశాల విముక్తి క్రమాన్ని పొందుపరచాలని పేర్కొన్నది.

ఈ విషయంలో ఇతర అంతర్జాతీయ సంస్థల వలెనే యునెస్కో కూడా తగు జాగ్రత్తతో వ్యవహరిస్తున్నది. యునెస్కో తన పద్ధతులు సాధ్యమైనంతవరకు సార్వజనీనంగా ఉండటానికి ప్రయత్నిస్తుంది. వీరు వివాదాస్పదం కాని ధోరణి అవలంభిస్తారు. ఈ పరిమితి ఉన్నప్పటికీ మానవ సంక్షేమం, ప్రపంచ శాంతి పట్ల యునెస్కోకు గల శ్రద్ధాసక్తులు అందరికీ తెలిసినవే.

## 1.6 పరివర్తనా దృక్పథం

ఈ పద్ధతి వ్యక్తిగత, సమాజ, రాజ్య, ప్రపంచస్థాయిలలో జరిగే పరిణామాన్ని ఆశిస్తుంది. వ్యక్తి, సమాజం అనేక విధాలుగా ఉండటం గమనించవచ్చు. గతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించి వర్తమాన సాంఘిక, ఆర్థిక పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే ఈ పరిణామ క్రమం స్పష్టమవుతుంది. ఈ దృక్పథం సమాజంలోని అసమానతలు, అన్యాయాల పైన దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఇది బీదలు, బాధితుల పక్షం వహిస్తుంది.

అంతేకాక ఈ దృక్పథం సమానత్వం, స్వేచ్ఛ, శాంతి, న్యాయం వంటి విలువలకు ప్రాధాన్యతను ఇస్తుంది. ఈ దృక్పథం సహజసిద్ధమైన మానవ శక్తి సామర్థ్యాలను ప్రతిబింబిస్తుంది. ఇది వ్యక్తిగత (Subjective), అవ్యక్తిగత (objective) కారకాలను పరిగణలోకి తీసుకుంటుంది. వ్యక్తిగత కారకాలలో వ్యక్తి స్వవిషయాలు ముఖ్యం కాగా, అవ్యక్తిగత కారకాలలో సామాజిక సంబంధాలలో గల ఆధిపత్యం ప్రధానంగా ఉంటుంది. ఇందులో భాగంగా స్వార్థం, అధికార దాహం, ధనదాహం, మూఢనమ్మకాలు, వంటి వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించటం జరుగుతుంది. అన్ని రంగాల్లోనూ, అన్ని స్థాయిల్లోనూ ఆధిపత్య మూలములను కనుగొని ప్రజాస్వామ్య సంస్కృతిని పెంపొందిచుట ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశ్యము. పాలో ఫ్రేయర్ ప్రయోగాలు చేసి కొత్త పద్ధతులను ఆవిష్కరించాడు. ఇట్టి పరివర్తనా దృక్పథాన్ని పాలో ఫ్రేయర్ తన "పెడగోగి ఆఫ్ ది అప్రెస్డ్", "కల్చరల్ ఆక్షన్ ఫర్ ఫ్రీడమ్" అను పుస్తకాలలో వివరించాడు. ప్రజలను చైతన్యవంతులను చేయటం ద్వారానే సామాజిక పరివర్తన జరుగుతుందని పాలో ఫ్రేయర్ భావించాడు. సామాజిక పరివర్తన రావటానికి వ్యక్తులు తమ 'మూగ' సంస్కృతిని విడనాడి తమ సామాజిక ఆర్థిక పరిస్థితులను విమర్శనాత్మకంగా అర్థం చేసుకొనే స్థాయికి ఎదగాలి అని ప్రతిపాదించాడు.

ఈ రకమైన చైతన్యాన్ని తీసుకురావటానికే మానవ హక్కుల విద్య దోహదపడుతుంది. ఈ మధ్యకాలంలో మానవ హక్కుల విద్యను చాలా విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు ప్రారంభించాయి. అందులో ముఖ్యమైనవి, బెంగుళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటి, హైదరాబాదులోని హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఇవి మానవ హక్కులలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను ప్రారంభించాయి. దేశంలో మొట్టమొదటిసారిగా మానవ హక్కుల విద్యను ప్రవేశ పెట్టిన సంస్థలలో హైదరాబాదు విశ్వవిద్యాలయం ఒకటి. వీరు దూరవిద్య ద్వారా డిప్లొమా కోర్సును ప్రారంభించారు.

## 1.7 హైదరాబాదు విశ్వవిద్యాలయం కోర్సు

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విద్యా దశాబ్దాన్ని ప్రకటించక ముందునుండే అనగా 1992 నుండి హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని రాజనీతిశాస్త్ర శాఖ 'మానవ హక్కుల రాజకీయ ఆర్థిక అంశాలు' అనే కోర్సును రాజనీతి శాస్త్ర విద్యార్థులకు బోధిస్తున్నది. ఈ శాఖ మానవ హక్కులకు సంబంధించిన ఎన్నో విషయాలపై పరిశోధన ప్రారంభించింది. ఇక్కడ జరుగుతున్న పరిశోధనలను గుర్తించి విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం ప్రత్యేక సహాయ నిధులకు సమకూర్చింది. అందులో భాగంగా ఇక్కడ వివిధ మానవ హక్కులకు సంబంధించిన అంశాలపై సమాచార

BRAOU

సేకరణ, పరిశోధన, చర్చాగోష్ఠులు చేపట్టారు. మానవ హక్కులపై సమాజంలో స్పందన కలిగించటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ నేపథ్యంలో హైదరాబాదు విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల వివరాలు ఇక్కడ చర్చించబడినవి.

ఈ డిప్లొమాలో గల ఆరు కోర్సుల ద్వారా వివిధ అంశాలను బోధించటం జరుగుతుంది. మొదటగా విద్యార్థులకు మానవ హక్కుల సిద్ధాంతము, తాత్విక భూమికలైన స్వేచ్ఛ, సామరస్యం, స్వాతంత్ర్యం, ధర్మం, రాజనీతి, లోకనీతి మొదలైన మౌలిక అంశాల పట్ల అవగాహన కలిగించుటకు ఉద్దేశింపబడినవి. ఈ క్రమంలోనే ఉదారవాదులైన రూసో, థామస్ పైన్, జె.యస్.మిల్, డైసీ, మార్క్సిస్టు తత్త్వవేత్తలు మార్క్స్, లెనిన్, మావో, గ్రామ్‌స్కీ మొదలైన వారి భావనలను ఈ కోర్సులో పొందుపరచారు. మూడవ ప్రపంచ దేశాలకు చెందిన పాలో ఫ్రేయర్, ఫాన్ వంటి వారి భావనలు కూడా పొందుపరచబడ్డవి. భారతదేశానికి సంబంధించి చారిత్రక పరిణామ క్రమం, గాంధీ, అంబేద్కర్, రామ్‌మనోహర్ లోహియాల ప్రాపంచిక దృక్పథం విపులంగా చర్చించబడినది. సోవియట్ రష్యా, చైనా, మరియు తూర్పు ఐరోపా దేశాలలో పరిస్థితులు, సామ్యవాద పాలనలో జరిగన మానవ హక్కుల ఉల్లంఘన అంశాలను సైతం చర్చించటం జరిగింది. ఈ కోర్సులోని రెండవ భాగంలో భారతీయ సమాజ అధ్యయనంలో సామాజిక, ఆర్థిక అంశాలు కూలంకష పరిశీలన అందులో భాగంగా దళితుల, మహిళల, గిరిజనుల, బాలల సమస్యలేకాక కార్మిక వర్గ స్థితిగతులను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించటం జరిగింది. డిప్లొమాలో భాగంగా అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఇంగ్లాండు, జపాన్ వంటి దేశాలలో మానవ హక్కుల స్థితిగతులు వివరింపబడినవి. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను విద్యార్థులకు తెలియజేయటం ఈ కోర్సు ద్వారా జరిగింది. ఇందులో భాగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలైన మెక్సికో, బ్రెజిల్, పాకిస్తాన్ వంటి దేశాలలోని మానవ హక్కుల పరిస్థితులను కూడా చర్చించబడినవి.

ఈ డిప్లొమాలో దాదాపు సగం కోర్సులు భారతదేశ పరిస్థితులకు సంబంధించి ఉన్నాయి. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, నేరము, శిక్ష, జైళ్ళ పరిస్థితులు, మానవ హక్కుల సంఘం పాత్ర వంటివి చర్చింపబడినవి. చివరిభాగంలో మానవ హక్కుల సంబంధిత అంశాలను మరియు వ్యక్తుల సామాజిక బాధ్యతలను చర్చించడం జరిగింది. రాజ్య వ్యవస్థ ఆధిపత్యాన్ని విశ్లేషించడంతో పాటు హింస, ప్రతిహింస, సామాజిక ఉద్యమాలు, స్త్రీల ఉద్యమాలు, గిరిజన ఉద్యమాలు, పర్యావరణ ఉద్యమాలు కూడా చర్చించబడినది.

BRAOU

## 1.8 ముగింపు

విద్యార్థులను, వ్యక్తులను తోటివారి పట్ల, వాళ్ళ మానవ హక్కుల పట్ల స్పృహ, చైతన్యం కలిగించటం ఈ కోర్సు లక్ష్యం. అంతేకాక వారికి మానవ హక్కుల సమస్యల పట్ల అవగాహన కలిగించి, వాటిని ఎదుర్కొనుటకు కార్యోన్ముఖులను చేయటం ఈ కోర్సు లక్ష్యాలలో ఒకటి. మానవ హక్కుల పట్ల చదువరుల దృక్పథంలో పరివర్తన కలిగించటం ఈ కోర్సు ముఖ్య ఉద్దేశ్యం.

సామాజిక పరివర్తన విద్య ద్వారా మాత్రమే రాదు. దానికి తోడుగా ప్రజా సమస్యలకు స్పందిస్తూ ప్రజల కోసం పని చేసే నిబద్ధులైన, ఉన్నత విలువలు కల వ్యక్తుల అవసరం కూడా ఉంది. ఈ లక్ష్య సాధనలో మానవ హక్కుల విద్య కొంతవరకైనా దోహద పడుతుందని ఆశించవచ్చు.

## 1.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మానవ హక్కుల అధ్యయనం ఉద్దేశ్యాన్ని, పరిధిని విశ్లేషించుము.

2. పరివర్తనా దృక్పథాన్ని చర్చించండి.

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మానవ హక్కుల అధ్యయనానికి ఉన్న మూడు పద్ధతులలో మీకు ఏ పద్ధతి సమంజసంగా తోస్తోందో ఆ పద్ధతి గురించి వివరించండి.

2. మానవ హక్కుల విద్య బాధ్యతాయుతమైన పౌరులు, బాధ్యతాయుత ప్రభుత్వ యంత్రాగాన్ని నెలకొల్పటము ఎంతవరకు ప్రభావితం చేయగలదు. వివరింపుము.

BRAOU

# భాగం - 2 : మానవ హక్కులు అంటే ఏమిటి ?

**విషయక్రమం**

2.0 ఉద్దేశం
2.1 పరిచయం
2.2 హక్కులంటే ఏమిటి ?
2.3 హక్కులు వాటి సందర్భం
2.4 రాజకీయ సంస్కృతి - హక్కులు
2.5 వైయక్తిక దృక్పథం, సామూహిక దృక్పథం
2.6 ఉదారవాదంపైన మార్క్సిస్టు విమర్శ
2.7 ప్రాచ్య దృక్పథం
2.8 కాలాన్ని బట్టి, ప్రదేశాన్ని బట్టి మారే సందర్భం
2.9 సమూహంలోపల వ్యక్తి హక్కులు
2.10 ముగింపు
2.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- హక్కులంటే ఏమిటో తెలుసుకుంటారు.
- రాజకీయ సంస్కృతి తెలుస్తుంది
- హక్కులకు గల వైయక్తిక, సామూహిక దృక్పథంపై అవగాహన
- సమూహంలోపల వ్యక్తి హక్కులు తెలుస్తాయి.

BRAOU

## 2.1 పరిచయం

మానవ హక్కులకు సంబంధించిన సమస్యలనూ వాటి నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన ప్రధాన భావనలనూ పరిచయం చేయడం ఈ పాఠం, దీని తరువాతి పాఠాల లక్ష్యం. ఆ భావనలను ప్రముఖ తత్త్వవేత్తలు ఆయా చారిత్రక సందర్భాలలో ఏవిధంగా అభివృద్ధి చేసారన్న విశ్లేషణ తరువాతి పాఠాలలో చూస్తారు.

స్వేచ్ఛా భావనలో అభివృద్ధే ప్రపంచ మానవ చరిత్ర అని ప్రధాన జర్మన్ మేధావులు కాంట్, హెగెల్, మార్క్సులు చరిత్రను స్థూలంగా పరిశీలిస్తూ అన్నారు. మానవ స్వేచ్ఛలో సమానత్వం పెరిగిన వైనం ప్రపంచ చరిత్ర గమనాన్ని సూచిస్తుందని వీరిలో మొదటి ఇద్దరు అన్నారు. ప్రాచ్య దేశాలలో ఒక్కరికి మాత్రమే అపరిమిత స్వేచ్ఛ ఉన్న దశనుండి పాశ్చాత్య ప్రజాస్వామ్యంలో అందరి స్వేచ్ఛనూ అత్యున్నతంగా అభివృద్ధి చేసిన దశకు చరిత్ర ప్రయాణించిందని భావించారు. మార్క్స వంటివారు బూర్జువా ప్రజాస్వామిక స్వేచ్ఛలను తీవ్రంగా విమర్శించినప్పటికీ, అందరికీ సంపూర్ణ స్వేచ్ఛ కల్పించే దిశగా చరిత్ర చేస్తున్న ప్రయాణానికి తిరుగులేదని భావించారు. ప్రాచీన గ్రీక్, రోమన్ సమాజాలలో బానిసత్వం ఒక వ్యవస్థగా ఉన్నప్పటికీ ఆ సమాజాలలో కొంతమంది మేధావులు 'అన్నిటికీ ప్రయాణం మనిషే'నని అన్నారు. బానిసత్వం ప్రకృతి విరుద్ధమని అన్నారు. అయితే ప్రాచీనకాలంలో స్వేచ్ఛ గురించి చేసిన ఆలోచనలో స్త్రీలకు ఇచ్చిన ప్రాధాన్యత తక్కువేనని చెప్పాలి.

మధ్యయుగాల ఆలోచన యావత్తు దేవుడిని కేంద్రం చేసుకునింది. యూరప్‌లో పునరుజ్జీవనం మొదలయిన తర్వాత ప్రపంచంలోని సకలవిషయాలకూ మనిషిని కేంద్రం చేసి చూసే వైఖరి మొదలయింది. అన్నిటినీ దైవత్వం ప్రాతిపదికన చూసే మధ్యయుగాల దృష్టికి ఇది పూర్తిగా విరుద్ధం. కళ, సాహిత్యం, రాజకీయాలు, మతం మొదలయిన సకల రంగాలలోనూ మనుషుల ఆశలు, కోరికలు, ఆత్మవిశ్వాసం, నిర్వేదం, దు:ఖం ప్రముఖ మానవతావాదుల దృష్టిని ఆకర్షించాయి. ఇంగ్లండ్‌లో, ఫ్రాన్స్‌లో, అమెరికాలో రాచరిక నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన రాజకీయ విప్లవాలు, అన్నిరకాల విచ్చలవిడి అధికార ప్రయోగానికి వ్యతిరేకంగా మనిషికి హక్కులు కల్పించడానికి నడిచిన ఉద్యమాన్ని బలోపేతం చేసాయి. హాబ్స్, లాక్, రూసో వంటి ఒప్పంద సిద్ధాంతవేత్తలు, రాజకీయ అధికారం ప్రజల ఒప్పుకోలు నుండి పుట్టిందనీ ప్రజల సమ్మతితోనే నిలుస్తుందనీ శక్తివంతంగా సూత్రీకరించారు. రాజ్యం అని పిలవబడే రాజకీయ వ్యవస్థను రూపొందించడంలో దైవసంకల్పంగానీ రాజసంకల్పంగానీ నిర్వహించే పాత్ర ఏమీ లేదు. రాజకీయ అధికారాన్ని ఇవ్వడానికీ తీసేయడానికి ప్రజలకు మౌలికమైన హక్కు ఉంది. సామాన్య ప్రజలు మహత్తరమైన త్యాగాలతోనూ అనేక విపప్లవాల ద్వారానూ గౌరవమర్యాదలనూ హక్కులనూ పొందారు. ఇంకా అనేక అణచివేత రూపాలను అధిగమించవలసి ఉంది. ముఖ్యంగా మానవ ప్రపంచ దేశాలలో అది జరిగినప్పుడే ప్రపంచమంతటా హక్కులు విశ్వజనీన రూపం తీసుకుంటాయి.

ఇప్పుడు మానవ హక్కుల నిర్వచనాన్నీ విశ్లేషణనూ చూద్దాం.

## 2.2 హక్కులంటే ఏమిటి ?

మనుషుల ఆత్మగౌరవం, యోగ్యత, వ్యక్తిత్వం మొదలయినవి ఎదగడానికి అవసరమైన కొన్ని అవకాశాలు హక్కులు నెగటివ్‌గా చూసినప్పుడు హక్కులు ఇతరుల విచ్చలవిడి ప్రవర్తన నుండి, రాజ్యయంత్రాంగం నుండి మనకు సంరక్షణ కల్గిస్తాయి. పాజిటివ్‌గా చూసినప్పుడు హక్కులు మానవ ఆకాంక్షల పురోభివృద్ధికి తోడ్పడుతాయి. హక్కులను, రాజకీయ హక్కులు, పౌరహక్కులు, ఆర్థిక హక్కులు, సాంస్కృతిక హక్కులు అని వర్గీకరిస్తారు. జీవితము స్వేచ్ఛ, సమానత్వం, ఉద్యోగం, విద్య, ఇష్టమొచ్చిన మతాన్ని అనుసరించడం మొదలయినవి హక్కులు. కొన్ని హక్కులు, ముఖ్యంగా రాజకీయ హక్కులు, ఆర్థిక హక్కులు పౌరులకు మాత్రమే ఉంటాయి. మిగిలినవి ప్రజాస్వామ్య దేశంలో అందరికీ ఉంటాయి. హక్కుల స్వేచ్ఛను పెంపొందిస్తాయి. హింసనుండి, వివక్షనుండి రక్షణ కల్పిస్తాయి. అన్ని రకాల అణచివేత నుండి అవి రక్షణ కల్పిస్తాయని ఆశిస్తాం. ఈ దృష్టితో చూసినప్పుడు, ఒక సమాజంలో హక్కులు ఎంత ఎక్కువగా ఉంటే ఆ సమాజం, ఆ రాజ్యం నాగరికతా క్రమంలో అంత హెచ్చుస్థాయిలో ఉన్నట్టు భావించబడతాయి. హక్కులను తీవ్రంగా పరిమితం చేసినప్పుడు అందుకు విరుద్ధంగా నాగరికత క్షీణించినట్టు భావించబడుతుంది.

పౌరులు వ్యక్తి హితాన్నీ, సమాజం హితాన్నీ, నిబద్ధతతో కాంక్షించే ఎదుగుదల, ఆత్మగౌరవం ఉన్నవారయితేనే ప్రజాస్వామ్యం విజయవంతంగా మనగలుగుతుంది. రాజ్యం, పౌరసమాజం పౌరులందరినీ అవకాశాల విషయంలోనూ హక్కుల విషయంలోనూ సమానంగా చూసినట్టయితే, ముఖ్యంగా బలహీన వర్గాలకు హక్కులు అనుభవించడానికి ఊతం ఇచ్చినట్టయితే, ఈ నిబద్ధత స్వచ్ఛందంగా నెలకొంటుంది. పురోగతి ఎరుగని చిన్న మనుషులతో గొప్ప పనులేవీ చేయలేమని జె.ఎస్.మిల్ అంటాడు.

## 2.3 హక్కులు, వాటి సందర్భం

'హక్కు' అనేది ఒక సామాజిక భావన. సామాన్య నైతిక, సామాజిక అవసరాల గురించి, బాధ్యతల గురించి స్పృహలేని సమాజంలో హక్కు అనేదేమీ ఉండదేమో. అధికార ప్రదర్శన ఉంటుంది. బలమే హక్కుగా చలామణి అవుతుందే తప్ప హక్కులే ఒక శక్తిగా మారజాలవు.

సహజ హక్కులు అనే భావనను బెంథామ్ వంటి మేధావులు విమర్శించారు. ఎందుకంటే ప్రాచీన కాలంలో ఎప్పుడో ఒకప్పుడు, సంఘటితమైన సమాజం లేనప్పుడు సహజ హక్కులనూ సహజ స్వేచ్ఛనూ, మనుషులు

BRAOU

అనుభవించారన్న అభిప్రాయం అందులో ఇమిడి ఉంది కాబట్టి జాన్‌లాక్, రూసో, జె.ఎస్.మిల్ మాత్రం సహజహక్కులూ, స్వేచ్ఛలూ అనే భావనలను సమర్ధించారు. హాబ్స్ సహజ హక్కుల భావనను అంగీకరించలేదు. హక్కులనేవి ప్రజల సమ్మతితో నెలకొల్పిన సార్వభౌమ అధికారం ఇచ్చే బహుమానం మాత్రమేనని అతని అభిప్రాయం. సార్వభౌములు అంగీకార ముద్రవేసి అమలు చేసే సర్వజనామోదం పొందిన చట్టం అనేది లేకపోతే హక్కులే ఉండవు. అంతర్యుద్ధం నడుస్తున్న సమాజాన్ని దీనికొక దృష్టాంతంగా తీసుకోవచ్చు. 16, 17 శతాబ్దాలలో ఇంగ్లాండ్ దేశం, 1789, 1795ల మధ్యకాలంలో ఫ్రాన్స్, 1917 నుండి 1921 దాకా సోవియట్ రష్యా గడచిన కొద్ది సంవత్సరాలుగా సోమాలియా, బోస్నియా, ఆఫ్ఘనిస్తాన్ మొదలైనవి ఈ దృష్టాంతం కిందికి వస్తాయి. భారతదేశంలోనూ, పంజాబు, కాశ్మీర్, ఈశాన్య భారత ప్రాంతాలలోని కల్లోలం పౌరులకు భారతప్రజాస్వామ్య రాజ్యాంగం కల్పించిన హక్కులను తీవ్రంగా పరిమితం చేసింది.

మానవజాతి మనుగడలోని తొలిదినాలలో సహజ హక్కులనేవి ఏవయినా ఉన్నాయో లేదో తెలుసుకోవడం అసాధ్యం అయినప్పటికీ, మనుషుల స్వీయ వ్యక్తీకరణకు అవసరమైన మౌలిక హక్కులు కొన్నింటిని రాజ్యం, పౌరసమాజం గుర్తించటం అవసరం అని టి. హెచ్. గ్రీన్ భావించాడు. మనిషి వ్యక్తిత్వం నిండుగా ఎదగడానికి అవసరమైన హక్కులు సహజ హక్కులని దీనిని బట్టి అనవచ్చును. గతించిపోయిన ఆదిమకాలంలో మనుషులు వాటిని అనుభవించారా లేదా అనేది అప్రస్తుతం.

అన్ని ఉదార ప్రజాస్వామ్య రాజ్యాలూ, సోషలిస్టు రాజ్యాలూ తమ రాజ్యాంగాల ద్వారా పౌరులకు అనేక హక్కులు కల్పించాయి. అయితే పేదరికం వల్ల, విద్యావకాశాల లేమి వల్ల, లైంగిక వివక్ష వల్ల, సాంఘిక వివక్ష వల్ల, సామాజిక ఆధిపత్య శక్తుల పెత్తనం వల్ల ప్రభుత్వ అధికారుల అవినీతి వల్ల, పౌరులలో అందరూ ఈ హక్కులను అనభవించలేకపోతున్నారు. బలహీనులు, పిల్లలు, స్త్రీలు, అసంఘటిత కార్మికులు, వ్యవసాయకూలీలు, దళితులు తదితరులకు వ్యవస్థ మీద ఒత్తిడి పెట్టి రాజ్యాంగం ప్రకారం తమకు రావలసిన హక్కులు పొందేందుకు తగిన శక్తి లేకపోవడం వల్ల హక్కులు అనుభవించలేకపోతున్నారు. పెత్తందారీ వర్గాలు, బలంగా సంఘటితమై అల్లరి చేయగల కొద్దిమంది సమాజంలోని అన్ని రంగాలలోనూ సదుపాయాలన్నిటినీ తమ గుప్పిట్లో పెట్టుకోగలుగుతున్నారు.

## 2.4 రాజకీయ సంస్కృతి, హక్కులు

అసమాన పురోగతి వల్ల కొందరు పౌరులకు హక్కులు సాపేక్షంగా అందకపోవడమేకాక, రాజ్యాంగ నిబద్ధతపట్ల రాజకీయ సంస్కృతికి ఉండే వైఖరి కూడ హక్కులను అనుభవించడానికి అవసరమైన వాతావరణాన్ని పెంపొందించగలదు లేదా నాశనం చేయగలదు. నియంతలకు వ్యతిరేకంగా అనేక త్యాగాలకు ఓర్చి హక్కుల కోసం పోరాడిన చరిత్ర బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, రష్యా, చైనా తదితర దేశాలలో ఉంది. భారత దేశస్తులు కూడ స్వయం నిర్ణయాధికారం కోసం బ్రిటీష్ పాలకులపైన పోరాటం చేసారు. హక్కుల కోసం పోరాటం నిరంతరాయంగా సాగాలి. చాలా మూడవ ప్రపంచదేశాల ప్రజలు సామ్రాజ్యవాదులు తొలగిపోయిన తరువాత తమ స్వంత నియంతల ఇనుపపాదాల కింద నలిగిపోయారు. స్వయం నిర్ణయాధికారం కోసం, ఆత్మగౌరవం కోసం వారు నియంతలపైననయితే పోరాటం చేసారుగానీ ఆ తరువాత వచ్చిన తమ స్వంత జాతి నియంతలు అంతకంటే తక్కువ క్రూరంగా లేరు. న్యాయాన్ని ప్రతిఫలించే చట్టబద్ధ పాలనలోనే బతకాలన్న కాంక్ష, న్యాయమైన చట్టాల పాలనను నాశనం చేయాలని చూసేవారిపైన పోరాటం చేయాలన్న సంకల్పం ఉన్న మానసిక స్థితిని పౌరులలో పెద్ద ఎత్తున పెంపొందించాలి, కాపాడాలి. 'నిరంతర అప్రమత్తత స్వేచ్ఛకు మనం చెల్లించే మూల్యం' అని గ్రీకు మేధావి పెరిక్లిస్ ఎన్నడో అన్నాడు.

ఒక మేరకయినా నిష్పాక్షికంగా జరిగిన ఎన్నికల ద్వారా ఎన్నుకోబడిన శాసనసభ చట్టాలు చేసిన తరువాత రాజ్యము, పౌరులు ఆ చట్టాలను గౌరవించాలి. ప్రజాస్వామ్య సంస్కృతిని పాలకులు, పాలితులు విస్మరిస్తే ఏ దేశమూ ప్రశాంతంగా మనుగడ సాగించలేదు, పౌరులెవ్వరూ హక్కులు అనుభవించలేరు. హక్కులూ, బాధ్యతలూ ప్రజాస్వామ్యంలో ఒకే నాణానికి రెండు ముఖాలవంటివి. వీటిని ఒకదాని నుండి ఒకటి వేరు చేయడం సాధ్యం కాదు. భారత రాజ్యాంగంతో సహా కొన్ని రాజ్యాంగాలలో పౌరుల ప్రాథమిక హక్కులే కాక రాజ్యం పట్ల వారి బాధ్యతలు కూడ

BRAOU

ఉల్లేఖించబడ్డాయి. మరికొన్ని దేశాలలో, బాధ్యతలు రాజ్యాంగంలో రాయకున్నప్పటికీ ప్రజలలో సామాజిక బాధ్యతల స్పృహ అత్యున్నత స్థాయిలో ఉంది. వారు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తారు. బ్రిటన్ ప్రజాస్వామ్య ప్రక్రియను అతిక్రమించని రాజకీయ రాజకీయేతర విశ్వాసాలు కలిగి ఉండే స్వేచ్ఛకు భరోసా ఉండాలి. కేవలం హక్కులను రాసిపెట్టుకున్నంత మాత్రాన బలహీనులయిన పౌరులకు వాటిని అనుభవించే అవకాశం లభిస్తుందన్న భరోసాలేదని పైన చూసాం. అది లభించాలంటే ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు పరస్పర సంయమనంతో కలిసి పనిచేస్తూ చట్టంలో కలిగించిన హక్కులను అనుభవించడానికి కావలసిన చేయూత ఇవ్వాలి. అధికారంలో ఉన్నవారు ప్రజల ఆకాంక్షలకు సానుకూలంగా స్పందించాలంటే ప్రజల చొరవకు, ముఖ్యంగా కింది స్థాయిలో, అవకాశం ఉండాలి.

## 2.5 వైయక్తిక దృక్పథం, సామూహిక దృక్పథం

హక్కుల సాధన వ్యక్తులకు కేంద్రంగా ఎంచుకోవాలా లేక కుటుంబం, కులం, మతం, జాతి మొదలైన సమూహాలను కేంద్రంగా ఎంచుకోవాలా అనేది మానవహక్కుల చర్చలో ఒక ముఖ్యవిషయం. ఆధునిక పాశ్చాత్య సంప్రదాయంలో అభివృద్ధి చెందిన వ్యక్తిగత దృష్టిని చాలామంది ఆదేశాలకు చెందిన వ్యాఖ్యాతలేకాక పాశ్చాత్యేతర దేశాలవారు కూడా విమర్శించారు. హేతుబద్ధమైన వివేచన, ఆచరణాత్మక దృష్టి, స్వయంప్రతిపత్తి కలిగిన వ్యక్తిని ఆధునిక ఉదారవాద సంప్రదాయం గొప్పగా భావిస్తుంది. ఆ వ్యక్తికి తననుంచి ఏదో తెలుసుకునే విజ్ఞత ఉందనీ, తన ప్రత్యేకతను, విశిష్ట వ్యక్తిత్వాన్ని ప్రధాన సామాజిక స్రవంతిలో ముంచేయడానికి జరిగే ప్రయత్నాలను ప్రతిఘటించడానికి ఈ వ్యక్తి సిద్ధమేననీ భావిస్తుంది. అయితే వోటర్లలో మెజారిటీ ఎన్నుకున్న ఒక గుంపు (శాసనసభ్యులు) మరికొన్ని గుంపులకు (కార్యనిర్వాహకులు, న్యాయమూర్తులు వగైరా) ప్రజల మానవ హక్కులను అనుమతించడానికీ తిరస్కరించడానికీ రాజ్యానికి ఉండే అధికారాన్ని కట్టబెట్టినప్పుడు ఈ వ్యక్తికి ఇబ్బందేమీ ఉండదు. ఈ పద్ధతి, ఈ ప్రయాణం హేతుబద్ధమైనవనీ, న్యాయమైనవనీ ఉదారవాద రాజకీయ స్రవంతి భావిస్తుంది. కాబట్టి ఈ శాసన సంస్కృతిని మానవ హక్కుల విషయంలో ఏకాభిప్రాయానికి ప్రాతిపదిక అయిన ఏకైక ప్రమాణంగా అన్ని ఇతర సమాజాలముందూ నిలబెట్టడం జరుగుతున్నది. వేరే ఏ పద్ధతయినా సూత్రమైనా అన్యాయమైనది, అసమంజసమైనది అని పాశ్యాత్యమైనది అని పాశ్యాత్య ఉదారవాద ఆలోచన భావిస్తుంది.

BRAOU

## 2.6 ఉదారవాద దృక్పథంపైన మార్క్సిస్టు విమర్శ

పలురకాల లేమినెలకొని ఉన్న సమాజంలో హక్కులను కేవలం ప్రకటించి రాజ్యాంగంలో రాసుకోవడం అంటే సారవిహీనమైన రూపాన్ని లేక అర్థరహితమైన సంకేతాన్ని కల్పించి ప్రజలను మభ్యపెట్టడం మాత్రమేననీ వాటికి వాస్తవంలో అర్థమేమీ లేదని మార్క్సిస్టులు అంటారు. అంతేకాక, అందరికీ సమాన అవకాశాలుంటాయని చెప్పే హక్కులు సంపదలోనూ కలిమిలోనూ సామాజిక ఆర్థిక అధికారంలోనూ ఉన్న అసమానత నుండి పుట్టినవేనంటారు. ఈ అధికారం, సంపద గల వాళ్ళు తమ యాజమాన్యానికీ దానిని ఇష్టమొచ్చినట్టూ ఉపయోగించే స్వేచ్ఛకూ చట్టం ముద్రపొందడం ద్వారా దానిని ఆమోదనీయం చేసుకోవాలని కోరుతారు. వాస్తవికమైన ఈ వ్యాఖ్యానంలో, ఆస్తులున్న కొంతమంది హక్కులు, ఆస్తులూ భౌతిక స్వతంత్రమూ కల్పించే అధికారం లేని బలహీనుల స్వేచ్ఛకు ప్రతిబంధకంగా పనిచేస్తాయి. చీలి ఉన్న సమాజాలలో సార్వజనీన హక్కులు ఉండవు. వాటిని అందరికీ అందియ్యగల నిష్పాక్షికమైన, స్వతంత్రమైన యంత్రాంగమూ ఉండదు. చివరిగా వ్యక్తిగత సంపాదనా సంస్కృతి తలకెక్కిన వర్గం మానవతను కోల్పోయి పరాయీకృత వస్తువులుగా మారిపోతాయి. మానవస్వేచ్ఛగురించి, మానవత గురించి వారిలో తప్పుడు చైతన్యం నెలకొంటుంది. హక్కులకు ఉదారవాదం ఇచ్చే నిర్వచనంలో తర్కంలేదనీ అదివట్టి డొల్ల అనీ మార్క్సిస్టులు అంటారు. ఎందుకంటే అది చట్టబద్ధపాలన, స్వేచ్ఛ, సమానత్వపు హక్కులను అమూర్తంగా నిర్వచిస్తుంది. వాస్తవమేమిటంటే, ప్రజలకు అవకాశాలలోగానీ ఆస్తిలోగానీ చట్టబద్ధపాలన నుండి రక్షణ పొందే హక్కులోగానీ సమానత్వం లేదు. కాబట్టి సోషలిస్టులు ఏమంటారంటే తీవ్ర అసమానతలున్న భౌతిక పరిస్థితులలో మౌలికమైన మార్పురానిదేమానవ సంబంధాలలో మెరుగుదల సాధ్యంకాదు. మానవస్వేచ్ఛ, మానవతా చైతన్యం చేదోడు వాదోడుగా ఉన్నప్పుడుగానీ కేవలం ఒక సంకేతంగా ఉన్న

రూపానికీ వికృతమైన సారానికీ మధ్య వైరుధ్యం సమసిపోదు. లేమినుండి పుట్టిన అమానవీయ వాతావరణంలో మానవతా చైతన్యం అభివృద్ధి చెందదు.

## 2.7 ప్రాచ్య దృక్పథం

తూర్పు ఆసియాకు చెందిన కొంతమంది వ్యాఖ్యాతలు పాశ్చాత్య ఉదారవాద దృక్పథంలో మానవ హక్కుల గురించి, మానవనైజం గురించి ఉన్న అభిప్రాయాలను విమర్శించారు. సింగపూర్‌కు చెందిన లీకువాన్‌యూను, కొందరు చైనా, జపాన్ దేశాల మేధావులను ఇక్కడ పేర్కొనాలి. ఉదారవాదులకు చట్టం గురించి ఉండే అవగాహన సమాజంలో మనుషుల మధ్య సంబంధాలను తెంపేస్తుందనీ, వ్యక్తిని సమూహంలో భాగం చేసే బంధాలను వమ్ము చేస్తుందనీ వారు విమర్శించారు. ఈ బంధాలే మనిషి ఎదుగుదలకు అర్థాన్ని ఇస్తాయనీ మనిషికి తన గురించే కాక సమాజాన్ని గురించి, కూడ ఆలోచించే అలవాటు కల్పిస్తాయనీ వాదించారు. చిన్ననాటినుండి ఒక ద్వీపంగా, ఎవ్వరి అవసరం లేకుండ, మానసికంగా గానీ భౌతికంగాగానీ ఎవ్వరిపైనా ఆధారపడకుండ తన జీవితానికి తానే చక్రవర్తి అయి ఎదిగే వారెవరూ లేరని అన్నారు. సమూహంతో మనిషికి ఉండే సంబంధాలకు, సమూహం పట్ల మనిషికి ఉండే విశ్వాసానికీ ప్రాచ్యదేశాలకు చెందిన కన్‌ఫ్యూషియన్ దృక్పథం, గాంధీ సిద్ధాంతాలు ప్రముఖపాత్ర కల్పిస్తాయి. మనుషులు తమ వ్యక్తిత్వాన్నీ వైఖరినీ ఈ సంబంధాల నేపథ్యంలోనే రూపొందించుకుంటారు. తన వ్యక్తిగత హక్కులకోసం తన కుటుంబసభ్యులతో సహితం ఘర్షణ పడే స్వయం నిర్ణేత అయిన స్వయం ప్రతిపత్తిగల వ్యక్తి దేశాల సంస్కృతికి విరుద్ధం. ఆ సంస్కృతి సమూహం యొక్క క్షేమంకోసం, శాంతికోసం వ్యక్తిని సమూహంతో మమేకం చేస్తుంది.

అన్ని చోట్లా పౌరసమాజం కాలక్రమంలో తన స్వంత సామాజిక నిర్మాణాలనూ సిద్ధాంత దృక్పథాన్నీ అభివృద్ధి చేసుకుంటుంది. అందులో సంకల్పపూర్వకమైన మానవ ఆచరణేకాక, మనుషుల నియంత్రణకు అతీతంగా ఆయాదేశకాలాలలో పనిచేసే చారిత్రక శక్తుల పాత్ర కూడా ఉంటుంది. రాజకీయవ్యవస్థ, భావజాలం త్వరగానే రూపం తీసుకోగలవూ వేగంగా మారగలవు. రెండవ ప్రపంచయుద్ధం తరువాత జపాన్, జర్మనీ, భారతదేశం తమ శతాబ్దాల నాటి నియంతృత్వ రాజకీయ వ్యవస్థనూ భావజాలాన్నీ ఉదారవాదం దిక్కుగా వేగంగా మార్చేసుకున్నాయి. కానీ, పౌరసమాజంలో మార్పురావడానికి ఎక్కువకాలం పడుతుంది. ఎప్పటికప్పుడు పాలకులు రూపొందించే విధానమార్పులకు అది సులభంగా లొంగదు.

BRAOU

పాశ్చాత్య ఉదారవాద సిద్ధాంతవేత్తలు వ్యక్తి స్వయంప్రతిపత్తిని ఎక్కువచేసి చూపిస్తారు. నిజజీవితంలో మనుషులు సమూహాలతో ముడిపడి ఉంటారన్న విషయాన్నీ సమూహాల నుండి (జాతి, జాతిరాజ్యం, పారిశ్రామిక వర్గం, కార్మిక సంఘంలో సభ్యత్వం వగైరా) వచ్చే గుర్తింపులో సంతృప్తి, భద్రత పొందుతారన్న విషయాన్నీ తక్కువచేసి చూపించారు. అయితే కొన్ని ప్రాచ్యదేశాలు (భారతదేశాన్నీ, జపాన్‌నూ ఉదాహరణలుగా చెప్పవచ్చు) సమూహాల ప్రాతిపదికన రూపొందిన బహుళత్వాన్ని (ఉదాహరణకు కులం, మతం, జాతి, భాష మొదలయినవి) ఉదారవాద సూత్రాలతోనూ వ్యక్తి హక్కులతోనూ సులభంగానే సమన్వయ పరచగలిగాయి.

తమ స్వభావంలోనూ భావజాలంలోనూ పిడివాద సామూహికవాదం ప్రబలంగా ఉన్న సమాజాలు మరికొన్ని ఉన్నాయి. ఆ సమాజాలు సత్యం సాపేక్షమనిగానీ పరిణామశీలమనిగానీ ఒప్పుకోవు. ఆ సమాజాలలో వ్యక్తి హక్కులకు గుర్తింపులేదు. ఆ సమాజాల పాలకులు పరమసత్యంగా భావించేదానిని అనుమానించే ఉదారవాద పారదర్శకతకు అక్కడ గుర్తింపులేదు. పిడివాదం ఏరూపంలో ఉన్నప్పటికీ - అది మతపరమైనదయినా రాజకీయ స్వభావం కలిగినదయినా ఇవి ఫాసిస్టు సమాజాలే. కన్‌ఫ్యూషియన్ సమాజాలు వ్యక్తులను సామాజిక జీవులుగా మార్చేది తమ వ్యక్తిత్వాన్ని సమాజంలో నిలబెట్టుకోవడానికి కాదు. కుటుంబానికీ కుటుంబాల పరంపర అయిన వంశానికీ వ్యక్తిత్వాన్ని లోబరచడానికి. చైనాలో అతి ప్రాచీన సంప్రదాయమేమిటంటే చైనా రాచరిక వ్యవస్థ చైనా ప్రజల కుటుంబమనేది.

ఆసియాలో కనిపించే ప్రత్యామ్నాయాన్ని పాశ్చాత్య దేశాలలో పుట్టిన పార్లమెంటు, న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుతమైన పత్రికారంగం మొదలయిన ప్రత్యేకమైన సంస్థలతో పోల్చడంగానీ ఆ పోలిక ప్రాతిపదికన తేడాను గుర్తించడంగానీ చారిత్రకంగా సరయినది కాదు. సంస్థలూ, విలువలూ చారిత్రక నిర్దిష్టత కలిగి ఉంటాయి. సామాజిక నిర్మాణాన్నీ సంఘజీవితాన్నీ తీర్చిదిద్దే 'లోతయిన నైతిక నియమావళి' హక్కులకు, మానవ ఆత్మగౌరవానికీ భరోసా ఉండాలన్న ఆలోచనకూ రాజకీయ నియంతృత్వానికీ పొంతన కుదరదు. ఉదారవాద సంస్కృతిలో అంతర్లీనంగా ఉన్న వ్యక్తి వాదాన్ని ప్రజాతంత్ర ఉదారవాద రాజకీయసామాజిక సంస్కృతి కొంత అదుపుచేయగలిగితే, మానవనాగరికతకు పాశ్చాత్యదేశాలు గొప్పమేలు చేసినట్టే. అయితే, ప్రస్తుతం పాశ్చాత్యదేశాలలోనూ ప్రాచ్యదేశాలలోనూ ఉన్న అన్ని సందర్భాలకూ తగినట్టు మనిషిగురించీ సమాజం గురించీ ఒక కొత్త తాత్త్విక సిద్ధాంతాన్ని ప్రతిపాదించవలసిన అవసరం మనముందు ఒక సమస్యగానే ఉండిపోయింది.

సమాజంలో నిచ్చెనమెట్ల హెచ్చుతగ్గులను ఆమోదించి, సమాజం సమ్మతించిన అభిప్రాయాలకే అందరూ కట్టుబడి ఉండాలని చెప్పే కన్‌ఫ్యూషియనిజం వ్యక్తి స్వేచ్ఛకు గానీ మానవహక్కులకుగానీ భరోసా ఇవ్వగలదా? పౌరసమ్మతిని (సివిల్ డిసోబిడియెన్స్) ఒక హక్కుగా నిలబెట్టుకోవడంలో పాశ్చాత్యదేశాలలో సోక్రటిస్, ప్రాచ్యదేశాలలో గాంధీ ఎదుర్కొన్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించాలి? ఇద్దరూ 'అన్యాయమైన' రాజకీయవ్యవస్థలను ఎదుర్కొన్నారు. అధికారానికి సమ్మతించాలన్న ఒత్తిడిపైన ఇద్దరూ పోరాటం చేశారు. తీవ్రమైన పర్యవసానాలను ఎదుర్కొన్నారు. ప్రపంచం తమతో ఉందా లేక తాము న్యాయమని నమ్మినదాని ప్రాతిపదికన హక్కులకోసం తాము చేస్తున్నపోరాటం ఒంటరిపోరాటమా అని వారిద్దరూ లెక్కచేయలేదు. తమ వ్యక్తిగత లక్ష్యం కోసం తాము ఏకాగ్రతతో చేస్తున్న ప్రయత్నంలో తమకు ఏ ఆటంకం కలిగించకుండ స్వేచ్ఛగా వదిలిపెట్టాలన్న ఉదారవాదుల డిమాండుకూ, తాము ప్రాథమిక నైతిక సమస్యగా భావించే విషయంలో ప్రశ్నించడానికి ధిక్కరించడానికీ తమకు హక్కు ఉండాలని వీరిద్దరూ లేవదీసిన డిమాండుకూ తేడా ఉంది.

## 2.8 కాలాన్నిబట్టి, ప్రదేశాన్నిబట్టి మారే సందర్భం

హక్కులు రూపంలోనూ సారాంశంలోనూ ఒక సమాజానికీ ఒక కాలానికీ చెందినవయినట్టయితే, మనుషులందరికీ చెందే సార్వజనీనత హక్కులకెట్లా సాధ్యం? ప్రతిసమాజానికీ తనదయిన ప్రత్యేకమైన చరిత్ర ఉంటుంది. ఎవరు ఏ హక్కులను ఎప్పుడు అనుభవించాలో ఆ సమాజం నిర్ణయిస్తుంది. వ్యక్తి హక్కుల భావన ఆధునికమైనది. ప్రాచీన గ్రీకు సమాజానికి చెందిన సామూహిక హక్కులకిది వ్యతిరేకం. బూర్జువావర్గం భూస్వామ్య వర్గంపైనా రాచరిక నియంతృత్వం పైన పోరాడి తమ ఆస్తులనూ వ్యాపారాలనూ రాజుల భూస్వాముల జోక్యం నుండి కాపాడుకోవాలని చేసిన ప్రయత్నంలో భాగంగా వ్యక్తి హక్కుల భావన పుట్టింది. సంకెళ్ళు తప్ప పోగొట్టుకోవడానికి వేరే ఏమీలేని సామాన్యజనం ఆ రాచరిక వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములయ్యారు, తీవ్రంగా నష్టాన్ని చవిచూసారు. అయితే ఆ తరువాత నెలకొన్న బూర్జువా ప్రజాస్వామ్య పాలనలో వారు పొందిన హక్కులు స్వల్పమే.

లాభనష్టాల బూర్జువా వ్యాపార సంస్కృతి సార్వజనీనం కావడంతో మానవసంబంధాలపైన 'సోషల్ డార్విజం' ప్రభావం బలంగా పడింది. వ్యక్తులు వ్యాపారంలో లాభాలు పొందడమే లక్ష్యం అయింది. ఈ వ్యాపార లక్ష్యానికి చట్ట సంరక్షణ కావలసివచ్చింది. వ్యక్తులవ్యాపారీకరణ, పరాయీకరణ సమూహాన్నీ కుటుంబాన్నీ నాశనం చేసాయి. దానికి తీవ్ర పర్యవసానాలున్నాయి. ఆత్మహత్యలు, కుటుంబవ్యవస్థపతనం, విడాకుల రేటుపెరగడం, మనుషులప్రవర్తనలో దిగజారుడుతనం పతనమయినవి.

'జ్యూ విష్ క్వెశ్చన్' అనే రచనలో మార్క్స్ ఈవిధంగా అంటారు. "మనిషి హక్కులు అని పిలవబడుతున్నవి ఇతర మనుషుల నుండి సమాజంనుండి వేరుపడిన స్వార్థజీవి హక్కులు. ఈ మనిషి తనలో తాను ముడుచుకొనిపోయి ఉంటాడు. తన బుద్ధికి తోచినట్టు నడుచుకుంటాడు తనవ్యక్తిగత ప్రయోజనాలు మాత్రమే అతనికి కావాలి. అమానవీయమైన బూర్జువా వాతావరణంలో ఈ హక్కులు మనిషిని తన ఒంటరి ప్రస్థానంలో నిలబెడతాయి. ఆధునిక

BRAOU

వైజ్ఞానిక పారిశ్రామిక శకాన్ని మార్క్స్ ఆహ్వానించాడు. కానీ అది కార్మికుల జీవితాల నుండి హక్కుల నుండీ కోరుకునే మూల్యాన్నీ పూర్తిగా వ్యతిరేకించాడు. ఆయన ఆధునిక విలువలను వ్యతిరేకించలేదు. అయితే వాటిని 'స్వేచ్ఛాయుతమైన వైయక్తికత' అనే హెగెలియన్ ఆలోచన వెలుగులో తిరగరాయాలనీ బలోపేతం చేయాలనీ భావించారు. అందరికీ ఈ స్వేచ్ఛను అందిస్తున్న భ్రమ పెట్టుబడిదారీ సంస్కృతి కలిగిస్తుంది. కానీ నిజానికి కేవలం కార్మిక వర్గానికే కాదు, పెట్టుబడిదార్లకు కూడ దీనిని నిరాకరిస్తుంది. పెట్టుబడిదార్లు సహితం తాము నిజమైన మానవత నుండి మానవహక్కులనుండి ఎంతగా పరాయీకృతమై ఉన్నారో ఎరుగరు.

పీడితులలో చైతన్యం పెరిగిన ఫలితంగా పెట్టుబడీదారీ వ్యవస్థ, వలసవాదం, పురుషాధిక్యత, మెజారిటీ గుంపుల పెత్తనం మొదలయిన అన్ని రకాల ఆధిపత్యానికీ లేమికీ వ్యతిరేకంగా హక్కులు కోరుకోవడం జరుగుతున్నది. ఇది ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాలలో జరుగుతున్నది. అయితే బాధాకరమైన వాస్తవం ఏమిటంటే ఇదే మూడవ ప్రపంచదేశాలలో హక్కులకు సంబంధించిన వైరుధ్యమొకటి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. విదేశీపెత్తనానికి వ్యతిరేకంగా ఎవరయితే తమ హక్కుల గురించి, స్వాతంత్ర్యాన్ని గురించి ఘంటాపథంగా మాట్లాడతారో, వారే తమ దేశాలలో మైనారిటీలకు, స్త్రీలకు ఈ హక్కుల సూత్రాన్ని అన్వయించకపోవడం కొన్ని ముస్లిం దేశాలలో కనిపిస్తుంది. సార్వజనీనమైన మానవ విలువల కోసం, హక్కులకోసం పోరాడిన చరిత్ర తమకు ఉందని గర్విస్తే దేశాలలో సహితం మానవహక్కుల నిరాకరణకు ఉదాహరణగా అమెరికాలో నల్లజాతి అమెరికన్లు, బ్రిటన్‌లో ఆసియావాసులు, జర్మనీలో టర్కీజాతివారు, ఫ్రాన్స్‌లో ఆఫ్రికన్లు నిలుస్తారు. మానవ ఆలోచనారీతులను విప్లవీకరించి, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో సామాజిక మార్పుకూ విప్లవానికీ ఉత్తేజం కలిగించిన సోవియట్ విప్లవం, ఏడుదశాబ్దాల సోషలిజం అని పిలువబడిన ప్రయోగం అనంతరం నిశ్శబ్దంగా కుప్పకూలిపోవడానికి గల ప్రధాన కారణం ఆ విప్లవనాయకులకు మానవహక్కులపట్ల ఉన్న తిరస్కారభావం, భూస్వామ్యదశనుండి సోషలిస్టు దశకు జరిగిన పరిణామంలోని సమస్యలతో వ్యవహరించడంలో మానవత్వం లోపించడం. వాళ్ళు రాజకీయ ఆర్థిక నిర్మాణాల రూపాన్ని మార్చారుగానీ మనుషులు వ్యక్తిత్వం, పెత్తందారీ, దోపిడీ గుణాలనుండి మనుషుల ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని స్నేహపూర్వకంగా ఆదరించే దిశగా మారలేదు.

అది సోషలిజం కానివ్వండి, ఉదారవాదం కానివ్వండి, విభిన్న రకాల పిడివాదం కానివ్వండి, అందరూ గౌరవించే మానవతావిలువలు కొన్ని ఉండాలి. విలువలన్నీ సందర్భం చేత, సంస్కృతిచేత నిర్ణయింపబడుతాయనే అనేకన్న (ఉదాహరణకు కులవ్యవస్థ, జాతివిభేదాలు వగైరా), మనుషుల మధ్య సమానత్వం, మానవహక్కులు మొదలయిన సూత్రాలను ఆధునిక కాలంలో పక్కన పెట్టడం సాధ్యం కాదు. ఆధునిక సమాజాలు ప్రజాస్వామ్యం దిశగా ఎదిగాయి. కానీ దురదృష్టవశాత్తు మనిషి అంటే ఏమిటి, మానవగౌరం అంటే ఏమిటి అనే విషయంలో ఒక ఏకాభిప్రాయానికి రావడం ఆధునిక ఆలోచనకు సాధ్యం కావడంలేదు. అందువల్ల సార్వజనీనంగా ఆమోదం పొందిన మనిషి హక్కులను ఈ ప్రపంచం నిర్వహించుకోలేకపోతున్నది. అయితే సమానహక్కుల గుర్తింపుకోసం డిమాండ్ మాత్రం ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా బలహీనులయిన ప్రజాసమూహాల నుండి, మరింత తీవ్రంగా వస్తున్నది.

ఇక్కడ ప్రధానమైన సమస్య ఏమిటంటే, హక్కులకు సార్వజనీనమైన ప్రమాణాలను నిర్వచించడం ఎట్లాగనేది. అవి తాత్వికంగా జ్ఞానదాయకంగానూ ఉత్తేజకరంగానూ ఉండాలి. అదేసమయంలో సార్వత్రికంగా వాటి చట్టం ద్వారా అమలు చేయగలగాలి. సర్వజనామోదనీయం అయిన ప్రమాణాలపైన అంగీకారం కుదరడానికి ముందు, సాధ్యమయినంతవరకు వివాదాత్మక సమస్యలను ప్రజాస్వామికంగా పరిష్కరించుకోవాలనే విషయంలో అందరూ అంగీకారానికి రావడం అవసరం. అంటే ఒకరినైతిక స్వతంత్రతనొకరు గుర్తించడం, అసమ్మతి వాదులను బలవంతం పెట్టకూడదని గుర్తించడం అవసరం. అప్పుడు సార్వజనీన ప్రమాణాలుగా పిలువబడే వాటిని కొద్దిమంది శిష్టవర్గంగా ఉన్నవారు అచేతనంగా అసంతృప్తిగా ఉన్న మెజారిటీపైన రుద్దడం అనే సమస్య ఉండదు. లాభార్జనకోసం పర్యావరణాన్ని ధ్వంసం చేసే బడా వ్యాపారంపైన పోరాటం కేంద్రీకృత నియంతృత్వ రాజ్యాలపైన పోరాటం ఈరోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సార్వత్రికమైన ఆకాంక్షలు. అదేవిధంగా స్త్రీలు, పిల్లలు, అసంఘటిత కార్మికుల దోపిడీ విషయంలో కూడా హక్కుల ప్రతిపాదనకు సార్వత్రిక నియమాలు అందరి సమ్మతినీ పొందగలవు.

BRAOU

## 2.9 సమూహంలోపల వ్యక్తి హక్కులు

మైనారిటీ మతస్తులు, జాతులు తమకు సమూహాలుగా హక్కులు ఇవ్వాలని కోరుకోవడం ఇవ్వాళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒక ముఖ్య సమస్య. ఒక వ్యక్తి ఏ సమూహానికి చెందినవారనే దానితో నిమిత్తం లేకుండా అందరికీ కొన్ని హక్కులుంటాయని చెప్పే అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని, ఈ సంస్థలు తరచుగా వ్యతిరేకిస్తాయి. సమాంతర విలువలు ప్రతిపాదిస్తాయి. ఈ సామూహిక హక్కుల భావజాలం, సమూహం తనవిగాభావించే హక్కులకూ అందులోని వ్యక్తులు అదే సమయంలో వ్యక్తులుగా కోరుకునే హక్కులకూ మధ్యనున్న వైరుధ్యాన్ని గుర్తించదు. మైనారిటీ సమూహాలకు చెందిన అసమ్మతివాదికి రాజ్యాంగం భరోసా ఇచ్చిన హక్కులను అందియ్యడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం ఒక సమస్యగానే ఉండిపోయింది. ఆ సమూహానికి ప్రతినిధులుగా నిలబడ్డవారు వ్యక్తంచేసే విలువలే ఆ సమూహానికి చెందినవారందరూ స్వచ్ఛందంగా అంగీకరిస్తున్నవారయినా ప్రభుత్వం సమ్మతి, లేదా అసమ్మతివాదులయిన వారు తెలివితక్కువ వాళ్ళనో సంఘవిద్రోహులనో భావించాలి. సమూహాల నాయకులు, అసమ్మతివాదులు ప్రతిపాదించే పరస్పరవిరుద్ధమైన వాదనలతో ఏది సత్యం అని తేల్చుకోవడానికి వస్తుగతమైన ప్రమాణాలేవీ లేనట్టయితే, అసమ్మతివాది భారతరాజ్యాంగం తనకు హామీ యిచ్చిన భావప్రకటనా స్వేచ్ఛనూ కార్యాచరణ స్వేచ్ఛనూ అనుభవించలేని పరిస్థితి తలెత్తుతుంది. ఒక వ్యక్తి ఒక సమూహానికి చెందినవాడని చెప్పి సనాతనత్వం పేరుమీద, సంప్రదాయం పేరుమీద ఉదారవాద ప్రజాతంత్ర రాజ్యాంగ హక్కులపైన పరిమితులు పెట్టినప్పుడు, సంప్రదాయక జెండర్ విభజనను అనుసరించాలని ఒత్తిడిపెట్టినప్పుడు, రాజ్యం ఆ పౌరుడి చట్టబద్ధమైన హక్కులు కాపాడలేకపోయినట్టయితే న్యాయం భ్రష్టుపట్టినట్టవుతుంది. పుట్టుక అనే కాకతాళీయమైన విషయం కారణంగా ఒక వ్యక్తి ఏ సమూహానికయితే చెంది ఉంటారో ఆ సమూహంలో భాగం కావడం వల్ల వ్యక్తి తన హక్కులు కోల్పోయినంతవరకు ఆ సమూహం అంతర్గత వ్యవహారాలలో రాజ్యం జోక్యం చేసుకోకూడదు. అయితే ఆ సమూహం తన సభ్యులయినవారు భావస్వేచ్ఛ విషయంలోనూ ఆచరణ విషయంలోనూ తమకు చట్టం ఇచ్చిన హక్కులు అనుభవించనీయనట్టయితే, ఆ వ్యతిరేకతను అధిగమించి తమ హక్కులు అనుభవించడానికి ఆ వ్యక్తులకు సహాయం చేయడం రాజ్యానికుండే చట్టపరమైన బాధ్యత.

మైనారిటీకి తమ ఉనికికీ సామూహిక హక్కులకూ న్యాయం జరుగుతుందన్న హామీ మెజారిటీ ఇవ్వాలనేది ప్రజాస్వామ్యంలో కీలకమైన విషయం. భిన్నమతాలవారు నివసించే రాజ్యాన్ని ఇస్లామిక్ రాజ్యమనో, హిందూరాజ్యమనో ప్రకటించడం ప్రజాస్వామ్యం మూలాలనే దెబ్బతీసే చర్య. రూపంలోనూ, స్ఫూర్తిలోనూ, సహనం, లౌకికత, బహుళత్వం, మానవత, ప్రజాతంత్ర రాజ్యాల లక్షణంగా ఉండాలి. షరియత్‌లోనో లేక మనుస్మృతిలోనో, టెన్‌కమాండ్‌మెంట్స్‌లోనో ఏదో ఒక దానిలోనే సత్యమంతా ఉందని భావించి వాటిని అనుసరించి రాజ్యం చట్టాలు చేసేటట్టయితే మైనారిటీల ఆత్మగౌరవం, సమానత్వం దెబ్బతింటాయి.

రాజ్యాంగంలోని హక్కులనూ, చట్టాలనూ అమలు పరచేటప్పుడు ప్రభుత్వ అధికారులు పక్షపాతవైఖరి అవలంభించేటట్టయితే మైనారిటీలలో అభద్రతాభావం, పరాయీకరణభావం పెరుగుతాయి. మైనారిటీల ఆకాంక్షలకూ మెజారిటీ ఆకాంక్షలకూ ఘర్షణ వచ్చినప్పుడు మెజారిటీయే ఎక్కువగా సర్దుబాటు చేసుకోవాలి. అయితే ప్రజ్వాస్వామిక పద్ధతిలో మెజారిటీ చేసిన చట్టాల పట్ల మైనారిటీ ధిక్కారవైఖరి అవలంభించినట్టయితే వ్యవస్థిత సమాజం ఎక్కువకాలం నిలవదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒక పెద్దమైనారిటీ బృందంలోని చిన్న సమూహాల హక్కులనుగానీ వ్యక్తుల హక్కులనుగానీ సాంస్కృతిక లేక జాతీయ పరిశుద్ధత పేరిట లేక గుంపు బలం పేరిట మైనారిటీ పరిమితం చేయగూడదు. మైనారిటీలు కూడ తమ ప్రాతినిధ్య సంస్థలకు ఎన్నికలు జరపడం అనే ప్రజాస్వామ్య పద్ధతిద్వారా ఏకాభిప్రాయ సాధనకు కృషిచేయాలి. బెదిరింపులలోనూ భావజాల సంబంధమైన ఒత్తిడితోనూ ఏకాభిప్రాయాన్ని సాధించే సంప్రదాయ పద్ధతులను అనుసరించకూడదు.

BRAOU

భాషాపరమైన మైనారిటీల హక్కుల రక్షణ కోసం, మెరుగుదలకోసం 20వ శతాబ్దంలో అంతర్జాతీయ చట్టంలో చాలా ప్రయత్నాలు జరిగాయి. మొదటి ప్రపంచయుద్ధం తరువాత కొత్తగా ఏర్పడిన దేశాలకు లీగ్ ఆఫ్ నేషన్స్‌లో సభ్యత్వం ఇవ్వడానికి పెట్టిన ఒక షరతు ఏమిటంటే అవి తమ దేశాలలోని భాషాపరమైన మైనారిటీలతో సహా అందరు మైనారిటీల హక్కులకూ భద్రత కల్పిస్తామన్న ఒప్పందంపైన సంతకం పెట్టాలని. రెండవ ప్రపంచయుద్ధం తరువాత దాదాపు 130 దేశాలు అంతర్జాతీయ పౌరరాజకీయ హక్కుల ఒడంబడిక పైన సంతకం చేయడం మరొక గణనీయమైన పరిణామం. భాష ప్రాతిపదికనగానీ వేరే ఏ ప్రాతిపదికన అయినా గానీ 'వివక్షనుండి సమానమైన, సమర్థమైన రక్షణ' ఉంటుందని ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 26 అంటుంది. భాషా, మతం, జాతిపరమైన మైనారిటీలు ఉన్న రాజ్యాలలో అటువంటి మైనారిటీలకు చెందిన వ్యక్తులకు తమ సంస్కృతిని ఆచరించడానికిగానీ తమ మతాన్ని పాటించడానికి గానీ తమ భాష ఉపయోగించడానికగానీ ఉన్న హక్కును నివారించడానికి వీలులేదు' అని ఆర్టికల్ 27 అంటుంది.

చాలా రాజ్యాలు ఈ నియమాలను ఆమోదించినప్పటికీ, తమ రాజ్యాలలోని మైనారిటీలకు అన్ని హక్కులకు భరోసా ఇవ్వడం లేదు. భాషాపరమైన, మతపరమైన మైనారిటీల పట్ల వివక్ష పాటిస్తున్నాయి. ఈ నియమాలు స్వచ్ఛందమైనవే. అయినప్పటికీ, అవి ప్రపంచవ్యాప్తంగా అన్ని రాజ్యాలకూ ఆదేశికసూత్రాలుగా పనిచేస్తున్నాయి. వివక్షకు గురయినవారు ఈ నియమాలను ఆధారం చేసుకొని తమహక్కుల కొరకు కొట్లాడగలరు. 1923లోనే అమెరికా సుప్రీంకోర్టు ఒక చెప్పుకోదగ్గ తీర్పులో (మేయర్ వెర్సస్ నెబ్రాస్కా రాష్ట్రం) విదేశీభాషలు రాష్ట్రంలోని పాఠశాలలో బోధించకూడదని చెప్పే చట్టం చెల్లదని కొట్టేసింది. ఒక భాషాపరమైన మైనారిటీకి (ఇక్కడ జర్మన్‌లు) తమ భాష బోధించుకునే హక్కుందని గుర్తించడం ద్వారా కోర్టు ఆ సమూహానికి ఉండే సాంస్కృతిక స్వయంప్రతిపత్తినీ పౌరుల హక్కులనూ కాపాడింది.

## 2.10 ముగింపు

ఒక నిర్దిష్ట సామాజిక సందర్భంలో, వ్యక్తులకు తమ సామర్థ్యాలు అభివృద్ధి చేసుకోవడానికి ఉండే అవకాశాలే హక్కులు. హక్కులు అపరిమితంగా ఉండలేవు. మెజారిటీ, మైనారిటీ స్వేచ్ఛగా పాల్గొనే ప్రజాస్వామిక స్వభావంగల చట్టసభలచేత హక్కులకు పరిమితులు నిర్ణయించబడాలి. అసమానత, వివక్ష విస్తృతంగా ఉన్నప్పుడు న్యాయమైన అవకాశాలు చాలామందికి అందుబాట్లో ఉండజాలవని మార్క్సిస్టులు అంటారు. అసమానత తొలగిపోయినప్పుడే హక్కులు, ప్రజాస్వామ్యం అందరికీ అందుబాట్లోకి వస్తాయి. ఉదారవాదులు హక్కులు వ్యక్తులకు చెందినవని అంటారు. వ్యక్తులు భాగమైన సామూహిక బృందాలకు హక్కులు చెందుతాయని మరికొందరంటారు. హక్కులూ బాధ్యతలూ కలిసి ఉంటాయి. ఒక మెజారిటీ ఆధిపత్యంలో ఉన్న సామాజిక, రాజకీయ వ్యవస్థ మైనారిటీ హక్కులకూ వ్యక్తి హక్కులకూ ప్రత్యేకమైన రక్షణ కల్పించాలి.

## 2.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబు రాయండి.**

1. మానవ హక్కులంటే ఏమిటో వివరణాత్మకంగా చర్చించండి ?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. ఉదారవాద హక్కుల సిద్ధాంతంపై మార్క్సిస్టు విమర్శ ?
2. సమూహంలోపల ఉండే వ్యక్తి హక్కులను చర్చించండి ?

Dr. BRAOU LIBRARY Acc. No. 115095 Class No. 323.4 BHA

# భాగం - 3 : మానవ హక్కులు - ప్రధాన భావనలు

**విషయక్రమం**

3.0 ఉద్దేశం
3.1 పరిచయం
3.2 రాజ్యస్వభావం
3.2.1 సంప్రదాయక భావన
3.2.2 ఉదారవాద సిద్ధాంతం
3.2.3 మార్క్సిస్టు సిద్ధాంతం
3.3 పౌరసమాజం : అర్థం
3.3.1 భారత, పాశ్చాత్య పౌరసమాజాల అధ్యయనం
3.3.2 సమూహవాదంలో పౌరసమాజం
3.3.3 మార్క్సిస్టు దృక్పథం
3.4 స్వేచ్ఛ : ప్రాచీన దృక్పథం
3.4.1 ఆధునిక ఉదారవాద సిద్ధాంతం
3.4.2 మార్క్సిస్టు వైఖరి
3.5 ధర్మం : అర్థం, మూలం
3.5.1 అభ్యుదయకరమైన అంశాలు; తిరోగామి అంశాలు
3.6 న్యాయవాదం - నిర్వచనం
3.7 నేరం - సంప్రదాయక దృక్పథం
3.7.1 సంప్రదాయక భావన గురించి సామాజికశాస్త్ర విశ్లేషణ
3.8 శిక్షలు వేయడానికిగల కారణం
3.8.1 మానవతావాద దృక్పథం
3.8.2 శిక్షకు సంబంధించిన సిద్ధాంతాలు
3.9 ముగింపు
3.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 3.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- రాజ్యస్వభావం గురించి, పౌరసమాజం గురించి అవగాహన చేసుకుంటారు
- స్వేచ్ఛమీద ఉదారవాద, మార్క్సిస్టు వైఖరుల గురించి తెలుసుకుంటారు
- ధర్మం, న్యాయం గురించిన ప్రాథమిక పరిజ్ఞానం పొందుతారు
- శిక్షలకు సంబంధించిన సిద్ధాంతాలు తెలుస్తాయి

## 3.1 పరిచయం

మానవ హక్కులకు సంబంధించిన చర్చను అర్థం చేసుకోవడానికి పునాదిప్రాయమైన కొన్ని ప్రధాన భావనలను ఈ భాగం విశదీకరిస్తుంది. ఈ పాఠంలో చర్చించిన ప్రధాన భావనలు మానవహక్కులకు సంబంధించిన సూత్రాలతో

ముడిపడినవి. ఇవి పరస్పర సంబంధం ఉన్న భావనలు. వీటిని మొత్తంగా తీసుకున్నప్పుడివి మానవహక్కుల చర్చకు సంబంధించిన పూర్వరంగాన్ని సమకూరుస్తాయి. హక్కులను ఒక రాజ్యం, ఒక సమాజంలో ఒక న్యాయశాస్త్ర చట్రంలో మాత్రమే అనుభవించడం సాధ్యం అవుతుంది. ఆ చట్రం అప్రజాస్వామికంగా ఉంటే హక్కులు మృగ్యమవుతాయి.

## 3.2 రాజ్యస్వభావం

మానవహక్కులను కాపాడేదీ అమలు చేసేదీ రాజ్యమే కాబట్టి రాజ్యం స్వభావం గురించి ఒక అవగాహన లేని మానవ హక్కుల చర్చ నిష్ప్రయోజనమైనది. హక్కులకు సందర్భాన్నీ హక్కుల స్వరూపాన్నీ నిర్ణయించేది, ఒక దేశంలోని పౌర సమాజమే అయినప్పటికీ, రాజ్యానికీ ఉండే కార్యనిర్వాహక, న్యాయ అధికారాలే చట్టపరమైన హక్కుల వ్యాప్తినీ పరిమితినీ నిర్ణయిస్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీలో అత్యంత ప్రజాస్వామిక స్వభావం గల రాజ్యాంగం (వైమార్ రాజ్యాంగం) ఉండింది. కాని హిట్లర్ అధినేతృత్వంలోని కార్యనిర్వాహక అధికారం ఆ రాజ్యాంగంలోని ప్రజాస్వామ్య సారాన్ని హతమార్చి ఒక్క యూదులకే కాక మెజారిటీ పౌరులయిన జర్మన్ క్రైస్తవులకు సహితం హక్కులు లేకుండా చేసింది. పాకిస్తాన్‌లో 1958 తరువాత మూడు దశాబ్దాలు నెలకొన్న సైనిక నియంతృత్వం హక్కులనూ ప్రజాస్వామ్యాన్నీ అదేవిధంగా ధ్వంసం చేసింది. మూడవ ప్రపంచంలోని అనేక ఇతర దేశాలు ఇదే విధంగా హక్కులు ప్రజాస్వామ్యం నాశనమైన బాధాకరమైన అనుభాన్ని చవిచూస్తాయి.

### 3.2.1 సంప్రదాయక భావన

ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తలు ప్లాటో, అరిస్టాటిల్ రాజ్యాన్ని ఆదర్శవంతమైన సంస్థగాను ప్రజలు భావించే అత్యున్నతమైన మంచికి ప్రతినిధిగాను అర్థం చేసుకున్నారు. కాబట్టి ఆదర్శవంతమైన రాజ్యశాసనాలకు పౌరుల ఆకాంక్షలకూ మధ్య వైరుధ్యమేదీ ఉండజాలదు. వాళ్ళు వ్యక్తుల హక్కులకు సంబంధించిన సిద్ధాంతమేది ప్రతిపాదించలేదు. రాజ్యాన్ని ఒక మొత్తంగానూ, వ్యక్తులను అందులో విడిభాగాలుగానూ వాళ్ళు భావించారు. రాజ్యం వ్యక్తి లేక సమాజం అనే భిన్న రంగాలను వాళ్లు వేరు చేసి చూడలేదు. సోక్రటిస్ అప్పటి (అవినీతిమయమైన) ఏథేన్స్ రాజ్యంలోని దిగజారిన సంస్థలకూ విలువలకు ఇబ్బందికరమైన భావస్వేచ్ఛనూ భావవ్యక్తీకరణ స్వేచ్ఛనూ కోరుకున్నాడు. కాబట్టి తనకి మరణదండన విధించారు.

BRAOU

### 3.2.2 ఉదారవాద సిద్ధాంతం

రాజ్యాన్ని గురించిన ఉదారవాద సిద్ధాంతాన్ని మాక్స్‌వెబర్ బాగా వివరిస్తాడు. రాజ్యం ఒక వ్యవస్థ లేక వ్యవస్థల సమూహం. అది సార్వజనీనమైన, తప్పనిసరిగా ఆచరించవలసిన నియమాలను ప్రకటిస్తుంది. ఒక నిర్దిష్ట భూభాగంలో "భౌతిక నిర్బంధం ప్రయోగించే హక్కుపైన దానికి గుత్తాధిపత్యం ఉంటుంది."

ప్రామాణిక ఉదారవాద సిద్ధాంతవేత్తలు రాజ్యాన్ని ఒక కీడుగా, అయితే అవసరమైన కీడుగా భావిస్తారు. తమ ప్రయోజనాలు ఏవిధంగా సాధించుకోవాలనేది అందరికీ తెలిసి ఉంటుందిగానీ తమ పొరుగువారి ప్రయోజనాలు గురించి అందరికీ అవగాహన ఉండదు. కాబట్టి తెలిసో తెలియకో వారికి హాని చేయవచ్చు. రాజ్యం తన శాసన, న్యాయ, కార్యనిర్వాహక అధికారాల ద్వారా ఈ హానిని నివారిస్తుంది. అందువల్ల రాజ్యం అవసరం. అయితే వ్యక్తిని తన స్వేచ్ఛననుసరించి నడుచుకొనకుండ నియంత్రించడం ద్వారా రాజ్యం తన అధికారాన్ని అమలు చేస్తుంది. కాబట్టి సాపేక్షంగా రాజ్యం ఒక కీడు కూడా. ఈ చట్రంలో రాజ్యశాసనానికీ వ్యక్తి స్వేచ్ఛకూ మధ్యనున్న వైరుధ్యాన్ని ఉదారవాద తర్కం పరిష్కరించజాలదు. హాబ్స్, లాక్‌ల వైయక్తిక దృష్టిని ఆడంస్మిత్, రికార్డో, ఫిజియోక్రైట్‌లు ఆర్థికరంగానికి అన్వయించడం ద్వారా మరింత బలపరిచారు. ఉత్పాదన, వాడకం, ధరలు మొదలైన మార్కెట్ శక్తులతో రాజ్యాధికారం సమర్థంగా వ్యవహరించజాలదు. కాబట్టి వాటిని రాజ్యం నియంత్రించడం గానీ అదుపు చేయడంగానీ మంచిది

కాదు. తమ ఆర్థిక ప్రయోజనాలు ఏవిధంగా సాధించుకోవాలో ప్రతి ఒక్కరికీ తెలుసును కాబట్టి ఎవరి ప్రయత్నాలకు వాళ్లను వదిలేయడం మంచిది. అనియంత్రితమైన మార్కెట్ శక్తులే వ్యక్తి హితవునూ సమాజం హితవునూ పెంపొందించడానికి తగిన సహజమైన పరికరాలు. కాబట్టి రాజ్యం జోక్యం చాలా పరిమితమైన పరిధిలో మాత్రమే ఉండాలి. శాంతి భద్రతలు నెలకొల్పడం, వ్యాపార ఒప్పందాలను అమలు చేయడం, దేశరక్షణ మొదలైన పరిమితమైన కర్తవ్యాలకు పరిమితం కావాలి. తక్కిన అన్ని రంగాలలోను వ్యక్తులు తమ సంపదను, సంతోషాన్నీ వెతుక్కోవడానికి వారిని స్వేచ్ఛగా వదిలేయాలి. ఆర్థిక రంగంలో రాజ్యం పాత్రను ఈ విధంగా అర్థం చేసుకొనే ఉదారవాద ఆలోచనను "లైజస్ ఫేర్" దృక్పథం అంటారు.

మొత్తం మీద, ఉదారవాదులు రాజ్యాన్ని ఒక సహజమైన విషయంగా కాక కృత్రిమమైనదిగా, ఒక ఒప్పందం ఫలితంగా ఏర్పడినదిగా, ఒక బాహ్యశక్తిగా అర్థం చేసుకుంటారు. రాజ్యంలోని ప్రజలందరికీ ఉండే కొన్ని సాధారణ ప్రయోజనాలను చూసుకొనే నిర్దిష్ట అవసరం కోసం నెలకొల్పిన ఒక అధికార సాధన మాత్రంగా చూస్తారు. చట్టబద్ధ పాలనలో జీవితం, స్వేచ్ఛ, వ్యక్తిగత ఆస్తులకు భరోసా ఉండాలని ఉదారవాద సిద్ధాంతవేత్తలు అంటారు. ఈ మౌలికమైన హక్కులకు అభిప్రాయస్వేచ్ఛను భావప్రకటన స్వేచ్ఛనుకూడ మరికొందరు ఉదారవాదులు చేర్చారు. వాటి విషయంలోనూ రాజ్యం జోక్యం అవాంఛనీయం అని భావించారు. స్వంత ఆస్తి వ్యవస్థ, వ్యక్తివాద భావజాలం సాంప్రదాయక ఉదారవాద రాజ్యానికి ప్రాతిపదిక. అయితే జాన్‌స్టువార్ట్‌మిల్, జాన్‌రాల్స్ వంటి తదుపరి కాలానికి చెందిన ఉదారవాదులు, రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కుల రక్షణకోసం రాజ్యం చేపట్టగల కార్యరంగాన్ని బాగా పెంచారు.

రాజ్యం అధికారానికీ వ్యక్తి స్వేచ్ఛకు హక్కులకూ మధ్య వైరుధ్యం ఉందని ఉదారవాదులు భావిస్తారు. రాజ్యాధికారం పరిధి పెరిగే కొద్దీ పౌరులకు తమ హక్కులను స్వేచ్ఛను అనుభవించడానికి ఉండే అవకాశం తగ్గుతుందని వారు భావిస్తారు.

ఆస్తి హక్కు, చట్టబద్ధపాలన, భావస్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, సార్వజనీనమైన ఎన్నికల వ్యవస్థ ద్వారా ప్రశాంతంగా ప్రభుత్వాల మార్పు, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం మొదలయినవి. ఉదారవాద రాజ్యభావనకు పునాది హాబ్స్, లాక్, బెంథాంలు అభివృద్ధి చేసినారు. సిద్ధాంతం బలప్రయోగాన్ని చట్టం అమలుకు అంతిమసాధనంగా భావిస్తుంది.

BRAOU

### 3.2.3 మార్క్సిస్టు సిద్ధాంతం

రాజ్యానికుండే బాధ్యతల గురించి రాజ్యం స్వభావం గురించి ఉదారవాదులు చెప్పేది మార్క్సిస్టులు ఒప్పుకోరు. కార్మికులను రైతులను దోచుకోవడానికీ వారిపైన పెత్తనం చేయడానికీ ఆస్తిపరులకు ఉపయోగపడే ఒక సాధనం రాజ్యం అని మార్క్సిస్టులు భావిస్తారు. ఆస్తిలేని వాళ్లపైన ఆస్తిపరులు ప్రయోగించిన హింసద్వారా రాజ్యం ఉనికిలోకి వచ్చింది. తరతరాలుగా అది హింసమీద, భావజాలం మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నది. మార్క్సిస్టుల ప్రకారం రాజ్యం చేసే చట్టాలు కలవారి అవసరాలను ప్రతిఫలిస్తాయి. కాబట్టి అవి నిష్పాక్షికంగా ఉండజాలవు. సమాజంలోని విద్యావంతులలో అధికభాగం ఆస్తిపరులే ఉంటారు. వారు రూపొందించే భావజాలం సార్వజనీనంగా హేతుబద్ధమైనదిగానూ నైతికమైనదిగానూ కనిపిస్తుంది. దానికి ప్రత్యర్థిగా వేరే ఏభావజాలాన్నీ, పాలకవర్గం ఎదగనివ్వదు. ప్రత్యామ్నాయ ఆధిపత్యం ఎదగకుండ ఉండగలందుకు దానిని బలప్రయోగంతోనూ, భావజాలంతోనూ అణచివేస్తుంది.

అటువంటి రాజ్యం ప్రజాస్వామికంగా ఉండజాలదు. న్యాయానికీ, మానవహక్కులకూ, స్వేచ్ఛకూ హామీ ఇవ్వలేదు. రాజ్యానికి విధేయులుగా ఉండడం హేతుబద్ధమైన, నైతికమైన చర్య అనే తప్పుడు చైతన్యాన్ని, ఆస్తిపరుల భావజాలం ఆస్తిలేనివారిలో కల్గించడం వల్ల వారికి ఆధిపత్యాన్ని ఇచ్చే ఆస్తి సంబంధాలను కాపాడుతుంది. ఆస్తిలేని వారు మేధోపరంగానూ భౌతికంగానూ బలహీనులు కావడంవల్ల పాలకవర్గ భావజాలంతో తలపడి గెలవగల భావజాలాన్ని వారు రూపొందించుకోలేరు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు సంఘటితమయ్యారు, విద్యావంతులయ్యారు.

కాబట్టి వాళ్ళు అన్యాయమైన దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థనూ దాని యంత్రాంగం అయిన రాజ్యాన్నీ అంతమొందించి కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పుతారు. ఈ నియంతృత్వం మనుషులను అన్ని రకాల దోపిడీనుండి విముక్తం చేసి అందరికీ నిజమైన స్వేచ్ఛ కల్పించే వాతావరణాన్ని రూపొందిస్తుందని ఆశించడం జరిగింది. ఆదిమదశలో రాజ్యం అనేదే లేదు. ఇతరుల శ్రమను దోచుకోవడంద్వారా పోగయిన వ్యక్తిగత ఆస్తి అప్పుడు లేదు. భవిష్యత్తులో కమ్యూనిజం 'ఉన్నవాళ్ళకూ' 'లేనివాళ్ళకూ' మధ్యవాళ్లకూ మధ్యనున్న ఆస్తిసంబంధాలను రద్దుచేసిన తరువాత రాజ్యం పతనం అయిపోతుంది. రాజ్యరహితమైన కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే నిజమైన మానవస్వేచ్ఛ హక్కులు, న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం సాధ్యం అవుతాయి.

## 3.3 పౌరసమాజం : అర్థం

సుస్థిరమైన సోవియట్ రాజ్యం పతనం అయిన తరువాత ఉదారవాద మేధావులూ మార్క్సిస్టు మేధావులు కూడా చరిత్రలో మానవసామాజిక సంబంధాలను తిరగరాయడానికి అపూర్వ పరిణామంలో జరిగిన అత్యంత ఉత్తేజకరమైన ఆ మహత్తర ప్రయోగం వైఫల్యాన్ని అర్థం చేసుకోవడానికి రాజ్యం స్వభావాన్ని కాక పౌరసమాజం అని పిలువబడే నిర్మాణాన్ని అధ్యయనం చేయసాగారు. 1920లోను, 30లలోనూ ఆంటోనియోగ్రాంసీ అనే మార్క్సిస్టు మేధావి పౌరసమాజాన్ని వివరంగా అధ్యయనం చేసి పెట్టుబడిదారీ వ్యవస్థ నిలదొక్కుకోవడానికి గల కారణాలనూ సోషలిజం సాధించడంలో ఎదురయ్యే సమస్యలనూ విశ్లేషించాడు. పౌరసమాజంలో చరిత్రక్రమంలో భౌతిక, సిద్ధాంతస్థాయిలో సంఘర్షణ, ప్రతిచర్య జరుగుతాయి. తత్ఫలితంగా ఉపరితల నిర్మాణం, ప్రమాణాలు రూపొందుతాయి. ఈ మారకపు సంబంధాలు ఏ మానవబృందాలూ ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించినవే కానవసరం లేదు. ఈ మార్పులు స్పష్టాస్పష్టంగా జరుగుతాయి. ఏ ఒక్కరి ఆదేశాల ప్రకారం జరగవు. పెట్టుబడిదారీ వ్యవస్థ, సోషలిజాల భవితవ్యం నిర్ణయమయ్యే రణరంగం పౌరసమాజమే. పౌరసమాజాన్ని పరిపూర్ణంగా మార్చడానికి ఒక రాజకీయ విప్లవం సరిపోదు. అంతబలం, అంతగాఢత దానికి ఉండవు.

BRAOU

### 3.3.1 భారత, పాశ్చాత్య పౌరసమాజాల అధ్యయనం

భారతదేశంలో కొన్ని కులాలు మరికొన్ని కులాల పైన భౌతిక, సిద్ధాంత ఆధిపత్యాన్ని నెలకొల్పిన క్రమంలో సామాజిక రాజకీయ సంబంధాలను రూపకల్పన చేసిన ప్రయత్నంలో భాగంగాను, కొన్ని ప్రయోజనాలనూ, విలువలనూ నిక్షిప్తం చేసుకున్న సంస్థల ద్వారానూ పౌరసమాజం నియమాలు రూపొందాయి. పాశ్చాత్యదేశాలలో ఒకవైపు నూతనంగా ఎదుగుతున్న సార్వభౌమ జాతి-రాజ్యానికీ మరొకవైపు పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకూ ఇంకొకవైపు పతనమవుతున్న భూస్వామ్యానికీ మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ (పౌరసమాజ) విలువలూ ప్రమాణాలూ ప్రయోజనాలూ సామాజిక స్వయంప్రతిపత్తినీ వ్యక్తి హక్కులనూ కల్పించాయి. వ్యక్తులు మార్కెట్ శక్తులకు గానీ రాజ్య ఆదేశాలకుగానీ బందీలు కాకుండ సమాజంలో క్రియాశీలక పాత్ర నిర్వహించడానికి అవకాశం కల్పించడం సామాజిక, రాజకీయ స్వచ్ఛంద సంస్థలు గణనీయమైన పాత్ర నిర్వహించడం పాశ్చాత్యదృక్పథంలో సాధ్యం అయింది. ప్రజలకు హక్కులు కల్పించడంలోనూ తమ అధికారం గురించీ బాధ్యత గురించి వారిలో అవగాహన కల్పించడంలోనూ స్వచ్ఛందసంస్థలు, స్వయంసహాయక బృందాలు సామాజిక ఉద్యమాలు, ప్రభుత్వేతర సంస్థలు, విభిన్న రకాల కార్యకర్తలు జాతీయస్థాయిలోనూ, స్థానికస్థాయిలోనూ పాత్రనిర్వహించడం అవసరం అని సమాజాన్ని మొత్తంగా తనగుప్పిట్లోకి తీసుకున్న సంక్షేమరాజ్యాన్ని విమర్శించిన వారందరూ - వామపక్షవాదులయినా, మితవాదులయినా - అన్నారు. ఈ దృక్పథంలో, పౌరసమాజం రాజ్యంనుండి స్వయంప్రతిపత్తిగల చురుకైన పాత్ర నిర్వహిస్తుంది. సంక్షేమరాజ్యం తన అధికారాలను చాలా విస్తృతం చేసి పౌరులను తనమీద ఆధారపడేటట్టు చేసుకోవడమే కాక మానవహక్కులకు ప్రమాదకారి అయిన బ్యూరోక్రసీని బాగా పెంచింది కాబట్టి, సంక్షేమ రాజ్యం రూపకల్పన చేసిన సామాజిక నిర్మాణాలకిది ఒక ప్రత్యామ్నాయంగా భావించబడుతున్నది.

### 3.3.2 సమూహవాదంలో పౌరసమాజం

1980లలో అమెరికా సమాజంపైన స్వచ్ఛందవాదం, సమూహవాదం బలమైన ప్రభావం వేసాయి. స్వచ్ఛందసంస్థలు, మహిళాసంఘాలు, సంక్షేమసంస్థలు మొదలయినవి. విధాననిర్ణయక్రమంలోనూ ప్రజాసంస్థల నిర్వహణలోనూ పాల్గొనడానికి పౌరులకు మరింత అవకాశం కల్పించాయి. ప్రజాస్వామ్యానికి పునరుజ్జీవనం కల్గించడానికి, పౌరులహక్కులకు భద్రత కల్పించడానికి, అతిశక్తివంతంగా తయారయిన రాజ్యాధికారాన్ని, పరిమితం చేయడానికి పౌరసమాజాన్ని పునర్నిర్మాణం చేయడం సరయిన మార్గమనే ఆలోచన ముందుకు వచ్చింది. అపరిమితమైన రాజ్యాధికారానికి విచ్చలవిడి వ్యక్తివాదానికీ ప్రత్యామ్నాయంగా సమూహవాదులు సామాజిక చైతన్యాన్నీ, స్వచ్ఛంద నిర్మాణాలనూ ప్రతిపాదించారు. ప్రజాస్వామ్యం, వ్యక్తిబాధ్యత మరింతబలంగా ఎదగడానికి పౌరులు సాంఘికసేవా కార్యకలాపాలలోనూ ప్రభుత్వేతర స్వచ్ఛందసంస్థలలోనూ పాల్గొనడం అవసరం అని సమూహవాదులు అంటారు. క్రియాశీలకమైన సమూహవాద పౌరసమాజం రాజ్యాధికార దుర్వినియోగాన్ని అరికట్టి, ప్రజలకార్యాచరణ ద్వారా పౌరులకూ పౌరులుకానివారికీ కూడ మానవహక్కులు అనుభవించే అవకాశం కల్పిస్తుంది.

### 3.3.3 మార్క్సిస్టు దృక్పథం

మార్క్సిస్టు భౌతికవాద దృక్పథంలో తొలిసూత్రమేమిటంటే ప్రతీసామాజిక వ్యవస్థకూ పునాది ఉత్పాదన, మారకం, ఉత్పత్తి సంబంధాలలో ఉంటుందనేది. అసమాన ఆస్తి యాజమాన్యం నిర్ణయించే శ్రమవిభజన ఉత్పాదన క్రమాన్ని నిర్ణయిస్తుంది. ఏం ఉత్పత్తి అవుతుందో నిర్ణయిస్తుంది. ఉత్పత్తి అయిన వస్తువుల మారకం ఏవిధంగా జరుగుతుందో నిర్ణయిస్తుంది. అన్ని ప్రముఖ సామాజిక మార్పుల అంతిమకారణం అభిప్రాయాలలోనూ ఆలోచనలలోనూ లేదు, ఉత్పత్తిశక్తులు ఉత్పత్తి వ్యవస్థలలోని మార్పులలో ఉంది. మనుషుల చైతన్యం, సామాజిక సంబంధాలు, కళ, మతం మొదలైన అభౌతిక విషయాలలో ఇవి ప్రతిఫలిస్తాయి. ఒక ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం కావచ్చు. పారిశ్రామికం కావచ్చు, పశుపోషకం కావచ్చు. ఏదైనా ఆ సమాజం సాంకేతికస్థాయి అందులో జరిగే ఉత్పత్తి ప్రక్రియలో వ్యక్తమయ్యే సంబంధాలు పౌర సమాజ జీవితాన్ని రూపకల్పన చేస్తాయి. ఆపైన మారకవ్యవస్థ ఉంటుంది. అది ఆదిమ వస్తుమార్పిడి వ్యవస్థ కావచ్చు, లేదా అత్యాధునికంగా పరిణతి చెందిన ద్రవ్య, ఋణవ్యవస్థ కావచ్చు. వర్గాలు ఆధిపత్యపోరాటంలో గెలిచేదీ ఓడేదీ పౌరసమాజంలోనే. ఇక్కడ మరొక ముఖ్య అంశాన్ని పేర్కొనాలి. అది ఆస్తి సంబంధాలు. ఆస్తి వ్యక్తులదా లేక సమూహానిదా, పెట్టుబడికీ శ్రమకూ మధ్య ఎడబాటు ఉంటుందా లేక ఒకటిగా ఉంటాయా మొదలయిన అంశాలు మారకసంబంధాల స్వభావాన్నే కాక రాజ్యం స్వభావాన్ని కూడ నిర్ణయించే ప్రధాన పౌరసామాజిక విషయాలు. మార్క్స్ అభిప్రాయంలో, ఉత్పత్తి వ్యవస్థ సమాజం భౌతిక పునాది. దానినుండే న్యాయ, భావజాల, రాజకీయ ఉపరితలం రూపొందుతుంది. దాని నిర్దిష్టరూపానికి తగిన నిర్దిష్టసామాజిక చైతన్యం, నిర్మాణాలు ఉంటాయి. బూర్జువా పౌరసమాజంలో హక్కులు, స్వేచ్ఛ ఎవరు అనుభవిస్తారు, ఎవరు వాస్తవానికి అనుభవించలేరు అనేది ఆస్తి యాజమాన్యం నిర్ణయిస్తుంది.

## 3.4 స్వేచ్ఛ : ప్రాచీన దృక్పథం

ప్రాచీన గ్రీకు తత్త్వవేత్త అభిప్రాయంలో స్వేచ్ఛ అంటే నగరరాజ్యం శ్రేయస్సు కోసం నగరరాజ్యసభ్యునిగా ఒక్కొక్క వ్యక్తి నుండి ఏంకోరుకోవడం జరుగుతుందో అది ఆచరించడానికి పౌరునికి ఉండే స్వేచ్ఛ. స్వేచ్ఛ ఉండేది సమూహానికే. వ్యక్తి స్వేచ్ఛ అనే భావన అప్పట్లో లేదు. బానిసలకూ స్త్రీలకూ రాజకీయ స్వేచ్ఛ లేదు. సార్వత్రిక చరిత్ర రాయడానికి జరిగిన సీరియస్ ప్రయత్నాలన్నీ కూడ స్వేచ్ఛ పురోగతిని చరిత్రలో కేంద్రవిషయంగా చూసాయి. కేవలం తారీఖుల చరిత్రతో సంతృప్తి చెందని చరిత్రకారులు సంఘటనలను అర్థం చేసుకొని సంఘటనల హేతుక్రమంలోనే చరిత్రక్రమాన్ని చూసే ప్రయత్నం చేసారు. చరిత్ర అంటే సంఘటనల అర్థరహితమైన సంచయం కాదనీ ఒక అర్థవంతమయిన మొత్తమనీ అటువంటి చరిత్రకారులు భావించారు. స్వేచ్ఛను పెంపొందించే న్యాయమైన

BRAOU

రాజకీయసామాజిక వ్యవస్థగురించి ఒకొక్క చారిత్రక దశలో మనుషులకు ఉన్న అభిప్రాయాలు పరిణతి చెంది వాటి కాలం చెల్లిపోయిన తరువాత అంతకంటే మెరుగయినవి ముందుకొస్తాయని భావించారు.

### 3.4.1 ఆధునిక ఉదారవాద సిద్ధాంతం

ఉదారవాద ఆలోచనలో స్వేచ్ఛ అంటే అర్థం ఒక సామాజిక రాజకీయ, ఆర్థిక సందర్భంలో వ్యక్తులు మరొకరిస్వేచ్ఛకు అడ్డం రాకుండ ఉన్నంతకాలం వేరే ఏ ఆటంకం లేకుండ ఆలోచించడానికీ ఆచరించడానికీ హక్కు కలిగి ఉండడం అని. తన వ్యక్తిగత బాగోగుల కోసం హేతుబద్ధంగా వ్యక్తి చేపట్టే ఆచరణపైన ఏనియంత్రణ లేకపోవడాన్ని ఉదారవాదులు స్వేచ్ఛగా నిర్వచించారు. తమ సంతోషానికి మార్గమేమిటో ప్రతీఒక్కరికీ తెలుసుననుకున్నట్టయితే, అందరికీ తమ లక్ష్యసాధనలో ముందుకుపోయే స్వేచ్ఛ ఉండాలి. ప్రతీఒక్కరూ బాగుపడినట్టయితే అందరి ఉమ్మడి మొత్తమయిన సమాజం దానంతటదే అత్యధికంగా బాగుపడుతుంది. బాహ్యనియంత్రణ కృత్రిమమైనది, అసహజమైనది. ఒక సాధారణవ్యక్తి సహజమైన ఎదుగుదలను అవి ఆటంకపరుస్తాయి, కుంచింపచేస్తాయి. అందువల్ల వాటిని వీలయినంత తగ్గించాలి.

ఏవ్యక్తీ ఒక ద్వీపం కాదని ఉదారవాదులు ఒప్పుకుంటారు. కాబట్టి స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చినట్టు ప్రవర్తించే అపరిమితమైన అవకాశం కాజాలదు. తన చర్యల ప్రభావం ఇతరులపైన ఎట్లా ఉంటుందన్న ఆలోచన లేకుండ తన కోర్కెలు తీర్చుకునే అవకాశం కాజాలదు. స్వేచ్ఛను గురించి మనం బతికే సమాజంలోపల మాత్రమే ఆలోచించగలమని ఉదారవాదులు అంగీకరిస్తారు. పౌరులూ, పౌరులు కాని రాజ్యవాసులూ స్వేచ్ఛను అనుభవించాలంటే రాజ్యం నిర్మాణం ప్రజాస్వామికంగా ఉండాలని ఉదారవాదులందరూ ఒప్పుకుంటారు. ప్రజాతంత్ర రాజ్యం లేనట్టయితే స్వేచ్ఛ అనుభవించడం సాధ్యం కాదన్నది నిజమే అయినప్పటికీ ఆరాజ్యం ప్రజాస్వామికంగా ఎన్నికయిన శాసనసభల ద్వారానూ స్వతంత్రమైన న్యాయవ్యవస్థద్వారానూ చట్టాలు చేసి స్వేచ్ఛకు పరిమితులు పెట్టడం అవసరం.

స్వేచ్ఛను హక్కుల ద్వారా మాత్రమే అనుభవించడం సాధ్యం. ఈ హక్కులు పౌరహక్కులు, రాజకీయహక్కులు, మతపరమైన హక్కులు అని బ్రైస్ అంటాడు. హక్కులు ఎంత ఎక్కువ ఉంటే ప్రజలకు అంత వైవిధ్యంతో కూడిన స్వేచ్ఛ ఉంటుంది. స్వేచ్ఛ ఉండాలంటే ఉదారవాద ప్రజాతంత్ర ప్రభుత్వం అవసరం. అంతేకాక భావాల స్వేచ్ఛ కావాలి, రూపంలో సమానత్వం కావాలి (వాస్తవంలో అసమానత్వంతోబాటు), కొన్ని మౌలికహక్కులకు భరోసా కావాలి, ప్రత్యేకించి ఆస్తిహక్కు కావాలి; ఇవన్నీ దేశరాజ్యాంగం ద్వారా సంక్రమించాలి. ఉదారవాదులు ప్రజాతంత్ర ప్రభుత్వానికే అనుకూలమైనప్పటికీ వారిలో లూక్‌విలి, మిల్ వంటి కొందరు మెజారిటీ హక్కులపైన, స్వేచ్ఛపైన మెజారిటీ నియంతృత్వం చలాయించే పరిస్థితి ప్రజాస్వామ్యంలో ఉత్పన్నం కాగలదని భయపడ్డారు. ఇది పౌరస్వేచ్ఛకూ, భావస్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛలపైన ఏపరిమితులూ ఉండకూడదని మిల్ భావించాడు. ప్రజాతంత్ర రాజ్యంలోని రాజ్యాంగంలో ఏకరువు పెట్టినంత మాత్రాన ప్రజలందరికీ హక్కులు, స్వేచ్ఛ అందకపోవచ్చునని జె.ఎస్.మిల్, టి.హెచ్.గ్రీన్ వంటి ఉదారవాదులకు స్పష్టంగానే అర్థం అయింది. బలహీనులయిన వారి వ్యక్తిత్వాన్నీ సామర్థ్యాన్నీ ఎదగనీయకుండ అడ్డం ఉన్న ఆటంకాలను తొలగించడానికి రాజ్యం క్రియాశీలక పాత్ర నిర్వహించాలని వారు భావించారు. ఆ బలం వారికి అందిస్తే వారు తమ స్వేచ్ఛనూ హక్కులనూ సమర్థంగా అనుభవించగలుగుతారు.

### 3.4.2 మార్క్సిస్టు వైఖరి

ఈ ఉదారవాద దృక్పథాన్ని మార్క్సిస్టులు అంగీకరించారు. ఆస్తిలేనివాళ్ళు ఏమాత్రం స్వేచ్ఛ అనుభవిస్తారనేది ఆస్తిపరులతో వారికి ఉన్న బానిస సంబంధం నిర్ణయించిందనీ, ఆ దయనీయ స్థితినుండి, ఊపిరి సలపని స్థితినుండి వారిని బూర్జువా ఉదారవాదం చెప్పే స్వేచ్ఛ విముక్తం చేయజాలదనీ అంటారు. ఉదారవాద ప్రజాస్వామ్యాలు అసమానులను సమానులుగా చూస్తాయి. వ్యవస్థ హింసద్వారా మనుషులను అణచివేస్తాయి. స్వేచ్ఛ, పేదరికం సహజీవనం చేయలేవు.

BRAOU

రాజ్యం అనేది ఉన్నంతకాలం, దోపిడీకి గురయ్యే ప్రజల నిజమైన స్వేచ్ఛను అడ్డుకొనడానికీ నాశనం చేయడానికీ దాని చట్టాలనూ విధానాలనూ వాడుకొనడం జరుగుతుంది. అయితే ఉదారవాద రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు అని పిలువబడే రకరకాల హక్కులను నామమాత్రం రాసిపెట్టడం ద్వారా స్వేచ్ఛ ఉందనే తప్పుడు చైతన్యాన్ని కల్పించడం జరుగుతుంది. ఇవి ప్రాథమికమూ కాదు, హక్కులు కావు. వాటిని సులభంగా నీరుగార్చవచ్చు. అవి నామమాత్రమైనవి, సారాంశరహితమైనవి. అసమానశక్తి ముందు న్యాయం, నిష్పాక్షికత, చట్టం ఎదుట సమానత్వం, చట్టబద్ధపాలన మొదలయిన మాటలకు కూడ నిజమైన అర్థమేమీ ఉండదు. ప్రతీ ఒక్కరి శక్తి అందరిశక్తికి ప్రాతిపదిక అయిన రాజ్యరహిత కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే అందరికీ సమానమైన స్వేచ్ఛ ఉండగలదు.

## 3.5 ధర్మం - అర్థం, మూలం

ధర్మం అనే మాటకు సంస్కృత మూలం 'ధృ' లేక 'ధర్' అంటే అర్థం, న్యాయాన్ని నిలబెట్టేది, కాపాడేది, భరించేది అని. ప్రామాణికమైన సమాజానికి లేక రాజ్యానికి ప్రాతిపదిక అయిన చట్టం, లేక ఆదర్శవంతమయిన వ్యక్తిత్వానికి ప్రాతిపదిక అయిన నియమాలు అనే అర్థాలు కూడా ఆ మాటకు ఉన్నాయి. కులంవంటి బృందాల హక్కులనూ విధులనూ అది వ్యక్తం చేస్తుంది. అది శ్రుతులమీద సంప్రదాయాలమీద ఆధారపడింది. శ్రుతులు దానికి చెప్పుకునే ఆధారాలు, సంప్రదాయం నిజమైన ఆధారం. స్థానిక అలవాట్లు ఈ చట్టానికి ప్రాతిపదిక. స్థానిక వ్యవహారాన్ని పట్టించుకోకుండ రూపొందించిన ధర్మం చెల్లుబాటుకాదన్న నియమం ఉండింది. 'ధర్మం' అనే భావనను తాత్వికంగా గనక అర్థం చేసుకునేటట్టయితే, ప్రకృతి నియమాలలో ఉన్న సార్వజనీన సూత్రాలని దానిని పాశ్చాత్య పరిభాషలో వర్ణించవచ్చు. ఈ సూత్రాలు ప్రాపంచిక క్రమాన్ని ఉనికిలోకి తీసుకొస్తాయి, నిలబెడతాయి, కాపాడతాయి. సకలచరాచర విషయాల వ్యక్తీకరణ అభివృద్ధి దీనిలో భాగమే. మనుషులకు అన్వయించినప్పుడు ధర్మం అనేది ఒక అమూర్తమైన ప్రమాణం. ఆత్మను దాని లక్ష్యం వైపు నడిపించే నియమావళి. సత్ప్రవర్తన గురించి, నీతిగురించి మతం గురించి అది సరయిన చైతన్యాన్ని ఇస్తుంది. జీవితంలో ఉచితమైన దశను అందుకోవడానికీ గమ్యాన్ని చేరుకోవడానికీ అవసరమైన నడవడికను నేర్పుతుంది.

### 3.5.1 అభ్యుదయకరమైన అంశాలు, తిరోగామి అంశాలు

'ధర్మం' అనే కత్తికి రెండువైపులా పదును ఉంది. సమాజంలో, రాజ్యంలో, వ్యక్తిగత జీవితంలో ఉన్న వ్యవస్థిత నైజాన్ని స్థిరపరచడానికీ దానిని వాడుకోవడం జరిగింది. ఆ వ్యవస్థను నైతిక ప్రాతిపదిక మీద నిత్యజీవిత అనుభవం ప్రాతిపదికమీద ప్రశ్నించడానికీ వాడుకోవడం జరిగింది. ధర్మం అని పిలువబడే సూత్రాలను అనుసరించి భారతదేశంలో అహేతుకమైన కులాధిక్యతను సమర్థించడం జరిగింది. అదేవిధంగా నియంతృత్వ స్వభావం ఉన్న రాచరికాన్ని స్త్రీ శూద్రుల, పంచముల పరాధీన స్థితినీ ధర్మం పేరిటనే సమర్థించడం జరిగింది. కులవ్యవస్థలోపలా బయటా అణచివేతకు గురయ్యేవర్గాలకు జీవితానికీ ఆత్మగౌరవానికీ హక్కులు లేవు.

ప్రతీసామాజిక రాజకీయవ్యవస్థకూ తనదైన ధర్మం ఉన్నప్పుడు ఒక ధర్మం నిర్దేశించే విధులకూ వేరే విధులకూ ఘర్షణ వచ్చినప్పుడు ఏవిధంగా నడచుకోవాలనేది స్పష్టంలేదు. ఒక రాజు రాజధర్మం నుండి గానీ ఒక బ్రాహ్మణుడు బ్రాహ్మణధర్మం నుండిగానీ వైదొలగినట్టు ఒక కింది కులానికి చెందిన వ్యక్తికితోస్తే, అంటే న్యాయమైన పరిపాలననుండి, జ్ఞానాన్నీ, నైతిక జీవితాన్నీ నిస్వార్థంగా శోధించే పరిశ్రమనుండి వైదొలగినట్టు తోస్తే, ఆవ్యక్తి తలొగ్గి ఊరుకోవాలా లేక ధర్మాన్ని కాపాడడానికి తిరగబడాలా ? 20వ శతాబ్దం దాకా భారతదేశ చరిత్రను పరిశీలించినట్టయితే పీడకులైన రాజులను ప్రజలు కూలదోసిన ఉదాహరణలు అతితక్కువ కనిపిస్తాయి. శతాబ్దాలుగా సాగుతున్న అవమానకరమైన కులవ్యవస్థను దళితులు రద్దుచేసి కులవ్యవస్థ నిస్సహాయులు చేసినవారికి హక్కులూ ఆత్మగౌరవం ఇవ్వడానికి విజయవంతంగా కృషిచేసిన ఉదంతాలు కనిపించవు. వేలసంవత్సరాల భారతచరిత్రలో ఇక్కడొక వ్యక్తి, అక్కడొక వ్యక్తి చేసిన తిరుగుబాట్లు మాత్రం కనిపిస్తాయి. బ్రిటీష్ పాలన అంతంవరకు ఈ కొన్ని మినహాయింపులు

BRAOU

నియంతృత్వ రాచరికాన్నీ తుదముట్టించలేదు. భారతదేశంలో ఈ రోజు సంప్రదాయక కులవిభజనను అంగీకరించని రాజ్యాంగం ఉన్నప్పటికీ అగ్రకులాల పెత్తనం, దోపిడీ సాగుతూనే ఉన్నాయి. హక్కులకోసం, స్వేచ్ఛకోసం, మానవ ఆత్మగౌరవంకోసం పోరాటం చేసిన చరిత్ర మన సామాజిక రాజకీయ సంస్కృతిలో లేకపోవడానికి మనల్నీ, ధర్మాన్నీ గురించి మనకున్న అవగాహననూ కాకపోతే ఎవరిని నిందించాలి? ఈ కోణం నుండి చూసినప్పుడు ధర్మం వ్యవస్థకు బాగా వత్తాసు ఇచ్చిందని చెప్పవలసి ఉంటుంది.

## 3.6 న్యాయవాదం : నిర్వచనం

ప్రాచీన భారతదేశంలోని ఆరు దర్శనాలలో న్యాయం ఒకటి. క్రీ.పూ. 6వ శతాబ్దంలో నివసించిన గౌతముడు అనే తత్త్వవేత్త దీనిని ప్రతిపాదించాడు. ఈవాదం అన్ని (భౌతిక, తాత్విక) విషయాలనూ రెండు ప్రతిదనలతో మొదలుపెట్టి వాదన ద్వారా నిరూపణ చేసే పద్ధతిలో పరిశీలిస్తుంది. న్యాయం అనేది తార్కిక నిరూపణకు సంబంధించిన శాస్త్రం. మానవ ఆలోచనగురించి, దానికి ఉండే జ్ఞానాన్ని గురించి తర్కబద్ధంగా తాత్విక వివేచన జరపడానికి ఇది చాలా సమర్ధమైన పద్ధతి.

న్యాయాన్ని తర్కవిద్య అని, అంటే తార్కిక వివేచనకు సంబంధించిన శాస్త్రం అని కూడ అంటారు. అది ఇద్దరి మధ్య లేక అంతకంటె ఎక్కువమంది మధ్య సంవాదం రూపంలో ఉంటుంది. న్యాయాన్ని వాదవిద్య అంటే గతితార్కిక చర్చ అని కూడ ఒక్కొక్కసారి పిలుస్తారు. ఒక విషయాన్ని దాని వాస్తవ అవాస్తవాలు, రూపం, సారం, సత్యం వాస్తవికత మొదలైన అంశాల ప్రాతిపదికన హేతుబద్ధంగా, తర్కబద్ధంగా చర్చించిన తరువాత నిర్ణయం తీసుకున్నట్టయితే ఆ నిర్ణయాన్ని, న్యాయం అంటారు. తర్కబద్ధమైన పద్ధతిని అనుసరించనట్టయితే ఆ వాదన చేసే నిరూప ఆధారరహితమైంది. తర్కరహితమైనది. కాబట్టి అది న్యాయానికి విరుద్ధం. వాదానికీ, ప్రతివాదానికీ మధ్య జరిగే తార్కిక ప్రతిచర్య సత్యాన్నీ, వాస్తవాన్నీ, తెలుసుకోవడానికి పనికొస్తుంది. కాబట్టి అది న్యాయమైనది. న్యాయం అనే తార్కిక పద్ధతి న్యాయమైన నిర్ణయాలకు దారితీస్తుంది. అందుకు విరుద్ధమైనది అన్యాయానికి దారితీస్తుంది. ఒక వ్యక్తికి కేవలం పుట్టుకను బట్టి మానవ హక్కులూ గౌరప్రదమైన జీవితం నిరాకరించడమంటే ఆ వ్యక్తి మంచిచెడు లెక్కలోకి తీసుకునే హేతుబద్ధమైన తర్కానికి విరుద్ధంగా వివక్ష పాటించడం అవుతుంది. కాబట్టి అది అన్యాయంగా భావించబడింది. ఈ వివక్షకు ముందుగా చేసుకున్న నిర్ణయం ప్రాతిపదిక. నీతి, ఆదర్శాలు, హక్కులు మొదలయినవి వ్యక్తిగత అంశాలనూ బాహ్యఅంశాలనూ హేతుబద్ధంగా, తర్కబద్ధంగా లెక్కలోకి తీసుకున్న సూత్రీకరణాలు ప్రాతిపదికపైన ఉండాలి. అప్పుడే అవి సత్యం లేక న్యాయం అనిపించుకుంటాయి. లేకపోతే అసత్యం లేక అన్యాయం అనిపించుకుంటాయి.

BRAOU

## 3.7 నేరం : సంప్రదాయక దృక్పథం

చట్టమూ, శిక్షలూ సమతుల్యం కల్పించేదే శాంతియుత సమాజం అని ఉదారవాదులు భావిస్తారు. ఎవరయినా చట్టాన్ని అతిక్రమించడం ద్వారా ఈ సమతుల్యాన్ని అస్థిరం చేసినప్పుడు, సమాజంలో సమతుల్యాన్నీ శాంతినీ పునరుద్ధరించడానికి ఆ వ్యక్తిపైన చట్టం చర్యతీసుకోవడం అవసరం.

చట్టం ఒకరిని శిక్షిస్తున్నదంటే దాని భావమేమిటంటే ఆ వ్యక్తి చట్టానికి వ్యతిరేకంగా ఉద్దేశ్యపూర్వకంగా నేరానికి పాల్పడ్డాడని, అందుకతను పరిహారం చెల్లించాలని. చట్టవ్యతిరేకమైన ప్రవర్తనకు సామాజిక మూలమేదీ లేదనీ, అది ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణంలో సహితం వ్యక్తమయ్యే కొన్ని, గుణాల ఫలితమనీ ఇక్కడున్న అభిప్రాయం, వ్యక్తి స్వభావాన్నీ ప్రవర్తననూ నిర్ణయించేది తన సహజస్వభావమే తప్ప పరిసరాలు కావన్న అభిప్రాయం. నేరమనస్తత్వంలో మార్పు ఉండదు. కాబట్టి అటువంటి మనుషులను హాని నుండి దూరం ఉంచాలంటే బాహ్య నిర్బంధం ఒక్కటే మార్గం.

### 3.7.1 సంప్రదాయక భావన గురించి సామాజిక శాస్త్ర విశ్లేషణ

ఈ దృక్పథం నేరాన్ని గురించి నేరస్తుల గురించి యాంత్రికంగా ఆలోచిస్తుందనీ పైపై పరిశీలనతో సరిపెట్టుకుంటుందనీ విమర్శకులు అంటారు. అందుకు విరుద్ధంగా, నేరస్తులకు సమాజం సానుభూతి చూపించడం అని వాదించే వారు చాలామంది ఉన్నారు. పుట్టుకతో ఎవ్వరూ నేరస్తులు కారు. మనం నేరాన్ని ద్వేషించాలే తప్ప నేరస్తులను కాదు. నిండయిన జీవితానికి ఆటంకమయిన పేదరికం, నిరక్షరాస్యత, వివక్ష, కుటుంబ అశాంతి మొదలయిన కారణాలను తొలగించడానికి సమర్థమైన చర్యలు చేపట్టాలి. సమాజం బాగుంటే నేరాలు చాలావరకు ఉండవు. ఆరోగ్యకరమైన వాతావరణం శారీరకంగా మానసికంగా ఆరోగ్యవంతులయిన మనుషులను రూపకల్పన చేస్తుంది. అటువంటివాళ్లు నేరాల ప్రలోభంలోనూ నియమరహిత ప్రవర్తన ప్రలోభంలోనూ పడరు. కుటుంబంతో మొదలుపెట్టి పాఠశాల, సమాజం, రాజ్యం, మతం తదితర సంస్థలు ఏవయితే మనిషి సంఘజీవిగా మలిచే కర్తవ్యం నిర్వర్తిస్తాయో అవే మనిషి వ్యక్తిత్వాన్ని మంచికయినా చెడుకయినా నిర్ణయిస్తాయి.

## 3.8 శిక్షలు వేయడానికి గల కారణం

సమాజంగానీ రాజ్యంగానీ తన ప్రమాణాలుగా భావించే వాటిని అతిక్రమించినందుకు మనం తప్పనిసరిగా చెల్లించే మూల్యం శిక్ష. అయితే సమాజం విధించే శిక్ష, రాజ్యం విధించే శిక్ష అంత కఠినంగా ఉండదు. అంత కచ్చితంగానూ ఉండదు. రాజ్యశాసనాలను మనం అతిక్రమించినా లేక చట్టాన్ని, చేతిలోకి తీసుకున్నా రాజ్యం మరణదండనతో సహా ఏశిక్ష అయినా విధించగలదు. సమాజం ప్రజాభిప్రాయం ఒత్తిడి మీదా వ్యక్తి అంతరాత్మ పెట్టే ఒత్తిడిమీదా ఆధారపడుతుంది. అది నియమాల ఉల్లంఘన ఆపడానికయినా నియమాలను అతిక్రమించినవారిని శిక్షించడానికయినా ఏమంత సమర్థంగా పనిచేయదు. రాజ్యం విధించే శిక్ష నిర్దిష్టమైనది, తప్పనిసరి అయినది, సార్వత్రికమైనది. ఒక చట్టాన్ని, అతిక్రమించినట్టు రుజువయిన వ్యక్తి ఆ చట్టం నిర్దేశించే శిక్షను తప్పించుకోవడం అసాధ్యం. రాజ్యం చట్టం సోక్రటిస్, గాంధీ వంటి వారికీ స్మగ్లర్లకూ తేడా చూడదు. పాపులయినా పవిత్రులయినా రాజ్య చట్టాన్ని అతిక్రమించినట్టయితే జీవించే హక్కుతో సహా అనేక హక్కులు కోల్పోవలసి ఉంటుంది. వారి ఉద్దేశ్యాలు ఎంత ఉన్నతమైనవైనా కానీయండి. చట్ట అతిక్రమణ ఎవరు చేసినా అది చట్ట అతిక్రమణే. చట్టం పెద్దలకూ పిన్నలకూ ఒకేరకంగా అమలవుతుంది. నేరం రుజువంటూ అయిన తరువాత శిక్ష విషయంలో చట్టం ముందు అందరూ సమానమే.

### 3.8.1 మానవతావాద దృక్కోణం

నేరస్తుడు దిగజారిన సామాజిక పరిస్థితుల సృష్టి అని నమ్మేవాళ్ళు, రాజ్యం నేరస్తుడిని అనాలోచితంగా శిక్షించకూడదని నమ్ముతారు. అతను నేరానికి కర్త కాడు. నేరమే అతనికి నేరస్తుడి రూపం ఇస్తుంది. నేరస్తుడిని శిక్షించడం కాక అతని దుష్ప్రవర్తన మూలాలు అర్థం చేసుకోవడం అవసరం. శిక్ష మనిషికి నేరస్తుడన్న ముద్ర వేస్తుంది. అతనిలోని మానవతను నాశనం చేస్తుంది. పరిహారం తీర్చుకునే స్వభావం గల క్రూరమైన శిక్షాచర్యలు అతనిని ఒక మూలకు నెట్టివేస్తాయి. పరివర్తనకు అందని కఠినమైన అధోజీవిగా మారుస్తాయి. జైలునుండి బయటకు వచ్చినాక, ప్రపంచానికి తన జీవన అవసరాలపట్ల సానుభూతి లేదని అర్థం చేసుకుంటాడు. మళ్లీ నేరం చేసి మళ్లీ జైలుకు పోతాడు. ఈ విషవలయం అతనిని కబళించి వేస్తుంది. సమాజం యావత్తు అతనిని ఏ చీకటి గుహలో పడేస్తుందో ఆ గుహనుండి బయటపడే మార్గమేదీ అతనికి కనిపించదు. సామాజిక వ్యవస్థను విధ్వంసం నుండి కాపాడుతూ, అదే సమయంలో నేరస్తుడిలోని మనిషినీ సామాజిక జీవినీ కాపాడే మానవీయ దృక్పథాన్నీ ఏవిధంగా అమలు చేయాలనేది ఇక్కడ ప్రధానమైన సమస్య.

BRAOU

### 3.8.2 శిక్షకు సంబంధించిన సిద్ధాంతాలు

శిక్షకు సంబంధించిన సిద్ధాంత దృక్పథాలు మూడు. ఇవి పరిహార సిద్ధాంతం, పరివర్తన సిద్ధాంతం, నిరోధన సిద్ధాంతం. మొదటిది ప్రతీకార విధానాన్ని అంటే కంటికి కన్ను, పంటికి పన్ను అనే విధానాన్ని ప్రతిపాదిస్తుంది. ఒకరు మరొకరిని లేక రాజ్యాన్ని దెబ్బతీస్తే, వారు అదే మోతాదులో అంతేగట్టి దెబ్బతీసి సమతుల్యాన్ని పునరుద్ధరించాలి. నేరం చేసిన వ్యక్తిచేత తాను చేసిన నేరానికి మూల్యం బలవంతంగానయినా చెల్లింపజేయాలి. అప్పుడు న్యాయం జరుగుతుంది, సామాజికశాంతి నెలకొంటుంది. మానవస్వభావం స్వార్థపూరితమైనదని, సంస్కరణ చెందదని, ఎల్లప్పుడూ వ్యక్తిగత ప్రయోజనాల వెంటపడిపోతుందనీ ఈ సిద్ధాంతం నమ్ముతుంది. కౌటిల్యుడు చెప్పిన దండాన్ని చేతబట్టుకున్న రాజ్యం మాత్రమే ఈ స్వార్థ పోకడలను అరికట్టగలదని నమ్ముతుంది.

నిరోధన సిద్ధాంతం ఏమంటుందంటే ఒక నేరస్తుడికి వేసే శిక్ష రేపు నేరం చేయబోయేవాళ్ళను నిరోధించాలి. శిక్ష నేరం వల్ల జరిగిన నష్టానికి సమానంగా ఉండటంకాక, నేరాలు చేయడానికి తయారవుతున్న వాళ్ళందరిలోనూ భయంగొలిపేటట్టు ఉండాలి.

నేరం చేయడం వల్ల ప్రయోజనమేమీ ఉండదనీ నేరానికి భారీ మూల్యం చెల్లించవలసి ఉంటుందనీ ఒక అభిప్రాయం కలిగించాలి. ఒక చిన్న నేరం చేసిన వ్యక్తికి తీవ్రమైన శిక్ష వేయడం ద్వారా నేరాలు చేయబోయేవారిని నిరోధించి అధిక సంఖ్యాకులకు భద్రత కల్పించే భీతి నెలకొల్పడం సాధ్యమయినట్టయితే ఆపని చేయడం ఈ సిద్ధాంతం దృష్టిలో తప్పుకాదు. మానవస్వభావంలోని వికృత లక్షణాలు కొంతమందిలో వ్యక్తం అవుతాయి. కాబట్టి కొంత భీతి కలిగించడం ద్వారా మాత్రమే వాటిని హేతుబద్ధమైన పరిమితిలో ఉంచగలుగుతామని ఈ సిద్ధాంత దృక్పథం నమ్ముతుంది.

నేరం చేసిన మనిషి జబ్బుపడిన వ్యక్తి అనే అతను తన మానవత్వాన్ని తిరిగిపొందడానికి అందరి సానుభూతి, సహాయం అవసరమనీ పరివర్తన సిద్ధాంతం నమ్ముతుంది. చట్టవిరుద్ధంగా ప్రవర్తించే వారిని క్రూరంగా అణచడం కాక అనునయంగా మార్చడం వారిని కాపాడడానికి సరయిన మార్గమనీ ఆతరువాత వారికి సామాజిక పునరావాసం కల్పించాలనీ ఈ వైఖరి అంటుంది. ఒకరికి నష్టం కలిగించడం ద్వారా మరొకరు లాభం పొందాలని చూసే అవకాశంలేని సామాజిక జీవితం కాంక్షనీయం అన్న ఆలోచన వారిలో కలిగించాలి. తమ తప్పులు సవరించుకోవడానికి వారికి అవకాశం ఇవ్వాలి. మానవచరిత్ర శతాబ్దాలుగా పరిహార సిద్ధాంతాన్నీ నిరోధన సిద్ధాంతాన్నీ అనుసరించింది. అయితే నేరాలు మటుమాయం కాలేదు, తగ్గలేదు. నేరస్తులకూ వారు సాధారణ వ్యక్తులతో సహజీవనం చేసే సమాజానికీ కూడ మెరుగయిన భవిష్యత్తు కల్పించడం కోసం పరివర్తన సిద్ధాంతాన్నీ అమలు చేయడానికొక సీరియస్ ప్రయత్నం అవసరం.

## 3.9 ముగింపు

మానవహక్కులకు భద్రత, వాటిని ఉపయోగించుకునే అవకాశం ఏమేరకు ఉంటాయనేది ప్రధానంగా రాజ్యంపైన, పౌరసమాజం పైన ఆధారపడి ఉంటుంది. రాజ్యం అప్రజాస్వామికమైనా లేక దాని సిబ్బందికి ప్రజాస్వామ్య స్పృహ లేకపోయినా హక్కులు అభద్రంగా ఉంటాయి. అదేవిధంగా సమాజం పంచుకునే సంస్కృతినీ ఒకరినొకరు ఆదుకునే సంస్కృతిని పరస్పర సహనాన్నీ, గౌరవాన్నీ పెంపొందించుకోవాలి. శిక్ష, ధర్మం న్యాయం మొదలయిన వాటిని ప్రగతిశీలకంగా వ్యాఖ్యానించుకుంటామా లేక తిరోగామి వైఖరితోనా అనేది సమాజం కల్పించే వాతావరణంచేత నిర్ణయమవుతుంది. స్వేచ్ఛను కుదించివేసే ప్రయత్నాన్ని ప్రతిఘటించే సంస్కృతి గనక లేనట్టయితే రాజ్యాధికారం నియంతృత్వ రూపం తీసుకోగలదు. పౌరులకు బలమైన సామాజిక స్పృహ లేనట్టయితే స్వేచ్ఛ విచ్చలవిడితనంగానూ అరాచకత్వంగానూ మారిపోగలదు. మానవ వ్యక్తినీ సామాజిక వ్యక్తినీ న్యాయసమ్మతంగా తీర్చిదిద్దడం అన్న అర్థంలో ధర్మానికి ఉండే అత్యున్నత ఆకాంక్ష ఏమిటంటే నేరం, శిక్ష, న్యాయం మొదలయిన వాటిపట్ల మన వైఖరి పరివర్తన, సంస్కరణల చేత ప్రభావితం కావాలి.

BRAOU

## 3.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబు రాయండి.

1. రాజ్య స్వభావాన్ని వివరించే వివిధ సిద్ధాంతాలు చర్చించండి.

2. పౌర సమాజం మరియు స్వేచ్ఛకు సంబంధించిన వివిధ దృక్పథాలు వివరించండి.

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో జవాబు రాయండి.

1. పౌర సమాజంపై మార్క్సిస్టు దృక్పథం వివరించండి.

2. శిక్షలు వేయడంలో మానవతావాద దృక్పథాన్ని చర్చించండి.

BRAOU

# భాగం - 4 : విశ్వ మానవహక్కులు - కొత్త కోణాలు

**విషయక్రమం**


4.0 ఉద్దేశం

4.1 మానవహక్కులు - సైద్ధాంతిక కోణాలు

4.2 సహజహక్కులు - మూలాలు

4.3 ఆధునిక హక్కులు - విమర్శ

4.4 ఆధునిక హక్కులు - మూలాలు

4.5 థామస్‌పేన్ దృక్పథం

4.6 జె.ఎస్.మిల్ దృక్పథం

4.7 మార్క్సిస్టు విశ్లేషణ

4.8 విశ్వహక్కులు - ఒక అభిప్రాయం

4.9 విశ్వమానవ హక్కులు - పరిమితులు

4.10 విశ్వమానవ హక్కులు - మూడవ ప్రపంచదేశాలు

4.11 విశ్వమానవహక్కులు - స్త్రీవాద దృక్పథం

4.12 విశ్వమానవహక్కులు - భారతీయ కులవ్యవస్థ

4.13 విశ్వమానవహక్కులు - చెల్లుబాటు

4.14 ముగింపు

4.15 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 4.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- మానవ హక్కులపై థామస్‌పేన్, జె.ఎస్ మిల్‌ల దృక్పథం వివరించగలుగుతారు.
- మార్క్సిస్టు విశ్లేషణను చర్చించగలుగుతారు.
- విశ్వమానవహక్కులపై స్త్రీవాద దృక్పథాన్ని తెలుసుకుంటారు.

## 4.1 మానవహక్కులు - సైద్ధాంతిక కోణాలు

ఏదేని ఒక సామాజిక ఆచరణ మూలాలను పరిశీలించినప్పుడు సహజంగానే మానవుడికీ, ప్రకృతికీ మధ్యవున్న సంబంధాన్ని తరచిచూడడం జరుగుతుంది. అంటే మనిషి బాల్యానుభవాలను, మార్క్స్ చెప్పినట్టుగా ప్రకృతితో అనుబంధం కలిగివున్న మనిషి బాల్యాన్ని పరిశీలించాలి. ఈ పరిశీలనలో మానవస్వభావం, ప్రవర్తన ఈ రెండూ రూపుదిద్దుకున్న మూలాలు వుంటాయి. ఈ విషయాలను పరిశీలించినప్పుడు మానవస్వభావంలో అనేకాంశాలు ప్రస్ఫుటమవుతాయి. ముఖ్యంగా మానవుడి స్వేచ్ఛాభావనలు. మానవస్వభావాన్ని పూర్తిగా ఆకళింపుచేసుకోకుండా మానవుడి స్వేచ్ఛ మీద ఏ చర్చా చేయలేము. అయితే మనిషిని అర్థం చేసుకోవడంలోవున్న పరిమితుల వల్ల అనుభవాల సారాన్ని ఆధారంచేసుకొని విషయపరిశీలన జరుగుతుంది. అందువల్ల మానవహక్కుల ప్రశ్న అనివార్యంగా స్వేచ్ఛాభావనల్లో రూపొందుతున్న దృక్కోణాలతో ముడిపడి వుంటుంది. ఈ నేపథ్యంలోనే మానవహక్కులకు సంబంధించిన పలుకోణాలను పరిశీలించవలసి వుంటుంది.

## 4.2 సహజహక్కులు : మూలాలు

తొలిహక్కుల స్వభావం ఏమిటి? మూలమేమిటి? అన్న ప్రశ్న ప్రారంభమవుతుంది. ఈ విషయమై జరిగిన సైద్ధాంతిక, తాత్విక చర్చల్లో సహజహక్కులు, మనిషి హక్కుల తొలిరూపమన్న సూచన కనబడుతుంది. ఈ సహజహక్కులంటే ఏవి? సాధారణంగా చెప్పాలంటే మనుషులు మొదటిసారిగా అంగీకరించింది, గుర్తించి, ఆమోదించింది 'జీవించే హక్కు' అంటే ఇదే తొలిహక్కు అవుతుంది. ఈ హక్కు అట్లాగే అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది. జాక్వస్ మారిటేన్ ప్రకారం 'మనిషనే వ్యక్తి', ఒక వ్యక్తి కనుక హక్కులు కలిగివున్నాడు. ఈ హక్కుపై యజమానే నీ సర్వమూ అతనే వ్యక్తిగా మానవుడు గౌరవించదగినవాడు. హక్కులు కలిగివుండేవాడు. హక్కులు అంశంగా వుండేవాడు కూడా అతడే. ఈ విషయాలన్నీ కూడా ఒక మనిషికి సంబంధించినవి ఎందుకంటే అతను ఒక మనిషి అన్నది వాస్తవం కనుక. చాలాకాలం వరకు హక్కులకు సంబంధించి లోతైన అర్థంలో, అనేకకోణాల్లో ఈ అభిప్రాయమే కొనసాగింది.,

ప్రకృతితో సంఘర్షించే సామర్థ్యం నుంచే మనిషి స్వేచ్ఛాభావనలు, ప్రతిఫలంగా హక్కులు అనే చెతన్యం ఉద్భవించింది. అందువల్లే ప్రపంచంమీద గల మరే జాతి కూడా ప్రకృతి న్యాయసూత్రాలను ఆకళింపుచేసుకొని, వాటిద్వారా లబ్ధిపొందలేదు. ఒక్క మనిషి మాత్రమే వీటిని ఆకళింపుచేసుకోగలిగాడు. బ్రోనోవ్‌స్కీ ఈ ఏకైక మానవ లక్షణాన్ని, హస్తాలు, స్వేచ్ఛా అవయవాలు అన్న రీతిలో అభివర్ణించారు. ఈ భౌతిక పరమైన సానుకూల నిర్మాణం లేకుండా మనిషి ప్రకృతిశక్తులతో పోరాడివుండేవాడుకానీ, చైతన్యం పొందేవాడు కానీ కాదని ఆయన అభిప్రాయము. చేతుల ద్వారా మాత్రమే మనిషి ప్రకృతిని గెలుచుకోగలిగాడు. బ్రోనోవెస్కీ, ఈ విషయాన్ని ఇంకా ఇట్లా పొడిగిస్తారు. "మెదడుకు పదునైన పరికరం చెయ్యి". అంటే ప్రకృతితో మానవుడి పోరాటం మెదడుకు ఆకృతిలోకి తెచ్చిందని, ప్రకృతిలోని తర్కాన్ని అర్థంచేసుకునే శక్తి కలిగించిందని, ప్రకృతి మెదడు చేతులకు పని కల్పించిందని అర్థం. ఈ ప్రకృతిక్రమమే సహజహక్కులకు సంబంధించిన నమూనాలు, ఏదో ఒక రూపంలో ఏర్పడడానికి దోహదం చేసింది.

అయితే, సహజహక్కులు అనబడే అవిచ్ఛిన్న హక్కులు మనిషి పుట్టుక నుంచీ వున్నాయని చెప్పడానికి ఇది ఒక అంశమే కానీ, చారిత్రిక దృక్పథంతో పరిశీలించినప్పుడు ఈ అంశం ధృవీకరణ అనుమానాస్పదమే. మనుషులకు జీవించేహక్కు శాశ్వతహక్కుగాకూడా, అవిచ్ఛిన్నంగా వున్నదని ' ఆహారసేకరణ' దశలో ఊహించలేము. ఎందుకంటే మానవపరిణామంలో ఈ దశలో దారుణమైన పరిస్థితులు, దేనికీ రక్షణలేని స్థితి, జీవితమే సమస్యాత్మకంగా వున్న దశకనుక అప్పుడు జీవించేహక్కు వున్నదని భావించడం కష్టమే. ఈ దశలో సమస్యలు పరిష్కారాలు, ఆ పరిష్కారాలతో మరిన్ని సమస్యలు ఇవన్నీకూడా ప్రకృతి సిద్ధంగా జరిగినవే. అందువల్ల ఈ తర్కం ఆధారంగా హక్కులెప్పుడూ సహజమైనవికావని, అవి సామాజికమైనవని భావించవచ్చు. అంటే సహజహక్కులు క్రమంగా సామాజిక లేదా రాజకీయ నిర్మితి విధించిన హక్కులని అనుకోవచ్చు.

BRAOU

## 4.3 సహజహక్కులు - విమర్శ

సహజహక్కుల మొత్తం సిద్ధాంతం పలురంగాల నుంచి పలువిమర్శలకు గురైంది. బెంథామ్ సహజహక్కుల మీద తీవ్ర విమర్శలు చేశారు. "హక్కులు" న్యాయానికి బిడ్డలు. నిజమైన న్యాయం వుంటే నిజమయిన హక్కులు వుంటాయి. ఊహాత్మకన్యాయం వుంటే అంటే సహజన్యాయం నుంచి ఊహాత్మకహక్కులు మాత్రమే సిద్ధిస్తాయి. అసలు సహజహక్కులు అనడమే అర్థరహితం. సహజహక్కులు, క్రోడీకరించి పొందుపరచనిహక్కులు అంతకన్నా అర్థవిహీనం ' అని ఆయన నిక్కచ్చిగా సహజన్యాయభావనలను కొట్టిపారేశారు. డేవిడ్‌హ్యూమ్ బర్కేలు కూడా వేరే కారణాల వల్ల సహజన్యాయం అన్న భావాలను వ్యతిరేకించారు. ఈ సిద్ధాంతం సమస్య ఇది చారిత్రిక వాస్తవాలకు నిలవకపోవడమేకాదు. సహజన్యాయభావనలు హక్కులకోసం మానవుడు అనాదిగా జరిపిన పోరాటాన్ని కూడా చూడ నిరాకరిస్తున్నాయి అని వారు అంటారు. అయితే, సహజహక్కులు భావన ఊహాత్మకమే అనుకున్నప్పటికీ ఈ భావనలు 17, 18వ శతాబ్దాలలో రాజకీయ ఆలోచనల మీద విశేషప్రభావాన్ని చూపింది. మరీ ముఖ్యంగా ఫ్యూడల్ అవశేషాల నుంచి పెట్టుబడిదారీ సమాజంవేపు పురోగమిస్తున్న యూరప్‌లో ఈ భావనల ప్రభావం ఎక్కువ.

## 4.4 ఆధునిక హక్కులు - మూలాలు

తొలినాళ్ళ గ్రీకు, రోమన్ సంస్కృతుల్లో, ఆఖరుకు పురా ఆసియా సంస్కృతుల్లో కూడా పరిమిత రూపంలో అయినా హక్కులు అస్తిత్వంలో వున్నాయి. కానీ, ఆధునిక భావనల ప్రకారం హక్కుల ప్రారంభం 13వ శతాబ్దంలో 'మాగ్నా కార్టా' జరిగిందని చెప్పవచ్చు. హక్కుల రంగంలో సంభవించిన పలుపరిణామాలకు 'మాగ్నాకార్టా' మూలస్థంభంగా నిలిచింది. అటుతర్వాత 1689లో బ్రిటన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన హక్కులు బిల్లు అనంతరం "సహజ లేదా పాక్షికహక్కులు" అనుకూల హక్కులుగా రూపాంతరం చెందాయి. ఈ క్రమం 1776లో వర్జీనియా బిల్లు హక్కులకు సంబంధించి ఇలా ప్రకటించింది" మనుషులందరూ ప్రకృతిసిద్ధంగా సమానస్వేచ్ఛ కలిగివున్నారు. స్వతంత్రులయిన మానవులు ఒక సామాజిక ఒప్పందంలోకి వచ్చినప్పుడు కొన్ని స్వాభావికమైన హక్కులను కలిగివుంటారు. మానవులు వారి వంశాల కారణంగా, జీవిత సౌఖ్యాన్ని అనుభవించడానికి గానీ, స్వేచ్ఛను అనుభవించడానికి గానీ, సంపదపొందడం ద్వారా సౌఖ్యాలు పొందడం నుంచి కానీ నిరాకరించబడకూడదు" అన్నదే వర్జీనియా బిల్లు సారాంశం. దీన్ని అమెరికా స్వాతంత్ర్య ప్రకటన మరింత బలోపేతం చేసి, " అందరు మనుషులూ సమానంగా సృష్టించబడ్డారు. అందువల్ల వారు అవిచ్ఛిన్నమైన కొన్ని సహజహక్కులను పొందారు. వాటిలో కొన్ని జీవితం స్వేచ్ఛ, సంతోషం అని ప్రకటించింది. సహజంగానే, సహజన్యాయం అన్నభావనలు లేకుంటే 18వ శతాబ్దపు హక్కుల్లో సంతోషం, సంతోషంకోసం ప్రయత్నం అన్న అంశాలు వుండేవే కాదు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటన అనంతరం 13 సంవత్సరాల తర్వాత ఫ్రెంచిప్రకటన వెలువడింది. "మనుషులు స్వేచ్ఛగా జన్మించారు. స్వేచ్ఛగా జీవిస్తారు. హక్కుల్లో అందరూ సమానమే' అందువల్ల రాజకీయ సమీకరణాల ఉద్దేశం మనిషి సహజన్యాయాన్ని కాపాడడమే. స్వేచ్ఛ, ఆస్తి, భద్రత, అణచివేతకు ప్రతిఘటన అన్నవే సహజహక్కులు అని ఈ ప్రకటన వెల్లడించింది.

## 4.5 థామస్‌పేన్ దృక్పథం

'మనిషి హక్కులు' అన్న పుస్తకంలో థామస్ పేన్ హక్కులను సమర్థించడమే కాకుండా ఫ్రెంచి విప్లవాన్ని సమర్థించడానికి సుదీర్ఘచర్చ జరిపాడు. ఫ్రెంచివిప్లవాన్ని 'అవాంఛనీయ' వేగిరపాటు చర్యగా అభివర్ణించిన బర్క్‌తో జరిగిన చర్చల్లో భాగంగా థామస్‌పేన్ 'మనిషిహక్కులు' పై సవివరంగా గ్రంథం ప్రకటించారు. ఈ సందర్భంగానే పేన్ ప్రతితరానికి కూడా తమ ముందు తరాన్ని ప్రశ్నించే హక్కేకాదు. అవసరమైతే అప్పటి పరిస్థితులను మార్చుకునే హక్కు కూడా వుంటుందని వాదించారు. మనుషులు సహజపరిస్థితులలోనే సహజహక్కులు కలిగివుంటారని కూడా ఆయన వాదన. మానవహక్కులను విస్తృతపరచడానికే పౌరవ్యవస్థలో సహజహక్కులు ప్రవేశించి పాలకులను కూలదోస్తాయని థామస్‌పేన్ అంటారు. మనుషులు హక్కులు మరింత అభివృద్ధి సాధించడానికి, మాత్రమే ఈ హేతుబద్ధతకు ఉపయోగించుకుంటారు కానీ, అవి మరింత క్షీణించడానికి మాత్రం కాదని ఆయన అంటారు. అయితే హక్కుల క్షీణత సంభవించినప్పుడు మాత్రం ప్రజలకు ప్రతిఘటించే హక్కువుంటుంది అని పేన్ భావన. అందువల్ల ప్రతిఘటనా హక్కు అనేది హక్కులకు సంబంధించిన ఫ్రెంచి భావనల్లో అతి ముఖ్యమైనది అయితే అనంతరం టి.హెచ్.గ్రీన్, గాంధీ రాజకీయ కార్యాచరణలలో తప్ప ఈ ప్రతిఘటనాహక్కు కనబడకపోవడం ఆశ్చర్యకరమైన పరిణామం.

## 4.6. జె.ఎస్.మిల్ దృక్పథం

నిజానికి 19 వశతాబ్దం చివరి సగంలో ప్రచారంలో వున్న యూరోపియన్ ఉదారాలోచనాధోరణులన్నింటినీ జె.ఎస్.మిల్ సిద్ధాంతీకరించాడని చెప్పవచ్చు. ప్రతిఘటనా హక్కుతో మిల్ ఏకీభవించలేదు. ఒక వ్యక్తి వ్యక్తిగతస్వేచ్ఛ నుంచి ఆయన హక్కులను పరిశీలించాడు. ఈ స్వేచ్ఛా భావనలు ఇవి "మొదట ప్రతిమనిషి అంతరంగ చైతన్యం, వ్యక్తిగత స్వేచ్ఛను కోరుతుంది. ఇదే సమగ్రరూపంలో భావనా స్వేచ్ఛ, అభిప్రాయాల స్వేచ్ఛ, అభిప్రాయ ప్రకటనకు పరిపూర్ణ స్వేచ్ఛ అన్ని అంశాలలో అవి పరికల్పితమైనవైనా, శాస్త్రీయమైనవైనా, నైతికమైనవి అయినా, ఆధ్యాత్మికమైనవైనా

BRAOU

వాటిపై సంపూర్ణ స్వేచ్ఛ, మిల్ ఈ భావనను కొనసాగిస్తూ వ్యక్తిగా లేదా సమూహంగా మానవులు దేనికోసమైతే పరితపిస్తారో దానికి సంబంధించి మానవసమూహంలో ఏ సభ్యునికైనా కార్యాచరణ స్వేచ్ఛ లేనట్టయితే అప్పుడు ఆత్మరక్షణ అవుతుంది అంటారు. దీనికి కొనసాగింపుగా "ఒక నాగరిక సమాజంలోని ఏ సభ్యుని పైనైనా అతని అభీష్టానికి వ్యతిరేకంగా న్యాయమైన అధికారాన్ని ఉపయోగించడమంటే అది సమాజంలోని ఇతరులకు హాని కలగకుండా కాపాడడానికే" అని అంటారు. అంటే, ఒకరులేని మొత్తం మానవ సమూహం, ఒకే అభిప్రాయంతో ఉన్నప్పుడు ఒకే వ్యక్తి తద్విరుద్ధమైన అభిప్రాయాలు కలిగి వున్నప్పుడు ఒక్క వ్యక్తి అందరినీ నియంత్రించడం ఎంత అప్రజాస్వామికమో ఆ ఒక్కవ్యక్తిని అందరూ నియంత్రించడంకూడా అంతే తప్పు" అని మిల్ సూత్రీకరించారు. ఆ ఒక్కవ్యక్తిని అదుపుచేయకపోతే న్యాయమేకాదు అని మిల్ అంటారు. ఈ విధంగా మానవహక్కులపై యూరోపియన్ ఆలోచనాధోరణుల్లో అనియంత్రిత స్వేచ్ఛ చర్యల్లో విచక్షణ అన్న అభిప్రాయాలు ప్రధాన పాత్ర వహించాయి.

## 4.7 మార్క్సిస్టు విశ్లేషణ

19వ శతాబ్దానికి సంబంధించి మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం, 20వ శతాబ్దపు తొలిపాదంలో సామూహికవిప్లవాల భావనలు ప్రధానంగా అన్ని హక్కులు, అది హక్కుకానీ, హక్కులకు అనుకూలంగానీ, వ్యతిరేకంగానే వీటన్నిటి మూలాలు సామాజిక శతృత్వాల్లో ఇమిడి వున్నాయని భావించాయి. కొందరు వ్యక్తులు, సమూహాలు, మార్కెట్, ఉత్పత్తి సాధనాల యజమానులు, శ్రామికవర్గంలోని సమాజం వ్యతిరేకవర్గాలుగా వుందని మార్క్సిస్టుభావన. పాశ్చాత్య సామూహికభావనలను మార్క్సిస్టులు నిరాకరించి ఈ సామూహిక భావన అంటే సామూహికంగా సంఘీభావం, సౌభ్రాతృత్వం లేకపోవడమేనని ఎద్దేవా చేశారు. అందువల్లనే శతృపూరిత సంబంధాల్లోకి సామూహిక విభజన అని మార్క్సిస్టులు అంటారు. మార్క్స్ ఈ విధంగా అంటారు. మానవుడి స్వేచ్ఛకు హక్కులు ప్రతిబంధకాలు. మానవుడి స్వేచ్ఛా కార్యాచరణను అవి నిరోధిస్తాయి. అయితే నిజమైన స్వేచ్ఛ హక్కుల ద్వారారాదని, మానవులను వైరివర్గాలుగా తయారుచేసిన భౌతికపునాది ముఖ్యంగా ఉత్పత్తి సాధనాల యజమాన్యాలను నిర్మూలించడం ద్వారా మాత్రమే సాధ్యం". అంటే, స్వేచ్ఛ హక్కులు, కొందరు ఆస్తిపరులను రక్షించడానికి, ప్రోత్సహించడానికి వారి ఆస్తుల పరిరక్షణకు మాత్రమే హక్కులు ఉపయోగపడుతాయి. అదే సమయంలో శ్రామికవర్గం మాత్రం శ్రమ ఫలితం అమ్ముకోవడానికి ఏ స్వేచ్ఛా వుండదు. అందువల్ల ఉత్పత్తి క్రమంలో పాల్గొనడం ద్వారా, శ్రమఫలితాన్ని, ఉత్పత్తి స్వభావంతో సంబంధం లేకుండా పొందడమే నిజమైన స్వేచ్ఛ అని మార్క్స్ భావన, దీనివల్ల మార్క్సిస్టు సూత్ర బద్ధంగా స్వేచ్ఛా నిర్వచనం జరిగింది. సమాజంలో ప్రతివ్యక్తి ప్రతిదిశలోనూ అభివృద్ధి చెందడానికి తగిన పరిస్థితులు ఏర్పడేందుకు అవరోధాలను తొలగించాలనే అభిప్రాయాలకు తావు కలిగింది.

మార్క్సిస్టుల తర్కం కారణంగా మానవహక్కుల భావనల్లో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక స్వేచ్ఛలను మిళితం చేయవలసి వచ్చింది. నిజానికి మార్క్సిస్టు దాడులను తట్టుకోవడానికి 'సార్వత్రిక ప్రకటన'లో అప్పటికే పైన పేర్కొన్న ఆయా హక్కులను చేర్చడం జరిగింది. అయితే యూరోపియన్లు భాగస్వామ్యంగా వెలువడిన "సార్వత్రిక ప్రకటన" లో మేమూ భాగస్వాములము కావాలని అమెరికా ప్రకటించింది. ఇది పెట్టుబడిదారీ స్వేచ్ఛలను నిజస్వరూపాన్ని, పరిమితులను ఎత్తిచూపింది. మార్క్సిస్టుభావనల అనంతరం ప్రపంచంలో హక్కులకు సంబంధించిన రెండు వేర్వేరు విరుద్ధభావనలు చర్చనీయాంశమయ్యాయి.

## 4.8 విశ్వహక్కులు - ఒక అభిప్రాయం

సహజహక్కులపై జరిగిన చర్చ, యూరోపియన్ పోరాటాల ఫలాలు విశ్వ మానవహక్కులకు ఆధునిక భావనలను అందించాయి. నిజానికి "యూనివర్సల్ ఛార్టర్"లో అదనంగా చేర్చిన మానవుడి గౌరవం 'అవిచ్ఛిన్న హక్కులు' అన్న పదాలు. సహజహక్కులకు నైతిక న్యాయహోదాను కల్పించేవి మాత్రమే. యూనివర్సల్ ఛార్టర్ సూచికలోనే వీటిని చేర్చారు. 1948 హక్కుల ప్రకటన హక్కుల వారసత్వానికి సమగ్రరూపం అని చెప్పవచ్చు. ఈ ఛార్టర్‌లో చేర్చిన చాలా హక్కులు వ్యక్తి వర్సెస్ సమూహం, ఒక స్థాయిలో వర్సెస్ మార్కెట్, అలాగే రాజ్యం వ్యక్తుల



BRAOU

మధ్య జరిగిన వాదోపవాదాలు, ఘర్షణలు పౌరహక్కుల ఉద్భవానికి కారకులయితే రాజ్యం, వ్యక్తుల మధ్య జరిగిన పోరాటాలు రాజకీయ హక్కులకు ప్రేరేపితాలయినాయి.

ఈవిధంగా విశ్వహక్కుల ప్రకటన" పలు చారిత్రికశక్తుల ద్వారా ఉద్భవించింది. పౌర రాజకీయహక్కులు అత్యవసరంగా పాశ్చాత్య ఉదారవాదం నుంచి వచ్చినవే. అయితే ఆర్థిక హక్కుల నుంచి రాజకీయ హక్కులను వేరుచేయడాన్ని మాత్రం ఉదారవాద ప్రజాస్వామ్యం అంగీకరించక ఆచరణలో వీటిని పాక్షికంగా మాత్రమే అమలులోకి తెచ్చిందని చెప్పవచ్చు. కానీ, ఈ విభజనవల్లనే ప్రతినిధుల సభలలో అన్ని సమూహాలు, అన్ని వర్గాలు, అధికారాన్ని ఏర్పరచడంలో, అమలు చేయడంలో భాగస్వాములు కావచ్చునన్న విషయాన్ని స్ఫూర్తికి తెచ్చింది. అదేవిధంగా ఉదారవాదం సామాజిక సంస్థల సాపేక్షస్వతంత్ర పతిపత్తిని నమ్ముతుంది. ఇదే కాకుండా వ్యక్తి వ్యక్తిగత ఆకాంక్షలు కూడా పౌరహక్కులు పొదుకోవడానికి దారితీసింది. ఆవిధంగా ఉదార ప్రజాస్వామ్యంలో పౌర, రాజకీయ హక్కులు చట్టంలో భాగాలయ్యాయి.

అయితే ఉదార ప్రజాస్వామ్యం బ్రహ్మాండమైన అనిశ్చిత్వాలకి ఆధారభూతమైన పెట్టుబడిదారి విధానాన్ని ఒక ఆర్థికవ్యవస్థగా ప్రోత్సహించిందనడం ఒక వాస్తవం. పెట్టుబడి దారీ అనిశ్చితాలు కేవలం ఆ వ్యవస్థలో మూలమైవున్న వైరుధ్యాలవల్లనేకాకుండా స్వార్థమైన వ్యక్తి ఆతృతల వల్ల కూడా ఏర్పడ్డాయి. అందువల్ల ఈ రెండు అంశాలు డోలాయమానస్థితికి శక్తివంతమైన ప్రభావాలుగా పనిచేశాయి. సామాజిక - ఆర్థిక శక్తులను సమతుల్యం చేయడం ద్వారా, ఈ సామాజిక ఏర్పాటులో అనివార్యమయిన సంక్షేమ వాదం వేపు ఉదారప్రజాస్వామ్యం గురి పెట్టింది. అదే సమయంలో బహుళస్వామ్యం భావనలో అనివార్యంగా సామాజిక సాంస్కృతిక హక్కులు, పౌరహక్కులకు అనివార్యంగా సామాజిక, సాంస్కృతిక హక్కులు, పౌరహక్కులకు కొనసాగింపు అయ్యాయి. సోవియెట్ యూనియన్ నాయకత్వం సోషలిస్టు సమాజాలలో రాజకీయహక్కులకన్నా, ఆర్థికహక్కులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. అయితే పౌర, సామాజిక సాంస్కృతిక హక్కులకు సంబంధించి మాత్రం రెండు బిన్నాభిప్రాయాల మధ్య పెద్దగా తేడాలేదు. ఒక రకమైన సర్దుబాటు వల్ల మానవహక్కులపై ' విశ్వప్రకటన' సాధ్యమయింది.

## 4.9 విశ్వమానవహక్కులు - పరిమితులు

విశ్వమానవహక్కులు అనుభవం లోకి వచ్చిన దాదాపు అర్ధశతాబ్దం తర్వాత ఈ విశ్వాస ప్రకటనలో తీవ్రమైన లొసుగులు పొడసూపాయి. పలుకోణాల నుంచి అసలు విశ్వ అన్న మాట పైనే తీవ్రవిమర్శలు చెలరేగాయి. సాధారణంగా సార్వత్రికత వాంఛనీయమైనప్పటికీ అమలుకు సంబంధించిన విషయాల్లో సవాళ్ళు పేరుకుపొయ్యాయి. చివరికి ఈ సవాళ్ళు ' మానవహక్కులు' అన్న సిద్ధాంతానికే సవాలుగా పరిణమించాయి. విశ్వమానవహక్కులు భావనలు ఆచరణలో సమస్యలు ఎదుర్కొంటునప్పుడు సిద్ధాంతం, ఆచరణలపై పునర్అంచనాలు ప్రారంభమయ్యాయి. నిజానికి ఇప్పుడు విశ్వమానవహక్కులు ఈ సంక్లిష్ట దశగుండా ప్రయాణిస్తున్నాయి.

విశ్వమానవహక్కుల పుట్టుకలోనే అవి వ్యక్తి కేంద్రంగా, బూర్జువా లక్షణాలతో నిండి వున్నాయని మొదటి విమర్శ. ఈ విమర్శకు ఇటీవలి సోషలిస్టు సమాజాల పతనం కొత్తకోణాన్ని కల్పించింది. సోషలిస్టు సమాజాలు రాజకీయ, పౌరహక్కులను పాటించడంలో, ప్రోత్సహించడంలో వైఫల్యమే వాటి పతకానికి నాంది పలికిందని ఈ విమర్శ చేస్తున్న వాళ్ళు ప్రతిపాదిస్తున్నారు. ఇదే సమయంలో సోషలిస్టు సమాజాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో చెందిన ఘోరవైఫల్యం ఇందుకు తోడయింది. ఈ సమాజాల పతనం అన్నిరంగాల్లో పూర్తి వైఫల్యం ఫలితమే. కానీ అదేసమయంలో చైనా, క్యూబాలాంటి దేశాల్లో ఈ విషయాలన్నీ వేరే విధంగా వున్నాయి. చైనా పాక్షికంగా కూలిపోకుండా వున్న ప్రధానకారణం, ఆ దేశం సాధించిన ఆర్థిక ప్రగతి, విప్లవం తొలినాళ్ళలోనే చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం కొనసాగింపు అని చెప్పవచ్చు. చైనా వ్యవస్థకు సాంస్కృతిక విప్లవం దన్నుగా నిలిచింది. అయితే ఈ విషయంలో విషాదమేమంటే చైనా, పౌర, రాజకీయహక్కులను విభజించడమే కాకుండా అంతర్జాతీయ వేదికలపైన కూడా తమకు పౌరహక్కులకు వ్యతిరేకంగా వాదనలు చేస్తున్నది. ఫలితంగా చైనా వైఖరి మొత్తంగా విశ్వ మానవహక్కులు అన్న అభిప్రాయానికే పెను సవాలుగా మారింది.

BRAOU

అయితే విశ్వ మానవహక్కులకు సంబంధించిన చైనా దృక్పథాన్ని మార్క్సిస్టు ప్రపంచ దృక్పథంలో భాగమని చెప్పలేము. ఇది చైనా స్వయంగా ప్రకటించుకుంటున్న "మార్కెట్ మైత్రీ సోషలిజం"లో భాగమని చెప్పవచ్చు. నిజానికి మార్క్సిస్టులు ఆచరణలో మానవహక్కుల సార్వత్రికతమీద విభేదించడం కాకుండా, మానవహక్కుల సారం మీద విభేదిస్తున్నారు. ప్రపంచ కార్మికుల ఐక్యతను కోరుకుంటున్న ఒక సిద్ధాంతం, విశ్వ మానవస్వేచ్ఛలను వ్యతిరేకిస్తుందని చెప్పలేము. మార్క్సిస్టులకు మానవసమాజం భౌతిక పునాదిలో వున్న వర్గ విభజనలకు సంబంధించి మాత్రమే విభేదాలు తలెత్తుతాయి. ప్రపంచంలోని ప్రజల్లో విశ్వమానవ హక్కులు అన్న భావన తీవ్ర విభేదాలను పెంచుతుందనడం ఒక వాస్తవం అయినప్పుడు సమాజంలోని విభజనలను అధిగమించడానికి విశ్వమానవహక్కులకు సంబంధించిన వ్యూహం ఏమిటన్నదే ప్రశ్న.

అధికారం, ఆస్తులు ప్రాతిపదికగా మానవుల మధ్య విభజన సంఘర్షణలకు దారి తీస్తుంది. హక్కుల్లో ఉదార భావన ఆస్తిహక్కును పరిగణనలోకి తీసుకోవడమే కాదు, మానవ హక్కుల్లో ఆస్తిహక్కును ఒక ప్రధానమైన హక్కుగా గుర్తిస్తుంది. యూరప్‌లో ఆస్తిని దైవసంబంధిత ఆమోదంగా పరిగణించే ఒక్క హక్కుల ప్రకటన కూడా లేదంటే అతిశయోక్తి కాదు. మనుషులకు ఆస్తిభద్రతను ప్రతిష్టను, ఆత్మగౌరవాన్ని ఇస్తుందని ఎవరైనా వాదించవచ్చు. అటువంటప్పుడు ఏ ఆస్తీలేని లక్షలాది మంది గురించి మనం చెయ్యగలిగింది ఏముంది? అందువల్ల ఆస్తిని అందరికీ సమానంగా పంచాలన్న భావనలే మనుషులకు సార్వజనీనహక్కులను కల్గించగలవు. ఇల్లాంటి అంశాన్ని మనం ఆమోదించినట్లయితే ఆర్థికవ్యవస్థను మార్పుచేయడానికి, ఇది ఒక ఆయుధమవుతుంది.

ఇదేవాదన అధికారం ఆధిపత్యానికి కూడా వర్తిస్తుంది. అధికారం ఒకరి భవిష్యత్తును నిర్ధారించే సామర్థ్యాన్ని ఓవంక, ఇతరులపై ఆధిపత్యం చెలాయించడానికి భౌతికమైన బలంగా మరోపక్క ఉపయోగపడుతుంది. భౌతికబలంపైన రాజ్యానికి గుత్తాధిపత్యం వుంటుంది. ఈ అధికారాన్ని క్రమబద్ధంచెయ్యడం అనే అంశం మానవహక్కుల చర్చల్లో గణనీయమయిన ప్రాధాన్యత సంతరించుకున్నది. అధికారక్రమబద్ధీకరణ అంటే అధికారాన్ని అందరికీ పంచడం ఎంత మాత్రమూ కాదు. తద్విరుద్ధంగా అది అధికారాన్ని నిరాకరించడమే. ఈ విషయాన్ని పాశ్చాత్య వాగ్వివాదాలు నేరుగా పరిశీలించకుండా వ్యక్తి లేదా, సమూహం లేదా సమాజం, జాతికి సంబంధించిన భవిష్యత్‌ను నిర్ధారించే సాధికారత గురించి మాత్రమే ఈ చర్చలు జరిగాయి.

BRAOU

## 4.10 విశ్వమానవహక్కులు - మూడవ ప్రపంచదేశాలు

మానవహక్కులలో సార్వత్రిక చెలామణిని ఇటీవలి కాలంలో మూడవ ప్రపంచదేశాలు (చైనా, భారత్ లాంటి దేశాలు ఎక్కువగా) ప్రశ్నిస్తున్నాయి. మానవహక్కుల విషయంలో ప్రాదేశిక న్యాయంగురించి ఈ దేశాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. హక్కులు చరిత్ర అభివృద్ధి, సంస్కృతులకు ప్రత్యేకంగా సంబంధించినవన్న ప్రాతిపదికన మూడవ ప్రపంచదేశాలు ఈ వాదన చేస్తున్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగాసాముదాయిక హక్కుల భావన గురించి వాదిస్తున్నాయి. కానీ, ఈ సాముదాయక హక్కులు అంటే ఏమిటి? అని నిర్వచనం మాత్రం ఇవ్వలేకపోతున్నాయి. పదశబ్దాలను బట్టి చూసినప్పుడు ఇవి సహజహక్కుల తొలిరూపంగా గోచరిస్తాయి. సహజహక్కులు కనీసం సానుకూల హక్కులుగా అయినా పనిచేశాయి. కానీ, ఇప్పటికీ సాముదాయక హక్కులు మాత్రం పరికల్పనా భావనగానే వుండి పోయాయి. సాముదాయిక హక్కులను సమగ్ర ఆచరణలోకి మలిస్తే అవి సమిష్టి ఆస్తి, సమైక్య అధికారం అన్న రూపం తీసుకుంటాయి. చాలావరకు మూడవ ప్రపంచదేశాల్లో సరళీకరణలో భాగంగా ఈ హక్కులు నిరాకరించబడతాయి. ప్రైవేటు యాజమాన్యం ద్వారా లాభాలకు ప్రోత్సాహం, రాజ్యానికి విచక్షణారహిత అధికారం అన్నవి మూడవప్రపంచదేశాల్లో అనుభవిస్తూనే ఉన్నాయి. ఇవి వ్యక్తి కేంద్రంగా స్వేచ్ఛాదృక్కోణంతో సాముదాయిక హక్కుల గురించి మాట్లాడుతున్న మూడవప్రపంచదేశాల్లో ఉనికిలో వున్న వైరుధ్యాలను చూపుతున్నది.

సాముదాయక సంస్కృతులు అని పిలవబడుతున్న వాటిలో కొత్తగా తలెత్తుతున్న పరిస్థితి చిరకాలంగా ఈ సంస్కృతుల్లో పాతుకుపోయివున్న వ్యక్తి వర్సెస్ సమిష్టిల మధ్య సంఘర్షణను పరిష్కరించడంలో విఫలమవ్వడమే

కాదు, అది మరీను పెరగడానికి దోహదం చేస్తున్నది. వ్యక్తికీ, సమిష్టికీ మధ్య, స్వార్థం, అందరి మంచికి మధ్య అధికారం, ఆస్తుల లాభాన్ని చేకూర్చే ఇతర అంశాలు సంఘర్షణకు మూలకారణమవుతున్నాయి. ఈ పరిణామక్రమంలో స్వయంభూవుగా వున్న వ్యక్తి ఒక స్థాయిలో ఉత్పత్తిశక్తులను ముందుకు కదిలించగలడేమో కానీ అదేసమయంలో ఉత్పత్తి సంబంధాల్లో మాత్రం అంతులేని సమస్యలను సృష్టిస్తాడు. విషాదమేమిటంటే మూడవ ప్రపంచదేశాల్లో, సోషలిస్టు, సమాజాల్లో వ్యక్తి స్వార్థం వ్యక్తి ప్రయోజనాలు ఆయాదేశాల్లో ఆర్థిక స్తబ్ధతకు దారితీసే పరిస్థితి సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయాదేశాలు సృజనాత్మక ప్రత్యామ్నాయాన్ని వెతకకుండానే, పాశ్చాత్య ఉదారవమూనాలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. అయితే మానవహక్కులకు సంబంధించి ఉదారవిధానాలకు ఇదే తర్కం ఎందుకు పనికిరాదన్నది ప్రశ్న. ఆర్థికరంగానికి సంబంధించి వ్యక్తి స్వార్థప్రయోజనాలను సమర్థించే ఉదారభావనలు, రాజకీయ, సామాజికరంగాల్లోనేమో సాముదాయక భావనలు అన్న విరుద్ధభావనలు మానవహక్కులకు కలగబోయే ప్రమాదానికి సూచికలు. మూడవ ప్రపంచదేశాల్లో ఈ పరిణామం మార్కెట్ కేంద్రంగా నడిచే పెట్టుబడి దారీ నమూనాకన్నా తీవ్రమైన ప్రమాదం ఏర్పడబోతున్నది.

## 4.11 విశ్వమానవహక్కులు - స్త్రీ వాద దృక్పథం

విశ్వమానవహక్కులు అన్న అభిప్రాయాలపై మరో విమర్శ స్త్రీ వాద ప్రపంచ దృక్పథం నుంచి వచ్చింది. వాస్తవ పరిస్థితుల్లో స్త్రీ, పురుషుల మధ్య వున్న అంతరాలను ఏమాత్రం పూడ్చలేని ఈ విశ్వమానవహక్కుల భావన లాంచన ప్రాయమని స్త్రీ వాదులు విమర్శిస్తున్నారు. సహజహక్కులు అన్న భావన స్థానంలో 'మనిషిహక్కులు' అన్న భావన ఏర్పడిన మాట మాత్రం నిజమే. ఇందుకు బదులుగా వీటిని 'మానవహక్కులు' అన్న పదం వాడాలని ఎలకార్ రూజ్‌వెల్ట్ లాంటి రచయితలు సూచించారు. అందువల్లనే మనిషిహక్కుల బదులు, స్త్రీల హక్కులు అన్నపదం ఖాయమైంది. ఇదిట్లావుంటే మానవహక్కులు మనిషి హక్కులుగా మాత్రమే కొనసాగుతున్నాయన్నది ఇటీవల వాదవివాదాల్లో తేలిన అంశం. మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష వ్యవస్థలతో సంబంధం లేకుండా, అభివృద్ధి స్థాయితో సంబంధం లేకుండా, సైద్ధాంతిక, సాంస్కృతిక విభేదాలతో నిమిత్తం లేకుండా, ప్రపంచవ్యాప్తంగా ఒకే రకంగా కొనసాగుతున్నది. మహిళల పట్ల వ్యవస్థీకృతమైన వివక్ష వారి గౌరవాన్ని దెబ్బతీస్తూనే వున్నది. దీనికితోడు ఇటీవలి కాలంలో మహిళలపై జరుగుతున్న హింసకూడా గణనీయంగా పెరిగింది. వ్యభిచారం, అత్యాచారం, సామూహిక అత్యాచారం వరకట్నం హత్యలు, ఆత్మహత్యలు భ్రూణహత్యలు, అల్ప సామాజిక అంతస్తు, అవకాశాలు మృగ్యమవడం లాంటి రూపాలతో ప్రపంచంలో సగం జనాభాగా వున్న మహిళల పట్ల అణిచివేత కొనసాగుతున్నది. ఈ సాక్ష్యాల ఆధారంగా విశ్వమానవ హక్కుల ప్రకటన ఆచరణలో మగవాళ్ళను సమర్థించేదిగా వున్నదనే వాదన ముందుకు వచ్చింది. ఈ వివక్షాదోరణి మానవహక్కుల అసలుమూలాలను ప్రశ్నించేందుకు బహిరంగంగా నిరసనలకు దారి తీసింది. వ్యక్తి కేంద్రంగా రూపొందించిన ఉదారహక్కులు తప్పనిసరిగా పురుషులచే రూపొందించబడినవి అని స్పైక్ పాటర్‌సన్ అనే శాస్త్రవేత్త ఒక వ్యాసంలో పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన పరాయీకరణకు గురైన, సంకుచితుడైన వ్యక్తి ఒక పురుషుడు మాత్రమే కాగలడని ఆమె అంటారు. మహిళ, ప్రకృతి సిద్ధమైన మిశ్రమ విభజన కారణంగా ఎప్పుడూ సంకుచితురాలు కాబోదని ఆమె అంటారు. స్త్రీ ఎప్పుడూ సమిష్టి, సహకారభావనల్లోనే బతుకుతూ ఎల్లవేళలా ఆందోళన పడుతుంది. అలాగే స్త్రీ పునరుత్పత్తి శక్తి కారణంగా మానవ జాతి కొనసాగడానికి దోహదపడుతున్నది. ఆమె మానవహక్కులు ఎక్కడో మానవీయ ఆందోళనలు, సమిష్టితత్వం పునాదిగా రూపుదిద్దుకొని వుంటాయి. అధికార రహితంగా, ఆస్తిరహితంగా శతాబ్దాలుగా జీవించిన మహిళలకు వ్యక్తిస్వేచ్ఛ, ఆస్తి తదితర అంశాలు అమెహక్కుల్లో ఎప్పుడూ భాగం కాలేదు. అందువల్ల మహిళల ప్రాపంచిక దృక్పథం ప్రకారం విశ్వమానవహక్కులకు సంబంధించి దాదాపుగా ఇప్పటికి భిన్నమైన సైద్ధాంతిక పునాదులపై ఆధారపడి మొత్తం దృక్పథమే ప్రశ్నించబడుతున్నది.

BRAOU

## 4.12 విశ్వమానవహక్కులు - భారతీయకులవ్యవస్థ

ఇప్పటిదాకా చర్చించిన సమస్యలతో పాటు భారత దేశపు వాస్తవ పరిస్థితుల్లో కులప్రాధాన్యత అన్న సమస్యకూడా ఉనికిలో వున్నది. ఇలాంటి తరహా సమస్యల్లో దేశాలు అరుదు. యూరోపియన్ దేశాల్లో అయితే ఇలాంటి సమస్యలేదు. స్థిరీకరించిన ఈ సామాజిక సమూహాలు డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్లు శ్రమవిభజనమీద కాకుండా, శ్రామికుల విభజన మీద ఎక్కువ ఆధారపడిఉన్నాయి. అయితే శ్రమవిభజన ఉత్పత్తి శక్తులను మరింత శ్రేష్ఠమైన శ్రమవిభజనకు దారితీస్తుందని కూడా చెప్పవచ్చు. అందుకు భిన్నంగా శ్రామికుల విభజన అనేది విరుద్ధమైన ఫలితాలనిచ్చి ఉత్పత్తికి అవరోధంగా నిలుస్తుంది. ఈ విభజనల ద్వారాను అధికారం, ఆస్తులు అన్న విషయాలకు పరిమితమై ఆలోచించినప్పుడు స్థరీకరణలో దిగువస్థానాల్లో వున్న కులాలు పూర్తిగా చలనరహిత కులాలుగా వున్నాయి. వారు కోరుకున్నప్పటికీ వారు వ్యవస్థలో భాగం ఎప్పుడూ కాలేకపోగా వ్యవస్థకు బయటే మిగిలిపోతున్నారు. ఈ స్థరీకరణ ఏర్పాట్లలో హక్కులు తలక్రిందులవుతాయి. స్వేచ్ఛ న్యాయం కొందరికి మాత్రమే సంబంధించి వుంటాయి. సామాజిక విలువలు కులవ్యవస్థలో కులానికీ, కులానికీ మధ్య వేర్వేరుగా వుంటాయి. అలాగే నేరమూ - శిక్షకూడా విభాజితమై వుంటుంది. అందువల్ల కులవ్యవస్థలో ఆచరణ అంతా విశ్వ మానవ హక్కులకు పూర్తి విరుద్ధంగా వుంటుంది. అయితే, కులవ్యవస్థ అంతర్గత నిర్మాణం, ఇతర సామాజికవ్యవస్థల్లో సారూప్యతలకు సంబంధించి మాత్రం భారతీయ మానవహక్కుల ఆచరణలో తిరుగులేని ఆధిపత్యధోరణి కొనసాగడానికి కులవ్యవస్థ ఉపయోగపడుతున్నది. ఇది మానవహక్కుల ఆచరణకు ఆలోచనకు ఒక్క ప్రత్యేకమైన అంశంగా మనం గుర్తించాలి.

## 4.13 విశ్వ మానవహక్కులు - చెల్లుబాటు

ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యానికి సంబంధించి బహుళరూపాలు విశ్వమానవహక్కులు చెల్లుబాటుపై తీవ్రసందేహాలను రేకెత్తిస్తున్నాయి. విశ్వమానవహక్కులకు ఎదురవుతున్న సవాళ్ళు భిన్న దిశల నుంచీ భిన్న కోణాల నుంచీ ఎదురవుతున్నాయన్నది వాస్తవం. అయితే ప్రశ్న ఏమిటంటే, ఇప్పటిదాకా ఎదురైన అనుభవాలు విశ్వమానవ హక్కుల కోణాన్ని ఆమోదించాయా? లేదా? అన్నదే. మానవహక్కుల సార్వజనీనత ఎదురైన సవాళ్ళను అధిగమించిన తీరుపై ఆధారపడి వుంటుంది. విశ్వమానవ హక్కులకు ఎదురవుతున్న ప్రధాన సవాళ్ళు వాటిరూపాలు ఏవైనప్పటికీ ప్రధానంగా ఆధిపత్యం, వివక్షలు అని చెప్పవచ్చు. అందుచేత ఆధిపత్యంలో సార్వజనసమస్యకు పరిష్కారంలోనే దారి చూపగలగాలి. అంటే మానవహక్కులను ఉద్దేశించిన నియమాలు సమస్యను దాటి పరిష్కారం వైపు పయనించాలి. ఈ మార్పు మానవహక్కులకు ఇప్పుడున్న స్థితినుంచి కాపాడి ప్రశంసలు పొందేరీతిలో నిజమైన లక్ష్యాలు సాధించేదిశగా రూపొందించాలి.

## 4.14 ముగింపు

మానవహక్కులపై జరిగిన సైద్ధాంతిక చర్చలను ఒకకొలిక్కి తెచ్చినట్టయితే హక్కుల భావన ఇప్పుడు ఒక సృజనాత్మక నిశ్చలస్థితి నుంచి నిరంతరాయంగా చలనంలో వున్నట్టు దృగ్గోచరమవుతుంది. మానవహక్కుల అంతర్గత చలనం సహజంగానే హక్కులు ఉనికిలోవున్న సమాజాలపైన నిరంతరం మార్పు చెందుతున్న బహిర్స్థితిగతులపైన తద్వారా దేశీయ స్థితిగతులపైన ఈ చలన ప్రభావం కనబడుతున్నది. సంక్లిష్ట సామాజిక సంబంధాల్లో ఈ చలనం ముడిపడివున్నది. ఈ పరిస్థితుల్లో అసమతుల్య స్థితిలోవున్న పరిస్థితులను మార్చడానికి పద్ధతుల్లోనూ, సైద్ధాంతిక ధోరణుల్లోనూ చురుకైన ప్రతిభావంతమైన భావాల రూపకల్పన అవసరం వుంది. మానవహక్కులకు సంబంధించి రాజకీయ ఆర్థిక వ్యవస్థల పరిశీలన యాంత్రికంగా కూడా సృజనాత్మకంగా జరగవలసి వున్నది అంటే ఈ ధోరణి బహుళాంశాలతో కూడిన మార్పు కోరేధోరణిలో వుండాలి. అంటే ఒకటి సామాజిక దృగ్గోచర విషయాలకు మార్పు కేంద్రకంగా వుంటుంది. రెండు సమానత్వంరూపు మారే సమాజానికి మానవీయ ప్రపంచ దృక్పథం దన్ను వాంఛనీయం అవసరం కూడా. మూడు మానవస్వేచ్ఛలకు సంబంధించిన సంక్లిష్ట గతితర్కాన్ని అర్థం చేసుకోవడానికి

BRAOU

సాధారణపద్ధతులుకాకుండా, ఆధునిక పద్ధతులు అవసరం అవుతాయి. ఈ విధంగా మానవహక్కుల రంగంలో సామాజిక సంక్లిష్టతలను అర్థంచేసుకొని కొత్తభావనలను రూపుదిద్దుకోవడానికి కొత్త సృజనాత్మక విధానాలు అవలంబించాలి.

## 4.15 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. సహజహక్కుల సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించి, వాటి ప్రాధాన్యతను వివరించండి?
2. మానవహక్కుల ఆధునిక భావనల మూలాలను చర్చించండి?
3. న్యాయప్రతిఘటనహక్కుపై థామస్‌పేన్, జె.ఎస్.మిల్ భావాలను పోల్చి, విభేదించి చూపండి?

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. మానవహక్కుల స్వేచ్ఛా సిద్ధాంతానికి సంబంధించి మార్క్సిస్టు విమర్శను వివరించండి?
2. మానవహక్కుల తొలి భావనలను సుసంపన్నం చేయడానికి 20వ శతాబ్దంలో చేర్చిన కొత్తకోణాలు పేర్కొనండి?
3. లింగ, కుల, వర్ణ వివక్షల కారణంగా మానవ హక్కులు పొందడంలో ఎదురవుతున్న అవరోధాలు ఏమిటి ?

BRAOU

BRAOU

# ఖండం - II

# ఉదారవాద దృక్పథం

సమకాలీన మనవహక్కుల భావనలు అధ్యయనం చేయాలంటే మానవహక్కుల పరిణామ చరిత్రను ఆకలింపు చేసుకోవాల్సిన అవసరం వుంది. ప్రాచీన రాజనీతి సిద్ధాంత కర్తలైన ప్లేటో, అరిస్టాటిల్ కాలం నుంచి సామాజిక ఒడంబడిక సిద్ధాంతం, బెంథాం ఉపయోగితావాదం మరియు ఉదారవాద సిద్ధాంతం వరకు జరిగిన మానవహక్కుల పరిణామం రెండవ ఖండంలో చర్చించబడింది. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. అవి:

భాగం - 5 : మానవ హక్కులు - పరిణామం

భాగం - 6 : జీన్ జాక్విస్ రూసో, థామస్ పెయిన్

భాగం - 7 : లాక్, మిల్, డైసీ, రస్సెల్, డ్వార్కిన్

BRAOU

BRAOU

# భాగం - 5 : మానవహక్కులు - పరిణామం

**విషయక్రమం**


5.0 ఉద్దేశం

5.1 పరిచయం

5.2 ప్రాచీన నమూన

5.3 మధ్య యుగాల నమూన

5.4 ఆధనిక నమూన

5.5 సామాజిక ఒడంబడిక సిద్ధాంత వేత్తలు

5.6 ఉదారవాద ఉపయోగితావాదం

5.7 ముగింపు

5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- మానవ హక్కులపై యురోపియన్ తత్త్వవేత్తల భావనలు తెలుసుకుంటారు.
- సామాజిక ఒడంబడిక తత్త్వవేత్తల సిద్ధాంతాలు అవగతమవుతాయి.
- ఉదారవాద ఉపయోగితా వాదం గూర్చి చర్చించగలుగుతారు.

BRAOU

## 5.1 పరిచయం

మానవ హక్కుల భావన పరిణామానికి సంబంధించిన సైద్ధాంతిక నేపథ్యాన్ని ఆ భాగం అందజేస్తుంది. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు సుప్రసిద్ధులైన యురోపియన్ తత్త్వవేత్తలు మానవహక్కులపై వ్యక్తం చేసిన భావనలు, హక్కులకు వారిచ్చిన నిర్వచనాలు మనకు అవగతం అవుతాయి. ప్రాచీనకాలంలోను, మధ్య యుగాల్లోను ఒక బృందం హక్కులు లేదా యావత్ నగర రాజ్యం ఉమ్మడి హక్కులపైనే దృష్టి వుండేది. ఆధనిక కాలం వచ్చేసరికి ఉమ్మడి హక్కుల స్థానే వైయక్తిక హక్కుల భావన బలపడింది. ఆధనిక యుగంలోని తత్త్వవేత్తల దృష్టి అంతా వ్యక్తిగత హక్కుల పరిరక్షణపైనే వుంది. జీవితానికి సంబందించిన అన్ని రంగాల్లో, ప్రభుత్వాల ఏర్పాటు, ప్రభుత్వాల రద్దుతో సహ మిగతా విషయాలు సామాజిక వ్యవహరాలలో వైయక్తిక హక్కుల రక్షణకే ఆధునిక తత్త్వవేత్తలు పెద్ద పీట వేశారు.

సమాజంలోను, రాజకీయాలలోను సుస్థిరత అన్నింటికి కంటే ముఖ్యమని వాదిస్తు ఆ లక్ష్యం దిశగా తమ సిద్ధాంతాలను పదును పెట్టిన యురోపియన్ తత్త్వవేత్తలు కొందరు వున్నారు. అయితే మరి కొందరు తత్త్వవేత్తలు సమాజంలోని అమానవీయ, న్యాయ విరుద్ధమైన ధోరణులని ధ్వంసం చేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో సమాజంలో, రాజకీయాల్లో సుస్థిరతకు భంగం కలిగే అవకాశాలున్నా వారు లెక్కచేయలేదు. శక్తికి మించివున్న ప్రభోదాత్మకమైన తమ రచనల ద్వారా సమాజంలో విప్లవాత్మకమైన పరివర్తనకు వారు కృషి చేశారు. ఆధునిక కాలంలో మానవ విమోచనకు సంబంధించిన చైతన్యం, స్పృహ గణనీయంగా పెరుగుతుండటం హర్షించదగిన పరిణామం. ఈ చైతన్యం కొత్తగా వచ్చినది కాదు. దీనికి మూలాలు ప్రాచీన కాలంలోనే వున్నాయి. ఈ చైతన్య వృద్ధి క్రమాన్ని దశలవారిగా చర్చిస్తూ, హక్కుల భావన మానవ మస్తిష్కంలో లేదా చైతన్యంలో అంకురించింది మొదలు అది ఒక మహావృక్షంగా ఎదిగి నేటి ఆధునిక రూపాన్ని సంతరించుకోవడం వరకు గల క్రమాన్ని ఈ భాగం చర్చిస్తుంది.

## 5.2 ప్రాచీన నమూన:

ప్రాచీన రాజనీతి సిద్ధాంతాల్లో వ్యక్తిగత హక్కుల భావన పెద్దగా కనిపించదు. అరిస్టాటిల్ సొంత ఆస్తి భావనని సమర్థించినప్పటికి, ఆ పరిధిని దాటి ముందుకు పోలేదు. వ్యక్తిగత హక్కులకు ఆధారభూతమైన 'స్వయం స్వతంత్ర వ్యక్తి' భావన అప్పటికింకా జీవం పోసుకోలేదు. అందువల్లే ప్రాచీన సిద్ధాంతాల్లో వైయక్తిక హక్కుల ప్రస్తావన లేకపోవడానికి కారణమని చెప్పవచ్చు. మనిషి యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే సృష్టిక్రమం వుంటుందని ప్రాచీన తత్త్వవేత్తలు విశ్వశించారు. విద్య ద్వారా, జ్ఞాన సముపార్జన ద్వారా అనాదిగా వున్న ఈ సృష్టి క్రమానికి సంబంధించిన జ్ఞానం మనిషికి లభిస్తుంది. ప్రాచీన తత్త్వశాస్త్రంలో మనిషికి సంబందించిన మీమాంస అంతా ఈ విశ్వాసం చుట్టే అల్లుకుని వున్నది. దైవ నిర్ణయానికి లోబడి ఏర్పడిన రాజ్యానికి, మనిషికి మధ్య సామరస్యం కచ్చితంగా వుంటుందని ప్లేటో అరిస్టాటిల్ భావించారు. మనకు కన్పిస్తున్న ప్రపంచం ఉత్త అభాస మాత్రమేనని, ఈ జగత్తుకు మూలమైన అసలు ప్రపంచం మరొకటి వుందని ప్లేటో ప్రతిపాదించారు.

అసలు ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం మనిషికి విద్య వల్ల, శిక్షణ వల్ల లభిస్తుందని ప్లేటో భావించారు. అసలు జగత్తులోని ఆకృతులు, భావాలకు సంబందించిన జ్ఞానమే నిజమైన జ్ఞానమని ప్లేటో అభిప్రాయం. ఎందుకంటే కచ్చితమైన ఉనికి వున్నదాని గురించిన జ్ఞానమే నిజమైన జ్ఞానం. మన కళ్లెదుటవున్న ప్రపంచం అభావం కనుక దాని గురించిన జ్ఞానం నిజమైన జ్ఞానం కాదు. మనిషికి రాజ్యానికి వున్న సంబందాన్ని విశదీకరించడానికి ప్లేటో ఆదర్శరాజ్యాన్ని ప్రస్తావించాడు. ఈ ఆదర్శరాజ్యానికి నాలుగు సుగుణాలుంటాయి. దైవనిర్దేశితమైన ఈ నాలుగు సుగుణాలను విజ్ఞత, ధైర్యం, నిగ్రహం, న్యాయం అని ప్లేటో వర్గికరించారు. వేరు వేరు రూపాల్లోవున్నా మంచితనాన్ని గ్రహించగల జ్ఞానమే విజ్ఞత, దేనికి భయపడాలి. దేనికి భయపడరాదని తెల్సుకోగల అవగాహనే ధైర్యం. ఇక నిగ్రహమంటే ఒక సామర్థ్యానికి సంబందించిన భిన్న విభాగాల సమన్వయం. అది ఒక సంఘీభావ సూత్రం. న్యాయం అంటే మన విధులు మనం నిర్వర్తిస్తూ, ఇతరుల విధుల్లో అకారణంగా కలగజేసుకోకుండా మన గలగడం. రాజ్యానికి సంబంధించిన ఈ నాలుగు గుణాలు, ఆత్మకు సంబంధించిన మూడు లక్షణాలతో ముడిపడి వున్నాయి. ఆ మూడు లక్షణాలను ఆకాంక్ష, హేతువు, స్ఫూర్తి అని ప్లేటో పేర్కొన్నారు. మనిషికి ఆదర్శ రాజ్యానికి మధ్య అవినాభవ సంబంధాన్ని విస్తృత స్థాయిలో వివరించాడానికి ప్లేటో ప్రయత్నించారు. వ్యక్తిలో కన్నా మరింత విస్తృతస్థాయిలో న్యాయం తనను తాను ఆదర్శరాజ్యంలో ఆవిష్కరించుకుందని ప్లేటో పేర్కొన్నారు. ఆదర్శరాజ్యానికి సంబంధించిన క్రమం శాశ్వత నిర్మాణం వంటిది. దానిలో ఎలాంటి మార్పు చేర్పులకు అవకాశం లేదు. మార్పులకు జరిపే ప్రయత్నం వ్యవస్థ పతనానికి దారితీస్తుంది. ప్లేటో చేసిన ఈ జడవాదాన్ని ఈ శతాబ్దంలో కార్ల్‌పాపర్ విమర్శించారు. ప్లేటో ప్రకారం స్వయం స్వతంత్ర వ్యక్తి భావనకే ఆస్కారం లేదు.

BRAOU

అరిస్టాటిల్ ప్లేటో శిష్యుడే అయినప్పటికి గురువుతో కొన్ని విషయాల్లో ముఖ్యంగా ఆకృతుల సిద్ధాంతం విషయంలో విభేదించారు. అయితే మనిషికి - రాజ్యానికి మధ్య అవిచ్ఛిన్నమైన సంబంధం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందనే విషయం అరిస్టాటిల్ కూడ అమోదించారు. మనిషికి రాజకీయాలకు మధ్య సంబంధం అతి సహజమని మనిషి 'రాజకీయ జంతువు' అని అరిస్టాటిల్ పేర్కొన్నారు. మనిషికి రాజ్యానికి మధ్య సంబంధాలను ఏకమొత్తంగానూ విడివిడిగానూ అరిస్టాటిల్ నిర్వచించారు. ఏదైన ఒక సంస్థకు అందులోని ఒక ఉపవిభాగానికి మధ్య ఎలాంటి సంబంధం వుంటుందో రాజ్యానికి వ్యక్తికి మధ్య అలాంటి సంబంధమే వుంటుందని ఆయన పేర్కొన్నారు. రాజ్యంలోని మౌలిక భాగాలయిన ఆడ-మగ, యజమాని-బానిస, తల్లిదండ్రులు-పిల్లలు, సొంత ఆస్తి వగైరాలన్ని సహజమైన అంశాలు. ఆడ-మగ పునరుత్పత్తి కోసం సమాగమం చేయాలని, సహజ ప్రేరణతో ఈ ప్రక్రీయ జరగాలని అరిస్టాటిల్ అంటారు. ఆడ-మగ సమాగమం దరిమిలా దైనందిన అవసరాలను తృప్తి పర్చుకొవడానికి ఏర్పడిందే కుటుంబం. దైనందిన అవసరాలను మించిన అవసరాలను గ్రామం తీరుస్తుంది. కుటుంబాల విస్తరణే గ్రామం. సహోదర భావన వున్నా కొన్ని గ్రామాల సమాహారమే రాజ్యం. సాధారణ జీవితం కోసం అభివృద్ధి చెందిన రాజ్యం, ఉదాత్తమైన జీవితాన్ని అందించడానికి కొనసాగుతుంది. రాజ్యం అస్తిత్వం అత్యంత సహజమైన విషయం. అత్యంత సహజంగా చలామణిలో వుండేవాటిలో

రాజ్యం ఒకటని అరిస్టాటిల్ అంటారు. మనిషి రాజ్యంలో అంతర్భాగంగా వుండటం కూడా అంతే సహజవిషయమని వివరిస్తారు. ప్రమాదవశాత్తు కాకుండా, స్వభావం కారణంగా, రాజ్యంలో భాగంగా కాకుండా వున్న వ్యక్తి అథమ స్థాయి జీవి అయినా అయివుండాలి లేదా సాటి మనుష్యుల కన్నా చాలా గొప్పవాడైనా అయివుండాలి.

మనిషికి-రాజ్యానికి మధ్య సహజసంబంధాన్ని విస్తృత స్థాయిలో వివరించడం ద్వారా బానిస వ్యవస్థను అరిస్టాటిల్ సమర్థించారు. మరొకరి ఆస్తికా గల లక్షణం లేదా స్వభావం వున్నా వ్యక్తి బానిస అవుతాడని అరిస్టాటిల్ అంటారు. అరిస్టాటిల్ రాజనీతి సిద్ధాంతంలోని ప్రధాన అంశం మనిషికి-రాజ్యానికి మధ్య ఆయన ప్రతిపాదించిన సంబంధం వ్యక్తి అస్తిత్వం కంటే ముందుగానే రాజ్యానికి అస్తిత్వం వుంటుందని అరిస్టాటిల్ పేర్కొన్నారు. మనిషి అస్తిత్వంతో నిమిత్తం లేకుండా మనిషి అస్తిత్వం కంటే పూర్వం నుంచే దైవాధీనమైన విశ్వక్రమం వుంటుందని గ్రీకుల విశ్వాసాన్ని లియోస్ట్రాస్ వ్యతిరేకిస్తారు. ఆధునిక, సహజన్యాయ సంప్రదాయ భావనతో ఈ ప్రాచీన గ్రీకు విశ్వాసాన్ని ఖండిస్తూ స్ట్రాస్ తన పుస్తకం(1966) లో ఈ విధంగా పేర్కొన్నారు.

'సాంప్రదాయ సహజన్యాయం మానవుని అస్తిత్వం కంటే పూర్వం నుంచి వుంటూ మనిషి విధిగా తలవగ్గాల్సిన శిలాశాసనం వంటిదైతే ఆధునిక సహజన్యాయం మాత్రం వ్యక్తి ఇచ్ఛలోంచి పుట్టుకు వచ్చిన హక్కుల పరంపరకు సంబంధించినది.'

ప్రాచీన సిద్ధాంతాల్లో సహజన్యాయం విశ్వక్రమానికి లోబడిన వస్తుగత నియమం వ్యక్తి అస్తిత్వంతో నిమిత్తం లేకుండా,మనిషి అస్తిత్వం కంటే పూర్వం నుంచే దాని ఉనికి కొనసాగుతుంది. విశ్వ క్రమానికి అనుగుణంగా తనను తాను మల్చుకోవడం మనిషి ప్రధాన లక్ష్యమని ప్రాచీన సిద్ధాంతాల ఉవాచ. తన అస్తిత్వం కంటే పూర్వం నుంచి వున్న సత్యాన్ని అన్వేషించి అనుభవంలోకి తెచ్చుకోవడం మానవ జీవిత పరమావధి. ఇలా ఆధునిక కాలానికి వచ్చేసరికి శృంఖలాలు తెంచుకున్నాడు. మనిషిని ఇలా కొత్త చట్రంలోకి లాక్కువచ్చిన క్రమాన్ని 'మంచి' నించి 'హక్కు' దిశగా మళ్ళడమని రిచర్డ్ (1985) వ్యాఖ్యానిస్తారు.

'ప్రాచీన తత్త్వవేత్తలు, పునరుజ్జీవన కాలం నాటి నైతిక వాదులకు సంప్రదాయ చర్చనీయాంశంగా వున్నా మంచిని గురించి మాట్లాడటం నిలిపి హాబ్స్ (గ్రోషియస్ మాదిరిగా) కూడ 'హక్కుల' గురించి ప్రస్తావించడం ప్రారంభించారు. ప్రాచీన తత్త్వవేత్తలు పునర్జీవనం కాలం నాటి పండితులు 'హక్కు' ఊసు కూడా ఎప్పుడు ఎత్తలేదు. ఆ మాటకొస్తె ప్రాచీన గ్రీక్ లాటిన్ తత్త్వ మీమాంసలో 'హక్కు'కు సమానార్థకమైన మాటనే లేదు.'

ప్రాచీన సిద్ధాంతాల్లో ప్రస్తావించిన సహజక్రమాన్ని ఆధనిక సిద్ధాంతాల్లోని సహజక్రమాన్ని ఒకటిగా అర్థంచేసుకొని అయోమయానికి లోనుకాకుండా వుండేందుకు హక్కుల భావన పూర్తిగా అధనికమైనదని, ప్రాచీన సిద్ధాంతాల్లో శాశ్విత హక్కులు ఏమి లేవని ఇక్కడ మరొక్కసారి ఉద్రేకంగా చెప్పుకోవలసిన అవసరం వున్నది. ప్రాచీన సిద్ధాంతాల్లో 'స్వయం స్వతంత్ర వ్యక్తి' భావనే లేదు కనుక హక్కుల ప్రస్తావన కూడా వచ్చే అవకాశం లేకుండాపోయింది.

ప్రాచీన కాలం నుంచి ఒక్కసారిగా ఆధునిక కాలానికి వచ్చేపడితే అప్పటి భావనలు, అభిప్రాయాలలో ఇప్పటి భావనలు విశ్వాసాలకు మధ్యపొంతనే కనిపించాడు. పరిస్థితి ఒక్కసారిగా మారినట్టు కనిపిస్తుంది. దృష్టి క్రమానికి విధేయుడైన వ్యక్తి స్వయం స్వతంత్రునిగా మారి అనేక హక్కులతో అలరారే దశకు చేరుకోవడం ఏకాఏకిన జరిగిన సంఘటన కాదు. మధ్యలో అనేక దశలు పరిణామాలు వున్నాయి. తొలిసారిగా 12వ శతాబ్దంలో ఆధునిక హక్కుల సిద్ధాంతానికి సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది. అయితే ఆ హక్కులు ఇక ఇప్పటిలాగే క్రియాశీలమైన హక్కులు కావు. అవి భగవత ప్రసాదితాలు. ప్రధానంగా ఆస్తికి, అధిపత్యానికి సంబంధించినది. హక్కులంటే ఆస్తిహక్కులనే భావన విస్తృతంగా చలామణిలో వుండేది.

BRAOU

## 5.3 మధ్యయుగాల నమూనా

ప్రాచీన తత్త్వశాస్త్ర సిద్ధాంతాల్లోని విశ్వక్రమ సిద్ధాంత చట్రం నుంచి బయటపడి, మధ్యయుగాల క్రిస్టియన్ మత సిద్ధాంతాలు భగవంతునికి మనిషికి మధ్య నేరుగా సంబంధాన్ని ఏర్పరచాయి. ప్రాచీన సిద్ధాంతాల్లో భగవంతుడు సృష్టించిన విశ్వంలో మనిషి ఒక భాగం. విశ్వక్రమం మనిషి అస్తిత్వం కంటే పూర్వం నుంచే వుంటుంది. ఈ మత సిద్ధాంతాలు ప్రాచీన సిద్ధాంతాల ప్రతిపాదనలను త్రోసిపుచ్చి, మనిషిని సాక్షాత్తు భగవంతుడే సృష్టించాడని ప్రతిపాదించాయి. మనిషికి భగవంతునికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని సంభవించడం ప్రాచీన విశ్వాసాలతో పోలిస్తే గొప్ప మార్పు క్రింద లెక్క. ఈ మార్పే ఆ తర్వాత కాలంలో మనిషి స్వయం స్వతంత్రునిగా మారడానికి దోహదం చేసింది. స్థూలంగా ఇది రెండు దశల్లో జరిగింది. తొలిదశలో హక్కులకు సంబందించిన భాష జీవం పోసుకుని అభివృద్ధి చెందితే, రెండో దశలో హక్కుల సిద్ధాంతంపై గ్రంథాలు వెలువడ్డాయి. గ్రోషియస్ నుంచి లాక్ వరకు గల కాలాన్ని రెండో దశగా చెప్పవచ్చు. మధ్యయుగాల ఆరంభం నుంచి మధ్యయుగాల ఉచ్ఛస్థాయి వరకు కాలన్ని తొలిదశగా పేర్కొనవచ్చు.

తొలిదశలో మరీ ముఖ్యంగా సెయింట్ అక్వినాస్ కాలంలో సహజ న్యాయానికి సంబంధించిన స్పష్టమైన భావజాలం అభివృద్ధి చెందడం చూస్తాము. వ్యక్తిని ప్రకృతికి మధ్య సంబంధాన్ని అక్వినాస్ వినూత్న పద్ధతిలో సిద్ధాంతీకరించారు. ప్రకృతిలోని భౌతికవస్తువులకు రెండు పార్శ్వాలు వుంటాయి. ఒక పార్శ్వం వస్తువు స్వభావానికి సంబంధంచినది కూడా. రెండో పార్శ్వం వస్తువు ఉపయోగానికి సంబంధించి వుంది. స్వభావానికి సంబంధిచినంతవరకు వస్తువు పూర్తిగా దైవాదీనమైనదే. వస్తువు స్వభావాన్ని దేవుడు నిర్ధారిస్తాడు. ఉపమోగం విషయం మాత్రం మానవ క్షేత్రానికి సంబంధించినది. భౌతిక వస్తువులపై మనిషి అజమాయిషీ అంతా ఇక్కడే వుంటుంది. అక్వినాస్ సిద్ధాంతం ప్రకారం మనిషికి ప్రత్యేకంగా హక్కులు అంటూ లేవు. ప్రకృతిపై పరిమిత ఆధిపత్యం మాత్రం వుంది. అయితే పరిమితంగానైనా మనిషికి తొలిసారిగా లభించిన రాయితీ ఆ తర్వాత కాలంలో మానవ హక్కుల భావన ఇంతింతై అన్నట్టుగా వృద్ధి చెందడానికి అంకురార్పణ చేసిందని చెప్పవచ్చు. అయితే అక్వినాస్ సిద్ధాంతం క్రిస్టియన్ మతాధిపతి పోప్‌కు రుచించలేదు. ప్రకృతిపై మనిషికి సహజ ఆధిపత్యాన్ని కల్పించడం వల్ల భౌతిక వస్తు సంపదపై చర్చి అధికారానికి భంగం కలగడంతో పాటు దారిద్ర్యానికి, సంపదకు దైవిక కారణాలు ఆపాదించే అవకాశం లేకుండా పోయింది. పోప్ జాన్ XXii ఒక సిద్ధాంతం చేశారు. తన అధీనంలోని భౌతిక వస్తుసంచయంపై మనిషి ఆధిపత్యం, భూ ప్రపంచంపై దేవుని ఆధిపత్యం భావనాత్మకంగా ఒకటేనని పోప్ పేర్కొన్నారు. ఈవ్ కంటే ముందుగానే లోకంలోకి వచ్చిన ఆడమ్ తన చుట్టువున్న భౌతికవస్తువులపై ఆధిపత్యానికి ధృవీకరించుకున్నారు. నిజానికి ఈ వస్తువులని ఇచ్చి పుచ్చుకోవడానికి మరొక ప్రాణి ఏదిలేనప్పటికి ఆడమ్ తన ఆధిపత్యానికి మాత్రం నిర్ధారించుకున్నారు. అంటే ఆస్తి మనిషికి అత్యంత సహజమైనది. అది దైవ సంకల్పం కారణంగా లభిస్తుంది. దానిని బహిష్కరించటం సాధ్యంకాదు. మనిషికి భౌతిక వస్తు ప్రపంచానికి మధ్య సంబంధాలన్ని ఆధిపత్యానికి ఉదహరణలే. అడవిలో ఒంటరిగా వుండే వ్యక్తి తన చుట్టు వున్న భౌతిక వస్తువులని వినియోగించుకోడం ఒక రకంగా ఆస్తిహక్కును ఉపయోగించుకోవడం. అక్వినాస్ ఫ్రాన్సిస్కన్ కన్నా మనిషికి ఆస్తికి మధ్య మరింత సన్నిహిత సంబంధాన్ని పోప్ జాన్ ప్రతిపాదించారు. హక్కుల సిద్ధాంతం పరిణామంలో ఈ ప్రతిపాదన ఒక కీలకమైన మైలురాయిగా మిగిలింది.

అక్వినాస్ కేవలం భౌతికవస్తువుల ఉపయోగానికి మాత్రమే మనిషి అధికారాన్ని పరిమితం చేస్తే, క్రిస్టియన్ మతాధిపతి మాత్రం భూమిపై దేవుని ఆధిపత్యానికి, భౌతిక వస్తువులపై మనిషి ఆధిపత్యానికి మధ్య భావనాత్మక సమానత్వాన్ని ప్రతిపాదించారు. దేవుడు-ప్రకృతి-మనిషి ఈ మూడు అంశాల చుట్టు పరిభ్రమిస్తున్న చర్యలో మరో కొత్త కోణాన్ని విలియమ్ ఒక్ హమ్ జోడించారు. హక్కులపై చర్చలోకి వీలుగా సమాజాన్ని ఒక్ హమ్ లాక్కువచ్చారు. మనిషికి ప్రకృతిపై ఆధిపత్యం వుంటుందనే పోప్ వాదనని ఆయన తిరస్కరించారు. ప్రకృతి భావనని ఆమోదిస్తూ ప్రకృతిలో భాగమైన సహజమానవుని భౌతిక వస్తువులపై 'ఆధిపత్యం' సాధ్యం కాదని పేర్కొన్నాడు. ఆధిపత్యం అనేది ఒక సామాజిక అంశంలోని మానవ నిర్మితమైన న్యాయ వ్యవస్థలో తార్కికంగా ముడిపడి వున్న విశయమని ఒక్ హమ్ పేర్కొన్నారు. ఒక్ హమ్ కలుగజేసుకున్న తర్వాత హక్కులపై చర్చ ప్రకృతినుంచి సమాజానికి మారింది. అప్పటి

BRAOU

నుంచే హక్కులపై చర్చలో సమాజం కీలకమైన చలనాంకంగా చోటుచేసుకొవడం ప్రారంభించింది. ఒక్ హమ్ ప్రకారం సహజ మానవుని హక్కులు అతనిలో అంతర్భాగాంగా వుంటాయి. ఆ హక్కులు కూడా ప్రాకృతికమైనవే. ఆ హక్కులను మూలం నుంచి విడగొట్టి సమాజానికి అంటగట్టారు. ఒక్ హమ్ భాష్యం వల్ల ఆ తర్వాత నుంచి మత సిద్ధాంత చర్చల్లోకి 'సమాజం' అనే మరో కొత్త అంశం వచ్చి చేరింది.

న్యాయ చర్చల పరిధిలో 'హక్కు' గా మనం ఆమోదించేది అమల్లో వున్న న్యాయ వ్యవస్థల ద్వారా సమాజం చలా మణిలోకి తెచ్చిన ఒక భావన మాత్రమేనని కూడా తేలింది.

ఒక్ హమ్ ప్రారంభించిన చర్చను పునరుజ్జీవన కాలం మానవతావాద (హ్యూమనిస్ట్) న్యాయవాదులు అంద్రియా, అల్సిమిటొ, మారియో సలమోనియా ఫ్రాన్సిస్ కానస్ తదితరులు అందిపుచ్చుకున్నారు. హక్కులు పూర్తిగా సాంఘీక సంబంధితమైనవని వారు గట్టిగా వాదించారు. ఒక్ హమ్ పాక్షికంగానైనా ఆమోదించిన 'సహజ ప్రపంచం' భావనను వారు పూర్తిగా తిరస్కరించారు. రోమన్ న్యాయం అభిప్రాయంతో ఏకీభవిస్తూ వాస్తవిక మానవ సంబంధాలన్ని సంఘీక సంబంధాలేనని వక్కాణించారు. వారి ప్రకారం నాగరికత ఫలితమే సమాజం.

హక్కులకు సంబంధించిన ఈ కొత్త భావనను తోడుగా, హక్కును సహజ అంశంగా పరిగణించడాన్ని వారు తిరస్కరించడం వల్ల మనిషికి సమాజానికి మధ్య అవిచ్ఛిన్నత ఏర్పడినది. ప్రకృతిని వారు జంతువులకు సంబంధించిన ప్రపంచంగా భావించారు. సమాజం అనేది మనుషులకు సంబంధించిన హేతుపూర్వక రాజ్యమని వారి సిద్ధాంతం. దీని వల్ల హక్కులు దైవ ప్రసాదితమైన సహజ అంశాలనే వాదనకు, హక్కులు సాంఘీమైనవనే భావనకు మధ్య తీవ్ర వివాదం రగిలింది. ఈ రెండు రకాల వాదనలు చేసేవారు కూడ హక్కులను మనిషి వ్యక్తిగత విశయంగా చూడటానికి ఇష్టపడలేదు. ఒకరి వాదన ప్రకారం మనిషి దేవుని నియంత్రణలో వుంటే మరో వాదన ప్రకారం మనిషి సమాజం యొక్క ఉత్పత్తి, స్వయం స్వతంత్ర వ్యక్తి భావన అనాటికి ఇంకా అంకురించలేదు.

ప్రాకృతిక వాదులు, హ్యూమనిష్టులు భిన్న సిద్ధాంతాలను సమ్మిళతం చేసి సరికొత్త ప్రతిపాదనలతో హక్కుల సిద్ధాంతానికి మరింత పరిణతి సాధించినవారు గ్రోషియస్. సహజ ప్రపంచంలో ప్రైవేట్ ఆస్తి లేదనే హ్యూమనిష్టుల అభిప్రాయంతో ఏకీభవించలేదు. ప్రాకృతిక వాదులు సహజ అధిపత్యానికి, సాంఘీక పరమైన అధిపత్యానికి సారుప్యం చూపడాన్ని ఆయన వ్యతిరేకించారు. అదే సమయంలో ప్రకృతి వాదంలో మనిషికి అసలేమాత్రం హక్కులులేవనే హ్యూమనిష్టుల వాదనని ఆయన తిరస్కరించారు. ప్రాకృతిక వాదులు పేర్కొన్న 'ఆధిపత్యం' కూడా హక్కులకు దాదాపు మరో రూపం లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాకృతిక వాదులు ప్రకారం కూడా మనిషికి హక్కులు వుంటాయి. అయితే హక్కులు హ్యూమనిష్టులు చెబుతున్న ఆస్తిహక్కుల్లా మాత్రం వుండవు. వాటిని హక్కులు కావని తోసిపారెయడానికి, అదే సమయంలో హక్కులంటే అవే అని చెప్పడానికి లేదు. మొత్తంపై అవి కూడా హక్కుల వర్గీకరణలోనే వుంటాయి. ఈ రకమైన వివరణ ద్వారా హ్యూమనిష్టుల వల్ల ప్రకృతికి -సాంఘీక వ్యవస్థకు మధ్య ఏర్పడిన అవిచ్ఛిన్నతను గ్రోషియస్ సరిదిద్దగలిగారు. ఇంకా చెప్పాలంటే ప్రకృతినుంచి సాంఘీక వ్యవస్థ అవిచ్ఛిన్న పరివర్తనను దర్శించడం గ్రోషియస్ వల్ల సాధ్యమైంది. ప్రాకృతిక వాదుల ప్రకారం మనిషి 'ఆధిపత్యం' తో పాటు అదనంగా శిక్షించే హక్కు కూడా వున్నదని గ్రోషియస్ వాదించాడు. రాజ్యం లేదా ప్రభుత్వ యంత్రాంగం లాగానే సహజ ప్రపంచంలో ఒక వ్యక్తికి కూడా తప్పుచేసిన వారిని శిక్షించే హక్కు వుంటుంది. సహజ ప్రపంచం గురించి రాసెటప్పుడు జాన్‌లాక్ ఈ విశయాన్ని ప్రస్తావించారు. గ్రోషియస్ పేర్కొన్న సహజ ప్రపంచంలో వ్యక్తులకుండే హక్కులు సమాజాన్ని పూర్తిగా నైతిక సమాజంగా మార్చివేశాయి. సాధారణ పౌరసమాజం ఈ సహజ సమాజానికి పొడగింపు అవుతుంది. గ్రోషియస్ ప్రకారం సహజ ప్రపంచంలో వ్యక్తులకులేని ప్రత్యేక హక్కులు ఏవి ప్రభుత్వానికి వుండవు. మానవ సమాజానికి మూలం ప్రకృతిలో వుంది. సహజ ప్రపంచం నుంచి సాంఘీకవ్యవస్థకు ప్రస్థానం నిరంతరంగా సాగినప్పటికి, సాంఘీకవ్యవస్థ ఉద్దేశ్య పూర్వకంగా మనిషి సృష్టించుకున్నదేనని గ్రోషియస్ అభిప్రాయం. సొంత ఆస్తులకు సంబంధించిన వ్యవహారాల్లో వ్యక్తులకు సహజంగా వ్యక్తి స్వేచ్ఛ వుంటుంది. అయితే కొన్ని రకాల అవాంఛనీయ ఆస్తిలావాదేవీలని నిరోధించడానికి పౌరచట్టాలను కూడా అమలు చేస్తుంటారు. వ్యక్తిగత స్వేచ్ఛ కూడా సొంత ఆస్తిలో

BRAOU

అంతర్భాగమే అయినప్పటికీ, మనిషి హక్కులు రెండు రకాలుగా వుంటుందని గ్రోషియస్ అంటారు. కొన్ని హక్కులు పూర్తిగా తనకే చెందివుంటాయి. మనిషి ప్రాణం, శరీరం, స్వేచ్ఛ, గౌరవం వంటిది. ఇవి తిరుగులేని హక్కులు. వారికికొన్ని హక్కులు అవసరమైతే పరిహరించి వాటిని సమాజానికి ధారదత్తం చేయదగినవిగా వుంటాయి. పాలన సౌకర్యార్థం తాము ఏర్పాటుచేసుకున్న ప్రభుత్వానికి ఈ హక్కులని వ్యక్తులు అవసరమైతే ధారాదత్తం చేయవచ్చు. స్వేచ్ఛవిషయంలో మాత్రం గ్రోషియస్ రాజీచూపలేదు. మనిషి తన స్వేచ్ఛని ఎట్టి పరిస్థితిలోనూ పరాధీనం చేయలేడని ప్రకటించారు. సహజ మానవునికి ప్రకృతిపై వున్న బేషరతు ఆదిపత్యాన్ని లాగే హక్కున్న కారణంగా బానిస వ్యవస్థకు అస్కారం ఏర్పడే ప్రమాదం వున్నందున స్వేచ్ఛవిషయంలో నిక్కచ్చిగా వున్నారు. గ్రోషియన్ సిద్ధాంతం ప్రకారం, మనిషి స్వేచ్ఛా దుర్వియోగం కాకుండ నిఘావుంచే వ్యవస్థగా సమాజం వుంటుంది.

మనిషిని మరింత శక్తివంతునిగా చేయడంలో గ్రోషియస్ పాత్ర ఎంతో వున్నది. దేవుని అనంత శక్తిని, ప్రాధాన్యతను అంగీకరిస్తూనే, దేవుని మించి సృష్టిలో సంబంధించిన అధికారాలని లాగివేసి నిశ్చల, జడ రూపునిగా నామమాత్రునిగా దేవున్ని గ్రోషయస్ తయారు చేశాడు. దైవానికి గ్రోషియస్ ఇచ్చిన నిర్వచనం ప్రకారం అప్పటికే అనాదిగా వున్న జగత్తుని దేవుడే ఏలుకుంటాడే తప్ప మిగిలిన విషయాలలో ఆయనకు నిమిత్తం లేదు. దైవ శక్తిని లాంఛనంగా మాత్రమే అమోదిస్తూ మనిషిని బలోపేతునిగా మార్చిన గ్రోషియస్ సిద్ధాంతాలు, పలువురు మత సిద్ధాంతవేత్తలకు సహజంగానే ఆగ్రహం తెప్పించాయి. దేవున్ని బలహీనునిగా మార్చి ఆయన పరిధి మించి మనిషిని పూర్తిగా పక్కకు తప్పించి మనిషి ముందు కొత్త ఎజెండా వుంచి అతన్ని స్వయం స్వతంత్రునిగా తీర్చిదిద్దడానికి గ్రోషియస్ ప్రయత్నించాడు. దేవునికి మనిషికి మధ్య సంబంధాలను కూడా పునర్‌నిర్వచించారు. అప్పటివరకు వున్న అభిప్రాయం ప్రకారం దేవుడు- మనిషి కూడా ఏకకాలంలోనే ఆధిపత్యాన్ని అనుభవిస్తారు. అయితే దేవుని అధిపత్యానికి, అధికారానికి మనిషి ఆధిపత్యానికి ఆధికారానికి మధ్య విస్తృత స్థాయిలో భేదం వుంటుంది. గ్రోషియస్ ఈ ఏకకాలిక సంబంధాన్ని కాస్తా ఒక దాన్ని వెన్నంటి మరొకటి వుండె సంబంధంగా మార్చారు.

'మనిషిని సృష్టించకుండా వుండే స్వేచ్ఛ దేవునికి వుంది. అయితే మనిషిని సృష్టించాలని ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత మాత్రం ఆ మనిషికి కొన్ని లక్షణాలని గుణగణాలని ప్రసాదిస్తాడు. మనిషి స్వభావానికి అనుగుణమైన లక్షణాలని మాత్రమే కల్పించి విరుద్ధమైన వాటిని తిరస్కరిస్తాడు. సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఏంచేయాలనుకుంటాడో అది మాత్రం చేస్తాడు తప్ప ఇంకోలా చేయలేక కాదు'

ఈ ప్రతిపాదనతో దేవున్ని, తాను ఏం సృష్టంచాడో అది పూర్తిగా తెలిసిన సృష్టికర్తగా మాత్రమే గ్రోషియస్ నిలిపాడు ఒకసారి సృష్టించిన తర్వాత ముందుకాని ఏం సంభావించాడో అదే జరుగుతుంది. ఆ తర్వాత సృష్టిలో మళ్ళీ జోక్యం చేసుకొనే ప్రశ్నే వుండదు. వాస్తవానికి దేవుడు కలగజేసుకునే అవసరమే రాదు. రాజ్యానికి సంబందించి కూడా గ్రోషియస్ చర్చ కొత్త పుంతలు తొక్కింది. గ్రోషియస్ సమాజంలో వ్యక్తులందరూ సమానులే. అందరికి సమాన హక్కులు, స్వేచ్ఛ ఉన్నాయి. ఎవరికి వారే న్యాయమూర్తి. దీనివల్ల కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎవరికి వారే రాజు, న్యాయమూర్తి కావడం వల్ల నిందమోసేవాడు, శిక్షవిధించేవాడు ఒక్కడే. ఎదుటివాడికి కూడా సమానహక్కులు ఉన్న కారణంగా వాడు దానిని ప్రతిఘటించేవాడు. దీనివల్ల సమాజంలో సంఘర్షణలు తలెత్తేవి. వాటిని నివారించడానికి, సమాజంలోని అందరివ్యక్తుల హక్కులను ఎంపికచేసిన వ్యక్తుల సమూహానికి బదలాయించారు. ప్రత్యేక హక్కులు, సార్వభౌమాధికారం ఉన్న ఈ వ్యక్తుల బృందానికి మిగిలిన మానవ సమూహానికి మధ్య తేడా ఉంటుంది. స్వతసిద్ధంగా లభించిన స్వేచ్ఛని మానవులు స్వచ్ఛందంగా వదులుకొని ఇంకొక ఆధిక్యశక్తికి లోబడి ప్రవర్తించడానికి అంగీకరించడంవల్ల సామాజిక శాంతికి ఆస్కారం ఉంటుంది. ఇది హక్కులని స్వేచ్ఛలని వదులుకోవడం కాదు. తమ హక్కులని స్వేచ్ఛను వేరొకరు ఉల్లంఘించకుండా కాపాడుకునే ఏర్పాటు. దానినే గ్రోషియస్ ఈ విధంగా అంటారు.

"ప్రతి మనిషికి ప్రతిఘటన ద్వారా గాయపడకుండా తననుతాను కాపాడుకునే హక్కు ఉంటుంది. అయితే శాంతి పరిరక్షణకు రాజ్యవ్యవస్థను ఏర్పాటుచేసిన కారణంగా, ఆలక్ష్యాన్ని సాధించడానికి సమాజంలోని వ్యక్తులందరికంటే ఉన్నతమైన హక్కు రాజ్యవ్యవస్థకు లభిస్తుంది. సమాజంలో శాంతిని రక్షించేందుకు వీలుగా, ఒక మనిషి మరోమనిషిపై అపరిమిత అధికారాన్ని హక్కులను చలాయించకుండా రాజ్యవ్యవస్థ నిరోధిస్తుంది. రాజ్యవ్యవస్థ అలా నిరోధిస్తే తప్ప

BRAOU

శాంతిస్థాపన సాధ్యం కాదు. అలా కాకుండా మనుషులని ప్రతిఘటనకు సంబంధించి ఎవరిహక్కులువారు ఉపయోగించుకోవడానికి ఆమోదిస్తే రాజ్యం కాకుండా విశృంఖల సమూహం మిగులుతుంది."

ఖచ్చితంగా చెప్పాలంటే సార్వభౌమాధికార వ్యవస్థకు చెందిన వ్యక్తికి వ్యతిరేకంగా తమను తాము సమర్థించుకునే హక్కుమనుషుల్లో లేదు. మనిషి క్రమంగా ఎలా స్వేచ్ఛాజీవిగా మారాడు. హక్కులు ఎలా పొందారు. ఆ హక్కుల రక్షణకు సంఘటిత వ్యవస్థని ఎలా ఏర్పాటు చేసుకున్నాడో మనం చూశాం.

ఇది నేపథ్యం - దేవుడు, మనిషి మధ్య సంబంధాలపై పెద్దగా పేచీలు లేకుండా చూస్తూ తన సహజహక్కుల పరిరక్షణ కోసం సమాజాన్ని మనిషి సృష్టించుకున్నాడు తప్ప సమాజం దేవుడు సృష్టించింది కాదని ప్రకటించడానికి ఆధునిక కాలం ఆరంభంలోని తత్వవేత్తలు ప్రయత్నించారు. ఇక్కడినుంచి సామాజిక ఒడంబడిక తత్వవేత్తలు అందుకున్నారు. ఆధునిక నమూనా తొలిదశలోని పరిణామాలు 'స్వయంస్వతంత్ర వ్యక్తి' ఆవిర్భావానికి దోహదం చేసిన విషయంపైన చదువుకున్నాము. ఆ పరిణామాల్లోని రెండు ముఖ్యవిషయాలు (1) మనిషి, దేవుని పరిధినుంచి బయటపడి క్రమంగా స్వతంత్రునిగా మారడం (2) అదే సమయంలో దేవునికి - మనిషికి మధ్య సంబంధం అవిచ్ఛిన్నంగా కొనసాగటం. అయితే సామాజిక ఒడంబడిక తత్త్వవేత్తలు తొలి అంశాన్ని ప్రధాన ఆధారంగా చేసుకుని దేవునికి - మనిషికి మధ్య సంబధాన్ని పూర్తిగా తెంచివేశారు. ఇది సాహసోపేతమైన విప్లవాత్మక చర్య. మూడు సరికొత్త పరస్పర ఆధారిత భావాలను ఆలంబనగా చేసుకొని వారు ఈ విధంగా చేయగలిగారు. ఆ భావాలను సహజ ప్రపంచం ఒప్పందం - పౌరసమాజంగా సోషల్ కాంట్రాక్ట్ తత్త్వవేత్తలు పేర్కొన్నారు. ఈ తత్వవేత్తల్లో ముఖ్యంగా థామస్‌హాబ్స్, జాన్‌లాక్, జె. జె. రూసో ఈఆలోచనలకు నిర్దుష్ట రూపం కల్పించారు.

## 5.4 ఆధునిక నమూనా

BRAOU

స్వయం స్వతంత్రవ్యక్తి ఆవిర్భావానికి సంబంధించిన భిన్నదశలను విశ్లేషించిన మనం ఇప్పుడు రెండు ఆధునిక సిద్ధాంతాల్లో వ్యక్తిభావన ఏవిధంగా ఉందో చూద్దాము. ఈ రెండు ఆధునిక సిద్ధాంతాల్లో ఒకటి సామాజిక ఒడంబడిక సిద్ధాంతం కాగా, మరొకటి ఉదారవాద ఉపయోగితావాదం. ఆధునిక కాలంలోనే హక్కులకు సంబంధించిన భావన స్పష్టమైన రూపం తీసుకోవడంతోపాటు, వాస్తవిక రూపం దాల్చటం ఆరంభమైంది. మనిషిని హక్కుల వాహకంగా నిర్వచించడం ఆధునిక యుగం ముఖ్యాంశాల్లో ఒకటి. రూసో ఇదే విషయం ఇలా అంటాడు.

"స్వేచ్ఛను వదులుకోవడం అంటే మనిషి తన అస్తిత్వాన్ని త్యజించడమే. మానవాళి హక్కులని, ధర్మాలను విడిచిపుచ్చడమే. సర్వం త్యజించేవానికి ఎలాంటి ప్రతిఫలం లభించదు. అలాంటి పరిత్యాగం మానవసహజ నైజానికే విరుద్ధం. ఒకమనిషి స్వేచ్ఛని మదులుకోవడమంటే తనచేతల్లోంచి నైతికతని విసర్జించడమే" (సోషల్ కాంట్రాక్ట్ పేజి - 8)

## 5.5 సామాజిక ఒడంబడిక సిద్ధాంతవేత్తలు

హక్కులకు సంబధించి ప్రాచీన తత్త్వవేత్తలు పేర్కొన్న సహజ భావనని ఆధునిక తత్త్వవేత్తలు తిరస్కరించారు. దానిస్థానే స్వచ్ఛంద భావనను ప్రవేశపెట్టారు. ప్రాచీన తత్త్వ-శాస్త్రంలోని సహజభావన ముఖ్యంగా అరిస్టాటిల్ పేర్కొన్న సహజభావన, వాస్తవ సహజభావనకు వికృతరూపమని కూడా వారు అభిప్రాయపడ్డారు. "అరిస్టాటిల్ సిద్ధాంతం సబబుగానే ఉంది. అయితే కారణం బదులుగా కార్యాన్ని ఆయన ఉపయోగించాడు. అని రూసోవ్యాఖ్యానిస్తాడు.

మనిషిని సమాజంలో అంతర్భాగంగా పేర్కొనే ప్రాచీన నమూనాను తిరస్కరించడానికి వీలుగా ప్రాకృతిక ప్రపంచంలో మనిషి భావనను సామాజిక ఒడంబడిక తత్త్వవేత్తలు ప్రతిపాదించారు. ఈ భావనను రెండు రకాలుగా సమాజపూర్వ దశగాను, సమాజేతర దశగానూ రెండు విధాలుగా తీసుకున్నారు. ప్రాకృతిక ప్రపంచ భావనని సామాజిక ఒడంబడిక తత్త్వవేత్తలందరూ ఆమోదించినప్పటికీ, ప్రాకృతిక ప్రపంచంలోని మనిషి స్వభావం, లక్షణాలపై వారి భాష్యాలు వేరు వేరుగా ఉన్నాయి.

హబ్స్ ప్రకారం ప్రాకృతిక ప్రపంచంలోని మనిషి స్వార్థపరుడు. అతని జీవితం ఒంటరిగా, దరిద్రంగా, అసహ్యంగా పాశవికంగా ఉంటుంది. ఆయువుకూడా తక్కువగా ఉంటుంది. హాబ్స్ పేర్కొన్న ప్రాకృతిక ప్రపంచంలో భయం, దుర్మరణ ప్రమాదం మనిషిని అనుక్షణం వెన్నాడుతుంటాయి.

సామాజిక నియమ నిబంధనలులేని కారణంగా ప్రాకృతిక ప్రపంచంలో పరిస్థితి అస్తవ్యస్థంగా ఉంటుంది. మనిషిలోని జీవస్వేచ్ఛ ఉచ్ఛనీచాల మీమాంస లేకుండా అన్నిరకాల ఉపాయాలను ప్రయోగించడానికి పురికొల్పుతుంది. దేనిని శ్లాఘించాలి దేనిని నైతికంగా ఆమోదించాలనే విషయంలో ఎడతెగని ఘర్షణ ఉంటుంది. నిరంతర ఘర్షణలతో సతమతమయ్యే సమాజంలో సాఫీగా మనుగడ సాగించడం ఎలా సాధ్యం అవుతుంది? ప్రజలు తమసామాజిక కార్యకలాపాలను నిర్వచించడానికి ఉమ్మడినైతిక పరిభాషని రూపొందిస్తే తప్ప ఈ ఘర్షణలు తెగవు. నైతిక సంఘర్షణని అధిగమించడానికి రాజకీయాలని పరిష్కారంగా హాబ్స్ పేర్కొన్నారు. దీంతో రాజకీయజీవితం ఏమిటనే ప్రశ్న కొత్తగా తలెత్తింది. నైతికతపై ఏకాభిప్రాయానికి రాజకీయం దోహదంచేసే మాట నిజమైతే అసలు రాజకీయ జీవితాన్ని సాధించడం ఎలా? ఈ కొత్త ప్రశ్నకు సమాధానంగా హాబ్స్ ప్రాచీన తత్త్వవేత్తలనుంచి పరంపరగా వస్తున్న 'మంచి' అనే వస్తువుని పక్కనబెట్టి 'హక్కులు' అనే కొత్త అంశాన్ని లేవనెత్తాడు. ప్రాకృతిక ప్రపంచంలో అందరికీ సమానహక్కులు ఉంటాయి. దాడిచేయడానికి ఒకనికి హక్కుఉంటే ఆత్మరక్షణకు ఇంకొకనికి హక్కుఉంటుంది. ఇది అందరూ అంగీకరించే విషయమే. అలాంటప్పుడు ఎవడిహక్కులని వాడు రక్షించుకోవడంతో పాటు, ఇతరుల హక్కులని కూడా గౌరవించాల్సిన అవసరం ఈ పరిస్థితివల్ల ఏర్పడుతుంది. హాబ్స్ రాజకీయ సమాజానికి స్థూలంగా ఇదే పునాది. సమాజ పూర్వవ్యవస్థలోని వ్యక్తుల పరస్పర ఒప్పందంపై ఆధారపడి సమాజ నిర్మాణం జరుగుతుంది. హాబ్స్‌కు భిన్నమైనది రూసో చెప్పిన ప్రాకృతిక ప్రపంచం. ప్రాకృతిక ప్రపంచానికి సంబంధించి భావన ఏదైనా శాస్త్రీయ చారిత్రక పరిశోధనల పరిధిని అధిగమించి, వెళ్ళాలని, మనిషి మొట్టమొదటి ఎలా ఉన్నాడో కనిపెట్టేందుకు సృజనాత్మక దృష్టికి పని కల్పించాలని రూసో అన్నారు. ప్రాకృతిక ప్రపంచం భావనని ఆమోదిస్తూనే హాబ్స్‌కంటే పూర్తి భిన్నమైన పద్ధతిలో ప్రాకృతిక ప్రపంచంలో మనిషి జీవితాన్ని రూసో వివరించారు. రూసో సంభవించిన మనిషికి సంబంధించి రెండు రకాల వివరణలు ఉన్నాయి. (1) ప్రాకృతిక ప్రపంచంలో మానవుడు ఉత్తముడు, ధార్మికుడు, (2) ప్రాకృతిక ప్రపంచంలో మానవుడు నైతికుడు గాదు, అనైతికుడు గాదూ. ఈ రెండింటికి అతీతుడు. రూసో పేర్కొన్న ప్రాకృతిక ప్రపంచమానవుడు కూడా క్రమంగా ఒప్పందం ద్వారానే పౌరవ్యవస్థను నిర్మించుకుంటాడు. ప్రాకృతిక ప్రపంచాన్ని విడిచి వ్యాపార వ్యవస్థని ఆదిమ మానవుడు ఏర్పాటు చేసుకోవడానికి రెండు కారణాలని రూసో వివరించాడు. ఒకటి ప్రాకృతిక ప్రపంచాన్ని అదే విధంగా కొనసాగించడం ఆదిమమానవుని వల్లా కాకపోవడం రెండు ప్రాకృతిక ప్రపంచంలోని జీవితంకన్నా పౌర సమాజంలోని జీవితం అనేకరెట్లు నాణ్యమైనదిగా ఉండటం. రూసో ప్రకారం పౌరసమాజం, మానవుల హక్కుల ఆధారంగా నిర్మితమైంది. ఇక లాక్ ఊహించిన ప్రాకృతిక ప్రపంచంలో మనిషి ప్రకృతి ధర్మాలకు లోబడి ప్రవర్తించేవాడు. హాబ్స్ ప్రాకృతిక ప్రపంచంలో కాకుండా లాక్ ప్రపంచంలో ధర్మం నాలుగు పాదాలా నడిచింది. మానవులందరూ సమానస్వేచ్ఛని, అధికారాన్ని అనుభవించేవారు. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే బేధమే లేదు. ఎవరికి తోచినట్టు వారు, ఎవరి సౌఖ్యం కోసం వారు ప్రవర్తించినా, ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించడం, పరస్పరం హాని కలిగించుకోవడం వుండేవికాదు.

ప్రైవేట్ ఆస్తుల రక్షణకు ఒక మనిషి మరోమనిషికి వ్యతిరేకంగా స్వయంగా తన అధికారాన్ని, హక్కులని ఉపయోగించుకునే పరిస్థితిని నిరోధించడానికి లాక్ ఆదిమ మానవుడు కూడా ప్రాకృతిక ప్రపంచం నుంచి బయటపడి సామాజిక ఒడంబడిక ద్వారా పౌరవ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు.

ఈ రకంగా సామాజిక ఒడంబడిక సిద్ధాంతాల్లో తొలిసారిగా మనిషిని స్వతంత్ర అస్తిత్వంగల వ్యక్తిగా గుర్తించడంతో పాటు మనిషికి హక్కులనికూడా కల్పించారు. ఈ వైయక్తిక హక్కుల ప్రాతిపదికపైనే సమాజం నిర్మాణమయింది. అందువల్ల సంపూర్ణ హక్కుల సిద్ధాంతానికి మూలాలు సామాజిక ఒడంబడిక సిద్ధాంతంలో ఉన్నాయి.

BRAOU

## 5.6 ఉదారవాద ఉపయోగితా వాదము

సామాజిక ఒడంబడిక తత్త్వవేత్తలు పేర్కొన్న ప్రాకృతిక ప్రపంచ భావనను బెంథాం వంటి ఉదార ఉపయోగితావాదులు ఆమోదించలేదు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హక్కులు వ్యక్తులని అంటిపెట్టుకొని వుండాలేతప్ప, వ్యక్తులకు అతీతంగా విడిగా వుండవని వారు అభిప్రాయపడ్డారు. వ్యక్తి వాదం పరిధులకు లోబడే సమాజం లేదా రాజ్యం వాస్తవికతను వారు ఆమోదించారు.

వ్యక్తివాద సిద్ధాంతవేత్తల్లో అగ్రగణ్యుడు బెంథాం. వ్యక్తివాదంలో ఆయన ప్రధానంగా ప్రస్తావించే అంశం ఉపయోగం. మూడు పరస్పరాధార సూత్రాలను ఆలంభనగా చేసుకొని ఉపయోగితాసిద్ధాంతాన్ని ఆయన వివరించారు. ఆ మూడు సూత్రాలు : (1) వ్యక్తివాదం (2) ఆనందం (3) అత్యధిక వ్యక్తులకు అత్యధిక ఆనందం. తొలి సూత్రం ప్రకారం రాజకీయ సామాజిక వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన అయినా అంతిమంగా స్త్రీ, పురుషుడు వంటి వ్యక్తి సూచక స్థాయి దగ్గరకు వచ్చి నిలిచిపోయింది. ఎందుకంటే సమాజంలో అంతర్భాగంగా ఉన్న భిన్న వ్యక్తుల ప్రయోజనాల సమాహారమే ఆ సమాజం యొక్క ప్రయోజనం కూడా అని బెంథాం అంటారు. ఈ ప్రయోజనాలని స్థూలంగా సంతోషం - ఉల్లాసంగా బెంథాం పేర్కొన్నారు. ప్రతివ్యక్తి అక్కరలకు ఆయన సమాన ప్రాధాన్యత ఇచ్చారు. ఎవరికి ఏది ఆనందాన్ని అందిస్తే అదే గొప్పదని, ఒక వ్యక్తికి ఉల్లాసాన్ని కలిగించే ఒక చర్య అదే మోతాదు ఉల్లాసాన్ని మరొకవ్యక్తికి కలుగజేయకపోవచ్చునని ఆయన అంటారు. అందువల్ల భిన్న వ్యక్తుల విభిన్న అభిప్రాయాలకు మనం విలువనిచ్చి, అన్ని రకాల మానసిక స్థితులను సమాదరించాలి. చర్యలు ఎలాంటివైనా అంతిమంగా వాటి ఉపయోగం ఆనందం, ఉల్లాసం మాత్రమే అన్న విషయం స్ఫృష్టిలో వుంచుకోవాలి. ప్రజల ఉపయోగాన్ని పెంచాలంటే వారి భౌతిక ప్రాధాన్యతలు అవి ఎటువంటివైనా సరే వాటిని తృప్తిపర్చడానికి ప్రయత్నం జరగాలి. ఈ రకం ఉపయోగితావాదం, అన్ని రకాల ప్రాధాన్యతలని ఎలాంటి వివక్ష లేకుండా తృప్తిపర్చాలని వాదిస్తుంది. ప్రాధాన్యతలని తృప్తిపర్చడమే సంక్షేమమని ఈ తరహా ఉపమోగితావాదుల అభిప్రాయం. భిన్న చర్యల వల్ల ఒనగూడే సంతోషం తాలూకు నాణ్యతను వారు పెద్దగా పట్టించుకోరు.

ఎవరి సంతోషం లేదా దు:ఖానైనా బాధల, ఆనందాల ఆల్జీబ్రిక్ సమ్‌గా వాదించవచ్చు. బెంథాం ప్రతిపాదించిన అన్నిరకాల సామాజిక విధానాలకు చట్ట సంస్కరణలకు ఈ తరహా ఉవయోగితావాదమే ప్రాతిపదికగా ఉందని చెప్పవచ్చు. వ్యక్తుల ప్రయోజనాలు స్వేచ్ఛని గరిష్ట స్థాయిలో తృప్తిపర్చడానికి అనుగుణంగా ప్రభుత్వ, సమాజం పాత్ర, స్వభావం ఉండాలి అని బెంథాం పేర్కొన్నారు.

జె. ఎస్. మిల్ స్థూలంగా ఉదారవాద ఉయోగితావాదం దృక్పథానికి పరిమితమై ఉంటూనే కొన్ని ముఖ్యమైన మార్పులు ప్రతిపాదించారు. ఉదాహరణకు బెంథాం పరిణామాత్మక ఉపయోగితావాదాన్ని ప్రతిపాదిస్తే మిల్ సంతోషాల్లో గుణాత్మక బేధాలను గుర్తించాడు. మిల్ ఉపయోగితావాదం ఆధునిక హేతుబద్ధ ప్రాధాన్యతల దృక్కోణానికి దగ్గరగా ఉంటుంది. హేతుబద్ధ లేదా సాధారణ ప్రాధాత్యతలను సంతృప్తిపర్చడమే సమాజ సంక్షేమమని ఈ సిద్ధాంతం చెబుతుంది.

ఈ సిద్ధాంతం ప్రకారం ఉపయోగితావాదం పూర్తి అవగాహనతో సరైన విచక్షణతో ఏర్పర్చుకున్న ప్రాధాన్యతలని తృప్తిపర్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుంటుంది. అదే సమయంలో అవగాహనరాహిత్యంతో తప్పుడు అంచనాలతో ఏర్పరచుకున్న అసంబద్ధ ప్రాధాన్యతలని తిరస్కరిస్తుంది. ఎంతెక్కువ మందికి సంతోషం లేదా బాధకలిగాయనే దానిని బట్టి ఉపయోగాన్ని లెక్కించాలనే బెంథాం అభిప్రాయాన్ని మిల్ తిరస్కరించారు. అదే విధంగా బెంథాం వ్యక్తుల చర్యలకు ప్రాధాన్యతిస్తే మిల్ సామాజిక చర్యలకు పెద్దపీట వేశారు. ప్రతివ్యక్తి కార్యకలాపాల్లో స్వీయచర్యలు, ఇతరులకు సంబంధించిన చర్యలు అని రెండు రకాలు ఉంటాయని మిల్ పేర్కొన్నారు. స్వీయచర్యల ఫలితంగా లభించే ఆనందం, బాధలకు ఆవ్యక్తికే చెందుతాయి. కాబట్టి ఈ చర్యల విషయంలో వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అదే సమయంలో ఇతరుల ప్రమేయంవుంటే చర్యల విషయంలో వ్యక్తి అనివార్యంగా సామాజిక నియమాలు, సూత్రాలకు లోబడి ప్రవర్తించాలి. మిల్ ప్రకారం వ్యక్తిగత హక్కులతో పాటు సామాజిక బాధ్యతలు కూడా వుంటాయి. అయితే సమాజం లేదా రాజ్యం వ్యక్తుల కోసం ఏర్పడ్డవేనను విషయం మిల్‌కూడా అంగీకరిస్తారు.

BRAOU

## 5.7 ముగింపు

స్వయం స్వతంత్రుడైన వ్యక్తి, ఆవ్యక్తి హక్కులపై మనం జరుపుతున్న చర్చ ఇవాల్టికి ఇవ్వాళ వచ్చింది కాదు. దానికి శతాబ్దాల చరిత్రవుంది. శతాబ్దాల తరబడి సాగిన చర్చని అత్యంత సంక్లిష్టంగా, తార్కికంగా విశ్లేషించడం వల్ల హక్కులభావన ఈ నాటికి ఆధునిక రూపానికి చేరుకున్నది. ప్రస్తుత పాఠ్యాంశంలో స్వయం స్వతంత్ర వ్యక్తి హక్కు పరిణామ క్రమంలోని ముఖ్యదశలను సంక్షిప్తంగా ఈ పాఠ్యాంశంలో చర్చించడం జరిగింది. ప్రాచీన కాలంలోనూ, మధ్యయుగాల్లోనూ కొన్ని రకాల హక్కులు అనుభవించడానికి జన్మద్వారా సంక్రమించిన హోదా ప్రాతిపదికగా వున్న విషయం మనం గమనిస్తాం. బానిసలకు ఎలాంటి హక్కులు లేవు. మహిళలకు ఉమ్మడి హక్కులు మాత్రమే వున్నాయి. సంఘసభ్యునిగా పురుషునికి మాత్రం అన్ని రకాల హక్కులు వున్నాయి. సాంస్కృతిక పునరుజ్జీవనం, సంస్కరణ, విప్లవాలవంటి చారిత్రక ఘటనల తర్వాత 15వ శతాబ్ది నుంచి 18వ శతాబ్ది మధ్య యూరప్‌లో వైయక్తిక వ్యక్తివాదం, మానవహక్కుల భావన, బలం పుంజుకున్నాయి. పుట్టుకతో, స్త్రీ, పురుష వివక్షతో ఆస్తి అంతస్తుతో సంబంధం లేకుండా అందరు వ్యక్తులకూ హక్కులు సమానమనే భావన అభివృద్ధి చెందడం ప్రారంభమవుతుంది.

## 5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. హక్కులపై ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తల భావనను చర్చించండి. ఆ కాలంలో వ్యక్తిగత హక్కుల సంప్రదాయం లుప్తం కావడానికి కారణాలను వివరించండి.

2. మానవ హక్కులపై మధ్యయుగాల నాటి తత్త్వవేత్తల ఆలోచనా ధోరణులను విశ్లేషించండి. హక్కులకు సంబంధించిన భావనలో ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తలకు, మధ్యయుగాల తత్త్వవేత్తలకు మధ్య బేధాలని చర్చించండి.

3. మానవహక్కులపై ఆధునిక కాలం తత్త్వవేత్తల ఆలోచనల్లోని ముఖ్యాంశాలు వివరించండి.

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ఆధునిక కాలంలోని మేధావుల్లో హక్కులపై ఎవరి ఆలోచనలు, సిద్ధాంతాలు మీకు సహేతుకంగా నైతికంగా తోస్తున్నాయి. కారణాలు వివరించండి.

2. ఈ పాఠంలోని ముగ్గురు తత్త్వవేత్తలు, మానవ హక్కులపై వ్యక్తం చేసిన అభిప్రాయములు, సిద్ధాంతాలపై విమర్శనాత్మకంగా చర్చించండి.

3. మానవ హక్కుల సిద్ధాంతం అభివృద్ధికి గ్రోషియస్ లేదా హాబ్స్ చేసిన దోహదం గురించి చర్చించండి.

BRAOU

# భాగం - 6 : మానవ హక్కులు : జీన్ జాక్విస్ రూసో, థామస్ పెయిన్

**విషయ క్రమం**

6.0: ఉద్దేశం
6.1: పరిచయం
6.2: రూసో
6.2.1: సామాజిక ఒడంబడిక : సహజ మానవుని నుంచి కృత్రిమ మానవుని వరకు
6.2.2: జనేచ్ఛ
6.2.3: స్వేచ్ఛ
6.2.4: వ్యక్తి- సముదాయం
6.2.5: వ్యక్తి సామాజికీకరణ
6.3 థామస్ పెయిన్
6.3.1: ఎడ్మండ్ బర్క్‌తో వాగ్వివాదం
6.3.2: ప్రభుత్వ హింస - ఫ్రెంచి విప్లవం
6.3.3: సహజ హక్కులు - పౌర హక్కులు
6.3.4: ప్రభుత్వ అవతరణ
6.3.5: ప్రభుత్వం, రాజ్యాంగం, హక్కులు
6,4: ముగింపు
6.5. మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 6.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- మానవ హక్కుల పై రూసో దృక్పథం తెలుసుకుంటారు.
- సహజహక్కులు - పౌరహక్కులపై థామస్‌పెయిన్ భావాలు వివరించగలుగుతారు.
- ఫ్రెంచి విప్లవ కాలంలో జరిగిన ప్రభుత్వ హింసను చర్చించగలుగుతారు.

## 6.1 పరిచయం

18వ శతాబ్దం చేసిన రూసో 91712-1778), థామస్ పెయిన్ (1737 - 1809) ల మధ్య ఎన్నో విషయాల్లో పోలికలు ఉన్నాయి. ముఖ్యంగా వీరిద్దరూ ఫ్రెంచి విప్లవ ప్రభావితులు, సమకాలీనులు. వారి విస్తృత ప్రాపంచిక అవగాహన ఆధునిక ఉదారవాద ప్రజాస్వామ్యలకు మార్గదర్శకం అయింది. ఈ ఇరువురూ ఒక నిర్దిష్ట లాంఛనప్రాయమైన అర్థంలో మేధావులు కాకపోయినా, వారు తమ భావనాశక్తితో మానవతత్వాన్నీ, అనుభవాలను బాగా అర్థం చేసుకున్నారు. వారికి లాంఛనప్రాయమైన విద్య లేదు అయినా వారు జీవిత అనుభవాల నుంచి, సమాజం నుంచి ఎంతో నేర్చుకున్నారు. వారి బాల్యదశ దుర్భరమైనదీ, బాధాకరమైనది. వృత్తిరీత్యా రూసో తండ్రి గడియారాల తయారీదారుడు కాగా థామస్

పెయిన్ తండ్రి దుస్తుల తయారీదారు.

అయితే విచిత్రంగా ఈ ఇద్దరూ తమ దురవస్థలకు బలయిపోవడానికి బదులు వాటి నుంచే విషయ పూరిత అనుభవాలను, మానవ అభివృద్ధి ని సానుభూతితో గ్రహించారు.

ఈ నేపథ్యంలో వీరి కృషి, ఆలోచనా సరళి మానవ హక్కుల అభివృద్ధికి, అవగాహనకు విశేషంగా ఉపయోగపడుతుంది.

మనం ఈ తత్త్వవేత్తలను వేరు వేరుగా అధ్యయనం చేస్తూ రాజ్యవ్యవస్థ, సమాజం, వ్యక్తి అనే విశాల చట్రంలో హక్కులపై వారి అభిప్రాయాలను తెలుసుకుందాం.

## 6.2 రూసో

రూసో ప్రఖ్యాత గ్రంథం 'సోషల్ కాంట్రాక్ట్' పుట్టుకతో మానవుడు స్వేచ్ఛాజీవి అయినా ప్రతి చోటా బంధానాల్లో ఉన్నాడు అనే గొప్ప వాక్యంతో ప్రారంభమౌతుంది. ఈ వాక్యం అతని విశ్లేషణకు పునాది. అతని అభిప్రాయంలో సమాజంలో అప్పటికి సభ్యుడు కాని ఆదిమానవుడు తన ప్రాకృతిక స్థితిలో ప్రతి బంధకాలు లేని స్వేచ్ఛను అనుభవించేవాడు. ఆ తరువాత కొన్ని నిర్దిష్ట నిబంధనలతో ఏర్పడిన సమాజంలో అతను సభ్యుడైన ఫలితంగా ఆ స్వేచ్ఛను నష్టపోయాడు. ఈ క్రమంలో మానవులు సమ్మతితో లేదా రాజీతో ఈ విధంగా స్వేచ్ఛని నష్టపోవడాన్ని విశ్లేషిస్తూ రూసో మానవుడు సమాజ సభ్యునిగా ఉండే అవసరాన్ని కూడా తెలుపుతాడు. మరో విధంగా శాసన బద్ధ రాజకీయ సమాజ పునాదులను రూసో అన్వేషించాడు.

ఈ సామాజికీకరణ క్రమం మానవ స్వభావాన్ని గాయపరిచినప్పటికీ వారు తమ పూర్వస్థితికి మరల కుండా సమాజ స్థితిలోనే ఉండేలా చూసి ఫలితంగా ఏర్పడే వ్యవస్థ మరింత లాభదాయకరమైనదనీ, న్యాయమైనదనీ ఒప్పించడమే రూసో ఆకాంక్ష.

BRAOU

### 6.2.1: సామాజిక ఒడంబడిక : సహజ మానవుని నుంచి కృత్రిమ మానవుని వరకు

సమాజ ఏర్పాటు కృత్రిమమైనదని ఫలితంగా కృత్రిమ మానవుడు ఆవిర్భవించాడని రూసో నమ్మాడు. ఈ భావన మిగిలిన భావనల కంటే ఎంతో వైవిధ్యం కలిగింది. నిజానికి ఇతర తత్త్వవేత్తలు రాజ్యపునాదులను హేతు బద్ధంగా సహజ శాసనాల ప్రతిపాదికన అన్వేషించగా రూసో కృత్రిమత్వ భావన తో సంప్రదాయాల మూలాల ద్వారా గ్రహించాడు. ప్రాకృతిక స్థితి లోని ఒక దశలో కేవలం బల ప్రయోగమే ఆచరణలో ఉండేదనీ, ఈ స్థితి నుంచి సామాజిక ఒప్పందం ద్వారా రాజ్యాన్ని ఏర్పరుచుకుని మానవులు సక్రమ వ్యవస్థకు నాంది పలికారని రూసో నమ్మాడు.

ప్రారంభంలో ఈ వ్యవస్థ మానవుల నైతిక శాసన బలాల సార్వభౌమాధికారి అయిన జనేచ్ఛ ద్వారా ఏర్పాటై క్రమంగా తరువాతి కాలంలో బల ప్రయోగ స్వభావాన్ని మార్చుకుంది. ఈ భావన తోనే సక్రమ వ్యవస్థ సంప్రదాయపు మూలంగా సామాజిక ఒప్పందంతో ఆవిర్భవించిందని రూసో జనేచ్ఛ పునాదిగా గల శాసన బద్ధ బల ప్రయోగానికి, శాసనాలు లేని బల ప్రయోగానికి భేదాన్ని తెలుపుతాడు.

ఈ సామాజిక ఒప్పందం సమాజ ఆవిర్భావానికి ముందుగల ప్రాకృతిక స్థితిని రద్దుచేసిందని రూసో నమ్మాడు. దీని వలన మానవుల ప్రతిబంధకాల్లేని సహజ స్వేచ్ఛ, సమాజ పూర్వస్థితిలోని ఆదిమ సమానత్వం రద్దయ్యాయి. దీని స్థానంలో సామాజిక ఒప్పందం ద్వారా ఏర్పడ్డ శాసన బద్ధ రాజకీయ సమాజం అంతకంటే విలువైన వినూత్న రాజకీయ స్వేచ్ఛ, పౌరసమానత్వాలను ప్రసాదించింది. ఈ ఒప్పందమనేది ఒక ఏకాభిప్రాయ చర్య. ఇది మానవుల స్వార్థ ఇచ్ఛలకు వ్యతిరేకంగా సక్రమ ఇచ్ఛల విధేయత ద్వారా ఏర్పడింది. వాస్తవంలో ఇది అధిక సంఖ్యాకుల అభిప్రాయానికి అనుగణమైనది.

ఈ రకంగా వ్యక్తి నైతిక అభిప్రాయానికి అనుగుణంగా ఉండడం ద్వారా దాని ఆదేశాలకు శాసనబద్ధత వచ్చి, వాటి పట్ల విధేయత బాధ్యతగా మారుతుంది. జనేచ్ఛ పరిపాలన కు నైతికంగా సమ్మతించాడు కాబట్టి మానవుడు యదార్థ ఇచ్ఛకు కూడా విధేయుడైనాడని అర్థం. ఈ తర్కంతో రూసో మానవుడు సామాజిక ఒప్పందాన్ని అంగీకరించడం ద్వారా తన సహజ స్వేచ్ఛని కోల్పోతానని పూర్తిగా తెలిసి కూడా అంగీకరిస్తాడని వాదిస్తాడు. అయితే సామాజిక ఒడంబడిక ద్వారా మానవుడు ఎదుర్కొనే నష్టాల కంటే లభించే ప్రయోజనాలే ఎక్కువని రూసో భావిస్తాడు.

నిజానికి ప్రాకృతిక స్థితిలోని ఆక్రమణ, అతిక్రమణలకు వాటి కొనసాగింపుకు బల ప్రయోగం అవసర మయ్యేదని అతని అభిప్రాయం. సమాజ ఏర్పాటు జరిగిన నూతన వ్యవస్థలో మానవుల హక్కుల ద్వారా బలం ఏర్పడింది. దీనికి ఉదాహరణగా ఆస్తి హక్కును పేర్కొంటాడు. సమాజ పూర్వ స్థితిలో ఆస్తి ఏర్పాటు, భద్రత బల ప్రయోగంతో మాత్రమే జరిగేవి. అయితే నూతన సామాజిక పద్ధతిలో రాజ్యవ్యవస్థ విధించిన నిబంధనలకు లోబడి మానవులు దీన్ని హక్కుగా పొందారు.

రూసో అభిప్రాయంలో సామాజిక ఒడంబడిక ద్వారా మానవుడు కోల్పోయేది సహజ స్వేచ్ఛ, తను కోరుకున్నది సాధించడానికి ఏ పనైన చేయడానికి గల హద్దుల్లేని హక్కు, అయితే సాధించేది పౌర స్వేచ్ఛ, తనకు కావలసిన ఆస్తి హక్కు. ఈ రెండు స్థితుల భేదాన్ని రూసో చక్కగా పేర్కొంటాడు. సహజ స్వేచ్ఛకు మానవుని శక్తియుక్తులు ఒక పరిమితి కాగా, పౌర స్వేచ్ఛకు జనేచ్ఛ ఒక పరిమితి. అలాగే బల ప్రయోగం ప్రాతిపదిక గా గల స్వాధీనత మొదటి స్థితిలో ఉండగా, ఒప్పందం తరువాత అది ఆస్తి అనే నిర్మాణాత్మక అంశంగా మారుతుంది. నిజానికి పూర్వస్థితిలోని స్వాధీనత హక్కు ఎంతో యదార్థమైనప్పటికి సమాజ స్థితిలో మాత్రమే అది నిజమైన ఆస్తి హక్కుగా మారుతుంది. తనకు అవసరమయ్యే వాటిపై ప్రతి వ్యక్తి కీ సహజ సిద్ధమైన హక్కు ఉంటుంది. అయితే నిర్మాణాత్మక నిబంధన అతనిని కొంత ఆస్తికి మాత్రమే హక్కు దారునిగా చేస్తుంది. దీనితో తమకు చెందవలసినది తాము పొందలేకపోయినా, ఇతరులు పొందినా అవగాహన ఉన్నవారు అంతగా పట్టించుకోరు. ఈ ప్రాథమిక ఒప్పందం ప్రకృతి మానవులపై విధించిన భౌతిక అసమానత్వం ద్వారా వచ్చే సహజ సమానత్వాన్ని ప్రవేశపెడుతుంది. ఫలితంగా మేథస్సు, బలం రీత్యా అసమానత్వం కలిగిన వారు ఒప్పందం ద్వారా సమానత్వం పొంది దాన్ని శాసన బద్ధ హక్కుగా పొందుతారు. రూసో, ప్రజలందరూ ఆస్తిని సాముదాయకంగా అనుభవించాలనీ, సమాన భాగస్వామ్యం పొందాలనీ చెప్పడం ద్వారా తరువాత కాలంలో వచ్చిన కారల్ మార్క్స్ సిద్ధాంతానికి జోస్యం చెప్పినట్లయింది.

'వ్యక్తికి తన ఆధీనంలోని వాటిపై గల హక్కు ఎల్లవేళలా వాటిపై సమాజానికి గల హక్కుకు లోబడి మాత్రమే ఉండాలి'.

ప్రభుత్వానికి కంటే ముందు రాజకీయ సమాజం ఏర్పడిందని రూసో పేర్కొంటాడు. అంటే మానవులు సమాజాన్ని ముందు ఏర్పాటు చేసుకున్న తరవాత రాజకీయ విభాగాలు వచ్చాయి. ఈ భావనకు విప్లవాత్మక స్ఫూర్తి ఉంది. అంటే పాలకులు ప్రజల సేవకులు, కార్యోపకరణాలు మాత్రమేనని దీని అర్థం. సార్వభౌమాధికారం గల ప్రజలు అందించిన అధికారాలను పాలకులు వారు అనుమతించినంతకాలం మాత్రమే అనుభవిస్తారు. ఈసందర్భంలోనే రూసో తన జనేచ్ఛ భావనని తెలుసుతాడు. రాజ్యావతరణను విశ్లేషించే దశ లోనే రూసో ప్రభుత్వం, పాలకులపై ప్రజలకు, సమాజానికి గల ఆధిక్యాన్ని ప్రస్తావించాడు.

## 6.2.2.: జనేచ్ఛ

జనేచ్ఛ భావన రూప కల్పనకు రూసో ఎంతో కష్టించాడు. జనేచ్ఛ అనేది సమాజంలోని ప్రజల నైతిక, హేతుబద్ధ ఇచ్ఛల ప్రతిరూపంగా పరిగణించవచ్చు. న్యాయం, సామాజిక నియంత్రణలను నిర్ణయించేది గా కూడా దీన్ని పేర్కొనవచ్చు. తన స్వప్రయోజనాలకోసం గుర్తింపు, చైతన్యంతో పోరాడే మనిషి లోని వాస్తవిక వాదిని రూసో గుర్తించకపోలేదు. అయితే వ్యక్తి తన భావన సరళి తో ముందుకుపోయి మానవులు మధ్య హేతుబద్ధ ఐక్యతను ఊహించ గలడనీ, మానవులందరూ స్వప్రయోజనాలను, కోరికలను వదలి హేతువు ద్వారా కాంక్షించినప్పుడు ఇది సాధ్యమేనని రూసో

BRAOU

పేర్కొంటాడు. దీని కోసం జనేచ్ఛను మెజారిటీ ఓటు ద్వారా గ్రహించి రూపకల్పన చేయవచ్చు. జనేచ్ఛ పునాదిగా గల తన సిద్ధాంతంలో రూసో రాజకీయ, పౌరస్వేచ్ఛలంటే వ్యక్తి తాను కొరుకున్నది చేయడానికి బదులు, జనేచ్ఛ (హేతుబద్ధ, నైతిక ఇచ్ఛా కలిగినది కాబట్టి) కోరినది మాత్రమే చేయాలని పేర్కొంటాడు. దీనర్థం వ్యక్తి నిర్నిబంధనగా తన ప్రయోజనాలను ఆచరించడానికి అనుమతి లేదని, దీనిపై నిరసన ఎదురైనప్పుడు కోతగాని, నిషేదం కాని తప్పని సరి అని పేర్కొంటాడు. ఈ విధమైన కోత, నిషేధాలు వ్యక్తి బాగుకోసమేనని వాదిస్తాడు. ఇది ఒక రకంగా వ్యక్తిని స్వేచ్ఛగా ఉండేలా కట్టడి చేయడమే. అంతేకాక నైతిక హేతుబద్ధ జీవిగా మాత్రమే వ్యక్తి తన ప్రయోజనాలను నిర్వహించేలా చూడడం. మరొవిధంగా చెప్పాలంటే వ్యక్తి ఇఛ్చా అంతర్భాగంగా గల జనేచ్ఛ నుంచి ఆత్మాను సారం ఎవరూ ప్రక్కదారి పట్టకుండా చూచి, తన స్వప్రయోజనాల కంటే జనేచ్ఛ మాత్రమే అత్యున్నతమైనదని వ్యక్తి గ్రహించేలా చేయడం. ఇదే జరిగితే, వ్యక్తులలో ఉండే ఈ వినూత్న ఆలోచన ఏకీకృత అవగాహనకు, ప్రయోజన కరమైన సాంఘిక నిర్మాణానికి దారి తీస్తుంది. 'వ్యక్తులకు దీని ప్రయోజనమేమిలో తప్పక తెలియ పరచాలి.'

రూసో భావనలో 'యునానిమస్ మొయి కమ్యూన్' అంటే సంగ్రహ ఇచ్ఛ లేదా సంయుక్త ఇచ్ఛ. ఇది హక్కుల్ని, న్యాయాన్ని రూప కల్పన చేయడమే కాక ప్రజా ప్రయోజనాల విషయంలో వ్యక్తి అంతరాత్మను సైతం త్రోసిరాజంటుంది. దీంతో వ్యక్తి, సంఘం, రాజ్యం ల మధ్య సంబంధాలపై మౌలిక ప్రశ్న తలెత్తుతుంది. ఈ రూసో ఎప్పుడూ వ్యక్తి కంటే సంఘమే గొప్పదని నమ్మేవాడు. వ్యక్తి ప్రయోజనాల కంటే సంఘ ప్రయోజనాలే ముందుండాలని అభిప్రాయ పడ్డాడు. ఈ సంఘం ప్రయోజానాలను రాజ్యం పరిరక్షించేలా చేయాలని రూసో అంతర్లీనంగా భావిస్తాడు. ఈ వాదన భిన్న అభిప్రాయాలకు తావు నిస్తుంది. కొందరు రూసోను ఈ నేపథ్యంలో ఉదారవాదిగా పేర్కొనగా, మరికొందరు అతనిని సంపూర్ణధికార వాదిగా గుర్తించారు. ఈ విషయంలో స్పష్టమైన జవాబు కష్టం. మానవ హక్కుల దృక్పథంలో మాత్రం రూసో భావనలు ఉదారవాద తత్త్వ రూప కల్పనలో నిర్మాణాత్మక పాత్రను పోషించాయని స్పష్టంగా చెప్పవచ్చు

మానవ ఆనందాన్ని శాసన బద్ధమైన రాజకీయ వ్యవస్థ ద్వారా మాత్రమే సాధించవచ్చని రూసో భావించాడు. నియంత్రణ, త్యాగాలు లేకుండా దీన్ని సాధించలేమని అతని వాదన. అతని అభిప్రాయంలో 'బల ప్రయోగ ప్రాకృతిక స్థితి నుంచి న్యాయబద్ధ పౌరస్థితికి - మానవ జాతి కోణం నుంచి ఒక సక్రమ స్థితి సంధ్యావర్తనం చెందాలంటే, మనం విశాల వ్యవస్థలో భాగమైన పౌరలుగా ఆలోచించాలే కాని సర్వ స్వతంత్రమైన స్వార్ధపూరిత వ్యక్తులుగా ఆలోచించాలే కాని సర్వ స్వతంత్రమైన స్వార్థ పూరిత వ్యక్తులుగా ఆలోచించరాదు.' ఈ విధమైన శాసన అనువర్తన, త్యాగం అనే ఈ రెండు అంశాలు అందరిలో నిక్షిప్తమవడమనేది రూసో రాజకీయ నిర్మితికి ప్రధాన మూలకాలు.

BRAOU

## 6.2.3. స్వేచ్ఛ

రూసో స్వేచ్ఛకు మూడు రూపాలు పేర్కొంటాడు. మొదటగా స్వేచ్ఛ అనేది రాజ్య స్వతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని సూచిస్తుంది. రెండో అర్థంలో స్వేచ్ఛ అంటే వర్గాల ప్రభావాల నుంచి, ఇతరుల నుంచి ఏ వ్యక్తికైనా ఉండే స్వాతంత్ర్యం. అతని అభిప్రాయంలో ఇది వివక్షరహితమైన, ధృడబలమైన సంయుక్త ఇచ్ఛపై అందరూ ఆధారపడడం ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది. మూడో అర్థంలో ఇది వ్యక్తులందరూ సమ్మతించిన, స్వయంప్రసాదిత చట్టాన్ని తెలుపుతుంది. ఈ తర్కం ద్వారా ఆధునిక ఉదారవాద దృక్పథానికి దగ్గరగా రూసో చేరుకుంటాడు. దీనిలో మానవులు తామనుభవించిన నిరపేక్ష స్వేచ్ఛలోని కొంత భాగాన్ని, మిగిలిన స్వేచ్ఛను పౌరస్వేచ్ఛగా పొందడానికి, సంరక్షించుకోవడానికి త్యాగం చేసి ఉండవచ్చునని భావిస్తాడు. దీనిలో సాగే బేరంలో వ్యక్తి రాజ్యానికి విధేయుడు కావాలని రూసో వాంఛించాడు. ఈ విధేయత లేదా స్వాతంత్ర్య త్యాగం ద్వారా మానవుడు వాస్తవంగా స్వేచ్ఛను ఏమీకోల్పోడని, అయితే స్వేచ్ఛ అర్థం మాత్రమే మార్పు చెందుతుందని రూసో అభిప్రాయం. రూసో మాటల్లో 'ఒక స్వేచ్ఛను పరిత్యాగం చేయడమంటే ఒకరిలోని మానవ శ్రేష్ఠతను, హక్కులను, మానవ విధులను, మానవ జాతి హక్కులు విధులను పరిత్యాగం చేయడమే అవుతుంది.' అతని దృష్టిలో ప్రతి దానిని పరిత్యజించేవారికి సాధ్యమయిన సమ్మేళనమే కరువవుతుంది. మానవ స్వభావంతో పొసగని విధంగా అపరిత్యాగం ఉంటుంది. ఒకరి ఇచ్ఛ కు వ్యతిరేకంగా స్వాతంత్ర్యాన్ని దూరం చేయడం అంటే ఒకరి చర్యల నుంచి నైతికతను విడదీయడమే. ప్రాకృతిక స్థితిలో వలెనే వ్యక్తి తన సమాజంలో కూడ పూర్తి స్వేచ్ఛతో ఉంటాడని రూసో విశ్లేషించాడు. వ్యక్తికి గల ఈ నూతన స్వేచ్ఛ యుక్తమైన స్వాతంత్ర్యమనీ, సంపూర్ణ విధేయతను చూపే

'ఇచ్ఛ' వ్యక్తి ఆత్మాహంకారం నుంచి జనించినది కాక వినూత్న సాంఘిక శక్తి నుంచి పుడుతుందని రూసో భావిస్తాడు. జనేచ్ఛ(మెజారిటి) కు తలవగ్గడం ద్వారా వ్యక్తి కోల్పోయే నష్టాల కంటే ప్రయోజనం పొందే లాభాలే ఎక్కువగా ఉంటాయని రూసో పునరుద్ఘాటిస్తాడు. నైతికబద్ధం, హేతుబద్ధం, అయిన ఈ జనేచ్ఛకు విధేయత చూపడం ద్వారా తనలోని స్వార్థ పూరిత పక్షపాతంపై గెలుపొంది వ్యక్తి సార్వజనీన ఆత్మను సుస్థిరం చేసుకుంటాడని రూసో భావించాడు. దీనిని విమోచనగా పేర్కొనవచ్చు.

## 6.2.4: వ్యక్తి- సముదాయం

వ్యక్తి, సముదాయం లపై రూసో సాగించే తర్కంలో సుగుణమే వ్యక్తి ప్రయోజనాలపై సంఘ ప్రయోజనాలకు స్థానం కల్పిస్తుందని తెలుపుతాడు. జనేచ్ఛ ఆధారంగా రాజ్యం రూపకల్పన జరిగినప్పటికీ, వ్యక్తి లోని సహజ న్యాయం, హేతువు, సదుద్దేశ్యాలపై రూసో తగినంత విశ్వాసం ఉంచలేదు. రూసో అభిప్రాయంలో వ్యక్తి విధేయత సాంఘిక క్రమశిక్షణ ద్వారానే సాధ్యమవుతుంది. మనం సాంఘిక వ్యక్తిని నిర్మించాలని పేర్కొనడం ద్వారా రూసో దీన్ని నొక్కి చెప్పాడు. గతంలో పేర్కొన్నట్లుగా సాంఘిక వ్యక్తి కూడా కృత్రిమ వ్యక్తే అనీ, ప్రాకృతిక స్థితికి సమాజ స్థితికి మధ్య భేదాన్ని మరువరాదని రూసో హెచ్చరిస్తాడు. అంటే ప్రాకృతిక స్థితిలోని మానవులకు కేవలం సహజ అవసరాలే ఉంటాయి. కాని సామాజిక స్థితిలోని మానవులు అన్ని రకాల కృత్రిమ అవసరాలకు, ప్రేరణలకు ప్రభావితులవుతారు. దీనితో వ్యక్తి స్వేచ్ఛ ద్వారా విలాసాలు, అధికారంపై తాపత్రయం, సంపాదన మొదలైన పోటీ తత్త్వ సమాజపు రుగ్మతలు తలెత్తవచ్చునని పేర్కొంటూ, దీనిని నిరోధించాలని రూసో భావించాడు. ఈ అలవాట్లు, కోరికలు మానవుని నిజమైన సంతోషానికి గొడ్డలిపెట్టు వంటివని విశ్వసిస్తాడు. దీన్ని వివరిస్తూ 'మనం మానవ వ్యవహారాల్లో సహజ సంఘటనల అవసరాన్ని, అధృఢతను తెలియ జెప్పే విధంగా మానవుని లోని సహజత్వాన్ని అధిగమించాలనీ, అలాగే మానవుల మధ్య విరోధాలు, ప్రతి వ్యక్తిలో అంతర్ సంఘర్షణలు లేని, అధికారం, కీర్తి కోసం పోటీ పడేది కాక సహకారం, సామరస్యాల ప్రాతిపదికన గల సమాజాన్ని, కృత్రిమ వ్యక్తిని, సాంఘీక వ్యక్తిని నిర్మించాలని' పేర్కొంటాడు. ఈ విధంగా సహజ మానవుని నుంచి కృత్రిమ మానవుడు, సహజ స్వాతంత్ర్యం నుంచి సమాజంలో స్వాతంత్ర్యం, వ్యక్తి ప్రయోజనాల నుంచి సంఘ ప్రయోజనాలు, దీనిలో రాజ్యం నిర్వహించే కీలక పాత్ర భేదా వ్యక్తిని క్రమబద్ధీకరించే సార్వభౌమాధికారం మొదలైన కొన్ని ప్రాధాన్యత అంశాలు రూసో రాజకీయ నిర్మితిలో అంతర్భాగాలు.

BRAOU

సమాజం, మానవ స్వభావాలపై రూసో సిద్ధాంతాల ద్వారా వ్యక్తి స్వేచ్ఛపై అతనికి గల సందేహాలు తేట తెల్లమౌతాయి. అందువల్ల వ్యక్తిని నియంత్రణ చేయడానికి సమగ్రమైన, స్పష్టమైన కార్యాచరణను సైతం రూసో సూచిస్తాడు. అందువల్ల వ్యక్తిని నియంత్రణ చేయడానికి సమగ్రమైన, స్పష్టమైన కార్యాచరణను సైతం రూసో సూచిస్తాడు. అందుకోసం స్వాధికార కేంద్ర వ్యక్తి వాదాన్ని సంస్కరించాలని తెలిపాడు. వ్యక్తిలో ఉండే స్వాభావిక పోటీ తత్త్వ కోరికలను అణచివేయాలనీ, దీనికోసం విద్య, శాసనాల ఆధారంగా క్రమబద్ధీకరణ ప్రక్రియ జరగాలని కోరాడు. దీనిలో భాగంగా సాముదాయక శక్తులను సమాయత్తపరిచి, వ్యక్తులలోని స్వాధికార ఆత్మలను సామాజీకీకరణ గావించాలనీ, సాముదాయక సమగ్రతను భగ్నం చేయడానికి అనుమతించరాదనీ కోరాడు. అంతే కాక స్వాభావిక విచ్ఛితి ద్వారా వక్ర మార్గంలోని వ్యక్తిని సమాజీకీకరణ గావించే రాజ్యానికి అడ్డంకులు రావడాన్ని హర్షించరాదని రూసో తెలిపాడు.

## 6.2.5 వ్యక్తి సామాజీకీకరణ

వ్యక్తులను నియంత్రణ చేయడానికి వారి మనోగతాలను స్వాధీన పరుచుకోవడమే ఉత్తమ మార్గంగా రూసో భావించాడు. ఈ నియంత్రణ పరిపూర్ణంగా జరగాలంటే వ్యక్తులు తమ మార్గదర్శి కోరినట్లుగా, చేయమన్నట్లుగా తమంత తామే స్వతంత్రంగా మారినట్లు భావించడమే ముఖ్యం. రూసో తన అంతిమ విశ్లేషణలో సంతోషం అనేది

మంచి సమాజం నుంచే సంక్రమిస్తుందనీ, ఆ సమాజంలో వ్యక్తులు సుగుణం ఆధారంగా జీవిస్తారనీ పేర్కొంటాడు. దాన్ని సాధించడం రాజకీయ స్వేచ్ఛ లేదా సమానత్వం, నియంత్రణ అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాలు మళ్ళీ శాసన బద్ధ మానవ రాజకీయ వ్యవస్థలో అంతర్భాగాలు.

నైతిక క్షీణతకు, అసౌకర్యాలకు హేతువయిన స్వార్థ ప్రయోజనాలనుంచి మానవుని కాపాడడంలో రూసో సిద్ధాంత ఔన్నత్యం ఉన్నదనేది వాస్తవమే అయినప్పటికీ, జనేచ్ఛను నిరపేక్షమైనదిగా గుర్తించడం విమర్శలకు గురైంది. మెజారిటి ఆదేశాల ద్వారా జనేచ్ఛ ఏర్పడుతుందనే దాని ఫలితంగా అధికారయుత వాదం, మైనారిటీ వాస్తవ దృక్పథ స్వేచ్ఛను తిరస్కరించడం ఉద్భవిస్తాయి. అయినా రూసో సిద్ధాంతం రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. అది ఒక వైపు విమోచన చూపుతుంది. మరొవైపు విమోచన కోసం పరితపించే నిజమైన మానవ ఆకాంక్షలను అణచి వేస్తుంది.

## 6.3 థామస్ పెయిన్ :

### 6.3.1 ఎడ్మండ్ బర్క్‌తో వాగ్వివాదం:-

'రైట్స్ ఆఫ్ మాన్' అనే గ్రంథంలో థామస్ పెయిన్ హక్కుల భావనను విశదీకరిస్తూ భావోద్వేగంతో ఈ హక్కులకై వాదిస్తాడు. ఈ ఉద్వేగం ఫ్రెంచి విప్లవానికి తన సంపూర్ణ మద్దతుద్వారా జనించిందే కాక, ఆ విప్లవ శైలిపై ఎడ్మండ్ బర్క్ ఏర్పరుచుకున్న దురభిప్రాయానికి నిరసనగా కూడా ఏర్పడింది, అమెరికన్ విప్లవంతో ఆయనకు గల సాన్నిహిత్యం దృష్ట్యా దీనికి కూడా బర్క్ ఘనంగా స్పందిస్తాడని పెయిన్ ఆశించాడు. అందువల్లనే ఎడ్మండ్ బర్క్‌ను ' మానవాళికి నేస్తం' గా పెయిన్ పేర్కొని పొగిడాడు. అయితే ఫ్రెంచి విప్లవంపై బర్క్ వెలువరించిన కరపత్రం పెయిన్‌కు ఆగ్రహన్ని కలిగించింది. దానిని 'వాస్తవాల వక్రీకరణగా', 'ఫ్రెంచి విప్లవం, స్వేచ్ఛల మూల సూత్రాల దారుణమయిన దుర్వినియోగంగా' పెయిన్ విమర్శించాడు, ఇదే విమర్శను కొనసాగిస్తూ ఫ్రాన్స్ దేశంపై బర్క్‌కు గల దురభిప్రాయాల ద్వారా ఈ అభిప్రాయాలు జనించాయో కాని ఫ్రెంచి విప్లవాన్ని నిజంగా విశ్లేషించడం ద్వారా జనించినవి కావని పేర్కొంటాడు. మానవ హక్కులపై చర్చకు 'రైట్స్ ఆఫ్ మాన్' లో వచ్చిన మేథోపరమైన వాదన ఎంతో విలువ నిచ్చింది.

పెయిన్ తన వాదనను ఒక పరిశీలన ద్వారా ఆరంభిస్తూ 1688వ సంవత్సరం ఆంగ్ల పార్లమెంట్ తన సమకాలీన అంశాలపై నిర్ణయాలు తీసుకోవడమే కాక కొన్ని ఊహాజనిత హక్కులను కూడా ఏర్పరచిందంటాడు. దీని వలన భావితరాలు దీనికి బద్ధులు కావాలి. ఈ ప్రయత్నాన్ని బర్క్ వంటి తాత్వికులు సమర్థించినప్పటికి థామస్ పెయిన్ వంటి ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించారు. పెయిన్ అభిప్రాయంలో 'ఒక పార్లమెంట్ కాని, లేదా ఏమానవ సంస్థ కాని, ఏ మానవ తరం కానీ, గతంలోనీ, భవిష్యత్‌లో కాని, ఎప్పుడైనా కానీ, ఏదేశం లోనూ భావితరాలను బద్ధులను చేసే నియంత్రణ హక్కును, అధికారాన్ని కాని కలిగి ఉండడానికి వీలులేదు' అలాగే ' భవిష్య ప్రపంచాన్ని ఎలా పరిపాలించాలి, ఎవరు పరిపాలించిలి అని నిర్దేశించడం తగదు. అందువలన దానికి సంబంధించి చట్టాలను, ప్రకటనలను, నిబంధలను తయారు చేసిన వారికి అలా చేసే హక్కు, అధికారం, వాటి అమలు అధికారం సంక్రమించలేదు. కాబట్టి అవన్నీ నిష్ఫలమైనవి, నిరర్థకమైనవి.' ఈ విషయంలో 'ప్రతి యుగానికి, తరానికీ తన వర్తమాన తరాల, యుగాల వలెనే స్వాతంత్ర్యం ఉండాలి' అని అతని అభిప్రాయం. సమాధినుంచి పాలించాలనే అర్థం లేని అవమానకర అహంకారధోరణి క్రూరత్వాల కంటే కూడా హేయమైనది. పెయిన్ విశ్వాసంలో ఒక తరం రూప కల్పన చేసిన చట్టాలు తరువాతి తరాల్లో సైతం అమల్లో ఉన్నప్పటికీ ఆ చట్టాలకు జీవించి ఉన్న వారి మద్దతు ద్వారానే బలం చేకూరుతుంది. ఒక చట్టం రద్దు కానప్పటికీ అమల్లో ఉంటుంది. ఎందుకంటే దాన్ని రద్దుచేయలేక కాదు అయితే అది రద్దు కాలేదు కాబట్టి ఉంటుంది. ఇక్కడ రద్దు చేయకపోవడానికి మద్దతు ఉంటుంది. ఈ విధమైన వాదన సంక్షిప్తంగా ఏమానవ తీరానికీ భవిష్యతరాల నిర్ణయాల హక్కును తిరస్కరించే అధికారం లేదని చెప్తుంది. అతని విశ్వాసంలో 'అనైతిక అధికారం ఒక మానవ హక్కు కాబోదు. అందువల్ల పార్లమెంట్ కు ఈ హక్కులేదు.' ఈ విధమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి, చైతన్యపూరిత ప్రాపంచిక దృక్పథం థామస్ పెయిన్ కు మానవ హక్కులపై గల మక్కువను తెలుపుతాయి.

BRAOU

ఫ్రెంచి విప్లవంపై బర్క్ ఘోరచిత్రీకరణను అక్షేపిస్తూ థామస్ పెయిన్ ' ఫ్రెంచి విప్లవానికి ఇతర దేశాల్లోని విప్లవాలతో పోల్చినప్పుడు, దానిలోని నిగూఢత అంతం అవాలంటే మనం అది వినాశనం చేసే అంశాలకు కారణమైన వ్యక్తుల పై కాక మూల సూత్రాలపై స్పందించాలి. జాతి మనస్సు నూతనోత్తేజంతో స్పందించడమనేది ఏ అంశాల కొసం వ్యక్తులు ఆకర్షితులైనారు, కొరుతున్నాడు అన్న దానిపై ఉంటుందే కాని, శత్రువు అపజయం ద్వారా ఏమి సిద్ధిస్తుందనే దానిపై కాదు.'

## 6.3.2 ప్రభుత్వ హింస - ఫ్రెంచి విప్లవం

బర్క్, ఫ్రెంచి విప్లవ సమయంలో ప్రజలు పాల్పడిన హింసను ముఖ్యంగా పైశాచికతను ప్రధానంగా ప్రస్తావిస్తాడు. కాని థామస్ పెయిన్, హింసను ప్రధానంగా హింసా మార్గాలను ప్రజల ప్రభుత్వం నుంచే నేర్చుకుంటారని భావిస్తాడు. పాశవిక హింసాపద్ధతులను ఆచరించే ప్రభుత్వాలు ప్రజలు కూడా ప్రతీ కారంతో అవే పద్దతులను పాటిస్తారన్న విషయాన్ని గ్రహించవు. పెయిన్ దృష్టిలో 'రక్త పిపాస గల శిక్షలు మానవ జాతిని చెడగోడతాయని' ఇంగ్లాండ్ లో కొన్ని కేసుల్లోని శిక్షల్లో ఉరిశిక్ష, శారీరక శిక్షలలో నిందితుని గుండెను బయటికి తీసి ముక్కలుగా కోసి మిగిలిన ప్రజలకు చూపడం మొదలైనవి ఉన్నాయి. 'ఫ్రాన్స్‌లో గత ప్రభుత్వం విధించిన శిక్షలు కూడా ఆటవిక మైనవే.' పెయిన్ విశ్వాసంలో 'ప్రజలకు చూపే ఈ పైశాచిక శిక్షా దృశ్యాలు వారిలోని సున్నిత మనస్తత్వాన్ని హరించి వారిలో ప్రతికారేచ్ఛను కలిగిస్తాయి. మౌలికంగా ప్రజలను హేతుబద్ధంగా కాక పీడన ద్వారా పాలించవచ్చనే భావన, శిక్షలు ప్రజలు అనుకరించడానికి ఉదాహరణలవుతాయి. మానవాళిలోని కనిష్ట స్థాయి ప్రజలను ప్రభుత్వం బల ప్రయోగం ద్వారా పాలించవచ్చునని నమ్మి తద్వారా దుశ్చర్యలకు పాల్పడుతుంది.' వాస్తవానికి దీని వలన పాలకులు పరిపాలన విషయంలో నైతికతతో కూడిన నిబంధనలు రూపొందిస్తే సాధారణ ప్రజలు కూడా వాటినే అనుసరిస్తారు. కాని పైశాచికత్వం పైశాచికత్వాన్నే అనుసరిస్తుంది.

## 6.3.3 సహజ హక్కులు - పౌరహక్కులు

పెయిన్ అమెరికన్ విప్లవాన్ని ఆహ్వానించాడు. ఎందువల్ల నంటే 'దాని వెంబడి ప్రభుత్వం మూల సూత్రాలు, ఆచరణలో విప్లవం రావడం,,....... ప్రభుత్వం నైతిక సిద్ధాంతం ప్రాతిపదికన ఏర్పడడం ......... మానవుని ఎదురులేని వారసత్వ హక్కులు....' వచ్చాయి. అతని సమకాలీన సమయంలో ఈ మానవ హక్కుల ఎదురులేని వారసత్వపు నైతిక సిద్ధాంతం అనేవి తాజాధోరణులే. ఈ విధమైన మానవ హక్కుల వక్కాణింపు గతంలో వచ్చిన (బర్క్ హక్కుల భావన సైతం) ప్రత్యేక వర్గాలకు సముదాయాలకు పరిమితమైన దైవదత్త, సాంప్రదాయ హక్కుల స్వభావాని కంటే భిన్నమైనది. హక్కుల విషయంలో మానవులను మానవులుగా, హక్కులతో పాలితులుగా, వారి సాంఘీకస్థితి నేపథ్యాలకు అతీతంగా పరిగణించారు. ఈ హక్కుల విషయంలో నిగూఢత ఏమీలేదు. వీటిని అందరూ అర్థం చేసుకొవడానికి గొప్ప మేథస్సు కూడా అవసరం లేదు. ఈ హక్కులు సహజమైనవి. ఏ మానవ చట్టం ద్వారా ఏర్పడలేదు కాబట్టి వీటిని తిరస్కరించడానికి, పరిమితం చేయడానికి రాజ్యం, సమాజం సహితంగా ఏమానవ సంస్థలకు వీలులేదు. అలాగే ఈ హక్కులను ఏ వ్యక్తీ మరొ వ్యక్తికి గాని, సంస్థకు గాని అప్పగించడానికి వీలు లేదు. ఇవి మానవుని నుంచి వేరు చేయలేనంత సహజమైన హక్కులు.

సహజ హక్కుల్ని, వాటి ప్రాముఖ్యాన్ని తరచుగా తెలిపే థామస్ పెయిన్ పౌరహక్కులను కూడా తెలిపి, ఈ రెండు రకాలు ఒకదాని నుంచి మరొకటి ఎలా ఉద్భవించాయో విశ్వసించాడు. ' మానవుడు సమాజంలోకి రావడం ద్వారా తన పూర్వస్థితి కంటే అధోస్థితికి మారాలని కోరుకోలేదు. కానీ ఆ స్థితిలోని హక్కులను మరింత భద్రంచేసుకొవాలని వాంఛించాడని' పెయిన్ బలంగా విశ్వశించాడు. అతని అభిప్రాయంలో 'అన్ని పౌరహక్కులకు మానవ హక్కులే పునాది.' అయితే మానవహక్కులకు పౌరహక్కులకు మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఈ భేదాన్ని పెయిన్ ఇలా పేర్కొంటాడు. 'మానవునికి తన స్వాభావిక మనుగడ ద్వారా సిద్ధించేవి సహజ హక్కులు, వ్యక్తిగా తన సౌకర్యం సంతోషాలకు వీలు కలిగించేలా, ఇతరుల సహజ హక్కులకు భంగం కలిగించని విధంగా ఉండే హక్కులు మొదలైనవి

BRAOU

ఉంటాయి. పౌర హక్కులు మానవునికి సమాజంలో సభ్యత్వం పొందడం ద్వారా సంక్రమిస్తాయి. ప్రతి పౌరహక్కు, వ్యక్తిలో అంతకుముందే నిక్షిప్తమైన ఏదో ఒక సహజ హక్కు పునాదిగా ఏర్పడిందే. అయితే వాటన్నింటిని అనుభవించడానికి కావల్సిన అధికారం వ్యక్తికి తగినంతగా ఉండేది కాదు. ఈ హక్కులు వ్యక్తి రక్షణకు, భద్రతకు చెందినవి.

పెయిన్ దృష్టిలో ఈ దృక్పదం ద్వారా 'ఈ రెండింటికి తేడా తెలుసుకోవడం వీలు కల్పించేలా రూపొందించుకున్న తరగతివి కాగా, సమాజ సభ్యత్వం ద్వారా వెలువడినవి పౌరహక్కులు' పెయిన్ ఈ అంశాన్ని విశదీకరిస్తూ ఇలా పేర్కొంటాడు. 'వ్యక్తి తనవద్దనే నిలుపుకున్న ఈ సహజ హక్కులు అంటే వ్యక్తి పూర్తి అధికారంతో అమలు చేసుకోగలిగే హక్కులు.' 'ఈ వర్గంలో' గతంలో పేర్కొన్నట్లు 'అన్ని మేధోపరమైన హక్కులు ఉంటాయి.' లేదా మనస్సుకు సంబంధించిన హక్కులుంటాయి. ఫలితంగా ఈ హక్కుల్లో మతం కూడా ఉంటుంది. వ్యక్తి తన వద్ద మిగుల్చుకొనని సహజ హక్కులపై వ్యక్తికి సంపూర్ణ హక్కు ఉన్నప్పటికి వాటిని అమలు చేసుకునే అతని అధికారం లోపభూయిష్టమైనది. ఈ హక్కులను వివరించడం పెయిన్ లక్ష్యం కాదు. ఒక వ్యక్తి తన సహజ హక్కుగా తన అవసరాలపై తానే న్యాయ నిర్ణయం చేసే హక్కు కలిగి ఉంటాడు, ఇక తన మనో సంబంధ హక్కుకు సంబంధించి ఎన్నడూ వదలుకోడు. కాని తను వినియోగించుకొనే అధికారం లేని హక్కుల కోసం వ్యక్తి ప్రశ్నిస్తాడు. ఈ కారణం వల్లనే ఈ రకమైన హక్కులను సమాజపు నిలువలో జమ చేసి, తాను సభ్యత్వం పొందిన సమాజం ద్వారా తన అభిరుచికి అనుగుణంగా సమాజ ఆయుధాన్ని పొందుతాడు. నిజానికి సమాజం అతనికి ఏమి ఇవ్వదు. అయితే ప్రతి వ్యక్తి సమాజ యజమానిగా ఉంటూ తన పెట్టుబడిపై ప్రయోజనం పొందే హక్కు కలిగి ఉంటాడు.

ఈ భావనల ద్వారా థామస్ పెయిన్ కొన్ని నిశ్చితాభిప్రాయాలను పేర్కొంటాడు. మొదటగా ప్రతి పౌరహక్కు ఒక సమాజ హక్కు నుంచి వృద్ధి చెందుతుంది. మరో విధంగా చెప్పాలంటే పౌరహక్కు అంటే మార్పుచెందిన సహజ హక్కు. రెండవది సమాజ అధికారం అనేది మానవుల అధికార లోపభూయిష్టత ద్వారా వదులుకున్న సహజ హక్కుల సమ్మేళనంతో జనించి, సాముదాయికంగా ప్రతి వ్యక్తికీ ఆ హక్కులపై అర్హత కల్పిస్తుంది.

మూడవది అసంపూర్ణ అధికారం కారణంగా వ్యక్తి సమాజానికి ఇచ్చివేసే సహజ హక్కుల ఫలితంగా ఏర్పడిన సాముదాయక అధికారాన్ని, వ్యక్తి పూర్తి అధికారంతో తన వద్దనే నిక్షిప్తం చేసుకున్న సహజ హక్కుల పై దాడి జరపడానికి వినియోగించరాదు. ఈ విషయంలో హక్కుతో పాటు అధికారంపై కూడా వ్యక్తిదే సంపూర్ణాధికారం. ఈ విధంగా థామస్ పెయిన్ సహజ మానవుని నుంచి సమాజ సభ్య మానవుని దాకా వ్యక్తిని శోధించి, దాని ద్వారా వ్యక్తి తన వద్దనే నింపుకున్న సహజ హక్కుల, మార్పిడి ద్వారా సంక్రమించిన పౌరహక్కుల ఔన్నత్యాన్ని తెలిపే సాహసం చేశాడు.

BRAOU

### 6.3.4 ప్రభుత్వ అవతరణ

ప్రభుత్వ అవతరణ పై థామస్ పెయిన్ వెల్లడించిన అభిప్రాయాలు మానవహక్కులపై చర్చకు ప్రాధాన్యత కలిగినవి. ప్రభుత్వాలు ఏర్పడడానికి కారణమైన అనేక మూలాలపై అతను సమీక్ష జరిపాడు. ఈ మూలాలను వర్గీకరించడం ద్వారా మూడు ప్రధాన కారణాలు ప్రభుత్వ అవతరణకు దారి తీశాయని పేర్కొంటాడు.

మొదటి మూఢ భక్తి రెండోది బలం మూడవది సమాజపు సామూహిక ప్రయోజనం, వ్యక్తి సాధారణ హక్కులు. పెయిన్ దృష్టిలో మొదటి మూలకం ద్వారా అర్చక పాలన, రెండోదాని వలన దురాక్రమణదారుల పాలన. మూడోదాని వలన అర్చక పాలన, హేతుబద్ధ పాలన ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. థామస్ పెయిన్ ప్రజాస్వామ్య స్వభావం ఈ పరిశీలన ద్వారా స్పష్టమౌతుంది, 'నేను మానవ సహజ గౌరవాన్ని తలుచు కున్నప్పుడు, నేను దానిలోని గొప్పదనం, సంతోషాల స్వభావాన్ని తెలుసుకుంటున్నప్పుడు (నా అనుభూతులను నగ్న పరిచే విషయం స్వభావ విరుద్ధమైనప్పటికీ) మానవ జాతిని బలప్రయోగం ద్వారా అనైతికంగా పాలించ వచ్చుననే ప్రయత్నం నాలో ఆగ్రహాన్ని కలిగించింది. మిగిలిన వారిని తేలికగా మోసగించవచ్చునని, తెలివి తక్కువ వారనీ, ఈ అసహ్యాకర పరిస్థితినుంచి తప్పించుకోలేమని నమ్మించవచ్చని వారు భ్రమించారు' ఈ కారణం వలననే సమాజం ద్వారా ఏర్పాటయ్యే ప్రభుత్వానికి, మూఢవిశ్వాసం. బల ప్రయోగప్రాతిపదికన ఏర్పాటయ్యే ప్రభుత్వానికి మధ్యగల వైరాధ్యాన్ని తెలపడానికి పెయిన్ ఎంతో కష్టించాడు.

పెయిన్ వాదనలో ప్రభుత్వమనేది సమాజ ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందపు భాగస్వామి కాదు. ఇలా చూస్తే ఫలితాన్ని ముందు గుర్తించి కారణాన్ని వదలి వేయడం అవుతుంది. నిజానికి ప్రభుత్వం ఏర్పాటుకు ముందే మానవ మనుగడ ఉండింది. పెయిన్ అభిప్రాయంలో 'గతంలో ఒక దశలో మానవాళికి ప్రభుత్వమనేది లేదు. ఒప్పందం రూపకల్పన చేయడానికి పాలకులు కరువైన సందర్భం కూడా ఉంది.' అలాంటి సందర్భంలో 'ప్రజలతో వారంతట వారే ప్రతివ్యక్తీ తనలోని వ్యక్తిగత, సార్వభౌమాధికార హక్కుతో ఒక ఒప్పందం ద్వారా ప్రభుత్వ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందువల్ల ఈ ఒక్క పద్ధతి ద్వారా మాత్రమే ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. ఈ ఒక్క మూల సూత్రం ఆధారంగానే అవి మనుగడ సాగించే హక్కు కలిగి ఉన్నాయి.' అని పేర్కొంటాడు. ప్రభుత్వ అవతరణను తెలిపే ఏ అంశమైనా' ప్రభుత్వమనేది ప్రజల నుంచి కాని, ప్రజల బాహ్యం నుంచి ఏర్పాటైనదేనని' తెలుపుతుంది. అందువల్ల ప్రజల నుంచి ఏర్పడిన ప్రభుత్వాల మనుగడ ఎంతోకాలం ఉంటుంది. ప్రజల బాహ్యం నుంచి ఏర్పాటైన ప్రభుత్వాలు ఎంతో కాలం మనుగడ సాగించ లేవు. అలాంటి ప్రభుత్వాలు ఏదో ఒక సంద్భంలో కూలిపోతాయి.

### 6.3.5 ప్రభుత్వం, రాజ్యాంగం, హక్కులు

ప్రజల నుంచి ఏర్పడిన ప్రభుత్వం రాజ్యాంగాన్ని వాంఛిస్తుంది. పెయిన్ అభిప్రాయంలో రాజ్యాంగమనేది పేరుకే కాక వాస్తవ రూపంలో ఉంటుంది. అది ఆదర్శవంతమైనది కాదు కానీ వాస్తవ మనుగడ ఉంటుంది. ఎక్కడైతే రాజ్యాంగానికి చలనశీలత ఉండదో, అది లేనట్లే. అలాగే 'రాజ్యాంగం ప్రభుత్వానికి ఉదాహరణ వంటిది. ప్రభుత్వం రాజ్యాంగ నిర్మితమే. ఒక దేశపు రాజ్యాంగమనేది ప్రభుత్వ చట్ట మనడం కంటే ప్రజా సమూహ ప్రభుత్వ భావన అంటే సరిపోతుంది.'

ఇంకా విపులీకరిస్తూ 'రాజ్యాంగ మనేది ఎన్నో మూలకాలతో నిర్మితమై ఉండి నీవు దర్శించవచ్చు. నిబంధన నుంచి నిబంగ్న పేర్కొనవచ్చు. ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన మూల సూత్రాలు తెల్సుకోవచ్చు. ప్రభుత్వం ఏవిధంగా వ్యవస్థీకృతం కావాలి, అధికారాలు ఉండాలి అనే అంశాలు, ఎన్నికల పద్ధతి, పార్లమెంట్‌ల కాలపరిమితి లేక ఇతర పేర్లతో ఉండే పార్లమెంట్ లాంటి సంస్థలు మొదలైన వాటి అంశాలు. ప్రభుత్వంలోని కార్యనిర్వాహక వర్గపు అధికారాలు ఏమి ఉండాలి అనే అంశాలు, ఆఖరకు పౌర ప్రభుత్వాన్ని సంపూర్ణంగా వ్యవస్థీకరించే అన్ని అంశాలు. ఆ ప్రభుత్వాల కార్యాచరణ లోని మూల సూత్రాలు, కార్యాచరణ పద్ధతి, ఆ ప్రభుత్వాలు దేనికి బద్ధులై ఉండాలనే అంశాలు' ఉంటాయి.

BRAOU

ముగింపుగా ఒక పరిశీలన చేస్తూ 'ప్రభుత్వానికి ఒక రాజ్యాంగమనేది ప్రభుత్వం రూపొందించే చట్టాలు న్యాయ శాఖకు ఎంత అవసరమో అంతే అవసరాన్ని కలిగి ఉంటుంది.' అయితే పెయిన్ అభిప్రాయంలో 'న్యాయ వ్యవస్థలోని కోర్టు చట్టాలను రూపకల్పన చేయలేదు. అలాగే వాటిని సవరించలేదు. తయారు చేసిన చట్టాలకు అనుగుణంగా కార్యాచరణ చేస్తుంది. ఈ విధంగా ప్రభుత్వం కూడా రాజ్యాంగం ద్వారా పాలించబడుతుంది.

## 6.4 ముగింపు

రూసో, థామస్ పెయిన్ ఇద్దరూ వారి రచనల్లో రాజ్యావతరణను శోధించారు. రాజ్యాని కంటే సమాజమే ముందు ఉద్భవించిందని ఇద్దరూ నమ్మారు. ఈ భావన ద్వారా రాజ్యం సమాజంలో అంతర్భాగం అనే అంశం కంటే సమాజపు ఉపకరణంగా గుర్తింపు పొందుతుంది.

అయితే రూసో, వ్యక్తి తన ఇచ్ఛను సాంఘీక ఇచ్ఛకు విధేయంగా తద్వారా మాత్రమే హక్కులు అనుభవించగలడనీ పేర్కొంటాడు. జనేచ్ఛ భావన ద్వారా వ్యక్తి కంటే సముదాయానికి ప్రాధాన్యత నిస్తాడు. అయితే అతని విశ్లేషణలోని పరిమితి ఏమంటే ప్రతిపాదించిన జనేచ్ఛ ఒక అది భౌతిక రూపకల్పన కాగా రాజ్యం ఒక నిర్దిష్టమైనది. రాజ్య వ్యవస్థ ఎల్లప్పుడూ తన పరిధులను దాటి జనేచ్ఛకు ప్రత్యామ్నాయంగా విస్తరించాలని కోరుకుంటుంది. ఈ అంశం మానవ

హక్కుల ఆచరణకు అభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తుంది.

థామస్ పెయిన్ దృక్పథం కొన్ని విధాలుగా భిన్నమైనది. సమాజం పట్ల, ప్రభుత్వాలను మార్చ గలిగే సమాజపు హక్కు పట్ల పెయిన్ కు అత్యంత విశ్వాసం ఉంది. మానవ జాతి తమ మనుగడ స్థితిని మెరుగుపరుచుకునేందుకే రాజ్యం, సమాజం ఏర్పాటుకు మొగ్గు చూపిందని పెయిన్ బలంగా విశ్వసించాడు. ప్రాకృతిక స్థితిలో మానవులు విడదీయరాని సహజ హక్కులను అనుభవించేవారు. సమాజ నిర్మాణం ద్వారా మాత్రమే పౌరహక్కుల భావన వెలుగుచూసింది. అందువల్ల పౌరహక్కుల్లో సహజ హక్కులు అంతర్భాగమనీ, వాటిని అభివృద్ధి పరచాలే కాని, ఆ మౌలిక హక్కుల్ని హరింపజేయడం తగదని వాదిస్తాడు. ముగింపు వాక్యంగా థామస్ పెయిన్ మానవాళి హక్కుల పట్ల గొప్ప విశ్వాసం కలిగిన తత్త్వవేత్తగా పేర్కొనవచ్చు.

ఈ ఇరువురి తాత్త్విక చింతన, దృక్పథాలు ఆ తరువాత కాలంలో మానవ హక్కులపై వచ్చిన యూరోపియన్ తత్త్వ విచారంపై ఎంతో ప్రభావం చూపింది.

## 6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. వ్యక్తి, సమాజం, ప్రభుత్వం మధ్య సంబంధాలపై రూసో దృక్పథాన్ని వివరించండి ?
2. రూసో ప్రతిపాదించిన జనేచ్ఛ భావనను పరీక్షించండి ?
3. రూసో స్వేచ్ఛ భావనను వివరించండి ?
4. ఎడ్మండ్ బర్క్‌తో థామస్ పెయిన్ ఎందువల్ల వాగ్వివాదానికి దిగాడు?
5. అపరిమిత స్వేచ్ఛను అనుభవించే మానవుడు సముదాయానికి లొంగిపోవడానికి థామస్ పెయిన్ పేర్కొన్న కారణాలు ఏవి?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.**

1. రాజ్యాంగ బద్ధ ప్రభుత్వపాలన అవసరాన్ని చర్చించుము?
2. హక్కులపై రూసో, థామస్ పెయిన్ ల అభిప్రాయాల్లోని పోలికలను, భేదాలను తెలపండి?
3. మానవ హక్కుల తత్త్వానికి రూసో, థామస్ పెయిన్‌ల చేసిన కృషిని విమర్శనాత్మకంగా అంచనా వేయండి?

BRAOU

# భాగం - 7 : లాక్, మిల్, డైసీ, రస్సెల్, రాల్స్, డ్వార్కిన్

**విషయక్రమం**


7.0 ఉద్దేశం

7.1 పరిచయం

7.2 జాన్‌లాక్

7.3 జె.ఎస్.మిల్

7.4 ఎ.వి.డైసే

7.5 బెర్ట్రాండ్ రస్సెల్

7.6 జాన్ రాల్స్

7.7 రోనాల్డ్ డ్వార్కిన్

7.8 ముగింపు

7.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 7.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

- ఉదారవాద హక్కుల సిద్ధాంతం గూర్చి తెలుసుకుంటారు.
- జాన్‌లాక్, జె.ఎస్.మిల్‌ల భావనలు అవగతం చేసుకుంటారు.
- బెర్ట్రాండ్ రస్సెల్, జాన్‌రాల్స్‌ల సిద్ధాంతాలు వివరించగలుగుతారు.

## 7.1 పరిచయం

ఉదారవాద సిద్ధాంతంలో హక్కులపై ముఖ్యంగా రెండు రకాల వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఒక రకమైన వ్యాఖ్యానానికి ఆలంబన సహజహక్కుల సంప్రదాయం కాగా, మరో రకం వ్యాఖ్యానానికి సంవర్థక హక్కుల (పాజిటివ్ రైట్స్) సంప్రదాయం ఆధారంగా ఉంది. తొలి సిద్ధాంతం ప్రకారం మనుషులకు సహజసిద్ధంగానే కొన్ని హక్కులుంటాయి. వారు ఒక నైతికవర్గానికి చెందిన కారణంగానో, ఒక న్యాయక్రమాన్ని ఆశ్రయించుకొని వున్న కారణంగానో కాకుండా కేవలం మనుషులయిన కారణంగానే వారికి కొన్ని హక్కులు, ఒకరిపై ఒకరికి అధికారం ఉంటాయి. ఈ హక్కులు మానవ నిర్మాత వ్యవస్థల పరస్పర ఒడంబడికలకంటే పూర్వం నుంచే చాలా మందిలో ఉంటూ వస్తున్నాయి. ఈ హక్కుల సగభాగం రుణాత్మకంగా వుండడంతో పాటు ఈ హక్కుల్లో కలగజేసుకునే అధికారం రాజ్యానికి వుండదు. ప్రాకృతిక న్యాయం అనేది ఒకటి అనాదిగా ఉంటుంది. అదే సహజహక్కులకు ఆధారమని ఈ సిద్ధాంతాన్ని విశ్వసించే వారి అభిప్రాయం. ప్రాకృతిక న్యాయం దైవనిర్ణయానికి అనుగుణంగా సాగుతుందని లాక్, అది భౌతిక జీవధర్మం వల్ల కొనసాగుతుందని అరిస్టాటిల్ పేర్కొన్నారు. సహజ న్యాయం అనాదిగా ఉంటుందా ? లేదా అన్న మీమాంస పక్కనబెడితే, సహేతుక లౌకిక దృష్టితో ఆలోచించినప్పుడు కొన్ని రకాల న్యాయాలను లేదా ధర్మాలను సహజ న్యాయాలుగా పేర్కొనడానికి ఆస్కారం ఉంది. సమాజంలోని ప్రజలు సాఫీగా మనుగడ సాగించడానికి లేదా ఒక మహత్తర ఉమ్మడి లక్ష్యాన్ని సాధించటానికి విధిగా కొన్ని నియమాలకు తలవొగ్గక తప్పని స్థితి మానవ స్వభావమే కల్పిస్తున్నది. ఇలాంటి నియమాలే సహజన్యాయాలు కావచ్చు.

BRAOU

ఇక సంవర్ధక హక్కుల సంప్రదాయానికి లీగల్ పాజిటివిజానికి దగ్గర సంబంధం వుంది. లిఖిత లేదా క్రోడీకరించిన న్యాయసూత్రాలను సహేతుకంగా వ్యాఖ్యానించడమే లీగల్ పాజిటివిజం. సంక్షేమ ఉదారవాదానికి సంవర్ధక హక్కుల సంప్రదాయానికి కూడా దగ్గర సంబంధమే వున్నది. సమాజంలోని ప్రతివ్యక్తికి ఇతర వ్యక్తులపై హక్కులు వుంటాయి. అదే సమయంలో తన వ్యవహారాల్లో ఇతరులు కలగజేసుకోకుండా నిరోధించే హక్కులు కూడా ప్రతివ్యక్తికి వుంటాయి. నైతిక కోణం నుంచి చూసినా, న్యాయాన్యాయాల దృష్టితో చూసినా ఈ రెండు రకాల హక్కులు, అన్ని విధాలుగా సమానమైనవని చెప్పవచ్చు. చారిత్రకంగా, 18, 19 శతాబ్దాల నాటి హేతుబద్ధ సంస్కరణ ఆలోచనాధోరణి, లీగల్ పాజిటివిజానికి మూలాధారమని పేర్కొనవచ్చు. మరి ముఖ్యంగా చెప్పాలంటే ఉపయోగితావాదంలోంచే ఇది పుట్టుకువచ్చింది. బెంథామ్ ఉపయోగితావాదంలో వైయక్తిక హక్కులకు స్థానం లేదనే అభిప్రాయం ఒకటి వుంది. సంఘం సమిష్టి ప్రయోజనాల దృష్ట్యా విధిగా నిర్వర్తించాల్సిన విద్యుక్త ధర్మాల తర్వాతనే హక్కుల ప్రస్తావన వుంటుంది. ఈ విద్యుక్త ధర్మాలను, సమాజ స్థూల ప్రయోజనాల దృష్ట్యా నిర్వచిస్తారు. బెంథామ్ నుంచి మిల్ దగ్గరకు వచ్చేసరికి, ఏది తప్పు, ఏది ఒప్పు అనే మీమాంసతో కూడిన నైతిక సిద్ధాంతంగా ఉపయోగితావాదం మారింది. ఉపయోగితావాదం సూత్రాలు, విధిగా అమలు చేయాల్సిన నైతిక ధర్మాలను, హక్కులను నిర్వచించాయి. అయితే ఈ తరహా ఉపయోగితా వాదాన్ని ప్రాచీన ఉదారవాదులు ససేమిరా అంగీకరించరు. వ్యక్తి స్వేచ్ఛా పరిరక్షణ సంక్షేమ అభివృద్ధికి చుక్కెదురు కాదను విషయం అంగీకరిస్తే తప్ప ఈ రకం ఉపయోగితావాదాన్ని ఉదారవాదులు ఒప్పుకోరు. అలాంటి భావనే లేకుంటే ఉపయోగితావాదంలో నైతికహక్కులు, విధులు ప్రాతిపదికనే ఉండదని వారు అంటారు.

కాంట్ సిద్ధాంతాలు ప్రాచుర్యంలోకి వచ్చిన తర్వాత గాని రెండు దృక్పధాల్లోని తేడాలు స్పష్టంగా అవగాహనలోకి రాలేదు. కాంట్ మానవస్వభావం, సంక్షేమం వంటి వాటిని తన సిద్ధాంతాలను ఆలంబనగా చేసుకోలేదు. ప్రతిమనిషి ఒక భావ సాధనంగా కాకుండా తానే లక్ష్యంగా చూసే దృష్టి నుంచి మనుషులు నిర్దిష్టమైన హక్కులను కలిగివుంటారనే భావన పుట్టుకొచ్చిందని కాంట్ అంటారు. "వ్యక్తులు స్వయం స్వతంత్రులైన బుద్ధిశాలులైన ఉపసంహరణలు. అందువల్ల మనుషులకు గరిష్టస్థాయిలో సమానస్వేచ్ఛ ఇవ్వాలనే సిద్ధాంతం, సార్వత్రికత ప్రాతిపదికన పూర్తిచేస్తుంది." అని కాంట్ అంటారు. ఒక చేత్తో నైతిక సాపేక్షత వాదాన్ని మరోచేత్తో ఉపయోగితావాదాన్ని ఎదుర్కొన్న కారణంగా 20వ శతాబ్దంలో కాంట్ సిద్ధాంతం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. కాంట్ సంప్రదాయాన్ని అనుసరిస్తూ రాల్స్ తన హక్కుల సిద్ధాంతానికి కనీస నైతిక పరికల్పనలను, విలువలకు సంబంధించిన వైయక్తిక భావనలను ఆధారం చేసుకున్నారు. సహజహక్కుల సిద్ధాంతానికి ఆపాదించిన సార్వత్రికతను అదే సమయంలో ఉపయోగితావాదం నైతిక విలువలు తెచ్చిపెట్టే సమస్యలను పక్కనబెట్టి, ఉత్తమజీవితం అంటే ఏమిటో సొంతంగా నిర్వచించలేని అజ్ఞానంలో ఉన్న వ్యక్తులకు ఆమోదయోగ్యమైన పరిస్థితులు కల్పించగల రాజ్యాంగ సూత్రాలు కావాలని రాల్స్ అంటారు. జాన్‌లాక్, జె.ఎస్.మిల్ తమ రచనల ద్వారా విస్తృత ప్రచారంలోకి తెచ్చిన రెండు ప్రధాన ధోరణులను ఈ పాఠ్యభాగంలో మనం చదువుతున్నాం. అదే విధంగా ఎ.వి.డైసే లీగల్ పాజిటివిజాన్ని బలంగా ప్రతిపాదిస్తాడు. బెర్ట్రాండ్ రస్సెల్ ఉదారవాద సిద్ధాంతాలను మొత్తంగానే శంకిస్తారు. రాల్స్, డ్వార్కిన్ రచనల్లో సమకాలీన ప్రతిస్పందనలు, పాత సిద్ధాంతాలను - అభివృద్ధి చేయడం గమనించవచ్చు.

## 7.2 జాన్‌లాక్

జాన్‌లాక్‌తోనే మానవహక్కుల భావన రాజకీయ వేదిక మధ్యలోకి దూసుకు వచ్చింది. వ్యక్తుల హక్కులకు, ప్రభుత్వానికి సంబంధంలేదని ప్రభుత్వాలు అంటూ ఏర్పడడానికి ముందునుంచే మనిషికి హక్కులు ఉన్నాయని లాక్ అంటారు. తన సిద్ధాంతాన్ని రుజువు చేసేందుకు, ప్రభుత్వ పాలన సిద్ధాంతాన్ని లాక్ ప్రాకృతిక వ్యవస్థ విశ్లేషణతో ప్రారంభించారు. లాక్ పేర్కొన్న వ్యక్తికి జీవించే హక్కు మాత్రమే కాకుండా స్వేచ్ఛ హక్కు, ఆస్తి హక్కు కూడా అనాదిగా ఉన్నాయి. ప్రభుత్వం లోపలా బయట కూడా వ్యక్తులకు వున్న ఈ హక్కులే లాక్ తన హక్కుల భావనని విస్తృతపరిధిలో వివరించడానికి ప్రాతిపదికగా ఎలాంటి మినహాయింపులు లేకుండా వ్యక్తులందరికీ ఈ హక్కులు ఉంటాయని ఆయన అంటారు. ప్రాకృతిక వ్యవస్థలో సమానత్వాన్ని ఎలా సంభోదిస్తాయో అలాగే హక్కుల స్థానాన్ని సమానత్వమే ప్రభావితం చేస్తుందని లాక్ భావించారు.

BRAOU

వ్యక్తుల హక్కులను సమర్థించడానికి సహజన్యాయ సిద్ధాంతాన్ని లాక్ ప్రయోగించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతివ్యక్తి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జన్మిస్తాడు. తన జీవితాన్ని, స్వేచ్ఛను ఆస్తులను కాపాడాలంటే తనను తాను ఉన్నతంగా మలచుకోవడానికి సహజన్యాయం ద్వారా సంక్రమించిన అన్ని రకాల హక్కులని నిరాటంకంగా అనుభవిస్తాడు. దేవుడు మనుషులను సృష్టించడమే కాకుండా జీవితంలో అత్యుత్తమమైనవి సాధించాలనే కాంక్షను, సాధించగల అంతర్గత సామర్థ్యాన్ని ప్రసాదిస్తాడు. అందువల్ల వైయక్తిక హక్కులు అనేవి సహజన్యాయం నుంచి సంగ్రహించబడిన సహజహక్కులే తప్ప వేరు కావు. ప్రాకృతిక వ్యవస్థలో కూడా ఈ హక్కులు ఉన్నాయని పేర్కొనడం ద్వారా, ప్రభుత్వం అంటూ ఒకటి వున్నా లేకున్నా వ్యక్తుల హక్కులకు మాత్రం ఎలాంటి భంగం కలగదని వివరించడానికి లాక్ ప్రయత్నించారు.

ప్రాకృతిక వ్యవస్థలో హక్కు అంటే ఒకరిపై మరొకరికి వుండే అధికారం. ప్రతివ్యక్తికి తన ఎదుటివారిపై అధికారం ఉంటుంది. పౌరసమాజం ఏర్పడిన తర్వాత అధికారం రాజ్యవ్యవస్థపైకి కూడా విస్తరిస్తుంది. తన వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారాల్లో రాజ్యప్రమేయాన్ని వ్యక్తి నిరోధించగలుగుతాడు.

జీవితం, స్వేచ్ఛ ఆస్తికి సంబంధించిన తన సహజ అధికారాలని రాజ్య వ్యవస్థకు ధారాదత్తం చేయడానికి వ్యక్తి ఎప్పుడూ ఇష్టపడడని లాక్ అంటారు. అవగాహన రాహిత్యం లేదా ఒత్తిళ్ళవల్ల ఎవరైనా వ్యక్తి ఈ మౌలిక హక్కులని రాజ్యపరం చేస్తూ ఒప్పందంపై సంతకం చేస్తే ఆ ఒప్పందం చెల్లుబాటు కాదు. ఒకవేళ ఏదైనా ప్రభుత్వం తన పౌరులకు ఈ సహజహక్కులను తృణీకరించడానికి ప్రయత్నిస్తే, ఆ ప్రభుత్వం తన పౌరులని మనుష్యులుగా కాకుండా మనిషికంటే అథమజాతి జీవిగా ఉండే పరిస్థితులని సృష్టిస్తున్నదన్న మాట. వ్యక్తుల హక్కులని పర్యవేక్షించే సహజన్యాయాన్ని అమలుచేయడంలో వున్న ఇబ్బందుల దృష్ట్యానే వ్యక్తులు ఒడంబడిక ద్వారా సమాజంగా ఏర్పడతారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ప్రభుత్వం వ్యక్తులకు కొత్తగా ఎలాంటి హక్కులని సృష్టించి ఇవ్వదు. తమ సహజహక్కుల రక్షణకోసం వ్యక్తులే ప్రభుత్వాన్ని సృష్టిస్తారు. రాజ్యాంగం ద్వారా హక్కుల బిల్లు ద్వారా సహజహక్కులకు చట్టబద్ధమైన గుర్తింపును ప్రభుత్వం ఇస్తుంది. అందువల్ల ప్రాకృతిక వ్యవస్థ నుంచి బయటపడి సమాజ జీవనంలోకి అడుగుపెట్టిన వ్యక్తులు, తమ హక్కుల పరిరక్షణను సమర్థవంతంగా, నీతివంతంగా ప్రభుత్వం నిర్వహించాలని ఆకాంక్షిస్తారు. విఫలమైన ప్రభుత్వం లేదా పాలకుడు, ఒడంబడిక ద్వారా తనకు సంక్రమించిన అధికారాన్ని ఉల్లంఘించినట్టు తనకు వ్యక్తులు ధారాదత్తం చేసిన అధికారాన్ని సదరు ప్రభుత్వం దుర్వినియోగం చేసినట్టు పరిగణించాల్సి వుంటుంది.

BRAOU

ఏ ప్రభుత్వమైనా సహజహక్కుల పరిరక్షణకు తన శక్తిని, న్యాయ అధికారాన్ని వినియోగించని పక్షంలో, వ్యక్తులే స్వయంగా ఈ స్వేచ్ఛని కాపాడుకోవడానికి తమ శక్తిని, అధికారాన్ని వినియోగించుకోవచ్చు. తమ హక్కులను కాపాడలేని ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవించి, ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసే అధికారం పౌరులకు వుంటుంది. అందువల్ల రాజకీయ సిద్ధాంతంలో ఏ ఇతర భావనలకన్నా సహజహక్కుల భావనే వ్యక్తికి అత్యధిక సైద్ధాంతిక బలాన్ని సమకూర్చింది.

## 7.3 జె.ఎస్.మిల్

వ్యక్తి స్వేచ్ఛ పరిధిని విశ్లేషించడంలో మిల్ సహజ హక్కుల సిద్ధాంతాన్ని ఉపయోగించలేదు. నైతికపరమైన సమస్యలకు అంతిమ సమాధానం ఉపయోగితావాదంలోనే వున్నదని మిల్ భావించారు. స్వేచ్ఛపై రాసిన తన సుప్రసిద్ధ వ్యాసంలో, వ్యక్తులపై సమాజం నియంత్రణ పరిధిని ఏది నిర్దేశిస్తుందనే అంశాన్ని ఒక సాదాసీదా సూత్రంలో మిల్ వివరించారు. ఆత్మరక్షణ హేతువుగా వున్న సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా గాని, మూకుమ్మడిగా గాని ఇతరుల స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకునే అధికారం మనుష్యులకు ఉంటుందని తన సూత్రంలో మిల్ వివరించారు.

ఇతరులకు హాని జరుగుతుంది, దానిని నివారించాలని భావించిన సందర్భాల్లో మాత్రమే ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తుల స్వేచ్ఛ విషయంలో బలవంతంగా కలగజేసుకునే అధికారాన్ని వినియోగించాలి. కేవలం తన వ్యక్తిగత శ్రేయస్సు, లబ్ధి కోసం ఇతరుల స్వేచ్ఛలో కలగజేసుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఒక వ్యక్తి యొక్క

ఆలోచనలు, కార్యకలాపాలను స్వార్థానికి సంబంధించినవి, సమయానికి సంబంధించినవి అని రెండురకాలుగా మిల్ వర్గీకరించారు. ఒక వ్యక్తి చర్యలు, ఆలోచనలు ఇతర వ్యక్తులకు హాని కలిగించేవిగా, వారి హక్కులు, స్వేచ్ఛకు విఘాతం కలిగించేవిగా వున్నప్పుడు చట్టపరమైన చర్యకు ఆ వ్యక్తి అర్హుడవుతాడు. అలా కాకుండా ఆ వ్యక్తి చర్యలు, ఆలోచనల వల్ల ఇతరులకు ఎలాంటి అపకారం జరగకుండా, వాటి పర్యవసానాలకు పూర్తిగా అతడే బాధ్యుడు - భోక్త కూడా అయినపుడు చట్టపరంగా వాటిని పట్టించుకోవలసిన అవసరం లేదు.

ఒక వ్యక్తి ప్రవర్తనలో సమాజానికి బాధ్యత వహించే విభాగాన్ని ప్రత్యేకంగా గిరిగీసి చూసే ప్రయత్నం మిల్ చేసాడు. ఇతరుల ప్రయోజనాలకు భంగం కలిగించని ప్రవర్తన ఈ విభాగంలో ముఖ్య అంశం. సహజ అవగాహన రీత్యాగాని, చట్టంలోని నిబంధనల ప్రకారంగాని మనం హక్కులుగా పరిగణించే వ్యక్తుల ప్రయోజనాలు కొన్ని ఉంటాయి. వ్యక్తుల్లో ఈ హక్కులని వినియోగించుకునే సామర్థ్యం స్వేచ్ఛగా అభివృద్ధి కాకుండా జోక్యం చేసుకునే ప్రయత్నం వ్యవస్థ ఎప్పుడూ చేయరాదు. ఈ సామర్థ్యాన్ని ధైర్యంగా, సృజనాత్మకంగా ఉపయోగించుకోగలిగే పరిస్థితి వ్యక్తులకు ఎప్పుడూ వుండాలి. అప్పుడు మాత్రమే జీవితపు అత్యుత్తమ పార్శ్వాన్ని వారు అందుకోగలరు. స్వతంత్ర ఆలోచన, సృజనాత్మక శక్తికి పదునుపెట్టడం, సత్యాన్వేషణకు శాయశక్తుల కృషిచేయడం ద్వారా మాత్రమే మనిషి తన జీవితానికి సార్థకత సాధించగలరు. ప్రతివ్యక్తిలోను సహేతుక ఆలోచన, సహేతుక కార్యనిర్వహణకు సంబంధించిన సామర్థ్యం వుంటుందని మిల్ అభిప్రాయం. ఈ సామర్థ్యాన్ని శక్తియుక్తులని అభివృద్ధి చేసుకునే అవకాశం కొందరు వ్యక్తులకు ఎక్కువగా వున్నప్పటికి, యావత్ జనాభాకు ఈ అవకాశాలు సమానంగా పంపిణీ అయివుంటాయి. అందుకే రాజకీయ ప్రక్రియలో విద్య అవిభాజ్యంగా వుండాలని మిల్ అంటారు. ఇక్కడ అభిప్రాయం అందరు వ్యక్తులు సహేతుకంగా ఆలోచిస్తారని, ప్రవర్తిస్తారని కాదు. అయితే ఆ దిశలో ప్రోత్సాహం తప్పనిసరిగా అందించాలని మాత్రమే. అందువల్ల వ్యక్తుల హక్కుల్లోని ప్రధానమైనది ఆలోచనా స్వేచ్ఛ, చర్చ స్వేచ్ఛ అని మిల్ అంటారు. "ఒక్క మనిషి తప్ప మొత్తం మానవాళి అభిప్రాయం అంతా ఒకరకంగా వుండి, ఆ ఒక్క వ్యక్తి అభిప్రాయం తద్విరుద్ధంగా వుంటే ఆ వ్యక్తి నోరు మూయించే ప్రయత్నం తక్కిన మానవాళి చేయడాన్ని సమర్థించజాలము. ఒకవేళ ఆ వ్యక్తి సర్వశక్తిమంతుడై తక్కిన మానవాళి నోరు మూయించే ప్రయత్నం చేస్తే అది ఎంత అమానుషమో, ఆ మనిషి నోరు మూయించడానికి మానవాళి చేసే ప్రయత్నంకూడా అంతే అమానుషం కాగలదు." అంటారు మిల్.

సత్యాన్వేషణకు మనిషి ఆలోచనల్లో, చర్చల్లో పూర్తి స్వేచ్ఛ అవసరమని మిల్ నిశ్చితాభిప్రాయం. మనకో స్థిర అభిప్రాయం వుండి అదే నిజమని సమర్థించుకోగల విశ్వాసం వుండాలంటే ఆ నిజాన్ని తెలుసుకోవడానికి ఎన్నో విమర్శలని, అవాంతరాలను ఎదుర్కొన్నామన్న జ్ఞానం వుండాలి. ఒక విషయం అది పూర్తిగా సత్యమని మనకు తెలిసినప్పటికి దానికి వ్యతిరేకంగ వున్న అభిప్రాయ తప్పయినపుడు దానిని తొక్కివేయడానికి ప్రయత్నం చేయరాదు. అలా చేస్తే అది సత్యంపట్ల అపచారమే కాగలదు. సత్యమైన విషయం ప్రామాణికతను పరిరక్షించే అవకాశాన్ని మనం తిరస్కరిస్తున్నామన్న మాట. ఒక సత్యం ఎన్ని ఎక్కువ పరీక్షలకు తట్టుకుని నిలబడితే దానికంటే ఎక్కువ ప్రామాణికత సిద్ధిస్తుంది. పరీక్షలకు తట్టుకొని నిగ్గుదేలని విషయాన్ని సత్యంగా అంగీకరించడానికి కారణాలు కూడా తక్కువగా ఉంటాయి. సత్యంగా వికసించడానికి తగిన బలం, ప్రాధాన్యత కూడా తక్కువగా ఉంటాయి.

సత్యాన్వేషణ, ఆత్మశోధన ఏకకాలంలో జరగాలి. ప్రచారంలో వున్న ప్రజాభిప్రాయం, సామాజిక ఆచారాల నీడలు పడకుండా వ్యక్తిత్వం స్వేచ్ఛగా వికసించాలని మిల్ కోరుతారు. ప్రతివ్యక్తికి సొంత అభిప్రాయాలు ఏర్పర్చుకోవడానికి, తన జీవితానికి సంబంధించిన ప్రణాళికలని సొంతంగా నిర్ణయించుకోవడానికి పూర్తి స్వేచ్ఛ వుండాలి. సామాజిక సంప్రదాయాలను, ఆచారాలను ఒక కుదుపు కుదపగల సామర్థ్యం వున్నందున అవసరమైతే దుందుడుకువాద ధోరణులను సమర్థించడానికి కూడా మిల్ స్థిరపడ్డారు. నిజంగా దుందుడుకుతనాన్ని మిల్ సమర్థించలేదు. అయితే ప్రతివ్యక్తి తన స్వీయశక్తి సామర్థ్యాలు, ప్రతిభావ్యుత్పత్తులకు అనుగుణంగా తన జీవిత గమ్యాన్ని నిర్ణయించుకొని తన జీవితాన్ని తానే తీర్చిదిద్దుకోగల సమాజాన్ని ఆయన కాంక్షించారు. మిల్ ఇక్కడి వాదనలకు, భావప్రకటన స్వాతంత్ర్యం కోసం చేసిన వాదనలకుసాంగత్యం వుంది. వ్యక్తుల జీవితపథంలో ఎంత వైవిధ్యం, భిన్నత్వం వుంటే ఆ సమాజంలో అత్యున్నత జీవనాన్ని ఆవిష్కరించే దిశగా అంత ఎక్కువ అభివృద్ధి వుంటుంది.

BRAOU

## 7.4 ఎ.వి.డైసే

డైసే సిద్ధాంతీకరణ ఉపయోగితావాదం లేదా నైతిక హక్కుల పరిధిని దాటి విస్తరించింది. బ్రిటీష్ రాజ్యాంగంలోని మౌలిక సూత్రమైన సమన్యాయపాలన (రూల్ ఆఫ్ లా) నే వ్యక్తుల హక్కుల పరిరక్షణకు ప్రాతిపదిక కావాలని డైసే అంటారు. డైసే సిద్ధాంతంలో మూడు ముఖ్య అంశాలున్నాయి. మొదట వ్యక్తిని పాలించేది చట్టం. కేవలం చట్టం మాత్రమే వ్యక్తులని పాలిస్తుంది. చట్టాన్ని ఉల్లంఘించిన సందర్భంలో తప్ప ఇతర విషయాలలో అతను శిక్షార్హుడు కాడు. ప్రభుత్వం లేదా రాజ్యం విచక్షణాయుత అధికారాలను ఉపయోగించడానికి, ఏకపక్షంగా పెత్తనం చేయడానికి వ్యతిరేకంగా చట్టాన్ని సర్వసమున్నతంగా డైసే సిద్ధాంతం నిలుపుతుంది. ఇక రెండు - ఈ సిద్ధాంతం ప్రకారం చట్టం ముందు అంతా సమానులే. అంటే సాధారణ న్యాయస్థానాలు అమలు జరిపే ఆ దేశ న్యాయసూత్రాల ముందు ఎలాంటి మినహాయింపు లేకుండా అన్ని వర్గాల ప్రజలు సమానంగానే నిలుస్తారు. ప్రభుత్వ అధికారులకు, రాజకీయ నాయకులకు, ఇతరత్రా శక్తిమంతులకు ఇందులో ఎలాంటి రాయితీలు వుండవు. చట్టానికి అందరూ విధేయులుగా వుండాల్సిందే. ఇక చివరకు హక్కులను గ్యారంటీ కల్పించే నిబంధనలు చట్టంలోనే పొందుపర్చి ఉంటాయి. వ్యక్తులకు సంబంధించిన ఈ ప్రైవేట్ హక్కులను చట్టం పరిరక్షిస్తుంది. చట్టపరంగా ఏ విధంగానూ సమర్థనీయం కాని రీతిలో అరెస్టుకావడం, జైలుపాలు కావడం లేదా ఇతర రకాల భౌతిక నిర్బంధానికి గురికావడం జరగకుండా ఒక వ్యక్తి తనని కాని కాపాడుకోగల హక్కునే వ్యక్తి స్వేచ్ఛా హక్కు సారాంశంగా డైసే చెబుతారు. ప్రతివ్యక్తికి తన అభిప్రాయాలని - స్వేచ్ఛగా ప్రకటించగల హక్కు ఉంటుందని, పత్రిక స్వేచ్ఛ ఉంటుందని ఆయన అంటారు. సమావేశం కావడానికి, సభలు జరుపుకోవడానికి వ్యక్తులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఎవరో కొందరు చట్టవ్యతిరేకుల చర్యలను దృష్టిలో ఉంచుకొని అన్ని విధాలా చట్టబద్ధత, శాంతియుతమైన సమావేశాన్ని లేదా ప్రసంగాన్ని చట్టవ్యతిరేకంగా ముద్రించడానికి వీలులేదు. ఈ తరహా చట్టపాలన (రూల్ ఆఫ్ లా) సంప్రదాయక ఇంగ్లాండ్‌లో డైసే కంటే ముందుగా కోక్, బ్లాక్‌స్టన్ సృష్టించారు.

## 7.5 బెర్ట్రాండ్ రస్సెల్

రాజకీయాల విషయం, లక్ష్యం, గమ్యం, అంతిమ పర్యవసానం స్వేచ్ఛ అని రస్సెల్ పేర్కొన్నారు. రాజకీయ లక్ష్యాలన్నింటిలోకి సమున్నతమైనది స్వాతంత్ర్యం అయినప్పటికి, స్వభావరీత్యా ప్రభుత్వం చట్టం వ్యక్తి స్వాతంత్ర్యం పై ఆంక్షలు కలిగివుంటాయని ఆయన అంటారు. అవధులు లేని వ్యక్తి స్వాతంత్ర్యానికి అదే సమయంలో విశృంఖల ప్రభుత్వ అధికారాలకు కూడా రస్సెల్ వ్యతిరేకం. "అదుపులేని సహజస్వేచ్ఛ అరాచకత్వం, అదుపులేని అధికారం నిరంకుశత్వం" అని రస్సెల్ పేర్కొన్నారు. అధికారం కోసం వ్యక్తుల మధ్య జరిగే కుమ్ములాట ప్రభుత్వం ఆవశ్యకతకు దారితీస్తుంది. దురదృష్టవశాత్తు ప్రభుత్వం అనేది ఎప్పుడు సామాజిక భద్రత, న్యాయం వంటి కనీస లక్ష్యాలని ఈడేర్చే అర్థవంతమైన అదే సమయంలో ఒంటరితనంతో కూడిన సాధనంగానే ఉంటుంది - తప్ప అభివృద్ధిపథంలో దూసుకుపోవడానికి సమగ్ర సంక్షేమాన్ని సాధించడానికి ఉపకరించే సృజనాత్మక వాహనంగా పనిచేయడం లేదు.

వ్యక్తిలో ఉన్న మంచితనాన్ని వ్యవస్థ సంపూర్ణంగా వెలికితీయాలని, ప్రతివ్యక్తి స్వేచ్ఛగా ఎదగడానికి పూర్తి అవకాశాలు కల్పించడం రాజకీయ వ్యవస్థ అత్యున్నత లక్ష్యంగా వుండాలని రస్సెల్ పేర్కొన్నాడు. ప్రపంచాన్ని మార్చడానికి అది ఎంతో అవసరమని ఆయన అంటారు. మనిషిలోని సృజనాత్మక శక్తులని వినియోగించడం ద్వారానే ఉత్తమ జీవితం అందుబాటులోకి వస్తుంది. సృజనాత్మకంగా జీవించాలనుకునే వ్యక్తి ఎన్నడూ కోల్పోవడానికి ఇష్టపడనిది స్వేచ్ఛ. అందువల్ల రాజకీయపరమైన అంశాలు అన్నింటిలోకి స్వేచ్ఛ అత్యున్నతమైనదని రస్సెల్ అంటారు. సృజనాత్మకత వికాసానికి, సాహసానికి అవకాశాలు ఉండటం, వ్యక్తి స్వేచ్ఛగా ఎదగడానికి తగిన వాతావరణం వీటికే రస్సెల్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. న్యాయం, స్వేచ్ఛ అనేవి యాంత్రిక, మానవతా దృక్పథాలు రెండింటికి సంబంధించిన అంశాలు అని ఆయన అంటారు. ఉత్తమ జీవితానికి సంబంధించిన బాహ్య పరిస్థితులు న్యాయ పరిధిలోకి వస్తే, ఒక వ్యక్తి తన స్వీయ దృక్పథం దృష్ట్యా ఆనందం కోసం సాగించే ప్రయత్నం స్వేచ్ఛ పరిధిలోకి వస్తుంది.

BRAOU

చట్టంపైనో లేదా సంప్రదాయంపైనో ఆధారపడిన పెత్తనాన్ని గుడ్డిగా ఆమోదించడాన్ని మిల్‌లాగానే రస్సెల్ కూడా వ్యతిరేకిస్తారు. వైయక్తికత అనేది భిన్న రుచులకు, అభిరుచులకు దోహదం చేస్తుందని, అందువల్ల దానిని ప్రోత్సహించాలని ఆయన అంటారు. అదే సమయంలో స్వేచ్ఛను, రాజ్యాధికారాన్ని, అతి జాగ్రత్తగా సమన్వయం చేయడం అవసరమన్న విషయం కూడా రస్సెల్ గుర్తించారు. "స్వల్ప స్వేచ్ఛ స్తబ్దతకు దారితీస్తుంది. అదుపులేని స్వేచ్ఛ సంక్షోభాన్ని సృష్టిస్తుంది." అని రస్సెల్ అంటారు. అందువల్ల సమాజంలో సామరస్యం, సుస్థిరత సాధించాలంటే వ్యక్తి విధిగా సహజధర్మాలకు తలవగ్గాలని అందుకు తగిన సాధనం చట్టమేనని రస్సెల్ అభిప్రాయం. హెగెల్ పేర్కొనట్టుగా ఆదర్శరాజ్యంలోని ఆదర్శచట్టాలకు బేషరతుగా విధేయత ప్రకటించడం వల్ల లభించే స్వాతంత్ర్యాన్ని మాత్రం రస్సెల్ తీవ్రంగా విమర్శించారు. పాలితుల బాగోగుల గురించి ఆలోచించే ప్రజల చేతిలో అధికారం ఉండటం చాలా మటుకు అపకార రహితం అని రస్సెల్ అంటారు. అవకాశాలు అందిరాని అదృష్టహీనులకు పాలనాపరమైన చర్యల ద్వారా, ఆర్థిక చర్యల ద్వారా స్వాతంత్ర్యాన్ని అందించడానికి నిరాకరించే ఉదారవాద స్వేచ్ఛా మార్కెట్, వ్యవస్థను కూడా రస్సెల్ తిరస్కరిస్తారు. అందరి అవసరాలు తీర్చడం ప్రభుత్వం బాధ్యత అని, ఇందుకోసం అవసరమైతే కొందరి స్వేచ్ఛలో కలగజేసుకోవడం సమర్థనీయమేనని ఆయన అంటారు. ఒక వ్యక్తి అపరిమిత సంపదలు కూడగట్టుకోవడాన్ని నిరోధించడం కంటే మరోవ్యక్తికి కనీస అవసరాలను తృణీకరించడము స్వేచ్ఛకు ఎక్కువ విఘాతమని రస్సెల్ అంటారు.

ఇతరుల ప్రయోజనాలని ఫణంగా పెట్టి విలాసాలు అనుభవించేవారి స్వేచ్ఛలో ప్రభుత్వం కలగజేసుకోవడాన్ని ఆయన సమర్థించారు. అయితే కొన్ని రకాల సౌకర్యాల, విలాసాలు అనుభవించడం, ఇతరుల అవకాశాలు, సౌకర్యాలు ఏవిధంగానూ భంగం కాదని అలాంటివాటి విషయంలో జోక్యం చేసుకోవడం మాత్రం సమర్థనీయం కాదని రస్సెల్ పేర్కొన్నారు. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గాని ఇతరుల ప్రయోజనాలకు భంగం కలిగించని విషయాల్లో వ్యక్తుల స్వేచ్ఛని ప్రభుత్వం గౌరవించాలి. అభిప్రాయం, జ్ఞానం, కళ స్వీయనైతిక విలువల వంటివాటి విషయంలో జోక్యం వుండరాదు. ఈ విషయంలో మిల్ ఆలోచనా ధోరణినే రస్సెల్ దాదాపుగా పునరుద్ఘాటించారు.

BRAOU

## 7.6 జాన్‌రాల్స్

న్యాయానికి సంబంధించి రాల్స్ చేసిన సూత్రీకరణల్లోనే హక్కుల సిద్ధాంతం కూడా అంతర్భాగంగా వుంది. సమాజంలోని మౌలిక వ్యవస్థలకు హక్కులు, విధులను నిర్దేశించడానికి రాల్స్ న్యాయసూత్రాలు మార్గనిర్దేశనం చేస్తాయి. హక్కుల సిద్ధాంతానికి తగిన ప్రాతిపదికను అన్వేషించే క్రమంలో రాల్స్ ఉదారవాద సిద్ధాంతం పట్ల పూర్తి అసమ్మతిని ప్రదర్శించాడు. సగటునగాని లేదా మొత్తంగా గాని సమాజ ఉన్నతిని ఉపయోగితావాదం పెంచే అవకాశం ఉన్నప్పటికీ కొంతమంది ప్రజల హక్కులను హరించడానికి అది దోహదం చేస్తుందని రాల్స్ విశ్వసించారు. ఉపయోగితావాదానికి ప్రత్యామ్నాయాన్ని అందించే ప్రయత్నంలో రాల్స్ తన సిద్ధాంతాన్ని ఒడంబడికవాద సంప్రదాయానికి ముడిపెట్టారు. ఒడంబడిక సిద్ధాంతం చారిత్రకంగా మౌలిక మానవహక్కుల భావనతో అనుసంధానమై వుంది. రాల్స్ న్యాయసిద్ధాంతానికి ప్రథమ ఆలంబన వ్యక్తి. న్యాయం పునాదిగా వుండే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని సమాజంలోని ప్రతివ్యక్తి కలిగి వుంటాడు. అనుల్లంఘనీయమైన ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని సంక్షేమ సమాజం కూడా త్రోసిపుచ్చజాలదు. అందువల్ల అత్యధికుల సంక్షేమం కోసమైనా కొందరు స్వేచ్ఛని హరించడాన్ని రాల్స్ ఒప్పుకోరు. అందువల్ల న్యాయబద్ధ వ్యవస్థలో ప్రతిపౌరుని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సమానమే. న్యాయం పూచి ఇచ్చి దాఖలుపర్చిన వ్యక్తుల హక్కులపై రాజకీయ బేరసారాలూ కుదరవు. మెజార్టీ ప్రజల ప్రయోజనాలు అనే అభిప్రాయము చెల్లదు. సామాజిక సహకారంతో పరస్పర లాభం వుందని రాల్స్ గుర్తించారు. ఒక వ్యక్తి నైతిక వివేచన ఆమోదించిన సామాజిక న్యాయానికి లక్ష్యంగా మారుతుంది. అందువల్ల న్యాయానికి సంబంధించిన ప్రధాన అంశం సమాజ మౌలిక నిర్మాణం అని రాల్స్ అంటారు. సాఫీగా, శాంతియుతంగా సౌకర్యవంతంగా కలిసిబతకడానికి వీలైనంత ఉత్తమమైన సామాజిక ఏర్పాట్లని ప్రజలు చూసుకోవాలి. సమాజ మౌలిక నిర్మాణంలో రాజకీయ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థ కుటుంబస్వభావం వగైరా అంతర్భాగంగా వుంటాయి. ఈ మౌలిక నిర్మాణాన్ని దృష్టిలో వుంచుకొనే రాల్స్ న్యాయసిద్ధాంతం, హక్కులు, విధులను నిర్దేశిస్తుంది.

సహేతుక పద్ధతుల్లో న్యాయసూత్రాలని నిర్మించడానికి రాల్స్ ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా పేర్కొన్నారు. వ్యక్తులు పరస్పర ఒడంబడిక ద్వారా ఒక సమాజంగా ఏర్పడతారు. ఇలా సమాజంగా ఏర్పడటానికి ముందు వుండే సర్వసమానదశలో ఒడంబడికకు మౌలిక షరతులుగా ఈ న్యాయసూత్రాలను బుద్ధిజీవులైన వ్యక్తులు అంగీకరిస్తారు. భావనాత్మకమైన 'సర్వసమాన' తొలిదశను రాల్స్ అసలు స్థితి అని పేర్కొంటారు. ఈ అసలు స్థితిలో ఏ వ్యక్తికి సమాజంలో తన స్థానం ఏమిటో తెలియదు. తన సామాజిక స్థాయి, వ... ఏమిటో ఎరుక వుండవు. తన శక్తి సామర్థ్యాలు, బుద్ధికుశలత జీవితం గురించి, సహజసంపదలు, రుణాల ఎంపికలో తన అదృష్టం గురించిన స్పృహ వుండదు. మంచి చెడు గాని, సామాజిక మానసిక ధర్మాలు గానీ వారికి తెలియవు. ఇలాంటి అజ్ఞానపూరిత స్థితిలో న్యాయసూత్రాల ఎంపికను తొలిదశలో పరస్పర ఒడంబడిక ద్వారా సమాజంగా ఏర్పడే వ్యక్తులు చేస్తారు. దాదాపు అందరి మానసిక భౌతిక స్థితి ఒకటే కనుక వారి ఒడంబడిక నుంచి వచ్చే న్యాయసూత్రాలు ఉత్కృష్టమైనవి. సామాజిక మౌలిక వస్తువుల పంపిణీని కూడా రాల్స్ న్యాయసూత్రాలే నిర్దేశిస్తాయి. జీవితాన్ని గురించి విలువల గురించి ఎలాంటి దృక్పథం వున్నా జ్ఞానమును ప్రతిమనిషి కోరుకునేవే మౌలికవస్తువులు. ప్రధానమైన సామాజిక మౌలిక వస్తువుల్లో స్వేచ్ఛా, అవకాశం, అధికారం, ఆదాయం, సంపద, ఆత్మగౌరవం వగైరా వుంటాయి. ఇతర మౌలిక వస్తువులు ఆరోగ్యం, బుద్ధికుశలత, సృజనాత్మకత సామర్థ్యం వంటివి ప్రకృతి ప్రసాదించాయి. సమాజ మౌలిక నిర్మాణం వీటిని కొంతమేర ప్రభావితం చేయగలుగుతుందే తప్ప ప్రత్యక్షంగా నియంత్రించలేదు. తొలిదశలో జ్ఞానం, అజ్ఞానం సమానంగా వున్న స్థితిలో సహజంగా వుండే ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని సామాజిక మౌలిక వస్తువుల పంపిణీకి రాల్స్ రెండు సూత్రాలు చేశాడు. ఈ రెండు సూత్రాలు ప్రత్యామ్నాయ సూత్రాలకు పైమెట్టుగా ఉంటాయి. తొలిదశలోని వ్యక్తులు ఎంచుకోవాల్సిన రెండు సూత్రాలని రాల్స్ ఈవిధంగా వివరించాడు.

ఎ) ప్రతి వ్యక్తికి ఎలాంటి మినహాయింపు లేకుండా సమానస్వేచ్ఛ హక్కులు వుంటాయి. ఈ హక్కులు స్వేచ్ఛలో కేవలం ఒక్క సమాన రాజకీయ హక్కులను మాత్రమే వాటి విలువలు గిసిన గ్యారంటీని కల్పించాల్సి వుంటుంది.

బి) సమాజంలో వుండే ఆర్థిక, సామాజిక అసమానతలు రెండు నిబంధనలనీ పూర్తి చేసే పక్షంలో మాత్రమే వాటి చలామణిని ఆమోదించవచ్చు. ఒకటి అందరికి సమాన అవకాశాల పరిధిలోకి వచ్చే అధికార పదవులు హోదా ఈ అసమానతలు పరిమితం అయినప్పుడు. రెండు అట్టడుగువర్గాలకు ఈ అసమానతల నుంచి అత్యధిక ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నప్పుడు -

న్యాయసమాజంలోని వ్యక్తులు ఒకే రకమైన మౌలికహక్కులు కలిగి ఉండాలి. కనుక మౌలికస్వేచ్ఛని నిర్వచించే ప్రతి సూత్రం అందరికి సమానంగా వర్తించాలని రాల్స్ తొలిసూత్రం చెబుతుంది. రాజకీయ స్వేచ్ఛ (ఓటుహక్కు, అధికారం చేపట్టే హక్కు) వాక్స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం భావస్వేచ్ఛ, ఆస్తి హక్కు, ప్రభుత్వం ఏకపక్షంగా అరెస్టు చేయకుండా రూల్ ఆఫ్ లా లేదా సమన్యాయ చట్టం క్రింద నిరోధించగల స్వేచ్ఛ ఇవన్నింటిని మౌలిక స్వేచ్ఛకు ఉదాహరణలుగా రాల్స్ చెబుతారు. అయితే స్వేచ్ఛ అవధులు లేకుండా వుండాలని కూడా రాల్స్ ప్రతిపాదించడం లేదు. మౌలికస్వేచ్ఛపై అదే స్వేచ్ఛ కోసం పరిమితులు విధించవచ్చని ఆయన అంటారు. ఒకరకమైన స్వేచ్ఛ.

ఒక రకమైన స్వేచ్ఛ ఒకో రకమైన మౌలిక స్వేచ్ఛ పరిరక్షణకే పరిమితం కావాలని ఆయన అంటారు సమాన స్వేచ్ఛా సిద్ధాంతానికి రెండో సిద్ధాంతంకంటే ఎక్కువ ప్రాధాన్యతనే రాల్స్ ఇచ్చారు. ఈ రెండు సూత్రాలు ఒక వరుసనే - క్రమపద్ధతిలో వున్నాయి. వస్తువులు, అంతస్తుల పంపిణీలోని అసమానతల జోలికి వెళ్ళడానికి ముందు స్వేచ్ఛా సిద్ధాంతం పూర్తిగా అసంతృప్తి చెందడం ముఖ్యమని ఆయన అభిప్రాయం. సమానత్వ సిద్ధాంతంకంటే స్వేచ్ఛాసిద్ధాంతం నైతికంగా ఉన్నతమైనది. సంపూర్ణస్వేచ్ఛా హక్కులను అమలు చేయడానికి సామాజిక పరిస్థితులు అనుకూలంగాలేని పక్షంలో మాత్రమే వీటిని పరిమితం చేసే విషయం పరిగణించాలని రాల్స్ అంటారు. ఆ ఆంక్షలు కూడా స్వేచ్ఛా సమాజానికి అవసరమైన బాటలు వేసేందుకు దోహదం చేసేవిగా వుండాలి.

BRAOU

ఇక రాల్స్ రెండో సూత్రం ఆదాయం, సంపదల పంపిణీకి, అధికారానికి బాధ్యతల నిర్వహణ మధ్య బేధాన్ని ఉపయోగించుకునే వ్యవస్థల నిర్మాణానికి వర్తిస్తుంది. ఆదాయం, సంపద పంపిణీ సమానంగా ఉండాల్సిన అవసరం లేదు. అయితే ప్రతి ఒక్కరికి అవకాశం దొరికేలా పంపిణీ జరగాలి. అధికార యంత్రాంగం మాత్రం అందరికి అందుబాటులో ఉండాలి. ఒకరకంగా ద్వితీయ సూత్రంలో రెండు భాగాలు వున్నాయి. తొలిభాగాన్ని భేదాత్మక సిద్ధాంతం అని రెండో భాగాన్ని సమాన అవకాశాల సిద్ధాంతం అని చెప్పవచ్చు. తొలిభాగం సమాజంలోని ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా ఆర్థిక, సామాజిక అసమానతలని అమరుస్తుంది. అవకాశాలు లేని అదృష్టహీనులకు లబ్ధి కలిగిస్తుందని భావిస్తే తప్ప సంపన్నులకు మరిన్ని అవకాశాలు లభించే విధంగా సామాజిక క్రమం వుండరాదని ఉద్బోధిస్తుంది. కాగా రెండోభాగం అధికార పీఠం - అందరికి అందుబాటులో వుండాలని సూచిస్తుంది. సమాన అవకాశాల ఉదారవాద సిద్ధాంతంగా దీనిని రాల్స్ అభివర్ణించారు. కేవలం సామర్థ్యం, ప్రతిభవున్న వ్యక్తులకు మాత్రమే అవకాశాలు కల్పించే సహజస్వేచ్ఛ సిద్ధాంతానికి ప్రగతిఫలాల పంపిణీని సమాజ పరిణామాలు, సహజ అదృష్టాలు ప్రభావితం చేస్తాయన్న ఉదారవాద వ్యాఖ్యానానికి తన సిద్ధాంతానికి మధ్య స్పష్టమైన బేధాలను కూడా రాల్స్ సూచిస్తారు. అందరికి సమాన అవకాశాల సిద్ధాంతాన్ని, భేదాత్మక సూత్రాన్ని కలగలిపితే నైతిక వ్యక్తులుగా ప్రజలంతా సమానులేనని పరిగణించే ప్రజాస్వామిక సమానత్వాన్ని సాధించవచ్చని రాల్స్ అంటాడు. న్యాయానికి సంబంధించిన తన ఉదారవాద రాజకీయ దృక్పథాన్ని ప్రజాచట్టం రూపకల్పనకు ఒక చట్రంగా ఉపయోగించవచ్చని రాల్స్ అభిప్రాయం. రాజకీయ నాయకత్వం విధిగా మానవహక్కులను గౌరవించాలని నిర్దేశించడం ఈ చట్రం పరిధిలోని ప్రధాన షరతుల్లో ఒకటి. అందువల్ల సార్వత్రిక దృష్టితో చూసినపుడు రాల్స్ సిద్ధాంతం, మానవహక్కులకు తాత్త్విక భూమికగా నిలుస్తుంది. న్యాయాన్ని ఉదారవాద దృక్పథంతో మథించినపుడు హేతుబద్ధమైన ప్రజాచట్టం ఎలా ఏర్పడుతుంది. ఈ ప్రజాచట్టం సార్వత్రికను ఎలా పొందగలుగుతుంది. మనం అవగాహన చేసుకుంటే భౌగోళిక రాజకీయ సరిహద్దులకు అతీతంగా, సాంస్కృతిక ఆర్థిక ఎల్లలకు అతీతంగా మానవ హక్కులు అంతటా ఒకటిగానే ఎలా ఉంటాయో మనకు అర్థం అవుతుంది.

క్రమబద్ధమైన ప్రభుత్వానికి మూడు ముందస్తు షరతులను రాల్స్ నిర్దేశించారు. అవి : విస్తరణవాదం జోలికి వెళ్లకుండా ఆ ప్రభుత్వం శాంతి సూత్రాలను గౌరవించాలి. ఆ ప్రభుత్వం యొక్క న్యాయ వ్యవస్థ పాలితులైన ప్రజలందరికి పూర్తిగా ఆమోదయోగ్యమై వుండాలి. చివరగా మౌలిక మానవ హక్కులను ఆ ప్రభుత్వం సదా గౌరవించాలి. ఉదారవాద, ఉదారవాదయేతరసమాజాలు రెండింటిలోనూ పౌరహక్కులను పరిరక్షించడం అన్నింటికన్నా ముఖ్యమని రాల్స్ అంటారు. న్యాయబద్ధమైన సమాజంలోని రాజకీయ వ్యవస్థల కనీస ప్రమాణాలలో మానవమహక్కులే సూచికలని రాల్స్ అభిప్రాయం. ఈ హక్కులను ఉల్లంఘించడానికి జరిగే ఏ ప్రయత్నమైనా తీవ్రమైన విషయమని, అది మొత్తం సమాజానికి విఘాతం కలిగిస్తుంది. ఈ హక్కులు, మానవ స్వభావానికి సంబంధించిన ఏదో ఒక సమగ్రనైతిక సిద్ధాంతంపై ఆధారపడివున్నవి కావు. మనుషులంతా నైతిక జీవులు. వారందరికి ఒకేరకమైన నైతికత శక్తి సామర్థ్యాలు ఉంటాయి. అందువల్ల హక్కులకు వారంతా అర్హులే - అనే సిద్ధాంతాలు మానవహక్కులకు ప్రాతిపదికకాదు. అందరికి మంచి జరుగుతుందనే ప్రజల విశ్వాసం నుంచి, చట్టంపై పూర్తి భరోసా వుంచి ప్రజలకు దాని గురించి క్షుణ్ణంగా వివరించగల అధికార యంత్రంగం నుంచి సమాజంలోని ప్రజల నైతిక విలువలు, విద్యుక్త ధర్మాలు నిర్దేశితం కావాలి. అలా జరగాలంటే సమాజంలోని వ్యక్తులంతా బాధ్యతాయుతంగా పరస్పర సహకారంతో వ్యవహరించగలవారై వుండాలి. తమ నైతిక విధులని ధర్మాలని అవగాహన చేసుకుని తదనుగుణంగా ప్రవర్తించగల వారై వుండాలి. ఈ తరహా మానవ హక్కులని పశ్చిమదేశాలకు పరిమితమైన ప్రత్యేక తరహా హక్కులుగా కొట్టిపారేయడానికి వీలుండదు. అన్ని రకాల అవధులను అధిగమించి సార్వత్రికతని ఈ హక్కులు సొంతం చేసుకుంటాయి.

రాజ్యం యొక్క సార్వభౌమాధికార పరిమితులని నిర్వచించడం మానవహక్కుల మేథోపాత్రల్లో ఒకటి అని రాల్స్ అంటారు. అందువల్ల మానవహక్కులకు, రాజ్యాంగం ప్రసాదించే హక్కులు, ప్రజాస్వామ్య పౌరసత్వం కారణంగా లభించే హక్కులు రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా వున్న కారణంగా లభించే ఇతర రకాల హక్కులకు మధ్య తేడా వుంది. అవన్ని ప్రజలు ఏర్పరుచుకున్నా చట్టంలో అంతర్భాగంగా వుంటూ, దేశీయ వ్యవస్థలలో పరిమితులను నిర్దేశిస్తాయి మానవహక్కులకు ముందు ముఖ్యమైన పాత్రలని రాల్స్ నిర్దేశించారు.

BRAOU

1. ఒక ప్రభుత్వం యొక్క చట్టబద్ధతకు, ఆ ప్రభుత్వం న్యాయవ్యవస్థ ఔన్నత్యానికి కొలమానం. మానవహక్కులు సరిగ్గా అమలు జరగడం.

2. మానవహక్కులని ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందంటే ప్రజల స్వేచ్ఛ విషయాలలో ఆర్థిక ఆంక్షల ద్వారానో, సైనిక చర్య ద్వారానో, ఇతర బలవంతపు పద్ధతుల్లోనో జోక్యం చేసుకునే పరిస్థితి లేదని స్పష్టం అయింది.

3. ప్రజల్లో ఏకకాలంలో అనేక పదవులు చేపట్టే ధోరణులను కూడా మానవహక్కులు నైతిక పరిమితులు విధిస్తాయి.

## 7.7 రోనాల్డ్ డ్వార్కిన్

లాక్ సహజహక్కుల సంప్రదాయాన్ని, న్యాయ తత్వశాస్త్రంతో ముడిపడివున్న క్రమానుగత హక్కుల సంక్రమణ సిద్ధాంతాన్ని కలగలపడానికి డ్వార్కిన్ ప్రయత్నించారు. లాక్ పేర్కొన్న హక్కులు సమాజంలోని వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాన్ని పాలించే సూత్రాలు. కాగా డ్వార్కిన్ సిద్ధాంతం వ్యక్తులకు, వారిని పాలించే ప్రభుత్వానికి మధ్య సంబంధాలని పర్యవేక్షిస్తుంది. వైయక్తిక హక్కులు, వ్యక్తుల దగ్గర వుండే రాజకీయ తురుపు ముక్కలు. ప్రభుత్వ చర్యవల్ల తన అరిష్టానికి అనుగుణంగా ఒక వ్యక్తి ప్రవర్తించలేనపుడు లేదా ప్రభుత్వ చర్యవల్ల కష్టానికి, నష్టానికి గురయినపుడు ప్రభుత్వ చర్యకు ఉమ్మడి ప్రయోజనం అనేది సమర్థనీయమైన కారణం ఏమాత్రం కాదని విశ్వసించినపుడు ఆ వ్యక్తి తన హక్కులను ఉపయోగించి ప్రభుత్వ చర్యను నిలదీయవచ్చు. ప్రభుత్వ చర్యవల్ల నష్టానికి గురైన వ్యక్తి ఏదో ఒక నిర్దిష్ట పద్ధతిలో వ్యవహరించడాన్ని, ప్రభుత్వం నుంచి ఏదో ఒక లబ్ధి కోసం డిమాండ్ చేయడాన్ని పూర్తిగా సమర్థించవచ్చు. సంక్షేమం, సంపద వంటి ఉమ్మడి లక్ష్యాలతో పోటీపడే సందర్భంలో వైయక్తిక హక్కులకే అగ్రాసనం లభిస్తుంది. అయితే ఉమ్మడి హక్కులు, ప్రయోజనాలను తోసిరాజని వైయక్తిక లబ్ధికి పెద్దపీట వేయాలంటే అందుకు సంబంధించిన సిద్ధాంతానికి రెండు ప్రధాన లక్షణాలు వుండాలని డ్వార్కిన్ అంటారు. ముందు ఆ సిద్ధాంతానికి వైయక్తికత ప్రాతిపదికగా వుండాలి. అంటే ఆ సిద్ధాంతం ఒక వర్గానికి స్పష్టంగా నిర్వచించి, ఆ వర్గంలోని ప్రతివ్యక్తికి ఆ లబ్ధి చేకూర్చేందుకు దోహదం చేయాలి. ఉమ్మడి లక్ష్యాలని సాధించడానికి ఉద్దేశించిన సిద్ధాంతాల దృష్ట్యా ఎంతసేపు సమిష్టి ప్రయోజనాలు, సమిష్టి లాభంపైనా వుంటుంది తప్ప వైయక్తిక లాభానికి అక్కడ స్థానం లేదు. ఇలాంటి వైయక్తిక లక్షణం లేని సిద్ధాంతాల ఆధారంగా వ్యక్తులు చేసే క్లెయిమ్‌లు హక్కులు అనబడవు. వైయక్తిక స్వభావం లోపించడమే అందుకు కారణం. ఇక రెండో లక్షణం - ఆ సిద్ధాంతానికి బలమైన నైతిక లేదా చట్టబద్ధమైన పరిగణన వుండాలి.

## 7.8 ముగింపు

హక్కులకు సంబంధించిన ఉదారవాద సిద్ధాంతంలోని ప్రధాన ధోరణులను ఈ పాఠ్యాంశంలో మనం పరిశీలించాము. ప్రతి వ్యక్తికి సహజంగా సంక్రమించిన హక్కులు కొన్ని వుంటాయని వాటిని ప్రభుత్వం కూడా హరించజాలదని లాక్ వాదిస్తారు. సమాజంలోని అత్యధిక శాతం మంది ప్రజల సంతోషాన్ని దృష్టిలో వుంచుకొని, ఇతరులకు హాని కలుగుతుందని భావించిన సందర్భంలో మాత్రం వైయక్తిక హక్కులలో ప్రభుత్వం కలగజేసుకోవచ్చని జె.ఎస్.మిల్ అభిప్రాయపడతారు. రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాల ద్వారా వ్యక్తుల హక్కులకు భద్రత కల్పించాలని డైసే అంటారు. వ్యక్తుల్లోని సృజనాత్మక శక్తులు స్వేచ్ఛగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేయాలని రస్సెల్ కాంక్షిస్తారు. వ్యక్తుల నైతిక వివేచనకు ఆమోదయోగ్యమైన సామాజిక ఏర్పాటుని ఈ సిద్ధాంతాలు నిర్వచిస్తాయి. కాగా డ్వార్కిన్ మాత్రం ప్రతివ్యక్తికి కొన్ని నైతిక హక్కులు వుంటాయని, న్యాయవ్యవస్థ వాటిని గుర్తించి గౌరవించాలని అంటారు. సమిష్టి మంచి కోసమైనప్పటికి ఈ హక్కుల్లో కలగజేసుకునే అధికారం ప్రభుత్వానికి వుండదు.

BRAOU

## 7.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. జె.ఎస్.మిల్ ప్రకారం వ్యక్తుల స్వేచ్ఛలో ప్రభుత్వం కలగజేసుకోవడానికి చట్టబద్ధమైన ప్రాతిపదికలు ఏమిటి ?
2. ఒక వ్యక్తి స్వీయ నైతిక వివేచన దృష్ట్యా వైయక్తిక హక్కులను రాల్స్ ఏవిధంగా నిర్వచించారో వివరించండి.

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.

1. లాక్ ప్రాకృతిక వ్యవస్థలో వ్యక్తులకు ఎలాంటి హక్కులు వుంటాయి?
2. వ్యక్తుల హక్కులను చట్టం ఎలా పరిరక్షించాలని డైసే కాంక్షిస్తారు ?
3. రస్సెల్ దృష్టిలో స్వేచ్ఛా సమాజాన్ని వివరించండి.
4. సహజహక్కుల సంప్రదాయాన్ని, చట్ట నియమాలను డ్వార్కిన్ తన సిద్ధాంతంలో ఎలా మేళవించింది వివరించండి.

BRAOU

# ఖండం - III

# మార్క్సిస్టు దృక్పథం

పందొమ్మిది, ఇరవయ్యో శతాబ్దంలో సాంఘిక, ఆర్థిక భావాలపై విశిష్టమైన ప్రభావాన్ని చూపించిన మార్క్సిజం మానవహక్కులపై ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వెల్లడించింది. సోషలిజంలో మానవహక్కులకు గల ప్రాధాన్యం మరియు రోజాలగ్జెంబర్గ్, ఆంటోనియోగ్రాంసీలు మానవహక్కులకు ఇచ్చిన కొత్త నిర్వచనాలు మూడవ ఖండంలో చర్చించబడ్డాయి. ఈ ఖండంలో రెండు భాగాలున్నాయి. అవి:

**భాగం - 8 : కార్ల్‌మార్క్స్ - మావో**

**భాగం - 9 : రోసా లగ్జెంబర్గ్, ఆంటోనియో గ్రాంసీ**

BRAOU

BRAOU

# భాగం - 8 : మానవ హక్కులు - కార్ల్‌మార్క్స్ మావో

**విషయక్రమం**


8.0 ఉద్దేశం

8.1 పరిచయం

8.1.1 భౌతిక ఉత్పత్తులు - మానవసంబంధాలు

8.1.2 భూస్వామ్యం - పరిమిత హక్కులు

8.1.3 పెట్టుబడిదారీ విధానంలో మానవ సంబంధాలు - తార్కికత

8.1.4 పెట్టుబడిదారీ విధానంలో స్వాతంత్ర్యం

8.1.5 నిజస్వాతంత్ర్యం పై మార్క్స్

8.2 మావో - పరిచయం

8.2.1 మార్క్స్ - మావో

8.2.2 గుణాత్మకతపై మావో

8.2.3 సోషలిస్టు పునర్నిర్మాణము - స్వాతంత్ర్యం

8.2.4 మారకం - సమాన హక్కులు

8.2.5 సోషలిస్టు హక్కుల సిద్ధాంతం అవసరం

8.3 ముగింపు

8.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 8.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- కార్ల్‌మార్క్స్, మావో జెడాంగ్‌లు మానవహక్కులపై ప్రతిపాదించిన విషయాలు.
- హక్కులపై మార్క్సిస్టు సిద్ధాంతం.
- హక్కులపై మావో విధానాలు.

BRAOU

## 8.1 పరిచయం

సోషలిస్టు దేశాలలో మానవహక్కుల స్థితిగతులను పరిశీలించిన ఉదారవాద మేధావులు చాలామంది మార్క్సిజం మానవహక్కులకు సంబంధించి ఏమీ పట్టించుకోలేదు అంటారు. కొందరైతే మార్క్సిజం మానవహక్కులకు వ్యతిరేకం అని కూడా అంటారు. సోషలిస్టు దేశాలు తమ మానవ హక్కుల రికార్డును అభివృద్ధిపరచుకోవాలని అంగీకరించవచ్చు. కానీ, సోషలిస్టు దేశాలలో మానవహక్కుల పట్టింపులేదనడం సబబుకాదు. దానికన్నా మార్క్స మానవహక్కులపై ప్రకటించిన భావనలను తెలుసుకోవడానికి ఆయన అసలు గ్రంథాలను పరిశీలించడం మంచిది. ఆయన గ్రంథాలను పరిశీలించినట్టయితే ఆయన మానవహక్కులకు వ్యతిరేకం కాదని, వ్యక్తి స్వాతంత్ర్యానికి వ్యతిరేకం కాదన్న విషయం బోధపడుతుంది. మార్క్స్, కేవలం పెట్టుబడిదారీ దేశాల్లో ఉనికిలో వున్న మానవహక్కుల తీరుపట్ల మాత్రమే విమర్శనాత్మకంగా వున్నారు.

బ్రిటిష్ ఆర్థిక రాజకీయతత్వం, జర్మన్ తత్వశాస్త్రం, ఫ్రెంచి సమసమాజభావనలను క్రోడీకరించి కార్ల్‌మార్క్స్ సమగ్ర విధానాన్ని ప్రతిపాదించారు. మార్క్స్ రచనల్లో 'దాస్‌క్యాపిటల్' జర్మన్ తత్వ శాస్త్రం, కమ్యూనిస్టు ప్రణాళికలు ముఖ్యమైన గ్రంథాలు. మార్క్స్ అన్ని విషయాలపై విస్తృతంగా రాసినప్పటికీ, ఆయన ప్రధానంగా రాజకీయ ఆర్థికతత్వం,

తత్వశాస్త్రాలపై దృష్టి పెట్టారు. రాజకీయాల గురించి ఆయన పెద్దగా రాసిందేమీ లేదు. అయితే తొలినాళ్ళలో మాత్రం మార్క్స్, రాజకీయాలపై 'హెగెల్స్ రాజ్యభావనలు - విశ్లేషణ', యూదుల సమస్య, హక్కులు, తాత్విక విచారణ అన్న గ్రంథాలు రాశారు. మానవహక్కులపై మార్క్స్ ప్రత్యేకంగా కాకుండా ఆయా విషయాల చర్చల్లో భాగంగా ఎక్కువ వివరించారు. హక్కులపై ఆయన ఎక్కువ రాయనప్పటికీ, ఆయన అభిప్రాయలన్నీ క్రోడీకరించి మార్క్స్ మానవహక్కులపై ఏం చెప్పారో అంచనా వేయవచ్చు.

మానవహక్కుల విషయంలో మార్క్స్ ఉదారవాద సాంప్రదాయాన్ని పూర్తిగా నిరాకరించారు. ఉదారవాదంలో మానవహక్కులను వాటికవేవిడిగా ఉనికిలో ఉండే అంశాలుగా భావించారు తప్ప, అవి సామాజిక నిర్మాణంలో భాగమని గుర్తించలేదు. ఈ కారణం వల్ల మార్క్స్ ఆ భావనలను తిరస్కరించి, వాటిపై విమర్శనాత్మకంగా పలురచనలు చేసి, స్వతంత్రభావనలను ప్రతిపాదించారు.

### 8.1.1 భౌతిక ఉత్పత్తులు - మానవసంబంధాలు

'హక్కులు వాటి స్వభావం వల్ల సమాన ప్రమాణాల్లో మాత్రమే అమలవుతాయి' ఇది మార్క్స్ భావన. మార్క్స్ ఈ వ్యాఖ్య మానవహక్కుల అన్ని అంశాలనూ ప్రతిబింబిస్తున్నది. ఈ వ్యాఖ్య ప్రకారం, మానవహక్కులు అమలవుతున్న దేశాల్లో మానవులు వారివారి భేదాలతో సంబంధం లేకుండా, అందరూ అందరినీ సమానంగా చూడాలి. హక్కులు మనుషులు మరొకరితో సమానస్థాయిలో సంబంధాలు పెట్టుకొనే అవకాశం. మానవహక్కుల నిర్వచనానికి సంబంధించి, మార్క్స్‌కూ, ఉదారవాద మేధావులకు పెద్దగా భేదం లేదు. అయితే సమాజంలో వాటి అమలుకు సంబంధించి మాత్రం పరస్పరం భేదాలున్నాయి.

'ఒక సమాజంలో న్యాయసంబంధాలు కానీ, రాజకీయ రూపాలుకానీ, మానవుని మేధస్సు వల్లకానీ, అందరూ భావించుకునే సాధారణ అభివృద్ధి వల్ల కానీ ఏర్పడవు. తద్విరుద్ధంగా ఇవి జీవితంలోని భౌతిక వాస్తవికతల వల్ల ఏర్పడతాయి'. అందువల్ల మానవహక్కులను ఎవరూ అమూర్తంగా భావించరాదు. మానవహక్కులు మానవసమాజం సృష్టించినవి. అవి భగవంతుని వల్ల గానీ, అమూర్త భావనల ద్వారాగానీ ఏర్పడలేదు. మానవహక్కులు మానవచరిత్రలో ఒక ప్రత్యేకదశలో అవసరాల ఉత్పత్తుల్లో నిమగ్నమయ్యే మానవ సమాజ సృజన ఫలితంగా ఏర్పడ్డవి.

మానవజాతి మౌలిక క్రియ ఉత్పత్తి కనుక మార్క్స్ ఉత్పత్తిని ప్రామాణికంగా తీసుకొని విశ్లేషణ సాగించారు. ఉత్పత్తి మనిషి సామూహిక చర్య. ఉత్పత్తి చర్యల ద్వారా మానవులు పరస్పరం సంబంధాల్లోకి వస్తారు. అయితే ఈ సంబంధాలు ఇష్టం వచ్చిన రీతిలో ఏర్పరచుకోలేరు. మనుషులు పాల్గొనే ఉత్పత్తి స్థాయి, అందుకు వినియోగించే ఉత్పత్తి సాధనాలను బట్టి మానవ సంబంధాలు రూపుదిద్దుకుంటాయి. ఈ సంబంధాలనే ఉత్పత్తి సంబంధాలు అంటారు. మార్క్స్ ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదికన మానవ సంబంధాలను నిర్వచించారు. "మనుగడలో వున్న సామాజిక ఉత్పత్తి విధానంలో మనుషులు అనివార్యంగా ఉత్పత్తి సంబంధాల్లోకి ప్రవేశిస్తారు. ఈ సంబంధాలతో ఉత్పత్తి భౌతికశక్తుల అభివృద్ధి కోసం ప్రయత్నిస్తారు. ఈ సంబంధాల పరిపుష్టత ఫలితంగానే సమాజంలో ఆర్థిక నిర్మాణం ఏర్పడుతుంది. ఇది న్యాయ, రాజకీయ ఉపరితలాలకు పునాదిగా పని చేస్తుంది' అని మార్క్స్ అంటారు.

### 8.1.2 భూస్వామ్యం - పరిమిత హక్కులు

భూస్వామ్యం కూలిపోయిన తర్వాతే హక్కులు పుట్టాయని మార్క్స్ వాదన. భూస్వామ్య సమాజాలు మానవ హక్కుల ఊసే ఎత్తవని ఆయన అంటారు. భూస్వామ్యంలో భూమి ప్రధాన ఉత్పత్తి సాధనం. భూమిపై ఆధిపత్యం వల్ల భూస్వాములు అధికారాన్ని అనుభవిస్తారు. ఎస్టేట్స్ మీద ఆర్థిక నియంత్రణ కారణంగా భూస్వాములు సామాజిక, రాజకీయ ఆధిపత్యాన్ని కూడా పొందుతారు. భూస్వామ్యంలో సెర్ఫ్‌లు, రైతులు భూస్వామి వ్యక్తిగత సంపదగా భావిస్తారు. ఎస్టేట్‌లో వున్న ప్రజలందరిపైనా భూస్వామి పూర్తి అధికారాన్ని కలిగివుంటారు. ఈ సావకాశం వల్ల భూస్వాములు మాత్రమే సాంఘిక, రాజకీయ కార్యకలాపాల్లాంటి ప్రజాకార్యకలాపాల్లో పాల్గొంటారు. అయితే ఇతర

BRAOU

వర్గాల ప్రజలు పూర్తిగా ఈ కార్యకలాపాలకు దూరంగా వుండరు కానీ, వారు ప్రధానంగా భూస్వాములకు సంబంధించిన బాధ్యతల నిర్వహణలో వుంటారు. అందువల్ల భూస్వామ్యంలో అసమానతలు నిర్మితమయ్యాయి. భూస్వామ్యసమాజ నిర్మిత కారణంగా సాంఘిక, రాజకీయ సంస్థలకు ఒకరు అనుసంధానమై, పలువురు వాటికి దూరమై వుండాల్సి వస్తుంది. భూస్వాములకు మాత్రం స్వాతంత్ర్యం, ఇతరులందరికీ బాధ్యతలు మాత్రం మిగులుతాయి. పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య సమాజంలోని అసమానతలపై యుద్ధంతో భూస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంది. నిజానికి భూస్వామ్య సమాజంలోని అసమాన సామాజిక క్రమాన్ని పెట్టుబడిదారీ బూర్జువాలు భూస్వామ్యంపై ఎక్కుపెట్టిన ఆయుధంగా వాడుకున్నారు. అందువల్ల మానవహక్కులు ఒక అమూర్తభావననుంచి ఉద్భవించినవి కావు. అవి ఏదో అతీతశక్తుల వల్ల సంక్రమించినవీ కావు. కొత్తగా పుట్టిన పెట్టుబడిదారీ వర్గం నాయకత్వంలో భూస్వామ్య సమాజంపై జరిగిన పోరాటంలో అవి ఉద్భవించాయి. అవి కొత్త ఉత్పత్తి సంబంధాలను వెల్లడి చేశాయి.

### 8.1.3 పెట్టుబడిదారీ విధానంలో మానవసంబంధాలు - తార్కికత

పైన చర్చించిన విషయాల ఆధారంగా పరిశీలించినప్పుడు మానవహక్కులు పెట్టుబడిదారీ సామాజిక సంబంధాల నుంచి ఉద్భవించాయని చెప్పవచ్చు. పెట్టుబడిదారీ సమాజంలో భూస్వామ్యంలో ఒక భూస్వామి రైతును స్వంతం చేసుకున్నట్లుగా, కార్మికుల్ని ఒక పెట్టుబడిదారుడు స్వంతం చేసుకోలేదు. పెట్టుబడిదారుడు, కార్మికుని మధ్య సంబంధం పూర్తిగా కాంట్రాక్టు ఒప్పందం అవుతుంది. కార్మికుడు వేతనం కోసం పని చేస్తాడు, పెట్టుబడిదారు వేతనాలు చెల్లించి పనిచేయించుకుంటాడు. ఇదే వారి సంబంధం. ఈ ఇద్దరి మధ్య సంబంధం అక్కడితో అంతం అవుతుంది. పెట్టుబడిదారుడు కేవలం కార్మికశక్తిని మాత్రమే కొనుగోలు చేసి వస్తువుల ఉత్పత్తికి దాన్ని వినియోగించుకొనే పెట్టుబడిదారుడు, ఆ కార్మికుడు జీవించేంత స్థాయి వేతనాన్ని మాత్రమే ఇస్తాడు. ఒక కార్మికుడు ఉత్పత్తి చేసే సంపద, ఆ కార్మికునికి చెల్లించే వేతనం మధ్య వుండే వ్యత్యాసాన్నే మార్క్స్ అదనపు విలువ అన్నారు. ఈ అదనపు విలువే పెట్టుబడిదారుని దోపిడి అని మార్క్స్ భావించారు. అలాగే పెట్టుబడిదారీ సమాజం మరొక ముఖ్యలక్షణం ఏమంటే మార్కెట్ డిమాండ్ మేరకు పెట్టుబడిదారుడు భారీ ఎత్తున ఉత్పత్తులు చేస్తాడు. భూస్వామ్య సమాజం స్థానిక అవసరాల మేరకే ఉత్పత్తి చేసే, పెట్టుబడిదారీసమాజం సమాజం మొత్తం అవసరాల దృష్ట్యా, మార్కెట్ అవసరాల మేరకు ఉత్పత్తి చేస్తారు.

భూస్వామ్య సమాజంలో నిర్మిత, పరిమిత చేతివృత్తుల పరిశ్రమలు మార్కెట్ కోసం ఉత్పత్తిని అనుమతించవు. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తుల్లో మాత్రం ఈ పరిమితులేవీ లేకుండా ఉత్పత్తి సమానత్వం, స్వాతంత్ర్యం వుంటాయి. మార్కెట్ ఉత్తులకు వ్యక్తి కొనడంలో, అమ్మకంలో స్వేచ్ఛ వుంటుంది. అమ్మేవాడికి, కొనేవాడికి మధ్య సమానత్వం వుంటుంది. ఈ చర్యలో ఎవరి ప్రయోజనాల మేరకు వారు వ్యవహరించవచ్చు. అందువల్ల పెట్టుబడిదారీ సమాజానికి ఎవరి ప్రయోజనాలకు అనుగుణంగా వారు కొనుక్కొనే, అమ్ముకునే స్వేచ్ఛా సమానత్వం వుంటుంది.

అయితే కొనుగోలుదారును, అమ్మకందారుకు మనం అమూర్తవ్యక్తులుగా భావించినట్టయితే మొత్తం ఈ ఎగుమతి యంత్రాంగం అంతా ఇద్దరు సమానవ్యక్తుల మధ్య సాగుతున్నట్టు కనబడ్తుంది. అయితే ఈ వ్యక్తులే సామాజిక సంబంధాల మూలాల నుంచి పరిశీలించినప్పుడు అసలు అసమానతలు బయటపడ్డాయి. ఉదాహరణకు కొనుగోలుదారులు, అమ్మకందారులు, పెట్టుబడిదారులు, కార్మికులు అనుకుందాం. ఇద్దరూ మార్కెట్‌కు సంబంధించి సమానులుగా కనిపించినప్పటికే, ఉత్పత్తి సాధనాలమీద యాజమాన్యం కలిగిన పెట్టుబడిదారుడు ఈ లావాదేవీని నియంత్రించగల అవకాశం కలిగివుంటాడు. అందువల్ల ఈ లావాదేవీలలో దోపిడీ సంబంధాలు పైకి కనబడవు.

### 8.1.4 పెట్టుబడిదారీ విధానంలో స్వాతంత్ర్యం

పెట్టుబడిదారీ సమాజాలలో రాజ్యం పెట్టుబడిదారీ సంబంధాలకు చట్టబద్ధత కల్పిస్తుంది. నిజానికి ఈ సమాజాలలో హక్కులు అంటే యాజమాన్యవర్గానికి స్వేచ్ఛ కల్పించడమే. పైన పేర్కొన్న రీతిలో కేవలం అధికారాలు

మార్పిడి కోసమే పెట్టుబడిదారీ సంబంధాల దోపిడీ లక్షణాన్ని బయటపెట్టకుండా చట్టం కూడా పెట్టుబడిదారీ అసలు అర్థాన్ని పట్టిసట్టకుండా వ్యవహరిస్తుంది. ఎందుకంటే పెట్టుబడిదారీ సమాజాల్లో చట్టం మనుషులను వారి ఆర్థిక, సామాజిక నేపథ్యం నుంచి కాకుండా కేవలం అమూర్తమానవునిగా పరిగణిస్తుంది. పెట్టుబడిదారీ సమాజం సార్వజనీనంగా ఇదే లక్షణాలలో వుంటుంది. మరో మాటల్లో చెప్పాలంటే చట్టం కొందరికే పరిమితంకాదు. ప్రతివ్యక్తి ఆయావ్యక్తుల సాంఘిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా రాజకీయ సంస్థలతో నామమాత్రపు, లాభప్రాయపు సంబంధాలను పెట్టుకోగలడు. రాజ్యం ఎలాంటి వివక్షలేకుండా అందరినీ సమానంగా చూస్తుంది. కానీ, రాజ్యం కేవలం అమూర్తమానవులను మాత్రమే, అంటే వారి ఆర్థిక, సాంఘిక నేపథ్యాలను పరిగణించకుండానే గుర్తించి వారికి హక్కులు కల్పిస్తుంది. అదీ సమస్య.

పెట్టుబడిదారీ విధానం ఈ లక్షణాల వల్ల ఉదారవాద మేధావులు రాజ్యాన్ని దాని సహేతుకత వల్ల అదొక నిష్పాక్షిక సంస్థగా భావిస్తారు. అందువల్లనే రాజ్యం ఒక వ్యవస్థ ద్వారా ప్రతివ్యక్తికి స్వేచ్ఛ కల్పించడానికి హక్కులు కల్పించిందని వారు భావిస్తారు. అయితే మార్క్స్ ఈ ప్రతిపాదనను ఎంతమాత్రం అంగీకరించలేదు. రాజ్యాన్ని ఆయన సమాజంలో అంతర్భాగంగా చూశారు. అందువల్ల రాజ్యం సమాజాన్ని మించిన ఒక నిష్పాక్షిక సంస్థ కాబోదని ఆయన భావించారు. నిజానికి రాజ్యం పౌర సమాజంలో ఇమిడి వుంది. అందువల్ల రాజ్యం హామీపడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సమాజంలో అందుకు అనుకూలమైన పరిస్థితులు వుంటేనే సాధ్యమవుతాయి. పెట్టుబడిదారీ సమాజంలో మార్క్స్ వాదన ప్రకారం రెండింటి మధ్య వైరుధ్యాలుంటాయి. ఈ వైరుధ్యానికి ప్రాతిపదికగా మార్క్స్ ఈ విధంగా చెప్పారు" అన్ని విషయాలూ నమూనాలుగా మాత్రమే మనుగడలో వుంటాయి. పౌర విషయాలు అట్లాగే రాజ్యానికి సంబంధించిన విషయాలు" చట్టం ప్రకారం మానవుడిని చట్టం ప్రకారం ఒక వ్యక్తిగా గుర్తించవచ్చు. కానీ, సమాజంలో అతను ఇంకొక పాత్రలో అంటే ఒక కార్మికుడు కానీ, ఒక పెట్టుబడిదారుడు కానీ కావొచ్చు. మార్క్స్ ప్రకారం సమాజంలో వ్యక్తిపాత్రే నిజమైనది. అందువల్ల రాజ్యం ఒక అమూర్త మానవుడికి హక్కులు ఇవ్వవచ్చు. కానీ పౌరులుగా ఈ హక్కులను ఒక కార్మికుడు, పెట్టుబడిదారుడు, పురుషులు, స్త్రీలు ఒకే స్థాయిలో వాటిని పొందకపోవచ్చు. మనుషుల మధ్య సాంఘిక ఆర్థిక అసమానతలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యక్తులకు హక్కులను ప్రసాదించడమంటే 'సమానత్వానికి హక్కు'గా దాన్ని భావించవచ్చునని మార్క్స్ అంటారు.

BRAOU

సమాజంలో సంపద, అధికారం విషయంలో అసమానతలున్నప్పుడు మెజారిటీ ప్రజలకు ఈ హక్కులు మృతప్రాయమైనవే. ఇదే సమయంలో ఈ హక్కులే కొందరికి రాయితీలవుతాయి. అందువల్ల పెట్టుబడిదారీ సమాజంలో హక్కులు సంపద, అధికారాల అసమానతలను పెంచిపోషిస్తాయి.

## 8.1.5 నిజస్వాతంత్ర్యంపై మార్క్స్

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను మార్క్స్ కొత్త తరహాలో ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం అంటే కార్మికశక్తిని సృజనాత్మకంగా వినియోగించగలగడం, సామూహికంగా ప్రణాళికాబద్ధంగా సాగే ఈ పని పరిస్థితుల్లో చివరకు ఒక వ్యక్తి మరొకరికి పనిలో సహకరించుకోగలిగిన పరిస్థిలు ఏర్పడడంగా మార్క్స్ అభివర్ణించారు. స్వాతంత్ర్యం అంటే ఒక వ్యక్తి తనకు తృప్తినిచ్చే శ్రమ చెయ్యడానికి తగిన వీలుకలగడం. ఉత్పత్తి శక్తి నిరాదరణల ఒత్తిళ్ళలో జరగకుండా వుండడం.

కానీ, సమాజంలో అసమానతలు వున్నంతకాలం ఇలాంటి స్వాతంత్ర్యం సాధ్యం కాదు. మార్క్స్ ప్రకారంగా వర్గాలు నిర్మూలించిన తర్వాత ఒక సమసమాజం ఏర్పడుతుంది. ఈ క్రమంలో శ్రామికవర్గం మాత్రమే అన్ని వర్గాలనూ నిర్మూలిస్తుంది. కానీ, కేవలం ఆధిపత్య వర్గాలను కూలదోసినంతటనే సరిపోదు. శ్రామిక వర్గం కూడా తనను తాను శుద్ధి చేసుకొని ఒక సార్వజనీన వర్గంగా వర్గరహిత సమాజాన్ని నిర్మించవలసి వుంటుంది.

వర్గరహిత సమాజంలో మార్క్స్ ప్రకారంగా "కమ్యూనిస్టు సమాజంలో ఎవరూ ప్రత్యేకరంగంలో పనిచేయవలసిన పరిస్థితులు వుండవు. కానీ ఎవరి కోర్కెలమేరకు వారు పనిని నిర్ణయించుకోగలిగిన సౌకర్యం ఏర్పడుతుంది. సాధారణ

ఉత్పత్తిని సమాజమే క్రమబద్ధీకరిస్తుంది. కావున ఇవ్వాళ ఒకపని చేసిన వారు రేపు మరొక పనిని ఎన్నుకొనే వీలు కలుగుతుంది." దాన్ని మార్క్స్ ఈ విధంగా అన్నారు. ఉదయం వేటాడతారు. మధ్యాహ్నం చేపలు పడ్తారు. సాయంకాలం పశువులను మేపుతారు. రాత్రిళ్ళు ఆలోచించే మెదడున్నందువల్ల విమర్శకుడు అవుతాడు. ఈ వైవిధ్యం వల్ల ఒక వ్యక్తి ఏ ఒక్క వేటగాడిగానో, చేపలు పట్టేవానిలాగానో, పశువుల కాపరిగానో కేవలం విమర్శకునిగానో వుండకుండా అన్నింటినీ అనుభవిస్తాడు.

హక్కులకు సంబంధించిన ఉదారవాద సిద్ధాంతాలను మార్క్స్ పూర్తిగా తిరస్కరించారు. ఎందువల్లనంటే అసమాన సమాజంలో హక్కులు అసమానతలకు చట్టబద్ధత కల్పించడానికే పనికివస్తాయి. అయితే నిర్మాణాత్మక అసమానతలను ధ్వంసం చెయ్యడంలో హక్కులు తమవంతు పాత్ర నిర్వహిస్తాయని మాత్రం మార్క్స్ అంగీకరించారు. కానీ, హక్కులు వ్యక్తిని పెట్టుబడిదారీ సమాజం అధికారసంబంధాల నుంచి మాత్రం కాపాడలేకపోయాయని అయన భావన. మరీ అయితే హక్కులు పెట్టుబడిదారీ సంబంధాల పరిధిలో తమతమ ప్రయోగాల సంగతి మాట్లాడే అవకాశాన్ని మాత్రం కల్పిస్తాయి. మార్క్స్ ప్రకారం "మనిషి మతం నుంచి స్వేచ్ఛ పొందలేదు. కానీ, హక్కులు వ్యక్తిని పెట్టుబడిదారీ సమాజం అధికార సంబంధాల నుంచి మాత్రం కాపాడలేకపోయాయని ఆయన భావన. మరీ అయితే హక్కులు పెటుబడిదారీ సంబంధాల పరిధిలో తమతమ ప్రయోగాల సంగతి మాట్లాడే అవకాశాన్ని మాత్రం కల్పిస్తాయి. మార్క్స్ ప్రకారం "మనిషి మతం నుంచి స్వేచ్ఛ పొందలేదు. కానీ అతనికి మతపరమైన స్వేచ్ఛ ఇచ్చారు. ఆస్తినుంచి అతను స్వేచ్ఛ పొందలేదు. కానీ అతనికి ఆస్తిహక్కు వుంది. వ్యాపార బుద్ధి నుంచి అతనికి స్వేచ్ఛ లేదు. కానీ అతనికి వ్యాపారంలో పాల్గొనే స్వేచ్ఛ లభించింది." అందువల్ల, మార్క్స్ నిజస్వాతంత్ర్యం గురించి ఈ వాదన చేశారు. సామాజికాంశాల మద్దతుతో ఒకరు తన శక్తిసామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకునే స్వేచ్ఛ లభిస్తేనే నిజస్వాతంత్ర్యం లభించినట్టు... అది వర్గరహిత సమాజంలోనే సాధ్యం.

## 8.2 మావో - పరిచయం

మావోత్సెటుంగ్ చైనా కమ్యూనిస్టు పార్టీ అధినేత. అందువల్ల ఆయన రచనల్లో ఎక్కువ భాగం చైనా విప్లవం ముందు, తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీ ఎదుర్కొన్న సమస్యలను చర్చించాయి. కానీ, చైనా ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని చేసిన ఆయా విశ్లేషణలు మానవ హక్కుల సమస్యలో అవగాహనకు తోడ్పడే ప్రతిపాదనలుగా వున్నాయి. వైరుధ్యాలపై, వైరుధ్యాల సవ్య పరిష్కారంపై, పది ప్రధాన సంబంధాలపై, ప్రజానియంతృత్వంపై ఆయన ప్రత్యేకంగా చేసిన రచనలు స్వాతంత్ర్యం అన్న పదానికి అర్థంతో పాటు సోషలిస్టు సమాజంలో దాని స్థానం ఏమిటో కూడా తెలియజెప్పాయి.

BRAOU

### 8.2.1 మార్క్స్ - మావో

మార్క్స్ ప్రకారంగా హక్కులు పెట్టుబడిదారులను ఉద్దేశించినవి. బూర్జువా విప్లవాల ఫలితంగా సరుకుల మారకంలో సమానత్వం, స్వాతంత్ర్యాల కోసం హక్కులు ఉద్భవించాయి. ఒకరు సరుకును తన ఇష్టమొచ్చినట్టుగా కొనుక్కోవడానికి, అమ్ముకోవడానికీ హక్కులు వీలు కల్పిస్తాయి.

బూర్జువా హక్కుల ప్రాథమికలోపం ఏమంటే అవి ఉత్పత్తిలో స్వాతంత్ర్యాన్నివ్వకుండా మారకంలో ఇస్తాయి. ఒకరు తమ ఇష్టం వచ్చిన ఉత్పత్తులను, ఇష్టమైన పనితో ఉత్పత్తిచేసే హక్కును పెట్టుబడిదారీ సమాజం కల్పించదు. ఎందువల్లనంటే శ్రామికశక్తి స్వయంగా ఒక సరుకు కొనగలరు కనుక. ఈ క్రమం వల్ల ఒకరు తమ సంతృప్తి కోసం శ్రామికశక్తిని వినియోగించే అవకాశం వుండదు. అందువల్ల పెట్టుబడిదారీ సమాజాన్ని ధ్వంసం చేసి వర్గరహిత సమాజం ఏర్పాటు చేస్తేనే నిజస్వాతంత్ర్యం వీలవుతుంది. అందువల్లనే మార్క్స్ బూర్జువా హక్కులను పూర్తిగా వ్యతిరేకించారు. అయితే పెట్టుబడిదారీ సమాజం, కమ్యూనిస్టు సమాజంగా మారే క్రమంలో మాత్రం హక్కులు అనే వ్యవస్థ కొనసాగుతూ వుంటుందని మాత్రం ఆయన అంగీకరించారు. అయితే దాన్ని ఆయన ఇంకా విపులీకరించలేదు. ఈ విధంగా

మార్క్స్ హక్కులను పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల వెల్లడిగా మాత్రమే భావించారు. ఆయన హక్కులను వివరించివాటిని, పెట్టుబడిదారీ సంబంధాల విమర్శల్లో తెగనాడారు.

మావో ప్రధానంగా వ్యావసాయిక దేశంలో, వెనుకబడిన దేశంలో జీవించారు. ఆయన వారి సమాజలక్షణాలను అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజంగా అభివర్ణించారు. అర్ధవలస రాజ్యంగా వున్న చైనాలో భూమిని ఆక్రమించుకున్న భూస్వాములు గ్రామీణ ప్రాంతాలమీద ఆధిపత్యం చెలాయించేవారు. మావో అన్నట్టుగా "భూస్వామ్య సమాజం క్రింద రైతులకు ఒక వ్యక్తి స్వాతంత్ర్యం కూడా వుండేది కాదు. ఒక రైతును భూస్వాములు కొట్టే, అవమానపరిచే, అవసరం అనుకుంటే చంపే హక్కు కలిగి వుండేవారు. రైతులకు మాత్రం ఎలాంటి రాజకీయ హక్కులూ వుండేవికావు'. చైనా కేవలం వెనుకబడిన భూస్వామ్య రాజ్యం మాత్రమే కాదు. వివిధ సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యం క్రిందకూడా అది నలిగిపోయేది. అందుకే మావో చైనాను 'అర్థవలస'గా కూడా అభివర్ణించారు. మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చైనాకు ఈ పరిస్థితుల నుంచి విముక్తి కల్పించింది.

మార్క్స్‌లాగే మావో కూడా హక్కులు పెట్టుబడిదారీ సమాజాలు ఉత్పత్తి చేసినవేనని భావించారు. కానీ ఆయన ఒక హక్కుల సిద్ధాంతాన్ని మాత్రం ప్రతిపాదించలేదు. కానీ ఒక వెనుకబడిన దేశంలో రాజకీయ కార్యకర్తగా మావో, మార్క్స్ ఎన్నడూ ఊహించని ప్రయోజనాల కోసం స్వాతంత్ర్యంగా భావించారు. మార్క్స్ ప్రకారం స్వాతంత్ర్యం వర్గరహిత సమాజంలో మాత్రమే లభిస్తుంది. కానీ మావో, సోషలిస్టు సమాజంలో కూడా ప్రజల ప్రయోజనాలు పరిరక్షించడానికి స్వాతంత్ర్యాన్ని ఒక షరతుగా భావించారు. మావో, మార్క్స్ సిద్ధాంతాన్ని నిరాకరించలేదు. కానీ, సోషలిస్టు సమాజాల్లో కూడా సోషలిజం పరిధిలో వ్యక్తులకు స్వాతంత్ర్యాన్ని హామీ ఇవ్వాలని మాత్రం కోరుకున్నారు. ఈ స్వాతంత్ర్యం పాలకులు అధికారాన్ని దుర్వినియోగపరచకుండా ప్రజలకు రక్షణగా పనిచేస్తుందని మావో భావించారు. దురదృష్టవశాత్తు మావో కూడా హక్కులకు సంబంధించి ఒక సమగ్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదు. అయితే ఆయన రచనల్లో స్వాతంత్ర్యం గురించి ఉటంకించిన విషయాలనే పరిగణనలోకి తీసుకొని హక్కుల సోషలిస్టు సిద్ధాంత నిర్మాణానికి ప్రాతిపదికగా స్వీకరించవచ్చును.

BRAOU

## 8.2.2 గుణాత్మకతపై మావో

చైనాలో 1920లో బెర్ట్రాండ్ రస్సెల్ చేసిన ఒక ప్రసంగంపై వ్యాఖ్యానిస్తూ మావో ఝెడాంగ్ స్వాతంత్ర్యంపై మాట్లాడారు. రస్సెల్ తన ప్రసంగంలో ఒక పెట్టుబడిదారుడు తన దోపిడీని వదులుకోవడానికి, వాదన ద్వారా చైతన్యవంతుల్ని చేయడం ద్వారా అతన్ని సిద్ధం చేయవచ్చును అన్నారు. ఈ క్రమంలో రస్సెల్ ఆలోచన ద్వారా హింసను తగ్గిస్తుందని, అదే సమయంలో స్వాతంత్ర్యంపై వున్న ఆంక్షలకు వున్న అవకాశాల్ని నిర్మూలిస్తుందని అన్నారు. కానీ, మావో ఈ విషయంపై మాట్లాడుతూ విద్యావిధానమే పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఉపయోగించుకుంటున్నప్పుడు ఎవరైనా విద్యద్వారా సంస్కరణలను ప్రవేశపెట్టే అవకాశమే లేదని కొట్టి పారేశారు. పెట్టుబడిదారులు ఈ ప్రయోజనాలకోసం ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి చట్టాలను రూపొందించిన వాటిని అమలు కూడా చెయ్యగలరని ఆయన అంటారు. ఇదే కాకుండా వారు వ్యవస్థలపై వున్న నియంత్రణను అంత సులభంగా వదులుకోరని కూడా మావో అభిప్రాయం. చరిత్రలో ఏ సమూహము అధికారాన్ని స్వచ్ఛందంగా వదులుకున్న దాఖలాలు లేవు. అందువల్ల ఆయా వ్యవస్థల నుంచి తప్పుకునేందుకు వత్తిడి తేవాల్సిందే. అప్పుడు కేవలం శ్రామికులు మాత్రమే సమాజాన్ని మార్చడానికి వివిధ వ్యవస్థలను ఏర్పరచుకుంటారు అని మావో అభిప్రాయం. మావో ఇట్లా అంటారు "పూర్తి స్వేచ్ఛ, అరాచకం, చివరకు ప్రజాస్వామ్యం గురించి నా ప్రస్తుత దృక్కోణంలో ఈ విషయాలన్నీ సైద్ధాంతికంగా బ్రహ్మాండంగా కనబడతాయి. కానీ ఆచరణలో శూన్యం". ఈ భావనలనే మావో ఇతర రచనల్లో చర్చ సందర్భంగా విపులీకరించి చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని మొత్తంగా మావో నిరాకరించలేదు. నిజానికి మావో 'నూతన తరహా బూర్జువా ప్రజాస్వామిక విప్లవం' కోసం పిలుపు ఇచ్చారు. చైనాను మార్చడానికి ఆయన ఈ సూచన చేశారు. అయితే పైన పేర్కొన్నట్టుగా ప్రజాస్వామ్యాన్ని సమగ్ర సామాజిక పరిస్థితుల్లో మాత్రమే చూడగలం. నూతన ప్రజాస్వామ్యం చైనాలో వున్న ప్రత్యేక పరిస్థితులకు సరిపడే సంధి దశగా మాత్రమే భావించారు. చైనాను పరిగణనలోకి తీసుకుంటే సోషలిస్టు సమాజ స్థాపనకు నూతన ప్రజాస్వామ్యం ఒక షరతుగా మావో భావించారు. అయితే మావో పేర్కొన్న నూతన ప్రజాస్వామ్యం పాశ్చాత్య దేశాల్లో బూర్జువా ప్రజాస్వామ్యానికి భిన్నమైనది. పాశ్చాత్య దేశాల్లో ప్రజాస్వామ్యం పెట్టుబడిదారుల విప్లవం వల్ల ఏర్పడింది. కాగా తూర్పుదేశాల్లో సామ్రాజ్యవాద ఆధిపత్యం వల్ల పెట్టుబడిదారీ వర్గం భూస్వామ్యాన్ని కూలదోసేంత సమర్థతను సాధించలేదు. అందువల్ల ఈ ప్రత్యేక పరిస్థితుల్లో భూస్వామ్యాన్ని నిర్మూలించే బాధ్యత చైనాలో శ్రామిక వర్గం మీద పడింది. చైనాలో శ్రామిక వర్గం ఇతర వర్గాలైన రైతులు, మధ్యతరగతి, జాతీయ బూర్జువాలతో కలిసి ఈ విప్లవాన్ని నిర్వహిస్తుంది. ఇతర వర్గాలతో కలిపి ఏర్పరిచే ఈ ప్రజాస్వామ్యాన్నే మావో 'నూతన ప్రజాస్వామ్యం'గా అభివర్ణించారు. నూతన ప్రజాస్వామ్యంలో భూస్వాముల' కమతాలను, భూమిలేని నిరుపేదలకు పంచాలి.' సామ్రాజ్యవాదులు, వారి తైనాతీల అధీనంలో వున్న పరిశ్రమలను స్వాధీనం చేసుకొని జాతీయం చెయ్యాలి. శ్రామికవర్గంలో కలిసివచ్చే ఇతర వర్గాలు మాత్రం ఆస్తిహక్కును కలిగి వుండాలి. వారు వారి పార్టీలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ కూడా వుండాలి. మావో ప్రకారంగా "నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ కాలం మొత్తమంతా కూడా చైనా ఒక వర్గం నియంతృత్వం క్రిందకానీ, ఒక పార్టీ గుత్తాధిపత్యం క్రిందగానీ వుండకూడదు".

నూతన ప్రజాస్వామ్యంలో రాజ్యాంగయంత్రాలైన పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థలను బలోపేతం చెయ్యాలని మావో ఎలాంటి సందేహాలకు తావులేకుండా స్పష్టంగా చెప్పారు. బలమైన రాజ్యం ప్రజలపట్ల ప్రేమగానూ, ప్రజాస్వామికంగానూ వ్యవహరిస్తుంది. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో తమనుతాము మళ్ళీ మలచుకోవడానికి రాజ్యం సహాయపడుతుంది. అయితే ఈ రాజ్యం ఏ సెక్షన్ ప్రజలతో కూడి వుంటుదన్నది కాలాన్నిబట్టి నిర్ధారణ అవుతుంది. విప్లవం వెనువెంటనే, మధ్యతరగతి, జాతీయ బూర్జువాలు, రైతాంగం, కార్మికులను ప్రజలుగా భావించవచ్చు. ఆతర్వాత ప్రజల్లోకి సోషలిజం కోసం పనిచేసే అన్ని వర్గాలవారిని కూడా ఆహ్వానించవచ్చు. సోషలిజానికి మద్దతు ఇచ్చేవారు ప్రజలు అనుభవించే అన్ని హక్కులనూ పొందుతారు. ఇదే సమయంలో సోషలిజాన్ని వ్యతిరేకించేవాళ్ళు తద్భిన్నంగా ఏ హక్కూ పొందరు. తిరోగమనవాదులకు ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నిరాకరిస్తారు. అందువల్ల నూతన ప్రజాస్వామ్యంలో అసలు సిసలైన ప్రజలు మాత్రమే స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తారు. అయితే కొత్త రాజ్యానికి వ్యతిరేకంగా పనిచేయనంతవరకు తిరోగమన శక్తులు కూడా స్వాతంత్ర్యాన్ని పొందవచ్చు. ఈ విధంగా అధికారం, క్రమశిక్షణల మధ్య సమతూకం పాటించే చర్యగా స్వాతంత్ర్యాన్ని మావో అభివర్ణించారు.

BRAOU

మావో వాదన ప్రకారం, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం రెండింటినీ వాటికవే పూర్తి అయినట్టు భావించరాదు. వాటిని కొత్త సమాజాన్ని సృష్టించే సాధనాలుగా మావో భావించారు. 'మార్క్సిజం ప్రజాస్వామ్యం ఉపరితలానికి సంబంధించింది, రాజకీయరంగానికి చెందినది బోధిస్తుంది. చివరగా దీన్ని ఇది అర్థికపునాదికి ఉపకరించేదిగా విశ్లేషించుకోవాలి' అని మావో అంటారు.

### 8.2.3 సోషలిస్టు పునర్నిర్మాణము - స్వాతంత్ర్యం

స్వాతంత్ర్యం, స్వేచ్ఛలకు సంబంధించి మావో భావనలను ఆచరణలో పెట్టినప్పుడు కొన్ని సమస్యలు అనివార్యమయ్యాయి. స్వాతంత్ర్యం, అధికారాల మధ్య సామరస్య సృష్టికి చేసిన ప్రయత్నాలు వ్యక్తి మీద పార్టీ, ప్రభుత్వం నియంత్రణకు దారి తీసాయి. పార్టీ క్రమశిక్షణ, సిద్ధాంతాలు, నాయకత్వాన్ని అంగీకరిస్తేనే స్వాతంత్ర్యం దొరికే పరిస్థితులు ఏర్పడ్డాయి. విప్లవ ఫలాలను పరిరక్షించుకోవడం కోసం పార్టీ నియంత్రణ అవసరమైంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని బలోపేతం చేయవలసి వచ్చింది. తిరోగమనశక్తుల అణచివేతకు బలమైన పార్టీ, బలమైన ప్రభుత్వ యంత్రాగం వుండాలని కోరుకున్న మావో, ఇందుకోసం పెద్దఎత్తున భౌతిక బలప్రయోగాలు జరగడాన్ని మాత్రం వ్యతిరేకించారు. కేంద్రీకృత నాయకత్వం మార్గదర్శకత్వంలో మన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకోసం నిలబడ్డప్పటికీ, సైద్ధాంతిక

విభేదాల పరిష్కారానికి, ప్రజల్లో తప్పు ఒప్పులు నిర్ధారణ చెయ్యడానికి బలప్రయోగం మాత్రం పరిష్కారం కాదు. బలప్రయోగం ఎప్పుడైనా అసమర్థమైందే కాకుండా హానికరమైంది కూడా అని మావో అభిప్రాయం.

ప్రజల్లో తప్పు, ఒప్పు సంగతికానీ, సైద్ధాంతిక అంశాలు కానీ, కళలు, విజ్ఞాన సమస్యలు కానీ చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించాలి. ఈ చర్చాస్వాతంత్ర్యాన్ని సోషలిజం నిర్మాణానికి, కొత్త భావాల సృష్టికి ఉద్దేశించాలి. ఇది ప్రజలను ఐక్యం చెయ్యడం, పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవడం, ప్రజాస్వామ్య నియంతృత్వం, శాంతిని ప్రేమించే దేశాలతో సంబంధాలు ఏర్పరచుకోవడం ద్వారా సాధించాలి.

మావో వాదన మొత్తం పార్టీకి అధికప్రాధాన్యత ఇచ్చిందే. అభివృద్ధి చెందిన చైతన్యానికి పార్టీ ప్రతీక అన్న తొలిభావన ఈ వాదనల్లో వుంది. పార్టీ ఎప్పుడూ తప్పుచెయ్యదనే విశ్వాసం వుంది. 1956 తర్వాత మావో ఈ నమ్మకాన్ని వదులుకున్నారు. హంగేరీలో కమ్యూనిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రజల తిరుగుబాటు, సి.పి.ఎస్.యు. 20వ పార్టీ సదస్సులో స్టాలిన్‌పై వెల్లువెత్తిన విమర్శలు, పార్టీకూడా తప్పుదారి పట్టవచ్చునని మావోకు అభిప్రాయం కలిగించింది. సోవియెట్ యూనియన్‌లో స్టాలిన్, లెనిన్‌కు వారసుడు. ఆయన మూడు దశాబ్దాలపాటు సోవియెట్ యూనియన్‌ను పరిపాలించాడు. సి.పి.ఎస్.యు 20వ సదస్సులో స్టాలిన్ నియంతృత్వ పోకడలపై విమర్శలు చెలరేగాయి. మావోత్సెటుంగ్, స్టాలిన్‌పై బహిరంగంగా వచ్చిన విమర్శలను అంగీకరించడం కానీ, హంగరీ తిరుగుబాటును సమర్థించడం కానీ చేయలేదు. కానీ, ఈ రెండు సంఘటనలు పార్టీ కూడా తప్పు చేస్తుందన్న అభిప్రాయాన్ని ఆయనకు కలిగించాయి. దాని తర్వాత దిగజారుడుతనానికి గల కారణాలను మావో అన్వేషించడం ప్రారంభించారు.

సమాజంలో పాతప్రభావాల వల్ల చెలామణి అయ్యే ఆలోచనల ప్రభావంతో కార్యకర్తల పార్టీని దుర్వినియోగం చేసే అవకాశం వుందని మావో గుర్తించారు. సమాజంలోనుంచే పార్టీ ప్రభవిస్తుంది. కూలద్రోసిన వర్గాలు, పాత సిద్ధాంతాలు, సంప్రదాయాలు, అలవాట్లు, సంస్కృతుల ప్రభావం సంధి దశలో కూడా పడతాయి. కేవలం ఆస్తిని జాతీయం చేసి, పాత పాలకపక్షాల నుంచి అధికారాన్ని లాక్కున్నంత మాత్రాన అవి సమసిపోవు అన్నది మావో భావన.

సోషలిజంలో కూడా అదేవిధంగా అనేకరకాల అసమానతలు కొనసాగుతాయి. ఉదాహరణకు ప్రతిభకల పనివానికీ, ప్రతిభలేని పనివారికీ మధ్య, మానసిక, శారీరక శ్రమజీవులకు మధ్య అసమానతలు సోషలిజంలో కూడా అంత సులభంగా చెరిగిపోవు. ఈ అసమానతలు సమాజంలో ప్రత్యేకతలు గల ఒక సెక్షన్ ఆవిర్భావానికి దారి తీస్తాయి. పాతసమాజపు ఈ పోకడలన్నీ పార్టీలో కూడా ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం పార్టీలో అధికారాన్ని చెలాయించే ఉన్నతశ్రేణి నాయకత్వం మెజారిటీకి వ్యతిరేకంగా మైనారిటీ ప్రజలకు సౌకర్యాలు కలుగజేసే దిశగా పడుతుంది.

అయితే, రాజకీయ అధ్యయనం ద్వారా మాత్రమే తప్పులు చేసే పార్టీ క్యాడర్‌ను, నాయకత్వాన్ని, మళ్ళీ తప్పులు చెయ్యకుండా సరిదిద్దగలం. అందుకోసం మావో పార్టీ నాయకులకు, ప్రభుత్వ నిర్వాహకులకు ప్రజలతో సంబంధాలు పెట్టుకోవాలని పదేపదే సూచించారు. ఇంతాజేసి కొందరు పాతపద్ధతుల్లోనే పనయిస్తున్నట్టు మావో కనిపెట్టారు. ఇక ప్రజల విమర్శమాత్రమే పార్టీ క్యాడర్ తమనుతాము సరిదిద్దుకోవడానికి, తద్వారా ప్రజలకు మరింత బాధ్యత వహించడానికి తోడ్పడుతుందని మావో భావించారు. ఈ దిశలోనే సోషలిస్టు అధ్యయనం, సాంస్కృతిక విప్లవం రూపుదిద్దుకున్నాయి. పరిశ్రమల జాతీయీకరణ, భూముల సముదాయీకరణ మాత్రమే ప్రజల్లోని సంఘర్షణలను రూపుమాపగలవని మావో భావించారు. పాతచైనాలో భూమి, పరిశ్రమలు కొందరి యాజమాన్యంలో మాత్రమే వుండేవి. వాటిని వారు పరులను దోపిడీ చేసే ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించేవారు. అందువల్ల ఉత్పత్తి సాధనాల యాజమాన్యానికి, పీడితులకు మధ్య ఘర్షణ వుండేది. సోషలిస్టు కాలంలో ఉత్పత్తి సాధనాలలో భాగస్వామ్యం ద్వారా, చర్చలు, ప్రజా విమర్శలలో ఘర్షణలను నివారించవచ్చునని మావో బోధించారు. అయితే ఏ ప్రజలు పార్టీని విమర్శించే స్వాతంత్ర్యం పొందుతారో అన్న విషయాన్ని మాత్రం మావో విపులీకరించలేదు.

BRAOU

### 8.2.4 మారకం - సమానహక్కులు

చైనా కమ్యూనిస్టు పార్టీ రైతాంగానికి సంబంధించిన ఆస్తిని సరైన నష్టపరిహారం లేకుండా స్వాధీనం చేసుకోకూడదని మావో ఎల్లవేళలా క్యాడర్‌కు బోధించేవారు. 1955 దాకా కూడా రైతాంగం ప్రైవేటు ఆస్తి కలిగి వుండడానికి అంగీకరించారు. ఈ కాలంలో భూసేకరణలు లేవు. సహకార సంస్థలు ఏర్పాటు చేయడానికి తమ భూమిని కూడా సాముదాయిక భూమిలో కలిపివేయాలని రైతాంగానికి నచ్చచెప్పేవారు. ఉమ్మడి వ్యవసాయక్షేత్రాల ఏర్పాటులో బలవంతం తగదని మావో వాదించారు. 1958లో ఉమ్మడి వ్యవసాయ సహకార క్షేత్రాలను మరింతవేగవంతమైన ఆర్థిక అభివృద్ధి సాధనకోసం 'కమ్యూన్'లుగా మార్చారు. అప్పుడు భూమి, రైతుకు సంబంధించిన పనిముట్లు అన్నీ ఉమ్మడి భాగస్వామ్యంలోకి వచ్చాయి. మహిళలు గృహవిధుల నుంచి విముక్తి పొందడానికి కమ్యూనిస్టులు వంటశాలలు, పిల్లల పెంపకం కేంద్రాలు నిర్వహించేవారు.

చైనాలో స్వయం యాజమాన్య, స్వయంనియంత్రణా సంస్థలుగా కమ్యూన్‌లను స్థాపించారు. పరస్పర సహకారం కోసం వాటిని సృష్టించారు. కమ్యూన్ రైతాంగం కేవలం వ్యవసాయ పనులేకాకుండా గ్రామీణాభివృద్ధి పథకాలను కూడా చేపట్టేవారు. ఇనుపకొలిమిలాంటి లఘు పరిశ్రమలకు కూడా కమ్యూన్‌లు ఏర్పాటు చేసుకున్నాయి. కానీ ఈ ఏర్పట్లలో పార్టీ కార్యకర్తలు ఏకపక్షంగా వ్యవహరించారు. రైతుల వ్యక్తిగత ఆస్తులను కూడా వారు కమ్యూన్‌ల పరంచేశారు. ఈ నేపథ్యంలో మారకం సమాన ప్రాతిపదికన జరగాలని మావో ప్రతిపాదించారు. మారకం చెల్లింపుల విషయంలో పనినిబట్టి, సమాన విలువలను బట్టి వెలకట్టాలని ఆయన ప్రతిపాదన.

ఎవరి సామర్థ్యం మేరకు వారికి ఎవరి అవసరాల మేరకు వారికి, అన్న కమ్యూనిస్టు సూత్రాల ప్రకారంగా సోషలిస్టు దశలోనే వ్యవహరించరాదు. ఒకసారి పరిశ్రమలు జాతీయం చేసిన తర్వాత భూమి ఉమ్మడి భాగస్వామ్యంలోకి తెచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఉత్పత్తి సాధనాలను స్వంతం చేసుకోలేరు. అందువల్ల ప్రజలు వినియోగవస్తువులను స్వంతం చేసుకుంటారు. వారి సామర్థ్యం మేరకు వ్యక్తులు వస్తువులను వుంచుకోవడాన్ని అందుకే కొనసాగనివ్వాలి. వేతనాలు కూడా పని ఫలితాన్ని బట్టి చెల్లించాలి.

వస్తుమారకానికి సంబంధించి, సమాన విలువల మారకం సూత్రాన్ని పాటించాలి. ఆచరణలో వస్తువులను వాటి విలువ ప్రకారం చెల్లించాలి. ఈ మార్క్సిస్టు సూత్రాల వెలుగులో మావో ధర చెల్లించకుండా సేకరణలు ఎలాంటివైనా దొంగతనాల వంటివేనని అంటారు. అయితే క్రమానుగతంగా ఇది సామర్థ్యం మేరకు, అవసరాల మేరకు పరిణామం చెందుతుంది. నిజానికి సమాన విలువల మారకం అనేది బూర్జువా హక్కు. ఇది అసమానతలకు, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణకు మార్గం సుగమం చేసే అవకాశం వుంది. అందువల్ల ఈ బూర్జువా హక్కును మావో కొన్ని ఆంక్షలతో అంగీకరించారు.

### 8.2.5 సోషలిస్టు హక్కుల సిద్ధాంతం - అవసరం

ఈ చర్చ తర్వాత తేలేదేమంటే స్వాతంత్ర్యం అనేది మావోకు సంబంధించి స్వతహాగా విలువైనది ఏమీ కాదు. దానికి అదిగా స్వాతంత్ర్యాన్ని సాధించలేము. సోషలిస్టు సమాజాలలో స్వాతంత్ర్యాన్ని, సోషలిస్టు నిర్మాణానికి అనుగుణంగా పునర్ నిర్వచించాలి. ఆచరణలో స్వాతంత్ర్యం, క్రమశిక్షణ, ప్రజాస్వామ్యం, కేంద్రీకృతంల మధ్య సమతూకం పాటించాలి. అయితే కేంద్రీకృత విధానాలు స్వాతంత్ర్యానికి బెడద కావొచ్చు. ఈ విధంగా పార్టీ, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే నియంతృత్వ ధోరణులకు లోనయ్యే అవకాశం వుందని భావించినప్పటికీ, వీటిని అరికట్టడానికి మావో ఏ ప్రత్యామ్నాయం చూపలేదు. ఈ రకమైన లోపాలుగల కార్యకర్తలను సవరించడానికి అధ్యయనం, చర్చలు, ప్రజావిమర్శ అనే పద్ధతులను సూచించారు. కానీ ఇందుకోసం ఆయన ఏ యంత్రాంగాన్నీ, పరిష్కార మార్గాన్నీ సూచించలేదు. స్వాతంత్ర్యాన్ని, ముఖ్యంగా తప్పు, ఒప్పుల నిర్ధారణకు సంబంధించిన అంశాల్లో బలప్రయోగం నుంచి రక్షించడం మాత్రం ఆయన గుర్తించారు. ఈ విషయంలో మాత్రమే, సోషలిస్టు తరహా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికి మావో హక్కుల వ్యవస్థను సూచించవలసింది. స్వాతంత్ర్యం గురించి ఎన్నో ప్రధాన ప్రతిపాదనలు చేసిన మావో,

BRAOU
Dr. BRAOU LIBRARY
Acc. No. Class No. 115095 3-2-16

స్వాతంత్ర్య పరిరక్షణ కోసం హక్కుల సిద్ధాంతాన్ని మాత్రం ప్రతిపాదించలేదు. ప్రజాస్వామ్య పద్ధతులకు హామీ పడే హక్కుల పాలనకోసం ప్రయత్నించలేదు. తద్వారా అధికారుల బలప్రయోగాన్ని నివారించే ప్రయత్నం చెయ్యలేదు. భావ ప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణకు, సోషలిజం పరిధిలో సాంఘిక సంక్షేమాన్ని హామీ పడే విధంగా ప్రతిపాదనలేవీ లేవు. సామూహిక ప్రయోజనాలతో కొరపడే వ్యక్తిగత ప్రయోజనాలను పరిరక్షించడానికి, వాటిని అధికారుల బలప్రయోగం నుంచి రక్షించడానికి స్వాతంత్ర్యాన్ని ఒక షరతుగా సోషలిస్టు హక్కుల సిద్ధాంతానికి మావో ప్రాతిపదిక ఏర్పాటు చేశారు. సోషలిస్టు హక్కుల సిద్ధాంతం సామూహికత నుంచి వ్యక్తిని రక్షించే బదులుగా వ్యక్తులు పరస్పరం సహకరించుకోవడంగా రూపొందింది.

## 8.3 ముగింపు

హక్కుల భావనే ప్రాథమికంగా పెట్టుబడిదారీ సామాజిక క్రమంలో వేళ్ళూనుకున్న భావన అని మార్క్స్ భావించారు. మొత్తం రాజకీయ వ్యవస్థ అంతా శ్రామికుల ఉత్పత్తి శక్తిని అంచనా వేసే ఆర్థిక క్రమాన్ని సృష్టించి దానికి మద్దతు ఇవ్వడానికే ఏర్పడిందని ఆయన భావన. ఈ పరిస్థితుల్లో ఒక శ్రామికుని హక్కు అతను తన శ్రమశక్తిని అమ్ముకోవడానికివిగానీ, ఆ శ్రామికుడు తన శ్రమను తన ఇష్టం వచ్చినట్టు వినియోగించడానికి కాదు. మౌలిక సంబంధం మారనంతవరకు నిజస్వాతంత్ర్యం లేదని మార్క్స్ దృఢాభిప్రాయం. మావో ఈ హక్కుల భావనను సందర్భానుసారం అన్వయించారు. ఆయన ఈ క్రమంలో నూతన ప్రజాస్వామ్యం, సామాజికక్రమాన్ని రూపొందించారు. ఈ నూతన క్రమం ప్రకారం సమాజాలు మార్పులో విభిన్న దశలలో సాగాలి. ఈ క్రమంలో బూర్జువా హక్కులకు కూడా పాత్ర వుంటుంది. ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, హక్కులు వాటికి అవే అంతం కావు. అవి ఒక కొత్త సామాజిక క్రమంలో మాత్రమే మనుగడలో వుంటాయి.

## 8.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి

1. పెట్టుబడిదారీ స్వాతంత్ర్యం భావనపై మార్క్స్ విమర్శ ఏమిటి ?
2. మానవ స్వాతంత్ర్యం పై మార్క్స్ భావనలపై మీరేమనుకుంటున్నారు ? మానవ హక్కుల చర్చకు దాన్ని మీరెలా ముడపెడతారు ?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి**

1. స్వాతంత్ర్యం, హక్కుల మార్క్సిస్టు భావనలను విస్తరించడంలో మావో పాత్ర ఏమిటి ? చర్చించండి.
2. మార్క్స్, మావో అభిప్రాయాలను ఈ పాఠంలో వెల్లడించిన విషయాలను ఆధారం చేసుకొని మానవ హక్కుల స్వభావంపై మౌలిక ప్రభావాలను చర్చించండి.

BRAOU

# భాగం - 9 : మానవహక్కులు : రోజాలగ్జెంబర్గ్, ఆంటోనియోగ్రాంసీ

**విషయక్రమం**

9.0 ఉద్దేశం

9.1 పరిచయం

9.2 రోజాలగ్జెంబర్గ్

 9.2.1 రోజాలగ్జెంబర్గ్ - జీవితం

 9.2.2 వేతన బానిసత్వం నుండి విముక్తి - మానవహక్కులకొక కొత్త నిర్వచనం

 9.2.3 ప్రజల నుండి నేర్చుకోవడం - మానవహక్కుల సంస్థను ప్రజాస్వామికరించడం

9.3 ఆంటోనియో గ్రాంసీ జీవితము కాలము

 9.3.1 గ్రాంసీ ఆలోచనలు (7 ప్రతిపాదనలు)

9.4 ముగింపు

9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 9.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- సోషలిజంలో మానవహక్కులకు గల ప్రాధాన్యత తెలుస్తుంది.
- రోజాలగ్జెంబర్గ్ మానవహక్కులకు ఇచ్చిన కొత్త నిర్వచనాన్ని అర్థం చేసుకోవచ్చు.
- ఆంటోనియోగ్రాంసీ యొక్క మానవ హక్కులు ఆలోచనలు అర్థమవుతాయి.

## 9.1 పరిచయం

యూరప్‌లో ఈ శతాబ్దం తొలిరోజులలో మానవహక్కుల అజెండాను రూపొందించడంలో ఇద్దరు ప్రముఖ మార్క్సిస్టు మేధావులు నిర్వహించిన పాత్రను ఈ పాఠంలో చూద్దాం. వారు రోజాలగ్జెంబర్గ్, ఆంటోనియో గ్రాంసీ. మార్క్స్ భావించిన సామాజిక పరిణామ క్రియకు ఈ ఇద్దరూ చేసిన చేర్పును ఈ పాఠంలో తెలుసుకుందాం. పెట్టుబడిదారీ సమాజం నుండి సోషలిస్టు సమాజానికి జరిగే పరిణామం గురించి, ఆ పరిణామ క్రమంలో మానవహక్కుల స్థానాన్ని గురించి వాళ్ళు చేసిన ఆలోచనను తెలుసుకుందాం. ఈ పరిణామ క్రియలో పాల్గొనే సంఘటిత సంస్థ స్వభావాన్ని గురించి, మానవహక్కుల ఉద్యమం ఏ పీడిత ప్రజలకోసమయితే కృషి చేస్తుందో ఆ పీడిత ప్రజలతో దానికి ఉండే సంబంధాన్ని గురించి తెలుసనుకుందాం. సమాజంలో - బహు రూపకంగా ఉండే అధికార వ్యవస్థల గురించి, వాటిని మార్చాలన్న మానవహక్కుల ఉద్యమకాంక్ష గురించి ఈ ఇద్దరూ ఏం చెప్పారో కూడా చూద్దాం.

రోజాలగ్జెంబర్గ్, ఆంటోనియోగ్రాంసీల కృషికి 1917లో రష్యావిప్లవం జరిగే నాటికి సోషలిస్టు ఉద్యమం, సిద్ధాంతం తీసుకున్న రూపాన్ని నేపథ్యంగా భావించాలి. సోషలిస్టు సిద్ధాంతంలో మానవహక్కుల భావనకు మూడు పార్శ్వాలు ఉన్నాయి. (అ) మానవహక్కులు, (ఆ) ప్రజాస్వామ్యహక్కులు (ఇ) పౌరహక్కులు. వ్యక్తిని సమాజాన్ని ప్రకృతి ఆధిపత్యం నుండి విముక్తం చేసే స్వేచ్ఛ గురించి చెప్పేది మానవహక్కుల భావన. సామాజిక పెత్తనం నుండి స్వేచ్ఛను గురించి చెప్పేది మానవహక్కుల భావన. సామాజికపెత్తనం నుండి స్వేచ్ఛను గురించి చెప్పేది ప్రజాస్వామిక హక్కుల భావన. రాజ్యం ఆధిపత్యం నుండి వ్యక్తికి, సమాజానికి ఉండవలసిన స్వయం ప్రతిపత్తి గురించి చెప్పేది పౌరహక్కుల భావన.

BRAOU

ఈ రకంగా నిర్వచించుకున్న మానవహక్కుల మూలాన్ని జాన్‌లాక్, మార్క్స్‌లు ఉత్పత్తి శక్తులలో చూస్తారు. మనిషికీ ప్రకృతికీ మధ్యనున్న ఐక్యతా పోరాటాలలో మానవహక్కుల ఉనికి ఉంది. జీవించాలి, బాగా జీవించాలి, ఇంకా ఎక్కువకాలం జీవించాలి అనే హక్కును ఉదాహరణగా తీసుకోవచ్చు. సమాజంలో మనుషుల మధ్యఉండే ఐక్యతాపోరాటాలలో ప్రజాస్వామ్యహక్కుల మూలాన్ని చూడవచ్చు. ఉదాహరణగా స్త్రీ పురుష సమానత్వపుహక్కును తీసుకోవచ్చు. సమాజానికీ రాజ్యానికీ మధ్యనున్న ఐక్యతాపోరాటాల వ్యక్తీకరణగా పౌరహక్కుల భావనను తీసుకోవచ్చు. భావప్రకటనా స్వేచ్ఛను, సంఘాలు పెట్టుకునే హక్కును ఇక్కడ ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ పౌరహక్కులు సమాజంలో పుడతాయి. అయితే వాటికి గీటురాయి సమాజంలో మనుషుల మధ్య ఉండే సంబంధాలు కావు. సమాజానికీ రాజ్యాధికారానికీ మధ్యనున్న సంబంధం వాటికి గీటురాయి. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే లాక్‌గానీ మార్క్స్‌గానీ రాజ్యంలో హక్కులను చూడరు. వాళ్ళ దృష్టిలో రాజ్యంలో హక్కులు లేవు. హక్కులు సమాజానికీ ప్రజలకూ చెందుతాయి.

లాక్‌దృష్టిలోనూ, మార్క్స్‌దృష్టిలోనూ కూడా అన్ని హక్కులలోనికీ మానవహక్కులు ప్రధానమైనవి. మానవహక్కులకు ఏమేరకు తోడ్పడతాయన్నదే పౌరహక్కులకు ప్రమాణం అని లాక్ అంటారు. . ఉదాహరణకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ నైనా, సంఘాలు పెట్టుకునే హక్కునైనా బాగా బతికే హక్కుకూ ఎక్కువ కాలం బతికేహక్కుకూ ఏమేరకు తోడ్పడతాయనే విషయాన్ని పౌరహక్కులకు అర్థం , ప్రాముఖ్యం మానవ హక్కుల సాధన నుండే వస్తాయి.

మానవహక్కుల ఉద్యమం అంటున్నామంటే పైమూడు అంశాలను కలిపి మాట్లాడుతున్నాయని అర్థం. పౌరహక్కుల ఉద్యమం అన్నప్పుడు మానవహక్కుల ప్రస్తావన ఉండనవసరం లేదు. ఉదాహరణకు, బాగా బతికే హక్కు అనే దానిని ప్రస్తావించకుండా వాక్ స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడవచ్చు. మానవ హక్కుల ఉద్యమానికి పైమూడు రకాల హక్కులు కీలకమని దీనినిబట్టి అర్థం అవుతుంది. ఆ లక్షణం పౌరహక్కుల ఉద్యమానికీ ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమానికీ ఉండనవసరం లేదు. అవి మానవహక్కుల భావనను ప్రస్తావించకనే పోవచ్చు. దానిని కప్పిపెట్టవచ్చుకూడ.

మానవహక్కులకు ఇచ్చిన పై నిర్వచనం ఆధారంగా రోజాలగ్జెంబర్గ్, అంటోనియోగ్రాంసీల కృషిని చూడాలి. చరిత్రలో ఆయా దశలలో కనిపించే భిన్నరూపాల సామాజిక అణచితవేతలను అంతమొందించి, మనిషి ప్రకృతితో ఐక్యతా సంఘర్షణల రూపంలో తనను తాను సంపూర్ణంగా అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించడం మానవహక్కుల ఉద్యమం లక్ష్యం.

## 9.2 రోజాలగ్జెంబర్గ్ (1870 - 1919)

### 9.2.1 రోజాలగ్జెంబర్గ్ జీవితం:

రోజాలగ్జెంబర్గ్ పోలెండ్, లిథ్‌వేనియా దేశాల సోషల్ డెమోక్రటిక్ పార్టీ వ్యవస్థాపకులలో ఒకరు. జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని వామపక్షమైన స్పార్టకస్‌లీగ్ నాయకురాలు. ప్రముఖ మార్క్సిస్టు ఆర్థికశాస్త్రవేత్త. ఆమె పోలెండ్‌లోని ఒక చిన్న ఊరిలో పుట్టారుగానీ తన బాల్యం, యవ్వనం వార్సాలో గడిపింది. ఆమె తండ్రి వర్తకుడు. తల్లి సంప్రదాయక జర్మన్ సాహిత్యంలో నిష్ణాతురాలు. అందువల్ల సంప్రదాయక జర్మన్ సంస్కృతిని అభిమానించే ఉదారవాద వాతావరణంలో రోజా పెరిగింది.

ఆమె విద్యార్థిగా ఉండగానే సోషలిస్టు విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొనింది. 1889లో, అంటే 19సంవత్సరాల వయస్సులో తనదేశం విడిచిపెట్టి పారిపోవలసి వచ్చింది. జర్మనీలోని జూరిక్ విశ్వవిద్యాలయంలో ప్రకృతిశాస్త్రాలు అధ్యయనం చేయడం కోసం ఆమె చేరింది. అయితే తనకు రాజకీయార్థిక శాస్త్రమంటేనే ఎక్కువ ఆసక్తి ఉందని గమనించి 1892 లో ఆమె న్యాయశాస్త్ర అధ్యయనాలపైన దృష్టి మళ్ళించింది. యూనివర్శిటీలో ఉండగానే ఆడంస్మిత్, రికార్డో, రాడ్‌బర్టస్, అందరికంటే ముఖ్యంగా కారల్‌మార్క్స్ రచనలు అధ్యయనం చేసింది. 28 సంవత్సరాల వయసులో

BRAOU

'పోలెండ్ పారిశ్రామిక అభివృద్ధి' అనే అంశంపైన సిద్ధాంత వ్యాసం సమర్పించి డాక్టరేట్ పొందింది. పోలెండ్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ రూపొందించుకున్న రాజకీయకార్యక్రమానికి ఆమె సిద్ధాంతవ్యాసం ప్రాతిపదిక అయింది.

జర్మనీలోని సోషలిస్టు ఉద్యమంలో పాల్గొనడం కోసం జర్మన్ పౌరసత్వం అవసరమయి ఆమె ఒక జర్మన్ జాతీయునితో కృత్రిమంగా వివాహతంతు జరిపించుకుంది. 1897 నుండి తన మరణందాకా ఆమె బెర్లిన్‌లో ఉండింది 1919లో, 49 సంవత్సరాల వయసులో, జనవరి 15నాడు ఫాసిస్టు మూకలు ఆమెను హతమార్చారు. ఆమె మృతదేహం మే నెలలో మరుగుకాలువలో దొరికింది.

'సామాజిక సంస్కరణా, విప్లవమూ (1899), సార్వత్రిక సమ్మె (1906), 'పెట్టుబడి పోగుదల' (1913), 'జూనియస్ పాంప్లెంట్' (1916) ఆమె రచనలలో ముఖ్యమైనవి.

ప్రజాపంథాను విప్లవాత్మకంగా సిద్ధాంతీకరించిన వ్యక్తిగా రోజాలగ్జెంబర్గ్ పేరు పొందింది. వామపక్షంలోనూ మితవాదులలోనూ కూడ ఇది వివాదానికి దారి తీసింది. ప్రపంచపెట్టుబడిని అర్థం చేసుకోవడానికి ఆమె ఆర్థిక విశ్లేషణలు కల్పించే అవకాశం కూడ ఒక ప్రముఖ కృషి.

## 9.2.2 వేతన బానిసత్వం నుండి విముక్తి : మానవ హక్కుల కొక కొత్త నిర్వచనం

1898 - 99లో రోజాలగ్జెంబర్గ్ ఎడ్వర్డ్‌బర్న్‌స్టైన్ ప్రతిపాదించిన రివిజనిస్టు పంథాపైన పెట్టిన విమర్శలో ఆమె ప్రతిపాదించిన ప్రజాపంథా మొట్టమొదటిసారి రూపం తీసుకుంది. ఉదారవాదమే ప్రజాస్వామ్యానికి ఉన్నతరూపమనీ, ఉదారవాద ప్రజాస్వామ్యం వోటుహక్కును ఆస్తినుండి విముక్తం చేసి దానికి 'సార్వజనీన' ప్రమాణాలు కల్పించిందనీ బెర్న్‌స్టైన్ వాదించాడు. కాబట్టి కార్మికవర్గం విప్లవాత్మకంగా 'రాజ్యాన్ని స్వాధీనం' చేసుకోవడం అనే ప్రక్రియకాక ఉదారవాద ప్రజాస్వామ్య రాజ్యంలో పాల్గొని కాలక్రమంలో సంస్కరణలు సాధించే పద్ధతే సోషల్ డెమోక్రసీకి ప్రపంచవ్యాప్తంగా ఈ రోజు తగిన మార్గమని బెర్న్‌స్టైన్ వాదించాడు.

బెర్న్‌స్టైన్ తర్కానికి విరుద్ధంగా ఓటుహక్కు విస్తరించి నప్పటికీ కార్మికవర్గం ఇంకా వేతన బానిసత్వంలో బతుకుతున్నారనీ పెట్టుబడి ఆధిపత్యంలో ఉత్పత్తి సాధనాలకు కార్మికులు పరాయివాళ్ళయి పోవడం దీనికి కారణమనీ లగ్జెంబర్గ్ వాదించింది. ఓటుహక్కు సార్వజనీనం కావడం వల్ల కార్మికులకు సంస్కరణల కోసం పోరాడే హక్కు లభించిన మాట వాస్తవమే గానీ ఆ రాజకీయ అవకాశం దానంతటదే కార్మికుల వేతన బానిసత్వాన్ని పోగొట్టలేదని ఆమె వాదించింది. అందువల్ల ఆమె రెండు పంథాలగల పోరాటాన్ని సూచించింది. సంస్కరణలను బహిష్కరించాలన్న బ్లాంక్వీపంథాకు విరుద్ధంగానూ విప్లవాన్ని వదులుకోవాలన్న బెర్న్‌స్టైన్ పంథాకు విరుద్ధంగానూ ఆమె వాదిస్తూ ఇవి రెండూ కూడ ఆయా సందర్భాలలో వేతన బానిసత్వం నుండి విముక్తి పొందే కృషికి ఆటంకం కాగలవని వాదించింది. ఆ విముక్తే సోషలిజం సారాంశం అనింది.

## 9.2.3 ప్రజల నుండి నేర్చుకోవటం: మానవహక్కుల సంస్థను ప్రజాస్వామీకరించడం:

అయిదు సంవత్సరాల తరువాత 1904లో, లెనిన్ రాసిన ' ఒక్కడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అనే రచనపైన చర్చ జరుపుతూ ఆమె రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో కేంద్రీకరణ గురించి లెనిన్ చేసిన ప్రతిపాదన అప్పటికి స్థానికంగా ఉన్న విప్లవకారబృందాలకు 'జాతీయ' స్వభావం కలిగించడానికి ఉపయోగపడవచ్చునని అంగీకరిస్తూనే, లెనిన్ పార్టీలో కేంద్రీకరణను శాశ్వత విషయంగా చూడడం బ్లాంక్విజంకు దారితీయగలదనీ అంటే విప్లవక్రమం ప్రజాబాహుళ్య స్వభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉందనీ వాదించింది.

పార్టీ గురించి రోజాలగ్జెంబర్గ్ అవగాహన కంటె లెనిన్ అవగాహన ఉన్నతమైనదని చాలామంది వ్యాఖ్యాతల అభిప్రాయం. అయితే లగ్జెంబర్గ్ ప్రజాపంథాను ప్రజలు తమంతటతామే విప్లవ ఆచరణ చేపడతారన్న పద్ధతిలో అర్థంచేసుకుందని వ్యాఖ్యానించినప్పుడు మాత్రమే ఇది సాధ్యం. అయితే స్టాలిన్, జార్జ్ లూకాచ్‌లు చేసిన ఈ వ్యాఖ్యానం

వక్రీకరణ తప్ప వేరే ఏమీ కాదు. విప్లవం స్వతస్సిద్ధంగా ఎదగాలని ఆమె సూత్రీకరించగా, అది కార్మికుల అస్తిత్వం నుండి 'సమాజంగా' ఉత్పన్నమయ్యే క్రియే తప్ప సామాజిక చారిత్రక క్రియకాదని ఆమె అంటున్నదని లూకాచ్ వ్యాఖ్యానించాడు. అందువల్ల ఆమె పార్టీ పాత్రను తక్కువ చేస్తున్నదని అన్నాడు. లగ్జెంబర్గ్ ఆలోచనలను ఈ విధంగా వ్యాఖ్యానించడం సరయినది కాదు.

ప్రజల ఆచరణ తనస్థానిక పరిమితుల నుండి ఎదిగి జాతీయ స్వభావం సంతరించుకోవలన్నా రాజకీయంగా పరిపక్వం కావాలన్నా ప్రజలకు సరయిన తాత్విక రాజకీయనాయకత్వం కావాలని రోజాలగ్జెంబర్గ్ బలంగా వాదిస్తుంది. 1904లో ఆమె లెనిన్‌తో పెట్టుకున్న వాదనలో కేంద్రీకృతపార్టీ నిర్మాణానికి లెనిన్ ఇచ్చిన ప్రాముఖ్యాన్ని సాధనంగా స్వీకరించింది. అదేవిధంగా, 1917 రష్యావిప్లవంలో బొల్షెవిక్ నాయకత్వం పాత్రను విమర్శించినప్పుడు కూడ, ' ముందు మనం మెజారిటీ అయ్యేదాకా ఆగుదాం' అన్న మెన్షెవిక్‌ల వైఖరిని ఆమె తిరస్కరించింది. సోషలిస్టు పరిణామం కోసం 'అధికారాన్ని స్వాధీనం చేసుకోవడం' అన్న బొల్షెవిక్ చొరవను ఆమె ఆహ్వానించింది. 'విప్లవ ఎత్తుగడల ద్వారా మెజారిటీ అవుతాం - అదే మనబాట' అని ఒప్పుకొంది. కాబట్టి 1904లో గానీ 1917లో గానీ ఆమె లెనిన్‌తో పెట్టుకొన్న వాదనలో పార్టీని తిరస్కరించే వైఖరి ఏ కోశానా లేదు.

1917లో లగ్జెంబర్గ్ రష్యావిప్లవంపైన పెట్టిన విమర్శ మరొకసారి ప్రజాపంథా లేకపోవడాన్ని కేంద్రవిషయం చేసింది, బొల్షెవిక్ నాయకత్వంలో ఉన్న ఈ సైద్ధాంతికలోపం ఫలితంగా రష్యావిప్లవం తన కార్మికస్వభావాన్ని నిలబెట్టుకోవడం రాజకీయంగా కష్టతరమైందని ఆమె వాదించింది. రష్యావంటి పెట్టుబడి పూర్వ సమాజాలలోకి పెట్టుబడి ఆలస్యంగా ప్రవేశించడం కార్మికవర్గంపైననే కాక మధ్యతరగతి పైన కూడ ప్రభావం వేసిందని ఆమె తనవాదనలో చూపించగలిగింది. ఆ స్థితిలో పెట్టుబడికి వ్యతిరేకంగా జరిగిన సోషలిస్టు ఉద్యమం కార్మికులనేకాక కార్మికేతరులను కూడ ఆకర్షించగలిగింది. కార్మికేతరులను కూడ కలుపుకుపోవడం అవసరం అని ఆమె గుర్తించినప్పటికీ, ప్రజాపంథా లేకపోతే రష్యావిప్లవంపైన మధ్యతరగతి పెత్తనం శాశ్వతంగా నెలకొంటుందని హెచ్చరించింది. అంతేకాక, ఆ కార్మికేతరులు 'డీ-క్లాస్' కాకుండ అది అర్థం పడుతుందనీ సోషలిస్టు సంస్థనుండి కార్మికులు సైద్ధాంతికంగా, తాత్వికంగా దూరం కావడం మొదలవుతుందని కూడ ఆమె అనింది.

ఆమె 1916 - 18 మధ్యకాలంలో ఖైదులో ఉండగా బొల్షెవిక్ విప్లవంపైన లోతయిన విమర్శ పెట్టింది. జాతీయ అసెంబ్లీనీ ఎన్నికలనూ గుర్తించకపోవడం; బొల్షెవిక్‌లు కాని పార్టీలకూ పార్టీ సభ్యులు కాని ప్రజలకూ స్వేచ్ఛలేకుండ చేయడం; ఒక పక్క పరిశ్రమలను జాతీయం చేస్తూ మరొకపక్క వ్యవసాయకమతాలను వ్యక్తిగత స్థాయిలో పంపిణీ చేసే విధానాన్ని అవలంబించడంలో ఉన్న వైరుధ్యం; ఒక పక్క కార్మిక అంతర్జాతీయత గురించి మాట్లాడుతూ మరొకపక్క జాతులస్వయం నిర్ణయాధికారం గురించి మాట్లాడడంలో ఉన్న వైరుధ్యం; మొదలయినవి ఆమె విమర్శించింది. నిజమే, బొల్షెవిక్‌లు తాము సాధించుకున్న రాజ్యాధికారాన్ని విశాల ప్రజానీకంలోకీ రష్యానేతర జాతులలోకీ తీసుకుపోయి స్థిరీకరించకోవడానికి చేసిన ప్రయత్నాన్ని ఆమె ఆహ్వానించింది. అయితే మొట్టమొదటి సోషలిస్టు విప్లవ ప్రయత్నం 'ప్రజాస్వామ్యాన్ని' తృణీకరించడం వల్ల రాగల దీర్ఘకాల దుష్పరిణామాల గురించి ఆమె ఆందోళన చెందింది.

జైలు నుండి బయటకొచ్చిన తరువాత లగ్జెంబర్గ్ 1918 - 19 కాలంలో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీతో పెట్టుకొన్న వివాదంలో భాగంగా బొల్షెవిక్‌లు పాతరాజ్యాంగ యంత్రంలో భాగమైన జాతీయ అసెంబ్లీ వంటి వాటిని రద్దుచేయడాన్ని అర్థం చేసుకొని తన అభిప్రాయాలు కొంత సవరించుకుంది. అయినప్పటికీ సోషలిస్టు ఉద్యమానికి ప్రజాస్వామిక స్వభావం ఉండాలన్న పట్టింపు ఆమె వదులుకోలేదు.

రోజాలగ్జెంబర్గ్ 1919లో చనిపోయింది. దాదాపు ఒక దశాబ్దం తరువాత ఇటలీలో అంటోనియోగ్రాంసీ, చైనాలో మావోజెడాంగ్, ఆమె బీజప్రాయంగా ప్రతిపాదించిన ప్రజాపంథాభావనకు పరిపూర్ణరూపం ఇచ్చారు. సోషలిస్టు ఉద్యమానికి లేక సంస్థకు కార్మిక స్వభావం తొలగిపోకుండ ఉండాలంటే ఏం చేయాలన్న ప్రశ్న రోజాలగ్జెంబర్గ్‌ను ప్రజాపంథావైపు నెట్టింది. మానవహక్కుల అజెండా రోజాలగ్జెంబర్గ్ నుండి ప్రధానంగా నేర్చుకునేది ఈ విషయమే సమాజాన్ని ప్రజాస్వామీకరించాలని చూసే మానవహక్కుల ఉద్యమం తాను ప్రజాస్వామికంగా ఉండాలి, ఉద్యమసంస్థలో

BRAOU

ప్రజాస్వామికపద్ధతులు అనుసరించాలి. పీడిత ప్రజలే దానికి నాయకత్వం వహించాలి. విముక్తి ఏదైనా స్వీయవిముక్తే. అంటే పీడితులు వేతన బానిసత్వం నుండి విముక్తి కోసం చేసే పోరాటాలకు తామే న్యాయకత్వం వహించాలి.

## 9.3 ఆంటోనియో గ్రాంసీ జీవితము, కాలము:

ఆంటోనియో గ్రాంసీ(1891 - 1937) 1899లో ఇటలీ దక్షిణ భాగంలోని సార్డీనియాలో ఉన్న అలాస్ అనే చిన్న గ్రామంలో జన్మించాడు. రిజిస్ట్రార్‌గా పనిచేసిన అతని తండ్రి అవినీతి కేసులో ఆరుసంవత్సరాలు జైలుకుపోయి బయటికొచ్చిన తరువాత ఒక చిన్న ఉద్యోగం మాత్రమే పొందగలిగాడు. గ్రాంసీ తల్లిదాదాపు నిరక్షరాస్యురాలు. ఆమె బట్టలు కుట్టి సంపాదించేది. గ్రాంసీ తండ్రి జైలులో ఉన్న కాలంలో వారికుటుంబం తమభూమి కొద్దికొద్దిగా అమ్ముకోవలసివచ్చింది. పైగా గ్రాంసీ తల్లిదండ్రులకు ఏడుగురు పిల్లలు. ఇది ఆ కుటుంబం ఆర్థికభారాన్ని మరింత పెంచింది. ఇటువంటి దిగువ మధ్యతరగతి వాతావరణంలో గ్రాంసీ పెరిగాడు.

దానికితోడు అతని ఆరోగ్యం కూడ ఒక సమస్యే. అతని వెన్నెముకలో ఏదోలోపం ఉండడంవల్ల గూనివాడిగా పెరిగాడు. అయిదడుగుల ఎత్తును మించి ఎదగలేదు. చిన్నప్పటినుండి తీవ్రమైన నరాలజబ్బులు, ఇతరరోగాలు ఉండేవి. ఈ అనారోగ్యం కారణంగానే అతను 46 సంవత్సరాలు ప్రాయంలో చనిపోయాడు.

గ్రాంసీ ఫాసిస్టుపాలనలో జైలులో చనిపోయాడు. చనిపోయేనాటికి అతను 11 సంవత్సరాలుగా జైలులో ఉన్నాడు. ప్రపంచంలోని మొదటి ఫాసిస్టు ప్రభుత్వమైన ముస్సోలిని ప్రభుత్వాన్ని ఎదిరించినందుకు ఆయనకు 1926లో ఖైదు చేశారు. అరెస్టయినప్పుడుఅతను ఇటలీ పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ తరపున సభ్యునిగా ఉన్నాడు. అయితే పార్లమెంట్ సభ్యులహక్కులంటే ఫాసిస్టుపాలకులకు గౌరవం లేదు. గ్రాంసీని అతని సహచరులనూ విచారించడానికి నెలకొల్పిన ప్రత్యేక కోర్టులో ప్రాసిక్యూటర్ గ్రాంసీని చూపిస్తూ ఆ బుర్రను ఇరవై సంవత్సరాలు పనిచేయకుండ ఆపాలి' అని న్యాయమూర్తితో అన్నాడు. న్యాయమూర్తి గ్రాంసీకి 20 సంవత్సరాల జైలు శిక్ష వేసాడు. అప్పటికే అతను ఒకటిన్నర సంవత్సరం కాలంగా జైలులో ఉన్నాడు. అప్పటికతని వయసు 35 సంవత్సరాలు.

గ్రాంసీ ఆలోచనలకు పునాది అతను ట్యూరిన్ యూనివర్శిటీలో విద్యార్థిగా ఉన్నప్పుడు పడింది. సార్డీనియాకు చెందిన పేదవిద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్ తీసుకొని అతను 1911లో 20వ ఏట ఆయూనివర్శిటీలో చేరాడు. అక్కడ సోషలిస్టు ఉద్యమంతో సంబంధం ఉన్న అధ్యాపకుల సోషలిస్టు భావాలు అతనిని ప్రభావితం చేశాయి. యూనివర్శిటీలో చేరిన కొన్నాళ్ళకే, 1912లో అతనికి ఇటలీసోషలిస్టు పార్టీ (పిఎస్ఐ)తో సంబంధాలు ఏర్పడ్డాయి. 1914లో అప్పటికి సోషలిస్టు పార్టీలో ఉన్న ముస్సోలినీతో కలసి పనిచేశాడు. ముసోలినీ ఆ తరువాత ఫాసిస్టు జంటాలో చేరాడు. అనారోగ్యం వల్ల కొంత, స్కాలర్‌షిప్ సరిపోకపోవడం వల్ల కొంత, పెరుగుతున్న రాజకీయ కార్యకలాపాల వల్ల కొంత, 1915లో గ్రాంసీ యూనివర్శిటీ వదిలిపెట్టాడు. పి.ఎస్.ఐ ఇటాలియన్ భాషలో నడుపుతున్న వారపత్రిక 'అరాంటీ' సంపాదకవర్గంలో చేరాడు. అప్పటికి అతనివయస్సు 24 సంవత్సరాలు. అరాంటీకి అప్పట్లో ముసోలినీ సంపాదకుడు. గ్రాంసీ ఆపత్రికలో కళావిమర్శకుడిగా చేరాడు. ఒక సంవత్సరం తరువాత మానవహక్కులు, స్త్రీ విముక్తి, కార్మిక ఉద్యమరంగాలలో గ్రాంసీ పనిచేయసాగాడు.

తరువాతి అయిదుసంవత్సరాల (1917 - 1921) కాలంలో గ్రాంసీ ఆలోచనలు, రాజకీయ జీవితం మలుపు తిరిగాయి. 1917లో రష్యా విప్లవం విజయవంతమయిన తరువాత ట్యూరిన్‌లో కార్మికతిరుగుబాటు జరిగింది. బోల్షెవిక్ విప్లవం ఇటలీలో సోషలిస్టుల మీద చాలాప్రభావం వేసింది. గ్రాంసీ అందులో కార్మికవర్గం విజయాన్ని చూసాడు. రష్యాలో కార్మిక రాజ్యాన్ని నెలకొల్పడం కోసం కమ్యూనిస్టులు చొరవతీసుకుని రాజ్యాధికారం నెలకొల్పినవైనం గ్రాంసీని ఆకట్టుకుంది. అంతలో ట్యూరిన్‌లో కార్మికులు అనేక ఫ్యాక్టరీలలో అజమాయిషీని స్వాధీనం చేసుకునే ఉద్యమాలు మొదలుపెట్టారు. రాజ్యం జోక్యాన్ని ఎదుర్కొనడం కోసం ఆయుధాలు చేపట్టారు. ఫ్యాక్టరీలలో ఉత్పత్తి నిర్వహించడం కోసం ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు నెలకొల్పారు. 1918 - 20 కాలాన్ని ఇటలీలో ' ఎర్ర సంవత్సరాలు'గా చెప్పుకోవచ్చు. ఈ పరిణామం సోషలిస్టుపార్టీని చీల్చింది. అందులోని వామపక్షం 1921 జనవరిలో బయటికొచ్చి ఇటలీ కమ్యూనిస్టుపార్టీ (పిసిఐ) నెలకొల్పారు. గ్రాంసీ పిసిఐ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు. అప్పటి అతని వయసుకేవలం 30 సంవత్సరాలు.

BRAOU

ఆ 'ఎర్రసంవత్సరాల' కాలంలో గ్రాంసీ లీఆర్డినో న్యూవోరో అనే పత్రిక నెలకొల్పాడు. తరువాత ఫాసిజం నెలకొన్నకాలంలో అది కమ్యూనిస్టు పార్టీ పత్రిక అయింది. లీఆర్డినో న్యూవోరో ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ ఉద్యమానికి మద్దతు ఇచ్చింది.

1926లో ఖైదు కాక ముందు గ్రాంసీ చేసిన రాజకీయరచనలు చాలావరకు ఈ పత్రికకోసం రాసినవే. 'పదకొండు సంవత్సరాల ఖైదులో అతను మరణయాతన అనుభవించాడు. ఖైదులోనే చనిపోయాడు. ఖైదు జీవితంలో అతని పళ్ళు ఊడిపోయాయి. జీర్ణకోశం పనిచేయడం మానేసింది, గట్టి అన్నం తినడం అసాధ్యం అయిపోయింది. నిద్రలేమి ఎంత తీవ్రమయిందంటే కొన్ని వారాల తరబడి రాత్రి ఒకటి రెండుగంటల నిద్రతో సరిపెట్టుకునేవాడు. మూర్ఛవంటిది వచ్చి రక్తం కక్కుకునేవాడు. విపరీతమైన తలనొప్పికి తట్టుకోలేక జైలుగోడలకు తలబాదుకునేవాడు'. అని అతని రచనలు ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసిన క్విన్టిన్‌హియోర్, జి.ఎన్.స్మిత్‌లు అంటారు.

జైలు జీవితంలో గ్రాంసీ పలువిషయాల గురించి ఆలోచించాడు. యూరప్‌లో భూస్వామ్యవ్యవస్థనుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగిన పరిణామం, వర్గసమాజంలో మేధావుల పాత్ర, యూరప్‌లో పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజానికి జరిగే పరిణామం, అందులో అగ్రగామిపార్టీ పాత్ర, పౌరసమాజం, ఆవిర్భావం, బూర్జువా రాజ్యంఆవిర్భావం, తత్వశాస్త్రానికీ నిత్యజీవితానికీ మధ్య సంబంధం, ఇటలీలో ఉదారవాదం, ఫాసిజాలస్వభావం మొదలయిన అనేక విషయాల గురించి ఆలోచించాడు. 2848 పేజీల నోట్స్ రాసాడు. వీటిని గ్రాంసీ 'ప్రిజన్‌నోట్‌బుక్స్' అంటారు. అతని మరణం తరువాత అవి ఫాసిస్టు పాలకుల బారిన పడకుండ ఉండేందుకు వాటిని జైలునుండి రహస్యంగా తరలించడం జరిగింది. ఆలోచనలలోని ఒక ముఖ్యభాగాన్ని 1971లో ఇంగ్లీషులోనికి అనువదించి అచ్చువేయడం జరిగింది. అప్పటినుండి ఇంగ్లీష్ భాషా ప్రపంచంలో కొత్త ఆలోచనా తరంగాలు మొదలయ్యాయి.

BRAOU

### 9.3.1 గ్రాంసీ ఆలోచనలు:

మొదట్లో చెప్పినట్టు, గ్రాంసీ రాజకీయ జీవితం మానవహక్కుల కార్యకర్తగా మొదలయింది. సోషలిస్టు సంప్రదాయంలో భాగంగా స్త్రీల హక్కులు, కార్మికులహక్కుల గురించి కృషిచేసాడు. రాజకీయంగా ఆయన ఎదిగిన తరువాత ఆయన చేసిన రచనలలో తొలినాటి కృషి ప్రతిఫలిస్తుంది. మానవహక్కుల అజెండా గ్రాంసీ నుండి నేర్చుకోగల విషయాలను కొన్ని ప్రతిపాదనల రూపంలో చెప్పుకోవచ్చు.

**ప్రతిపాదన 1**

"మనిషి అనే భావనను సంస్కరించవలసిన అవసరం ఉంది. మనిషిని క్రియాశీలక సంబంధాల పరంపర (ఒక క్రమం)గా అర్థం చేసుకోవాలి. అందులో వైయుక్తికత బహుశా అన్నిటికంటే ప్రధానమైన అంశం. దానితోపాటు ఇతర అంశాలను కూడా లెక్కలోకి తీసుకోవాలి. ప్రతిఒక్క వైయుక్తికతలోనూ ఉన్న మానవతలో మూడు అంశాలుంటాయి.

1. వ్యక్తి 2. ఇతర వ్యక్తులు 3. ప్రాకృతిక ప్రపంచం

ప్రతీ వ్యక్తీ సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తారో, తిరిగి సమాజం చేత ఏవిధంగా ప్రభావితులవుతారో తెలుసుకోవడం అవసరం. మనిషి 'సామాజికజీవి అయినట్టయితే తన వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవడం అంటే సమాజాన్ని గురించి స్పృహ పొందడం అని అర్థం. తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం అంటే సమాజాన్ని మార్చుకోవడం అని అర్థం. మనిషి సామాజికజీవి , రాజకీయ జీవి అనడం సాధారణ విషయం. అయితే దీని పర్యవసానాలన్నిటినీ వ్యక్తిస్థాయిలో సహితం - గ్రహించవలసి ఉంది. ఒకొక్కవ్యక్తి ప్రకృతితో సంబంధం పెట్టుకునేటప్పుడు ఏ పద్ధతిలో సామాజిక సంబంధాలు పెట్టుకుంటారో తెలుసుకోవడం ఇప్పుడు అవసరం. ఒక్కొక్క వ్యక్తిని ఒక వర్గంలోనో ఒక బృందంలోనో భాగంగా అర్థం చేసుకుంటే సరిపోదు. మనిషిని గురించిన ఈ నూతన భావన ప్రకారం ప్రతీవ్యక్తీ సమాజానికీ, విజ్ఞానశాస్త్రానికీ తత్వశాస్త్రానికీ చేసేసేవలో ఆ వ్యక్తికి సంబంధించిన ప్రత్యేకమైన విశిష్టమైన విషయాలను వెలికి తీయాలి. ఉదాహరణకు, రబీంద్రనాథ్ టాగూర్ ఒక పెటీబూర్జువా కాల్పనిక కవి అని విచారిస్తే సరిపోదు. పెటీ

బూర్జువా కాల్పనిక కవులందరూ ఎందుకు టాగూర్‌లాగలేరన్న ప్రశ్న వేసుకోవాలలి. కాబట్టి, సమాజాన్నీ ప్రకృతినీ మార్చడానికీ మనం చేసే కృషిలో ప్రతీ ఒక్క కృషిలోని ప్రత్యేక విశిష్ట అంశాలను అర్థం చేసుకోవాలి. కాబట్టి స్వేచ్ఛకోసం కృషిచేసే అజెండా, ప్రతీ ఒకవ్యక్తిలోని స్వేచ్ఛాకాంక్షనూ లెక్కలోకి తీసుకోవాలి. ప్రతీఒక్కరి సృజనాత్మకత వర్ధిల్లేటటువంటి పరిస్థితులు సాధించేదిశగా సమాజాన్ని మార్చడంపైన దృష్టి సారించాలి.

**ప్రతిపాదన - 2**

'మానవహక్కులకు కేంద్రం సమాజం, రాజ్యం కాదు. అచేతన విప్లవం మానవహక్కుల ఉద్యమానికి ప్రమాదకరం'.

మానవహక్కులు ప్రకృతినీ మానవసంబంధాలనూ మార్చే క్రమంలో సమాజంలో ఆవిర్భవిస్తాయి. మానవహక్కుల దృష్టికి కేంద్రం సమాజమే తప్ప రాజ్యం కాదు.

రాజ్యం స్వభావం మానవహక్కుల ఉద్యమం పరిణతిపైన ఆధారపడి ఉంటుంది. రాజ్యాన్ని ప్రధాన చోదకశక్తిగానూ సమాజాన్ని రెండవ శ్రేణి విషయంగానూ భావించే అభివృద్ధి పంథా మానవహక్కుల అభివృద్ధిలో అచేతన స్థితిని కల్పిస్తుంది. యూరప్‌లో భూస్వామ్యదశనుండి పెట్టుబడిదారీ దశకు జరిగిన పరిణామాన్ని చర్చిస్తూ, 19వ శతాబ్దంలో యూరప్‌లో బూర్జువావర్గం అనుసరించిన అచేతన విప్లవపద్ధతులను గ్రాంసీ తీవ్రంగా దుయ్యబట్టాడు. యూరప్‌లో బూర్జువావర్గం రైతాంగం నుండీ కార్మికుల నుండీ దూరం అయి భూస్వామ్యశక్తులతో రాజీ పడింది. భూస్వామ్యాన్ని తుదముట్టించే కృషిలో వారు భూస్వాముల కంటె కార్మికులకు ఎక్కువ భయపెట్టారు. అందువల్ల అభివృద్ధికి వారు రాజ్యాన్ని కేంద్రంగా ఎంచారు. ఆధునికత దిశగా సామాజిక మార్పులను ప్రజల ద్వారా కాకరాజ్యంద్వారా తీసుకురావాలని ప్రయత్నించారు. అందువల్ల యూరప్‌లో ఒక్క ఫ్రాన్స్ మినహాయిస్తే మిగిలిన దేశాలలో ఆధునిక ఉదారవాద ప్రజాస్వామ్య సంస్థలు బలహీనంగా ఉన్నాయి. సమాజంలోని ఈ బలహీనత కారణంగా ఫాసిస్టు మూకలు తలెత్తి, ఉదారవాద రాజ్యాన్ని కూలదోసి ఒక్కొక్క యూరప్ దేశంలోనూ ఫాసిస్టు నియంతృత్వాన్ని నెలకొల్పాయి.

అంటే, యూరప్‌లోని బూర్జువా వర్గం రాజ్యాన్ని కేంద్రం చేసుకున్న అభివృద్ధి పంథాను అనుసరించిన కారణంగా, చివరికి ఉదారవాద ప్రజాతంత్ర ప్రభుత్వాలు కాక ఫాసిస్టు నియంతృత్వాలు నెలకొన్నాయి. ఈ రకమైన అభివృద్ధిపథాన్ని గ్రాంసీ 'అచేతన విప్లవం' అంటాడు. అంటే యూరప్‌లో లాగ ఉదారవాద ప్రజాతంత్ర విప్లవం సాధించడానికి ప్రజలమీద కాక రాజ్యం మీద ఆధారపడడం. యూరప్ అనుభవం తెలియజేసినట్టు అచేతన విప్లవం మానవహక్కుల పురోగతికి చాలా హానికరం. ఎందుకంటే అది ప్రజలను అచేతనంగా చేసేసి రాజ్యాధికారం పరిధిని పెంచుతుంది. తద్వారా ఫాసిజానికి దగ్గరవుతుంది. కాబట్టి ప్రజాతంత్ర హక్కుల పురోభివృద్ధి ఎప్పుడూ సమాజాన్ని కేంద్రంగా కలిగి ఉండాలే తప్ప రాజ్యాన్ని కాదు.

**ప్రతిపాదన - 3**

గ్రాంసీ ఆలోచనల ప్రకారం, అచేతన విప్లవానికి మరొక పర్యవసానం ఉంటుంది. దానిని ఆయన 'అణుపరిణామం' అంటాడు. అంటే కింది వర్గాలలోని చైతన్యవంతులయిన వ్యక్తులను రాజ్యాధికారంలో కలుపుకునే ప్రక్రియ "అణుపరిణామ వ్యూహం పీడిత వర్గాల మానవీయ స్వేచ్ఛకొక అటంకం"

అణుపరిణామ వ్యూహంలో, పీడిత ప్రజలలోని మేధావులనూ రాజకీయంగా చొరవగల వారినీ రాజ్యాధికారంలోనికి కలుపుకోవడం జరుగుతుంది. ఆవిధంగా వాళ్ళు తమవారయిన ప్రజానీకానికి దూరం అవుతారు. ప్రజలలోని చురుకయిన వారిని అధికారవర్గంలోకి కలుపుకోవడం ద్వారా పాలకవర్గాలు ప్రజలకు పంపించే సంకేతమేమిటంటే ప్రజలకు కూడ అధికారంలో భాగం ఉందని చెప్పడం. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రజాస్వామీకరించి ప్రజలలోని భిన్నవర్గాలకు భాగస్వామ్యం కల్పించే బదులు, ఈ వ్యూహం కేంద్రీకరణను పెంచుతుంది. అధికారాన్ని కొద్ది మంది చేతిలోనే కేంద్రీకరిస్తుంది. పాతవ్యవస్థలోపలే చేతులు మారడం జరుగుతుంది. అధికారంలో కొత్తనాయకులు

BRAOU

ఉండవచ్చు. కానీ ప్రజల మీద ఆధిపత్యం ఎప్పటిలాగే కొనసాగుతుంది. ప్రజల తాత్విక, రాజకీయ ప్రతినిధులు మాత్రం ప్రజలనుండి దూరం అవుతారు. ఈ మొత్తం క్రమాన్ని గ్రాంసి ఆధిపత్యం అంటాడు. అంటే నాయకత్వం పెత్తనం కలగలిసిన ప్రక్రియ.

ఎస్.సి, ఎస్.టిలకు భారతదేశంలో ఇచ్చే రిజర్వేషన్లనొక ఉదాహరణగా తీసుకోవచ్చు. దళితులలోనూ ఆదివాసీలలోను బాగాచదువుకున్నవారు, రాజకీయహెరవ ఉన్నవారు క్రమంగా రాజ్యాధికారంలో భాగం అవుతున్నారు. దీనివల్ల రాజ్యాధికార నిర్వాహకులు మారుతున్న మాటవాస్తవమేగానీ, కుల అణచివేతనుగానీ కులపరమైన హింసనుగానీ తగ్గించడానికిదేమీ పనికిరాదు. అంటే, రిజర్వేషన్ విధానం కులవ్యవస్థనూ రాజ్యవ్యవస్థనూ కొంత మార్చినప్పటికీ, అది దళిత, ఆదివాసీ ప్రజానీకంచేతిలో అధికారం పెట్టలేదు. ఈ విధానం వల్ల ఎస్.సి, ఎస్.టిలలో నుండి కొత్తనాయకత్వం వచ్చిందిగానీ కుల అణచివేత పోలేదు. ఆధిపత్య ప్రక్రియకు దీనికొక దృష్టాంతంగా భావించవచ్చు. ఇది పీడిత ప్రజలపైన నాయకత్వం, పెత్తనం కల్పిస్తుంది. అధికారంలోకి ప్రజలు ప్రవేశించే హక్కునొక ప్రశ్నగా ఇది ముందుకు తీసుకొస్తుందిగానీ, పెత్తనాన్ని అధిగమించే అవకాశాన్ని మూసేస్తుంది. అందువల్ల గ్రాంసీ ఏమంటారంటే ఆధిపత్యం లేక పరిణామం పీడిత ప్రజల మానవస్వేచ్ఛను ఆటంకపరుస్తాయని. ఎందుకంటే స్వేచ్ఛ అంటే పెత్తనాన్ని అధిగమించడం సామాజిక పెత్తనాన్ని కొనసాగించే ఏ ప్రయత్నమైనా మానవస్వేచ్ఛకు వ్యతిరేకమే.

**ప్రతిపాదన - 4**

రాజ్యం, పౌరసమాజం, వర్గం అనే మూడు ప్రధాన పెత్తన రూపాలను విమర్శించడం మనిషిశక్తులను సంపూర్ణంగా సాధించడానికి ఉపయోగపడుతుంది. వీటిలో ఏదోఒక్కదానిని మాత్రమే విమర్శించి మిగిలిన వాటిని విస్మరించడం సంస్కరణవాదానికి గానీ సిండికలిజానికిగానీ దారి తీస్తుంది. అది మానవ స్వేచ్ఛను పాక్షికంగా మాత్రమే ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో మూడుప్రధాన అధికారవ్యవస్థలున్నాయని గ్రాంసీ అంటాడు. అవి (i) రాజ్యం (ii) పౌరసమాజం (iii) వర్గం. పౌరసమాజానికి ఇటువర్గంతోనూ అటురాజ్యంతోనూ ఉన్న సంబంధాన్ని విశదీకరించడం గ్రాంసీ మార్క్సిస్టు సిద్ధాంతానికి చేసిన ప్రధానమైన చేర్పు.

BRAOU

పౌరసమాజం అనేది కొన్ని సంస్థల సమూహమనీ అవన్నీ బజారులోలాగ పోటీస్వభావాన్ని సంకుచిత ప్రయోజనాలకు పరిమితమయ్యే స్వభావాన్నీ స్వార్థదృష్టినీ కలిగిఉంటాయనీ గ్రాంసీ అంటాడు. వాటిలో సార్వజనీనత ఉండదు. పరస్పర సహకారదృష్టి ఉండదు. కార్మికసంఘాలు, రాజకీయపార్టీలు, కుటుంబం, ఫ్యాక్టరీవ్యవస్థ ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడం కోసం పనిచేసే బృందాలు, ధర్మకర్తృత్వ సంస్థలు, సంక్షేమసంస్థలు మొదలైనవన్నీ 'సంకుచిత దృష్టి' గల సంస్థలు స్వప్రయోజనం లేక ఒక 'పాక్షిక ప్రయోజనం' వాటికి ప్రామాణికం ఒక కుటుంబం అనుకోండి లేక కార్మిక సంఘం అనుకోండి, అవి తమ సభ్యుల ప్రయోజనాలకు మాత్రమే పరిమితం అవుతాయి. పౌరసమాజంలోని ఈ సంస్థలన్నీ సమిష్టి సంస్థలుగా కనిపిస్తాయి. కానీ అవి ప్రైవేట్ సంస్థలుగానే వ్యవహరిస్తాయి. పబ్లిక్ ప్రయోజనాలు సాధించే పబ్లిక్ సంస్థలుగా వ్యవహరించవు. స్త్రీలకు కేవలం తమ వాక్ స్వాతంత్ర్యాన్ని గురించి మాత్రమే పట్టింపు ఉండవచ్చు. దళితులకు కేవలం తమ సమానత్వం గురించి మాత్రం పట్టింపు ఉండవచ్చు. కార్మికులు తమ సంఘాల ద్వారా కేవలం తమపాక్షిక ప్రయోజనాలను మాత్రమే వ్యక్తం చేయవచ్చు. అప్పుడు వారంతా ఇతరుల హక్కులతో సంబంధం లేకుండ కేవలం తమ ఒక్కరి ప్రయోజనాల గురించి, లేక స్వేచ్ఛ గురించి ఆందోళన చేస్తారు. ఆవిధంగా ఒక్కొక్కరి స్వేచ్ఛ గురించి ఆందోళన చేస్తారు. ఆవిధంగా ఒక్కొక్కరి స్వేచ్ఛ అనేది ఇతరుల స్వేచ్ఛతో సంబంధంలేని వ్యక్తిగత విషయంగా వ్యక్తం అవుతుంది.

ఈ రకమైన పౌరసమాజం రాజ్యానికి బలమైన వత్తాసు కల్పిస్తుందని గ్రాంసీ అంటాడు. ఆధునిక బూర్జువా రాజ్యానికి పౌరసమాజం ఆర్థికరాజకీయ పునాదిని కల్పిస్తుంది. పౌరసమాజంలోని సంస్థలు పాక్షిక అవసరాలకూ వ్యక్తిగత ప్రయోజనాలకూ పరిమితం అయిఉండటంవలన వాటి మధ్యన ఉండే వైరుధ్యాలను పరిష్కరించడానికి వాటి స్వయంప్రతిపత్తిని కాపాడడానికీ రాజ్యం అవసరం అయింది. స్వప్రయోజనాలనూ ఇతరుల నుండి స్వయంప్రతిపత్తిని కోరుకునే ఆధునిక పౌరసమాజ సంస్థలు ఉదారవాద రాజ్యానికి ఈ విధంగా పునాది కల్పిస్తాయి.

పౌరసమాజంలోని సంస్థలు ఒకదానినుండి ఒకటి స్వయంప్రతిపత్తి కోరుకుంటూ ఆ స్వయంప్రతిపత్తిని రాజ్యం కాపాడాలని కోరుకున్నట్లే పౌరసమాజం రాజ్యం నుండి స్వయం ప్రతిపత్తి కోరుకుంటుంది. ప్రతీకుటుంబం ఇతరకుటుంబాలనుండి 'ప్రైవసీ' కోరుకుంటుంది. అన్ని కుటుంబాలూ రాజ్యంనుండి స్వయంప్రతిపత్తి కోరుకుంటాయి.

పౌరసమాజం ఒక వైపు రాజ్యంతో ముడిపడి ఉంది. మరొకవైపు వర్గంతోనూ ముడిపడి ఉంది. అది వర్గాలను పార్టీలుగా సంఘటితం చేస్తుంది. అదనపు విలువను వైయుక్తికంగా స్వాధీనం చేసుకునే క్రమంలోనే పెట్టుబడిదారీ వ్యవస్థలో వర్గాలు ఏర్పడ్డాయన్నది మార్క్స్ ఆలోచనలలో గ్రాంసీ ఆలోచనలలో చాలా కీలకమైన విషయం. దాని పర్యవసానంగా, వర్గ సంబంధాలు అనేక ప్రైవేట్ సంస్థల ఆవిర్భావానికి దారి తీస్తాయి. కాబట్టి ఉదారవాద రాజ్యాన్ని ఎట్లాగయితే పౌరసమాజంలోని ప్రైవేట్ సంస్థల లేక వ్యక్తుల మధ్య సమతుల్యం కుదిర్చే పాత్ర నుండి వేరు చేసి చూడలేమో, అదేవిధంగా వర్గసమాజంలో అదనపు విలువనువైయుక్తికంగా చేజిక్కించుకునే ప్రక్రియను కాపాడే ప్రధానమైన కర్తవ్యం నుండి పౌరసమాజాన్ని వేరుచేసి చూడలేము. నిజానికి, ఆర్థికరంగంలో అదనపు విలువను వైయుక్తికంగా చేజిక్కించుకునే సామాజిక సంబంధాన్ని కాపాడే క్రమంలో, పౌరసమాజం స్వార్థప్రయోజనాలను సాధించే ప్రైవేట్ సంస్థగా తనను తాను వ్యక్తం చేసుకుంటుంది.

ఆర్థికరంగంలో ఒక వర్గంపైన మరొక వర్గం పెత్తనాన్ని చూస్తాం. పౌరసమాజంలో కుటుంబంలోపలా వెలుపలా స్త్రీ పైన మగవాడి పెత్తనాన్ని చూస్తాం. ఒక జాతిపైన మరొక జాతి పెత్తనం, ఒక వ్యక్తిపైన మరొక వ్యక్తిపెత్తనం, వగైరాలు చూస్తాము. రాజ్యంలో బలప్రయోగం కేంద్రీకృతము ఉండటం గమనిస్తాము. ఆర్థికవ్యవస్థలోనూ పౌరసమాజంలోనూ ఉన్న అన్ని రకాల పెత్తనాన్ని కాపాడడం ఈ బల ప్రయోగం లక్ష్యం. అందుకే గ్రాంసీ ఏమంటాడంటే పైన పేర్కొన్న అన్ని రకాల పెత్తందారీ సంస్థలనూ మార్చినప్పుడే ప్రస్తుత పరిస్థితులలో మానవస్వేచ్ఛ అనే అజెండా సాధనకు ద్వారాలు తెరుచుకుంటాయి.

అటువంటి సామాజిక మార్పు బహుముఖంగా ఉండాలి. ఒకే ఒక సరళరేఖలో కాదు. సంస్కరణవాదము, సిండికలిజం ప్రతిపాదించే సామాజికమార్పు ఒక సరళరేఖలో ఉంటుంది. సిండికలిస్టులు ఫ్యాక్టరీలో కార్మికులు అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలంటారు. కానీ రాజ్యాధికారాన్ని గానీ పౌరసమాజాన్ని గానీ మార్చాలని చూడరు. అనార్కిస్టుల ప్రైవేట్ ఆస్తినీ రాజ్యాన్నీ కూడ రద్దు చేస్తామంటారు గానీ ఈ అణచివేత వ్యవస్థల వల్ల పీడన అనుభవిస్తున్న ప్రజలకు అందులో చోటు కల్పించరు. సామాజిక మార్పుకు సంబంధించిన పై మార్పులన్నీ పాక్షికమైనవే. మానవస్వేచ్ఛకు సంబంధించిన అజెండాను అవి సమగ్రంగా ప్రస్తావించవు. అందువల్ల బహుసంఖ్యలో ఉన్న అణచివేత వ్యవస్థలపైన బహుముఖమైన పోరు అవసరం అని గ్రాంసీ అన్నారు.

## ప్రతిపాదన - 5

బహుముఖమైన వ్యూహంతో సామాజిక మార్పుకోసం కృషి చేసినట్లయితే, బహుళసంఖ్యలో ఉన్న అణచివేత వ్యవస్థలచేత అణచివేత అనుభవిస్తున్న వర్గాలన్నీ తమ విముక్తికోసం ఐక్యం కావడానికి ఒక చారిత్రక సంఘటన అవసరం.

ఈ చారిత్రక సంఘటన సకల పీడిత ప్రజల సంఘటన అందులో పెత్తనం చేయని నాయకత్వం ఉంటుంది. ఏవివక్షలేకుండ అన్ని పీడిత ప్రజాశ్రేణుల సమస్యలను చేపడుతుంది. అన్ని రకాల పీడన నుండి స్వేచ్ఛ అనే లక్ష్యాన్ని ముందుకు తెస్తుంది.

ఆధిపత్యక్రమంలో లాగకాక చారిత్రక సంఘటనలో రైతాంగం, స్త్రీలు తదితర ప్రజాశ్రేణులకు కార్మికవర్గం పెత్తనంలేని నాయకత్వం కల్పిస్తుంది. అన్ని పీడిత ప్రజాశ్రేణుల పొత్తు నిలవాలంటే ఏ ఒక్కరి పెత్తనమూ చారిత్రక సంఘటనపైన ఉండకూడదు. చారిత్రక సంఘటన అన్ని రకాల ఆధిపత్యానికి (అంటే పెత్తనంతో కూడిన నాయకత్వక్రియకు) వ్యతిరేకం. అందుకే తన వాదనలో భాగంగా గ్రాంసీ చారిత్రక సంఘటనకు ' పెత్తనం లేకుండ

BRAOU

నాయకత్వం కల్పించే ప్రక్రియ అని నిర్వచిస్తాడు. రాజ్యం ఎట్లాగయితే అన్ని రకాల పెత్తనాన్ని ఒకే ఆధిపత్య సంఘటనగా మలుస్తుందో, అట్లాగే అన్ని రకాల స్వేచ్ఛనూ ఒకే ఆధిపత్య వ్యతిరేక (లేక విప్లవ) సంఘటనగా మలచడానికి చారిత్రిక సంఘటన అవసరం. చారిత్రిక సంఘటన రూపొందించినట్టయితే స్వేచ్ఛాన్వేషణ అసమగ్రంగానూ అసంపూర్ణంగానూ ఉంటుంది. స్వీయవినాశకరం కూడా కాగలదు.

**ప్రతిపాదన - 6**

సమాజాన్ని ప్రజాస్వామీకరించాలని ప్రయత్నంచేసే మానవహక్కుల అజెండా ప్రజాపంథాను కచ్చితంగా అనుసరించడం ద్వారా తనను తాను ప్రజాస్వామీకరించుకోవాలి.

మానవహక్కుల అజెండాలోగానీ సంస్థలోగానీ పెత్తందారీ స్వభావం ఏ కొంచెం ఉన్నా అది దాని ఎదుగుదలకు చాలా ప్రమాదకరం అవుతుంది. మానవహక్కుల ఉద్యమంలోనికి భిన్నమైన అహంకారపూరితమైన పెత్తందారీ పోకడలు ప్రవేశించగలవు. మానవహక్కులు కార్యకర్తలు ప్రజలకొక ఐక్యలక్ష్యాన్ని అందిచ్చేముందు తాము ప్రజల నుండి నేర్చుకోవాలి. ప్రజలనుండి నిరంతరాయంగా నేర్చుకుంటే అప్పుడప్పుడు కొత్త ఆలోచనలు రాగలవు, మానవహక్కుల అజెండా సుసంపన్నం కాగలదు. ఈ ప్రజాపంథా లేకుంటే మానవహక్కుల అజెండా తన సృజనాత్మకతను కోల్పోతుంది. 'ప్రజలగురించి మాకు ఇప్పటికే అంతా తెలుసు' అనుకునే పెత్తందారీ దురహంకార శక్తుల చేతిలో ఒకసాధనంగా కూడ మారగలదు. కాబట్టి, కార్యకర్తలు ప్రజలను విద్యావంతులు చేయడానికి ఎంతగా ఉవ్విళ్లూరుతారో అంతగా ప్రజలను తమ అధ్యాపకులుగా వారు భావించాలి. మానవహక్కుల కార్యకర్తలు సమాజాన్ని ప్రజాస్వామీకరించడానికి చేసే కృషితోబాటు మానవహక్కుల జ్ఞానవ్యవస్థ కూడ నిరంతరాయంగా ప్రజాస్వామీకరణ చెందాలి.

**ప్రతిపాదన - 7**

స్వేచ్ఛ అంటే బహుళ అణిచివేత వ్యవస్థల నుండి స్వీయ విముక్తి సాధించడం. స్వేచ్ఛకోసం జరిగే పోరాటంలో భాగంగా పీడిత ప్రజల నుండి ఆ ప్రజలకే చెందిన సజాతమేధావులుముందుకొచ్చినప్పుడు అది సాధ్యం అవుతుంది.

ఏ వర్గమైనా సమర్థంగా పరిపాలించాలంటే దానికి తన మేధావి వర్గం అవసరం. మేధావులలో 3 రకాలు ఉంటారు.

1. సంప్రదాయకమేధావులు
2. శిష్టమేధావులు
3. సజాత మేధావులు

సంప్రదాయక మేధావి మధ్యతరగతి నుండి వచ్చి ప్రజలలో కొత్తభావాలు ప్రచారం చేస్తారు. వారిది ప్రధానంగా ఆధిపత్యపాత్ర. శిష్ట మేధావులు ఏ సామాజిక శ్రేణికైనా చెందినవారయి ఉండవచ్చునుగానీ వారు ప్రజలతో సంబంధం లేకుండ అభిప్రాయాలు ప్రచారం చేస్తారు. సజాత మేధావులు తాముపుట్టిన వర్గం అవసరాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

## 9.4 ముగింపు

యూరప్‌లో 15 నుండి 18వ శతాబ్దకాలంలో భూస్వామ్యవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినదశలో బూర్జువావర్గం తనమేధావులను ఏవిధంగా తయారుచేసుకున్నదీ గ్రాంసీ చూపిస్తాడు. పాత సమాజానికి చెందిన మేధావులు - సంప్రదాయక మేధావులూ శిష్టమేధావులూ - చాలామంది భూస్వామ్యవ్యతిరేకపోరాటానికీ, 'స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే నినాదానికీ ఆకర్షితులయినప్పటికీ బూర్జువావర్గం భూస్వామ్య పెత్తనం నుండి తాను కోరుకుంటున్న విముక్తికి అవసరమైన సజాతమేధావులను తనే తయారుచేసుకుంది. ఆ మేధావులు బూర్జువావర్గం ప్రయోజనాలకు బలం చేకూర్చడమేకాక, విముక్తి అంటే స్వీయవిముక్తేనని రుజువు చేశారు.

BRAOU

పెట్టుబడిదారీ వ్యవస్థపైన సోషలిజం చేసే పోరాటానికి అవసరమైన పాఠాలను పై చరిత్రనుండి గ్రహించాలని గ్రాంసీ ప్రయత్నించాడు. సోషలిస్టు ఉద్యమం పీడిత ప్రజలనుండి మేధావులను తయారుచేసుకోవాలనే వారు పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి అండగా నిలబడేవారయి ఉండాలనీ అంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలకు చెందిన సంప్రదాయకమేధావులు ప్రజలలో పనిచేసి ఉండటంవల్ల మొదట్లో ప్రజాఉద్యమాల వైపు ఆకర్షితులయి వచ్చినా వారిపైన సోషలిస్టు ఉద్యమం ఆధారపడజాలదని అంటాడు. పీడిత వర్గాలనుండి మేధావులను తయారుచేసి రాజ్యాధికారంలో భాగం చేయడం ద్వారా బూర్జువా ఆధిపత్యం విజయవంతంగా నిలదొక్కుకున్న వైనాన్ని గ్రాంసీ వివరిస్తాడు. ఈ మేధావులు తమ వర్గం నుండే శిష్టమేధావులుగా మారిపోతారు.

మానవహక్కుల అజెండా సారాంశం ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడడమనీ వానికోసం పీడిత ప్రజాశ్రేణుల నుండి మేధావులను తయారు చేసుకోవాలనే వారు అన్ని పీడిత ప్రజాశ్రేణుల (కార్మికులు, రైతులు, దళితులు, స్త్రీలు, నల్లజాతివారు వగైరా) మానవ హక్కులకోసం నిలబడాలనీ గ్రాంసీ అంటాడు. అప్పటికి ఉనికిలో ఉన్న అన్ని పీడిత ప్రజాబృంధాలనుండి మేధావులు ముందుకొచ్చి, మానవస్వేచ్ఛ, అనే సామాన్యలక్ష్యంతో భాగంగా ఎవరి మానవహక్కుల గురించి వారు మాట్లాడాలి . కేవలం సంప్రదాయ మేధావులపైన ఆధారపడే విముక్తి అజెండా తనకుతానే ఆటంకం అవుతుంది. ఎందుకంటే తమలోనే ఉండి తమ అవసరాలకోసం నిలబడే మేధావులను ఆప్రజాశ్రేణులు రూపొందించుకోలేకపోతున్నాయని దాని భావం. అందుకే పీడిత ప్రజలనుండి సజాత మేధావులను పైకి తీసుకురావడం ద్వారా మానవహక్కుల ఉద్యమానికి కొంత స్థిరత్వం వస్తుందని గ్రాంసీ అంటాడు. అంతేగాక ఏ మానవహక్కుల అజెండా అయినా స్వీయవిముక్తిని ధ్యేయంగా కలిగిఉండాలే తప్ప కేవలం అన్నిపీడిత ప్రజాశ్రేణుల విముక్తిని ధ్యేయంగా కలిగి ఉంటే చాలదు. పీడిత ప్రజలే మేధావులుగా మారినప్పుడే ఇవి సాధ్యం అవుతుంది. ఆధిపత్యప్రక్రియ ఈ అవకాశాన్నే నిరాకరించాలని చూస్తుంది.

## 9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి

1. మానవ హక్కుల ఎజెండాను రూపొందించడంలో రోజాలగ్జెంబర్గ్ చేసిన కృషిని చర్చించండి ?
2. మానవ హక్కుల ఎజెండాపై గ్రాంసీ ప్రతిపాదించిన ఏడు అంశాలను చర్చించండి?

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో జవాబు రాయండి?

1. రోజాలగ్జెంబర్గ్ జీవిత విశేషాలు వివరించండి?
2. ఆంటోనిమో గ్రాంసీ జీవిత విశేషాలు వివరించండి ?

BRAOU

BRAOU

# ఖండం - IV

# ప్రత్యామ్నాయ దృక్పథాలు

మానవహక్కులపై ఐరోపా కేంద్రంగా జరిగిన చర్చలు మూడవ ప్రపంచదేశాల మానవహక్కులకు సంబంధించి అనేక పరిమితులున్నాయి. మూడవ ప్రపంచదేశాలలోని మానవహక్కులకు సంబంధించి పాలో ఫ్రేయర్, నోమ్ఛామ్స్కీల భావాలు మరియు స్త్రీవాద దృక్పథం మానవహక్కుల భావాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపించిందో కూడా నాలుగో ఖండంలో చర్చించబడ్డాయి. ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. అవి:


భాగం - 10 : మూడవ ప్రపంచ దేశాలు - మానవ హక్కుల మీమాంస

భాగం - 11 : పాలో ఫ్రేయర్ భావాలు

భాగం - 12 : నోమ్ ఛామ్స్కీ

భాగం - 13 : స్త్రీవాద దృక్పథం


BRAOU

BRAOU

# భాగం - 10 : మూడవ ప్రపంచ దేశాలు - మానవ హక్కుల మీమాంస

**విషయక్రమం**

10.0 ఉద్దేశం
10.1 పరిచయం
10.2 ఐరోపా కేంద్రక భావన - పరిమితులు
10.2.1 హక్కులు : వాటి స్వభావం
10.2.2 అభివృద్ధి దశలో ఉపేక్ష
10.2.3 సాంస్కృతిక విలక్షణతలపట్ల ఉదాసీనత
10.2.4 ప్రేరేపిత విమర్శ
10.3 విమర్శనాత్మక అంచనా
10.4 ముగింపు
10.5 మాదిరి పరీక్షాజ ప్రశ్నలు

## 10.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- మానవహక్కులపై ఐరోపా కేంద్రక భావన - పరిమితులు వివరించగలుగుతారు
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని పరిస్థితులు తెలుసుకోగలుగుతారు.
- మూడవ ప్రపంచ దేశాల సాంస్కృతిక విలక్షణతను అవగతం చేసుకుంటారు.

BRAOU

## 10.1 పరిచయం

గత దశాబ్దికాలంలో మానవ హక్కుల గురించి జరిగిన చర్చ అనేక నూతన అంశాలను వెలుగులోకి తెచ్చింది. మానవ హక్కుల విషయంలో 'అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పన' మూడవ ప్రపంచదేశాల పాలక వర్గాల తీవ్ర నిరసనకు దారితీసింది. మానవ హక్కులకు సంబంధించి 40వ దశకంలో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందాలు ఎక్కువ కాలం మనగలిగేట్లు లేవు. యాభై సంవత్సరాల అనంతరం కూడా ఏకాభిప్రాయ సాధన, స్పష్టమైన దిశానిర్దేశం జరగలేదు. పైగా మానవ హక్కులకు సంబంధించిన విశ్వజనీన ప్రమాణాల విషయంలో ప్రపంచాభిప్రాయం మరింత వైరుధ్యాల పుట్టగా రూపొందటం ఆశ్చర్యకరం. మానవ హక్కుల విషయంలో రూపొందించిన అంతర్జాతీయ ప్రమాణాలను, వాటి ఐరోపా - కేంద్రక లక్షణాలను, ఆధిపత్యభావనను ప్రశ్నించటంతో పాటుగా, మానవ హక్కుల ప్రాథమిక దృక్పథానికి చెందిన మౌలిక తత్వాన్నే ప్రశ్నించేస్థాయిలో వీనిపై విమర్శ చోటుచేసుకున్నది. ఈ దృక్పథం మానవ హక్కుల కోసం "దేశీయన్యాయ పరిపాలన" ఏర్పాటు అవసరాన్ని వెలుగులోకి తెచ్చింది.

## 10.2 ఐరోపా - కేంద్రక భావన : పరిమితులు

మానవ హక్కుల పై జరిగిన చర్చలు ఐరోపా-కేంద్రక భావనలోని అనేక పరిమితులను సమగ్రంగా వెలికి తెచ్చాయి. అవి (1) హక్కులు-వాటి స్వభావం (2) అభివృద్ధి దశలో వివక్ష (3) సాంస్కృతిక విలక్షణతల పట్ల ఉదాసీనత(4) పాశ్చాత్యదేశాల ప్రేరేపిత విమర్శ. ఈ పరిమితును మనం సవివరంగా చర్చిద్దాం. ఈ చర్చ వల్ల విమర్శ పట్ల అవగాహన కలుగుతుంది. హక్కులపై జరిగే చర్చల వైవిధ్యంపై విద్యార్థికి గల అవగాహన మరింత సమగ్రమవుతుంది.

### 10.2.1 హక్కులు : వాటి స్వభావం

మానవ హక్కుల పరంగా ఐరోపా-కేంద్రక భావనలో హక్కులు 'వ్యక్తి' పరమైనవి. పాశ్చాత్య పారిశ్రామిక సమాజాల్లో మార్కెట్ శక్తుల అభివృద్ధి, వ్యక్తి స్వామ్యం, స్వార్థపరత్వం, సృజనాత్మకత వంటి అంశాల పెరుగుదలకు దారితీసింది. అలాంటి వ్యక్తే పారిశ్రామికాభివృద్ధికి కారణం-ఫలితం కూడా. పాశ్చాత్యసమాజాల్లో మాదిరిగా పారిశ్రామిక విప్లవాన్ని చవిచూడని సమాజాల్లో ఈ 'యాంత్రిక జీవి/వ్యక్తి' ఇంకా రూపొందలేదు. స్వజాతీయత, సామూహిక గుర్తింపు, ఉమ్మడి కుటుంబం, కుల సమూహాలు- వ్యక్తికి తనకు తానుగా, పాశ్చాత్యసమాజాల్లోని వ్యక్తి మాదిరిగా, ప్రత్యేక గుర్తింపు లేక పోవటాన్ని సూచిస్తాయి.

హక్కులు వ్యక్తిపరం కావటం అవాస్తవమే కాక ఆహ్వానించదగిన పరిణామం కూడా కాదు. అనేక అభివృద్ధి చెందుతున్న సమాజాలు పేదరికంతో నిండినవి. వాటి ఉత్పాదక శక్తుల్లో కూడా అభివృద్ధి శూన్యం. అటువంటి ఆర్థిక వ్యవస్థలో పరిమిత వనరులను భాగం పంచుకొనే దృక్పథంతో కూడిన మానవతా విలువలు అవసరమవుతాయి. ఆ వనరులకోసం పోటీపడే తత్వాన్ని ఆ వ్యవస్థ హర్షించదు. పోటీతత్వభావన ముందుగా గౌరవప్రదమైన జీవితాన్ని, క్రమంగా జీవించే హక్కును కాలరాస్తుంది. వ్యక్తిగత శ్రద్ధ వ్యక్తి కేంద్ర భావనకు దారి తీస్తుంది. అయితే సంపన్న సమాజాల్లోను, కనీసం ఒక స్థాయిలో వ్యక్తులందరి మౌలిక అవసరాలు తీరిన సమాజాల్లోను, ఈ భావన విధ్వంసకరం కాదు. కానీ, పేద దేశాల్లో ఇది తీవ్రమైన అనుత్పాదక స్వభావాన్ని కలిగి వుంటుంది. అందుచేత 'హక్కుల భావన' 'వ్యక్తి' నుంచి సామూహిక గుర్తింపు దిశగా తన ప్రాధాన్యతను మార్చుకొనవలసి ఉంటుంది.

BRAOU

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యక్తికి విభిన్న గుర్తింపులుంటాయి. సందర్భాన్ని బట్టి, పరిస్థితుల ఆధారంగా ఈ గుర్తింపు మారుతుంటుంది. ఈ కారణం చేత వ్యక్తిగత గుర్తింపు దృఢంగా ఉండదు. స్పష్టంగా రూపొందదు. ఫలితంగా అస్థిరమైన ఈ వ్యక్తిగత గుర్తింపు చర్చనీయాంశమైంది. ప్రత్యేకించి పాశ్చాత్య సమాజాల్లో ప్రాచుర్యం పొందిన 'వ్యక్తి భావన' ల గురించి చర్చించే సమయంలో ఈ విషయం దృష్టిలో ఉంచుకోవాలి.

ఇటువంటి చారిత్రక, సామూహిక పరిస్థితి, హక్కులు బాధ్యతలకు చెందిన ఉదార నిర్మాణాన్ని తిరిగి రూపొందించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. కనీస అవసరాలు మృగ్యమై, సేవల విభజనలో సమతుల్యం లోపించిన సమాజంలో 'హక్కులు, బాధ్యతలు' భావన అమలు భిన్నంగా వుంటుంది. సంపన్న వర్గాలు హక్కులను అనుభవిస్తుంటే - పేదవర్గాల వారు బాధ్యతలను భరిస్తూ ఉంటారు. ఈ నిర్మాణాన్ని మార్చటం ఎలా? 'హక్కులు-బాధ్యతల' పరంగా వ్యక్తికి-వ్యక్తికి, వ్యక్తికి-సమూహానికి, సమూహానికి-సమూహానికి మధ్య ఒక స్థాయి సమానత్వాన్ని ఊహించటం పాశ్చాత్య భావనలో ఇమిడివుంది. అటువంటి సమానత్వం లోపించినప్పుడు సమాజం మరో తరహా తర్కాన్ని ఉపయోగిస్తుంది. పేదవర్గాల బాధ్యతలను సంపన్న వర్గాలు స్వీకరించటం, పేదలు సంపన్న వర్గంలో సమానమయ్యేందుకు దోహదపడే హక్కులను వారికి అందించడమే ఈ తర్కం. ఇలా, వివక్షను సమర్థించే తర్కానికి న్యాయబద్ధతను ఆపాదించటం చూస్తాం. దీంతో పరిమితమైన అవకాశాలను కోరుకునే అవకాశం పేదవర్గాలు పొందాయి. అయితే అభివృద్ధి చెందిన సమాజాల్లో ఇది వాస్తవ పరిణామమే కానీ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పరిస్థితి తీవ్రత మరో రకంగా వుంది. అక్కడ అనేక రక్షణ చట్టాల రూపకల్పనకు సమర్థనగా చూపించే అంశాల్లో ఇది ఒకటి. మౌలిక

అసమానతల గుర్తింపునుంచి వచ్చినవి 'రక్షణ చట్టాలు' కాగా 'విశ్వజనీన హక్కులు' సర్వసమానత్వాన్ని బలపరుస్తాయి.

## 10.2.2 అభివృద్ధి దశలో ఉపేక్ష

ఈ అంశాన్ని ఇప్పటికే కొంతమేరకు చర్చించినా ఇంకా వివరించాల్సిన అవసరం వుంది. పారిశ్రామిక అభివృద్ధిలో ముందుండటంతోపాటు పాశ్చాత్యసమాజాలు, మూడవ ప్రపంచదేశాల్లో భారీ వలసలేర్పరచుకున్నాయి. అక్కడి సహజ వనరులు ముడి సరుకులకోసం వారిని దోపిడీ చేయటం ద్వారాను, తమ మార్కెట్‌లలో డిమాండ్ తగ్గిన ఉత్పత్తులను వలస దేశాల్లో చొప్పించటం ద్వారాను పాశ్చాత్యసమాజాలు లాభపడ్డాయి. వాస్తవానికి అభివృద్ధి చెందుతున్న, సరైన అభివృద్ధి లోపించిన ఆధేయాలైన సమాజాల్లోని అభివృద్ధి ప్రక్రియ కూడా వలసవాద ఫలితంగా రూపొందినదే అన్నది ఆ దేశాల వాదన. అందుచేతనే అభివృద్ధి చెందుతున్న దేశాలకు చారిత్రకమైన అనుకూలత ఉంది. ఈ అనుకూలత కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరించాల్సిన 'మానవహక్కుల సూచీ' 'ప్రమాణాలు' ప్రత్యేకంగా ఉండాలని మూడవ ప్రపంచ ప్రభుత్వాలు వాదిస్తున్నాయి. పాశ్చాత్య దేశాల ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్న దశలో ఉన్నప్పుడు అక్కడి మానవ హక్కుల స్థాయి ఎలా వుండేది? అనే ప్రశ్నను మూడవ ప్రపంచదేశనాయకులు కొందరు లేవనెత్తుతున్నారు.

ఉత్పాదక శక్తుల పాక్షిక అభివృద్ధి కారణంగా హక్కుల కల్పనకు, రక్షణకు అవసరమైన సామర్థ్యం మూడవ ప్రపంచదేశాలు పొందలేకపోయాయి. అట్టడుగు వర్గాల ఐక్యతకు, ప్రశాంతమైన, గౌరవప్రద జీవితాన్ని కోరుకునేందుకు పౌర, రాజకీయ హక్కులు అనివార్యంగా దోహదపడతాయి. అయితే వ్యవస్థపైన ప్రతిఘటన స్థాయి తీవ్రంగా, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కోలేని విధంగా ఉంటుంది. ఆయా దేశాలు సైనిక, ఆధిపత్య పాలనలను బలపరచేందుకు ఇదీ ఒక కారణమే. ఈ కారణంగానే పౌర, రాజకీయ హక్కులు వివాదాస్పద అంశాల్లో ప్రముఖస్థానం ఆక్రమిస్తాయి. అభివృద్ధి చెందిన సమాజాలు, అంతర్జాతీయ సంస్థలు మానవహక్కుల నిర్వహణను గణించేందుకు ఈ (పౌర, రాజకీయ హక్కులు) సూచిని అధికంగా వినియోగిస్తుండటంతో ఆ దేశాలకు వ్యతిరేకంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో చైనాతో పాటు అనేక దేశాల నాయకులు హక్కుల గురించి ప్రత్యేకించి పౌర, రాజకీయ హక్కులు మౌలిక భావననే ప్రశ్నిస్తున్నారు.

BRAOU

ఈ పరిస్థితి పౌర, రాజకీయ హక్కులకు, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులకు మధ్య ఒక పెద్ద వివాదానికి తెరతీసింది. ఇది న్యాయానికి, స్వేచ్ఛకు మధ్య వివాదంగా రూపొందింది. ఆకలితో అలమటించేటప్పుడు రాజకీయ స్వేచ్ఛకు అర్థం ఉంటుందా! అన్న తర్కం చుట్టూ ప్రధాన వాదన సుళ్లు తిరుగుతున్నది. ఆకలిగొన్న మనిషికి ఆహారం అవసరమే తప్ప పౌరస్వేచ్ఛ రాజకీయ స్వేచ్ఛలు కావు. అయితే ఈ తర్కాన్ని తిరస్కరిస్తూ 'స్వేచ్ఛ' ఆహారానికి ఎలా అడ్డంకిగా మారుతుందని ప్రశ్నించటం చూస్తాం. అయితే రాజకీయ అస్థిరతకు దారితీసే విధంగా. వ్యవస్థపై అవాంఛనీయమైన వత్తిడికి ఈ స్వేచ్ఛ తలుపులు తీస్తుంది. ఈ తర్కంతోనే అభివృద్ధి చెందుతున్న సమాజాల్లోని పాలక వర్గాలు శీఘ్ర అభివృద్ధికి 'స్థిరత్వం' మౌలికావసరంగా పేర్కొన్నాయి. - స్థిరత్వం కోసమే ప్రభుత్వాలు అణచివేత చర్యలకు పాల్పడతాయనే వాదన సర్వసాధారణంగా మనం చూసుకుంటాం. ఈ వాదన ఆధారంగానే పాశ్చాత్యసమాజాల దృక్పథం పాక్షికమైనది. పక్షపాతంతో కూడినదన్న విమర్శకు గురైంది.

## 10.2.3 సాంస్కృతిక విలక్షణత పట్ల ఉదాసీనత

అభివృద్ధి చెందుతున్న సమాజాలలోని సాంస్కృతికాంశాల పట్ల పాశ్చాత్యదేశాలు పూర్తిగా ఉపేక్ష వహించాయన్నది మరో విమర్శ. వాస్తవానికి ఆసియా, ఆఫ్రికా దేశాల సాంస్కృతిక వ్యవస్థలు పాశ్చాత్య సమాజాలకు భిన్నమైనవి. మానవహక్కుల ఆచరణ, ధిక్కరణలను విశ్లేషించి అర్థం చేసుకునేటందుకు సంస్కృతి ఒక ప్రధాన ఆధారం. సామాజిక సంబంధాల సమాహారమే ఈ సంస్కృతి. ఈ సంబంధాలే అధికంగా భూస్వామ్య నాగరికత నేపథ్యంగా రూపొందుతాయి. అంటే జాతి పరంగాను, సమూహపరంగాను, ఉమ్మడి కుటుంబం రూపంలోను ఈ సంబంధాలుంటాయి. ఇలా వ్యక్తికి వివిధ సమూహాలతో గల సంబంధం ఆధారంగా, అతని గుర్తింపు అంచనా వేయబడుతుంది. పైన చెప్పిన

విధంగా వ్యక్తికి అనేక గుర్తింపులుండటంతో పాటుగా ఆయా గుర్తింపులలో మార్పులు సైతం జరుగుతుంటాయి. అయితే. 'యాంత్రిక జీవి'గా మాత్రం వ్యక్తిగత గుర్తింపు కన్పించదు. ఈ సాంస్కృతిక వైరుధ్యం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో హక్కులను సామూహిక హక్కులుగానే పరిగణించాలన్న వాదనకు దారితీసింది. సామూహిక హక్కులు - భాష, వర్ణం, ప్రాంతం, మతం, కులం, జాతి, అల్పసంఖ్యాకులు - వంటి విభిన్న రూపాల్లో ఉంటాయి. వ్యక్తి స్వయంగా హక్కులను కలిగివుంటాడన్న పాశ్చాత్య భావన సాంస్కృతిక పరంగా కూడా గణనకు రాదు. హక్కులకు చెందిన పాశ్చాత్య భావనను బలవంతంగా రుద్దడం సాంస్కృతిక దురాక్రమణ మాత్రమేకాక మూడవ ప్రపంచదేశాలు భావనా పరంగా వాస్తవ దూరం కూడా.

అభివృద్ధి చెందుతున్న సమాజాలు పాశ్చాత్య హక్కుల భావన పట్ల విమర్శనాత్మక వైఖరిని ప్రదర్శించినాయి, కాని ప్రత్యామ్నాయ హక్కుల భావనను మాత్రం అవి రూపొందించలేక పోయాయి. ఈ విమర్శ పాశ్చాత్యభావనను వ్యతిరేకించినా, స్వంత భావనకుపకరించే సృజనశీల నిర్మాణాన్నిగాన్ని, ఒక ఉదాహరించదగిన అంశాన్నిగాని అందించలేదు. హక్కులకు చెందిన ఒక ప్రత్యేక నిర్మాణం లేని కారణంగా రాజకీయంగా స్తబ్దత ఏర్పడింది. ఫలితంగా సామాజిక, పౌరపోరాటాల్లో వ్యక్తులు, సమూహాలు, రాజ్యం నిస్సహాయంగా నిలిచాయి. సమగ్రమైన మానవహక్కుల నిర్మాణం ఉన్నట్లయితే జాతి విద్వేషాలు, సామాజిక పోరాటాలు, సామూహిక అలజడులను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాన్ని, అందించిఉండేది. ఈ పరిస్థితి కారణంగా, ఆయాసమూహాలు అనుభవించే సాంప్రదాయిక హక్కుల పై వేటు పడింది. పాశ్చాత్య నిర్మాణం నుంచి వ్యక్తిపొందిన సమన్యాయ పాలన, న్యాయ సమీక్ష వంటి పాశ్చాత్యప్రమాణాలను మొత్తంగా తిరస్కరించటానికి దారి తీసింది. దాంతో ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది.

ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరించే క్రమంలోనే జాతీయీకరణ కూడా మొదలైంది. కానీ ప్రపంచీకరణ, దాని ఫలితంగా రూపొందిన ఆర్థిక భావన సైతం గ్రామీణ, గిరిజన ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేయలేక పోయాయి. వెనుకబడిన ప్రాంతాలు కూడా అతి స్వల్పంగానే ప్రభావితమైనాయి. దీంతో సాంస్కృతిక సంబంధాల్లో మార్పు చోటు చేసుకోలేదు. తద్వారా మార్కెట్ శక్తులు/ ఆధునిక శక్తులు సాంప్రదాయిక వ్యవస్థతో విభేధించాయి. ఇది సాంఘిక అనిశ్చితికి, సంక్షోభానికి కారణమైంది. పరిమిత వనరులపై ఆధిపత్యం కోసం జరిగే పోరాటం పౌరసంక్షోభానికి దారితీస్తుంది. సమకాలీనంగా ప్రపంచంలో జరుగుతున్న 3000కి పైగా పోరాటాలు, 600 వేర్పాటు వాద ఉద్యమాలు పెరుగుతున్న సంక్షోభానికి నిదర్శనాలు. అంతర్జాతీయ ఆలోచనా విధానం, ప్రత్యేకించి ఐరోపా కేంద్రక దృక్పథం ఆధారంగా రూపొందిన మానవ హక్కుల భావన ప్రస్తుత సంక్షోభ నివారణకు ఉపకరించేదిగా లేదని స్పష్టమైంది.

BRAOU

సాంస్కృతిక స్థాయిలో ఏర్పడిన సంక్షోభం, ఆర్థిక సంక్షోభంతో కలిసి అభివృద్ధి చెందుతున్న సమాజాలకు పెనుసవాళ్లను ముందుంచాయి. ఈ సమాజాలు తమ లక్ష్యాలను పునర్నిర్వచించుకొని ఆర్థిక స్థాయిలో సమదృష్టిని అలవర్చుకొని సాంస్కృతిక స్థాయిలో సామాజిక సంబంధాలను ప్రజాస్వామ్యీకరించాల్సి ఉంది. సృజనాత్మక రాజకీయ ప్రక్రియ ద్వారా మాత్రమే ఇది సాధ్యం. అభివృద్ధి చెందున్న సమాజాల 'మానవ హక్కుల భావన' తప్పని సరిగా 'ఐరోపా కేంద్రక' దృక్పథానికి వ్యతిరేకంగానే ఉండనక్కరలేదు. అయితే దాని పరిధిని విస్తృత పరుస్తూ మానవ హక్కులను నిర్వచించేదై ఉండాలి.

## 10.2.4 ప్రేరేపిత విమర్శ

మూడవ ప్రపంచదేశాల మరో విమర్శ పాశ్చాత్యదేశాల విమర్శకు సంబంధించినది. పాశ్చాత్య విమర్శ రాజకీయంగా ప్రేరేపించబడినదన్నది వీరి వాదన. నిష్కపటమైన మానవ అభ్యున్నతి కోసం కాక మూడవ ప్రపంచదేశాలను చిక్కుల్లోకి నెట్టేందుకు జరుగుతున్న రాజకీయ తంత్రంలో భాగంగా, మానవ హక్కుల విషయంలో కొన్ని ప్రామాణిక అంశాలకోసం పట్టుబడుతున్నారన్నది ఈ వాదన. సామాజిక బాధ్యత, బాలకార్మిక వ్యవస్థ, పర్యావరణం, సాంఘిక షరతులు, అధికప్రాధాన్య దేశపు హోదా వంటి అంశాలను, ఇంకా ప్రపంచ బ్యాంక్, IMF అప్పులను మానవ హక్కుల ఆచరణతో ముడిపెట్టడం వెనుక, పాశ్చాత్య దేశాలకు మానవహక్కుల పట్ల గల చిత్తశుద్ధి, దృఢవిశ్వాసాలకు బదులుగా వారి లాభాలను

వృద్ధిచేసుకోవటం అంతర్జాతీయ మార్కెట్‌లోకి కొన్ని ప్రత్యేక వస్తువుల ప్రవేశాన్ని నిషేధించటం వాళ్ళ ప్రయోజనాలను కాపాడుకోవడానికే ముందుకు తీసుకువస్తున్నారన్న వాదనలో కూడా కొంత వాస్తవం ఉంది. ప్రమాణాలను ఏకరీతిగా అనుసరించక పోవటం విషయంలో ఈ విమర్శ గణనకు వస్తుంది. అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్ ప్రయోజనాలు దారుణంగా దెబ్బతినే పరిస్థితిలో వారు షరతులకోసం పట్టుబట్టడం సాధారణం. ఈ విధంగా మానవహక్కుల బూచిని కొన్ని ప్రత్యేక అంశాల పరంగానే ఉపయోగించటం పెక్కు అనుమానాలకు అవకాశమిచ్చింది.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సమాజాలు విశ్వమానవ హక్కులకోసం నిష్కపటంగా కట్టుబడిన పక్షంలో ప్రజలకు మౌలికావసరాలను కల్పించలేని స్థితిలో ఉన్న సమాజాలతో తమసంపదను పంచుకునేందుకు సిద్ధపడాలన్నది అభివృద్ధి చెందుతున్న సమాజాల వాదన. వియన్నా సమావేశంలో నోబెల్ బహుమతి గ్రహీత సోయెంకా ఈ ప్రశ్న లేవనెత్తారు. మొదటి ప్రపంచదేశాలు సిసలైన ఆసక్తితో అభివృద్ధి చెందిన దేశాలకు ఇచ్చిన అప్పులను రద్దుచేస్తాయా లేక మానవ హక్కుల కోసం వెంటాడుతాయా? అన్నదే అసలు సమస్య. మరోవైపు ప్రపంచీకరణ ప్రక్రియ చురుకుగా సాగుతున్న దశలో, ప్రపంచమంతా మరింత చేరువౌతున్నదని నమ్ముతున్న పరిస్థితిలో వ్యాపార ఉత్పత్తి రంగాల్లో అంతర్జాతీయ సంబంధాల్లో 'మేధోసంపద హక్కుల' గురించిన ప్రశ్న ఉదయించింది. పేటెంట్ హక్కులలో మార్పు కారణంగా ప్రాణరక్షణకుపకరించే మందులు పేదవర్గాలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఇది ఆరోగ్య హక్కును తీవ్రంగా కాలరాయటమే - వైద్యపారిజ్ఞానంలో అద్భుత ప్రగతి సాధించినా, అల్పాదాయం కారణంగా పేదలు మరణించటం జీవించే హక్కుకు వ్యతిరేకంగా సాగే ఘోరమైన, అమానవీయమైన చర్యే.

సంపన్న సమాజాలు, పేదసమాజాల మధ్య సంబంధం మానవ హక్కులు పునాదిగా ఏర్పడాలి. ఈ పునాది సామాజిక బాధ్యతతో నిండినదై ఉండాలి. ఈ విషయంలో విస్తృత దృక్పథం, దూరదృష్టి అవసరం. ఈ సంబంధాల ఏర్పాటులో ప్రథమ ప్రపంచ ప్రజాస్వామిక అభిప్రాయం ప్రధాన భూమికను పోషిస్తుంది. మూడవ ప్రపంచ సమాజాల్లోని చైతన్యవంతమైన వర్గం నిర్మాణాత్మకమైన ప్రశ్నలతో అర్థవంతమైన చర్చలు జరపాలి. మొదటి ప్రపంచ ప్రజాస్వామిక వర్గాలు తమ పాలకులపై వత్తిడి తెచ్చి, ప్రజల లేమికి, బాధలకు ఉన్నత వర్గాలు బాధ్యత వహించేట్లు చేయాలి. ఇది నోమ్ ఛామ్‌స్కీ వంటి ప్రముఖ మేధావుల వలననే సాధ్యపడుతుంది. భిన్నజాస్వామ్యం, మానవతావాదం వంటి చారిత్రక అంశాలు ఈ దశలో ఆచరణలో పెట్టాల్సిఉంది. ఇటువంటి చర్యలు మాత్రమే విశ్వమానవ హక్కుల పురోగతికి అవసరమైన పరిస్థితులను కల్పించగలవు.

### తటస్థ - కేంద్రక

పాశ్చాత్య దేశాల్లో మానవహక్కులపై జరిగిన చర్చల్లో మానవ హక్కులను అంతిమ ఉత్పాదకాంశాలుగా, ఆధీనమైన హక్కులుగా భావించటం కనిపిస్తుంది. మానవ హక్కులను లక్ష్యపెట్టక ఘోరంగా ఉల్లంఘించే సమాజాల్లో మానవ హక్కుల విద్యకు ప్రాధాన్యం ఇవ్వటం సరైన చికిత్సగా సూచిస్తున్నారు. ప్రధానమైన ఈ విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు, అయితే ఇది మాత్రమే చాలదు. ఆధిపత్యభావన, అప్రజాస్వామిక సంప్రదాయాలు, సమీకృతం కాని ప్రజాభిప్రాయం, హక్కులభావనలోనే దాతృత్వం లోపించటం వంటి అంశాలు నేపథ్యంగా మానవ హక్కుల మౌలిక స్వభావాన్ని గుర్తించడం ఎలా సాధ్యపడుతుంది? అందుచేత పరిణామం విషయంలో ఒక వ్యూహం ఉండాలి. కాని జాతీయ, అంతర్జాతీయ చర్చల్లో ఈ అంశం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. తటస్థ-కేంద్రక దృక్పథం మానవ హక్కుల వంటి అంశాలపై స్వల్పమైన ప్రభావాన్ని మాత్రమే కలిగించింది. బాధానర్పదష్టులు ప్రతిఘటించే హక్కును కలిగి ఉంటారు. గనక - న్యాయం, స్వేచ్ఛల కోసం ఆయా వ్యవస్థలపై వత్తిడి తేగలుగుతారు.

## 10.3 విమర్శనాత్మక అంచనా

అభివృద్ధి చెందుతున్న సమాజాల్లో పౌరహక్కుల సంస్థలు, మానవ హక్కుల ఉద్యమాలు స్వేచ్ఛకి, కనీసావసరాలకు మధ్య ఏర్పడుతున్న అగాధం తప్పుదారి పట్టించేదిగా ఉందని స్పష్టం చేస్తూనే ఉన్నాయి. తమ

సమస్యలపై అవసరమైన దృష్టి సారించేందుకు సంపన్న పాలక వర్గాలను వత్తిడి చేసేందుకు చాలినంత రాజకీయ, ప్రజాస్వామిక వాతావరణం పేదవర్గాలకు ఉంది. అయితే పౌర, రాజకీయ హక్కులతో నిమిత్తం లేకుండా, తమ సమస్యలను పాలక వర్గాలకు చేరవేసేందుకు అవసరమైన ఏర్పాటు వీరికి లేదు. సంపన్న పాలకవర్గ ప్రవర్తనా స్వభావాన్ని బట్టి పేదవారి సమస్యల పట్ల తగిన శ్రద్ధ కనబరిచే అవకాశాలు మృగ్యమే.

కనీసావసరాలు పూర్తిగా తీరినట్లుగా ఊహించుకుంటే, అప్పుడు స్వేచ్ఛలేమిని సమర్థించుకోగలుగుతామా? మనుషులు ఆహారం లేకుండా జీవించలేరన్నది వాస్తవం. అయితే వారు కేవలం తిండి కోసం మాత్రమే జీవిస్తారన్నది మాత్రం నిజం కాదు. అదే నిజమయ్యే పక్షంలో, 'జీవనం కోసం ఆహారం' స్థానంలో 'తిండి కోసమే జీవితం' అనే భావం వచ్చి చేరుతుంది. ఈ భావన మానవజాతి ప్రత్యేక లక్షణాన్ని దూరం చేస్తుంది. దీంతో జంతువులకు, మానవులకు మధ్య తేడా లేకుండా పోతుంది. కనీసావసరాలు తీరిన తర్వాత వ్యక్తులు తమ వృత్తి నైపుణ్యాలు, కళాత్మక ప్రతిభ, సృజన సమర్థ్యాల ద్వారా తమ వ్యక్తిత్వాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తారు. ఇందుకు వారికి 'స్వేచ్ఛ' అవసరమౌతుంది. కనీసావసరాలకు, స్వేచ్ఛకు మధ్య సమతుల్యం సాధించే విషయంలో అభివృద్ధి చెందుతున్న సమాజాలు తమ స్వంత 'సూచిక'ను రూపొందించుకొనవలసి వుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ అభివృద్ధి నమూనాలను పునర్నిర్మాణం చేయటంద్వారా మాత్రమే ఈ సమతుల్యతను సాధించగలుగుతాయి. పాశ్చాత్య అభివృద్ధి భావనల పట్ల విమర్శనాత్మక దృష్టిని కలిగి ఉన్నట్లుగా, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆర్థిక, అభివృద్ధి నమూనాల విషయంలో విమర్శనాత్మక దృష్టిని కలిగి లేవే. ఇటీవలి కాలంలో నిర్మాణాత్మక సర్దుబాటు లేదా సరళీకరణ పేరుతో ఈ దేశాలన్నీ పారిశ్రామిక దేశాలను వాటి అభివృద్ధి నమూనాలను అనుకరిస్తున్నాయి. దీంతో ఆర్థిక నమూనాలు అంగీకారయోగ్యమైనప్పుడు పాశ్చాత్య భావనలైన స్వేచ్ఛ, పౌర, రాజకీయ హక్కులు ఎందుకు అంగీకారం కావు? అన్న ప్రశ్న ఉదయించింది. ఈ ప్రాతిపదికతో జరిగే చర్చ, పాశ్చాత్య అభివృద్ధి దశలకు పూర్తి విరుద్ధమైన ఓ ముఖ్య తర్కాన్ని జ్ఞప్తికి తెస్తుంది. అభివృద్ధి చెందిన సరళ ప్రజాస్వామ్య సమాజాలుగా ఏర్పడక పూర్వం పాశ్చాత్య సమాజాల్లో అణచివేత ఉండేది. అయితే మార్కెట్ శక్తుల అభివృద్ధిలో భాగంగానే ఇది చోటు చేసుకున్నది. మార్కెట్ ఒక ముఖ్య వ్యవస్థగా అవతరించింది. దానితో పాటుగా సరళ ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ, ప్రాతినిధ్య సంస్థలు, అధికారాల విభజన వంటి భావాలు ప్రవేశించాయి. పారిశ్రామిక విప్లవం నేపథ్యంగా 'మానవ హక్కుల' సంపూర్ణ భావన ఒక రూపాన్ని సంతరించుకున్నది. కానీ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇది విరుద్ధ క్రమంలో సాగుతున్నట్లుగా కనిపిస్తున్నది. ఆర్థిక రంగంలో సరళమైన నమూనాను ఎన్నుకొన్నప్పటికీ రాజకీయంగా వారు ఆధిపత్యపాలన దిశగా వెలుతున్నట్లనిపిస్తున్నది. ఆ కారణంగానే ప్రజాస్వామిక స్పృహ కలిగిన ప్రజలు తమ పాలక వర్గాన్ని మానవ హక్కుల పట్ల తమ స్పష్టమైన వైఖరికి కట్టుబడి ఉండటం తప్పనిసరి.

## 10.4 ముగింపు

మావ హక్కుల పరిరక్షణకోసం అభివృద్ధిచెందిన దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంది. స్వాతంత్ర్యానంతరం భారత్ వంటి దేశాలు సామ్యవాద దృష్టిని వదలకుండానే శీఘ్ర ఆర్థికాభివృద్ధి కోసం ప్రయత్నించటం, చైనా వంటి దేశాలు సైతం సామ్యవాద భావాన్ని అలక్ష్యం చేయలేకపోవటం చూస్తాము. ఈ అభివృద్ధి నమూనాల్లో మానవ హక్కుల ప్రచారానికి, ఆచరణకు అవకాశం వుంటుంది. ఆర్థిక హక్కుల పేరుతో, సంపూర్ణ మనవ హక్కుల భావనపట్ల ప్రత్యేకించి పౌర, రాజకీయ హక్కుల భావన పట్ల ఉదాసీనత చూపటం ప్రమాదకరమే కాక అనుత్పాదకం కూడా. తూర్పు ఐరోపాదేశాలు, ప్రత్యేకించి సోవియట్ యూనియన్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొనటం

BRAOU

అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎంతైనా అవసరం. అందుచేత హక్కుల పట్ల పాశ్చాత్య భావనలకు వ్యతిరేకంగా వచ్చిన విమర్శ, అభివృద్ధి దశతో మమేకమయ్యే క్రమంలో కొంత వత్తిడి ఉంటుంది. అయినప్పటికీ ఆర్థికాభివృద్ధి అనివార్యతలను, రాజకీయస్వేచ్ఛ అవసరాలను తృప్తి పరచే రాజకీయ - ఆర్థిక నమూనాలను రూపొందించాల్సిన చారిత్రక అవసరాన్ని తక్కువగా అంచనా వేయలేం.

## 10.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. సాంస్కృతిక రంగంలో హక్కుల పట్ల పాశ్చాత్య భావనలకు వ్యతిరేకంగా మూడవ ప్రపంచదేశాల విమర్శను గూర్చి వ్రాయండి.
2. ఆర్థిక రంగంలో హక్కుల విషయంలో పాశ్చాత్య భావనల పట్ల మూడవ ప్రపంచ దేశాలు చేసిన ప్రధాన విమర్శలేవి?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.**

1. విశ్వ మానవ హక్కుల ప్రామాణికత పై వచ్చిన విమర్శ ఏమిటి?
2. మానవ హక్కులపై - మూడవ ప్రపంచ ఆలోచనాస్రవంతిని విమర్శనాత్మకంగా అంచనా వేయండి?

BRAOU

# భాగం - 11 : పాలోఫ్రేయర్ భావనలు

## విషయక్రమం

11.0 ఉద్దేశం
11.1 పరిచయం
11.2 పాలోఫ్రేయర్ నేపథ్యం
11.3 విద్యపై ఫ్రేయర్ భావనలు
11.4 ఆదిపత్య సమాజం : అమానుషీకరణ
11.5 బ్యాంకింగ్ విద్య
11,6 సమస్యా విశ్లేషనాత్మక పద్ధతి
11.7 విద్యాబోధన కూడా ఒక రాజకీయమే
11.8 విమర్శనాత్మక చైతన్యం
11.9 సంభాషణ పద్ధతి
11.10 మానవులు : విద్య
11.11 విద్య : చైతన్యీకరణ
11.12 ముగింపు
11.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 11.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- పాలో ఫ్రేయర్ నేపథ్యాన్ని తెలుసుకుంటారు.
- విద్యా బోధనపై పాలో ఫ్రేయర్ భావాలు చర్చించ గలుగుతారు.
- ఆది పత్యసమాజం - అమానుషీకరణ పై ఫ్రేయర్ భావాలు వివరించగులుగుతారు.

BRAOU

## 11.1 పరిచయం

పాలో ఫ్రేయర్ (Paulo Friere) మూడవ ప్రపంచ దేశమైన బ్రెజిల్‌కు చెందిన విద్యావేత్త, పరిశోధకుడు, తత్వవేత్త మరియు సామాజిక కార్యకర్త. తన అనుభవాల వ్యక్తీకరణతోను, అలోచనా విధానంతోను తన స్వదేశమైన బ్రెజిల్‌తోపాటు ఇతర మూడవ ప్రపంచ దేశాల దృష్టిని కూడా ఆకర్షించాడు. పేద ప్రజల స్థితిగతుల పట్ల వారి హక్కుల పట్ల అత్యంత శ్రద్ధ, ఆసక్తి కనపరిచాడు. దుర్భర పరిస్థితుల నుండి పేద ప్రజల విముక్తికి ఫ్రేయర్, విద్య పదునైన సాధనంగా గుర్తించి ప్రయోగించాడు. మానవ హక్కుల చర్చలో ఫ్రేయర్ అభిప్రాయాలను తప్పని సరిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఫ్రేయర్ విద్యారంగంలో నెలకొన్న అసమానతలను నిర్మూలించకుండా మానవ హక్కులను సాధించడం అత్యంత కష్టమౌతుందని ఫ్రేయర్ వాదించాడు.

## 11.2 పాలో ఫ్రేయర్ నేపథ్యం

ఫ్రేయర్ 1921 సంవత్సరంలో బ్రెజిల్ లోని 'రెసిఫీ' అను నగరంలో జన్మించాడు. బ్రెజిల్ లోని ఈశాన్య ప్రాంతము అసంఖ్యాక పేద ప్రజలతో కూడిన వెనుకబడిన కరువు ప్రాంతము. భూమి పంపిణీలో విపరీతమైన

వ్యత్యాసాలున్న ప్రదేశము. పోర్చుగీసు వారి వలస పాలన గుర్తులు ఇప్పటికి కనిపిస్తూనే ఉంటాయి. ఫ్రేయర్ జన్మించినటువంటి మధ్య తరగతి, సాంఘీక నేపధ్యం ఆయన ఆలోచనా విధానమును ఎక్కువగా ప్రభావితం చేసాయి.

తను పుట్టిన రెసిఫ్ నగరంలోనే ఫ్రేయర్ విశ్వవిద్యాలయ స్థాయి విద్యను పూర్తి చేసి విద్యారంగంలోనే అధ్యాపక జీవితాన్ని ప్రారంభించాడు. పేద ప్రజల పట్ల ఎంతగానో శ్రద్ధ కనబరిచే ఫ్రేయర్ వారి స్థితిని మెరగు పరచుటకు ఒక విద్యా విధానాన్ని రూపొందించాడు. 1963 సం॥లో బ్రెజిల్ ప్రభుత్వ విద్యాశాఖ దేశ వ్యాప్తంగా విద్యా వ్యాప్తికి ఫ్రేయర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యా వ్యాప్తికి దేశ వ్యాప్త ప్రచారం జరిగిన సమయంలో ఫ్రేయర్‌కు రైతులతో జీవించడమే కాక వారి పరిస్థితులను అధ్యయనం చేసే అవకాశం వచ్చింది. తదనంతరం ఫ్రేయర్ విద్యార్జనకు గల మానవ సామర్థ్యాలపై ఒక సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఫ్రేయర్ ప్రయోగాలు, సిద్ధాంతాలు త్వరితగతిన ఫలితాలు ఇవ్వడమే కాక సమకాలీన వ్యవస్థను విశ్లేషించే, ప్రశ్నించే చైతన్యాన్ని ప్రజల్లో కలిగించాయి. ఈ దశలో ఫ్రేయర్ కార్యక్రమాలను ప్రభుత్వ, ప్రజా వ్యతిరేకమైనవిగా బ్రెజిల్ ప్రభుత్వం పరిగణించడం ప్రారంభించింది. ఈ రకమైన ప్రభుత్వ ధోరణికి పరాకాష్ఠగా 1964లో బ్రెజిల్ మిలిటరి, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్న వెంటనే ఫ్రేయర్ ని నిర్బంధించి దేశం నుండి భహిష్కరించింది. మళ్ళీ 1980 లో ఫ్రేయర్ బ్రెజిల్ చేరాడు. అది కూడా 1979 లో ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించిన తరువాత. ఈ విధమైన ఫ్రేయర్ కార్యక్రమాలు, భావనలు నికరాగువా, క్యూబా, పోర్చుగల్, చిలీ, అంగోలా, టాంజానియా వంటి అనేక దేశాలలో విస్తృత ప్రచారం పొంది ఆయా దేశాల మానవ హక్కుల కార్యక్రమాలను ఉద్యమాలను ఎంతగానో ప్రభావితం చేసాయి.

## 11.3 విద్యపై ఫ్రేయర్ భావనలు

పాలో ఫ్రేయర్ ఉద్దేశ్యంలో విద్యను రెండు రకాల లక్ష్యాలకు ఉపయోగించవచ్చు. మొదటిది: ప్రజలకు ఇప్పుడున్న సామాజిక విలువలు, ఆచార సాంప్రదాయాలలో మరింత విశ్వాసం కల్పించి వారిని ప్రస్తుత వ్యవస్థకు అనుకూలంగా తయారు చేయడం.

రెండవది: వారికి నూతన విలువలను ఇచ్చి ఇప్పుడున్న ఆధిపత్య సమాజంలోని ఆచార వ్యవహారాలను ప్రశ్నించే శక్తినిచ్చి వారి ఆలోచనలో మార్పులను, తద్వారా సమాజంలో మార్పును తీసుకురావటం. ఆధిపత్యానికి గరవుతన్న వ్యక్తులలో మార్పును తీసుకురావడం వల్ల, వారి ద్వారా ఆధిపత్యం వహించేవారిలో కూడా మార్పు వస్తుందని పాలో ఫ్రేయర్ నమ్మాడు. విద్య మానవుని అన్ని రకాల వెనుక బాటు తనం నుండి, అజ్ఞానం నుండి విముక్తి చేయాలి తప్ప మానవ మేథస్సును సంకుచితం చేయకూడదని ఫ్రేయర్ భావించాడు. అందుకే ఈయన విద్యను విముక్తి సాధనంగా గుర్తించాడు. ఫ్రేయర్ దృష్టిలో కొంత సమాచారాన్ని మాత్రమో తెలుసుకోవటమో విద్యకాదు, అది యాంత్రిక విధానమని ఆయన అభిప్రాయం. ఫ్రేయర్ తన నూతన సిద్ధాంతంలో కేవలం ఉపాధ్యాయులు చెప్పింది విద్యార్థులు వినటం అనే సాధారణ యాంత్రిక పద్ధతికి బదులుగా విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే ఒరవడి కావాలని ప్రస్తావించాడు. వ్యక్తికి సమాజానికి మధ్య ఒక బలమైన సంధాన కర్తగా కూడా ఫ్రేయర్ విద్యను గుర్తించాడు. ఫ్రేయర్ రూపొందించిన సిద్ధాంతం ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య నిరంతర దైనందిక జీవిత సమస్యల పట్ల చర్చలు విశ్లేషణ జరిపి అవి మానవ జీవిత ప్రగతికి తోడ్పడే వ్యూహం ఉండాలి. ఈ విధమైన పద్ధతి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను కూడా చైతన్యవంతులుగా తీర్చి దిద్దుతుందని ఫ్రేయర్ ప్రతి పాదించాడు. విద్య అంటే అక్షరాల భోదన మాత్రమే కాదు. పాలో ఫ్రేయర్ ఉద్దేశ్యంలో విద్య అంటే మనిషిలో ప్రజాస్వామిక విలువలు పెంపొందించటం, ప్రశ్నించే స్వభావం కల్పించటం, అన్నింటికీ మించి ఒక చైతన్య వంతమైన వ్యక్తిని, సమాజాన్ని తయారు చేయటం.

BRAOU

## 11.4 ఆధిపత్య సమాజం:- అమానుషీకరణ (Dehumanisation)

పాలో ఫ్రేయర్ ఉద్దేశ్యంలో అణచివేత పరిస్థితి ఉన్న సమాజంలో ముందుగా మనుషులు సమాజాన్ని విమర్శనాత్మకంగా అర్థం చేసుకొని అట్టి అణచివేతకు కారణాలు గుర్తించాలి. సమాజంలోని ఆధిపత్య సాధనాలను ఉపయోగించి ఆధిపత్యం వహించేవాడు బాధితులపై తమ అధికారాన్ని చెలాయిస్తాడు. ఈ క్రమంలో ఆధిపత్యం చెలాయించేవాడు తాను అమానుషీకరణ చెందటమే కాక ఇతరులలోని మానవత్వాన్ని కూడా నశింపజేస్తాడు ఇట్టి పరిస్థితుల నుండి బయటపడటానికి విద్య అణిచివేయబడే వారికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. బాధితులు విద్యావంతులు, చైతన్యవంతులు అయినపుడు వారు మానవీకరణ చెందటమే కాక అణిచివేసే వర్గాలలో కూడా మానవత్వాన్ని తీసుకువస్తాడు. అందుకే ఫ్రేయర్ విద్య ద్వారా ప్రజలలో చైతన్యాన్ని తీసుకరావాలని చెప్పారు. అణిచివేతకు గురిఅయ్యేవాడు దానికి కారణాలను తెలుసుకోకుండా బయట పడుటకు ప్రయత్నించాడు. అందుకే వ్యక్తులకు తామున్న పరిస్థితులకు గల కారణాలను తెలుసుకొనేందుకు విద్య ఉపయోగపడుతుంది. 1970వ సంవత్సరంలో ఫ్రేయర్ రాసిన 'పెడగాగే ఆఫ్ ది అప్రెస్డ్' అనే పుస్తకంలో ప్రస్తుత విద్యావిధానం కేవలం శ్రోతలను మాత్రమే తయారు చేస్తుందని వాదించాడు. ఈ పద్ధతిలో యాంత్రికంగా పాఠాలు చెప్పుకుపోయే ఉపాధ్యాయులు, సహన శీలురైన విద్యార్థులు మాత్రమే ఉంటారు. ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు భోదించే అంశం ఏదైనను నిస్సారంగా తయారౌతుంది. ఫ్రేయర్ ఈ పద్ధతిని 'బ్యాంకింగ్ పద్ధతి' అని పేర్కొన్నాడు.

## 11.5 బ్యాంకింగ్ విద్య

బ్యాంకింగ్ విధానం అంటే బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు జమ చేసిన విధంగా ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో అంచలంచలుగా పాఠ్యాంశాలను జమ చేస్తాడు. అట్లా భోదించి విద్యను పరీక్షల సమయంలో విద్యార్థి ఉన్నది ఉన్నట్లుగా తిరిగి ఉపాధ్యాయునికి అప్పజెప్పాలి (బ్యాంకులోని డిపాజిట్ తిరిగి తీసుకున్నట్లు). ఈ పద్ధతిలో విద్యార్థి తాను తరగతి గదిలో నేర్చుకున్నది జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని తిరిగి ఉపాధ్యాయునికి అప్పజెప్పాలి. ఇటువంటి బ్యాంకింగ్ విధానం విద్యార్థి జ్ఞాపక శక్తికి ప్రాధాన్యతనిస్తుంది తప్ప అతనిలో విమర్శనాత్మక, విశ్లేషనాత్మక శక్తిని పెంపొందించదు. దీని వలన సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనే శక్తి విద్యార్థి కోల్పోతాడు. అందుకే దానికి భిన్నంగా ఫ్రేయర్ సమస్య విశ్లేషనాత్మక పద్ధతిని ప్రతిపాదించాడు.

BRAOU

## 11.6 సమస్యా విశ్లేషనాత్మక పద్ధతి

విద్య విద్యార్థులో ప్రశ్నలను రేకెత్తించేదిగా ఉండాలని పాలో ఫ్రేయర్ సూచించాడు. విద్య ఎప్పుడు సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుక వచ్చేదిగా వాటిపై చర్చను జరిపేదిగా ఉండాలి. అంటే ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు అనేక వాస్తవ జీవిత సమస్యలను విద్యార్థుల ముందుంచి వారిని ఆలోచింపజేసి వారి నుండే పరిష్కార మార్గాలను బయటకు తీస్తాడు. విద్యార్థి గుడ్డిగా అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేవాడిగా కాక మౌలికమైన ప్రశ్నలను అడిగేవాడుగా తయారు కావాలి. అంటే ఇప్పుడున్న విజ్ఞానాన్ని విలువలను ప్రశ్నించే శక్తి విద్యార్థికి రావాలి.

## 11.7 విద్యా భోదన కూడా ఒక రాజకీయమే

1987 లో రచించిన 'పెడగాగె ఫర్ లిబరేషన్' అను గ్రంథంలో పాలో ఫ్రేయర్ విద్యను రాజకీయ అంశంగా పేర్కొన్నాడు. విద్యాభోదన రాజకీయాలకు అతీతం కాదని, విద్యా భోదన కూడా రాజకీయమేనని ఉపాధ్యాయులు తెలుసుకోవాలని పాలో ఫ్రేయర్ నొక్కి చెప్పాడు. ఉపాధ్యాయుడు ఎప్పుడు తరగతి గదిలో కొన్ని రాజకీయ విషయాలను, సామాజిక విలువలను భోదిస్తాడు. అయితే తాను ఎటువంటి రాజకీయం చేస్తున్నదీ తెలుసుకోవాలని చెప్పాడు. ఉపాధ్యాయుడు తెలిసి తెలియకో కొన్ని విలువలకు అనుకూలంగానూ, కొన్ని విలువలకు వ్యతిరేకంగానూ పని చేస్తాడు.

అయితే చైతన్య పూరిత, విమర్శనాత్మక విద్యను భోదించే ఉపాధ్యాయుడు ఎప్పుడు ప్రజాస్వామ్య వాది అయి ఉండాలి. సామాజిక అసమానతలను, అన్యాయాలను ఎప్పుడు ప్రశ్నిస్తూ ఉండాలి.

## 11.8 విమర్శనాత్మక చైతన్యం

ప్రజలలో విమర్శనాత్మక చైతన్యం రావాలని ఫ్రేయర్ భావించాడు. ఈ దశకు చేరాలంటే దానికి ముందుగల రెండు స్థాయిలను అధిగమించాలి. ఇందులో మొదటిదశ, పరివర్తన చెందని ఆలోచనా దశ intrandsitine, thought). ఈ స్థాయిలో ప్రజలు ప్రతి విషయాన్ని తమ ఖర్మగా భావిస్తారు. తమ జీవితం పై తమకు ఎట్టి నియంత్రణ లేదని భావిస్తారు. ఇట్టి ప్రజలు పూర్తిగా వారిపై ఆధిపత్యం చెలాయించే శిష్టుల (Semi-transitine) అధీనంలో ఉంటారు. రెండవ దశ, స్వల్ప పరివర్తన చెందిన దశ. ఈ దశలో ప్రజలు కొంత విచక్షణ జ్ఞానాన్ని కలిగి మార్పుకోసం ప్రయత్నిస్తారు. వారికున్న సమస్యలు అర్థం చేసుకొగలరు కాని వాటికి పరిష్కారాలు వెతికే స్థోమత ఉండదు. తమ సమస్యలను సమాజంలో విశాలమైన ఇతర అంశాలకు ముడిపెట్టి చూడలేరు. తమ సమస్యలను తాము పరిష్కరించుకోలేని దశలో ఎవరైన గట్టి నాయకుడు ముందుకు వస్తే అతని ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఉద్దేశ్యంతో అమాయకంగా అతన్ని అనుసరిస్తారు. చివరి దశ, విమర్శనాత్మక చైతన్యం కలిగిన వారు తమ సమస్యలను చారిత్రకంగాను, విమర్శనాత్మకంగాను అర్థం చేసుకొని వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు చేపడతారు. అంటే ప్రతి సమస్యను ఖర్మతో ముడిపెట్టే స్థాయినుండి తమ సమస్యలు అర్థ చేసుకొని వాటికి గల కారణాలను తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలు వెతికే స్థాయికి చేరడమే విమర్శనాత్మక చైతన్యం(critical consciousness). ఈ స్థాయిలో వ్యక్తులు తమకు ఏమి కావాలో తెలుసుకొని దానికి తగిన మార్పులను చేపడుతారు. తన చుట్టు ఉన్న పరిస్థితులను అర్థం చేసుకొని ఆ పరిస్థితులను మార్చటానికి ప్రయత్నిస్తారు. విద్య యొక్క లక్ష్యం వ్యక్తులను విమర్శనాత్మక చైతన్య స్థాయికి ఎదిగేలా చేయడం, సమాజాన్ని గురించి విజ్ఞానం, చరిత్రను మార్చగలమను నమ్మకం, భవిష్యత్తును నిర్మించుకొగలమను నమ్మకం, విశ్లేషనాత్మకంగా ఆలోచించగలగటం, తమ సమస్యలకు గల సామాజిక సందర్భాన్ని అర్థం చేసుకోవడం, మున్నగువన్ని కూడా విమర్శనాత్మక చైతన్యంలో భాగమే. విమర్శనాత్మక చైతన్యం కలవారు ఇప్పుడున్న సామాజికార్థిక విలువలను ప్రశ్నిస్తారు. సామాజిక అపోహలను ఎదురిస్తారు, ఇప్పుడున్న సమాజంలో అప్రజాస్వామిక ఆధికారయుత సంబంధాలను ఎదిరించి వాటితో మార్పు తీసుక రావటానికి ప్రయత్నిస్తారు.

## 11.9 సంభాషణ పద్ధతి (Dialogue method)

ప్రజల్లో విమర్శనాత్మక చైతన్యం తీసుకరావటానికి విద్యా వ్యవస్థలో తీసుకరావలసిన మార్పుల గురించి, నూతన పద్ధతుల గురించి పాలో ఫ్రేయర్ వివరించాడు. ఆయన చెప్పిన పద్ధతులన్ని కూడా తను ఆచరించి చూపించిందే. విద్య ఎప్పుడు ఉపాధ్యాయుడు చెప్పుకుంటూ పోతుంటే విద్యార్థులు మౌనంగా వినే ఎక పక్ష ప్రసంగంలా కాక సంభాషణా ధోరణిలో జరగాలని పాలో ఫ్రేయర్ సూచించాడు. తరగతి గదిలో విద్యార్థులు మౌనంగా కూర్చునే సాంప్రదాయ పద్ధతికి స్వస్తి చెప్పాలి. సాంప్రదాయ పద్ధతిలో భోధన అచేతనంగానూ నిస్సారంగానూ సాగుతుంది. దానికి బదులు ఉపాధ్యాయుడు విద్యార్థుల మధ్య నిరంతరం చర్చా సంభాషణలు జరగటం వల్ల విద్యార్థుల్లో చైతన్యం పెరుగుతుంది. విద్య, ఉపాధ్యాయుడు కేంద్రంగా కాక విద్యార్థిని కేంద్రంగా చేసుకొని ఉండాలి. అంటే అది విద్యార్థుల అవసరాలను వారి దైనందిక సమస్యలను కేంద్రంగా చేసుకొని నిర్వహించాలి. విద్యార్థులలో ఆత్మ పరిశీలన ప్రోత్సహించాలి. తరగతి గది నిర్వహణ ప్రజాస్వామికంగా ఉండి విద్యార్థులకు కూడా మాట్లాడే హక్కును ఇవ్వాలి. విద్యార్థికి కూడా మాట్లాడే హక్కు ఉంటుందని ఉపాధ్యాయుడు గుర్తించాలి.

విమర్శనాత్మక విద్య విద్యార్థులలో పరిశోధనా గుణాన్ని పెంపొందిస్తుంది. వారిలో క్రియాశీలక భాగస్వామ్యాన్ని. సహకార గుణాన్ని పెంపొందించాలి. ఇటువంటి విద్య సామాజికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది.

BRAOU

## 11.10 మానవులు - విద్య

ఫ్రేయర్ ప్రకారం విద్య ఒక తటస్థమైన ప్రక్రియ కాదు. ఇంతకు ముందు చెప్పినట్లుగానే విద్యను రెండు రకాలుగా ఉపయోగించవచ్చు. ఒకటి, ప్రస్తుత సామాజిక విలువలను పటిష్ఠ పరిచేది కాగా, రెండవది, మానవుని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై ప్రయత్నించేది. మొదటి రకం విద్య అమానుషానికి అణచివేతకు దారి తీయగా రెండవ రకం విద్య మానవీకరణకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు దారి తీస్తుంది. విమర్శనాత్మక విద్య ద్వారా మానవీకరణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించవచ్చుని ఫ్రేయర్ భావించాడు. చారిత్రకంగా ఎంతో ప్రగతిని సాధించిన మానవ సంస్కృతిలో ఈ స్థాయిని సాధించటం ఏమంత కష్టసాధ్యం కాదు.

ప్రపంచంలోని ఇతర జీవరాసులలో భాగంగా బ్రతికిన మానవుడు చరిత్ర క్రమంలో వాటినుండి విడువడి ఎంతో ప్రగతి సాధించాడు. ఇతర ప్రాణులతో పోల్చినపుడు మానవునికి కొన్ని విభిన్న లక్షణాలున్నాయి. మానవులు తామున్న పరిస్థితులు అర్థం చేసుకొని విశ్లేషించగలరు. తాము నివసిస్తున్న పరిస్థితులకు భిన్నమైన పరిస్థితులను ఊహించుకొని గత అనుభవం ఆధారంగా తమకు అనుకూలమైన భవిష్యత్తును నిర్మించుకోగలరు. పశు పక్ష్యాదులు ప్రకృతి పరిస్థితులకు లోబడి నివసించగా మానవుడు ప్రకృతిని జయించి తమకు అనుకూలంగా మార్చుకొగలడు. ఒక పక్షి ఎన్ని తరాలైనప్పటికి ఒకే రకం గూడును నిర్మించగలదు. అదే మానవుడు తన చైతన్యాన్ని సృజనాత్మక శక్తిని ఉపయోగించి వివిధ రకాల ఇళ్ళను నిర్మించుకున్నాడు. ఇంత ప్రగతిని సాధించిన మానవుడు సామాజిక పరివర్తన కూడా తీసుకరాగలడు. ఈ రకమైన అవగాహన మానవ శక్తి సామర్థ్యాలపై ఫ్రేయర్‌కు గల దృఢమైన నమ్మకాన్ని సూచిస్తుంది.

## 11.3 విద్య చైతన్యీకరణ (literacy and conscientisation):-

అణచివేతకు గురైన ప్రజలు 'మూగ సంస్కృతి' తో జీవిస్తారని పాలో ఫ్రేయర్ వర్ణించాడు. వారు ఖర్మ సిద్ధాంతాన్ని నమ్ముతూ అచేతనంగా జీవిస్తారు. తమ సమస్యలను బహిర్గతం చేయలేక తమలో తామే బాధపడుతుంటారు. ఇట్టి పరిస్థితినుండి బయట పడటానికి వారిలో చైతన్యీకరణ సాధించాలి. అట్టి చైతన్యం విమర్శనాత్మక విద్య ద్వారా సాధించవచ్చు. వారు మూగ సంస్కృతి నుండి బయట పడి చైతన్యవంతమైన వ్యక్తులుగా, తమ పట్ల తమ సమాజం పట్ల పూర్తి అవగాహన కలవారిగా అభివృద్ధి చెందాలి. సామాజిక వాస్తవాన్ని అర్థం చేసుకొని అట్టి వాస్తవాన్ని మార్చగలిగే దశకు మానవుడు చేరాలి.

పాలో ఫ్రేయర్ ప్రజలతో విమర్శనాత్మక చైతన్యాన్ని తీసుకరావడానికి పాటించిన పద్ధతులు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. తాను పేద ప్రజలను విద్యావంతులను చేయడానికి వారిని 'సాంస్కృతిక సమూహాలు'గా(cultural circles) ఏర్పాటు చేసాడు. ఇలా ఏర్పాటు చేసిన 'సాంస్కృతిక సమూహాలు' తరచూ సమావేశమై తమ దైనందిక సమస్యలను ఒక్కొక్కటిగా గుర్తించి విస్తృతంగా చర్చించేవారు. ఆ చర్చించే క్రమంలోనే వాటికి పరిష్కార మార్గాలను కూడా వెదికేవారు. అంటే అవి అక్షరాలు నేర్పే కేంద్రాలుగా కాక చైతన్యాన్ని పెంపొందించే సమూహాలుగా పనిచేసేవి. ఈ పద్ధతి వల్ల పాలో ఫ్రేయర్ కనుగొన్నది ఏమంటే, మనం కొన్ని కీలక పదాలను గుర్తించి ఆ పదాలను చర్చకు పెట్టడం ద్వారా, చర్చలనుండే ప్రజలను చైతన్యవంతులనూ, విద్యావంతులను చేయవచ్చు. ఉదహరణకు, 'బీదత్వం', 'నేలా', 'నాగలి', 'వర్షం', 'మురికివాడ' వంటి కీలక పదాలను గుర్తించి 'సాంస్కృతిక సమూహం' లో చర్చకు పెట్టడం ద్వారా, సమస్యలపై వారికి సరైన అవగాహన కుదిరి పరిష్కార మార్గం వైపు పయనిస్తారు. మరింత వివరంగా చెప్పాలంటే 'ఆహారం' అను పదం చర్చకు వచ్చినప్పుడు ఆహారాన్ని పండించే పద్ధతులను మాత్రమో కాక ఉత్పత్తి అయిన ఆహారం ఎలా ప్రజల మధ్యకు వెళ్ళుతుంది, ఎందుకు కొంత మందికి ఆహారం దొరకకుండా పోతుంది. ఆహార పంపిణిలో అసమానతలకు కారణాలేమిటి అనే విషయము చర్చించినప్పుడు నిజంగానే ఆ సమూహానికి ఒక నూతన అవగాహన, చైతన్యం ఏర్పడే అవకాశం ఉంది, అలాగే ప్రతి కీలక పదాన్ని విమర్శనాత్మకంగా విపులంగా చర్చించాలి. ఈ పద్ధతి పాటించడం వల్ల

BRAOU

విద్య శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది. అలాకాక సంతకం చేయటం మాత్రమే విద్య అనుకుంటే ఆ విద్య ఎప్పుడూ అసంపూర్ణంగా మిగిలి పోతుంది. అందుకే పాలో ఫ్రేయర్ సూచించిన విద్యా పద్ధతులపై మరింత చర్చ జరిగి ప్రభుత్వాలు వాటిని పాటించినపుడు ప్రజలు నిజమైన విద్యావంతులుగా తయారవుతారు. అప్పుడే వారు వారి మౌలిక హక్కులను కూడా రక్షించుకోగలరు.

## 11.12 ముగింపు:

పై విశ్లేషణను బట్టి తెలిసిందేమంటే పాలో ఫ్రేయర్ విద్యను ఒక విముక్తి సాధనంగా భావించిన ఆధునిక తత్వవేత్త. ఈయన విద్యను సామాజిక మార్పుకు ఉపయోగించాలని వాదించాడు. ఈయన అభివృద్ధి చేసిన విద్యా పద్ధతులు వివిధ దేశాలలో అమలు చేయబడ్డాయి. ఆధునిక రాజకీయ పోరాటాలకు. సమాజ మౌలిక సమస్యలపై చర్చలకు పాలో ఫ్రేయర్ ఉద్దేశ్యంలో అసలైన విద్య మనిషికి-మనిషికి మధ్య, మనిషికి - బాహ్య ప్రపంచానికీ మధ్య నూతన సంబంధాలను ఏర్పరచి చరిత్ర నిర్మాణంలో ప్రతి మానవుడు భాగస్వామి అయ్యేలా దోహదం చేయాలి. నిజమైన విద్య మనిషిని అణిచివేత సంస్కృతిలో అంతర్భాగం చేయకుండా అతన్ని సామాజిక చట్రం నుండి విముక్తి కలిగించేదిగా ఉండాలి. ఈ రకమైన విముక్తి కోసం చేపట్టిన విద్య అణిచివేతకు గురైయ్యేవారి హక్కుల రక్షణ కోసం దోహద పడుతుందని చెప్పవచ్చును.

## 11.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు:

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి

1. 'విద్య ఒక విముక్తి సాధనం' అన్న ఫ్రేయర్ భావనలను వివరించండి?.

2. ఫ్రేయర్ ప్రతిపాదించిన విమర్శనాత్మక చైతన్యం మరియు సాంప్రదాయ విద్యా విధానన్ని విశ్లేషించండి?

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబురాయండి

1. భారతీయ సమాజాన్ని ప్రజాస్వామీకరించడానికి ఫ్రేయర్ పద్ధతి ఏవిధంగా సరైనదొ వివరించండి ?

BRAOU

# భాగం - 12 : నోమ్ ఛామ్‌స్కీ

**విషయక్రమం**

12.0 ఉద్దేశం
12.1 పరిచయం
12.2 అమెరికన్ మార్కెట్ ప్రజాస్వామ్యం - మానవహక్కులు
12.3 పాశ్చాత్య ప్రజాస్వామ్య భావన
12.4 బీభత్స రూపాలు
12.5 చర్చి - పరిపూర్ణ స్వేచ్ఛాయుత వాణిజ్యాభివృద్ధి నమూనాల మధ్య పోటీ
12.6 ప్రసార సాధనాలు - ఫాసిస్టు బీభత్సం
12.7 ప్రసారసాధనాలు - అత్యాచారాల సమర్థనా నిర్వహణ
12.8 అమెరికా ప్రభావిత రాజ్యాల ప్రాథమిక లక్షణంగా అవినీతి
12.9 నూతన మానవహక్కుల ఉద్యమం
12.10. ముగింపు
12.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 12.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- నోమ్ ఛామ్ స్కీ మానవహక్కుల భావాలు తెలుసుకుంటారు.
- మూడవ ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని చర్చించగలుగుతారు.
- నూతన మానవహక్కుల ఉద్యమాన్ని వివరించగలుగుతారు.

BRAOU

## 12.1 పరిచయం

ప్రపంచంలో జీవించివున్న ప్రతిభావంతమైన మేధావుల్లో గణనీయుడు నోమ్ ఛామ్‌స్కీ. భాషా శాస్త్రవేత్తగా శిక్షణ, ప్రసిద్ధి పొందిన నోమ్‌ఛామ్‌స్కీ ప్రవృత్తిరీత్యా మానవహక్కుల ఉద్యమకారుల్లో అగ్రగణ్యుడు. భౌతికశాస్త్రంలో ఐన్‌స్టీన్ సేవలతో ఛామ్‌స్కీ భాషాశాస్త్ర సేవలను పోలుస్తారు. సృజనాత్మక మేధావి అయిన ఛామ్‌స్కీ అన్వేషణ భాషాశాస్త్ర పరిధులను దాటి విస్తరించింది. అతని తొలినాళ్ళ మేధో ఆసక్తులు కానీ, ఎం.ఐ.టి. నేపథ్యం కానీ చివరకు అమెరికా నాగరికతా హద్దులు గానీ ఛామ్‌స్కీని ప్రపంచం మొత్తంమీద మానవుల వేదనల పట్ల స్పందించకుండా నివారించలేక పోయాము. మూడవ ప్రపంచదేశాల ప్రజల పట్ల ఆయనకున్న ప్రత్యేక అభిమానం, నిబద్ధత పట్ల అతనికున్న ధైర్యసాహసాలు, అమెరికా ప్రతికూల ధోరణులను ఎండగట్టడంలో శషభిషలు లేని నిర్మొహమాటం, మూడవ ప్రపంచ దేశాల సమర్థ మేధోజీవుల్లో ఛామ్‌స్కీకి ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించి పెట్టాయి. పుట్టుకవల్లగానీ, ఒక భౌగోళిక ప్రాంతానికి చెందినందువల్లగానీ బుద్ధిజీవుల వర్గీకరణ జరగదని, ఛామ్‌స్కీ మూడవ ప్రపంచదేశాల్లో సాధించుకున్న గుర్తింపు ఆయన భావనల వల్లేనని రుజువవుతుంది. సంపన్న ప్రపంచాన్ని మేధోపరంగా, భావోద్వేగపరంగా ప్రాతినిధ్యం వహించే అనేక మంది మూడవ ప్రపంచ మేధావులు వున్నారు. బుద్ధిజీవులు ఏ ప్రజల పట్ల ఆందోళన చెందుతున్నారనేదే వారి గుర్తింపుకు కొలబద్ద. నోమ్‌ఛామ్‌స్కీ అభినివేశం, అభిమానం అన్నీ ఆయన రచనల్లో ప్రతిబింబిస్తాయి. మానవహక్కుల ఉద్యమాల మీద ఆయన విస్తృతంగా రచనలు చేశారు. ఈ పాఠంలో మానవహక్కులలో అమెరికా పాత్ర, మూడవ ప్రపంచదేశాలలో మానవహక్కుల స్థితిగతులపై ఛామ్‌స్కీ భావాలను తెలుసుకోవచ్చు.

## 12.2 అమెరికన్ మార్కెట్ ప్రజాస్వామ్యం-మానవహక్కులు

నోమ్‌ఛామ్‌స్కీ మానవహక్కుల రాజకీయ అర్థశాస్త్రం పై రాసిన ఒక పుస్తకం చరిత్ర సృష్టించింది. ఈ పుస్తకం ప్రచురణ ఉదంతం అమెరికాలో మానవహక్కుల పరిస్థితికి దర్పణం పడుతుంది. ఈ పుస్తకం తొలిప్రచురణ కాంట్రాక్టును వార్నర్, మాడ్యులర్ పబ్లికేషన్స్ వారు అత్యుత్సాహంతో తీసుకున్నారు. తొలుత ఆసక్తి ప్రదర్శించిన ఈ కంపెనీ మాతృసంస్థ అధికారులు 1973లో పుస్తకంలోని 7వ పేజీలో వున్న ఒకవ్యాఖ్యను చదివి గాభరాపడిపోయారు. ఆ వ్యాఖ్య ఇది "అమెరికా నాయకత్వం తన ఆధిపత్య స్థానంలోనూ, విప్లవ ప్రతీఘాతక చర్యలలోనూ రెండవ ప్రపంచ యుద్ధానంతరం చెలరేగిన రక్తపాతాలకు ఏకైక ప్రేరకశక్తిగా, చోదకురాలిగా, నిర్వహణ శక్తిగా వుంది" ఈ వ్యాఖ్య అమెరికా దేశభక్తికి వ్యతిరేకంగా వుందని, ఇలాంటి అభిప్రాయాలు వెలుగు చూడకూడదని నిర్ణయించుకున్న ప్రచురణకర్తలు రచయితతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించాలని నిర్ణయించుకున్నారు. కానీ, అప్పటికే ఆ పుస్తకం 20,000 ప్రతులు అచ్చయ్యాయి. 'న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్' లో ఒక వ్యాపార ప్రకటన కూడా వచ్చింది. అయితే 'వార్నర్ పబ్లిషింగ్' వారు మాత్రం ఈ పుస్తకం పంపిణీకి అంగీకరించలేదు. ఈ పుస్తకంలోని అభిప్రాయాలను సమతుల్యం చేసే అభిప్రాయాలు గల మరో పుస్తకం వచ్చేంతవరకు ఈ పుస్తకం పంపిణీని నిలిపివేయాలని ప్రచురణసంస్థ నిర్ణయించింది. అయితే ఇదేదీ జరగకముందే ప్రచురణ సంస్థే మూతపడింది. ఏ ఒక్క వ్యాపార ప్రకటనకు నోచుకోని, అమ్మకం కానీ, సమీక్షకు నోచుకోని, అమెరికాలో ఏమాత్రం గుర్తింపు పొందని ఈ పుస్తకం అనేక యూరోపియన్ భాషల్లోకి అనువదితమయింది. ఫ్రాన్స్‌లో అయితే ఏకంగా మలిముద్రణకు కూడా నోచుకుంది. విషాదమేమంటే ఈ పుస్తకం సమీక్ష జరగకపోవడానికి ఈపుస్తకం వెలుగులోకి రాకుండా పోవడానికి అమెరికా ప్రభుత్వం విధించిన ఆంక్షలు కారణంకాకపోవడం. కేవలం 'మార్కెట్' ఈ పుస్తకం పై విధించిన 'సెన్సార్ షిప్' వల్ల ఛామ్‌స్కీ పుస్తకం అమెరికాలో వెలుగుచూడలేదు. ఈ ఉదంతం మానవహక్కుల పట్ల మార్కెట్ శక్తుల ప్రతికూలపాత్రను ఓ వేపు ఎండగడితే, మరో వేపు ఛామ్‌స్కీ లాంటి మేధావుల భావనలను ఎంత ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకొని వెల్లడించగలరో అర్థంచేస్తుంది.

## 12.3 పాశ్చాత్య ప్రజాస్వామ్యభావన

అమెరికాలోని వ్యవస్థీకృత సంస్థలు, మొత్తంగా అధికార దృక్పథం ప్రజాస్వామ్యం పేరుమీద యుద్ధాన్ని సమర్థించాయి. శాంతి ఉద్యమాలు పాశ్చాత్య సంపన్న వర్గాలను కలవరపరిచాయని ఛామ్‌స్కీ అంటారు. 1960లలో అమెరికా జనాభాలో ఎక్కువ శాతం రాజకీయచైతన్యం పొందడం పట్ల ఆ దేశ నాయకత్వం అనుసరించిన వైఖరి వారి ప్రజాస్వామ్య భావనలను బట్టబయలు చేస్తుంది. పారిశ్రామిక ప్రజాస్వామ్యదేశాల్లో, నైతిక ఉదారవాదులకు ప్రాతినిధ్యం వహించే ఒక త్రైపాక్షిక కమిషన్ 1975లో "ప్రజాస్వామ్య సంక్షోభం" పేరిట ఒక అధ్యయాన్ని ప్రకటించింది. విధాన నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఈ నివేదిక వెల్లడించింది. ప్రజల డిమాండ్లనే ఆటంకాలు లేకుండా సంపన్నవర్గాల ఆధిపత్యం కొనసాగాలంటే ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని అరికట్టాలని ఈ నివేదిక అభిప్రాయం. సంపన్నవర్గాల ఈ ప్రజాస్వామ్యభావనలు కొనసాగాలంటే ప్రజలలో యధాస్థితి వాదం, ఉపేక్షను పెంచిపోషించాల్సి వుంటుందని, పారిశ్రామిక ప్రజాస్వామ్యదేశాల్లో కూడా 'ప్రతినిధులే ప్రజాస్వామ్యం' అన్న దుస్థితికి ఇదే కారణమని ఛామ్‌స్కీ అంటారు. స్వేచ్ఛపట్ల అమెరికన్‌ల భావనలు ఏమైనా కానీ, దానికి ప్రజాస్వామ్యం, మానవహక్కుల పట్ల వున్న పై అభిప్రాయాలు పదాడంబరాలలోకూడి వాస్తవిక స్వేచ్ఛా విధానాలకు పూర్తిగా విరుద్ధమైనవి' ' అని ఛామ్‌స్కీ విమర్శించారు. అలాగే ఆర్థిక స్వాతంత్ర్యం అన్న విషయానికి అసలు అర్థం కేవలం అమెరికా వ్యాపారానికి, అమెరికా పెట్టుబడులకు, అమ్మకాలకు, లాభాలు తెచ్చుకోవడానికి వీలుకల్పించే ఆర్థిక స్వాతంత్ర్యం మాత్రమే, అంటే ఈ ఆర్థిక స్వాతంత్ర్యం కోసం, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఒక ప్రత్యేక తరహాలో స్థిరత్వం అమెరికా ప్రతిపాదిస్తున్నదని ఛామ్‌స్కీ అంటారు. ఇట్లాంటి పరిస్థితుల్లోనే తీవ్రమైన భావనలు, ప్రజాస్వామ్యక్రమం శ్రామిక సంఘాలు, పత్రికా స్వేచ్ఛ, స్వేచ్ఛాయుతమైన కార్మిక సంఘాలు తాముకోరుకుంటున్న ప్రాథమిక విలువలనే భగ్నం చేస్తున్నట్లుగా అమెరికా భావిస్తుంది. అందువల్ల పాశ్చాత్యదేశాల్లో కీలకమైన విలువగా గౌరవించే వ్యక్తి హక్కుల పట్ల గౌరవం కూడా, మూడవ ప్రపంచదేశాలకు వచ్చే సరికి అమలులో కనీస స్థానం కూడా పొందలేక పోతోందని

BRAOU

ఛామ్‌స్కీ వివరిస్తారు. మరో విధంగా, ఆర్థిక స్వేచ్ఛ పేరిట పెట్టుబడులకు అనువైన వాతావరణం, రాజకీయ స్థిరత్వం సాధన కోసం అణచివేత అవసరమని, దీనికి తగినట్టుగా అణచివేత పద్ధతులు చిత్రహింసలు, విచారణా పద్ధతులకు స్వయంగా నేర్పి, ప్రోత్సాహించి మూడవ ప్రపంచదేశాలలో చిత్రహింసలు విపరీతంగా పెరగడానికి అమెరికా దోహదపడ్డదని ఛామ్‌స్కీ అభిప్రాయం.

## 12.4 భీభత్స రూపాలు

"ప్రజాస్వామ్యరాజ్యాల్లో ప్రజానీకాన్ని భయభ్రాంతంచేసి, ప్రభావితం చేయడానికి ఉపయోగించే పద్ధతుల్లో కొన్ని భీభత్సం, ఉగ్రవాదాలను మించి వుంటాయి." అని ఛామ్‌స్కీ అభిప్రాయం. నిజానికి ఈ పదాలను కొందరు వ్యక్తులు, కొన్ని సమూహాల హింసకు మాత్రమే పరిమితంచేసి మాట్లాడతారు. అతే సమయములో దీన్ని మించి వుండే హింసను, పాలకవర్గాల విధ్వంసకర భీభత్సాన్ని మాత్రం వేరే కొలబద్దలో పరిగణిస్తారు. ఉగ్రవాదం గురించి మాట్లాడినప్పుడు న్యాయం, కార్యకారణ సంబంధాలు, బాధితుల సంఖ్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోరని ఛామ్‌స్కీ అంటారు. పాలకవర్గాల హింస ప్రభావం ఎంతటిదైనా, వాస్తవ పరిస్థితులు ఎట్లావున్నా ఆ హింసను మాత్రమే బాధ్యత వహించేదిగా, హింసను ప్రేరేపించేదిగా మాత్రం చెప్పరు. ఇదే విధంగా అమెరికా పురికొల్పి ప్రేరేపించిన సామాజిక వ్యవస్థల్లో అణచివేతను, దీర్ఘకాలంగా అమలవుతున్న హింసను పట్టించుకోరు. ఈ విషయంలో కొట్టొచ్చినట్టు కనబడే సత్యం మరొకటి వుంది. ఆయా సమూహాల తీవ్రవాదం కన్నా, పాలక వర్గాల భీభత్సంలో చనిపోయిన వారి సంఖ్య వేలల్లో ఎక్కువగా వుంటుంది. అయితే ఇదే సూక్తి అన్ని దేశాలకూ, అన్ని పరిస్థితులకూ వర్తించదు. అర్జెంటైనాలో హింసను భద్రతాదళాలు పోలీసుచర్యలకు పూనుకున్నప్పుడు జరిగిన హింసగా పేర్కొంటారు." కానీ అది క్యూబాలో, కంబోడియాల్లో అయితే మిత్రదేశాలు కాకుండా పోతే దాన్ని, ఉగ్రవాదంగా ముద్ర వేయవచ్చు, అంటే ఒక్కమాటలో చెప్పాలంటే హింసకు పాల్పడేవారిని ఏ పేరుతో పిలవడం అన్న సమస్య వచ్చేసరికి వారి వారి అధికార, అనధికార హోదాతో కాకుండా ఆయాదేశాల సమూహాల రాజకీయ అభిప్రాయాలతో ముడిపడి వుంటుంది. ఛామ్‌స్కీ నిర్వచనం ప్రకారం "ఉగ్రవాదానికి ఇచ్చే పరిమితార్థం అసలైన సమస్యల నుంచి ప్రజలను ప్రక్కదారి పట్టించేందుకు ఉపయోపడే వెలుగురేఖలా ఉపయోగపడుతుంది. అదే సమయంలో రాజ్యహింసకు కావలసిన గొప్పస్వేచ్ఛను కూడా ఇది కల్పిస్తుంది"

కడచిన 25 సంవత్సరాల్లో జరిగిన హింసకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలిస్తే అనధికార హింసకన్నా పాలకవర్గాల హింసా, హత్యాకాండలు ఎక్కువని తేలింది. భీభత్సం సృష్టించే, పెంచిపోషించే పనిని తైనాతీలయిన పాశ్చాత్యదేశాలకు చేరింది. అమెరికా ఇందుకు మార్గదర్శిగా మారింది. ఛామ్‌స్కీ ప్రకారం 'రెండవ ప్రపంచయుద్ధం సమయంలో పాతవలసవాదం కుప్పకూలింది. ఫలితంగా ఉద్భవించిన జాతీయ తీవ్రవాద శక్తులు సాంప్రదాయ పాశ్చాత్య వ్యాపారానికి బెడదగా మారారు. ఈ బెడదను నివారించడానికే అమెరికా మూడవ ప్రపంచదేశాల సంపన్న వర్గాలతో, సైనిక శక్తులలో మిలాఖతు అయింది. ఫలితంగానే అమెరికా మార్గదర్శకత్వంలో కొత్త రాడికల్ శక్తులను, మార్పును నిరోధించడానికి పెద్దఎత్తున హింసాకాండ జరిగింది. రాజ్యాలూ, వాటి సంస్థలూ జరిపిన ఈ హింసాకాండను 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' పూర్తిగా నమోదు చేసింది. 70వ దశకంలో లాటిన్ అమెరికా చిత్రహింసల కొలిమిగా, ప్రయోగశాలగా మారింది. ఫలితంగా వేలాది, వందలాది మంది విద్యావేత్తలు, జర్నలిస్టులు, శాస్త్రవేత్తలు, ఇతర వృత్తి నిపుణులు, ఉదారవాదులు, రాడికల్స్ ఇతర అన్ని సాఘికవర్గాలు లాటిన్ అమెరికా విడిచి ప్రవాసం వెళ్ళారు. ఫలితంగా అమెరికా వలసలకు పుట్టినిల్లయింది" అని ఛామ్‌స్కీ అంటారు. ఒక లాటిన్ అమెరికన్ జర్నలిస్టు అన్నట్టు "ఇది మేధోవిధ్వంసకాండ, సంస్కృతిపై మారణకాండ" అని ఛామ్‌స్కీ అన్నారు. సాధారణ ప్రజానీకం ఆకాంక్షలను ప్రతిబింబించే మేధావులను నిర్మూలించడం ద్వారా సామాజిక విమర్శకు ఏ మాత్రం తావులేకుండా చేయడమే దీని ప్రధానోద్దేశ్యం. ఇదేకాకుండా ఇదే వ్యూహానికి మరో కోణంలో " పాలకవర్గాలకు ఎలాంటి వ్యతిరేకత రాకుండానే ఇంతటి చిత్రహింసలు, రాజకీయ హత్యలను ప్రోత్సహించి అమలు పరిచారు అని ఛామ్‌స్కీ భావన.

B R A O U

## 12.5 చర్చి - పరిపూర్ణ స్వేచ్ఛాయుత వాణిజ్యాభివృద్ధి నమూనాల మధ్య పోటీ

అమెరికా ప్రభావిత ఫాసిస్టు దేశాలు ఆయా దేశాల మెజారిటీ ప్రజల పట్ల ఎంత క్రూరంగా ప్రవర్తించాయంటే, ఫాసిస్టు యూరప్ దేశాల్లో ఒకప్పుడు జరిగినట్టుగా ఈ దేశాల్లో కూడా అమెరికా అంతటా, ఆయాదేశాల్లో ఫాసిస్టు పద్ధతులకు వ్యతిరేకంగా సాంప్రదాయ చర్చిలు పలుకుబడి సంపాదించుకోగలిగినాయి. అమెరికా కొత్త నియంతలు, సైనిక ప్రభువులు, స్థానిక సంపన్నులతో, విదేశీ వ్యాపారంతో కుమ్మక్కై స్థానిక వనరులను దోపిడీ చేశారు. ఆయా దేశాల్లో 80 శాతం మంది ప్రజానీకం సంక్షేమాన్ని, బాగోగులను ఈ కూటమి ఏ మాత్రం పట్టించుకోలేదు. సైనిక ప్రభువులు ప్రజలకు సంబంధించిన అన్ని రక్షిత వ్యవస్థలనూ ధ్వంసంచేయడమే పనిగా పెట్టుకున్నారు. అంటే ప్రజల సంఘాలు, రైతు సంఘాలు, సహకార, రాజకీయ సమూహాలను నాశనం చేసి తద్వారా అశేష జనసమూహాలు రాజ్యానికి వ్యతిరేకంగా సమీకరించకుండా అడ్డుపడ్డారు. ఈ సమయాల్లో 1930లో యూరప్‌లో చర్చిలలాగే ఇక్కడకూడా చర్చి ఒక్కటే ప్రజల పరిరక్షకుడిగా నిలవగలిగింది.

ఈ రకమైన స్వేచ్ఛాయుత వాణిజ్య అభివృద్ధి నమూనాలు బీభత్సం సృష్టించడం ద్వారా ప్రజలను భయభ్రాంతులను చేయడం ద్వారా ప్రజల్లో వ్యతిరేకత తలెత్తకుండా అణచి వేసిందని ఛామ్‌స్కీ అభిప్రాయం. వాళ్ళు ఎన్నుకున్న అభివృద్ధి నమూనాలు, ఇంకా రూపుదిద్దుకోని విప్లవాల పట్ల ప్రజలపట్ల క్రౌర్యంగా వ్యవహరించి, జాతీయభద్రతా రాజ్యాన్ని దాని అత్యాచారాలను ప్రతిఘటన నుంచి రక్షించుకోవడానికి శ్మశాననిశ్శబ్దం తప్ప మరేమీ లేకుండా వ్యవహరిస్తారని చర్చి పత్రాలు చాలా తీవ్రపదాలతో వెల్లడించాయి. అమెరికాలో ఎన్నో నిరసనలు, వ్యతిరేకతలు ఊసులోకి లేకుండా పోయాయి. ఛామ్‌స్కీ ప్రకారం, ఈ కొత్త అభివృద్ధి నమూనాలు అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు ఉమ్మడి భాగస్వామ్య వ్యవస్థల ప్రయోజనాలను కాపాడడానికి మాత్రమే ఉద్దేశించింది. ఫలితంగా బీభత్సాన్ని, భయోత్పాతాన్ని సృష్టించిన క్రౌర్యానికి, హింసకు ఆయాదేశాల్లో నెలకొన్న శ్మశానశాంతికి గొప్ప గౌరవం ఏర్పడింది. స్వేచ్ఛా భూమిగా చెప్పుకునే అమెరికా నిశ్శబ్ద భూమిగా తయారయింది. అమెరికా తైనాతీ దేశాలైన లాటిన్ అమెరికా దేశాల్లో చర్చిలు, ప్రజలు ఒకటిగా, ఆయాదేశాల ప్రభుత్వాలు ఒకటిగా నిలబడ్డాయి.

## 12.6 ప్రసారసాధనాలు-ఫాసిస్టు బీభత్సం

మానవహక్కుల అమలులో ప్రసారసాధనాల పాత్రను ఛామ్‌స్కీ సవివరంగా చర్చించారు. "సైనిక ముఠాలు ఆయా దేశాల్లో మానవహక్కులకు పాశ్చాత్య విలువలకు, ప్రజాస్వామ్యానికి విఘాతం కల్పిస్తూ రక్తపాతాలు క్రూరమైన చిత్రహింసలకు పాల్పడినప్పుడు వారిని సమర్థించడానికి అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల ప్రసారసాధనాలు చాలా తంటాలు పడ్డాయి. ఇందుకు ప్రసారసాధనాలు, మేధావులు అనుసరించిన పద్ధతి ఏమిటంటే, వాస్తవాలను దాచిపెట్టడం, హత్యలు, హింసాకాండలు వంటి ఇబ్బంది కలిగించే వాస్తవాలనుంచి దృష్టి మళ్ళించడంలాంటి పద్ధతులు పాటించారు. ఇందుకు బదులుగా ఇక్కడి ప్రసారసాధనాలు ఈ కొత్త ఫాసిస్టురాజ్యాలలో సాధికారక ప్రభుత్వాలు, వాటి క్రమబద్ధవ్యవస్థలు వీటిని రక్షించడంలో అమెరికా పాత్రల గురించి మాట్లాడడం ప్రారంభించాయి. ఎప్పుడైనా లాటిన్ అమెరికా చిత్రహింసలగురించి, వలసల గురించి, బహిష్కారాల గురించి ప్రస్తావించవలసివచ్చినప్పుడు క్లుప్తంగా, ముక్తసరిగా ప్రస్తావించేవారు. ఈ విధానానికి రెండు కోణాలున్నాయి అని ఛామ్‌స్కీ అంటారు. అవి ఒకటి, వామపక్ష గెరిల్లాల హింసవల్లే రాజ్యహింస జరుగుతుందనడం రెండువేపులా హత్యలు సమానమేనని, రాజ్యహింస తీవ్రతకు వెనకేసుకురావడం. అధికార హింస వివరణలకు వారి సమర్థనలకు, అనివార్య సంస్కరణల పేరిట హేతుబద్ధత కల్పించడం లాంటి ప్రయోజనాలు ఈ విధానాల్లో వున్నాయని ఛామ్‌స్కీ అభిప్రాయం. సోవియట్ యూనియన్‌లో మేధావుల హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ప్రసారసాధనాలు అవలంబించే నాటకీయత లాటిన్ అమెరికా దేశాల్లో జరిగినప్పుడు మచ్చుకు కనిపించదు.

BRAOU

సైనిక ముఠాలను సమర్థించడానికి అమెరికా ప్రసార సాధనాలు వారికి అనుకూలంగా రాయడం చాలా ఎక్కువ చేశాయి. జరుగుతున్నట్టు చెప్పే అభివృద్ధి రాజకీయ ఖైదీల విడుదల? జి.ఎన్.పి పెరుగుదల, ఎన్నికలు ప్రకటించడం, ద్రవ్యోల్బణం తరుగుదల లాంటి వాటిని అనుకూలాంశాల పేరిట విపరీతంగా ప్రచారం కల్పించడం ఇందులో భాగమే. సైనిక ప్రభుత్వం చెడ్డదైనా ఏర్పడాల్సిన అనివార్యతను కూడా 'మీడియా' పదేపదే ప్రచారం చెయ్యడం, దీని మాటున అంతర్జాతీయ పెట్టుబడులు, అవసరాలు, ప్రయోజనాల గురించిన చర్చ మరుగున పడేది" అని ఛామ్‌స్కీ అభిప్రాయం. అమెరికా అధికారగణాలు సందర్శించినప్పుడో బడ్జెట్ ఆమోదించడానికి కాంగ్రెస్ సమావేశమైనప్పుడో ఈ సైనికముఠాలు, అమెరికా అనుకూల తొత్తు నియంత ప్రభుత్వాలు సరిగ్గా అప్పటికి తగినట్టుగా ఎత్తులు వేయడం నేర్చుకున్నారు. ప్రచారం కోసం చేసే ఇలాంటి కొన్ని 'మచ్చుకు' చేసే పనులతో నియంతకేమో పరిస్థితి మెరుగుపడిందని బాకా ఊదుకోవడానికి, అమెరికాకేమో స్వేచ్ఛా పిపాసులమని చెప్పుకోవడానికి వీలుకలుగుతుంది. ఇందువల్ల పరిమితంగానైనా కొద్ది సంఖ్యలో ఖైదీల విడుదల జరుగుతుంది. కానీ అది ఉన్న పూర్వస్థితిని ఏమాత్రం మార్చలేదు" అని ఛామ్‌స్కీ అంటారు. ఈ రకమైన ప్రచార ఎత్తుగడలు తరచుగా జరుగుతాయి. నియంతలు, అమెరికన్ యాజమాన్యాలు కలసి మౌలికంగా ఏమార్పులు జరగకుండానే మసిపూసి మారేడుకాయ చేసి పరిస్థితులు మెరుగుపడినట్టు చూపించడానికి కలిసికట్టుగా చేసే ప్రయత్నం. అమెరికా ప్రసారసాధనాల స్వేచ్ఛ ఈ పద్ధతులకు కించిత్ విమర్శలేకుండా, విశ్లేషణ లేకుండా, నిరసన లేకుండా ఆమోదించింది అని ఛామ్‌స్కీ అభిప్రాయం.

అమెరికా విదేశాంగశాఖ ప్రతిసారీ విడుదలచేసే మానవహక్కుల నివేదికలు ఇదే ధోరణిలో వుంటాయి. ఏరకమైన మేధోపరమైన సందేహాలకు సందివ్వకుండా అమెరికా విదేశాంగశాఖ తొత్తు ప్రభుత్వాలకు నిరంకుశరాజ్యాలను మంచి ప్రభుత్వాలుగా చూపేందుకు ప్రయత్నిస్తుంది. సైనిక ముఠాలు చేసే వాగ్దానాలను, హామీలను ప్రకటలను ఏ సందేహం లేకుండా నమ్మడానికి వీలైన ప్రయత్నాలన్నీ చేస్తుంది. అదే సమయంలో రాజ్యహింస, బీభత్సాల కారణంగా బాధితులకు కాదని ఈ నివేదికలే నిలువెత్తు సాక్ష్యాలు. అమెరికా ఆధ్వర్యంలో ఇవి ఈ నివేదికలు ఫాసిజానికి రక్షణ కవచాలే కాని మానవహక్కుల పరిరక్షణకు కాదు. అమెరికా మానవహక్కుల కార్యక్రమాన్ని ఈ నేపథ్యం నుంచే అర్థం చేసుకోవాలని ఛామ్‌స్కీ అభిప్రాయం.

లాటిన్ అమెరికా, ఆసియా దేశాల్లోని సైనిక ప్రభుత్వాలు వాస్తవానికి అమెరికా ముఠాలే. వాటిలో చాలావరకు అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దింపినవారు. లేదా అమెరికా ప్రత్యక్షజోక్యం వల్ల లబ్ధి పొందినవారు. తక్కినవారు అమెరికా సైనికశిక్షణతో స్పష్టమైన మద్దతుతో, ప్రత్యక్షంగా సైన్యసహాయాన్ని కూడా తీసుకుని ఉనికిలోకి వచ్చినవారే. లాటిన్ అమెరికా, ఆసియాదేశాల్లో అమెరికా ప్రత్యక్ష, పరోక్ష జోక్యాన్ని, అమెరికా ప్రేరిత తిరుగుబాట్లను ఛామ్‌స్కీ తీవ్రంగా విమర్శించారు. చాలా సందర్భాల్లో అమెరికా ప్రేరిత సైనిక తిరుగుబాట్లు, అమెరికా జోక్యం సంస్కరణవాదులను, ప్రజాస్వామ్యవాదులను, తీవ్రవాదులనూ అధికారం నుంచి తోసివేయడానికి మాత్రమే పరిమితమయ్యాయి. మితవాద సైనిక రాజ్యాలున్న చోట, అవి ఎంత అవినీతికరమైన, బీభత్స రాజ్యాలని రుజువయినప్పటికీ వాటి విషయంలో అమెరికా జోక్యం ఎన్నడూ లేదని ఛామ్‌స్కీ అంటారు.

## 12.7 ప్రసారసాధనాలు, అత్యాచారాల సమర్థనా నిర్వహణ

సామాజిక, రాజకీయ వాతావరణం క్షీణించడం, రక్తపాతాలు నిరంతరం కొనసాగే హింసలనుంచి దృష్టిని మళ్ళించడానికి, కమ్యూనిస్టుల మానవహక్కుల ఉల్లంఘనలకు కొన్ని నిజమైనవి, కొన్ని కల్పనలను విపరీతంగా ప్రచారం చెయ్యడం. 'వియత్నాంలో అమెరికన్లు, సైగాన్ ప్రభుత్వ అతిక్రమణలతో పోల్చుకుంటే కమ్యూనిస్టుల బీభత్సం కొంత నయమే అయినప్పటికీ, అమెరికా ప్రభుత్వం, ప్రసార సాధనాలు అందుకు వ్యతిరేకమయిన అభిప్రాయాన్ని కలిగిస్తాయి. దీన్నే 'దౌర్జన్యాల సమర్థనా నిర్వహణ'గా చెప్పవచ్చునని ఛామ్‌స్కీ అంటారు.

అమెరికా ప్రచారంలో మూడు అంశాలను ఛామ్‌స్కీ పేర్కొన్నారు. ఒకటి అమెరికా ప్రచారానికి వున్న తిరుగులేని విస్తృతి. కాంబోడియాలాంటి దేశాల్లో ఈ విస్తృతిని గుర్తించవచ్చు. రెండవ అంశం ఆయాదేశాల్లో అత్యంత ప్రాధాన్యత

BRAOU

కలిగిన చారిత్రక నేపథ్యాన్ని, దృష్టిని ఒక పద్ధతి ప్రకారం తెరమరుగు చేయడం. నాశనం చేయడం ప్రతిగా అభూతకల్పనలను ప్రచారం చెయ్యడం. కాంబోడియాలో జరిగిన భీభత్సం గురించి పూర్తిగా పట్టించుకోకుండానే అసలు దౌర్జన్యాలు, హింస జరిగిందా? అని సందేహించే స్థాయిలో గందరగోళం సృష్టించి, ఏవో కొన్ని నిరసన గొంతులున్నా వాటిని నొక్కడం అనే మూడవ అంశం అమెరికా ప్రసార సాధనాల విధానమని ఛామ్‌స్కీ అభిప్రాయపడతారు.

ప్రసారసాధనాలు సాధారణంగా ఎక్కడైనా సరే! రాజ్యానికి సంబంధించిన అతిముఖ్యమైన ప్రయోజనాలను కాపాడడానికి వాస్తవాలను అణచివేస్తుందని, తద్వారా జాతీయవిధానం సదుద్దేశంతో కూడినదని, న్యాయబద్ధమైందన్న అభిప్రాయాన్ని కలిగించడానికి కృషిచేస్తుందని ఛామ్‌స్కీ అంటారు. సామాజిక సమస్యలు, సమకాలీన పరిస్థితులపై సాగే విద్యాపరిశోధనలు కూడా ఇదే తరహాలో వుంటాయనిఆయన చెబుతారు. అధికారిక నిషేధం వున్న సమాజానికి (ఉదా. సోవియెట్ యూనియన్), నిషేధంలేని (అమెరికా) సమాజానికీ మధ్య స్పష్టమైన తేడావున్న మాటనిజమే అయినప్పటికీ సాధారణంగా ప్రత్యేకంగా ముందరి విధానాల పరిణామాలను, ప్రభావాలను హెచ్చవేసి చెబుతారు. స్వీయనియంత్రణ ప్రాధాన్యాతను తగ్గించ చూపే ధోరణి కూడా వుంది. అలాగే అనుసరించే విదేశాంగ విధానానికి ప్రచారసాధనాలు ఒక్కటిగా మద్దతివ్వడానికి వెనకవున్న జాతీయవాదం బలం, ప్రభుత్వ ఒత్తిడి, వనరులు, ప్రభుత్వం ప్రచారసాధనాల, వ్యాపారవర్గాల ప్రయోజనాల ఏకత్వం మొదలైన వాటిని తక్కువచేసి చూపడం కూడా వుంది. స్వేచ్ఛాసమాజ పాలకవర్గ ప్రయోజనాలు విదేశీదురాక్రమణను పురికొల్పితే ప్రచారసాధనాలన్నీ అందుకు ప్రజలను మానసికంగా సంసిద్ధం చేస్తాయి. అందుకు పూర్తి అదుపులో వున్న తరహాలో పూర్తి శక్తివంతంగా, స్వచ్ఛందంగా పని చేస్తాయి. ఇందుకైనవ్యయం, సరిగ్గా ఉపయోగపడుతున్నదా! అన్న చిన్నచిన్న సందేహాలు, ప్రశ్నలు పాలకవర్గాల అసలు విధానాన్ని ఇసుమంత మార్చలేవు. బదులుగా దురాక్రమణ ప్రజాస్వామిక చర్చతోనే జరిగిందని ఆమోదింప జేసేటప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తాయి. ప్రచారవ్యవస్థ మౌలికతను ఛిద్రంగంగా నిరాకరించే ప్రాథమిక విమర్శగానీ ఏవిదేశీయత్నాల చట్టబద్ధతనూ. మర్యాదనూ గౌరవించాలనే వాదన ప్రసారసాధనాలలో ఒక మినహాయింపు మాత్రమే. ఇలాంటి ప్రత్యామ్నాయ దృక్పథం కేవలం పరిమిత జనాభాకు మాత్రమే అందే పత్రికలలో, బులెటిన్‌లలో మాత్రమే కనబడుతుందని ఛామ్‌స్కీ అభిప్రాయం.

## 12.8 అమెరికా ప్రభావిత రాజ్యాల ప్రాథమిక లక్షణంగా అవినీతి

అమెరికా మద్దతుతో పెంచి పోషించిన వియత్నాం లాంటి దేశాలు అవినీతి కూపాలకు సజీవ సాక్ష్యాలయ్యాయి. ఇలా తయారు కావడానికి ఛామ్‌స్కీ వివరణిది. అమెరికాకు సేవలు చేసే సంపన్నవర్గాలు తమ స్వంతసంస్కృతితో పూర్తి సంబంబధం కోల్పోయి యంత్రికమైన కిరాయి తైనాతీలుగా మారి విజాతీయులవుతారు. వీరికి సహజంగానే తమ స్వంత జనాలమీదే తీవ్రవ్యతిరేకత వుంటుంది. తమ సమాజాన్ని నాశనం చేసే ఉన్నత సంస్కృతికి ఈ సంపన్నులు నిర్లక్షంగా మద్దతు ఇస్తారు. వీరి ప్రాపంచిక దృక్పథం తమ స్వంత సంస్థాగత ప్రయోజనాలనుంచి ఏర్పడుతుంది. అది విదేశీ అధికారానికి కట్టుబడే లలూచీతో కూడిన, కమ్యూనిస్టు వ్యతిరేక విప్లవ ప్రతీఘాతక భావజాలంపూనాదిగా వుంటుందని ఛామ్‌స్కీ వివరంగా చెబుతారు.

అమెరికా ప్రభావిత దేశాల్లోని జాతీయత కోల్పోయిన "విజాతీయసంపన్నవర్గాలు సంఖ్యలో స్వల్పంగా వుండే దళారీలు. వీరివి మితవాద వ్యాపార ప్రయోజనాలు. విదేశీ ఆర్థిక సైనిక వ్యవస్థల నుంచి ఈ దళారీలకు అండ మద్ధతు వుంటుంది" అని ఛామ్‌స్కీ ఈ సంపన్నవర్గాలను అభివర్ణించారు. స్వంతంగా ఎలాంటి స్వతంత్ర ఆర్థిక భావాలు లేని ఈ సంపన్నవర్గం విదేశీపెట్టుబడులు, స్వేచ్ఛా వాణిజ్యం అభివృద్ధికి ఏకైక మార్గం అనే పిడివాదానికి నిబద్ధులై వుంటారు. అవినీతిని నిష్పక్షపాతంగా తుడిచేస్తామనే ఈ ఆర్థిక భావదారిద్ర్యం కలిగిన సంపన్న వర్గాలే అవినీతికి అసలు వాహికలుగా పని చేస్తారు. అర్జెంటైనా నుంచి జైరేదాకా అమెరికా ప్రభావిత దేశాల్లో సైనిక ప్రభుత్వాల స్థాపన విదేశీ వ్యాపారాల పాత్రను, నూతన అధికారాన్ని, అవినీతిని ఒక వ్యవస్థగా ముందుకు తెచ్చాయి. ఈ అవినీతిని సమర్థించుకోవడానికి అమెరికా వ్యాపారులు, వారి ప్రతినిధులు మాత్రం లంచాలివ్వడం తమపద్ధతి కాదని, వ్యాపార

BRAOU

పోటీవల్ల కొన్ని సందర్భాల్లో బలవంతంగా ఇలాంటివి రుద్దుతున్నారని వాపోతారు. ఈ సమర్థనతో మరుగునపడే అంశం ఒకటి అమెరికా ప్రభావిత రాజ్యాల్లోనే, పాలనల్లోనే అవినీతి విపరీతంగా పెరిగిపోయిందన్నది సత్యం. ఈ ధోరణులన్నింటిలోనూ విజాతీయ అల్పసంఖ్యాకుల పాలన, మెజారిటీ ప్రజలపై అణచివేత బయటి మద్దతులో పాలించే పాలకుల్లో పెచ్చు పెరిగిన అవినీతి, బయటి మద్దతుదారుల ప్రయోగాలు ఇవన్నీ దీనిలో భాగమే అని ఛామ్‌స్కీ అంటారు.

## 12.9 నూతన మానవహక్కుల ఉద్యమం

'అమెరికాతో సంబంధం' వల్ల భీభత్సం, అణచివేత పాటించే దేశాలు పెరిగిపోయాయని ఛామ్‌స్కీ అభిప్రాయము. అమెరికాతో సంబంధం మానవహక్కుల పరిరక్షణ కోసం కాకుండా ఆయా దేశాల్లోని సెమీఫాసిస్టురాజ్యాలతో చెలిమి, అనుకూలమైన పెట్టుబడుల వాతావరణానికి స్థానిక నేతల హామీలనుంచే ఏర్పడుతుంది. ఆయాదేశాల్లోని ఫాసిస్టు పోకడలనె అమెరికా మితవాద ప్రభుత్వం మానవహక్కుల రక్షణ వంటి అంశాలను ప్రక్కనపెట్టి బహిరంగంగా సమర్థిస్తుంది. అదే ఉదారవాద ప్రభుత్వం అయితే అంతకన్నా ఎక్కువ కూడా సమర్థిస్తుంది. కాకపోతే అప్పుడప్పుడు ఆయాదేశాలు మరింత దయగలమొఖాలు తగిలించుకోవాలని సలహాఇస్తుంది. ఎవరైనే చిత్రహింసల కొలుములను, పులిబోనులను, బంబుదాడులను, హంతక దళాలను, సైనిక ముఠాలను సృష్టించారో, వారే మానవహక్కుల గురించి, ప్రత్యేకంగా కమూనిస్టు రాజ్యాల్లో మానవహక్కులస్థితిగతుల గురించి మాట్లాడడం విచారకరం అని ఛామ్‌స్కీ ఈ పరిస్థితిని చెబుతారు. అయితే, కమ్యూనిస్టు దేశాల్లోకూడా క్రూరత్వం, సోల్జెనిత్సిన్, సఖరోవ్‌లాంటి మేధావుల వేధింపు వున్నాయని అంగీకరిస్తూనే అమెరికా కనుసన్నల్లో వున్న ఉరుగ్వే, ,చిలీ, అర్జెంటైనాలలో మేధావుల హత్యలు, హింసలు కూడా అంతే క్రూరంగా వున్నాయని ఛామ్‌స్కీ అంటారు. అయితే అమెరికా తొత్తుదేశాలయిన ఈ దేశాల్లో జరిగే చిత్రహింసలు, ఇతర ప్రపంచంలో జరిగిన చిత్రహింసల స్థాయిలో బయటకురాలేదు. ఇది మానవహక్కుల కోసం ఉద్యమించే నూతన నాయకత్వం చిత్తశుద్ధి లోపానికి కొండగుర్తుగా ఛామ్‌స్కీ అభివర్ణించారు.

"ఒకవైపు అమెరికా ప్రయోజనాలు, అధికారంలో గల సంబంధం, మరోవైపు మానవహక్కుల ఉల్లంఘన అనేది ఒకేదశలో వుండడం క్రమపద్ధతిలో జరిగినవే కానీ, కాకతాళీయం కావని" ఛామ్‌స్కీ అంటారు. వ్యాపార ప్రయోజనాలు, ఆర్థిక ప్రయోజనాలు, సైనిక, ఇంటిలిజెన్స్, విదేశీ వ్యవహారాలశాఖ, అధికారులు, రాజకీయవేత్తలు అందరూ పెట్టుబడులకు అనువైన వాతావరణం గురించి ఆందోళన చెందుతున్నప్పుడు, సైనిక తొత్తులైన ఆధారితవర్గం మరోవైపు వున్నప్పుడు, ఉదారవాద, మానవీయ నాయకత్వాన్ని ఒక మూటకు నెట్టివేస్తారని, ప్రతికూలశక్తులకు, వీరికి వ్యతిరేకంగా మోహరిస్తారని ఛామ్‌స్కీ అంటారు. అందువల్ల అమెరికా విదేశాంగ విధానంలో హఠాత్తుగా మానవహక్కుల పట్ల ఆందోళన కలిగించే పరిస్తితులను ఆశించడం కాల్పనిక ఊహమాత్రమే అవుతుందని ఛామ్‌స్కీ అంటారు.

అయినప్పటికీ, ఈ మౌలికమైన అంశాలను పరిగణంలోకి తీసుకుని కూడా మనవ హక్కుల ఉద్యమానికి, కొత్త ప్రచార ఊపువల్ల చెప్పుకోదగ్గ లాభాలు చేకూరాయని ఛామ్‌స్కీ అన్నారు. మానవహక్కుల పట్ల నిజమైన ఆందోళన వున్నవారికి ప్రకటిత ఆందోళనలు అవకాశాలు కల్పిస్తాయి. హింసారాజ్యాల బాధితులపై అణచివేతను తగ్గించడానికి, బాధలను,పీడాను తగ్గించడానికి వాళ్ళు ఈ కొత్త పదాలను వాడుకోవచ్చు. అంతేగాక అమెరికా రాజకీయవేత్తల మద్దతును కూడగట్టవచ్చు. అయితే ఈ మాత్రం చైతన్యంతో ఆయాదేశాలలలో ఫాసిజాన్ని రుద్ది, మద్దతిచ్చే అమెరికా విధానాల క్రమబద్ధతకుగల కార్యాకారకాలను పూర్తిగా నిర్మూలించగలమని అనుకోలేం. ఎందుకంటే అన్నింటిని మించి ఆర్థిక ప్రయెజనాలు శక్తివంతమైనవి. అనివార్యమైనవి. అంతర్జాతీయంగా అమెరికాలో ఇటీవలి పరిణామాలేవీ ఈ ఆర్థిక ప్రయోజనాల ప్రభావాన్ని తగ్గించలేక పోయాయి" అని ఛామ్‌స్కీ హెచ్చరిస్తాడు.

మానవ హక్కుల ఉద్యమం నిర్మించడంలో బుద్ధిజీవులకు ఛామ్‌స్కీ ఈ సూచనలు చేస్తాడు. నిజాయితీ కలిగిన వ్యక్తిఎవరైనా అణచివేత బాధితుల పరిస్తితులు మెరుగుపడగలిగిన చోటనే నిరసన ప్రయత్నాలు చేస్తాడు. ఈ ప్రయత్నం సాధారణంగా వుండాలని, దేశానికి సంబంధించిందై వుండాలని, లేదా ఆయాదేశాల లేదా ప్రభావిత పాలనల విధానాల్లోనే

BRAOU

అణచివేత, మానవహక్కుల ఉల్లంఘన మూలాలున్నాయని అతను భావిస్తాడు. దీనితోపాటు ఆర్థిక, స్వదేశీ సంస్థలు అనుసరించే విధానాలపై ఆధారపడే ఈ నిరసనల ప్రభావం వుంటుంది అని ఛామ్స్కీ భావన. మానవహక్కుల ఉద్యమాలతో ప్రభావితమైన పాశ్చాత్య మేధావులు తమ దృష్టిని, నిరసనను తమతమ దేశాల్లో కొనసాగించడం పైననే దృష్టి కేంద్రీకరించాలని, మానవహక్కుల పట్ల ఆసక్తి, శ్రద్ధవున్న అమెరికన్ పౌరుల ప్రాధమిక బాధ్యత అమెరికా కొనసాగిస్తున్న నేరాలను ఎదుర్కోవడం అని ఛామ్స్కీ సలహా ఇస్తారు.

## 12.10 ముగింపు

సమకాలీన సమాజంలో సాహసికుడైన తాత్వికుడిగా నోమ్‌ఛామ్స్కీ మానవహక్కుల పరిధిలో అమెరికా ప్రతికూలపాత్రను బట్టబయలు చేశారు. ప్రజాస్వామ్యంపట్ల, స్వేచ్ఛ పట్ల మానవహక్కుల పట్ల అమెరికా నిబద్ధత దాని ఆర్థిక ప్రయోజనాలపై ఆధారపడి వుందని ఛామ్స్కీ అభిప్రాయం. అమెరికా ప్రసారసాధనాలు దీనికి అనుగుణంగా మలుచుకొని, ఈ క్రమానికి తోడ్పడుతుందని అన్నారు. అమెరికా స్వార్థప్రయోజనాలుగల శక్తులు, స్థానిక స్వార్థప్రయోజనాలు కలగలసి ఫాసిజాన్ని ఆదరించి, సమర్థించి, ప్రోత్సహిస్తాయని, కొనసాగిస్తాయని ఛామ్స్కీ అంటారు. మూడవప్రపంచదేశాల్లో ఫాసిజం, ఈ సామ్రాజ్యవాద స్వభానికి ఒక వ్యక్తీకరణ. మూడవ ప్రపంచదేశాల్లోని సంపన్నవర్గాలలోని స్వార్థపూరిత శక్తులు ఏ జీవన రంగంలోనైనా ఈ క్రమాన్ని మాత్రమే సమర్థించి తమ స్వదేశ ప్రయోజనాలను తెగనమ్ముతావని, విస్తృతంగా అవినీతికి పాల్పడుతాయని ఛామ్స్కీ అంటారు. ఈ మొత్తం పరిణామ క్రమం మానవహక్కుల ఉల్లంఘనకు దారితీస్తుందని అందువల్ల నిజమైన నూతన మానవహక్కుల ఉద్యమం ఆవశ్యకత ఏర్పడుతోందని ఛామ్స్కీ అంటారు.

## 12.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి :**

1. ప్రజాస్వామ్యం పట్ల అమెరికా దృక్పథం, వాగ్దానానికీ, పనితీరుకు మధ్య గండిని వివరించండి?

2. మానవహక్కులకు సంబంధించి అమెరికా ప్రసారసాధనాల పాత్రను పరీక్షించండి?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి :**

1. మూడవ ప్రపంచదేశాల్లో ఫాసిజం అభివృద్ధికి దోహదం చేసిన కారణాలేవి?

2. మానవ హక్కుల భావన, ఆచరణలకు సంబంధించి నోమ్‌ఛామ్స్కీ సైద్ధాంతిక కృషిని వివరించండి?

BRAOU

# భాగం - 13: స్త్రీవాద దృక్పథం

**విషయక్రమం**


13.0 ఉద్దేశం

13.1 పరిచయం

13.2 మానవహక్కుల వివరణ

13.2.1 నిర్వచనంలో పాక్షికదృష్టి

13.2.2 విధానాల్లో పాక్షికదృష్టి

13.2.3 విధానాల్లో వివక్ష

13.3 మానవహక్కులపై స్త్రీవాదం తొలిదృక్పథం

13.3.1 ఆంగ్లేయ ఉదార స్త్రీవాదులు

13.3.2 అమెరికన్ స్త్రీవాదులు

13.3.3 ఉదారవాదంలో చట్ట పరమైన సమానత్వంలో పరిమితులు

13.4 సామాజిక, వైయక్తిక ద్వైదీభావ ఉదారవాదంపై విమర్శ

13.4.1 కుటుంబానికి ఉదారసూత్రాలను ఆపాదించేందుకు నిరాకరణ

13.4.2 చట్టాల్లో సమానత్వానికి ప్రాధాన్యత

13.4.3 కుటుంబం - సామాజిక జీవనం

13.5 స్త్రీలు - సమానహక్కుల నిర్వచనం.

13.6 మానవహక్కులపై అర్థవంతమైన విమర్శ

13.6.1 వ్యక్తి, సమాజంపై హక్కుల అవాంఛనీయ చిత్రీకరణ

13.6.2 స్త్రీ జీవిత అనుభవాలకు హక్కుల ప్రమాణాలు దూరం

13.7 ముగింపు

13.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 11.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- మానవ హక్కులపై స్త్రీవాద తొలిదృక్పథాలు తెలుసుకుంటారు.
- మానవ హక్కుల నిర్వచనాల్లో వున్న పాక్షిక దృష్టి అర్థం చేసుకుంటారు.
- మానవ హక్కులపై అర్థవంతమైన విమర్శను తెలుసుకుంటారు.

## 13.1 పరిచయం

స్త్రీ పురుషుల మధ్య సమాన అవకాశాలు, సమానవిలువల గురించి మట్లాడేదే స్త్రీవాదం. స్థూలంగా స్త్రీ పురుషుల సమానత్వం స్త్రీవాదుల ప్రధాన లక్ష్యం. స్వేచ్ఛ, అధికారిన్నిచ్చే హక్కులు స్త్రీ, పురుషుల మధ్య అసమానతలకు ఎలాదారితీశాయో వారు వివరించారు. స్త్రీలకు స్వేచ్ఛ, అధికారం కొరవడి ఎలా వివక్షకు, అణచివేతకు గురయ్యారో స్త్రీవాదులు చెప్పారు. హక్కుల పక్షపాత ధోరణిని వారు ఎత్తిచూపారు. సోషలిస్టులు, మార్క్సిస్టులు వ్యక్తుల సామాజిక జీవితానికి మాత్రమే హక్కులను పరిమితంచేస్తే, స్త్రీవాదులు వ్యక్తుల వైయక్తిక జీవితానికి కూడా హక్కులను వర్తింపచేశారు.

(వ్యక్తిగతమంటే పురుషులకు స్త్రీలను లొంగివుండమని చెప్పే కుటుంబ జీవితం). స్త్రీ వాదులు, స్త్రీ వాదం నిరంతరం చేసిన ప్రయత్నాలవల్ల కుటుంబ వ్యవస్థలోగాని, వెలుపలగాని స్త్రీ విముక్తి సాధ్యపడింది.

రెండు ప్రతిపాదనలు చేయడానికి హక్కుల అంశాన్ని స్త్రీవాదులు విమర్శనాత్మకంగా ఉపయోగించుకున్నారు. మొదటి ప్రతిపాదన పురుషుల ఆధిపత్యంలోనే వుండే అన్ని కార్యకలాపాల్లో సమానభాగస్వామ్యం కావాలి. రెండవ ప్రతిపాదన - ఎటువంటి హక్కుల పరిధిలోకి రాని 'సాంప్రదాయస్త్రీ చట్టం' ఇరుకైనది. మిగతాసామాజిక జీవితానికి సంబంధించిన హక్కులే ఈ చట్టాన్ని ప్రభావితం చేశాయని చెప్పారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం కోసం వారు ప్రయత్నం చేశారు. అయితే అది స్త్రీ పురుషుల సమానస్థాయికే పరిమితం కాలేదు. వివక్ష, అణచివేతల నుండి విముక్తి కావాలనే నూతన హక్కుల శాస్త్రంగా ఆ సమానత్వాన్ని వారు ప్రతిపాదించారు. ఈ దృక్కోణంతోనే పురుషాధిపత్యం అంతం కావాలని, ఆ దిశగా అన్ని వ్యవస్థల్లో మార్పు రావాలని వారు వాదించారు.

## 13.2 మానవహక్కుల వివరణ:

స్త్రీవాద దృక్పధం హక్కులను లింగభేదం లేకుండా పౌరులందరికి స్థూలంగా మానవులందరికి పంచవలసి వుండగా, స్త్రీలు కేవలం తాము స్త్రీలమన్న లింగవివక్ష కారణంగా సామానస్థాయిలో హక్కులు పొందలేకపోయారు. ఈ అసమానత మూడు రకాలుగా వుంటుందని స్త్రీవాదులు చెప్పారు. స్త్రీలను హక్కుల నిర్వచనంపరిధి నుండే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దూరంచేయడం మొదటి అసమానత. హక్కులు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితం కావడం రెండవ అసమానత. హక్కులు అనుభవించే పరిస్థితులు లేకపోవడం, హక్కుల ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో పరిహారం పొందే విధానాలు లేకపోవడమే ఇందుకు కారణం. పౌర, రాజకీయ హక్కుల కోసం రూపొందించిన అంతర్జాతీయ మనవ హక్కుల కోసం రూపొందించిన అంతర్జాతీయ మానవహక్కుల నియమావళి పూర్తిగా పబ్లిక్ జీవితంలో, ప్రభుత్వం నుంచి పురుషులు ఎదుర్కొనే అనుభవాల ఆధారితమైంది. స్త్రీలు కుటుంబం వెలుపలా, లోపలా పురుషులనుండి ఎదుర్కొనే హింసను ఈ నియమావళి పరిగణనలోకి తీసుకోలేదు. ఇది మూడవ అసమానత. ఆరకంగా హక్కుల ఉల్లంఘనను ఎదుర్కొనేందుకు మహిళలకు ఈ నియమావళి ఎటుంటి రక్షణ, భద్రతా కల్పించలేదు. వీటి గురించి వివరంగా తెలుసుకుందాం.

### 13.2.1 నిర్వచనంలో పాక్షిక దృష్టి:

స్త్రీలను ఒక క్రమపద్ధతిలో వేరుచేసిన హక్కుల నిర్వచనాలను చెప్పిన అంశాలను ముందుగా పరిశీలిద్దాం. ఈ ప్రక్రియ చాలా స్పష్టంగానూ, అంతే నర్మ గర్భంగానూ జరిగింది. వివాహంలో మహిళలకు ఆస్తిహక్కు లేకపోవడం, వైవాహిక రేప్ లేదా అత్యాచారం నుండి స్త్రీలకు మినహాయింపు లేకపోవడాన్ని స్పష్టమైన పాక్షిక ధోరణిగా అర్థంచేసుకోవచ్చు. స్త్రీలకు హక్కులు కేటాయించినా వాటిని, పురుషుల అనుమతి పరిధిలోనే అనుభవించాల్సి వుంటుంది. ఇది అస్పష్టమైన పాక్షిక ధోరణి. ఉద్యోగాల్లో కనీస స్థాయిని నిర్ణయించడం, భూమికలవారికే రుణాలు మంజూరు చేయడం ఇందుకు ఉదాహరణ. స్త్రీ ఈరకంగా హక్కుల నుంచి స్త్రీలు మినహాయించే ధోరణులను గుర్తించే ప్రయత్నం చేశారు. స్త్రీలను, వారి అనుభవాలను కూడా హక్కుల పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### 13.2.2 విధానాల్లో పాక్షిక దృష్టి:

చట్టాల్లో స్త్రీల హక్కులకు హామీ ఇచ్చిన తరువాతే విధానాల్లో అవకతవకలు జరిగాయి. హక్కుల అమలు విధానాలే వాటిని స్త్రీలు అనుభవించాల్సిన పరిస్థితులను కల్పిస్తున్నాయి. హక్కుల అమలు అనివార్యం చేసే కీలకమైన వ్యూహాత్మక అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇది రెండు రకాలుగా జరిగింది. మొదటిది చట్టాల్లో స్త్రీల హక్కులకు హామీ నివ్వడం. అదే సమయంలో సమానత్వాన్ని హక్కులు నిజంగా అమలు జరిగేలా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల సమానత్వం ఒట్టి మాటగా మిగిలిపోతుంది. ఉద్యోగాల్లో సమాన హక్కులు కల్పించినా

B RAOU

చారిత్రాత్మకంగా తమకుగల అడ్డంకులవల్ల స్త్రీలు పురుషులతో సమాన సంఖ్యలో ఉద్యోగాలు చేయలేరు. తరాలపాటు ఆ విద్య, ఆస్తి, పరిమితి హోదా లేకపోవడం వల్ల వారికి సమానంగా ఉద్యోగావకాశాలు లభించవు. ఈ విషయాన్ని స్త్రీల సమానత్వ అవకాశాలను దెబ్బతీసేదిగా చట్టం ఎప్పుడూ పరిగణించలేదు. నిశితంగా పట్టించుకోలేదు కూడా. రెండవది హక్కుల ఉల్లంఘన జరిగినపుడు పరిహారంపొందే విధానాలు లోపభూయిష్టంగా వున్నాయి. పరిహారం పొందే విధానాలు, వ్యూహాలు శక్తివంతమైనవి కాకపోవడంవల్ల స్త్రీలు వాటిని అనుభవించలేరు.

### 13.2.3 విధానాల్లో వివక్ష:

మూడవ అంశానికివస్తే మానవహక్కుల నియమాలు, విలువలు ప్రమాణాలు నిర్వచించిన, నిర్దేశించిన విధానంలోనే పురుషపక్షపాత ధోరణి వుంది. మానవహక్కుల నియమావళి దృక్కోణం న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ స్వయంప్రతిపత్తికి సంబంధించి పురుషుల అనుభవాలతోనే ప్రభావితమైంది. స్త్రీల అనుభవాలను దాని తాలుకు విలువలు, న్యాయం నియమాలను పూర్తిగా విస్మరించింది. స్త్రీల హక్కులను, పురుషుల హక్కులను కాలరాచేవిగా భావించింది. దాంతో కుటుంబంలోనే స్త్రీలు వివక్షకు గురయ్యారు. వారిపై సామూహిక అత్యాచారాలు జరిగాయి. పురుషులకు ఇటువంటి హింస ఎదురుకాదు కనుక ఈ విషయమై అంతర్జాతీయ మానవహక్కుల నియమావళి ఏమి వ్యాఖ్యానించలేదు. పిల్లల సంరక్షణకు సంబంధించి స్త్రీల అనుభవాలు, విలువలను నైతికతను మానవ అనుభవాలుగా నియమావళి పేర్కొనలేదు. హక్కుల వివరణా ఇవ్వలేదు. స్త్రీల హక్కుల వాదన దేనిమీద ఆధారపడాలన్న విషయం మీద స్త్రీవాద హక్కుల సిద్ధాంత వేత్తలు తర్క, దార్శనిక పరమైన సంశయాలను ఎదుర్కొంటున్నారు. పురుషులే నిర్వచించిన 'ఉమ్మడి' మానవత్వం ఆధారంగానా లేక ఉమ్మడి మానవత్వాన్ని కూడా కలగలుపుకున్న స్త్రీల మానవత్వం ఆధారంగా హక్కుల ప్రతిపాదన చేయాలన్న విషయాన్ని వారు తేల్చుకోలేకపోతున్నారు. 'మానవత్వం', 'మానవనైజం' నిర్వచనాలు మానవహక్కుల నిర్వచనాలకెంతో ప్రధానమైనవి. ఈ నిర్వచనాలు, మానవహక్కులను ప్రతిపాదించడానికి అనుభవసారాంశంగా వుంటాయి. విభిన్న ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన ప్రజలందరి అనుభవాలను మానవహక్కుల నిర్వచనాలు మిళితం చేసుకోవాలి. ఈ నేపథ్యాల్లో చాలాసార్లు స్త్రీల అనుభవాలకన్నా పురుషుల అనుభవాలకే ప్రాధాన్యత ఏర్పడుతుంది. పురుషుల అనుభవాలనే మానవ అనుభవాలుగా నిర్వచిస్తున్నారు. కానీ ఇద్దరి అనుభవాలు జతకలసి వుంటాయి. స్త్రీల హక్కుల ఉద్యమాల వేదిక మీదకు స్త్రీ వాదులు ఈ అనుభవాలు తీసుకువస్తున్నారు.

BRAOU

## 13.3 మానవ హక్కులపై స్త్రీవాదం తొలిదృక్పథం: సమాన హక్కుల కోసం డిమాండ్:

ఇంగ్లండ్, అమెరికాల్లో స్త్రీల హక్కులను తొలిసారిగా ప్రతిపాదించిన మారీవాల్‌స్టోన్ క్రాఫ్ట్, మార్గరెట్ ఫుల్లర్, జె.ఎస్.మిల్ వంటి వారు స్త్రీలు, పురుషులు ప్రాథమికంగా సమానులేనని, కాబట్టి సమానహక్కులు కావాలని కోరారు. పురుషులకు ధారాదత్తం చేసిన పౌర, రాజకీయ హక్కుల నుండి (ఓటు హక్కు, విద్యా హక్కు, ఉద్యోగ హక్కు, ఆస్తి హక్కు) స్త్రీలను వేరు చేయడాన్ని వారు ప్రశ్నించారు.

### 13.3.1 ఆంగ్లేయ ఉదార స్త్రీవాదులు:

చట్టాల్లో అసమానతే ఉదార స్త్రీవాదుల ఆగ్రహానికి కారణమైంది. 'చట్టాల్లో సమానత్వం' స్త్రీ పురుషుల మధ్య సమానత్వానికి దారితీస్తుందని భావించారు. ఉదారవ్యక్తి వాదం (వులెన్ స్టోన్ క్రాఫ్ట్ - ఫుల్లర్), ప్రయోజన వాదం (మిల్) నుండి దార్శనిక వాదులు మార్గ దర్శనం పొందారు. స్త్రీలు 'నీచమైన' వారనే సాకుమీద హక్కులు నిరాకరించడాన్ని అన్యాయంగానూ, అర్థరహితంగా వారు పేర్కొన్నారు. " 18 శతాబ్దం నుండి స్త్రీ వాదులు పురుషుల తార్కిక శక్తికి స్త్రీలు ఏమి తీసిపోరని వాదించారు. స్త్రీలకు మేధో సంపత్తి లేకపోవడాన్ని వారు ఆ విద్యను కారణంగా చెప్పారు"(జగ్గార్). స్త్రీల దుస్థితికి వారి సామర్థ్యాల లేమి కారణం కాదు. శతాబ్దాలుగా కొనసాగుతున్న అణచివేతకది నిదర్శనం. స్త్రీలు స్వయంప్రతిపత్తి, తర్కంకల వ్యక్తులుగా పురుషులకు ధీటుగా ఎదగాలి. తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి.

ఈ సిద్ధాంత వేత్తల దృష్టిలో స్త్రీలు సామర్థ్యం, ఆలోచన, స్వయం అభివృద్ధిలో పురుషులకు ఏమాత్రం తీసిపోరు. స్త్రీలను ముందుగా మానవులుగా, ఆ తర్వాతనే తల్లిగా, భార్యగా వారి పాత్రల్లో గుర్తించాలి. సంప్రదాయ వ్యవస్థలన్ని చెదురుతున్న సమయంలో కుటుంబం లోపలా, వెలుపలా స్త్రీల సొంత వ్యక్తిత్వాన్ని కాదనడం అమానుషం. స్త్రీ కన్నా పురుషుడు అధికుడనే సాంప్రదాయ ఆలోచనా విధానాన్ని తిరస్కరించాలి. స్త్రీలకు ఆపాదించిన స్త్రీత్వం వారి కష్టాలకు కారణమైంది. వారు విద్యావకాశాలు కోల్పోయారు. అందువల్ల వారు పూర్తిగా భర్తలమీద ఆధారపడ్డారు. ఈ కారణం వల్లనే వారి దృక్పథం పరిమితమై, సంకుచితమైంది. కానీ స్త్రీల సంకుచితత్వం వారిని అల్పులను చేయలేదు. ఆస్తిహక్కు, ఉద్యోగహక్కు లేకపోవడం వల్ల ప్రగతి సాధించలేకపోయారు. స్త్రీలకు హక్కులు అవసరమేలేదని, స్త్రీలకు హక్కులను అనుభవించే సామర్థ్యం లేదన్న సాంప్రదాయ వాదనలు, భావనలు తప్పు. స్త్రీల శక్తి సామర్థ్యాలు వినియోగించుకోలేకపోవడంవల్ల సమాజం కూడా నష్టపోతుంది. ఉదారవాదంతోపాటు అమెరికాలో ముందుకు వచ్చిన రిపబ్లిక నిజంవల్ల స్త్రీవాదుల ప్రశ్నలకు, ప్రతిపాదనలకు మరింతపదును చేకూరింది.

## 13.3.2 అమెరికన్ స్త్రీ వాదులు:

మనోభావనల వ్యక్తీకరణ పౌర, రాజకీయ హక్కుల కోసం స్త్రీలు జరిపిన పోరాటంలో కీలకమైన బహిరంగ ప్రకటన అమెరికాలో 1848 లో జరిగిన స్త్రీల హక్కుల సదస్సులో ముందుకు వచ్చింది. మనోభావనలు లేదా సెంటిమెంట్లను సదస్సు ప్రకటించింది. స్త్రీలు, పురుషులు సమానంగానే సృష్టించబడ్డారు. కాబట్టి వారికి జీవన, స్వేచ్ఛ హక్కులున్నాయి. దాని నుండి సంతోషం పొందడానికి అంతేహక్కు వుందని అమెరికా హక్కుల బిల్లు ఉద్ఘాటనను ఈ సదస్సు ఆధారం చేసుకుంది. స్త్రీలపై తమ అధికారం కొనసాగడానికి వివాహంలో, వివాహం వెలుపలా వారికి గల హక్కులను పురుషులు నిరాకరించారు. "స్త్రీ'పై పురుషుడి ఆధిపత్యమే మానవ చరిత్ర" పురుషులు నిరాకరించిన హక్కులను అత్యంతకీలకమైనవిగా డిక్లరేషన్ వక్కాణించింది. స్త్రీలకు తమ ప్రతినిధులను ఎన్నుకునే అనుమతినివ్వకుండానే, వారి గళం ఏ మాత్రం వినిపించని చట్టాలకు లోబడి వుండాలని నిర్ణయించారు. వివాహానంతరం చట్టం వారికి తమ పేరిట ఆస్తిని కలిగివుండే వీలును నిరాకరించింది. వారికి పనిద్వారా లభించిన వేతనం మీద కూడా హక్కు వుండదు. భర్తకు స్త్రీ పూర్తిగా బానిసగా మారే విధంగా వివాహ ప్రతిజ్ఞలను చేయిస్తారు. విడాకులు, పురుషుల ఇష్టాయిష్టాల మీద ఆధారపడి వున్నాయి. పిల్లలు, స్త్రీ అభీష్టాలతో నిమిత్తం లేకుండా నిర్ణయించబడుతుంది. పురుషుల ఆధిపత్యం కొనసాగిన విద్యవంటి రంగాల్లోకి స్త్రీలకి ప్రవేశం నిషేధం . చర్చిలో కూడా ఆమె లొంగివుండాల్సిందే. "తన శక్తులపై స్త్రీ నమ్మకాన్ని చెదరగొడుతూ, ఆమె ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ, ఆమె తనపై ఆధారపడి మాత్రమే జీవించడానికి వీలుగా ఆమెను అన్ని రకాలుగా పురుషుడు అణచిపెట్టాడు.

BRAOU

## 13.3.3 ఉదారవాదంలో చట్టపరమైన సమానత్వంలో పరిమితులు

ఇంతకు ముందు చేసిన ప్రతిపాదనల్లో కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేయకుండానే స్త్రీలకు పురుషులతో సమానంగా పౌర, రాజకీయ హక్కులకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ చట్టంలో లొసుగులు ఈ సిద్ధాంత వేత్తలను అయోమయంలో పడవేశాయి. కుటుంబంలో స్త్రీ పాత్ర ప్రాధాన్యతను చట్టం గుర్తించలేదు. కుటుంబంలో పాత్రకే స్త్రీని చట్టం పరిమితం చేసింది. ఈ సిద్ధాంతకర్తల్లో చాలా మంది మహిళలు తమ వైవాహిక జీవితాన్ని కాదని, సాంఘిక జీవనంలోకి వస్తారని విశ్వసించనప్పటికీ, చట్టమే స్త్రీలకు సంబంధించి నిర్ణయాలు చేయరాదని దృఢంగా భావించారు. కుటుంబంలోని వ్యక్తిగత జీవనంలో మార్పు రాకుండా సామాజిక జీవనంలోకి రావడం వల్ల ఎదురయ్యే సమస్యలను వారు వూహించలేకపోయారు. దానితో పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల్లో చట్టబద్ధమైన హక్కులు స్త్రీల పరిస్థితిని మెరుగుపరచలేకపోయాయి. చాలా మంది మహిళలు 'గృహ పరిమితుల్లోనే' తమ జీవనాన్ని కొనసాగించారు. ఉదార వ్యవస్థల్లో గృహపరిధి ఇతరుల జోక్యంతో లేని 'వ్యక్తిగతంగా' మిగిలింది. ప్రపంచంలోని చాలా రాజకీయ వ్యవస్థల్లోని కుటుంబాలలో కూడా పురుషుడి ఆధిపత్యం కొనసాగింది. స్త్రీ పురుషుడి వ్యక్తిగత జీవితంగా మారింది. ఈ రకంగా మహిళలకు సంక్రమించిన హక్కులు ఆచరణలో ఫలితానివ్వలేక పోయాయి. స్త్రీలు పురుషులకు లొంగివున్నారన్న

విషయాన్ని హక్కులు విస్మరించాయి. 60,70 దశకాల తరువాత వచ్చిన రెండవతరం స్త్రీ వాదులు సామాజిక, వ్యక్తిగత జీవనంలోని ద్వైధీ భావాన్ని ఎత్తిచూపారు. స్త్రీలు తరచుగా పురుషుల హింసను ఎదుర్కొనే వ్యవస్థగా వారు కుటుంబాన్ని గుర్తించారు. స్త్రీలు, పురుషుల వ్యక్తిగత పార్శ్వం కావడం వల్ల, సామాజిక జీవితాన్ని వ్యక్తిగతానికి పూర్తిగా దూరంగా వుంచాలన్న ధోరణి వల్ల స్త్రీలకు పురుషుల నుండి రక్షణే లేకుండా పోయింది. సమాన పౌరసత్వ హక్కులు చట్టంలో సమానత్వంగా పరిగణింపబడవు. వ్యక్తిగత, సామాజిక జీవితంలో వైరుధ్యాన్ని స్త్రీవాదులు ఎత్తిచూపడం వల్ల స్త్రీల వ్యక్తిగత జీవితంలో సామాజిక అంశాల ప్రభావంపై నిషేదం తొలగిపోయింది.

## 13.4 సామాజిక/వైయక్తిక ద్వైదీ భావ ఉదారవాదంపై విమర్శ:

సామాజిక/వైయుక్తిక ద్వైదీభావనలను ఖండించిన స్త్రీవాదులు కుటుంబంలో పురుషుని ఆధిపత్యాన్ని కాపాడిన 'ఉదారసిద్ధాంతపు' పితృస్వామిక ధోరణిని వివరించారు. కుటుంబంలో పురుషుని అధిపత్యం మూడు ముఖ్యమార్గాల ద్వారా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

### 13.4.1 కుటుంబానికి ఉదార సూత్రాలను అపాదించేందుకు నిరాకరణ:

కుటంబానికి ఉదారసూత్రాలను అపాదించేందుకు నిరాకరించిన పశ్చిమదేశాల్లో ఉదారవాదం, ఫెమినిజం సమసమాజశకం నుండే వున్నాయి. ఈ సమాజం వ్యక్తుల మధ్య లొంగుబాటు సంబంధాలను వ్యతిరేకించినా, ఉదారవాదులు తమ సూత్రాలను కుటుంబ పరిధిలోకి తీసుకురాలేదు. తమ జీవితాల కోసం పురుషులు సృష్టించిన చట్టాల పరిధిలోనే అంటే కుటుంబ పరిమితుల్లోనే స్త్రీలు వుండాలని లాక్ వాదించాడు. కుటుంబంలో స్త్రీలు లొంగివుండటం వల్ల వారిని పరిపూర్ణ వ్యక్తులుగా పరిగణించడానికి లేదు. రాజకీయ అధికారం కుటుంబంలో పితృస్వామ్య అధికారానికి భిన్నమైందని, కాబట్టి కుటుంబ నియమాలు రాజకీయ రంగానికి వర్తించవన్నాడు. మరోవైపు కుటుంబంలో స్త్రీలు లొంగివుంటారు కాబట్టి వారికి రాజకీయ అధికారం వుండకూడదన్నాడు.

BRAOU

### 13.4.2 చట్టాల్లో సమానత్వానికి ప్రాధాన్యత:

చట్టపరమైన సమానత్వం లభించగానే, సామాజిక జీవనంలో వివక్ష తొలగిపోతుందని, వారికి సమానత్వం సిద్ధిస్తుందని ఉదారవాదులు వాదించారు. మిల్ ప్రతిపాదన లాగానే వారు కూడా చట్టపరమైన సమానత్వం లభించినంత మాత్రాన స్త్రీలు తల్లులుగా, భార్యలుగా తమ పాత్రలను పోషించే అవకాశం పోగొట్టుకోనక్కర్లేదని, అంతమాత్రాన వారు సామాజిక జీవనానికి దూరం కానక్కర్లేదని పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత జీవితంలో స్త్రీ, పురుషుల మధ్య అసమానతలున్నపుడు వారి మధ్య ఎలా రాజకీయ సమానత్వం సాధ్యపడుతుందో వారు చెప్పలేకపోయారు.

### 13.4.3 కుటుంబం - సామాజిక జీవనం:

సామాజిక, వ్యక్తిగత జీవనాలను రెండు రకాలుగా ఉదారవాదులు విభజించారు. కుటుంబం, సామాజికం, సామాజికజీవనం లోపలే (రాజ్యం, సామాజం) ఈ వ్యత్యాసం గురించి వారు వివరించారు. సోషలిస్టులు కూడా సామాజిక - వ్యక్తిగత జీవనంపై ప్రతిపాదనలు చేయడంలో సమస్యలు ఎదుర్కొన్నారు. 'ఇక్కడ వ్యక్తిగతమంటే, గృహ పరిమితుల్లోని కుటుంబం మాత్రమే కాదు మార్కెట్, ఆర్థిక స్థితిగతులు, రాజకీయానికి సంబంధంలేని మన సామాజిక అస్థిత్వం కూడా' (ఫిలిప్స్,15). కుటుంబం ఆరకంగా స్థానం కోల్పోయింది. హక్కుల ఉదారత్వం, రాజ్యం, వ్యక్తులపై తీసుకొనే చర్యల పరిమితులను వ్యాఖ్యానిస్తుంది. కుటుంబంలోనే వ్యక్తులు స్వేచ్ఛ కలిగి వుంటారు కనుక వ్యక్తిగతాన్ని దాని పరిధినుండి మినహాయించారు. కుటుంబంలో స్త్రీల కన్నా పురుషులే అధికులు కనుక కుటుంబాన్ని హక్కుల పరిధినుండి తొలగించడం వల్ల జరిగే ప్రయోజనం లేదు. స్త్రీలకు ఇచ్చిన చట్టపరమైన సమానత్వానికి దీనికి తేడాలేదు. స్త్రీలపై పురుషులు చేసే అత్యాచారాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. భార్యలపై దాడి చేయడం, లైంగిక

వేధింపులు, ఇన్‌సెస్ట్, బలాత్కారం వంటి వాటికి సమాజంలో ఆమోదం వుంది. ఈ ధోరణులు ఎంతమాత్రం ఆపేక్షణీయం కావు. పైగా స్త్రీలను కించపరిచేవి కూడా ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఇప్పుడు పురుషుల హింసనుండి,అత్యాచారాల నుండి విముక్తి కావాలన్న తమ హక్కును వక్కాణిస్తున్నారు, పోలీసులు, కోర్టులు, ప్రభుత్వ యంత్రాంగం హింసను తీవ్రంగా పరిగణించక పోవడం వల్ల స్త్రీల జీవన, స్వేచ్ఛ హక్కుల చెల్లుబాటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హక్కులు అమలుతో మరిన్ని సమస్యలు ఉద్భవించాయి. పాశ్చాత్య మహిళలకు గత శతాబ్ద కాలం నుంచి విద్య, ఉద్యోగ, ఆస్తి హక్కులు సంక్రమించాయి. కానీ అన్ని స్థాయిల్లో వివక్షను ఎదుర్కొంటూనే వున్నారు. నిజ జీవితంలో స్త్రీలకు, పురుషులకు గల తేడాలను విస్మరించడం వల్ల సమాన హక్కుల అమలులో వ్యక్తుల జెండర్ పాత్రపై వారు అవగాహనకు రాలేకపోయారు. అందువల్ల స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ లభించలేదు.

## 13.5 స్త్రీలు - సమాన హక్కుల నిర్వచనం:

సమానత్వంపై సామాజిక వ్యవస్థల నిర్వచనం వల్ల స్త్రీల హక్కులకు చిక్కులు ఏర్పడ్డాయి. సమాన హక్కులంటే పురుషులతో సమానస్థాయి కల్పించగానే అర్థం చేసుకొంటే ఆ సమానత్వానికి ప్రయోజనమే లేదు. దురదృష్టవశాత్తు చాలా చట్ట వ్యవస్థలు ఈ రకంగానే సమానత్వాన్ని నిర్వచించాయి. స్త్రీలూ, పురుషులూ ఒక్కలానే వున్నపుడే వారికి సమానత్వం సిద్ధిస్తుంది. మాతృత్వం, పిల్లల సంరక్షణ, గృహ బాధ్యతలు అడ్డురానంతవరకూ స్త్రీలకు కూడా పురుషుల అధిపత్యం కల రంగాల్లో ఆవకాశాల్ని కల్పించడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చట్టాల్లో ఇటువంటి అసమగ్ర సమానత్వం వల్ల స్త్రీలకు నష్టం వాటిల్లుతుంది. స్త్రీలకు గల మాతృత్వ భాద్యతను, పిల్లల సంరక్షణకు నెరవేర్చడానికి తగిన అవకాశం యివ్వకుండా ఉద్యోగావకాశాలు కల్పించి లాభం లేదు. స్త్రీల పునరుత్పత్తిని దెబ్బతీస్తుందనే కారణం మీద ఎక్కువ వేతనం పొందగలిగే ఉన్నతస్థాయి ఉద్యోగాలను పురుషులే ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగాలు కూడా స్త్రీలకు సమానహోదా అంశాన్ని పట్టించుకోలేదు. అత్యాచారం, కుటుంబ హింస, ఉద్యోగాల్లో వివక్షకు గురై, తమ హక్కుల పరిహారం కోసం సంప్రదించిన మహిళలకు అన్ని యంత్రాంగాల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. అందువల్లనే చాలామంది స్త్రీవాదులు అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలను విమర్శించారు. వాటి దార్శనిక మార్గనిర్దేశికతను కూడా వారు వ్యతిరేకించారు.

BRAOU

## 13.6 మానవ హక్కులపై అర్థవంతమైన విమర్శ, స్త్రీ వాద దృక్పథ ఆవిర్భావం:

మానవ హక్కులు ప్రమాణాలు స్త్రీల అనుభవాలకు దర్పణం పట్టవని, స్త్రీల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని రెండు విమర్శలున్నాయి. ఒక విమర్శ మానవ హక్కుల నైతిక దృక్పథాన్ని నిరాకరిస్తే మరో విమర్శ మానవ హక్కులను కొత్త కోణంలో ఆవిష్కరిస్తుంది. మొదటి రకం విమర్శకులు మానవహక్కులు పూర్తిగా 'పురుష స్వభావం' తో కూడిన నైతిక ప్రగతిని సూచించాయన్నారు. రెండోరకం విమర్శకులు స్త్రీలు గానీ, ఇతర అణగారిన వర్గాల అణచివేతను ఏమాత్రం ప్రతిబింబించని అస్పష్ట విశ్వజనీన సూత్రీకరణలు చేశామన్నారు.

### 13.6.1 వ్యక్తి - సమాజంపై హక్కుల అవాంఛనీయ చిత్రీకరణ:

మానవ హక్కులపై తొలి విమర్శకులు (నాన్సీ హిర్క్‌మాన్, కారోల్ గిలిగన్) హక్కులు వ్యక్తిని, సమాజాన్ని అవాంచనీయంగా చిత్రీకరిస్తాయని పేర్కొన్నారు. హక్కులను ఇప్పుడు పితృస్వామ్య ఉదార భావజాలం నిర్దేశిస్తోందన్నారు. దానితో స్త్రీలు హక్కుదార్లు ఒకరి నుండి ఒకరు విడివడ్డారు. స్త్రీలు తమ స్వయం ప్రతిపత్తి, సమైక్యతలకు ఇతరులనుండి వాటిల్లే ముప్పునుంచి రక్షణ కావలసిన పరాధీనులుగా చిత్రీకరించాయి. ఈ దృక్పథం నైతిక భ్రమలను కలిగించి, ఇతరుల లొంగుబాటులో వుండేలా ప్రోత్సాహమిస్తుంది. ఫక్తు స్వార్థపరత్వాన్ని అమోదించి సమాజాన్ని నిరాకరిస్తుంది. సమాజం తాలూకూ నైతికవిలువలన్ని 'పురుషదృక్పధం'తో కూడుకుని వుంటుంది. పురుషులు ఒకరితో ఒకరు సంబంధం లేకుండా విడిగా వుండగలరు. మనవ సంబంధ బాంధవ్యాల వలయాల్లో చిక్కుకుపోయిన స్త్రీలు ఎక్కడివారు అక్కడే

వుండిపోతారు. స్త్రీలను సాంప్రదాయికంగా ఎప్పటినుండో చుట్టుముట్టిన కార్యక్రమాలు, సంబంధాలు, వైఖరుల ప్రాముఖ్యతకు హక్కుల దృక్పథంలో చోటులేకుండా పోయింది. వ్యక్తిగత బాంధవ్యాలు, బాధ్యత సంరక్షణలు స్త్రీ జీవితంలో అంతర్భాగాలయ్యాయి. స్త్రీల అంతరంగిక సంబంధాలను బాధ్యత తాలుకు విలువలు ప్రభావితం చేశాయేతప్ప హక్కులు కావాల్సిన విలువలు కాదు. స్వయంప్రతిపత్తి, విడి అస్తిత్వపు విలువలను కాపాడే శక్తివంతమైన సాధనాలుగా హక్కులను చిత్రీకరించడాన్ని విమర్శకులు ఖండించారు.

### 13.6.2 స్త్రీజీవిత అనుభవాలకు హక్కుల ప్రమాణాలు దూరం

(రెండవ విమర్శ - కాథరిన్ మాకినాన్ ప్రతిపాదన)

హక్కులు 'విశ్వజనీన సమానత్వం' గురించికాకుండా అసమానతలు తొలగించే దిశగా అమలుకావాలని వాదించారు. అంతర్జాతీయ మానవహక్కుల నియమావళి స్త్రీలహక్కులను పురుషులతో సమానత్వంగా పేర్కొనడాన్ని ఈ విమర్శ అంగీకరించలేదు. జెండర్ ఆధారిత అసమానతలు లేనిదిగా సమానత్వాన్ని భావించాలని కాథరిన్ పేర్కొన్నాడు. మనవ హక్కుల నియమావళి మారణహోమ అనుభవాలనే పరిగణనలోకి తీసుకుందని వారు పేర్కొన్నారు. ఉదాహరణకు యూదులను సమూలంగా నిర్మూలించే ప్రయత్నాలన్నీ మనవహక్కుల ప్రమాణాలకు ప్రేరణగా నిలిచాయి. ఈ అనుభవాలే మానవహక్కుల నియమావళి వెన్నెముకగా నిలిచాయి. అయితే స్త్రీల లొంగుబాటును నియమావళి ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. ఆకారణంగా సామాజికంగా స్త్రీల హోదాపురుషులకు బానిసలుగా స్థిరపడింది. స్త్రీలు ప్రభుత్వ విధానాల్లో స్థానం కోల్పోయారు. 'సామాజిక ఒప్పందం' (Social contract) ప్రతిపాదించిన సిద్ధాంతవేత్తలు సహజహక్కుల వివరణ ద్వారా 'విశ్వజనీనత' కు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సహజహక్కుల ప్రకారం సమానులను సమానంగా, అసమానులను అసమానంగా వ్యవహరించారు. ఈ సిద్ధాంతవేత్తల ప్రకారం సహజంగానే పురుషులకు అణిగి వుండే స్త్రీలకు సహజహక్కులు సంక్రమించవు. స్వేచ్ఛా జీవులుగా పురుషులకే ఈ హక్కులు సంక్రమిస్తాయి. స్త్రీలను వారు 'ఇతర' వ్యక్తులుగానే చూశారు. అందువల్లనే సహజ చట్టాలు లేక హక్కులు విశ్వజనీనమైనా నిష్ఫలమయ్యాయి. ఇంతకుమునుపే స్త్రీలకుగల హక్కులను కొనసాగించడమే వారి ధ్యేయం. సమానత్వం పురుషులతో సమానత్వమైంది. అమెరికా కోర్టులో ఇందుకుసంబంధించిన ఒక సంఘటన పురుషులతో సమానత్వమెంత హాస్యాస్పదమో నిరూపించింది. ఉద్యోగంలో లింగవివక్షకు గురైన ఒక మహిళ దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఆ స్థానంలో పురుషుడుకూడా అదేవిధమైన వివక్షకు గురవుతాడా అన్న విషయాన్ని పరిశీలించడానికి ప్రయత్నించింది. అదే నిజమైతే ఆ స్త్రీకి వివక్ష ఎదురుకాలేదని నిర్ధారించుకుంది. అందువల్ల ఇటువంటి విశ్వజనీన, అస్పష్ట దృక్పథాల ఆధారంగాకంటే సెక్స్ అసమానతకు (లైంగిక, పునరుత్పత్తి, అత్యాచారాల్తో సహా) వ్యతిరేకం. స్త్రీల ప్రపంచవ్యాప్త ఉద్యమానికి అనుసంధానంగా హక్కులగురించి మాట్లాడటం మేలవుతుంది. ఈ ఉద్యమం అధికారం, పెత్తనం - లేకపోవడాన్ని సమానత్వంగా నిర్వచిస్తుంది. పురుషుడితో సమానత్వం దీనికి ఆధారం కాదు. హింస, అత్యాచారం, రెండవశ్రేణి పౌరసత్వం వ్యతిరేకత దీని స్ఫూర్తి. 'ఇతర హక్కులకు కూడా సమాన సంప్రాప్తి' అని సమానత్వాన్ని పాపులర్‌గా నిర్వచించడాన్ని ఈ ఉద్యమం గుర్తించలేదు. సమాజంలో సమానత్వం కావాలని వాదిస్తున్నది. అమెరికా నల్ల జాతివారి పౌరహక్కుల ఉద్యమం, కెనడాలో స్త్రీ హక్కుల ఉద్యమం నుండి ప్రేరణ పొందిన ఈ ఉద్యమానికి సమాజంలో వాస్తవాలే ఆధారం. "దైనందిన జీవితంలోకి ఈ ఉద్యమం చొచ్చుకుపోయింది. సామాజిక ప్రయోజనాల కోసం సమానత్వాన్ని చట్టాల ద్వారా కట్టబెట్టడానికి అతీతమైన దృక్పథంతో ముందుకుపోయింది. అసమానత వ్యక్తులను గాయపరిచినా, సామాజిక సమూహాల సభ్యులుగా వారు గాయపడ్డారు. వ్యవస్థాగతమైన అసమానతలను, వ్యక్తులమధ్య అసమానతలగురించి వక్కాణిస్తుంది. పెత్తనానికి అతీతమైన; సామజిక, తార్కిక సమానత్వాన్ని ఉద్భోదిస్తుంది."

ఈ నిర్వచనం వల్ల సెక్సువల్ అసమానతలను స్త్రీల మానవహక్కుల ఉల్లంఘనలుగా పరిగణించడానికి వీలవుతుంది. లైంగిక వేధింపు, గర్భధారణ సమయంలో నిర్లక్ష్యాన్ని మానవ హక్కుల ఉల్లంఘనగా పేర్కొనవచ్చు. సమానత్వం పరిధులను విస్తృతం చేస్తుంది. సృజనాత్మక నిర్వచనాలిస్తుంది.

BRAOU

## 13.7 ముగింపు:

మానవహక్కులపై స్త్రీవాదపు వివరణ సమగ్రం కాదు. అసమగ్రమూ కాదు. మనవ హక్కులపై స్త్రీవాదపు వివరణలోని ముఖ్యఅంశాలను మాత్రమే వ్యాఖ్యానిస్తుంది. మార్క్సిస్టు, ఫెమినిస్టు విమర్శకులు,నల్లజాతి స్త్రీవాద, మూడవ ప్రపంచ స్త్రీవాద విమర్శకులు అభివృద్ధి దశలో మానవహక్కులపై ఎంతో వివరణ ఇవ్వవచ్చని భావించారు. జెండర్ ఆస్తిత్వాన్ని ప్రభావితంచేసే వర్గ, కుల, జాతి సమస్యలను ఈ పరిధిలో చర్చించలేదు. విశ్వజనీన మానవహక్కులపై స్త్రీవాదం చర్చపై ఒకనోట్‌గా మాత్రమే ఈ పాఠాన్ని అర్థం చేసుకోవాలి.

## 13.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మనవ హక్కులపై స్త్రీవాద తొలిదృక్పథాలను చర్చించండి.

2. స్త్రీలకు సంబంధించిన మానవహక్కులపై ఉదారవాదుల భావాలు వివరించండి.

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మానవ హక్కులపై ఆంగ్లేయ ఉదార స్త్రీవాదుల భావాలు వివరించండి.

2. స్త్రీల మానవ హక్కులపై గల అర్థవంతమైన విమర్శను చర్చించండి.

BRAOU

BRAOU

# ఖండం - V

# భారతీయ దృక్పథం

మానవహక్కులపై పాశ్చాత్యదేశాల తత్త్వవేత్తల భావాలకు ధీటుగా భారతీయ తత్త్వవేత్తల ఆలోచనలు, సిద్ధాంతాలు ఉన్నాయని ప్రకటించుకోవడం ఎంతమాత్రం అతిశయం కాజాలదు. పౌరసమాజంపై, అహింసపై గాంధీ ప్రాపంచిక దృక్పథం, భారతీయ చట్టాలపై లోహియా విమర్శనాత్మక పరిశీలన మరియు ఇరవయ్యో శతాబ్దానికి చైతన్యవంతమైన దిశానిర్దేశనం చేసిన అంబేద్కర్ వంటి మహామహుల భావాలు చివరి ఖండంలో చర్చించబడ్డాయి. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి.

భాగం - 14 : గాంధీ

భాగం - 15 : లోహియా

భాగం - 16 : పూలే, అంబేద్కర్

BRAOU

BRAOU

# భాగం - 14: గాంధీ

**విషయక్రమం**

14.0 ఉద్దేశం
14.1 పరిచయం
14.2 రాజ్యం - అధికారాలపై గాంధీ అభిప్రాయాలు
14.3 పౌర సమాజం - గాంధీ అభిప్రాయాలు
14.4 ఉదారవాద మార్క్సిజం, గాంధేయ విధానాలు - పోలికలు
14.5 గాంధేయ పోరాట విధానాలు
14.6 ముగింపు
14.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 14.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- రాజ్యం, అధికారం మరియు పౌరసమాజంపై గాంధీ భావాలు తెలుసుకుంటారు.
- ఉదారవాద మార్క్సిజంతో గాంధేయ విధానాల పోలికలు గుర్తిస్తారు.
- గాంధీ అనుసరించిన పోరాట విధానాలు వివరించగలుగుతారు.

BRAOU

## 14.1 పరిచయం

సమకాలీన భారతీయ సమాజంవైపు సునిశిత దృష్టిని సాధించగలిగితే అది ఎంతటి మానసిక గాయాలతో, ఛిద్రమైన అనుభవాలతో ముందుకు పయనిస్తోందో మనకు అర్థం అవుతుంది. జాతిపిత మహాత్మాగాంధీ ప్రభోదించిన ఎన్నో విలువలు గాలికి కొట్టుకుపోతున్నాయి. కనుచూపుమేరలో కూడా వాటి జాడ కనిపించడం లేదు. "అహింస" గాంధీ మార్గం! కాని అందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితులను నేడు మనం చూస్తున్నాం. హింసాత్మక ధోరణులు పెచ్చరిల్లడమే కాదు. నిత్య జీవితంలో అడుగడుగునా, అనుక్షణం మనకు ఎదురుపడుతున్న ఏకైకదృశ్యం ... హింస. ప్రభుత్వాల చేతిలో పరిమిత అధికారాలుండాలని గాంధీజీ ఎప్పుడూ వాదించేవారు. కాని ఇప్పుడు రాజ్యం ప్రధానశక్తిగా, సంపూర్ణ అధికారానికి 'కేంద్రం' గా మారింది. గాంధీజీ వుద్దేశంలో అధికార వికేంద్రీకరణ అంటే 'ప్రజల చేతుల్లో పాలన'! ప్రజలే నిర్ణాయాధికారులు, కానీ ఇప్పుడు మనం చూస్తున్నది కేంద్రీకృతమైన నిరంకుశ రూపాలను!! మనకాళ్ళమీద మనం నిలబడగలిగే స్వరాజ్యమే గాంధీజీ కోరుకున్నారు. అయితే మన అభివృద్ధి తీరు మటుకు గాంధీజీ కన్న కలలను కల్లలు చేస్తోంది. మానవత్వంతో నిండిన సమాజాన్ని గాంధీజీ కోరుకుంటే అమానుషత్వం, మానవతా రహిత పోకడలే మనచుట్టూ నేడు అలుముకునివున్నాయి. మానవహక్కులను మరింతగా బలోపేతం చేయాలంటే కొన్నిసార్లు గాంధేయ విధానాలు ఎంతో అవసరపడతాయి. ఇదే గాంధీ వాదంలోని ప్రత్యేకత.

## 14.2 రాజ్యం -అధికారాలపై గాంధీ అభిప్రాయాలు:

రాజ్యం - అధికారాలలో శక్తివంతమైన మానవ ఒరవడి ఇమిడి వుంది. చారిత్రక క్రమంలో ఇది ఎంతో ప్రముఖపాత్ర వహిస్తుంది. చారిత్రక పరిణామ క్రమంలోనే తనదైన రూపాన్ని సంతరించుకుంటుంది. సమాజంలో అగుపించే ఈ అంశం కొంతమంది మేధావుల దృష్టిని ఆకర్షించింది. గడచిపోయిన 2,500 సంవత్సరాల కాలంలో ఇది

పలు అంశాలపై వివిధ రీతుల్లో ప్రతిఫలించింది. వీటిని రెండు వైవిధ్యంగల అంశాలుగా మనం విడమర్చవచ్చు. అవి:

1. రాజ్యం(స్టేట్) మానవ పరిణామ క్రమంలో నూతనంగా తలెత్తిన ముఖ్య అంశం.
2. ఆధిక్యత, అణచివేతలకు చెందిన సాధనం రాజ్యం

గాంధీజీ రెండవ వర్గానికి చెందిన వారు.

గాంధీ రాజ్యానికీ, అధికారానికీ మాత్రమే బద్ధవిరోధి కాదు.... ఈ రెండు రుగ్మతలూ లేని సమాజ స్వరూపాన్ని ఆయన కోరుకున్నారు. పోలీసులు, సైన్యం లేని సమాజం కోసం ఆయన కలలు కన్నారు. ఇంకా గాంధీ ఇలా అంటారు.. "పరిపాలనా యంత్రాంగాన్నీ నడపడానికి మనం పోలీసులను, సైన్యాన్నీ ఉపయోగించినన్నాళ్ళూ మనం బ్రిటీష్ వాళ్ళకో, మరే ఇతర విదేశీ అధికారం కిందనో కట్టుబానిసత్వం చేయాలని వుంటుందన్న దానిని నేను నూటికి నూరుపాళ్ళు విశ్వసిస్తున్నాను. అధికారం ఎవరి చేతుల్లో వుందన్న దానితో దీనికి ప్రమేయం లేదు. అది కాంగ్రెస్ చేతిలోనే వుండవచ్చు లేదా మరొకరి గుప్పెట్లో వుండవచ్చు". అని అభిప్రాయపడ్డారు. తమ పనులను తామే నిర్వహించుకోగల సమాజాన్ని గాంధీజీ ఆశించారు. అంటే ప్రజల్లో స్వయం నిర్వహణ సామర్థ్యాన్ని ఆయన కోరుకున్నారు. బయట వారి సహాయంతో సంబంధం లేకుండా సమాజం తనదైన మార్గంలో నడవాలన్న గాంధీ విశ్వాసం ఆయనకు మానవులపై వున్న అపరిమితమైన నమ్మకాన్ని వెల్లడిస్తుంది. అయితే గాంధీ విధానాలలో ఇది కూడా ఫలించని కలగానే మిగిలిపోయింది.

## 14.3 పౌరసమాజంపై గాంధీ అభిప్రాయాలు:

స్వతంత్ర ప్రతిపత్తి వున్న చిన్న చిన్న మానవ విభాగాల సహాయంతో సమాజక్రమం ముందుకు నడవాలన్నది గాంధీ అభిప్రాయం. వ్యక్తిగత, సమిష్టి సమస్యల్ని బయట ఏజన్సీలపైగానీ, అత్యున్నత వర్గాలపైగానీ ఆధారపడకుండా సర్వస్వతంత్రంగా పరిష్కరించుకోగలగాలి. గాంధీ వూహించిన సమాజంలో మానవుడు నిరాడంబరుడు, న్యాయబద్ధమైన డిమాండ్లు మాత్రమే కోరుకుంటాడు. ఐహిక సుఖాల పట్ల గాంధీజీకి మక్కువ లేదు. తన 'రామరాజ్యం' లోని మనుషులు వీటి వెంటపడతారని ఆయన భావించలేదు. ఉత్పత్తి విధానాలు స్వయం పోషకాలుగా మాత్రమే వుంటాయి. మానవ అవసరాలను పెంచుకోగలగడం సులభమేగాని దురాశను జయించడమే కష్టమని గాంధీజీ గాఢాభిప్రాయం. అవసరమైనంత మేరే పంటలు పండించుకోవాలి. అప్పుడు సంక్లిష్టమైన సమాజ నిర్మాణంను మనం చూడం. సంక్లిష్టమైన రాజ్యస్వరూపంతో పనిలేదని గాంధీ అభిప్రాయం. పౌరసమాజ నిర్మాణంపై గాంధీజీకి అపరిమితమైన విశ్వాసం వుంది. రాజ్యంలో "సంస్థాగత అధికారం" వుంటుంది. దీనికి బద్ధ విరోధి మహాత్మాగాంధీ, ఒక సందర్భంలో గాంధీజీ మాట్లాడుతూ "రాజకీయ అధికారం నా లక్ష్యం కానే కాదు. జీవితంలోని అనేకానేక పరిస్థితులను ఎదుర్కోడానికి అందుబాటులో వున్న సవాలక్ష మార్గాలలో అది ఒకటి". గాంధీ దృష్టి పథంలో 'రాజకీయ అధికారం' అంటే అర్థం, "జాతీయ స్థాయిలో, ప్రజాప్రతినిధుల సహాయంతో, జాతి జీవనాన్ని క్రమబద్ధం చేసే శక్తి సామర్థ్యాలు వున్నటువంటిది"! స్వయం నిర్వహణ నైపుణ్యంలో జాతి జీవనం సవ్యంగా సాగితే ఎవరి ప్రాతినిధ్యంతోనూ పనిలేదు. అప్పుడు "ఎన్‌లైటెంట్ అనార్కీ" తో వుండే రాజ్యం ఏర్పడుతుంది. అలాంటి రాజ్యంలో ప్రతిఒక్కరూ క్రమబద్ధతతో, సవ్యంగా మసలుకుంటారు. ఏ ఒక్కరూ పొరుగువారికి ప్రతిబంధకం కారు. ఆదర్శవంతమైన సమాజంలో రాజ్యం అనేది వుండదు. కాబట్టి రాజకీయాధికారం ప్రసక్తే తల ఎత్తదు." అంటారు గాంధీ. నిజ జీవితంలో ఆదర్శాలు పూర్తిగా ఫలవంతం కావన్నది కూడా ఆయనకు విస్పష్టం. దేశంలో సంక్షోభానంతర పరిస్థితుల్లో గాంధీజీ తన అభిప్రాయాల్లో కొంత సర్దుబాటు వైఖరిని ప్రదర్శించాల్సి వచ్చింది. "పాలనాధికారం అతి తక్కువ వున్న ప్రభుత్వం మాత్రమే వుండాలని" అనాడు ఆయన విజ్ఞప్తులు కూడా చేసారు.

అందుకే గాంధీ అధికార వికేంద్రీకరణ కావాలంటూ వాపోయారు. అట్టడుగు వర్గాల చేతుల్లో అధికారం వుండాలి. అంతటి సమాజంలో రాజ్యాధికారాన్ని ఇష్టం వచ్చినట్టు చెలాయించడానికి వీలువుండదు. ప్రజల చేతుల్లో పూర్తిగా అధికారం కేంద్రీకృతమయ్యే అత్యున్నత దశకు ఇది చేరుకుంటుంది. పరిమితస్థాయిలో ఉత్పత్తి, అధికారం

BRAOU

నామమాత్రంగా వుండే ప్రభుత్వం, అధికార ి కేంద్రీకరణ ఇవన్నీ గాంధేయవాదానికి ప్రతీకలు. పశ్చిమదేశాలలో కనిపించే మార్కెట్ శక్తుల పాత్ర, వ్యక్తివాదం, చట్టబద్ధ మైన యంత్రాంగం, ఇవేగాక పశ్చిమదేశాల్లోని రాజ్యం అధికారం - సమాజం వంటి వాటిపై కూడా పలు ప్రశ్నలు తలెత్తుత ఎన్నాయి. కేంద్రీకృత రాజ్యవ్యవస్థలో అధికారం చట్టబద్ధతను పొందుతుంది. లేదా రాజ్యం నిర్బంధ అధికారాన్ని చలా యిస్తుంది. చట్టబద్ధత వున్నచోట జవాబుదారీతనం కూడా వుంటుంది. పెట్టుబడిదారీ రాజ్యవ్యవస్థలో చట్టబద్ధ మైన న్యాయం అంతర్గతంగా వుంటుంది. వాస్తవాభివృద్ధికి అనుగుణంగా సాధ్యాసాధనాలుంటాయి. పెట్టుబడిద ారీ విధానం లేని సమాజాల తీరు వేరుగా వుంటుంది. చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన విధానాలలో తేడా కని పిస్తుంది. నైతిక ప్రమాణాలకు గాంధీజీ ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఇది పెట్టుబడిదారీ విధానానికి పడని అంశ ం. అధికారాన్ని క్రమబద్ధీకరించేటప్పుడు చట్టబద్ధమైన మార్గాలకు బదులుగా నైతిక విధానాలు పెట్టుబడిదారీ విధాన వ్యతిరేక వ్యవస్థలో ప్రాధాన్యత సంతరించుకుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే నైతిక ప్రమాణాల మీద నడిచే గాంధీ సిద్ధాంతం పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్తిగా భిన్నమైంది.

అధికారం నుంచి నైతిక ప్రమ ాణాలను విడదీసి చూసే రాజ్యస్వభావం గాంధీజీకి పూర్తిగా అభ్యంతరకరమైన విషయం. దీనిని రాజ్యంలో కనిపిం చే అవాంచనీయ అంశంగా ఆయన భావిస్తారు. నీతి నియమాలకు, అధికారానికి ముడివేసే ప్రసక్తి లేదని అంటూ కొ ంతమంది మేధావులు నోటి వాచలతను ప్రదర్శించారు కూడా. అలాంటి వారిలో మనదేశంలో కౌటిల్యుడు, చైనాలో యాంగ్‌చేవ్, పశ్చిమదేశాలకు చెందిన ప్రముఖ ఫిలాసఫర్లు మేకియవెల్లి, హాబ్స్, సొరెల్ పేరెటోలు కూడా వున్నారు. నైతిక పరిమితులను వాటి పరిపాలకులు ప్రదర్శించే స్వేచ్ఛను వీళ్ళు సమర్థించారు. రాజు ఎన్నడూ తప్పు చేయడు! చట్టానికి, నైతికవిలువలకు రాజు అతీతుడు ! అధికారం నుంచి నైతిక విలువలను విడగొట్టి చూడటం వల్ల తప్పుక ూ ఒప్పుకూ మధ్యవున్న రేఖ చెరిగిపోతుందని వాల్టర్, లండెన్ పిటిరామ్ సోరోకిన్‌లు అభిప్రాయపడ్డారు. నేరస్థుడికి, అమాయకుడికి, మంచికి, చెడుకీ మధ్యవున్న తేడాలు పూర్తిగా అదృశ్యం అయిపోతాయని కూడా వారు పేర్కొన్నారు.

చిన్న చిన్న స్వపరిపా లనా సంస్థలలో అధికార వికేంద్రీకరణ జరగాలన్నది గాంధీజీ సిద్ధాంతాల అంతస్సూత్రం. చట్ట బద్ధ విధానాల ద్వారా అధికార క్రమబద్ధీకరణ పెద్ద సమస్య కాదు. కేంద్రీకృత పారిశ్రామీకరణం పొందిన సమాజాలతోనే అసలు సమస్య ఉంటుందంటారు.

నైతిక నిబంధనలతో రూపుదిద్దుకున్న పరిపాలనా క్రమం గాంధీ రాజ్యాధికార భావజాలంలోని ప్రధాన అంశం. గాంధీ సిద్ధాంతం రాజ్యం - జాతి (స్టేట్-నేషన్) అనే దానికి కూడా వ్యతిరేకిస్తుంది. ఇది తప్పుగా తోచదు. ఎందుకంటే 'స్టేట్-నేషన్' అనే వ్యవస్థలు కూడా పారిశ్రామిక విప్లవఫలితంగా పుట్టుకొచ్చినటువంటివే. నిర్దిష్టమైన ప్రాదేశిక పరిమితులకు లోబడి వున్న ప్రాంతాలలో మార్కెట్ శక్తుల విస్తరణకు, పరిరక్షణకు, వాటి మధ్య పోటీని పెంచడం కోసంగా స్టేట్-నేషన్ అనే రూపాలు ఉనికిలోకి వచ్చాయి. గాంధీ సిద్ధాంతంలో ఆధునిక పారిశ్రామీకరణకు స్థానం లేదు. మార్కెట్ శక్తులకు ప్రవేశం వుండదు. అలాంటప్పుడు మార్కెట్‌తోగాని, దాని రక్షణ యంత్రాంగంతో గాని పనేలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని తిరస్కరించినపుడు అదే స్థాయిలో రాజ్యాన్ని కూడా గాంధీ వ్యతిరేకించారు. ఆక్రమంలో పుట్టుకొచ్చే అత్యాధునిక మార్పులను కూడా గాంధీజీ అంతే దూరంలో పెట్టారు. అధికారానికి నైతిక ప్రమాణాలే పునాది కావాలని తాపత్రయ పడ్డారు. ఈ క్రమంలో మానవ పరిపాలనలో పెట్టుబడిదారీ పోకడలను గాంధీ నిశితంగా విమర్శించారు.

అభివృద్ధి పరంగా కూడా ఇదే పోకడలు ఎదురవుతున్నాయి. ఫలితంగా మనముందు మరో ప్రశ్న తలెత్తుతుంది. గాంధీ మార్గంలో వున్నత విలువలతో కూడుకున్న పునాదులపై ప్రజాస్వామ్య సంబంధాలు సాధ్యపడవా? శక్తివంతమైన సంస్థల్ని నిర్మించటం అసాధ్యమా? మొదలైన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. మానవజీవనం ఎప్పుడు స్థిరంగా నడవదు. అనిశ్చిత పరిస్థితులు ఎప్పుడూ వాళ్ళను చుట్టుముట్టి వుంటాయి. అపరిమితమైన కోరికలు వత్తిడితో వాళ్ళు హింసాత్మకంగా, అహంకారంగా కూడా ప్రవర్తిస్తారు. మనిషి తన స్వప్రయోజనాలకోసం విచక్షణారహితంగా ఎంతదూరమైనా వెళ్ళగలడు. మానవుల్లో మంచితనం, త్యాగబుద్ధులు అపురూపం అయిపోతాయి. మానవజాతిలో అంత స్వార్థపరత్వం వాంఛనీయం కానేకాదు. అందుకే ఇలాంటి మానవజీవనంలో అత్యున్నత ప్రజాస్వామిక సంబంధాలు ఏర్పాడాలంటే ఎలాంటి మౌలిక పునాది అవసరపడుతుందన్న ప్రశ్న మనముందు నిలుస్తుంది. అభివృద్ధితో కూడుకున్న పునాది వినిమయ సంస్కృతికి

BRAOU

ప్రతీక. పేదరికం పునాదులు అభద్రతకు నిలయం. నియంత్రణలేని దోపిడీ విధానాలకు కేంద్రం అవుతుంది. చిట్టచివరకు సామాజిక సంబంధాల్లో హింస పెచ్చరిల్లేట్టు చేస్తుంది. మొత్తానికి రెండు వైపులా వున్న చిత్రాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

ఉదారవాద సిద్ధాంతం ప్రకారం చూస్తే, మానవ సమాజ నిర్మాణంలో రాజ్యం పాత్ర చాలా పరిమితమయింది. మార్కెట్ పరిస్థితులు తలెత్తడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. మార్కెట్ వ్యవస్థలో మానవుల మధ్య సంబంధాలు ఉత్పత్తి, మారకాలపై నడుస్తాయి. ఉత్పత్తి, మారకాలు రెండూ రాజ్యం పరిధిలోకిగాని, అధికార యంత్రాంగం గుప్పెట్లో గాని వుండవు. మార్కెట్ సంస్కృతిలో మనిషి కూడా వనరుగానే చూడబడతాడు. లాభార్జనకు, శ్రమకు మానవ వనరులు పుష్కలంగా దొరుకుతాయి. ఉదారవాద సిద్ధాంతం వ్యవస్థాగతమైన శ్రమను ప్రోత్సహించదు. అలాగే వినియోగపరంగా సమిష్టి సూత్రాలను అనుమతించదు. పోటీ ముసుగులో ఈ తతంగం అంతా నడుస్తుంది. సమిష్టి వినియోగం అన్నది ఇక్కడ అసలు పడని విషయం. అనూహ్యం కూడా. అసలు విషయం లాభార్జనకు ఇది గండికొడుతుంది. ఉదారవాద వ్యవస్థలో వ్యక్తిగత వినియమం మూలస్తంభం లాంటిది. ప్రతివ్యక్తీ తన అవసరాలను తీర్చుకోవడం కోసం మార్కెట్‌పై ఆధారపడుతాడు. ఫలితంగా రాజ్యంతో మనిషికంటే సంబంధం పరిమితంగానే వుంటుంది. రాజ్యంలో సంబంధంలేని స్వేచ్ఛా జీవితాన్ని ప్రతివ్యక్తీ అనుభవిస్తాడు. ఈ సామాజిక నిర్మాణంలో నిరంతర స్వేచ్ఛను చూస్తాం. ఇక్కడ లేవనెత్తాల్సిన సమంజసమైన ప్రశ్న ఒకటి వుంది. అందరికీ ఒకేరీతిలో మార్కెట్ అందుబాటులో లేకపోవడం. అంటే అందించే సేవల్లో అసమానతలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అసమానతలు వ్యక్తుల్ని ఒకరికొకర్ని దూరం చేయడమే కాదు. మనుషుల్ని విడగొడతాయి కూడా. మనుష్యుల్లోని అనైక్యతా, వ్యక్తిగత ప్రయోజనాల నుంచి తలెత్తుతున్న సంఘర్షణలు రాజ్యాధికారాన్ని సంఘటితం చేయడమేకాదు బలపడేట్టు చేస్తుంది. చట్టబద్ధత దాల్చేట్టు చేస్తుంది. పౌరసమాజంలో ప్రజల మధ్య ఐక్యత కొరవడినంత కాలం శక్తివంతమైన రాజ్యం ఉనికి అవసరం అవుతుంది.

గాంధేయవిధానం వ్యక్తివాదాన్ని, వినిమయవిధానాన్ని వ్యతిరేకిస్తుంది. రామరాజ్యాన్ని తలపించే సమాజాన్ని గురించే గాంధీ సిద్ధాంతం వివరిస్తుంది. సామాజిక వ్యవస్థాస్వరూపాల ఆధారంగా రామరాజ్య నిర్మాణం సాగుతుంది. దాని స్వరూపం ప్రజాస్వామికంగానే వుండాలన్న నిబంధన ఏమీలేదు.

ప్రాచీన సమాజాల తీరుతెన్నుల ఆధారంగా ఈ విధానం రూపొందించడమైంది. అంచలవారీ వ్యవస్థ వున్న సమాజాలు అవి. అంత ప్రజాస్వామిక పరిస్థితులు లేవు. కుటుంబం, కులం, గ్రామ సమూహాలు, మతం, విద్య, ఆస్తులు వంటి వ్యవస్థల్లో మార్పులు తీసుకురావడంలో గాంధేయ విధానాలకు నిర్దిష్టమైన వ్యూహాలు, కార్యక్రమాలు లోపించాయి. తిరిగి వీటిని నిర్వహించే ప్రయత్నం గాంధీ చేసారు. సాంప్రదాయక చట్రంలో ఇమిడివుండే ఒక మోడల్‌ని తయారుచేసారు. దేన్నీ పరిగ్రహించకూడదనే నైతిక సూత్రంకు గాంధీజీ పీటవేసారు. సంపదను పరిత్యజించాలన్నది కూడా గాంధీ గాఢాభిప్రాయం. ధర్మకర్తృత్వం అన్నది గాంధేయ వాదంలోని అంతఃసూత్రం. సంపదను ఆర్జించడం పట్ల గాంధీకి వ్యతిరేకత వున్నా ఆస్తులను నిషేదించాలని మటుకు ఆయన కోరలేదు. ఇక్కడ ఎదురవుతున్న ప్రాధమిక ప్రశ్న ప్రైవేటు ఆస్తులను బదిలీ చేయడాన్ని గాంధీ ఎందుకు ప్రస్తావించలేదన్నదే. సామూహిక లేదా సమిష్టి యాజమాన్యం అన్న దానిపై గాంధీ ఎక్కువ దృష్టి సారించలేదు. చిన్న చిన్న స్వతంత్రప్రతిపత్తి విభాగాలలో ఆస్తుల నిర్వహణకు ట్రస్టీల నియామకం అవసరమా? రాజ్యం ప్రసక్తిలేని 'ఎన్‌లైటెండ్ అనార్కీ' ని విస్తరింపచేయడానికి ధైర్యంగా పూనుకున్న గాంధీ ఆస్తుల సంబంధాలను క్రమబద్ధీకరణ చేయడంలో చొరవను, ధైర్యాన్ని ప్రదర్శించలేకపోయారు. గాంధేయవాద దృష్టిలో ఆస్తిహక్కుపై పెద్ద ఎత్తున చర్చ జరగాల్సి వుంది.

## 14.4 ఉదారవాద మార్క్సిజం - గాంధేయవిధానాలు : పోలికలు

స్వంత ఆస్తినుంచే అన్నిరకాల ఆధిక్యధోరణులు పుట్టుకొస్తాయన్నది మార్క్స్ విధానం. గాంధేయవాదానికి ఇది భిన్నమైనది. ఇది ఇటీవల పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయింది కూడా. సంపద పునాదులమీద నుంచే సమాజంలో విభిన్న వర్గాలు పుట్టుకొచ్చాయని మార్క్సిజం నమ్ముతుంది. ఇలాంటి సమాజంలో మానవసంబంధాలు సంక్లిష్టంగా,

BRAOU

భిన్నాభిప్రాయాలతో కొనసాగుతుంటాయి. రాజ్యం, అధికారం రెండూ ఒకే స్థాయికి చేరుకున్నాయి. స్వంత ఆస్తిని రద్దుచేయడం వల్ల బదలాయింపు చేయడం వల్ల సమాజంలో వున్న వర్గాలు నమసిపోతాయి. ఎప్పుడైతే వర్గసమాజం రద్దవుతుందో తదనుగుణంగా భిన్న మార్గాల్లో పయనిస్తున్న మానవ సంబంధాలు కూడా అదృశ్యమవుతాయి. ఎప్పుడైతే ఇవన్నీ వాస్తవాలవుతాయో అప్పుడు వినిమయ సంస్కృతి, వ్యక్తి ప్రయోజనాలు, మానవ సంబంధాల మధ్య పెరుగుతున్న దూరానికి చరమగీతం పాడినట్లవుతుంది. అందులోంచి పుట్టుకొచ్చిన సమాజం సమైక్య, సమిష్టి చర్యలకు అనుగుణమైన పరిస్థితులను సృష్టిస్తుంది. సమిష్టి మానవ సమాజం నూతన చరిత్రకు శ్రీకారం చుడుతుంది. ఇది మానవుల్లో దాగివున్న అపూర్వశక్తి సామర్థ్యాలను వెలికితీస్తుంది. ఉత్పాదక శక్తులను మార్క్సిజం నమ్ముతుంది. కాబట్టి నూతన సమాజంలో ఉత్పత్తుల కొరత వుండదు. ఉత్పత్తి లాభార్జనకోసమో, కూడ బెట్టడానికోసమో లక్ష్యంగా పెట్టుకున్నది కాదు. ఉత్పత్తి విధానాలకూ, ప్రకృతికీ మధ్య సమతౌల్యతచెరిగిపోదు. ఇలా గనుక చూసినట్లయితే రాజ్యం, అధికారాలతో పనిలేకుండా స్వయంగా సమాజక్రమబద్ధీకరణ సాధ్యపడుతుందని స్పష్టమవుతుంది.

మార్క్సిజం, ఉదారవాదం, గాంధేయవాదం వేటికవే విలక్షణమైనవి, వేటికవి తమదైన ప్రత్యేకతతో అలరారుతున్నాయి. అయితే ఉదారవాదం, గాంధేయవాదులకు వచ్చేసరికే "బదలాయింపుల వ్యూహం తో రెండింటికీ కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. మార్పును మార్క్స్ సిద్ధాంతం నొక్కిచెబుతుందని మార్క్సిస్ట్ ప్రపంచం అభిప్రాయం. గాంధేయవాద సమాజంలో నైతిక పునాదులతో కూడివున్న అధికారం, "ఎన్‌లైటెడ్ అనార్కీ", వినిమయం సంస్కృతిలో పరిమితులు వంటి ప్రధాన అంశాలు సమ్మిళితమై వున్నాయి. వ్యక్తి సంపూర్ణఎదుగుదల, ఉత్పత్తి శక్తుల సహాయంతో ఉత్పత్తిని సరైనమేర పెంపొందింపచేయడం - ఉదారవాద సారాంశం. సమకాలీన ప్రజాస్వామిక చర్చల్లో, ప్రజా ఉద్యమాల్లో గాంధేయవాదం, ఉదారవాదం ప్రస్తావన వుండాలి. పౌరస్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమాలకు కూడా ఇది వర్తిస్తుంది. బాధ్యతాయుతమైన రాజ్యం, ప్రజాస్వామిక పౌరసమాజాల రూపకల్పనే ఈ ఉద్యమాల లక్ష్యం.

## 14.5 గాంధేయ పోరాట విధానాలు:

రాజ్యం, సమాజాలపై గాంధీ అభిప్రాయాలు ఆదర్శవంతమైనవి. యూటోపియావాదాన్ని తలపిస్తుంది. ప్రపంచంలో, మరీ ముఖ్యంగా భారత్‌లో హింసపెరిగిపోతుంది. గాంధీవిధానాలు వాగాడంబరంగా, అతి వాస్తవంగాను వుంటాయి. గాంధేయ మార్గం ఆయనకు ఎన్నో అమూల్యమైన అనుభవాలను పంచిపెట్టింది. భారత్‌లో పెరుగుతున్న హింసను ఎదుర్కోవాలంటే గాంధేయవిధానాలపై క్షుణ్ణంగా పరిశీలన చేయాలి. గాంధీ, పోరాటవిధానాలు, మానవ హక్కులకు సంబంధించి వీటి ఆవశ్యకత, వీటి శక్తియుక్తులు, పరిమితులను కూడా ఈ సంధర్భంగా లోతుగా పరిశీలించాల్సిన అవసరం వుంది.

BRAOU

సామ్రాజ్యవాదులను, పెట్టుబడి దారులను, భూస్వాములను, పెత్తందారులను తమ మిత్రులుగా మలచుకునే క్రమంలో బానిసత్వంలో మగ్గుతున్న ప్రజలు మరిన్ని కష్టాలను, కడగళ్ళను పడవలసి వస్తుంది. అయితే ఇలాంటి పరిస్థితి కొంతకాలమే. తర్వాత వాళ్ళ హృదయం నిండా ప్రేమే. అణిచివేతకు గురవుతున్న వర్గాలు తమకు తాము ధర్మబద్ధంగా, నిర్మల హృదయులుగా తీర్చిదిద్దుకోగలిగితే మరెన్నటికీ ఎవరిచేతిలోనూ అణచివేతకు బలిఅవరు" అని కూడా గాంధీ అంటారు.

"అణచివేతదారులతో పోరాడడం తప్పుడు విధానం. పూర్తిగా అసంబద్ధం. సత్యాగ్రహి అనేవాడు వలసరిపాలనకు తలవొగ్గి ప్రవర్తించాలి. విశ్వాసంగా వుండాలి. సత్యాగ్రహి అయినవాడు ఎంతలోతులోకైనా చూడ గలగాలి. ఏ చిన్న అవకాశం దొరికినా వాన్ని వదిలిపెట్టకుండా ముందుకుసాగాలి".

"అంతా కలసి సత్యాగ్రహశక్తులను బలోపేతం చేయగలగాలి. లేకపోతే హింసను అడ్డుకోవడం జరిగే పని కాదు. నానాటికీ హింసాత్మక ధోరణులు పెరుగుతాయే తప్ప తరిగే ప్రసక్తి లేనేలేదు". అని కూడా గాంధీ అన్నారు. గాంధీ, పోరాట విధానాల్లో మనల్ని ఆకట్టుకునే అంశం మరొకటి వుంది. ప్రయోగశాల ద్వారా ఆయన అహింసావిధానాలు పరిణతి చెందాయి. రూపుదిద్దుకున్నాయి. గాంధీ పోరాట విధానాలు ప్రయోగాలతోనే కొనసాగుతాయి. రూపు

దిద్దుకున్నాయి. గాంధీ పోరాట విధానాలు ప్రయోగాలతోనే కొనసాగుతాయి. విధానాల్లో మార్పు చేర్పులకు విజయాలు, వైఫల్యాలు మరింతగా తోడ్పడుతాయి. 1893-1915 మధ్యలో, దక్షిణాఫ్రికాలో వుండేటప్పుడు గాంధీజీ తన ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. బానిసత్వకోరలు జాచుకొని వున్న దక్షిణాఫ్రికాలో వలస శ్రామికుల పరిస్థితులు ఎంతో దయనీయంగా వుండేవి. శ్వేత పాలకులకు, భారతీయులకు మధ్య ఘర్షణలు చెలరేగటానికి ఇది కారణం అయింది. యూరప్ వలసపాలకులు "ఆసియాటిక్‌లు అమెండ్‌మెంట్" అనే ఆర్డినెన్స్‌నొకదానిని జారీ చేసారు. కొత్త పర్మిట్లను పొందేముందు భారతీయులందరూ తమ చేతిముద్రలను శ్వేత ప్రభుత్వానికి అందజేయాలని ఈ ఆర్డినెన్స్ పేర్కొంటుంది. భారతీయ ప్రతినిధులతో కూడిన బృందం ఈ సవరణను వ్యతిరేకిస్తూ విజ్ఞప్తులు చేసింది. భారతీయుల ప్రతినిధి బృందంతో మహాత్మాగాంధీ కూడా వున్నారు. అక్కడి భారతీయులందరూ విజ్ఞాపన పత్రం సమర్పించినా లాభం లేకపోయింది. దీనికి తోడు జాతివివక్షచూపే మరొక చట్టాన్ని కూడా శ్వేతజాతి ప్రభుత్వం తీసుకొచ్చింది. అదే ఇమ్మిగ్రేషన్ రిస్ట్రిక్షన్ యాక్ట్ (వలసపరిమితి చట్టం). ఈ కొత్త చట్టం కింద ఏ భారతీయుడు తమ పేర్లను నమోదు చేయించుకొకూడదని అందరూ ప్రమాణం చేయాల్సిందిగా గాంధిజీ, ఇతర నాయకులు అక్కడి భారతీయుల్ని కోరారు. హింసాత్మక విధానాలకు పాల్పడరాదని కూడా విజ్ఞప్తులు చేసారు. గాంధీతో సహా ఎంతోమంది భారతీయుల్ని జైళ్ళల్లో నిర్బంధించారు. జనరల్ స్మట్స్ దగ్గరికి గాంధీజీని తీసుకువెళ్ళారు. చర్చల్లో గాంధీ తన అభిప్రాయాన్ని, వాదనను ఎంతో పట్టుదలగా సాగించారు. జరిగిన చర్చల ప్రహసనంతో ఒక సూచన చేసారు. అదేమిటంటే భారతీయులు ఇమ్మిగ్రేషన్ రిస్ట్రిక్షన్ చట్టం కింద తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిన పనిలేదు. కాని ఆ చట్టంలో పేర్కొన్నట్టు భారతీయులు స్వచ్ఛందంగా తమ చేతిముద్రలను ఇవ్వాలి. స్వచ్ఛందంగా చేయడానికి అంగీకారం కుదిరిన అనంతరం జనరల్ స్మట్స్ ఈ చట్టాన్ని కొట్టివేయటం జరిగింది. దక్షిణాఫ్రికాలో పరిస్థితులు రోజురోజుకీ తీవ్రరూపం దాలుస్తున్నాయి. దీంతో గాంధీ విధానాల ప్రభావం ఏమిటో దక్షిణాఫ్రికా శ్వేత ప్రభుత్వానికి తెలిసివచ్చింది. హింసాత్మక విధానాల కన్నా వీటిప్రాధాన్యత, ప్రాముఖ్యత, వీటివల్ల పొందగలిగే అనూహ్యమైన రక్షణ ఏమిటో పలువురికి తెలిసివచ్చింది. సత్యాగ్రహ విధానం రూపుదిద్దుకోవటానికి దక్షిణాఫ్రికాలో జరిగిన ఈ సంఘటనలే ప్రాణం పోసాయి.

BRAOU

నేటి సమకాలీన పరిణామాల్లోంచి కూడా గాంధీ పోరాట విధానాలపై చర్చజరగాల్సి వుంది. విప్లవోద్యమాల దగ్గరనుంచీ ప్రతి ఉద్యమంకూడా మార్పుదిశగా పయనించేందుకు ప్రజాసమీకరణ విధానాలను చేపడుతాయి. సమాజం ఎదుర్కొంటున్న పలుసమస్యల పరిష్కారంలో ప్రజలే ప్రత్యక్షంగా పాలుపంచుకోవడం అనేది విశేషమైన అంశం. ఇలాంటి పరిస్థితులు ఏర్పడడం చాలా అపూర్వమైన విషయం. ఎప్పుడో గాని ఇలాంటివి సంభవించవు. తమచుట్టూ వుంటూ తమకన్నా మరింత కష్టాలు పడుతున్న వారిని గమనించగలిగేది ఏ కొద్దిమందో. తాము ఎందుకు కష్టాల పాలవుతున్నామో కూడా తెలియనంతగా ఈతి బాధలకు వీళ్ళు అలవాటు పడిపోయారు. వాటినుంచి బయటపడే మార్గం ఏమిటో కూడా ప్రజలకు తెలియదు. ఇక్కడే తిరుగుబాటుకు బీజాలు పడతాయి. తిరుగుబాటు విధానాలు రూపుదిద్దుకుంటాయి. కొన్ని విధానాలు విజయవంతమైతే, మరికొన్ని విఫలమవుతాయి. తిరుగుబాటు దూపాల శక్తి యుక్తులను విధాన రూపకర్తల దృష్టిలోంచికూడా అంచనా వేయవచ్చు. సిద్ధాంతానికి ఎలా కట్టుబడి వున్నారో కూడా తెలుసుకోవచ్చు. ఏ స్థాయిలో వాళ్ళలో చైతన్యం వెల్లివిరుస్తోందో ఆకళింపు చేసుకోవచ్చు.

హింసాయుత విధానాలను అనుసరించడంలోనే గాంధీ ఉద్యమానికి, విప్లవోద్యమాలకు మధ్య వున్న తేడా స్పష్టం అవుతుంది. ఉద్యమం పెట్టుకున్న లక్ష్యాలు ఎంత ముఖ్యమో అందుకు అనుసరిస్తున్న మార్గాలు అంటే తిరుగుబాటు విధానాలు కూడా అంతే ప్రాధాన్యత పొందుతాయన్నదే గాంధీ ఫిలాసఫీ. పాలకులు మనమీద పెత్తందారీ తనం వహించేటప్పుడు చేపట్టే తిరుగుబాటు విధానాలకు అడ్డుకట్ట వుండదని విప్లవోద్యమాలు నమ్ముతాయి. అహింసా విధానాల ద్వారా పాలకుల మనసులను మార్చగలమనేది గాంధీనమ్మకం. పాలకులకు తెలిసిందల్లా దోపిడీనే, తామనుభవిస్తున్న అపరిమితమైన హక్కులు, అధికారాలను తమకు తామే వాళ్ళు వదులుకునే ప్రసక్తిలేదన్నది విప్లవకారుల గాఢాభిప్రాయం. అందుకే ఇవి రెండూ రెండు విభిన్న ప్రపంచాల్లాంటివి. తమ తిరుగుబాటు విధానాలను పోరాట పద్ధతులను వేటి పరిధిలో అవి మలచుకుంటాయి.

గాంధీ తిరుగుబాటు విధానాలపై అధ్యయనం చేసిన కొంతమంది మేధావుల అభిప్రాయాలు ఇలావున్నాయి. "పరిస్థితిని చూసిన వెంటనే గ్రహించగల అద్భుతమైన తెలివితేటలు గాంధీజీకి వున్నాయి. రాజ్యాంగ బద్ధమైన తిరుగుబాటువల్ల గాని, తీవ్రవాద విధానాల వల్ల గాని పరిస్థితులు అదుపులోకి రావు. కేవలం ప్రత్యక్ష చర్యలకు పూనుకోవడమే ఏకైక మార్గం". ఇది ఒక అంశం.

"తిరుగుబాటు పరిస్థితులను ఎదుర్కోవాలంటే నిరాయుధులైన ప్రజలు ఎలాంటి ప్రత్యక్ష్య చర్యలకు సంసిద్ధులవాలన్నది". ఇది ప్రధానమైన రెండవ అంశం. కొత్త తరహాతో కూడిన తిరుగుబాటు విధానాలకు గాంధీజీ ఇక్కడే శ్రీకారం చుట్టారు. ఈ విధానాలు నిజంగానే సరికొత్తవి. వీటిని అనుసరించడంవల్ల అణచివేతకు గురవుతున్న ప్రజలు మరిన్ని కష్టాలను, బాధలను కొని తెచ్చుకున్నట్టవుతుంది. అయితే గాంధీ కనుగొన్న ఈ విధానాలు మనుషుల్లో అంతర్గతంగా దాగివున్న అత్యంత గొప్ప లక్షణాలు బయటకొచ్చేట్టు చేస్తాయి. సామర్థ్యం పెరిగి మరింత శక్తివంతంగా శత్రువును ఎదుర్కోగలుగుతాయి. తననితాను మరింత బలవంతునిగా రూపొందించుకోగలడు. అన్యాయాలకు ఎదురొడ్డి పోరాడగలడు. అప్పుడు మానవత్వానికి మనం అనుకునే పరిమితార్థం పోయి విశాలదృక్పథాన్ని అలవరచుకుంటుంది. మొత్తం ఆసియా, ఆఫ్రికా దేశాల్లో శ్వేతజాతి పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ఏకైక నాయకుడు గాంధీజీనే అని ఆయన అభిమానుల గాఢ విశ్వాసం. మానవ జాతి గౌరవం కోసం గాంధీ చేసిన పోరాటం ఎవ్వరము మరచిపోలేరనేది గాంధేయవాదుల దృఢ అభిప్రాయం. ఆసియావాసుల్లో చైతన్యం వెల్లివిరిసేట్టు చేసిన వారిలో గాంధీజీ మొట్టమొదటివాడు. పూర్తి అహింసామార్గంలోనే ఆయన తన పోరాటాన్ని కొనసాగించారు. హింసాత్మక విధానాలకు పాల్పడకుండా, ఏస్థాయిలోను సర్దుబాటు ధోరణులకు తావివ్వని యుద్ధవ్యూహంలో, ఆయుధ సంపత్తివున్న 'బలమైన' విదేశీ నియంతృత్వ అధికారంగుప్పెట్లో నలిగిపోతున్న మనదేశ ప్రజలను ఆయన విముక్తుల్ని చేసారు! ఆదర్శం, అన్యాయం అయిన సామ్రాజ్యాధిపతుల ఆధిపత్యాన్ని ఆయన ఎదిరిస్తూనే వచ్చారు. చివరకు ఆ సామ్రాజ్యవాదులే వెనుదిరిగి పోయేట్టు చేసారు".

సత్యాగ్రహం మత ఉద్యమంగా గాంధీపేర్కొన్నారు. "దోపిడీకి, అణచివేతకు గురవుతున్న ప్రజలు సత్యాగ్రహంలో భాగంగా నిర్మల హృదయులు కావాలి. అప్పుడు తమను అష్టకష్టాలపాలు చేస్తున్న అణచి వేతదారుల పట్ల కూడా ప్రేమ మూర్తులుగా మసలుకుంటారు". అని గాంధీ అంటారు.

దక్షిణాఫ్రికా సంఘటన అనంతరం 1915 లో గాంధీజీ భారతదేశానికి తిరిగివచ్చారు. 1916 లో గాంధీ బీహార్‌లోని చంపారన్‌లో ఉన్న పేదరైతుల పక్షం నిలబడి యూరోపియన్ ఇండిగో వ్యాపారాలకు ఎదురుతిరిగారు. చంపారణ్ రైతులు 1867 నుంచి అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు. 1908,1912 సంవత్సరాలలో ఎన్నో ఘర్షణలు, మరెన్నో ఉద్యమాలు ఇక్కడ చోటుచేసుకొన్నాయి. వాళ్ళు చేసిన పోరాటాల ఫలితంగా అక్కడి రైతుల శక్తిసామర్థ్యాలు, సత్తాఏమిటో ఇండిగో వ్యాపారులకు తెలిసివచ్చింది.ఇండిగో కంపెనీ రైతులతో చర్చించి సర్దుబాటువైఖరిని ప్రదర్శించాలనే నిర్ణయానికి వచ్చింది. దక్షిణాఫ్రికాలో తలెత్తిన పరిస్థితే చంపారణ్‌లో కూడా తలెత్తింది. అదే సమయంలో గాంధీజీ రంగప్రవేశం చేసారు. తన అహింసాప్రయోగాన్ని మొదలు పెట్టారు. కొంతమేర విజయం సాధించారు. రెండు సందర్భాల్లో పరిస్థితులు తీవ్రతరం దాల్చలేదు. చర్చలద్వారా సమస్యను పరిష్కరించుకుందామనే దృష్టిని రెండు పక్షాల వారు ప్రదర్శించారు. నిరాశా నిస్పృహలకు గురైన రైతులు ఏక్షణంలోనైనా హింసాత్మక సంఘటనలకు దిగవచ్చనే భయం అణచివేత దారులలో వుంది. అణచివేతకు గురయ్యే ప్రజలకు, అణచివేత దారులకు మధ్య "కమ్యూనికేషన్ ఛానల్" గా గాంధీ పోరాటాలు వెలుగులోకి వచ్చాయి. దీనిని బట్టి గాంధివిధానాలకున్న 'అడ్వాంటేజ్' ఏమిటో అర్థం అయివుంటుంది. ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదర్చడంలో గాంధీ ఒక్కరే ఏకైక వ్యక్తిగా బాధ్యతలను చేపట్టారు. గాంధేయవిధానాలు ప్రయోగాత్మకంగా ఎంతగా ఉపయోగపడగలవో ఈ సంఘటనలు చెబుతున్నాయి. ఈ సంఘటనలననుసరించి తనవిధానాలను విశ్వదృష్టితో చూడటం గాంధీ ఆరంభించారు.

గాంధీ పోరాట విధానాలు వలసదోపిడి వాదుల జేజేలను అందుకుంది. ఒకవైపు గాంధేయవిధానాలను ప్రశంసిస్తూనే చట్టాలను మరింతభయంకరంగా రూపొందించారు. అలాంటిదే 1919 నాటి రౌలత్ చట్టం. వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలోని భారతీయ సభ్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుగా ప్రవేశపెట్టిన వాటిల్లో ఇదికూడా వుంది. చివరకు చట్టరూపం ధరించింది.

BRAOU

ఇది వలస ప్రభుత్వానికి మరింత శక్తివంతమైన అధికారాలను కట్టబెడుతుంది. నిర్బంధించే అధికారం, ట్రయిల్ జరపడం గానే ఏ మనిషినైనా సరే వెదికి పట్టుకుని జైల్లోబంధించే అధికారం, స్పెషల్ కోర్టుల ఏర్పాట్లు లాంటి ఎన్నో అపరిమిత అధికారాలను వలసప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. ఈ చట్టంతో మళ్ళీ పోరాటాలు, ఘర్షణలు మొదలయ్యాయి. రౌలత్ బిల్లును చట్టంచేసినందుకు నిరసిస్తూ సత్యాగ్రహాన్ని చేపట్టాలని ఫిబ్రవరి 24 న నిర్ణయించారు. వైస్రాయి తమ నిర్ణయాన్ని పునరాలోచించవలసిందిగా గాంధీజీ ఆయన్ను కోరారు. ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహావేశాల్ని ఆయన గుర్తించారు. మనం చేపట్టనున్న ఉద్యమానికి నిర్దిష్టమైన గమ్యం ఉండాలి. హింసాత్మక విధానాలవైపు మళ్ళకూడదు. ఉద్యమం కుప్పకూలి పోకూడదు."

రెండవ పద్ధతి ఏమిటంటే, సత్యాగ్రహానికి పౌర ఉల్లంఘనకు మధ్య మార్గం. అదే గాంధీజీ సహాయనిరాకరణ విధానం. ఏ కొద్దిగా కూడా పౌరులు సహకరించకుండా ఉండటం. ఇది చూపే ప్రభావం అంతా ఇంతాకాదు. సహాయ నిరాకరణతో పరిస్థితి చేయి దాటిపోయింది. హింస, ఆవేశకావేషాలు తలెత్తాయి. సత్యాగ్రహం సరిపోదనే అభిప్రాయం ఏర్పడింది.

1920 లో గాంధీ ఇలా రాసారు.

"దేశానికి నిర్దిష్టమైన కార్యక్రమం అవసరం, సహాయనిరాకరణం అన్నింటికన్నా అత్యుత్తమమైంది. మన దేశానికి కావలసింది హింసాత్మక శక్తులను మరోరీతిలోనూ ఎదుర్కోలేము". అన్నారు. సంక్షోభం ముదిరినకొద్దీ బ్రిటీషు ప్రభుత్వానికి హెచ్చరికలు అందుతున్నాయి. బ్రిటీష్ అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలలో పరిస్థితి తీవ్రత గురించి స్పష్టంగా వుంది. హింసాత్మక సంఘటనలతో పరిస్థితి చేయిదాటి పోతూ వచ్చింది. "పౌరోల్లంఘనలో ఎన్నో కష్టాలు, ప్రమాదాలు పొంచివున్నా దేశంలో పలుచోట్ల చెలరేగుతున్న హింసాత్మక ధోరణులకన్నా దీని తీవ్రత చాలా చాలా తక్కువ" - అని గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలో అలుముకున్న ఆగ్రహజ్వాలలను తగ్గించగలిగేది కూడా సహాయనిరాకరణేనని గాంధీ సంపూర్ణ విశ్వాసం. గాంధీ ఇర్విన్‌తో సమావేశానికి చొరవచూపారు. అటునుంచి స్పందనఏమిలేదు. ఇదే పౌరోల్లంఘనకు ఉద్యమానికి పునాదివేసింది. ఉప్పు చట్టాలను ధిక్కరిస్తూ గాంధీ దండీ మార్చిని నిర్వహించారు. విదేశీ వస్త్రాల బహిష్కరణ పిలుపుతో ఎంతోమంది విదేశీ వస్త్రాలను బహిరంగంగా అగ్నికి ఆహుతి చేయడం మొదలైనవి ఎంతో చారిత్రాత్మక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

గాంధి పోరాట విధానాలకు భారత ప్రజలు అపూర్వంగా ప్రతిస్పందించారన్నది వాస్తవం. ఇది గాంధేయ విధానాలు ఎంతగా విజయవంతం అయ్యాయన్న దానిని స్పష్టం చేస్తోంది. ఇంతపెద్దఎత్తున ప్రజలను గాంధీజీ తనవెంట నడిపించడం భారతీయ చరిత్రలోనే ప్రప్రథమం. బలహీనవర్గాల్లో, దళితులు, మహిళలు, మధ్య తరగతి ప్రజల్లో గాంధిచూపించిన ప్రభావం ఎంత ఉందో వేరుగా చెప్పవలసిన పని లేదు.

## 14.6 ముగింపు

సమాజంలోని విభిన్నవర్గాలతో, ప్రజల్లో కదలిక తీసుకువచ్చిన ఏకైకవ్యక్తి మహాత్మగాంధీ. ఈ విషయంలో గాంధీజిది చాలా ప్రత్యేకమైన స్థానం. గాంధీజిలోని మేధావిత్వం కాదు ప్రజలను ఆకర్షించింది. గాంధీ పోరాట విధానాల్లో కనబర్చిన సృజనాత్మకత, నూతనత్వం, తండోపతండాలుగా ప్రజలు ఆయనవెంట నడిచేట్టు చేసింది. పలువురి ప్రశంసలు పొందేట్టు చేసింది. గాంధేయ విధానాల సహాయంతో మానవులు మహోన్నత స్థాయికి ఎదగగలిగితే మానవజాతికి తాము ఉత్తమమానవులం అన్న భావన అణువణువునా మొదలుతుంది. విషాదం ఏమిటంటే సిసలైన మనిషిగా పరిణామం చెందే క్రమంలోనే మానవజాతి ఇంకా వుంది. నైతిక సత్యాల్లోంచే గాంధీ ప్రపంచాన్ని అర్థం చేసుకున్నారు. ఆ మార్గాన్ని అంటిపెట్టుకుని ఉండగలనని ఆయనే అన్నారు. నైతికమైన, ఆదర్శవంతమైన మార్గాల్లో తప్పనిసరిగా పరిమితులు ఎదురవుతాయి. గాంధీ ఇక్కడ గ్రహించని అంశం ఒకటివుంది. నైతికసత్యం అనేది మానవ సామర్థ్యాన్ని బయటపెడుతుంది. అయితే చారిత్రక సత్యం మానవ సాధ్యాసాధ్యాలను తెలియజేస్తుంది.

BRAOU

గాంధీయ విధానాలు మనిషి వ్యక్తిత్వంలోని ఒక పార్శ్వాన్నే వెల్లడిస్తాయి. గాంధీ పోరాట విధానాలు, రాజ్యం అధికారాలపై గాంధి అభిప్రాయాలు మానవహక్కుల పురోగతికి ఎంతో ఉపయోగపడగలవు.

## 14.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. రాజ్యం అధికారాలపై గాంధి అభిప్రాయాలు వివరించి, అవి సమకాలీన సమాజానికి ఎంతవరకు వర్తిస్తాయో చర్చించండి?

2. పౌర సమాజంపై గాంధీ అభిప్రాయాలు చర్చించండి?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. ఉదారవాద మార్క్సిజం - గాంధేయ విధానాల మధ్య తేడాను గుర్తించండి?

2. గాంధేయపోరాట విధానాలు వివరించండి?

BRAOU

# భాగం - 15 : లోహియ

**విషయక్రమం**

15.0 ఉద్దేశం
15.1 పరిచయం
15.2 లోహియ ప్రపంచ దృక్కోణం
15.3 ఏడు విప్లవాలు
15.4 పౌరహక్కులు
15.5 కులాలు - ఆంగ్లేయులు
15.6 ఫ్రాన్స్ దేశ పౌరహక్కులు
15.7 అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం
15.8 ఇంగ్లాండ్ దేశ పౌరహక్కులు
15.9 పౌరహక్కులు - రకాలు
15.10 పౌరహక్కులు ఎలా ఉద్భవించాయి.
15.11 పౌరహక్కులపై అంక్షలు
15.12 పౌరహక్కుల అతిక్రమణ
15.13 పౌరహక్కుల పరిరక్షణ
15.14 భారతదేశంలో చట్టాలు
15.15 ముగింపు
15.16 మాదిరి పరీక్షాప్రశ్నలు

BRAOU

## 15.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

- ప్రాపంచిక దృక్పథంపై లోహియ భావాలు, అందుకు రావాల్సిన మార్పుల గురించి తెలుసుకుంటారు.
- ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లాండ్ దేశాలలోని పౌరహక్కులను అర్థం చేసుకోగలుగుతారు.
- పౌరహక్కుల అణచివేత, అతిక్రమణ, పరిరక్షణల గురించి అవగాహన చేసుకుంటారు.

## 15.1 పరిచయం

ఈ యుగంలో ఉద్భవించిన చాలా కొద్దిమంది విశిష్టవ్యక్తులను ప్రపంచం గుర్తుంచుకుంటుంది. అటువంటి వారిలో రాంమనోహర్ లోహియ నిస్సందేహంగా ఒకరు. లోహియ మానవహక్కులను ప్రపంచ దృక్కోణం నుంచి చూసిన వ్యక్తి. ఆయనెప్పుడూ తాను గాంధేయవాదిని కానని - మార్క్సిస్టును అంతకంటే కానని అనేవారు. కానీ ఇరు సిద్ధాంతాల నుండి ఎంతో కొంత గ్రహించాననే చెప్పేవారు. లోహియ "ఆర్థికవ్యవస్థ కేవలం యంత్రశాస్త్ర సంబంధమైనది కాదు. జాతి, కుల, సంస్కృతి వంటి అంశాలు మానవచరిత్రను రూపొందించడంలో ప్రముఖ పాత్రను వహిస్తాయి". అని అభిప్రాయపడ్డారు.

## 15.2 లోహియ ప్రపంచ దృక్కోణం

వలసవాదం నుంచి పుట్టుకొచ్చిన మిగులు విలువ (surplus value) సూత్రాన్ని, మార్క్సిజాన్ని లోహియ తీవ్రంగా విమర్శించేవారు. పెట్టుబడిదారీ విధానం, వలసవిధానాలను ఆధారంగా చేసుకొని లోహియ ఒక క్రొత్త ఆర్థిక సూత్రాలను రూపొందించారు. పెట్టుబడిదారి, వలసవాదాల వల్ల ప్రపంచంలో ఒక ప్రక్క ధనం మూల్గుతూ ధనవంతులు దినదినానికి ధనవంతులవుతూ ఉంటే మరో ప్రక్క పేదవారు మాత్రం మరింత పేదవారుగా మారే ఈ వ్యవస్థ విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. అంతేకాకుండా పెట్టుబడిదారీ విధానం వల్ల వలస ప్రాంతాలన్ని గ్రామాలుగా మారుతున్నాయనే భ్రమను కల్పించి వారి ఆర్థికవిధానం మెరుగైనదని ప్రపంచప్రజలు సమ్మెలా చేసింది. ఈ వలసవాద, పెట్టుబడిదారి విధానాలు.

## 15.3 ఏడు విప్లవాలు

ప్రపంచంలోని పరిస్థితులు మెరుగయ్యేందుకు లోహియ ఒకటికాదు కనీసం ఏడు విప్లవాలు జరిగితీరాలని అన్నారు.

1. స్త్రీ పురుష సమానతలు రావాలి.
2. జాతి, తెగలు ఆధారంగా రాజకీయ, ఆర్థిక, మానసిక అసమానతలు వివక్షను ఎదిరించాలి.
3. కులవ్యవస్థ నిర్మూలన, అణగారిన కులాలకు మెరుగైన అవకాశాలు
4. వలసవాద పాలనా నిర్మూలన, దాస్య సృంఖలాల ఛేదన; ప్రపంచ ఐక్యపాలన
5. ఆర్థిక సమానత్వం; ఆస్తులపై హక్కు, ఉత్పత్తిలో సమానత
6. వ్యక్తిగత జీవితంలో ఇతరుల జోక్యం లేకుండా, వ్యక్తి స్వేచ్ఛను కాపాడుకోవడం.
7. సహాయ నిరాకరణ ఆయుధంగా, ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాటం. లోహియ పేర్కొన్న ఏడు తిరుగుబాట్లలో ఏడు సమకాలీన వ్యవస్థకు సంబంధించినవి, న్యాయ సంబంధమైనది.

BRAOU

" సహాయ నిరాకరణ అనేది వ్యక్తిగతమే కాకుండా అది ఒక వ్యవస్థకు ఎదురుతిరిగి పోరాటం చేయగల శక్తిగా ప్రజలలో ఉండే ఆయుధమన ప్రజలు తెలుసుకోవాలి.

ఇది 'తూటాకు - ఓటుకు' మధ్య పోటీకాదు. కేవలం తూటాకు - పౌరుల సహాయ నిరాకరణకు మధ్య తీవ్రమైన పోటీ ' అంతేకాకుండా' అహింస అనేది మన నైతిక విలువల్లోలా ఒకటిగా ఉన్నప్పుడే దాన్ని గురించి మనం వెంటనే ఆలోచించగలం. చాలామంది శాంతియుత పోరాటాన్ని సాగించాలి అని బోధిస్తారు. వారు నైతిక విలువల విషయం గురించి ప్రస్తావించరు" అని లోహియ అభిప్రాయపడ్డారు.

## 15.4 పౌర హక్కులు

పౌర, మానవ హక్కులు, రాజ్యాంగ విధాన రూపకల్పనపైన ఆయనకున్న అభిప్రాయాలను 1967 జూలై 21 జరిగిన లోకసభ ప్రసంగంలో స్పష్టీకరించారు. బారిస్టర్ నాథ్‌పాయ్ ప్రసంగిస్తూ "ఈ ఆర్టికల్‌ను అనుసరిస్తూ రాజ్యంగంలోని ఏదేని ప్రొవిజన్‌ను సవరించవచ్చు" అన్న మాటలను ఆధారంగా చేసుకొని లోహియ తన ఖచ్చితమైన అభిప్రాయాలను వెల్లడించారు. "ఇటువంటి విషయాలు చాలా ప్రమాదకరమైనవి అసలు హిట్లర్ ఆలోచనలకంటే ప్రమాదకరమైనవి" అని అన్నారు. ఎనేబ్లింగ్ బిల్ (Enabling bill) ద్వారా జర్మనీలోని మానవహక్కులను, ప్రజాస్వామ్యాన్ని

కూల్చిన హిట్లర్ వ్యూహాలతో సమానమని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా అసలు ఆ బిల్లు అమలులోకి రాకముందే రిచ్‌స్టాగ్ సభ్యులు (పార్లమెంట్) జైళ్ళకు తరలించబడ్డారు. వీరు సోషలిస్టు, కమ్యూనిస్టులు. అసలు హిట్లర్ ఎదురుగా, అసెంబ్లీ సభ్యుల ముందు నిలబడి సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తుందని చెప్పడానికే చాలాధైర్యం అవసరం. అలాంటి ధైర్యశీలి ఓల్‌వెల్స్. ఈయన హిట్లర్‌కు సమాధానం ఇవ్వగలిగారు. "రక్షణ లేకపోవడం ప్రతిష్ఠ లేకపోవడం కాదు" ప్రతిష్ఠ అనేది లోహియా దృష్టిలో వ్యక్తి స్వేచ్ఛ మీద ఆధారపడి ఉన్నందువల్ల పౌరహక్కుల ఉల్లంఘన కానీ వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లడమంటే వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయడమే.

1963లో ముద్రితమైన "పౌరహక్కులకై పోరాటం" అనే పుస్తకంలో లోహియ ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్భవించిన పౌరహక్కుల గురించి ప్రస్తావించారు. పౌరహక్కుల పుట్టుక, వాటి ఉద్దేశాన్ని చర్చించారు. రెండవ పర్యాయం ప్రచురితమైన ఇదే గ్రంథం ముందుమాటలో స్వాతంత్ర్య సమరంలో అండమాన్ జైలుశిక్షను అనుభవించిన దినేష్‌దాస్‌గుప్తా "లోహియ తన యవ్వనమంతా తన దేశ ప్రజలను దాస్య శృంఖలాల నుంచి రక్షించడానికి, దేశ పౌరులు తమ, పౌర, మానవ హక్కులను తెలుసుకుని పోరాడే విధంగా తీర్చిదిద్దడంలోనే గడిపేసారు" అని పేర్కొన్నారు.

## 15.5 కులాలు - ఆంగ్లేయులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని భారతప్రభుత్వం కులం, భాష, భూమికి సంబంధించిన లోహియ సిద్ధాంతాలను స్వీకరించడానికి ప్రయత్నించలేదు. సోషలిస్టు పార్టీ సభ్యులపై ఆంగ్లేయుల తీవ్ర చర్యలను చూసిచూడనట్లుగా ప్రవర్తించేది కాంగ్రెస్. ఫలితంగా ఎందరో సభ్యులు జైళ్ళకు తరలించబడటం, పోలీసుకాల్పుల్లో దుర్మరణం పాలవ్వటం జరిగేది. అసలు కులవ్యవస్థే ఈ సమాజంలో జరుగుతున్న అన్ని అన్యాయాలకు, అరాచకాలకు మూలకారణమని లోహియ అనేవారు. మనుధర్మంలోని స్త్రీ వివక్ష కూడా కులవ్యవస్థ పెంచి పోషించిన అంశమే. అలాగే ఆంగ్లభాష కూడా సమాచార సాధనంగా కాకుండా వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకునే సాధనంగా మాత్రమే వాడుకోవడం జరుగుతోంది అని వాపోయారు. అంతేకాకుండా లోహియ వీలైన ప్రతిచోట భారతీయ భాషలనే వాడాలని అన్ని ప్రభుత్వకార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రాంతీయ భాషనే ప్రయోగించాలని సూచించారు. ప్రాంతీయతత్వం కేవలం భాషలద్వారానే సాధ్యమని దీనివల్ల భూర్జువాలను నిర్మూలించి అత్యంత ప్రజాస్వామికంగా ప్రభుత్వం పనిచేయగలదని అన్నారు. అసలు ప్రభుత్వమే పేద, గొప్ప తారతమ్యాలను సృష్టిస్తోందని ధరలపెంపుదలను ఇందుకు సాధనంగా వాడుకొంటోందని అన్నారు.

## 15.6 ఫ్రాన్స్ దేశ పౌరహక్కులు

ఫ్రెంచ్ మానవహక్కుల లీగ్ 1898లో ఉద్భవించిందని, ఫ్రెంచ్ పౌరహక్కుల గురించిన అధ్యాయంలో లోహియ ప్రస్తావించారు. ఫ్రాన్స్‌దేశంలో విభ్రాంతి కల్గించిన 'డ్రెఫన్ కేస్' అసలు చట్టాలు అనేవి పనిచేసే విధానాన్ని సుస్పష్టం చేసింది.

డ్రెఫస్ కేసు' గా ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ప్రఖ్యాతిగాంచిన డ్రెఫస్ పన్నెండేళ్ళు చేయని నేరానికి జైలు శిక్షను అనుభవించారు. ఫ్రెంచ్ పౌరులు మానవహక్కుల లీగ్‌గా ఏర్పడి న్యాయాన్ని పొందేందుకు పోరాడారు. చివరకు న్యాయంగెలిచి డ్రెఫస్ విడుదలయ్యారు. ఈ కేసు మానవహక్కుల విలువలను ప్రజలందరూ తెలుసుకునేలా చేసింది. కేవలం పేరుకు జాతివాడైనంతమాత్రాన జీవించడానికి అనర్హుడని, ఒకవ్యక్తికుండే ప్రాథమిక హక్కులను కాలరాచే హక్కు ఎవరికీ లేదని లీగ్ ఎలుగెత్తి చాటింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, నినాదంగా చేసుకున్న ఫ్రాన్స్‌దేశంలోనే సదరు హక్కులు కాలరాచేటువంటి పరిస్థితులు వచ్చాయి. పౌరహక్కుల లీగ్ ఫ్రెంచ్ దేశస్తుల హక్కుల రక్షణలో ఎంతో కృషి చేసింది. అరెస్టులు, చట్టవ్యతిరేక నిర్బంధనలు వాక్ స్వాతంత్ర్య వంటి వ్యక్తిగత స్వేచ్ఛల అణచివేతలను తీవ్రంగా ఖండించి ఫ్రాన్స్‌పౌరులకు వారి హక్కులు తిరగి వచ్చేలా పోరాడింది లీగ్.

BRAOU

లీగ్‌కార్యకలాపాలను గురించి ప్రస్తావిస్తూ లోహియా "అన్యాయమనేది ఏరూపంలో ఎక్కడ జరిగినా ఎదిరించే శక్తిని , వ్యక్తిగత హక్కులు గానీ ఒక సమాఖ్య, సంఘం యొక్క హక్కులు గాని అణచబడే సమయంలో పౌరహక్కుల సంఘాలు కల్పించుకుని ఎదుర్కొనే అధికారాన్ని కల్గి ఉన్నారు. ఈ సంఘాలు కరపత్రాలు, చర్చలు, సమావేశాలు, బహిరంగ సభలద్వారా ప్రజల్లోకి తమ అభిప్రాయాలను చేర్చవచ్చు. అలాగే అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు పార్లమెంటుకు పిటిషన్లు, సమర్పించడం కరపత్రాలను పంచడం ద్వారా, చర్చలు, సమన్వయాల ద్వారా హక్కులను రక్షించేందుకు పాటుపడాలి.

ఫ్రెంచ్‌లీగ్ అంతవిజయవంతం ఎలాఅయిందో వివరిస్తూ "మానవ హక్కుల పరిరక్షణ అనే బాటలో ఒక్కొక్క మైలురాయినే దాటుకుంటూ తన లక్ష్యాన్ని చేరుకోగలిగింది. పౌరహక్కుల పరిరక్షణ మాత్రమే కాకుండా, పత్రికాస్వేచ్ఛ, సంఘాలు సమస్యలుగా ఏర్పడే స్వేచ్ఛ, న్యాయం వక్రీకరించినపుడు ఎదిరించేటటువంటి అనేక కార్యక్రమాల్లో కూడా పాల్గొనవచ్చు. దీనికి సుదీర్ఘమైన పరిధి ఉంది. ప్రజాస్వామిక విలువల సంరక్షణ, శ్రామికులకు తగిన వేతనం అందేలా చూడడం, నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించేందుకు పాటుపడడం, పెట్టుబడిదారుల, భూర్జువాల పెత్తనాన్ని ఓ కంట కనిపెట్టడం కూడా లీగ్ వ్యవహారాలే. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజాహక్కుల పరిరక్షణా సంఘాలు ఇటు ప్రజల హక్కులను పరిరక్షిస్తూనే, అటు ప్రభుత్వాలు చట్టసభలు హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకునేట్లు మరో కంటకనిపెడుతూ ఉండాలి అని అన్నారు.

## 15.7 అమెరికాలో పౌరహక్కుల ఉద్యమాలు

లోహియా అమెరికాలోని పౌరహక్కుల ఉద్యమంపై తన అభిప్రాయాలను తెలియజేస్తూ "పౌరహక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛకు గల ప్రాధాన్యతకు అమెరికా ప్రపంచదేశాలకు ఆదర్శం కాగలదు."

1930 ప్రాంతంలో జస్టిస్ హోమ్స్ "తిరుగుబాటుల్లో స్వాతంత్ర్యాన్ని పొందినవారు పిరికివారు ఏమాత్రం కాదు. వారు స్వేచ్ఛను పొందేందుకు ఎటువంటి క్రమాన్ని ఉల్లంఘించలేదు" అన్నారు.

పౌరహక్కులకు ఇంత ప్రాధాన్యత ఉన్నా అమెరికాలో సైతం న్యాయం వక్రించిందనడానికి నిదర్శనం మూని - బిల్లింగ్‌వేస్. 1916లో బాంబుదాడి జరిపారనే నేరారోపణలో కార్మిక సంఘ ప్రతినిధులైన మూని-బిల్లింగ్‌లను అరెస్ట్ చేసి దీర్ఘకాల జైలుశిక్షను విధించారు. అమెరికా వంటి దేశంలో సైతం కార్మికశక్తి, రైతు విప్లవాలను అణచివేసేందుకు పోలీసుబలగాలున్నాయి. మూని-బిల్లింగ్‌ల శిక్షను సమర్థిస్తూ అమెరికా దేశప్రముఖ పత్రికా సంపాదకుడు ఇలా వ్యాఖ్యానించారు, "అసలు వారు నేరస్థులా, కాదా ? అనేది, వారెటువంటి నేరాలను శిక్ష అనుభవిస్తున్నారనేది కాదు ప్రశ్న. అసలు అలాంటివారు చట్టం నుంచి తప్పించుకోవాలని మనం కోరుకుంటున్నాము ? దీనికి వ్యతిరేకంగా ఆలోచించి వారిని కట్టివేసాము.

అమెరికాలోని మానవహక్కులు ఎలా అణచివేయబడుతున్నాయో వివరిస్తూ... మనదేశంలో సమాజంలో హెచ్చుతగ్గులలో కులవ్యవస్థ ఎటువంటి పాత్రను పోషిస్తోందో అమెరికాలో జాతి వివక్ష అనేది సరిగ్గా అటువంటి పాత్రను పోషిస్తుంది. న్యాయ, పోలీసు వ్యవస్థల్లో ఈ వివక్ష వేళ్ళూనుకొని వుంది. అమెరికా పౌరహక్కుల సంఘాలు ఎటువంటి చర్యలు సామాన్య పౌరుల హక్కులకు భంగం వాటిల్లేలా చేస్తాయో వివరించారు.

1. ఆంగ్లో - సెక్సాన్ సంస్కృతి ఉన్నతమైనదిగా చాటేటువంటి అమెరికా సంస్కృతి పెంచిపోషించడం.

2. అమెరికా వాణిజ్య సంస్థలు వలసవాద వాణిజ్య సంస్థలకు వ్యతిరేకంగా ప్రభుత్వ సహాయంతో వాణిజ్యరంగంలోకి చొచ్చుకుపోవడం.

3. అమెరికా అధికారులతో పూర్తిగా నిండివున్న కేంద్రీకృత ప్రభుత్వ వ్యవస్థ.

BRAOU

(ఫెడరల్) రాజ్యాంగంలో మానవహక్కులు, పౌరహక్కులకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చినట్లు స్పష్టంగా పేర్కొని ఉన్నా కానీ అవి నిజజీవితంలో వక్రీకరించడాన్ని లోహియా ప్రశ్నిస్తున్నారు. 'అసలు లోపం ఎక్కడుంది. చట్టాలు సరిగా కూర్చబడలేదా ? లేదంటే అసలు పౌరహక్కులు, స్వేచ్ఛ అనేవి ఉద్భవించిన తీరు అటువంటిదా ? ఇవి భూస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధునిక పారిశ్రామిక వ్యవస్థకు మధ్య జరిగిన సంఘర్షణ నుంచి ఉద్భవించినందువల్ల ఈ రెండు వ్యవస్థలలోనూ తిరిగి పోరాడాల్సి వచ్చిందా? అంటే ఇటు రెంటిలోనూ అటు ఇంటిబయట పోరును ఎదుర్కోవాల్సి వస్తున్నందుకు కారణం ఏమై ఉంటుంది. ఎందువల్ల మానవహక్కులు దినదినానికి అణచివేయబడుతున్నాయి. అని తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు.

అమెరికా పౌరహక్కుల సంఘాలు "వ్యక్తి యొక్క అభిప్రాయాలను ఆధారంగా చేసుకొని శిక్ష విధించే అధికారం న్యాయవ్యవస్థలకు లేదు; అతని అభిప్రాయాలు ప్రభుత్వాన్ని కూల్చేటటువంటివైనా కానీ !" అని కోరాయి. పౌరకహక్కుల సంఘాల దృష్టిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనేవి కేవలం వాటిపై పట్టును కల్గిన వారికే వాటిని అనుభవించే వీలుంటుంది. అంటే ఎదుటివారి చేతిలోకి ఒక వ్యక్తి స్వేచ్ఛ చేజారిపోకుండా ఉండేంత వరకే అతడు వాటిని అనుభవించగలడు" అని పౌరహక్కుల సంఘాల గురించి లోహియ తన అభిప్రాయాలను వ్యక్తం చేసారు.

పౌరహక్కులు ఏవిధంగా కాలరాయబడుతున్నాయని శోధించి ఆ వ్యవస్థ పనితీరు గురించే కాకుండా ఇంకా అనేక కోణాలు స్పష్టమయ్యాయి. ఆర్థిక రాజకీయ వ్యవస్థల పనితీరు వెలుగులోకి వచ్చింది. అందువల్లే మానవహక్కుల నినాదం కేవలం (అదే పరిమితిలో పనిచెయ్యదు. అది మరింత లోతుకు చొచ్చుకువెళ్ళి సాంఘిక దురాచారాలను వెలికితీస్తుంది. అంటే పౌరహక్కుల పోరాటం పరోక్షంగా పాలనావ్యవస్థలు మార్పును కాంక్షించడమే కాకుండా పోలీసు యంత్రాంగం న్యాయవ్యవస్థ పనితీరును కూడా ప్రశ్నిస్తుంది.

## 15.8 ఇంగ్లాండ్ దేశ పౌరహక్కులు

ఇంగ్లాండ్ దేశ పౌరహక్కుల సంఘాల పనితీరును వివరిస్తూ సంఘాలు వ్యక్తిస్వేచ్ఛ పరిధి అత్రమణ; పోలీసు న్యాయవ్యవస్థ చట్టాలు, స్థానిక ప్రభుత్వం వంటి వాటికున్న న్యాయసమ్మతమైన అస్థిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవస్థలు స్వేచ్ఛా కూటములు, వాటిపనితీరును తీవ్రంగా అడ్డుకోవడం వల్లనే స్వేచ్ఛావిలువలు కొరవడుతున్నాయి. అని లోహియ అభిప్రాయపడ్డారు. అయితే ఈ సంఘాలు ఇటువంటి అణచివేతను చాలా ప్రమాదకరమైన సూచనగా వర్ణించాయి. వ్యక్తిస్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు, వాక్ స్వాతంత్ర్యాలను కాపాడుకునే సమయం ఇదే అని, అవి అణచివేయబడుతున్న సమయంలోనే స్పందించి వెంటనే ఎదురుతిరిగి వాటిని పరిరక్షించుకోవాలని ఈ సంఘాలు ఉద్బోధించాయి. ఈ నేపథ్యంలోనే బ్రిటిష్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీ (BBC) ప్రసారమయ్యే అంశాలు నిష్పాక్షికంగా, వ్యక్తిస్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం వాటిల్లేటువంటివి కాకుండా ఉండాలని, న్యాయపరమైన స్వచ్ఛమైన అభిప్రాయాలను మాత్రమే ప్రసారం చేయాలని ఈ సంఘాలు పేర్కొన్నాయి.

ఒక అభిప్రాయాన్ని సెన్సారు చెయ్యడం వల్ల ప్రాథమిక హక్కులు అనేవి ఆదిలోనే అణచబడుతున్నట్లు తేటతెల్లమవుతోంది. అంటే అభిప్రాయ వ్యక్తీకరణలో స్వేచ్ఛలేకపోతే ఇక ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లనట్టే కదా!

స్త్రీ పురుషులు వారికి సంబంధించిన న్యాయసమ్మతమైన, ప్రాథమిక హక్కులను ఎవరైనా కానీ అతిక్రమించి వ్యక్తి హక్కులకు భంగం వాటిల్లేలా ప్రవర్తించినట్లైతే వాటిని కాపాడుకునేందుకు ప్రాంతీయ, కేంద్రీయ స్వేచ్ఛ సంఘాలు శ్రమిస్తాయి.

భారతదేశంలోని పౌరహక్కుల గురించి ప్రస్తావిస్తూ "పౌరహక్కులు అణచివేత అనేది కేవలం చట్టాలు కట్టుదిట్టంగా లేకపోవడం వల్లనే సాధ్యమవుతోంది. న్యాయవ్యవస్థలోని లోపాలు, లొసుగులు కూడా స్పష్టంగా కనబడుతున్నవి. కేవలం ఊహాతీతమైన స్పందనలో న్యాయం వెలువడుతోంది. పోలీసువ్యవస్థ పనితీరు తెలిసిందే. హింసను ఒకందుకు పెంచిపోషిస్తున్నాయి. దాంతో ఏ ఒక పౌరహక్కు కూడా పరిరక్షింపబడుటం లేదు. మన పోలీసు వ్యవస్థ పనితీరు



BRAOU

అమెరికా నౌకాదళ పనితీరు కంటే హీనంగా వుంది. క్రింది తరగతి ఉద్యోగులే చట్టాలను అమలు పర్చేస్తారు. ఉన్నతాధికారుల సంగతి ఇక ప్రస్తావించనే అక్కరలేదు." అని తన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పారు లోహియ.

లోహియాకు పౌరహక్కులపై ఉన్న అవగాహన నేరాల సైద్ధాంతిక పరమైనదే కాకుండా ఆయన జీవితంలో చాలా సమ్మిళితమై ఉన్నట్లు తోస్తోంది. ఆయన దృష్టిలో కులం, లింగం, స్వేచ్ఛ, పేదరికం, కొనుగోలుశక్తి, పనిచేసే హక్కు, విద్య, ఆరోగ్యం వంటి విభిన్న అంశాలన్నీ పౌరహక్కుల ఉద్యమంలోని వివిధ అంశాలే !

## 15.9 పౌరహక్కులు - రకాలు

పౌరహక్కులు ఎన్ని విధాలు ? అవి ఎలా ఉద్భవించాయి ? అసలు వాటికి భంగం ఎందుకు వాటిల్లుతోంది? వాటిని మనం ఎందుకు రక్షించుకోవాలి ? అని లోహియ ప్రశ్నిస్తారు.

పౌరహక్కులు ఎన్ని రకాలు ? రాజ్యాంగ నిర్మాతలు, చట్ట న్యాయవ్యవస్థ నిర్మాతలు కొన్నిటిని సూత్రీకరించారు. ఈ సూత్రాలు అనేక విధాలుగా పౌరహక్కులతో సంబంధం కలిగి ఉన్నాయి. వీటన్నిటిలోకి ముఖ్యమైనది మానవుని స్వేచ్ఛ, అతని అస్థిత్వానికి భంగం వాటిల్లకుండా ఉండటం.

"రాజ్యాంగం యొక్క ముఖ్యవిధి మానవుని ప్రాథమిక హక్కులకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా పరిరక్షించడం. వీటిని మనం స్వేచ్ఛ, ఆస్తుల పరిరక్షణ, అణచివేతకు గుర్తికాకుండా ఉండటంగా విభజిస్తున్నాము" అని 1789లో రాయబడిన ఫ్రెంచ్ రాజ్యాంగంలో స్పష్టంగా వివరించారు.

న్యాయపరమైన విధులను జరుపకుండా ఏ ఒక వ్యక్తిని బంధించడం, నిర్బంధించడం, జైలుశిక్షను విధించడం చేయరాదు. విచారణ, నిజానిజాలను వెలికితీసి, శిక్షార్హులకు శిక్ష విధించే అధికారం కేవలం న్యాయవ్యవస్థకు మాత్రమే ఉంది.

1. ప్రతివ్యక్తి తన నివాసగృహంలో స్వేచ్ఛగా జీవించే అర్హతకల్గి ఉన్నాడు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినప్పుడు విచారణ నిమిత్తం అతని ఏకాంతాన్ని భంగపరచి గృహాన్ని శోధించే అధికారం, ఆ వ్యక్తిని అరెస్టు చేసే అధికారం తప్ప మరెటువంటి పరిస్థితుల్లోనూ ఒక పౌరుని స్వేచ్ఛను నిర్దేశించే అధికారం ఎవరికీ లేదు. ప్రతిపౌరుడు స్వేచ్ఛగా ఒక దేశం నుంచి మరొక దేశానికి ప్రయాణాన్ని సాగించే వీలును కల్పించాలి.

2. ప్రజలు అన్ని విధాలా చైతన్యవంతులవుతున్న నేపథ్యంలో వాక్ స్వాతంత్ర్యానికి మల్లే స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేయడం, సభలు, సమావేశాలు నిర్వహించడం కూడా వ్యక్తి స్వేచ్ఛ వంటి ముఖ్యమైన అంశాలుగా పరిగణిస్తున్నారు. అమెరికా వంటి దేశాల్లో వాక్ స్వాతంత్ర్యానికి అత్యంత ప్రాముఖ్యం ఉంది. ఆ దేశంలో ఏ పౌరుడైన తన అభిప్రాయాలను నిర్భయంగా, నిక్కచ్చిగా వెల్లడించవచ్చు. అది కేవలం అత్యంత విప్లవాత్మకమైన చర్యగా గుర్తించబడినప్పుడు తప్ప అతని భావవ్యక్తీకరణను ప్రశ్నించే అధికారం, ఎవరికీ లేదు. ఇంగ్లాండ్‌లోని పౌరులకు సభలు, బహిరంగ సభలు నిర్వహించడంలో ఊరేగింపులు నిర్వహించడంలో పూర్తి స్వేచ్ఛ ఉంది. ఇటువంటి కార్యక్రమాల వల్ల ఇతరుల స్వేచ్ఛకు భంగం వాటిల్లినప్పుడో లేదా రాకపోకలకు ఇబ్బందులు కల్గినపుడు మాత్రమే పోలీసులకు జోక్యం చేసుకునే అధికారం ఉంది. సెక్షన్ చట్టాలను, పత్రికా స్వేచ్ఛ, పుస్తక ప్రచురణ, తపాలా, రేడియో ప్రసారాలపై ఆంక్షలను రద్దు చేయాలని కోరింది. సభలు సదస్సుల నిర్వహణ మీద కూడా ఆంక్షలను ఎత్తివేయాలని, సభలు నిర్వహించేందుకు ప్రతి పౌరునికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇవ్వాలని చట్టం, న్యాయం దృష్టిలో పౌరులందరూ సమానమే అని గ్రామాల్లో, పట్టణాల్లో జరిగేటువంటి సాంస్కృతిక ఉత్సవాల వంటి సభల నిర్వహణను ప్రోత్సహించాలనేవి.

3. వ్యక్తి స్వేచ్ఛ వ్యక్తి యొక్క అభిప్రాయాల వ్యక్తీకరణలో స్వేచ్ఛ అనే రెండు విభిన్న అంశాలైన పౌరహక్కులు నానాటికీ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటున్నాయి. సభలు, చట్టాల ద్వారా ప్రజల్లోకి పాలనా వ్యవస్థపై ఒక

BRAOU

అవగాహన కలిగి ప్రభుత్వ విధానాలైన ఆర్థికరంగం వంటి విషయాల్లోని అవకతవకలను గుర్తించి వాటిని ఎదుర్కొనేశక్తి లభిస్తుంది. ప్రాథమిక హక్కుల పరిరక్షణకు సమ్మెలు, హర్తాళ్ళను చేసేటువంటి హక్కులను కల్పించడం వల్ల శాంతి కొరవడుతుందని ప్రజలు తిరుగుబాటు చేసే అవకాశాలున్నాయంటూ అటువంటి హక్కులను కల్పించేందుకు వ్యతిరేకించడమే కాకుండా సమ్మెలను అణచివేసేందుకు బహిరంగపరచి, వాటిని ఎదిరించే హక్కును కూడా పౌరులు కలిగి ఉన్నారు. అంతేకాకుండా యాజమాన్యాల నిరంకుశవైఖరులను ఎదిరించేందుకు సమ్మెలను నిర్వహించి హక్కులను సాధించుకోవచ్చు.

4. ఫ్రెంచ్ రాజ్యాంగంప్రకారంప్రభుత్వం ప్రజల కోరికకు కట్టుబడి పనిచేయాలి. ప్రజాస్వామ్య రీతిలో ప్రజలకోరికలకు భంగం వాటిల్లకుండా అమలుపర్చాలి. ఇది అత్యంత ముఖ్యమైనదిగా దీనినే పౌరహక్కులుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఏవిషయంలోనూ రహస్యంగా వ్యవహరించకూడదు. ప్రజాస్వామికంగా ఎన్నికైన సభ్యులలో చర్చల అనంతరమే ఎటువంటి నిర్ణయాన్నైనా అమలు పర్చాలి. ప్రపంచంలోని పలు పౌరహక్కుల సంఘాలు ప్రభుత్వం పరిపాలనా అంశాలు నిర్ణయాత్మక వ్యూహాలను క్రమబద్ధం చేసే హక్కు ఉంది.

5. వర్ణప్రాతిపదికన గల జాతుల హక్కుల సంరక్షణ అంశాలు కూడా పౌరహక్కుల క్రిందనే వస్తాయి. జాతి, తెగలను వేరు చేసి వారిని అల్పసంఖ్యాకులుగా విభజించడం మౌలిక హక్కులను అందనివ్వకుండా చేయడమే. న్యాయాన్ని కల్పించడంలో కూడా పక్షపాతవైఖరిని ప్రదర్శించడం ప్రాథమిక హక్కులను అందనివ్వకుండా చేయడమే. ఇటువంటివి దృష్టిలో పెట్టుకునే అమెరికాలో నీగ్రో జాతీయులకు, బ్రిటీష్, ఫ్రెంచ్‌దేశాల్లో వలసవాద ప్రాంతాల వాసులకు ప్రత్యేక హక్కులను కల్పించారు.

6. భావ స్వాతంత్ర్యం వచ్చిన విద్యను పొందే హక్కులు కూడా పౌరహక్కులే. ప్రతి పౌరునికి అతనికి నచ్చిన అంశాలలో జ్ఞానాన్ని సముపార్జించుకునే స్వేచ్ఛకలదు. అంతేకాకుండా ప్రతివిషయంపై అతడికి కల్గిన అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించే హక్కు ఉంది. ఉదాహరణకు ఒక ఉపాధ్యాయుడు పాలనా యంత్రాంగంపై తన అభిప్రాయాలను వెల్లడించనందువల్ల ఉద్యోగంలో నుంచి తొలగించడం వ్యక్తి - భావస్వేచ్ఛకు అంతరాయం కల్గించడమే అవుతుంది.

7. రాజకీయ ఖైదీలను విడుదల చేయమని కోరడం కూడా పౌరహక్కులలోని అంశమే. చాలా కేసులు ప్రభుత్వ పక్షంగానూ, ప్రజలకు వ్యతిరేకంగాను నిర్ణయించబడి, శిక్షలు అమలు జరుపబడతాయి. రాజకీయ నేరస్థులుగా ముద్రింపబడినవారు బలీయమైన న్యాయ, రాజకీయ వ్యవస్థతో తలపడాల్సి ఉంటుంది.

అందువల్లనే ఇటువంటి విషయాల్లో మానవ, పౌరహక్కుల సంఘాలు చొరవచూపించి రాజకీయ ఖైదీల తరపున వాదిస్తూ వారికి అవసరమైన అంశాలను ప్రభుత్వం, న్యాయస్థానం దృష్టికి తీసుకువస్తాయి. ఇటువంటి అంశాల్లో రాజకీయ ఖైదీలకు అవసరమైన ఆహారం, వసతి మెరుగ్గా ఉండాలని శిక్ష అమలులో సడలింపులను, జ్ఞాన సముపార్జనకు సంబంధిత వసతులను కల్గించడం వంటి విషయాలను కోరడం పౌరహక్కు సంఘాల విధులే !

## 15.10 పౌర హక్కులు ఎలా ఉద్భవించాయి ?

'పౌర హక్కులు' అనేవి ప్రజల చిరకాల సంఘర్షణ నుంచి ఉద్భవించిన స్వేచ్ఛా కాముకులకి ప్రతిరూపం. ఏ చరిత్ర చూసినా రాజ్యపాలనా వ్యవస్థ తన కబంధహస్తాలతో ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను నలిపివేసిన ఉదాహరణలే కనపడతాయి. అధిక పన్నులతో ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే ప్రభుత్వం కాని, శ్రమకు తగ్గవేతనాలను చెల్లించలేని భూస్వామ్య వ్యవస్థ కానీ ప్రజల వ్యతిరేకతలను చవిచూసినవే. ఈ వ్యతిరేకతని ప్రదర్శించే క్రమంలో ప్రజలకు వున్న

BRAOU

మౌలిక హక్కులను కాలరాసి వారిని నిస్సహాయులుగా చేసి వ్యవస్థ నుంచి శాశ్వతంగా స్వేచ్ఛను పొందినవే ఈ హక్కులు. ప్రభుత్వాన్ని ఎదిరించిన పౌరుడి జీవితం ఒక దుర్భరప్రాయమే. పాలించే ప్రభువు హృదయాన్ని బట్టి శిక్షలు కూడా ఉంటాయి. కొన్నిసార్లు ఎదురుతిరిగిన పౌరుడికి యావజ్జీవ కారాగార శిక్షపడితే మరికొన్నిసార్లు మరణశిక్షనే విధిస్తారు. ఈ విధంగా సామాన్యమానవుని విలువైన స్వేచ్ఛను హరించేవి ప్రభుత్వాలు.

అటువంటి వ్యవస్థతో పోరాడేందుకు తగినశక్తి అవసరమయింది. ఈ శక్తి కేవలం పౌరహక్కుల ద్వారా లభిస్తుంది. జీవించే హక్కును సైతం ప్రశ్నించేటువంటి ప్రభుత్వాన్ని నిలదీసే అస్త్రాలుగా హక్కులను ఉపయోగించి ప్రతివ్యక్తి విజయాన్ని పొందగలడు.

ప్రతిదేశపు పౌరహక్కుల ఉద్భవం వెనుక నిరంకుశపాలన అణచివేత, ఆర్థిక అసమానతలే కారణాలుగా కపడతాయి. అమెరికా, ఫ్రెంచ్ దేశాల రాజ్యాంగాలు, ఆంగ్లేయుల బిల్ ఆఫ్ రైట్ ఇందుకు నిదర్శనాలు. నరకకూపాలను తలపించేటువంటి కారాగారాల నిర్మాణం, చేయని నేరానికి కూడా కఠినాతికఠినమైన శిక్షలు విధించి సామాన్య పౌరులతో వాటిని నింపడం అనేది కేవలం హక్కులు అందనివ్వకుండా అణచివేయడమే ! తమ హక్కుల విలువను గ్రహించి చివరకు ఆ నరకకూపాలను కూలద్రోసి సర్వమానవ సౌభాతృత్వంసమసమాజస్థాపనకు ప్రజలు శ్రీకారం చుట్టారు. అనిరంకుశ ప్రభుత్వాలతో పోరాడి వాటి శిథిలాలపై పౌరహక్కుల సౌధాన్ని నిర్మించారు.

ఇలా ఉద్భవించిన పౌరహక్కులు సమాజ పురోగతిని సుగమనం చేసి అభివృద్ధి గమ్యానికి మార్గం కాగలిగాయి. కానీ కొన్ని శక్తులు అభివృద్ధి పథం వైపు పయనిస్తున్న సమాజానికి అడ్డుగోడలుగా నిలుస్తూ దాని తిరోగమనానికి కారకాలు అయ్యాయి. అయితే ఈ శక్తులు రాజ్యంపై పట్టును సాధించి పాలనను నియంత్రించగలిగాయి.

## 15.11 పౌరహక్కులపై ఆంక్షలు

పౌరహక్కులను నియంత్రించే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి. దీనికి లోహియ సమాధానం చాలా ప్రస్ఫుటంగా ఉంది.

"నేడు ప్రజానీకం పాలన వ్యవస్థ, మిథ్యా అభివృద్ధి మధ్య కొట్టుమిట్టాడటం మనం గమనిస్తున్నాము. బ్రిటీష్ వారి ఆధీనంలోని వలస ప్రాంతాలు కానీ ఇంపీరియల్ దేశాల్లోని పాలనకు, ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు ధ్వజమెత్తి తమ నిరసనను ప్రదర్శించారు. వలస పాలనలో ప్రజలు పడే కష్టాలు వర్ణనాతీతం. ప్రజలకు అవసరమైన పని కల్పించడంలో సాంస్కృతికాభివృద్ధిలో ఏమాత్రం పురోగతి లేకుండా ప్రజలను నానాటికీ మరింత దౌర్భాగ్యుల్ని చేయడంలో ఎటువంటి సాధనాన్ని వదలలేదు. ప్రజలను హింసించి వారిపై ప్రచ్ఛన్నయుద్ధాలను తలపెట్టింది. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం సమాజ స్థితిగతుల మార్పుకోసం, అర్రులు చాచారు. అయితే ఇది కేవలం తిరుగుబాటు వల్లనే సాధ్యమని గ్రహించిన ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగసభలు, చర్చలు, సమ్మెలు నిర్వహించి అంధకారంలో ఉన్న ప్రజల్ని చైతన్యవంతులుగా చేసి వారి నూతన సమసమాజ స్థాపన కార్యక్రమానికి నాంది పలికారు.

వలసవాద రాజ్యాల నుంచి స్వాతంత్ర్యాన్ని పొందాలనే పోరాటంలో సోషలిస్ట్, కమ్యూనిస్ట్ పార్టీలు చాలా శ్రమించాయి. ఈ పార్టీలు ప్రత్యామ్నాయ పాలనను, కార్మిక కర్షకుల కోరికలను సాధించేందుకుగాను ఎన్నోరకాల ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. వీటిని ప్రభుత్వాలు మాత్రమే కష్టాలకు గురి చెయ్యలేదు. భూస్వామ్య వలసవాద ప్రభుత్వాలు, ఆర్థికబలం, అంగబలం కల్గిన అన్ని శక్తులు దాడిచేసాయి. ఈ పార్టీల ముఖ్యసిద్ధాంతాలలో ఒకటైన పౌరహక్కులను కాలరాయడమే కాకుండా తిరుగుబాటు చేసే ప్రజల కొమ్ము వంచడానికి హక్కులు అనేవి లేకుండా చేయడమే శిక్షగా ప్రజలను అణచడంలో దీన్ని సాధనంగా ఉపయోగించాయి ఈ వలసవాద భూస్వామ్య శక్తులు.

మనదేశంలో పౌరహక్కులను మత, ఆర్థిక, రాజకీయ ప్రాతిపదికన విభజించ ప్రయత్నించారు. కానీ ఇటువంటి గౌరవసూచకాలు కేవలం తప్పుడు అభిప్రాయాల వల్ల ఏర్పడినవే. హక్కులనేవి వ్యక్తికి సంబంధించినవి కానీ కుల,

BRAOU

మత, ఆర్థిక రాజకీయ ప్రాతిపదికలే ముఖ్యంగా ఏర్పడినవి కాదు. పౌరహక్కులు, వాటి పరిరక్షణ అనే విషయాలు ప్రభుత్వాలు వ్యక్తి అస్థిత్వాన్ని కాపాడటంలో విఫలమైనప్పుడే చర్చకు వస్తాయి. రాజ్యం ఒక వ్యక్తిగానీ లేదా ఒక సంఘం యొక్క స్వేచ్ఛను నియంత్రించినప్పుడే ప్రజలు ఐక్యమై వారి హక్కుల సంరక్షణకు పూనుకుంటారు. రాజ్యానికి వ్యతిరేకంగా జరిగే ఈ ప్రజాపోరాటాన్ని అణచడానికి సిద్ధపడుతుంది ప్రభుత్వం. దీని వెనుక కేవలం విమర్శలు, తిరుగుబాటును సహించలేని దృష్టి మాత్రమే కాకుండా ప్రజలపై పూర్తి అధికారాన్ని ప్రదర్శించాలనే వైఖరి కూడా ముఖ్యమైనది.

## 15.12 పౌరహక్కుల అతిక్రమణ

పౌరహనక్కులను ఎలా ఉల్లంఘిస్తారు అనే ప్రశ్నను లేవనెత్తారు లోహియ. మొదటిగా నిర్బంధించడం, ఇంటిని సోదా చేయడం, సెన్సార్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (code of criminal procedure) వంటి అన్ని చట్టాలు ప్రపంచం అంతటా వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కల్గించేవే! ఇటువంటి చట్టాలు ప్రజలపై అధికారాన్ని చెలాయించాలనే ప్రతీకార కాంక్షతోనో ప్రజలకు వీటివల్ల న్యాయం జరక్కుండా ఉండేందుకే తెలిసీ అస్పష్టంగా, లొసుగులతో రూపొందించినవై ఉంటాయి. ఈ చట్టాలు పౌరుడిని అకారణంగానే అధికారానికిలోబడి ఉండేలా సృష్టించబడినవి. తర్వాత, ప్రపంచం అంతటా కార్యనిర్వాహక వర్గం న్యాయ వ్యవస్థచేతిలోనే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయి. స్వేచ్ఛను ప్రసాధించడమూ, అణచడమూ అనేది కేవలం వీరిచేతిలోనే ఉన్నాయి. అకారణంగా శిక్షలు విధించడం, అసమానమైన శిక్షలను విధించడం చాలాసార్లు చేయని నేరానికి శిక్షలు విధించబడటం కూడా ఇందువల్లనే సంభవిస్తున్నాయి. ప్రభుత్వం ఎప్పుడూ నిజజీవితంలో సులువుగా అమలుపర్చడానికి వీలులేని అసలు ఏ న్యాయస్థానంలోనూ సవాలు చేయలేనటువంటి శాసనాలను జారీ చేస్తుంది. తప్పుడు ప్రజాభిప్రాయాలను సేకరించి కార్యనిర్వహణలో అవకతవకలకు పాల్పడుతుంది. అంతేకాకుండా, పోలీసు వ్యవస్థ వ్యక్తి స్వేచ్ఛను పూర్తిగా నియంత్రించేదిగా రూపొందింది. నేరస్థుల నుండి విషయాన్ని రాబట్టేందుకు చీకటి కొట్లలో థర్డ్ డిగ్రీ మెథడ్ (అత్యంత క్రూరమైన పద్ధతులు)లను ఉపయోగించి న్యాయాన్ని తన చేతిలోకి తీసుకొంటుంది. దీనికి కేవలం నిందితుడి నుంచి నిజాన్ని రాబట్టేందుకు ఉపయోగించే సాధనం అనే భూటకపు పేరు నిజానికి ఇది ప్రజల ప్రాథమిక హక్కులను అణచడానికి పోలీసువ్యవస్థ చేతిలోని సాధనం. చట్టవ్యతిరేకమైన నిర్బంధాలు, బెదిరింపులు హెచ్చరికలనేవి చాలా మామూలు విషయాలు.

చివరగా, ప్రభుత్వానికి కానీ కార్యనిర్వహక వర్గానికి గానీ సంబంధించిన వ్యక్తులు పౌరహక్కులు అతిక్రమించడానికి అనుమతి ఉంది. ఇది బంధు ప్రీతికి నిదర్శనం. ముఖ్యంగా గ్రామ, నగర స్థాయిలో ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలు నిరంతరం సాగిపోతూనే ఉంటాయి.

అయితే పైన వివరించిన నాలుగు రకాల చట్టఅతిక్రమనచర్యలు పౌరుని స్వేచ్ఛను నిరోధించేవే. ఇటువంటి నిరోధకాల గురించి ప్రజల్ని కరపత్రాల ద్వారా, సభలు సధస్సుల ద్వారా, ప్రచార సాధనాల ద్వారా చైతన్యవంతుల్ని చేయాలి. తన హక్కులతో ఎటువంటి విజయాన్ని సాధించవచ్చో తెలియక పౌరుడు ఉద్యోగం నుంచి బహిష్కరించబడటం, పోలీసు చేతుల్లో నరకాన్ని అనుభవించడం, చేయని నేరానికి కఠినాతికఠినమైన శిక్షలను అనుభవించాల్సి వస్తుంది.

## 15.13 పౌరహక్కుల పరిరక్షణ

అసలు పౌరహక్కులను ఎలా కాపాడుకోవాలి? లోహియ అభిప్రాయం ప్రకారం ప్రపంచ పౌరహక్కుల సంఘాలు ప్రపంచం నలుమూలల విస్తరించి ప్రజలకు అత్యంత అవసరమైన న్యాయపరమైన, చట్టపరమైన సంరక్షణ పొందే మార్గాలను తెలియచేయడంలోనూ, వారిని చైతన్యవంతుల్ని చేయడంలో నిమగ్నమై ఉన్నాయి. అంతేకాకుండా ప్రతిప్రాంతంలోనూ వాలంటీర్లు కరస్పాండెంట్లను నియమించి పౌరహక్కులకు భంగం వాటిల్లినటువంటి కేసులను

BRAOU

తీసుకుని పకడ్బందీగా ఎదుర్కొని విజయాన్ని సాధించేలా వాదనను రూపొందిస్తున్నాయి. బాధితుల తరపున వాదించేందుకు గాను అత్యంత అనుభవజ్ఞులైన మేధావుల, సహాయం, రచయితల, సంఘ సేవకుల సహాయాన్ని కూడా ఇవి కల్పిస్తాయి. అలాగే జాతీయ కేంద్రాలు సమావేశాలు, సభలు, చర్చలు, ఊరేగింపులు వంటివి నిర్వహించి ప్రజల దృష్టిలోకి ఒక సమస్య వెళ్ళేలా చేసి, ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం పూనుకునేలా వత్తిడిని తెస్తాయి. కొన్ని కేసులలో అవసరమైన పబ్లిక్ ఎంక్వైరీలు, ఉచిత వాదనలను కూడా కల్పిస్తుంది. ముఖ్యంగా రాజకీయ ఖైదీలకు అవసరమైన లీగల్ డిఫెన్స్‌నుకూడా కల్పిస్తుంది. పౌరహక్కులసంఘంలోని ప్రచార విభాగం ప్రజల దృష్టిని ఆకర్షించేటువంటి కరపత్రాలు, బ్రోచర్లు, పత్రికావ్యాసాలు, చిన్నచిన్న పుస్తకాలను కూడా ప్రచురిస్తుంది.

అసలు పౌరహక్కులను ఎందుకు పరిరక్షించుకోవాలి?

ఈ ప్రశ్న కారణం లేకుండా ఎవరూ ప్రశ్నించాలనుకోరు, అసలు మనహక్కులను ఎందుకు కాపాడుకోవాలి. మీకే కనుక అధికారం ఉంటే మా హక్కులకు రక్షణ కల్పిస్తారా? ఈ ప్రశ్న కూడా కేవలం వారి హక్కులకు భంగం వాటిల్లిన వ్యక్తి మాత్రమే వేయగలడు. లేదా తన హక్కును పరిరక్షించుకునేందుకు అతడు చేసే పోరాటాన్ని ఆపివేయమని సలహాను ఇవ్వడుగానీ, బుజ్జగింపు మాటలనుగానీ మాట్లాడగలరు. అయితే హక్కువిలువ తెలిసిన వారు ఇటువంటి యుక్తుల ముందు తల ఒగ్గరు. పురోభివృద్ధి సాధించడానికి సంప్రదాయవాదులు, మితవాదులు, అతివాదులు సైతం పౌరహక్కుల పరిరక్షణకే పూనుకుంటారు.

అతివాదులు మాత్రం పౌరహక్కుల పరిరక్షణ అనే అంశాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. అసలు పౌరహక్కులు అణిచివేయబడినపుడు తిరిగి వాటిని పరిరక్షించుకునే మార్గమే ఉండదు. ఎందుకంటే అణచివేత వెనుక ఎప్పుడూ రాజకీయబలందాగి ఉంటుంది కనుక. ఎప్పుడూ అధికార బలంలోనే అణచివేత సాధ్యమవుతుంది. అయితే ఇటువంటి అణచివేతను విమర్శించినపుడో లేదో అధికారాన్ని ప్రశ్నించే మరో అధికారం ఉన్నపుడు మాత్రమే హక్కులు కొంతవరకు పరిరక్షింపబడుతాయి. అంటే వాటిని కుల్రదోసినపుడు మాత్రమే పరిరక్షింపబడతాయి అని అతివాదుల వాదన. అంటే అణచివేయబడిన హక్కులు కేవలం వేరొక క్రొత్తపాలనలో మాత్రమే సంరక్షింపబడుతవే కానీ ఏ రాజ్యాధికారంలో భంగం వాటిల్లినదో తిరిగి అదే అధికారంలో మంచి జరుగుతుందనేది కల్ల అని అసలు హక్కుల పరిరక్షణకు కాకుండా వేరొక క్రొత్త ప్రభుత్వాన్ని స్థాపించడానికి ఆ శక్తిని ఉపయోగించాలని అతివాదులు తీవ్రంగా వ్యక్త పరుస్తున్నారు.

BRAOU

పౌరహక్కులు ప్రజల జీవనానికి వెన్నెముక వంటివి.. అన్యాయాన్ని ఎదిరించేందుకు పౌరహక్కు సంఘాలు ప్రజలనమ్మకాన్ని చూరగొనాలి. ప్రతిసామాన్య పౌరుడు తనకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించి, పోలీసుయంత్రాంగాన్ని ప్రశ్నించి తన హక్కులను వినియోగించుకొని ఇతరుల దృష్టిని ఆకర్షించడమే కాకుండా వారితో కూడా వినియోగించుకోవాలనే ఉత్సుకతను పెంచి హక్కుల శక్తిని తెలిసేలా చేయగలడు. ఇలా అభివృద్ధి పథంవైపు సాగడానికి పౌరహక్కులు శక్తిమంతమైన సాధనాలను ప్రజలు తెలుసుకుంటారు.

పౌరహక్కుల సాధనకోసం జరిపే పోరాటంలో ప్రజలు ముందుగా రాజకీయాధికారాన్నే ప్రశ్నిస్తారు. ఎందువల్లంటే ఇదే అన్ని సమస్యలకూ మూలబిందువు కనుక. అమెరికాలో జరిగిన గ్రామీణపోరాటం కూడా అక్కడి ఆర్థిక రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే. ప్రజల వ్యతిరేకత లేకపోతే అక్కడి పరిస్థితులు సజావుగానే ఉన్నాయనే అభిప్రాయమే ఉండేది. దానివల్ల అభివృద్ధి కొరవడి ప్రజలు మరిన్ని కష్టాలు పడవలసి వచ్చేది. అంటే ఒక సమస్యను పరిష్కరించాలనేప్పుడు దానిలోతులోకి వెళ్ళినపుడే సమస్య అర్థమవుతుంది, పరిష్కారం లభిస్తుంది. ఒక వ్యక్తికి కల్గిన సమస్యని నిర్మూలించేటపుడు ఆ సమస్య ఎందుకు కల్గిందో తెలుసుకుంటాం. వెంటనే అక్కడి రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు కారణమని తేలినపుడు వీటన్నిటినీ శాసించే అధికారమైన రాజకీయ వ్యవస్థను ప్రశ్నించాల్సి ఉంటుంది. అంటే ఇది కేవలం ఒక పౌరుని సమస్య మాత్రమే కాకుండా యావన్మందికీ సంబంధించిన సాంఘిక సమస్య అని పౌరహక్కులు కూడా మొత్తం సమాజానికి అవసరమైన అస్త్రాలని అర్థమవుతుంది. అలాగే పౌరహక్కుల స్వాతంత్ర్య పోరాటానికి అభివృద్ధి పథంలో పయనించేందుకు కూడా సాధనాలనే విషయాన్ని కూడా గ్రహించాలి.

స్వాతంత్ర్యం....అభివృద్ధి అనే అంశాల ప్రాధాన్యతను గురించి ఏకాభిప్రాయం లేకపోవచ్చు కానీ పౌరహక్కులు అతిముఖ్యమైనవే అని అందరూ అంగీకరించాల్సిందే! ఈ అభిప్రాయం చాలా ధృఢమైనదే కాకుండా రాజ్యాధికారాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని కూడా కలుగచేస్తుంది.

అయితే పౌరహక్కుల పరిరక్షణ అనేది రాజ్యాధికారంతో మాత్రమే సంభవం అనేది అసత్యం. ఈ వాదం కేవలం ఆ కాలంలో ఉన్న అధికారం నేలకూలినపుడే హక్కులు రక్షింపబడుతాయనే విషయాన్ని తెలుపుతుంది. కానీ ఈ అభిప్రాయం పాక్షికంగా మాత్రమే సరైనది, ఒకవేళ అధికారం అంతరించినా కానీ వేరొకరి ఆధీనంలో కూడా హక్కులకు భంగం వాటిల్లదనే నమ్మకం కల్ల. కావున అణచివేతకు గురైనపుడు ఆ దుష్టశక్తులను పూర్తిగా వేళ్ళతో సహా పెకిలించగలిగినపుడే తిరిగి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే కొత్త ఊపిరిలతో పాటు పౌరహక్కులనే నాడీ కేంద్రాన్ని కూడా తిరిగి పొందగలరు. పౌరహక్కులు పరిరక్షించుకోవడమంటే, స్వాతంత్ర్యాలను పొందేందుకు పోరాడే యుద్ధంలో సగం విజయాన్ని సాధించినట్లే!

పౌరహక్కుల ఉల్లంఘన అనేది కేవలం ఏ ఒక ప్రాంతానికో పరిమితమైనది కాదు. నలుదిశలా వ్యాపించినదే? ప్రపంచదేశాల అభిప్రాయం ప్రకారం పౌరహక్కుల సాధన, పరిరక్షణ వంటి కార్యక్రమాల్లో అణచివేత అధికమవడం వల్లనే హక్కులకు ముప్పు వాటిల్లుతుంది. అయితే ఆయా దేశాల జాతీయ పౌరహక్కుల సంఘాలు అంతర్జాతీయ పౌరహక్కుల సంఘాలతో సమన్వయం చెంది ఒక క్రమబద్ధమైన ప్రణాళికను రూపొందించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాల్సి వుంది.

పౌరహక్కులు అనేవి పాలనావ్యవస్థకు దాని పరిధులను, వాటి కర్తవ్యాలను స్పష్టంగా బోధించే అంశాలుగా చెప్పుకోవచ్చు,. అంతేకాకుండా ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాల వంటి ఇతర హక్కులను కల్పించి, పరిరక్షించే బాధ్యతను కూడా కల్గి ఉంది ప్రభుత్వం. కానీ దురదృష్టవశాత్తు ఈ బాధ్యతలను స్వీకరించకనే హక్కుల పరిరక్షణ అని నినదించే వారి గొంతును నొక్కి తన అధికారాన్ని ప్రకటించుకోవాలని ప్రయత్నిస్తుంది. హక్కుల పోరాటంలో కేవలం అధికార దుర్వినియోగమో లేక అధికారం అడ్డదారిలో నడవటమనేది స్పష్టం అవుతుందే తప్ప ప్రభుత్వాన్ని కూద్రోయాలనే ధ్యేయంతో పోరాటాలు సాగవు. ఇది అంతా ఒక చక్రం వంటిది. మార్పును కోరడమనేది పోరాటం యొక్క అంతర్లీన కాంక్ష మాత్రమే!

## 15.14 భారతదేశంలో చట్టాలు

భారతదేశ న్యాయవ్యవస్థను గురించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ఉన్న ప్రావిజన్స్‌ను గురించి లోహియ ఇలా అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత కాలంలో న్యాయవ్యవస్థ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను పున:పరిశీలించాల్సిన అవసరం ఉంది. కొన్ని సెక్షన్లలోని వాక్యనిర్మాణం ఆచరణయోగ్యంగా లేకపోవడం, అసలు సామాన్యపౌరునికి సులువుగా అర్థమయ్యేలా లేకపోవడం వల్ల వాటిని కొందరు స్వార్థపరులు వారికి నచ్చిన రీతిలో అన్వయించుకునే వీలుంటుంది. ఉదాహరణకు సెక్షన్ 107 మరియు 144లోని కొన్ని వాక్యాలు పూర్తిగా అర్థమయ్యేలా రాయబడలేదు. వాటికి న్యాయపరమైన విలువ ఉండవచ్చు. కానీ ప్రజలకు ఉపయోగంలేని సెక్షన్లవల్ల నష్టమే ఎక్కువగా ఉంటుంది. సెక్షన్ 144 గురించి ప్రస్తావిస్తూ లోహియా, "నాకు ఈ 144 సెక్షన్ కొంత వ్యక్తిగత బంధం ఉందనే చెప్పాలి. నేను జైలు జీవితాన్ని గడుపుతున్న కాలంలో న్యాయశాస్త్రాన్ని క్షుణ్ణంగా చదివే అవకాశం లభించింది. ఈ సెక్షన్‌లోని విషయం మనదేశ న్యాయవ్యవస్థలోని అంశమని చెప్పడానికి విచారించాలి. ఇవి మన భారత రాజ్యాంగానికే వ్యతిరేకమైనవి. వీటిని గురించి సవ్యంగా, పూర్తిగా ఎక్కడా కూడా చర్చించలేదు. ఒకందుకు న్యాయవ్యవస్థను నీరుగార్చేవిగా ఉన్నాయి. ఉదాహరణకు ఒకానొకప్పుడు జిల్లా మేజిస్ట్రేట్ మరియు ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్‌లకు ఈ రెండు సెక్షన్లను ఉపయోగించే వీలుండేది. కానీ క్రిమినల్‌లా అమెండ్‌మెంట్ యాక్ట్ (1955) వల్ల ఈ సెక్షన్లు సబ్‌డివిజనల్ లేక మొదటి తరగతి మేజిస్ట్రేట్ స్థాయి నుంచి చీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్, జిల్లా మేజిస్ట్రేట్ స్థాయివారు మాత్రమే దీన్ని ఉపయోగించే యోగ్యత కలిగింది."

BRAOU

అంతేకాకుండా 107 మరియు 144 సెక్షన్లు భావార్థం మీద ఆధారపడకూడదు. అవి కేవలం న్యాయభాషకోణం నుంచే వ్యక్తపరచాలి. న్యాయమనేది ప్రజలదృష్టిలో మంచి, చెడు అనే కోణం నుంచి పొందేది యేమాత్రం కాదు. భారతదేశంలోని న్యాయవ్యవస్థ "సమస్యలోతుకు వెళ్ళకుండా తప్పించుకొని కేవలం పైపైనే తడిమి న్యాయాన్ని చేకూర్చాలనుకుంటుంది." అని నిష్కర్షగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు లోహియ.

ఈ సెక్షన్ 144ను ప్రవేశపెట్టిన వద్దనుంచి పరిధి, విస్తీర్ణం పెరిగాయనే అనవచ్చు. ఉదాహరణకు, కాన్‌పూర్‌లోని మేజిస్ట్రేట్‌కు ఒక సభను ఏకంగా సంవత్సరంలోని 350 రోజులు రద్దుచేసే అధికారం లభించింది. భారత రాజ్యాంగం ప్రతిపౌరునికి వాక్స్వేచ్ఛ, సభలు నిర్వహించుకునే స్వేచ్ఛను కల్గిస్తోంది. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పబ్లిక్ ఆర్డర్ అనీ, సెక్యూరిటీ పరమైన పరిధుల వల్ల అనీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఆంగ్లేయులు మనదేశం విడిచి వెళ్ళిన తర్వాత కూడా ఇంకా అమలులోనే ఉన్నాయి. పబ్లిక్ ఆర్డర్‌ను, స్టేట్ సెక్యూరిటీకి కొంత వ్యత్యాసం ఉంది. పబ్లిక్ ఆర్డర్ అనేది పెద్ద అంశమైనపుడు అది సెక్యూరిటీకి సంబంధించినదవుతుంది. సెక్షన్ 107లోని అంశాలకు సెక్షన్ 144లోని అంశాలకు ఎక్కువ వ్యత్యాసం లేదు. నిజానికి ఈ చట్టాలను రూపొందించినవారికి వీటిని రాజకీయపరంగా వక్రీకరించి ఉపయోగించి ప్రజలకు కల్గించే నష్టాలను, వాటి పర్యవసానం గురించి ఆలోచన రాలేదు. అంటే పోలీసు వ్యవస్థకి, న్యాయవ్యవస్థకి దేశంలోని ఏ పౌరున్ని అరెస్టు చేసే అధికారం లేదని కానీ, అరెస్టు చేయనే కూడదని నా అభిప్రాయం కాదు. కానీ ధర్నాలు చేస్తూ న్యాయబద్ధంగా వారి హక్కులను సాధించుకునే వారిని హింసించి ధర్నాలను నిలిపివేయరాదు.

వాక్ స్వాతంత్ర్యం అంటే కేవలం మంచినే ఎల్లప్పుడూ మాట్లాడాలి అనే నిర్బంధన కాదు. అ సలు ఏది మంచి ఏది చెడు అని నిర్ణయించుకునే హక్కు ప్రజలదే ! ఆంక్షలు కేవలం రాజ్యరక్షణకు భంగం వాటిల్లే పరిస్థితుల్లోనే విధించాలి. మాజీ చీఫ్ జస్టిస్ పతంజలిశాస్త్రి అభిప్రాయం ప్రకారం "తాముగా పరిష్కరించుకోలేని సమస్యలున్నప్పుడో అవి వాళ్ళ పరిస్థితులను చర్చించుకోవడానికి మాత్రమే ప్రజలు పెద్ద సమూహాలుగా గుమిగూడి తమ అభిప్రాయాలను వ్యక్తపర్చుకుంటారు. అయితే ఇది సమాజానికి ఎటువంటి హాని కలిగించే చర్యకాదు. సెక్షన్ 107 మరియు 144లు ప్రజలు సదస్సులు, సమావేశాలు జరుపుకునే హక్కును నిషేధిస్తున్నాయి. ఇది ప్రజల భావాలను నొప్పించేదిగాను దీర్ఘకాలంలో వారు ఎదురు తిరిగేందుకు కారణం కావచ్చు. నా అభిప్రాయం ప్రకారం భారతదేశంలోని అధికశాతం న్యాయమూర్తులు ఈ రెండు సెక్షన్ల పట్ల వ్యతిరేకంగానే ఉన్నారు. ఏ న్యాయమైతే రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నదో దాన్ని ప్రజలపై రుద్దడం నేరమే అవుతుంది. రాజ్యాంగంలోని హక్కులు అల్పసంఖ్యాకులకు రక్షణ కల్పించేది, కానీ 107 మరియు 144 సెక్షన్లు అల్పసంఖ్యాకుల హక్కులకు భంగం కలుగచేసేవని స్పష్టమవుతోంది. స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత కూడా భారతదేశంలో ఈ రెండు సెక్షన్లు ఇంకా అమలు జరిపేందుకు వీలుగా ఉండటం నిజంగా శోచనీయం. ఈ రెండు సెక్షన్లు మన న్యాయ విధాన పరిధిలో ఉన్నంత వరకూ ఆంగ్లేయులు మనల్ని విడిచిపోలేదని అనవచ్చు".

## 15.15 ముగింపు

ఈ విధంగా మనకు లోహియ దృక్కోణం నుంచి పౌరహక్కులు వాటి విలువ వంటి అంశాలపై ఒక అవగాహన ఏర్పడుతుంది. లోహియ సిద్ధాంతాల నుంచి పౌరహక్కులను చర్చించిన విధానం వల్ల విద్యార్థులకే కాకుండా మానవహక్కులను కార్యకర్తలకు కూడా తగినంత అవగాహన ఏర్పడుతుంది.

BRAOU

## 15.16 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. లోహియ దృక్కోణం నుంచి ప్రపంచ పౌరహక్కులను చర్చించండి.

2. పౌరహక్కుల అణచివేత, వాటి పరిరక్షణ విధానాలు లోహియ కోణం నుంచి చర్చించండి.

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. భారతదేశంలోని న్యాయవ్యవస్థ స్థితిని చర్చించండి.

2. అమెరికాలో పౌరహక్కుల ఉద్యమాన్ని వివరించండి.

BRAOU

# భాగం - 16 : పూలే, అంబేద్కర్

**విషయక్రమం**

16.0 ఉద్దేశం
16.1 పరిచయం
16.2 బుద్ధుడు
16.2.1 బుద్ధుడు - హక్కుల భావన
16.2.2 బుద్ధుడు - సామాజిక ఒడంబడిక సిద్ధాంతం
16.2.3 భిక్షువుల హక్కులు
16.2.4 ఆస్థి హక్కు
16.2.5 స్త్రీల హక్కులు
16.2.6 భారతదేశంపై బుద్ధుడి మత ప్రభావం
16.3 బసవ ఉద్యమం - మానవ హక్కులు
16.4 భక్తి ఉద్యమం
16.5 ఆధునిక యుగం - పూలే
16.6 అంబేద్కర్
16.6.1 అంబేద్కర్ - కులం
16.6.2 బాధ్యతలకే పరిమితమైన శూద్రులు
16.6.3 అంబేద్కర్ మరియు గాంధీ
16.6.4 కులం - మానవ హక్కులు
16.6.5 స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పై అంబేద్కర్ భావాలు
16.6.6 మానవ హక్కులు - హింస
16.7 ముగింపు
16.8 మాదిరి పరీక్షాప్రశ్నలు

BRAOU

## 16.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు -

- మానవ హక్కులకు - బుద్ధిజానికి వున్న సంబంధాన్ని అర్థం చేసుకోగలుగుతారు.
- మానవహక్కులపై పూలే భావాలు తెలుసుకుంటారు.
- కులవ్యవస్థకు - మానవ హక్కులకు గల సంబంధాన్ని అంబేద్కర్ దృక్పథంతో అధ్యయనం చేస్తాం.

## 15.1 పరిచయం

మానవ హక్కుల ఉద్యమాలు విస్తృతమవుతున్న కొద్దీ వాటి పరిధిలో, నిర్మాణంలో, కార్యక్రమాల్లో కూడా మార్పులు వస్తున్నాయి. నిజానికి మానవహక్కుల ఉద్యమం విశ్వవ్యాప్తమైంది. ప్రపంచంలో మనుషులందరి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, హక్కులకు పంబంధించింది. అయినప్పటికీ మనదేశంలో దీనికి ఒకే పరిధిని, ఒకే ఎజెండాను నిర్ణయించలేం. ఎందుకంటే మనదేశంలో ప్రపంచంలో ఎక్కడాలేని సామాజిక విభజన వుంది. అసమానతలు, అంతరాలూ వున్నాయి. హక్కులు, అవకాశాలు, అధికారాలు అందరికీ సమానంగా అందుబాటులో లేవు. కాబట్టి

భారతదేశానికి సంబంధించినంతవరకు మానవహక్కుల సమస్య రెండు వేరు వేరు ప్రధాన రూపాల్లో కనిపిస్తుంటుంది. మానవ హక్కుల చర్చ కూడా రెండు ప్రధాన సాంప్రదాయ దృక్కోణం కాగా రెండోది దళిత బహుజన సాంప్రదాయం.

హిందూ ధర్మం ప్రకారం మనుషులందరికీ సమాన హక్కులు లేవు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క రీతిలో హక్కులుండగా, శూద్రులకు, పంచములకు మరోరకంగా మానవ హక్కులు అమలవుతూ వచ్చాయి. కొన్నిసార్లు మానవులకుండే కనీస హక్కులు కూడా ఈ'నిమ్న' వర్గాలకు వుండేవికావు. ఇలా కొన్ని వేల సంవత్సరాలపాటు కొనసాగింది. ఈ అసమానతలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు సాగాయి. దళితవర్గాల అభ్యున్నతికోసం, హక్కుల కోసం అనేక పోరాటాలు నడిచాయి. ఈ పోరాటాలు సాగించిన వారిలో జ్యోతీరావు పూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్ ముఖ్యులు. పూలే, అంబేద్కర్ మొదలుపెట్టిన పోరాటపంథా మరింత విస్తృతమై కొనసాగుతున్నది. ఇవాళ దేశవ్యాప్తంగా ఎస్.సి., ఎస్.టి., ఒ.బి.సి, మైనారిటీలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. ఈ పోరాటాలనే సమాజశాస్త్రవేత్తలు దళిత బహుజన ఉద్యమాలుగా పేర్కొంటున్నారు.

## 16.2 బుద్ధుడు

పూలే, అంబేద్కర్‌లు దళితులకు కనీస మానవహక్కులు కల్పించడం కోసం సాగించిన పోరాటం వాళ్ళకు వాళ్ళుగా సృష్టించింది కాదు. చరిత్రలో ఇటువంటి పోరాటాలు అదే లక్ష్యం కోసం అనేకం జరిగాయి. ఆ పోరాటాల వారసత్వమే ఇప్పటికీ కొనసాగుతుంది.

దళిత బహుజన పోరాటాల బీజాలు నిజానికి బౌద్ధమతంలో వున్నాయి. మనుషులంతా సమానమేనని అందరికీ సమాన హక్కులు, బాధ్యతలుండాలని పేర్కొన్న తొలి తత్త్వవేత్త గౌతమబుద్ధుడు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక హక్కులపై బుద్ధుడి యొక్క బోధనలు ఆయన మానవహక్కుల భావనలను ప్రతిబింబిస్తాయి.

గౌతమబుద్ధుడి ఆలోచనలకు ఆనాటి సాంఘిక పరిస్థితులే ప్రధానంగా ప్రేరణగా నిలిచాయి. అవి కులవ్యవస్థ బలపడుతున్న తొలిరోజులు. మంత్రతంత్రాలు, కర్మకాలక్షేపాలతో సామన్యబ్రాహ్మణులు ప్రజలను మోసం చేస్తుండేవారు. హిందూ రాజులు అప్రతిహిత దాడులకు లొంగిపోకుండా ఎదురొడ్డి నిలిచిన శౌక్యరాజ్యం బుద్ధుడిది..... రాజ్యకాంక్షతో హిందూరాజులు ఒకరిపై ఒకరు దండయాత్రలు చేసుకోవడం, యుద్ధాలకు దిగడం అనేక మంది సామాన్యులను బలిగొనేది. మరోవైపు యజ్ఞయాగాల పేరుతో నిత్యహోమాలు జరుగుతుండేవి. ఈ యజ్ఞయాగాల పేరుతో బ్రాహ్మణులు ప్రజలను మోసం చేసి, దోచుకోవడమే కాక అసంఖ్యాకమైన పశుగణం ముఖ్యంగా గోవులు లేగదూడలను, వడ్లను, ఈ హోమాలకు బలిఇచ్చేవారు. రాజ్యాధికారం కోసం జరిపే 'రాజసూయ' యాగం వంటి వాటిలో బలియిచ్చే పశుగణానికి లెక్క వుండేది కాదు.

బుద్ధుడి కాలంలో వ్యవసాయం కూడా పెద్దగా అభివృద్ధి చెందలేదు. అప్పుడప్పుడే ప్రజలు పోడువ్యవసాయం మంచి నాగళ్ళకు మళ్ళుతున్నారు. బ్రాహ్మణుల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని బుద్ధుడు భావించాడు. అప్పుడే అందరికీ విముక్తి కలుగుతుందని, లేకపోతే భారతదేశ మనుగడే కష్టమని భావించాడు. దానికిగాను అతడు తనరాచరికాన్ని త్యజించి ప్రజలను సంఘాల ద్వారా చైతన్యవంతులను చేయడానికి బయలుదేరాడు. బుద్ధుడి 'సంఘ'వ్యవస్థ మతవ్యవస్థగా అనిపించినా నిజానికి అది మతానికి అతీతమైంది. బుద్ధుడు ఎన్నడూ దేవుడిని నమ్మలేదు. అయితే ఆయన మరణానంతరం అతని శిష్యుల్లో కొందరు సరియైన అవగాహన లేకపోవడం వల్ల బుద్ధున్నే దేవుడిగా, దేవుడి అవతారంగా ప్రచారం చేయడం ప్రారంభించారు. హిందూమతం కూడా ఆ తరువాత బుద్ధున్ని తమలో కలుపుకుని దశావతారాల్లోబుద్ధావతారం ఒకటని ప్రచారం చేసింది. అయితే ఆ ప్రచారం పూర్తిగా ఫలించలేదు.

BRAOU

భారతదేశంలో బౌద్ధమతాన్ని పునఃప్రతిష్ఠింపజేసిన వ్యక్తి అంబేద్కర్. అంబేద్కర్ ప్రయత్నాలు, ప్రచారం వల్ల 1956లో బౌద్ధమతానికి స్వయం ప్రతిపత్తి, స్వతంత్ర హోదా వచ్చాయి. అదొక ప్రత్యేక ఆలోచనా విధానంగా ఎదిగింది. ఇప్పుడు అదే నియో-బుద్ధిజం (Neo-Buddhism) గా ప్రాచుర్యంలోకి వస్తోంది.

### 16.2.1 బుద్ధుడు - హక్కుల భావన

బుద్ధుడు 'సంఘా'లను స్థాపించే నాటికి దేశంలో సాంఘిక పరిస్థితులు అనేక అసమానతలతో నిండి వుండేవి. సామన బ్రాహ్మణులు, క్షత్రియులకు మినహా ఇంకెవరికీ ఎటువంటి సాంఘిక, ఆర్థిక హక్కులు వుండేవికావు. ఇంతదాకా సమాజంలోని అతికొద్దిమంది (మైనారిటీ)కి మాత్రమే హక్కులున్నాయని, మెజారిటీ ప్రజలు (బహుజనులు) ఇంకా హక్కులకు దూరంగా వుంటున్నారని బుద్ధుడు గ్రహించాడు. సామాజిక వ్యవస్థ అనేది 'బహుజన హితయ, బహుజన సుఖాయ' లక్ష్యంకోసం పనిచేయాలే తప్ప 'బ్రాహ్మణ హితాయ, బ్రాహ్మణ సుఖాయ'లా కాదని అతను వాదించాడు. 'బహుజన' పదం అప్పటినుంచి అన్ని వర్గాల ప్రజలు (మెజారిటీ ప్రజలకు) ప్రత్యామ్నాయంగా వాడుకలోకి వచ్చింది.

ఆకాలంలో రాజ్యవ్యవస్థ కూడా మెజారిటీ ప్రజల గురించి పట్టించుకోకుండా మైనారిటీగా వున్న అగ్రవర్ణాలకు అనుకూలంగా వుండేది. ఈ మైనారిటీ వర్గం మతపరంగా, రాజకీయపరంగా తన ఆధిపత్యంతో ప్రజలను దోచుకుంటూ వుండేది.

### 16.2.2 బుద్ధుడు - సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

బుద్ధుని కాలం నాటికి వర్ణధర్మ సిద్ధాంతం విస్తృతంగా ప్రచారంలో వుంది. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ ప్రపంచం, రాజ్యం అంతా బ్రహ్మ సృష్టించిందే, మనుషులందరినీ ఎలాగైతే కొందరిని తలలోంచి, మరికొందరిని బాహువులు, ఉదరం, పాదాలలోంచి ఎలాగైతే సృష్టించాడో అదే సృష్టికర్త అలాగే రాజ్యాన్ని కూడా రూపొందించాడు. ఈ సిద్ధాంతాన్ని బుద్ధుడు కొట్టిపారేశాడు. దీనికి భిన్నంగా మనుష్యులు వారి హక్కులు కేంద్రబిందువులుగా జరిగిన సామాజిక ఒడంబడిక లేదా ఒప్పందంలో భాగంగా రాజ్యం అవతరించిందని పేర్కొన్నాడు. బౌద్ధ గ్రంథాల ప్రకారం ప్రయివేటు ఆస్తి అనేది తొలిహక్కుగా అవతరించింది. రెండోహక్కుగా రాజు అనే వ్యవస్థ సృష్టించబడింది. దీని ప్రకారం ప్రజలందరి బాగోగులు చూడడం రాజు విధి. అప్పటివరకూ వున్న దైవదత్తాధికార (Divine Rights) సిద్ధాంతాన్ని ఈ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం త్రోసిపుచ్చింది. ఒక రకంగా సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ప్రజల హక్కులకు పునాదులు వేసింది. ఈ సిద్ధాంతం ఇప్పటిదాకా బ్రాహ్మణులు ప్రచారం చేస్తూ వచ్చిన దైవదత్తాధికార సిద్ధాంతానికి ఒక సవాలు అయ్యింది.

BRAOU

### 16.2.3 బిక్షువుల హక్కులు

అత్యున్నత ప్రజాస్వామ్య విలువలకు బుద్ధుడి 'సంఘ' వ్యవస్థ ఒక నమూనా. అసలు ప్రపంచంలోనే ఎక్కడా ఇంతటి ప్రజాస్వామ్య వ్యవస్థ లేదంటే అతిశయోక్తి కాదు. బౌద్ధ సంఘం సభ్యులందరికీ తమ సంఘ సమావేశాల్లో పాల్గొనే హక్కుంది. సభ్యుల్లో ఎవరైనా సరే సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేయవచ్చు, చర్చలు ప్రారంభించవచ్చు. ఏ విషయాన్నయినా చర్చకు పెట్టవచ్చు, ఎవరైనా సరే సంఘంలోని పదవులకు పోటీ చేయవచ్చు, ఓటు వేయవచ్చు.

సంఘం అనేది బిక్షువుల సముదాయం. అన్ని కులాలకు చెందినవారు బిక్షువులుగా చేరవచ్చు. సంగంలో వాళ్ల కులాలతో సంబంధం లేకుండా బిక్షువులందరూ సమానమే. బుద్ధుడి తరువాత అంతే ప్రముఖమైన బిక్షువు ఉపాలి. అతను శూద్రుడు. ఆనంద క్షత్రియుడు. అయినప్పటికీ వాళ్లు బౌద్ధంలో అత్యంత కీలకమయిన పాత్ర నిర్వహించారు. బుద్ధుడి ప్రకారం ఈ కులాలన్నీ రకరకాలు పాయల్లాంటివి. పాయలు ప్రవహించి నదులై సముద్రంలో కలిసినట్లు అన్ని కులాలూ సంఘంలో కలుస్తాయి. అప్పుడు ఆ కులాల లక్షణాలు కాకుండా సంఘలక్షణాలే మిగులుతాయి.

### 16.2.4 ఆస్థి హక్కు

బౌద్ధ సంఘాలకు సంబంధించినంత వరకు ఆస్థి అనేది సాముదాయికమైనది. వ్యక్తులు కేవలం వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకునే వస్తువులను కలిగి వుండవచ్చు. అంటే నిత్యం వాడుకునే దుస్తులు, బిక్షుపాత్ర, సూదులు, చాపవంటివి మాత్రమే వ్యక్తిగతంగా కలిగి వుండొచ్చు. అయితే వీటిని కూడా ఆస్థిగా పరిగణించరాదు. ఈ వస్తువులను తమ సంతతి కోసం దాచి వుంచడాన్ని కూడా బుద్ధుడు అంగీకరించలేదు. సంఘంలో చేరిన ప్రతి సభ్యుడు తన వ్యక్తిగత వస్తువులు కూడా తన మరణానంతరం సంఘానికే చెందుతాయని సంఘం సాధారణ సభలో ప్రమాణం చేసేవారు.

సంఘం ఉమ్మడిగా కొంత ఆస్థిని కలిగివుండవచ్చు. కానీ దాన్ని తన వ్యక్తిగత ఆస్థిగా ప్రకటించుకునే హక్కు ఏ ఒక్కరికీ లేదు. బుద్ధుడు కూడా అనేకసార్లు, విహారాలు, భూములు, ఇల్లు, దుస్తులు, బంగారం వంటివి విరాళాల రూపంలో స్వీకరించాడు. వాటన్నింటినీ సంఘం ఉమ్మడి ఆస్థి కిందే జమకట్టాడు. బుద్ధుడి అనంతరం కూడా అతను సమీకరించిన ఆస్థిపాస్తులన్నీ సంఘానికే చెందాయి తప్ప అతని కొడుకు రాహులుకో, భార్య యశోదకో చెందలేదు.

సంఘ ఆస్తిపాస్తులను ప్రయివేటీకరించకుండా వుండేందుకు పలుశాసనాలు రూపొందిచినారు. సంఘంలోని సభ్యులు కొందరు సంఘ ఆస్తులు దుర్వినియోగం చేయాలని ప్రయత్నించేవారు. అలాంటివారిని నిర్దాక్షిణ్యంగా సంఘంలోంచి పంపించారే తప్ప ఆస్థి కలిగి వుండడాన్ని అనుమతించలేదు. దేవదత్తుడు అందుకు ఉదాహరణ.

### 16.2.5 స్త్రీల హక్కులు

BRAOU

బౌద్ధ సంఘాలు మహిళల హక్కుల పట్ల ఎలా వ్యవహరించేవనే విషయంలో అనేక రకాల చర్చలు జరిగాయి. నిజానికి బౌద్ధసంఘాల్లో స్త్రీలకు మొదట సభ్యత్వం లేదు. బుద్ధుడు స్త్రీలను సంఘాల్లో చేరడానికి అనుమతించలేదు. అయితే ఆశ్చర్యకరంగా ఒకరోజు బుద్ధుడు పినతల్లి మహాప్రజాపతి సంఘంలో చేరడానికి ముందుకు వచ్చారు. ఆమెతో పాటు మరికొందరు స్త్రీలు కూడా సంఘంలో చేరడానికి అనుమతించాలని కోరారు. మహిళల నుంచి వచ్చిన ఈ డిమాండును ఆమోదిస్తూ ఆవెంటనే సంఘసమావేశాలు తీర్మాణాలు చేశాయి. స్త్రీల కోసం ప్రత్యేకంగా బిక్షుక సంఘాలు తెరిచారు. హిందూ వ్యవస్థ స్త్రీలకు యజ్ఞయాగాల్లో పాలు పంచుకునే హక్కులేకుండా చేసిన కాలంలో బౌద్ధం ఈ నిర్ణయం తీసుకోవడం అనేకమంది స్త్రీలను ఆకట్టుకుంది. అలాగే ఆకాలంలో స్త్రీలకు ఎలాంటి మతస్వేచ్ఛ లేకుండా చేసివాళ్ళకు కనీసం మనుషులన్న గుర్తింపు కూడా ఇవ్వకుండా నిరాకరించిన రోజుల్లో ఈ అవకాశం రావడం స్త్రీలను ఆకర్షించింది.

భారతదేశ చరిత్రలో స్త్రీ బిక్షుకులకోసం ప్రత్యేక సంఘాలు ప్రారంభించడం ఒక కొత్త అధ్యాయంగా చెప్పవచ్చు. స్త్రీలకోసం ఏర్పరచిన ఈ సంఘాలు సాధారణ (పురుషుల) సంఘాల అధీనంలోనే పనిచేసినప్పటికీ స్వతంత్రంగా కార్యకలాపాలు నిర్వర్తించే స్వేచ్ఛ అవకాశం వాటికి ఉండేవి. వీటి కార్యకలాపాల వల్ల బుద్ధుడి కాలంనాటికీ అనేక మంది మహిళానాయకులు , రచయిత్రులు, వెలుగులోకి వచ్చారు. నిజానికి ఆకాలంలో హిందూ స్త్రీలు చదువు సంధ్యలకు దూరం. అంతేకాదు హిందూ మతం స్త్రీలకు గ్రంధరచన చేసే హక్కు నిషేదించింది. చివరకు చదువుల తల్లి, అన్న పేరున్న సరస్వతి కూడా సాహిత్యగ్రంధరచన చేసిన దాఖలాలు మనకెక్కడా కనిపించవు. దీనికి విరుద్ధంగా బౌద్ధమతానికి చెందిన మహిళలు టెరిగాత (Terigatha). మిత్ర, ఆమ్రపాళి, సుమంగళి వంటి మహారచయిత్రులు సంఘ జీవితంనుంచి వెలుగులోకి వచ్చినవారే.

### 16.2.6 భారతదేశంపై - బౌద్ధమతప్రభావం

బుద్ధుడి మరణానంతరం బౌద్ధమతం హీనయాన, మహాయాన అని రెండు శాఖలుగా చీలిపోయింది. అయితే ఈ రెండు శాఖలు గూడా బుద్ధుడు సూచించిన మానవతా మార్గాన్ని విడనాడలేదు. బౌద్ధమత సూత్రాలకు అనేక

మంది రాజులు చక్రవర్తులు ప్రభావితులైనారు. అటు ప్రాచీన, ఇటు మధ్యయుగాల్లో పలువురు రాజన్యులు సంక్షేమ రాజ్యస్థాపకుడు తద్వారా బుద్ధుడు సూచించిన కుల, వర్గ రహిత సమాజ స్థాపనకు ప్రయత్నించారు. అశోక చక్రవర్తి పాలన దీనికొక ఉదాహరణ. అశోకుడి పాలనను మనం రెండు దశల్లో చూడవచ్చు. తొలిభాగం హిందూ రాజ్యపాలకుడైన అశోకుడు కాగా చివరిభాగం బౌద్ధ పాలకుడైన అశోకుడు, కళింగయుద్ధం తరవాత అశోకుడిలో ఈ మార్పు వచ్చింది. అశోకుడు హిందువుగా ఉన్నంతకాలం ఒక యుద్ధాభిలాషి, ప్రజావ్యతిరేకి, అతనికి ప్రజలు ప్రజాసంక్షేమం అస్సలు పట్టలేదు. కానీ బౌద్ధమత స్వీకారం ఆయన జీవనరీతిని మార్చివేసింది. ప్రజల జీవితాలను మార్చడానికి వాళ్ల కష్టాలు తొలగించి కన్నీళ్లు తుడవడానికి రాజ్యం గుణాత్మకమైన పాత్ర పోషించాలన్న వాస్తవాన్ని ఆయన ఆ తరువాతే గుర్తించాడు. రాజ్య పరిపాలనలో కులాన్ని, కుల వివక్షతను రద్దుచేసిన తొలి రాజు అశోకుడే కావడం ఇక్కడ గమనార్హం. ఈఘనత అశోకుడు ఎదిగివచ్చిన బౌద్ధవాతావరణం వల్ల మాత్రమే సాధ్యమయ్యింది. అశోకుడిలాగే అనేక మంది శూద్రరాజులు మానవతా విలువల కోసం పరితపించారు. అయితే అశోకుడి అనంతరం పరిస్థితి వికటించింది. శూద్రులు, దళితుల హక్కులు హరించుకుపోయాయి. అంటరానితనం, మూఢాచారాలు తీవ్రంగా పెరిగి పోయాయి. బౌద్ధ సన్యాసులను అణచివేశాయి. అశోకుడి సాంప్రదాయాన్ని ఏ రాజూ పాటించకుండా అడ్డుకున్నారు. ఆ వైభవం అక్కడితోనే ఆగిపోయింది.

## 16.3 బసవ ఉద్యమం - మానవహక్కులు

అశోకుడి అనంతర దశలోనే పన్నెండవ శతాబ్దంలో బసవ ఉద్యమం మొదలైంది. శంకరాచార్య అద్వైతానికి వ్యతిరేకంగా అత్యంత బలమైన వీరశైవ ఉద్యమానికి బసవడు పునాది వేశాడు.

శూద్రులు, అంతిశూద్రులు హిందూ దేవతలను ఆరాధించడాన్ని శంకరాచార్యుడు నిరాకరిస్తే వాళ్లందరినీ 'లింగారాధన' కు ఆహ్వానించిన ఘనత బసవడిది. సమాజంలోని సమస్త కులాలకూ దైవాన్ని పూజించే అర్చన వుంటుందని 'లింగం' ఒక్కటే అసలైన దైవమని బసవడు ఉద్భోదించాడు. ఏ మనిషయినా సరే లింగాన్ని మెడలో ధరిస్తే చాలునని ప్రత్యేకంగా పూజించవలసిన పనే లేదని బసవడు పేర్కొన్నాడు. అలా లింగాన్ని ధరించినవారినే లింగావతులు/ లింగాయతులు అంటారు. 'బసవడి మతస్వేచ్ఛ ఉద్యమానికి' ఆకర్షితులై వివిధ కులాలకు చెందిన అనేకమంది లింగపూజ ఉద్యమంలో చేరిపోయారు. అంటరాని కులాల వారితో పాటు చాకలి, వడ్రంగి గొల్ల తదితర వృత్తికులాల వారు, గిరిజనులు కూడా బసవ ఉద్యమంలో భాగం పంచుకున్నారు. ఆ రకంగా బసవ ఉద్యమం అనేక కులాలను మతచాంధస కబంధ హస్తాలనుంచి విముక్తం చేసింది. బ్రాహ్మణీయ మూఢత్వాన్ని ఎదుర్కొగలిగే నూతన ఆలోచనారీతిని ఈ ఉద్యమం అంకురార్పణ చేసింది. ఈ ఉద్యమం అన్ని వర్గాల ప్రజల మత హక్కులను విస్తృత పరిచింది. దైవారాధనకు సంబంధించిన రూపురేఖలను మార్చివేసింది.

బసవ ఉద్యమం బ్రహ్మను ఆరాధించే హిందూధర్మంపై పెద్ద ఎత్తున దాడిచేసి ప్రజలకు లింగారాధన నేర్పించి దేవతలకు శాఖాహారమే వడ్డించాలనే బ్రాహ్మణీయ విలువను త్రోసిపుచ్చింది. మనుషులు ఏ ఆహారం అయితే తింటారో, అదే ఆహారాన్ని దేవతలకు కూడా పెట్టాలని ఉద్భోదించింది. దీంతో మాంసాహారులంతా మత కార్యక్రమాల్లో పాల్గొనే స్వేచ్ఛలభించింది. బసవడు మహిళలకు కూడా మతహక్కును కల్పించాడు. అతని లింగ-లింగసంగమ (స్త్రీ, పురుషుల కలయిక) సిద్ధాంతం సమాజంలో నూతన జ్ఞాన గవాక్షం తెరిచింది. బసవడి ఆలోచనలు బుద్ధుడి గతి తార్కికతకు దగ్గరగా వుంటాయి. వీరశైవ ఉద్యమం బలపడిన క్రమంలో సమాజంలో శూద్రుల స్థానం చెప్పుకోదగ్గ రీతిలో మెరుగుపడింది.

## 16.4 భక్తి ఉద్యమం

బసవ ఉద్యమ అనంతరదశలో భక్తి ఉద్యమం ఆవిర్భవించింది. వాస్తవానికి భక్తి ఉద్యమం దళిత మహుజన సాంప్రదాయాన్ని కొనసాగించలేదు. ఈ ఉద్యమం హిందూ చిహ్నాలకు బదులుగా ప్రత్యామ్నాయ చిహ్నాలను రూపొందించకపోయినా శూద్రులలో (అంటరానివారిలో కాదు) హిందూ మత ప్రభావాన్ని కలుగజేసింది. మీరాబాయి:,

BRAOU

కబీర్, తుకారాం మొదలైన వారికి హిందూ దేవాలయాలలో స్థానం లభించింది. ఉదాహరణకు మీరాభాయికృష్ణుడి భక్తురాలు కాగా, కబీర్ రామభక్తుడిగా ప్రచారం పొందారు. హిందూ దేవాలయాల్లో శూద్రులకు మరియు స్త్రీలకు స్థానం కల్పించడానికి బ్రాహ్మణ మతాధికారులు వ్యతిరేకించారు. అయితే బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని భక్తులైనవారు సహించలేకపోయారు. దేవునికి, సాధారణ వ్యక్తులకు మధ్య మతగురువుల అవసరం లేదని భక్తులు వాదించారు.

ఈ భక్తి ఉద్యమం ప్రాథమికంగా ఉత్తర భారతదేశానికి సంబంధించింది. హిందూ సమాజ పరిధికి లోబడి ఈ భక్తి ఉద్యమం మానవ హక్కులకు సంబంధించిన కొన్ని ప్రాథమికమైన ప్రశ్నలను లేవనెత్తింది. హిందూయిజం అనేది కేవలం ద్విజులకు సంబంధించినదేనా? లేక మొత్తం భారతీయులకు సంబంధించిందా? హిందూ మతం కేవలం పురుషులకు ప్రాధాన్యత ఇస్తుందా? లేక స్త్రీలకు స్థానం కల్పిస్తుందా? హిందూ సమాజంలోని పితృస్వామిక ఆధిపత్యాన్ని మరియు ద్విజుల ఆధిపత్యాన్ని భక్తి ఉద్యమం ప్రశ్నించింది. సుమారు ఇదే కాలంలో శూద్రవర్ణానికి చెందిన పోతులూరి వీరబ్రహ్మం నాయకత్వంలో తెలుగు ప్రాంతంలో తిరుగుబాటు మొదలైంది. ఇతను ఉత్పత్తి మరియు సృజనాత్మక శక్తి కలిగిన వివిధ కులాలు మరియు మతాలలోని వారితో సర్వ స్వతంత్రమైన మతచైతన్యాన్ని రూపొందించాడు.

శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్రననుసరించి వీరబ్రహ్మం వడ్రంగి వృత్తిలో నైపుణ్యం కలిగి ఉండటంతో పాటు వ్యవసాయం ప్రధానవృత్తిగా కలిగినవాడు. ఇతను ఒక మతాన్ని స్థాపించాడు. ఈ మతానికి దూదేకుల వాడైన సిద్ధయ్యను కాలజ్ఞాన తత్త్వ ముఖ్య ప్రచారకునిగా పోతులూరి వీరబ్రహ్మం నియమించాడు. కాల జ్ఞానతత్త్వం మతాన్ని అర్థం చేసుకోవడాన్ని పూర్తిగా మార్చివేసింది. మారుతున్న కాలపరిస్థితుల్లో మానవ విజ్ఞాన వ్యవస్థ మార్పులకు లోనవుతుంది. సమాజంలోని వ్యక్తులందరికి కులంతో నిమిత్తం లేకుండా మతకార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కల్పించింది. భారత మత వ్యవస్థలోని బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ఇది ప్రశ్నించింది. ఈ ఉద్యమం మతపరమైన హక్కులను దళిత బహుజనులకు కల్పించడమేగాక భారత మత తాత్త్విక పునాదులను మార్చివేసింది. పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం వ్యక్తులందరినీ కులం, లింగం వివక్షతకు అతీతంగా మత కార్యకలాపాలలో పాల్గొనేందుకు ప్రోత్సహించింది. వీరబ్రహ్మం, సిద్ధయ్య, కక్కయ్యలు హిందూమతంలో అంచెలంచెలుగా వున్న కులవ్యవస్థను మరియు బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ఎదురించారు.

BRAOU

## 16.5 ఆధునిక యుగం - పూలే, అంబేద్కర్

కులం ప్రాతిపదికగా మానవ హక్కులకు సంబంధించిన ప్రశ్నలు లేవనెత్తబడడానికి ముందే అంబేద్కర్ భారత జాతీయోద్యమంలో ప్రవేశించారు. ప్రజల మానవహక్కులను హరించడంలో కులం యొక్క పాత్రనుఅర్థం చేసుకున్న మొదటి తత్త్వవేత్త అంబేద్కర్. చరిత్ర క్రమంలో కులం మరియు అంటరానితనం ఆధారంగానే హక్కులు ఇవ్వబడ్డాయని పురాణాలలో చెప్పిన విషయాన్ని బుద్ధిజం పేర్కొంటుంది. ఆధునిక కాలంలో దళిత బహుజనులకు మానవహక్కులనే భావనను మొదటగా ఆరంభించింది మహాత్మాజ్యోతిరావ్ పూలే.

### మహాత్మా జ్యోతిరావ్ పూలే

మానవ హక్కులపై అంబేద్కర్ దృక్పథాన్ని అవగాహన చేసుకునేదానికంటే ముందు అంబేద్కర్ గురువుగా భావించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే లేవనెత్తిన ప్రశ్నలను అర్థం చేసుకోవాల్సి వుంది. 19వ శతాబ్దంలో పశ్చిమ భారతదేశంలో పూలే ప్రధాన సంఘ సంస్కర్తగా ఎదిగారు. ఇతను ఆధునిక పశ్చిమభారతంలో బ్రాహ్మణీయ సామాజిక క్రమాన్ని వ్యతిరేకించిన వెనుకబడిన కులాలకు చెందిన మొదటి వ్యక్తి. ఇతను తోటమాలి కుటుంబంలో 1827లో జన్మించాడు. తల్లిదండ్రులు పూనా పట్టణంలో పూవులు అమ్ముతూ జీవనం గడిపేవారు. వీరి వృత్తి నుంచే వీరి ఇంటిపేరు వచ్చింది. పూలే 7వ తరగతి వరకు మిషనరీ స్కూల్లో చదువుకుని పాశ్చాత్య విలువల పట్ల ఆకర్షితుడయ్యాడు. పాశ్చాత్య సమాజంలో వ్యక్తి హక్కులు సమాజం మరియు రాజ్యం, పౌరసమాజం పరస్పరం గౌరవించుకోవడాన్ని

ఇతడు గమనించాడు. అయితే భారతదేశంలో ఒక కులం మరోకులాన్ని గౌరవించదు. వ్యవస్థాపరంగా మరియు సిద్ధాంతపరంగా - వ్యక్తులు, సమాజాలు అణచివేతకు గురవుతున్నాయి.

థామస్‌పెయిన్ "రైట్స్ ఆఫ్ మాన్ అండ్ ది ఏజ్ ఆఫ్ రీసన్" అనే రచనతో పూలే ప్రభావితుడయ్యాడు. అంటరానితనాన్ని విశ్వసించే సమాజం ప్రపంచంలో ఎక్కడాలేదని ఆలోచించే స్నేహితులపై పూలే ప్రభావం చూపేవాడు. (ఆ రోజుల్లో అనేక శూద్ర కులాలు బ్రాహ్మణ మరియు బనియా కులాలచే అంటరానితనానికి గురైనాయి). భారతీయ కులవ్యవస్థకున్న సమస్యలను అందుకుగల పునాదులను అర్థం చేసుకున్న మొదట వ్యక్తి పూలే. సమకాలీన భారత సమాజంలో బ్రాహ్మణ బనియా కులాలవారే మానవ హక్కులను అణగదొక్కడంలో ప్రధాన బాధ్యత వహించాల్సి వుందని పూలే భావించాడు. షెట్జీ - బాట్జీలు (బనియా మరియు బ్రాహ్మణులు) వర్తకం, పౌరోహిత్యం ద్వారా శూద్రులను, అతిశూద్రులను మోసం చేస్తూంటారు. వీరిని బ్రాహ్మణులు నీచభావంతో అంటరానివారుగా భావిస్తే, పూలే వీరిని సానుకూలదృష్టితో శూద్రులుగా అభివర్ణించారు. అచూట్స్ లేదా చండాలులను అతిశూద్రుల విద్యాహక్కుల కోసం పోరాడేందుకు పూలే నిర్ణయించుకున్నాడు.

శూద్రుల - అతిశూద్రుల హక్కులు షెట్జీ మరియు బాట్జీ కులాలు ఎలా అణచివేస్తున్నాయో పూలే తన నాటకాలు, కవిత్వం ద్వారా ప్రజలందరికి తెలియచేశాడు. శూద్రులు, అతిశూద్రుల హక్కులను పూలే చారిత్రక దృక్పథంతో పరిశీలించాడు. రాముడు శంభూకుడిని హతమార్చటం మరియు వామనుడు బలిచక్రవర్తిని అంతమొందించటంలో శూద్రుల హక్కులపై క్షత్రియ రాజుల మరియు మతాధిపతుల అణచివేతవుందని పూలే అవగాహన చేసుకున్నాడు. పాలించే హక్కు మరియు తపస్సు చేసే హక్కు కేవలం క్షత్రియులకు మరియు బ్రాహ్మణులకు మాత్రమే ఇవ్వబడ్డాయి. ఇటువంటి ప్రత్యేకీకరణ ఉత్పత్తి వర్గాలైన బహుజనుల శక్తి నైతికంగా విధ్వంసమవుతుంది.

భారతీయ సామాజిక వ్యవస్థకు పూలే విప్లవాత్మకమైన మార్గాన్ని నిర్దేశించాడు. అంటరాని కులాలకు చెందిన పిల్లలను చదివించేందుకు పాఠశాలలను ప్రారంభించాడు. పూలే తన భార్య సావిత్రిభాయ్‌ను తొలిమహిళా ఉపాధ్యాయురాలిగా తయారుచేశాడు. ఇతను 'సత్యశోధక్' (సత్యం కోసం అన్వేషణ) అనే సంస్థను ప్రారంభించాడు. సత్యశోధక్ సంస్థ పేరుతో అనేకమంది రైతులు మరియు స్త్రీలు తమ హక్కుల సాధన కోసం సమీకరించబడ్డారు. శూద్రులకు, అతిశూద్రులకు సత్యశోధక్ సమాజం నిత్యజీవితంలోని అనేక సమస్యలపై ప్రజల సమీకరణకు ముఖ్యమైన సంస్థగా ఎదిగింది.

B RAOU

## 16.6 అంబేద్కర్

పూలే, సావిత్రిభాయ్ పూలేల చారిత్రాత్మక పోరాటం నుంచి స్ఫూర్తి పొందిన అంబేద్కర్ అంటరాని కులాలు, వెనుకబడిన కులాల హక్కుల సాధన కోసం పోరాడేందుకు సంకల్పించారు. మానవహక్కుల సాధనకోసం పోరాడేందుకు సంకల్పించారు. మానవహక్కులపై అంబేద్కర్ దృక్పథాన్ని మనం అర్థం చేసుకోవాలంటే పశ్చిమ భారతదేశంలో ప్రాచుర్యం పొందిన కులవ్యతిరేక భావనను గమనించాలి.

అంటరానికులంలో జన్మించిన అంబేద్కర్ ఆ కుల సమస్యలు బాగా అర్థం చేసుకోగలిగారు. మహారాష్ట్రలోని మహర్ కుటుంబంలో అంబేద్కర్ జన్మించాడు. బాల్యం నుండి అంటరానివాడిగా అనేక అనుభవాలు చవిచూసిన అంబేద్కర్ బరోడా మహారాజా పరిపాలనలో ఆఫీసర్‌గా ఉద్యోగం చేసిన సమయంలో సైతం ఈ వివక్షతకు గురైనాడు. షెడ్యూలు కులాలకు చెందినవారు కులంపేరుతో అంటరానితనానికి గురికావడంవల్ల వారి మానవహక్కులు హరించివేయబడుతున్నాయనే సత్యాన్ని అంబేద్కర్ గమనించాడు. షెడ్యూలు కులాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడేందుకు మిలియన్ల కొలది భారతీయుల మానవహక్కులను రక్షించడానికి అంబేద్కర్ అనేక సామాజిక రాజకీయ వ్యూహాలను రూపొందించాడు.

ఎస్.సి.లకు చట్టసభలలోను, ప్రభుత్వ సర్వీసులలోను మరియు విద్యాసంస్థలలోను రిజర్వేషన్లు కల్పించడం మూలంగా భారతదేశంలోని ఉన్నత కులాల దృక్పథంలో కొంతమార్పు వచ్చింది. ప్రాచీన హిందూ కులవ్యవస్థ అనుసరిస్తున్న అంటరానితనానికి, మానవహక్కుల ఉల్లంఘనకు వున్న సంబంధాన్ని అంబేద్కర్ వివరించాడు. ఒక మనిషి ఇంకో మనిషిని తాకడాన్ని, పరస్పరం కలిసి భోజనం చేయడాన్ని, ప్రక్కప్రక్కగా కలిసి జీవించడాన్ని విశ్వసించని సమాజం ఎప్పుడూ ప్రగతిశీలమైన దిశవైపు పయనించజాలదని అంబేద్కర్ అంటాడు.

### 16.6.1 అంబేద్కర్ - కులం

ఆర్యుల ఆధిపత్యం తర్వాతనే భారతదేశంలో కులవ్యవస్థ సృష్టించబడింది. ఆర్యులు స్థానిక వ్యవసాయదారులపై, ఉత్పత్తి దారులపై యుద్ధాలు ప్రకటించి హింసాత్మక దాడులు చేసారు. దీంతో స్థానికులైనవారి హక్కులు నిర్బందంగా హరించివేయబడ్డాయి. హిందూ మతానికి, ఎస్.సి.ఎస్.టి, ఓ.బి.సి. ల (దళిత బహుజనులు) మానవహక్కుల అణచివేతకు చాలా దగ్గరి సంబంధం వుందనే విషయాన్ని గుర్తించిన మొదటి తత్త్వవేత్త అంబేద్కర్.

కులవ్యవస్థ వున్న సమాజంలో మానవహక్కుల ఉల్లంఘన అనేది పౌర సమాజం స్థాయిలోనూ మరియు రాజ్య వ్యవస్థ స్థాయిలోనూ జరుగుతుందని అంబేద్కర్ వాదన. వ్యవస్థాపరమైన హింస హిందూమత హింసకు కొనసాగింపుగా మారిపోయిందటాడు. అంబేద్కర్ తన ప్రముఖ గ్రంథమైన Annihilation of Caste లో కులవ్యవస్థ ఎటువంటి పరిస్థితులను అనుసరిస్తూ మౌలికమైన మానవహక్కులను ధ్వంసం చేస్తుందో విశ్లేషించాడు. కులవ్యవస్థ కేవలం శ్రమవిభజనకు పరిమితం కాలేదని అది శ్రామికుల మధ్యన విభజన తెస్తుంది. బ్రాహ్మణులు వైశ్యులు, క్షత్రియ కులాలు తమ స్వలాభం కోసం ఉత్పత్తివర్గమైన శూద్రులను వివిధ కులాలపేరుతో విభజించి మానవహక్కులను అణచివేసాయి. ఈ కులాలు సామాజిక వ్యవస్థలో వివిధ స్థాయిలలో అసమానతలను సృష్టించాయి.

BRAOU

### 16.6.2 బాధ్యతలకే పరిమితమైన శూద్రులు

దేవునికి సంబంధించిన ఆధ్యాత్మిక విధులు కాకుండా బ్రాహ్మణులకు మరేవిధమైన బాధ్యతలు లేకపోగా అనేకమైన హక్కులను కలిగి ఉన్నారు. అంతేకాక రాజులు మరియు వైశ్యులు బ్రహ్మణులకు సహకారం అందజేయాలి. క్షత్రియ రాజులు ఆధ్యాత్మిక అంశాలను మరియు రుషుల బోధనలను అమలు చేయడమే వారి విధి. వైశ్యులు బ్రాహ్మణులకు మరియు క్షత్రియులకు సేవచేసే బాధ్యత కలిగి ఉండాలి. వీరు శూద్రులైన కార్మికవర్గాన్ని స్వేచ్ఛగా దోపిడి చేసే అవకాశాన్ని పొందారు. మతపెద్దలు, రాజులు మరియు వ్యాపారుల హక్కులను సాధారణ ప్రజలంతా గౌరవించాలి. భారతచరిత్ర పరిణామ క్రమాన్ని అధ్యయనం చేసిన అంబేద్కర్ ప్రకారం ధన, దక్షిణ పేరుతో మతాధికారులు మరియు గుప్త ధనం పేరుతో వైశ్యులు ప్రజలను దోపిడిచేశారు.

శూద్రులలో కూడా అనేక రకాలైన కులాలు అంచెలంచెలుగా గుర్తించబడ్డాయి. ఉదహరణకు రెడ్డి, వెలమ, కమ్మ, కాపు. వీరు నయాక్షత్రియులుగా పరిగణించబడుతున్నారు. వీరికి దిగువన ఇతరవెనుకబడిన తరగతుల వారు వుండగా, వెనుకబడిన తరగతుల వారికి దిగువన షెడ్యూల్ కులాలవారు వున్నారు. షెడ్యూలు కులాల వారు అంటరానితనానికి మరియు షెడ్యులు తెగలవారు ఇతర విధాలైన సామాజిక అసమానతకు లోనయ్యారు. అంబేద్కర్‌ననుసరించి హిందుమతం అసమానమైన నిర్మాణాలను రూపొందించింది. ఈ అసమానతల మూలంగా కొందరికి మాత్రమో ఎక్కువ మొత్తంలో హక్కులు ఇవ్వబడి అనేకులకు అధికమొత్తంలో బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఇటువంటి ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనని వర్గాలకు బాధ్యతలు లేని హక్కులు ఇవ్వబడగా, ఉత్పత్తి ప్రక్రియలో చురుకుగా పాల్గొనె కులాలకు హక్కులు లేకుండా బాధ్యతలు ఇవ్వబడిన సంక్లిష్టమైన సామాజిక వ్యవస్థ రూపొందింది. హిందూ సమాజంలో మెజారిటిగావున్న కొన్ని వర్గాలకు అన్ని హక్కులు ఇవ్వబడ్డాయని అంబేద్కర్ ఒక అవగాహనకు వచ్చాడు. బ్రిటిషువారికి వ్యతిరేకంగా పోరాడడం కన్నా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడం కన్నా కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడల్సిన అవశ్యకతను గుర్తించిన మొదటి తత్వవేత్త అంబేద్కర్. ఇతను కుల నిర్మూలనకు సంబంధించి ఒక కార్యక్రమాన్ని రూపొందించాడు. కాని ఇతని కుల నిర్మూలన ఎజాండాకు గాంధీ మరియు ఇతర కాంగ్రెసు నాయకుల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

### 16.6.3 అంబేద్కర్ మరియు గాంధి

అణచివేతకు గురైన ఎస్.సి, ఎస్.టి మరియు ఓ.బి.సి కులాలకు చెందినవారి మానవ హక్కులను సాధించేందుకు ఉద్దేశించిన అంబేద్కర్ కులనిర్మూలన కార్యక్రమానికి గాంధి వ్యతిరేకించాడు. గాంధి జన్మించిన గజరాతి బనియా (హిందూ కుటుంబం) కులం హిందూ ద్విజుల వ్యవస్థలో ఒక భాగం. అయితే గాంధి అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అంగీకరించాడు. కాని కులవ్యవస్థ నిర్మూలనచేయడమంటే హిందు సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయడమేనని భావించాడు. అంటరానికులాలకు చెందిన వారిని 'హరిజన్' అనే పేరుతో పిలవడాన్ని అంబేద్కర్ వ్యతిరేకించాడు. గాంధి వర్ణధర్మం మనుగడను అంగీకరిస్తూనే అంటరాని తనాన్ని నిర్మూలించాలని కోరుకున్నాడు. అంటే భారత రాజ్యాన్ని హిందూ (రామరాజ్యం) జాతి రాజ్యంగా నిర్మించాలనుకున్నాడు. అంతేకాక ఇతర మతాల పట్ల సమానదృష్టి వుండాలని వాదించేవాడు. ఇదే భావన తర్వాతి కాలంలో సెక్యులరిజంగా రూపుదిద్దుకుంది. అయితే సెక్యులరిజంలో కులానికి ఎటువంటి స్థానం ఉండదు. కులం మరియు అంటరానితనం ఉనికిలో ఉండటమంటే సెక్యులరిజం భావనకు వ్యతిరేకంగా ఉండటమే అవుతుంది.

అణచివేయబడిన వర్గాలకు ధామాషా ప్రతిపాదన చట్టసభలోనూ మరియు ప్రభుత్వ సర్వీసుల్లోనూ అవకాశం కల్పించే విషయంలో అంబేద్కర్‌కు, గాంధికి విభేదాలున్నాయి. దళితులకు అంబేద్కర్ సాధించిన పాక్షిక హక్కులలో 'రెండు ఓట్లు మరియు ద్విసభ్య నియోజకవర్గం' ఒకటి. దళితులకు కల్పించిన ఈ హక్కులకు వ్యతిరేకంగా గాంధి పూనాలోని ఎరవాడ జైలులో అమరణ నిరహారదీక్ష చేపట్టారు. దీంతో గాంధి అంబేద్కర్ ల మధ్య రాజీ కుదుర్చేందుకు 'పూనా ఒడంబడిక' జరిగింది. ఈ ఒడంబడికలో దళితుల రాజకీయ రిజర్వేషన్‌కు సంబంధించి గాంధి తాత్కాలిక ప్రయోజనం సాధించగా అంబేద్కర్ దీర్ఘకాలిక విజయం సాధించాడు. ఇటువంటి రిజర్వేషన్ల సూత్రంపైన ఇటీవల మండల్ కమీషన్ సిఫార్సుల అమలుపై పోరాటం జరిగింది. క్రమంగా భారతీయ తాత్విక ఆలోచనలో సామాజిక న్యాయ సిద్ధాంతం స్థానం సంపాదించుకుంది. మండల్ రిజర్వేషన్ మరియు మహిళా రిజర్వేషన్లు సామాజిక న్యాయభావన నుంచి పెంపొందినవే. స్వాతంత్ర్య పోరాటంలో అంటరానివారి కోసం గాంధి పాత్రను అయనకున్న పరిమితులను గుర్చి అంబేద్కర్ తాను రాసిన "What congress and Gandhi have done to untouchables" పుస్తకంలో అంచనా వేశాడు.

మానవహక్కులకు సంబంధించి కులవ్యవస్థ ఏరకమైన అర్థంకులను సృష్టిస్తుందో అంబేద్కర్ తన సృజనాత్మకమైన తాత్విక ఆలోచనా దృక్పథంతో వివరించాడు. ఎస్.సి, ఎస్‌టి మరియు ఓ.బి.సి కులాలకు మానవహక్కులు ఏ మేరకు వర్తిస్తాయి? మానవహక్కులకు సంబంధించిన అంశాలలో కులాన్ని ఏరకంగా చూడాలి మెదలైన ప్రశ్నలను అంబేద్కర్ లేవనెత్తాడు.

### 16.6.4 కులం - మానవహక్కులు

దళితులకు కులవ్యవస్థ నాలుగు రకాల మౌలిక హక్కులను నిరాకరించింది. అవి (a) ఇతరులను తాకడం లేదా ఇతరులు తమను తాకే హక్కు (b) ఇతర మానవ సమాజం నుంచి ఆహారం పొందే హక్కు (c) కులవ్యవస్థ నిర్మించిన పరిధులకు అతీతంగా ఇతర సమాజాల నుంచి వివాహం చేసుకునే హక్కు (d) వృత్తిని మార్చుకోవడం, ఇతర రంగాలకు సంబందించిన నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని పొందే హక్కు.

ఇటువంటి నిర్బంధాలన్ని దళితులను మానసికంగా, శారీరకంగా ఎదగకుండా చేస్తాయని అంబేద్కర్ భావించాడు. పౌరసమాజంలోని ప్రతివ్యక్తి తన జీవనంలో సమాన అవకాశాలు కావాలని కోరుకుంటాడు. మానవహక్కుల భావన మనిషి ఔన్నత్యాన్ని మరియు ఆత్మగౌరావాన్ని పెంపొందిస్తాయి. అయితే కులవ్యవస్థ ఈ హక్కులకు స్థానం లేకుండా చేసింది.

### 16.6.5 స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వంపై అంబేద్కర్ భావాలు

స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వంపై అంబేద్కర్ చాలా స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్యం చేశాడు. ఫ్రెంచి విప్లవానంతరం పాశ్చాత్య సమాజంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం భావాలకు సంబంధించి విస్తృతప్రాచుర్యం లభించిది. దీనికి విరుద్ధంగా భారత దేశంలో హిందుసామాజిక వ్యవస్థ ప్రజలలో స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వానికి సంబంధించిన చైతన్యాన్నిఅహ్వానించలేకపోయింది. అయితే హిందు సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా బుద్ధిజం కాలంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాత్రుత్వం నకు సంబంధించిన సృజనాత్మకమైన ఆలోచనలను ప్రజలలో కల్పించడానికి ప్రయత్నం చేసింది. కులం, వర్గం మరియు లింగం బేదాలు లేకుండా సంఘంలో సభ్యత్వం పొందిన వారందరికి హక్కులు లబించేట్టు చేసింది. అందువల్ల అంబేద్కర్ బుద్ధిజం అందచేసిన దృక్పధాన్ని పునర్నిర్మించి ప్రజలందరికి హక్కులు పొందే అవకాశాన్ని కల్పించేందుకు ప్రయత్నించాడు.

సామాజిక హక్కుల పునాదులపైనా రాజకీయ మరియు ఆర్థిక హక్కులు ఆధారపడి ఉన్నాయని అంబేద్కర్ అభిప్రాయ పడ్డాడు. అసంఖ్యాకులైన ప్రజలను హిందూమతం మరియు కులవ్యవస్థ సామాజిక హక్కులను నిరాకరించిది. భారత రాజకీయ వ్యవస్థ సైతం హిందు పౌరసమాజం వలెనే దళితులకు, ఇతర అణచివేత వర్గాల హక్కుల విషయంలో ఉదాసీనత వ్యక్తపర్చింది. క్షత్రియ రాజులు వర్ణధర్మాన్ని విశ్వసించడం మూలంగా శూద్రులకు, చండాలులకు ఎటువంటి హక్కులను ప్రకటించలేదని అంబేద్కర్ చారిత్రకంగా వివరించాడు. చదవటం రాసే హక్కును, దేవాలయలోనికి ప్రవేశించే హక్కును పరస్పరం నేర్చుకునేహక్కును శూద్రులకు నిరాకరించారు. ఇంకో మాటలో చెప్పాలంటే వారిని మనషులుగా గుర్తించలేదు.

ఈ పరిస్థితుల్లో చైతన్యవంతమైన అణచివేత వర్గాల ఆకాంక్షలను రాజ్యం పరిగణలోకి తీసుకోవాల్సి వచ్చింది. విద్యా రంగంలోనూ, ఉద్యోగ రంగంలోకి తీసుకోవాల్సి వచ్చింది. విద్యారంగంలోను, ఉద్యోగ రంగంలోనూ ఈ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించటమంటే శూద్రులు కొన్ని హక్కులు పొందటం మాత్రమేనని, కాని చారిత్రకంగా ఏర్పడిన సమస్యలను పూర్తిగా పరిష్కరించే అవకాశం మాత్రం ఏర్పడదని అంబేద్కర్ అభిప్రాయపడుతాడు. కేంద్రీకృతమైన రాజ్యవ్యవస్థ ఈ అంశాలలో జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంబేద్కర్ రాసిన "State and Minorities" అనే డాక్యుమెంటులో పారిశ్రామిక సంపదను జాతీయం చేయడం మరియు వ్యవసాయ భూములను సహకార వ్యవస్థలో నిర్వహించాలన్నారు. ఇటువంటి సంపద పై రాజ్యానికి పూర్తి ఆధిపత్యం ఏర్పడినపుడు ఎస్.సి, ఎస్.టి మరియు ఓ.బి.సిలు కొంతవరకు సంపదపై హక్కులు సాధించే అవకాశం ఏర్పడుతుంది.

### 16.6.6 మానవహక్కులు - హింస

అణచివేతకు గురైన వార్గాలకు మానవహక్కుల విషయంలో హిందూకుల వ్యవస్థలో జరుగుతున్న నిర్బంధం కూడా హింసా స్వభావాన్ని కలిగివుంది. అణచివేత వర్గాలకు చెందిన శూద్ర, చండాల ప్రతినిధులు విద్య ద్వారా తమ హక్కులు తెలుసుకున్నారు. వీరు తపస్సు చేసి సాధించుకున్న హక్కులపై పాలక వర్గాలు నిర్ధాక్షిణ్యంగా దాడి చేసాయి. ఏకలవ్య, శంభూక, బాలి మరియు వాలి మొదలైన వారు ఇందుకు ఉదాహరణలు. రామ, ద్రోణాచార్య, వామనులు హింసాత్మక పద్ధతులద్వారా పైన పేర్కొన్న శూద్రులను హతమార్చి వారికి హక్కులు లేకుండా చేశారు. హిందూమతం ఆరాధన పేరుతో హింసను ప్రోత్సహిస్తుందని అంబేద్కర్ అభిప్రాయ పడ్డాడు. శూద్రులను వ్యతిరేకించేవారు ఆరాధన, భక్తి పేరుతో శూద్రులకు, ఛండాలులకు హక్కులు లేకుండా హింసాత్మకంగా అణచివేశారు.

అంబేద్కర్ హిందూయిజాన్ని మరియు కమ్యూనిజాన్ని వ్యతిరేకించాడు. ఈ రెండు హింసను ప్రోత్సహిస్తున్నాయంటాడు. హింసకు తావులేని సామ్య వాద తరహా భావాలను అంబేద్కర్ సమర్థించాడు. అణచివేయబడ్డ వర్గాలు హింసాపద్ధతుల ద్వారా పోరాటం చేస్తే తమహక్కును తిరిగి పొందలేరనేది అంబేద్కర్ అభిప్రాయం. అంటే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గాంధి ఉపయోగించిన పద్ధతినే అంబేద్కర్ హిందూమతానికి వ్యతిరేకంగా ఉపయోగించాడు.

BRAOU

హింసా పద్ధతులను అవలంబించే బ్రిటీషు వారికి వ్యతిరేకంగా గాంధి అవలంభించిన అహింసా పద్ధతివలె అంబేద్కర్ హిందూ హింసాపద్ధతికి వ్యతిరేకంగా బుద్ధిజం పేర్కొనే అహింసాపద్ధతిని ఉపయోగించాడు. అణచి వేతకు గురైన వర్గాలు ప్రజాస్వామ్య పద్ధతులద్వారా సంఘటితమైతే తమహక్కులను సాధించుకునే అవకాశం ఏర్పడుతుందని అంబేద్కర్ విశ్వసించాడు. అంబేద్కర్ మరియు గాంధీలు ఉపయోగించిన అహింసా పద్ధతుల మధ్య మౌలికమైన వ్యత్యాసం వుంది. గాంధి తన అహింసా భావనలో రాముడు, కృష్ణుడిని సూచికలుగా వాడితే అంబేద్కర్ వాస్తవమైన బుద్ధిజాన్ని సూచికగా వాడారు.

## 16.7 ముగింపు

బుద్ధుడితో ప్రారంభమైన దళిత బహుజన భావన జాతీయోద్యమకాలంలో అంబేద్కర్‌తో ఒకదశకు చేరుకోగలిగింది. హిందూతత్వవేత్తలైన కౌటిల్యుడు, మనువు, రాజారాంమోహన్‌రాయ్, గాంధి వంటివారు భారతీయ సమాజాన్ని అర్ధంచేసుకున్న తీరు ఇందుకు పూర్తి భిన్నమైంది. దళిత బహుజన సాంప్రదాయం అంబేద్కర్ చెప్పినట్లు "బోదించు, సమీకరించు మరియు ఉద్యమించు" వాటిపై నమ్మకం కలిగివుందంటాడు. హిందూ సమాజం కులం మరియు ఉపకులాల పేరుతో వేటికవే కుదురుగా నిర్మితమై ఉన్నాయి. ఈ వైరుధ్యాలు ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా తొలగించవచ్చని బుద్ధిస్టులు, అంబేద్కరైట్స్ విశ్వాసం వ్యక్తం చేస్తారు. ఇది మనిషికున్న చైతన్యస్థాయి కొద్దిమంది హక్కుల నుంచి బహుజనుల హక్కుల (మైనారిటీ హక్కుల నుండి మెజారిటీ హక్కుల వరకు) స్థాయికి పెంపొందిస్తుంది. భారత రాజ్యాంగ రచనలో అంబేద్కర్ ఈ లక్ష్యాన్ని దృష్టిలో వుంచుకున్నారు. అయితే భారతరాజ్యాంగం ఇటువంటి తరహా హక్కులను ప్రతిబింబించదు. వలసవాదానంతర సంధికాలంలో రాజ్యాంగం ప్రారంభదశలో ప్రభుత్వ హక్కులను మరియు కొద్దిమంది పాలకవర్గ హక్కులను మాత్రమే ప్రతిబింబించగలిగింది.

అంబేద్కర్ అనంతరదశలో రాజ్యం మరియు పౌరసమాజం రెండు మానవహక్కులపై విధిస్తున్న నిర్బంధాన్ని ఎలా ఎదిరించాలనే అంశంపై పెద్దఎత్తున చర్చజరిగింది. ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా ప్రజలను కదిలించినపుడే మానవహక్కులు సాధించబడతాయని కొంతమంది అంబేద్కరైట్స్ భావించగా మరికొందరు అంబేద్కరిజాన్ని మరియు మర్క్సిజాన్ని మిళితంచేసి మరోకొత్త సిద్ధాంతాన్ని రూపొందించి పోరాడాలని అప్పుడే ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సి మరియు స్త్రీల మానవ హక్కులు సాధించబడతాయని భావించారు. అంబేద్కర్ ప్రవేశపెట్టిన 'హిందూకోడ్' బిల్లు నెహ్రూతో సహా పార్లమెంటు ఆమోదం పొందలేకపోవడంతో తన న్యాయశాఖామంత్రి పదవికి రాజీనామా చేసిన అంశాన్ని మనం గుర్తుంచుకోవాలి. స్త్రీల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్.

భారత దేశంలోని దళిత బహుజనుల మానవహక్కులకు సంబంధించిన అనేకమైన మౌలిక ప్రశ్నలను లేవనెత్తిన మొదటి తత్వవేత్త అంబేద్కర్. ఎటువంటి రూపంలోవున్న హింసనైనా అంబేద్కర్ వ్యతిరేకించి హింసపై నూతన అవగాహనను ఏర్పర్చాడు. ఏ రూపంలోని హింస అయినా సామాజిక - రాజకీయ వ్యవస్థలను ధ్వంసం చేస్తుందని అంబేద్కర్ పేర్కొన్నాడు.

BRAOU

## 16.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ప్రాచీన భారతదేశంలో మానవహక్కుల కోసం బుద్ధిజం చేసిన కృషిని చర్చించండి?

2. మానవ హక్కుల ఉల్లంఘనకు కులం ఒక సాధనంగా మారడానికి గల పరిస్థితులను అంబేద్కర్ ఎలా విశ్లేషించాడు?

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి?:**

1. భారత దేశంపై బౌద్ధమత ప్రభావం ఎటువంటిది?

2. మానవ హక్కుల సాధనలో బసవ ఉద్యమం పాత్ర?

3. హిందూ మతంలో భక్తి ఉద్యమం తెచ్చిన మార్పు ఏమిటి?

4. మానవ హక్కులపై పూలే భావాలు చర్చించండి?

5. కుల వ్యవస్థపై అంబేద్కర్ - గాంధీ ల అవగాహన పరిశీలించండి?

BRAOU

# Model Question Paper

## Post Graduate Diploma in Human Rights

## Paper-I-Human Rights-Philosophical Foundations

**Max. Marks : 70**

### మొదటి విభాగం

**(మార్కులు : 4×10=40)**

క్రింది వాటిలో ఏవైనా నాలుగు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబు వ్రాయండి. ప్రతి ప్రశ్నకు 10 మార్కులు.

1. మానవ హక్కులంటే ఏమిటో వివరణాత్మకంగా చర్చిండి.
2. పౌర సమాజం మరియు స్వేచ్ఛకు సంబంధిచిన వివిధ దృక్పథాలు వివరించండి?
3. మానవ హక్కులపై రూసోభావాలు చర్చించండి.
4. మానవ హక్కుల ఎజెండాపై గ్రాంసీ ప్రతిపాదించిన ఏడు అంశాలు వివరించండి.
5. మానవ హక్కుల భావన, ఆచరణలకు సంబంధించి నోమ్‌భామ్‌స్కీ సైద్ధాంతిక కృషిని వివరించండి.
6. పౌర సమాజంపై గాంధీ అభిప్రాయాలు చర్చించండి.
7. కుల వ్యవస్థపై అంబేద్కర్ అవగాహనను పరిశీలించండి?
8. మానవ హక్కులపై స్త్రీవాదం తౌలికదృక్పథాలు పేర్కొనండి.

BRAOU

### రెండవ విభాగము

**(మార్కులు: 5×6=30)**

ఈ క్రింది వాటిలో ఏవైనా ఐదు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 20 పంక్తులలో జవాబు వ్రాయండి. ప్రతి ప్రశ్నకు 6 మార్కులు.

9. మానవ హక్కుల ఉద్దేశాన్ని, పరిధిని విశ్లేషించండి.
10. పౌర సమాజంపై మార్క్సిస్టు దృక్పథం వివరించండి.
11. లింగ, కుల, వర్ణ, వివక్షల కారణంగా మానవహక్కులు పొందడంలో ఎదురవుతున్న అవరోధాలు ఏమిటి?
12. హక్కులపై ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తల భావాలు చర్చిండి.
13. వ్యక్తుల హక్కులను చట్టం ఎలా పరిరక్షించాలని డైసీ కాంక్షిస్తారు?
14. మానవహక్కుల సంస్థను ప్రజాస్వామీకరించడంలో రోజాలగ్జెంబర్గ్ ఆలోచనలేమిటి?
15. మానవహక్కులపై మూడవ ప్రపంచ ఆలోచనా స్రవంతిని విమర్శనాత్మకంగా అంచనావేయండి?
16. 'విద్య ఒకవిముక్తి సాధనం' అన్నఫేయర్ భావనలను వివరించండి?
17. గాంధేయ పోరాట విధానాలు చర్చించండి?
18. లోహియా పేర్కొన్న పౌరహక్కులపై చర్చించండి?

# అందరికీ అందుబాటులో ఉన్నత విద్య




## డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

రోడ్డు నెం: 46,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033

DHR - ( T ) 02

# మానవ హక్కులు : చారిత్రక దృక్పథాలు



డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం , హైదరాబాద్

BRAOU

# మానవ హక్కులు: చారిత్రక దృక్పథాలు

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం
ప్రొ. జి. రాంరెడ్డి మార్గ్, రోడ్ నెం. 46, జూబిలిహిల్స్,
హైదరాబాద్-500 033.

# పాఠ్య నిర్మాతలు

**సంపాదకులు**
ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు

**రచయితలు**
ఆచార్య జి. హరగోపాల్
డా॥ కె.ఎస్.ఎస్. శేషన్
డా॥ ఆర్. హంగ్లూ
సల్మా అహ్మద్
డా॥ మహ్మద్ మొజం అలీ
కె. మురళి
ఎ. సునిత
జి. విజయ్
కల్పన కన్నాభిరన్
సుమనదాస్ గుప్త
కె. కోదండ రాంరెడ్డి

**కార్యక్రమ సమన్వయకర్త**
ఘంటా చక్రపాణి

**అనువాదం**
డా. కె. శ్రీనివాస్
డా॥ ఎం. శ్రీధర్
అల్లం నారాయణ
కె. మురళి
వసంత లక్ష్మి

**ముఖచిత్రం**
చంద్ర

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్

*ప్రథమ ముద్రణ, 2000*

© 2000, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నయినా ఉపయోగించ దలుచుకుంటే విశ్వవిద్యాలయము అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం

*ఇతరవివరాలకు:*
డైరెక్టర్ (అకాడమిక్) డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
ప్రొ॥ జి. రాంరెడ్డి మార్గ్, రోడ్ నెం. 46, జూబిలిహిల్స్, హైదరాబాద్-33.

---

Lr. No. 525A/BRAOU/DMP/PTG/2000-01/J.O.602/Dt. 26-11-2000 Copies : 1000
Printed at M/s. Joy 'N' Joy Offset Printers, 3-2-6/5, Beside Badruka College, Kachiguda, Hyderabad. Ph. 6583424.

# పరిచయం

ఇది మానవ హక్కుల యుగం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో, అన్ని సమాజాల్లో ఇప్పుడు మానవ హక్కులు ఒక ప్రధానమైన చర్చనీయాంశం. ఒక రకంగా చెప్పాలంటే గడిచిన సహస్రాబ్దిని (1000AD నుంచి 1999AD) మనం మానవ హక్కుల సహస్రాబ్దిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే మానవ హక్కుల భావన వికసించింది, విస్తరించింది ఈ సహస్రాబ్దిలోనే.

మానవ జాతిలో హక్కుల భావన తొలిసారిగా మొలకెత్తిన 13వ శతాబ్ది తొలిరోజుల నుంచి ఈనాటి 21వ శతాబ్ది ఆరంభం దాకా 'మానవ హక్కుల ఉద్యమం' అనేక పరిణామాలకు గురి అయ్యింది. అనేక సిద్ధాంతాలు, అనేక ధోరణులు, దృక్పథాలు చారిత్రక భావనలు మానవ హక్కుల భావనకు మరింత పదును పెట్టాయి. పరిపుష్టం చేశాయి. ఇప్పుడు మన దేశంలాంటి అనేక దేశాలు, ఆ దేశాల ప్రజల చేతుల్లో మానవ హక్కులు ఒక వజ్రాయుధం అయ్యింది. ఒక సమోజ్వల ఉద్యమంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఈ ఉద్యమంలో అగ్ర భాగాన వుంది.

ఈ నేపథ్యంలో మానవ హక్కుల బావనను జనబాహుళ్యానికి తెలియ పరచడం భాద్యతగా భావించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మానవ హక్కుల విద్యా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఒక డిప్లొమాను ప్రవేశపెట్టాలని విశ్వవిద్యాలయం నిర్ణయించింది. మానవ హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలన్న 'జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా విద్యా కార్యక్రమంలో చేర్చడంతో పాటు, దేశంలోనే తొలిసారిగా ఒక పూర్తిస్థాయి డిప్లొమాను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగులో మీ కందిస్తోంది.

BRAOU

ఐదు కోర్సులుగా వున్న డిప్లొమా కార్యక్రమంలో 'మానవ హక్కులు: చారిత్రక దృక్పథాలు' ఒక కోర్సు చేర్చడం జరిగింది. ఈ సంపుటంలో అధ్యయనాంశాలను మొత్తం నాలుగు ఖండాలుగా విభజించడం జరిగింది.

అవి:

1. అంతర్జాతీయ వారసత్వాలు
2. అంతర్జాతీయ ఒడంబడికలు, ప్రకటనలు
3. అంతర్జాతీయ హక్కుల సంస్థలు
4. ఇటీవలి ఆలోచనా ధోరణులు

ఈ నాలుగు ఖండాల్లో మొత్తం 18 అధ్యయన భాగాలున్నాయి. వీటిని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహకారంతో ఆయా రంగాల మేధావులు, మానవ హక్కుల ఉద్యమాలలో భాగస్వాములైన కార్యకర్తలు ఇతర వృత్తి నిపుణులు అధ్యాపకులతో రూపొందించడం జరిగింది. ఈ ప్రయత్నంలో మానవ హక్కులపై తొలిసారి ఒక డిప్లొమాను రూపొందించిన సార్వత్రిక విశ్వవిద్యాలయంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ పాఠ్యాంశాలు కూడా తెలుగులో మొదటిసారిగా వెలువడుతున్న సమాచారం. ఈ పాఠ్యాంశాల అధ్యయనం ద్వారా మానవ హక్కుల పట్ల అవగాహనతో పాటు విద్యార్థులకు ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడే అవకాశం వుంది. అలాగే మానవ హక్కుల కార్యకర్తలకు, ఆ ఉద్యమంలో మమేకమైన వారికి ఈ కార్యక్రమం మార్గ నిర్దేశం చేస్తుంది.

BRAOU

# మానవ హక్కులు: చారిత్రక దృక్పథాలు

## విషయ సూచిక


ఖండం I అంతర్జాతీయ వారసత్వాలు

భాగం 1. ఐరోపా వారసత్వం
భాగం 2. ఆధునిక విప్లవాలు-మానవ హక్కులు
భాగం 3. ప్రపంచ యుద్ధాలు : శాంతి
భాగం 4. వలసవాద వ్యతిరేక పోరాటాల వారసత్వం
భాగం 5. సోషలిస్టు విప్లవాల వారసత్వం

ఖండం II అంతర్జాతీయ ప్రకటనలు-ఒడంబడికలు

భాగం 6. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన
భాగం 7. ఖైదీల మానవ హక్కులు
భాగం 8. వివక్ష వ్యతిరేక ఒడంబడికలు
భాగం 9. అభివృద్ధి హక్కులు
భాగం 10. శ్రామిక వర్గ హక్కులు

ఖండం III అంతర్జాతీయ హక్కులు-సంస్థలు

భాగం 11. ఐక్యరాజ్య సమితి-మానవ హక్కుల కమిషన్
భాగం 12. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్
భాగం 13. హ్యూమన్ రైట్స్ వాచ్
భాగం 14. ఐ.ఎం.ఎఫ్. ప్రపంచ బ్యాంకు మానవ హక్కులు

ఖండం IV ఇటీవలి ధోరణులు

భాగం 15. వియన్నా ప్రపంచ మానవ హక్కుల సదస్సు
భాగం 16. రియో ప్రపంచ పర్యావరణ సదస్సు
భాగం 17. బీజింగ్ ప్రపంచ మహిళా సదస్సు 1995
భాగం 18. నూతన ప్రపంచ వ్యవస్థ-మానవ హక్కులు:కొత్త ధోరణులు


BRAOU

BRAOU

# ఖండం I

# అంతర్జాతీయ వారసత్వాలు

BRAOU

BRAOU

# భాగం 1: ఐరోపా వారసత్వం

విషయక్రమం


1.0 ఉద్దేశం

1.1 మాగ్నాకార్టా: ఒక మహా ఒప్పంద పత్రం

1.1.1 మాగ్నాకార్టాలోని అంశాలు

1.1.2 మాగ్నా కార్టా ప్రాముఖ్యం

1.2 పునరుజ్జీవనోద్యమం

1.2.1 పునరుజ్జీవనం ఫలితాలు

1.3 సంస్కరణ ఉద్యమం

1.3.1 తొలినాటి ఉద్యమాలు

1.3.2 లూథర్ తిరుగుబాటు

1.3.3 ఉద్యమం వ్యాప్తి

1.3.4 సంస్కరణ ఫలితాలు

1.4 డచ్ స్వాతంత్ర్య పోరాటం

1.4.1 తిరుగుబాటుకు కారణాలు

1.4.2 డచ్ స్వాతంత్ర్య ప్రకటన

1.5 ముగింపు

1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 1.0 ఉద్దేశం

### *ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- ఐరోపాలో మాగ్నా కార్టా ప్రాధాన్యతను తెలుసుకుంటారు.
- పునరుజ్జీవనోద్యమ ఫలితాలు అవగతమవుతాయి.
- మత సంస్కరణోద్యమ ఫలితాలు వివరించగలుగుతారు.

## 1.1 మాగ్నాకార్టా: ఒక మహా ఒప్పంద పత్రం

ఇంగ్లండు సాధించిన అత్యున్నత విజయం, మానవ నాగరికతకు అది చేసిన మహోపకారం ఏమిటంటే, స్వేచ్ఛకు వ్యవస్థకూ మధ్య, సుస్థిరతకు ప్రగతికి మధ్య సామరస్యం ఉండే ఒక ప్రభుత్వ నిర్మాణాన్ని రూపొందించుకోవడం. ఈ పాలనా రూపమే రాజ్యాంగబద్ధ రాచరికం. ఆంగ్లేయ రాజ్యాంగం ప్రధాన లక్షణం అది నిరంతరం మెరుగుపడుతూ ఉండడం.

ఆంగ్లేయ రాజ్యాంగం అలిఖిత రాజ్యాంగంగా ప్రసిద్ధి చెందినా అందులో చాలా లిఖిత అంశాలు ఉన్నాయి. మాగ్నాకార్టా, బిల్ ఆఫ్‌రైట్స్ ఆ రాజ్యాంగంలోని లిఖిత భాగాలు. ఇప్పటికీ వాటిని బ్రిటిష్‌వారు అనుసరిస్తూ ఆచరిస్తూ ఉన్నారు. మాగ్నాకార్టా ప్రజల హక్కులకు హామీ ఇచ్చిన మొదటి లిఖిత ప్రకటన.

రెండో హెన్రీ విధానాల వల్ల పటిష్టమయిన ఆంగ్లో సాక్సన్ రాజుల అతీతవాదం (absolutism), జాన్ రాజు (1204-1216) కాలంలో పరాకాష్టకు చేరుకుంది. అతడు కిరాయి సైనికులను నియమించి వారి సాయంతో ప్రజల మీద పన్నులు, జరిమానాలు విధించడం మాత్రమే కాకుండా అనేక క్రూరమయిన అణచివేత చర్యలు జరిపాడు. అతడు ఫ్రెంచి రాజుతోనూ పోప్ తోనూ కూడా తగాదా పడ్డాడు.

జాన్ రాజు ఆంగ్లేయ ప్రజల మద్దతు మీదే ఆధారపడవలసి వచ్చింది. బ్యారన్లు (ఇంగ్లండులోని ఒక రకం ఫ్యూడల్ భూస్వాములు) కూడా ఇంగ్లండుకు మాత్రమే పరిమితమయినందున మంచి పరిపాలన సాధించడానికి ఏమీ చేయలేక పోయారు. కాంటర్‌బెరీ ఆర్చిబిషప్ ఎన్నిక విషయమై జాన్ మూడవ పోప్ ఇన్నోసెంట్‌తో తగువు పెట్టుకున్నాడు. కాంటర్‌బెరీ క్రైస్తవ సన్యాసులు ఒకరిని ఎన్నుకుంటే, జాన్ మరొకరిని ఆర్చిబిషప్‌గా ఎంచుకున్నాడు. వారిద్దరూ కలిసి పోప్‌ను ఆశ్రయిస్తే, ఆయన ఇంకొకరిని ఎంపిక చేశాడు. జాన్‌ను మతంనుంచి పోప్ వెలివేశాడు. కానీ, ఫ్రెంచ్ సైన్యం దాడికి దిగే పరిస్థితి వచ్చేదాకా జాన్ లొంగలేదు. అప్పుడు జాన్ తాను పోప్‌కు విధేయుడినని ప్రకటించాడు దాన్ని ప్రజలు నిరసించారు.

ఫ్రాన్స్ అధీనంలో ఉన్న భూభాగాలను తిరిగి సాధించడానికి జాన్ రాజు దండెత్తాలనుకుంటే, బ్యారన్లు ఒప్పుకోలేదు. తమ ఫ్యూడల్ బాధ్యతలు ఇంగ్లండు వదిలి బయటకు పోవడానికి అనుమతించవని వారు వాదించారు. ఈ లోగా జాన్‌ను ఫ్రెంచి రాజు ఓడించాడు. పట్టణవాసుల మద్దతుతో బ్యారన్ల బలం పెరిగింది. ఒకటవ హెన్రీ జారీ చేసినటువంటి హక్కుల శాసనాన్ని జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అప్పుడు రాజు జాన్ ఫ్రాన్స్‌లో ఉన్నాడు, తిరిగి రాగానే అతను కిరాయి సైనికులను రంగంలోకి దింపాడు, పోప్ సహాయం తీసుకుని బ్యారన్లను అణచి వేయాలనుకున్నాడు. అయితే బ్యారన్ల బలం జాన్ బలానికి మించింది. చివరికి జాన్ మిత్రులు కూడా అతనిని వదిలి వెళ్లారు. అప్పుడు జాన్ 1215 జూన్ 15 నాడు మాగ్నాకార్టా శాసనపత్రం మీద సంతకాలు చేశాడు.

BRAOU

## 1.1.1 మాగ్నాకార్టాలోని అంశాలు

మాగ్నాకార్టాలో 63 అధికరణాలున్నాయి. చర్చికి సంబంధించినవి, ఫ్యూడల్ విధులు, న్యాయం, చట్టం, రాజ్యాంగ అంశాలు-ఇలా వాటిని విషయతరగతిని బట్టి కొన్ని విభాగాలు చేయవచ్చు. చర్చి, దాని స్వేచ్ఛలు, హక్కులతో సహా స్వతంత్రంగా ఉండాలని శాసన పత్రం నిర్ధారించింది. రాజుకు విధిగా చెల్లించవలసిన ఫ్యూడల్ చెల్లింపుల విషయంలో సాంప్రదాయికంగా అమలులో వున్న మొత్తానికి మించి తీసుకోకూడదని, మైనర్ ఆస్తిని వ్యర్థం చేయరాదని మాగ్నాకార్టా ప్రకటించింది. శిక్ష విధించిన అర్థ బానిస/సేవకుడు ఆస్తిని ఏడాది మీద ఒక రోజుకు మించి రాజు తన ఆధీనంలో ఉంచుకోగూడదని మాగ్నాకార్టా చెప్పింది.

న్యాయ సంబంధమయిన విషయాలు శాసనపత్రంలో అనేకం ఉన్నాయి. సర్వసాధారణ ఫిర్యాదులకు సంబంధించిన విచారణ ఒక నిర్ణీత స్థలంలో జరగాలి. స్వతంత్రుడయిన ఏ వ్యక్తినీ తగిన విచారణ లేకుండా శిక్షించరాదు. ''ఏ స్వతంత్రమయిన వ్యక్తినీ బహిష్కరించడంకానీ, ప్రవాసం పంపడం కానీ, ఏ రకమయిన హాని తలపెట్టడం కానీ జరగదు, ఏ వ్యక్తికీ వ్యతిరేకంగా వ్యవహరించడం జరగదు. అతని యజమాని, చట్టబద్ధమయిన తీర్పు ద్వారాగానీ, ఈ దేశపు చట్టం ద్వారాగానీ తప్ప'' అని మాగ్నాకార్టా ఉద్ఘాటించింది. జరిమానాలు నేరాలకు తగ్గట్టుగా ఉండాలి, ఆదాయమార్గాలు జరిమానాకు ప్రాతిపదిక కారాదు. న్యాయాన్ని వ్యాపారంగా మార్చబోనని రాజు వాగ్దానం చేయాలి. న్యాయ శాస్త్రంలో నిష్ణాతులయిన వారిని న్యాయమూర్తులుగా నియమించాలి.

ఒక సాధారణ మండలిని ఏర్పాటు చేయాలని మాగ్నాకార్టా ప్రతిపాదించింది. ఈ మండలిలో ఆర్చిబిషప్‌లు, బిషప్‌లు, ఈర్ల్‌లు, పెద్ద బ్యారన్లు సభ్యులుగా ఉంటారు. ఈ మండలి సమావేశాన్ని ప్రత్యేక ఆజ్ఞ ద్వారా ఏర్పాటు చేయాలి. లండన్ మహానగరం, ఇతర నగరాలు, పట్టణాలు, టౌన్‌లు, ఓడరేవులు అన్నీ స్వంత స్వేచ్ఛలను, స్వేచ్ఛా సుంకాలను కలిగివుండాలి. అధిక పన్నులనుంచి, ఇతర వసూళ్లనుంచి, అటవీ చట్టాలనుంచి సామాన్యులను రక్షించడానికి అనేక నిబంధనలు కూడా మాగ్నాకార్టాలో ఉన్నాయి.

ఈ మహాహక్కుల శాసనానికి ఆమోదం తెలిపిన వెంటనే, దాన్ని విస్మరించాలని జాన్‌రాజు ప్రయత్నించాడు. ఆ శాసనం అతనినుంచి బలవంతంగా చేయించినది కాబట్టి, దానికి కట్టుబడి ఉండవలసిన పనిలేదని పోప్ చేత చెప్పించాడు. బ్యారన్లతో పోరాడడానికి కిరాయి సైనికులను రప్పించాడు. జాన్ 1216లో మరణించాడు. తరువాత అతని మైనర్ కుమారుడు మూడవ హెన్రీ రాజయ్యాడు.

## 1.1.2 మాగ్నాకార్టా ప్రాముఖ్యం

బ్యారన్‌లకు ప్రయోజనం కలిగించిన భూస్వామ్య పత్రంగా మాగ్నాకార్టా కనిపించినా, వాస్తవంలో అది అందుకు విరుద్ధమయినది. 'స్వేచ్ఛ' అన్న మాట పత్రంలో తరచు కనిపిస్తుంది. ఇక్కడ, అంటే 13వ శతాబ్దంలో, ఆ మాటకు అర్థం ఒక ప్రత్యేకమయిన వర్గానికి కావలసిన ప్రత్యేక సదుపాయాలు. కానీ ఇప్పుడు ఆ మాటకున్న అర్థం-ఏ వర్గానికీ ప్రత్యేక సదుపాయాలు కానీ, రాయితీలు కానీ ఉండకూడదని చెబుతుంది.

మొత్తం మానవచరిత్రలోనే మాగ్నాకార్టా అతి ముఖ్యమయిన రాజ్యాంగ పత్రం, ఆంగ్లేయ స్వేచ్ఛకు అది పునాది వంటిది. ఛాతమ్ (Chatham) ప్రకారం మాగ్నాకార్టా, పిటిషన్ ఆఫ్ రైట్స్, బిల్ ఆఫ్ రైట్స్ కలిపి 'ఆంగ్లేయ రాజ్యాంగానికి బైబిల్' వంటివి. అయితే, ఏ విలువల మీద ఈ పత్రం రూపొందిందో దాన్ని బట్టి ప్రాధాన్యాన్ని నిర్ణయించాలి. ప్రజానుకూలమయిన పన్నుల పద్ధతిని గానీ, ప్రజలకు మంత్రులు బాధ్యత వహించాలని కానీ, జూరీ ద్వారా విచారణ జరగాలని కానీ మాగ్నాకార్టా కోరలేదు. మాగ్నాకార్టా గుర్తించినది ఏమిటంటే-రాజ్యంలో ఒక న్యాయవ్యవస్థ ఉన్నది, పాలితులకు లేదా ప్రజలకు కొన్ని హక్కులున్నాయి, వీటిని రాజు గుర్తించక తప్పదు. అతను వాటిని ఉల్లంఘించిన పక్షంలో వాటి పరిరక్షణ కోసం తిరుగుబాటు తప్పదు.

13వ శతాబ్దం అంతటా మాగ్నాకార్టా జనం మనసుల్లో నిండిపోయి ఉంది. ఇంతకాలం రాజు పక్షాన ఉన్న సామాన్య జనం ఇప్పుడు రాజుకు వ్యతిరేకంగా బ్యారన్ల పక్షానికి చేరిపోయారు. మాగ్నాకార్టా పొందిన ఈ గౌరవాన్నే 14, 15 శతాబ్దాలలో పార్లమెంటు పొందింది. ట్యూడర్‌ల కాలంలో ప్రజలు మాగ్నాకార్టా గురించి పట్టించుకోలేదు. కారణం, అప్పుడు రాజుకూ, ప్రజలకూ మధ్య ఒక రకమయిన ఏకీభావం ఉండేది. షేక్స్పియర్ తన 'కింగ్ జాన్'లో మాగ్నాకార్టా ప్రస్తావన కూడా చేయడు.

మొదటి ఎలిజబెత్ మరణం తరువాత స్టూవర్టులు అధికారంలోకి వచ్చినప్పుడు వారు తమని తాము చట్టానికి అతీతులమని భావించసాగారు. అప్పుడు తిరిగి ప్రజల మనస్సుల్లోకి మాగ్నాకార్టా మెదిలింది. 17వ శతాబ్దం అంతా రాజుకూ పార్లమెంటుకూ సార్వభౌమాధికారం విషయంలో జరిగిన పోరాటంలో పార్లమెంటు పక్షం మాగ్నాకార్టాను తోడుగా తెచ్చుకుంది. పద్దెనిమిదో శతాబ్దంలో మాగ్నాకార్టాను ఎడ్మండ్ బర్క్ వంటి నాయకులు ఆరాధించారు. అమెరికన్ స్వాతంత్ర్య వాదులు సహితం మాగ్నాకార్టా ప్రభావంలోనే తమ స్వాతంత్ర్య ప్రకటనను రూపొందించుకున్నారు.

## 1.2 పునరుజ్జీవనోద్యమం (Renaissance)

పునరుజ్జీవనోద్యమం ఆధునిక యుగారంభాన్ని సూచిస్తుంది. ఆధునికయుగం ఆరంభంలో ఐరోపాలో జరిగిన పునర్వికాస ఉద్యమాన్ని పునరుజ్జీవనోద్యమం అంటున్నారు. ఇది సాంప్రదాయిక అధ్యయనానికి పునర్జన్మ. అలనాటి ఘనమైన

BRAOU

గ్రాకో-రోమన్ నాగరికత పునర్దర్శనం. రినాయిజాన్స్ అన్న మాటకు అర్థం, అణగారిపోయినది తిరిగి లేవడం అని. ఇక్కడ సాంప్రదాయిక అధ్యయనం తిరిగి జీవం పోసుకోవడం. మధ్యయుగాలలో ప్రబలంగా ఉన్న విలువల విషయంలో విమర్శనాత్మక దృష్టి వహించడం, స్వయం విముఖత ధోరణికి ప్రతిగా ఆత్మవిశ్వాసపు వ్యక్తివాదాన్ని ఆశ్రయించడం. దీనికి చర్చి అండ ఉన్నది. ప్రపంచాన్ని, మనిషిని పునర్దర్శించిన కాలంగా పునరుజ్జీవనోద్యమ కాలాన్ని పేర్కొనవచ్చు.

పునరుజ్జీవనోద్యమం రావడానికి అనేక కారణాలున్నాయి. పవిత్ర స్థలాల కోసం ముస్లిములకు క్రైస్తవులకు మధ్య జరిగిన అనేక మత యుద్ధాలు పశ్చిమ, తూర్పు దేశాల ప్రజలను సన్నిహితం చేశాయి. ఈ సంబంధాలు ఐరోపా వాసులు తమ జీవన విధానాలను మెరుగు పరుచుకోవడానికి దోహదం చేశాయి. ఫ్యూడల్ యుద్ధాల అణచివేత కారణంగా బౌద్ధికమయిన కృషికి సావకాశం చిక్కింది. సలెర్నో, సలమాన్కా, రోమ్, నేపుల్స్, పడ్వా, బోలొగ్నా, పారిస్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వంటి అనేక చోట్ల విశ్వవిద్యాలయాలు స్థాపించడం వల్ల బౌద్ధిక, సాంస్కృతిక కార్యక్రమాలు విస్తరించాయి. ఎంతో కాలంగా విస్మృతిలో పడ్డ సాంప్రదాయిక సాహిత్యం తిరిగి ప్రాముఖ్యం వహించి అనేక అధ్యయనాలు మొదలయ్యాయి. పెట్రార్క్, డాంటే, బోకేసియో తదితర ఇటాలియన్ పండితులు, రచయితలు ఈ అధ్యయనానికి ప్రాచుర్యం తెచ్చారు. భూమి ఆకారం గురించిన ఖగోళశాస్త్ర ఆవిష్కరణలు, నావికుల కంపాస్ వంటి పరికరాలను కనుగొనడం అనేక మత సిద్ధాంతాల నిర్హేతుకతను నిరూపించాయి. 1453లో టర్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను స్వాధీనం చేసుకోవడంతో పురాతన అధ్యయనం మరింత తీవ్రమయింది. కాగితం, సిరాలను విరివిగా వాడడం కూడా ఈ ఉద్యమం వ్యాప్తికి కారణమయింది.

## 1.2.1 పునరుజ్జీవనోద్యమం ఫలితాలు

సమాజం మీద చర్చి ప్రభావాన్ని బలహీనపరిచే అనేక మార్పులను పునరుజ్జీవనోద్యమం సాధించింది. అధ్యయనం మీద చర్చి గుత్తాధిపత్యం నశించింది. సామాన్య మానవుడి ముందుకు గొప్ప సాహిత్యాన్ని చాలా పెద్దమొత్తంలో తీసుకువచ్చింది. జ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ ప్రజలు క్రీస్తు వాస్తవ బోధనలకూ, మతాధికారుల ఆచరణకూ ఉన్న తేడాను గుర్తించగలిగారు.

ఎంతో కాలంగా విస్మృతిలో పడిపోయిన ఐరోపా ఘనమైన సంస్కృతీ సంప్రదాయాలను, వాటిలోని గొప్ప వారసత్వాన్ని పునరుజ్జీవనోద్యమం మళ్లీ వెలుగులోకి తెచ్చింది. అధికారం ముందు విధేయం ఉండడం అన్న విలువ స్థానంలో విమర్శనాత్మకంగా పరిశీలించడం అన్న కొత్త విలువ ప్రవేశించింది. స్వతంత్ర ఆలోచనలు పెరిగాయి. ఫలితంగా రోమన్ కేథలిక్ చర్చికి సంబంధించిన అనేక విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆచారాలు ప్రశ్నించబడ్డాయి. చర్చి నైతికతా విలువలలో సంస్కరణలు జరగాలని, అర్థంలేని మత తంతులు రద్దుకావాలని, మతంలో తొలినాటి నిరాడంబరతను తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్‌లు వచ్చాయి.

పునరుజ్జీవనోద్యమం సాధించిన మరో ఫలితం మానవతావాదం. తోటి మానవుల విషయంలో సానుభూతి. పరలోకం మీదనుంచి మనిషి దృష్టి మళ్లించి, జీవితానికి జీవితమే పరమార్థమని మానవతా వాదులు చెప్పారు. వారు చర్చి అధికారాన్ని ప్రశ్నించి, మత వ్యవహారాల్లో సహనాన్ని బోధించారు. ఈ బోధనలకు తోడు భౌగోళిక ఆవిష్కరణ కారణంగా పెరిగిన అపారమయిన భౌతిక సంపద అవకాశాలు కలసి చర్చి విషయంలో ఉదాసీనతను, ద్వేషాన్ని కూడా కలిగించాయి.

శాస్త్ర విజ్ఞానపు ఆవిష్కరణలు, కొత్త కొత్త భూభాగాలను కనుగొనడం పవిత్ర గ్రంథాల వివేకాన్ని ప్రశ్నించాయి. ఎరాస్మస్, ఇన్ ప్రెయిజ్ ఆఫ్ ఫాలీ అన్న తన పుస్తకంలో అజ్ఞానులయిన పాత పండితులను చూసి పరిహసించమని ప్రజలకు సూచించాడు. సాంప్రదాయిక చర్చికి వ్యతిరేకంగా ఉద్యమించి, జర్మనీలో ప్రొటెస్టెంట్ చర్చికి ఆద్యుడయిన లూథర్ ఆగ్రహం కంటే, ఎరాస్మస్ చమత్కారమే చర్చికి ఎక్కువ ప్రమాదకరమయిందని కొందరు వ్యాఖ్యానించారు.

స్థానిక భాషలు అభివృద్ధి చెందడంతో యూరోపియన్లు ప్రజల మధ్య ఉన్న మౌలిక భేదాల గురించిన అవగాహన పెంచుకున్నారు. భాషా జాతీయవాదం కూడా అవతరించింది. మధ్య యుగాల నాటి ఏకరూపతను పునరుజ్జీవనోద్యమం బద్దలు చేసింది. చర్చి అనుమతించని ఆసక్తులను, ఉత్సాహాన్ని ఇచ్చింది. వ్యక్తిని ఉన్నతంగా నిలబెట్టింది. ఊహను, కల్పనను ప్రోత్సహించింది.

# 1.3 సంస్కరణ ఉద్యమం (Reformation)

పునరుజ్జీవనోద్యమం లాగే సంస్కరణ ఉద్యమం కూడా ఆధునిక యుగంలో అవతరించిన బలమయిన ఉద్యమం. 16వ శతాబ్దంలో కేథలిక్ చర్చిలో జరుగుతున్న అక్రమాల మీద తిరుగుబాటుగా వచ్చిందీ ఉద్యమం. రాజకీయ కారణాలు, వాటికి తోడు ఆర్థిక కారణాలు కలిసి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేశాయి. ఐరోపా దేశాలలో పెరుగుతున్న జాతీయవాద స్పృహ పోప్ అధికారాన్ని సహించలేక పోయింది. అలాగే ఎదుగుతున్న పెట్టుబడి దారీ విధానం ప్రభుత్వం నుంచి చర్చి కోరుతున్న అధిక కేటాయింపుల్ని వ్యతిరేకించింది. ఈ ఉద్యమం ఫలితంగా పోప్ సర్వం సహాధికారం పోయి, జాతీయ చర్చిలు ఆవిర్భవించాయి.

సంస్కరణ ఉద్యమం ఆవిర్భవించడానికి అనేక కారణాలున్నాయి. సంస్కరణ ఉద్యమం పునరుజ్జీవనోద్యమం నుంచి పుట్టినదేనని కొందరు అంటారు. చర్చిలో అనేక అక్రమాలు జరుగుతుండేవి. అర్హతలు లేకుండానే ఎక్కువ డబ్బు ముట్ట జెప్పినవారికి మత పదవులు దొరికేవి. ఒకే వ్యక్తి అనేక పదవులు నిర్వహించే వీలుండేది. పాపపరిహారాలను అమ్ముకునే దురాచారముండేది. చర్చి అధికారులు విలాస జీవితాలు గడిపే వారు, సంపదను పోగుచేసుకునేవారు. చర్చి పట్ల, సమాజం పట్ల తమ బాధ్యతను విస్మరించేవారు.

పదహారో శతాబ్దంలో కేథలిక్ చర్చి కేవలం మత సంస్థ మాత్రమే కాదు, అదొక బలమయిన రాజకీయ శక్తి. పన్ను కట్టనవసరంలేని పెద్ద పెద్ద ఎస్టేట్లు చర్చికుండేవి. అది తన సొంత పన్నులను వసూలుచేసుకునే వీలుండేది. మత తంతుల వల్ల వచ్చే ఆదాయం ఉండేది. చర్చికి సొంతంగా ఒక చట్టం కోర్టులు ఉండేవి. మత పరమైన నేరాలకు అందులో విచారణ జరిగేది. కానీ, ఫ్యూడలిజం క్షీణించి, జాతీయ రాజ్యాలు ఏర్పడ్డాక, ఇంగ్లండ్ రాజు పోప్ అధికారానికి లొంగి ఉండడానికి ఇష్టపడలేదు. జాతీయవాద స్ఫూర్తి రాజును, ఇతర దేశ భక్తులను పురికొల్పి పోప్ అధికారన్ని కూల్చడానికి ఉద్యమం నడిపించింది.

సంస్కరణ ఉద్యమానికి రాజకీయ అసంతృప్తితో పాటు ఆర్థిక కారణాలు కూడా తోడయినాయి. అత్యధిక పరిమాణంలో భూమి కలిగి వున్న చర్చిచాలా సంపన్నమయినది. అనేక శతాబ్దాలుగా అది ఎంతో భూమిని, సంపదను పోగు చేసుకుని వుంది. మతాధికారులు ఎంతో విలాసవంతమయిన జీవితం గడిపేవారు. రాజులను, మధ్యతరగతి వారిని చర్చి సంపద ఆకర్షించింది. చర్చి ఆస్తులను లాభదాయకంగా వినియోగించాలని వారు భావించారు. అవినీతి పరులయిన ఇటాలియన్ల కోసం ఇటలీకి వెలుపలి క్రైస్తవులను పోప్‌లు దోపిడీ చేస్తున్నారని, రోమ్‌కు చేసే అన్ని చెల్లింపులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

## 1.3.1 తొలినాటి ఉద్యమాలు

మధ్యయుగాలలో కూడా చర్చిమీద అనేక పోరాటాలు జరిగాయి. బొహెమియాలో జాన్ హస్, ఇంగ్లండ్‌లో జాన్ విక్లిఫ్ పోప్ అధికార్రాన్ని, చర్చి పద్ధతులను ప్రశ్నించారు. వారి ఉద్యమాలను రాజులు అణచివేసినా, వాటి వల్ల పోప్ ప్రతిష్ఠ దెబ్బతిన్నది, చర్చి అధికారం క్షీణించింది. క్రమంగా అనేకమంది రాజులు చర్చికి వ్యతిరేకంగా వచ్చే ఉద్యమాలను సమర్థించడం మొదలు పెట్టారు.

## 1.3.2 లూథర్ తిరుగుబాటు

సంస్కరణోద్యమానికి తక్షణ కారణం మార్టిన్ లూథర్ తిరుగుబాటు. విటెన్‌బర్గ్ విశ్వవిద్యాలయం మత విజ్ఞాన (Theology) విభాగంలో ఆయన జర్మన్ ప్రొఫెసర్. 1517లో టెట్‌జెల్‌లో పాపపరిహారం పత్రాలను అమ్మడాన్ని ఆయన వ్యతిరేకించాడు. పాప పరిహార పత్రాల అమ్మకాన్ని, మతాధికారులు పాల్పడే ఇతర దురాచారాలను విమర్శిస్తూ ఆయన 95

BRAOU

అంశాల సిద్ధాంతపత్రాన్ని రూపొందించి, సమాధానం చెప్పవలసిందిగా పోప్‌ను సవాల్ చేశాడు. ఆ విధంగా సంస్కరణోద్యమం ప్రారంభమైంది.

## 1.3.3 ఉద్యమం వ్యాప్తి

జర్మనీలో మత సంస్కరణోద్యమం పెల్లుబుకడానికి మార్టిన్ లూథర్ కారణమయితే, జ్వింగ్లి, కాల్విన్ వంటి నాయకులు స్విట్జర్లండ్‌లో ఉద్యమానికి కారకులయ్యారు. సంస్కరణోద్యమం ప్రభావం కొంత ఫ్రాన్స్ మీద కూడా పడింది. అయితే, ఇంగ్లండులో ఎనిమిదవ హెన్రీయే స్వయంగా ఉద్యమాన్ని ప్రారంభించాడు. అందుకు కొన్ని రాజకీయ కారణాలు, కొన్ని హెన్రీ సొంతకారణాలు ఉన్నాయి. యూరపులో ప్రతిచోటా ప్రొటెస్టెంట్ ఉద్యమం ఘనవిజయం సాధించింది. అయితే కేథలిక్‌లు రోమన్ కేథలిక్ మతాన్ని రక్షించడానికి కొన్ని ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల కౌన్సిల్ ఆఫ్ ట్రెంట్, ఇండెక్స్, ఇన్‌క్విజిషన్, సొసైటీ ఆఫ్ జీసస్ వంటి సంస్థలు ప్రతీఘాత సంస్కరణ చర్యలకు పాల్పడ్డారు. కేథలిక్ సంస్కరణ తమ విశ్వాసాన్ని రక్షించుకోగలిగారు, ప్రొటెస్టెంట్‌ల చేతికి పోయిన ప్రాంతాలను, మతానుయాయులను తిరిగి దక్కించుకోగలిగారు.

## 1.3.4 సంస్కరణోద్యమం ఫలితాలు

ఆధునిక ఐరోపాలో జరిగిన తొలి, ప్రధానమైన ఉద్యమాలలో సంస్కరణోద్యమం ఒకటి. రోమన్ కేథలిక్ చర్చిలోని దురాచారాల మీద ప్రతిఘటనగా అది ప్రారంభమైంది. ఆ కాలపు కొన్ని రాజకీయ, సాంఘిక పరిస్థితుల కారణంగా ఆ ఉద్యమం విజయవంతమైంది. అందువల్ల, ఉద్యమం ఫలితాలు మతానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆధునిక యుగాన్ని తీర్చి దిద్దిన అనేక సామాజిక, రాజకీయ పరిణామాలను అది సాధించింది.

**మతం:** మత రంగంలో సంస్కరణోద్యమం సాధించిన విజయం చర్చిలోని ఐక్యతను, సమష్టితత్వాన్ని బద్దలు కొట్టడం. పశ్చిమ ఐరోపాలోని క్రైస్తవులు ఆ తరువాత లూథరన్‌లుగా, కాల్వినిస్టులుగా, ఆంగ్లికన్‌లుగా, ఎవాంజెలిస్టులుగా, అనబాప్టిస్టులుగా, ఇంకా అనేక మార్గాల క్రైస్తవులుగా చీలిపోయారు. ఈ చీలికలు మత అసహనానికి దారితీసి, కనీ వినీ ఎరుగని రీతిలో క్రైస్తవ అంతర్గత యుద్ధాలు జరిగాయి. మత విభేదాలకు తోడు భాషా జాతీయవాదం, జాతి వాదం తోడై స్థానిక మత కలహాలే అంతర్జాతీయ స్థాయి చేరుకుని ముప్పయ్యేళ్ళ యుద్ధం వంటి యుద్ధాలకు కారణమయ్యాయి.

### పెరిగిన సహనం

క్రూరమయిన వేధింపులు, మత యుద్ధాలు ప్రజల మనస్సుల్లో క్రమంగా మత విభేదాల విషయంలో వ్యతిరేకత పెంచాయి. క్రీస్తు బోధనల్లోని సాధుత్వం మీద దృష్టి పెరగసాగింది. ఇదంతా మత సహనం పెరుగుదలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి.

### సాంస్కృతిక ఫలితాలు

ప్రొటెస్టెంట్ ఉద్యమంలోని మానవతావాద నాయకుల ప్రభావంతో సామాన్యులలో విద్య పెరిగింది. బైబిల్‌ను, ఇతర మత గ్రంథాలను ఆ నాయకులు సామాన్యులకోసం అనువాదం చేసి, మత బోధనలను స్వయంగా చదివి తెలుసుకోమన్నారు. 'ప్రతి గ్రామంలోనూ ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి మార్కెట్ టౌన్‌లో ఒక గ్రామర్ స్కూల్, ప్రతి నగరంలోనూ ఒక యూనివర్సిటీ' ఉండాలని స్కాట్‌లాండ్‌కు చెందిన జాన్ నాక్స్ ప్రతిపాదించాడు. కేథలిక్కులు కూడా యువతరాన్ని ఆకర్షించడానికి విద్యకు ప్రాధాన్యం ఇవ్వనారంభించారు. విద్యను చర్చి అదుపు నుంచి తప్పించి, లౌకిక విలువలను జొప్పించడానికి ప్రయత్నం జరిగింది. ప్రభుత్వాలు కూడా క్రమంగా విద్య, ఆస్పత్రులు, శరణాలయాలు వంటి సామాజిక సంస్థల మీద దృష్టి పెట్టనారంభించారు.

BRAOU

చర్చి పాటించే అనేక మూఢ విశ్వాసాల మీద కూడా ఉద్యమ ప్రభావం పడింది. మానవతావాదుల హేతువాద దృష్టి వల్ల ఇది సాధ్యమైంది. ప్రొటెస్టెంట్లు మూఢ విశ్వాసాల మీద దాడి చేస్తున్న సందర్భంలో కేథలిక్కులు కూడా తమ మతాన్ని హేతుబద్ధం చేయడానికి ప్రయత్నించారు. మొత్తం సంస్కరణోద్యమం ఫలితంగా చర్చి వ్యవస్థకు చెందిన అన్ని పిడివాద సూత్రాల స్థానంలో హేతువాదం ప్రవేశించింది. అతీత శక్తులనుంచి ప్రకృతి శక్తుల మీదికి మత విజ్ఞానం నుంచి శాస్త్ర విజ్ఞానం మీదికి, చర్చి మీది నుంచి రాజ్యం మీదికి మేధావుల దృష్టిని ఉద్యమం మళ్లించింది. హేతువాదం మత సహనానికి దోహదం చేసింది. బౌద్ధిక వికాసానికి, శాస్త్ర ప్రగతికి ఉద్యమం బాటలు వేసింది.

## సామాజిక, రాజకీయ ఫలితాలు

ఐరోపాలోని రాజకీయ సాంస్కృతిక పరిస్థితుల మీద ఉద్యమం చాలా ప్రభావం వేసింది. విజాతీయమయిన ప్రతిదాని మీదా నిరసనను, సజాతీయమైన వాటి మీద ఆసక్తిని ప్రొటెస్టెంటిజమ్ కలిగించింది. పోప్ అదుపు నుంచి ప్రొటెస్టెంట్ దేశాలు విదిలించుకున్నాయి. చివరికి కేథలిక్ దేశాలు కూడా తమ చర్చికి జాతీయ స్వభావం ఉండాలని వాంఛించాయి, పోప్ అధికార పరిధిని తగ్గించాయి. ఫలితంగా సంస్కరణోద్యమం భాషా భేదాలను, జాతి కలహాలను ముందుకు తెచ్చి, క్రైస్తవతనాన్ని వెనక్కు నెట్టింది. ఆ విధంగా ఉద్యమం క్రైస్తవ సంఘీభావాన్ని దెబ్బతీసింది.

పెట్టుబడి దారీ విధానం ఎదుగుదలకు సంస్కరణోద్యమం చాలా దోహదం చేసింది. చర్చిల, మఠాల ఆస్తులను స్వాధీనం చేసుకుని ప్రభుత్వాలు వాటిని పరిశ్రమల అభివృద్ధికి, వాణిజ్యం విస్తరణకు వినియోగించాయి. పవిత్రతా వాద ధోరణులు ఆర్థిక క్రమశిక్షణను, పొదుపును ప్రోత్సహించాయి. ఏ పనిచేయకుండా కూర్చోవడం నైతికంగా పాపమని, దారిద్ర్యం దేవుని శాపమని, సంపద దేవుని వరమని చెప్పడం ద్వారా ప్రొటెస్టెంట్లు ఆర్థిక వ్యక్తివాదాన్ని ప్రేరేపించారు. ఆర్థిక వ్యక్తివాదమే పెట్టుబడిదారీ విధానానికి పునాది. సంస్కరణవాదం తిరిగి రాచరిక అతీత వాదానికి బలాన్నిచ్చింది. జాతీయవాదంలో నుంచి ప్రభవించిన కొత్త విశ్వాసాలు రాజులకు కొత్త అధికారాలను స్వచ్ఛందంగా ఇచ్చాయి. ఒక విదేశీ పీఠాధిపతి అయిన పోప్‌కు విధేయంగా ఉండే చర్చి అధికారాలను స్వాధీనం చేసుకొమ్మని ఉద్యమకారులు రాజులను ప్రేరేపించారు. చర్చిలనుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తులతో రాజులు సంపన్నులయ్యారు. స్థానికంగా ఉండే మతాధికారులు రాజ్యం అదుపులోకి వచ్చారు. ఫలితంగా ప్రొటెస్టెంట్ దేశాలలో రాజుల అధికారం విపరీతంగా పెరిగింది.

ప్రొటెస్టెంట్ విప్లవం ఆధునిక ప్రజాస్వామ్యానికి బీజం వేసింది. సంస్కరణవాదం ఉనికిలో ఉన్న అధికారాన్ని సవాలు చేసింది. తిరుగులేని విధేయతను ప్రశ్నించి, వ్యక్తివాదాన్ని ప్రకటించింది. ఈ కొత్త విప్లవాత్మక చైతన్యం క్రమంగా మతం నుంచి రాజకీయాలకు వ్యాపించింది. మత అధికారం ముందు తలవొగ్గని వారు రాజకీయ అధికారం ముందు తల వొగ్గుతారని అనుకోలేము. జ్వింగ్లి, కాల్విన్ వ్యవస్థలు చర్చి నిర్వహణను మరింత ప్రజాస్వామ్యీకరించి కొత్త చైతన్యాన్ని మరింత పటిష్టం చేశాయి. కాల్వినిజం విప్లవవాదుల సిద్ధాంతంగా మారింది. అది నెదర్లాండర్లను విదేశీ పాలకుల మీదికి తిరగబడేట్టు, స్కాట్‌లను స్థానిక నియంతల మీద పోరాడేట్టు ప్రేరణ ఇచ్చింది. ఇంగ్లండ్‌లో 1688లో జరిగిన ఆంగ్లేయ ఘనమైన విప్లవానికి ప్రేరకశక్తులలో ఒకటిగా ఉన్నది. ఆ తరువాత ఆధునిక యుగంలో సంభవించిన అనేక ఇతర విప్లవాలకు కూడా అది ప్రేరణ ఇచ్చింది. ఆ విధంగా, ఐరోపా చర్చి చరిత్రలో, ఐరోపా సాంస్కృతిక చరిత్రలో సంస్కరణోద్యమం ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.

# 1.4 డచ్ స్వాతంత్ర్య పోరాటం

పదహారో శతాబ్దంలో జరిగిన అతి ముఖ్యమైన రాజకీయ సంఘటన నెదర్లాండ్స్‌లో జరిగిన తిరుగుబాటు, డచ్ రిపబ్లిక్ అవతరణ. కొత్తగా ఏర్పడిన దేశం హాలండ్. ఇది ఆ తరువాత ఐరోపా రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో ప్రముఖమైన పాత్ర నిర్వహించింది. ఐరోపాలో స్పానిష్ పెత్తనానికి డచ్ తిరుగుబాటు పెద్ద దెబ్బ తీసింది.

BRAOU

ఇప్పటి బెల్జియం, హాలండ్ దేశాల భూభాగాలతో ఉన్న నాటి నెదర్‌ల్యాండ్స్‌లో 17 ప్రత్యేక రాష్ట్రాలుండేవి. ప్రతి దానికీ సొంత పాలనా వ్యవస్థ ఉండేది. రెండవ ఫిలిప్‌కు ఈ భూభాగాలు తన తండ్రినుంచి వారసత్వంగా సంక్రమించాయి. ఆనాటికి నెదర్‌ల్యాండు ప్రజలు యిరోపాలోని తక్కిన దేశాలకన్న పారిశ్రామికంగా చాలా అభివృద్ధి చెంది ఉన్నారు. పైగా నెదర్‌ల్యాండ్ ప్రజలు తమ వ్యవస్థల విషయంలో అంకితభావంతో ఉండేవారు. అంట్‌వెర్ప్, బెరుజెస్, ఘెంట్, అమ్‌స్టర్‌డ్యామ్ వంటి నెదర్‌ల్యాండ్ నగరాలు ప్రపంచానికి అసూయాజనకంగా ఉండేవి. స్పెయిన్ రాజుకు ప్రధాన ఆదాయం ఇక్కడినుంచే వచ్చేది.

## 1.4.1 తిరుగుబాటుకు కారణాలు

రెండవ ఫిలిప్ కాలంలో నెదర్‌ల్యాండ్స్‌లో జరిగిన తిరుగుబాటుకు అనేక కారణాలున్నాయి. స్పెయిన్‌లో లాగానే నెదర్‌ల్యాండ్స్‌లో కూడా ఫిలిప్ తన అధికారాన్ని కేంద్రీకృతం చేయడానికి ప్రయత్నించాడు. దేశీయ కులీనులకు, నగరాలకు సాంప్రదాయిక హక్కులను, సదుపాయాలను అతను నిరాకరించాడు. పాలనా యంత్రాంగాన్నంతా స్పానిష్ రెజెంట్‌లకు అప్పగించాడు. శాంతి భద్రతలను నిర్వహించడానికి స్పానిష్ సైన్యాన్ని నియోగించాడు. అన్ని ప్రభుత్వ పదవులలో కులీన కుటుంబాల వారిని తొలగించి స్పానియార్డులను నియమించాడు. ఫలితంగా ఫిలిప్ పాలనమీద ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయింది.

మత పరమయిన ఏకరూపత లేకపోతే రాజకీయ ఐక్యత అసాధ్యమని రెండో ఫిలిప్ విశ్వసించాడు. అందుకని నెదర్‌ల్యాండ్స్‌లో ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో బలమయిన శక్తిగా ఎదిగిన కాల్వనిస్టు తరహా ప్రొటెస్టంటిజాన్ని నిర్మూలించాలని, కేథలికిజాన్ని పునరుద్ధరించాలని అతను కంకణం కట్టుకున్నాడు. ఆ విధానంలో భాగంగా కేథలిక్ బిషప్ పదవుల సంఖ్యను పెంచాడు, మతాచరణలో ఏకరూపత ఉండాలనే చట్టాలను జారీ చేశాడు. ప్రత్యర్థి మతావలంబకుల మీద దారుణమయిన వేధింపులు, హింసలు అమలు జరిపాడు. అయిదవ చార్లెస్, రెండో ఫిలిప్ కూడా నెదర్‌ల్యాండ్ ప్రజల మీద అనేక రకాలయిన పన్నులు విధించి తమ సామ్రాజ్యంలోని ఇతర భాగాల్లో ఆ సొమ్మును వ్యయం చేశారు. స్పానిష్ వర్తకుల సౌకర్యం కోసం డచ్ వాణిజ్యం మీద అనేక ఆంక్షలు విధించారు.

ఫిలిప్ తండ్రి అయిదో చార్లెస్ నెదర్‌ల్యాండ్‌లోనే పుట్టి పెరిగాడు. అతనిని పరాయివాడుగా నెదర్‌ల్యాండీయులు భావించలేదు కానీ, ఫిలిప్‌ను మాత్రం విదేశీయుడుగానే పరిగణించారు. ఫిలిప్ వారి భాషమాట్లాడలేడు. అధికారానికి వచ్చిన తరువాత ఒక్క సారికూడా నెదర్‌ల్యాండ్స్‌ను సందర్శించలేదు.

1566 ఏప్రిల్‌లో 400 మంది నెదర్‌ల్యాండ్స్ కులీనులు బ్రస్సెల్స్‌లో సమావేశమై రీజెంట్, మార్గరేట్ ఆఫ్ పర్మాకు డిమాండ్ల పత్రాన్ని సమర్పించారు. మత విచారణలను నిలిపి వేయాలని, మత ఆంక్షలను రద్దు చేయాలని, స్టేట్స్ జనరల్‌ను తరచు సమావేశ పరచాలని ఆ పత్రంలో కోరారు. పిటిషన్‌ను పరిశీలిస్తామని రీజెంట్ హామీ ఇచ్చారు కానీ, ఆమె అనుయాయుల్లో ఒకరు 'ఈ ముష్టి వాళ్లకు ప్రభువు భయపడతాడా?' అని వ్యాఖ్యానించారట. ఈ వ్యాఖ్య పిటిషనర్లకు చేరింది. అప్పుడే వారు తమను తాము 'ముష్టివాళ్లు' (Beggars) గా ప్రకటించుకుని స్పానిష్ పాలన మీద తిరుగుబాటు చేశారు. విలియమ్ ఆఫ్ ఆరెంజ్ నాయకత్వంలో పెద్ద సైన్యం సమీకృతమై, తిరుగుబాటును నిర్వహించింది.

తిరుగుబాటును ఎలాగైనా అణచివేయాలని సంకల్పించిన ఫిలిప్ డ్యూక్ ఆఫ్ అల్వాను ఆ పనికోసం నియోగించాడు. అతని తరువాత రెక్వెసెన్స్ రిజెంట్ అయ్యాడు. తరువాత డాన్ జాన్ రిజెంట్ అయ్యాడు. చివరికి డ్యూక్ ఆఫ్ పర్మా. ఈ జనరల్స్ అందరూ తిరుగుబాటును అణచడానికి ప్రయత్నించారు కానీ ఫలితంలేక పోయింది. చివరికి 1579లో కేథలిక్ రాష్ట్రాలయిన పది దక్షిణాది రాష్ట్రాలు మత విశ్వాసాల పరిరక్షణ నిమిత్తం స్పెయిన్‌తో రాజీపడి లీగ్ ఆఫ్ ఔరస్‌కు అంగీకరించారు. ఏడు ఉత్తరాది రాష్ట్రాలు తమ స్వేచ్ఛను రక్షించుకునే నిమిత్తం యూనియన్ ఆఫ్ ఉట్రెచ్‌గా ఏర్పడ్డాయి. ఆ రకంగా నెదర్‌ల్యాండ్స్ శాశ్వతంగా రెండుగా విడిపోయింది. వాటి చరిత్ర కూడా అక్కడినుంచి రెండు వేరు వేరు శాఖలుగా కొనసాగింది.

BRAOU

## 1.4.2 డచ్ స్వాతంత్ర్య ప్రకటన

1581లో అనేక ముఖ్యమైన పరిణామాలు జరిగి డచ్ రిపబ్లిక్ స్థాపనకు దారితీశాయి. ఆ సంవత్సరమే రెండో ఫిలిప్ విలియం ఆఫ్ ఆరెంజ్‌ను నిషిద్ధ వ్యక్తిగా ప్రకటించి, అతని ప్రాణానికి బహుమతి ప్రకటించాడు. దానికి సమాధానంగా విలియం ఉత్తరాది రాష్ట్రాల ప్రతినిధులను హేగ్‌లో సమావేశ పరిచి స్పెయిన్‌తో సంబంధాలు తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించాడు. ఆ ప్రకటనను 'యాక్ట్ ఆఫ్ అబుజూరిగేషన్' (Act of Abjurigation) అంటారు. అదే డచ్ స్వాతంత్ర్య ప్రకటనా పత్రం. ఈ పత్రంలోనే 'మనిషి హక్కుల' (rights of man) గురించి వివరించారు. ఒక దేశం మరో దేశం హక్కులను, మరో దేశ ప్రజల హక్కులను, స్వేచ్ఛలను కాలరాయడానికి హక్కు ఎక్కడుందని ఈ పత్రంలో ప్రశ్నించారు. మానవహక్కుల గురించిన డచ్ స్వాతంత్ర్య ప్రకటన తరువాతి కాలంలో పవిత్ర విప్లవంలోనూ, అమెరికన్ స్వాతంత్ర్య పోరాటంలోను, ఫ్రెంచి విప్లవంలోనూ నమూనాగా పనిచేసింది.

## 1.5 ముగింపు

ఆధునిక యుగ ఆరంభంలో ఐరోపాలో సంభవించిన వివిధ చారిత్రక సంఘటనలు యూరప్ ప్రజల హక్కులకు గుర్తింపునివ్వడమే గాక ప్రపంచ వ్యాప్తంగా అటువంటి హక్కుల సాధనకు అవకాశాలను కల్పించాయి. 13వ శతాబ్దంలో ఇంగ్లండులో రాజు జాన్ మాగ్నాకార్టాను జారీచేయడం అది మానవ హక్కుల సాధనలో ఒకమైలు రాయిగా నిలవడం మనం గమనిస్తున్న విషయం. ఆ తర్వాత వచ్చిన పిటిషన్ ఆఫ్ రైట్స్, బిల్ ఆఫ్ రైట్స్ ఇవన్నీ ఆంగ్లేయ లిఖిత రాజ్యాంగానికి ప్రాతిపదికలుగా పనిచేస్తున్నాయి. వీటితోపాటు యూరప్ సమాజంలో సంభవించిన పునరుజ్జీవనోద్యమం, మత సంస్కరణోద్యమం హేతు వాద వ్యాప్తికి, శాస్త్రీయ పరిశోధనలకు దారులు తెరిచి, రోమన్ కాథలిక్ చర్చి తిరుగులేని అధికారాన్ని బద్దలు కొట్టినవి. ఇవన్నీ యూరప్‌లో సామాజిక, రాజకీయ మార్పులు వేగవంతమవడానికి దోహదం చేశాయి. వలస వాదం మీద జరిగిన మొట్టమొదటి పోరాటంగా డచ్ స్వాతంత్ర్య పోరాటం గుర్తించబడింది. స్పెయిన్‌వంటి పెద్ద దేశాన్ని ఎదిరించి స్వాతంత్ర్యం సంపాదించిన డచ్ ప్రజలు చేసిన మానవ హక్కుల గురించిన ప్రకటన తర్వాతి కాలంలో సంభవించిన అమెరికన్, ఫ్రెంచి విప్లవాలకు మూలమైందని చెప్పుకోవచ్చు.

BRAOU

## 1.6 మాదిరి ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. మాగ్నాకార్టా ప్రాముఖ్యం ఏమిటి? దానిలోని ప్రధాన అంశాలేమిటి? వివరించండి.
2. మధ్యయుగాల దృష్టినుంచి ఆధునిక దృక్పథానికి జరిగిన పరివర్తనగా పునరుజ్జీవనోద్యమాన్ని చెప్పవచ్చునా? చర్చించండి.

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. డచ్ స్వాతంత్ర్య పోరాటం విశిష్టతను వివరించండి.
2. పునరుజ్జీవనోద్యమంలోని ప్రధాన అంశాలేమిటి?

# భాగం 2 : ఆధునిక విప్లవాలు-మానవ హక్కులు

విషయక్రమం

2.0 ఉద్దేశం

2.1 పరిచయం

2.2 విప్లవాల పాత్ర

2.3 ఆంగ్లేయ విప్లవం, హక్కుల చట్టం

2.4 బిల్ ఆఫ్ రైట్ హక్కుల చట్టం

2.5 అమెరికన్ విప్లవం

2.6 అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భావం

2.7 ఫ్రెంచ్ విప్లవం

2.7.1 ఫ్రెంచ్ విప్లవ ఫలితాలు

2.8. పారిశ్రామిక విప్లవం

2.8.1 పారిశ్రామిక విప్లవ ఫలితాలు

2.9 ముగింపు

2.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 2.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- ఆంగ్లేయ విప్లవంలో జరిగిన హక్కుల ప్రకటనను తెలుసుకుంటారు.
- అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భావం గురించి తెలుసుకుంటారు.
- ఫ్రెంచి విప్లవ కారణాలు అర్థం చేసుకుంటారు.
- పారిశ్రామిక విప్లవ ఫలితాలు వివరించగలుగుతారు.

## 2.1 పరిచయం

ఆధునిక యుగ లక్షణాలైన ప్రజాస్వామ్యం, జాతీయవాదం అనే భావనలు గత మూడు వందల సంవత్సరాల్లో పశ్చిమ దేశాల్లో జరిగిన కొన్ని విప్లవాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నవి. 17వ శతాబ్దంనాటి ఆంగ్లేయ విప్లవం రాచరికం మీద ఇంగ్లీషు పార్లమెంటును పైచేయి చేసింది. ప్రజలకు 'హక్కుల చట్టాన్ని' (బిల్ ఆఫ్ రైట్స్) ఇచ్చింది. 18వ శతాబ్దం చివర్లో జరిగిన అమెరికన్ విప్లవం ఉత్తర అమెరికాలో స్థిరపడిన ఇంగ్లీషు వలసదారులకు స్వాతంత్ర్యాన్ని, లిఖిత రాజ్యాంగాన్ని ఇచ్చింది. ఫ్రెంచి విప్లవం సార్వజనీనంగా మనిషి హక్కులను ప్రకటించి ఫ్యూడలిజాన్ని, అతీతవాదాన్ని (Absolutism) చావుదెబ్బ తీసింది.

1750 ప్రాంతాల్లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం మానవప్రగతికి సంబంధించి అనేక కొత్త ద్వారాలను తెరిచింది, చెప్పలేనంత యాతనను, సామాజిక పతనాలను కలగజేసింది. ఈ విప్లవం ఉత్పత్తి విధానాలను నిర్మాణాత్మకంగానూ, విధ్వంసాత్మకంగానూ కూడా మార్చింది. ఇప్పటి వ్యక్తి స్వేచ్ఛ, హక్కులు, స్వేచ్ఛలు, రాజ్యాంగ రక్షణలు అన్నీ కూడా ఈ విప్లవాల వల్ల అధికంగా ప్రభావితమయినవే.

## 2.2 విప్లవాల పాత్ర

విప్లవం అంటే అకస్మాత్తుగా లేదా పెద్ద ఎత్తున జరిగే మార్పు అని నిర్వచించవచ్చు. కొన్ని సార్లు ఆ మార్పు బలప్రయోగంతో, రక్తపాతంతో జరిగే మౌలిక మార్పు కావచ్చు లేదా శాంతియుతంగా జరిగే పెద్ద మార్పు కూడా కావచ్చు. విప్లవం సాధారణంగా దేశంలోని రాజకీయ వ్యవస్థ అంతటిలోనూ సంభవించే మౌలికమైన మార్పు కావచ్చు. ప్రభుత్వ స్వభావంలో జరిగే మార్పు, ప్రభుత్వాన్ని నిర్వహించే వర్గంలో, వర్గాలలో జరిగే మార్పు, ప్రజల హక్కులలో సదుపాయాలలో జరిగే మార్పు కూడా కావచ్చు.

ప్రభుత్వాలను మార్చే క్రమంలో విప్లవాలు ప్రజాజీవితంలోని అన్ని పార్శ్వాలను ప్రభావితం చేస్తాయి. ప్రజల్లో ప్రచారంలో ఉన్న సిద్ధాంతాలలో, అభిప్రాయాలలో, మనోభావాలలో, ఆప్యాయతల్లో మార్పు క్రమం గోచరిస్తుంది.

మానవ హక్కుల వికాసంలో విప్లవాలు ముఖ్యమైన పాత్ర వహించాయి. మౌలికంగా విప్లవం అంటే మానవ హక్కుల అవతరణ, ఆచరణ జరిగే ఒక క్రమం లేదా ఉద్యమం. విప్లవాలు లేకుండా మానవ హక్కుల విస్తరణ కానీ, వికాసం కానీ జరిగే అవకాశం లేదు. స్వేచ్ఛ, వ్యక్తి హక్కుల వికాసంలో విప్లవాలు అత్యవసరమైనవి. దేశ నాయకులు లేదా వ్యవస్థను నడిపించే నాయకులు మార్పును అడ్డుకోవడం మానేసి, అనుమతించడం లేదా మార్పుకు తామే మార్గదర్శకత్వం వహించడం చేస్తే విప్లవాలు సాపేక్షికంగా శాంతియుతంగా జరుగుతాయి.

చరిత్రల్లో విప్లవాలన్నీ సాధారణంగా హింసకే దారితీశాయి. ఎందుకంటే, అధికారంలో ఉన్నవారు లొంగి పోవడానికి ఇష్టపడరు. జీవిత గమనంలో మెరుగైన మార్గంలోకి వెళ్లాలంటే మానవజాతి చెల్లించవలసిన మూల్యం ఈ హింస. విప్లవాలను సాధ్యం చేసిన అనేక మంది ప్రజలు ఎన్నో యాతనలను, బాధలను అనుభవించి నిలబడ్డారు.

విప్లవాలు భావాల నుంచి పుట్టేవి కాబట్టి, అవి తొందరగా పాకిపోతాయి. ఒక చోట పుట్టిన విప్లవ భావాలు ఇతర ప్రాంతాలకు అతివేగంగా చేరుతాయి. ముఖ్యంగా అణచివేతకే లోనవుతున్న ప్రజల ఆలోచనలను, ఆచరణను ఎక్కువగా ప్రభావితం చేయగలుగుతాయి. ఉదాహరణకు, ఆంగ్లేయ విప్లవానికి కారణమయిన భావాలు అమెరికాకు కూడా వ్యాపించి అక్కడికి వెళ్లి స్థిరపడ్డ ఇంగ్లీషువారి ఆలోచనలను ప్రభావితం చేశాయి. అలాగే, ఆంగ్లేయ, అమెరికన్ విప్లవాలు ఫ్రెంచ్ విప్లవానికి ప్రోత్సాహాన్నిచ్చాయి. రష్యన్ విప్లవం ఆ మూడు విప్లవాలనుంచి వారసత్వాన్ని పుచ్చుకుని 19వ శతాబ్దంలో రూపొందిన విప్లవసిద్ధాంతానికి జోడించింది.

సమాజంలోని మనిషి జీవితంలోని ప్రతి ఒక సంచలనమూ, అనేక బౌద్ధిక కారణాల నేపథ్యంలో రూపొంది, భావాల రూపంలో ప్రస్ఫుటమవుతుంది. ఒక ఉద్యమం విప్లవం స్థాయికి చేరుకోవాలంటే, అంతిమంగా చేరుకోవలసిన నూతన వ్యవస్థ ఔన్నత్యాన్ని వివరించగల భావాల సముదాయం అందుకు తోడుగా వుండాలి. ఈ భావాలు దాదాపు రాజకీయ, ఆర్థిక ఆకాంక్షల ఫలితాలే అయినప్పటికీ, కాలం గడిచేకొద్దీ అవి స్వతంత్ర అంశాలుగా ప్రాముఖ్యం పొందుతాయి. విప్లవ ఉద్యమాలు సాధారణంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆదర్శాల ఉమ్మడి ప్రభావపు అంతిమ ఫలితాలుగా చెప్పవచ్చు. విప్లవాల ద్వారా హక్కులు, స్వేచ్ఛలు సాధించబడ్డాయి, రక్షించబడ్డాయి.

## 2.3 ఆంగ్లేయ విప్లవం, హక్కుల చట్టం

ఆధునిక కాలంలో సంభవించిన విప్లవాలన్నిటిలోకి 17వ శతాబ్దంలో జరిగిన ఆంగ్లేయ విప్లవం చాలా ముఖ్యమైనది.

BRAOU

ఈ విప్లవం ఫలితంగా పార్లమెంటు అధికారాలను గుర్తించడం, రాచరికం అధికారాలను కుదించడం జరిగింది. ఇది రాజుని రాజ్యాంగాధిపతిగా చేసిన హక్కుల చట్టాన్ని కూడా ప్రసాదించింది. తిరుగులేని రాచరికంవైపు దేశాలనేకం మళ్లుతుండగా, ఇంగ్లండు కొత్తదారితొక్కి ప్రజామోద పార్లమెంటరీ పాలనను స్థాపించుకుంది. 1485 నుంచి 1603 దాకా ఇంగ్లండును ట్యూడర్(Tudor) రాజులు పాలించారు. వ్యవసాయాన్ని, వాణిజ్యాన్ని, సాధారణ ప్రజా ఆర్థిక జీవనాన్ని మెరుగుపరచడంలో వారు సఫలమయ్యారు. జాతీయవాద దేశ భక్తిని వారు గుర్తించారు. ట్యూడర్‌ల నిరంకుశత్వాన్ని ఆంగ్లేయ జాతి సమర్థించింది, ఎందుకంటే ట్యూడర్‌లు అనుసరించింది ప్రజారంజక నిరంకుశత్వం. అయితే 1603లో ఎలిజబెత్ రాణి మరణం తరువాత స్టూవర్టు రాజు ఒకటవ జేమ్సు అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. ప్రజలు స్టూవర్టుల విధానాలను మెచ్చలేదు. ఫలితంగా స్టూవర్టులు అధికారంలో ఉన్న కాలమంతా రాజ్యాంగ పరమయిన సంక్షోభం ఉండేది. 1642 నుంచి 1649 దాకా జరిగిన అంతర్యుద్ధాన్ని, 1688లో జరిగిన రక్తపాత రహిత విప్లవాన్ని (Bloodless Revolution) కలిపి ఆంగ్లేయ విప్లవమని సాధారణంగా పిలుస్తారు.

ఇంగ్లండులో విప్లవం రావడానికి అనేక కారణాలున్నాయి. ఒకటవ జేమ్సు, అతని కొడుకు ఒకటవ చార్లెసు వంటి స్టూవర్టు రాజులు తాము దైవప్రతినిధులమని విశ్వసించేవారు. తమను పాలకుడిగా దేవుడే నియమించాడని, తమ చర్యలను ఎవరూ ప్రశ్నించడానికి వీలులేదని వారు భావించేవారు. కానీ, ప్రజలు వారి సిద్ధాంతాన్ని నిరసించారు. అంతేకాక, ట్యూడర్‌ల హయాంలో వాణిజ్యాభివృద్ధి బాగా జరిగింది. గ్రామీణ సంపన్న వర్గం ఒకటి వృద్ధి అయింది. వర్తకుల ఆత్మ విశ్వాసం పెరిగిపోయింది. స్టూవర్టుల కాలానికి వచ్చే సరికి పార్లమెంటు ఈ వర్గాల ప్రతినిధులతో నిండివుంది. వారు గతంలో లాగా లొంగి వుండడానికి సిద్ధంగాలేరు.

మరొక విషయం, ట్యూడర్లు ఆంగ్లేయులు, చాకచక్యం తెలిసినవారు, ప్రజల మనసు ఎరిగినవారు. ప్రజలను నొప్పించకుండా పాలించడం తెలిసినవారు. స్టూవర్టులు అలా కాదు. వారు స్కాట్ జాతివారు. ఇంగ్లీషువారి మనోభావాలు వారికి తెలియవు. అందుకే వారు తమ అధికారాన్ని మొరటుగా చెలాయించడం మొదలుపెట్టి, ప్రజల నిరసనను చవిచూశారు.

ప్యూరిటన్లు (పవిత్రతా వాదులు) అనిపిలిచే ఆంగ్లేయ ప్రొటెస్టెంట్లు ఆంగ్లికన్ చర్చి విషయంలో అసంతృప్తితో వున్నారు. సంస్కరణలు జరగాలని కోరారు. ఒకటవ జేమ్సు, ఒకటవ చార్లెస్ ఇద్దరూ ఈ ప్యూరిటన్లకు వ్యతిరేకులు. పార్లమెంటులో ప్యూరిటన్ల ప్రాతినిధ్యం బాగా ఉండేది. అందువల్ల తరచు మత విషయాలమీద కూడా కలహాలు జరిగేవి.

మత విషయాలకు తోడు, ఆర్థిక అంశాలు కూడా పరిస్థితిని విషమింపజేశాయి. రాజుకు వచ్చే ఆదాయం ప్రభుత్వాన్ని నిర్వహించడానికి సరిపోయేదికాదు. అందుకని జేమ్సు అనేక అక్రమ వసూళ్లకు పాల్పడేవాడు. తన ఆమోదం లేకుండా జరుగుతున్న వసూళ్లకు పార్లమెంటు వ్యతిరేకత తెలిపేది. ఒకటవ చార్లెస్ కాలంలో రాజుకు, పార్లమెంటుకు ఘర్షణ తీవ్రమయింది. అనుమతి లేకుండా ఎటువంటి పన్నులు వసూలు చేయబోనని రాజు పార్లమెంటుకు హామీ ఇవ్వవలసి వచ్చింది. మత విషయాలమీద రాజుకు, పార్లమెంటుకు జరుగుతున్న గొడవ చార్లెస్‌కాలంలో పరాకాష్టకు చేరింది. చార్లెస్ పార్లమెంటును రద్దుచేసి, నేరుగా పాలించడం మొదలు పెట్టాడు. ప్రభుత్వ నిర్వహణకు డబ్బులేనందున, అతి త్వరలోనే అతను మరొక పార్లమెంటును ఏర్పాటు చేయక తప్పలేదు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న రాజు పరిస్థితిని ఆసరా చేసుకుని పార్లమెంటు అనేక సంస్కరణలకు అతని ఆమోదాన్ని పొందింది. క్రమం తప్పకుండా పార్లమెంటు సమావేశాలు నిర్వహించడానికి కూడా రాజు అంగీకరించవలసి వచ్చింది.

ప్రత్యర్థుల విషయంలో మాటకు కట్టుబడి వుండవలసిన అవసరంలేదని చార్లెస్ భావించాడు. పార్లమెంటుకు ఇచ్చిన వాగ్దానాలన్నిటినీ ఉల్లంఘించాడు. అప్పుడు 1642లో అంతర్యుద్ధం మొదలయింది. రాజు ఒకవైపు, పార్లమెంటు ఒకవైపు, సమర్థుడయిన కమాండర్ ఆలివర్ క్రామ్‌వెల్ నాయకత్వంలో పటిష్టమయిన సైన్యాన్ని పార్లమెంటు కూడగట్టింది. చివరికి 1649లో రాజు పరాజయం పొందాడు. పార్లమెంటరీ సైన్యం సహాయంతో పార్లమెంటులోని అతివాదులు ప్రభుత్వాన్ని చేజిక్కించుకున్నారు. పార్లమెంటు నుంచి మితవాదులను తొలగించి ఇంగ్లండును రిపబ్లిక్ లేదా కామన్‌వెల్త్‌గా ప్రకటించారు. రాజు మొదటి చార్లెస్ మీద విచారణ జరిపించి 1649లో మరణశిక్ష అమలు జరిపారు.

BRAOU

ఈ రిపబ్లిక్ పాలన నిజానికి ఆలివర్ క్రామ్‌వెల్ పాలనే. అతనికి 'రక్షకుడు' అన్న బిరుదును ఇచ్చారు. అంటే అది సైనిక పాలన కాలమే. రిపబ్లిక్ పాలనను ప్రజలు మెచ్చలేదు. అందుకని వారు మరణ శిక్ష విధించబడిన మొదటి చార్లెస్ కుమారుడు రెండవ చార్లెస్‌ను రాజుగా 1660లో ఆహ్వానించారు. ఈ పరిణామాన్ని పునరుద్ధరణ **(Restoration)** అని అన్నారు. రాచరికం పునరుద్ధరణ జరిగినా, రాజుకీ, పార్లమెంటుకీ ఘర్షణ జరగడానికి కారణమయిన పరిస్థితులు అలాగే ఉన్నాయి. రెండవ చార్లెస్, అతని వారసుడు, సోదరుడు రెండవ జేమ్స్ ఇద్దరూ తిరిగి రాచరికం ఆధిక్యాన్ని ప్రతిష్ఠించడానికి ప్రయత్నించారు.

మత విషయాల్లో, విదేశాంగ విధానం విషయాల్లో విభేదాలు రెండవ జేమ్స్ రాజ్యానికి వచ్చేనాటికి తీవ్రమయ్యాయి. రెండవ జేమ్స్ కుమార్తె మేరీ భర్త, నెదర్‌ల్యాండ్ పాలకుడు అయిన విలియమ్ ఆఫ్ ఆరెంజ్‌ను పాలన చేపట్టవలసిందిగా 1688లో పార్లమెంటు ఆహ్వానించింది. ఒక్క తుపాకి గుండు కూడా పేలకుండానే అధికార మార్పిడి జరిగింది. విలియమ్ లండన్ చేరగానే రెండవ జేమ్స్ ఫ్రాన్స్‌కు పారిపోయాడు. హక్కుల చట్టం/బిల్ ఆఫ్ రైట్స్‌ను ఆమోదించి సింహాసనాన్ని విలియంకు, మేరీకి కలిపి సంయుక్తంగా అప్పగించారు. శాంతియుతమైన సుప్రసిద్ధ **(Glorious)** విప్లవం ద్వారా దీన్ని సాధించటం జరిగింది.

## 2.4 బిల్ ఆఫ్ రైట్స్/హక్కుల చట్టం

మూడవ విలియంను, మేరీని ఇంగ్లండ్ ప్రభువులుగా చేసిన హక్కుల చట్టం చాలా ముఖ్యమైనది. భవిష్యత్తులో ఇంగ్లండు ప్రభువులయ్యేవారందరూ ప్రొటెస్టెంట్‌లే అయివుండాలని ఆ చట్టం నిర్దేశించింది. విలియం, మేరీలకు కనుక సంతానం కలగక పోతే సింహాసనం మేరీ సోదరి, ప్రొటెస్టెంటూ అయిన అన్నెకు చెందాలని బిల్ ఆఫ్‌రైట్స్ ప్రకటించింది. వారసత్వం గురించిన ఈ ఏర్పాటు చాలా ముఖ్యమయినది. సింహాసనానికి వారసత్వాన్ని వంశపారంపర్య హక్కుద్వారా కాక, పార్లమెంటు ద్వారా నిర్దేశించడం జరిగింది. ఆ విధంగా విప్లవం ఇంగ్లండ్‌లో రాచరికపు దైవదత్తహక్కులను తుడిచిపెట్టింది.

BRAOU

చట్టాల అమలు నిలిపివేతను, పన్నుల విధింపును, కొత్త సైన్యం సమీకరణను పార్లమెంటు అనుమతి ద్వారా మాత్రమే చేయాలని చట్టం నిర్దేశించింది. పార్లమెంటు తరచు సమావేశమవుతుందని కూడా బిల్ తెలిపింది. నేరాలలో శిక్షవిధించినవారికి, నిందితులకు అధిక జరిమానాలనుంచి, శిక్షలనుంచి విముక్తిని కోరుతూ పిటిషన్‌పెట్టుకోవడానికి, జ్యూరీ ద్వారా విచారణకు బిల్ నిబంధనలు చేసింది.

సుప్రసిద్ధ విప్లవం రాచరికం మీద పార్లమెంటు విజయానికి చిహ్నం. విలియం, మేరీ పార్లమెంటునుంచి రాజ్యాధికారాన్ని పొందారు, రాజ్యాధికారంలో కొనసాగడానికి వారు పార్లమెంటు ఆమోదం మీద ఆధారపడ్డారు. ఆంగ్లేయ రాజులకిక సర్వంసహా అధికారం లేదు. విలియం, మేరీల వారసులను కూడా నిర్ణయించడంతో, రాచరికం మీద పార్లమెంటు ఆధిక్యాన్ని ప్రకటించుకుంది.

అంతర్యుద్ధమూ, విఖ్యాత విప్లవమూ ఇంగ్లండ్‌లో మధ్యతరగతికి రాజకీయ అధికారంలో పటిష్టమయిన స్థానాన్నిచ్చాయి. ఆ తరువాత పార్లమెంటులో ఈ మధ్య తరగతిదే పై చేయి అయింది. అయితే, ఓటు హక్కు మాత్రం ఆస్తిపరులకు మాత్రమే పరిమితమై ఉండింది. ఇప్పుడు రాజకీయ అధికారం చేజిక్కించుకున్న మధ్యతరగతి సంపన్న వర్గాల, మతాధికారుల ప్రత్యేక హక్కులను ప్రశ్నించడం కొనసాగించారు. ఎటువంటి ఫ్యూడల్ అవరోధాలూ లేకుండా ఆర్థికవ్యవస్థ స్వేచ్ఛగా వికసించాలని కూడా ఆ వర్గం కోరుకుంది. ఇంగ్లండ్‌లో తరువాతి శతాబ్దాలలో జరిగిన ఆర్థిక వ్యవస్థ మహావిస్తరణ, ఆధునిక పెట్టుబడిదారీ సమాజం ఎదుగుదల ఈ అంతర్యుద్ధం, ఘనమైన విప్లవాల ప్రత్యక్ష ఫలితాలే.

## 2.5 అమెరికన్ విప్లవం

అమెరికన్ విప్లవం లేదా అమెరికన్ స్వాతంత్ర్య పోరాటం-ఉత్తర అమెరికాలోని 13 బ్రిటిష్ వలసలు తమ మాతృ దేశపు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటం. ఆకాలంలో ఇంగ్లండును మూడవ జార్జి పాలిస్తున్నాడు.

అతను రాజు వ్యక్తిగత అధికారాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నిస్తున్నవాడు. ఉత్తర అమెరికాలో ఉన్న 13 బ్రిటిష్ వలసల్లో ఒక్కొక్క దానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక గవర్నర్‌ను నియమించేది. అతను వైస్‌రాయ్ వంటి వాడు. ప్రతి వలసలోనూ ఇంగ్లండ్ హౌజ్ ఆఫ్ కామన్స్ తరహాలో ఒక లెజిస్లేటివ్ అసెంబ్లీ ఉండేది. ఆ అసెంబ్లీ స్థానిక చట్టాలను, గవర్నర్ జీతభత్యాలను నిర్ణయించేది. ఆ విధంగా ఆ వలసలకు చెప్పుకోదగ్గ స్వయం నిర్ణయాధికారం ఉండేది. అయితే ఆ వలసల అసెంబ్లీలు తమకు బ్రిటిష్‌పార్లమెంటుతో సమానమయిన ప్రతిపత్తి కావాలని, తమ పన్నులను తామే నిర్ణయించుకుంటామని కోరసాగాయి.

తమ మీద వేసే పన్నులను వేలాది మైళ్ల ఆవల కూర్చున్న ఒక చట్టసభ, తమ ప్రాతినిధ్యం ఏమీ లేని పార్లమెంట్ నిర్ణయించడం అమెరికన్ వలసలకు అభ్యంతరకరమైంది. అందుకని, వారు 'ప్రాతినిధ్యం లేకుండా పన్నుల విధింపు ఉండకూడదు' అన్న నినాదం లేవదీశారు. పైగా, బ్రిటీష్ ప్రభుత్వమే స్వయంగా అమెరికన్ బ్రిటన్ వలసల్లో స్వావలంబన, స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంచి పోషించారు. అమెరికాలోని తమ వలసల విషయంలో బ్రిటన్ 'సానుకూల అలక్ష్యం' (మంచి ఫలితాలు సాధించే ఉద్దేశంతో పట్టించుకోకుండా ఉండడం; జోక్యం లేకుండా కొంత స్వయం ప్రతిపత్తితో పాలించడం) అన్న విధానాన్ని అనుసరించి చాలా కాలంపాటు పట్టించుకోలేదు. కాబట్టి, ఈ వలసల ప్రజలు నెమ్మదిగా మాతృదేశం నుంచి మానసికంగా దూరమైపోయి స్వతంత్రవాదులు కావడంలో ఆశ్చర్యంలేదు.

అమెరికన్ స్వాతంత్ర్యం వచ్చిన చాలా కాలం తరువాత స్వాతంత్ర్యం పూర్వపు పరిస్థితులగురించి రాస్తూ జాన్ ఆడమ్స్ విప్లవం కంటే ముందే యుద్ధం ప్రారంభమైందని వ్యాఖ్యానించాడు. "విప్లవం ప్రజల మనసుల్లో, మెదళ్ళలో మొదలయింది" అన్నాడాయన.

వలసలకీ, ఇంగ్లండుకీ మధ్య ఉన్న దూరం, రవాణాలో సమాచార వినిమయంలోవున్న ఇబ్బందులు, శిక్షలు పడ్డ నేరస్తులని వలసలకి పంపించే సంప్రదాయం-ఇవన్నీ అమెరికాలో స్థిరపడ్డ బ్రిటన్లకి మాతృదేశ భక్తిని సడలించి స్వాతంత్ర్య ఆకాంక్షను పెంచాయి.

అమెరికాలో స్థిరపడ్డ బ్రిటన్ల విషయంలో ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాల్లో బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి చాలా అసంతృప్తికి కారణమయింది. ఇంగ్లండ్ ప్రయోజనాలకే ప్రాముఖ్యం ఇస్తూ వలస ప్రజలను తక్కువగా చూడడం అమెరికన్ బ్రిటిషర్లకు నచ్చలేదు. వలసల గురించిన బ్రిటిష్ వారి విధానాల్లో ముఖ్యమైనది వర్తకవాదం (Mercantilism). తమ వలస దేశాల్లో ప్రజల వాణిజ్యాన్ని ఇంగ్లండ్ ప్రయోజనాలకు అనుగుణంగా మలచడం ఆ వాదం ఉద్దేశం. ఈ వర్తకవాదాన్ని అమలు చేయడానికి అనేక చట్టాలుకూడా చేశారు. వాటిలో ముఖ్యమైనవి నావికా చట్టాలు. 1660-1672 మధ్యకాలంలో జారీ అయిన ఈ చట్టాల ప్రకారం ఇంగ్లండ్‌కు, దాని వలసలకూ మధ్య జరిగే వర్తకం ఇంగ్లీషు వారు సొంతదారు అయిన ఓడల ద్వారా కానీ, ఇంగ్లీషు వారు నిర్మించిన ఓడలద్వారా కానీ జరగాలి. అలాగే పొగాకు, చక్కెర, పత్తి వంటి కొన్ని సరుకులను ఇంగ్లండుకు తప్ప మరే దేశానికి ఎగుమతి చేయకూడదు. చాలా కాలం పాటు ఈ చట్టాలు గట్టిగా అమలు కాలేదు. కానీ 1764లో ఇంగ్లండ్ పార్లమెంటు చక్కెర చట్టం ద్వారా వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చట్టం కొన్ని రకాల దిగుమతులమీద సుంకాలను తగ్గించింది కానీ, చక్కెర, వైన్, కాఫీ, పట్టు మొదలైన సరుకులు కొన్ని ఫ్రెంచి, స్పానిష్ వెస్ట్ ఇండీస్ నుంచి ఇంగ్లండ్ వలసల్లో దేనికయినా దిగుమతి అయిన పక్షంలో అదనపు సుంకాలు చెల్లించాలని నిర్దేశించింది. కస్టమ్స్ సుంకాల వసూలుకు సంబంధించి, అక్రమ రవాణా నిరోధానికి సంబంధించి ఈ చట్టం కఠినమయిన నిబంధనలను పెట్టింది. స్పానిష్, ఫ్రెంచ్‌వెస్ట్‌ఇండీస్‌నుంచి చక్కెర, మొలాసిస్‌ను దిగుమతి చేసుకుంటే చాలా లాభాలు గడిస్తున్న అమెరికన్ వర్తకులు ఈ చట్టం దెబ్బకు బాగా దెబ్బతిన్నారు. వారు ఆగ్రహించారు.

ఖజానా ఛాన్సలర్ జార్జి గ్రెన్‌విల్లె బ్రిటిష్‌పార్లమెంట్‌లో అనేక పన్నుల ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. వాటి ఫలితాల్లోగా 1765 నాటి స్టాంప్ యాక్ట్ వచ్చింది. వలసల రక్షణ బాధ్యతను చూసే బ్రిటిష్‌సైన్యం నిర్వహణావ్యయంలో కొంత భాగాన్ని వలస ప్రజల (వలసల్లో స్థిరపడిన బ్రిటిషర్ల) మీద ఈ చట్టం మోపింది. కానీ, ఈ చట్టానికి ఎంత వ్యతిరేకత వచ్చిందంటే వలసదారు ప్రజలు న్యూయార్క్‌లో స్టాంప్ యాక్ట్ మహాసభ జరిపి హక్కుల ప్రకటన జారీచేశారు. జూరీ ద్వారా విచారణను,

BRAOU

సొంత పన్నుల విధింపు విధానాన్ని ఈ ప్రకటనలో పొందుపరిచారు. ఫలితంగా బ్రిటిష్ పార్లమెంట్ మరుసటి సంవత్సరం స్టాంప్ యాక్ట్‌ను రద్దు చేసింది.

1767లో అప్పటి ఖజానా ఛాన్సలర్ చార్లెస్ టౌన్‌షెండ్ గాజు, సీసం, కాగితం, పెయింట్లు, రంగులు, తేయాకు వంటి అనేక సరుకుల మీద దిగుమతి సుంకాలను విధించారు. ఈ కొత్త పన్నులకు వ్యతిరేకంగా వలసల్లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమయింది. ప్రధానమంత్రి లార్డ్ నార్త్ తేయాకు మీద తప్ప తక్కిన టౌన్ షెడ్ సుంకాలన్నిటినీ రద్దుచేశాడు. తేయాకు మీద సుంకం కూడా బ్రిటిష్ పార్లమెంట్ తనకు వలసల మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా పన్నులు విధించే అధికారం ఉందని ప్రకటించుకోవడానికే కొనసాగించడం జరిగింది. అయితే వలసదారు ప్రజలు ఆ అధికారాన్ని అంగీకరించడానికి సిద్ధంగాలేరు. డిసెంబర్ 1773లో బోస్టన్ పౌరులు కొందరు రెడ్ ఇండియన్ల వేషంలో వెళ్లి ఒక బ్రిటిష్ తేయాకు ఓడనుంచి 342 పెట్టెల తేయాకును సముద్రంలో పారబోశారు. ఈ సంఘటననే 'బోస్టన్ టీపార్టీ' అంటారు. దీనికి ప్రతీకారంగా బ్రిటిష్ ప్రభుత్వం బోస్టన్ ఓడరేవును మూసివేసి, మాసాఛూసెట్స్‌కు స్థానిక స్వయం పాలనను రద్దు చేసింది.

జార్జియా తప్ప తక్కిన రాష్ట్రాల ప్రతినిధులతో అమెరికన్ కాంగ్రెస్ 1774లో సమావేశమై బ్రిటన్‌తో వర్తకాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. ఆ తరువాత సంవత్సరం జరిగిన రెండో అమెరికన్ కాంగ్రెస్ రాజ్యాంగ పరమయిన రాయితీలు కావాలని అభ్యర్థిస్తూ బ్రిటిష్ రాజుకు ఒక పిటిషన్ పంపింది. ఆ రాయితీలను ఇవ్వడానికి బ్రిటన్ నిరాకరించేసరికి, అమెరికన్ కాంగ్రెస్ యుద్ధానికి సన్నాహాలు మొదలు పెట్టింది. అమెరికన్ సైన్యానికి కల్నల్ జార్జి వాషింగ్టన్‌ను కమాండర్-ఇన్-చీఫ్‌గా నియమించింది. 1775లో యుద్ధం మొదలయింది.

అన్ని విప్లవాల లాగే, అమెరికన్ విప్లవానికి కూడా ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక ఉంది. పదిహేడవ శతాబ్ది ఆంగ్లేయ తత్వవేత్తలయిన లాక్, హారింగ్‌టన్, ఎడ్వర్డ్ కోక్ వంటి వారి నుంచి అమెరికన్ నాయకులు స్ఫూర్తిని పొందారు. 'ప్రాతినిధ్యం లేకుండా పన్నుల విధింపు లేదు', విప్లవించే హక్కు వంటి సిద్ధాంతాలు వారిని ఆకర్షించాయి.

అమెరికన్ కాంగ్రెస్ మూడో సమావేశం ఫిలడెల్ఫియాలో జరిగింది. ఈ సమావేశంలోనే 1776 జులై 4 నాడు సుప్రసిద్ధమయిన స్వాతంత్ర్య ప్రకటన **(Declaration of Independence)** రూపొందించారు. 'అందరు మనుషులూ సమానంగా సృష్టించబడ్డారు' **(All men are created equal)** అని ఈ ప్రకటన ఉద్ఘాటించింది. అవిభాజ్యమయిన హక్కుల గురించీ, ప్రజల సార్వభౌమాధికారం గురించి, విప్లవపు హక్కు గురించి ఈ ప్రకటన నొక్కిచెప్పింది. ఈ విలువల ప్రాతిపదికపై ఆ డిక్లరేషన్ ఇలా ప్రకటించింది; 'ఈ ఐక్య వలసలన్నీ ఇక స్వతంత్ర, స్వేచ్ఛాయుత రాజ్యాలు. స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండే హక్కు ఉన్న రాజ్యాలు'. జార్జి వాషింగ్టన్ సమర్థవంత నాయకత్వంలో, ఫ్రెంచి స్పానిష్ సైన్యాల సహకారంతో అమెరికన్ విప్లవకారులు ఆంగ్లేయ సైన్యాన్ని ఓడించగలిగారు. 1783లో ఇంగ్లండు అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వతంత్రాన్ని గుర్తించింది.

## 2.6 అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భావం

పవిత్ర విప్లవం, ఘనమైన విప్లవం- ఈ రెండు ఆంగ్లేయ విప్లవాల సిద్ధాంతాలను అమెరికన్ విప్లవం మరింత ముందుకు తీసుకువెళ్లింది. అది రాచరికాన్ని రద్దుచేసి, ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని, ప్రజా సార్వభౌమాధికారాన్ని అత్యున్నత స్థానంలో ప్రతిష్టించింది. ''17వ శతాబ్ది బ్రిటిష్ విప్లవాలు బ్రిటన్‌లోని కులీన వర్గాల విజయానికి ఎలాగయితే మార్గం వేశాయో, అలాగే 18వ శతాబ్దంలోని అమెరికన్ విప్లవం అమెరికాలోనూ, ప్రపంచం అంతటా ప్రజాస్వామ్యానికి పాదులు వేశాయి''

అమెరికన్ విప్లవం నుంచి ఒక కొత్త స్వతంత్ర దేశం- అమెరికా సంయుక్త రాష్ట్రాలు అనే దేశం ఆవిర్భవించింది. 1776 జులై 4 నాటి అమెరికన్ స్వాతంత్ర్య ప్రకటన అమెరికా దేశం బర్త్ సర్టిఫికేట్ లాంటిది. దాని అవతరణ పీడిత ప్రజలకు స్ఫూర్తి దాయకమయింది. ఫ్రెంచి విప్లవాన్ని నిర్వహించిన ఫ్రాన్స్ విప్లవకారులు అమెరికాను చూసి ప్రేరితులైనవారే.

BRAOU

## 2.7 ఫ్రెంచి విప్లవం

ఫ్రెంచి అతీతవాద (Absolutism) రాచరికం మీదా, ఫ్రెంచి కులీనవర్గాల ఫ్యూడల్ దోపిడి మీదా పెరిగిన అసంతృప్తి శతాబ్దంపైగా రాజుకుని 1789లో హింసాత్మక తిరుగుబాటుగా ప్రజ్వరిల్లింది. అదే ఫ్రెంచి విప్లవం. ప్రపంచ చరిత్రలో ఫ్రెంచి విప్లవం ఒక ప్రధానమయిన సంఘటన. ఫ్రెంచి విప్లవం అంటే ఫ్రాన్స్‌లో 1789 నుంచి 1799 వరకు జరిగిన అనేక సంఘటనల పరిణామాల పరంపర. ఈ దశాబ్ద కాలంలో దైవదత్తమయిన హక్కుతో పాలిస్తున్న రాచరికం, బోర్బన్ నిరంకుశత్వం హింసాత్మకంగా కూలదోయబడ్డాయి. రిపబ్లిక్ ఏర్పడింది, వర్గ భేదాలు, హోదాలు అన్నీ అంతరించి సామాజిక సమానత్వం ఏర్పడింది.

ఫ్రెంచి విప్లవం జరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. రాజకీయ, సామాజిక, ఆర్థిక, బౌద్ధిక కారణాలు అన్నీ తగినంత మోతాదులో పనిచేశాయి. అసలు బోర్బన్ రాచరికం రాజకీయ స్వభావమే ఇటువంటి విప్లవాలు రావడానికి అనువుగా ఉండేది. 18వ శతాబ్దంలోని ఫ్రెంచి రాజకీయ, సామాజిక వ్యవస్థ (Ancien Regime) అతీత వాదపు అధ్వాన్న శకంగా ఉండేది. రాజులు దైవదత్త హక్కు సిద్ధాంతాన్ని నమ్మేవారు. ఇష్టం వచ్చినట్టు పన్నులు వేసేవారు. ఫ్రెంచి రాజు ఎంతటి నిరంకుశుడంటే 14వ లూయీ 'నేనే రాజ్యం' అని ప్రకటించుకున్నాడు. 15వ లూయీ, 16వ లూయీ వంటి రాజులు రాణుల అభీష్టం మేరకు పాలనను నిర్వహించేవారు. ఫ్రెంచి విప్లవం ఆసన్నం అయ్యే కాలానికి రాచరికానికి ప్రజలతో సంబంధాలు లేని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల బాధ్యతారహిత ప్రభుత్వాన్ని కానీ, బాధ్యతారహిత పాలకుడిని కానీ సహించగలిగే, భరించగలిగే స్థితిలో ప్రజలు లేరు.

విప్లవానికి ఉన్న సామాజిక, ఆర్థిక కారణాలు కూడా బలమయినవే. ఫ్రెంచి సమాజంలో మూడు వర్గాల ప్రజలుండేవారు. ఒకరు మతాధికార వర్గం, రెండు కులీనులు, మూడు సేవకులు/శ్రామికులు. ఇందులో మొదటి రెండు వర్గాల వారి చేతిలోనే అత్యధిక భాగం భూమి ఉండేది. సామాన్యులు మాత్రం వారికంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తూ, ఆ భారం కింద అణగారి పోతున్నారు. సైన్యంలోనూ, పాలనాయంత్రాంగంలోనూ కులీనులే గుత్తాధిపత్యం వహించేవారు.

దేశంలో అత్యధికులు రైతులు. వారి పరిస్థితి దయనీయంగా ఉండేది. ఒకే ఒకగది ఉన్న గుడిసెలలో వారు నివసించేవారు. వారు రాజ్యానికి, ఫ్యూడల్ ప్రభువులకు, చర్చికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక పన్నులు చెల్లించేవారు. ఉప్పు పన్ను వంటి పరోక్ష పన్నులనేకం ఉండేవి. కులీనులకు, ప్రభుత్వానికి చేయవలసిన నిర్బంధ చాకిరీ ఉండేది. విప్లవాన్ని నిర్వహించింది రైతులు కాకపోయినప్పటికీ, వారి కష్టాలను కూడా విప్లవకారులు పరిగణనలోనికి తీసుకున్నారు. విప్లవకాలానికి మధ్యతరగతి బాగా బలపడింది. ప్రభుత్వ వర్తక వాద విధానాలను రద్దు చేయాలన్న డిమాండ్ కూడా పెరుగుతూ వస్తోంది. వర్తకవాదాన్ని వారు వ్యాపార సంస్థల స్వేచ్ఛకు వ్యతిరేకమయినదిగా భావించారు. వర్తకవాదం కోరలనుంచి విముక్తం కావాలన్న వ్యాపారుల ఆకాంక్ష కూడా ఫ్రెంచి విప్లవానికి ఒక ప్రధాన కారణం.

అనేక వినాశక యుద్ధాలు చేయడం వల్ల, 14వ లూయీ చేసినట్టు రాజ ప్రసాదాల నిర్మాణానికి డబ్బు వృధా చేయడం వల్ల ఫ్రెంచి ప్రభుత్వం దివాలా తీసింది. జాతీయ రుణాలు పెరిగిపోవడం వల్ల, ఖజానా ఖాళీ కావడం వల్ల మరింతగా పన్నులను విధించవలసి వచ్చింది. అయితే, మరిన్ని పన్నులను స్వీకరించాలంటే రాజకీయ సంస్కరణలు జరగాలని ప్రజలు కోరారు. ఆ సంస్కరణలను సాధించే అధికారం కోసం చేసిన పోరాటం విప్లవపు మొదటి కర్తవ్యంగా ఉండింది.

విప్లవానికి అనుకూలమయిన వాతావరణాన్ని సృష్టించిన రాజకీయ తాత్వికుల ప్రభావం గురించి చెప్పాలి. ఫ్రెంచి రాజకీయ విప్లవానికి ముందు బౌద్ధిక విప్లవం జరిగింది. వోల్టేర్, రూసో, మోంటెస్క్యూ తదితరులు అవతరించారు. లోకె; మోంటెస్క్యూ వంటి రచయితల ఉదారవాద సిద్ధాంతం ప్రకారం రాజ్యం ఒక అవసరమయిన చెడుగు, ప్రభుత్వం పరస్పర ఒప్పందం మీద ఏర్పడే వ్యవస్థ. అతీతవాదాన్ని లోకె తీవ్రంగా వ్యతిరేకించాడు. సహజ హక్కులు, పరిమిత ప్రభుత్వం, నియంతృత్వం మీద తిరగబడే హక్కు వంటి అతని సిద్ధాంతాలు ఫ్రెంచి విప్లవానికి ప్రధాన సిద్ధాంత ఇంధనాన్ని అందించాయి. ఉదారవాద రాజకీయ సిద్ధాంతానికి ఫ్రాన్స్‌లో ప్రముఖ సమర్థకులు, వోల్టేర్, మోంటెస్క్యూ, జ్ఞానవంతమయిన రాచరికంకానీ,

BRAOU

మధ్యతరగతి ప్రాబల్యం ఉన్న రిపబ్లిక్‌కానీ ఆదర్శమైన రాజ్య వ్యవస్థలని వోల్టేర్ భావించాడు. అసహనాన్ని, మూఢనమ్మకాలని, హోదాలని వ్యతిరేకించాడు. సమానత్వాన్ని, స్వేచ్ఛనీ డిమాండ్ చేశాడు. పాలనాయంత్రాంగంలోని అన్ని శాఖల్లోనూ మౌలికమయిన, తీవ్రమయిన మార్పు రావాలని కోరాడు. అధికారాల వేర్పాటు సిద్ధాంతాన్ని చెప్పిన మాంటెస్క్యూ కూడా వోల్టేర్ అంతటి గొప్పవాడు. అయితే, 18వ శతాబ్దిలోని ఫ్రెంచి తత్వవేత్తలందరిలోకీ గొప్పవాడు జీన్ జాక్వెస్ రూసో. అతడు నిజంగా ప్రజాస్వామ్యానికి పితామహుడు. రాచరికపు దైవదత్త హక్కును అతను నిరాకరించాడు. అన్ని ప్రభుత్వాలూ ప్రజలనుంచే ఏర్పడతాయని, ప్రభుత్వాలను కూలదోసే హక్కు ప్రజలకుంటుందని అతను చెప్పాడు. 'సామాజిక ఒప్పందం' (Social Contract) అన్న అతని రచన ఫ్రెంచి విప్లవానికి, ఆధునిక ప్రజాస్వామ్యానికి మౌలికమైనది.

విప్లవానికి నేపథ్యంగా పనిచేసిన బౌద్ధిక శక్తులలో నూతన ఆర్థిక సిద్ధాంతం కూడా ఒకటి. దాని ప్రధాన ఉద్దేశం ప్రభుత్వ అధికారాలను కనిష్టంగా తగ్గించి, వ్యక్తి స్వేచ్ఛను అత్యధికంగా పెంచడం. ఈ సిద్ధాంతంలో మరో ముఖ్యమయిన అంశం ఏమిటంటే-ఉన్నత వర్గాలన్నీ పరాన్న భుక్కులయిన సోమరులేనని, కింది తరగతుల వారే ఉత్పాదకులనీ తేల్చి చెప్పడం. వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయాలని చెప్పిన తీవ్రమయిన ఆర్థిక సిద్ధాంతకారులు కూడా ఈ కాలంలో ఉన్నారు.

ఆర్థిక సంక్షోభం రీత్యా ఎస్టేట్స్ జనరల్‌ను 1789 మేలో 16వ లూయీ పిలిపించాడు. ఆ విధంగా ఫ్రెంచి పార్లమెంటు 175 సంవత్సరాల తరువాత సమావేశం అయింది. అదే విప్లవానికి సూచన అయింది. దిగువసభ సభ్యులు జాతీయ అసెంబ్లీగా ఏర్పడి, మూడో ఎస్టేట్ పాలనాయంత్రాంగాన్ని చేపట్టింది. విప్లవకారులు బాస్టెల్ జైలును ముట్టడించి, ఖైదీలను విడుదల చేశారు. వెర్సైల్స్ రాజ ప్రాసాదాన్ని వదిలి పారిస్‌లో నివాసముండవలసిందిగా రాజును, రాణిని ఆదేశించారు. 1793లో 16వ లూయీని విచారించి గిలెటిన్ ద్వారా మరణ శిక్ష అమలు జరిపారు. అతని భార్య మేరీ అంటెనెట్టీని కూడా చంపేశారు.

విప్లవ ట్రిబ్యునల్ వేలాది మంది అనుమానితులను నామ మాత్రపు విచారణ జరిపి గిలెటిన్ ద్వారా వధించింది. విప్లవ నాయకులయిన డాంటన్, రోబెస్పియర్, మరట్ తదితరులు కూడా గిలెటిన్‌కు గురయ్యారు. ఆ బీభత్సకాండలో అనేక మంది ఫ్రెంచి నాయకులు శిరచ్ఛేదానికి గురయ్యారు.

BRAOU

## 2.7.1 ఫ్రెంచి విప్లవ ఫలితాలు

మానవ నాగరికత మీద మరే విప్లవమూ వేయనంత గాఢమయిన ముద్రను ఫ్రెంచి విప్లవం వేసింది. దాని ప్రకంపనలు 19వ శతాబ్దం అంతా ప్రతిధ్వనించాయి. అతీతవాద రాచరికాన్ని ఫ్రెంచి విప్లవం చావుదెబ్బతీసింది. ఫ్రెంచి విప్లవం తరువాత అపరిమిత అధికారాన్ని కోరడానికి చాలామంది రాజులకు ధైర్యం చాలలేదు. విప్లవం, అర్థ బానిసత్వం, ఫ్యూడల్ హోదాలతో సహా అనేక ఫ్యూడల్ అవశేషాలను ధ్వంసం చేసింది. ఫ్యూడలిజానికి చరమ గీతం పాడి, దాని స్థానంలో సమానత్వ సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించడం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛ సాధనకు అది మార్గం సుగమం చేసింది. వర్తక వాదాన్ని కూడా ఫ్రెంచి విప్లవం గట్టిదెబ్బ తీసింది. ఇక మతం రంగంలో క్రైస్తవం స్థానంలో హేతువాదాన్ని నిలబెట్టే ప్రయత్నం జరిగింది. కానీ, నెపోలియన్ అధికారానికి వచ్చిన తరువాత మతానికి దాని పాత స్థానాన్ని ఇచ్చాడు. అయినా, మతాన్ని రాజకీయాలను అంతిమంగా వేరుచేసే ప్రక్రియను ఫ్రాన్స్‌లోనే కాక ప్రపంచమంతటా ఈ విప్లవమే ప్రారంభించింది. ఫ్రెంచి వలసలలో బానిసత్వం రద్దు, రుణ గ్రస్తుల శిక్షణ రద్దు, వారసత్వాన్ని పెద్ద కొడుకు మాత్రమే పరిమితం చేసే చట్టాల రద్దు-వంటి అనేక సంస్కరణలు అమలు జరిగాయి. పెద్ద పెద్ద ఎస్టేట్లను విభజించి భూమిని పంపకం చేయడం కూడా విప్లవం ఫలితమే. ఫ్రెంచి విప్లవం సాధించిన అతి పెద్ద విజయం-ప్రజాస్వామ్యాన్ని, ప్రజా సార్వ భౌమాధికారాన్ని స్థాపించడం. ఫ్రెంచి విప్లవం అందించిన అతి గొప్ప వారసత్వం ఎన్నిక చేసుకున్న ప్రతినిధుల ద్వారా ప్రజలు తమను తాము పాలించుకునే హక్కు.

ఫ్రెంచి విప్లవం కొన్ని చేదు జ్ఞాపకాలను కూడా అందించింది. పాత వర్గహోదాల తొలగింపు వల్ల, విదేశీ శత్రువులనుంచి ఎదురయిన ఉమ్మడి ప్రమాదం వల్ల ఫ్రాన్స్‌లో జాతీయవాదం ఆవిర్భవించింది. అయితే అది తరువాత యుద్ధోన్మాద జాతీయవాదం (Jingoistic nationalism) గా పరిణమించింది. విప్లవం ద్వారా సాధించుకున్న విజయాల గురించిన ఫ్రెంచి

ప్రజల గర్వం, ఆ విజయాలను రక్షించుకోవాలన్న వారి దృఢ సంకల్పం ఉన్మాద దేశభక్తిగా, దుందుడుకు జాతీయవాదంగా పరిణమించాయి. ఆధునిక చరిత్రలో మొదటి సారిగా దేశం యావత్తూ యుద్ధానికే అంకితమై పోయింది. ఫ్రెంచి సమరశీల జాతీయవాదం ఇతర దేశాలకు కూడా సోకింది. అది జాతిపరమయిన ద్వేషాలకు, జాతి ఆధిక్య పోరాటాలకు దారితీసింది. విప్లవం అందించిన మరో దుష్ఫలితం-మానవ ప్రాణానికి విలువలేకుండా పోవడం. వేలాది మందిని దారుణంగా గిలెటిన్ కింద తలలు నరికేయడం విప్లవం సృష్టించిన బీభత్సం.

కొన్ని చెడులు ఉన్నా, మానవ నాగరికతా ప్రస్థానంలో ఫ్రెంచి విప్లవం స్థానం ఉన్నతమయినది. 1815 నుంచి ఐరోపా చరిత్ర అంతా ఫ్రెంచి విప్లవపు భావనలు సాధించిన పురోగతి చరిత్రే. ఇప్పటికీ ఫ్రెంచి విప్లవపు ఆదర్శాలు ప్రపంచ ప్రజల భవితవ్యాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

## 2.8 పారిశ్రామిక విప్లవం

పద్దెనిమిదో శతాబ్దంలో అనేక రాజకీయ విప్లవాలతో పాటు ఆర్థిక విప్లవాలు కూడా జరిగాయి. ఫ్రెంచి విప్లవం జరుగుతుండగా ఇంగ్లండు ఆర్థికరంగంలో తీవ్రమయిన మార్పులు జరుగుతున్నాయి. ఆ మార్పులనే పారిశ్రామిక విప్లవం అని అంటున్నాము. తయారీ సరకుల (Manufactured goods) ఉత్పత్తిలో జరిగిన అనేక మార్పుల పరంపరే పారిశ్రామిక విప్లవం. ఈ విప్లవం అనేక శాస్త్రీయ ఆవిష్కరణలకు దారితీసింది. ప్రాచీన సామాజిక, ఆర్థిక వ్యవస్థను వెనుకకు తోసేసి, యాంత్రిక యుగాన్ని (Machine-age) లేదా కర్బన యుగాన్ని (Carbon-age) అవతరింపజేసింది. సామాన్య మానవుడి జీవితంలో ఈ విప్లవం తెచ్చినన్ని మార్పులు మరే విప్లవమూ తీసుకురాలేదు. మానవ జాతి ప్రగతికి కొత్త ద్వారాలను తెరిచిందీ ఈ విప్లవమే. బాధలను, కష్టాలను పెంచిందీ, అసంతృప్తులను రగుల్కొల్పిందీ ఈ విప్లవమే.

పారిశ్రామిక విప్లవానికి జన్మస్థానం ఇంగ్లండేనని సాధారణ అభిప్రాయం. ఇంగ్లండ్‌లోని బొగ్గుగనులు, ఇనుప ఖనిజం, అనుకూలమయిన వాతావరణం, మంచి రవాణా సదుపాయాలు మొదలయినవి పారిశ్రామిక ప్రగతికి అనువయిన పరిస్థితులు. అనేక యంత్రాలను కనుగొనడం ద్వారా పత్తి, నూలు పరిశ్రమను మొదట యాంత్రికం చేశారు. నూలు వడికే యంత్రాన్ని, మరమగ్గాన్ని కనిపెట్టడంతో పరిశ్రమ క్రమంగా విస్తరించసాగింది. డేవీ సేఫ్టీ ల్యాంప్ బొగ్గుగనుల తవ్వకానికి కొత్త కాంతినిచ్చింది. ఆవిరి యంత్రాన్ని తీర్చి దిద్ది జేమ్స్‌వాట్ ఉత్పత్తి పద్ధతులను విప్లవీకరించాడు. పారిశ్రామిక విప్లవానికి విస్తృతార్థాన్నిచ్చిన అనేక ఇతర ఆవిష్కరణలు ఉన్నాయి. ఈ విప్లవం ఇతర దేశాలకు కూడా వ్యాపించి ప్రపంచవ్యాప్తం అయింది. ప్రకృతి శక్తుల మీద మనిషి విజయం ఈ విప్లవం.

BRAOU

## 2.8.1 పారిశ్రామిక విప్లవ ఫలితాలు

పారిశ్రామిక విప్లవంతో విశ్వాసయుగం అంతరించింది. పురాతన ఫ్యూడల్ సామాజిక నిర్మాణం ఛిన్నాభిన్నమైంది. ఈ విప్లవం అనేక కొత్త శక్తులను రంగం మీదికి దింపింది. సామాజికమయిన సర్దుబాట్లకు, పునర్నిర్మాణానికి సంబంధించిన అనేక దీర్ఘకాలిక సమస్యలకు కారణమయింది. ఈ విప్లవం చాలా విస్తృతంగా జరగడం వల్ల, దాని వల్ల ఉత్పన్నమయిన సమస్యలు సంఖ్యలోనూ, గుణంలోనూ పెరుగుతూ వచ్చాయి.

పారిశ్రామిక విప్లవం తక్షణ ఫలితాలు ఆర్థికరంగంలో కనిపించసాగాయి. కుటీర పరిశ్రమల స్థానంలో ఫ్యాక్టరీ ఉత్పత్తి వచ్చింది. ప్రతి పరిశ్రమలోనూ శ్రమ విభజన తీవ్ర రూపాలలో ఉండింది. ఫ్యాక్టరీలలో పెద్ద పరిమాణంలో జరిగిన సరుకుల ఉత్పత్తి ధరలను తగ్గించి సామాన్యులకు కూడా వాటిని అందుబాటులోకి తెచ్చింది. చవుక ధరలు, సమాచార సాధనాలలో మెరుగుదల, యంత్రాలు కలిగించిన విశ్రాంతి మనుషులలో సామాజిక సదుపాయాల్ని పెంచాయి, జనాభాను పెంచాయి.

ప్రాముఖ్యం వ్యవసాయం నుంచి పరిశ్రమకు మళ్లడంతో, గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణాలకు జనం వలసవెళ్లడం మొదలు పెట్టారు. పెద్దపెద్ద వ్యవసాయ క్షేత్రాల స్థాపన, పరిశ్రమల ఏర్పాటు అనేక మందిని నిరుద్యోగులను చేసింది. వారందరూ

పారిశ్రామిక నగరాలకు వలస వెళ్లడంతో, శ్రామికులు పెద్ద సంఖ్యలో పరిశ్రమలకు అందుబాటులోకి వచ్చారు. దానితో పెట్టుబడిదారులు తక్కువ వేతనాలు చెల్లించనారంభించారు. ఎక్కువ సమయం పని, తక్కువ వేతనాలు-పారిశ్రామిక విప్లవం తొలిదినాలలోని పరిస్థితి. గనుల్లో, ఫ్యాక్టరీల్లో పిల్లల్ని, ఆడవారిని కూడా కూలీలుగా తీసుకోసాగారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతం చుట్టూ మురికి వాడలు ఏర్పడ్డాయి. పేదరికం, అనారోగ్యం, అవినీతి, నేరాలు పెరిగిపోయాయి. శ్రామికుల చుట్టూ కమ్ముకున్న ఈ పరిస్థితులను చూసి సంస్కర్తలు అవతరించారు. శ్రామికుల విముక్తికి అనేక సామాజిక, మానవతావాద ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. బాలల చేత శ్రమ చేయించడాన్ని వ్యతిరేకించి లార్డ్ షాఫ్ట్స్‌బరీ దాన్ని రద్దు చేయించాడు. రాబర్ట్ ఓవెన్ కార్మికుల చైతన్యాన్ని పెంచి ట్రేడ్ యూనియన్లను, సహకార సంఘాలను నిర్మించాడు. కార్మికుల రాజకీయ హక్కుల కోసం చార్టిస్టులు పోరాడారు. ప్రభుత్వం కూడా కల్పించుకుని కార్మిక, ఫ్యాక్టరీ చట్టాలను చేయడం మొదలు పెట్టింది. పెట్టుబడికీ, కార్మికులకూ మధ్య ఘర్షణ పారిశ్రామిక సమాజం ప్రధాన స్వభావమైంది.

రాజకీయ రంగంలో భూస్వామ్య శక్తులను తొలగించిన పెట్టుబడిదారులు మధ్యతరగతికి చెందిన వారు. స్వేచ్ఛను, ఇతర ప్రజాస్వామిక విలువలను సాంప్రదాయికంగా పరిరక్షిస్తూ వస్తున్నవారు. అందుకని వారి రాజకీయ కార్యక్రమంలో మత సహనం, సార్వజనీన ఓటుహక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, పరిమిత ప్రభుత్వ జోక్యం వంటి విలువలు ఉండేవి. ఈ విలువలే వారు అభివృద్ధి చేసిన వ్యక్తి వాద, ఉదారవాద తాత్వికతకు పునాదులు.

పెట్టుబడి దారుల ఉదారవాదానికి ప్రతిగా కార్మిక వర్గానికి చెందిన విప్లవాత్మక సిద్ధాంతం రూపొందింది. జాతీయ వాదం స్థానంలో విశ్వజనీనవాదాన్ని అది నిలబెట్టింది. పెట్టుబడి దారీ విధానంలో ఉన్న సామ్రాజ్యవాదాన్ని వేలెత్తి చూపింది. కార్మిక వర్గ సిద్ధాంత కర్తలలో కారల్ మార్క్స్ అగ్రగణ్యుడు. పెట్టుబడిదారీ వ్యవస్థ శిథిలాలనుంచి నిర్మించే కార్మిక, కర్షక రాజ్యాన్ని ఆయన ఊహించాడు. ఆయన బోధలు కార్మికులలో విశ్వాసాన్ని పెంచి, వర్గరహిత సమాజం కోసం పోరాడడానికి వారిని ప్రేరేపించాయి.

BRAOU

## 2.9 ముగింపు

ఆధునిక యుగంగా చెప్పబడుతున్న 17, 18 శతాబ్దాల చారిత్రక పరిణామక్రమం అనేక విప్లవాలను వెంటతీసుకువచ్చింది. ఈ విప్లవాల ద్వారా సంభవించిన మార్పులే మానవ హక్కులకు దారులు తెరిచాయి. ఆధునిక మానవ హక్కుల రూపకల్పనకు అవకాశం కల్పించాయి. బ్రిటిష్ రాజరికంమీద హక్కుల చట్టం ఆధిక్యత, అమెరికాలో సంభవించిన స్వాతంత్ర్య పోరాటం విశ్వమానవ హక్కులను చాటిచెప్పింది. ఫ్రెంచి విప్లవం స్వేచ్ఛా స్వాతంత్ర్యం సౌభ్రాతృత్వం వంటి ప్రజాస్వామ్య భావజాలాన్ని ఈ ప్రపంచానికి అందించింది. ఈ మూడు విప్లవాల వారసత్వంగా 19వ శతాబ్దంలో రష్యా విప్లవం విజయవంతమైంది. ఈ విప్లవాల యుగంలో రక్త పాతరహితంగాను, హింసద్వారాను వివిధ సందర్భాలలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ విప్లవాల వికాసంలో మానవ హక్కులకు ముఖ్యస్థానం లభించింది. విప్లవాలు సంభవించిన అన్ని సందర్భాలలోని అనుభవాలను పరిశీలిస్తే ఆయా దేశాల పాలకవర్గాలు మానవ హక్కులపై మోపిన ఉక్కు పాదాన్ని ధ్వంసం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున సంఘటితమై తమ హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించారని చెప్పవచ్చు.

ఆర్థిక విప్లవంగా చెప్పుకునే పారిశ్రామిక విప్లవంద్వారా ఉత్పత్తి శక్తుల స్వరూప స్వభావాలు మారినప్పటికి మానవ హక్కులకు సంబంధించినంతవరకు పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ మార్పు రాకపోగా దోపిడి రూపాలు, అణచివేత అధికమైనాయి. ఈ లోపాలను కప్పిపుచ్చుకుంటూ మనుగడ సాగించే క్రమంలో ప్రజాస్వామ్యం, వ్యక్తి వాదం, ఉదారవాద తాత్విక సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సిద్ధాంతాలకు ప్రతిగా కార్మిక వర్గానికి చెందిన విప్లవ సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చింది. మార్క్సిస్టులు పెట్టుబడిదారి విధానంలోని సామ్రాజ్యవాదాన్ని వేలెత్తి చూపారు. కార్మిక దోపిడిని అంతమొందించే సిద్ధాంతంగా కార్మిక వర్గంలో విశ్వాసాన్ని పాదుకొల్పి వర్గ రహిత సమాజం కోసం పోరాడే శక్తిని, విశ్వమానవ హక్కుల సాధనకు సమగ్రమైన పోరాటాన్ని ఈ సిద్ధాంతం అందించగలిగింది.

## 2.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానాలు రాయండి:**

1. ఆంగ్లేయ విప్లవం నుంచి అమెరికన్ స్వాతంత్ర్య సమరం దాకా జరిగిన పరిణామంలో మానవ హక్కుల వికాసాన్ని గుర్తించండి.
2. ఆధునిక విప్లవాలు ప్రకటించిన విలువలు నేటి పరిస్థితులకు ఎంత మేరకు అనుగుణమైనవో చర్చించండి.
3. పారిశ్రామిక విప్లవం తక్కిన విప్లవాల కంటే భిన్నమైనదా, దాని ప్రభావాలేమిటి? పరిశీలించండి.

**ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు రాయండి:**

1. ఇంగ్లండులో 17వ శతాబ్దంలో రాజుకు, పార్లమెంటుకు మధ్య జరిగిన రాజ్యాంగ ఘర్షణను పరిశీలించండి.
2. అమెరికన్ స్వాతంత్ర్య ప్రకటన ఒక దేశం జనన ప్రకటన? అని ఎందుకు అనవచ్చునో చర్చించండి.
3. వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం- ఈ విలువల వికాసంలో ఫ్రెంచి విప్లవం పాత్ర ఏమిటో వివరించండి.

## 2.11 సంప్రదింపు గ్రంథాలు

కార్టర్ & జేమ్స్ మియర్స్: ఎ హిస్టరీ ఆఫ్ బ్రిటన్

ఎ.జె. పాట్రిక్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్

బ్రెయిన్ మౌనింగ్: ఇంగ్లీష్ పీపుల్ అండ్ ది ఇంగ్లీష్ రివల్యూషన్

ఇ. లిప్సన్: హిస్టరీ ఆఫ్ యూరోప్ డ్యూరింగ్ నైన్టీన్ అండ్ ట్వంటియెత్ సెంచరీస్

సి.డి. హేజెన్: హిస్టరీ ఆఫ్ మోడర్న్ యూరోప్ సిన్స్ *1789*

బి.ఎమ్. గార్డినర్: ది ఫ్రెంచి రివల్యూషన్

హెచ్.ఎ.ఎల్. ఫిషర్: హిస్టరీ ఆఫ్ యూరోప్

జి.ఎమ్. ట్రెవిల్యన్: హిస్టరీ ఆఫ్ ఇంగ్లండ్

BRAOU

# భాగం 3 : ప్రపంచ యుద్ధాలు:శాంతి

## విషయ క్రమం

3.0 ఉద్దేశం

3.1 పరిచయం

3.2 మొదటి ప్రపంచ యుద్ధానికి కారణాలు

3.3. యుద్ధ క్రమం

3.4 మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావం

3.5 శాంతి ప్రయత్నాలు

3.6 శాంతి ప్రయత్నాల వైఫల్యం

3.7 రెండో ప్రపంచయుద్ధం-కారణాలు

3.8 రెండో ప్రపంచయుద్ధ క్రమం

3.9 రెండో ప్రపంచయుద్ధ ప్రభావం

3.10 శాంతి స్థాపనకు చర్యలు

3.11 ముగింపు

3.12 మాదిరి పరీక్ష ప్రశ్నలు

BRAOU

## 3.0 ఉద్దేశం

### ఈ భాగం చదివిన తర్వాత మీరు

- మొదటి ప్రపంచయుద్ధానికి గల కారణాలు తెలుసుకుంటారు.
- రెండవ ప్రపంచయుద్ధ పరిణామాలు అర్థం చేసుకుంటారు
- రెండవ ప్రపంచయుద్ధానంతరం జరిగిన శాంతియత్నాలు వివరించగలుగుతారు.

## 3.1 పరిచయం

1914లో మొదలయిన మొదటి ప్రపంచ యుద్ధం చరిత్రలో జరిగిన అతిపెద్ద మొదటి యుద్ధం. 19వ శతాబ్దం చివరలో, 20వ శతాబ్దం మొదట్లో ఐరోపా రాజ్యాలలో తలెత్తిన అహంకార పూరితమయిన దురాక్రమణ (మిలిటెంట్) జాతీయవాదం పరాకాష్ఠ ఈ యుద్ధం. ఐదు సంవత్సరాల పాటు జరిగిన ఈ మహా సంగ్రామం ఐరోపా రాజకీయ పటం రూపురేఖలు మార్చివేసిన అతిపెద్ద ఉపద్రవం.

# 3.2 మొదటి ప్రపంచ యుద్ధానికి కారణాలు

18వ శతాబ్దిలోని చివరి మూడు దశాబ్దాలలో సంభవించిన అనేక పరిణామాల పరాకాష్ఠగా 1914లో మొదటి ప్రపంచ సంగ్రామం బద్ధలయింది. అప్పటికి ఐరోపాలో ప్రధాన శక్తులైన రాజ్యాల నడుమ ఉన్న అంతర్జాతీయ సంబంధాలలో ఈ యుద్ధానికి మూలాలు ఉన్నాయి. ఆ శక్తుల మధ్య ఉన్న దౌత్య పరమైన వైరం, రహస్య సంధుల ద్వారా రెండు ప్రత్యర్థి శిబిరాలుగా అవి చీలిపోవడం ఐరోపా ఖండాన్ని రణరంగంగా మార్చి వేశాయి. దుందుడుకు జాతీయవాదం, వాణిజ్య, వలసవాద వైరాలు, ఆయుధ పోటీ సృష్టించిన ఉద్రిక్తతలు ప్రపంచమంతా కమ్ముకున్నాయి. 1899 నాటి హేగ్ కాన్ఫరెన్స్ నిరాయుధీకరణ విషయంలో ఎటువంటి తీర్మానానికి రాలేకపోవడంతో, ప్రమాదం మరింత పెరిగింది. సమీప ప్రాచ్య దేశాల సమస్య ప్రత్యర్థుల ప్రవేశంతో మరింత క్లిష్టమై పోవడం, సమాంతరంగా పాన్ స్లావిక్ జాతీయవాదం పెరిగిపోవడం యుద్ధారంభానికి దారితీశాయి.

ఇతర ముఖ్య కారణాలు:

## i. జాతీయ వాదం:

మొదటి ప్రపంచ యుద్ధానికి ప్రధాన కారణం ఫ్రెంచి విప్లవం ఫలితంగా అవతరించిన జాతీయవాదం. ముక్కలు ముక్కలుగా ఉన్న ఇటలీ, జర్మనీలు జాతి ప్రాతిపదిక మీద దేశాలుగా ఏకం కావడంతో ఈ జాతీయవాదానికి మరింత శక్తి వచ్చింది. ఇతర ఐరోపా దేశాలు కూడా తమ జాతి ఆధిక్యాన్ని ప్రదర్శించుకుంటూ, ఇతరులను పాలించే హక్కును ప్రకటించుకోసాగాయి. పారిశ్రామిక విప్లవం కారణంగా సమకూరిన సంపద, సమృద్ధి వల్ల వారిలో ఆధిక్య భావం బలంగా నాటుకుని పోయింది. గ్రేట్ బ్రిటన్, జర్మనీలు నౌకా-సైనిక వైరంలోకి దిగడం, జర్మనీనుంచి అల్సేస్-లొరేన్ సాధించాలని ఫ్రాన్స్ ప్రయత్నించడం, ఆస్ట్రియానుంచి ఇటాలియన్ భూభాగం కోసం జరిగిన ఇటాలియన్ల పోరాటం... అనేక రీతుల్లో జాతీయవాదం ఉధృతమైంది. జాతీయవాదం వైపరీత్యం వల్లే ఈ కలహాలు... చిలికి చిలికి ఆసియా, ఆఫ్రికా, బాల్కన్‌లలో సామ్రాజ్యవాద ప్రయోజనాల ఘర్షణగా పరిణమించింది.

## ii. దౌత్య పరమైన వైరాలు:

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభానికి చాలా కాలం ముందునుంచే బ్రిటన్‌కూ, జర్మనీకి మధ్య నావికా రంగవైరం ఉండేది. అలాగే అల్సేస్-లొరేన్ విషయంలో ఫ్రాన్స్‌కూ, జర్మనీకి ఘర్షణ ఉండేది. బాల్కన్స్ విషయంలో, ఆస్ట్రియా-రష్యా మధ్య ఉన్న గొడవ మొరాకో, బాల్కన్‌ల సంక్షోభానికి దారితీసింది. జర్మనీ తలపెట్టిన బెర్లిన్-బాగ్దాద్ ప్రాజెక్టు కారణంగా టర్కీకి అసంతృప్తిగా ఉంది. చివరగా, స్లావ్ జనాభా ప్రాంతాలయిన బోస్నియా, హెర్జెగోవినాలను 1908లో ఆస్ట్రియా కలుపుకోవడం, సెర్బియాను అణచివేయాలన్న నిశ్చయంతో ఉండడం పరిస్థితికి ఆజ్యం పోశాయి.

## iii. ప్రత్యర్థి కూటముల వ్యవస్థ:

రహస్య కూటములు ఐరోపాను రెండు ప్రత్యర్థి శిబిరాలుగా చీల్చివేశాయి. ముఖ్యంగా త్రయ కూటమి (Triple Alliance), 'ట్రిపుల్ ఎంటెంట్ (Triple Entente) అవగాహన-వాన్ ప్రష్యా జర్మనీ, ఆస్ట్రియా, రష్యాల మధ్య 1873లో ఒక స్నేహ సమితి (League of Friendship) ని బిస్మార్క్ ఓటో ఏర్పాటు చేశాడు. ఈ కూటమిని 'డ్రీకైసబాండ్' (Dreikaisaband) (ముగ్గురు చక్రవర్తుల సమితి) అని పిలిచాడు. తరువాత ఈ సమితినుంచి రష్యా వైదొలగింది. అప్పుడు బిస్మార్క్ ఆస్ట్రియాతో ఒక సంధి చేసుకున్నాడు. అది ఆస్ట్రో-జర్మన్ ద్వంద కూటమి (Austro-German Dual Alliance) గా సుప్రసిద్ధం. ఈ సంధి ప్రకారం రష్యా కనుక ఆస్ట్రియా, జర్మనీలలో దేనిమీద దాడిచేసినా ఈ రెండు దేశాలూ పరస్పరం సైనికంగా సహాయం చేసుకుంటాయి. ఈ ద్వైపాక్షిక కూటమి రష్యాకు వ్యతిరేకంగా రూపొందిన ఆత్మరక్షణా కూటమి. తరువాత 1882లో దీనిలో ఇటలీ చేరడంతో ఇది త్రయ కూటమి (Triple Alliance) అయింది. అలాగే ఈ త్రయ కూటమినుంచి దాడి జరిగే పక్షంలో సహకరించుకోవాలని 1891లో ఫ్రాన్స్-రష్యాల మధ్య అంగీకారం కుదిరింది.

B R A O U

ఇందులో బ్రిటన్ కూడా చేరినప్పుడు 1907లో ఇదే 'రాజ్యత్రయం' (Triple Entente) గా అవతరించింది. ఈ రకంగా ఐరోపా రెండు ప్రత్యర్థి శిబిరాలుగా చీలిపోయింది.

### iv. సైనికవాదం

బిస్మార్క్ నాయకత్వంలో జర్మనీ పెద్ద సైనిక శక్తిగా, తిరుగులేని నావికా శక్తిగా అవతరించింది. 1913లో జర్మనీ సైన్యం సంఖ్య 8,70,000 ఉండేది. దీనికి సమాధానంగా ఫ్రాన్స్ నిర్బంధ సైనిక సర్వీసును రెండు నుంచి మూడేళ్లకు పెంచింది. రష్యా కూడా సైన్యాన్ని భారీగా పెంచింది. అలాగే బ్రిటన్ తన నావికా బలాన్ని పటిష్టం చేసుకుంది. ఇలా పోటా పోటీగా సైనికశక్తిని పెంచుకోవడం యుద్ధానికి నేపథ్యంగా పనిచేసింది.

### v. ఆర్థిక కారణాలు:

పారిశ్రామిక దేశాల మధ్య వలసలకోసం పోటీకి ప్రధానకారణం పారిశ్రామిక విప్లవం. ముడి పదార్థాలను సంపాదించుకోవడం కోసం వారికి వలసలు అవసరమయ్యాయి. దక్షిణ ఆఫ్రికా మార్కెట్లను చేజిక్కించుకోవడానికి బ్రిటన్, జర్మనీ తీవ్రంగా పోటీ పడ్డాయి. గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాల మధ్య నిరంతర ఘర్షణలకు సామ్రాజ్యవాదమే ప్రధాన కారణం ఈ మూడు రాజ్యాలూ ఐరోపాకు వెలుపల పెద్ద సామ్రాజ్యాలను నిర్మించాయి. తమ దేశాలను సుసంపన్నం చేసుకోవడానికి అవి వలసదేశాలను పీల్చి పిప్పిచేశాయి. ఆసియా, ఆఫ్రికా మార్కెట్లను రక్షించుకోవడానికి అవి పెద్ద సైన్యాలను నిర్మించుకున్నాయి. ఈ ఆర్థిక శత్రుత్వం యుద్ధం ప్రజ్వరిల్లడానికి చాలా దోహదం చేసింది.

### vi. మొరాకో సమస్య

దక్షిణాఫ్రికాను బ్రిటన్, ఫ్రాన్స్ పంచుకోవడం మీద జర్మనీకి గుర్రుగా ఉండేది. తమ మధ్య సంధి ప్రకారం బ్రిటన్ ఫ్రాన్స్‌కు మొరాకో విషయంలో స్వేచ్ఛ ఇచ్చింది. కానీ, జర్మనీ దౌర్జన్యాలు చేసింది. అన్ని రాజ్యాలకు మొరాకో విషయంలో సమాన హక్కు ఉండాలని వాదించింది. ఆ సమస్య అమెరికా జోక్యంతో తాత్కాలికంగా పరిష్కారమయింది. మొరాకో మీద ఫ్రాన్స్‌కున్న ప్రత్యేక హోదాను గుర్తించడం జరిగింది. కానీ, 1911లో మొరాకోకు ఫ్రాన్స్ సైన్యం పంపినపుడు, జర్మని వ్యతిరేకించింది. అయితే ఆ తరువాత మొరాకోలో ఫ్రెంచి ప్రొటెక్టొరేట్‌ను అంగీకరించింది. ఫ్రెంచి కాంగోలో కొంత భాగాన్ని ఫ్రాన్స్ జర్మనీకి ఇచ్చింది.

BRAOU

### vii తక్షణ కారణం:

ఆస్ట్రియాకు చెందిన ఆర్‌డ్యూక్ ఫెర్డినాండ్, అతని భార్య సరయెవోలో ఒక సెర్బ్ చేతిలో హత్యకు గురయినప్పుడు, నేరస్థులను 48 గంటల్లో తమకు అప్పగించాలని ఆస్ట్రియా సెర్బియాకు అల్టిమేటమ్ ఇచ్చింది. దీనితో పాటు బోస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా ఆక్రమించడం గురించి కొంత ఉద్రిక్తత ఉండింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రియా 1914 జులై 28 నాడు సెర్బియా మీద దాడి చేసింది. రష్యా సెర్బియాకు రక్షణగా నిలబడగా, జర్మనీ ఆస్ట్రియాకు అండగా నిలిచింది. తరువాత టర్కీ, బల్గేరియా జర్మనీ పక్షాన చేరేసరికి మొదటి ప్రపంచ మహా సంగ్రామం ప్రారంభమయింది.

## 3.3. యుద్ధ క్రమం

బెల్జియం ఆక్రమణతో 1914లో జర్మనీ దాడులు మొదలయ్యాయి. వాన్‌క్వక్ (Von kwck) ఆధ్వర్యంలో జర్మనీ పారిస్ వైపు దండయాత్ర మొదలుపెట్టి మార్నె (Mame) దాకా వెళ్లింది. జనరల్ ఫోచ్ (General Foch) నాయకత్వంలోని మిత్ర రాజ్యాలు జర్మనీ సైన్యాన్ని ఛిన్నా భిన్నం చేసి మార్నెనుంచి ఉత్తరదిక్కుగా ఐస్నె (Aisne) నది దిశగా వెనక్కు మళ్లేట్టు చేశాయి. 1914 నాటి మార్నె పోరాటం ఫ్రాన్స్‌ను అణచి పారేయాలన్న జర్మనీ సంకల్పాన్ని విఫలం చేసింది. ఈ లోగా

జర్మన్లు అంట్‌వెర్ప్ (Antwerp) ను చేజిక్కించుకుని, బెల్జియంను ఆక్రమించారు. 1915లో వెప్రెస్ పోరాటం (battle of Vpnes) లో వారు బ్రిటన్‌తో చేతులు కలిపారు. రష్యా ఆస్ట్రియాను ఓడించింది కానీ జర్మనీ దాని సహాయానికి వచ్చి వార్సాను పట్టుకుంది. 'ట్రిపుల్ అలయన్స్'లో వున్న ఇటలీ 1915లో మిత్ర రాజ్యాల పక్షానికి చేరింది. డార్డెనెల్లెస్ (Dardenelles) ను చేజిక్కించుకుని టర్కీ రష్యాకూ, మిత్ర రాజ్యాలకూ నడుమ సమాచార సంబంధాలు లేకుండా చేసింది.

1916లో వెర్డన్ (Verdun) మీద జర్మనీ పెద్ద ఎత్తున దాడి చేసింది. తరువాత బ్రిటిష్ సేనలు, ఫ్రెంచి సైన్యం కలిసి సోమె (Somme) మీద దాడి చేశాయి. తీవ్రమయిన పోరాటం జరిగింది. తూర్పు ప్రాంతంలో రష్యన్లకు ఎక్కువ విజయాలు దక్కాయి. ఆస్ట్రియన్లను వెనక్కు తరుమగలిగారు. కానీ, మరింత ముందుకు వెళ్లకుండా జర్మన్లు అడ్డుకున్నారు. ఇంతలో ఇటలీ దాడులు మొదలుపెట్టి, కోరిజీ (Corizie) ని చేజిక్కించుకుంది. అదే సంవత్సరం రుమేనియా ఆస్ట్రియా మీదయుద్ధం ప్రకటించింది కానీ ఆస్ట్రో-జర్మన్ సేనలు రుమేనియాను ఓడించాయి. 1916లో జట్‌ల్యాండ్ (Jutland) పోరాటంలో బ్రిటన్,జర్మన్ నావికా సైన్యాన్ని ఓడించింది. అందుకు ప్రతీకారంగా ఇంగ్లండునుంచి బయలుదేరిన ఓడలను జర్మనీ ముంచేసింది.

బోల్షెవిక్ విప్లవం తరువాత యుద్ధం నుంచి రష్యా తప్పుకుంది. జర్మనీతో బ్రెస్ట్లి టోవస్క్ సంధి (treaty of Brestlitovsk) చేసుకుంది. ఆ సంధి ప్రకారం పోలండ్‌ను, బాల్టిక్ ప్రాంతాలను జర్మనీకి రష్యా ఇచ్చేసింది. అన్ని అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి జర్మనీ విచ్చలవిడిగా జరుపుతున్న జలాంతర్గామి దాడులకు నిరసనగా అమెరికా కూడా యుద్ధంలో చేరింది.

1918లో జర్మనీ పశ్చిమ రంగంలో దాడుల పరంపర మొదలు పెట్టింది. మార్షల్ ఫోక్ నాయకత్వంలోని మిత్ర రాజ్యాల సేనలు సిరియాలో టర్కీలను ఓడించి, బల్గేరియాను లొంగదీసుకుని, ఆస్ట్రియాను పతనం చేసాయి. జర్మన్లను తరిమివేశాయి. జర్మనీ వెనక్కి తగ్గి శాంతి ప్రతిపాదన చేసింది. అమెరికా అధ్యక్షుడు విల్సన్ చేసిన 14 అంశాల కార్యక్రమం ఫలితంగా మిత్రరాజ్యాలు శాంతి ప్రతిపాదనలకు అంగీకరించాయి. మిత్ర రాజ్యాల డిమాండ్లకు తలవొగ్గి, జర్మనీ 1918 నవంబర్ 11నాడు యుద్ధ విరమణ సంధి మీద సంతకాలు చేసింది.

## 3.4 మొదటి ప్రపంచయుద్ధ ప్రభావం

ప్రపంచవ్యాప్తంగా జరిగిన మొట్టమొదటి యుద్ధం కాబట్టి మొదటి ప్రపంచ మహాసంగ్రామానికి ప్రాముఖ్యం ఏర్పడింది. అయితే, ఆ ప్రాముఖ్యం కంటే, యుద్ధంలో ఎవరు ఓడారు, ఎవరు గెలిచారు అన్న విషయాల కంటే ఆ యుద్ధం కలిగించిన ప్రభావం ఇంకా ముఖ్యమైనది.

యుద్ధాన్ని విరమిస్తూ చేసుకున్న వెర్సైల్స్ సంధి (Treaty of Versailles) మీద సంతకం చేసినప్పటినుంచి జర్మనీ ఇంటా బయటా విమర్శలను ఎదుర్కొనవలసి వచ్చింది. యుద్ధ విరమణ సంధి కోసం జరిగిన శాంతి మహాసభ నిజానికి శాంతి సభ కాదని, జర్మనీ దాని పక్షాన ఉన్న రాజ్యాలను పిలిచి శిక్ష వినిపించిన ట్రిబ్యునల్ అని విమర్శలు వచ్చాయి. మొదటి అంశం-సంధి రూపకల్పనలో జర్మనీకి స్థానం ఇవ్వలేదు. ఇచ్చివుంటే జర్మనీని అంతగా అవమానించే సంధి షరతులు కొద్దిగానయినా సడలి ఉండేవి. రెండో అంశం-సంధిలో జర్మన్‌లు ఎవ్వరూ లేనందువల్ల దానికి దేశంలో మద్దతు కూడగట్టడం సాధ్యం కాలేదు.

అది జాతీయ వాదపు ఘనవిజయం. అది ఐరోపాను జాతి ప్రాతిపదికన పునర్నిర్మించింది. 1914 కంటే ముందు ఐరోపాలో 19 దేశాలుండేవి. సంధి తరువాత 26 దేశాలయ్యాయి. ఫిన్‌లాండ్, ఇస్తోనియా, లాట్వియా, లిథుయేనియా, పోలండ్, చెకొస్లొవేకియా, యుగొస్లావియా దేశాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఈ దేశాల్లో కొన్ని చాలా చిన్నవి. ఆర్థికంగా స్వావలంబనతో మనుగడ సాగించలేనివి. అలాగే, యుద్ధానంతరం, స్వతంత్ర ఐరిష్ దేశం ఒకటి డొమినియన్ ప్రతిపత్తితో ఏర్పడ్డది.

BRAOU

ఈ జాతీయవాద స్ఫూర్తి ఆసియాను, ఆఫ్రికాను, మేల్కొల్పింది. చైనాలో, జపాన్‌లో జాతీయ పునర్నిర్మాణ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. టర్కీలో కొత్త ఉత్సాహం తలెత్తింది. యుద్ధం ద్వారా ఈజిప్టు మీద సాధించుకున్న ప్రొటెక్టరేట్‌ను వదులుకునేట్టు ఈజిప్టు బ్రిటన్ మీద ఒత్తిడి చేసి 1922 నాటికే సాధించింది. భారతదేశంలో ఖిలాఫత్ ఉద్యమం భారతీయులను ఏకం చేసింది, అది సహాయనిరాకరణ ఉద్యమం ఎదుగుదలకు దోహదం చేసింది.

ప్రజాస్వామ్యం వ్యాపించడానికి, రిపబ్లికనిజమ్, కమ్యూనిజాలకు దారి సుగమం కావడానికి మొదటి ప్రపంచ యుద్ధమే కారణం. రష్యా, టర్కీ, జర్మనీ, గ్రీస్‌లలో కొత్త రకాల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయితే, జర్మనీలో, ఇటలీ, స్పెయిన్‌లలో నియంతృత్వం ఏర్పడడంతో నాజీలు, ఫాసిస్టులు వంటి ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు ప్రబలి 1939 నాటికి మరో ప్రపంచ యుద్ధం రావడానికి కారణమయ్యారు.

మొదటి ప్రపంచ యుద్ధం ఫలితం మరొకటి-నానాజాతి సమితి ఆవిర్భావం. ఇది శాంతి స్థాపన, భద్రతలకోసం మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ స్థాయిలో ఏర్పడ్డ సంస్థ. రెండో ప్రపంచ యుద్ధం రావడంతో ఈ సమితి అంతరించిపోయినా, ఐక్యరాజ్యసమితి పూర్వరూపంగా అది చరిత్రలో నిలిచిపోతుంది.

## 3.5 శాంతి ప్రయత్నాలు

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత శాంతి స్థాపన కోసం వివిధ ప్రయత్నాలు జరిగాయి. అనేక మహా సభలు జరిగాయి. అనేక సంధిలు కుదిరాయి.

### I. పారిస్ శాంతి మహాసభ, 1919

BRAOU

ఈ మహాసభలో 37 దేశాలు పాల్గొన్నాయి. 1919 జనవరి 18వ తేదీన జరిగిన ఈ మహాసభలో ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఇటలీ, అమెరికా, జపాన్- ఈ ఐదు దేశాలకు చెందిన 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్రాన్స్ నుంచి క్లెమెన్స్యూ (Clemensceau), ఇంగ్లండ్ నుంచి లాయిడ్ జార్జ్ (Lloyd George), ఇటలీనుంచి ఆర్లాండో (Orlando), అమెరికానుంచి విల్సన్, జపాన్ నుంచి సౌన్‌టెరీజి (Sauntereezi) ప్రతినిధి బృందాలకు నాయకత్వం వహించారు. అయితే, అన్ని ప్రధాన చర్చల్లోనూ ఫ్రాన్స్, ఇంగ్లండ్, అమెరికా ప్రధానంగా పాల్గొన్నారు. 1870లో జర్మనీ చేతిలో జరిగిన పరాభవాన్ని ఫ్రాన్స్ మరిచిపోలేదు. నానాజాతి సమితి ప్రాతిపదికమీద నూతన ప్రపంచ వ్యవస్థ ఏర్పాటు కావాలని ఆదర్శ వాది అయిన విల్సన్ కోరాడు. దీనితో పాటు ఆయన జర్మనీ వలసదేశాల్లోనూ, మిత్ర రాజ్యాల ఆధీనంలో ఉన్న టర్కీ ప్రాంతాల్లోనూ మంచి పరిపాలనను నెలకొల్పడానికి తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా కోరాడు. ఫ్రాన్స్, ఇటలీ చేసిన కొన్ని డిమాండ్లను విల్సన్ వ్యతిరేకించాడు.

### II. వెర్సైల్స్ సంధి, 1919

మొదటి ప్రపంచయుద్ధానికి సంబంధించి ఈ సంధి చాలా కీలకమైనది. యుద్ధానికి సంబంధించిన బాధ్యతను నిర్ధారించి, జర్మనీ లొంగుబాటును ఖాయం చేసినది యీ ఒడంబడికే. మిత్ర రాజ్యాలు రూపొందించిన యీ సంధిలోని అంశాలను చర్చించడానికి జర్మన్ ప్రతినిధులను అనుమతించలేదు. కీలకమైన ప్రాదేశిక అంశాలు, సైనిక అంశాలు, యుద్ధ నేర బాధ్యత అంశం యీ సంధిలో ఉన్నాయి.

ప్రాదేశిక అంశాల కింద, అల్సేస్-లొరేన్‌ను సార్‌వేలీతో సహా పదిహేను సంవత్సరాలపాటు పరిహారంకింద ఫ్రాన్స్‌కు అప్పజెప్పాలి. బెల్జియంకు యూపెన్, మల్మెడీ, డెన్మార్క్‌కు ష్లెస్విగ్, లిథువేనియాకు మెమెల్ జర్మనీ ఇచ్చేయాలి. ప్రష్యన్ పోలండ్‌ను, సైలీషియాలో కొంత భాగాన్ని కొత్తగా ఏర్పాటయిన పోలండ్‌కు ఇవ్వాలి. పశ్చిమ ప్రష్యాలో ఒక భాగం పోలండ్‌కు బాల్టిక్‌సముద్రానికి రహదారి కింద ఇవ్వాలి. డాంజింగ్ రేవును అంతర్జాతీయ రేవుగా ప్రకటించి నానాజాతి సమితి ఆధీనంలోని

స్వేచ్ఛా రేవుకింద మార్చారు. ఆఫ్రికాలోని వలసలను, చైనాలో ఉన్న ప్రత్యేక హక్కులను కూడా జర్మనీ వదులుకుంటుంది.

ఇక సైనిక అంశాల కింద జర్మనీ తన సైన్యాన్ని లక్షకు తగ్గించాలి. నిర్బంధసైనిక సర్వీసును రద్దు చేయాలి, యుద్ధ సామగ్రి ఉత్పత్తిని, దిగుమతులను నిలిపివేయాలి. తన యుద్ధనౌకలను జర్మనీకి అప్పగించి చిన్న పాటి నౌకాదళాన్ని మాత్రమే ఉంచుకోవాలి. రిన్ ల్యాండ్‌ను సైనిక రహిత మండలంగా చేయడం, హెలిగొల్యాండ్ రేవును మూసివేయాలి, కీల్ కాలువను అందరి ఉపయోగార్థం తెరవాలి.

యుద్ధ బాధ్యత అంశం కింద మొదటి ప్రపంచ యుద్ధానికి బాధ్యత తనదేనని జర్మనీ అంగీకరించాలి. ఆర్థిక పరిహారం కింద జర్మనీ మిత్ర రాజ్యాలకు పెద్దమొత్తం చెల్లించాలి. ఈ రకంగా ఈ సంధి ద్వారా జర్మనీ అధీనంలోని దేశాలు, వలసలు అన్నీ వదులుకుని, ఈ వైభవాన్నంతా కోల్పోయింది.

### III. ఇతర సంధులు:

వెర్సైల్స్ సంధి కాక, మరో నాలుగు సంధులు జరిగాయి. ఈ నాలుగూ మిత్ర రాజ్యాలకూ ఆస్ట్రియా, బల్గేరియా, హంగరీ, టర్కీలతో స్వయం నిర్ణయాధికారం విషయమై జరిగినవి. సెయింట్ జర్మైన్ సంధి (1919) ఆస్ట్రియాతో మిత్ర రాజ్యాలకు జరిగింది. ట్రియానన్ సంధి (1920) హంగరీతో, న్యైలీ (1919) బల్గేరియాతో, సెవ్రెస్ సంధి (1920) టర్కీతోనూ చేసుకున్న సంధులు. ఈ నాలుగు సంధుల ప్రకారం ఓడిపోయిన రాజ్యాలు మిత్ర రాజ్యాలకు చాలా పెద్ద ప్రాంతాలను ఇచ్చుకోవలసి వచ్చింది.

## 3.6. శాంతి యత్నాల వైఫల్యం

BRAOU

అమెరికా అధ్యక్షుడు విల్సన్ ప్రతిపాదించిన 14 అంశాల కార్యక్రమం వెర్సైల్స్ సంధికి ప్రాతిపదిక. విల్సన్ ప్రతిపాదనలు శాంతికి అంగీకరించి, శాంతియుత పరిస్థితుల కొనసాగింపునకు తోడ్పడే దేశాలన్నిటి మధ్య వాణిజ్య నిబంధనల్లో సమాన పరిగణనను నెలకొల్పడానికి, సాధ్యమైనంతగా ఆర్థిక అంతరాలను తొలగించడానికి ఉద్దేశించినవి.

అంతరంగిక భద్రతకు సరిపోయేంత కనీసంగా మాత్రమే ఉంచుకుని తక్కిన ఆయుధనిల్వలను తగ్గించుకోవడానికి హామీలు ఇవ్వడం తీసుకోవడం కూడా ఈ సంధిలో ఉన్నాయి. వలసలగురించిన అందరి హక్కులను స్వేచ్ఛగా, విశాల హృదయంతో, పూర్తి నిష్పాక్షిక దృక్పథంతో పరిష్కరించడానికి ప్రయత్నించడం, 1871లో ఫ్రాన్స్ విషయంలో (అల్సేస్-లొరేన్ విషయంలో) రష్యా చేసిన తప్పును సరిదిద్దడం, స్వతంత్ర పోలండ్‌ను ఏర్పాటు చేయడం, నానాజాతి సమితిని ఏర్పాటు చేయడం-ఇవీ వెర్సైల్స్ మహాసభలోని ముఖ్యాంశాలు.

**తక్షణం పరిష్కరించవలసిన సమస్యలుగా శాంతి మహాసభ గుర్తించిన విషయాలు ఇవీ:**

i. నానాజాతి సమితి ఏర్పాటు
ii. ఫ్రాన్స్ భద్రత, జర్మన్ సరిహద్దులు
iii. మాజీ జర్మన్ వలసల భవిష్యత్తు
iv. జర్మనీ వాణిజ్య హోదా
v. రిపారేషన్స్
vi. నిరాయుధీకరణ
vii. సైన్యం
viii. యుద్ధనేరస్థులకు శిక్ష
ix. ఒడంబడిక

ఓడిపోయిన రాజ్యాల విషయంలో మిత్ర రాజ్యాలు స్వయం నిర్ణయాధికారం, జాతి అన్న రెండు సూత్రాలను అనుసరించాయి. చెకొస్లొవేకియా, యుగొస్లావియా దేశాలు ఈ సూత్రాల ప్రకారమే కొత్తగా ఏర్పడ్డాయి, పోలండ్ పునరుద్ధరణ కూడా ఈ సూత్రాల ప్రకారమే జరిగింది. ఓడిపోయిన రాజ్యాల వలసలను స్వాధీనం చేసుకున్నారు. యుద్ధం సందర్భంగా జర్మనీ సృష్టించిన బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకుని ఓడిపోయిన దేశాలమీద చాలా కఠినమైన షరతులను విధించారు. ఇన్ని షరతులకు తలవొగ్గిన జర్మనీ తను కోల్పోయిన జాతీయ ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకోవడానికి ప్రయత్నించడం సహజం. ఆ రకంగా రెండో ప్రపంచయుద్ధానికి బీజాలు వెర్సైల్స్ సంధిలోనే పడ్డాయని చెప్పవచ్చు.

# 3.7 రెండో ప్రపంచయుద్ధం-కారణాలు

మొదటి రెండవ ప్రపంచయుద్ధాల నడుమ ఉన్న ఇరవై సంవత్సరాలు ఎంతో ఉద్రిక్తలతో నిండిన కాలం. ప్రపంచంలో పెనుమార్పులు సంభవించిన కాలం. సంధులు, ఒప్పందాల ద్వారా శాంతిని స్థాపించడానికి ప్రయత్నాలు జరిగినా అవి పెద్దగా ఫలించలేదు. 1939 దాకా యుద్ధ ప్రకటన జరగకపోయినా మరొక ప్రపంచయుద్ధం అనివార్యమని పశ్చిమ రాజ్యాలన్నీ ఈ కాలంలోనే నమ్మాయి.

## 3.7.1 ప్రతీకార యుద్ధం

మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మిత్ర రాజ్యాలు వెర్సైల్స్ సంధి పేరిట జర్మనీ మీద అవమానపూరితమయిన షరతులను విధించాయి. ఈ షరతులు జర్మనీ సామ్రాజ్యాన్ని, సంపదను కొల్లగొట్టాయి. ఆర్థికంగా, సైనికంగా జర్మనీ కుప్పకూలిపోయింది. ఇదంతా జర్మన్ల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది, ప్రతీకారం కోసం వారు తహతహలాడేట్టు చేసింది. వెర్సైల్స్ సంధిని కాలదన్ని, నానాజాతి సమితిని ఉల్లంఘించిన హిట్లర్‌ను వారు మనస్ఫూర్తిగా సమర్థించడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

### I. ఐరోపాలో నియంతృత్వం ఆవిర్భావం:

మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన కొన్ని సంవత్సరాల తరువాత ఐరోపాలో ఒక కొత్త రాజకీయ సిద్ధాంతం అవతరించింది. స్పెయిన్, ఇటలీ, జర్మనీలలో ప్రజాస్వామ్యాన్ని ఫాసిస్టు శక్తులు నిర్మూలించాయి. తమ ప్రభుత్వ ఆధిక్యాన్ని అంగీకరించని వారినందరినీ తక్కువగా చూశారు, హింసించారు. వ్యక్తిగత స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. జర్మన్ జాతి ఆధిపత్యాన్ని ప్రపంచంలో నెలకొల్పాలని అడాల్ఫ్ హిట్లర్ సంకల్పించాడు. ఫ్రాన్స్ చేతిలోనూ, ఆ తరువాత నానాజాతి సమితి చేతిలోనూ సార్ పారిశ్రామిక సముదాయం వినాశనానికి గురికావడం చూసి కోపోద్రిక్తులయిన జర్మన్లను హిట్లర్ మరింత రెచ్చగొట్టాడు.

### II. తలెత్తిన సామ్రాజ్యవాదం:

ఇంగ్లండు, ఫ్రాన్స్, అమెరికా వంటి దేశాలు మహా సామ్రాజ్యవాద దేశాలు. సైనికంగా ఎదిగిన జర్మనీ, జపాన్, ఇటలీ వంటి దేశాలు వాటికి శత్రువులుగా అవతరించాయి. తాముకూడా ఎక్కువ విదేశీ భూభాగాలు సంపాదించుకుని మహా సామ్రాజ్య దేశాలు కావడానికి తహతహలాడాయి. ఈ నేపథ్యంలోనే యుద్ధం అనివార్యమైంది.

### III. ప్రజాస్వామ్య దేశాల బలహీనత:

జర్మనీ ఫాసిస్టు దేశంగా అవతరించడంతో ప్రపంచంలోని అనేక దేశాల భద్రతకు, రక్షణకు ముప్పు ఏర్పడింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సైనిక కూటములు ఏర్పడడం అవసరమయింది. యుగొస్లావియా, చెకొస్లొవేకియాలు రష్యా, ఫ్రాన్స్, పోలండ్, రుమేనియాలతో కలిసి ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అందుకు ప్రతిగా జర్మనీ, ఇటలీ, జపాన్‌లతో కలిసి

ఒక కూటమిగా ఏర్పడింది. మొదటి కూటమి ప్రజాస్వామ్య సూత్రాల పరిరక్షణకు కట్టుబడగా, రెండో కూటమి ఏకస్వామ్య వ్యవస్థ (totalitarianism) ను ప్రతిబింబించాయి. అమెరికా, బ్రిటన్ మొదట యుద్ధానికి దూరంగా వున్నా, తరువాత మొదటి కూటమిలో చేరాయి. ఆ విధంగా ప్రపంచం రెండు శిబిరాలుగా చీలిపోయింది.

### iv. ఆయుధాల పోటీ

జర్మనీ ఎదుగుదలను చూసి భయభ్రాంతులయిన అనేక యూరోపియన్ దేశాలు తమ సైనిక శక్తిని పెంచుకోవడం మొదలు పెట్టాయి. 1935లో జర్మనీ ఏడాదికి 1500 యుద్ధవిమానాలను తయారుచేస్తుండగా, మరోవైపు ఫ్రాన్స్ తన సరిహద్దులను కాపాడుకోవడానికి తీవ్రమయిన ఆత్మరక్షణ సన్నాహాలలో నిమగ్నమై ఉండింది. బెల్జియం ఆత్మరక్షణ కోసం అనేక దుర్గాలను నిర్మించుకుంది. ఈ సన్నాహాలన్నిటిని గమనించి జర్మనీ తన శక్తిని మరింతగా పెంచుకోసాగింది.

### v. నానాజాతి సమితి వైఫల్యం:

అనేక దేశాల దురాక్రమణ చర్యలను అడ్డుకోవడంలో నానాజాతి సమితి ఘోరంగా విఫలమైంది. చెకొస్లోవేకియాను, ఆస్ట్రియాను ఆక్రమించిన జర్మనీ, మంచూరియాను ఆక్రమించిన జపాన్‌ను, అబిస్సినియాను లొంగదీసుకున్న ఇటలీని సమితి ఏమీ చేయలేకపోయింది.

### vi. ఆర్థిక సంక్షోభం:

1929లో ఆర్థిక రంగంలో మహా పతనం సంభవించి, అనేక ఐరోపా దేశాల ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోయింది. మొదటి ప్రపంచయుద్ధంలో యుద్ధ బాధ్యత కింద విధించిన భారీ పరిహారాన్ని జర్మనీ చెల్లించలేక పోయింది. తన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుచుకోవడానికి జర్మనికి యుద్ధం అవసరమైంది. ఇలా, ఆనాటి రాజకీయ, ఆర్థికపరిణామాలు యుద్ధానికి కారణయ్యాయి.

### vii. జాతీయవాదం:

1919 నాటి పారిస్ శాంతి మహాసభ వివిధ జాతులకు న్యాయం చేయడంలో సఫలం కాలేక పోయింది. అనేక జాతులను పరాయి పాలనకిందికి, అవమానాల కిందికి, వేధింపులకి లోనుచేసింది. ఈ జాతులన్నిటిలో బలమైనది జర్మన్ జాతి. మిత్ర రాజ్యాలు విధించిన షరతుల వల్ల జర్మనీ తన భూభాగాలనేకం కోల్పోయింది. నెరవేరని జాతుల ఆకాంక్షలు ఐరోపా దేశాల మధ్య ఉద్రిక్తతలను, ఘర్షణలను పెంచాయి.

### viii తక్షణ కారణం:

పోలిష్ కారిడార్ (డోన్సెస్) అన్నారు. ఆ రకంగా జర్మనీ రెండుగా చీలిపోయింది. హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత, పోలిష్ కెడార్‌ను మూసివేయాలని, జర్మన్లు అధికంగా ఉండే డాన్‌జిగ్‌ను జర్మనీకి ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

## 3.8 రెండో ప్రపంచ యుద్ధ క్రమం

బహిరంగ ఘర్షణలో జర్మనీ వ్యూహానికి మొదట బలైనది పోలండ్. జర్మనీ, రష్యా పరస్పరం యుద్ధానికి దిగకుండా నిర్యుద్ధ సంధి చేసుకున్నారు. ఆ సంధి ప్రకారం జర్మనీ చర్యల్లో రష్యా జోక్యం చేసుకోగూడదు. పోలండ్‌ను జర్మనీ ఆక్రమించుకున్నప్పుడు అందులో కొంత భాగాన్ని రష్యాకు ఇచ్చారు కూడా. అప్పుడు, జర్మనీకి వ్యతిరేకంగా తన స్థితిని పటిష్టం చేసుకునేందుకు 1939లో రష్యా ఫిన్లాండ్‌ను ఆక్రమించుకుంది. 1940 ఏప్రిల్‌లో జర్మన్ సైన్యాలు డెన్మార్క్‌ను, నార్వేను, హాలండ్‌ను, బెల్జియంను ఆక్రమించుకున్నాయి.

BRAOU

పక్కనున్న చిన్న చిన్న దేశాలను జయించిన తరువాత జర్మనీ ఫ్రాన్స్ మీదకి కదిలింది. ఫ్రాన్స్ మిత్ర రాజ్యం బ్రిటన్ ఏ మాత్రం సాయం చేయలేక పోవడంతో డన్ కిర్క్ జర్మనీ స్వాధీనమయింది. జర్మన్ సేనలను ఎదిరించలేక ఫ్రాన్స్ 1940 జూన్‌లో లొంగిపోయింది.

ఫ్రాన్స్ పతనం తరువాత, జర్మనీ బ్రిటన్ మీద దాడిచేసింది. బ్రిటన్ అప్పుడు యుద్ధానికి తయారుగాలేదు. ఇంతలో విన్స్టన్ చర్చిల్ బ్రిటిష్ ప్రధానమంత్రి అయ్యారు. ఇంగ్లండ్ తన సేనలను ఇంగ్లీష్ ఛానల్ దాటి సుదూర యుద్ధరంగాలకు పంపలేదు, చాలా కాలంపాటు తన దేశంలోనే ఆత్మరక్షణ యుద్ధం చేస్తూ వచ్చింది. మరోవైపున జర్మనీ ఇంగ్లండ్ మీద దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఫ్రాన్స్ ఓడిపోయిన తరువాత ఇటలీ కూడా యుద్ధంలో చేరింది. పరిస్థితిని అనువుగా వాడుకుని సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలని ఇటలీ నాయకుడు బెనిటో ముస్సోలిని అనుకున్నాడు. జర్మన్‌సేనల సహాయంతో ఇటలీ గ్రీస్‌ను ఆక్రమించింది. ఆ తరువాత ఉత్తర ఆఫ్రికాలో బ్రిటన్‌సేనలతో తలపడింది. ఇటలీ కూడాతోడు దొరకడంతో జర్మనీ యుగోస్లావియాను, క్రెట్‌ను జయించింది.

యుద్ధానికి దూరంగా ఉండడం వల్ల దీర్ఘకాలికంగా ఏ ప్రయోజనమూ ఉండదని గుర్తించిన అమెరికా రంగంలోకి దిగాలనుకుంది. బ్రిటిష్ జాతీయవాద ఉద్రేకాలను చూసి ముచ్చటపడ్డ అమెరికన్లు ఎఫ్.డి. రూజ్వెల్టు నాయకత్వంలో ఇంగ్లండ్‌కు సాయపడాలని నిర్ణయించుకున్నారు. ఈ సహాయం రుణాల రూపంలో, భూభాగాల లీజురూపంలో, ఆయుధాల రూపంలో ఉంది. కానీ, ఆ తరువాత అమెరికా మరింత క్రియాశీలమయిన పాత్ర వహించకతప్పలేదు.

నిర్యుద్ధ ఒడంబడిక ఉన్నప్పటికీ 1941 జూన్‌లో జర్మనీ రష్యామీద హఠాత్తుగా, యుద్ధ ప్రకటన గూడా లేకుండా దాడి చేసింది. రష్యన్‌సేనలనుంచి జర్మనీ గట్టి ప్రతిఘటన ఎదుర్కోవలసి వచ్చింది. మరోవైపున అమెరికా, బ్రిటన్ రష్యాకు సహాయంగా వచ్చాయి. జర్మన్ దాడులను తిప్పికొట్టడానికి మూడు శక్తులూ ఒక్కటైనాయి. జపాన్ అమెరికా మీద దాడిచేయడానికి సన్నాహాలు చేస్తోంది. డిసెంబర్ 1941లో జపాన్ పెరల్‌హార్బర్ దగ్గర అమెరికన్‌సేనలమీద దాడిచేయడంతో అమెరికా జపాన్ మీద యుద్ధాన్ని ప్రకటించింది. ఫిలిప్పీన్స్‌ను, సింగపూర్‌ను జపాన్ ఆక్రమించింది కానీ, మిత్ర రాజ్యాల తాకిడిని అది తట్టుకోలేకపోయింది.

యుద్ధం తుది ఘట్టంలో మిత్ర రాజ్యాల సేనలు ఫ్రాన్స్ కోల్పోయిన ఆఫ్రికన్ భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోసాగాయి. అలాగే, అమెరికన్, ఇంగ్లీష్ సేనలు ఆగ్నేయాసియానుంచి జపాన్‌ను తరిమికొట్టడం ప్రారంభించాయి. ఐరోపాలో జర్మన్లు రష్యా చేతిలో పరాజయం చవిచూశారు. 1945లో హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. జర్మనీ బేషరతుగా లొంగిపోయింది. హిరోషిమా, నాగసాకిల మీద అమెరికా అణుబాంబు ప్రయోగం తరువాత జపాన్ 1945 ఆగస్టులో లొంగిపోయింది. ఇటలీ ఓడిపోయింది, ముస్సోలిని చనిపోయాడు. అక్షరాజ్యాల (Axis forces) లొంగుబాటుతో యుద్ధం ముగిసింది. శాంతి కోసం చర్చలు ప్రారంభమయ్యాయి.

## 3.9 రెండవ ప్రపంచ యుద్ధ ప్రభావం

రెండో ప్రపంచయుద్ధం పర్యవసానాలు చాలా తీవ్రమైనవి. యుద్ధంలో జననష్టం, ఆస్తినష్టం విపరీతంగా జరిగింది. లక్ష కోట్ల రూపాయలు యుద్ధం మీద ఖర్చయిందని ఒక అంచనా. బ్రిటన్ ఒక్కటే రెండువేల కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. రష్యా తన జాతీయ సంపదలో పావుభాగం యుద్ధానికే ధారపోసింది. పోలండ్, ఫ్రాన్స్, జర్మనీ అనుభవించిన నష్టాలను లెక్కకట్టలేము. మొత్తం మీద కోటీ 50 లక్షల మంది చనిపోయారు. అనేక కోట్ల మంది గాయపడ్డారు.

ఆసియా మీద ఐరోపా ఆధిపత్యం ముగిసింది. బర్మా, సిలోన్, ఈజిప్టు, మలయా వంటి దేశాలు యుద్ధానంతరం స్వాతంత్ర్యం పొందాయి. ఫ్రాన్స్, పోర్చుగల్, హాలండ్ ఆసియాలోని తమ సంపన్నమయిన వలసలను కోల్పోయాయి. ఈ యుద్ధం వల్లనే భారతదేశ స్వాతంత్ర్యం వేగవంతమయింది.

ప్రపంచంలో బ్రిటన్ నాయకత్వం ముగిసింది. ఇప్పుడు ఆ హోదా అమెరికా, రష్యాలకు దక్కింది. అయినా అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల్లో బ్రిటన్‌కు గౌరవనీయ స్థానం యిప్పటికీ వుంది. మానవ జీవితంలోని అన్ని రంగాలలో శాస్త్ర

BRAOU

విజ్ఞాన ప్రగతిని యుద్ధం వేగవంతం చేసింది. అమెరికా, రష్యాల సాయుధ ఆధిక్యం వల్ల అనేక చిన్న దేశాలు పరోక్షంగా వాటి ఆధిపత్యంలోకి వెళ్లాయి. తిరిగి ప్రపంచం రెండు ప్రధాన శిబిరాలుగా చీలిపోయింది. ఒకటి అమెరికా నాయకత్వంలోని పెట్టుబడిదారీ శిబిరం, రెండవది సోవియట్ యూనియన్ నాయకత్వంలోని కమ్యూనిస్టు శిబిరం.

## 3.10 శాంతి స్థాపనకు చర్యలు

తిరిగి యుద్ధం రాకుండా అంతర్జాతీయ శాంతిభద్రతలను కాపాడగలిగే ఒక పటిష్టమయిన అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడడం అవసరమని యుద్ధానంతరం అందరూ భావించారు. 1943లోనే సోవియట్ యూనియన్, కొమింటాంగ్ చైనా, గ్రేట్ బ్రిటన్, అమెరికా దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పాటు అవసరాన్ని నొక్కి చెప్పింది.

1944లో జరిగిన డంబర్టన్ ఓక్స్ మహాసభలో బ్రిటన్, రష్యా, అమెరికా, చైనా అంతర్జాతీయ సంస్థ ఏర్పాటుకు సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనను రూపొందించారు. ఆ ప్రతిపాదన ఆధారంగా 1945లో శాన్ ఫ్రాన్సిస్కోలో సమావేశమయిన 50 దేశాల ప్రతినిధులు ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను రూపొందించారు. ఐక్యరాజ్య సమితి 1945 అక్టోబర్ 24నాడు లాంఛనంగా ఉనికిలోకి వచ్చింది.

ప్రపంచశాంతిని కాపాడడానికి, అందరు ప్రజల ఆర్థిక, సామాజిక పురోగతికి కృషి చేయడానికి ప్రపంచంలోని అనేక దేశాలు కలిసికట్టుగా ఏర్పాటు చేసుకున్న అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి. ప్రపంచ శాంతి భద్రతలను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేసిన అనేక దేశాల సమష్టి సంస్థ ఐక్యరాజ్యసమితి.

ఈ లక్ష్యాలను సాధించడానికి అవసరమయిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఏర్పరచడానికి సహకరించాలని సభ్యదేశాలు అంగీకరించాయి. మానవ హక్కులను పరిరక్షణలో ఒక ముఖ్యమైన పాత్ర వహించడానికి ఏర్పడిన సంస్థ ఐక్యరాజ్యసమితి.

BRAOU

## 3.11 ముగింపు

రెండు ప్రపంచ సంగ్రామాల తరువాత సుదీర్ఘమైన సుస్థిర శాంతి కాలంలో ప్రయాణించాము. ఇవాళ అంతర్జాతీయ వ్యవస్థ ఆనాటి ప్రపంచ యుద్ధాలనాటి మాదిరిగానూ లేదు, రెండు యుద్ధాల మధ్యకాలంలో లాగానూలేదు. నానాజాతి సమితి పతనం తరువాత ఏర్పడ్డ ఐక్యరాజ్యసమితిలో కూడా లోపాలు లేకపోలేదు కానీ, ఇంత కాలం మరో ప్రపంచయుద్ధం రాకుండా కాపాడిన ఘనత ఐక్యరాజ్యసమితి దక్కుతుంది. యుద్ధరహిత శాంతియుత ప్రపంచ నిర్మాణాన్ని, సమాన న్యాయంతో కూడిన అభివృద్ధిని, ప్రపంచ ప్రజానీకం సర్వతోముఖాభివృద్ధిని కోరుకునే వారందరికీ ఐక్యరాజ్యసమితి ఇప్పటికీ ఆశాకిరణంగానే ఉన్నది.

## 3.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**ఈ కింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. రెండు ప్రపంచ యుద్ధాలు రావడానికి కారణాలను చర్చించండి.
2. శాంతి స్థాపనకోసం జరిగిన ప్రయత్నాలను వివరించండి.
3. మానవ హక్కుల గురించి అధ్యయనం చేసే వారు ప్రపంచయుద్ధాల అనుభవంనుంచి ఏ పాఠాలను నేర్చుకుంటారు?

ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. మొదటి ప్రపంచయుద్ధం ప్రభావం అంతర్జాతీయ పరిణామాల మీద ఏ విధంగా ఉన్నది?
2. రెండో ప్రపంచ యుద్ధ ప్రభావాలను వివరింపుము.
3. మానవ హక్కుల సమస్యకు ప్రపంచయుద్ధాలతో ఉన్న ప్రత్యక్ష సంబంధం ఏమిటి?

## 3.13 సంప్రదింపు గ్రంథాలు


1) బి.ఎచ్.లిడెల్ హార్ట్, ఎ హిస్టరీ ఆఫ్ ది వరల్డ్ 1914-1918 (1934)
2) ఆంథోని పి., ఆడమ్ అండ్ ది నైట్, ది మాన్‌కైండ్ ఆఫ్ ది సెకండ్ వరల్డ్ వార్ (లండన్ 1977)
3) ఎ.జె.పి. టేలర్, ది అప్రోచ్ ఆఫ్ వార్ 1938-39 (లండన్ 1967)
4) ఆర్. సార్తి, ది యాక్స్ విదిన్: ఇటాలియన్ ఫాసిజమ్ ఇన్ యాక్షన్ (న్యూయార్క్, 1974)
5) ఎ.జె. నికొల్లస్, వీమర్ అండ్ రైజ్ ఆఫ్ హిట్లర్, (లండన్, 1968)
6) ఎ. రోజెన్ బర్గ్, ఎ హిస్టరీ ఆఫ్ జర్మన్ రిపబ్లిక్ (న్యూయార్క్, 1965)
7) మార్టిన్ కిచర్, యూరోప్ బిట్వీన్ ది వార్స్ - ఎ పొలిటికల్ హిస్టరీ, (లాంగ్‌మాన్, లండన్ 1988)
8) లాంగ్‌సమ్, డబ్ల్యు.సి., ది వరల్డ్ సిన్స్ *1919* (మాక్మిలన్, న్యూయార్క్, 1959)
9) థామ్సన్ డేవిడ్, యూరోప్ సిన్స్ నెపోలియన్ (లాంగ్‌మాన్, 1960)


BRAOU

# భాగం 4 : వలసవాద వ్యతిరేకపోరాటాల వారసత్వం

## విషయక్రమం


4.0 ఉద్దేశం

4.1 పరిచయం

4.2 ఆసియా, అమెరికా, ఆఫ్రికాల్లో వలసవాద విస్తరణ

4.2.1 ఇంగ్లండు, ఫ్రాన్స్ మధ్య పోటి

4.2.2 అమెరికాలో విస్తరణ

4.2.3 ఆఫ్రికాలో విస్తరణ

4.3 వలసవాద వ్యతిరేక పోరాటాలు

4.3.1 ఇటలీలో వలసవాద వ్యతిరేక పోరాటం

4.3.2 జర్మనీలో వలసవాద వ్యతిరేక పోరాటం

4.3.3 చైనాలో వలసవాద వ్యతిరేక పోరాటం

4.3.4 జపాన్‌లో వలసవాద వ్యతిరేక పోరాటం

4.3.5 భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాటం

4.4 ముగింపు

4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

4.6 సంప్రదింపు గ్రంథాలు:


BRAOU

## 4.0 ఉద్దేశం

### ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఆసియా, అమెరికా, ఆఫ్రికాల్లో వలస విస్తరణ పరిణామాన్ని తెలుసుకుంటారు.
- వలస వాద వ్యతిరేక పోరాటాలను అర్థం చేసుకోగలుగుతారు.
- భారతదేశంలో జరిగిన వలసవాద వ్యతిరేక పోరాటాన్ని వివరించగలుగుతారు.

## 4.1 పరిచయం

సామ్రాజ్యాల నిర్మాణం అనేది చరిత్రలో ఒక ముఖ్యమైన దశ. కాలం గడుస్తున్న కొద్దీ సామ్రాజ్యాల నిర్మాణం కూడా అనేక మార్పులకు లోనయింది. ఆధునిక యుగంలో ఐరోపా దేశాలు మసాలా దినుసులు, పట్టు, పత్తి మొదలయిన కొన్ని రకాల సరుకుల కోసం సముద్ర ప్రయాణాలు చేపట్టి, వారికి సుదూరంగా ఉన్న భూభాగాలకు మార్గాలను కనుగొనగలిగారు. వలస ప్రాంతాలలో ఒక వర్తక సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించవచ్చో చెప్పడానికి భారతదేశం మంచి ఉదాహరణ అవుతుంది. ఇక్కడి రాజకీయ బలహీనతలను ఆసరా చేసుకుని బ్రిటిష్ వర్తకులు ఈ దేశాన్ని గ్రేట్ బ్రిటన్ రాజకీయ ఆధిపత్యంలోకి తీసుకెళ్లారు, ఇక్కడి వనరులను దోచుకున్నారు. ఆ రకంగా భారతదేశం సుమారు 200 సంవత్సరాలపాటు బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండింది. అలాగే, శాస్త్ర సాంకేతిక రంగాలలో, సైనిక వ్యవస్థలలో పైచేయిగా ఉన్న

ఐరోపా రాజ్యాలు క్రమంగా ప్రపంచంలోని అనేక దేశాలను తమ రాజకీయ ఆధిపత్యంలోకి తెచ్చుకుని సామ్రాజ్యాలు నిర్మించుకున్నాయి. 19వ శతాబ్దం ద్వితీయార్థభాగంలో యూరోపియన్లు ఆఫ్రికా మీదికి దృష్టి మరల్చి, అక్కడ సామ్రాజ్యవాదపు అధ్యాయాన్ని ప్రారంభించారు.

## 4.2 ఆసియా, అమెరికా, ఆఫ్రికాలలో వలసవాద విస్తరణ

ఐరోపా రాజ్యాలు 16, 17వ శతాబ్దాలలో అమెరికా ఖండంలో తమ ప్రాబల్యాన్ని విస్తరింపజేయడంలో మునిగి వుండగానే, ఆసియా ఆఫ్రికాల్లో కూడా అటువంటి విస్తరణే ప్రారంభమయ్యింది. మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు, పట్టు, రత్నాలు మొదలయిన సరుకుల వర్తకం భూమార్గం మీదుగా ఐరోపా, ఆసియా ఖండాల మధ్య లాభసాటిగా జరిగేది. బాల్కన్ ద్వీపకల్పాన్ని టర్క్ ఆక్రమించుకున్న ఫలితంగా ఈ భూరవాణా మర్గం లేకుండాపోయింది. వాస్కోడిగామా 1498లో భారతదేశానికి కొత్త సముద్రమార్గాన్ని కనుగొనడంతో వాణిజ్యానికి, వలసల ఏర్పాటుకు కొత్త ద్వారాలు తెరుచుకున్నాయి. దాని తక్షణ ఫలితంగా భారతదేశంలో గోవా, డమన్, డయ్యులలోను, పర్షియన్ సింధుశాఖలో హోర్ముజ్‌లోను, సిలోన్,మలక్కాలలోను పోర్చుగీసు వలసలు ఏర్పడ్డాయి. గోవా, కొచ్చిన్‌లను పోర్చుగీసువారు తమ స్థావరాలుగా మార్చుకున్నారు. పోర్చుగీసు వారి వలస ప్రయాణాలు చైనా, జపాన్, మలయా ద్వీపకల్పం వైపుగా కూడా సాగాయి. అయితే, వారికి వర్తకమూ, క్రైస్తవ మతవ్యాప్తి ప్రధానం కావడం వల్ల కేవలం మకావు ద్వీపాన్ని మాత్రమే వలసగా మార్చుకున్నారు. త్వరలోనే భారతదేశంలోను, ఇతర తూర్పు దేశాలలోను పోర్చుగీసువారి వలసలకు డచ్‌వారినుంచి, ఇంగ్లీషు, ఫ్రెంచి వారినుంచి పోటీ వచ్చిపడింది. ఫలితంగా చాలా కొద్దికాలంలోనే పోర్చుగల్ తన వలస భూభాగాలను కోల్పోయింది.

అమెరికా ఖండంలోని వలసలతోనే స్పెయిన్ ఆగిపోయింది. అది తూర్పు దేశాలదిశగా విస్తరణ జరపలేదు. ఎక్కువ మంది క్రైస్తవులు, ఐరోపా సంస్కృతి ప్రభావంలో పడ్డవారు ఉన్న ఫిలిప్పీన్స్ దీవులలో మాత్రం ప్రవేశించింది. తరువాత ఫిలిప్పీన్స్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంది.

డచ్‌వారు స్పెయిన్‌తో, పోర్చుగల్‌తో శత్రుత్వం వహించారు. 1615 సంవత్సరం నాటికి వారు భారతదేశం, ఆఫ్రికాల్లోని స్థావరాలనుంచి పోర్చుగీసువారిని తొలగించారు. మలయా ద్వీపసముదాయంలో గట్టి పట్టు సంపాదించారు. సిలోన్, జావా, సుమత్రా మలుకో, ఫార్మోసా, బోర్నో, పెలెబెస్‌లలో డచ్‌వారు తమ రాజ్యాన్ని నిర్మించుకున్నారు. అయితే, ఇతర ఐరోపా రాజ్యాలతో నిరంతర యుద్ధాలు చేయవలసి వచ్చిన డచ్ వలసవాదులు ఎక్కువకాలం తమ రాజ్యాన్ని నిలుపుకోలేకపోయారు. త్వరలోనే వారు అన్నిటినీ ఇంగ్లీషువారికి సమర్పించుకోవలసి వచ్చింది.

అమెరికా వైపుగా జైత్రయాత్ర ప్రారంభించిన ఇంగ్లండు, లాభసాటిగా ఉన్న తూర్పు దేశాల వర్తకంలో కూడా తనకు భాగం కావాలని ఆశించింది. క్రీస్తుశకం 1600 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీని స్థాపించారు. భారతదేశంలో వారి మొట్టమొదటి స్థావరాలు మచిలీపట్నం, సూరత్, మద్రాసు, కలకత్తా పట్టణాలు బ్రిటిషు వారి ప్రధాన స్థావరాలుగా మారాయి. 1690లో పోర్చుగీసు వారినుంచి రెండవ చార్లెస్‌కు బొంబాయి అరణంగా దొరికింది. పర్షియన్ గల్ఫ్‌లో నోర్ముజ్‌ను స్వాధీనం చేసుకోవడంతో భారతదేశం, పర్షియాలలో బ్రిటిష్ వర్తక సామ్రాజ్యానికి పునాదులు పడ్డాయి.

### 4.2.1 ఇంగ్లండు, ఫ్రాన్సు మధ్య పోటీ

అమెరికా ఖండంలోను, భారతదేశంలోను ఫ్రాన్సు ఇంగ్లీషు వారికి ప్రమాదకరమయిన ప్రత్యర్థిగా తయారు కాసాగింది. సూరత్, పాండిచ్చేరి, చందనగోరెలలో ఫ్రెంచి స్థావరాలు ఏర్పడ్డాయి. రెండు సామ్రాజ్యవాద శక్తుల ప్రయోజనాల మధ్య స్పర్థ పెరిగి, ఆధిపత్యంకోసం పోటీ అనివార్యమైంది. అయితే, భారతదేశంలో వలస మహాసామ్రాజ్యాన్ని నిర్మించాలన్న ఫ్రెంచి స్వప్నాన్ని ఏడు సంవత్సరాల బ్రిటిష్-ఫ్రెంచ్ యుద్ధం (the seven years war) భగ్నం చేసింది.

1763 నాటికి ఇంగ్లండు ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న వలస, వాణిజ్య శక్తిగా అవతరించింది. ఇంగ్లీషువారి ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశానికి వర్తకం కోసమే వచ్చినా, రాబర్ట్ క్లైవ్ ఆధ్వర్యంలో దానికి రాజకీయమైన

BRAOU

సామ్రాజ్యకాంక్షకూడా ఏర్పడింది.

సుదూర దేశాలలో ఐరోపా సామ్రాజ్య విస్తరణ 19వ శతాబ్దంలోను, 20వ శతాబ్దం ప్రారంభంలోను తిరిగి తలెత్తి, ఉధృతమయ్యింది. పారిశ్రామిక విప్లవం వల్ల ఐరోపా రాజ్యాలకు కొత్త అవసరాలు కలిగాయి, అవి సరుకులు తయారుచేయడానికి ముడి పదార్థాలు కావాలి, వినియోగం కోసం ఆహార సరుకులు కావాలి, తాము తయారుచేసే సరుకులు కొనడానికి మార్కెట్లు కావాలి. 'వెనుకబడిన ప్రాంతాల' మీద ఆధిపత్యం ద్వారా ఈ అవసరాలను తీర్చుకోవచ్చునని సామ్రాజ్యవాదం భావించింది. వలసవాదానికి మిషనరీ కార్యకలాపాలు తోడై ఆసియాలోని వివిధ ప్రాంతాలలో ఐరోపా ఖండానికి చెందిన పెద్ద రాజ్యాలు రాజకీయ, ఆర్థిక సామ్రాజ్యవాదం నెలకొనడానికి దారితీసింది.

19వ శతాబ్దాంతానికి సైబీరియా పూర్తిగా రష్యన్ వలసగా మారిపోయింది. పోర్ట్ ఆర్థర్, లియావోటుంగ్ కూడా రష్యన్ల ప్రాబల్యంలోకి వచ్చేశాయి. మంచూరియా, కొరియాల మీద కూడా రష్యా కన్ను వేసింది. కానీ, అప్పుడప్పుడే కొత్తశక్తిగా రంగప్రవేశం చేస్తున్న జపాన్ రష్యన్ ఆశలకు పగ్గం వేసింది.

వలసల సాధనలో గ్రేట్ బ్రిటన్ తక్కిన ఐరోపా రాజ్యాలకన్న ముందున్నది. సిలోన్, మలక్కా, సింగపూర్, భారతదేశం, బర్మా, బొర్నో, బలూచిస్తాన్ వంటి పెద్ద దేశాలను బ్రిటన్ ఆక్రమించుకున్నది. ఇవి కాక, అడెన్ నుంచి కువైట్ దాకా ప్రొటెక్టరేట్‌లను స్థాపించి సామంతులను చేసుకున్నది. దక్షిణ పర్షియా, టిబెట్‌లలో కూడా పలుకుబడిని సంపాదించింది.

ఫ్రాన్స్ ఇండో చైనాలో 1863లో ఫ్రెంచి రాజ్యాన్ని స్థాపించింది. కంబోడియాలో ప్రొటెక్టరేట్‌ను నెలకొల్పింది. చైనా నుంచి 1899లో క్వాంగ్‌చౌను లీజుకు తీసుకుని చైనా ప్రాంతాలు క్వాంగ్‌సీ, హైనాన్‌లలో ప్రత్యేక హోదాను సంపాదించుకుంది.

సుమత్రా, జావా, సెలెబెస్, బొర్నోలో కొంతభాగం, న్యూగినీ దీవులలో డచ్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. జర్మనీ న్యూగినీలోని ఈశాన్యభాగాన్ని 1880లో స్వాధీనం చేసుకుంది. 1898లో కియావోచౌలోని కొంతభాగాన్ని చైనానుంచి లీజుకు తీసుకుంది.

పదహారో శతాబ్దం నుంచి ఐరోపా వర్తకులు, మిషనరీలు జపాన్‌లో పలుకుబడి కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. జపాన్‌తో వర్తకం విషయంలో స్పెయిన్, నెదర్‌ల్యాండ్స్ పోర్చుగల్ మధ్య పోటీ ఉండేది. ఐరోపా వారి ప్రవేశాన్ని జపాన్ నిషేధించింది. ఒక అమెరికన్ యాత్రికుల బృందం వచ్చినప్పుడు 1853లో ఆ నిషేధాన్ని సడలించింది. జపాన్ లాగే, చైనా కూడా 17వ శతాబ్దంలో ఐరోపా మిషనరీల, వర్తకుల ప్రవేశాన్ని నిషేధించింది. నల్లమందు దిగుమతి అయ్యే కోంటన్ రేవును 19వ శతాబ్దంలో చైనా తెరిచింది. చైనాకు, బ్రిటన్‌కు మధ్య జరిగిన యుద్ధాలలో హాంగ్‌కాంగ్‌ను బ్రిటన్‌కు దత్తం చేశారు. కొద్ది కాలంలోనే చైనా సామ్రాజ్యం విచ్ఛిన్నం కాసాగింది. అమూర్‌ను రష్యా ఆక్రమించింది, మంగోలియా సరిహద్దు ప్రాంతాలలో ప్రొటెక్టొరేట్‌ను సంపాదించుకుంది, కౌలూన్‌ను ఇంగ్లండ్ స్వాధీనం చేసుకుంది. ఈ విధంగా ఆసియా ఖండంలోని చాలా పెద్ద భూభాగం అనేక ఐరోపా రాజ్యాల ఆధీనంలోనే 20వ శతాబ్దం మధ్య కాలందాకా ఉండిపోయింది.

## 4.2.2 అమెరికాలో విస్తరణ

ఆసియా, ఆఫ్రికా దేశాలకు కొత్త సముద్ర మార్గాలను కనిపెట్టడం ఫలితంగా, అనేక ఐరోపా రాజ్యాల వారికి అమెరికా ఖండం కూడా వనరుల వేటకు అనువుగా కనిపించింది. 17వ శతాబ్దాంతానికి అనేక ఐరోపా శక్తులు అమెరికాలో తమ వలసలను స్థాపించాయి. ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మీద స్పెయిన్ గుత్తాధిపత్యం సాధించి, ఇతరులకు అక్కడ స్థిరపడడానికి, వర్తకం చేయడానికి అనుమతి నిరాకరించింది. అమెరికా వలస వల్ల స్పెయిన్ సాధిస్తున్న సంపదను చూసిన ఇతర ఐరోపా రాజ్యాల వారు ఊరుకోలేదు. కొద్ది కాలంలోనే డచ్, ఇంగ్లీషు, ఫ్రెంచి వారు ఉత్తర అమెరికాలో స్పానిష్



BRAOU

గుత్తాధిపత్యాన్ని సవాలుచేయడం మొదలు పెట్టారు. హూసన్ అన్వేషణలను ప్రాతిపదిక చేసుకుని స్పెయిన్ అమెరికా మీద తనదే హక్కు అని వాదించింది, ఉన్ని, తోళ్ల వర్తకంలో బాగా లాభం చేసుకుంది. న్యూనెదర్‌ల్యాండ్, మాన్‌హట్టన్, హడ్సన్, డెలావేర్, కన్నెక్టికట్‌లలో వారి వలసలు ఏర్పడ్డాయి. స్పెయిన్ చివరికి న్యూ ఆమ్‌స్టర్‌డ్యామ్‌ను ఇంగ్లండ్‌కు అప్పగించవలసి వచ్చింది. అదే తరువాత న్యూయార్క్ నగరం అయింది.

ఉత్తర అమెరికా అట్లాంటిక్ తీరంలో ఇంగ్లీషు వారు స్థిరపడ్డారు. ఆ వలసే తరువాత పెద్ద దేశంగా ఏర్పడడానికి దారితీసింది. వర్జీనియా, ప్లైమౌత్, మసాచుసెట్స్, నార్త్ కరొలినా, సౌత్ కరొలినా, న్యూజెర్సీ, జార్జియా మొదలయిన చోట్ల ఇంగ్లీషువారి సెటిల్‌మెంట్‌లు ఏర్పడ్డాయి. సంపదకోసం వేటలో ఫ్రాన్స్ కూడా చేరిపోయి, క్యూబెక్‌ను స్థాపించింది. 1650లో వారు కెనడాను, అక్రెడియాలను వలసగా మార్చుకున్నారు. లూయిసియానాను ఫ్రెంచివారు ఆక్రమించడంతో వారికీ, ఇంగ్లీషువారికి ప్రత్యక్షఘర్షణ ఏర్పడింది. ఆ తరువాత కొద్దికాలంలోనే జరిగిన ఐరోపా యుద్ధంలో ఫ్రెంచివారిని బ్రిటీష్‌వారు ఓడించడంతో అమెరికాలోని ఫ్రాన్స్ వలసలు ముగిసాయి. బ్రిటిష్‌హయాం కూడా అమెరికాలో ఎక్కువ కాలం చెల్లలేదు. వలసపాలకులు తెచ్చిన రాజకీయ సిద్ధాంతాలను, వ్యవస్థలను అమెరికన్లు నిరసించారు. త్వరలోనే అమెరికా స్వాతంత్ర్య యుద్ధం జరిగి ఇప్పటి అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి.

## 4.2.3 ఆఫ్రికాలో విస్తరణ

ఐరోపాదేశాలు 19వ శతాబ్ది దాకా ఆఫ్రికా జోలికి పోలేదు. అందుకు కారణం ఆఫ్రికా భౌగోళిక ప్రత్యేకతలు. సహజమైన ఓడరేవులుకానీ, రవాణాకు పనికివచ్చే నదులు కానీ లేకపోవడం, పెద్ద పెద్ద ఎడారులు, దట్టమైన అడవులు ఆఫ్రికా మీద కన్నుపడకుండా కొంతకాలం కాపాడాయి. వలసవాద శక్తులు ఆఫ్రికాలో కొత్తకొత్త సరిహద్దులను గీస్తూ కొత్త రాజ్యాలను ఏర్పరుస్తూ ఆఫ్రికా ప్రజలను జయించారు. ఉదాహరణకు, మధ్య సబ్-సహారా ఆఫ్రికాలో ఒకే తెగకు చెందిన ప్రజలు కూడా అనేక రాజ్యాలుగా విడిపోయారు. ప్రజల సాంస్కృతిక, చారిత్రక అస్తిత్వంతో సంబంధంలేకుండా ప్రజలను విభజించి, వలసపాలకులు ఆఫ్రికాను లొంగదీసుకున్నారు. ఈ విభజన కారణంగా కొత్త రాజ్యాల్లో ప్రజల మధ్య ఐక్యతకు సంబంధించిన అనేక సమస్యలు తలెత్తాయి. అలాగే కొత్తసరిహద్దుల కారణంగా రాజ్యాల మధ్య ఘర్షణలు తలెత్తాయి. బకంగోలను ఫ్రెంచివారు పాలించారు. (ఫ్రెంచి వారి వలస రాజ్యం కాంగో(బ్రజ్జవిల్లె), బెల్జియన్లూ పాలించారు. (బెల్జియన్ కాంగో, ఇప్పటి జైర్;) పోర్చుగీసువారూకూడా పాలించారు. (పోర్చుగీసు పాలిత రాజ్యం ఇప్పటి అంగోలా) అలాగే సోమాలీలను ఇటాలియన్లు, బ్రిటిష్‌వారు, ఫ్రెంచ్‌వారు, ఇథియోపియన్లు పంచుకున్నారు. ఒకవైపున వలసవాద పాలన వల్ల ఐక్యతా సాధ్యపడింది. వలసవాదులను శత్రువులుగా చూసి పాలితులంతా ఏకం అయ్యే క్రమం ఒకటి జరిగింది. అది ఐక్యతకు ఉపయోగపడితే, మరోవైపున అదే వలసపాలన కొత్త కొత్త విభజనలకు దారితీసింది. బ్రిటిష్ పాలిత ఆఫ్రికాకు, ఫ్రెంచి పాలిత ఆఫ్రికాకు మధ్య, ఆఫ్రికన్ ప్రజలలోని వివిధ తెగలవారి మధ్య, భాషలు మాట్లాడేవారి మధ్య స్పర్థలు శత్రుత్వాలు ఏర్పడ్డాయి, లేదా సృష్టించబడ్డాయి. నైజీరియా తెగల ఘర్షణలు ఇందుకు ఉదాహరణ. వలసవాద వ్యవస్థలు నికార్సయిన అర్థంలో జాత్యాహంకార పూరితమయినవి. జాత్యహంకార, సాంస్కృతిక ఆధిపత్యతత్వ భావజాలం వలసరాజ్యాలలోని ప్రజల మీద విపరీతమయిన మానసిక ప్రభావాన్ని చూపించాయి. శ్వేతజాతి దురహంకార రాజ్యాలయిన దక్షిణ ఆఫ్రికా, రొడీషియా ఇందుకు స్పష్టమయిన ఉదాహరణలు. వలసవాదం వదిలివెళ్లిన జాతి విద్వేషాలు, ఆఫ్రికన్ల మీద వాటి మానసిక ప్రభావం అంత తొందరగా మాసిపోయేవి కావు, ఇంకా చాలా కాలం పాటు అవి మిగిలే ఉంటాయి.

BRAOU

19వ శతాబ్దం చివరిభాగంలో ఐరోపా రాజ్యాలు ఆఫ్రికాను అసాంతం ఆక్రమించుకున్నాయి. వలసల వేటలో ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ ఎక్కువ వాటా పొందగా, బెల్జియం, పోర్చుగల్, ఇటలీకూడా కొంత భాగం పొందాయి. ఐరోపా దేశాలు ఆఫ్రికా పంపకాన్ని చాలా శాంతియుతంగా చేసుకున్నాయి. స్థానిక తెగ పెద్దలతోనూ, తమ మధ్య ఒడంబడికలు చేసుకుని పంపకాలు చేసుకున్నాయి. ఆఫ్రికాను విభజించిన ఈ ఒడంబడికలు అన్నీ 1884 నుంచి 1890 మధ్య జరిగాయి. అయితే తరువాత కాలంలో ఆ ఒడంబడికలు ఐరోపా రాజ్యాల మధ్య అసూయలకు, ఘర్షణలకు కారణమయ్యాయి.

రాజ్యదాహం, మరింత ఆర్థిక దోపిడి చేయాలన్న అత్యాశ ఈ ఘర్షణలకు దారితీశాయి. కాంగో విషయమై ఫ్రెంచి వారికి, పోర్చుగీసువారికి శత్రుత్వం. ట్యునీసియాను కలుపుకోవడంతో ఫ్రాన్స్ మీద ఇటలీ కన్నెర్ర చేసింది. ఇక బ్రిటన్‌కూ, ఫ్రాన్స్‌కూ మధ్య పది సంవత్సరాలపాటు కలతలు చెలరేగి 1898లో యుద్ధ వాతావరణమే ఏర్పడింది. మొరాకో, ఈజిప్టు విషయంలో 1904లో బ్రిటన్, ఫ్రాన్స్ మధ్య అవగాహనకుదిరి, శాశ్వత మయిన రాజీ సాధ్యమయింది. మొరాకో విషయంలో జర్మనీకి ఆసక్తి ఉండడంతో దాని విషయంలో ఫ్రాన్స్‌కూ, జర్మనీకి మధ్య విభేదాలు చెలరేగి మొరాకో సంక్షోభానికి దారితీశాయి.

'శాంతి భద్రతల పరిరక్షణ' పేరుతో బెల్జియన్ కాంగో, ఫ్రెంచ్ కాంగో, జర్మన్ వాయవ్య ఆఫ్రికాల్లో పాశవిక పాలనా వ్యవస్థను రూపొందించారు. దాని ఫలితంగా పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజల నిర్మూలన జరిగింది. సమష్టి భూయాజమాన్య పద్ధతి పోయి, స్థానికులు నిర్బంధ శ్రామికులుగా మారిపోయారు. జరిగిన మేలు కూడా ఉంది. ఐరోపా ప్రభావం వల్ల తెగల మధ్య పోరాటాలు, అంతర్గత ఘర్షణలు సమసిపోయాయి. కొన్ని మిషనరీలు బానిస వ్యవస్థను వ్యతిరేకించి, సమానత్వాన్ని బోధించాయి. క్రైస్తవం, పాశ్చాత్య విద్యా వ్యాపించి కొత్త ఆలోచనలు ప్రవేశించాయి. కానీ, పాశ్చాత్య ప్రభావం ఆఫ్రికాలో ఎక్కువగా చొచ్చుకుపోలేదు.

# 4.3 వలసవాద వ్యతిరేక పోరాటాలు

వలసవాద వ్యతిరేక పోరాటాల చరిత్రను గమనిస్తే, ప్రపంచ వ్యాప్తంగా, వివిధ దేశాలలో ఆయా సమాజాల అంతరంగిక నిర్మాణమూ, బయటి శక్తులతో ఉన్న సంబంధాలూ ఆధారంగా పోరాటాలు తలెత్తినట్టు తెలుస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం భావనలకోసం పోరాడిన ఫ్రెంచి విప్లవం ఈ వలసవాద వ్యతిరేక పోరాటాల ఎదుగుదలకు గట్టి దోహదాన్నిచ్చింది. 19వ శతాబ్దం ఆరంభంలో ఇంగ్లీషువారు, ఫ్రెంచి, ఐరిష్, డేన్, స్వీడిష్, రష్యన్, పోల్, గ్రీక్, జర్మన్, ఇటాలియన్ ప్రజానీకం అంతా వలసవాద వ్యతిరేకపోరాటాలతో పెనవేసుకుని పోయి ఉన్నారు. తరువాత ఆ స్ఫూర్తి అమెరికా, ఆసియా, ఆఫ్రికాలకు వ్యాపించింది.

పోరాటాలకు కారణాలు దేశానికీ దేశానికీ వేరువేరుగా ఉన్నాయి. ఐరోపాలో కూడా ఆ పోరాటాలు అన్ని దేశాలలో ఒక్క రకంగా లేవు. ఇంగ్లీషు వారికీ, ఫ్రెంచి వారికీ అది ఆర్థికాభివృద్ధికీ, రాజకీయ విస్తరణకు కీలకమయిన సాధనం, జర్మనీలో, ఇటలీలో వలసవాద వ్యతిరేక పోరాటం వారి వారి దేశాలలో ఐక్యతకు ఉద్దేశించినది. అదే ఆ తరువాత సామ్రాజ్యవాద ఆకాంక్షగా పెరిగి, ఇతర దేశాల దోపిడికి, దురాక్రమణకు దిగజారింది. ఐరిష్, పోలిష్, గ్రీక్ ప్రజలు స్వయం పాలన కోసం పోరాడారు. ఇక ఆసియా, ఆఫ్రికా, అమెరికాలలో వలసవాద వ్యతిరేక పోరాటం ప్రధానంగా ఐరోపా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగింది. బయటి ఆధిపత్యాన్ని ఎదుర్కొనగల శక్తిని సమకూర్చుకోవడం కోసం చైనా, జపాన్‌లలో ఉద్యమాలు జరిగాయి. భారతదేశంలో ఆ పోరాటం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వతంత్రం కోసం జరిగింది.

## 4.3.1 ఇటలీలో వలసవాద వ్యతిరేక పోరాటం

అంతర్గత కలహాలు, విదేశీ ఆధిపత్యం ఇటలీకి శతాబ్దాలనుంచి ఎదురవుతూ వచ్చిన దౌర్భాగ్యం. 18వ శతాబ్ది చివరలో ఫ్రెంచి విప్లవం ప్రకటించిన ఉదార భావాలు ఇటలీ ప్రజల్ని ఒక కుదుపు కుదిపాయి. కొత్తగా తలెత్తిన ఈ జాతీయవాద ఆకాంక్షలను నెపోలియన్ ఇటలీ ఆక్రమణ దెబ్బతీసింది. అయితే, ఆ పరిణామం కొంత మేలు కూడా చేసింది. అన్ని ఇటాలియన్ ప్రాంతాలను ఒకే ఒక అధికారం కిందికి తీసుకువచ్చింది. వియన్నా కాంగ్రెస్ (1815) వెనిషియా, లొంబార్డీలను ఆస్ట్రియాకు స్వాధీనం చేసింది. పోప్ (పాపల్) ఆధిపత్యాన్ని పునరుద్ధరించింది. తక్కిన ఇటలీని హాప్స్‌బర్గ్స్‌కూ బోర్బన్స్‌కూ నడుమ పంపకం చేసింది. ఇటలీ ప్రజలను విముక్తం చేసి, ఐక్యం చేసేందుకు మజ్జిని (Mazzini) నాయకత్వంలో జాతీయ ఐక్యతా ఉద్యమం మొదలయింది. మజ్జిని భావాలను మరింత ముందుకు తీసుకువెళ్లింది కౌంట్ కేవర్ (Count Cavour). ఇటలీ ఐక్యతకు కారకులయినవారిలో మరొక ముఖ్యమయిన నాయకుడు గారీబాల్డీ (Garibaldi) పునరుజ్జీవనోద్యమం

BRAOU

తక్కిన ఐరోపా దేశాలకన్నా ఇటలీకి సాంస్కృతికంగా, బౌద్ధికంగా, తాత్వికంగా ఆధిక్యాన్నిచ్చింది. మొత్తం ఐరోపాకు ఇటలీ విజ్ఞానకేంద్రమయింది. అది తిరిగి జాతీయవాద చైతన్యానికి దోహదం చేసింది. కౌంట్ కేవర్ 1859లో ఆస్ట్రియన్లను ఓడించి, లోంబార్డిని తిరిగి సాధించాడు. మధ్య ఇటలీలోని డచ్ జాతివారు పాలకుల మీద తిరగబడి స్వాతంత్ర్యం సాధించారు. సార్డినియాతో కలిసి ఉన్న నేపుల్స్‌నీ, సిసిలీని గారీబాల్డీ సాధించాడు. ప్రష్యాతో పొత్తుపెట్టుకుని 1866లో జరిగిన ఆస్ట్రో-ప్రష్యన్ యుద్ధంలో సర్డినియా వెనిస్‌ను గెలుచుకుంది. 1870లో ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధంలో రోమ్‌ను గెలుచుకుంది. ఈ రకంగా ఇటలీ ఏకీకరణ పూర్తయింది.

## 4.3.2 జర్మనీలో వలసవాద వ్యతిరేక పోరాటం

జర్మనీ జాతీయ ఏకీకరణను జర్మన్లు కోరుతున్నా, వియన్నా కాంగ్రెస్ మాత్రం జర్మనీని 39 రాజ్యాల సమాఖ్యగా ఆస్ట్రియన్ చక్రవర్తి ఆధీనంలోనే ఉంచింది. అయితే, జర్మన్ జాతీయ చైతన్యాన్ని పెంచడానికి, ఐక్య భావాన్ని పెంపొందించడానికి కళాసాహిత్యరంగాలలో ప్రయత్నాలు జరిగాయి. జర్మన్ పాత్రలను, కథానాయకులను, సంగీతాన్ని, కళను, సాహిత్యాన్ని ఉన్నత స్థానంలో ప్రతిష్ఠించడానికి కళాకారులు, రచయితలు ప్రయత్నించారు. జర్మన్ రాజ్యాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించే కస్టమ్స్ యూనియన్ ఏర్పాటు కూడా జర్మన్ ఐక్య భావానికి దోహదం చేసింది. ప్రష్యా చక్రవర్తికి ప్రధానమంత్రిగా ఓటో-వన్ బిస్మార్క్‌ను నియమించడంతోనే జర్మనీ ఏకీకరణకు నిజమయిన నాంది జరిగింది. ప్రష్యా మాత్రమే జర్మనీని ఏకం చేయగలదని, దానికి అవరోధంగా ఉన్నది ఆస్ట్రియా మాత్రమేనని, దాన్ని యుద్ధం ద్వారా తొలగించుకోవాలని బిస్మార్క్ విశ్వసించాడు. ఫలితంగా మూడు యుద్ధాలు జరిగాయి. మొదటిది 1864లో డెన్మార్క్ విషయమై ఆస్ట్రియాతో జరిగింది. షెల్స్‌విగ్, హోల్‌స్టీన్ ప్రాంతాల మీద ఆధిపత్యం కోసం ఆస్ట్రియా-ప్రష్యా మధ్య 1866లో మరో యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఆస్ట్రియా ఓడిపోయి జర్మనీనుంచి తప్పుకోవలసివచ్చింది. ఆ తరువాత బిస్మార్క్ 1870లో ఫ్రాన్స్‌తో మరో యుద్ధం చేశాడు. అది ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధం పేరిట ప్రసిద్ధం. దానిలో ఫ్రాన్స్ ఓడిపోయింది. ఆ తరువాత అన్ని జర్మన్ రాజ్యాలూ ప్రష్యా ఆధీనంలో ఒకే జర్మనీగా ఏకం అయినాయి. నెమ్మదిగా, జర్మన్ పారిశ్రామికాభివృద్ధి ఇంతింతై వలసవాద వ్యతిరేక పోరాటం, చైతన్యం తిరిగి తలెత్తకుండా చేశాయి. ఈ సమరశీలమయిన వలసవాద వ్యతిరేక పోరాటం తరువాత రెండు ప్రపంచయుద్ధాలలోనూ జర్మన్‌లకు ప్రతికూల ఫలితాలను ఇచ్చాయి.

## 4.3.3 చైనాలో వలసవాద వ్యతిరేక పోరాటం

ఆసియా దేశాలలో, ముఖ్యంగా చైనా, జపాన్‌లలో వలసవాద వ్యతిరేక పోరాటం ఆధునిక ప్రపంచ వ్యవస్థలో విస్తరిస్తున్న మార్కెట్ సంబంధాలకు ప్రతిక్రియగా తలెత్తినవి. ఐరోపాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిలో ఈ పోరాటానికి మూలాలు ఉన్నాయి. చైనా ఎప్పుడూ ఐరోపా దేశాల వలసగా ఉండలేదు. కానీ, వారి ప్రభావం నుంచి మాత్రం తప్పించుకోలేకపోయింది. డచ్, ఫ్రెంచ్, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల మధ్య తలెత్తిన పరస్పర ఘర్షణల్లో చైనా 19వ శతాబ్దంలో అర్ధవలస స్థితిలో పడింది. ఆ దశలోనే మంచూ రాజవంశం పెట్టుబడిదారీ శక్తుల ప్రవేశాన్ని నిరోధిస్తూ, ఉమ్మడి సంస్కృతి, భాష, సంస్కరణ, రాజకీయ ఐక్యత ప్రాతిపదికన ప్రజలను సమీకరించింది.

పెట్టుబడిదారీ పరిశ్రమలు, ఉన్నత విద్య కలిసి చిన్నదే అయినా ఒక ప్రభావశాలి అయిన మధ్యతరగతి వర్గాన్ని సృష్టించాయి. ఈ వర్గం మొదట పశ్చిమదేశాలను యథేచ్ఛగా అనుకరించినా తరువాత తమ తమ దేశాలలో వలసవాద వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహించింది. రాజకీయ, ఆర్థిక ఆధిక్యాన్ని స్థాపించడానికి ప్రయత్నించారు. 19వ శతాబ్దంలో చైనా రాచరిక ప్రభుత్వం పతనోన్ముఖంగా ఉన్నది.

తీవ్రంగా ఉన్న ఆంతరంగిక కల్లోలం సుదీర్ఘమైన తైపింగ్ తిరుగుబాటుగా పరిణమించింది. పశ్చిమ దేశాలు వాణిజ్యంలో రాయితీలకోసం, రేవుల ఒడంబడికలకోసం ఒత్తిడిచేస్తున్న ఆ కాలంలో ఈ తిరుగుబాట్లు చైనా ప్రభుత్వాన్ని బలహీనపరిచాయి. ఆ తరువాత నల్లమందు యుద్ధాలు (Opium wars) విల్లంబుల యుద్ధాలు (Arrow Wars), బాక్సర్

BRAOU

తిరుగుబాటు (Boxen rebellion) జరిగాయి. సైనిక, పారిశ్రామిక రంగాలలో జపాన్ సాధిస్తున్న పురోగతిని చూసి దానిని అనుకరించాలని చైనీయులు తపించారు. కొత్త భావాలకోసం చైనీయులు జపాన్‌కు, జర్మనీకి, ఫ్రాన్స్‌కు, అమెరికాకు వేలం వెర్రిగా తరలి వెళ్లారు. జపాన్ విజయం మొత్తం ఆసియానే కదిలించివేసింది, చైనాలో జాతీయవాద చైతన్యం బలపడడానికి కారణమయింది. చైనాలో వలసవాద పోరాటం సన్-యట్-సెన్, తియాంగ్ చిథావొ, జనరల్ చియాంగ్‌కైషేక్ నాయకత్వంలో చైతన్యం సతాకస్థాయికి చేరుకుంది. చైనా వలసవాద పోరాటంలో ఒక ముఖ్యమైన లక్షణం సైనికవాదం. అది చైనా ఏకీకరణకు అవరోధంగా మారింది. చాలా కొద్ది కాలంలోనే చగ్‌సా, వుచాంగ్, హాన్‌కో హూనాన్, షాంసీ మొదలయిన నగరాలు వలసవాద పోరాటశక్తుల వశమైనాయి. 1928 నాటికి నాంకింగ్, పెకింగ్, మంచూరియా వంటి విదేశీ వాణిజ్య కేంద్రాలు కూడా వలసవాద వ్యతిరేక చైనీయుల పక్షానికి చేరిపోయాయి.

## 4.3.4 జపాన్‌లో వలసవాద వ్యతిరేక పోరాటం

పసిఫిక్ మహాసముద్రంలో ఒక మూల ఏకాకిగా ఉండడం, సహజ వనరులు లేకపోవడం, జనాభా దట్టంగా ఉండడం-ఈ కారణాల వల్ల జపాన్‌మీద వలసవాదుల కన్ను అంతగా పడలేదు. 1853లో కమొడోర్ పెర్రీ రెండు జపానీ ఓడరేవులలో అమెరికన్ నావికుల ప్రవేశాన్ని అనుమతించే ఒక ఒడంబడిక మీద జపాన్ చేత సంతకం చేయించడంతో కథ మారింది. వాణిజ్య సరుకుల దిగుమతికోసం ఉద్దేశించినవా రేవులు. ఇంగ్లండ్, రష్యా, హాలండ్ కూడా జపాన్‌నుంచి అటువంటి హక్కులను ఒడంబడికల ద్వారా పొందాయి. 1867 నాటికి అన్ని ఐరోపా దేశాలూ జపాన్‌తో ఒడంబడికలను కుదుర్చుకున్నాయి. వాణిజ్య సంబంధాలు, ఓడరేవులలో రాక పోకలకు స్వేచ్ఛ, సుంకాల మీద అదుపు, ప్రాదేశికమయిన హక్కులు వంటి రాయితీలను ఆ ఒడంబడికల ద్వారా ఆ దేశాలు సంపాదించుకున్నాయి.

విదేశీయులకు జపాన్ తలుపులు బార్లా తెరవడంతో దేశంలో విదేశీ వ్యతిరేక భావాలు తలెత్తాయి. అది క్రమంగా షొగన్ రాచరికాన్నే (Shogunate) రద్దుచేయాలనే డిమాండ్ దాకా వెళ్లింది. జపాన్‌లో వలసవాద వ్యతిరేక పోరాటం చివరికి 1867లో షొగన్ రాచరికాన్ని వదులుకునేలా చేసింది. మునుపటి మిజీ (Meiji) పాలకుడిని తిరిగి సింహాసనం ఎక్కించారు. పాలనలో, విద్యలో, సైనిక వ్యవస్థలో, ఆర్థిక వ్యవస్థలో కొత్త విధానాలను ప్రారంభించారు. ఆ క్రమం జపాన్‌ను ఆసియా ఖండంలో ఒక విభిన్నమయిన దేశంగా తీర్చిదిద్దింది. ఒక్క మాటలో చెప్పాలంటే, వలసవాద వ్యతిరేక పోరాటం జపాన్‌లో ఒక కొత్త దశను-శాంతియుతమైన ఆంతరంగిక స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి సాధించే దశను సృష్టించింది.

BRAOU

## 4.3.5 భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాటం

భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాటం 19వ శతాబ్దంలో, బ్రిటిష్ పాలనను సవాల్ చేస్తూ తలెత్తింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, బౌద్ధిక, రాజకీయ రంగాలలో వెనుకబాటు తనానికి బ్రిటిష్ పాలనే ప్రధానకారణం కావడమే ఈ వలసవాద వ్యతిరేక పోరాటానికి పునాది వేసింది. వలసపాలన వల్ల పాలనా పరమయిన, ఆర్థిక పరమయిన ఏకీకరణ జరగడంతో అది వలసవ్యతిరేక పోరాటం ఎదుగుదలకు దోహదం చేసింది. రైల్వేలు, పోస్టల్ సర్వీసులు, టెలిగ్రాఫు ప్రవేశం వల్ల దేశంలోని వివిధ ప్రాంతాలు దగ్గరయ్యాయి. పాశ్చాత్య భావాల వ్యాప్తి, ఇంగ్లీషు భాష చాలా ముఖ్యమయిన పాత్ర పోషించాయి. రాజా రామమోహనరాయ్, బంకించంద్ర చటర్జీ, స్వామి వివేకానంద మొదలయినవారు నిర్వహించిన సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఉద్యమాలు భారతదేశపు ప్రాచీన వారసత్వాన్ని, గతకాలంలోని స్వర్ణయుగాలను ప్రజలకు గుర్తు చేశాయి. ఈ ప్రయత్నాలు కళా, వాస్తు, సాహిత్య, తాత్విక, శాస్త్ర, రాజకీయ రంగాలలో ఉమ్మడి జాతీయ వారసత్వాన్ని కనుగొనడానికి దోహదం చేశాయి.

1876లో సురేంద్రనాథబెనర్జీ కలకత్తాలో 'ఇండియన్ అసోసియేషన్' స్థాపించడంతో భారతదేశంలో బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన పోరాటం ప్రారంభమయింది. డబ్ల్యు.సి. బెనర్జీ 1885లో భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించడం వలసవాద వ్యతిరేక ఉద్యమంలో కీలకఘట్టం. గాంధీజీ నాయకత్వంలో 1919లో అహింసాయుతమయిన స్వాతంత్ర్య

పోరాటం ప్రారంభమయింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో భారతజాతీయ కాంగ్రెస్ ప్రముఖమయిన పాత్ర వహించింది. గిరిజనులు, దళితులు వంటి ఇతర శక్తులు కూడా స్వాతంత్ర్య పోరాటంలో తమ వంతు పాత్ర పోషించారు. జాతీయవాద భావనలు ఎంతగా తీవ్రమయ్యాయంటే బ్రిటిష్‌వారు భారతీయుల మనోభావాలను పరిగణనలోనికి తీసుకోక తప్పలేదు. భారతదేశాన్ని వదిలివెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు. 1947 ఆగస్టు 15 నాడు భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. వలసవాద వ్యతిరేక పోరాటం ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికవాదం అన్న ఆదర్శాలను దేశంలో ప్రతిష్టించింది.

## 4.4 ముగింపు

ప్రపంచంలోని అత్యధిక భాగం పూర్వపు దొరలనుంచి విముక్తమయినా, వలసవాదపు కొత్త రూపాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అనేక దేశాలను పట్టి పీడిస్తున్నాయి. ఈ దేశాలన్నీ నియంతృత్వ పాలన కిందో, నిరంకుశ పాలన కిందో ఉండడం విషాదం. భారతదేశం వంటి కొన్ని దేశాలు మాత్రమే బలహీనంగా కనబడుతున్నా, తమ ప్రజాస్వామిక సంప్రదాయాలకు కట్టుబడివున్నాయి. వలసానంతర సమాజాలలో ప్రజాస్వామిక వ్యవస్థలను పటిష్టం చేయడం ఇంకా నెరవేరని కలగానే ఉన్నది. చరిత్రలోని వలసవాద వ్యతిరేక పోరాటం అవసరమయిన చారిత్రక స్ఫూర్తిని, వారసత్వాన్ని అందిస్తుండగా, ప్రపంచ ప్రజలందరూ ముఖ్యంగా తృతీయ ప్రపంచ దేశాలలోని ప్రజలందరూ ప్రజాస్వామ్యానికి అనువయిన సమాజాలు సృష్టించుకోవలసిన అవసరాన్ని వర్తమాన అనుభవం సూచిస్తున్నది. ప్రజాస్వామ్యానికి అనువయిన సమాజం కోసం కృషి చేయడమంటే మానవహక్కుల పరిరక్షణను ఉద్యమంగా చేపట్టడమే.

## 4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానాలు రాయండి

1. ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో వలసపాలన వ్యాప్తి గురించి చర్చించండి, వాటినుంచి వర్తమాన ప్రపంచం నేర్చుకోవలసిన పాఠాలను వివరించండి.
2. ఆసియా, ఆఫ్రికా దేశాలలో జరిగిన వివిధ వలసవాద వ్యతిరేక పోరాటాలను విశ్లేషించండి. వాటికీ, మానవ హక్కుల సమస్యకూ ఉన్న సంబంధాన్ని వివరించండి.
3. భారతదేశంలో వలస వాద వ్యతిరేక పోరాటాలను వివరించండి.

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు రాయండి

1. వలసల కోసం వివిధ సామ్రాజ్యవాద దేశాల మధ్య జరిగిన యుద్ధాలను విశ్లేషించండి.
2. ఇటలీ జాతీయవాదంలోని విశిష్టతను వివరించండి.

BRAOU

## 4.6 సంప్రదింపు గ్రంథాలు


అనిబీసెంట్: సోషలిజమ్ ఇన్ ఇండియా (మద్రాస్, 1920) బ్రిన్‌మూల్

ఇ.ఎచ్.కార్: ది బోల్షివిక్ రివల్యూషన్: *1917-1923* (3 సంపుటాలు) లండన్

ఆర్.పి. దత్: ఇండియా టుడే, (లండన్, 1940) నేటి భారతదేశం

లజపత్‌రాయ్: ది పొలిటికల్ ఫ్యూచర్ ఆఫ్ ఇండియా, న్యూయార్క్, 1921

పణిక్కర్, కె.ఎమ్.: ఏషియా అండ్ వెస్టరన్ డామినన్స్ (లండన్ 1952)

రోమేన్, జె., లార్హీమ్, డబ్ల్యు, ఎఫ్.,: ఎ వరల్డ్ ఆన్ ది రోవ్; ఎ హిస్టరీ ఆఫ్ కలోనియలిజమ్ అండ్ నెహరలిజమ్ ఇన్ ఏషియా అండ్ నార్త్ ఆఫ్రికా (ఆమ్‌స్టర్‌డామ్, 1954)

# భాగం 5 : సోషలిస్టు విప్లవాల వారసత్వం

## విషయక్రమం


5.0 ఉద్దేశం

5.1 పరిచయం

5.2 మానవ హక్కులపై - మార్క్స్, ఎంగెల్స్

5.3 మానవ హక్కులపై లెనిన్

5.4 మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ అభిప్రాయాల విశ్లేషణ

5.5 సోషలిస్టు దేశాలలో మానవ హక్కులు

5.6 ముగింపు

5.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

5.8 సంప్రదింపు గ్రంథాలు


## 5.0 ఉద్దేశం

మానవ హక్కులకు సంబంధించి ప్రధాన స్రవంతిగా చెలామణిలో వున్న ఉదారభావనలకు సోషలిస్టు ప్రపంచం నుంచే అర్థవంతమైన, అతి ప్రధానమైన సవాల్ వచ్చింది. వివిధ అంశాలపై భిన్నరీతి అభిప్రాయాలు కలిగి ఉన్న సోషలిస్టు ప్రపంచం మానవ హక్కులపై కూడా అదే అభిప్రాయాన్ని కలిగివుంది. మానవ హక్కులు, వాటి వారసత్వానికి సంబంధించి ప్రస్తుతం విచ్ఛిన్నమై వున్న సోషలిస్టు ప్రపంచంలో మూడు ప్రధాన భాగాలుగా వున్న సోవియట్ యూనియన్, తూర్పు యూరప్, చైనాల అభిప్రాయాలను, విధానాలను ఈ పాఠంలో తెలుసుకోవచ్చు. మానవ హక్కులపై సోషలిస్టు ప్రపంచపు సైద్ధాంతిక అవగాహనను కూడా ఈ పాఠంలో చర్చిద్దాం. దీనితో పాటు ఈ మూడు రకాల సోషలిస్టు దేశాలలో రాజ్యాంగాలు-వాటి అమలు తీరును పరిశీలిద్దాం. పాఠం చివరి భాగంలో మానవ హక్కుల సిద్ధాంతాలకు, ఆచరణకు సోషలిస్టు ప్రపంచం అందించిన అభిప్రాయాలను చర్చిద్దాం. మానవ హక్కులకు సంబంధించి భిన్నమైన ఒక ప్రధాన భావనగా ముందుకు వచ్చిన సోషలిస్టు ప్రపంచపు విధానాలను గురించి తెలియచెప్పటమే ఈ పాఠం ఉద్దేశం.

## 5.1 పరిచయం

వివిధ అంశాలమీద మిగతా ప్రపంచానికి, సోషలిస్టు ప్రపంచానికి మధ్య చెప్పుకోతగ్గ తేడా వుండడం ప్రధానంగా ఈ దేశాలు 'మార్క్సిజం-లెనినిజం' ఆలోచనా విధానాలతో ప్రభావితం కావడం వల్లనే. మార్క్సిజం-లెనినిజాలకు అనంతర దశల్లో ఎంగెల్స్, స్టాలిన్, మావోలు అందించినసైద్ధాంతిక ధార సోషలిస్టు దేశాలు ఆయా అంశాల్లో భిన్నంగా ఆలోచించడానికి దోహదపడ్డాయి. మార్క్సిజం-లెనినిజం సైద్ధాంతిక అవగాహన కారణంగానే సోషలిస్టు ప్రపంచం మొత్తం చాలా విషయాలపై ఒకే రకమైన అభిప్రాయాలు కలిగి వున్నాయి. అందువల్ల సోషలిస్టు ప్రపంచంలో మానవ హక్కుల సిద్ధాంతాలు, ఆచరణను విశ్లేషించడానికి ముందు ఆ ప్రపంచపు మానవ హక్కుల పునాదులను పరిశీలించడం అవసరం. మొదట ఈ అంశపై మార్క్స్, ఎంగెల్స్‌లతోపాటు సోవియట్ యూనియన్ నిర్మాత లెనిన్ సైద్ధాంతిక అవగాహనను పరిశీలించాలి. 1917 అక్టోబర్ విప్లవానంతరం ఏర్పడిన పరిస్థితులు, మానవ హక్కులపై సోవియెట్ భావనలు, సోవియెట్ రాజ్యాంగాలలో మానవ హక్కుల పాత్ర, సోవియట్ పాలనల్లో మానవ హక్కుల అమలుకు సంబంధించిన ఆచరణ అన్న అంశాలను ఈ పాఠంలో అధ్యయనం చేద్దాం.

BRAOU

# 5.2 మానవ హక్కులపై మార్క్స్ - ఎంగెల్స్

చరిత్రకు పూర్వం (కమ్యూనిజం పూర్తి స్థాయిలో వికసించినప్పుడే చరిత్ర ప్రారంభమవుతుందని మార్క్సిస్టుల అంచనా) అంటే కమ్యూనిస్టు పూర్వపు యుగంలో ఉనికిలో వున్న మానవ హక్కులతో మార్క్సిస్టుల అవగాహన ప్రారంభమవుతుంది. మార్క్స్ వాదన ప్రకారం-

'బలవంతపు శ్రమ, బహిర్ శక్తుల ప్రేరణతో మాత్రమే జరిగే శ్రమ, అవసరార్థ శ్రమ అమలులో వున్నంత కాలం స్వేచ్ఛాయుగం అనే మాటకు అర్థంలేదు. భౌతిక ఉత్పత్తులకు సంబంధించి స్వాభావికత వల్ల ఒక ఆటవికుడు తన వాంఛల సాఫల్యతకోసం ప్రకృతితో యుద్ధం చేస్తాడు. జీవనం కొనసాగింపునకు పునరుత్పత్తి చేస్తాడు. నాగరికుడు కూడా ఈ పనులను అన్ని రకాల ఉత్పత్తి విధానాలలో చేస్తాడు. ఇది ప్రతి సారీ అవసరం అన్న అంశం మీద ఆధారపడి వుంటుంది. అందువల్ల మానవుడి శక్తి అభివృద్ధి చెందేముందే అంతమవుతుంది. నిజమైన స్వేచ్ఛ కేవలం నిజమైన అవసరం అన్న ప్రాతిపదిక మీదే రూపుదిద్దుకుంటుంది. అంతిమంగా పనిదినం మరింత తగ్గడం అనేదే స్వేచ్ఛకు అసలు ప్రాతిపదిక అవుతుంది'

ఎంగెల్స్ వాదన ప్రకారం స్వేచ్ఛ గురించి మాట్లాడడం అన్నది ప్రారంభమైతే తక్షణమే రాజ్యం కూడా అమలులోకి వస్తుంది. రెండవది మానవ హక్కులు (రాజ్యం, చట్టం, మతం, నైతికతలతో పాటు) సాపేక్షిక దృగ్విషయాలు. మానవ సమాజానికి ప్రాథమిక ప్రాతిపదిక ఆర్థిక వ్యవస్థ. మరో మాటలో చెప్పాలంటే కమ్యూనిస్టు పూర్వపు సమాజాల్లో మానవ హక్కులు నిబద్ధమైనవి. అంతిమంగా ఆర్థిక వ్యవస్థ స్వభావం, ఒక సమాజంలో, యుగంలో ఆర్థిక వాస్తవాలు మానవ హక్కులను నిర్ధారిస్తాయి. ఒక మనిషి స్వేచ్ఛ ఆ మనిషి వర్గంపై ఆధారపడి నిర్ణయించబడుతుంది. ఒక వర్గం స్వేచ్ఛను పొందితే, సహజంగానే ఆ వర్గానికి చెందిన మనిషీ స్వేచ్ఛా జీవి అవుతాడు. అందువల్ల పూర్తి స్థాయిలో ఆలోచించినపుడు ఏ మనిషీ స్వేచ్ఛా జీవి కాడు.

మూడవది స్వాభావిక హక్కులు అన్న ఆలోచనే ఒక ఆదర్శవంతమైన ఊహ. ఒక కల్పనకు సంబంధించిన ఉపోశకలం. స్వాభావిక హక్కులకు సంబంధించి మార్క్స్, ఎడ్మండ్ బ్లాక్ లాంటి ఆలోచనాపరుల ఆధారంగా ఈ విషయాలు మాట్లాడారు. 'ఒక సమాజంలో భౌతిక పరిస్థితుల ప్రత్యేకతలు, చారిత్రికంగా సంభవించిన సంప్రదాయాలు హక్కుల స్వభావాన్ని నిర్ధారిస్తాయి. మానవ స్వభావానికి సంబంధించిన అంశాల్లోనే పొదిగివున్న రీతిలో సార్వత్రిక, స్వాభావిక హక్కులు అని చెబుతున్నవేవీ నిజానికి ఏ సార్వత్రిక సత్యాలకు, ప్రతిబింబాలుగా లేవు. అందువల్ల ఒక సమాజంలోని ప్రత్యేక ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులు (ఉత్పత్తిక్రమంలో ఉపరితలాంశాలు) ఆ సమాజానికి సంబంధించిన మానవ హక్కులను ఆచరిస్తాయి, నిర్దేశిస్తాయి. అందువల్ల కమ్యూనిస్టు పూర్వపు యుగంలో మానవ హక్కులకు సంబంధించి చెప్పాల్సిందేమీ లేదు. మానవ హక్కులు అంతిమమైనవి కావు. సాపేక్షికమైనవి. సమాజంలో సంభవించే ఆర్థిక, అధికార సంబంధాలలోని మార్పులతోపాటు మానవ హక్కుల భావనలూ మారతాయి. ఈ కారణం చేత మానవ హక్కులు సర్వవేళలకూ, సర్వావస్థలకూ సంబంధించినవి కావు కనుక సార్వత్రిక హక్కుల గురించి మాట్లాడడం దండగ. మార్క్స్ ఈ విషయంలో ఒక సమాజంలోని ఆర్థిక నిర్మాణం కన్నా, సాంస్కృతిక అభివృద్ధి కన్నా హక్కులు ఎప్పుడూ ఉత్కృష్టమైనవి కావు అన్న ధృఢ నిర్ణయాన్ని ప్రకటించారు.

నాలుగవది రాజ్యానికి, మనిషికీ వున్న సంబంధాల ప్రతిబింబమే మానవ హక్కులు అన్న అభిప్రాయంలో కూడా లోపమున్నది. రాజ్యం చారిత్రకపరిణామక్రమంలో, చరిత్రలో ఒక ప్రత్యేకస్థితిలో హింస, వర్గపాలన అమలు అన్న లక్ష్యాలతో ఆవిర్భవించింది. ఈ క్రమంలోనే చాలా సమాజాలు గతంలో రాజ్యం లేకుండా మనుగడలో వుండేవని, భవిష్యత్‌లో కమ్యూనిస్టు సమాజం కూడా రాజ్య రహితంగా వుంటుందని ఎంగెల్స్ సూచించారు. రాజ్యం భవిష్యత్‌లో అంతరించి పోయే ఒక ఉపరితలాంశం. కమ్యూనిస్టు పూర్వకాలంలో రాజ్యం ఉనికి వల్ల హక్కులను డిమాండ్ చేయడం అర్థవంత భావన. కానీ, రాజ్యం ఉనికిలో వుండని కమ్యూనిస్టు సమాజాల్లో రాజ్యానికి వ్యతిరేకంగా హక్కులు అడగడం ప్రయోజనకరం కాదు.

BRAOU

అయిదవది పాశ్చాత్య బూర్జువాలు ప్రతిపాదించిన మానవ హక్కులు, స్వాభావిక హక్కుల సిద్ధాంత మూలాలపై మార్క్స్ తీవ్ర విమర్శలు చేశారు. బూర్జువాలు గ్యారంటీ పడుతున్న చట్టాలు, మాట్లాడే హక్కు, పత్రికా స్వేచ్ఛ, ఆరాధన, గుమికూడే హక్కు, అర్జీ హక్కు, సంఘాల ఏర్పాటు అందరికీ సమానన్యాయం అన్న అంశాలన్నీ శ్రామిక వర్గాన్ని దోచుకునేందుకు ముసుగులా ఉపయోగపడే ఉత్తి ఆదర్శాలని మార్క్స్ ఎద్దేవా చేశారు. బూర్జువా సమాజంలోని లాంఛన ప్రాయమైన స్వేచ్ఛ, భవిష్యత్‌లో రూపుదిద్దుకునే కమ్యూనిస్టు సమాజంలోని అర్థవంతమైన స్వేచ్ఛలకు మధ్య భేదాలను మార్క్స్ స్పష్టంగా పేర్కొన్నారు. చివరగా మార్క్స్ ఒక సంపూర్ణ మానవుడి గురించి చెప్పారు. భూస్వామ్య వ్యవస్థ కూలి పోయిన తర్వాత, పెట్టుబడిదారీ నేతృత్వంలో ఏర్పడే పారిశ్రామిక, సాంకేతిక బూర్జువా విప్లవం మానవున్ని విచ్ఛిన్నం చేస్తుందని, పరాయీకరించి, స్వార్థపూరిత, అమానవీయతలతో ప్రకృతి నుంచి, సామాజిక సమూహాలనుంచి మనిషిని వేరు చేయబడతారని మార్క్స్ అంటారు. ఆ తర్వాతి దశల్లోనే సంపూర్ణ మానవుడు ఉద్ధరిస్తాడని మార్క్స్ వాదన.

స్వేచ్ఛపై ఎంగెల్స్ 'స్వేచ్ఛ అంటే మనమీదమన నియంత్రణ, మరియు బహిర్‌శక్తుల స్వభావం మీద నియంత్రణ స్వాభావిక అవసరాల విజ్ఞానం నుంచి పొందిన నియంత్రణ. అందువల్ల స్వేచ్ఛ తప్పని సరిగా చారిత్రక అభివృద్ధి క్రమం ఫలితంగా ఏర్పడింది''.

బూర్జువా సమాజంలో మానవ శ్రమ ఒక సరుకుగానూ, శ్రమజీవి విచ్ఛిన్నమైన వ్యక్తిత్వంతో ఒక వస్తువుగానూ తయారవుతాడు. మనిషి మొత్తం అమానవీయుడుగా మార్చబడతాడు. ఈ సమాజంలోనూ మానవుడు సమాజం నుంచి వేరు చేయబడి తన స్వంత హక్కుల గురించి అడుగుతాడు. అందువల్ల తన శరీరంలోనే తిరుగాడుతున్న ఒక పరాయిగా మనిషి తయారవుతాడు అని మార్క్స్ విమర్శించాడు.

'మానవ సమాజం నుంచి వేరు పడ్డ మనిషి తనలోకి తాను కుచించుకు పోయిన వ్యక్తి, తన వ్యక్తిగత ప్రయోజనాల కాంక్ష మాత్రమే గల మనిషిని మించి ప్రతిపాదిత హక్కులేవీ వుండవు. ఈ స్థితిలో మనిషికి సమాజం బహిర్ విషయంగా, వ్యక్తికి సంబంధించిందిగా హక్కులు వుంటాయి. ఇందుకు భిన్నంగా ఆయా వ్యక్తుల నిజ స్వాతంత్ర్యానికి, సమాజంలో భాగంగా సిద్ధించే హక్కులకు ఇది భిన్నమైనది. వ్యక్తి ఈ స్థితిలో సమాజంలో స్వాభావికమైన అవసరాలు, వ్యక్తి అవసరం, ప్రయోజనం, ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలపై ఆధారపడి వుంటాడు. అందువల్ల వ్యక్తి సమాజంలో భాగంగా సంపూర్ణ మానవుడిగా, వ్యకి ప్రయోజనాలూ, సామాజిక ప్రయోజనాలు పరస్పరం వ్యతిరేకించకుండా, సౌహార్ధ్రతగా వున్నప్పుడే మనిషి హక్కులకు ప్రాతిపదిక ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ సమాజం వ్యక్తిని విచ్ఛిన్నం చేసి, అమ్మకం సరుకుగా మారుస్తుంది. చివరకు వినోదాన్ని కూడా కొనే, అమ్మే సరుకుగా మారుస్తుంది. ఈ స్థితిలో వ్యక్తి స్వేచ్ఛ అంటే తనలోకి తాను కుచించుకు పోయిన ఏకాంతిక వ్యక్తి స్వేచ్ఛ అవుతుంది అని మార్క్స్ అంటాడు.

ఆదిమ తెగల సమయంలో ఇటువంటి వ్యవస్థలులేవు. వ్యక్తుల మధ్య పరస్పర ఆధారిత, సంబంధాలు వుండేవి. ఈ సంబంధాలు లేకుంటే మనుగడే లేకుండేది. అందుకే, మార్క్స్, ఎంగెల్స్ ఈ విధంగా అంటారు.

'మనిషి వ్యక్తిగత స్వేచ్ఛ కేవలం సమూహంలో అంతర్భాగంగా మాత్రమే వస్తుంది. నిజ సమూహంలో వ్యక్తులు వారి వారి అనుబంధాలను బట్టే నిజ స్వేచ్ఛను పొందుతారు.' ఈ స్థితి పెట్టుబడిదారీ సమాజాన్ని విప్లవం ద్వారా కూల్చివేసి, ఉత్పత్తి సాధనాలు, సంబంధాలు మార్చినప్పుడు, దోపిడీరహిత, వర్గరహిత సమాజంలో మాత్రమే ఏర్పడుతుంది.

కమ్యూనిస్టు ప్రణాళికలో ఈ విధంగా వుంది. వర్గాలు, వర్గసంఘర్షణలతో కూడిన పాత బూర్జువా సమాజం స్థానంలో ఒక కొత్త సమాజం, అదీ, వ్యక్తికీ, సమాజానికీ మధ్య వైరుధ్యం లేని సమాజం ఏర్పడుతుంది. కమ్యూనిస్టు సమాజంలోనే ఇది సాధ్యం. వ్యక్తి, సమాజం పరస్పర సౌహార్ధ్రతతో వుండే ఈ సమాజంలోనే వ్యకికి నిజస్వేచ్ఛ లభిస్తుంది' అని మార్క్స్ ఎంగెల్స్‌లు పేర్కొన్నారు.

'అప్పుడే నిజమైన ఒక వ్యక్తి తనను తాను పునర్ విలీనం చేసుకున్న ఒక అమూర్త మానవుడు అవుతాడు. తదనంతరం అతను సమాజంలో భాగమవుతాడు అప్పుడే వ్యక్తి తనను తాను గుర్తుంచుకొని, తన బలగాలను సమీకరించుకుని ఒక

సామాజిక శక్తిగా, రాజకీయ అధికారంగా రూపొందుతాడు'.

అప్పటిదాకా మనిషిహక్కులు, స్వేచ్ఛలు కాదు అడిగేది. అతను అవసరాల నిమిత్తం నుంచి స్వేచ్ఛ నిమిత్తం వేపు, సృజనాత్మకత వైపు పురోగతి చెందుతాడు. అప్పుడు నిజమైన మానవుడు సామాజిక సంబంధాల ప్రతీక గా రూపొందుతారు అని మార్క్స్ భావన.

బూర్జువా పౌరసమాజంలో స్వేచ్ఛా హక్కు స్థితిగతులను మార్క్స్ ఈ విధంగా అభివర్ణించారు. బూర్జువా సమాజంలో హక్కులు మనిషికీ, మనిషికీ మధ్య సంబంధాలు ఏర్పరచేవి కాకుండా పడగొట్టేవిగా వున్నాయని ఆయన భావన. ఒక వ్యక్తి తనలోకి తాను ముడుచుకు పోయేందుకే ఈ హక్కులు. అందువల్ల మార్క్స్ 18వ శతాబ్దపు మానవ హక్కుల ప్రకటనను 'మనిషిగా భావించుకునే హక్కులు' గా అభివర్ణించారు. ఈ వ్యక్తి ఇతరులతో, సమాజంతో వేరయిన వ్యక్తి. ఈ హక్కులన్నీ పరిమితమైనవి అని మార్క్స్ భావన. ఉదాహరణకు పత్రికా స్వేచ్ఛ హక్కును మార్క్స్ అభివర్ణించారు.

బూర్జువా హక్కుల్లో ప్రధానమైన ఆస్తి హక్కుపై మార్క్స్ ఈ వ్యాఖ్యానాలు చేశారు. ఆస్తిపై వ్యక్తి హక్కు అంటే, ఒకరి ఆస్తిని వారు అనుభవించే హక్కు, లేదా అమ్ముకునే హక్కు, ఇతరులకు సంబంధం లేకుండా, సమాజానికి ఏ మాత్రం సంబంధం లేకుండా వుండే ఆస్తి హక్కు స్వప్రయోజన హక్కు. ఈ విధంగా బూర్జువా సామాజిక పరిస్థితుల్లో 'మనిషి ఆస్తి నుంచి స్వేచ్ఛ పొందలేడు. తద్భిన్నంగా వ్యాపార స్వేచ్ఛను పొందుతాడు.

బూర్జువా సమాజంలో రాజ్యం వర్గ సంఘర్షణలకు ఆయుధంగా వుంటుంది కాబట్టి రాజ్యానికి వ్యతిరేకంగా వివిధ రకాల హక్కులను డిమాండ్ చేస్తారు. కానీ, సోషలిస్టు సమాజంలో వ్యక్తికీ, సమాజానికీ మధ్య ఘర్షణ వాతావరణం వుండదు. క్రమ క్రమంగా రాజ్యం అంతరించి పోతుంది కాబట్టి హక్కుల ప్రస్తావనే వుండదు. తత్ఫలితంగానే సోవియట్ రాజ్యాంగంలో రాజ్యాన్ని పరిమితం చేసేందుకు బదులుగా అపరిమితం చేసి అంతిమ అధికారాలు కట్టబెట్టారని ఇ.హెచ్. కార్ అభిప్రాయం.

వ్యక్తి కార్యాచరణలో రాజ్యం జోక్యం వుండకూడదని, వ్యక్తి హక్కులకు రాజ్యం గ్యారంటీ పడాలన్న బూర్జువా స్వేచ్ఛను మార్క్సిజం తిరస్కరిస్తుంది. వర్గ పాలనలో ఇటువంటి స్వేచ్ఛ లాంఛనంగానూ, అసమర్థతలోనూ వుంటుంది. అందువల్ల ఒక శ్రమ జీవి స్వేచ్ఛను రాజ్యానికి వ్యతిరేకంగా కాకుండా రాజ్యం కార్యాచరణ ద్వారా చూడాలి. వర్గ సమాజంలో వ్యక్తికీ, రాజ్యానికీ మధ్య వ్యతిరేక భావన సహజమైంది. శ్రామికుల ప్రయోజనాలు అన్నమొత్తం భావనలోనే ఒక శ్రామికుడి హక్కులు ఇమిడి వుంటాయి. ఒక శ్రామికుల రాజ్యంలో ఆ శ్రామికున్ని వ్యతిరేకంగా నిలపడం హేతురహితమైంది.

కాగా, సోషలిస్టు విధానంలో విధులకు అత్యధిక ప్రాధాన్యత కల్పించారు. ఒక్కొక్కసారి హక్కులకన్నా విధులకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. కోరికలు, కొరతలు, అసమానతలు, అన్యాయాలు, దోపిడి, పీడనల నుంచి స్వేచ్ఛ లభించాలని, ఇదే మానవ జీవనంలో అత్యున్నత రూపంలో సృజనాత్మకత పరిఢవిల్లడానికి మార్గమని మార్క్సిజం భావన.

## 5.3 మానవ హక్కులపై లెనిన్

వర్గ సమాజంలో మానవ హక్కులు, స్వేచ్ఛా భావనలు కేవలం లాంఛనంగా, కపటంగా, ముసుగులో వుంటాయి. పేదలు, ధనికులు రాజకీయంగా సమానులు కావడం అసాధ్యం అట్లాగే పీడితులు, పీడకులు సమానులు కారు'. ఒక వర్గాన్ని మరో వర్గం దోపిడీ చేయడం వీలుపడినంత కాలం అసలైన, వాస్తవ సమానత్వం సాధ్యం కాదు. 'ప్రతి బూర్జువా ప్రజాస్వామ్యం, ధనికుల ప్రజాస్వామ్యం' అని లెనిన్ భావన.

''స్వేచ్ఛ, ఏ వర్గానికి? ఎందుకోసం? సమానత్వం. ఎవరు ఎవరితో సమానులు? ప్రజాస్వామ్యం ప్రైవేటు ఆస్తి హక్కు కోసమా? ఆస్తి హక్కు రద్దు కోసమా?''

పెట్టుబడి దారీ సమాజంలో ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యం హక్కుపట్ల స్వేచ్ఛా సమానత్వం అన్న భావనలు కేవలం కపటంగానూ, మాటరాని విధంగానూ వుంటాయని, ఇవి అంతిమంగా పెట్టుబడులతో దోపిడీ చేసేందుకు,

BRAOU

శ్రామికులకు అసమానతలను ఆర్థిక పరాధీనతను తెచ్చిపెట్టడానికే ఉపయోగపడ్తాయని లెనిన్ అన్నారని సోవియెట్ రచయిత ఒకరు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం ఎవరికి? ఈ ప్రజాస్వామ్యం ఏ ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పుతుంది, కాపాడుతుంది. అన్నది లెనిన్ ప్రశ్న. దీన్ని లెనిన్ ఈ విధంగా వివరించారు.

'ఆధునిక రాజ్యాలలో ప్రాథమిక చట్టాలను తీసుకోండి. పత్రికా స్వేచ్ఛ, సమావేశమయ్యే స్వేచ్ఛ, అందరూ పౌరులూ చట్టం ముందు సమానులే' అన్న హక్కును తీసుకొండి. ప్రతిసారి, ప్రతి గౌరవనీయమైన వర్గ స్పృహ కలిగిన శ్రామికుని విషయంలో ఇవి బూర్జువా ప్రజాస్వామ్యంలో కపట పూరితంగా వుంటాయి. వీటికి పరిమితులు, లోపాలు లేకుండా వుంటే, కార్మికులకు వ్యతిరేకంగా సైనిక బలగాలను మోహరించడం, మార్షల్ లా విధించడం జరిగే పని కాదు.

అందువల్ల హెవ్లెట్ జాన్సన్ అనే బ్రిటిష్ శాస్త్ర కారుడు ఈ విధంగా ప్రకటించారు. రాజకీయ సమానత్వం, ఆర్థిక సమానత్వాన్ని కోరుతుంది. సోవియట్ యూనియన్ ఆ సమానత్వం ఇస్తుంది. మేము బ్రిటన్‌లం అది ఇవ్వం' ఇదే విధంగా స్టాలిన్, లెనిన్ అడుగు జాడల్లో నడిచారు. మానవ హక్కులకు సంబంధించిన బూర్జువా సిద్ధాంతాలపై ఆయన కూడా ధ్వజమెత్తారు.

## 5.4 మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ అభిప్రాయాల విశ్లేషణ

BRAOU

పై విషయాలను బట్టి మార్క్సిజం-లెనినిజం మానవ హక్కులను సామాజిక, ఆర్థిక, వర్గ సంబంధాల కోణంలో విశ్లేషించారని చెప్పవచ్చు. ఒక సోవియెట్ రచయిత ప్రకారం హక్కులను, ఒక వ్యక్తి నివసించే సమాజానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మేధో సంబంధాల విశ్లేషణల ఆధారంగా నిర్ధారించవచ్చు. సంపూర్ణ, పరాధీనం కాని, స్వాభావిక హక్కులనేవి ఒక మిథ్య. హక్కులు సాపేక్షికమైనవి. ఒక సమాజంలోని సామాజిక, ఆర్థిక అభివృద్ధికన్నా హక్కులెప్పుడూ ఉత్కృష్టమైనవి కావు. ప్రతి సామాజిక, ఆర్థిక నమూనాకు నిర్ణీత హక్కులు రూపొందుతాయి. పెట్టుబడి దారీ విధానం క్రింద, శ్రమ విభజన, వర్గాలు, దోపిడీ, అసమానతలు, అన్యాయాలు, స్వార్థం, బూర్జువా వ్యక్తి వాదం సమాజానికి, వ్యక్తికీ మధ్య సంఘర్షణలను రేపుతుంది. ఈ సంఘర్షణ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రధానమైంది. విచిత్రమైంది.

సోషలిజంలో వ్యక్తికీ, సమాజానికీ మధ్య సంబంధాన్ని సౌహార్దం చేస్తుంది. కమ్యూనిజంలో మనిషి తనకు తాను స్వేచ్ఛా జీవిగా పరిణతి పొందుతాడు. అది మనిషిలోని సృజనాత్మకతను పూర్తిగా వెలికి తీస్తుంది. ఈ స్థితిలో వ్యక్తి ప్రకృతిలో, సమాజంతో సత్సంబంధాలలోకి వస్తాడు. 'సామూహిక చేతన' ఆధిపత్య పాలన ఏర్పడుతుంది.

ఒక సోవియట్ రచయిత ప్రకారం, వ్యక్తినీ, వ్యక్తుల హక్కులనూ అమూర్తంగా చూసే పాశ్చాత్య ధోరణులను మార్క్సియన్ దృక్పథం తిరస్కరించింది. తద్భిన్నంగా వ్యక్తి వాస్తవానికి సామాజిక జీవి అని, ఏదో ఒక వర్గానికి చెందిన వాడనీ మార్క్సిజం చెబుతుంది. వర్గ సమాజంలో హక్కులు కేవలం లాంఛనాలని, ఆగర్భ శ్రీమంతులు, అష్ట దరిద్రులూ ఈ సమాజంలో రాజకీయంగా సమానులే అని చెప్పుకుంటారు. పెట్టుబడి దారీ సమాజంలో ప్రజాస్వామ్యం తటస్థ వర్గ విధానాన్ని బోధిస్తూ, వాస్తవాలను మరుగు పరుస్తుందని మార్క్సిస్టుల అభిప్రాయం.

సోషలిస్టు ప్రపంచం ఈ భావాలను పంచుకోవడం, ప్రచారం చేయడమే కాకుండా తమ తమ రాజ్యాంగాల్లో ఈ విధానాలను పొందు పరుచుకున్నాయి. అందువల్ల మార్క్సిస్టు-లెనినిస్టు సైద్ధాంతిక విధానాలనుంచి మానవ హక్కులకు సంబంధించిన సోషలిస్టు విధానాలు-ఆచరణ రూపొందాయి.

## 5.5 సోషలిస్టు దేశాలలో మానవ హక్కులు

మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాల ప్రాతిపదికగా సోవియట్ యూనియన్, దాని అనుబంధ 'బ్లాక్'లుగా చెలామణి అయిన తూర్పు యూరప్ దేశాలు, చైనాలో మానవ హక్కులు అమలయ్యాయి. ఉదారవాద ప్రపంచానికి

భిన్నంగా ఆర్థిక వ్యవస్థలు పునాదిగా, వ్యక్తి స్వేచ్ఛను విభేదిస్తూ ఆయా దేశాలు మానవ హక్కులకు సంబంధించి కొత్త తరహా సిద్ధాంతాలు ప్రతిపాదించాయి. మార్క్సిజం-లెనినిజం ఆచరణలో ఒక రాజ్యంగా ఏర్పడింది సోవియట్ యూనియన్‌లోనే. 1918లో సోవియట్ యూనియన్ రాజ్యాంగంలో మొదటిసారి లెనిన్, పీడితుల, తాడితుల హక్కులను కూడా చేర్చారు. 1918, 1924, 1936, 1977లలో రూపొందించిన నాలుగు సోవియట్ రాజ్యాంగాల్లోనూ హక్కుల జాబితా రూపొందించారు. కానీ, సోవియట్ పౌరులు మొత్తంగా అన్ని హక్కులనూ వీటి ద్వారా పొందలేక పోయారు. స్టాలిన్ హయాంలో పౌరుల రాజకీయ స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగింది. కానీ, జారిస్టు రష్యాతో పోల్చినపుడు మాత్రం మెజారిటీ సోవియట్ పౌరులు, సామాన్యులు చాలా హక్కులు పొందారు. కానీ ఉదారవాద సమాజాలయిన పాశ్చాత్య ప్రజాస్వామ్య వ్యవస్థలతో పోల్చినపుడు మాత్రం ఇవి ఏ మాత్రం పోలికలకు రాజాలవు. అనంతర పరిణామాల్లో సోవియట్ యూనియన్ పతనమైంది. సోవియట్ యూనియన్‌కు అనుబంధంగా సోషలిస్టు దేశాలుగా వున్న జెకొస్లొవేకియా, పోలండ్ తదితర దేశాల్లో కూడా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. మొత్తానికి పాత, కొత్త రాజకీయ సంస్కృతులు, ఆది సోషలిస్టు దేశాలు, అనంతర పతనాల కారణంగా సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలలో మానవ హక్కులు ఒకానొక సంధికాలంలో వున్నాయని చెప్పక తప్పదు.

సోషలిస్టు దేశాలలో 'మార్కెట్ ఎకానమీ' ప్రవేశపెట్టినప్పటికీ పతనం కాకుండా మిగిలి వున్న దేశం చైనా. ఆదినుంచి సోవియట్ యూనియన్ తరహా భిన్నంగా వుండే చైనాలో కూడా మానవ హక్కులకు ప్రాతిపదిక మార్క్సిజం-లెనినిజమ్, మానవ హక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యంల గురించి మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు ప్రకటించిన భావాలనే మావో చైనాలో ప్రచారం చేశారు. మానవ హక్కులపై ప్రత్యేకంగా మావో ఏమీ రాయనప్పటికీ, ఆచరణ వాదిగా రాజకీయ సమస్యల విశ్లేషణలో భాగంగా ఆయన ప్రకటించిన అభిప్రాయాలను చైనాలో మానవ హక్కుల పరిశీలనకు ఉపయోగపడతాయి. 1949 చైనా విముక్తికి పూర్వం మావో రచనల్లోంటిలోనూ ప్రజాస్వామ్యం, హక్కులు, స్వేచ్ఛ, ప్రజలు, ప్రజలదైన ప్రజాస్వామ్యం, నూతన ప్రజాస్వామ్యం అన్న మాటలున్నాయి. ప్రజాస్వామ్యాన్ని చైనాలో కేంద్రీకృత ప్రజాస్వామ్యంగానే చూసేవారు. అట్లాగే బూర్జువా ఉదారవాదం గురించి కూడా మావో ఝెడాంగ్ విస్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. ఉదారవాదం అవకాశవాదానికి పరాకాష్ట అని అది మార్క్సిజంతో మౌలికంగానే విభేదిస్తుందని మావో బోధించారు. 1949 నుంచి చైనా నాలుగు రాజ్యాంగాలను రూపొందించింది. 1954, 1975, 1978, 1982లలో ఈ రాజ్యాంగాలను రూపొందించారు. 1954 రాజ్యాంగంలో మావో ఆలోచనా విధానాల మేరకు ఎర్ర చైనా శ్రామికవర్గం నేతృత్వంలో కార్మిక, కర్షక ఐక్యతతో ప్రజలదైన ప్రజాస్వామ్య రాజ్యంగా వుంటుందని ప్రకటించారు. ఈ రాజ్యాంగ **అధికరణ-2** లోనే చైనాలో అధికారమంతా ప్రజలకే చెందుతుందని ప్రకటించారు. 1982 రాజ్యాంగంలో చైనాలో ఆర్థిక, సామాజిక రంగాల్లో వస్తున్న మార్పులకు ప్రతిబింబంగా సడలింపు ధోరణి కనబడుతుంది. ఈ రాజ్యాంగంలో కార్మిక, కర్షక ఐక్యతతో శ్రామిక వర్గ నియంతృత్వం అని ఒక వంక అంటూనే మరో వంక ఆర్థిక వ్యవస్థ మార్పులు, అసమానతలు, రాయితీలను కూడా సమ్మిళితంగా చేర్చారు. అయితే 1970 దాకా చైనాలో ఏం జరుగుతుందో తెలియని ప్రపంచానికి ఇప్పుడు ప్రతి విషయమూ బహిర్ ప్రపంచానికి వెల్లడవుతున్నది. తదనుగుణంగానే చైనా కూడా అంతర్జాతీయ మానవ హక్కుల ఒడంబడికలపై సంతకాలు చేయడానికి ముందుకు వస్తున్నది.

ఇక తూర్పు యూరప్ దేశాలన్నీ పాశ్చాత్య దేశాలకు సమీపంగా వుండడంతో ఇవి పేరుకు సోషలిస్టుదేశాలే అయినా రష్యా, చైనాలకు భిన్నంగానే వుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఇవన్నీ సోవియట్ యూనియన్ ఆధీనంలోకి వచ్చాయి. తూర్పు జర్మనీ, పోలండ్, జెకొస్లొవేకియా, హంగరీ, రుమేనియా, యుగొస్లావియా, ఆల్బేనియా, బల్గేరియా లాంటి దేశాలన్నీ మార్క్సిజం-లెనినిజంను మార్గదర్శకంగా స్వీకరించి, రాజ్యం, చట్టం, హక్కులు ప్రజాస్వామ్యం అన్నీ సోవియట్ యూనియన్ మాదిరిగానే వుంటాయని ఈ దేశాలు అధికారికంగా ప్రకటించుకున్నాయి. అందువల్లనే ఈ దేశాల రాజ్యాంగాలన్నీ సోవియట్ యూనియన్‌కు నకలుగా వుంటాయి. అయితే సోవియట్ యూనియన్‌కన్నా ముందే ఈ దేశాల్లో పాశ్చాత్య పోకడలు పొడసూపాయి. ఫలితంగా మొదట 1940లో మార్షల్ టిటో స్టాలిన్‌తో విభేదించి ఆయనకు దూరమయ్యారు. కాలక్రమేణా ఆయా దేశాల్లో ప్రజాస్వామ్యం, సంస్కరణల ఉద్యమాలు చెలరేగి అన్ని దేశాల్లోనూ

BRAOU

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. జెకోస్లోవేకియా విడిపోయింది, యుగొస్లావియా ఉనికిలో లేకుండా పోయింది. ఇక్కడ మానవ హక్కులు కొత్త దారులు తీసింది. క్లుప్తంగా సోషలిస్టు విప్లవాల వారసత్వం చరిత్ర ఇది.

## 5.6 ముగింపు

మానవ హక్కులకు సంబంధించి మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం ఆర్థిక, వర్గ కోణం నుంచి ప్రతిపాదనలు చేసింది. ఒక సమాజంలో సామాజిక-ఆర్థిక అభివృద్ధికన్నా హక్కులు మిన్నకాదని ఈ దృక్పథం వెల్లడించింది. ఒక వ్యక్తి అమూర్తంగా జీవించలేడు. అతను ఒక వర్గానికి చెందిన సామాజిక జీవి. ఒక వ్యక్తి వర్గం స్వేచ్ఛ పొందితే అతను కూడా స్వేచ్ఛగా జీవిస్తాడు. అమూర్త భావనల మీద ఆధారపడిన స్వాభావిక హక్కులనేవి ఊహా శకలాలు మాత్రమే. ఒక వ్యక్తి హక్కులతో పాటు విధులు కూడా అంతే ముఖ్యమైనవని మార్క్సిస్టు దృక్పథం దృఢంగా వెల్లడించింది. వర్గ సమాజంలో హక్కులు లాంఛన ప్రాయమైనవని, రాజ్యానికి సంబంధించి చూసే హక్కులు బూర్జువా విధానమని మార్క్సిస్టుల భావన. కమ్యూనిస్టు సమాజంలో కమ్యూనిస్టు పూర్వపు సమాజాల్లోని అన్ని చెరుగులు, రాజ్యం అంతరించి పోయి ప్రతివాళ్లు స్వేచ్ఛ పొందుతారు. మనిషి తన అత్యున్నత సృజనాత్మకతలు సాధించినప్పుడే నిజంగా చరిత్ర ప్రారంభమవుతుంది అని మార్క్సిస్టుల అభిప్రాయం. ఈ విధానాలకు అనుగుణంగానే మొట్టమొదటి సోషలిస్టు దేశంగా ప్రకటించుకున్న సోవియట్ యూనియన్‌లో లెనిన్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా మానవ హక్కులను, రూపొందించారు. ఆయా కాలాల్లో ప్రకటించిన రాజ్యాంగాల్లో మానవ హక్కులను ఉదారవాద, పాశ్చాత్య ప్రజాస్వామ్య రాజ్యాలకు భిన్నంగా ప్రకటించారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సోవియెట్ యూనియన్ అనుబంధ రాజ్యాలుగా ప్రకటించుకున్న తూర్పు యూరప్ దేశాలు కూడా ఇదే దారిలో మానవ హక్కులపై అభిప్రాయాలు కలిగి వున్నాయి. చైనాలో మాత్రం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల ఆలోచనా ధోరణుల్లోనే మావో కూడా ప్రజాస్వామ్యం, హక్కుల గురించి మాట్లాడారు.

BRAOU

## 5.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1. మానవ హక్కులపై మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథంలో ముఖ్యాంశాలను చర్చించండి.
2. మానవ హక్కుల సోషలిస్టు వారసత్వాన్ని వివరించండి.
3. ఉదారవాద, పాశ్చాత్య మానవ హక్కుల భావజాలానికీ, మార్క్సిస్టుల మానవ హక్కుల భావనలకూ గల తేడాలను వివరించండి.
4. మార్క్సిస్టుల మానవ హక్కుల భావనలను విమర్శనాత్మకంగా వివరించండి.
5. సోషలిస్టు దేశాలలో మానవ హక్కుల స్థితి గతులను వివరించండి?

## 5.8 సంప్రదింపు గ్రంథాలు


1. కార్ల్ మార్క్స్ 'ఆన్ ది జ్యూయిస్ క్వొశ్చన్' కలెక్టెడ్ వర్క్స్ వాల్యూమ్-III (మాస్కో)
2. కార్ల్ మార్క్స్, ఎంగెల్స్ 'ది ఇండ్యువిడ్యుయల్ అండ్ సొసైటీ' (మాస్కో 1984)
3. లెనిన్ 'ఆన్ సోవియెట్ సోషలిస్టు డెమొక్రసీ - (మాస్కో 1984)
4. జిన్స్, శామ్యూల్, హ్యూమన్ రైట్స్, కంటిన్యూయింగ్ ది డిస్కషన్ (మాస్కో 1980)

# ఖండం II

# అంతర్జాతీయ ప్రకటనలు, ఒడంబడికలు

BRAOU

BRAOU

# భాగం 6: అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన

## విషయ క్రమం


6.0 ఉద్దేశం

6.1 పరిచయం

6.1.1 అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన

6.2 రాజకీయ హక్కులు

6.3 సాంఘిక, ఆర్థిక హక్కులు

6.4 పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందం

6.5 మరణ శిక్ష

6.6 నిర్బంధితుల హక్కులు

6.7 భావ వ్యక్తీకరణ హక్కు

6.8 ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం

6.9 ఆర్థిక హక్కులు

6.10 సాంఘిక హక్కులు

6.11 సాంస్కృతిక హక్కులు

6.12 సారాంశం

6.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

6.14 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

## 6.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన గురించి వివరించ గలుగుతారు.
- సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులు తెలుసుకోగలుగుతారు
- ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందాన్ని అవగాహన చేసుకుంటారు.

## 6.1 పరిచయం

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనతో మానవ హక్కులనే ఆధునిక భావనకు ఒక పునాది ఏర్పడింది. డిసెంబరు 10.1948 నాడు ఆమోదించబడిన ఈ ప్రకటన, ఆధునిక సమాజాలను పరిపాలించడానికి కొన్ని ప్రమాణాలను ఏర్పరిచింది. అన్ని దేశాల ప్రజలు సాధించవలసిన ప్రమాణాలుగా, మానవ హక్కుల ప్రకటన గుర్తించబడింది. విశ్వాసాలను వుంచుకునే స్వేచ్ఛను, వాటిని వ్యక్తీకరించే స్వేచ్ఛను, ఆకలినుండి భయం నుండి స్వేచ్ఛను మానవులు అనుభవించగల ప్రపంచాన్ని సాధించడం మానవ హక్కుల ప్రకటన లక్ష్యం. ఈ నాలుగు రకాల స్వేచ్ఛలను సాధించడం, సామాన్య

మానవుల అత్యున్నత లక్ష్యంగా ప్రకటించబడింది. హక్కుల ప్రకటనలోని ప్రవేశిక సామ్యవాద, ఉదారవాద ఆలోచనలను ప్రతిబింబిస్తుంది. సమాజంలోని ప్రతివ్యక్తి, సంస్థ ఈ హక్కుల పట్ల గౌరవాన్ని పెంపొందించాలి. అంతర్జాతీయంగా ఈ హక్కులకు గుర్తింపు వచ్చేలా ఆచరణలో అమలు అయ్యేట్లు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

## 6.1.1 అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన

మానవ హక్కుల ప్రకటనలో 30 అధికరణలు వున్నాయి. మానవులందరూ స్వేచ్ఛా జీవులని, హక్కులలోను, ఔన్నత్యంలోనూ సమానులని మొదటి అధికరణ అంటుంది. మానవులు నైతిక స్పృహతోను, హేతు బద్ధంగాను ఆలోచించగలరని భావిస్తుంది. రంగు, భాష, జాతి, మత, రాజకీయ, సామాజిక, ఆస్తి, పుట్టుకలాంటి వివిధ రకాల తేడాలకు అతీతంగా మానవ హక్కుల ప్రకటనలోని అన్ని హక్కులు అందరికి వర్తిస్తాయి.

ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ పొందే హక్కు, జీవించే హక్కు రక్షణ పొందే హక్కు వుంటుందని మూడవ అధికరణ పేర్కొంది. అన్ని రూపాలలో వున్న బానిసత్వాన్ని, బానిస వ్యవస్థను నిషేధించింది. క్రూరమైన, అమానవీయమైన, నీచమైన శిక్షకు ఎవ్వరినీ గురి చేయడానికి వీలులేదు.

ప్రతి ఒక్కరికి చట్టం నుండి రక్షణ, గుర్తింపు పొందే హక్కు వుంటుంది. అందులో విచక్షణకు తావుండకూడదు అంటాయి ఆరు, ఏడు అధికరణలు. అన్యాయంగా ఎవరినీ అరెస్టు చేయరాదని, నిర్బంధించరాదని, ప్రవాసానికి పంపరాదని తొమ్మిదవ అధికరణ తెలుపుతుంది. ప్రభుత్వాలు, భిన్నమైన రాజకీయ విశ్వాసాలు వున్న వారి పట్ల ఉద్దేశపూర్వకంగా ఇలాంటి అణచివేత చర్యలకు పాల్పడటం వాస్తవం కావటం వల్ల ఈ మానవ హక్కుల ప్రకటనకు దారితీసిందని మనం గుర్తుంచుకోవాలి.

ఎవరిపైనైనా నేరారోపణ జరిగినప్పుడు, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించగల వారిచేత బహిరంగ విచారణ చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద వుంటుంది. నేరారోపణ రుజువు కానంత వరకు నిందితుడిని నిర్దోషిగానే పరిగణించాలి. కొత్తగా తెచ్చిన చట్ట ప్రకారం, ఆ చట్టం వునికిలో లేనప్పుడు చేసిన చర్యలకు ఏ వ్యక్తినీ నేరస్థునిగా పరిగణించరాదు. 10, 11వ అధికరణల ప్రకారం నేరారోపణ జరిగిన సమయాలలో అమలులో వున్న శిక్షల కన్నా ఎక్కువ శిక్షలను ఎవరికి వేయడానికి వీలులేదు.

మనుష్యుల వ్యక్తిగత జీవితంలో, కుటుంబ వ్యవహారాలలో, గృహంలో, ఉత్తర ప్రత్యుత్తరాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడాన్ని మానవ హక్కుల ప్రకటన 12వ అధికరణలో నిషేధించింది. గౌరవ ప్రతిష్టలకు భంగం కల్గించే జోక్యానికి వ్యతిరేకంగా రక్షణ పొందే హక్కు ప్రతి ఒక్కరికి వుంది. ఒక దేశపు ఎల్లల పరిధిలో ఎక్కడికైనా ప్రయాణించే హక్కు, ఎక్కడైనా నివాసం ఏర్పరచుకొనే హక్కు ప్రతి ఒక్కరికి వుంటుందని 13, 14వ అధికరణలు పేర్కొంటాయి. రాజకీయ వేధింపులనుండి రక్షణ పొందే నిమిత్తం, ఏదేశంలోనైనా ఆశ్రయం కోరి, ప్రవాసం వెళ్లిపోయే హక్కు ప్రతి ఒక్కరికి వుంటుంది. ఒక జాతీయతకు చెందిన వారికి గుర్తింపు పొందడానికి, తన జాతీయతను మార్చుకోవడానికి ప్రతి వారికి హక్కు వుంటుంది.

జాతిమత భేదాల పరిమితి లేకుండా, నిర్ణీత వయస్సు దాటిన స్త్రీ పురుషులందరికి వివాహం చేసుకొనే హక్కు, కుటుంబాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు, వివాహం చేసుకోడానికైనా, దానిని రద్దు చేసుకోడానికైనా హక్కు వుంటుంది. వివాహ వ్యవస్థలోకి పూర్తి అంగీకారంతో, స్వేచ్ఛగా ప్రవేశించవచ్చు. అలాగ ఏర్పడిన కుటుంబానికి సమాజం నుండి, రాజ్యం నుండి రక్షణ పొందే హక్కు వుంటుంది. (16వ అధికరణ).

ప్రతి ఒక్కరికి ఆస్తిని సంపాదించుకునే హక్కు, దానికి రక్షణ పొందే హక్కు వుంది. భావ వ్యక్తీకరణను స్వేచ్ఛగా చేసే హక్కు, తనకు నచ్చిన మతాన్ని, నైతికతను నమ్మి, ఆచరించి, బోధించే హక్కులకు మానవ హక్కుల ప్రకటన హామీనిస్తుంది. ప్రతి ఒక్కరు తన మతాన్ని మార్చుకొనే హక్కును కలిగి వుంటారు.

BRAOU

## 6.2 రాజకీయ హక్కులు

మానవ హక్కుల ప్రకటనలోని 19, 20, 21వ అధికరణలు రాజకీయ హక్కులకు సంబంధించినవి. అధికరణ 19 ప్రకారం ప్రతి ఒక్కరికి అభిప్రాయాలను కలిగి వుండే స్వేచ్ఛ, వ్యక్తీకరించే స్వేచ్ఛ వుంది. ఇతరులతో జోక్యం చేసుకోకుండా, అభిప్రాయాలను కల్గి వుండడం, అభిప్రాయాలను, సమాచారాన్ని ఏ సాధనం ద్వారానైనా ఇచ్చిపుచ్చుకోవడం ప్రచారం చేసుకోవడం అనేవి పై హక్కులలో భాగమే. ఈ హక్కుకు సరిహద్దుల పరిమితి లేదు. శాంతియుతంగా గుమిగూడే, స్వేచ్ఛ, కలిసి వుండే హక్కు వుంటుంది. 21వ అధికరణ ప్రకారం ప్రతి ఒక్కరికి తన దేశ ప్రభుత్వ కార్యకలాపాలలో పాలుపంచుకొనే హక్కు వుంటుంది. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగంలో చేరడానికి అందరితోపాటు సమాన హక్కు వుంటుంది.

## 6.3 సాంఘిక, ఆర్థిక హక్కులు

సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల మధ్యనున్న అంతర్గత సంబంధాన్ని మానవ హక్కుల ప్రకటన గుర్తిస్తుంది. ప్రతి ఒక్కరికి సాంఘిక బాధ్యతను కోరుకునే హక్కు వుంటుందని 22వ అధికరణ అంటుంది. వ్యక్తియొక్క మూర్తిమత్వ (personality) అభివృద్ధికి, గౌరవానికి కావలసిన సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులను పొందే హక్కు ప్రతి ఒక్కరికి వుంటుంది. ప్రతి ఒక్కరికి పని చేసే హక్కు, తనకు నచ్చిన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొనే హక్కు, న్యాయబద్ధమైన పని పరిస్థితులు కలిగి వుండే హక్కు, నిరుద్యోగ పరిస్థితులనుండి భద్రత కోరే హక్కు వుంటుందని 23వ అధికరణ అంటుంది. ఉద్యోగుల ప్రయోజనాలు పరిరక్షించడానికి కార్మిక సంఘాలలో చేరే హక్కు, నెలకొల్పుకొనే హక్కులు ప్రధానమైనవి. సరియైన పని పరిస్థితులను కలిగి వుండే హక్కులో భాగంగా ఉద్యోగుల విశ్రాంతి పొందే హక్కును చేర్చబడింది. వివిధ పరిస్థితులలో పనిచేసే వివిధ రకాల ఉద్యోగుల ప్రత్యేక హక్కులకు సంబంధించి 25వ అధికరణ ముఖ్యమైనది. వ్యక్తిగత, కుటుంబ సంక్షేమ అవసరాలను తగినంతగా తీర్చగల ప్రామాణిక జీవనానికి ప్రతి ఒక్కరు అర్హులు. తిండి, బట్ట, గృహము, వైద్య సౌకర్యము, సామాజిక సేవలు లాంటి అన్ని హక్కులను జీవన స్థాయిలో (Standard of living) భాగంగా పరిగణించాలి. వ్యక్తిగతంగా తమ అదుపులో లేని కారణాల రీత్యా నిరుద్యోగులైన వారికి, అనారోగ్యంలో వున్న వారికి, అవిటివారికి, భర్త మరణించి అసహాయ స్థితిలో వున్న వారికి, ముసలి తనంలో వున్న వారికి సామాజిక రక్షణ పొందే హక్కు వుంటుంది. మాతృత్వం పట్ల, బాల్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచ వలసి వుంటుంది.

మానవ హక్కుల ప్రకటనలోని 26, 27 అధికరణలు సాంస్కృతిక, విద్యా హక్కుల గురించి చర్చిస్తాయి. విద్య ప్రతివారి హక్కు. సాంకేతిక, వృత్తిపరమైన విద్యను ప్రతివారికి అందుబాటులో వుండాలి. మానవ హక్కుల పట్ల, ప్రాథమిక స్వేచ్ఛ పట్ల గౌరవాన్ని పెంపొందించేదిగా విద్య ఉండాలి. ప్రజల సాంస్కృతిక జీవనంలో పాల్గొంటూ మూర్తిమత్వ అభివృద్ధి హక్కు ప్రతి ఒక్కరికి వుంటుంది. (29వ అధికరణ)

## 6.4 పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందం

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలో సంక్షిప్తంగా గుర్తించబడిన హక్కులకు విస్తృతమైన రూపం ఇవ్వాల్సిన అవసరం వుండడంతో 1966 డిసెంబర్‌లో ఐక్యరాజ్య సమితి రెండు ఒప్పందాలను ఆమోదించింది. అందులో మొదటిది పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందం. రెండవది సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం. మొదటి ఒప్పందం 1976 మార్చిలో అమలులోకి వచ్చింది.

BRAOU

మానవులందరూ హక్కులలోను, ఔన్నత్యంలోను సమానులు, స్వేచ్ఛాజీవులు అనే మానవ హక్కుల ప్రకటన ప్రాతిపదికనే ఈ అంతర్జాతీయ ఒప్పందానికి కూడా మూలం. మానవ హక్కుల ప్రకటన వూహించిన స్వేచ్ఛా మానవుడు అనే ఆదర్శాన్ని సాధించడానికి కావలసిన పౌర, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితుల గురించి ఈ ఒప్పందాలు చర్చిస్తాయి.

ఈ ఒప్పందంలో ఐదు భాగాలున్నాయి. మొదటి భాగం స్వయం నిర్ణయాధికారాన్ని గురించి చర్చిస్తుంది. అన్ని ప్రాంతాల, దేశాల ప్రజలకు స్వయం నిర్ణయాధికారం వుందని ఈ ప్రకరణ ప్రకటించింది. తమ రాజకీయ పరిస్థితిని స్వేచ్ఛగా నిర్ణయించుకొనే హక్కు, తమ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధిని కొనసాగించుకొనే హక్కు వుంటుంది. తమ దేశ సహజ సంపదను, వనరులను ఎటువంటి అంతర్జాతీయ వత్తిడికి లోను కాక తమకు నచ్చిన విధంగా వుపయోగించుకోవచ్చును. ఎట్టి పరిస్థితులలోను ప్రజలకు వారి జీవనాధారాన్ని నిరాకరించకూడదు. ఈ ఒప్పందానికి సంతకం చేసిన అన్ని దేశాలు, ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును పొందే విధంగా కృషి చేయాలి. ఒప్పందంలో గుర్తించబడిన అన్ని హక్కులను గౌరవించడమే కాక, వాటిని ప్రజలు అనుభవించడానికి అన్ని భాగస్వామ్య పక్షాలు హామీనివ్వాలి. ఈ హక్కులను ప్రజలకు ఇచ్చే క్రమంలో, లింగ, భాష, జాతి, మత, ఆస్తి, పుట్టుక, రాజకీయ పక్షపాతాలకు అతీతంగా రాజ్యం వ్యవహరించాలి. ఈ హక్కులను అమలు చేయడానికి తీసుకోవలసిన చర్యల సందర్భంగా రాజ్యాంగ క్రమాన్ని అనుసరించాలి. ప్రభుత్వాధికారులవల్లనైనా సరే ఈ హక్కుల ఉల్లంఘన జరిగినట్లయితే సత్వరమే ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలి. హక్కులను పొందడానికి చట్టబద్ధమైన చర్యలను రూపొందించి, అమలు అయ్యేట్లు చూడాలి. హక్కుల ఉల్లంఘన వలన బాధించబడ్డ వారికి సత్వరమే న్యాయ పరిష్కారం పొందే అవకాశాన్ని రాజ్యం కల్పించాలి. ఈ పరిష్కారాలను అమలు చేయడానికి తగిన యంత్రాంగాన్ని రూపొందించవలసిన బాధ్యత రాజ్యానిదే. ఒప్పందంలో పొందుపరచిన పౌర, రాజకీయ హక్కులను స్త్రీపురుషులు సమానంగా అనుభవించడానికి కావలసిన చర్యలు రాజ్యాలు తీసుకోవాలి.

యుద్ధకాలంలో లేక ఇతర అత్యయిక సమయాలలో పరిస్థితులు విషమించిన మేరకు రాజ్యాలు తమ బాధ్యతలనుండి వైదొలగవచ్చు. అలా బాధ్యతల నుండి వైదొలగిన సందర్భాలలో, ఐక్యరాజ్య సమితి కార్యదర్శి ద్వారా, ఇతర రాజ్యాలకు ఆ విషయాన్ని తెలియజేయాలి. అంతేకాదు, ఒప్పందంలోని ఏ అంశాలనుండి తాత్కాలికంగా తప్పుకుంటున్నది. ఏ కారణాల రీత్యా తప్పుకుంటున్నది వివరించాలి. కాని ఏ రాజ్యము కూడా, జీవించే హక్కు క్రూర, అమానవీయ శిక్షల నుండి రక్షణ పొందే హక్కు, బానిసత్వానికి వ్యతిరేకంగా రక్షణ పొందే చట్టం ముందు గుర్తింపు పొందే హక్కులాంటి ప్రాథమిక హక్కులను కాపాడే బాధ్యత నుండి తప్పుకోవడానికి వీలులేదని ఆరవ అధికరణ వెల్లడించింది.

## 6.5 మరణ శిక్ష

ప్రతి మనిషికి జీవించే హక్కు సహజంగా వుంటుందని ఈ ఒప్పందం అంటుంది. ఈ జీవించే హక్కును చట్టం రక్షించాలి. కాని మరణ శిక్షను రద్దు చేయని దేశాల పట్ల ఒప్పందం మెతక వైఖరి అవలంబించింది. క్రమంగా మరణ శిక్షను రద్దు చేయాలని ఒప్పందానికి సంతకం పెట్టిన దేశాలను కోరుతూనే, తీవ్రమైన నేరాలకు ఆ దేశాలు మరణ శిక్ష విధించవచ్చని, కాని బాల నేరస్థులు, గర్భిణి స్త్రీలు చేసిన నేరాలకు మరణ శిక్ష విధించరాదని పేర్కొంటుంది.

ఖైదీల పట్ల క్రూరమైన, అమానుషమైన, నీచమైన విధానాలను, శిక్షలను ఈ ఒప్పందం నిషేధించింది. మనుషుల మీదవైద్య, శాస్త్ర పరమైన ప్రయోగాలను నిర్వహించడాన్ని పూర్తిగా వ్యతిరేకించింది. అన్ని రూపాలలో వున్న బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని నిషేధించింది. ఈ ఒప్పందం వెట్టి చాకిరిని, బల వంతపు శ్రమను రద్దు చేసింది.

# 6.6 నిర్బంధితుల హక్కులు

వ్యక్తులను చట్ట బద్ధంగా నిర్బంధించే పద్ధతుల గురించి తొమ్మిదవ అధికరణ చర్చిస్తుంది. స్వేచ్ఛగా వుండే హక్కు, భద్రత పొందే హక్కు ప్రతి ఒక్కరికి వుంటుంది. ఎవరినీ సరియైన కారణాలు లేకుండా నిర్బంధించరాదు. చట్ట ప్రకారం రూపొందించబడిన కారణాలతో, పద్ధతులతో మాత్రమే ఎవరి స్వేచ్ఛనైనా హరించవచ్చు. ప్రజాస్వామ్య సూత్రమైన న్యాయ విచారణాక్రమాన్ని (due procedure of law) చట్టాలే ఉల్లంఘిస్తే ఏం చేయాలి? చట్టాలు ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం రూపొందితేనే అవి ప్రజల హక్కులను పరిరక్షించగల్గుతాయి. చట్టాలు నాటికవే ప్రజాస్వామిక లక్షణాలను కల్గివుంటాయని ఒప్పందం భావిస్తున్నట్టు కనిపిస్తుంది.

ఏ వ్యక్తినైనా నిర్బంధిస్తే, అతని నిర్బంధానికి గల కారణాలను వెంటనే వెల్లడిచేయాలి. అతని మీద వున్న ఆరోపణలను అతనికి తెలియజేయాలి. తక్షణమే న్యాయాధికారి ముందు అతన్ని ప్రవేశ పెట్టాలి. నిర్బంధించబడిన వారికి విచారణ త్వరగా పూర్తి చేయమని కోరే హక్కు వుంటుంది. లేకపోతే విడుదలయ్యే హక్కు వుంటుంది. విచారణ ఎదుర్కొంటున్న వారు నిర్బంధంలో వుండి తీరాలన్న నిబంధనేమీ లేదు. చట్ట విరుద్ధంగా నిర్బంధానికి గురైన వ్యక్తికి నష్టపరిహారం పొందే హక్కు ఉంటుంది.

నిర్బంధితుల పట్ల వ్యవహరించవలసిన తీరుగురించి ఒప్పందంలోని 10వ అధికరణ చర్చిస్తుంది. వ్యక్తిలోని ఔన్నత్యం పట్ల గౌరవం తోనూ, మానవత్వం తోనూ వ్యవహరించాలి. బాల నేరస్థులను, ఖైదీలను శిక్షించడం కాక, పునరావాసం కల్పించి, సంస్కరించాలని ఒప్పందం అంటుంది. చేసుకున్న ఒప్పందంలోని షరతులను పాటించలేనందుకు ఎవరినీ నిర్బంధించకూడదు. (14వ అధికరణ)

న్యాయ వ్యవస్థ ముందు, కోర్టుల ముందు సమానత్వపు హక్కు గురించి చర్చిస్తుంది. నేరారోపణకు గురైన ప్రతి ఒక్కరూ, చట్టం ద్వారా ఏర్పరచబడిన సమర్థవంతమైన, స్వతంత్రమైన, నిష్పక్షికమైన న్యాయ వ్యవస్థద్వారా బహిరంగ న్యాయవిచారణకు అర్హులు. నైతిక, జాతీయ ప్రయోజనాలు, శాంతి భద్రతలకు రక్షణ అవసరం అనిపిస్తే, రహస్య విచారణ జరిపించవచ్చు. తన నేరారోపణ రుజువయ్యే వరకు, తనను అమాయకులుగానే పరిగణించాలనే హక్కు నిందితుడికి వుంటుంది. ఒక వ్యక్తిపై వచ్చిన నేరారోపణలోని వాస్తవాన్ని నిర్ధారించడానికి ఈ క్రింది కనీస ప్రమాణాలను పాటించాలి:

1. నేరారోపణకు గల కారణాలను, దాని స్వభావాన్ని నిందితుడు అర్థం చేసుకోగల భాషలో వివరణాత్మకంగా, వెంటనే తెలియజేయాలి.
2. నిందితునికి నచ్చిన న్యాయవాదిని నియమించుకోడానికి తన వాదన వినిపించడానికి తగిన సమయము కోరే హక్కుండాలి.
3. విపరీతమైన జాప్యం లేకుండా విచారణ జరగాలని కోరుకునే హక్కు నిందితునికి వుండాలి.
4. స్వంత ఖర్చులతో న్యాయవాదిని నియమించుకొనే స్తోమత లేని వారికి, న్యాయసహాయాన్ని పొందవచ్చని తెలియ జేయబడే హక్కు ఉంటుంది.
5. న్యాయస్థానంలో మాట్లాడే భాషను అర్థం చేసుకోలేనట్లయితే, నిందితునికి వివరంగా చెప్పేవారు వుండాలి.
6. నేరాన్ని ఒప్పుకోమని లేక తనకు వ్యతిరేకంగా తననే సాక్ష్యం ఇవ్వమని ఎవరినీ బలవంతం చేయరాదు.

క్రింది న్యాయస్థానంలో నిర్ధారించిన నేరాన్ని శిక్షను పై న్యాయస్థానంలో సమీక్ష జరిపించుకునే హక్కు చట్ట ప్రకారం ప్రతి ఒక్కరికి వుంటుంది. కొంత శిక్షను అనుభవించిన తరువాత, నిందితుడు నిర్దోషి అని న్యాయస్థానంలో తేలితే, నష్టపరిహారం కోరే హక్కు వుంటుంది. చట్ట ప్రకారం నేరస్థుడని కాని, నిర్దోషి అని కాని తేలిన తరువాత తిరిగి విచారణ జరిపించరాదు.

BRAOU

## 6.7 భావ వ్యక్తీకరణ హక్కు

తమకు నచ్చిన మతాన్ని, భావాలను, అంతరాత్మను (conscience) అనుసరించే స్వేచ్ఛ కలిగి వుండే హక్కుకు ఈ ఒప్పందంలోని 18వ అధికరణ హామీనిస్తుంది. చట్టం సూచించిన పరిమితులకు లోబడి ఈ స్వేచ్ఛలను ప్రతి ఒక్కరు అనుభవించవచ్చు. ప్రజల భద్రతను, ఆరోగ్యాన్ని, నైతికతను, ప్రాథమిక హక్కులను, ఇతరుల స్వేచ్ఛను పరిరక్షించడానికి ఈ పరిమితులు కొంత వరకు అవసరం. అదే విధంగా తమ భావాలు కలిగి వుండే హక్కును వ్యక్తీకరించే హక్కును కూడా జాతీయ భద్రతకు, ప్రజల సంక్షేమానికి భంగకరంగా వుండకుండా కొన్ని పరిమితులకు లోబడి అనుభవించవచ్చు.

ఈ మధ్యకాలంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి కొత్త వాదనలు-సమంజసమైనవి-వినిపిస్తున్నాయి. అత్యయిక పరిస్థితులలోను, యుద్ధ కాలాలలోను, సాధారణంగా భావ వక్తీకరణ స్వేచ్ఛమీద పరిమితులు విధించబడతాయి. అట్టి సందర్భాలలో గందరగోళము, అనిశ్చిత పరిస్థితులు వుంటాయి. సాధారణ సమయాలలోకన్నా, అత్యవసర (emergency) పరిస్థితులలో, జరుగుతున్న పరిణామాల పట్ల స్పష్టత వుండడానికి, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఎక్కువ అవసరం. గందరగోళాన్ని అస్పష్టతను చర్చకు పెట్టక దాచి వుంచితే, పరిస్థితుల పట్ల స్పష్టత ఏర్పడదు.

శాంతియుతంగా గుమిగూడే హక్కును, సంస్థలను ఏర్పాటు చేసుకొనే హక్కును, వివాహం చేసుకొనే హక్కును, పిల్లలు సమాజం నుండి రక్షణ పొందే హక్కును ఈ అంతర్జాతీయ ఒప్పందం గుర్తిస్తుంది. వోటు వేసే హక్కును, ఎన్నిక కాబడే హక్కును, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే హక్కును ఒప్పందంలోని 25 అధికరణ గుర్తిస్తుంది. ఎటువంటి విచక్షణ లేకుండా పౌరులందరూ ఈ హక్కులకు, అవకాశాలకు అర్హులని ఒప్పందం అంటుంది.

చట్టం ముందు అందరూ సమానులేనని, చట్టం ద్వారా సమానంగా రక్షణ పొందే హక్కు ప్రతివారికి వుంటుందని ఒప్పందం తెలుపుతుంది. జాతి, మత, భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలు వున్న దేశాలలో, వారి సంస్కృతిని, మతాన్ని, భాషను వారు అనుసరించకుండా నిషేధించరాదు. వాటిని పాటించే హక్కు వారికుంటుంది. (27వ అధికరణ)

## 6.8 ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం

ఇంతకు ముందు చెప్పినట్లుగా ఈ ఒప్పందాన్ని 1966లో ఐక్యరాజ్యసమితి ఆమోదించినప్పటికి, 1976లో మాత్రమే అమలులోకి వచ్చింది. పై ఒప్పందంలాగే, ఈ ఒప్పందమూ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులను అనుభవించడానికి అనువైన పరిస్థితులను సృష్టించడం అవసరమని తన ప్రవేశికలో గుర్తించింది. మానవులకున్న సహజమైన ఔన్నత్యం (inherent dhignity) నుండే ఈ హక్కులు పుట్టాయని అంటుంది. మానవుల స్వేచ్ఛల పట్ల, హక్కుల పట్ల గౌరవం పెంపొందించే బాధ్యతని రాజ్యాలు తీసుకోవాలని అంటుంది. తన అధీనంలో వున్న వనరులను ఉపయోగించి, ఒప్పందంలో గుర్తించిన హక్కులు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఈ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వాలు చట్టాలు చేయాలి. ఈ ఒప్పందంలో పొందుపర్చిన అన్ని ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులను స్త్రీ పురుషులు సమానంగా అనుభవించేలా చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి.

## 6.9 ఆర్థిక హక్కులు

పని చేయడం ద్వారా జీవనాధారాన్ని సంపాదించుకొనే అవకాశం ప్రతివారికి వుండాలి. నచ్చిన పనిని ఎంచుకునే, అంగీకరించే హక్కు ప్రతివారికి వుంటుంది. ఈ హక్కును పరిరక్షించుకోడానికి, తగిన చర్యలు తీసుకొనే హక్కు ప్రతివారికి వుంటుంది. ఉత్పాదకత (productive) కలిగిన పనిని సాధించడానికి, కావల్సిన సాంకేతిక, వృత్తి పరమైన శిక్షణను, సూచనలను కార్మికులకు అందించాలి.

DR. B.R.A.O.U

న్యాయమైన, అనుగుణమైన పని పరిస్థితులను కలిగి వుండే హక్కు ఆర్థిక హక్కుల్లో భాగమే! సమానమైన విలువ కల్గిన పనికి, సమానమైన వేతనాన్ని అందరి కార్మికులకు-ఎటువంటి భేదం చూపకుండా ఇవ్వాలి. పురుషులతో సమానమైన వేతనానికి, పని పరిస్థితులకు స్త్రీలకు హామీనివ్వాలి. తాము, తమ కుటుంబాలు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణంలో జీవించడానికి కావలసిన పని పరిస్థితులు వుండాలి. చేస్తున్న పనిలో, ఉద్యోగంలో పై స్థాయికి ఎదగడానికి అందరికి సమాన అవకాశాలు వుండాలి. జాతీయ సెలవుదినాల్లో జీతం పొందే హక్కు, జీతంతో కూడిన సెలవులు, పరిమిత పనిగంటలు, విశ్రాంతి లాంటివన్ని న్యాయమైన పని పరిస్థితులు కలిగి వుండే హక్కులో భాగమే!

ప్రతి కార్మికుడికి, తనకు నచ్చిన కార్మిక సంఘంలో చేరే హక్కు వుంటుంది. కార్మిక సంఘాలకు, జాతీయ సమాఖ్యలను ఏర్పరుచుకొనే హక్కు వుంటుంది. చట్ట పరిమితులకు లోబడి సమ్మెకు పిలుపునిచ్చే హక్కు కార్మిక సంఘాలకు వుంటుంది. సైన్యాలకు, పోలీసులకు వున్న ఈ హక్కు మీద చట్టబద్ధంగా పరిమితులు ఆయా ప్రభుత్వాలు విధించటానికి ఈ ఒప్పందం అంగీకరించింది.

## 6.10 సాంఘిక హక్కులు

సాంఘిక ధీమాతో కూడిన సాంఘిక భద్రతా హక్కును 9వ అధికరణ గుర్తిస్తుంది. తల్లుల, పిల్లల, పిన్నవయస్కుల హక్కులను 10వ అధికరణ చర్చిస్తుంది. కుటుంబాన్ని ఏర్పరచుకునే హక్కు ప్రతివారికి వుంటుంది. పిల్లల విద్య, వైద్య సంక్షేమాల్ని చూడాల్సిన కుటుంబాన్ని, సమాజంలోని ప్రాథమిక వ్యవస్థగా గుర్తించబడింది. పిల్లలకు జన్మనిచ్చే ముందు ఆ తరువాత కొంతకాలం తల్లులు ప్రత్యేకమైన రక్షణ పొందే హక్కు వుంటుంది. సాంఘిక భద్రతా ప్రయోజనాలతో కూడిన సెలవులను తగినంతగా పనిచేసే తల్లులకు ఇవ్వాలి. సాంఘిక, ఆర్థిక దోపిడినుండి పిల్లలను, పిన్న వయస్కులను సంరక్షించాలి. ప్రమాదకర వాతావరణంలో పిల్లలను పనిచేయించకుండా చూడడానికి కావలసిన చట్టబద్ధ చర్యలను ప్రభుత్వాలు తీసుకోవాలి. ఏ వయస్సులోపు పిల్లలు పనిచేయకూడదో నిర్ణయించాలి. పిల్లలను ఉద్యోగాలలో చేర్చుకున్న వారిని శిక్షింప బడేలా చూడాలి.

BRAOU

తగినంత జీవనాధారాన్ని పొందే హక్కు ప్రతివారికి వుంటుందని ఒప్పందంలోని 11వ అధికరణ అంటుంది. తగినంత ఆహారం, బట్ట, గృహవసతి కలిగి వుండే హక్కు, నిరంతరంగా జీవన పరిస్థితులను మెరుగు పరచుకునే హక్కు ప్రతి ఒక్కరికి వుండాలి. ఈ హక్కులన్ని జీవన ప్రమాణాన్ని సాధించే హక్కులో భాగం. ఈ హక్కులు ఆచరణలోకి వచ్చేలా ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి. ఆహార ఉత్పత్తులు, నిల్వలు, పంపిణీ పద్ధతుల మెరుగుదలకు ప్రభుత్వం కృషి చేయాలి. సహజ వనరుల వినియోగాన్ని, అభివృద్ధిని సమర్థవంతంగా వుపయోగించుకోడానికి అనువైన విధంగా వ్యవసాయిక సంస్కరణలను చేపట్టాలి. సమాన ఆహార పంపిణి సాధించడానికి, ఆహార పంపిణీని దెబ్బతీయని విధంగా వుండేటట్లు ఎగుమతి, దిగుమతి విధానాలను రూపొందించాలి.

ఉన్నతమైన శారీరక, మానసిక ఆరోగ్య ప్రమాణాలను కలిగి వుండే హక్కు ప్రతివారికి వుండాలని ఒప్పందం చెపుతుంది. పిల్లల ఆరోగ్యకరమైన అభివృద్ధికి శిశు మరణాల రేటును తగ్గించాలి. పారిశ్రామిక, పర్యావరణ పరిశుభ్రతను పెంపొందించాలి. ఆరోగ్యం కలిగి వుండే హక్కులో భాగంగా, అంటువ్యాధులను నివారించే, అదుపుచేసే బాధ్యతను ప్రభుత్వాలు చేపట్టాలి.

ప్రతి ఒక్కరి విద్య హక్కును ఈ అంతర్జాతీయ ఒప్పందం గుర్తిస్తుంది. మనుషులు తమ ఔన్నత్యాన్ని, మూర్తిమత్వాన్ని సాధించడానికి విద్యా హక్కు తప్పనిసరని భావించింది. మానవ హక్కుల పట్ల స్వేచ్ఛల పట్ల గౌరవాన్ని పెంపొందించడానికి విద్య అవసరం. ప్రతి ఒక్కరి ప్రాథమిక, నిర్బంధ విద్య పట్ల ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి. ఉన్నత విద్య అందరికీ క్రమంగా, ఉచితంగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. స్కూళ్ల వ్యవస్థ ఏర్పాటు, ఉపకారవేతనాలు

ప్రకటించడం, బోధనకు కావలసిన పరిస్థితులను కల్పించడం లాంటివి విద్యాహక్కును పరిరక్షించడానికి అవసరం. తమ విశ్వాసాలకు అనుగుణంగా, తమ పిల్లలకు మతపరమైన, నైతిక పరమైన విద్యను అందించే అవకాశం తల్లిదండ్రులకు వుంటుందని ఈ ఒప్పందం అంటుంది.

# 6.11 సాంస్కృతిక హక్కులు

ప్రతి ఒక్కరు సాంస్కృతిక జీవితంలో పాలు పంచుకొనే హక్కును 15వ అధికరణ గుర్తిస్తుంది. శాస్త్రీయ ప్రగతి, దాని ఆచరణ వలన వచ్చే ప్రయోజనాలను అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికి వుంటుంది. శాస్త్రీయతను, సంస్కృతిని అభివృద్ధి పరచి, ప్రచారం చేసి ఈ హక్కును ఆచరణలో సాధించేటట్లు చూడాలి. సృజనాత్మక కార్యకలాపాలను, శాస్త్రీయ పరిశోధనను చేపట్టే హక్కు ప్రతి వారికి వుంటుంది.

# 6.12 సారాంశం

మానవహక్కులపట్ల గౌరవాన్ని, ఆచరణను పెంపొందించడానికి అన్ని దేశాల ప్రభుత్వాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ ఒప్పందాలను చేసుకున్నాయి. ఈ ఒప్పందాలలోని, ప్రకటనలలోని అధికరణాలను ఆయా దేశాల ప్రభుత్వాలు ప్రజలను పాలించే క్రమంలో పాటించవలసిన, అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాలుగా భావించబడ్డాయి. ఈ హక్కులన్నీ వివిధ దేశాలలోని చట్టాల పరిమితులకు లోబడి మాత్రమే ప్రజలు అనుభవించగల్గుతారు.

ప్రతి హక్కు ఒక న్యాయబద్ధమైన, సహజమైన భావనగా రూపుదిద్దుకొనే శతాబ్దాల క్రమం వెనుక ఒక నిర్దిష్ట, స్పష్టమైన నేపథ్యం వుంది. ప్రజల జీవితాలకు చెందిన ప్రతి అంశంమీద వివిధ రకాల ఆధిపత్య శక్తులు పరిధిని, పరిమితులను విధించాయి. స్వేచ్ఛగా, గౌరవంగా జీవించాలని కాంక్షించిన ప్రజలు అన్ని రకాల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా రక రకాల దేశాలలో పోరాటాలు చేసి హక్కులను సంపాదించుకున్నారు. ఇంకా చాలా రకాల హక్కులను ఆచరణలో సాధించవలసి వుంది. ఈ చారిత్రక నేపథ్యాన్ని, పోరాటాలను గుర్తించడమే ఈ అంతర్జాతీయ ఒప్పందాలు, ప్రకటనలు చేసిన పని. అంతే కాని ఈ ప్రకటనల, ఒప్పందాల వలన మాత్రమే హక్కులు వునికిలోకి వచ్చాయని భావించనవసరం లేదు. అయినా ఇలా రాజ్యాలు హక్కులను నిర్దిష్టంగా గుర్తించడం కూడా హక్కుల సాధనలో ఒక ముందడుగే!

BRAOU

# 6.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానం రాయండి!**

1. మానవ హక్కులకు మూలం ఏమిటి?
2. నేరారోపణ చేయబడిన వ్యక్తి యొక్క చట్టబద్ధ హక్కులేమిటి? నేరారోపణ చేయబడిన వ్యక్తిపట్ల ప్రభుత్వాల బాధ్యతలేమిటి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. అత్యయిక పరిస్థితులలో రాజ్యం తన విధులనుండి ఏ మేరకు తప్పుకోవచ్చునో వివరింపుము.
2. సాంఘిక, ఆర్థిక హక్కులేవి? వివరింపుము.

## 6.14 సంప్రదింపు గ్రంథాలు

Some Basic International Document on Human Rights and Refuges. UNHCR, New Delhi. India, 1995.

రచయిత : కె. మురళి
పరిశోధక విద్యార్థి, రాజనీతి శాస్త్ర విభాగం,
సెంట్రల్ యూనివర్శిటి, హైదరాబాద్.

## 6.15 Glossory

| | |
|---|---|
| Convenient | -ఒడంబడిక |
| Standard of life | -జీవన స్థాయి, జీవిత ప్రమాణం. |
| Motherhood | -మాతృత్వం |
| Right to Express | -వ్యక్తీకరించే హక్కు |
| Right to peaceful assembly | -శాంతియుతంగా గుమిగూడే హక్కు |

BRAOU

# భాగం 7: ఖైదీల మానవ హక్కులు

## విషయ క్రమం


7.0 ఉద్దేశం

7.1 పరిచయం

7.2 ఖైదీల పట్ల అనుసరించవలసిన కనీస ప్రమాణిక సూత్రాలు

- 7.2.1 శారీరక శిక్షల రద్దు
- 7.2.2 సక్రమ పని పరిస్థితులు పొందే హక్కు
- 7.2.3 విచారణలోవున్న ఖైదీల హక్కులు

7.3 ఖైదులో కాని, లేక ఎటువంటి నిర్బంధంలో నైనా వున్న వారి రక్షణ కొరకు సూత్రాలు

7.4 చిత్ర హింసలు, క్రూర, అమానవీయ, నీచ శిక్షలనుండి పరిరక్షణ ప్రకటన

- 7.4.1 నష్ట పరిహార హక్కు

7.5 ముగింపు

7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

7.7 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

## 7.0 ఉద్దేశం

ఖైదీల హక్కుల గురించి వర్ణించడానికి ఈ అధ్యాయం ప్రయత్నిస్తుంది. ఖైదీల హక్కుల తాత్విక భూమిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ అధ్యాయం చదివిన తరువాత విద్యార్థికి ఈ క్రింది విషయాల పట్ల అవగాహన పెరుగుతుంది.

- ❖ ఖైదీల హక్కుల భూమికను,
- ❖ ఖైదీల చట్టబద్ధస్థాయిని, వివిధ రకాల హక్కులను,
- ❖ వాళ్ల హక్కుల పట్ల చూపవలసిన ప్రత్యేక శ్రద్ధ గురించిన అవగాహన

## 7.1 పరిచయం

గౌరవం పట్ల, సమానమైన, పరాధీన కాని (Inalienable) హక్కుల పట్ల సమాజంలోని సభ్యులలో వున్న ఆకాంక్షను, స్వేచ్ఛకు, న్యాయానికి పునాదిగా అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన గుర్తిస్తుంది. స్వేచ్ఛగా పుట్టిన మానవులందరూ గౌరవంలోనూ, హక్కులలోనూ సమానమే. ఈ ప్రకటనలో పొందు పరిచిన అన్ని హక్కులకు, స్వేచ్ఛలకు ప్రతి ఒక్కరూ అర్హులే. ఈ ప్రకటనలోని మూడవ ప్రకరణ ప్రకారం ప్రతి ఒక్కరికి జీవించే హక్కు, స్వేచ్ఛ, వ్యక్తిగత రక్షణ హక్కు వుంది. అన్ని రకాల హక్కులను పొందే అర్హత ప్రతి ఒక్కరికి వున్నప్పుడు, ఖైదీల పట్ల అనుసరించవలసిన ప్రత్యేకమైన పద్ధతుల గురించిన ఒప్పందాలను ఆమోదించాల్సిన అవసరం ఏమిటి?

చట్టాన్ని అతిక్రమించిన వ్యక్తులను సమాజానికి దూరంగా వుంచే ప్రయత్నంలో భాగంగా, వారికి స్వేచ్ఛను

నిరాకరించి జైలులో వుంచుతారు. ఖైదీలు ప్రధానంగా కోల్పోయేది తమకు నచ్చిన చోటుకు సంచరించే హక్కు. ఈ స్వేచ్ఛ నిరాకరించబడడంతో, రక రకాల ఆటంకాలకు గురౌతారు. ఈ మొత్తం క్రమంలో చట్టబద్ధంగా గుర్తించబడిన హక్కులను, స్వేచ్ఛలను కూడా ఖైదీలు కోల్పోతారు. నిజానికి ఖైదీలకు చాలా కొన్ని హక్కులను మాత్రమే నిరాకరించబడాలి. కాని కొన్ని హక్కులను కోల్పోవడం వలన, న్యాయబద్ధంగా వారికి చెందిన ఇతర హక్కులను కూడా నిరాకరించే ప్రమాదం జరుగుతూ వుంటుంది. అందుచేత ఖైదీలుగా అనుభవించవలసిన మిగిలిన చట్టబద్ధ హక్కులను జాగ్రత్తగా నిర్దిష్టంగా పేర్కొనవలసిన అవసరం ఉంది.

జైలు వ్యవస్థ, శిక్షల యొక్క లక్ష్యాలు స్పష్టంగా వున్నట్లయితే, కొంత వరకు ఖైదీలకు హక్కులను నిరాకరించడాన్ని సమర్థించవచ్చు. కాని జైలు వ్యవస్థ యొక్క లక్ష్యాల గురించి పూర్తి అంగీకారం లేదు. జైలు వ్యవస్థ లక్ష్యాల గురించి చాలా సిద్ధాంతాలు వున్నాయి. సమాజ రక్షణ సిద్ధాంతం, ప్రతీకార సిద్ధాంతం, పునరావాస సిద్ధాంతం లాంటి అన్నిటిని చాలా మంది విమర్శించారు. ఇక్కడ ఆ సిద్ధాంతాలను సమీక్షించడం సాధ్యం కాదు. కాని ఖైదీల పట్ల అనుసరించవలసిన కనీస ప్రమాణిక సూత్రాలలోని 5వ సూత్రం, శిక్ష యొక్క ప్రధాన ధ్యేయం సమాజ రక్షణ అంటుంది. సమాజ రక్షణే ఖైదీల నిర్బంధం యొక్క ప్రధాన ధ్యేయం, అయితే-ఖైదీలను సమాజం నుండి వేరుచేసే మేరకు మాత్రమే వారి హక్కులలో జైలు వ్యవస్థ జోక్యం చేసుకోవాలి. మిగిలిన హక్కులను పరిరక్షించాలి. ఈ దృక్పథం ప్రకారం ఖైదీలు స్వేచ్ఛగా సంచరించే హక్కు మాత్రమే కోల్పోతారు. నేరస్థుడు జైలుకు వెళ్లడమే శిక్షగా పరిగణించక, జైలులోపల శిక్ష మొదలౌతుందని, భావించడం వలన ఖైదీలు పూర్తిగా హక్కుల నిరాకరణకు గురవుతున్నారు.

ఇవాళ జైళ్ల లోపల ఏమి జరుగుతుందో తెలియని, నియంత్రిత్వ సంస్థలైపోయాయి. జైలు లోపల కార్యకలాపాలను నియంత్రణ (Control), రక్షణ (Security) అనే రెండు అంశాలు మాత్రమే నిర్ణయించడం వలన, జైలుకు సంబంధించిన ప్రతిదీ రహస్యమే అయిపోయింది. ఆహారము, ఇతర ఖైదీలతో మాట్లాడడంలాంటి ప్రతి అంశమూ జైలు యంత్రాంగం యొక్క అదుపులోనే వుంటుంది. జైలులో క్రమశిక్షణ వుండాలనే పేరుతో, ఖైదీల ప్రతికదలికా వ్యవస్థీకృతపు అదుపునకు గురిచేయబడుతుంది. జైలు నిర్వాహకుల దృష్టిలోనే కాక, ప్రజల దృష్టిలో కూడా ఖైదీలు విశ్వసనీయులు కాదు, వారి ప్రయోజనాలు గుర్తించదగినవి కావు. జైలు నిర్వహణలో ఖైదీలను సంప్రదించడం కాని, వారికి ప్రాతనిధ్యం యివ్వడం కాని జైలు నిర్వహణాధికారులు చేయరు. సామాన్య మానవుల పట్ల చూపే గౌరవం కూడా ఖైదీల పట్ల చూపరు. ఖైదీల హక్కులను హరించడానికి ఏర్పాటు చేసిన పరిస్థితులు, వాతావరణం ఎంత ఎక్కువగా ఉన్నాయో చూపడానికి ఇదంతా చెప్పవలసి వచ్చింది.

BRAOU

## 7.2 ఖైదీల పట్ల అనుసరించవలసిన కనీస ప్రామాణిక సూత్రాలు

నేర నివారణ, నేరస్థుల పట్ల దృక్పథం మీద ఐక్యరాజ్య సమితి 1955లో జెనివాలో జరిపిన తన మొదటి కాంగ్రెసులో ఖైదీల పట్ల అనుసరించవలసిన కనీస ప్రామాణిక సూత్రాలను ఆమోదించారు. ఈ సూత్రాల లక్ష్యం, జైళ్ల వ్యవస్థకు ఒక నమూనాను రూపొందించడం కాదు, కొన్ని కనీస ప్రమాణాలను ఏర్పరచడం.

ఖైదీలను జైలులోనికి ప్రవేశపెట్టిన సమయాన్ని, తారీఖులను, ఖైదీల గుర్తింపులను, శిక్షపడ్డ కారణాలను సమగ్రంగా రికార్డులలో పొందుపర్చాలని ఈ కనీస ప్రమాణాలలోని 7వ సూత్రం పేర్కొంది. నిర్బంధాన్ని చట్ట బద్ధంగా వుండాలనే ధ్యేయంతో ఈ ప్రమాణం ఏర్పరచబడింది. వయస్సు లింగభేదం, నేర చరిత్ర లాంటి అంశాల ప్రాతిపదికన విభిన్న రకాల ఖైదీల పట్ల వివిధ రకాల సూత్రాలు అనుసరించాలి. కాబట్టి, స్త్రీలనుండి పురుషులను, పెద్దలనుండి బాల నేరస్థులను, క్రిమినల్ ఖైదీలనుండి సివిల్ ఖైదీలను, శిక్ష పడిన ఖైదీలనుండి విచారణ ఖైదీలను వేరు చేయాలని ఎనిమిదవ సూత్రం వెల్లడించింది.

ఖైదీలు వుండటానికి తగిన వసతిని ప్రతి ఖైదీకి కేటాయించాలి. ప్రతి ఖైదీకి ఒక గదిని యివ్వాలని (తొమ్మిదవ

నిబంధన) సరిపడినన్ని నివాస గదులు లేనప్పుడు, ఎక్కువ మంది ఖైదీలు వున్నప్పుడు మాత్రమే ఒక గదిలో ఒక్కరికంటే ఎక్కువ మందిని వుంచవచ్చు. జైళ్లలో పరిమితికి మించి ఖైదీలను వుంచడం చాలా కాలంగా కొనసాగుతుందని జైళ్ల వ్యవస్థ చరిత్రను చూస్తే అర్థమౌతుంది. నిద్ర పోవడానికి సరియైన స్థలము, వైద్యం, ఆరోగ్యము, మంచి గాలి, వెలుతురులాంటి ప్రతి సౌకర్యమును పొందే హక్కు ఖైదీలకు వుండాలి. చలికాలం, వర్షాకాలం, చలి నుంచి కాపాడుకోవడానికి తగిన బట్టలు, నిద్ర పోవడానికి దుప్పట్లు మొదలైనవి ఇవ్వాలి. ఈ సౌకర్యాలు ఎట్టి పరిస్థితులలోనూ, ఖైదీలను అవమాన పరిచేవిగా, చిన్న చూపు చూసేవిగా వుండరాదు.

ఖైదీల ఆరోగ్యాన్ని, బలాన్ని పెంపొందించగల, పోషక విలువలుగల ఆహారాన్ని జాగ్రత్తగా వండి, తగు మోతాదులో పెట్టాలి. సరియైన ఆహార సమయాల్లో భోజనం ఖైదీలకు అందేలా జైలు అధికారులు చూడాలని 20 (1)వ రూలు అంటుంది. అనారోగ్యంగా వున్న ఖైదీలకు కావలసిన ప్రత్యేక వైద్య సౌకర్యము, పరిశుభ్రవాతావరణం నెలకొనేటట్లు చూడాల్సిన బాధ్యత జైలు అధికారులది. ఈ సౌకర్యాల కోసం ప్రతి జైలులో, మానసిక శాస్త్ర పరిజ్ఞానం వున్న కనీసం ఒక వైద్యుణ్ణి నియమించాలి.

ఖైదీల హక్కులు పరిరక్షించాలనే ఉద్దేశంతో, ఖైదీల మీద క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు జైలు యంత్రాంగం ఒక పద్ధతి ప్రకారం (Due Procedure) వ్యవహరించాలని ప్రామాణిక సూత్రాలు సూచించాయి. ఖైదీల మీద సాధ్యమైనంత తక్కువ చర్యలను తీసుకోవాలి. జైలు లోపల శాంతి భద్రతలను నిర్వహించడానికన్నా ఎక్కువ అవసరమైన అదుపును, క్రమశిక్షణా చర్యలను చేపట్టరాదు. క్రమశిక్షణా రాహిత్యానికి దారితీసిన పరిస్థితులను, నేరాన్ని, శిక్షను నిర్ణయించడానికి, చట్ట ప్రకారం ఏర్పరచిన పాలనా యంత్రాంగం అవసరం అంటాయి. ప్రామాణిక సూత్రాలు కాని ఖైదీల హక్కులను కాపాడడానికి ఈ సూత్రం పనికి రాదు. పై విషయాలను విచారించడానికి, జైలు యంత్రాంగం కాక, ఒక స్వతంత్ర ప్రతిపత్తికల సంస్థ, లేక కమిటీ అవసరం. అప్పుడు మాత్రమే జైలు యంత్రాంగానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడానికి ఖైదీకి అవకాశం వుంటుంది. అంతేకాక, జైలు యంత్రాంగం తీసుకున్న క్రమశిక్షణా చర్యల ఔచిత్యాన్ని అంచనా వేసే అవకాశం ఆ సంస్థకు వుండాలి.

## 7.2.1 శారీరక శిక్షల రద్దు

క్రమ శిక్షణారాహిత్యం పేరుమీద, ఖైదీలను చీకటి కొట్లలో వుంచి శిక్షించేలాంటి క్రూరమైన, అమానుష, అవమానకర శిక్షా పద్ధతులను ప్రామాణిక సూత్రాలు నిషేధించాయి. ఖైదీని వైద్యాధికారి పరీక్షించి, క్రమశిక్షణా చర్యను భరించగలడు అని నిర్ధారించిన తరువాతే ఇతర రకాల క్రమశిక్షణా చర్యలను జైలు అధికారులు తీసుకోవచ్చు. ఖైదీని మానసికంగా, శారీరకంగా విపరీతమైన మార్పులకు గురిచేయని శిక్షా పద్ధతులను మాత్రమే అనుసరించాలి. చేతులకు బేడీలు వేయడం, ఇనుప సాధనాలను కాళ్లకు వేయడం లాంటి వాటిని శిక్షగా ఉపయోగించకూడదు. పారిపోకుండా వుంచడానికి, ఇతరులను, లేక తనను తాను గాయపరచుకోకుండా వుంచడానికి మాత్రమే ఖైదీలకు ఇనుప గొలుసులను ఉపయోగించాలి. వీటిని ఏ పద్ధతులలో ఉపయోగించాలనే విషయాన్ని కేంద్రీయ జైళ్ల యంత్రాంగం నిర్ధారించాలి. ఆచరణలో ఏం జరుగుతుందంటే, క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి, జైళ్ల అధికారులకు విస్తృతమైన అధికారాలు ఇవ్వబడతాయి. ఖైదీల హక్కులను హరించడానికి, ఇది మానవ హక్కులకు చాలా అవకాశం ఇస్తుంది. సాంఘిక కార్యకర్తలతోను, మానవ హక్కుల ఉద్యమ కార్యకర్తలతోనూ పౌర కమిటీలను నియమించినట్లయితే, ఖైదీల హక్కుల రక్షణ కొంతవరకు సాధ్యమౌతుంది.

ఖైదీలు తమ హక్కులను పూర్తిగా అనుభవించాలంటే సరియైన పరిస్థితులను తప్పకుండా నెలకొల్పాలి. ఖైదీల హక్కులు, విధులు, క్రమశిక్షణలు, జైలు నిర్వహణా పద్ధతుల గురించిన సమగ్ర సమాచారాన్ని ఖైదీకి జైలు అధికారులు

అందించాలని రూలు 35 (1) అంటుంది. వారికి కావలసిన సమాచారాన్ని ఎలా పొందాలో, ఫిర్యాదులు ఎవరికి, ఎలా చేయాలో లాంటి విషయాలను ఖైదీలకు తెలియజేయాలి. దీని వలన వారి హక్కులను విధులను గురించి తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. ఒక వేళ ఖైదీ నిరక్షరాస్యుడు అయితే, అతనికి వీటి గురించి చదివి వినిపించాలి. అదే విధంగా ఖైదీ పరదేశీయుడైతే, తన హక్కుల గురించి అతనికి అర్థమయ్యే భాషలో చెప్పే ఏర్పాటు చేయాలి.

పరిమిత సమయాల్లో ఖైదీలు తమ కుటుంబ సభ్యులను కలుసుకొనే హక్కు, వారికి ఉత్తరాలు రాసుకొనే హక్కు వుంది. ఖైదీలు ప్రవాసులు (Refugers) పరదేశీయులు అయితే, తమ ప్రభుత్వ ప్రతినిధులతో, రాయబారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకునే హక్కు వుంది.

జైలు అధికారులు, ఖైదీల మత విశ్వాసాలను గౌరవించాలి. ఒక మతానికి చెందిన వారు తగినంత మంది వుంటే, ఆ మతానికి చెందిన గురువును జైలు అనుమతించాలి. ప్రతి ఖైదీ తన అనారోగ్యం గురించి, తను జైలులో వున్న సమాచారాన్ని, తన బదిలీ గురించి (వేరే జైలుకు) తన కుటుంబ సభ్యులకు తెలియ పరిచే హక్కు వుంది. తన బంధువుల ఆనారోగ్యం, చావుల సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ప్రతి ఖైదీకి వుంది. తన సమీప బంధువులలో ఎవరైనా మరణ దశలో వుంటే, వెళ్లి కలవడానికి, పరిస్థితులు అనుకూలించిన మేరకు, అవకాశాన్ని జైలు అధికారులు కల్పించాలి.

## 7.2.2 సక్రమ పని పరిస్థితులు పొందే హక్కు

జైల్లో ఖైదీలు పనిచేయవలసి వుంటుంది. కాని ఖైదీ యొక్క మానసిక, శారీరక సంసిద్ధతను వైద్యాధికారి నిర్ధారించాలి. ఖైదీలు చేసే పనులు వారిని బాధించేవిగా వుండకూడదు. ఖైదీకి కేటాయించే పని, తను జైలునుండి విడుదలైన తరువాత నిజాయితీగా జీవితాన్ని గడపడానికి వుపయోగపడేదిగా వుండాలే కాని, జైలుకు లాభాల్ని ఆర్జించేదిగా వుండకూడదు. ఖైదీలు చేసే పనికి సమానవేతనం పొందే హక్కు వుంటుంది. విశ్రాంతికి చదువుకు, ఇతర రకాల పనులకు తగినంత సమయం పరిశ్రమలో పనిచేసిన తరువాత మిగిలేవిధంగా పనిని నిర్ధారించాలి. జైలు బయట కార్మికులకు ఎలాంటి పని పరిస్థితులు వర్తిస్తాయో రక్షణ పద్ధతులు, గాలి వెలుతురు, పని గంటలు లాంటివి వాటిని ఖైదీలకు కల్పించాలి.

ఖైదీలకు విద్యా, సాంస్కృతిక సౌకర్యాలు కల్పించాలి. ఇవి ప్రతి జైలులోనూ కల్పించాలి. ఎందుకంటే ఇవి ఖైదీల మానసిక, శారీరక ఆరోగ్యానికి అవసరం.

ప్రత్యేక తరగతికి చెందిన ఖైదీల పట్ల, ప్రత్యేక దృష్టి అవసరం. మానసిక వైకల్యం వున్న వాళ్లను జైలులో వుంచరాదని రూలు 82 (1) అంటుంది. సాధ్యమైనంత తొందరగా అలాంటి వారిని మానసిక వైద్య సంస్థలకు తరలించాలి. అలాంటి ఖైదీలను వైద్య సౌకర్యాలతో ప్రత్యేక పర్యవేక్షణలో వుంచాలి.

## 7.2.3 విచారణలో వున్న ఖైదీల హక్కులు

విచారణలో వున్న ఖైదీల హక్కుల పట్ల ప్రత్యేక దృష్టి అవసరం. నేరారోపణ చేయబడి, విచారణ పూర్తికాక పోలీసు నిర్బంధంలోకాని, జైలులో కాని వున్న వారిని విచారణలో వున్న ఖైదీలు అంటారు. శిక్షలు పడని ఇలాంటి ఖైదీలను అమాయకులు గానే భావించి వారితో సాధారణ పౌరులతో సమానంగా గౌరవ మర్యాదలతో జైలు అధికారులు ప్రవర్తించాలి. విచారణలో వున్న ఖైదీ తన నిర్బంధం గురించిన సమాచారాన్ని వెంటనే తన కుటుంబ సభ్యులకు తెలియజేసే హక్కు వుంటుంది. తన కుటుంబ సభ్యులను మిత్రులను కలుసుకొని మాట్లాడుకోవడానికి కావలసిన సౌకర్యాలను పొందే హక్కు అతనికి, ఆమెకు వుంటుంది. ఉచిత న్యాయ సలహా పొందడానికి, తన వేదన వినిపించడానికి తన న్యాయ

BRAOU

వాదులతో మాట్లాడడానికి, రహస్య సమాచారాన్ని రాసి ఇవ్వడానికి హక్కు వుంటుంది. రాతకు కావలసిన కలం, కాగితం లాంటి రాత సామాగ్రిని పొందే హక్కు వుంటుంది. ఖైదీ తన న్యాయవాదిని కలుసుకున్నప్పుడు, పోలీసులు కనిపించే దూరంలో నిలబడాలే కాని, వారు మాట్లాడుకునేది వినిపించే దూరంలో వుండకూడదు.

## 7.3 ఖైదులో కాని, లేక ఎటువంటి నిర్బంధంలో నైనా వున్న వారి రక్షణ కొరకు సూత్రాలు

పై సూత్రాలలోని ఆరవ సూత్రం, ఎటువంటి నిర్బంధంలో వున్న వారినైనా క్రూరమైన చిత్ర హింసలకు, అమానవీయమైన, నీచమైన శిక్షలకు గురి చేయకూడదని అంటుంది. సమాచారాన్ని రాబట్టడం కోసం పోలీసులు తమ నిర్బంధంలో వున్న నిందితులను చిత్ర హింసలకు గురిచేస్తారు. ఏ కారణం రీత్యానైనా సరే నిందితుడిపై ప్రయోగించే హింసను సమర్థించుకొనే వీలు లేదు అంటుంది ఆరవ సూత్రం. నిందితుడిని నిర్బంధించే సమయంలోనే, అధికారులు అతనికిగల హక్కులను వివరించి, వుపయోగించుకోమని చెప్పాలి. ఆ అవకాశాన్ని అతనికి కల్పించాలి.

## 7.4 చిత్ర హింసలు, క్రూర, అమానవీయ, నీచ శిక్షలనుండి పరిరక్షణ ప్రకటన

BRAOU

పై ప్రకటనను ఖైదీల హక్కులకు సంబంధించి చేస్తున్న చర్చల సందర్భంగా చర్చించాల్సిన అవసరం వుంది. ఎందుకంటే, సాధారణ పౌరులకన్నా, నిర్బంధంలో, ఖైదులో వున్న వారు నీచమైన, క్రూరమైన, అమానవీయమైన శిక్షలకు గురయ్యే అవకాశం ఎక్కువ వుంది. ఈ ప్రకటనను ఐక్యరాజ్య సమితిలోని జనరల్ అసెంబ్లీ డిసెంబరు 9, 1975న ఆమోదించింది. ఒక వ్యక్తిని భయపెట్టే వుద్దేశంతో లేక అతను చేసిన నేరానికి శిక్షించే వుద్దేశంతో లేక అతనినుండి లేక మూడవ వ్యక్తినుండి ఒప్పుకోలును (Confession) లేక సమాచారాన్ని రాబట్టే ఉద్దేశంతో, ఒక ప్రభుత్వ అధికారి ప్రోద్బలంలో శారీరకమైన లేక మానసికమైన హింసకు గురిచేయడాన్ని చిత్రహింస (Torture) అని ఈ ప్రకటన నిర్వహించింది. అమానుషమైన, క్రూరమైన శిక్షగా పరిగణింపబడుతుంది. అన్ని రకాల నీచమైన శిక్షలు, మానవ ఔన్నత్యానికి (Dignity), స్వేచ్ఛకు, హక్కులకు విరుద్ధముగా మానవ హక్కుల ప్రకటన పరిగణించింది.

ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాల సాయుధ దళాలు నిందితులనుండి సమాచారాన్ని రాబట్టేందుకు హింసను ప్రయోగిస్తాయి. భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం (TADA) 1985, సాయుధ దళాల ప్రత్యేక చట్టాల (SAFA) ద్వారా సాయుధ దళాలకు ఎనలేని అధికారాలు ఇవ్వబడ్డాయి. ప్రజలలో అశాంతి, అలజడి రేగినప్పుడు అణిచివేయడానికి ఈ చట్టాలు ఉద్దేశించబడ్డాయి. ప్రభుత్వాలు ప్రజల హక్కులను హరించే ఇలాంటి చట్టాలను తెస్తాయనే విషయాన్ని దృష్టిలో ఉంచుకునే ''యుద్ధ పరిస్థితి, లేక యుద్ధ భయం, అంతర్గత రాజకీయ అస్థిరత లేక అత్యయిక పరిస్థితిలాంటి ఎలాంటి కారణాలను చూపించైనా సరే, సాయుధ దళాలకు నిందితులను హింసలపాలు చేసే అధికారాలను కట్టబెట్టరాదని'' ఈ ప్రకటనలోని మూడవ ప్రకరణ పేర్కొంది. క్రూరమైన శిక్షలు విధించకుండా చూడాల్సిన బాధ్యత రాజ్యానిదని నాలుగవ ప్రకరణ అంటుంది. చిత్ర హింసలను, ఇతర రకాల శిక్షలను నిషేధించిన విషయానికి సంబంధించిన అవగాహన, సున్నితత్వం పెరగాడనికి, నిందితుల నిర్బంధానికి బాధ్యత వహించవలసిన అధికారులకు శిక్షణ ఇవ్వాలి. క్రూరమైన శిక్షలను నిలుపుదల చేసే ఉద్దేశంతో, నిందితులను ప్రశ్నించే పద్ధతుల మీద, ఆచరణ మీద, వారిపట్ల అనుసరించాల్సిన విధానంమీద ప్రభుత్వాలు సమీక్షలు నిర్వహించాలి. ఈ ప్రకటనలో గుర్తించిన అన్ని రకాల చిత్ర హింసల చర్యలను, తన నేరస్మృతిలో నేరాలుగా పరిగణించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే!

## 7.4.1 నష్టపరిహార హక్కు

నిందితులు, ఖైదీలు చిత్ర హింసలకు గురికాని రోజులు వస్తే మంచిదే! కాని చిత్ర హింసలకు గురైనవారికి నష్ట పరిహారం పొందే హక్కు వుండాలి. ప్రభుత్వ అధికారి చేతిలో హింసకు గురైనానని ఆరోపించే ప్రతి వ్యక్తికి ఫిర్యాదు చేసే హక్కు, ఆ ఫిర్యాదు మీద నిష్పక్షపాతంగా విచారణ ప్రభుత్వాధికారి చేత చేయించుకునే హక్కు వుండాలి. నేరస్థుడికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడానికి, కొన్ని సందర్భాలలో నష్టపోయినవారు ముందుకు రాకపోవచ్చు. అలాంటి సందర్భాలలో, నేరం జరిగివుండవచ్చు అని భావించినట్లైతే, తగిన అధికారి పరోక్ష సమాచారం మీద ఆధారపడి నిష్పక్షపాతంగా విచారణ చేయవచ్చు. ప్రభుత్వాధికారిమీద, పోలీసుల మీద చేసిన ఆరోపణలు రుజువైతే వారిని చట్టం ప్రకారం శిక్షించాలి. అలాగే హింసకు గురైన వ్యక్తికి చట్టం ప్రకారం నష్టపరిహారాన్ని పొందే హక్కుండాలి.

## 7.5 ముగింపు

నిర్బంధంలో వున్న వ్యక్తుల హక్కులను పరిరక్షించడానికి పైన పేర్కొన్న ఏర్పాట్లు సరిపోవు. నిర్బంధితుల హక్కులను అమలు చేయాల్సిన అధికారులు అలా చేయక పోయినా, హక్కులను వుల్లంఘించినా వారి మీద ఎలాంటి చర్యలను ఎవరు తీసుకోవాలి? ప్రభుత్వ, పోలీసు అధికారులు హక్కుల ఉల్లంఘనతో చేసే నేరాలను, పౌరులు చేసే నేరాలతో సమానంగా పరిగణించబడితేనే కొంతవరకు వారిని శిక్షించడం సాధ్యమౌతుంది. సైనికుల, పోలీసుల, అధికారుల నైతిక స్థైర్యాన్ని నిలబెట్టడం పేరు మీద చాలా ప్రభుత్వాల చట్టాలు, నేర విచారణ నుండి వారికి మినహాయింపులు ఇచ్చాయి. నిర్బంధితుల హక్కులు కాపాడబడాలంటే, అలాంటి చట్టాలను ముందు రద్దు చేయాలి. దానికి ప్రజలలో చైతన్యం, ఉద్యమం అవసరం. కొన్ని రకాల వ్యవస్థాగత మార్పులూ అవసరం. ఒక విభాగానికి చెందిన ప్రభుత్వాధికారి, నిర్బంధితుల హక్కులను హరిస్తే అతనిమీద అదే విభాగానికో, లేక ఇంకొక సోదర విభాగానికి చెందిన అధికారిని విచారణకు నియమిస్తారు. దీనివలన నిష్పాక్షిక నేర విచారణ జరగదు. హక్కులను హరించిన ప్రభుత్వ విభాగం నుండి స్వతంత్ర ప్రతిపత్తి వున్న మరో సంస్థో, అధికారో విచారణ కొనసాగిస్తే మాత్రమే బాధితుడికి న్యాయం జరిగే అవకాశం వుంటుంది.

ప్రజల హక్కులను కాపాడడానికి నిర్మించబడ్డ జైళ్లు, పోలీసు వ్యవస్థ, చాలా కాలంగా ఖైదీల, నిర్బంధితుల హక్కులను కాలరాస్తూ వుందనే విమర్శలను ఎదుర్కొంటూ వుంది. పైన జరిగిన చర్చల వెలుగులో, ఖైదీల, నిర్బంధితుల హక్కుల పట్ల ప్రజలలోను, ప్రభుత్వంలోనూ అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. సమాజాన్ని ప్రజాస్వామీకరించే ప్రయత్నంలో, ఈ కృషిలో కూడా పాలు పంచుకోవాలని ఆశిద్దాం.

BRAOU

## 7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1) ఖైదీల హక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచవలసిన అవసరం ఏమిటి? విశదీకరింపుము.
2) ఖైదీలపై ఏ మేరకు నిర్బంధ సాధనాలను జైలు అధికారులు ఉపయోగించవచ్చునో పేర్కొనుము.
3) ఖైదీలు తమ హక్కులను సక్రమంగా అనుభవించడానికి ఉండవలసిన పని పరిస్థితులేమిటి?
4) ఖైదీలకు ఉండవలసిన పని పరిస్థితులేమిటి?
5) విచారణలో వున్న ఖైదీల హక్కు లేమిటి?
6) ప్రభుత్వాధికారులు పాల్పడే క్రూర, హింసాత్మక చర్యల పట్ల ప్రభుత్వ బాధ్యత ఏమిటి? వివరింపుము.
7) మానవ హక్కులు కోల్పోయిన బాధితుల హక్కుల గురించి వ్రాయుము?

## 7.7 సంప్రదింపు గ్రంథాలు

1. Berkman, Ronald, Opening the Gates, The Rise of the prisoners movement, (Lexington Book, 1975)
2. Foncault, Michel, Disupture and Punish: The Birth of the Prison, (London Penguin Books, 1975)
3. Fiztgerald, Mike, Prisoners in Revolt, (London Penguim Books, 1977)
4. Macquine, Mike, Accountability and Prisons London, Tavistock Publications, 1985)
5. Mathissen, Thouras, Prison on Trial, New Delhi Sage Publications, 1990
6. The Historical Prison Struggle in Andhra Pradesh (Hyderabad, AIRPRO, 1996)
7. Naresh Kumar, Constitutional Rights of Prisoners, (Delhi: Mittal Publications, 1986)

## 7.8 పదకోశం (Glossary)

Inalianable-పరాధీనం కాని, అన్యాక్రాంతం కాని

Standard Rules- ప్రమాణిక సూత్రాలు

Working Conditions-పని పరిస్థితులు, పని షరతులు

Dignity- ఔన్నత్యం

Custody-నిర్బంధము

రచయిత: కె. మురళి
పరిశోధక విద్యార్థి
రాజనీతి శాస్త్ర విభాగము
సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్

BRAOU

# భాగం 8: వివక్ష వ్యతిరేక ఒడంబడికలు

## విషయక్రమం


8.0 ఉద్దేశం

8.1 పరిచయం

8.2 విద్యారంగంలో వివక్షకు వ్యతిరేకంగా ఒడంబడికలు

- 8.2.1 పరిచయం
- 8.2.2 విద్య నిర్వచనం, విద్యారంగంలో వివక్ష
- 8.2.3 వివక్షకు వ్యతిరేకంగా తీసుకోవలసిన పాలనాపరమైన, శాసనపరమైన చర్యలు
- 8.2.4 వివక్షకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన విధాన నిర్ణయాలు
- 8.2.5 ప్రత్యేక నిబంధనల రూపకల్పన ఆవశ్యకత

8.3 మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా ఒడంబడిక

- 8.3.1 పరిచయం
- 8.3.2 విషయక్రమం
- 8.3.3 మహిళలపై వివక్ష నిర్మూలన
- 8.3.4 మహిళలకు సమాన హక్కులు కల్పించిన రంగాలు
- 8.3.4.1 సమాన న్యాయం
- 8.3.4.2 జాతీయతలో సమాన హక్కులు
- 8.3.4.3 సమాన రాజకీయ హక్కులు
- 8.3.4.4 సమాన విద్యావకాశాలు
- 8.3.4.5 సమాన ఉపాధి అవకాశాలు
- 8.3.4.6 పెళ్లి, కుటుంబంలో సమాన హక్కులు

8.3.5 గ్రామీణ మహిళల హక్కులు

8.3.6 అర్థవంతమైన సమానత్వం కోసం చర్యలు-మహిళల హక్కుల రక్షణ

8.4 బాలల హక్కుల ఒడంబడిక

- 8.4.1 పరిచయం
- 8.4.2 తల్లిదండ్రుల రక్షణ హక్కు
- 8.4.3 వ్యక్తిగా గుర్తింపు
- 8.4.4 లైంగిక అత్యాచారాలు, ఆర్థిక దోపిడీలనుంచి రక్షణ
- 8.4.5 సాయుధ సంఘర్షణల నుంచి రక్షణ న్యాయ రక్షణ
- 8.4.6 వికలాంగ బాలలకు ప్రత్యేక హక్కులు

8.5 సారాంశం

8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.7 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

# 8.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- ❖ విద్యారంగంలో వివక్షకు వ్యతిరేకంగా జరిగిన ఒడంబడికలు తెలుసుకుంటారు.
- ❖ మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా జరిగిన ఒడంబడికలు తెలుసుకుంటారు.
- ❖ బాలల హక్కుల పరిరక్షణకు జరిగిన ఒప్పందాలు తెలుస్తాయి.

# 8.1 పరిచయం

మహిళలపై అన్ని రూపాల్లో కొనసాగుతున్న వివక్ష నిర్మూలనకు సంబంధించిన ఒప్పందాలు, బాలల హక్కులపై ప్రకటనలు, విద్యా వివక్షకు వ్యతిరేకంగా కుదిరిన ఒడంబడికలకు సంబంధించి మూడు ఏకాంశ ఒప్పందాలను గురించి ఈ పాఠంలో చర్చిద్దాం. కొన్ని ప్రత్యేక చారిత్రక, సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో ప్రజలు, కొన్ని ప్రత్యేక సమూహాలు ఈ మూడు రకాల వివక్షలకు లోనయిన స్థితిలో ఈ ఒప్పందాలు, ఒడంబడికలు కుదిరాయి. అయితే మానవ సమాజంలో ఈ ఒప్పందాల ఆవశ్యకత అధిక సంఖ్యాకులకు వుండడం ఒక విషాదకర పరిణామం. కొద్ది మంది చేతుల్లో వనరులు, అధికారం వుండడం వల్ల అధిక సంఖ్యాకుల హక్కుల పరిరక్షణకు ఈ ఆవశ్యకత ఏర్పడింది. అధిక సంఖ్యాకుల పరిరక్షణ ఇక ఏ మాత్రం పట్టించుకోరాని అంశంకాదు. ఇది ఓవైపు సుదీర్ఘ కాలంగా హక్కుల నిరాకరణకు గురయిన వాళ్ల ప్రపంచ వనరుల్లో భాగస్వామ్యాన్ని, సమన్వయాన్ని డిమాండ్ చేస్తూ చూపుతున్న చైతన్యానికి నిదర్శనంగా ఉంది. మరోవైపు ఈ వివక్షలు కొనసాగినంత కాలం 'అంతర్జాతీయ ప్రకటన'లో పరిమళించిన 'మానవ జాతి ఆత్మగౌరవం' అన్న భావనకు అర్థం వుండదన్న విషయాన్ని తేటతెల్లం చేస్తున్నది.

విద్యా వివక్షకు వ్యతిరేకంగా కుదిరిన ఒడంబడిక ప్రతి మనిషికి విద్య నేర్చుకునే హక్కును రక్షిస్తుంది. బాలల హక్కులపై వెలువడిన ప్రకటన 'మానవ హక్కుల అంతర్జాతీయ ప్రకటన'లో గ్యారంటీ పడిన బాలల హక్కులను విస్తరిస్తుంది. మహిళలపై వివక్షా నిర్మూలన ఒప్పందం ఇప్పుడు ఈ దిశగా జరుగుతున్న విషయాల్లో మరింత సమగ్ర మార్పులు రావాలని సూచిస్తుంది.

ఈ మూడు ఒప్పందాలను ఒక క్రమ పద్ధతిలో చర్చిద్దాం. మొదట విద్యా వివక్షకు వ్యతిరేకంగా కుదిరిన ఒడంబడికను, తర్వాత మహిళలపై వివక్షా నిర్మూలనకు కుదిరిన ఒడంబడికను, చివరగా బాలల హక్కుల ఒడంబడికను గురించి చర్చిద్దాం.

# 8.2 విద్యా రంగంలో వివక్షకు వ్యతిరేకంగా ఒడంబడికలు

## 8.2.1 పరిచయం

ఐక్యరాజ్య సమితి విద్యా, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ (UNESCO) 1960 డిసెంబర్‌లో ఈ ఒడంబడికను రూపొందించింది. యుఎన్‌డిహెచ్‌ఆర్ ప్రకటించుకున్న లక్ష్యాల మేరకు ఈ ఒడంబడిక ప్రతి వ్యక్తికీ ఎలాంటి వివక్షలేకుండా విద్య నేర్చుకునే హక్కును విస్తృత పరిచింది. 'అంతర్జాతీయ ప్రకటన' మేర అధికరణ 2, 26 లలో ఈ విషయాలను పొందు పరిచారు. విద్యా వివక్షకు వ్యతిరేకంగా, విద్యా రంగంలో సమానత్వం, సమాన అవకాశాలు, సమ దృష్టి సాధన ఉద్దేశంతో ఒడంబడిక రూపొందించారు. అయితే ఒడంబడిక అమలుకు మాత్రం ఆయా దేశాలు తమతమ పరిస్థితులకు

BRAOU

అనుగుణమయిన సత్వర చర్యలు చేపట్టాలని ఒడంబడిక సూచించింది.

ఈ ఒడంబడికలో విద్యను విశాల దృక్పథంతో నిర్వచించింది. అలాగే వివక్ష ఏ విధంగా, ఏ ఏ రకాలుగా వుందో నిర్వచించి, విద్యా రంగంలో సమాన అవకాశాలు, సమానత్వం సాధనకు ఆయా దేశాల ప్రభుత్వాలు తీసుకోవలసిన పాలనా పరమైన, న్యాయపరమైన విధాన నిర్ణయాలను కూడా ఒడంబడిక సూచించింది.

## 8.2.2 విద్య నిర్వచనం, విద్యా రంగంలో వివక్ష

ఈ ఒడంబడిక ప్రకారంగా విద్య అంటే సమగ్ర దృష్టి అంటే అన్ని రకాల, స్థాయిల విద్య అన్న అర్థమే కాకుండా, విద్యావకాశాలు, విద్యా ప్రమాణాలు, స్థాయి, విద్యకు సానుకూల పరిస్థితులు అన్న అంశాలను విస్తృత పరిచి ఈ ఒడంబడికలో విద్యను సమగ్రంగా నిర్వచించారు. అలాగే విద్యా ప్రయోజనాలను కూడా ఈ అంశంలో చేర్చారు. విద్య అనేది మానవుడి మూర్తిమత్వాన్ని అభివృద్ధి పరిచేదిగా, ప్రాథమిక స్వేచ్ఛ, మానవ హక్కుల పట్ల గౌరవం తదితర భావనలను పెంపొందించేదిగా వుండాలని ఒడంబడికలో పేర్కొన్నారు.

ఇక విద్యా వివక్షను ఈ విధంగా వర్ణించారు. విద్యలో జాతి, వర్ణ, భాష, మతం, ఆర్థిక స్థితిగతులు, స్త్రీ, పురుష భేదాలపై ఆధారపడి ఎలాంటి ప్రాధాన్యతగానీ, పరిమితిగానీ, ప్రత్యేకత అసమానత గానీ చూపినట్టయితే దానిని వివక్షగా అభివర్ణించారు. ఇదే కాకుండా, సామాజిక మూలాలను బట్టి, జాతీయత, ఆర్థిక స్థితిగతి, పుట్టుకను బట్టిగానీ అసమానత చూపినప్పుడు దానిని కూడా వివక్షగా పేర్కొన్నారు. విద్యకు సంబంధించిన అన్ని రంగాల్లోనూ, వివక్షకు అవకాశం వుంది. అన్ని రకాల, అన్ని స్థాయిల విద్య, విద్యా ప్రమాణాలు, విద్య నేర్చుకునే స్థితిగతుల వివక్షకు కూడా అవకాశం వుంది. విద్యా వివక్షపైన పేర్కొన్న ఏ అంశాలపైన కూడా ఆధారపడి వుండవచ్చు. దీనితోపాటు స్త్రీలు, నల్లజాతి ప్రజలు, దళితులు, మత, భాషా పరమైన అల్ప సంఖ్యాకులు, వికలాంగులు, పేదలు విద్యా రంగంలో వివక్షకు గురయ్యారు. అలాగే ప్రభుత్వాల స్థాయిలో కొన్ని చట్టపరమైన నిబంధనల్లో కూడా వివక్షకు తావుంది. ఈ నిబంధనలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు అలసత్వంతో వ్యవహరించినప్పుడు కూడా వివక్షలు కొనసాగుతూనే ఉంటాయి.

BRAOU

విద్యలో వివక్షను గుర్తించడం ఆయా రాజ్యాల ప్రథమ కర్తవ్యం. విద్యలో వివక్ష నిర్మూలనకు విద్యారంగంలో సమానత్వాన్ని సాధించేందుకు ప్రభుత్వాలు పాలనాపరమైన, న్యాయపరమైన సానుకూల చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఈ మేరకు జాతీయ విధానాలు రూపొందించుకోవాలి.

## 8.2.3 వివక్షకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన పాలనా, న్యాయ పరమైన చర్యలు

విద్యా వివక్షకు తోడ్పడే అన్ని రకాల చట్టపరమైన నిబంధనలను, పరిపాలనా సంబంధమైన ఆదేశాలను తొలుత రద్దు పరచాలి. విద్యా సంస్థల్లో వివక్షను చట్టం ద్వారా నిషేధించాలి. ఏదేని విద్యా సంస్థలో ఒక ప్రత్యేకమైన సమూహానికి చెందిన విద్యార్థులు వున్నారన్న కారణంగా ప్రభుత్వం ఎప్పుడూ వివక్ష చూపరాదు. విదేశీయులైనా సరే స్వదేశీయులతో సమానంగా విద్యా హక్కును కల్పించాలి.

## 8.2.4 వివక్షకు వ్యతిరేకంగా తీసుకోవల్సిన విధాన నిర్ణయాలు

విద్యా రంగంలో సమానత్వ సాధనకు, సమాన అవకాశాలు, సమదృష్టి సాధనకు విద్యపై రూపొందించే జాతీయ విధానంలో ఇందుకు సంబంధించిన సూత్రాలను అదనంగా రూపొందించుకోవాలి. ఇందులో భాగంగా ప్రాథమిక విద్యను తప్పని సరి చెయ్యడంతోపాటు, ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. అన్ని విద్యా సంస్థల్లోనూ

ప్రమాణాల్లో సమానత్వాన్ని సాధించడానికి అన్ని సంస్థలకూ అవసరమైన భవనాలు, ఉపాధ్యాయులు, సంస్థలు చేకూర్చాలి. ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వాలి. అలాగే అసలే ప్రాథమిక విద్య ప్రారంభించనివారికీ, ప్రాథమిక విద్య పూర్తి చెయ్యనివారికి కూడా విద్యాభ్యాస అవకాశం కల్పించాలి (అధికరణ 4)

## 8.2.5 ప్రత్యేక నిబంధనల రూప కల్పన ఆవశ్యకత

చారిత్రికంగా, తర తరాలుగా విద్య నిరాకరణకు గురైన మహిళలకు సమాన అవకాశాలు కల్పించడానికి, ప్రత్యేక పాఠశాలలు ఏర్పరచడం లాంటి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఒడంబడిక గుర్తించింది. అలాగే, మత, భాషా పరమైన ఇతర అల్పసంఖ్యాకులు తమ అస్తిత్వం, సంస్కృతి పరిరక్షించుకొనటానికి తమ పిల్లలను ప్రత్యేక పాఠశాలల్లోనే చేర్చడానికి ఇష్టపడతారు. అల్ప సంఖ్యాక వర్గాలకు తాము ఈ విధంగా కోరుకునే హక్కువుంది కనుక వారికి అవకాశాలను, సౌకర్యాలను సమకూర్చాలి. ఇలాంటి వారు వారి వారి సంస్కృతులను అర్థం చేసుకోవడానికి వారికి వారి మత బోధనలకు కూడా హాజరయ్యే స్వేచ్ఛ కల్పించాలి. ఈ మేరకు విద్యా స్థాయిని, ప్రమాణాలను రూపొందించాలి.

ఈ విధంగా ఈ ఒడంబడిక, ఆయా రాజ్యాలు ప్రజలకు విద్యావకాశాలు కల్పించాలని, ప్రతి వ్యక్తి విద్యా హక్కును ప్రాథమిక మానవ హక్కుగా గుర్తించాలని కోరింది.

## 8.3 మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా ఒడంబడిక (సి.ఇ.డి.ఎ.డబ్ల్యు.)

## 8.3.1 పరిచయం

CEDAW ను 1979లో రూపొందించి 1981లో అమలులోకి తెచ్చారు. నిజానికి స్త్రీల స్థితిగతుల కమిషన్ 1947లోనే మహిళా హక్కుల జాబితాను రూపొందించే క్రమాన్ని ప్రారంభించింది. అన్ని రకాల జాతి వివక్షల నిర్మూలనా ఒడంబడిక నమూనాలో రూపొందించిన మహిళా వివక్ష నిర్మూలనా ఒడంబడిక మహిళల హక్కులపై అధికార పత్రం కాదుగానీ, మహిళా పురోగతికి ఆటంకంగా వున్న వివక్షలను కూలదోసి హక్కులు అనుభవించడానికి దోహదం చేసింది. జాతి వివక్షల నిర్మూలన 1973లో రూపొందించినప్పటికీ 1981 దాకా మహిళల హక్కుల ఒడంబడిక రూపుదిద్దుకోలేదు. ఐక్యరాజ్య సమితి మహిళల పురోగతి కృషిలో తలమునకలయి వున్న స్థితిలో ఈ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి మహిళా సమస్యలపై అంతర్జాతీయ కార్యాచరణ అన్న కార్యక్రమం చేపట్టిన సందర్భంగా ఈ ఒడంబడిక తయారు చేసారు.

మహిళా సమస్యలపై గత ఒడంబడికలను అనుసరించి మహిళలపై వివక్ష నిర్మూలనపై కేంద్రీకరించి ఈ ఒడంబడికను తీర్చి దిద్దారు. అయితే పెళ్లి తత్సంబంధిత హింస, పురుషులనుంచి హింస, మాతృత్వ హక్కు, పునరుత్పత్తి హక్కు, లైంగిక పాత్ర హక్కుల లాంటి మహిళలకే ప్రత్యేకమైన హక్కుల జాబితాను తయారు చేయడంలో మాత్రం ప్రణాళికా వంతమైన కృషి మాత్రం జరగలేదు. ఈ ఒడంబడికలో అలాంటి హక్కులను కొన్నింటిని చేర్చినప్పటికీ అవి క్రమానుగతమైన కృషి వల్లనే సాధ్యమయింది.

మనిషిగా పుట్టినందుకు మానవజాతికి హామీ పడిన హక్కులకు సంబంధించి మహిళలపై వివక్షను నిర్మూలించే దిశగా ఈ ఒడంబడిక ప్రధానంగా కృషి చేసింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రకటనలో వున్న పూర్వపు నిబంధనలు ఎన్ని వున్నప్పటికీ జీవితపు అన్ని పార్శ్వాల్లోనూ మహిళలపై వివక్ష కొనసాగుతూనే వున్నది. ఆయా దేశాల రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో పురుషులతో సమానంగా మహిళల భాగస్వామ్యాన్ని నిరోధిస్తూనే

BRAOU

వున్నారు. ఆయా దేశాల్లోని సామాజిక, ఆర్థిక, కుటుంబీక వ్యవహారాలలో మహిళల కృషిని ఇప్పటికీ గుర్తించడంలేదు. మహిళల కృషి స్వాభావికమయిందే కానీ, సామాజిక మైనది కాదనే కుంటి సాకుతో వీరి కృషిని గుర్తించ నిరాకరిస్తున్నారు. ఉదాహరణకు మాతృత్వం స్వాభావికమయిన అంశంగా పరిగణిస్తున్నారే తప్ప దాని సామాజిక ప్రాధాన్యతను ఇప్పటికీ గుర్తించడం లేదు. శారీరక ప్రాతిపదికన కూడా మహిళల పట్ల వివక్ష కొనసాగుతున్నది. అందుకే అన్ని వ్యవస్థలలోనూ మహిళల శ్రమకు గుర్తింపు నివ్వాలని ఈ ఒడంబడిక నొక్కిచెప్పింది. అలాగే సామాజిక, ఆర్థిక పురోగతిలో మహిళల పాత్రను గుర్తించకుండా, పిల్లల పెంపకం స్త్రీ, పురుషుల సమాన బాధ్యతగా భావించకుండా వివక్షను పూర్తిగా తుడిచిపెట్టడం అసాధ్యం.

## 8.3.2 విషయక్రమం

ఈ ఒడంబడికను ఆరు భాగాలుగా 30 అధికరణలుగా రూపొందించారు. న్యాయం, విద్య, రాజకీయం, పెళ్లి, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, సామాజిక జీవితం, బ్యాంకింగ్, కుటుంబం తదితర రంగాలలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షను నిర్మూలించడానికి ఆయా రాజ్యాలు చేపట్టవలసిన న్యాయసంబంధమైన ఇతర చర్యలను మొదటి నాలుగు భాగాల్లోనూ చర్చించారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పౌర రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని మానవ హక్కులనూ, స్వేచ్ఛలూ పొందకుండా అడ్డుపడే ఏ విధమైన పరిమితులు, ఆటంకాలు, ఆంక్షలైనా వివక్షగా ఈ ఒడంబడిక నిర్వచించింది. అలాగే చారిత్రికంగా మహిళలకు జరిగిన ఈ అన్యాయాలను తొలగించడానికి రక్షిత విధానాలు చేపట్టాలని, ఇందుకోసం మాతృత్వాన్ని రక్షించేందుకు, ఇతరేతర రిజర్వేషన్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నప్పుడే న్యాయం జరుగుతుందని ఈ ఒడంబడిక పేర్కొన్నది. (అధికరణ 4)

ఒడంబడికలోని నిబంధనలను మూడు తరగతులుగా విభజించవచ్చు. మొదటిది, మహిళలకు వ్యతిరేకంగా వున్న వివక్షల నిర్మూలనకు వున్న ఆటంకాలను తొలగించడానికి తీసుకోవలసిన చర్యలు. రెండవది, వివక్షను నిర్మూలించవలసిన రంగాలు ఏవి అనేది గుర్తించడం. మూడవది, మహిళలకు ప్రత్యేకించిన హక్కుల పరిరక్షణకు తీసుకునే రక్షణ చర్యలు. ఈ మూడవ అంశంలోనే మహిళల హక్కులు అనుభవించడానికి తగిన సమర్థవంతమయిన చర్యలను కూడా సూచించారు.

BRAOU

## 8.3.3 మహిళలపై వివక్ష నిర్మూలన

మహిళలపై వివక్షను నిర్మూలించడానికి ఎదురవుతున్న ఆటంకాలను మొట్టమొదట తొలగించాలి. రాజ్యాంగంలోనూ, ఇందుకు సంబంధించిన చట్టాలలోనూ స్త్రీ, పురుష సమానత్వం సిద్ధాంతాన్ని రాయాలి. అవి మహిళలపై వివక్షను నిరోధించగలిగి వుండాలి. మహిళా హక్కులకు సమాన న్యాయ రక్షణ వుండాలి. ప్రభుత్వ అధికారులను ఎట్టి పరిస్థితులలోనూ వివక్షకు పాల్పడకుండా నిరోధించాలి. వివక్షకు సంబంధించిన ఇప్పుడున్న చట్టాలు, నిబంధనలు, ఆచారాలు, వ్యవహారాలు అన్నింటినీ మార్చడం కానీ, రద్దు పర్చడం కానీ జరగాలి. అలాగే జాతీయ శిక్షాస్మృతుల్లో వున్న వివక్షాపూరితమయిన నిబంధనలను రద్దు పరచాలి.

## 8.3.4 మహిళలకు సమాన హక్కులు కల్పించిన రంగాలు

### 8.3.4.1 సమాన న్యాయం

స్త్రీ, పురుషుల మధ్య వున్న న్యాయ అసమానతను తొలగించాలి. పౌర న్యాయానికి సంబంధించి స్త్రీ, పురుషులను

సమానంగా గుర్తించాలి. స్వంత ఆస్తి హక్కు లేకుండా, కాంట్రాక్టులపై సంతకాలు చేసే హక్కు లేకుండా వున్న ఇప్పటి స్థితిని సరి చెయ్యాలి. బ్యాంకు రుణాలు, తనఖాలు, ఇతర ఆర్థిక రుణాలు పొందడానికి మహిళలకు హక్కు వుండాలి. (మూడవ భాగం అధికరణ 13). కోర్టులు, ట్రిబ్యునళ్ల విచారణా క్రమంలో కూడా పురుషులకు సమానంగా స్త్రీలను చూడాలి. ఈ న్యాయపరమైన సౌకర్యాన్ని నిరోధించే ఏ కాంట్రాక్టునైనా చెల్లదని ప్రకటించాలి. నివాసాన్ని ఎంచుకోవడం, తరలి పోవడానికి సంబంధించి కూడా పురుషులకున్న స్వేచ్ఛను స్త్రీలకూ ఇవ్వాలి (భాగం నాలుగు అధికరణ 15)

## 8.3.4.2 జాతీయతలో సమాన హక్కులు

పెళ్లి తర్వాత మహిళలు తమ జాతీయతను మార్చుకోవాల్సిన అవసరం లేదు. వేరే జాతీయులను పెళ్లాడినప్పుడుకూడా తమ జాతీయతను వదులుకోవడానికి, మార్చుకోవడానికి, లేదా వుంచుకోవడానికి మహిళలకు పూర్తి సమానత్వ హక్కు వుండాలి. పిల్లలకు సంబంధించికూడా ఇదే హక్కు వుంటుంది. (భాగం II అధికరణ 9)

## 8.3.4.3 సమాన రాజకీయ హక్కులు

ఆయా సమాజాల రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్త్రీలకు, పురుషులతో సమాన అవకాశాలు వుండాలి. ఓటింగ్ హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు, ప్రజా ప్రతినిధిగా వుండేహక్కు, ప్రభుత్వ అన్ని స్థాయిలలో జరిగే బహిరంగ వేదికల్లో పాల్గొనడానికి, ప్రభుత్వ విధాన నిర్ణయాల రూపకల్పన, అమలు హక్కులతో సహా మహిళలకు అన్ని రాజకీయ హక్కులూ ఇవ్వాలి. దేశ రాజకీయాలకు సంబంధించిన అన్ని ప్రజా వేదికల్లోనూ, సంస్థల్లోనూ, ప్రభుత్వేతర సంస్థల్లోనూ పాల్గొనే హక్కు కూడా మహిళలకు ఇవ్వాలి. (భాగం II అధికరణ 7)

అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతినిధులను ఎన్నుకునే విషయంలో ప్రభుత్వాలు మహిళల పట్ల వివక్ష చూపకూడదు. అంతర్జాతీయ సంస్థల్లో పనిచేయడానికి మహిళలకు పురుషులతో పాటు సమాన అవకాశం ఇవ్వాలి.

BRAOU

## 8.3.4.4 సమాన విద్యావకాశాలు

విద్యా రంగంలో పురుషులకు మాదిరే మహిళలకు అన్ని హక్కులూ వుండాలి. ఈ రంగంలో స్త్రీల పట్ల వివక్ష కొనసాగకుండా ప్రభుత్వం అవసరమయిన అన్ని చర్యలూ చేపట్టాలి. విద్య అన్ని స్థాయిల్లోనూ, అన్ని రకాల్లోనూ పురుషులకు సమానంగా మహిళలకు అవకాశాలు కల్పించాలి. పురుషులతో సరి సమానంగా అదే ప్రామాణికమైన విద్య, ఆర్థిక రాయితీలు పొందే అవకాశాలు, క్రీడల్లో చురుకుగా పాల్గొనే అవకాశం, క్రీడలకు సంబంధించిన విద్య నేర్చుకునే సమాన అవకాశాలు కల్పించాలి. పాఠశాలల్లో బాలికల శాతం పడిపోకుండా వుండడానికి, విద్య మానేయకుండా చూడడానికి, స్త్రీ, పురుష నమూనా పద్ధతులను త్రోసి పుచ్చి, స్త్రీ, పురుష సమానత్వాన్ని పాదుకొల్పేందుకు చర్యలు తీసుకోవాలి. సాధ్యమయినంతవరకు ఆటపాటల్లో, స్త్రీ, పురుష భేదాలను పాటించకుండా చూడాలి (భాగం IV అధికరణ 10)

## 8.3.4.5 సమాన ఉపాధి అవకాశాలు

ఉపాధి రంగంలో మహిళలకు సమాన హక్కులు ఇవ్వాలి. ఉద్యోగ అవకాశాలు, నియామకాల్లో ఒకే నియమాలు, వృత్తి, ఉద్యోగం ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, పదోన్నతి, ఉద్యోగ భద్రత, జీత వేతనాల సమాన హక్కు, సామాజిక భద్రత, ఆరోగ్య కరమైన పని పరిస్థితులు తదితర అంశాలన్నింటిలోనూ స్త్రీలకు, పురుషులతో సమానంగా హక్కులు వుండాలి.

## 8.3.4.6 పెళ్లి కుటుంబంలో సమాన హక్కులు

అన్నింటికన్నా ముఖ్యంగా పెళ్లి, కుటుంబానికి సంబంధించి స్త్రీలకు సమాన హక్కు వుండాలి. పెళ్లి

కుదుర్చుకోవడానికి, జీవిత భాగస్వామిని ఎంచుకోవడానికి, పిల్లలకు సంబంధించి భార్యా భర్తలకు సమాన బాధ్యతలు, హక్కుల విషయంలో, దత్తత తదితర అంశాలలో స్వంత యాజమాన్యం అక్విజిషన్, పరిపాలన, వినోదం, ఆస్తి అమ్మకాలు తదితర అంశాల్లో పురుషులకు ధీటుగా మహిళలకు హక్కులు వుండాలి.

## 8.3.5 గ్రామీణ మహిళల హక్కులు

కుటుంబాల ఆర్థిక మనుగడకు గ్రామీణ మహిళలు ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల గ్రామీణ మహిళలు పోషిస్తున్న కీలకమైన పాత్రను ఈ ఒడంబడిక ప్రత్యేకంగా పేర్కొన్నది. గ్రామీణ మహిళలకు కూడా అన్ని హక్కులూ వుండేలా చర్యలు తీసుకోవాలని ఒడంబడిక అయా రాజ్యాలను కోరింది. పురుషులతో సమానంగా గ్రామీణ మహిళలు అన్ని హక్కులూ పొందేందుకు ఒడంబడిక కొన్ని కార్యాచరణలను, చర్యలను సూచించింది. గ్రామీణ అభివృద్ధి ద్వారా వచ్చే సౌకర్యాలను పొందడంలో వివక్షను నిర్మూలించాలని, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక అమలుకు సంబంధించిన అన్ని స్థాయిలలోనూ మహిళల పాత్రను పెంచాలని ఒడంబడిక పేర్కొన్నది. సరైన వైద్య సౌకర్యాలు, ముఖ్యంగా సమాచారం, కుటుంబ నియంత్రణ బోధన, సేవలు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని ఒడంబడిక సూచించింది. సామాజిక భద్రతా కార్యక్రమాల్లో వారి వారి భర్తలు, లేదా తండ్రి ద్వారా కాకుండా అవకాశాలు నేరుగా గ్రామీణ మహిళలకు అందజేయాలి. అన్ని రకాల శిక్షణ, విద్య వారికి అందుబాటులోకి తేవాలి. ఉపాధి, స్వయం ఉపాధి పథకాలు రూపొందించుకోవడానిక స్వయం సహాయ సంస్థలు, సహకార సంఘాలు నిర్మించుకోవడానికి వారికి హక్కు వుండాలి. అలాగే వ్యవసాయ రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, భూ సంస్కరణలు, మార్పిడి పథకాల్లో సమాన అవకాశాలు, గ్రామీణ మహిళలకు కల్పించాలి. సాముదాయిక కార్యకలాపాల్లో పాల్గొనే అన్ని హక్కులతో పాటు వారికి కనీస సౌకర్యాలయిన గృహనిర్మాణం, పారిశుధ్యం, విద్యుత్, నీటి సరఫరా, రవాణా, సమాచార అవకాశాలు, సౌకర్యాలు కల్పించాలని ఒడంబడిక కోరింది.

ఈ నిబంధనలన్నీ స్త్రీ, పురుష సమానత్వం, వారి హక్కుల పరిరక్షణకు రూపొందించినవే.

BRAOU

## 8.3.6 అర్థవంతమైన సమానత్వం కోసం చర్యలు మహిళల హక్కుల రక్షణ

మహిళలను చిన్న చూపు చూసే సామాజిక, సాంస్కృతిక వెనుకబాటు తనాన్ని రూపుమాపడానికి, దీనివల్ల ఏర్పడే స్త్రీ, పురుష నమూనా పద్ధతి తేడాను తొలగించడానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. అలాగే మాతృత్వం ఒక సామాజిక కార్యకలాపం అని, పిల్లల బాధ్యత స్త్రీ, పురుషులిద్దరిదీ అన్న చైతన్యాన్ని కలిగించడానికి రాజ్యం ప్రయత్నించాలి. (భాగం I అధికరణ 5)

వ్యభిచారం, లైంగిక దోపిడీ స్త్రీల గౌరవాన్ని కించపరిచే చర్యలు మానవ హక్కుల ఉల్లంఘనగా భావించి వీటన్నింటినీ అరికట్టడానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. (భాగం I అధికరణ 5)

ఉద్యోగ అవకాశాల్లో, ముఖ్యంగా పెళ్లయినవారు, తల్లుల పట్ల ఏర్పరచిన వివక్షా నిబంధనలన్నింటినీ తొలగించాలి. గర్భధారణ, వైవాహిక స్థితిని అనుసరించే అన్ని అంశాలనూ వెంటనే నిషేధించాలి. సామాజిక రాయితీలు, సీనియారిటీకి భంగం కలుగకుండా అందరు గర్భిణీలకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి. గర్భధారణ, మాతృత్వాన్ని వ్యక్తిగత బాధ్యతగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. అందుకోసం పనిచేసే స్త్రీల కోసం పిల్లల పోషణ, రక్షణ సంస్థలు లాంటివి ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. దీనితో మహిళలు కుటుంబానికి సంబంధించిన సమస్యలను

తట్టుకొని, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలిగే పరిస్థితి ఏర్పడుతుంది. గర్భిణీలు అపాయ కరమైన పని పరిస్థితుల్లో పని చేయకుండా ప్రత్యేక రక్షణ కల్పించాలి.

## 8.4 బాలల హక్కులు ఒడంబడిక

### 8.4.1 పరిచయం

ఈ ఒడంబడికను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1989లో ఆమోదించింది. బాలల మానవ హక్కుల పరిరక్షణకు ఈ ఒడంబడిక చట్టపరమైన సాధనంగా ఉపయోగపడ్తుంది. బాలల హక్కుల ఒప్పంద చట్టాలను ఇది బలోపేతం చేసింది. 1959లోనే ఆమోదించిన బాలల హక్కుల ప్రకటనలోనే తల్లిదండ్రుల అధికారం, ఆర్థిక దోపిడి, సామాజిక నిర్లక్ష్యం తదితర బాలల హక్కులను ప్రస్తావించారు. డెబ్భయికి పైగా దేశాలు ఈ ప్రకటనపై సంతకాలు చేయగా, 1990లో అమలులోకి వచ్చింది. 54 అధికరణలుగా వున్న ఈ ప్రకటన బాలల హక్కులపై దూరదృష్టితో తయారు చేయబడింది. ఆయా దేశాల సామాజిక, రాజకీయ జీవితంలో పిల్లలు చురుకైన సృజనాత్మకపాత్ర వహించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ ప్రకటన కోరింది. ఈ ఒడంబడికలో 18 సంవత్సరాలకు లోబడిన పిల్లలందరినీ బాలలుగా గుర్తిస్తూ, వారి హక్కులకు ప్రత్యేక రక్షణ అవసరమని భావించింది. ఒక బాలుడు లేదా బాలిక స్వంత జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో, అతని లేదా ఆమె స్వీయ అభివృద్ధిలో వారి పాత్రను ఈ ఒడంబడిక ధృవీకరించింది. వారి తల్లి దండ్రులపై ఆధారపడి బాలలపై ఎలాంటి వివక్షా చూపరాదని, వారి తల్లిదండ్రుల నేపథ్యం మీద ఆధారపడిన బాలల వివక్షను వ్యతిరేకించే హక్కును కల్పించింది. బాలలకు సంబంధించిన వివిధ సంస్థల ఏకైక లక్ష్యం, ప్రథమ కర్తవ్యం 'బాలల ప్రయోజనాలే' అని ఈ ఒడంబడిక ధృవీకరించింది.

### 8.4.2 తల్లిదండ్రుల రక్షణ హక్కు

బాలల పెంపకంలో కుటుంబ వాతావరణం, తల్లిదండ్రుల రక్షణ అవసరమని ఒడంబడిక గుర్తించింది. 'బాలలు తమ పూర్తి స్థాయి మూర్తిమత్వం రూపొందడానికి, అభివృద్ధికి కుటుంబ వాతావరణంలో పెరగాలి. ప్రేమ, ఆనందం, అర్థం చేసుకునేవారు వుండే వాతావరణం కావాలి' అని ఒడంబడిక ఖరారుచేసింది. అలాగే పిల్లలపై తల్లిదండ్రుల అధికారాన్ని గుర్తిస్తూనే, ఇలాంటి అధికారం నుంచి కొంత రక్షణ కూడా కల్పించింది. తల్లిదండ్రులు, పిల్లల సంబంధాల గురించి అధికరణ 5,7,9,10,18,20,21,22 లలో అన్ని కోణాలనుంచీ చర్చించారు. ప్రతి బాలలు తమతమ తల్లిదండ్రులెవరో తెలుసుకునే హక్కువుంది. వారి సంరక్షణ పొందే హక్కు వుంటుంది. (అధికరణ 7) ఒక పిల్లవాని జీవితంలో తల్లిదండ్రులు లేదా సంరక్షకుల హక్కులు, విధులు, బాధ్యతల ప్రాధాన్యత ఎంతో వుంటుందని వీటిలో స్పష్టంగా చెప్పారు. (అధికరణ 5) తల్లిదండ్రుల నుంచి పిల్లలు వేరు కాకూడదు. ఒక వేళ తల్లిదండ్రులు విడిపోయినా, ఇద్దరినీ కలుసుకోవడానికి పిల్లలకు హక్కు వుంటుంది. ఒకవేళ తల్లిదండ్రులు జైలు పాలయినా, అటు తల్లిదండ్రులు, ఇటు పిల్లలు వారి వారి యోగక్షేమాలు విచారించుకునే హక్కు వుంటుంది. (అధికరణ 9) విదేశాల్లో వున్న తల్లిదండ్రులను కలుసుకునే హక్కు, వారితో సంబంధాలు కొనసాగించే హక్కు పిల్లలకు వుంటుంది. (అధికరణ 10). పిల్లల బాధ్యత తల్లిదండ్రులిద్దరికీ సమానంగా వుంటుంది. ఇందుకోసం రాజ్యం కూడా ఈ భావనను ప్రోత్సహించి సహకరించాలి అంటే తల్లి రాజ్యం కూడా ఈ భావనను ప్రోత్సహించి సహకరించాలి. అంటే తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులయినప్పుడు వారి పిల్లల సంరక్షణా కేంద్రాలు లాంటివి ఏర్పాటు చేయాలి (అధికరణ 18). తల్లిదండ్రుల సంరక్షణ కర్వైన పిల్లలకు

BRAOU

రాజ్యం వారి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి. లేదా దత్తత ఏర్పాటు చేయాలి. (అధికరణ 20) అయితే దత్తత పిల్లల సంరక్షణ బాగుండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. (అధికరణ 21)

## 8.4.3 వ్యక్తిగా గుర్తింపు

ప్రతి బాలకీ జీవించే హక్కు, వ్యక్తిత్వం, జాతీయత హక్కు వుంటుంది. (అధికరణ 6) అలాగే ఆరోగ్య సంరక్షణ, విద్యా హక్కు కూడా వుంటుంది. న్యాయ సంబంధ విషయాలతో సహా పిల్లలకు సంబంధించిన విషయాలపై మాట్లాడడానికి బాల బాలికలకు హక్కు వుంటుంది (అధికరణ 12). పిల్లలకు భావ ప్రకటనా స్వేచ్ఛ అలాగే ఏ సమాచారాన్నైనా తెలుసుకోవడానికి, వెల్లడించడానికి బాలలకు హక్కు వుంటుంది. (అధికరణ 13) భావ స్వేచ్ఛ, చైతన్యం, మతం, శాంతియుతంగా సమావేశాలు ఏర్పాటు చేసుకునే హక్కు కూడా బాలలకు వుంది (అధికరణ 15) అంతర్జాతీయ సంస్థలు అందించే సమాచార సాధనాల సమాచారం తెలుసుకునే హక్కు కూడా పిల్లలకు వుంటుంది (అధికరణ 17).

## 8.4.4 లైంగిక అత్యాచారాలు, ఆర్థిక దోపిడీలనుంచి రక్షణ

హింసకు అందరికన్నా ఎక్కువ గురవుతున్నది పిల్లలే. పిల్లలపై వేధింపులు, గాయపర్చడం, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఈ ఒడంబడిక రక్షణ కల్పించింది. బాలలు తమ తల్లిదండ్రులు లేదా సంరక్షకుల రక్షణలో వున్నప్పటికీ, భౌతిక లేదా మానసిక హింసలనుంచి, గాయపర్చడం, అత్యాచారాలనుంచి, నిర్లక్ష్యం, అలక్ష్యాల నుంచి, లైంగిక దోపిడీతో సహా, అన్ని రకాల పీడనలనుంచి పిల్లలను రక్షించడానికి ఆయా రాజ్యాలు శాసనపరమైన, పాలనాపరమైన, సాంస్కృతిక పరమైన చర్యలు తీసుకోవాలని ఒడంబడిక ప్రకటించింది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు రాజ్యం పిల్లలకు అవసరమైన రక్షణ కూడా కల్పించాలి. బాలలపై వేధింపులను గుర్తించి, దర్యాప్తు జరిపి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. ఇదే కాకుండా పిల్లలు ఆరోగ్యవంతంగా, ఆత్మగౌరవంతో, హుందాగా బ్రతకడానికి వీలైన పరిస్థితులను కల్పించడానికి రాజ్యం అన్ని చర్యలూ తీసుకోవాలి.

BRAOU

బాలల సంక్షేమం పరిధిలోకి వచ్చే అన్ని రకాల దోపిడీలనుంచి పిల్లలను రక్షించాలి. (అధికరణ 36) పిల్లల అపహరణ, అమ్మకం, వ్యభిచారాన్ని నిరోధించాలి (అధికరణ 35). బాలల శ్రమదోపిడీని నిర్మూలించాలి. ఉద్యోగానికి కనీస వయసును నిర్ధారించి, సక్రమ పని గంటలు, పని పరిస్థితులు రూపొందించి ఈ చట్టాలను ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించాలి (అధికరణ 32)

## 8.4.5 సాయుధ సంఘర్షణల నుంచి రక్షణ–న్యాయ రక్షణ

న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న పిల్లలకు రాజ్యం సహాయం అందించాలి. ఏ బాల కానీ, చిత్ర హింసలకు, అమానుష అవమానాలకు, శిక్షలకు గురికాకూడదు. పిల్లలకు, యావజ్జీవకారాగారం, మరణ శిక్షలాంటివి వేయకూడదు. పిల్లల విషయంలో అరెస్టు, నిర్బంధం, జైలు శిక్షలాంటివి అనివార్యమైతేనే ఉపయోగించాలి (అధికరణ 37) చట్ట పరిధి నేరశిక్షాస్మృతి పరిధిలోకి వచ్చే పిల్లల కనీస వయసును నిర్ధారించి, ఈ పరిధిలోకి రాని పిల్లలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలి.

సాయుధ సంఘర్షణల సమయంలో పిల్లల ప్రయోజనాల పరిరక్షణకు కూడా రాజ్యం బాధ్యత వహించాలి. సాయుధ దళాల్లోకి, సాయుధ బలగాల్లోకి 15 సంవత్సరాల లోపు పిల్లలను చేర్చుకోకూడదు. ఈ వయసు పిల్లలను యుద్ధంలో వాడుకోకూడదు. సాయుధ సంఘర్షణల వల్ల నష్టపోయిన పిల్లల రక్షణ రాజ్యం తీసుకోవాలి (అధికరణ 38)

## 8.4.6 వికలాంగ బాలలకు ప్రత్యేక హక్కులు

వికలాంగ బాలల కోసం ఒడంబడికలోని (అధికరణ 23) ప్రత్యేక చర్యలు ప్రకటించింది. భౌతికంగా, మానసికంగా వికలాంగులయిన పిల్లలకు కూడా పూర్తిస్థాయి మంచి జీవితం గడిపే హక్కు వుందని ఒడంబడిక ప్రకటించింది. ఇలాంటి పిల్లలకు విద్యా హక్కు, ప్రత్యేక పరిగణన, శిక్షణ, ఆరోగ్య సంరక్షణ, పునరావాస సేవలు, ఉపాధి చూపెందుకు తగిన ఏర్పాట్లు చెయ్యాలని ఒడంబడిక పేర్కొన్నది.

## 8.5 ముగింపు

ఒడంబడికలన్నీ కూడా అమలు చేయడానికి వివిధ రాజ్యాలలో బలహీనమయిన పాలనా యంత్రాంగాలు మాత్రమే వున్నాయి. కనుక వివక్షల నిర్మూలనకు ఐక్యరాజ్య సమితి సాధారణ సభ చేసిన సిఫారసులు చాలావరకు, అనేక రాజ్యాలు సమర్థంగా చర్యలు తీసుకోక పోవడంతో నీరుగారి పోయాయి. ఒడంబడికల సిఫారసులు అమలు పరచడంలో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల అంగాల అసమర్థతతోపాటు, ఒడంబడికలను అమలు పరిచే యంత్రాంగం లేకపోవడంతో అమలు కాలేకపోయాయి.

ఒడంబడికలు ఏర్పాటు చేసిన కమిటీలకు క్రమ గతమైన నివేదికలు సమర్పించడం తప్ప రాజ్య సంస్థలు చేసిందేమీలేదు. వీటిని కమిటీలు పరిశీలిస్తాయి. వ్యక్తులు తమ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడుగానీ, ఒక రాజ్య సంస్థ, మరో రాజ్య సంస్థ హక్కుల ఉల్లంఘనల గురించి కానీ, కమిటీలకు ఫిర్యాదు చేసే నిబంధన ఏదీ లేదు. అందువల్ల పౌర, రాజకీయ హక్కులకు సంబంధించి వ్యక్తుల సమస్యలకు అంతర్జాతీయ ప్రకటనలు ఏవీ పరిష్కారం చూపలేకున్నాయి. పౌర, రాజకీయ హక్కులకు సంబంధించి, రాజ్య సంస్థలు కూడా ఎలాంటి నిఘాను ఏర్పాటు చేయలేకున్నాయి.

BRAOU

## 8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I.** ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానం రాయండి

1. విద్యా వివక్షకు వ్యతిరేకంగా రూపొందించిన ఒడంబడికలో ముఖ్యాంశాలేవి? ఈ హక్కు సాధనలో ఎదురయ్యే అవరోధాలేవి?
2. సిఇడిఎడబ్ల్యులో ముఖ్యాంశాలేవి? వాటిలో లోపాలేమిటి?

**II.** ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి

1. గ్రామీణ మహిళల హక్కులకు సంబంధించి సిఇడిఎడబ్ల్యు సూచించిన చర్యలేవి?
2. బాలలపై వివక్షకు వ్యతిరేకంగా రూపొందించిన ఒడంబడికలో హక్కుల పరిరక్షణ సిఫారసులేవి? ఇతర హక్కులకు, బాలల హక్కులకు మధ్యగల తేడాను వివరించండి?

## 8.7 సంప్రదింపు గ్రంథాలు


1. 'కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫార్మ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ అగెనెస్ట్ వుమెన్' *ఎ/ఆర్ఇఎస్/34/180,* 18 డిసెంబర్, 1979.
2. 'కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ది చైల్డ్' *ఎ/ఆర్ఇఎస్/44/25* 20, నవంబర్, 1989

3. 'నిరాబరోస్ 'ఇంటర్నేషనల్ లా అండ్ హ్యూమన్ రైట్స్-ది కేస్ ఆఫ్ వుమన్స్ రైట్స్, ఇన్ టామ్ కాంప్ బెల్స్, 'హ్యూమన్ రైట్స్ : టరిక్ టు రియాలిటీ' బ్లాక్‌వెల్ పబ్లిషర్స్, 1986

4. సాంద్రా కాలివర్ 'యునైటెడ్ నేషన్స్ మెషినరీస్ ఆన్ వుమన్ రైట్స్ హౌ మైట్ దే బెటర్ హెల్ప్ వుమన్ హూజ్‌రైట్స్, ఆర్ బీయింగ్ వయొలేటెడ్' 'న్యూడైరెక్షన్స్ ఇన్ హ్యూమన్ రైట్స్' -ఫిలడెల్ఫియా, యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ప్రెస్, 1989

5. 'ది యునైటెడ్ నేషన్స్ అండ్ హ్యూమన్ రైట్స్ *1945*, 1995 డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్స్, న్యూయార్క్- 1995

6. కాత్యాయనీ విద్మహే, జ్యోతిరాణి, శోభ, మహిళా జనజీవన సమస్యలు, మూలాల అన్వేషణ, స్త్రీ జనాభ్యుదయ సంస్థ, వరంగల్, 1994.

BRAOU

# భాగం 9: అభివృద్ధి హక్కులు

## విషయ క్రమం


9.0 ఉద్దేశం

9.1 పరిచయం

9.2 కొత్త హక్కుల డిమాండ్‌కు గల సందర్భం

9.3 సహజ వనరుల మీద ప్రజలకు శాశ్వత సార్వభౌమత్వం: జనరల్ అసెంబ్లీ తీర్మానం

9.3.1 పరిచయం

9.3.2 లక్ష్యాలు

9.3.3 విషయాలు

9.4 ఆకలి, పౌష్టికాహార లోపాల నిర్మూలనపై అంతర్జాతీయ ప్రకటన

9.4.1 పరిచయం

9.4.2 లక్ష్యాలు

9.4.3 ఆహార భద్రత ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత

9.4.4 ఆహార భద్రత పట్ల సంపన్న దేశాల బాధ్యత

9.4.5 ఆహార భద్రతా వ్యవస్థ కోసం అంతర్జాతీయ సహకారం

9.4.6 ఆకలి, పౌష్టికాహార లోపం లేకుండా బతకడం ఒక ప్రాథమిక మానవ హక్కు

9.5 శాస్త్ర సాంకేతిక ప్రగతిని శాంతి కోసం, మానవాళి శ్రేయస్సు కోసం ఉపయోగించడంపై అంతర్జాతీయ ప్రకటన

9.5.1 పరిచయం, లక్ష్యాలు

9.5.2 శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో పాటించవలసిన ప్రమాణాలు

9.5.3 శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించకూడని సందర్భాలు: వాటి ప్రమాణాలు

9.6 అభివృద్ధి హక్కుపై అంతర్జాతీయ ప్రకటన

9.6.1 పరిచయం, అభివృద్ధికి అర్థం

9.6.2 మనిషి కేంద్రంగా అభివృద్ధి క్రమం

9.6.3 అభివృద్ధి సాధనంగా రాజ్యం

9.6.4 ప్రపంచ శాంతి, నిరాయుధీకరణ: అభివృద్ధికి అవసరమైన పరిస్థితులు

9.7 ముగింపు

9.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

9.9 చదవాల్సిన పత్రాలు, పుస్తకాలు


BRAOU

## 9.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- అభివృద్ధి హక్కుపై అంతర్జాతీయ ప్రకటనలలో ఉన్న అంశాలను వివరించగలుగుతారు
- ఆకలి, పౌష్టికాహార లోపాల నిర్మూలనపై అంతర్జాతీయ ప్రకటన తెలుసుకుంటారు.
- శాస్త్ర సాంకేతిక ప్రగతిని శాంతికోసం, మానవాళి శ్రేయస్సుకోసం ఉపయోగించడంపై ఒక అవగాహనకు రాగలుగుతారు.

## 9.1 పరిచయం

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వనరుల పంపకం న్యాయంగా జరిగినప్పుడే మనుషులందరూ మానవ హక్కుల్ని అనుభవించగలరు. అంటే వర్ధమాన దేశాల దగ్గర కూడు, గూడు, గుడ్డ వంటి ప్రాథమిక అవసరాలను సమకూర్చగల వనరులు ఉంటేనే వాళ్ల ప్రజలు నిజమైన అర్థంలోకి మానవ హక్కుల్ని పొందగలుగుతారు. మూడు పనులు జరిగితేనే యిది సాధ్యమవుతుంది. మొదటిది-శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఫలితాలను ఈ అవసరాల కోసం ఉపయోగించాలి. రెండోది-ఆయుధాలకు బదులు ఉన్న కొద్దిపాటి ఆర్థిక వనరుల్ని వీటి కోసమే ఖర్చు పెట్టాలి. మూడోది-సంపన్న దేశాల దగ్గర పోగుపడిన ఆర్థిక వనరుల్ని అందరికీ చెందేలా చర్యలు తీసుకోవాలి. వనరుల పంపిణీ న్యాయంగా జరిగినపుడే ఏ ప్రజలైనా మానవ హక్కుల్ని అనుభవించగలుగుతారని వర్ధమాన దేశాలు ఈ రోజు నిష్కర్షగానే చెపుతున్నాయి. తద్వారా తమ మాజీ వలసదొరల నయావలస వాదాన్ని సూటిగానే నిలదీస్తున్నాయి. అలాగే వనరుల్ని సమానంగా పంచుకునే హక్కు తమకుందని ప్రకటించి అవి ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను కూడా సవాలు చేస్తున్నాయి.

సహజ వనరుల మీద ప్రజలకు శాశ్వత సార్వభౌమత్వం ఉండాలనే జనరల్ అసెంబ్లీ తీర్మానంతో పాటు ఈ పాఠంవెనకబడిన దేశాలకు, వర్ధమాన దేశాలకు అవసరమైన మరో మూడు అంతర్జాతీయ ప్రకటనలను కూడా వివరిస్తుంది. అవి-ఆకలి, పౌష్టికాహార లోపాల నిర్మూలనకు ఉద్దేశించిన అంతర్జాతీయ ప్రకటన (1974), శాస్త్ర సాంకేతిక ప్రగతిని శాంతి కోసం, మానవాళి ప్రయోజనాల కోసం ఉపయోగించాలని చెప్పే అంతర్జాతీయ ప్రకటన (1975), అభివృద్ధి హక్కు గురించిన అంతర్జాతీయ ప్రకటన (1986).

## 9.2 కొత్త హక్కుల డిమాండ్‌కు గల సందర్భం

పరస్పర సంబంధమున్న మూడు ఘటనల నుండి ఈ డిమాండ్ పుట్టుకొచ్చింది. మొదటిది-రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్ర్యం పొందిన దేశాలు 'అభివృద్ధి'ని కేంద్రంగా తీసుకుని తమ ప్రయోజనాల కోసం సమైక్యం కావడం. రెండోది-తమ దేశాల ప్రాథమిక అవసరాలను తీర్చగల ఆర్థిక వనరులు ప్రచ్ఛన్నయుద్ధం పేరిట వృధా కావడాన్ని వారు వ్యతిరేకించడం. మూడోది-'అభివృద్ధి' పేరుచెప్పి వర్ధమాన దేశాల ప్రభుత్వాలు తమ ప్రజల హక్కుల్ని హరించడంపై తీవ్ర విమర్శలు రావడం.

కొత్త హక్కుల కోసం డిమాండ్ ప్రధానంగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలలోని పేద దేశాల నుండి వచ్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వారి బలహీనమైన స్థానం, దానివల్ల వారి సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలు ఈ డిమాండ్‌లో ప్రతిఫలిస్తున్నాయి. కొత్త హక్కులు వ్యక్తులతో పాటు పేద దేశాలకు కూడా లభిస్తాయి. కాబట్టి వీటిని 'మూడోతరం హక్కులు' అంటున్నారు. వీటివల్ల పేద దేశాలు సంపన్న దేశాల నుండి తమ ప్రజల అభివృద్ధికి అవసరమైన

BRAOU

ఆహారం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలను పొందే హక్కును సంపాదించుకున్నాయి. ఇప్పుడు మానవ హక్కులకు అర్థం దేశాల్లోపలే కాదు, దేశాల మధ్య కూడా వనరుల పంపిణీ న్యాయంగా, సమానంగా జరగాలని, నూతన ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు పిలుపునిచ్చిన అంతర్జాతీయ ప్రకటన లక్ష్యాలలో కూడా ఇది 'దేశాలమధ్య సమానత్వం' న్యాయం ప్రాతిపదికగా జరగాలని స్పష్టంగానే ఉంది.

కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా, ఆసియా దేశాలు 1960, 1970 దశకాలలో ఐక్యరాజ్య సమితి సభ్యత్వం తీసుకుని దానిలో వర్ధమాన దేశాల సంఖ్యాబలాన్ని పెంచాయి. అయితే అప్పటికే వారి అభివృద్ధికి అవసరమైన డబ్బు, సాంకేతికపరిజ్ఞానం, అధికారం అన్నీ మాజీ వలసవాద దేశాల చేతుల్లో ఉండిపోవడంతో ఈ పరిస్థితిని మార్చి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్తరూపం ఇవ్వడానికి ఆసియా, ఆఫ్రికా దేశాలు సమైక్యంగా ఒక ప్రకటనను రూపొందించి ఐక్యరాజ్య సమితి చేత ఆమోదింప జేశాయి. దీనికి కొనసాగింపుగా అవి తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతుల్ని మెరుగు పరుచుకోవడానికి సంపన్న దేశాలను వాళ్ల ఆహారం, వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తమతో పంచుకోమని డిమాండ్ చేశాయి. వనరులలో వాటా ఇవ్వకపోతే తమ ప్రజలు మానవ హక్కుల్ని అనుభవించలేరని కూడా స్పష్టం చేశాయి. వీరి ప్రయత్నాల ఫలితంగానే 1980లలో 'అభివృద్ధి హక్కు' ప్రాథమిక మానవ హక్కుల్లో ఒకటిగా ఆమోదం పొందింది. ఈ మార్పుకు నేపథ్యం ప్రచ్ఛన్నయుద్ధ పరిణామాలు. ఆ కాలంలో ప్రపంచ ఆర్థిక వనరుల్లో అత్యధిక భాగం కొత్త కొత్త ఆయుధాలను కనిపెట్టడానికి, కొనడానికి ఖర్చవుతుండేవి. నిరాయుధీకరణ అభివృద్ధిని వేగవంతం చేయగలదనే జ్ఞానం కలిగాక 1970లనుంచి త్రాసు క్రమంగా అభివృద్ధి వైపు మొగ్గుతూ వచ్చింది. ఆయుధ పోటీని ఆపి, ఆ నిధులను వర్ధమాన దేశాల ప్రజావసరాల కోసం ఉపయోగించాలనే డిమాండ్ అప్పటినుంచే మొదలైంది. శాంతి భద్రతలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పరస్పర సంబంధమైనవి కాబట్టి ఒకటి లేకపోతే రెండోది ఎంతోకాలం ఉండదని వర్ధమాన దేశాలకు అర్థమైంది.

చాలా వర్ధమాన దేశాలకు వలసవాద బాధిత చరిత్రేకాక విదేశీ ఆక్రమణ, జాతి వివక్ష, నయా వలస వాదం మొదలైన బాధలు కూడా ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో వచ్చే ఆటుపోట్లన్నీ వీటికీ గట్టిగా తగులుతున్నాయి. వీటి వ్యవసాయోత్పత్తులకు గాని, ఇతర ఉత్పత్తులకు గాని అంతర్జాతీయ మార్కెట్లలో గిరాకీ ఉండదు. దేశ అభివృద్ధికి అవసరమైన శాస్త్ర సాకేతిక విజ్ఞానం వాటికి ఎప్పుడూ అందుబాటులో ఉండదు. ఉన్నప్పుడు కూడా అది ప్రజల సంక్షేమానికి కాక వారి మానవ హక్కులను హరించడానికి ఉపయోగపడుతుంది.

మూడో అంశం జాతీయ పాలక వర్గాలకు సంబంధించినది. వీరు వేరెవరి హక్కుల్నో కాదు, తమ ప్రజల హక్కుల్నే యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. సహజవనరుల ప్రాపకంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న అన్యాయమే జాతీయ స్థాయిలో కూడా జరుగుతోంది. ఫలితంగా అత్యధిక ప్రజానీకానికి ప్రాథమిక హక్కులు సైతం లేకుండా పోయాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా పైన పేర్కొన్న మూడు అంతర్జాతీయ ప్రకటనలూ వర్ధమాన దేశాల సర్వతోముఖాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ అభివృద్ధిని సాధించే ప్రాథమిక బాధ్యత ఆయా దేశాలదే అయినా వాటికి అంతర్జాతీయ సహకారం కూడా చాలా అవసరమని మూడు ప్రకటనలూ నొక్కి చెప్పాయి. అలాగని దీన్ని లైసెన్స్‌గా తీసుకుని ప్రజలకు మానవ హక్కులు లేకుండా చేయొద్దని, సహజసిద్ధమైన హక్కుల్ని అభివృద్ధి పేరుతో తొలగించవద్దని ఈ ప్రకటనలు ప్రభుత్వాలను హెచ్చరించాయి.

జనరల్ అసెంబ్లీ తీర్మానం గురించి క్లుప్తంగా చెప్పుకున్నాక ఈ మూడు ప్రకటనలను వరస క్రమంలో చర్చిద్దాం.

## 9.3 సహజవనరుల మీద ప్రజలకు శాశ్వత సార్వభౌమత్వం: జనరల్ అసెంబ్లీ తీర్మానం

BRAOU

## 9.3.1 పరిచయం

ఈ తీర్మానాన్ని 1962లో ఆమోదించారు. వర్ధమాన దేశాలు అప్పుడప్పుడే సంపాదించుకున్న రాజకీయ సార్వభౌమత్వానికి ఇది అండగా ఉంటుందనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ తీర్మానం చేసింది. రాజకీయ సార్వభౌమత్వాన్ని రక్షించుకోవడానికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని ఇది గుర్తించింది. వర్ధమాన దేశాలకు వారి మాజీ వలస పాలకులైన సంపన్న దేశాల నుండి ఆర్థిక, ద్రవ్యపరమైన లావాదేవీలలో రక్షణ కల్పించాల్సి వచ్చింది. వలస పాలకులు కొల్లగొట్టుకుపోయిన జాతీయ వనరులను వారికి తిరిగి ఇప్పించడం, సహజవనరుల మీద వారికి శాశ్వతమైన, అనుల్లంఘనీయమైన హక్కు కల్పించడం, రెండూ అవసరమయ్యాయి. ఈ హక్కు ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కులో ముఖ్యమైన భాగమని గుర్తించే ఈ తీర్మానం వర్ధమాన దేశాలకు చాలా మేలు చేసింది.

## 9.3.2 లక్ష్యాలు

కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు నిజమైన అర్థంలో స్వతంత్ర దేశాలుగా కొనసాగాలంటే అంతర్జాతీయ ఆర్థిక రంగంలో వాటి స్వతంత్ర ప్రతిపత్తికి, స్వయం నిర్ణయాధికార హక్కుకు గుర్తింపు ఉండాలి. వారి సహజవనరుల మీద వారికి పూర్తి ఆధిపత్యం ఉన్నప్పుడే ఇది సాధ్యం. అప్పుడే వారు తమ వనరుల్ని, సంపదను జాతీయ ప్రయోజనాలకోసం, ప్రజల శ్రేయస్సు కోసం ఉపయోగించగలుగుతారని తీర్మానం పేర్కొంది. ఈ వనరులు ప్రైవేట్ పెట్టుబడి ప్రయోజనాల కోసం కాక మెజారిటీ ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడేలా చేయడానికి కూడా ఇది ప్రయత్నించింది.

## 9.3.3 విషయాలు

సహజ వనరుల మీద, సంపద మీద ప్రజలకు, వారు నివశిస్తున్న దేశాలకు మాత్రమే పూర్తి హక్కులు ఉంటాయని ఈ తీర్మానంలోని మొదటి రెండు అధికరణాలు స్పష్టం చేశాయి. వాటి అన్వేషణ, అభివృద్ధి, అమ్మకం అన్నీ ఆయా ప్రజల శ్రేయస్సుకు, వారి జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే జరగాలని చెప్పాయి. వనరుల అభివృద్ధికి విదేశీ పెట్టుబడిని దిగుమతి చేసుకోవాల్సి వస్తే అది ఆయా దేశాలు, ప్రజలు విధించే షరతులకు, నిబంధనలకు లోబడే జరగాలని చెప్పాయి. ఈ పెట్టుబడుల మీదవచ్చే లాభాలను పెట్టుబడి దారులు ఆయా దేశాల వాళ్లతో సమానంగా పంచుకోవాలని మూడో అధికరణం చెప్పింది. నాలుగో అధికరణ ప్రకారం వనరుల వినియోగంలో ప్రజావసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలే తప్ప విదేశీ అయినా, స్వదేశీ అయినా వ్యక్తిగత లేదా ప్రైవేట్ ప్రయోజనాలకు ఇవ్వకూడదు. దేశాలకు తమ వనరులమీద ఉండే సార్వభౌమత్వాన్ని అన్ని అంతర్జాతీయ ఒప్పందాలు గుర్తించి, గౌరవించాలని ఐదు, ఆరు అధికరణాలు పేర్కొన్నాయి. లేకపోతే అది ఐక్యరాజ్యసమితి ప్రణాళికను అతిక్రమించడమవుతుందని హెచ్చరించాయి.

# 9.4 ఆకలి, పౌష్టికాహార లోపాల నిర్మూలనపై అంతర్జాతీయ ప్రకటన

## 9.4.1 పరిచయం

వర్ధమాన దేశాలు తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రపంచ ఆహార సదస్సు 1973లో ఈ ప్రకటనను ఆమోదించింది. మరుసటి సంవత్సరం ఇది జనరల్ అసెంబ్లీ ఆమోదం కూడా పొందింది. అంతర్జాతీయ సహకారం ద్వారా ఆహార సమస్య పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలనేది ఈ ప్రకటన ముఖ్య విన్నపం. ఆహార

BRAOU

కొరత అతి ప్రాథమికమైన జీవించే హక్కునే హరిస్తుందని, జనాభాకు తగినంత ఆహారం అందుబాటులో లేనపుడే వర్ధమాన దేశాలలో ఆహారసంక్షోభం ఏర్పడిందని ఇది పేర్కొంది. వ్యవసాయ ఎగుమతులకు అంతర్జాతీయ మార్కెట్‌లో తగిన ధరలు లభించక పోవడం, ద్రవ్యోల్బణం వల్ల దిగుమతుల ఖర్చు పెరిగిపోవడం, విదేశీ అప్పుల భారం, జనాభా పెరుగుదల లేదా సహజంగానో కృత్రిమంగానో ఏర్పడిన కొరత వల్ల ఆహారానికి డిమాండ్ పెరగడం, వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడం వగైరా కారణాలు దీనికి తోడయినపుడు ఈ సంక్షోభం మరింత తీవ్రమవుతుంది.

## 9.4.2 లక్ష్యాలు

ఆహారం అందుబాటులో ఎక్కువ తక్కువల తేడా రాకుండా చూడడానికి ప్రపంచ స్థాయిలో ఆహార భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడం అవసరమని జనరల్ అసెంబ్లీ భావించింది. వాతావరణం వల్ల గాని, రాజకీయ, ఆర్థిక ఒత్తిడుల వల్లగాని, మరే ఇతర కారణాలవల్లగాని ఆహార సరఫరాకు అంతరాయం లేకుండా చూడటం ఈ వ్యవస్థ లక్ష్యం. శాంతి సహకారాలను పెంపొందించుకోవడం ద్వారా ప్రభుత్వాలు అరుదైన పదార్థాలను, ఆర్థిక వనరులను అధిక వ్యవసాయోత్పత్తికి ఉపయోగించు కోగలుగుతాయని ఈ ప్రకటన వారి కర్తవ్యాన్ని మరోసారి గుర్తు చేసింది. వ్యవసాయాభివృద్ధి, ఆహారోత్పత్తి రంగాలలో విడిగాను, సామూహికంగాను ఎవరి కృషి వాళ్లు చేసుకోవడానికి వర్ధమాన దేశాలు సిద్ధంగా ఉన్నా, అంతర్జాతీయ సహకారం కూడా వారికి ఇప్పుడు అవసరమని ప్రకటన పేర్కొంది.

## 9.4.3 ఆహార భద్రత ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత

దేశాలు తమ ఆహార అవసరాలను పూర్తిగా, సమర్థవంతంగా తీర్చుకునేందుకు ఏఏ చర్యలు తీసుకోవాలో 2,3,4,5,11 అధికరణాల్లో వివరంగా ఉంది. మొత్తం జనాభా ఆహార అవసరాలను తీర్చే బాధ్యత ప్రభుత్వాలదే కాబట్టి ఆహార సరఫరాను పెంచడానికి, అది సమానంగా సమర్థంగా పంపిణీ అయ్యేలా చూడడానికి ప్రభుత్వాలే కృషి చేయాల్సి ఉంటుందని చెప్పాయి. సామాజికార్థికాభివృద్ధికి రూపొందించే కార్యక్రమాలు, ప్రణాళికలలో జనాభాకు సరిపోయే ఆహారావసరాలను తప్పని సరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించాయి. ఆహారోత్పత్తికి ఉన్న అవరోధాలను అవసరమైతే చట్టాల సహాయంతో తొలగించమని చెప్పాయి. రైతులకు ప్రోత్సాహకాలు యివ్వమని చెప్పాయి. ఇందుకోసం గ్రామీణ భూవ్యవస్థను సంపూర్ణంగా సంస్కరించడం అవసరమని చెప్పాయి. వ్యవసాయోత్పత్తిలో స్త్రీల కీలక పాత్రను గుర్తించి, తగు శిక్షణ, ఆర్థిక సదుపాయాలు విస్తరణ సేవా (ఎక్స్‌టెన్షన్) కార్యక్రమాల ద్వారా వారిని మరింత ప్రోత్సహించాలని చెప్పాయి. ఏదో ఒక దానికే పరిమితం కాకుండా అన్ని రకాల ఆహార వనరులనూ అభివృద్ధి చేయమని చెప్పాయి. ఆహారోత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వమని, వ్యవసాయ ఎగుమతులకు మంచి గిరాకీ ఉండేలా చూసుకోమని చెప్పాయి. ఎక్కువగా బలహీన వర్గాలవారు, అల్పాదాయ వర్గాలవారు ఆహార కొరతతో, తత్ఫలితంగా వచ్చే జబ్బులతో బాధపడే అవకాశం ఉంది కాబట్టి వారి అవసరాలు తీర్చడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పాయి.

BRAOU

## 9.4.4 ఆహార భద్రత పట్ల సంపన్న దేశాల బాధ్యత

వర్ధమాన దేశాల నుండి ఆకలిని, పౌష్టికాహార లోపాన్ని తొలగించడానికి సంపన్న లేదా పారిశ్రామిక దేశాలు చేయవలసిన పనులను 7,8,10,11 అధికరణాలు పేర్కొన్నాయి. మరీ వెనుకబడిన దేశాలకు ఆహారోత్పత్తిని పెంచుకోవడానికి సంపన్న దేశాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆర్థిక సహాయాన్ని అందజేయాలని చెప్పాయి. ఆహారోత్పత్తిని పెంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆ జ్ఞానాన్ని వర్ధమాన దేశాలకు బదిలీ చేసి, ఎలా వాడాలో చూపించి, విస్తృత ప్రచారం చేయాలని చెప్పాయి. వ్యవసాయాభివృద్ధి నిలకడగా ఉండాలంటే సంపన్న దేశాలు తమ పరిశోధనా ఫలితాలను వర్ధమాన దేశాల ప్రభుత్వాలతో, అక్కడి వైజ్ఞానిక సంస్థలతో పంచుకోవాలని చెప్పాయి. అలాగే వారికి ఎరువులు, రసాయనాలు, మేలుకరకం విత్తనాలు, పరపతి కూడా అందేలా చూడమని చెప్పాయి.

## 9.4.5 ఆహార భద్రతా వ్యవస్థ కోసం అంతర్జాతీయ సహకారం

సహజవనరులను సమర్థవంతంగా ఉపయోగించి ఆకలిని, పౌష్టికాహార లోపాన్ని సత్వరమే ఎలా తొలగించవచ్చో 9,11,12 అధికరణాలు వివరించాయి. సహజవనరుల సక్రమ వినియోగానికి పర్యావరణ పరిరక్షణ చాలా అవసరమని, ఇందుకోసం అన్ని దేశాలూ పరస్పరం సహకరించుకోవాలని చెప్పాయి. ప్రజలందరికీ ఏడాది పొడవునా తగినంత ఆహారం అందుబాటులో ఉండాలంటే దేశాలన్నీ కలిసి ఆహార భద్రతా ఏర్పాట్లను వ్యవస్థీకృతం చేసుకోకతప్పదని చెప్పాయి. ఆహార వ్యవసాయాలపై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, ముందస్తు హెచ్చరికల వ్యవస్థను నెలకొల్పుకోవడం, ఆహార భద్రతకు పూచీపడే అంతర్జాతీయ ఒప్పందం కుదుర్చుకోవడం మొదలైన చర్యల ద్వారా ఈ పని చేయొచ్చని చెప్పాయి. ఎమర్జెన్సీ అవసరాల కోసం ఆహార నిల్వలు, నిధుల కేటాయింపు చేసి ఉంచుకోమని ఈ ప్రకటన సూచించింది.

## 9.4.6 ఆకలి, పౌష్టికాహార లోపం లేకుండా బతకడం ఒక ప్రాథమిక మానవ హక్కు

ఆకలి, పౌష్టికాహార లోపం లేకుండా బతకడం ప్రతి మనిషి ప్రాథమిక మానవ హక్కని ఈ ప్రకటన నొక్కిచెప్పింది. ఈ హక్కు అమలయ్యేలా చూడాల్సిన కర్తవ్యం అన్ని దేశాల ప్రభుత్వాల మీద ఉందని పేర్కొంది. ఇందుకు అవసరమైన వనరులు, సంస్థాగత సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి కాబట్టి కావలసిందల్లా సంకల్పం మాత్రమేనని చెప్పింది. ఈ హక్కు ప్రజల జీవించే హక్కులో అంతర్భాగమని పేర్కొంది.

## 9.5 శాస్త్ర సాంకేతిక ప్రగతిని శాంతికోసం, మానవాళి శ్రేయస్సు కోసం ఉపయోగించడంపై అంతర్జాతీయ ప్రకటన

## 9.5.1 పరిచయం, లక్ష్యాలు

ఈ ప్రకటనను జనరల్ అసెంబ్లీ 1975లో ఆమోదించింది. రెండుఅంశాలు దీనికి దోహదం చేశాయి. మొదటిది శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజాల అభివృద్ధికి ఉపయోగించాల్సిన అవసరం. రెండోది దానికి పూర్తి విరుద్ధంగా ఉపయోగిస్తారనే భయం. ఈ ప్రకటనకు రెండు లక్ష్యాలు ఉన్నాయి. ఒకటి-విజ్ఞానాన్ని మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడేలా చేయడం, రెండు-అది హానికరమైన, అమానవీయమైన పద్ధతులకు ఉపయోగపడకుండా అడ్డుకోవడం, కనీసం వాటిని తగ్గించడం. శాస్త్ర సాంకేతిక ఫలితాలను ఆయుధపోటీని పెంచేందుకు, విముక్తి ఉద్యమాలను అణచేందుకు, వ్యక్తులు, సమూహాల మానవ హక్కుల్ని, మౌలిక స్వేచ్ఛల్ని హరించేందుకు ఉపయోగిస్తారేమోననే భయం ఈ ప్రకటనలో వ్యక్తమైంది. నిజానికి వర్థమాన దేశాల సామాజికార్థికాభివృద్ధికి ఈ పరిజ్ఞానం ఎంతో అవసరమని, దీన్ని వెంటనే వాళ్లకు అందజేయాలని కోరింది.

## 9.5.2 శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో పాటించవలసిన ప్రమాణాలు

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దుర్వినియోగాన్ని అరికట్టి, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా దేశాలు సమైక్యంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రకటన ఆదేశించింది. వీటి ఫలితాలను ఉపయోగించుకునేటపుడు ప్రభుత్వాలు

BRAOU

అనుసరించవలసిన ప్రమాణాలను 1,3,5,7,9 అధికరణాలు పేర్కొన్నాయి. అవేమిటంటే ఈ విజ్ఞానం ప్రపంచ శాంతి భద్రతలకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రజల ఆర్థిక సామాజికాభివృద్ధికి, వారి మానవ హక్కుల మౌలిక స్వేచ్ఛల అనుభవానికి ఉపయోగపడాలి. అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులో ఉండాలి. వర్ధమాన దేశాల వాళ్లు వారి ప్రజల మానవ హక్కులకు దోహదం చేసే శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే నెలకొల్పి అభివృద్ధి చేయాలి. జాతి, లింగ, మత, భాషా తేడాలు లేకుండా వీటి ఫలితాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి. ఈ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నప్పుడు కూడా మానవ హక్కులకు, మౌలిక స్వేచ్ఛలకు భంగం కలగనివ్వకూడదు.

## 9.5.3 శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించకూడని సందర్భాలు: వాటి ప్రమాణాలు

ఏఏ పనులకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగంచకూడదో 2,4,6 అధికరణాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా మానవ హక్కులను, మౌలిక స్వేచ్ఛలను హరించే లేదా పరిమితం చేసే పనులకు శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించకూడదని గట్టిగా చెప్పాయి. అలాగే ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను అతిక్రమించడానికి, వారి ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి, దురాక్రమణ యుద్ధాలు చేయడానికి, జాతీయ విమోచన ఉద్యమాలను అణచడానికి, జాతివివక్ష పాటించడానికి కూడా శాస్త్ర సాంకేతిక ప్రగతి ఫలితాలను వాడకూడదని వివరంగా చెప్పాయి. ఈ విజ్ఞానం దుర్వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాల నుండి ప్రజల రక్షణకు చర్యలు తీసుకోమని చెప్పాయి. దీన్ని ఉపయోగించి వ్యక్తుల, సమూహాల ప్రైవసీ, వ్యక్తిత్వాలకు, భౌతిక, మేధో ఆరోగ్యానికి హాని కలిగించే పనులేవీ చేయొద్దని కూడా చెప్పాయి.

## 9.6 అభివృద్ధి హక్కుపై అంతర్జాతీయ ప్రకటన

## 9.6.1 పరిచయం, అభివృద్ధికి అర్థం

ఈ ప్రకటనను జనరల్ అసెంబ్లీ 1986లో ఆమోదించింది. వర్ధమాన దేశాల ప్రజలకు అభివృద్ధి హక్కు చాలా ముఖ్యమైన మానవ హక్కని యిది చెపుతుంది. ఎట్టి పరిస్థితులలోను వారినుంచి తొలగించడానికి వీల్లేని హక్కని కూడా చెప్పింది. అది అభివృద్ధిని మొత్తం జనాభా శ్రేయస్సును, వ్యక్తుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం వాటి మెరుగుదలకు కృషి చేసే సమగ్ర ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ ప్రక్రియ అని నిర్వచించింది. దీనిలో ప్రజలు స్వేచ్ఛగా, చురుకుగా, అర్థవంతంగా పాల్గొనగలగాలని అలాగే దాని ఫలితాలను కూడా న్యాయంగా పంచుకోగలగాలని చెప్పింది. అభివృద్ధికీ మానవ హక్కుల్ని సంపూర్ణంగా అనుభవించడానికీ, అలాగే అభివృద్ధికీ దానికి అవసరమైన సంస్థాగత, నిర్మాణపరమైన మార్పులకూ ఉన్న సంబంధాన్ని ఇది వక్కాణించింది.

అభివృద్ధి క్రమానికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని ఇది వివరించింది. వలసలు రద్దయి, వివక్షలు తొలగించబడి, ప్రపంచ శాంతి భద్రతలను, జాగ్రత్తగా పరిరక్షించుకుంటున్న సందర్భం ఇది. అలాగే అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడిక, అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడిక ప్రజల అన్ని ఆర్థిక సామాజిక సాంస్కృతిక హక్కులకు పూచీ పడుతున్న సందర్భం ఇది. అభివృద్ధి క్రమానికి దోహదం చేయగల పరిస్థితుల గురించి చెపుతూ వలసవాదం, నయా వలసవాదం, జాతివెలి విధానాలతో సహా అన్ని రకాల జాతి వివక్షలు, విదేశీ పెత్తనం, ఆక్రమణ, దాడి, జాతీయ సార్వభౌమత్వానికి, ఐక్యతకు, ప్రాదేశిక సమగ్రతకు ఏర్పడే ప్రమాదాలు, యుద్ధ బెదిరింపులు లేని వాతావరణమే దీనికి అనువైందని వివరించింది. వీటికి నిరాయుధీకరణ, ప్రపంచ శాంతి, నూతన అంతర్జాతీయ

BRAOU

ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు ప్రయత్నాలు తోడయినప్పుడే అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి సాధ్యమని చెప్పింది. సహజ వనరుల మీద సార్వభౌమత్వం, స్వయం నిర్ణయాధికార హక్కు రెండూ ఉన్నప్పుడే ప్రజలు వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి కృషి చేసుకోగలుగుతారని చెప్పింది. అభివృద్ధి అవకాశాలలో సమానత్వం దేశాలకు, ప్రజలకు కూడా అవసరమని, అభివృద్ధి ప్రజలకు హక్కు లేనప్పుడూ నిరాకరించదని ఈ ప్రకటన పేర్కొంది. అసలు అభివృద్ధి ప్రక్రియలో మనిషిదే కేంద్ర స్థానం కాబట్టి ఏ దేశమూ ఈ సూత్రాన్ని విస్మరించకూడదని చెప్పింది.

## 9.6.2 మనిషికేంద్రంగా అభివృద్ధి క్రమం

అభివృద్ధి క్రమంలో మనిషికున్న కేంద్రస్థానాన్ని 1,2 అధికరణాలు నొక్కి చెప్పాయి. అభివృద్ధిలో పాల్గొనే, అందుకోసం కృషి చేసే హక్కుతోపాటు మనుషులందరికీ అభివృద్ధి ఫలితాలను అనుభవించే హక్కు కూడా ఉంటుందని చెప్పాయి. ఇది ఆచరణలోకి రావడమంటే ప్రజలు తమ స్వయం నిర్ణయాధికారహక్కును సంపూర్ణంగా అనుభవిస్తున్నారని భావించవచ్చు.

## 9.6.3 అభివృద్ధి సాధనంగా రాజ్యం

మిగతా ఒడంబడికల లాగానే దీనిలో కూడా అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రధాన బాధ్యత దేశాలదే. దీనిని వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో చట్టాలు, ఇతర విధానపర చర్యల రూపకల్పన, ఆమోదం, అమలు ద్వారా నెరవేర్చాలి.

దేశాలు జాతీయ స్థాయిలో చేయాల్సిన పనులేమిటంటే-తమ దేశాలకు అనువైన అభివృద్ధి విధానాలను రూపొందించుకోవాలి. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ చురుకుగా, స్వేచ్ఛగా, అర్థవంతంగా పాల్గొనేందుకు అవకాశాలు కల్పించాలి. ఇది అన్ని స్థాయిల్లోనూ జరగాలి. స్త్రీలు చురుకైన పాత్ర వహించేలా నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. ప్రాథమిక అవసరాలు, విద్యా ఆరోగ్య సదుపాయాలు, ఆహారం, గృహవసతి, ఉపాధి ప్రజలందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా, అలాగే ఆదాయం కూడా న్యాయంగా పంపిణీ అయ్యేటట్లు చూడాలి.

BRAOU

ఇక అంతర్జాతీయ స్థాయిలో జరగాల్సిన పనులేమిటంటే-దేశాలు పరస్పర సహకారంతో అభివృద్ధికి ఉన్న అవరోధాలను తొలగించుకోవాలి. వర్ధమాన దేశాల అభివృద్ధికి అనువైన అంతర్జాతీయ అభివృద్ధి విధానాలను రూపొందించుకోవాలి. మానవ హక్కుల్ని పెద్దఎత్తున ఉల్లంఘించే జాతి వివక్ష విధానాలు, వలసవాదం, సామ్రాజ్యవాదం మొదలైన అసమానతలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

## 9.6.4 ప్రపంచశాంతి, నిరాయుధీకరణ: అభివృద్ధికి అవసరమైన పరిస్థితులు

వర్ధమాన దేశాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన సాధనాలను, సదుపాయాలను వారికి సమకూర్చాలని, ప్రపంచంలో నిరంతర శాంతి కోసం, సంపూర్ణ నిరాయుధీకరణ కోసం అన్ని దేశాలూ గట్టి కృషి చేయాలని, ఆ విధంగా మిగుల్చుకున్న వనరులను వర్ధమాన దేశాల అవసరాల కోసం ఉపయోగించాలని ఈ ప్రకటన పేర్కొంది.

## 9.7 ముగింపు

ఇటీవల జరిగిన రెండు ముఖ్యమైన పరిణామాల కారణంగా ఈ అంతర్జాతీయ ప్రకటనలకు ప్రాముఖ్యం పెరిగింది.

ఒకటి-అంతర్జాతీయ స్థాయిలో వర్ధమాన దేశాల మధ్య ఐక్యత దెబ్బతినడం, రెండు-ఆసియా, ఆఫ్రికాలలోని అనేక దేశాలు 'న్యాయమైన అభివృద్ధి' లక్ష్యాన్ని విడనాడటం. వనరులు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాల బదిలీ, నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు మొదలైన డిమాండ్లను ముందుకు తీసికెళ్లడంలో వర్ధమాన దేశాల మధ్య ఇప్పుడు ఐక్యత లేదు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రోద్బలంతో 1980 దశకం చివరినుంచి ఈ దేశాలలో 'నిర్మాణపర సర్దుబాట్ల' యుగం ప్రారంభమైంది. వర్ధమాన దేశాలు అనుసరిస్తున్న అపసవ్య ఆర్థిక విధానాల వల్లనే వారికి ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయని ఈ సంస్థల అభిప్రాయం. ఈ సమస్యలు సంపన్న దేశాలతో వారికున్న అసమాన వాణిజ్య సంబంధాల ఫలితమేమోనన్న అనుమానం కూడా వాటికి లేదు! నిజానికి ఈ 'వ్యవస్థాపర సర్దుబాట్ల' విధానాలు చాలా వర్ధమాన దేశాలలో సామాజిక, ఆర్థిక అసమానతల్ని పెంచాయి. మరోవైపు సంపన్న దేశాలు మొదట్నించి తమ వనరుల్ని వర్ధమాన దేశాలకు బదిలీ చేయడానికి నిరాకరిస్తూనే వచ్చాయి. కాని ఇప్పుడు మాత్రం అభివృద్ధి క్రమాన్ని త్వరితగతం చేయడానికి సరళీకరణ చాలా అవసరమని ప్రచారం చేస్తున్నాయి. చివరికి అభివృద్ధికి అర్థమే మారిపోయింది. పూర్తి ప్రైవేట్ పెట్టుబడితో, లాభాల కోసం చేసే పనులను ఇప్పుడు అభివృద్ధి అంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో జరిగే అభివృద్ధిలో కూడా ప్రజా ప్రయోజనాల కంటే ప్రైవేట్ పెట్టుబడే ఆధిపత్యం వహిస్తోంది.

ఇప్పటివరకు జరిగిన వర్ధమాన దేశాల 'అభివృద్ధి'లో కూడా అధిక భాగం మానవ హక్కుల అతిక్రమణే అని చెప్పొచ్చు. ఆ దేశాల ప్రభుత్వాలు 'అభివృద్ధి' పేరుమీద తీవ్రమైన ఆర్థిక, సామాజిక అసమానతల్ని ప్రోత్సహించాయి. ఈ అసమానతలూ, అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి నిర్దేశిస్తున్న పరిష్కారాలూ రెండూ వర్ధమాన దేశాల బాధితులనుండి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటున్నాయి.

తమ అభివృద్ధి మీద తమకే హక్కు ఉండాలని వాదిస్తున్న ప్రజలు నేడు. మొత్తం 'అభివృద్ధి' రాజకీయాలనే (జాతీయం, అంతర్జాతీయం) వారిపుడు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి ఫలితాలు ఎవరికి దక్కబోతున్నాయి, ఈ క్రమం ఎవరి ప్రయోజనాలకు మేలు చేస్తుంది వగైరా ప్రశ్నలడిగే వాళ్లు దీన్నిప్పుడు బహిరంగ చర్చకు పెట్టారు. అందుకే గతంలో 'అభివృద్ధి' ఆలయాలుగా కీర్తింపబడిన పెద్దడ్యామ్ వగైరాలకు యిప్పుడు వ్యతిరేకత ఎదురవడం సర్వసామాన్యమై పోయింది. ఈ అభివృద్ధి క్రమాన్ని ప్రశ్నించడమే కాక వనరుల సమీకరణకు, వాటిని ప్రజావసరాలకు ఉపయోగించడానికి ఏమేమి ప్రత్యామ్నాయ మార్గాలున్నాయో వారే ప్రతిపాదిస్తున్నారు. ఈ పాఠంలో పేర్కొన్న అంతర్జాతీయ ప్రకటనలలోని అనుకూలాంశాలన్నిటినీ వాళ్లిప్పుడు దీని కోసం ఉపయోగించుకుంటున్నారు. ఈ హక్కుల్ని బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాల కోసం ఏ విధంగా వాడుకునే అవకాశముందో వారు పరిశీలిస్తున్నారు. ఈ ప్రకటనలకు సార్థకత ఆ ప్రయత్నాలలోనే ఉంది.

BRAOU

## 9.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తుల్లో సమాధానం రాయండి!**

1. అభివృద్ధి హక్కుల నేపథ్యాన్ని వివరించండి?
2. అంతర్జాతీయ ప్రకటనలు అభివృద్ధికి చెప్పిన అర్థం ఏమిటి, దాని లక్ష్యాలేమిటి? మానవ హక్కులకు, అభివృద్ధికి ఉన్న అంతఃసంబంధాన్ని వివరించండి.
3. ప్రపంచ శాంతి వర్ధమాన దేశాలవారి అభివృద్ధి హక్కులతో ఎలా ముడిపడి ఉందో వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో సమాధానం రాయండి!**

1. సామాజిక అభివృద్ధిలో రాజ్యం పాత్ర ఏమిటి? ఆర్థిక సరళీకరణ తర్వాత అది మారుతుందా? మారితే ఏ విధంగా మారుతుందో భారతదేశాన్ని ఉదాహరణగా తీసుకుని వివరించండి.
2. ఆకలి, పౌష్టికాహార లోపాల నిర్మూలనకు ఉద్దేశించిన అంతర్జాతీయ ప్రకటన లక్ష్యాలేమిటి? ఆహార భద్రత

మానవ హక్కులకు ఏ విధంగా దోహదం చేస్తుంది?

3. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడంలో అనుసరించవలసిన ప్రమాణాలేమిటి?

## 9.9 సంప్రదింపు గ్రంథాలు


1. అభివృద్ధి హక్కుపై అంతర్జాతీయ ప్రకటన, *A/RES/41/128,* 4 డిసెంబర్ 1986
2. సహజ వనరుల మీద ప్రజలకు శాశ్వత సార్వభౌమత్వంపై జనరల్ అసెంబ్లీ తీర్మానం, *A/RES/1803,* (xvii), 14 డిసెంబర్ 1962
3. మానవ హక్కులు-శాస్త్ర, సాంకేతిక పరిణామాలు, ఐక్యరాజ్య సమితి సమాచార శాఖ, న్యూయార్క్, 1982.
4. మానవ హక్కులు మరియు అభివృద్ధి?
5. జాక్ డొనెల్లి, సార్వజనీన మానవ హక్కుల సిద్ధాంతం, ఆచరణ, ఇతాకా, కార్నెల్ యూనివర్శిటీ ప్రెస్, 1989
6. జాక్ డొనెల్లి, అంతర్జాతీయ మానవ హక్కులు, బోల్డర్, వెస్ట్ వ్యూ ప్రెస్, 1993
7. రజని కొఠారి అభివృద్ధిపై పునరాలోచన


BRAOU

# భాగం 10 : శ్రామికవర్గ హక్కులు

విషయ క్రమం

10.0 ఉద్దేశం

10.1 పరిచయం

10.2 బలవంతపు శ్రమ నిషేధ ఒడంబడిక

10.3 సంఘటితం కావించి సమిష్టి బేరం చేసే హక్కుల ఒడంబడిక

10.4 సమాన వేతన ఒప్పందం

10.5 ఉపాధికల్పన విధాన ఒప్పందం

10.6 ముగింపు

10.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.8 సంప్రదింపు గ్రంథాలు

## 10.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- వెట్టిచాకిరి నిషేధ ఒడంబడిక గురించి వివరించగలుగుతారు.
- సమానవేతన ఒప్పందం గురించి తెలుసుకోగలుగుతారు.
- ఉపాధికల్పన విధాన ఒప్పందాన్ని అర్థం చేసుకోగలుగుతారు.

BRAOU

## 10.1 పరిచయం

గౌరవ ప్రదమైన జీవితాన్ని సాధించుకోవడానికి శ్రామికులు చేసే పోరాట క్రమంలో, ఈ ఒడంబడికలు గతంలో కన్నా ప్రస్తుతం ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఉత్పత్తి సాధనాలలో ఒకటైన పెట్టుబడి ప్రపంచపు ఒక మూలనుండి (యూరోప్) నుండి మూడవ ప్రపంచ దేశాలకు తరలుతూ వుంది. అదే పద్ధతిలోను, వేగంతోనూ, శ్రామిక శక్తి తరలించబడడం లేదు. నూతన ప్రపంచీకరణలో భాగంగా, పాశ్చాత్య దేశాల పెట్టుబడితో, మూడవ ప్రపంచ దేశాల శ్రామికులను అనుసంధానిస్తున్నారు. పెట్టుబడి ప్రధానమైన సాంకేతిక అభివృద్ధితో, పలు పరిశ్రమలలో శ్రామికులు పనులనుండి తొలగింపుకు గురౌతున్నారు. ఈ క్రమంలో ప్రపంచ దేశాలన్నీ శ్రామిక వ్యతిరేక చట్టాలను తీసుకురావడానికి ఎంతో ఉత్సాహం చూపుతున్నాయి. ఈ చట్టాలవలన పెట్టుబడి దారులు శ్రామికుల ఉద్యోగ భద్రతకు బాధ్యత వహించవలసిన అవసరం వుండదు. ఈ పరిస్థితులలో శ్రామికులు పెట్టుబడి దారుల దయాదాక్షిణ్యాల మీద బతకవలసి వస్తుంది. పారిశ్రామిక విప్లవం తరువాత అనేక శతాబ్దాలపాటు శ్రామికులు చేసిన పోరాటాల ఫలితంగా ఇప్పటి వరకు ఎన్నో హక్కులు అనుభవించారు. మానవ హక్కుల చర్చ సందర్భంగా, ఈ హక్కుల ఒడంబడికలకు మరలా ప్రాణం పోయవలసిన అవసరం వుంది.

## 10.2 బలవంతపు శ్రమ నిషేధ ఒడంబడిక (Abolition of forced labour convention)

జూన్ 25, 1957న అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ILO) తన సర్వసభ్య సమావేశంలో ఈ నూతన ఒడంబడికను ఆమోదించింది. జనవరి 1959 నుండి ఇది అమలులోకి వచ్చింది. అంతకుమునుపు వున్న బలవంతపు శ్రమ ఒడంబడికను (1926), వేతనాల రక్షణ ఒడంబడికను (1949), బానిసత్వం ఒడంబడికను, ఈ నూతన ఒడంబడిక ముసాయిదా పత్రం పరిగణనలోకి తీసుకుంది. పైన పేర్కొన్న అన్ని ఒడంబడికలు బలవంతపు శ్రమను నిషేధించాయి. ఐక్యరాజ్య సమితి తన 'సార్వత్రిక ప్రకటన'లో (Universal Declaration) పేర్కొన్న వివిధ రకాల వెట్టిచాకిరీలను నిషేధించే ఉద్దేశంతో ఈ ఒడంబడిక కొన్ని కొత్త ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది.

ఈ ఒడంబడికలో పది అధికరణలు (Articles) వున్నాయి. బలవంతపు శ్రమకు శ్రామికులను గురిచేసే వివిధ రకాల ఉద్యోగ పద్ధతుల గురించి మొదటి ప్రకరణం చర్చిస్తుంది. మిగిలినవి, ఒప్పందాన్ని ఆమోదించే పద్ధతుల గురించి, సంస్థ అధిపతుల బాధ్యతల గురించి, సభ్యుల అనర్హతకు సంబంధించిన అంశాల గురించి చర్చిస్తుంది. ఈ చర్చంతా చాలా వరకు సాంకేతిక పరమైనది. కాబట్టి అంతకు మునుపు వున్న ఒడంబడికల గురించి ఇక్కడ చర్చించడం సబబుగా వుంటుంది.

1926, సెప్టెంబరు 25న ఆమోదించిన బానిసత్వం ఒడంబడిక (Slavery Convention), అన్ని రూపాలలో వున్న బానిసత్వాన్ని నిషేధించింది. బానిస వ్యాపారాన్ని, అంటే మనుషులను బానిసలుగా కొనడాన్ని, అమ్మడాన్ని, క్రమంగా అపుతామూ, నిషేధిస్తామని, ఈ ఒడంబడికలోని సభ్యదేశాలు ప్రతిజ్ఞ తీసుకున్నాయి. బానిసత్వాన్ని, బానిస వ్యాపార నిషేధాన్ని సాధించడానికి కావలసిన అన్ని రకాల సహాయాలను ఇచ్చిపుచ్చుకోవడానికి అన్ని దేశాలు అంగీకరించాయి. బానిసత్వానికి దారితీసే వివిధ రకాల బలవంతపు శ్రామిక రూపాలను రద్దు చేయడానికి కావలసిన చర్యల ప్రాముఖ్యతను ఈ ఒడంబడిక గుర్తించింది. ఈ ఒడంబడిక లక్ష్యాలను సాధించడానికి చేసిన చట్టాలను అతిక్రమించిన వారిమీద తీవ్రమైన శిక్షలను విధించడానికి కావలసిన చర్యలను ఆమోదించవలసిందిగా అన్ని దేశాలకు, ఈ ఒడంబడిక సలహానిచ్చింది. కాని దురదృష్టవశాత్తు, సామాజిక అవసరాలకోసం బలవంతపు వెట్టిని ఉపయోగించడాన్ని ఈ ఒడంబడిక అంగీకరించింది. బలవంతపు శ్రమను శ్రామికుల నుండి తీసుకోవలసి వస్తే, ఆ బాధ్యత ఒక కేంద్రీయ అధికార వ్యవస్థ చేతిలో వుంచాలి అని కూడా ఆ ఒడంబడిక చెబుతుంది. జాతి వివక్షతను, రాజకీయ ఒత్తిడిని కొనసాగించడానికి, ఆ తరువాత రోజులలో ఈ బలవంతపు చాకిరి అంశం ఒక ఆయుధంగా ఉపయోగపడింది. ఈ కేంద్రీయ అధికార వ్యవస్థ మీద అధికమైన విశ్వాసాన్ని ఒడంబడిక వుంచిందని చెప్పకతప్పదు. అదే విధంగా, 1930 జూన్‌లో ఆమోదించబడిన బలవంతపు శ్రమ ఒడంబడిక, ప్రతి సభ్యదేశమూ సాధ్యమైనంత తక్కువ సమయంలో వెట్టిని నిర్మూలించాలని సూచించింది. పని కాని, సేవకాని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రాని ఏ వ్యక్తినైనా, శిక్షిస్తామనే భయంతో లొంగదీసుకొని పనిచేయించుకోవడాన్ని బలవంతపు శ్రమ లేక వెట్టిగా ఈ ఒడంబడిక నిర్వచించింది. బానిసత్వ ఒడంబడికలో అంగీకరించిన, సామాజిక అవసరాలకోసం చేసే బలవంతపు శ్రమను, శ్రమ రూపంలో చెల్లించేపన్నును కూడా క్రమంగా రద్దు చేయాలని ప్రతిపాదించింది. సైన్యం చేసే సేవలను, పౌరులు చేయాల్సిన సాధారణ పౌర బాధ్యతలను, కోర్టులో శిక్షపడిన కారణంగా ఏ వ్యక్తికైనా చేయాల్సిన శ్రమను, అత్యయిక పరిస్థితిలో చేయాల్సిన శ్రమను సేవలను, ఈ ఒడంబడిక 'బలవంతపు శ్రమ' పరిధిలో చేర్చలేదు.

ఐక్యరాజ్య సమితిలో భాగమైన ఆర్థిక సాంఘిక సంఘం 1956లో ఒక సమావేశాన్ని ఏర్పరచింది. దాని ప్రధాన వుద్దేశం బానిసత్వ నిర్మూలనకు బానిస వ్యపారానికి బలవంతపు శ్రమకు సంబంధించి సాధించిన మార్పులను అంచనా వేయడం. బానిసత్వ ఒడంబడికను, బలవంతపు శ్రమ ఒడంబడికను పునపరిశీలించింది. బానిసత్వము, బానిసల వ్యాపారము, అలాంటి, సంస్థలు, ఆచారాలు ప్రపంచం నలుమూలలా ఇంకా కొనసాగుతూనే వున్నాయని ఆ సమావేశం

BRAOU

గుర్తించింది. జాతీయంగా, అంతర్జాతీయంగా బానిసత్వాన్ని, దాన్ని సజీవంగా వుంచే సంస్థలను నిషేధించే వుద్దేశంతో బానిసత్వ ఒడంబడికకు (1926) మద్దతుగా మరో ఒడంబడికను రూపొందించడానికి నిర్ణయించింది. 'బానిసత్వం, బానిస వ్యాపారం, అలాంటి సంస్థల, ఆచారాల నిషేధ ఒప్పందం' అని కొత్త ఒడంబడికకు నామకరణం చేశారు.

ఆచరణకు సాధ్యమైన అన్ని రకాల చర్యలు, శాసనాల ద్వారా క్రమంగాను, త్వరగాను వెట్టిచాకిరిని (serfdom) రుణ దాస్యం (debt bondage) ను నిర్మూలించాలని అన్ని సభ్యదేశాలు అంగీకరించాయి. ఒక వ్యక్తి తాను తీసుకున్న ఋణాన్ని తన వ్యక్తిగత సేవల ద్వారా తీర్చడానికి ఒప్పుకున్నా, అతని శ్రమను హేతుబద్ధంగా అంచనా వేసి ఋణం తీర్చినట్లు భావించక, శ్రమ చేయాల్సిన కాలాన్ని నిర్ణయించక, దాని స్వభావాన్ని నిర్వచించక, అతని శ్రమను నిరంతరాయంగా పొందే పరిస్థితిని రుణ దాస్యంగా చెప్పవచ్చు. 'ఒక చట్టం వలనగాని, ఆచారం వలన గాని ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తికి చెందిన భూమిలో పని చేస్తూ, ప్రతిఫలం అందినా, అందకపోయినా, తన స్థితిని మార్చుకునే స్వేచ్ఛలేక అక్కడే జీవిస్తూ వుండవలసిన పరిస్థితిని వెట్టిచాకిరిగా ఒడంబడిక నిర్వచించింది. స్త్రీలను, పిల్లలను, యువకులను, వారి శ్రమను దోచుకునే సంస్థలను, వాటి ఆచరాలను కూడా ఒడంబడిక నిషేధించింది. బానిసలను ఒక ప్రదేశం నుండి ఇంకో ప్రదేశానికి ఏ పద్ధతిలోనైనా తరలించడాన్ని నేరంగా పరిగణించేలా అన్ని దేశాలను ఆదేశించింది. తమ దేశాల సరిహద్దులు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు బానిసలను తరలించకుండా తగు చర్యలను సభ్య దేశాలు తీసుకోవాలి. బానిస వ్యాపారాన్ని నిర్మూలించడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవడానికి సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవాలి. తమ దృష్టికి వచ్చిన ప్రతి సంఘటనను పరిశీలించాలి. ఒక వ్యక్తిని బానిసను చేసే ఉద్దేశంతో బంధించడం, కొనడం, అమ్మడం, తరలించడం లాంటి అన్ని చర్యలను బానిస వ్యాపారంగా ఒడంబడిక నిర్వచించింది.

బానిసత్వ నిషేధానికి సంబంధించి ఇన్ని ఒడంబడికలు వున్నా, మానవ హక్కులను ఉల్లంఘించే అంతర్జాతీయ దోపిడీ రూపాలు ఇంకా వున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) 1957లో భావించింది. ఆ ఆలోచన ఫలితంగా బలవంతపు శ్రమ నిషేధ ఒడంబడిక ఆవిర్భవించింది. ఈ క్రింది రూపాలలో శ్రామికులను బలవంతపు శ్రమకు గురిచేయకూడదని, వాటిని నిషేధించాలని ఐఎల్ఓ లోని అన్ని సభ్య దేశాలు అంగీకరించాయి.

1) అమలులో ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలకు వ్యతిరేకంగా అభిప్రాయాలు కలిగి వున్నందుకు, వ్యక్త పరిచినందుకు శిక్షగా, రాజకీయ వొత్తిడిగా బలవంతపు శ్రమను విధించకూడదు.

2) ఆర్థిక అభివృద్ధి కొరకు శ్రామికులను సమీకరించే ఉద్దేశంతో బలవంతపు శ్రమకు శ్రామికులను గురిచేయకూడదు.

3) శ్రామిక శిక్షణ (labour discipline) సాధించాలనే పేరుమీద

4) సమ్మెలో పాల్గొన్న వారిని శిక్షించే పేరుమీద

5) జాతి, మత, సాంఘిక వివక్షను పాటించడానికి, బలవంతపు శ్రమకు శ్రామికులను గురిచేయరాదు.

## 10.3 సంఘటితం కావించి సమిష్టి భేదం చేసే హక్కుల ఒడంబడిక

అంతర్జాతీయ కార్మిక సంస్థ, తన సాధారణ సమావేశంలో జూలై 1949లో ఈ ఒడంబడికను ఆమోదించింది. 1951లో ఇది అమలులోకి వచ్చింది. శ్రామికుల హక్కుల పరిరక్షణలో ఈ ఒడంబడిక ఒక మలుపు.

యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లితే, పూర్తి రక్షణ పొందే హక్కు శ్రామికులకు వుందని ఒడంబడిక పేర్కొంది. శ్రామికులను యూనియన్ కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించే పరిస్థితులనుండి, యూనియన్ సభ్యత్వాన్ని వదులుకోమని ఒత్తిడి తెచ్చే పరిస్థితుల నుండి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఉద్యోగం నుండి ఉద్వాసనకు, వేధింపులకు గురికాకుండా రక్షణ పొందే హక్కు కార్మికులకు వుందని ఈ ఒప్పందం అంటుంది. ట్రేడ్ యూనియన్ల ఏర్పాటులో యాజమాన్యం జోక్యం ఉండకూడదు. యాజమాన్యపు అదుపులో ఉంచుకునే ఉద్దేశంతో, ఆర్థిక సహాయం చేసి

BRAOU

ట్రేడ్ యూనియన్లను ఏర్పాటు చేయడానికి యాజమాన్యం ప్రయత్నిస్తే, అలాంటి చర్యలను జోక్యం చేసుకోవడంగా ఈ ఒప్పందం పరిగణిస్తుంది.

కార్మికుల సంఘటిత (organise) హక్కును పరిరక్షించడానికి ప్రభుత్వాలు తగిన యంత్రాంగాన్ని నెలకొల్పాలని 3వ అధికరణ అంటుంది. ఒక సమిష్టి ఒప్పందం ద్వారా ఉద్యోగానికి సంబంధించిన షరతులను క్రమబద్ధీకరించడం కోసం ఈ యంత్రాంగం కార్మిక సంఘాలకి ప్రభుత్వానికి మధ్య చర్చలు జరపాలి.

# 10.4 సమాన వేతన ఒప్పందం

అంతర్జాతీయ కార్మిక సంస్థ జూన్ 29, 1951న తన సాధారణ సమావేశంలో (General Conference) ఈ ఒప్పందాన్ని ఆమోదించింది. మే నెల 23, 1953 నుండి ఈ ఒప్పందం అమలులోకి వచ్చింది. 69 దేశాలు తమ ఆమోదాన్ని తెలిపాయి. స్త్రీలు, పురుషులు చేసే సమాన విలువగల పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈ ఒప్పందం అంటుంది.

అభివృద్ధి చెందిన దేశాలలో కూడా, వేతనాలకు, జీతాలకు సంబంధించిన విషయంలో స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని పాటించాలనే వాదనకు చాలా మెల్లగాను, అయిష్టంగాను గుర్తింపు వచ్చింది. బ్రిటన్‌లో సమాన వేతన చట్టం 1970లో మాత్రమే అమలులోకి వచ్చింది. సోషలిస్టు దేశాలలో మాత్రమే ఈ సూత్రం మరికొంత ముందుకు వెళ్లింది. సమాన విలువగల పనికి సమాన వేతనాన్ని స్త్రీ కార్మికులకు, పురుష కార్మికులకు చెల్లించాలని 12వ అధికరణ అంటుంది. అంటే వేతనం విషయంలో ఎటువంటి లైంగిక వివక్ష చూపించరాదని అంటుంది. ఈ హక్కును, (ఎ) జాతీయ చట్టాల ద్వారాను, (బి) వేతనాన్ని నిర్ణయించడానికి ఏర్పడిన చట్టబద్ధ యంత్రాంగం ద్వారాగాని (సి) యాజమాన్యం, కార్మికుల మధ్య ఏర్పడిన సమైక్య ఒప్పందం ద్వారా గాని అమలు పరచవచ్చునని ఒప్పందం అంటుంది. చేయవలసిన పనిని బట్టి ఉద్యోగ స్వభావాన్ని, దాని విలువను నిర్ధారించే చర్యలను ప్రతి రాజ్యము తీసుకోవాలని ఈ ఒప్పందం అంటుంది. ఈ పనిని వేతన నిర్ధారణ యంత్రాంగం చేపట్టవచ్చు. సమిష్టి అంగీకారం వున్నచోట యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి చేయవచ్చు. లైంగిక వివక్షకు అతీతంగా, వేతనాలలో తేడాను అలాంటి యంత్రాంగం తగు జాగ్రత్తతో సూచిస్తే, దానిని ఈ ఒప్పందానికి వ్యతిరేకమైనదిగా భావించనవసరం లేదు.

BRAOU

# 10.5 ఉపాధి కల్పన విధాన ఒప్పందం

'ప్రతి ఒక్కరికి పని చేసే హక్కు, తనకు నచ్చిన పని ఎంచుకునే హక్కు, న్యాయమైన పని పరిస్థితులను కోరుకునే హక్కు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా రక్షణ పొందే హక్కు వున్నాయని 'అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 23వ అధికరణ అంటుంది. ఈ హక్కుకు ఒక నిర్దిష్ట రూపం ఇవ్వడానికి అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ILO), 1964లో ఉపాధి కల్పన విధాన ఒప్పందాన్ని ఆమోదించింది. ఈ ఒప్పందం 1966 జూలై 15 నుండి అమలులోకి వచ్చింది. 3 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. ఈ ఒప్పందం ఆర్థిక రక్షణకు, పని హక్కుకు సంబంధించినది. ఈ ఒప్పందం యొక్క లక్ష్యం మొదటి అధికరణలోనే స్పష్టంగా చెప్పబడింది.

### అధికరణ 1

1. ఆర్థిక అభివృద్ధి, పెరుగుదలను పెంచే ఉద్దేశంతోనూ, జీవన ప్రమాణాలను పెంచే ఉద్దేశంతోనూ, ఉద్యోగ అవసరాలను పెంచే ఉద్దేశంతోనూ, నిరుద్యోగాన్ని అధిగమించే ఉద్దేశంతోనూ ప్రతి సభ్యదేశము ఉపాధికల్పన విధానాన్ని ప్రకటించి, కొనసాగించాలి. ఈ విధానం ఉత్పాదకత కలిగిన పూర్తికాలపు ఉద్యోగాలను సృష్టించగలగాలి.

2. ఈ విధానం లక్ష్యం

I. ఉద్యోగం చేయాలనుకున్న వారందరికి పనికల్పించాలి.

II. అలాంటిది సాధ్యమైనంతవరకు ఉత్పాదకత (productive) కలిగినదిగా వుండాలి.

III. తనకు నచ్చిన పనిని ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ఉండాలి. తన నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకొనే అవకాశం, జాతి, వర్ణ, లింగ, మత, జాతీయ, రాజకీయ విచక్షణకు అతీతంగా వుండాలి.

3. ఇలాంటి విధానాన్ని ఆర్థిక అభివృద్ధి స్థాయిని దృష్టిలో వుంచుకొని రూపొందించుకోవాలి. ఉపాధికల్పనా విధానానికి ఆర్థిక సమాజిక లక్ష్యాలకు మధ్య పరస్పర సంబంధం వుండాలి. జాతీయ పరిస్థితులను, ఆచరణలను దృష్టిలో వుంచుకొని తగు పద్ధతులలో అమలు పరచాలి.

## 10.6 ముగింపు

అంతర్జాతీయ కార్మిక సంస్థ అన్ని జాతీయ ప్రభుత్వాల మీద అధికారం చెలాయించగల సంస్థకాదు. ఈ సంస్థలో సభ్యులుగా వున్న రాజ్యాలు ఈ ఒప్పందాలను రూపొందించుకున్నాయి. ఈ ప్రభుత్వాల ప్రతినిధులు, తమ వర్గాల ప్రయోజనాలకు అతీతంగా ఉన్నారని చెప్పలేము. ఈ ఒప్పందాలు, మానవ హక్కుల ఉల్లంఘనలను మాత్రమే గుర్తించలేదు. మినహాయింపుల పేరుమీద చాలా హక్కుల ఉల్లంఘనలకు న్యాయబద్ధత (legitimacy) కల్పించింది. కొన్ని సార్లు, వెట్టి చాకిరికి ఎన్ని రకాల మినహాయింపులు యివ్వవచ్చో నిర్ణయించడానికి ఈ ఒప్పందాలలోని చాలా భాగం కేటాయించబడింది. ఈ హక్కుల అమలుకు, 'చట్టబద్ధంగా ఏర్పరిచిన అధికార యంత్రాంగం' మీద ఈ ఒప్పందం చాలా విశ్వాసాన్ని ఉంచింది. సమర్థ యంత్రాంగం, చట్టం అనేవి వాటికవే ప్రజాస్వామికమూ కావు, హక్కుల పరిరక్షకులూ కావు. బలహీనుల హక్కులను అతిక్రమించే క్రమంలో చట్టమూ, రాజ్యమూ కూడా భాగస్వాములు. మానవ హక్కులను ఉల్లంఘించే చట్టాలను రాజ్యాలే చాలా సార్లు చేస్తాయి. స్వభావంలో ఆర్థిక పరమైనదిగా కనిపించే అన్ని అసమానతలు నిజానికి సాంస్కృతికంగా లోతైన రూపాలలో వుంటాయి. నిర్దిష్టంగా, సాంస్కృతిక రూపాలలో కనిపించే అసమానత్వాన్ని పట్టించుకోకపోతే, చట్టంమీద ఆధారపడిన సమానత్వం మానవ హక్కుల పరిస్థితిని మెరుగు పరచదు. హక్కుల పట్ల చైతన్యము, ప్రజల ఉద్యమాలు మాత్రమే చివరకు మనుషుల స్వేచ్ఛకు, హక్కులకు హామీనివ్వగలవు.

BRAOU

## 10.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తుల్లో జవాబు రాయండి**

1. వివిధ వెట్టి చాకిరి రూపాలు ఏవి?

2. బలవంతపు శ్రమ రద్దు ఒప్పందం నిషేధించిన నూతన వెట్టిచాకిరి రూపాలు ఏవి?

**II. ఈ క్రింది ప్రశ్నకు 30 పంక్తుల్లో జవాబు రాయండి**

1. Right to organise and Collective begain convention- ఈ ఒప్పందం ప్రాముఖ్యం ఏమిటి?

2. సమాన వేతన ఒప్పందం గూర్చి తెలపండి?

## 10.8 సంప్రదింపు గ్రంథాలు


1. సతీష్ చంద్ర ఇంటర్నేషనల్ డాక్యుమెంట్స్ ఆన్ హ్యూమన్ రైట్స్, న్యూఢిల్లీ: మిట్టల్ పబ్లికేషన్స్, 1990

2. ఇయన్ బ్రౌన్‌లై. బేసిక్ డాక్యుమెంట్స్ ఆన్ హ్యూమన్ రైట్స్, ఆక్స్‌ఫర్డ్: క్లారుండన్ ప్రెస్, 1994.

# ఖండం III

# అంతర్జాతీయ హక్కుల సంస్థలు

BRAOU

BRAOU

# భాగం 11: ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్

విషయ క్రమం:


11.0 ఉద్దేశం
11.1 పరిచయం
11.2 యు.ఎన్. మానవ హక్కుల కమిషన్ స్థాపన
11.3 యు.ఎన్. ఆధ్వర్యంలో కమిషన్ నిర్మాణం
11.4 కమిషన్ లక్ష్యాలు
11.5 హక్కుల పత్రాల రచన
11.6 హింసకు వ్యతిరేక ఒప్పందం
11.7 మానవ హక్కుల ఉల్లంఘన-కమిషన్ పాత్ర
11.8 చర్యతీసుకునే స్థోమత
11.9 వివక్ష వ్యతిరేక ఒప్పందం
11.10 ఫిర్యాదులు విచారించే ప్రక్రియ
11.11 విమర్శ
11.12 ముగింపు
11.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు
11.14 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

## 11.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- యు.ఎన్. మానవ హక్కుల కమిషన్ స్వరూప, స్వభావాలు
- మానవ హక్కుల కమిషన్ పనితీరును వివరించగలుగుతారు.
- మానవ హక్కుల ఉల్లంఘనలో కమిషన్ పాత్రను అర్థం చేసుకోగలుగుతారు.

## 11.1 పరిచయం

యుద్ధాన్ని నివారించడానికి ఏర్పడిన ఐక్యరాజ్యసమితి యుద్ధంలేని సమయంలో మానవహక్కులను రక్షించడంకోసం ఒక కమిషన్ ఉండాలని భావించింది. మానవ హక్కులేమిటో నిర్వచించి ఉల్లంఘనలను ఆపడం ఈ కమిషన్ విద్యుక్త ధర్మాలు.

## 11.2 యు.ఎన్. మానవ హక్కుల కమిషన్ స్థాపన

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 1946లో మానవ హక్కుల కమిషన్ ఏర్పాటయింది. ఇది చాలా ప్రభావమయిన సంఘం. భిన్న దేశాల మధ్య అంతర్జాతీయ స్థాయిలో కుదిరిన ఒప్పందాలను అమలు చేయడానికి కొన్ని సంస్థల నిర్మాణం అవసరమని భావించారు. అటువంటి సంస్థలలో ముఖ్యమైనది మానవ హక్కుల కమిషన్. ఆర్థిక, సామాజిక మండలి (Economic & Social Council) Ecosoc దేశాలు 3 ఏళ్ల పదవీకాలం కోసం 53 మంది సభ్యదేశాలను ఎన్నుకుంటాయి.

ఈ కమిషన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ కమిషన్లు పనిచేస్తూ ఉంటాయి. ఏసియా, ఆఫ్రికా, తూర్పు యూరప్, లాటిన్ అమెరికా, పశ్చిమ యూరప్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా ప్రాంతాలకు ఈ ప్రత్యేక కమిషన్లు ఉన్నాయి. అయిదు సభ్యదేశాల ప్రభుత్వాలతో ప్రాంతీయ కమిషన్ పనిచేస్తుంది. చైర్‌పర్సన్ పదవి వివిధ గ్రూపులకు రొటేషన్‌పై లభిస్తూ ఉంటుంది. జెనీవాలో జరిగే వార్షిక సమావేశం ఆరువారాలపాటు సాగుతుంది. అందులో అన్ని ప్రాంతీయ కమిషన్ల నాయకులు పాల్గొంటారు. ఎమర్జన్సీ సందర్భాలలో ప్రత్యేక సమావేశాలు కూడా జరుపుతూ ఉంటారు. 1996 జూన్‌లో ఇదివరకటి యుగోస్లావియా, రువాండాకు సంబంధించిన విషయాలపై ప్రత్యేక సమావేశాలు జరిగాయి.

ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్‌కు ఈ కమిషన్ తన నివేదికను సమర్పిస్తుంది. ఆర్థిక పరమయిన పరిణామాలు ఉండే నిర్ణయాలకు తీర్మానాలకు కౌన్సిల్ ECOSOC ఆమోదం అవసరం. సాధారణంగా కమిషన్ తీర్మానాలను ECOSOC వ్యతిరేకించబోదు.

# 11.3 యు.ఎన్. ఆధ్వర్యంలో కమిషన్ నిర్మాణం

1945లో జరిగిన సాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో ప్రభుత్వేతర సంస్థల ద్వారా మానవ హక్కుల ఉద్యమ నిర్వహణ విషయంపై నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన ఈ సమావేశంలో కీలకమయిన నిర్ణయం అని తెలిసిందే. ఐక్యరాజ్యసమితి కింద కొన్ని సంస్థల నిర్మాణానికి ఏర్పాట్లు చేయడానికై 1945లో లండన్‌లో Preparatory Commission (ఏర్పాట్ల రూపకల్పన సంఘం) సమావేశమైంది. మానవ హక్కుల కమిషన్ ఈ కింది లక్ష్యాలు సాధించాలని నిర్ణయించారు.

# 11.4 కమిషన్ లక్ష్యాలు

1) అంతర్జాతీయ హక్కుల పత్రం రచన
2) పౌర హక్కులు, మహిళల హోదా, సమాచార స్వేచ్ఛ వంటి అంశాలపై అంతర్జాతీయ ప్రకటన కోసం సిఫార్సులు రూపొందించడం.
3) మైనారిటీల రక్షణ
4) మతం, లింగం, భాష, ప్రాంతం పేర వివక్ష చూపకుండా నిరోధించడం
5) విభిన్న దేశాల సాధారణ సంక్షేమం, స్నేహ సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉన్న వివిధ మానవహక్కుల వ్యవహారాలు ఏవైనా.

మానవ హక్కుల కమిషన్ ఒక రాజకీయ రూపు దాల్చకుండా ఉండడం కోసం తీవ్ర కృషి చేయవలసి వచ్చింది. 1947లో మానవ హక్కులకు సంబంధించిన ఫిర్యాదులపై చర్య తీసుకునే అధికారం కమిషన్‌కు లేదని స్పష్టమయిన ఒక ప్రకటన చేసింది. మానవ హక్కుల ఉల్లంఘన రాజకీయాలకు ముడిబడిన సమస్య. కనుక చర్య తీసుకునే అధికారం లేదని ప్రకటించి రాజకీయ రంగు అంటకుండా తప్పించుకోగలిగినా ఈ ప్రకటన అనేక విమర్శలకు గురయింది.

# 11.5 హక్కుల పత్రాల రచన

మానవ హక్కుల కమిషన్, మానవ హక్కులకు సంబంధించిన ఎన్నో కీలకమయిన ప్రకటనలు, ఒప్పందాలు రచనా కార్యక్రమంలో నిమగ్నమయింది. 1970 వరకు నిర్దిష్టమయిన ప్రమాణాలను రూపకల్పనచేయడానికి కమిషన్ తన సమయమంతా వెచ్చించింది. 1990 దశకం మొదట్లో మళ్ళీ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మానవ హక్కుల ప్రమాణాలను రూపొందించే కార్యక్రమం మొదలు పెట్టింది. 1947-48 సంవత్సరంలో 'సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన' (Universal Declaration of Human Rights) రచనను సమగ్రంగా ముగించింది. ఆరునెలల్లో యు.ఎన్. అసెంబ్లీ మానవ హక్కులను ప్రకటించింది. 1954 వరకు మరో రెండు కీలకమయిన హక్కుల పత్రాల రచన ముగించి అసెంబ్లీకి పంపింది.

BRAOU

## 11.6 'హింస'కు వ్యతిరేకంగా ఒప్పందం

1977లో 'హింస'పై ఒప్పందం రచన బాధ్యతను యు.ఎన్. మానవ హక్కుల కమిషన్‌కు అప్పగించింది. పిల్లల హక్కులకు సంబంధించిన సదస్సును నిర్వహించే బాధ్యతను 1978లో పోలిష్ ప్రభుత్వం కమిషన్‌కు అప్పగించింది. 1984, 1989లో ఎంతో ప్రాధాన్యం ఉన్న రెండు ప్రకటనలను అంతర్జాతీయ సదస్సులో ఆమోదించడం జరిగింది. 1986లో అభివృద్ధి సాధించే హక్కు ప్రకటన (Declaration on The Right to Development) కూడా కీలకమైనదే.

## 11.7 మానవ హక్కుల ఉల్లంఘన-కమిషన్ పాత్ర

కీలకమయిన హక్కుల ప్రకటనలతోపాటు మానవ హక్కులకు తీవ్ర విఘాతం కలిగినపుడు కమిషన్ సకాలంలో ప్రతిస్పందించి, బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నాలుకూడా చేసింది. 1944-66 మధ్య కాలంలో నిర్దిష్టమయిన మానవ హక్కుల ఉల్లంఘన కేసులను కమిషన్ అసలు పట్టించుకోలేదు. 1967-78 సంవత్సరాల కాలంలో జాతివివక్ష, విచ్ఛిన్న వాదాలతో ముడిబడిన సమస్యలకు ప్రతిస్పందించే విధానాలను మాత్రం రూపొందించుకుంది. 1979 తర్వాత ఈ విధానాలను అనుసరించి నియమాలకు అమలుచేస్తూ మానవ హక్కుల ఉల్లంఘనలను ప్రతిస్పందించండం కొనసాగించింది.

## 11.8 చర్యతీసుకునే స్థోమత

1946 నుంచి 1966 వరకు మానవ హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులపై చర్యతీసుకునే అధికారం లేదంటూ బాధ్యతలను కమిషన్ వదిలేసింది. కమిషన్ తనకు అందిన ఫిర్యాదులను కేవలం సంబంధిత ప్రభుత్వాలకు తెలియచేసి ఊరుకునేది. సమాచారం తెలిసిన వారి వివరాలను గోప్యంగా ఉంచేది. సమస్యలకు పరిష్కారం మాత్రం లభించేదికాదు.

1960 దశకం మధ్యకాలంలో ఆఫ్రికన్, ఏసియన్ ఖండాల నుంచి కొత్త స్వతంత్ర దేశాలు సభ్యులుగా చేరిన తర్వాత మానవ హక్కుల కమిషన్ చైతన్యవంతమయిన పాత్ర నిర్వహించింది. 1960లో 18 సభ్య దేశాలుంటే 1967లో ఈ సంఖ్య 32 దేశాలకు పెరిగింది. వీటిలో 20 దేశాలు మూడో ప్రపంచ దేశాలు కావడం విశేషం.

BRAOU

## 11.9 వివక్ష వ్యతిరేక ఒప్పందం

1965లో అన్ని రకాల జాతి వివక్షలను తొలగించే ఒప్పందం (Convention on the Elimination of all forms of Racial Discrimination (ERD) మరో కీలకమయిన పరిణామం. ఈ ప్రకటనలో ఆర్టికల్ 14 ప్రకారం వ్యక్తులు లేదా వర్గాలు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడానికి విధానాన్ని నిర్దేశించింది. 1966లో పౌర, రాజకీయ హక్కులపై సదస్సు జరిగింది. ఈ హక్కుల ఉల్లంఘనపై కూడా ఫిర్యాదులు స్వీకరించే విధానాన్ని కల్పించారు.

## 11.10 ఫిర్యాదులు విచారించే ప్రక్రియ

ఫిర్యాదులు అందనపుడు అనుసరించేందుకు రెండు విధానాలు రూపొందించారు. ECOSOC తీర్మానం 1235 ప్రకారం మానవ హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులను విచారించి, జవాబు ఇచ్చి, కమిషన్‌కు ఆ విషయంపై బహిరంగంగా చర్చించే అధికారం ఇవ్వడం. 1503 తీర్మానం ప్రకారం మరో ప్రక్రియ ఉంది. వరుసగా మానవ హక్కుల ఉల్లంఘన ఒక పథకం ప్రకారం సాగిపోతూ ఉంటే ప్రయివేట్‌గా సంబంధిత ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి ఆ ఉల్లంఘనలపై చర్య తీసుకునేందుకు వారిని ఒప్పించడం.

## 11.11 విమర్శ

నిజానికి ఈ రెండు ప్రక్రియల వల్ల కూడామానవ హక్కులను ప్రత్యేకంగా రక్షించడం అంటూ జరిగిందేమీ లేదనే

విమర్శ చెలరేగింది. అయితే ఉల్లంఘన ఫిర్యాదులను మరింత బహిరంగంగా చర్చించి చురుగ్గా చర్యలు తీసుకునే విధానాలను కమిషన్ 1979 నుంచి అన్వేషిస్తూనే ఉంది. ప్రజాస్వామ్య కంపూచియా దేశంలో పోల్ పాట్ ఘోరాలపైన కమిషన్ అసలు బహిరంగంగా ఏ చర్య తీసుకోలేదు. ఉగాండా ప్రభువు అమీన్ అత్యాచారాలను మధ్య ఆఫ్రికా సామ్రాజ్యంతో బోకాసా, ఈక్వెటోరియల్ గినియాలో మేగియాన్, అరుగ్స్, అర్జెంటీనాలో మిలటరీ పాలకులు చేసిన ఘోరాలను కూడా కమిషన్ అంతగా పట్టించుకోలేదనే విమర్శలు తీవ్రంగా వచ్చాయి.

## 11.12 ముగింపు

ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కులు ఏమిటో నిర్వచించి, ఆ విషయం ప్రజలందరికీ తెలియచేసేందుకు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఒక సంస్థను నిర్మించాలనే ఉద్దేశంతో యు.ఎన్. మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేశారు.

మానవ హక్కులకు నిర్దిష్టమయిన ప్రమాణాలను రచించేందుకు అనేక హక్కుల పత్రాలను ఈ కమిషన్ తయారు చేసింది. మానవ హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులను మొదట్లో అంతగా పట్టించుకోకపోయినా తర్వాత పరిణామాల వల్ల, మూడో ప్రపంచం నుంచి సభ్యదేశాలుగా చేరిన తర్వాత వచ్చిన వత్తిడుల వల్ల, మానవ హక్కుల కమిషన్ ఫిర్యాదులు విని ప్రతిస్పందించి చర్యలు తీసుకోవడానికి తగిన విధానాలను రూపొందించింది.

మానవ హక్కుల ఉల్లంఘనలను నిరోధించి బాధితులకు న్యాయం చేయడానికి కమిషన్ ఇంకా చైతన్యవంతమయిన పాత్ర పోషించవలసిన అవసరం ఉంది.

## 11.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తుల్లో సమాధానం రాయండి ?**

1. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో మానవ హక్కుల కమిషన్ ఎప్పుడు ఏర్పడింది? కమిషన్ లక్ష్యాలు ఏమిటి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో సమాధానం రాయండి**

1. మానవ హక్కుల కమిషన్ నిర్వహించిన బాధ్యతలను వివరించండి.
2. ఫిర్యాదులను స్వీకరించి విచారించే విధానాలను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

## 11.14 సంప్రదింపు గ్రంథాలు

*"International Human Rights in Contest"*, by Henry J. Steiner and Philip Alston; Oxford Newyork.

BRAOU

# భాగం 12: ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్

*విషయక్రమం:*


12.0 ఉద్దేశం

12.1 పరిచయం

12.2 ఆమ్నెస్టీ స్థాపన

12.3 ఆమ్నెస్టీ లక్ష్యం, ఆదేశం

12.3.1 భావ ప్రకటనా స్వేచ్ఛ

12.3.2 భావాల బందీలు

12.3.3 రాజకీయ ఖైదీలు

12.3.4 మరణ శిక్షలు

12.3.5 విచారణ లేకుండా చంపివేయడం

12.4 కార్యవిధానం

12.5 'హింస' పై నియమం

12.6 ఇంటర్నేషనల్ కౌన్సిల్

12.7 కొన్ని ఇబ్బందులు

12.8 భారతదేశంలో ఆమ్నెస్టీ

12.9 భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘన: ఆమ్నెస్టీ నివేదిక

12.10 ముగింపు

12.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

12.12 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

## 12.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తరువాత మీరు*

- ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ స్వరూప స్వభావాలు తెలుసుకుంటారు.
- ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ పనితీరును అర్థం చేసుకుంటారు
- మానవ హక్కుల రక్షణలో ఆమ్నెస్టీ పాత్ర గురించి వివరించగలుగుతారు.

## 12.1 పరిచయం

మానవ హక్కుల రక్షణ ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు ముఖ్యమయిన పాత్ర వహిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితికి చెందకుండా, స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధానమయిన విశ్వవ్యాప్త సంస్థ.

(i) మరో దేశానికి పంపి అక్కడ రాజకీయంగా బంధించే అవకాశాలు, చిత్ర హింసలకు గురిచేసే అవకాశాలున్న సందర్భాల్లో అటువంటి బహిష్కారాలను బలవంతపు వలసలను వ్యతిరేకిస్తుంది.

(j) పై విధంగా కొందరి మానవ హక్కులను కాలరాసారని ఆరోపణలు వచ్చిన చోట దర్యాప్తు పరిశోధన జరిపించడానికి కొందరిని పంపడం.

(k) ఎవరయినా వ్యక్తిని అక్రమంగా బంధించినా, ఇతర హక్కుల ఉల్లంఘనలకు గురిచేసినా, ఆ వివరాలను క్రోడీకరించి ఆయా ప్రభుత్వాలకు అంతర్జాతీయ సంస్థలకు ఫిర్యాదు చేస్తుంది.

(l) రాజకీయ ఖైదీలకు సామూహికంగా శిక్షలు తగ్గించి, క్షమాభిక్ష పెట్టే అవకాశాలను ఆమ్నెస్టీ సమర్థిస్తుంది, ప్రోత్సహిస్తుంది.

(m) పైన వివరించిన లక్ష్యాలను సాధించి, ఆదేశాలను పాటించేందుకు సమంజసమయిన ఏ ఇతర విధానాలనయినా అనుసరిస్తుంది.

లక్ష్యం, ఆదేశం, అనుసరించే విధానాలను కలిపి **Mandate** 'ఆదేశం'గా ఆమ్నెస్టీ నియమావళి (**Statute**) అభివర్ణించింది.

అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా 'మాండేట్'ను సవరించుకునే వీలును నియమావళిలో కల్పించారు. అయితే ఈ సవరణలు మరీ తీవ్రమయిన మార్పులు కాకూడదని నియమావళి నిర్దేశించింది.

రాజకీయంగా నిష్పాక్షికతను పాటించి ఆమ్నెస్టీ సంస్థ విశ్వసనీయతను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.

BRAOU

## 12.5 'హింస' పై నియమం

'హింసా' విధానాన్ని బోధించిన లేదా అనుసరించిన వారిని బంధించినపుడు వారిని భేషరతుగా విడుదల చేయాలని ఆమ్నెస్టీ ఎప్పుడూ అడగలేదు.

విభిన్న మార్గాలలో విశ్వాసం ఉండే వ్యక్తులు ఆమ్నెస్టీలో సభ్యత్వం తీసుకున్నారు. అహింసకు సంబంధించిన ఈ నియమం ఉండడం వల్ల విభిన్న సిద్ధాంతవాదులు ఉమ్మడి లక్ష్యమయిన, మానవతా హక్కుల పరిరక్షణకు ఆమ్నెస్టీతో సహకరించడానికి వీలయింది.

బంధించిన వారిని విడుదల చేయమని ఆమ్నెస్టీ కోరినపుడు ఆయా దేశాల ప్రభుత్వాలకు భిన్నంగా వ్యవహరించినట్టు భావించి రాజకీయ సైద్ధాంతిక పక్షపాతం అంటగట్టే అవకాశం ఉంది. రాజకీయాలనుంచి 'నేరచర్యలను' విడిగా గుర్తించవలసిన అవసరం వుందని ఆమ్నెస్టీ భావించింది.

రాజకీయ ఖైదీలందరినీ న్యాయమైన ధోరణిలో విచారణ జరిపించాలని కోరడం, మరణ శిక్షలను వ్యతిరేకించడం, ఖైదీలపట్ల అమానుషమైన, క్రూరమయిన, అసభ్యమయిన హింసను-శిక్షలను వ్యతిరేకించడం ఆమ్నెస్టీ మౌలిక లక్ష్యాలు.

## 12.6 ఇంటర్నేషనల్ కౌన్సిల్

ఆమ్నెస్టీ నియమావళి (**Statute**) ని సవరించే అధికారం ఇంటర్నేషనల్ కౌన్సిల్‌కు ఉంది. ఇంటర్నేషనల్ కౌన్సిల్‌లో

వివిధ దేశాల నుంచి ఎన్నికైన సభ్యులకు ప్రాతినిధ్యం ఉంటుంది. రెండు సంవత్సరాలకు ఒకసారి సమావేశమవుతుంది. హాజరైన వారిలో మూడింట రెండు వంతులు ఆధిక్యతతో 'సవరణ' చేయవచ్చు. సాధారణ ఆధిక్యతతో ఇతర తీర్మానాలను ఆమోదించవచ్చు. నియమాల అర్థాలను తీర్మానాల ద్వారా వివరించవచ్చు.

## 12.7 కొన్ని ఇబ్బందులు

రాజకీయ సిద్ధాంతపరంగా నిష్పాక్షికతను పాటించడం, అన్ని రకాల ప్రభుత్వాలు హక్కులను కాలరాచినపుడు ప్రశ్నించడం అంత సులువుకాదు. ఈ ప్రతిఘటనలో ఆమ్నెస్టీ అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తున్నది. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష ప్రపంచంలోకెల్లా తీవ్రమయిన ఉల్లంఘన అంటూనే దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్నిఖండించలేక పోయామని ఆమ్నెస్టీ పేర్కొన్నది. ప్రభుత్వాన్ని, ఈ విషయంపై ఖండిస్తే 'నిష్పాక్షికత'కు దెబ్బ తగులుతుందేమోనని ఆమ్నెస్టీ అనుమానించింది. అయితే 'ప్రపంచంలో ఎక్కడైనా శాసనాలు, పద్ధతుల ద్వారా జాతి సిద్ధాంతపరమైన ఆలోచన ఆధారంగా ప్రజల పట్ల వివక్ష చూపడం, బంధించడం, హింసించడం న్యాయపరమైన విచారణ చేయకపోవడం, మరణ శిక్ష విధించడం కూడదని ఒక సార్వజనీనమయిన తీర్మానాన్ని ఆమ్నెస్టీ ఆమోదించింది. స్పష్టంగా వివక్షచూపే వారిని వేలెత్తి విమర్శించకుండా దాటిపడడం విమర్శలకు గురయింది. ఆమ్నెస్టీ నిర్ద్వంద్వంగా వివక్షను ఖండించక పోవడాన్ని ఆమ్నెస్టీ సంస్థలో ఉన్న ఆఫ్రికన్ సభ్యులకు ఆమోదించడం కష్టమే.

హింసను వ్యతిరేకించే విషయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వం హింసకు పాల్పడినపుడు మాత్రమే వ్యతిరేకించి ప్రభుత్వేతర హింసావాదులను ఖండించకపోవడం తప్పు అనే విమర్శలువచ్చాయి.

స్వలింగ సంపర్కం కూడా ఆమ్నెస్టీకి సమస్యలు సృష్టించింది. స్వలింగ సంపర్కం కేసుల ఆధారంగా ఎవరినికూడా బంధించిన సందర్భంలో వారిని విడుదల చేసేందుకు కృషి చేయాలో లేదో తేల్చుకోవడం కష్టమయింది. పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికా సభ్యులు వారి విడుదలకు ఆమ్నెస్టీ ఉద్యమించాలని కోరితే ఏసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల సభ్యులు అందుకు వ్యతిరేకించింది. అయితే హోమోసెక్సువల్టీకి సమాన హక్కులకోసం ఉద్యమించే వారిని బంధించినపుడు, హోమో సెక్స్‌ను ఒక మిషగా చూపి, సైద్ధాంతిక వ్యతిరేకులను బంధించినపుడు ఆమ్నెస్టీ వ్యతిరేకిస్తుందని ఒక అంగీకారానికి వచ్చారు.

ఆమ్నెస్టీ సంస్థ పోరాడే మానవ హక్కుల భంగానికి సంబంధించిన సమస్యలు సంక్లిష్టంగా మారుతూ వస్తున్నాయి. అంతర్యుద్ధాలు, ప్రభుత్వ అధికారాన్ని సవాలు చేసే విధంగా ఎదిగిపోయాయి. మతకలహాలు, వర్గకలహాలు, వరదలు, కరువు అణచివేత వల్ల శరణార్థుల వరం శరణార్థుల వలస మొదలయింది. సంపన్న దేశాలు వారికి ఆశ్రయం ఇవ్వకుండా తలుపులు మూసాయి. ఇటువంటి సంఘటనలుకూడా మానవ హక్కుల ఉల్లంఘనను గుర్తు చేస్తాయి. రాజకీయ హత్యలు, వ్యక్తులు హఠాత్తుగా మాయం కావడం వంటి ఉల్లంఘనలను వ్యతిరేకించడం ఆమ్నెస్టీ కార్య ప్రణాళికలో మొదటి అంశం.

## 12.8 భారతదేశంలో ఆమ్నెస్టీ

భారతదేశంలో మొదటి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గ్రూప్ 1968లో ప్రారంభమైంది. మానవ హక్కులకోసం పోరాడిన మృదులా సారాభాయి మొదటి నాయకురాలు. ఆమెను 1968లో అక్రమంగా అరెస్టు చేసారు. ఆమె జైలులో ఉన్నప్పుడు ఆమ్నెస్టీ నుంచి అందిన ఉత్తరాలు ఆమెను ఈ సంస్థ పట్ల ఆకర్షించాయి. ఇప్పుడు భారత్‌లో 14 గ్రూపులు పనిచేస్తున్నాయి. ఢిల్లీలో ఇండియన్ సెక్షన్ ప్రధాన కార్యాలయం ఉంది. విభిన్న వర్గాల నుంచి, సెక్షన్ల నుంచి ఆడమగ, యువకులు, వృద్ధులు సభ్యులుగా చేరారు. ఏసియా పసిఫిక్ ప్రాంతంలో 850 ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గ్రూప్స్ పని చేస్తున్నాయి. బంగ్లాదేశ్, హాంగ్‌కాంగ్, జపాన్, నేపాల్, ఫిలిప్పైన్స్, దక్షిణ కొరియా దేశాలలో ఆమ్నెస్టీ బృందాలు పనిచేస్తున్నాయి.

BRAOU

సార్వజనీనమైన ప్రాథమిక హక్కులు అందరికీ లభింపచేయడం, ఆ హక్కులు భంగపడినపుడు పరిష్కారాలకోసం పోరాడడం ఆమ్నెస్టీ ధ్యేయం. రాజకీయ ఉద్యమకారులపైన ప్రభుత్వం హింసకు దిగితే ప్రజల రాజకీయ, పౌరహక్కులకే కాక, వారి ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక హక్కులకు కూడా భంగం కలుగుతుంది.

సాయుధులైన ప్రభుత్వేతర మతాలు పౌరులను ఎత్తుకుపోయి, బందీలుగా ఎత్తుకోవడాన్ని మానవ హక్కులను ఉల్లంఘించడాన్ని కూడా ఆమ్నెస్టీ వ్యతిరేకిస్తుంది.

ఆమ్నెస్టీ సభ్యులు, మద్దతుదారులు ఇచ్చే విరాళాలతో ఈ సంస్థ నడుస్తున్నది. ప్రభుత్వాలనుంచి, ప్రభుత్వ సంస్థలనుంచి విరాళాలను నిధులను స్వీకరించబోదు కనుక ఈ సంస్థ స్వతంత్రంగా వ్యవహరించడానికి వీలు ఏర్పడింది.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లండన్ ప్రధాన కార్యాలయంలో ప్రతిరోజూ మానవ హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులు అందుతూ ఉంటాయి. ఆ ఫిర్యాదులను పరిశీలించి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆమ్నెస్టీ బృందాలలో సంబంధిత గ్రూప్‌నకు సమాచారాన్ని విజ్ఞప్తి పత్రాలను పంపుతారు. వారు ఉత్తరాల ద్వారా పత్రికా ప్రకటనలద్వారా ఈ ఫిర్యాదులను బహిరంగంగా తెలియ జేస్తారు. 1996 సంవత్సరం మొదట్లో 100 దేశాలలో 7000 మంది బాధితులకు సంబంధించిన ఫిర్యాదులపైన 4012 దీర్ఘకాలిక కార్యక్రమాలను 4345 ఆమ్నెస్టీ గ్రూప్‌లు నిర్వహిస్తున్నాయి.

1995లో మహిళల హక్కులపై ఒక సదస్సు జరిగింది. ప్రతి పక్షాలకు, ప్రభుత్వానికి మహిళా హక్కులకు సంబంధించి ఉత్తరాలు రాసారు. అంతర్జాతీయ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు. భారత్‌లోనే కాక ఇతర దేశాలలో ఉల్లంఘనలను గురించి కూడా ఇక్కడి ఆమ్నెస్టీ బృందాలు పనిచేస్తున్నాయి. రేప్, హింస, కస్టడీలో మరణాలు ఎక్కువవుతున్నాయని ప్రజల మానవ హక్కులు కాపాడాలని కోరుతూ భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్య బృందాలు విజ్ఞప్తి చేసాయి.

మానవ హక్కుల రక్షణకు సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందాలపై భారతదేశం కూడా సంతకం చేసేందుకు ఆమ్నెస్టీ బృందాలు భారత ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాయి. అంతర్జాతీయ రాజకీయ పౌరహక్కుల ఒప్పందం, ఆర్థిక సామాజిక సాంస్కృతిక హక్కులపై అంతర్జాతీయ ఒప్పందాలపైన 1979లో భారత్ సంతకం చేసేట్లు ఆమ్నెస్టీ కృషి చేసింది.

ఇతర మానవ హక్కుల రక్షణ సంస్థలతో కూడా ఆమ్నెస్టీ సహకరిస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి హక్కుల సమస్యలు తీసుకువస్తూ కార్యకలాపాలను నిర్వహిస్తున్నది.

కస్టడీలో మరణాలు, హింస, రేప్ వంటి నేరాలు, విచారణ జరగకుండా చంపడం, మరణశిక్ష, హక్కుల ఉల్లంఘనను ప్రోత్సహించే చట్టాలను వ్యతిరేకించడంలో భారత్‌లోని ఆమ్నెస్టీ బృందాలు కృషి చేస్తున్నాయి.

## 12.9 భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘన: ఆమ్నెస్టీ నివేదిక

రాజ్యాంగం మూడో భాగంలో లభింపచేసిన ప్రాథమిక హక్కులను హరించే విధంగా 'నిరోధక నిర్బంధం' పేరుతో నష్టాలు చేయడానికి ఆర్టికల్ 22లో ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. ఇది అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం (ICCPR International Convention on civil and political rights) కు విరుద్ధమయినదని ఆమ్నెస్టీ తన నివేదికలో పేర్కొన్నది. హెబియస్ కార్పస్ రిట్ ద్వారా ఈ నిర్బంధాన్ని కోర్టులలో ప్రశ్నించే అధికారం రాజ్యాంగం ఇచ్చినప్పటికీ చట్టపరమయిన పరిష్కారాలు ప్రజలకు అందుబాటులో లేవని ఈ నివేదికలో వివరించారు. స్థానిక, ప్రాంతీయ, జాతీయ పాలనా వ్యవస్థ అవినీతికర విధానాలకు అనుకూలంగా ఉండడమే హక్కుల ఉల్లంఘనకు కారణం. భారతదేశంలో

BRAOU

సగం మంది పేదవారు, నిరక్షరాస్యులు. ఇందులో సగం మందికి ప్రత్యేక రక్షణ అవసరమని ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆమ్నెస్టీ ఇండియా నివేదికలో పేర్కొన్నది. వీరు హింసకు, మాన భంగాలకు, కస్టడీ మరణాలకు గురవుతూ ఉంటారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా లేకపోవడం వల్ల ఇక్కడి చట్టపరమయిన నియమాలు, మానవ హక్కుల ఉల్లంఘనకే ఆస్కారం కల్పిస్తున్నాయి. బాధితులకు రక్షణాత్మకమయిన నియమాలు కొన్ని ఉన్నప్పటికీ అవి అమలుకావు. సాయుధ పోరాటాలు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతాదళాలు నియుక్తులైన సందర్భాల్లో కొన్ని వర్గాలకు చెందినవారిపై హక్కుల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయని ఆమ్నెస్టీ పేర్కొన్నది.

జాతీయ మానవ హక్కుల కమిటీ నివేదిక ప్రకారం 1994లో 3007 మంది ప్రజలు నిరోధక నిర్బంధంలో మగ్గుతున్నారు. స్థానిక పౌర హక్కుల సంఘాల నివేదికల ప్రకారం వీరి సంఖ్య 20 వేలకు మించింది. ఆరోపణలు, ప్రాసిక్యూషన్‌లు కూడా లేకుండా వీరంతా ఏళ్లతరబడి జైళ్లలోనే ఉంటున్నారు. పోలీసు మిలటరీ నిర్బంధాలలో బంధితులచేత నేరాంగీకారాలను చేయించేందుకు హింసిస్తున్నారనీ, లాఠీలతో బాదడం చేతులతో కాళ్లతో వేళ్లాడదీయడం, కరెంట్ షాక్‌లకు గురిచేయడం మామూలు విధానాలనీ పేర్కొన్నారు. 1995లో దేశం మొత్తం మీద లాకప్‌లో హింసలకు కనీసం వందమంది చనిపోయారనీ, జాతీయ మానవ హక్కుల కమిటీ నివేదిక ప్రకారం 10 నెలల్లోనే 130 లాకప్ మరణాలు సంభవించాయని ఆమ్నెస్టీ-ఇండియా నివేదికలో వివరించింది. యు.ఎన్. హింస, ఇతర అమానుష క్రూర నీచప్రవర్తన, శిక్షల వ్యతిరేక ఒప్పందం పైన ఇండియా ఇంకా సంతకం చేయలేదు. Unstandard minimum rules for the treatment of prisons అంటే ఖైదీల పట్ల ప్రవర్తించడంలో కనీస విలువల పాటింపుకోసం యు.ఎన్. రూపొందించిన నియమాలకు అనుగుణంగా భారతదేశపు జైళ్ళు లేవనీ, బందీఖానాలు లాకప్‌లు దారుణంగా ఉన్నాయని, ఆమ్నెస్టీ పేర్కొన్నది. డజన్లకొద్దీ రాజకీయ బంధితులు హఠాత్తుగా 'అదృశ్యం' కావడం ఎక్కువైందని, Undeclaration on the protection of the persons from enforced disappearance బలవంతంగా అదృశ్యం చేయించబడే వ్యక్తుల రక్షణకు సంబంధించిన యు.ఎన్. ప్రకటనకు భిన్నంగా పరిస్థితులున్నాయని, వారి రక్షణ మార్గాలే లేవనీ, సెక్యూరిటీ దళాల చేతుల్లో న్యాయానికి చట్టాలకు అతీతంగా వందలాది మంది హతులవుతున్నారని పేర్కొన్నారు. మరణ శిక్షలు ఇంకా అమలు చేస్తున్నారని, 1995లో ముగ్గురిని ఉరి తీసారని పేర్కొన్నారు. ఆమ్నెస్టీ ప్రభుత్వ వ్యతిరేక సాయుధ శక్తులు జరిపే మానవ హక్కుల ఉల్లంఘనల గురించి కూడా తన నివేదికలో పేర్కొన్నది. కొందరు పౌరులను అధికారులను బందీలుగా పట్టుకొని, హింసించి, చంపి వేసిన సంఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. భారత చట్టాలు జెనీవా ఒప్పందం ఆర్టికల్ 3 ప్రకారం వ్యక్తులను ఎత్తుకుపోయి హింసించి చంపడానికి వీలులేదు. అంతర్జాతీయ సాయుధ సంఘర్షణలు లేని సందర్భాల్లో వ్యక్తులను చంపే అన్ని రకాల హత్యావిధానాలను వ్యతిరేకిస్తున్నారు.

BRAOU

## 12.10 ముగింపు

లండన్ ప్రధాన కార్యాలయంగా 1961లో ప్రారంభమైన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ మానవ హక్కుల రక్షణోద్యమంలో కీలకమయిన పాత్ర నిర్వహిస్తున్నది. 11 లక్షల మంది సభ్యులతో ప్రపంచవ్యాప్తమయిన ఈ సంస్థ మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగిన సంఘటనలపై ఫిర్యాదులు చేయడం, సమాచారం సేకరించడం, ప్రజల దృష్టికి తేవడం, అక్రమ నిర్బంధాలకు గురయిన వారి విడుదలకు కృషి చేయడం ఆమ్నెస్టీ కార్యక్రమాలు.

భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. సాయుధ దళాలు, విప్లవ వర్గాలు ఉల్లంఘించిన హక్కుల వివరాలు, చట్టాల్లో, చట్టాలు అమలుచేసే యంత్రాంగాల్లో లోపాలు నివేదికలో వివరించారు.

## 12.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I.** ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానం రాయండి

1) ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఏ విధంగా పనిచేస్తుంది? ఎన్ని దేశాలలో ఆమ్నెస్టీ విస్తరించింది.

2) భారతదేశంలో ఆమ్నెస్టీ కార్యక్రమాలు వివరించండి.

**II.** ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి

1) ఆమ్నెస్టీ మానవ హక్కుల రక్షణలో నిర్వహిస్తున్న పాత్రను విశ్లేషించండి.

2) భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘన గురించి ఆమ్నెస్టీ నివేదికలో అంశాలను తెలపండి?

## 12.12 సంప్రదింపు గ్రంథాలు


1. *International Human Rights in context,* Henry J. Steiner and Phillip Alston Clarendan Press-Oxford.


BRAOU

# భాగం 13: హ్యూమన్ రైట్స్ వాచ్

## విషయక్రమం


13.0 ఉద్దేశం
13.1 పరిచయం
13.2 ఏసియావాచ్ అవతరణ
  13.2.1 ఏసియా వాచ్ కార్యక్రమాలు
  13.2.2 ఈశాన్య రాష్ట్రాలలో అలజడి
  13.2.3 నర్మదాలోయ: మానవ హక్కులు
  13.2.4 నక్సలైట్ల ఉద్యమం
  13.2.5 మత మారణ హోమం
  13.2.6 పిల్లల చేత వెట్టిచాకిరి
  13.2.7 జమ్మూ-కాశ్మీర్‌లో మానవ హక్కులు
13.3 ఆఫ్రికాలో మానవ హక్కులు
  13.3.1 ఆఫ్రికా వాచ్ నివేదికలు
13.4 ముగింపు
13.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
13.6 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

## 13.0 ఉద్దేశం

### ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఏసియా వాచ్ గురించి తెలుసుకుంటారు
- జమ్మూ-కాశ్మీర్‌లో మానవ హక్కుల గురించి అవగాహన చేసుకుంటారు
- ఆఫ్రికాలో మానవ హక్కుల గురించి వివరించగలుగుతారు.

## 13.1 పరిచయం

ప్రభుత్వేతర సంస్థలు మానవ హక్కుల రక్షణలో అరుదైన పాత్ర నిర్వహిస్తున్నాయి. మానవ హక్కుల ప్రకటన, ఆ తర్వాత దాదాపు 10 మానవ హక్కుల పత్రాల రచన జరగడంతో ఇదొక ఉద్యమంగా సాగుతున్నది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వలె హ్యూమన్ రైట్స్ వాచ్ కూడా ఒక అంతర్జాతీయ ప్రభుత్వేతర మానవ హక్కుల సంస్థ. గత రెండు దశాబ్దాలనుంచి మానవ హక్కులపట్ల ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి, ఆందోళన పెరిగింది. అమెరికాలోనూ, ఇతర కీలకమయిన దేశాలలోనూ హ్యూమన్‌రైట్స్ వాచ్ వ్యాపించింది.

హెల్సింకీలో లాయర్లు, సంఘసేవకులు, ప్రచురణ కర్తలు కలిసి 1978లో హెల్సింకీ వాచ్ అనే మానవ హక్కుల పరిశీలనా సంస్థను రూపొందించారు. హెల్సింకీ ఒప్పందాలకు యూరోపియన్ సభ్యదేశాలు, అమెరికా, కెనడా కట్టుబడి ఉండేట్లు చూడడం హ్యూమన్‌రైట్స్ వాచ్ లక్ష్యం.

## 13.2 ఏసియావాచ్ అవతరణ

హ్యూమన్‌రైట్స్ ఏసియా వాచ్ 1985లో అవతరించింది. హ్యూమన్ రైట్స్ వాచ్‌కు న్యూయార్క్, వాషింగ్టన్, లాస్ ఎంజెల్స్, లండన్, బెల్‌గ్రేడ్, హాంగ్‌కాంగ్ మొదలయిన అనేక నగరాలలో కార్యాలయాలున్నాయి. హ్యూమన్ రైట్స్ వాచ్‌లో అయిదు ముఖ్య భాగాలు పనిచేస్తున్నాయి. ఆఫ్రికా వాచ్, ఏసియా వాచ్, అమెరికా వాచ్, హెల్సింకీ వాచ్, మిడిల్ ఈస్ట్ వాచ్, ఈ సంస్థకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రోగ్రాం డైరెక్టర్, ప్రాంతీయ డైరెక్టర్ నాయకత్వం వహిస్తారు.

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మానవ హక్కుల ప్రమాణాలను, నియమాలను పత్రాలను, ఒప్పందాలను ఆయా దేశాలు, ప్రభుత్వాలు పాటిస్తున్నాయో లేదో పరిశీలించడం ఈ సంస్థ ముఖ్య కార్యక్రమం. కొన్ని దేశాలలో నిర్దిష్టమైన పద్ధతులపై ఈ మానవ హక్కుల సంస్థ నివేదికలు సమర్పిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగితే స్వయంగా నిజ నిర్ధారణ బృందాలను పంపి నిజానిజాలు విచారించి, నివేదికలను రూపొందిస్తుంది. ఉల్లంఘన ఫిర్యాదులను ఒక పద్ధతి ప్రకారం పరిశోధన జరిపే విధానాలు ఏర్పాటుచేసారు. స్థానిక మానవ హక్కుల సంఘాలు, కార్యకర్తలు, తదితరుల సహకారాన్ని స్వీకరిస్తారు.

వివిధ జాతుల ప్రభుత్వాలు, మత ప్రభుత్వాలు, రాజకీయ ప్రభుత్వాలు వ్యవహరించే తీరుతెన్నులను, హక్కుల ఉల్లంఘనలను పరిశీలిస్తుంది. యుద్ధ సమయాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనా స్వేచ్ఛ, ఏ మేరకు ఉందో వివరాలు సేకరిస్తారు. హింస, లౌకిక మరణాలను ఖండిస్తారు. ఉల్లంఘనలు జరిగిన చోట ప్రభుత్వాల బోధనలను గుర్తు చేస్తారు. ఆయుధాలు, జైళ్లు, మహిళలు వంటి ప్రత్యేక వర్గాల హక్కులు, ఉల్లంఘనలను గురించి ప్రత్యేక నివేదికలు ఇస్తారు.

## 13.2.1 ఏసియా వాచ్ కార్యక్రమాలు

BRAOU

పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతి, నర్మదాలోయ ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళన, నక్సలైట్ ఉద్యమం (ఆంధ్రప్రదేశ్) మత తత్వ సమస్య, పిల్లల వెట్టిచాకిరి, జమ్మూ-కాశ్మీర్‌లో సాయుధ ఆందోళనల్లో పౌరహక్కులు మానవ హక్కులపై విస్తృతమయిన అధ్యయనం చేసి నివేదికలు తయారు చేసింది ఏసియా వాచ్.

భారతదేశంలో అనేక వర్గాలు మామూలు హక్కులకు నోచుకోకుండా బ్రతుకు సాగిస్తున్నాయి. బడుగువర్గాల ఆశలు నెరవేరడం లేదు, పాలకులకు ప్రజలకు మధ్యన దూరంపెరుగుతూనే ఉంది. దళితులు మైనారిటీలు అత్యాచారాలకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్నారు. ప్రభుత్వ దళాలు హింసకు పాల్పడుతున్నాయనే ఆందోళనలు చెలరేగుతున్నాయి.

పంజాబ్‌లో 'ఖలిస్తాన్' విభజన కోసం సాగిన సాయుధ ఆందోళనను ఎదుర్కొనడానికి ప్రభుత్వం సాగించిన కార్యక్రమాలు రక్త పాతానికి దారితీసాయని వేరే చెప్పనవసరం లేదు. ఆపరేషన్ నైట్ డామినెన్స్, ఆపరేషన్ రెస్టొరేషన్ పీస్, ఆపరేషన్ రక్షా-II, ఆపరేషన్ బ్లూస్టార్‌పేర్లతో మిలటరీ కార్యక్రమాలు సాగించారు. కొందరు అమాయకులైన సిక్కుయువకుల హక్కులు హరింపచేసినాయి. పంజాబ్‌లో మానవ హక్కుల వ్యవహారాలపై ఏసియా వాచ్ ప్రపంచమేధావులను చైతన్యవంతం చేసింది.

సిక్కు టెర్రరిస్టులు సాగించిన మానభంగాలు, అమాయకుల హత్యలు, హింసలను కూడా ఏసియా వాచ్ ఎత్తిచూపింది.

## 13.2.2 ఈశాన్య రాష్ట్రాలలో అలజడి

ఈశాన్య రాష్ట్రాలలో గిరిజనుల ఆందోళనపై కూడా ఏసియా వాచ్ దృష్టి కేంద్రీకరించింది. భద్రతాదళాలు ఈ సమస్యను ఎదుర్కోవడంలో అవలంబించిన విధానాలను విశ్లేషించింది. బాంగ్లాదేశ్‌నుంచి వలస వచ్చిన వారితో అస్సాం

గిరిజనులు పోరాడవలసి వస్తున్నదని ఈ వలస దారులు సంస్కృతి, గుర్తింపు, జనాభా, భాష, సంప్రదాయాలను కలుషితం చేస్తున్నారని ఏసియా వాచ్ నివేదికలో తెలిసింది. భద్రతా దళాలు, ఉల్ఫా ఉగ్రవాదులు అనేక సందర్భాలలో మానవ హక్కులను భంగ పరిచారని వివరించారు. స్వతంత్ర ప్రతిపత్తికోసం పంజాబ్, కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో సాగే ఉద్యమాలు, వాటిని ప్రతిఘటించడంలోనూ అనేక మానవ హక్కుల ఉల్లంఘనలు జరగడాన్ని, ఏసియా వాచ్ వెల్లడించింది.

## 13.2.3 నర్మదా లోయ: మానవ హక్కులు

ఏసియాలో కెల్లా పెద్ద నదీలోయ సేద్యపు నీటి పథకం నర్మదా ప్రాజెక్టు. 50 లక్షల హెక్టార్ల భూమికి సేద్యపు నీరు అందించగల ఈ భారీ ప్రాజెక్టు 3830 మెగావాట్ల విద్యుచ్ఛక్తిని కూడా ఉత్పత్తి చేయగలుగుతుందని అంచనా. అయితే వేలాది గిరిజన కుటుంబాలు సొంత ఊళ్లనుంచి నిర్వాసితులు కావలసిరావడం, జనజీవన సంస్కృతీ సంప్రదాయాలు కూకటివేళ్లతో సహా పెకిలించవలసి రావడం ఈ ప్రాజెక్టులో తీవ్ర నష్టానికి కారణమయిన అంశాలు. గిరిజనులు అభివృద్ధి పేరసాగే సంస్కృతి వినాశనాన్ని, ఎదిరించి ఆందోళన సాగిస్తున్నారు. ఈ ఆందోళనను అణచి వేయడానికి ప్రభుత్వాలు బలప్రయోగం చేస్తున్నాయి. పోలీసులు గిరిజనులను బంధించి, హింసిస్తున్నారు, వేధిస్తున్నారు. 90వేల మంది ప్రజలు నిర్వాసితులు అవుతారని, 33,947 ఎకరాల అడవులు మునిగిపోతాయని ఏసియా వాచ్ వివరించింది. స్థానిక పత్రికల అంచనా ప్రకారం లక్షా 52 వేలమంది నిర్వాసితులు అవుతారు. 'నర్మదా బచావ్' ఆందోళన నాయకురాలు మేధా పాట్కర్ కృషిని ఏసియావాచ్ అభినందించింది.

## 13.2.4 నక్సలైట్ల ఉద్యమం

ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లకు, పోలీసు బలగాలకు మధ్య సాగుతున్న ఘర్షణ, ఆందోళన అణచివేతలో మానవ హక్కులు బలికావడం మామూలైపోయింది. పోలీసులు, నక్సలైట్ల హింసాకార్యక్రమాలను ఏసియా వాచ్ బయటపెట్టింది. తెలంగాణలో భూస్వామ్య వాదం, జమీందార్ల అరాచకాలను ఏసియా వాచ్ ప్రపంచానికి తెలిపింది.

BRAOU

## 13.2.5 మత మారణ హోమం

రాజకీయ స్వార్థ పరులు భారతదేశం నెత్తిన మతవాదం రుద్దడం వల్ల మతకలహాలు విజృంభించాయని ఏసియా వాచ్ అభిప్రాయపడింది. ఒక్క ముంబై నగరంలోనే మత కలహాలకు ఒకేసారి 700 మంది బలి అయిపోయారు.

## 13.2.6 పిల్లలచేత వెట్టిచాకిరి

మనదేశంలో పిల్లలను కూడా పనిలోకి దింపడానికి పేదకుటుంబాలు, వారితో తక్కువ కూలి డబ్బులకు పనిచేయించుకోవడానికి సపన్న కాంట్రాక్టర్లు వెనుకాడరు. పసిమొగ్గల చేత పనులు చేయించేందుకు వారికి తగినంత కూలీ డబ్బుకూడా ఇవ్వకుండా ఉండేందుకు, వెట్టిచాకిరి మార్గాలు కనిపెట్టారు. తల్లిదండ్రుల అప్పులు తీర్చేందుకు బాల్య, యౌవన దశలన్నీ వెట్టిచాకిరికి బలిచేసే బాలల సంఖ్య ఎంతో ఉందని ఏసియావాచ్ తెలిపింది. వ్యవసాయంలో వెట్టిచాకిరి ఎక్కువని పేర్కొంది. బీడి పరిశ్రమలో 3 కోట్ల 27 లక్షలమంది బాలలున్నారని, ఉక్కు పరిశ్రమలో 10 వేల మంది పిల్లలు వెట్టిచాకిరి చేస్తున్నారని, రాళ్ల పరిశ్రమలో 1.6 లక్షల మంది, పట్టు పరిశ్రమలో 2.5 లక్షలమంది, రెండు లక్షల 62 వేలమంది తివాచీ పరిశ్రమలో వెట్టిచాకిరి చేస్తున్నారు. 52.87 శాతం మంది పిల్లలు కేవలం వ్యవసాయ రంగంలో వెట్టిచాకిరి చేస్తున్నారు. పిల్లలచేత చాకిరి చేయిస్తూ వారిని తిట్టడం, వేధించడం, అనారోగ్యకర వాతావరణంలో పనులు పురమాయించడం,

అవసరమయినా గ్లోవ్స్‌లు, అద్దాలు ఇవ్వకపోవడం ఇతర పరికరాలు సమకూర్చకపోవడం వంటి నిజాలను ఏసియావాచ్ వెల్లడించింది.

## 13.2.7 జమ్మూ-కాశ్మీర్‌లో మానవ హక్కులు

జమ్మూ-కాశ్మీర్‌లో సామాజిక ఆర్థిక పరిస్థితులపై మానవ హక్కుల ఏసియా వాచ్ నివేదిక ఇచ్చింది. పెట్టుబడులు 0.03 శాతానికి తగ్గిపోయాయని, టూరిజం తప్ప మరే పరిశ్రమ అక్కడ అభివద్ధి చెందలేదని ఏసియా వాచ్ తెలిపింది. ఆర్థిక పరిస్థితుల వల్ల కలిగిన నిరాశ నిస్పృహ పేదరికం ఆకలి వివిధ అల్లర్ల రూపాలు ధరించిందని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతా దళాలు సైనిక దళాల అణచివేత విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. 1990-94 మధ్య కాలంలో కస్టడీలో 700 మందికి పైగా మరణించారని నివేదిక పేర్కొన్నది. నివాస ప్రాంతాలను తగులబెట్టడం ఈ సంఘటనలను గురించి నివేదికలో వివరించారు. 3000 గృహాలను దగ్ధం చేయడానికి మిలిటెంట్లకు అనుకూలంగా ఉన్నారనే అనుమానమే కారణమని పేర్కొన్నారు. మిలిటెంట్లు స్కూలు భవనాలు కూల్చి, సినిమా థియేటర్లు పేల్చి, పత్రికలపై దాడిచేసి టెలివిజన్ డైరెక్టరును, కాశ్మీర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌ను హత్యచేసి అనేక మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారు. పోలీసు ఇన్‌ఫార్మర్లు అని అనుమానించి ఎందరో మహిళలతో మిలిటెంట్లు సాగించిన దుర్వ్యవహారాలను ఏసియా వాచ్ వెల్లడించింది. 6వేలమంది కాశ్మీరీ హిందువులను హత్యచేశారు. లక్షమంది కాశ్మీర్‌ను వదిలి వలస వెళ్లారని ఏసియా వాచ్ వివరించింది.

## 13.3 ఆఫ్రికాలో మానవ హక్కులు

ఆఫ్రికన్ దేశాలలో మానవ హక్కుల ఉద్యమాన్ని సాగించడానికి 1981లో 'ఆఫ్రికన్ ఐక్యత రక్షణ సంఘం'లో దేశాధినేతల సమావేశం జరిగింది. వారు మానవ, పౌర హక్కుల ఆవశ్యక చార్టర్‌ను రూపొందించారు. 1986లో ఈ చార్టర్ అమలులోకి వచ్చింది. 1998 జనవరి నాటికి 49 ఆఫ్రికన్ దేశాలు ఇందులో సభ్యత్వం తీసుకున్నాయి. పాశ్చాత్యుల బానిస వ్యాపారం, స్వతంత్ర దేశాలను పరాధీనం చేయడం, వర్ణవివక్ష వంటి సమస్యలను గురించి ఆఫ్రికా మానవ హక్కుల చార్టర్ నియమాలను ప్రమాణాలను రూపొందించింది. ఏసియన్ జాతీయులను ఉగాండా నుంచి బహిష్కరించడం వంటి సమస్యలను చర్చించింది. అందరికీ సామాన్య మానవ గౌరవం అందేట్లు చూడటం గురించి ప్రస్తావించింది. మానవ హక్కులతోపాటు ఆఫ్రికా చార్టర్‌లో కొన్ని విధులను కూడా చేర్చారు. హింసకు పాల్పడకపోవడం, రాజకీయ పాలనావిధానాలలో అందరికీ అవకాశం కల్పించడం ప్రభుత్వాల విధులు. మరొకరి వ్యక్తిగత హక్కులపై దాడిచేయకపోవడం, మరొకరి వ్యక్తిగత భద్రతా హక్కును గౌరవించడం వ్యక్తుల బాధ్యతలు.

వివక్షకు గురికాకుండా అందరితో కలిసి పోయే హక్కును ఈ చార్టర్ గుర్తించింది.

ఆఫ్రికన్ దేశాల అధినేతల సంఘం సభ్యులు ఎన్నుకున్న 11 మంది సభ్యులతో ఆఫ్రికన్ కమిషన్ ఏర్పడింది. ఆఫ్రికన్ మానవ హక్కులపై ఈ కమిషన్ నివేదికలు రూపొందిస్తుంది.

హ్యూమన్ రైట్స్, ఆఫ్రికా వాచ్ సంస్థ మానవ హక్కుల ఫిర్యాదులను స్వీకరించి, నిజ నిర్ధారణ చేసి సంబంధిత అధికారులకు ప్రభుత్వాలచేత పరిష్కారాలను కనుగొనే ప్రయత్నాలను చేస్తున్నది.

## 13.4 ముగింపు

ప్రపంచ దేశాలలో మానవ హక్కుల రక్షణ కోసం ఉద్యమం సాగుతున్నట్టే ఉల్లంఘనలు కూడా సాగిపోతూనే ఉన్నాయి. ప్రపంచ మానవ హక్కుల ప్రకటన, తదితర హక్కుల పత్రాలు, ఒప్పందాలు, మానవతా ప్రమాణాలను నిర్ణయించాయి. అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రమాణాలు ఏర్పడడం వల్ల ఉల్లంఘనల మీద ఉద్యమించడానికి ప్రాతిపదిక

BRAOU

ఏర్పడింది. ఈ అవకాశాల ఆధారంగా అనేక అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ సంఘాలు అవతరించి ఉద్యమాలు నిర్వహించాయి. అందులో హ్యూమన్ రైట్స్ వాచ్ ఒకటి. ఏసియా వాచ్, అమెరికా వాచ్, ఆఫ్రికా వాచ్, హెల్సింకీ వాచ్, మిడిల్ ఈస్ట్ వాచ్ విభాగాలు ఆయా ప్రాంతాల్లో ఈ మానవ హక్కుల రక్షణకు కృషి చేస్తున్నాయి.

ఏసియాలో, ముఖ్యంగా ఇండియాలో అనేక చోట్ల ఉల్లంఘనల గురించి ఏసియా వాచ్ నివేదికలు ఇచ్చింది. పంజాబ్ ఈశాన్య రాష్ట్రాలు, నర్మదా లోయ ప్రాజెక్టు, కాశ్మీర్ ఆంధ్రలో నక్సలైట్ ఉద్యమం, మత తత్వ వివాదాలు బాలల వెట్టి చాకిరి వంటి సమస్యలపైన నివేదికలు ఇచ్చింది.

ఆఫ్రికాలో వర్ణవివక్ష తదితర మానవ హక్కుల ఉల్లంఘనలపై నివేదికలు సమర్పించి అక్కడి ఉల్లంఘనలను ప్రపంచం దృష్టికి తెచ్చింది.

## 13.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తుల్లో సమాధానం రాయండి**

(1) హ్యూమన్ రైట్స్ వాచ్ ఎప్పుడు ఏర్పడింది? ఏయే దేశాల్లో 'వాచ్' విభాగాలు పనిచేస్తున్నాయి?

(2) ఏసియా వాచ్ కార్యక్రమాలను వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో సమాధానం రాయండి**

(1) భారత్‌లో ఏ సమస్యలపై వాచ్ నివేదికలు రూపొందించింది.

(2) ఆఫ్రికాలో హ్యూమన్‌రైట్స్ వాచ్ కృషి వివరించండి

## 13.6 సంప్రదింపు గ్రంథాలు


1. ఏసియావాచ్ అండ్ ఫిజీసియన్ ఫర్ హ్యూమన్ రైట్స్: ది హ్యూమన్‌రైట్స్ క్రైసిస్ ఇన్ కాశ్మీర్, ఎ. పాటెర్న్ ఆఫ్ ఇంప్యూనిటీ న్యూయార్క్ 1993
2. హ్యూమన్ రైట్స్ వాచ్, డెడ్ సైలెన్స్: ది లెగసీ ఆఫ్ బ్యూసెస్ ఇన్ పంజాబ్, న్యూయార్క్, 1993
3. హ్యూమన్ రైట్స్ వాచ్, ది స్మాల్ హాండ్స్ ఆఫ్ స్లేవరీ బాండెడ్‌చైల్డ్ లేబర్ ఇన్ ఇండియా, న్యూయార్క్ 1996
4. హ్యూమన్ రైట్స్ వాచ్, వరల్డ్ రిపోర్ట్స్ *1995*, 1996, 1997


BRAOU

# భాగం 14: అంతర్జాతీయ ద్రవ్యనిధి-ప్రపంచ బ్యాంకు-మానవ హక్కులు

## విషయ క్రమం

14.0 ఉద్దేశం
14.1 పరిచయం
14.2 విభిన్న రకాల హక్కులు-అర్థవివరణ
14.3 ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధుల ఆవిర్భావం
14.4 ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధుల పరిణామం, మారుతున్న పాత్ర
14.5 ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు విధానాల ప్రభావం
14.6 ముగింపు
14.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 14.0 ఉద్దేశం

*ఈ భాగం చదివిన తరువాత మీరు*

- విభిన్న రకాల హక్కుల అర్థాల్ని తెలుసుకుంటారు.
- ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధుల ఆరంభాన్ని, పరిణామాన్ని మరియు వాటి పాత్రను అవగాహన చేసుకుంటారు
- ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు విధానాల ప్రభావాన్ని వివరించగలుగుతారు.

BRAOU

## 14.1 పరిచయం

గత దశాబ్దకాలంలో మూడో ప్రపంచ దేశాలు, మాజీ సోషలిస్టు దేశాలు ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి సంస్థల నుండి పెద్ద ఎత్తున అప్పు తెచ్చుకొన్నాయి. అప్పు తెచ్చుకొన్నందుకుగాను తప్పనిసరిగా ఈ దేశాలు ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి విధానాలను అమలుచేయవలసి వస్తున్నది. ఈ విధానాల వలన ప్రభుత్వం ఇంతవరకూ నిర్వహిస్తున్న కార్యకలాపాలలో మార్పులు చేర్పులు వచ్చాయి. ఆ మార్పుల ప్రభావం పౌర హక్కుల రంగంలో గణనీయంగా ఉన్నది. అందుకే పౌర హక్కుల గురించి, ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాల్లో పౌర హక్కుల పరిస్థితి గురించి తెలుసుకోవాలంటే తప్పని సరిగా ప్రపంచబ్యాంకు, ద్రవ్యనిధి విధానాలను అధ్యయనం చేయాలి. ఈ పాఠము ప్రపంచబ్యాంకు, ద్రవ్యనిధి సంస్థలు అప్పుతీసుకునే దేశాలలో అమలుచేస్తున్న విధానాల స్వభావాన్ని పౌరహక్కుల పరిస్థితిపై ఆ విధానాల ప్రభావాన్ని వివరిస్తుంది.

ఈ పాఠ్యాంశంలో ఉపోద్ఘాతము కాక నాలుగు భాగాలున్నాయి. మొదటి భాగం సంక్షిప్తంగా వివిధ రకాల పౌరహక్కులను పరిచయం చేస్తుంది. రెండవ భాగం ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి ఆవిర్భావానికి దారితీసిన చారిత్రక పరిస్థితులను వివరిస్తుంది. మూడవ భాగం 1980లలో ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు విధానాలలో వచ్చిన మార్పులను ఆ మార్పులు రావటానికి గల కారణాలను, ఆ విధానాల స్వభావాన్ని వివరిస్తుంది. ఇక చివరి భాగం మానవ హక్కులపై ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల విధానాల ప్రభావాన్ని విశ్లేషిస్తుంది.

## 14.2 విభిన్న రకాల హక్కులు-అర్థవివరణ

పౌరహక్కుల భావన యూరప్‌లో 16, 17 శతాబ్దాలలో ఆవిర్భవించి క్రమంగా పరిణామం చెందింది. పౌరహక్కుల భావన అభివృద్ధిలో మూడు స్పష్టమైన దశలున్నాయి. ఒక్కొక్క దశలో ఒక్కొక్క రకమైన హక్కులకు ప్రాముఖ్యత వచ్చింది. ఇందులో మొదటి తరం హక్కులను Negative Rights అంటారు. రెండవ తరం హక్కులను Positive Rights అని మూడవ తరం హక్కులను సమిష్టిహక్కులని పిలుస్తారు.

మొదటి తరం హక్కులు యూరప్ దేశాల్లో ఫ్యూడల్ నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాట క్రమంలో ఉనికిలోకి వచ్చాయి. ఈ హక్కులు ప్రధానంగా సమాజం ఆధిపత్యం నుండి, ప్రభుత్వ నిరంకుశత్వం నుండి వ్యక్తికి స్వేచ్ఛను ప్రసాదించాయి. వ్యక్తి జీవితంలో సమాజం జోక్యాన్ని, ప్రభుత్వ జోక్యాన్ని Negative Rights నిరోధిస్తాయి. ఈ హక్కులు వ్యక్తి స్వతంత్రంగా వ్యవహరించగల కార్య రంగ పరిధిని తెలియజేస్తాయి. స్వేచ్ఛ అంటే జోక్యం లేకపోవడం, పరిమితులు లేక పోవడం అన్న Negative అర్థంలో వివరించడం వల్లనే ఈ హక్కులకు Negative Rights అన్న పేరు వచ్చింది. భావ ప్రకటనా హక్కు, జీవించే హక్కు, నచ్చిన వృత్తిని చేపట్టే హక్కు వంటి Negative Rights జాబితాలో చేరతాయి.

ఫ్యూడల్ వ్యవస్థలు కుప్పకూలి ఆధునిక ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భవించిన తర్వాత Negative Rights కల్పించే స్వేచ్ఛకన్నా పరిమితులు బహిర్గతమయ్యాయి. పరిమితులు, ఆంక్షలు లేనంత మాత్రాన, వ్యక్తి స్వేచ్ఛగా వ్యవహరించడం సాధ్యంకాదు. ఆంక్షలు లేకపోవడం వలన స్వేచ్ఛగా వ్యవహరించడానికి అవకాశం కలుగుతుంది. అయితే స్వేచ్ఛగా వ్యవహరించడానికి ఈ ఒక్క పరిస్థితి సరిపోదు. స్వేచ్ఛ అంటే వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం, తనకు నచ్చిన జీవితాన్ని ఎంచుకొని దాన్ని పొందడానికి ప్రయత్నించడం, గౌరవప్రదమైన జీవితాన్ని పొందడం అని అనుకుంటే కనుక చదువు లేక పోవడం వలన, ఉపాధిలేనందువలన, ఆరోగ్యం లేకపోవడం వలన కూడా స్వేచ్ఛ నిరర్థకమవుతుందని గుర్తించక తప్పదు. సృజనాత్మక శక్తులను పెంపొందించుకోవడానికి కావలసిన పరిస్థితులు విద్య, ఉపాధి, వైద్యం వంటివి ఉంటేనే వ్యక్తి స్వేచ్ఛను అనుభవించగలడు. 20వ శతాబ్దం ఆరంభం నాటికి అన్ని దేశాల్లో వ్యక్తి జీవితాన్ని పెంపొందించుకోవడానికి కావలసిన సదుపాయాలను కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని అంగీకరించారు. వ్యక్తి జీవితాన్ని పెంపొందించుకోవడానికి కావలసిన సదుపాయాలను, పరిస్థితులను Positive Rights అంటారు. ఈ హక్కులను సామాజిక-ఆర్థిక హక్కులని కూడా అంటారు. సోషలిస్టు దేశాలు, మూడో ప్రపంచ దేశాలు సామాజిక-ఆర్థిక హక్కులకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాయి. ఎందుకంటే ఈ దేశాలు సామాజిక-ఆర్థిక అసమానతలను నిర్మూలించకుండా వ్యక్తి వికాసానికి అవకాశం ఉండదని భావిస్తున్నాయి.

మూడవ తరం హక్కులు కూడా 20వ శతాబ్దం లోనే ఆవిర్భవించాయి. స్వయం నిర్ణయాధికారపు హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పర్యావరణ హక్కు ఈ జాబితాలోకి చేరుతాయి. స్వయం నిర్ణయాధికార హక్కు ప్రతి జాతికి తన రాజకీయ భవితవ్యాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను కల్పిస్తున్నది. అభివృద్ధి చెందే హక్కును 1986లోనే ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానం ద్వారా గుర్తించింది. ఈ హక్కు ప్రకారం రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిని రూపకల్పన చేయడానికి, సాధించడానికి ప్రజలకు భాగస్వామ్యం ఉంది. అంతేకాదు అభివృద్ధి ఫలితాలను అనుభవించడానికి కూడా ప్రజలందరికి ఈ హక్కు అవకాశం కల్పిస్తుంది. మరొక రూపంలో చెప్పాలంటే అభివృద్ధి చెందే హక్కు వలన ప్రతి దేశానికి నచ్చిన అభివృద్ధి నమూనాను ఎంచుకునే స్వేచ్ఛను దేశీయ వనరులను వినియోగించుకునే అధికారాన్ని కల్పిస్తున్నది. పర్యావరణపు హక్కు స్వచ్ఛమైన పర్యావరణాన్ని పొందే హక్కును కల్పిస్తుంది. మూడో తరానికి చెందిన హక్కులన్నీ సమిష్టిహక్కులే. అంటే ఈ హక్కులవలన వ్యక్తులకు కాకుండా సమాజానికి స్వేచ్ఛ లభిస్తుంది.

పై వివరణను పరిశీలిస్తే ఒక విషయాన్ని గమనించవచ్చు. మానవ జాతి ఎదుర్కొంటున్న విభిన్న సమస్యల వ్యక్తీకరణకు, వాటికి పరిష్కార మార్గాలను వెదకటానికి ఆధునిక సమాజాన్ని హక్కుల పరిభాషపై ఆధారపడుతున్నాయి. అందువల్లనే హక్కుల పరిధి పెరిగింది. మొదట ఆధిపత్య శక్తుల పెత్తనం నుండి ప్రభుత్వ నిరంకుశత్వం నుండి తనని తాను

BRAOU

కాపాడుకోవడానికి, మనిషిహక్కులను నైతిక ప్రవచనంగా ఉపయోగించాడు. ఆ తర్వాత వ్యక్తికి, సమూహానికి సామాజిక-ఆర్థిక సమానత్వాన్ని చేకూర్చడానికి హక్కులు సాధనాలయ్యాయి. అందుకే హక్కులు అనే పదాన్ని ఇదమిద్ధంగా నిర్వచించడం కష్టం.

ఈ సంక్లిష్టత వల్లనే చాలామంది రచయితలు, రాజకీయ నాయకులు ఈ మూడు రకాల హక్కుల మధ్య వైరుధ్యాన్ని చూస్తున్నారు. కొంతమంది సామాజిక - ఆర్థిక హక్కుల వలన వ్యక్తి జీవితాన్ని నిర్దేశించగల అధికారం ప్రభుత్వానికి సంక్రమిస్తున్నది. కనుక వాటి హక్కుల జాబితాలో నుండే తొలిగించాలంటారు. మరికొందరు సామాజిక-ఆర్థిక సమానత్వం లేకుండా అందరూ పౌర స్వేచ్ఛను అనుభవించలేరు కాబట్టే పౌర స్వేచ్ఛను కొంతకాలం అణచివేసైనా సామాజిక-ఆర్థిక హక్కులను సాధించాలంటారు. సమూహం అభివృద్ధి జరగకుండా వ్యక్తి వికాసం సాధ్యం కాదు. కాబట్టి సమూహం కొరకు వ్యక్తి స్వేచ్ఛను త్యాగం చేయాలనేవారుకూడా ఉన్నారు.

నిజానికి ఈ మూడింటి మధ్య వైరుధ్యం లేదు. అవి పరస్పర ఆధారితాలు, సామాజిక ఆర్థిక హక్కులు లేకుండా, సమిష్టి హక్కులు లేకుండా వైయక్తిక హక్కులను అనుభవించడం సాధ్యం కాదు. అయితే వైయక్తిక హక్కులను అనుభవించగలిగే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే సామాజిక-ఆర్థికహక్కులను రూపకల్పన చేసుకోవడానికి, ఆచరించడానికి వీలవుతుంది. వ్యక్తి స్వేచ్ఛను కూల్చే ఏ సమిష్టి హక్కులు నిలబడవు. వాటికి వ్యక్తుల మద్దతు ఉండదు. వ్యక్తుల స్వేచ్ఛను ఇనుమడింప చేసే హక్కులను మాత్రమే వ్యక్తులు ఆమోదిస్తారు. అందుకే సమిష్టి హక్కులను రూపకల్పన చేయడానికి పౌరస్వేచ్ఛ ఉండి తీరాలి.

వివాదాన్ని, పరిష్కరించాలంటే ఇంకాస్త లోతుల్లోకి వెళ్ళాలి. హక్కులకు వ్యక్తి శ్రేయోవాదం, సమానత్వం అనే రెండు విలువలు మూలపునాది వంటివి. వ్యక్తి శ్రేయోవాదం ప్రకారం ప్రతి మనిషి తన మంచి చెడులను తానే నిర్ధారించుకో గలుగుతాడు. ప్రతి మనిషి తనకు ఏది మంచిదని తోస్తే అది చెయ్యడానికి కృషిచేస్తాడు. మంచి చెడులను నిర్ణయించుకోవడానికి ఇతరులకు హాని కలిగించకుండా మంచిని పొందడానికి కావలసిన వివేచనాశక్తి మనుషులందరిలోనూ ఉన్నది. అందుకే మనుషులందరికి ఎదగడానికి సమానావకాశాలుండాలి. సమానత్వమందే మనుషులందరు సహజ సిద్ధంగా సమానులనుకోరు. సమానత్వమందే మనుషులందరికీ సమానావకాశాలుండాలని అర్థం. సమాజం బలవంతంగా తన అభిప్రాయాలను వ్యక్తులమీద రుద్దడం మానేసి వ్యక్తులను గౌరవించాలి. కనుక గౌరవ ప్రదంగా బతకడానికి అవకాశమున్నప్పుడే ప్రతిమనిషి తనకు నచ్చిన జీవితాన్ని ఎంచుకొనడాన్ని పొందడానికి కృషి చేయగలడు. అంతిమంగా హక్కులు గౌరవప్రదమైన జీవితాన్ని ఇవ్వగలిగే సాధనాలు మాత్రమే. ఈ కోణం నుంచి చూసినప్పుడు హక్కుల మధ్య వైరుధ్యం మాయమౌతుంది. గౌరవప్రదంగా జీవించడానికి మూడు రకాల హక్కులు కూడా అవసరమే. గౌరవప్రదంగా జీవించడానికి భావ ప్రకటనాస్వేచ్ఛ, జీవించే హక్కు ఎంత అవసరమో ఉపాధిహక్కు, సమానత్వపు హక్కు అంతే అవసరం. ఈ కోణంనుండి చూసినప్పుడు హక్కుల మధ్య వైరుధ్యం మాయమౌతుంది. ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులో అప్పు తీసుకున్న దేశాల్లో అమలు చేస్తున్న ఆర్థిక విధానాల వలన రెండవ, మూడవ తరం హక్కులు అంతరించి పోతున్నాయి. ఫలితంగా మొదటి తరం హక్కులు నిరర్థక మౌతున్నాయి.

## 14.3 ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధుల ఆవిర్భావం

ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు సంస్థలు వివిధ దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అర్థం చేసుకోవాలంటే ఆ సంస్థల పరిణామాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు సంస్థలకు అమెరికాలోనున్న న్యూహాంప్‌షైర్‌లోని బ్రెట్టన్‌వుడ్స్ అనే ప్రాంతంలో 1944లో జరిగిన ఒక సమావేశంలో రూపకల్పన జరిగింది. అందుకే ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులను బ్రెట్టాన్ వుడ్స్ వ్యవస్థలని అంటారు. ఈ సంస్థలు 1930లలో వచ్చిన ఆర్థిక సంక్షోభం వలన ఆ తర్వాత వచ్చిన రెండవ ప్రపంచ యుద్ధం వలన చితికిపోయిన అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలకు సహాయాన్ని అందించడానికే రూపొందాయి. కానీ మూడవ ప్రపంచ దేశాల అభివృద్ధి అవసరాలను తీర్చడానికి కాదు. విదేశీమారక రేట్ల స్థిరత్వాన్ని సాధించడానికి, విదేశీ మారక లోటును అధిగమించడానికి, స్వేచ్ఛా వ్యాపారానికున్న అవరోధాలను తొలగించడానికి ద్రవ్యనిధి

BRAOU

ఉనికిలోకి వచ్చింది. అభివృద్ధికి సహాయాన్ని అందించడం, విదేశీపెట్టుబడులకు అవకాశాలను కల్పించడం లక్ష్యంగా ప్రపంచ బ్యాంకు ఏర్పడింది. అయితే ద్రవ్యనిధినుండికానీ, ప్రపంచ బ్యాంకునుండి కానీ అప్పు పొందాలంటే విధిగా ఆ సంస్థలు సూచించే ఆర్థిక కార్యక్రమాలను పాటించాలి. సాధారణ పరిభాషలో ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకులు రుణగ్రస్త దేశాల్పై రుద్దే విధానాలను షరతులని అంటారు.

బ్రెట్టాన్ వుడ్స్ వ్యవస్థ అభివృద్ధి చెందినపెట్టుబడిదారీ దేశాల అనుభవం ఆధారంగా, ఆ దేశాల ఆలోచనలే ఊపిరిగా ఉనికిలోకి వచ్చి వాటి అవసరాలను తీర్చడానికి కృషిచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాల సమస్యలు వేరు. సామ్రాజ్యవాదం వలన మూడో ప్రపంచ దేశాల్లోని అంతర్గత ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమైంది. ఈ శిథిలాల నుండి స్వావలంబనతో కూడిన ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ ఉద్భవించలేదు. అందుకే మూడో ప్రపంచ దేశాలు వెనుకబాటుతనంతో సతమతమవుతున్నాయి. వెనుకబాటుతనం వలన ఆర్థిక అవసరాలను నెరవేర్చుకోవటానికి అభివృద్ధి చెందిన దేశాల్పై ఆధారపడవలసి వస్తున్నది. ఈ అసమానతలు నానాటికీ పెరగిపోతున్నాయి. ఫలితాంగానే అభివృద్ధి చెందిన దేశాలు బలాన్ని సంతరించుకొని ఆధిపత్య దేశాలుగా మారాయి. బ్రెట్టాన్ వుడ్స్ వ్యవస్థలు అంతర్జాతీయ రంగంలో సామ్రాజ్యవాదం వలన తలెత్తిన అసమానతలను రూపుమాపడానికి ప్రయత్నం చేయలేదు. చేసే ఉద్దేశ్యం కూడాలేదు.

అయినా మూడో ప్రపంచ దేశాలు ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల్లో ఉత్సాహంగా చేరాయి. ఆ సంస్థల సహాయంతో సత్వరంగా అభివృద్ధి చెందవచ్చునని ఆశించాయి. అయితే ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు మూడవ ప్రపంచ దేశాల సమస్యలను పరిగణనలోనికి తీసుకోవడానికి సిద్ధపడలేదు. ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల నిర్మాణమే అసమానతలను రక్షించడానికి తోడ్పడుతున్నది. ద్రవ్యనిధి గవర్నర్ల బోర్డు (Board of Governors), కార్యనిర్వాహక బోర్డు, మేనేజింగ్ డైరెక్టరు తదితర సిబ్బంది ద్వారా కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. సభ్యదేశం తన ప్రతినిధిగా ఒక గవర్నరును నియమిస్తుంది. అయితే గవర్నర్ల బోర్డులో అన్ని దేశాలకు సమాన ఓటుహక్కు లేదు. సభ్యదేశాల ఓట్ల సంఖ్య ద్రవ్యనిధిలో ఆయా దేశాలు చేసిన పెట్టుబడిని బట్టి నిర్ణయిస్తారు. ద్రవ్యనిధి మూలధనంలో సంపన్న దేశాల వాటా ఎక్కువ కాబట్టి వాటి ఓట్ల సంఖ్య కూడా ఎక్కువే. దిగువ పేర్కొన్న పట్టికలో ద్రవ్యనిధి సభ్యదేశాల మొత్తం ఓట్లలో కొన్ని ముఖ్యమైన దేశాలకున్న ఓట్ల శాతాన్ని చూడవచ్చు.

అమెరికా 19.3%

బ్రిటన్ 6.7%

జర్మనీ 5.8%

ఫ్రాన్సు 4.8%

చైనా 2.6%

ఇండియా 2.2%

ద్రవ్యనిధి నిర్మాణంలో మాదిరిగానే ప్రపంచ బ్యాంకు నిర్మాణంలో కూడా సంపన్న దేశాలకే ఆధిపత్యం ఉన్నది. ప్రపంచ బ్యాంకులో అత్యున్నత విధాన నిర్ణయ విభాగాన్ని కూడా గవర్నర్ల బోర్డు అంటారు. బోర్డులో కొన్ని ముఖ్యమైన సభ్యదేశాల ఓట్ల శాతం ఇలా ఉన్నది.

| | | |
|---|---|---|
| అమెరికా | - | 19.63% |
| జపాన్ | - | 9.43% |
| జర్మనీ | - | 7.29% |
| బ్రిటన్ | - | 6.99% |
| ఫ్రాన్సు | - | 4.76% |
| చైనా | - | 2.55% |
| ఇండియా | - | 2.55% |



BRAOU

సాధారణంగా గవర్నర్ల బోర్డుతరపున రోజువారీ కార్యకలాపాలను **Board of Executive Directors** నిర్వహిస్తుంది. ఈ బోర్డుకు సభ్యులను ఎన్నుకునే అధికారం ప్రపంచ బ్యాంకులోని సభ్యదేశాలలో 5 సంపన్న దేశాలకు మాత్రమే ఉన్నది.

ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల్లో కనుక అన్ని దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండి ఉంటే, ఆ సంస్థలు సమిష్టి ప్రయోజనాలకనుగుణంగా ప్రపంచ ఆర్థిక సమస్యలను పరిష్కరించగల ప్రజాస్వామిక వేదికలుగా పెంపొందేవి. కానీ సంపన్న దేశాల ఆధిపత్యం వలన ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకులు ఆ దేశాల జేబు సంస్థలుగా మారిపోయాయి. కనుక సంపన్న దేశాలు ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల ద్వారా మూడో ప్రపంచ దేశాల ఆర్థిక విధానాలను నిర్ధారిస్తున్నాయి.

అయితే ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల పాత్ర 1998లలో చాలా మారిపోయింది. అప్పటివరకు ఆ సంస్థలు మూడో ప్రపంచ దేశాల పట్ల కొంత సానుభూతితో వ్యవహరించాయి. మూడో ప్రపంచ దేశాల అవసరాలను పట్టించుకొనే ప్రయత్నం చేసాయి. ఈ కాలంలో ద్రవ్యనిధి ప్రధానంగా స్వల్పకాలిక రుణాలిచ్చేది. బ్యాంకు నిర్దిష్టపథకాలకు మాత్రమే రుణ సౌకర్యం కల్పించేవి.

కానీ 1980ల తర్వాత మూడో ప్రపంచ దేశాల్లో ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల పాత్ర మారిపోయింది. మూడో ప్రపంచ దేశాలను స్వేచ్ఛా మార్కెటు వ్యవస్థలుగా మార్చడానికి సంపన్న దేశాలు ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులను సాధనాలుగా వాడుకొంటున్నాయి. కొత్త పాత్ర నిర్వహించటానికి వీలుగా ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు కొత్త రుణ పథకాలను, కొత్త పద్ధతులను ప్రవేశపెట్టాయి.

1970లలో తలెత్తిన రుణ సంక్షోభం వలన ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల కొత్త పాత్రను చేపట్టగలిగాయి. 1970లలో మూడవ ప్రపంచ దేశాల ఎగుమతులు తగ్గి, దిగుమతులపై ఖర్చు పెరగడం వలన విదేశీ మారకలోటును ఎదుర్కొన్నాయి. ఈ లోటును భర్తీ చేయడానికి మూడవ ప్రంచ దేశాలకు అంతర్జాతీయ వాణిజ్య బ్యాంకులో అప్పు పెట్టాయి. యూరప్, అమెరికా దేశాల్లో ఆనాటికి తలెత్తిన ఆర్థిక సంక్షోభం వలన ఉత్పాదక రంగాల్లో పెట్టుబడి అవకాశాలు కరువై పోవడంలో పేరుకొని పోయినడబ్బును బ్యాంకులు మూడవ ప్రపంచ దేశాలకు అప్పుగా ఇచ్చాయి. ఈ అప్పుతో మూడవ ప్రపంచ దేశాలు పాత బాకీలను తీర్చాయి. కొత్తగా అప్పు తెచ్చి పాత బాకీని తీర్చాయన్నమాట. ఆశించిన స్థాయిలో ఉత్పత్తి ఎదగక పోవడం వలన, ఎగుమతులు పెరగక పోవడం వలన మూడవ ప్రపంచ దేశాల అప్పులు రోజు రోజుకూ పెరిగాయే తప్ప తగ్గలేదు. అందువలన రుణ సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ పరిస్థితిలో ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకులు కీలకమైన పాత్రను సంతరించుకున్నాయి.

BRAOU

మూడవ ప్రపంచ దేశాల రుణ సంక్షోభాన్ని అసరాగా చేసుకొని ఆదేశాలపై పట్టు సాధించడానికి అభివృద్ధి చెందిన దేశాలు కృషి చేసాయి. అందుకు ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు సాధనాలయ్యాయి. రుణ సంక్షోభం తీవ్రమైన తర్వాత ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని ఆ సంస్థలు విధించే షరతులను ఆమోదించే మూడో ప్రపంచ దేశాలకు మాత్రమే వాణిజ్య బ్యాంకుల ద్వారాగాని, అధికారికంగా కానీ అప్పులివ్వాలని అభివృద్ధిచెందిన దేశాలు నిర్ణయించుకున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు మూడో ప్రపంచ దేశాల రుణాలను పూర్తిగా రద్దు చేయవచ్చు. కానీ అలా చేయలేదు. అందువలన మూడో ప్రపంచ దేశాలు అప్పు తెచ్చుకోవడానికి విధిగా ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధిల పంచన చేరవలసి వచ్చింది. ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు షరతులను శిరసావహించకుండా వేరే అప్పుదొరికే అవకాశం లేకుండా పోయింది.

ఈ సన్నివేశంలో ద్రవ్యనిధి సంస్థాగత, సర్దుబాటు రుణ పథకాన్ని ప్రవేశపెట్టింది. 1980లనుండి మూడో ప్రపంచ దేశాలలో బ్యాంకు ద్రవ్యనిధి సంయుక్తంగా వ్యవహరిస్తున్నాయి. ద్రవ్యనిధితో పాటు ప్రపంచ బ్యాంకు కూడా సంస్థాగత సర్దుబాటు రుణాలిస్తున్నది. అయితే రెండు సంస్థలు ఇచ్చే రుణ పథకాలకు తేడా ఉన్నది. బడ్జెట్ లోటును నివారించడం ద్వారా, డబ్బు, సర్క్యులేషన్ తగ్గించడం ద్వారా ద్రవ్యనిధి ప్రధానంగా డిమాండును నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నది. ప్రపంచ బ్యాంకు ఉత్పత్తి మీద దృష్టిని కేంద్రీకరిస్తున్నది. మొత్తంగా ఉత్పత్తి విధానాలలోనే మార్పులు తేవడానికే బ్యాంకు

కృషి చేస్తున్నది.

విదేశీ మారక లోటును, రుణ సంక్షోభానికి ఆర్థిక స్వభావమే కారణం కాబట్టి ఆర్థిక వ్యవస్థలోనే సమగ్రమైన మార్పులు తేవాలని ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు రుణ గ్రహీతలను ఆదేశిస్తున్నాయి. సంస్కరణలు ఒక సంవత్సరంలో తేవడం సాధ్యంకాదు కాబట్టి బ్యాంకు, ద్రవ్యనిధులు దీర్ఘకాలిక రుణాలనిస్తున్నాయి.

రుణాలు మంజూరయ్యే పద్ధతిని చూస్తే తప్ప అప్పుతీసుకునే దేశాలపై ద్రవ్యనిధికి సంక్రమించే అధికారం అర్థంకాదు. ద్రవ్యనిధిలో కానీ ప్రపంచ బ్యాంకులో కానీ సభ్యదేశాల మధ్య జరిగే సంప్రదింపుల్లో అప్పుకొరకు ప్రతిపాదనలు వస్తాయి. ఈ ప్రతిపాదనలు ఆధారంగా, ఆ సంస్థలు సంప్రదింపులు కొనసాగించటానికి ఆర్థిక వేత్తలతో కూడిన కమిటీని నియమిస్తాయి. కమిటీ అప్పు తీసుకోదలచిన దేశం అధికారులతో మాట్లాడి ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది. సేకరించిన సమాచారం ఆధారంగా కమిటీ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి అప్పు మంజూరుకు విధించవలసిన షరతులను నిర్ధారిస్తుంది. ఆ తర్వాత అప్పు తీసుకోదలచిన దేశంతో షరతులకు సంబంధించి చర్చలు సాగుతాయి. చర్చల్లో ద్రవ్యనిధికానీ, ప్రపంచ బ్యాంకుగానీ అప్పు తీసుకునే దేశం అప్పు మంజూరుకు ముందుగానే చేపట్టవలసిన చర్యలను అప్పు మంజూరైన తర్వాత అనుసరించవలసిన విధానాలను సూచిస్తాయి. అప్పు తీసుకోదలచిన దేశం ఏ సంస్థ నుండి అప్పు తీసుకొంటుందో ఆ సంస్థ సూచించిన విధానాలను అనుసరించటానికి సిద్ధపడితేనే రుణం మంజూరవుతుంది. తిరస్కరిస్తే అప్పు నిరాకరించబడుతుంది. షరతులను అంగీకరించే దేశం తాను చేపట్టే చర్యలను వివరిస్తూ ఒక పత్రాన్ని రాసి ఇవ్వాలి. దీన్నే లెటర్ ఆఫ్ ఇంటెంట్ అంటారు. ఈ తంతు ముగిసిన తర్వాతే రుణం మంజూరవుతుంది.

## 14.4 ప్రపంచ బ్యాంకు ద్రవ్యనిధుల పరిణామం, మారుతున్న పాత్ర

BRAOU

ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు, సంస్థాగత సర్దుబాటు రుణ పథకం అనే పేరుతో పిలువబడే దీర్ఘకాలిక రుణ సౌకర్యాన్ని మంజూరు చేయడానికి దిగువ పేర్కొన్న షరతులను విధిస్తున్నాయి. ద్రవ్యనిధి సూచిస్తున్న ఆర్థిక విధానాలను మూడు గ్రూపుల కింద విభజించవచ్చు. అవి విత్త, ద్రవ్య, వాణిజ్య రంగాలలో సంస్కరణలు తీసుకొచ్చే విధానాలు.

విత్త సంస్కరణల్లో భాగంగా జీత భత్యాలను కుదించాలి. సబ్సిడీలను తగ్గించాలి. సాంఘిక సంక్షేమ పథకాలను నిరుపేదలకు మాత్రమే పరిమితం చేయాలి. అందుకయ్యే ఖర్చును కూడా తగ్గించాలి. పన్నుల వసూళ్ళను పటిష్టం చేయాలి. కొత్త పన్నులను విధించకూడదు ప్రభుత్వం అందించే సేవలకయ్యే ఖర్చులను వాడకం దార్లనుండి రాబట్టాలి.

ద్రవ్యవిషయాలకొస్తే కరెన్సీ విలువను తగ్గించాలి. విదేశీ మారకంపై నియంత్రణను తొలగించాలి. వాణిజ్య రంగానికి సంబంధించి విదేశీ వ్యాపారంపై, అంతరంగిక ఆర్థిక కార్యకలాపాలపైన ప్రభుత్వ నియంత్రణను సడలించాలి. మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విధానాలనే కాక ఆయా రంగాల్లో చేపట్టవలసిన నిర్దిష్ట కర్తవ్యాలను కూడా ద్రవ్యనిధి సూచిస్తుంది. పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, వ్యవసాయరంగానికిచ్చే సబ్సిడీలను రద్దు చేయడం పారిశ్రామిక వస్తువుల ధరలపై నియంత్రణను తొలగించడం ద్రవ్యనిధి ప్రతిపాదిస్తున్న నిర్దిష్ట కార్యక్రమాల్లో కొన్ని ముఖ్యమైన అంశాలు.

బ్యాంకు కూడా ద్రవ్యనిధి 1980ల నుండి ద్రవ్యనిధి చర్యలను అనుకరించడం ప్రారంభించింది. ద్రవ్యనిధి విధించిన సర్దుబాటు చర్యలు సఫలీకృతం కావడానికి బ్యాంకు కూడా సంస్థాగత రుణ పథకాన్ని అమలుచేసింది. బ్యాంకు కూడా ద్రవ్యనిధి తరహా విధానాలనే అమలు చేస్తున్నది. ఇదివరకే వివరించినట్లు ద్రవ్యనిధి ప్రధానంగా పంపిణీని పరిమితం చేయడానికి కృషి చేస్తుండగా ప్రపంచ బ్యాంకు వ్యాపార ఉత్పత్తి రంగంలో మౌలిక మార్పులు తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్నది. ప్రపంచ బ్యాంకు విధిస్తున్న విధానాల ప్రకారం ఆర్థిక వ్యవస్థపై, మార్కెట్టుపై ప్రభుత్వ నియంత్రణను సడలించాలి. ఉత్పత్తి రంగం నుండి, ప్రభుత్వం వైదొలగి ఆ రంగాన్ని ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగించాలి. సేవారంగంలో (Services) కూడా ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాలి. అంటే వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాలను వ్యాపార సరళితో అమ్ముకోవడానికి ప్రైవేటురంగానికి భాగస్వామ్యం కల్పించాలన్న మాట. విదేశీ పెట్టుబడులపై నున్న ఆంక్షలను తొలగించి పూర్తి స్వేచ్ఛనివ్వాలి.

ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి సంస్థలు కలిసి అమలుచేస్తున్న విధానాల వలన ఆర్థిక వ్యవస్థలో దిగువ పేర్కొన్న మార్పులు వస్తాయి.

1) ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు పూర్తిగా తొలగి స్వేచ్ఛా వ్యాపారానికి అవకాశం కలుగుతుంది.

2) విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి, పెట్టుబడుల తరలింపులకు స్వేచ్ఛ ఉంటుంది.

3) ప్రభుత్వం వ్యాపార, ఉత్పత్తి కార్యక్రమాల నుండి నిష్క్రమిస్తుంది. ఆ రంగాల్లో ఇప్పటికే ఉన్న పబ్లిక్ రంగ సంస్థలు ప్రైవేటీకరించబడతాయి. ప్రైవేటీకరించబడని సంస్థలు వాణిజ్య సరళిలో నడపబడతాయి.

4) ప్రభుత్వం వ్యయాన్ని తగ్గించుకుంటుంది. అందులో భాగంగా జీత భత్యాలపై ఖర్చు తగ్గుతుంది. సబ్సిడీలు క్రమంగా తగ్గుతాయి. ప్రభుత్వం వివిధ సౌకర్యాలను కల్పించడానికయ్యే ఖర్చును కూడా వీలైనంత మేరకు వాడకం దార్లనుండి రాబట్టుతుంది.

5) సంక్షేమ పథకాలు కుదించబడతాయి. కేవలం పేద, బలహీన వర్గాల ప్రజలకు అదీ అవసరమైన మేరకు మాత్రమే, ప్రభుత్వ సహాయం లభిస్తుంది.

ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి దృష్టిలో పైన వివరించిన సంస్కరణలు ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి, విదేశీ వ్యాపారంలో లాభాలను సంపాదించడానికి ఆర్థికాభివృద్ధిని సాధించడానికి దోహదపడతాయి. ప్రభుత్వం ఖర్చును తగ్గించుకోవడం వలన మిగిలిన వనరులను విద్యుత్, రోడ్లు, రవాణా, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి కేటాయించవచ్చు. ప్రభుత్వం ఖర్చును తగ్గించుకోవడం వలన మార్కెట్లలో కరెన్సీ తగ్గి ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది. ఇక ఆర్థిక రంగంపై ప్రభుత్వ నియంత్రణను తగ్గించడం వలన ఉత్పత్తిలో సమర్థత పెరుగుతుంది. సమర్థత పెరగడమంటే తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తువులను తయారు చేయగలగడం. ఈ విధంగా వచ్చిన మార్పుల వలన సమాజంలో ప్రతి ఒక్కరికీ లాభం కలుగుతుందని ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధులు అభిప్రాయ పడుతున్నాయి.

అయితే 1966 నుండి 12 ఏళ్లపాటు ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి సంస్థల్లో సీనియర్ అధికారిగా పనిచేసిన డేవిసన్ బుధూ అనే ఆర్థిక శాస్త్రవేత్త ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి సంస్థలు తాము పేర్కొన్న ఏ ఒక్క లక్ష్యాన్ని సాధించలేక పోయామన్నారు. బుధూ దృష్టిలో 'సంస్థాగత సర్దుబాటు అనే పదాన్ని వాడినప్పుడు మనం ఆపడం ద్వారా, సర్దుబాటుకు లోనయ్యే దేశం ఆర్థిక సంక్షోభం నుండి బయటపడి అంతరంగికంగా నిర్ణయమైన లక్ష్యాల ఆధారంగా, మనం సూచించిన కాలంలో నిలకడగల అభివృద్ధిని, సామాజిక మార్పును సాధించగల ఆర్థిక, విత్త విధానాలేనని నమ్మించే ప్రయత్నం చేస్తున్నాం. ఇతరులను నమ్మించాలని చెప్తున్న విషయాలకు మన దృష్టిలో నుంచి తెలిసిన వాస్తవానికి ఎంతో తేడా ఉన్నది. సంస్థాగత సర్దుబాటు ఆర్థిక సామర్థ్యం వనరుల వినియోగం వంటి అంశాలను ప్రమాణంగా తీసుకొని మూల్యాంకనం చేయగల ఆర్థిక భావన కాదు. అది ఒక రాజకీయ ఎత్తుగడ-'సంస్థాగత సర్దుబాటు' అనగానే మనకు మూడో ప్రపంచ దేశాల్లో దిగువ పేర్కొన్న రాజకీయ కార్యక్రమం అమలు చేయాలన్న ప్రేరణ కలుగుతుంది. దీన్ననుసరించి 'సోషలిస్టు', 'పాపులిస్టు', 'ప్రజానుకూల' అని వ్యాఖ్యానించగల విధానాలను-అవి నిజంగా పేదలకు అనుకూలంగా ఉన్నా, సర్వజనామోదంతో రూపొందించినా-వాటిని వెంటనే నిలిపివేయవలసిందిగా ఆజ్ఞాపిస్తున్నాం. వాటి స్థానంలో రీగన్ కాపిటలిస్టు విధానాలను పాటించాల్సి ఉంటుంది'. బుధూ అభిప్రాయంలో బ్యాంకు, ద్రవ్యనిధి విధానాలు 'పెట్టుబడి దారీ విధానాన్ని అన్ని మూలాలకు తీసుకొని వెళ్తుంది'. అందుకుగాను అంటే 'పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణానికి తీసుకోవలసిన నిర్దిష్ట చర్యలను' సూచించడమే ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకులు కర్తవ్యంగా ఎంచుకున్నాయని బుధూ పేర్కొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు కలిసి ఏర్పర్చిన అంతర్జాతీయ ప్రజా ట్రిబ్యునల్ అనే వేదిక కూడా 1993లో అభివృద్ధి చెందిన 77 దేశాల కూటమి (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, జర్మనీ, కెనడా) ఒత్తిడి వల్లనే సంస్థాగత సర్దుబాటు పథకాలు అమలులోకి వచ్చాయని, వాటి వలన నిరుద్యోగం పెరిగిందని, నిజ వేతనాలు తగ్గాయని, ఆహార ధాన్యాల కొరత ఏర్పడిందని, పర్యావరణం దెబ్బతిన్నదని, వైద్య వ్యవస్థ కుప్పకూలిపోయిందని, విద్యాలయాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య

BRAOU

తగ్గిందని, జాతీయ ఉత్పత్తి పడిపోయిందని, విదేశీ రుణం పెరిగిందని, ప్రజాస్వామిక వ్యవస్థలు పతనమయ్యాయని తీర్పు చెప్పింది. మొత్తం మీద సంస్థాగత సర్దుబాటు పథకాలు ఆర్థిక సంక్షోభాన్ని రూపుమాపకపోగా, ఆ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేసాయి. అందువలన ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి.

ఐక్యరాజ్య సమితి అంగమైన UNICEF కూడా ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి కార్యక్రమాల వలన పేదరికం మరింతగా పెరిగిందని, జీవన ప్రమాణాలు పడిపోయాయని తేల్చిచెప్పింది. UNICEF నివేదిక ప్రకారం **"Wherever it is obvious that free market economic systems are capable of generating economic growth, it is far from obvious that they are capable of creating just cirilised and sustainable human society. And in the recent committment to free market economic policies....Supported by the world bank and the IMF, insufficient account had been taken of the effects on the poor or vulnerable or on the environment".**

ప్రపంచ బ్యాంకు విధానాలను, ఆ విధానాలపై ఆయా వ్యక్తుల సంస్థల అంచనాలను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు దిగువ పేర్కొన్న అంశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. (1) రాజ్య యంత్రాంగం యొక్క పాత్ర మార్పులకు లోనవుతుంది. సంస్థాగత సర్దుబాటు పథకాలు అమలయ్యే దేశాల్లో ప్రభుత్వం సంక్షేమ విధులను వదులుకుంటుంది. ప్రైవేటు పెట్టుబడి దారులకు అవకాశాలను కల్పించడమే ప్రభుత్వం ప్రధాన కర్తవ్యమౌతుంది. (2) సంక్షేమ కార్యక్రమాలు, సబ్సిడీలు తగ్గుతాయి. (3) ప్రైవేటు రంగానికి ఇతోధికంగా అవకాశాలు పెరుగుతాయి. ఏ నియంత్రణ లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకొనే అవకాశాలు కలుగుతాయి.

ఆర్థిక సంక్షోభాన్ని రుణ సంక్షోభాన్ని రూపు మాపటానికి ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు సూచించిన పథకాలు కాకుండా మూడో ప్రపంచదేశాలు భిన్నమైన విధానాలను 60 దశకం నుండే సూచిస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలోనే సంస్కరణలు తేవాలని దోపిడీకి, ఆధిపత్యానికి వీలులేని నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, రూపొందాలని డిమాండ్ చేశాయి. మూడో ప్రపంచ దేశాల ఒత్తిడివలన ఐక్యరాజ్య సమితి 1974లోనే 'దేశాల ఆర్థిక సమాజిక వ్యవస్థలు ఏవైనప్పటికీ, వాటి మధ్య పరస్పర సహకారం మరియు సమిష్టి ప్రయోజనం, స్వతంత్రత, సార్వభౌమ సమానత్వం, సమత ఆధారంగా నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను, ఏర్పాటు చేయడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది. ఈ ప్రకటన ప్రకారం ఈ నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 'అన్యాయాలను రూపుమాపి, అసమానతలను నిర్మూలించి ప్రస్తుత మరియు భావితరాలకు వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని, శాంతిని, న్యాయాన్ని హామీయిస్తుంది'.

BRAOU

## 14.5 ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకు విధానాల ప్రభావం

పై పరిణామాల ప్రభావం పౌర హక్కుల పరిస్థితిపైన కూడా ఉంటుంది. ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల విధానాల ఫలితంగా తలెత్తిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు పౌర హక్కులను, సామాజిక-ఆర్థిక హక్కులను, సమిష్టి హక్కులను మూడింటిని కూడా నీరుగార్చుతున్నాయి. ఆయా హక్కులపై ద్రవ్యనిధి విధానాల ప్రభావం ఇలా ఉంటుంది.

(1) ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల్లో మెజారిటీ ఓట్లు అభివృద్ధి చెందిన దేశాలకే ఉండటం వలన ఆ దేశాలు ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల ద్వారా తమకు ప్రయోజనకరంగా ఉండే ఆర్థికాభివృద్ధి పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి అమలు చేస్తున్న పథకాలు మూడవ ప్రపంచ దేశాలకు అనుకూలంగా లేవు. ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు విధానాల వలన మూడవ ప్రపంచ దేశాలు ఆర్థిక విధానాలను రూపొందించుకోగల స్వయం ప్రతిపత్తిని, స్వావలంబనను కోల్పోతున్నాయి. ఈ పరిస్థితి వలన మూడో ప్రపంచ దేశాలు స్వయం నిర్ణయాధికారపు హక్కును అభివృద్ధి హక్కును కోల్పోతున్నాయి.

(2) ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల విధానాలు సమిష్టిహక్కులను హరించినట్టే సాంఘిక, ఆర్థిక హక్కులను కూడా అంతరాయాలను కల్పించాయి. పైన వివరించినట్టు ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి విధానాల వలన ఆర్థిక రంగంలో ప్రభుత్వం పాత్ర తగ్గుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుదించబడుతాయి. ఉత్పాదక రంగంలోకానీ, సేవా రంగంలో కానీ ప్రైవేటు రంగం పాత్ర పెరుగుతుంది. ఈ మార్పుల వలన సంక్షేమ రాజ్యం విచ్ఛిన్నమైంది. సంస్థాగత సర్దుబాటు పథకాలు అమలులో

ఉన్న దేశాల్లో ఈ పథకాలు కాక ముందు పేదలకు, బలహీన వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా సహాయాన్ని అందజేసేది. ఆధిపత్య శక్తులనుండి బలహీన వర్గాలను కాపాడటానికి విభిన్న చర్యలను చేపట్టేది. ఇవన్నీ ఉపసంహరించబడ్డాయి. ఉత్పత్తి, పంపిణీలను పూర్తిగా మార్కెటు నియంత్రణకు వదిలివేయడం వలన కొన్ని రంగాలలో ఉపాధి సౌకర్యాలు దెబ్బతిన్నాయి. కొన్ని వసతులు పేద ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ఉదాహరణకు చాలా దేశాలు వైద్య రంగంలో ప్రైవేటు పెట్టుబడి ప్రవేశానికి అవకాశాన్ని కల్పించాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫీజులు వసూలు చేయడం మొదలుపెట్టాయి. అందువలన పేద ప్రజలు వైద్య సౌకర్యం పొందలేక పోయారు. విషయాన్ని అర్థం చేసుకోవడానికి మరొక ఉదాహరణను పరిశీలిద్దాం. చాలా దేశాలు కొన్ని రకాల వస్తూత్పత్తిని గృహ పరిశ్రమలకే రిజర్వు చేశాయి. అందువలన ఉపాధి సౌకర్యం కల్పిస్తున్న చేతి వృత్తులు రక్షింపబడ్డాయి. ద్రవ్యనిధి, బ్యాంకు విధానాల ప్రకారం ఎప్పుడైతే ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థపై నియంత్రణను తొలగించిందో అప్పటినుండి చేతి వృత్తులు పరిశ్రమలనుండి పోటీని ఎదుర్కొన్నాయి. పరిశ్రమల నుండి పోటీని ఎదుర్కొనలేక చేతి వృత్తులు దెబ్బతిన్నాయి. చేతి వృత్తులపై ఆధారపడి బతుకుతున్న వారు ఉపాధిని కోల్పోయారు. ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి ఒత్తిడి వలన ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల వలన ఉపాధి హక్కు, వైద్య సౌకర్యం పొందే హక్కువంటి సామాజిక, ఆర్థిక హక్కులు అంతరించి పోయాయి.

(3) ఇదివరకే వివరించినట్లు పౌరహక్కులను అనుభవించడానికి సామాజిక ఆర్థిక హక్కులు కావలసిన పరిస్థితిని కల్పిస్తాయి. ఉపాధి కలిగినప్పుడే, వైద్య ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడే భావ ప్రకటనా స్వేచ్ఛ, రాజకీయ హక్కు, న్యాయ పరిహారపు హక్కు వంటి పౌరహక్కులను అనుభవించడం సాధ్యమౌతుంది. ఉదాహరణకు భారతదేశంలో వెట్టి నుండి కుల వివక్షం నుండి, బయటపడకుండా వైయక్తిక హక్కులను అనుభవించడం సాధ్యం కాదు. సామాజిక-ఆర్థిక హక్కులు పౌర హక్కులను అనుభవించడానికి కావలసిన పరిస్థితులను కల్పిస్తాయి. కనుక ఆ హక్కులు అంతరించడం వలన పౌర హక్కులకు కూడా అంతరాయం కలుగుతుంది.

అంతేకాక మూడో ప్రపంచ దేశాల్లో సంక్షేమ పథకాల వలన ప్రభుత్వం పేద, బలహీన వర్గాల్లో ఆమోదాన్ని సంపాదించగలిగింది. సంక్షేమ పథకాల ఉపసంహరణ ఫలితంగా ప్రభుత్వం సాధికారతను కోల్పోయి నిరంకుశ అధికారాలతో, ప్రజలను అణచివేసి పరిపాలన చేయవలసి వస్తున్నది. ఈ విషయాన్ని రేవీసన్ బుధూ ఇలా వివరించాడు. 'ప్రజాస్వామ్య లక్షణాలు కలిగి, ఆటుపోట్లకు తట్టుకొని నిలబడగలిగే శక్తి ఉన్న దేశాలు మన కార్యక్రమాలవలన అయ్యే రాజకీయ ఆర్థిక మూల్యాన్ని భరించలేక అస్థిరతకు లోనవుతాయి. ఫలితంగా వెంట వెంటనే ప్రభుత్వాలు మారుతాయి... మనం నాశనం చేసిన ప్రజాస్వామిక ప్రక్రియల శిథిలాలనుండి క్రూరమైన సైనిక నియంతృత్వం ఆవిర్భవించి లాఠీల సహాయంతో మన కార్యక్రమాలను అమలు చేస్తుంది'.

కనుక ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకుల విధానాల వలన హక్కులు అంతరించి పోతున్నాయి. అందువలన బలహీన వర్గాల ప్రజల వికాసానికి అవాంతరాలు తలెత్తుతాయి. ఎందుకంటే మూడవ ప్రపంచ దేశాల్లో పేద బలహీన వర్గాలు గౌరవ ప్రదమైన జీవితాన్ని పొందడానికి హక్కులను సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఈ దేశాల్లో మధ్యయుగాల్లో వ్యవస్థీతమైన సామాజిక, ఆర్థిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. పేద, బలహీన వర్గాల ప్రజలు అసమాన సమాజాన్ని మార్చడానికి హక్కుల పరిభాషలో తమ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు విధానాల వలన హక్కులు అంతరించి పోతున్నాయని పై వివరణ వలన స్పష్టమైంది. మూడవ ప్రపంచ దేశాల్లో హక్కులు అంతరించి పోవడం వలన కేవలం వైయక్తిక స్వేచ్ఛకు మాత్రమే అంతరాయం కలగడం లేదు. హక్కులు అంతరించి పోవడం వలన సామాజిక మార్పు కూడా కుంటుబడుతున్నది.

## 14.6 ముగింపు

ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే మూడో ప్రపంచ దేశాల్లో హక్కుల పరిణామ క్రమాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. మూడో ప్రపంచ దేశాల్లో హక్కులు, సామాజిక రంగంలో నున్న అసమానతలను, ఆధిపత్యాన్ని ప్రశ్నించే క్రమంలో ఆవిర్భవించి, నూతన సమాజ నిర్మాణానికి మార్గదర్శక సూత్రాలయ్యాయి. ఉదాహరణకు అంటరాని తనాన్ని

నిర్మూలించడానికి దళితులు కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ క్రమంలో అంటరానితనాన్ని నిర్మూలించే హక్కును సాధించుకున్నారు. ఈ హక్కు నూతన సమాజ నిర్మాణానికి ప్రాతిపదికైంది. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చబడిన హక్కులన్నీ ఈ విధంగా ఆవిర్భవించినవే. ఈ ప్రత్యేకమైన పరిస్థితివల్లనే మూడో ప్రపంచ దేశాల్లో, పేద, బలహీన వర్గాల ప్రజలకు అసమానతల నుండి బయటపడి గౌరవ ప్రదమైన జీవితాన్ని పొందడానికి హక్కుల పరిభాషలో తమ డిమాండ్లను వ్యక్తం చేసే అవకాశం కలిగింది. నూతన సమాజ రూపకల్పన హక్కులు ప్రాతిపదికను కల్పిస్తున్నాయి. అందుకని మూడవ ప్రపంచ దేశాల్లో హక్కులు వాటంతట అవే అభిలషణీయమైన విలువలు. వాటిని ఆచరించడం వల్లనే నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. కనుక హక్కుల వ్యవస్థ కూలిపోవడం వలన మూడో ప్రపంచ దేశాల్లో నూతన సమాజ నిర్మాణం కూడా కుంటుబడుతుంది. కాబట్టి మూడో ప్రపంచదేశాల్లో ఆర్థికాభివృద్ధి నమూనా తప్పనిసరిగా హక్కులను ఒక విలువగా స్వీకరించాలి. హక్కులను పెంపొందించడానికి తోడ్పడాలి. ఈ విషయాన్ని ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకులు పరిగణనలోనికి తీసుకోవడం లేదు.

## 14.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది వాటికి **40** పంక్తుల్లో జవాబులు రాయండి*

1. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల ఆవిర్భావాన్ని వివరించండి?
2. అంతర్జాతీయ రంగంలో ప్రపంచ బ్యాంకు, ద్రవ్యనిధి సంస్థలు నిర్వహిస్తున్న పాత్ర మరియు వాటి విధానాల ప్రభావాలను చర్చించండి?

*ఈ క్రింది వాటికి **30** పంక్తుల్లో జవాబులు రాయండి*

1. విభిన్న రకాల హక్కుల అర్థాన్ని తెలపండి
2. ప్రపంచ బ్యాంకు విధానల ప్రభావాన్ని పేర్కొనండి

BRAOU

BRAOU

# ఖండం IV

# ఇటీవలి ఆలోచనా ధోరణులు

BRAOU

BRAOU

# భాగం 15: వియన్నా ప్రపంచ మానవహక్కుల సదస్సు

## విషయక్రమం


15.0 ఉద్దేశం

15.1 పరిచయం

15.2 సందర్భం

15.3 సమస్యలు

15.3.1 మానవ హక్కుల సార్వజనీనత్వపైచర్చ

15.3.2 రాజ్యహింస వర్సెస్ ప్రైవేట్ హింస

15.3.3 జెండర్ సమస్య

15.3.4 మూలవాసులు

15.3.5 ప్రభుత్వేతర సంస్థలు

15.4 వియన్నా ప్రకటన-ముఖ్యాంశాలు

15.4.1 మానవ హక్కుల సార్వజనీన సిద్ధాంతంలోని ఔచిత్యం

15.4.2 ప్రజాస్వామ్యం అభివృద్ధి, మానవ హక్కులు

15.4.3 టెర్రరిజం-మానవ హక్కులు

15.5 బలహీన వర్గాలు-మానవ హక్కులు

15.5.1 పిల్లలు

15.5.2 మైనారిటీలు

15.5.3 మూలవాసులు

15.5.4 వికలాంగులు

15.6 ముగింపు

15.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

15.8 సంప్రదింపు గ్రంథాలు


# 15.0 ఉద్దేశం

### *ఈ భాగం చదివిన తర్వాత మీరు*

- సార్వజనీన మానవ హక్కులకు అవరోధంగా ఉన్న అంశాలు తెలుసుకుంటారు.
- వియన్నా ప్రకటనలోని ముఖ్యాంశాలు తెలుసుకుంటారు
- మానవ హక్కులు పొందడంలో బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు అర్థం చేసుకోగలుగుతారు.

BRAOU

## 15.1 పరిచయం

సుఖంగా, గౌరవంగా బతికే హక్కు మనుషులందరికీ ఉందని, అందుకు కావల్సిన అన్ని సాధనాలూ వారికి ఉండాలని ఈనాడు ప్రపంచమంతా ఒప్పుకుంటున్న విషయమే. కాబట్టి ఆ రకమైన ప్రకటనతో కొత్తదనం ఏమీ అనిపించక పోవచ్చు. కాని ఈ హక్కు ఎంత ఎక్కువగా, భయంకరంగా ఉల్లంఘింపబడుతుందో చూసినపుడు ఆ ప్రకటనను పదే పదే చేయాల్సిన అవసరం కనిపిస్తుంది. ప్రపంచమంతటా పెద్దఎత్తున జరుగుతున్న హక్కుల అతిక్రమణ దృశ్యాలే వియన్నా సదస్సు నిండా కనిపించి కలవరపెట్టాయి. 1993 జూన్ 10-25వ తేదీల మధ్య వియన్నాలో జరిగిన ప్రపంచ మానవ హక్కుల సదస్సు ప్రపంచ వాస్తవికతను ఎన్ని కోణాల నుంచి ఎంత నగ్నంగా బయటపెట్టిందంటే మనం అసలు నాగరిక ప్రపంచంలోనే జీవిస్తున్నామా అనే సందేహం కలుగుతుంది. దాదాపు 400 దాకా జరిగిన సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ఉపన్యాసాలు, వ్యక్తిగత అనుభవాల నుంచే కాక వివిధ పుస్తకాలు, నివేదికలు, కరపత్రాల ద్వారా ఈ వాస్తవికత మనకు అర్థమవుతుంది. వీటి సారాంశమేమిటంటే, మానవ హక్కుల కోసం ఇంతవరకు ఎంతో కృషి జరిగినా అది ఈ ప్రపంచాన్ని యింకా గౌరవప్రద మానవ జీవనానికి అనువుగా మార్చలేక పోయిందని తెలుస్తుంది. మార్చలేక పోగా 20వ శతాబ్దపు మధ్యకాలంలో కనిపించిన మానవ హక్కుల ఆశావహ దృశ్యం కూడా క్రమంగా కనుమరుగవుతోందని తెలుస్తుంది.

## 15.2 సందర్భం

1993 సంవత్సరంలో నిరుపేదల సంఖ్య ప్రపంచ జనాభాలో ఐదోవంతు అనగా 110 కోట్లు ఉంది. జనాభా కంటే వీరి సంఖ్యే వేగంగా పెరుగుతున్నందువల్ల 2000 సంవత్సరం నాటికి 150 కోట్లమంది నిరుపేదలు ఉంటారని అంచనా వీరిలో ఆదిమ మూలవాసులు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం మొత్తం 70 దేశాలలో 30 కోట్లమంది ఆదిమ మూలవాసులు ఉన్నారు. వాళ్లను వాళ్ల పరిసరాల నుంచి, వాతావరణం నుంచి వేరు చేస్తున్నందువల్ల ఆర్థికంగానే కాక సాంఘికంగా, సాంస్కృతికంగా కూడా వాళ్లు నిరుపేదలు అయిపోతున్నారు. 1951లో ప్రపంచం మొత్తంమీద చూసినా శరణార్థుల సంఖ్య 20 లక్షల కంటే తక్కువే ఉండేది. ఇవ్వాళ ఒక కోటీ 85 లక్షల మంది స్త్రీ పురుషులు, పిల్లలు శరణార్థులుగా బతుకుతున్నారు. మరో రెండు కోట్ల మంది స్త్రీ పురుషులు, పిల్లలు తమ దేశాల్లోనే కాందిశీకులుగా బతుకుతున్నారు. అంటే ప్రతి 1350 మంది మనుషుల్లో ఒకరు స్వంత గడ్డ నుంచి వలసపోక తప్పని పరిస్థితులున్నాయి.

జాతుల విషయానికొస్తే 190 దేశాలలో మూడు వేల సాంస్కృతిక జాతులు (Ethnic groups) తమ అస్తిత్వం కోసం, విముక్తి కోసం ఏదో ఒక రూపంలో పోరాటాలు చేస్తున్నారు. ఈ అంతర్యుద్ధాలలో జననష్టం విపరీతంగా ఉంది. ఒక్క 1992 సంవత్సరంలోనే ఈ ఘర్షణలలో ఐదు లక్షలమంది పిల్లలు చనిపోయినట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలు పేర్కొన్నాయి.

ఇవ్వాళ ప్రపంచంలో 640 వేర్పాటు ఉద్యమాలు నడుస్తున్నట్లు అంచనా. ఇవి జాతి రాజ్యం (Nation-State) భావననే కాక అధికార వ్యవస్థను కూడా సవాలు చేస్తున్నాయి. ఈ ఉద్యమాలు కనుక సంపూర్ణంగా విజయవంతమైతే ప్రపంచ పటం పూర్తిగా మారిపోవలసి వస్తుంది.

వికలాంగుల సంఖ్య ప్రపంచం మొత్తం మీద 50 కోట్లు ఉంది. అయినా వారి సమస్యల్ని చిన్న సమస్యలుగా చూసి పట్టించుకోవడం లేదని ఈ సదస్సుకు వచ్చిన వికలాంగ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్త్రీల పట్ల వివక్ష, అవమానాలు, లైంగిక అత్యాచారాలు నిత్యకృత్యమై పోయాయని ప్రపంచంలోని 270 కోట్లమంది స్త్రీలకు ప్రతినిధులుగా వచ్చిన వారు ఎన్నో గణాంక వివరాలతో చెప్పారు. వారు చెప్పిన దాని ప్రకారం వ్యభిచారం జరగని ప్రాంతం ఈ భూ ప్రపంచంలో లేదు. కడు పేద సమాజాలలోను, అతి సంపన్న సమాజాలలోను రెండిట్లో వ్యభిచారం

BRAOU

ఎక్కువగానే జరుగుతోంది. 'అభివృద్ధి', స్త్రీలకు గౌరవప్రదమైన జీవితం ఇస్తుందనే నమ్మకం ఏమీ లేదని దీనివల్ల అర్థమవుతుంది. 16 ఏళ్ల లోపు బాలికలు ప్రపంచంలో 60 వేలమంది దాకా వేశ్యా వృత్తిలో ఉన్నారని అంచనా. వీరి సంఖ్య 1989 తర్వాత మూడు రెట్లు పెరిగింది. టూరిజం అభివృద్ధికీ వ్యభిచార వృత్తికీ దగ్గర సంబంధం ఉందనేది కొంతకాలంగా తెలిసిన విషయమే. అలాగే సైనికీకరణ పెరిగే చోట్ల వ్యభిచార సమస్యా పెరుగుతుంది.

కుటుంబ నియంత్రణ సేవలు అందుబాటులో లేని స్త్రీలు ఇవ్వాళ ప్రపంచంలో 30 కోట్లమంది దాకా ఉన్నారు. అసలు ఏ రకమైన ఆరోగ్య సదుపాయం అందుబాటులో లేని స్త్రీల సంఖ్యయితే వందకోట్లపైనే ఉంది. గర్భధారణ సమస్యలతో ఏటా ఐదు లక్షలమంది స్త్రీలు చనిపోతుండడమే దీనికి ప్రబల ఉదాహరణ. స్త్రీల సమస్యల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి యివన్నీ సాక్ష్యాలే.

రేప్‌కు, మూకుమ్మడి రేప్‌కు, ఇతర హింసలకు గురైన 30 మంది స్త్రీలు వియన్నా సదస్సు వేదికమీద నుంచి తమ బాధను, ఆవేదనను ప్రపంచంతో పంచుకున్నారు. వారి అనుభవాలు ప్రతి ఒక్కర్నీ కదిలించాయి. రెండో ప్రపంచ యుద్ధం నుంచి నేటివరకు జరిగిన అనేక రేప్ సంఘటనలలో బాధితులు వాళ్లు. రేప్‌లు, మూకుమ్మడి రేప్‌లు యిప్పుడు ప్రపంచమంతటా పెరుగుతున్నాయి. ఒక్క బోస్నియాలోనే మూకుమ్మడి రేప్‌ల కారణంగా 30 వేలమంది స్త్రీలు గర్భవతులయ్యారు. ఈ అమానవీయతకు పరాకాష్ట మూడేళ్ల సమీర్‌పై జరిగిన రేప్....స్పృహ కోల్పోయి రక్తమోడుతున్న ఆ పసిదాన్ని చూపించి ఫిర్యాదు చేయడానికి మిలటరీ జనరల్ దగ్గరకు వెళ్లిన ఆ పాప తల్లి సబ్రీజాను కూడా సైనికులు మళ్లీ మళ్లీ రేప్ చేసారు. ఈ రకమైన హింసాత్మక ధోరణులు బాధితులకే కాదు, మానవత్వం ఉన్న మనుషులందరికీ కోపం తెప్పించక మానవు.

హింసను ఉపయోగించే ఉద్యమాలు, పోరాటాలు ప్రపంచంలో ఎక్కడో ఒక చోట ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. వీటిని అణచివేయడానికి ఆయా ప్రభుత్వాలు సైనిక బలాన్ని ఉపయోగించడమే కాక మొత్తం రాజ్యయంత్రాంగాన్ని రాక్షస శక్తిగా మారుస్తాయి. దీనివలన ఆ ఉద్యమాలకు మూలమైన సమస్యలు పరిష్కారం కాకపోగా పెరుగుతాయి.

## 15.3 సమస్యలు

మానవ హక్కుల సందర్భం 1948తో పోల్చుకున్నా, 1968తో పోల్చుకున్నా చాలా మారిందనేది ఈ విషయాలు సూచిస్తున్నాయి. మానవ హక్కుల దృష్టితో చూస్తే ప్రపంచం మునుపెన్నడూ లేనంత తీవ్ర సంక్షోభంలో ఉందని అర్థమవుతుంది. అన్ని ప్రభుత్వాలూ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాక ఆ ఉల్లంఘనను సమర్థించుకోవడానికి సిద్ధాంత రూపంలో సాకుల కోసం వెతుక్కుంటున్నాయి. ఇది వియన్నా సదస్సులో స్పష్టంగా కనిపించింది. ఈ సదస్సులో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది ప్రధానంగా ఐదు సమస్యలు. అవి-

- ఎ. మానవ హక్కుల సార్వజనీన సిద్ధాంతంలోని ఔచిత్యం
- బి. రాజ్యహింసకు వ్యతిరేకంగా (వర్సెస్) ప్రైవేట్‌హింస
- సి. లింగ (జెండర్) సమస్య
- డి. జాతులు, ఆదిమ మూలవాసుల అస్తిత్వ ఉద్యమాలు
- ఇ. ప్రభుత్వేతర సంస్థల స్థానం, పాత్ర

### 15.3.1 మానవ హక్కుల సార్వజనీనతపై చర్చ

మానవ హక్కులు సార్వజనీనమనే భావన, ఆ భావన నుండి జనించిన ఆచరణ ప్రభుత్వ ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమైన చర్చనీయాంశమైంది. నిజానికి 1948లో అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనను ఆమోదించినపుడు మానవ హక్కుల భావన మీద అందరికీ దాదాపు ఏకాభిప్రాయం ఉంది. మానవ హక్కులు సార్వజనీనమనుకునే దశకు ఆ అవగాహన

BRAOU

ఎదిగిందని 1948లో అంగీకరించారు. కాని యిప్పుడు దాని స్థానంలో సాంస్కృతిక బహుళత్వం **(Cultural plurality)**, చారిత్రక నేపథ్యం లాంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. అసమానతలు, వివక్షలు, అస్తిత్వం నిరాకరణల వల్ల జాతి పరమైనవో, భాషా పరమైనవో, సాంస్కృతికపరమైనవో సమస్యలు లేదా జెండర్ సమస్యో, ఆదిమ మూలవాసుల సమస్యో తలెత్తుతాయన్న గుర్తింపు యింకా పూర్తిగా రాలేదు. వీటికి కారణాలు పైకి కనిపిస్తున్న వాటి కంటే లోతైనవీ, తీవ్రమైనవీ కూడా.

మార్కెట్ వ్యవస్థలో ఏకీకృత విధానం కోసం కొన్ని ప్రామాణిక ప్రవర్తనా సరళులను రూపొందించి అందరి నెత్తినా వాటిని రుద్దడానికి పాలక వర్గాలు చేస్తున్న ప్రయత్నాలు ఈ సంక్షోభానికి ఒక ముఖ్య కారణం. ఈ ప్రయత్నాలను వివిధ ప్రజా సమూహాలు ప్రతిఘటిస్తున్నాయి. పాలకులు, మరీ ముఖ్యంగా వర్ధమాన దేశాల పాలకులు ఆ ప్రజల కనీస మానవ గౌరవానికి లోటు లేని విధంగా సమస్యను ప్రజాస్వామికంగా పరిష్కరించుకునే బదులు మానవ హక్కులను విభజించి కొందరికే వర్తింపజేయాలని చూస్తున్నారు. ప్రతిఘటించే ప్రజాసమూహం స్వభావాన్ని బట్టి, రాజకీయ వ్యవస్థలో వారి స్థానాన్ని బట్టి పాలకులు వాళ్ల మానవ హక్కులను నిర్ణయించే ప్రయత్నం చేస్తున్నారు.

## 15.3.2 రాజ్యహింస వర్సెస్ ప్రైవేట్ హింస

రెండో చర్చనీయాంశం హింస స్థానం గురించి. రాజ్యం మానవ హక్కులను రక్షిస్తుందని, పెంపొందిస్తుందని ఈ శతాబ్దపు మధ్యకాలం వరకు ఆశలు ఉండేవి. సామాజిక మార్పుకు రాజ్యమే సాధనమని అప్పుడు నమ్మారు. ఈ నమ్మకంతోనే ఐక్యరాజ్య సమితిలోని చాలా దేశాలు అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన మీద, తర్వాత వచ్చిన రెండు అంతర్జాతీయ ఒడంబడికల మీద సంతకాలు చేసాయి. అప్పటికి ప్రైవేట్ హింస లేదా రాజకీయ హింస మీద పెద్ద చర్చలేదు. అయితే చివరి దశాబ్దం వచ్చే సరికి, అంటే 1990 దశకం మొదలయ్యే సరికి ఈ చర్చ పరిధి, పరిభాషలో చాలా అవాంఛనీయమైన మార్పులొచ్చాయి.

ఇదివరకే చెప్పినట్టు 1950, 60లలో రేకెత్తిన ఆశలు, కోరికలు చివరి దశాబ్దం వచ్చేసరికి నీరుగారి పోయాయి. అభివృద్ధి క్రమంలోనుండే హింస, ప్రతి హింసలు పుట్టుకురావడంతో ఎవరిది హింస? ఎవరిది ప్రతిహింస? అనే చర్చ ప్రారంభమైంది. వియన్నా సదస్సులో అనధికార ప్రతినిధులు చర్చించిన హక్కుల అతిక్రమణ సంఘటనలలో ఎక్కువభాగం రాజ్యహింస ఘటనలే. అయితే ఆయా ప్రభుత్వాల అధికార ప్రతినిధులు మాత్రం వీటిని 'పొరపాట్లు' లేదా అభివృద్ధి క్రమంలో 'అనివార్యమైన' విషయాలు అని చెప్పి సమర్థించుకున్నారు. వ్యక్తులు లేదా రాజకీయ గ్రూపులు సంకుచిత ప్రయోజనాల కోసం ప్రజల హక్కులను అతిక్రమిస్తుంటే ప్రభుత్వాలు విస్తృత ప్రయోజనాల కోసం ఆ పని చేయవలసి వస్తోందని వారు వాదించారు. మొదటి వర్గం చర్యల వల్లనే మానవ హక్కులకు నిజమైన ముప్పు ఏర్పడుతోందని కూడా వారు అభిప్రాయ పడ్డారు. రాజ్య హింసను హింసగా కాక ప్రతిహింసగా చూపెట్టే ప్రయత్నం చేశారు. ఈ కారణం చూపెట్టే వారు మానవ హక్కులను, వాటిని అతిక్రమించే శక్తులను పునర్నిర్వచించాలని కోరారు.

## 15.3.3 జెండర్ సమస్య

మూడోది జెండర్ సమస్య. వియన్నా సదస్సును భవిష్యత్ తరాల వాళ్లు గుర్తు పెట్టుకోవడమంటూ జరిగితే అది స్త్రీల సమస్య ఇక్కడ నివేదింపబడిన తీరుకు గుర్తుంటుంది. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన స్త్రీ ప్రతినిధులు స్త్రీల సమస్యపై ఉమ్మడి అవగాహనను కలిగి ఉండడమే కాక దాన్ని వాళ్లు సమైక్యంగా, శక్తివంతంగా వినిపించగలిగారు. తమ సమస్య తీవ్రతను, దానిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని సదస్సు చేత గుర్తింపజేయగలిగారు. ప్రభుత్వేతర సంస్థల స్థాయిలో అనేక విడతలుగా జరిగిన చర్చల ఫలితం తుది నివేదికలో స్పష్టంగానే కనిపించింది.

1948 నాటి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన జెండర్ సమస్యను సాధారణ సమస్యల్లో భాగంగానే చూసిందనేది గమనార్హం. నిజానికి ఈ ప్రకటనలో గాని, 1960లలో ఆమోదింపబడిన రెండు అంతర్జాతీయ ఒడంబడికలలో గాని స్త్రీల ప్రస్తావన దాదాపుగా లేదు. వేతనాలు, వివాహం అనే రెండు విషయాలకు సంబంధించి మాత్రమే వారి ప్రస్తావన

BRAOU

ఉంది. ఆ తర్వాతి నాలుగున్నర దశాబ్దాల కాలంలో పేదరికం, సంపద రెండూ తమని ఎలా బాధలకు గురి చేస్తున్నాయో స్త్రీలు గుర్తించారు. గౌరవం, స్వేచ్ఛ, అభివృద్ధి తమ దరిదాపుల్లోకి రావడం లేదని తెలుసుకున్నారు. మార్కెట్‌ను కేంద్రంగా పెట్టుకుని జరుగుతున్న అభివృద్ధి వల్ల స్త్రీల పరిస్థితి మరింత దిగజారుతోందని కూడా గుర్తించారు. ఈ గుర్తింపే పారిశ్రామిక దేశాలలోని స్త్రీలకు మిగతా దేశాలలోని స్త్రీలకు యింకా చాలా సమస్యలు ఉమ్మడిగా ఉన్నాయనే తెలివికి తెచ్చింది. ఇది స్త్రీల మధ్య మరింత సంఘీభావానికి, ప్రపంచ స్థాయిలో ఐక్య సంఘటన ఏర్పాటుకు ప్రయత్నించేలా చేసింది. ఈ ఐక్యత పితృస్వామ్యం మీద, అన్ని రకాల ఆధిపత్యాల మీద తిరుగుబాటు జెండాను ఎగరేసింది. సంఘటితమైన ఈ స్త్రీలకు కొన్ని అంతర్జాతీయ, ప్రభుత్వ సంస్థల తోడ్పాటు కూడా లభించడంతో స్త్రీ విముక్తి ఉద్యమాలకు బలం చేకూరింది.

అయితే జెండర్ సమస్య చాలా సంక్లిష్టమైంది కనుక దాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోగలవనేది స్పష్టంగాలేదు. ఎక్కువ శ్రద్ధ చూపిస్తామనే వాగ్దానం తప్ప నిర్దిష్ట కార్యక్రమం ఏదీ వాళ్లు ప్రకటించలేదు. ఏ కార్యక్రమం తీసుకున్నా పితృస్వామ్యాన్ని దాటి ముందుకు పోవడం అవసరం. క్రమబద్ధమైన మార్పుకు సంఘటిత పోరాటమొక్కటే సరైన మార్గం. ఏదేమైనా తమ సమస్యను ముఖ్యమైన మానవ హక్కుల సమస్యగా గుర్తింపజేయడంలో వియన్నా సదస్సు కొచ్చిన స్త్రీలు కృతకృత్యులయ్యారు.

## 15.3.4 మూలవాసులు

ప్రముఖంగా చర్చకు వచ్చిన నాలుగో విషయం జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణలు, మూలవాసుల సమస్య. ఈ సమస్యల మీద అధికారికంగా స్పందించడానికి ప్రభుత్వ ప్రతినిధులు కొంత ఇబ్బంది పడ్డారు. సమస్యను నిజమైన అర్థంలో గుర్తిస్తే దాని పర్యవసానం స్వయం నిర్ణయాధికారానికి వదిలేయడమే అవుతుంది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన స్వయం నిర్ణయాధికార హక్కును సూత్రప్రాయంగా గుర్తించినా ఈ సమస్యలో సున్నితమైన కోణాలు చాలా ఉన్నాయి. ఈ హక్కు ప్రాదేశిక సార్వభౌమాధికారంతో ముడిపడి ఉండడం అన్నిట్లోకి ముఖ్యమైన కోణం. అందువల్ల అన్ని సాంస్కృతిక జాతులు, మూలవాసులు స్వతంత్ర ప్రతిపత్తితో లేదా తమ తమ జాతి రాజ్యాలలో ముఖ్యమైన భాగస్వాములుగా తమ అభివృద్ధికి కృషి చేసుకోగలిగిన పరిస్థితులు కల్పించడం అవసరం. అటువంటి పరిష్కారం దిశగా ప్రపంచాన్ని ఒప్పించే పనిని ప్రజాస్వామ్య రాజకీయ ప్రక్రియలు చేపట్టాలి.

BRAOU

## 15.3.5 ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జివోలు)

గత నాలుగు దశాబ్దాల కాలంలో వచ్చిన మరో ముఖ్యమైన మార్పు ఎన్‌జివోల పెరుగుదల. వియన్నా సదస్సులో మొదటిరోజు నుండి ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వేతర సంస్థలకు మధ్య కొన్ని విషయాలలో అభిప్రాయ భేదాలు, ఉద్రిక్తతలు చోటు చేసుకుంటూనే వచ్చాయి. నిజానికి ఎన్‌జివోలు జూన్ 10-13 తేదీల మధ్య సమావేశమై తమ ఎజెండాను చర్చించుకోవడం పూర్తి చేశాకే అధికార సమావేశం జూన్ 14 నుంచి మొదలైంది. అయితే అధికార సమావేశాలకు ఎన్‌జివోలను అనుమతించాలా వద్దా అనే విషయంలోనే విభేదాలు ఏర్పడ్డాయి. కొన్ని దేశాలవారికి, ముఖ్యంగా వర్ధమాన దేశాల ప్రభుత్వ ప్రతినిధులకు ఎన్‌జివోలను అనుమతించడం ఇష్టంలేదు. పాశ్చాత్య దేశాల ప్రభుత్వ ప్రతినిధులలో కొందరు వాళ్లను అనుమతించడమే కాదు, వాళ్లకు సమావేశాలలో చురుకుగా పాల్గొనే అవకాశం యివ్వాలని ఒత్తిడి పెట్టారు. కొంత చర్చ తర్వాత ఎన్‌జివోలకు పరిశీలక హోదా యివ్వడానికి ప్రభుత్వ ప్రతినిధులు ఒప్పుకున్నారు. కాని ఈ విషయం చివరివరకు వివాదాస్పదమే అయింది. అలాగే అధికార బృందాలను కలిసి వాళ్లు తయారుచేసే పత్రాల రచనలో పాల్గొనవచ్చని ఎన్‌జివోలకు మరో మినహాయింపు కూడా యిచ్చారు కాని ఈ ఉమ్మడి కృషి, అన్ని దేశాల వాళ్లమధ్య ఒకే రకంగా సాగలేదు. కొన్ని దేశాల ప్రభుత్వ ప్రతినిధులు సుహృద్భావంతో మెలిగితే కొన్ని దేశాల వాళ్లు మౌనం వీడలేదు. తుదిప్రకటనను రూపొందించే ముసాయిదా కమిటీలో సభ్యత్వం కోసం ఎన్‌జివోలు చేసిన ప్రయత్నం మాత్రం ఫలించలేదు. ప్రభుత్వ ప్రతినిధులు ఒప్పుకోలేదు.

## 15.4 వియన్నా ప్రకటన ముఖ్యాంశాలు

### 15.4.1 మానవ హక్కుల సార్వజనీన సిద్ధాంతంలోని ఔచిత్యం

మానవ హక్కుల సార్వజనీనత గురించి సీరియస్ చర్చలు జరిగినప్పటికీ 'హక్కులు, స్వేచ్ఛలు సార్వజనీనమైనవనే విషయంలో ఎలాంటి సందేహం లేదు'' అని వియన్నా సదస్సు ప్రకటించింది. మానవ హక్కులు, మౌలిక స్వేచ్ఛలు మానవులందరి జన్మహక్కు కాబట్టి మానవ హక్కుల సంస్కృతిని ప్రపంచమంతటా పెంపొందించాలని ఈ సదస్సు అన్ని దేశాలనూ కోరింది. మానవ హక్కులను కాపాడటం, పెంపొందించడం ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యతని చెప్పింది. అన్ని మానవ హక్కులూ సార్వజనీనమైనవి, అవిభాజ్యమైనవి, పరస్పర ఆధారమైనవి, పరస్పర సంబంధమైనవని సదస్సు స్పష్టం చేసింది. అయినా ''జాతీయ, ప్రాంతీయ ప్రత్యేకతల్ని, వివిధ చారిత్రక, సాంస్కృతిక, మత నేపథ్యాల ప్రాముఖ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని'' వియన్నా ప్రకటన చెప్పడం గమనార్హం.

### 15.4.2 ప్రజాస్వామ్యం, అభివృద్ధి, మానవ హక్కులు

అభివర్ధికి, ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు ఉన్న సంబంధాన్ని వియన్నా ప్రకటన వివరించింది. ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధినీ కలిపి చూడాలనే ఆలోచన సోషలిస్టు ప్రభుత్వాల పతనానంతరం వచ్చిన ఆలోచన. ''ప్రజలకు తమ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలను నిర్ణయించుకోగలిగిన సంపూర్ణస్వేచ్ఛ, తమ జీవితాలకు సంబంధించిన అన్ని అంశాలలో పూర్తిగా పాల్గొనగలిగే అవకాశం'' ఉండడమే ప్రజాస్వామ్యమని ఈ ప్రకటన నిర్వచించింది. దీన్ని ప్రమాణంగా తీసుకుని వెనుకబడిన దేశాలను, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలను ప్రజాస్వామ్య దేశాలుగా మార్చడంలో సహాయపడమని సదస్సు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేసింది. 'అభివృద్ధి హక్కు సార్వజనీనమైంది, తొలగించడానికి వీల్లేనిది' అని కూడా వియన్నా ప్రకటన స్పష్టం చేసింది. వర్ధమాన దేశాలను అప్పులభారం నుంచి విముక్తి చేయడానికి శాయశక్తులా ప్రయత్నించమని కోరింది. ''అభివృద్ధికి మనిషి కేంద్రబిందువు''గా ఉండాలని చెపుతూ అభివృద్ధి లేదనే సాకుతో కొన్ని మానవ హక్కులను తొలగించడం లాంటి చర్యలకు ఎవరూ పాల్పడరనే ఆశాభావాన్ని అది వ్యక్తం చేసింది. ''దుర్భర దారిద్ర్యం మానవ హక్కుల్ని అనుభవించనీయదు. అందువల్ల దారిద్ర్యానికి తక్షణ ఉపశమనం, శాశ్వత పరిష్కారం కనుకొనడం ప్రపంచానికి మొదటి ప్రాధాన్యం కావాలి. ఆ పరిష్కారం ప్రస్తుత తరానికే కాక భవిష్యత్ తరాలవారి అభివృద్ధి, పర్యావరణ అవసరాలకు అనువైనదిగా ఉండాలి'' అని వియన్నా ప్రకటనపేర్కొంది. విష, వ్యర్థపదార్థాలను ఎక్కడెక్కడికో అక్రమంగా తరలించి వదిలేయడం మనుషుల జీవించేహక్కును, ఆరోగ్య హక్కును హరిస్తోందని సదస్సు హెచ్చరించింది. అలాగే జీవ, వైద్య శాస్త్రాలలో జరుగుతున్న కొన్ని పరిశోధనలు, సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులు మనుషుల గౌరవానికి, నిండైన జీవితానికి, మానవ హక్కులకు ప్రతిబంధకాలయ్యే ప్రమాదముందని అభిప్రాయపడింది.

అన్ని సామాజిక వివక్షలను, జాత్యహంకారాన్ని రూపు మాపాల్సిందిగా ఈ ప్రకటన ప్రపంచ దేశాలను కోరింది. జాతి వెలిని పాటించిన దక్షిణ ఆఫ్రికా తెల్ల రాజ్యం కూలిపోవడం పట్ల అది హర్షం వ్యక్తం చేసింది.

### 15.4.3 టెర్రరిజం, మానవ హక్కులు

''అన్ని రకాల టెర్రరిస్టు చర్యలూ, పద్ధతులూ, కొన్ని దేశాలలో టెర్రరిజానికీ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకూ ఉన్న సంబంధాలూ ఒకవైపు ప్రాదేశిక సమగ్రతకు, దేశ భద్రతకు, చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలకు ముప్పు కలిగించడమే కాక మరోవైపు మానవ హక్కులను, మౌలిక స్వేచ్ఛలను, ప్రజాస్వామ్యాన్ని సర్వనాశనం చేస్తాయ''ని సదస్సు అభిప్రాయపడింది.

BRAOU

టెర్రరిజాన్ని ఎదుర్కోవడంలో, నివారించడంలో మరింత కలిసికట్టుగా చర్యలు తీసుకోమని అది ప్రపంచదేశాలకు పిలుపునిచ్చింది.

## 15.5 బలహీన వర్గాలు: మానవ హక్కులు

స్త్రీలు, పిల్లలు, మైనారిటీలు, మూలవాసులు, వికలాంగులు, శరణార్థులు మొదలైన బలహీన వర్గాలపై (Vulnerable groups) జరుగుతున్న హక్కుల ఉల్లంఘనల గురించి ఈ సదస్సు ప్రత్యేకంగా చర్చించింది. ఉద్దేశపూర్వకంగానో, అనుద్దేశపూర్వకంగానో కొన్ని ప్రజా సమూహాలు నిర్లక్ష్యం చేయబడుతూ వస్తున్నాయనేది చారిత్రక సత్యం. ఈ సమూహాల హక్కులను గుర్తించి వారూ అందరిలా అన్ని మానవ హక్కుల్నీ పొందేలా చర్యలు తీసుకోమని వియన్నా ప్రకటన ప్రపంచ దేశాలను కోరింది. ఈ క్రింది తీర్మానాల రూపంలో సదస్సు వారి హక్కులను మరోసారి ప్రపంచం దృష్టికి తెచ్చింది.

స్త్రీల గురించి- ''స్త్రీల, బాలికల మానవ హక్కులు సార్వజనీన మానవ హక్కుల్లో అంతర్భాగం, అవిభాజ్యమే కాక తొలగించడానికి వీల్లేని''వని చెప్పింది. ''స్త్రీలు జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాజకీయ, పౌర, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నిట్లో సంపూర్ణంగా, శాశ్వతంగా పాల్గొనేలా చేయడం; జెండర్ కారణంగా వాళ్లు ఎదుర్కొంటున్న అన్ని రకాల వివక్షల్ని అంతం చేయడం ప్రపంచ దేశాలు తక్షణం సాధించాల్సిన లక్ష్యాలు''. అలాగే ''స్త్రీలపై జరుగుతున్న హింస, అన్ని రకాల లైంగిక వేధింపులు, దోపిడీ (సాంస్కృతిక, కారణాల వల్లగాని, అంతర్జాతీయ వ్యభిచార వ్యాపారం వల్లగాని) మనిషి పుట్టుకకు, గౌరవానికి ఏ మాత్రం సరిపోని విషయాలు వాటిని వెంటనే తొలగించాలి'' అని సదస్సు నిక్కచ్చిగా చెప్పింది.

BRAOU

### 15.5.1 పిల్లలు

పిల్లల హక్కుల గురించి ఈ సదస్సు అనేక సూచనలు చేసింది. తల్లీ పిల్లల మరణాల సంఖ్యను, వాళ్లలో పౌష్టికాహార లోపాన్ని, నిరక్షరాస్యతను తగ్గించడానికి కృషి చేయమంది. రక్షిత మంచినీరు, ప్రాథమిక విద్యల పట్ల ఎక్కువ శ్రద్ధ వహించమని కోరింది. పిల్లల శ్రమ దోపిడీని అరికట్టమనీ, వాటికి మూలకారణాలు తెలుసుకుని పరిష్కరించమనీ చెప్పింది. ''ఆడశిశువుల హత్యలు, పిల్లల విక్రయం, వారి అవయవాల విక్రయం, వారిచేత ప్రమాదకరమైన పనులు చేయించడం, వారిని వ్యభిచారవృత్తిలోకి దించడం లసభ్య చిత్రీకరణ, ఇతరత్రా లైంగిక దోపిడీలను ఆపేందుకు పటిష్టమైన చర్యలు అవసరమని'' సదస్సు నొక్కి చెప్పింది. బాలికలకు హాని కలిగించే సంప్రదాయాలను, చట్టాలను, నిబంధనలను తొలగించమని అన్ని ప్రభుత్వాలనూ కోరింది. సాయుధ సంఘర్షణలు జరిగేచోట పిల్లలకు భద్రత కల్పించే మార్గాల గురించి అధ్యయనం జరపమని సెక్రటరీ జనరల్‌ను కోరింది. యుద్ధ దృశ్యాలు చూసి మనసు చెదిరిపోయిన పిల్లల సంరక్షణకు, పునరావాసానికి ఏర్పాట్లు జరగాలని సూచించింది. సైన్యంలో చేరే వారి కనీస వయస్సును పెంచితే బాగుంటుందని కూడా సూచించింది.

### 15.5.2 మైనారిటీలు

'మైనారిటీల హక్కులను కాపాడడం, పెంపొందించడం చాలా ముఖ్యమైన పని. ఇది వారి వారి దేశాల రాజకీయ, సామాజిక సుస్థిరతకు కూడా దోహదం చేస్తుంద''ని వియన్నా సదస్సు చెప్పింది. 'మైనారిటీలు ఎటువంటి వివక్షకు గురికాకుండా, చట్టం ముందు పూర్తి సమానులుగా అన్ని మానవ హక్కులనూ, మౌలిక స్వేచ్ఛలనూ అనుభవించగల వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వాల బాధ్యత'ని కూడా చెప్పింది. 'మైనారిటీలు స్వేచ్ఛగా, ఏ వివక్షలూ, ఆంక్షలూ లేకుండా తమ సంస్కృతిని, మతాన్ని, మాతృభాషను అనుసరించే, ప్రచారం చేసుకునే, మాట్లాడే హక్కు కలిగి ఉన్నార''ని అది మరోసారి నొక్కి చెప్పింది.

## 15.5.3 మూలవాసులు

"సమాజ అభివృద్ధికి, బహుళత్వానికి మూలవాసులు చేసిన విశిష్ట కృషిని, వారి ఆత్మాభిమానాన్ని" గుర్తిస్తూ వియన్నా సదస్సు "మూలవాసుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక శ్రేయస్సు పట్ల, అభివృద్ధి ఫలితాలు వారికి దక్కేలా చేయడం పట్ల అన్ని ప్రపంచదేశాలకూ బాధ్యత ఉంద"ని గట్టిగా గుర్తు చేసింది. అన్ని సామాజికాంశాలలో, మరీ ముఖ్యంగా మూలవాసులకు సంబంధించిన విషయాలలో వారు పూర్తిగా, స్వేచ్ఛగా పాల్గొనేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సదస్సు కోరింది". మూలవాసుల హక్కుల పరిరక్షణకు ఉన్న ప్రాముఖ్యాన్నే కాక దానివల్ల వారు నివసిస్తున్న దేశాల రాజకీయ, సామాజిక సుస్థిరతకు జరిగే మేలును కూడా దృష్టిలో పెట్టుకుని ప్రపంచ దేశాలు మూలవాసుల మానవ హక్కులకు, మౌలిక స్వేచ్ఛలకు సర్వత్రా గౌరవం లభించేలా నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాల"ని చెప్పింది. మూలవాసుల అస్తిత్వాలలో, సంస్కృతులలో, సాంఘిక నిర్మాణాలలో ఉన్న వైవిధ్యాన్ని, వాటి విలువను కూడా ఈ సదస్సు గుర్తించింది.

## 15.5.4 వికలాంగులు

వికలాంగుల సమస్యలను, నిర్వాసితుల సమస్యలను ఈ సదస్సు ప్రపంచ ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. వికలాంగులు ఎటువంటి వివక్షకు గురికాకుండా అన్ని మానవ హక్కులను, మౌలిక స్వేచ్ఛలను అందరితో సమానంగా అనుభవించేలా, అన్ని సామాజిక రంగాలలో చురుకుగా పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సదస్సు ప్రభుత్వాలను కోరింది. సాయుధ ఘర్షణలతో సహా వివిధ సందర్భాల్లో విస్తృతంగా జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలు ప్రజల్ని ఉన్న ఊరు విడిచిపెట్టి పారిపోయేలా చేస్తాయని, నిర్వాసిత సమస్యకు దారితీసే కారణాల్లో యిదొక ముఖ్యమైన కారణమని వియన్నా ప్రకటన పేర్కొంది. శరణార్థుల రక్షణ కోసం ఉన్న అన్ని అంతర్జాతీయ ఒడంబడికలను జాగ్రత్తగా పాటించాలని కూడా ఈ సదస్సు కోరింది. జాతి ప్రక్షాళన పేరుతో జరుగుతున్న ఊచకోతలు, స్త్రీలపై అత్యాచారాల పట్ల సదస్సు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. వీటివలన ప్రజలు పెద్ద ఎత్తున వలస పోవలసి వస్తోందని, ఫలితంగా నిర్వాసితుల, శరణార్థుల సంఖ్య మరింత పెరుగుతోందని చెప్పింది. ఈ "హేయమైన" చర్యలను తీవ్రంగా ఖండించమని అది ప్రపంచ దేశాలను కోరింది. ఈ నేరాలకు పాల్పడేవారిని శిక్షించడంతో పాటు వీటిని తక్షణమే నిలిపివేయాలని కూడా కోరింది.

BRAOU

## 15.6 ముగింపు

మానవ హక్కుల ఆవిర్భావనలో వియన్నా సదస్సు ఒక ముఖ్యమైన మైలురాయి. మానవ హక్కుల కార్యక్షేత్రంలో యిన్నాళ్ళూ నిక్షిప్తంగా ఉన్న అనేక ధోరణులను యిది వెలికి తెచ్చింది. వర్ధమాన దేశాల పరిపాలక వర్గాలు లేవనెత్తిన ప్రశ్నలు మానవ హక్కుల సార్వజనీనతనే సవాలు చేశాయి. ఈ సవాలు మార్కెట్ వ్యవస్థ ఏకీకృతమవుతున్న చారిత్రక దశలో వచ్చిందనే విషయం మరిచిపోకూడదు. 1948 పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధం. అప్పుడు చాలా దేశాలకు రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు ఆర్థిక సార్వభౌమత్వం కూడా వచ్చింది. బహుశా అందువల్లే మానవ హక్కుల విషయంలో వారి మధ్య ఎక్కువ ఏకాభిప్రాయం కనిపించింది. కాని ఇప్పుడలా కాదు. మానవ హక్కుల సందర్భంలో, సమస్యలలో వచ్చిన ఈ మార్పు చాలా ముఖ్యమైన చారిత్రక పరిణామంగా గుర్తించాలి.

ఎన్‌జీవోల పాత్ర, వారు లేవనెత్తిన ప్రశ్నలు కూడా ముఖ్యమైనవే. స్త్రీలు, పిల్లలు, మూలవాసులు, వికలాంగులు, శరణార్థులపై ప్రత్యేక చర్చ జరిగింది. 'ఏకాభిప్రాయాన్ని సాధించి తుది ప్రకటనను వెలువరించడంలో కృతకృత్యులయ్యారు. ఈ ప్రకటన ప్రస్తుత సమస్యలకే కాక భవిష్యత్‌కు కూడా చాలా ముఖ్యమైన రెఫరెన్స్ పాయింట్‌గా ఉంటుంది.

## 15.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తుల్లో సమాధానం రాయండి

1. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని అంశాలకు వియన్నా సదస్సులో చర్చించిన అంశాలకు ఉన్న తేడాలేమిటి?

2. మానవ హక్కుల సందర్భంలో వచ్చిన మార్పును వివరించండి

II. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. వియన్నా ప్రకటనలోని ముఖ్యమైన అంశాలేమిటి?

2. 'వియన్నా ప్రకటనలో మానవ హక్కుల్ని విభజించి చూసే ధోరణి ఉంది' అనే అభిప్రాయం సరైందేనా?

## 15.8 సంప్రదింపు గ్రంథాలు


1. జి. హరగోపాల్, మానవ హక్కుల రాజకీయార్థిక విశ్లేషణ; కొత్త ధోరణులు, హిమాలయా ప్రచురణలు, న్యూఢిల్లీ, 1997

2. ఇందిరా అర్జున్ దేవ్ & సుప్తాదాస్: మానవ హక్కులు: మూలగ్రంథం, ఎన్‌సిఇఆర్‌టి, న్యూఢిల్లీ, 1996


BRAOU

# భాగం 16: రియో ప్రపంచ పర్యావరణ సదస్సు

(అభివృద్ధి, పర్యావరణాల మీద 1992లో రియో-డి-జెనీరోలో జరిగిన ఐక్యరాజ్యసమితి సదస్సు)

విషయక్రమం


16.1 ఉద్దేశం

16.2 పరిచయం

16.3 నిర్వచనం

16.4 ఒప్పందాలు, ఎజెండా

16.4.1 వాతావరణ మార్పులకు సంబంధించిన ఒప్పందం

16.4.2 జీవ వైవిధ్య ఒప్పందం

16.4.2.1 ప్రణాళికలకు రూపకల్పన

16.4.2.2 అంశాల తొలగింపు

16.4.3 ఎజెండా-21

16.5 విధాన ఒడంబడికలు

16.5.1 నష్టపరిహార హక్కు

16.5.2 సమాచార హక్కు

16.5.3 కాలుష్యం నుంచి రక్షణ పొందే హక్కు

16.6 ఆర్థిక యంత్రాంగం

16.7 ద ఫ్లామిగో పార్క్: ఎన్జీవోల సమావేశం

16.8 విభేదాంశాలు

16.9 ప్రత్యామ్నాయం

16.10 ముగింపు

16.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

16.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 16.0 ఉద్దేశం

*ఈ క్రింది నాలుగు విషయాల మీద అవగాహన కలిగించడం ఈ పాఠం ఉద్దేశం:- అవి*

- పర్యావరణ సమస్యల్ని అసలు ఎందుకు పట్టించుకోవాలో చెబుతుంది.
- సుస్థిరాభివృద్ధిని నిర్వచించి, అది మానవ హక్కుల భావనగా ఎలా రూపుదిద్దుకుందో వివరించడం.
- రియో సదస్సు ఆమోదించిన పర్యావరణ పరిరక్షణ ఒప్పందాలను, ఎజెండా-21 పేరుతో విడుదలయిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను విశదీకరించడం.
- పర్యావరణ సమస్యలమీద జరుగుతున్న చర్చను విమర్శనాత్మకంగా చూసే దృష్టిని, ప్రత్యామ్నాయ ఆలోచనలను అందజేయడం.

# 16.2 పరిచయం

ప్రకృతితో సంఘర్షించే క్రమంలోనే మానవ సమాజాలన్నీ ఆవిర్భవించాయి. వేట, ఆహారసేకరణ నుండి ఆహారోత్పత్తి, వస్తూత్పత్తిల దాకా అన్ని దశల్లోను మానవ నాగరికతలు ప్రకృతిని తమ అవసరాలకు, కోరికలకు అనుగుణంగా మార్చుకుంటూ వచ్చాయి. అయితే ప్రకృతికి మాత్రం పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడిన క్రమంలోనే ఎక్కువ నష్టం కలిగింది. ఈ దశలో ప్రకృతిని ఎంతగా కొల్లగొట్టారంటే ఇవ్వాళ మనిషితో సహా కోట్లాది జీవరాశుల మనుగడకు తీవ్రప్రమాదం ఏర్పడింది. ప్రకృతికి మానవ సమాజానికి మధ్య ఉండాల్సిన సమతుల్యం తెగిపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది.

నిజానికి ప్రకృతిలోనే దాని సమతుల్యతను కాపాడుకునే యంత్రాంగం ఉంది. ఉత్పత్తయిన ప్రతి వస్తువూ మరో ఉత్పత్తి క్రమానికి ముడి సరుకుగా ఉపయోగపడడం వల్ల అన్నిటిమధ్య ఒక వర్తులాకార సంబంధం ఉంటుంది. ఈ సహజ సమతుల్యత అన్ని జీవ-భూ-రసాయన క్రమాలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. చెరువులు, నదులు, సముద్రాలు ప్రకృతిని 'కుప్పతొట్లు'గా ఉపయోగపడితే విస్తారమైన అడవులు దానికి 'ఊపిరితిత్తులు'గా పనిచేస్తాయి. ఒక సమాజానికి ప్రకృతితో ఎలాంటి సంబంధం ఉందో దాని సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానాలు చూస్తే తెలిసిపోతుంది. పారిశ్రామిక అభివృద్ధి ఆవిరిశక్తి నుంచి కైనటిక్‌కు, దాన్నించి విద్యుత్‌కు, అణుశక్తికి మారుతున్నకొద్దీ ప్రకృతి మీద మనిషిదాడి పెరుగుతూ వచ్చింది. దాని ఫలితమే 'గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్' అనబడే పర్యావరణ ప్రమాదం యిప్పుడు మన ముంగిట్లోకి వచ్చింది. ఈ ప్రమాదానికి కారణమైన ఇతర ఉపద్రవాలు కూడా మానవ కల్పితాలు, స్వయంకృతాపరాధాలే.

పెట్టుబడిదారీ సమాజం లేదా స్వేచ్ఛావిపణి సమాజం అవగాహన ప్రకారం ప్రకృతి, అభివృద్ధి పరస్పర విరుద్ధ విషయాలు. ఈ వైరుధ్యం అనివార్యమని కూడా వాటి ఉద్దేశం. 'పర్యావరణ సంక్షోభం'గా పిలవబడుతున్న ప్రస్తుత పరిస్థితికి ఈ అవగాహనే కారణం. 'భూమి' మీద జరిగిన అతిపెద్ద సదస్సుగా, 'భూమిని రక్షించడానికి చివరి అవకాశం'గా అభివర్ణించబడిన రియో-డి-జనీరో సదస్సును ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. మరీ ముఖ్యంగా మానవ హక్కుల దృక్పథం నుంచి ఈ నేపథ్యాన్ని అర్థం చేసుకునేటప్పుడు చర్చ రెండు విభిన్న హక్కుల మధ్య జరుగుతుందనే విషయం మరిచిపోకూడదు. ఇప్పుడున్న జీవరాశులకు, ఇకముందు పుట్టబోయే వాటికి కూడా ఈ భూమిమీద ఆరోగ్యంగా జీవించేహక్కు ఒకటయితే, రెండోది అభివృద్ధి హక్కు. వీటి మధ్య రాజీ చేయడానికే సుస్థిరాభివృద్ధి (Sustainable development) అనే భావనను ముందుకు తెస్తున్నారు. ప్రస్తుతం ఇది ఎక్కువమందికి ఆమోద యోగ్యంగా ఉంది.

BRAOU

# 16.3 నిర్వచనం

'భవిష్యత్ తరాలవారికి వారి అవసరాలు తీరే అవకాశాలు ఉంచుతూ వర్తమాన అవసరాలను తీర్చుకునే అభివృద్ధే' సుస్థిరాభివృద్ధి అవుతుందని అభివృద్ధి, పర్యావరణ సమస్యలమీద ఏర్పడిన ఐక్యరాజ్య సమితి కమిషన్ నిర్వచించింది. ఈ నిర్వచనాన్ని అందరూ ఆమోదించకపోయినప్పటికీ సదస్సులో చర్చకు ఇది నాందిగా ఉపయోగపడింది. నిర్వచనం 'ఏదయినప్పటికీ సుస్థిరాభివృద్ధి' భావనలో ఈ కింది అంశాలయితే తప్పనిసరిగా ఉండాలని అందరూ భావించారు. అవి:-

1) ప్రకృతికి హాని చేయని ఆరోగ్యవంతమైన, ఫలప్రదమైన జీవితం (మొదటి సూత్రం)

2) అభివృద్ధి క్రమంలో అంతర్భాగమయ్యే పర్యావరణ పరిరక్షణ (నాలుగో సూత్రం)

3) దారిద్ర్య నిర్మూలన

4) జనాభా, ఉత్పత్తి, వినిమయంపై తగిన విధానాల రూపకల్పన

5) శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం

## 16.4 ఒప్పందాలు, ఎజెండా

'రియో' ఒప్పందాలలో రెండు అంశాలున్నాయి. ఒకటి-అంతర్జాతీయ చట్టాలకు ప్రాతిపదికగా ఉపయోగపడగల సార్వత్రిక సూత్రాలు, రెండు-నిర్దిష్ట కార్యక్రమాల నిర్వహణకు సమన్వయ యంత్రాంగాలను నెలకొల్పే సూత్రాలు. అందువల్ల రియో సదస్సు రెండు రకాల ఒప్పందాలను, వాటితో పాటు 21వ శతాబ్దానికి అవసరమైన ఒక ఎజెండాను కూడా రూపొందించింది. అవి-

1. వాతావరణ మార్పులకు సంబంధించిన ఒప్పందం
2. జీవ వైవిధ్యం గురించిన ఒప్పందం
3. ఎజెండా-21

పర్యావరణ చర్చల్లో ఈ సదస్సు ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. 153 దేశాల నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు. సమావేశం ఏర్పాట్లకే రెండేళ్లపైన పట్టింది.

## 16.4.1 వాతావరణ మార్పులకు సంబంధించిన ఒప్పందం

*గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల పర్యవసానమే ఈ ఒప్పందం. దీనిలోని ముఖ్యమైన విషయాలు :-*

BRAOU

(1) అన్ని అంశాలూ అందరికీ వర్తించేవే అయినా కొన్ని తేడాలు ఉంటాయని అధికరణ 4.1 పేర్కొంది. ఉదాహరణకు 'గతంలో గాని, ఇప్పుడుగాని గ్రీన్‌హౌస్ గ్యాస్‌లలో ఎక్కువభాగం సంపన్న దేశాలనుండే వెలువడుతున్నాయి. తలసరి లెక్క ప్రకారం చూస్తే ఈ గ్యాస్‌ల ఉత్పత్తి వర్ధమాన దేశాలలో ఇప్పటికీ చాలా తక్కువే. అయితే తమ సామాజిక, అభివృద్ధి అవసరాలను తీర్చుకునే క్రమంలో ఈ దేశాలు ఇకముందు గ్రీన్‌హౌస్ గ్యాస్‌ను యిదివరకటికంటే ఎక్కువ ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయి' అని ఒప్పందం తన ప్రవేశికలోనే గుర్తించింది. అలాగే ఆర్థిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీలకు సంబంధించి సంపన్న దేశాలు తాము ఇచ్చిన పూచీలను ఎంతమేరకు అమలు చేస్తాయో అంతమేరకే వర్ధమాన దేశాలు తాము పూచీపడిన విషయాలను కూడా అమలు చేయగలవని ఇది స్పష్టం చేసింది. అన్నిటికంటే తమ ఆర్థిక సామాజిక అభివృద్ధి, దారిద్ర్య నిర్మూలన వర్ధమాన దేశాలకు ముఖ్యమైన సమస్యలనేది దృష్టిలో పెట్టుకోవడం అవసరమని పేర్కొంది. (అధికరణం 2-7)

(2) మంచి వాతావరణం కోసం ప్రయత్నించాల్సిన బాధ్యత పాశ్చాత్య పారిశ్రామిక దేశాలతో పాటు తూర్పు యూరప్‌లోని పారిశ్రామిక దేశాలకు కూడా ఉందని ఒప్పందం అభిప్రాయపడింది. అందువల్ల వారు కొన్నిటిని తగ్గించుకోవడమే కాక కొన్నిటి విషయంలో నిర్దిష్ట ప్రమాణాలను పాటించాల్సి ఉంటుందని పేర్కొంది.

(3) వర్ధమాన దేశాలు తమ పూచీలను నిలబెట్టుకోవడానికి అవసరమయ్యే ఆర్థిక వనరుల్ని కూడా సంపన్న దేశాలే సమకూర్చాలని చెప్పింది.

(4) ఈ ఒప్పందం అమలుకు తీసుకునే చర్యలను ఉభయులూ వివరంగా నమోదు చేయాలని, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని చెప్పింది. (అధికరణం 12)

## 16.4.2 జీవవైవిధ్యం ఒప్పందం

ఒక ప్రాంతంలో కనిపించే అన్ని జన్యువులు, జీవరాశులు, పర్యావరణ వ్యవస్థల్ని కలిపి జీవవైవిధ్యం (Bio-Diversity) అంటున్నాం. ఈ వైవిధ్యం క్రమంగా తగ్గుతూ కొన్ని రకాల జీవరాశులు పూర్తిగా అదృశ్యమై పోతున్నందువల్ల ఈ

ఒప్పందాన్ని రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది.

*దీని లక్ష్యాలు*

**జీవవైవిధ్యం పరిరక్షణ:** ఆ వైవిధ్యానికి నష్టకరం కాని రీతిలో వాటి వినియోగం, జన్యు వనరులు, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాలపై హక్కులు ఎవరికున్నాయో దృష్టిలో పెట్టుకుని ఆ వనరుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను న్యాయంగా, సమానంగా పంచుకోవడం; వాటిని తగురీతిలో అందుబాటులో ఉంచడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సముచిత రీతిలో బదిలీ చేసుకోవడం; నిధులు సమకూర్చుకోవడం.

## 16.4.2.1 ప్రణాళికలకు రూపకల్పన

మొదటి రెండు లక్ష్యాల అమలుకు దేశాలు సొంతంగా వ్యూహాలు, ప్రణాళికలు, కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. తమ దేశంలోని జీవవైవిధ్యాన్ని గుర్తించి, కాపాడుకోవడం కూడా వాటి బాధ్యతే. ఈ పనులను వారు తమ తమ పరిస్థితులను బట్టి, సామర్థ్యాన్ని బట్టి చేసుకోవచ్చు. (అధికరణం 7,11 & 14)

## 16.4.2.2 ఆంక్షల తొలగింపు

జన్యు వనరుల మీద ఆంక్షలు పెట్టకుండా వాటిని వీలైనంతగా అందరికీ అందుబాటులో ఉంచడానికి ప్రయత్నించాలని ఈ ఒప్పందం అన్ని దేశాలనూ కోరింది. అయితే ఈ అందుబాటును నిర్ణయించే అధికారం ఆయా దేశాల ప్రభుత్వాలకు, వాటి చట్టాలకు మాత్రమే ఉంటుందని చెప్పింది.

BRAOU

## 16.4.3 ఎజెండా-21

రియో సదస్సు నుంచి వెలువడిన క్రియాశీల పత్రాలలో ఇదే ముఖ్యమైనది. ఎజెండా-21 పత్రానికి చట్ట బద్ధత లేకపోయినా పర్యావరణ పరిరక్షణ మార్గంలో ఇది నిస్సందేహంగా గొప్ప మైలురాయి. దీనిలో 40 అధ్యాయాలు ఉన్నాయి. పర్యావరణాన్ని, అభివృద్ధిని కలిపి చూసే దృష్టిని అలవర్చుకుని, ఉమ్మడిగా వాటిమీద మరింత శ్రద్ధ పెడితే అందరికీ కనీసావసరాలు తీరి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ప్రవేశికలో పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థల రక్షణ, నిర్వహణ మెరుగుపడి భవిష్యత్తు మరింత సౌభాగ్యంగా, సురక్షితంగా ఉండగలదని కూడా అందులో ఆశాభావం వ్యక్తం చేశారు.

*ఎజెండా-21లో నాలుగు భాగాలున్నాయి.*

I సామాజిక - ఆర్థిక కోణాలు (అధ్యాయాలు 2-8)

II వనరుల పొదుపు నిర్వహణ (అధ్యాయాలు 9-12)

III పర్యావరణ రక్షణ సామాజిక బృందాల బలోపేతం (అధ్యాయాలు 23-32)

IV పర్యావరణ విధానాల అమలు సాధనాలు (అధ్యాయాలు 32-40)

I. మరింత సమానమైన, సమర్థవంతమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోసం అన్ని దేశాలమధ్య నిరంతర, నిర్మాణాత్మక చర్చలు జరగాలని, అందుకోసం ఒక నూతన భాగస్వామ్య వ్యవస్థను నెలకొల్పుకోవాలనేది మొదటి భాగంలోని ముఖ్యమైన విషయం.

అభివృద్ధి, పర్యావరణాల లక్ష్యాలను సాధించడానికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అందుకు అనువైన అంతర్జాతీయ వాతావరణాన్ని నెలకొల్పాలని ఎజెండా-21 చెపుతుంది. ఇందుకు ఆర్థికవ్యవస్థ చేయాల్సిన పనులు నాలుగున్నాయి. అవి:-

1. వాణిజ్య సరళీకరణ ద్వారా సుస్థిరమైన అభివృద్ధికి దోహదపడటం
2. వాణిజ్యం, పర్యావరణం పరస్పర ఆధారంగా వృద్ధి చెందేలా చర్యలు తీసుకోవడం
3. వర్ధమాన దేశాలకు తగినన్ని ఆర్థిక వనరులు సమకూర్చి, విదేశీ అప్పు భారం కాకుండా చేయడం
4. పర్యావరణానికి, అభివృద్ధికి తోడ్పడే స్థూల ఆర్థిక విధానాలను ప్రోత్సహించడం

### వీటిని సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు:

1. మార్కెట్ రక్షణ విధానాలకు స్వస్తి చెప్పడం. దానివల్ల ప్రపంచ వాణిజ్య విస్తరణకు, సరళీకరణకు అవకాశం ఏర్పడుతుంది.
2. న్యాయమైన, స్థిరమైన, వివక్షా రహితమైన, నమ్మకమైన అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం.
3. నిర్ణీత కాలవ్యవధి లోపల అన్ని దేశాలూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో, అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థలో సంలీనమయ్యేలా చేయడం.
4. సుస్థిరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ, వాణిజ్య విధానాలు పరస్పరం ఉపయోగపడేలా రూపొందించడం.
5. ఉరుగ్వే చర్చలను విజయవంతం చేయడం ద్వారా అంతర్జాతీయ వాణిజ్య విధానాన్ని బలపరచడం.

దారిద్ర్య నిర్మూలన గురించి, ప్రకృతితో సామరస్య సహజీవనం చేయగల జనావాసాల ఏర్పాటు, అభివృద్ధి గురించి కూడా ఈ సమావేశం చర్చించింది. 'దారిద్ర్య సమస్యకు చాలా కోణాలున్నాయి. దాని మూలాలు జాతీయ, అంతర్జాతీయ రంగాలు రెండింట్లో ఉన్నాయి. కాబట్టి ప్రపంచానికంతటికీ పనికొచ్చే ఒకే ఒక పరిష్కారం దొరకడం అసాధ్యం' అని ఎజెండా భావించింది.

'పర్యావరణ విధానం ప్రధాన లక్ష్యం వనరులను పొదుపుగా ఉపయోగించడం, పరిరక్షించడం మాత్రమే అయితే బతుకుతెరువు కోసం ఆ వనరులమీద ఆధారపడే వారి పరిస్థితి ఏమిటి? వనరుల లభ్యతతో నిమిత్తం లేకుండా సరుకుల అధికోత్పత్తికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే అభివృద్ధి విధానం వల్ల ఇవాళ కాకపోతే రేపయినా ఉత్పాదకత తగ్గి తీరుతుంద'ని ఎజెండా అభిప్రాయపడింది. కాబట్టి వనరుల పొదుపుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమూ మంచిది కాదు, అభివృద్ధి అవకాశాలను అతిగా అంచనా వేయడమూ సరికాదు. రెండూ దారిద్ర్య నిర్మూలన లక్ష్యాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంది.

ప్రయోజనకరంగా కొనసాగించలేని ప్రస్తుత ఉత్పత్తి, వినిమయ వ్యవస్థల పట్ల ఎజెండా ఆందోళన వ్యక్తం చేసింది. సహజ వనరుల్ని ఉచిత సరుకులుగా చూసే సంప్రదాయ భావన స్థానే వాటిని జాతీయ సంపదగా చూసే కొత్త భావన అవసరమని వాదించింది. ఈ విధంగా చూసినపుడు సహజ వనరుల తరుగుదల సంపద తగ్గిపోవడమవుతుంది. ఫలితంగా భూమికున్న పరిమిత వనరుల మీద ఆధారపడడం తగ్గి, భూమితో సామరస్యంగా బతికే ప్రయత్నం మొదలవుతుందని, అప్పుడు మనుషుల జీవన విధానాలు, ప్రమాణాలు కూడా మారతాయని ఎజెండా భావిస్తోంది.

ఒకవైపు ప్రపంచ జనాభా, ఉత్పత్తి పెరుగుతూ పోవడం, మరోవైపు వినిమయం కూడా అపరిమితంగా జరగడం వల్ల భూమి జీవశక్తి సామర్థ్యం తగ్గిపోతుందని, ఈ విషయాల్ని కూడా ఎజెండాలో చేర్చాల్సి ఉంటుందని ఆ పత్రం అభిప్రాయపడింది.

### ఎజెండాలో కనిపించే మరో అంశం మనుషుల ఆరోగ్య సంరక్షణ:

1. ప్రాథమిక ఆరోగ్య అవసరాలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అవసరాలను తీర్చాలని,

BRAOU

2. అంటు వ్యాధుల్ని నియంత్రించాలని,

3. తరచూ వ్యాధుల బారిన పడే వర్గాల పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని,

4. నగరజీవనం కలిగించే అనారోగ్యాన్ని ఎదుర్కొవాలని,

5. పర్యావరణ కాలుష్యం, ప్రమాదాల వల్ల కలిగే అనారోగ్యాలను తగ్గించాలని ఎజెండా పేర్కొంది.

'సామాజిక-ఆర్థిక కోణాల' విభాగంలో జనావాసాల అభివృద్ధి గురించి ఒక అధ్యాయం ఉంది. జనావాసాల అభివృద్ధికి ఈ కింది పనులు అవసరమని అది భావించింది.

1. అందరికీ సరయిన గృహవసతి

2. మెరుగయిన నిర్వహణా పద్ధతులు

3. నేలను ప్రయోజనకరంగా వాడే విధానాలను ఆలోచించి, అమలు చేయడం

4. నీరు; పారిశుధ్యం, మురుగునీటి సౌకర్యం, వ్యర్థ పదార్థాల నిర్మూలనకు సంబంధించి సమన్వయ విధానం.

5. పునరుద్ధరించుకోగల ఇంధన వనరుల్ని మాత్రమే వాడుకునే విధానాలను, రవాణా వ్యవస్థను పెంపొందించుకోవడం.

6. తరచూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రాంతాలలో జనావాసాల నిర్మాణంలో జాగ్రత్త వహించడం.

7. పునరుద్ధరించుకోగల సామగ్రితో జరిగే నిర్మాణ కార్యకలాపాలను మాత్రమే ప్రోత్సహించడం.

8. మానవ వనరుల్ని, జనావాసాల అభివృద్ధికి అవసరమైన శక్తి సామర్థ్యాలను పెంపొందించడం.

ప్రతి నిర్ణయంలోనూ పర్యావరణానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం లభించేలా చేయడం తమ లక్ష్యమని ఈ మొదటి భాగం చెప్పుకుంది.

II. వనరుల పొదుపు, నిర్వహణకు సంబంధించిన రెండో భాగంలో వాతావరణ పరిరక్షణ, భూవనరుల్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవడం; అంతరిస్తున్న అడవుల్ని, విస్తరిస్తున్న ఎడారుల్ని, కరువు కాటకాల్ని నివారించే చర్యల్ని చేపట్టడం; ప్రయోజనకర పద్ధతిలో పర్వతాలను అభివృద్ధి చేయడం, అదే పద్ధతిలో వ్యవసాయాన్ని, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడం; జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం; జీవ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొదించడం; సముద్రాల్ని, మంచినీటి వనరుల్ని కాపాడుకోవడం; విషపూరితమైన రసాయనాలను, ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాలను, ఘనరూపంలోని వ్యర్థ పదార్థాలను, మురుగునీటిని, రేడియోధార్మిక వ్యర్థ పదార్థాలను పర్యావరణకు హానిచేయని పద్ధతిలో వదిలించుకోవడం మొదలైన విషయాలున్నాయి.

వాతావరణ మార్పులకు సంబంధించిన ఒప్పందం ప్రభావం ఈ రెండో భాగం మీద బాగా కనిపిస్తుంది. వాతావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఇంధన అభివృద్ధి, రవాణా, పారిశ్రామికాభివృద్ధి, భూమిమీద, సముద్రం లోపల ఉన్న వనరుల అభివృద్ధి, ఓజోన్ తగ్గుదల, వాతారవణ కాలుష్యం మొదలైన విషయాలలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇది వివరించింది.

మొత్తం మీద వనరుల్ని నిలకడగాను, సమగ్రంగాను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎజెండా భావిస్తోంది. అది తన లక్ష్యాలను ఇలా వివరించింది.

1. వనరుల అత్యుత్తమ వినియోగాన్ని, నిర్వహణను బలపరిచే విధానాలను రూపొందించుకోవడం, ఎప్పటికప్పుడు వాటిని సమీక్షించుకోవడం-ఇది 1996 లోపు జరిగిపోవాలి.

BRAOU

2. ప్రణాళిక, నిర్వహణ, వాటిని బేరీజు వేసుకునే పద్ధతులను మెరుగు పరుచుకోవడం, పటిష్టం చేయడం-2000 లోపు జరిగిపోవాలి.

3. సంస్థల్ని, సమన్వయ యంత్రాంగాలను పటిష్ట పరచడం.

4. నిర్ణయాలు తీసుకోవడంలో దానికి సంబంధించిన వారంతా, ముఖ్యంగా స్థానిక ప్రజలు, సమూహాలు చురుకుగా పాల్గొనడానికి అవకాశం కల్పించే యంత్రాంగాలను ఏర్పరచడం.

III. 'అన్ని సామాజిక బృందాలూ నిబద్ధతతో మనస్ఫూర్తిగా పనిచేస్తేనే ఎజెండా-21లో ప్రభుత్వాలు అంగీకరించిన అన్ని లక్ష్యాలు, విధానాలు, యంత్రాంగాలు సమర్థవంతంగా అమలు కాగలుగుతాయ'ని మూడో భాగం పేర్కొంది. ఈ విషయంలో స్త్రీలు, యువత, స్థానికులు, స్థానిక అధికారులు, ఎన్‌జివోలు, (స్వచ్ఛంధ సంస్థలు) కార్మికులు, కార్మిక సంఘాలు, వ్యాపార పారిశ్రామిక వేత్తలు, శాస్త్ర సాంకేతిక నిపుణులు, రైతులు నిర్వహించగలిగిన కీలకపాత్ర గురించి ఈ భాగంలో వేరు వేరు అధ్యాయాలున్నాయి.

నైరోబీ సదస్సు ఆమోదించిన 'భవిష్యత్ వ్యూహాల'ను దృష్టిలో పెట్టుకుని స్త్రీలకు అన్ని అభివృద్ధి కార్యక్రమాలలో సమానమైన, సంపూర్ణమైన, ప్రయోజనకరమైన భాగస్వామ్యం కల్పించాలని, ఇందుకోసం అన్ని దేశాలూ పెక్కు కార్యాచరణ పథకాలను రూపొందించుకోవాలని ఎజెండా కోరింది. జాతీయ, అంతర్జాతీయ పర్యావరణ వ్యవస్థల నిర్వహణలో వారి భాగస్వామ్యం ఉండేలా చూసుకోమని కూడా చెప్పింది.

'అలాగే ప్రపంచ జనాభాలో యువతరం 30 శాతం ఉంది. ఎజెండా-21 దీర్ఘకాలిక విజయానికి పర్యావరణం, అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో, ఆ కార్యక్రమాల అమలులో వారి పాత్ర ఉండడం చాలా ముఖ్యం' అని ఎజెండా అభిప్రాయపడింది.

'ప్రతి సమస్యకూ మూలం స్థానిక కార్యకలాపాలలో ఉంటుంది కాబట్టి క్రింది స్థాయిలో జరిగే సామాజిక ఉద్యమాలు, ప్రజలు చురుకుగా పాల్గొనే ప్రజాస్వామ్య వ్యవస్థ చాలా ముఖ్యమైనవి. అందువల్ల ప్రభుత్వేతర సంస్థలకు (ఎన్‌జివోలకు), స్థానిక అధికారులకు, కార్మికులకు, కార్మిక సంఘాలకు, రైతులకు ప్రధానపాత్ర ఉంటుంద'ని ఎజెండా పేర్కొంది. అదే విధంగా పర్యావరణం, అభివృద్ధికి సంబంధించి ప్రయోజనకర నిర్ణయాలను తీసుకోగల స్థిరమైన విధానాలు అవసరమని, అటువంటి యంత్రాంగాన్ని అభివృద్ధి చేయడంలో బహుళజాతి సంస్థలతో సహా వ్యాపార, పారిశ్రామిక రంగాలకు, శాస్త్ర సాంకేతిక రంగాలకు ముఖ్యమైన పాత్ర ఉందని ఇది చెప్పింది.

స్థానికంగా పనిచేయడంలోనూ, సృజనాత్మకంగా పనిచేయడంలోనూ ప్రభుత్వేతర సంస్థలకు అనుభవం ఉండడమే కాక సుస్థిరమైన అభివృద్ధి పట్ల ఆసక్తి, ఆ పనులు చేయడంలో సామర్థ్యం కూడా వారికి ఉందని ఎజెండా పేర్కొంది.

IV. ఎజెండాలోని ఈ భాగం ఆర్థికవనరులు, వాటి యంత్రాంగం, పర్యావరణ దృష్ట్యా మేలయిన సాంకేతికపరిజ్ఞానం, సుస్థిర అభివృద్ధికి అవసరమైన వైజ్ఞానిక శాస్త్రం, విద్య మొదలైన వాటిని చర్చించింది. అలాగే వర్థమాన దేశాలలో పర్యావరణ గురించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడం, శిక్షణ ఇవ్వడం, సామర్థ్యాన్ని పెంచడం, అంతర్జాతీయంగా సంస్థాపరమైన ఏర్పాట్లు చేయడం, అంతర్జాతీయ ఒడంబడికలను, యంత్రాంగాలను రూపొందించడం, నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన సమాచారాన్ని అందజేయడం వగైరాల గురించి కూడా ప్రస్తావించింది.

వనరులను ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడానికి అవసరమైన శాస్త్రీయ ప్రాతిపదికను బలోపేతం చేయడం, పర్యావరణం గురించి అవగాహన, సామర్థ్యాలను పెంచడం, సుస్థిర అభివృద్ధికి అనువైన విద్యా విధానాలను రూపొందించుకోవడం మొదలైనవి ఈ భాగం లక్ష్యాలలో కొన్ని. విధానాల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమని ఇది నొక్కి చెప్పింది.



BRAOU

ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమాన్ని (UNEP) బలపరచాలని కూడా ఎజెండా-21 భావిస్తోంది. ఈ కార్యక్రమంలో ఈ కింది అంశాలకు ప్రాధాన్యం ఉండాలని సూచించారు. అవి-ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థల ద్వారా పర్యావరణ కార్యక్రమాలను అమలు జరపడం, పర్యావరణ రంగంలో అంతర్జాతీయ సహకారం, సహజవనరుల లెక్కలు తీసి పథకాలు రూపొందించడం, సంబంధిత శాస్త్రీయ పరిశోధనలు చేపట్టడం, పర్యావరణ పరివేక్షణతోపాటు వీటి ప్రభావం ఎలా ఉందో అంచనా వేయడం, పర్యావరణ సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి కార్యోన్ముఖుల్ని చేయడం, అంతర్జాతీయ పర్యావరణ చట్టాన్ని, సంస్థల్ని రూపొందించడం.

ఇంకా ఈ భాగంలో ఆర్థిక విషయాలు కూడా ఉన్నాయి. పర్యావరణానికి సంపన్న దేశాలు తమ స్థూల జాతీయోత్పత్తిలో 0.7శాతం యివ్వడానికి అంగీకరించడమే కాక వర్ధమాన దేశాలు తమ లక్ష్యాలు సాధించడానికి అవసరమైన నిధుల్ని కూడా ఇస్తామని ఒప్పుకున్నాయి. సుస్థిర అభివృద్ధికి సంబంధించిన పనులు ఎలా జరుగుతున్నదీ తెలుసుకుని, మార్పులు చేర్పులు చేయడానికి ఒక కమిషన్‌ను నియమించాలని కూడా దీనిలో ఉంది.

# 16.5 విధాన ఒడంబడికలు

రియో సదస్సు పర్యావరణ పరిరక్షణ కోసం మూడు అంతర్జాతీయ క్రమబద్ధీకరణ ఒడంబడికలు అవసరమని భావిస్తోంది. అవి: 1) చట్టబద్ధమైన చర్యకు అవకాశం కల్పించే యంత్రాంగం 2) ఆర్థిక క్రమబద్ధీకరణ 3) పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేసే యంత్రాంగం (13,16,17 సూత్రాలు)

## 16.5.1 నష్టపరిహార హక్కు

కాలుష్య కారకుల చేత బాధితులకు ఈ ఒడంబడిక నష్టపరిహారం చెల్లింపజేసే హక్కును యిస్తుంది. నష్టపరిహారానికి సంబంధించిన జాతీయ చట్టాలలోనూ, ఆర్థిక ఒడంబడికలలోనూ ఈ సూత్రాన్ని అంతర్భాగం చేయాలని రియో సదస్సు వక్కాణించింది. కాలుష్యం వల్ల కలిగే సామాజిక నష్టాన్ని కూడా కాలుష్య కారకుల నుంచి పరిహార రూపంలో వసూలు చేయాలనేది దీని ఉద్దేశం.

ప్రకృతికి జరిగిన హానికి సంపన్న దేశాలదే బాధ్యత అని వాతావరణ మార్పుల ఒప్పందం పేర్కొంది. కాబట్టి ఆ నష్టాన్ని సరిచేసేందుకయ్యే ఖర్చును ఆ దేశాలే భరించాలనే అభిప్రాయం వచ్చింది. గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల విషయంలో, జన్యుమార్పులకు గురయిన జీవరాశి వల్ల కలిగిన హాని విషయంలో (జీవవైవిధ్య ఒప్పందంలోని 8 (జి), (హెచ్) అధికరణం) కూడా నష్టపరిహార బాధ్యత సంపన్న దేశాలదేనని తేల్చి చెప్పాయి.

భారత ప్రభుత్వం 'జీవించే హక్కును ప్రాథమిక హక్కు'గా గుర్తించిన రాజ్యాంగంలోని 21వ అధికరణంలోనే పర్యావరణ హక్కుల్ని కూడా చేర్చింది. పర్యావరణ (పరిరక్షణ) చట్టం-1986 సెక్షన్-6 ద్వారా, హానికర వ్యర్థ పదార్థాల (నిర్వహణ, నిర్మూలన) నిబంధనలు-1989 ద్వారా, నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం-1974 సెక్షన్ 24(i), 25 (i) ల ద్వారా, వాయు (కాలుష్య) నివారణ, నియంత్రణ చట్టం-1981 ద్వారా ఈ హక్కులకు చట్టరూపం కల్పించింది. రియో సదస్సు తర్వాత 'కాలుష్య కారకులు పరిహారం చెల్లించాల్సిన' సూత్రాన్ని, 'ముందు జాగ్రత్త' సూత్రాన్ని చట్టంలో అదనంగా చేర్చారు.

## 16.5.2 సమాచార హక్కు

జరిగిన నష్టాన్ని లేదా జరగబోయే నష్టాన్ని గురించి సమాచారం పొందే హక్కు అందరికీ ఉందని రియో సదస్సు



BRAOU

గట్టిగా అభిప్రాయపడింది. సరిహద్దుల్ని కూడా దాటిపోయే పర్యావరణ హాని గురించి సమాచారంతో కూడిన నోటిఫికేషన్ చాలా అవసరమని అది భావించింది.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు లేదా పర్యావరణంపై ఆకస్మిక హానికర ప్రభావాన్ని చూపగల అత్యవసర పరిణామం ఏర్పడినపుడు దేశాలు వాటి ప్రభావానికి లోను కాగల ఇతర దేశాలకు ఆ విషయాన్ని వెంటనే తెలియజేయాలని 18వ సూత్రం పేర్కొంది. 19వ సూత్రం దీన్ని మరింత విశదీకరించింది. తమ కార్యక్రమాల ప్రభావం బయట దేశాలమీద తీవ్రంగా ఉంటుందనుకున్నప్పుడు ఆ దేశాలకు ముందుగానే అవసరమైన సమాచారాన్ని అందజేయాలని, సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేయాలని ఈ సూత్రం చెప్పింది.

జీవ వైవిధ్య ఒప్పందంలోని 14 (1), (సి), (డి), (ఇ) అధికరణం ప్రకారం కూడా బయట దేశాల జీవవైవిధ్యానికి హాని కలగజేసే అవకాశమున్న కార్యక్రమాల గురించి దేశాలు ఆయా దేశాలతో చర్చించాలి, సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలి.

కాలుష్యాన్ని నివారించడం, నియంత్రించడంతో పాటు కాలుష్యానికి సంబంధించిన సమాచారాన్ని అందజేయడం కోసం కూడా భారత ప్రభుత్వం కాలుష్య నియంత్రణ బోర్డుల్ని ఏర్పాటు చేసింది. నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం, 1974 ప్రకారం ఏర్పాటయిన ఈ బోర్డులు కాలుష్యాన్ని నిర్ధారించడానికి కొన్ని శాస్త్రీయమైన ప్రమాణాల్ని నెలకొల్పాయి. స్వతంత్ర ప్రతిపత్తిగల ఈ బోర్డులు ప్రభుత్వానికి సలహాదారుగా పనిచేస్తాయి. ఇవి రాష్ట్ర స్థాయిలో పనిచేసినా వీటికి అధికారాలు కేంద్రప్రభుత్వం ద్వారా సంక్రమిస్తాయి. పర్యావరణాన్ని కలుషితం చేసే వ్యర్థ పదార్థాలను విడుదల చేసే పరిశ్రమల మీద ఒత్తిడి తేవడానికి సి.ఆర్.పి.సి. లోని సెక్షన్ 133 వీటికి ఉపయోగపడుతుంది.

## 16.5.3 పర్యావరణ ప్రభావాన్ని బేరీజు వేయడం–కాలుష్యం నుంచి రక్షణ పొందే హక్కు

BRAOU

పర్యావరణం మీద హానికర ప్రభావాన్ని చూపగల కార్యకలాపాలను అనుమతించాలా వద్దా అని నిర్ణయించడానికి ఈ ఒడంబడిక ఉపయోగపడగలదని రియో ప్రకటనలోని 17వ సూత్రం అభిప్రాయ పడింది. విధానాల రూపకల్పనలో వాతావరణ మార్పుల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని వాతావరణ మార్పుల ఒప్పందం లోని 14 (1) (ఎఫ్) అధికరణం చెపుతోంది. జీవవైవిధ్యం మీద హానికర ప్రభావం చూపగల ప్రాజెక్టులను కూడా ఈ ఒడంబడిక ప్రకారం బేరీజు వేయాలని, అందుకు తగిన నియమాలను ప్రవేశపెట్టాలని జీవ వైవిధ్య ఒప్పందంలోని 14వ అధికరణం పేర్కొంది. ఈ పనిలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని కూడా అది అభిప్రాయపడింది.

ఇటీవలి కాలంలో 'నీరి' (నాగపూర్‌లోని జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ) వివిధ ప్రాజెక్టులకు 'పర్యావరణ ప్రభావ అంచనా'లను తయారుచేస్తున్నది. 'నీరి' నివేదికల ఆధారంగా కొన్ని పరిశ్రమలను కోర్టులు మూసివేసాయి కూడా.

## 16.6 ఆర్థిక యంత్రాంగం

వాతావరణ మార్పుల ఒప్పందంలోని 11వ అధికరణం, జీవవైవిధ్య ఒప్పందంలోని 21 (1) అధికరణం గ్రాంటుగా గాని, రాయితీలుగా గాని నిధుల్ని సమకూర్చుకునే యంత్రాంగాన్ని ఒకదాన్ని నిర్వచించాయి. ఒప్పందం ప్రకారం ఏర్పడే సభ్యుల సంస్థకు ఇది జవాబుదారీగా ఉంటుంది. నిధుల సేకరణ, ఖర్చుకు సంబంధించిన విధానాల్ని, వ్యూహాల్ని, కార్యక్రమాలను, ప్రాధాన్యాల్ని, అర్హత ప్రమాణాలను ఈ సంస్థే నిర్ణయిస్తుంది. మొత్తం ఆర్థిక యంత్రాంగం ప్రజాస్వామికంగా,

పారదర్శకంగా పని చేయాలని ఎజెండా-21 భావిస్తోంది.

ప్రపంచ బ్యాంకు, ఎన్‌డిపి, యుఎన్‌ఇపి కలిసి ప్రపంచపర్యావరణ నిధి సౌకర్యాన్ని (జిఇఎఫ్) నెలకొల్పాలని వాతావరణ మార్పుల ఒప్పందంలోని 21వ అధికరణం, జీవవైవిధ్య ఒప్పందంలోని 39వ అధికరణం భావిస్తున్నాయి.

అభివృద్ధికి ఇచ్చే అధికారిక సహాయాన్ని స్థూల జాతీయోత్పత్తిలో 0.7 శాతం ఉండేలా పెంచితే నిధులు రెట్టింపు స్థాయిలో లభ్యమవుతాయి. 5500 కోట్ల డాలర్ల నుంచి 11000 కోట్ల డాలర్లవుతాయని అంచనా. బ్యాంకులకు వర్ధమాన దేశాలు చెల్లించాల్సిన రుణాలు 20,000 కోట్ల డాలర్లదాకా ఉంటే వాటిని తగ్గించాలని, అలాగే ఆర్థిక సంస్థలకు చెల్లించాల్సిన రుణాలు 4000 కోట్ల డాలర్లు దాటని పక్షంలో వాటిని మాఫీ చేయాలని ఒక సూచన వచ్చింది.

దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలకు 3000 కోట్ల డాలర్లు అవసరమని అంచనా వేసి అందులో సగం బయటినుంచి సహాయంగా అందచేయాలని నిర్ణయించారు. జనాభా నియంత్రణ చర్యలకు 450కోట్ల డాలర్లు అవసరమని అంచనా వేశారు కాని 80 శాతం ఖర్చును వర్ధమాన దేశాలే భరించాలని నిర్ణయించారు. అయితే జనాభా పర్యావరణాల సమగ్ర పథకానికి అవబోయే 700 కోట్ల డాలర్ల ఖర్చులో సగం సంపన్న దేశాలే పెట్టుకోనున్నాయి.

ఎజెండా-21లోని అన్ని కార్యక్రమాలకు ఇలాంటి అంచనాలు, బయటి సహాయం వాటా నిర్ణయమై ఉన్నాయి.

## 16.7 ద ఫ్లామింగో పార్క్: ఎన్‌జివోల సమావేశం

వివిధ పర్యావరణ సమస్యల గురించి చర్చించడానికి అనేక ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జివోలు) ఫ్లామింగో పార్క్‌లో విడిగా సమావేశ మయ్యాయి. వీటిలో ఓషో ఆధ్యాత్మికారోగ్య సంస్థ మొదలుకొని ఆరోవిలి, గ్రీన్ పీస్, అంతర్జాతీయ టిబెట్ ప్రచార సంస్థ, ప్రపంచ బ్యాంకు దాకా రకరకాల సంస్థలున్నాయి. సహజంగానే విభిన్న అభిప్రాయాలు, దృక్పథాలు వ్యక్తమయ్యాయి. క్రియాశీల పర్యావరణ సంస్థల చొరవతో ప్రత్యామ్నాయ ఒప్పందాలకు అవసరమైన ప్రక్రియల గురించి చర్చ జరిగింది. ప్రభుత్వాల సమావేశం కూడా చర్చించని 'సైనిక చర్యలు-పర్యావరణం' వంటి అంశాలు సైతం యిక్కడ చర్చకు వచ్చాయి. ఎన్‌జీవోలు చర్చించిన మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే ఆదివాసీ జీవితాలు-వారి ప్రయోజనాలు ఎలా నిర్లక్ష్యానికి గురవుతున్నాయనేది.

BRAOU

ప్రభుత్వాలను నిలదీయడానికి, వాటి చర్యలమీద విమర్శనాత్మకంగా మాట్లాడడానికి, ప్రత్యామ్నాయ ఎజెండాను రూపొందించడానికి ఎన్‌జీవోలకు ఈ వేదిక చాలా ఉపయోగపడింది. ప్రభుత్వ సమావేశం యాంత్రిక చర్చలతో సాగితే, ప్రభుత్వేతర సంస్థల సమావేశం మాత్రం 'ప్రజల మధ్య సరిహద్దుల్ని చెరిపేసి నిజమైన సహకారం' నెలకొనే రోజు వస్తుందని ఆశయ ప్రకటన చేసింది.

'సుస్థిర అభివృద్ధి' భావనను కొన్ని ఎన్‌జివోలు తీవ్రంగా విమర్శించాయి. భూమిమీద, భవిష్యత్ తరాలమీద పడుతున్న భారాన్ని ఈ భావన గుర్తించడం లేదని వారు వాదించారు. ఈ వేదిక లేవనెత్తిన అనేక ప్రశ్నలు ఇలాగే చాలా వివాదాస్పద విషయాలయ్యాయి.

## 16.8 విభేదాంశాలు

పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన ఎజెండా-21 సమర్థవంతంగా అమలు కావాలంటే అనేక అంశాలను ముందుగా పరిష్కరించాల్సి ఉంటుంది. రియో సదస్సు మీద వర్ధమాన దేశాలకు ఎన్నో అనుమానాలున్నాయి. దీన్ని సాకుగాతీసుకుని

తమ అభివృద్ధిని అడ్డుకుంటారనే భయం వారికి ఉంది. అలాగే పర్యావరణ నెపంతో తమ విధానాలలో సంపన్న దేశాలు జోక్యం చేసుకుంటాయనే అనుమానం కూడా వారికి ఉంది. అప్పుడు తమ సార్వభౌమత్వానికీ ముప్పు వాటిల్లుతుందనుకుంటున్నారు. ఆర్థిక యంత్రాంగం ఏర్పాటును వారు తమకు జరిగిన మరో అన్యాయంగా భావిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు ద్వారా పనిచేసే ఈ యంత్రాంగంలో అందరికీ సమాన ఓట్లు లేవు. 'ప్రపంచ పర్యావరణ నిధి సౌకర్యం' (జిఇఎఫ్) లో ఏ దేశానికి ఎన్ని వాటాలుంటాయో దాన్ని బట్టి ఈ ఓట్లు నిర్ణయింపబడతాయి. దీనివల్ల సంపన్న దేశాలకు ఎక్కువ అధికారాలు లభిస్తే, వర్థమాన దేశాలు సమానత్వ హక్కును కోల్పోతాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తి అపహాస్యమవుతుంది.

రియో సదస్సు లక్ష్యాలకూ, ప్రపంచ వాణిజ్య సంస్థ రూపంలోని నూతన ఆర్థిక వ్యవస్థకూ స్పష్టమైన వైరుధ్యం ఉందని కొన్ని పర్యావరణ కార్యకర్తల సంఘాలు వేలెత్తి చూపాయి. నిబంధనలను తొలగించడం వాణిజ్య సంస్థ షరతుల్లో ముఖ్యమైనదైనపుడు పర్యావరణ నష్టాన్ని నియంత్రించడానికి ప్రభుత్వాలు ఎటువంటి కఠిన నిబంధనలను అమలు జరపలేక పోతాయని వారు చెప్పారు. సబ్సిడీల రద్దు వల్ల పెట్టుబడి దొరకడం కష్టమైపోయి, పర్యావరణానికి నష్టం చేయని సాంకేతిక పరిజ్ఞానాన్ని వర్థమాన దేశాలు అభివృద్ధి చేసుకోవడం అసాధ్యమని వారు చెప్పారు. మేధో హక్కుల కారణంగా ఈ పరిజ్ఞానం సంపన్న దేశాల నుండి వర్థమాన దేశాలకు బదిలీ కావడం కూడా కష్టమై పోయిందని గుర్తు చేశారు. ఇప్పుడు గాట్, ఎజెండా-21 అనే రెండు పరస్పర విరుద్ధ విధానాలను వర్ధమాన దేశాల మీద రుద్దారని అభిప్రాయపడ్డారు. జీవవైవిధ్య ఒప్పందం లాంటి ముఖ్యమైన ఒప్పందాల మీద అమెరికా ఇంతవరకు సంతకం పెట్టకపోవడం మరో గమనార్హమైన విషయం

## 16.9 ప్రత్యామ్నాయం

BRAOU

పర్యావరణ సమస్యల పట్ల రియో సదస్సు అనుసరించిన వైఖరిలో ప్రధాన లోపం దాని స్వేచ్ఛా విపణి (Free Market) సిద్ధాంత చట్రం. వినిమయం పెరిగే కొద్దీ సౌఖ్యం పెరుగుతుందనే ఈ ధోరణివల్ల సంపదనే సౌఖ్యంగా భావించే వస్తు వ్యామోహ సంస్కృతి దృష్టితో నిర్ణయాలు తీసుకుంటారు.

పర్యావరణానికి జరిగే నష్టానికి పరిహారం చెల్లించే సదుపాయంకూడా అన్యాయమైనదే. ఈ పరిహారాన్ని కోర్టుల్లో సంబంధిత వ్యక్తులో నిర్ణయించవచ్చు కానీ వ్యక్తుల ఆరోగ్యహక్కు, కాలుష్య రహిత జీవన హక్కు కొనుగోలు చేయగల హక్కులుగా భావించడం ఎంత ప్రమాదం. మానవ హక్కులకు, గౌరవానికి ఇవి భంగకరమైన విషయాలు. ఇంత విలువైన హక్కులను మార్కెట్ వస్తువులుగా మార్చడం స్వేచ్ఛకు తీవ్రమైన అపచారం అవుతుంది. తీవ్ర అసమానతలు పెత్తందారీ నిర్మాణాలను బలోపేతం చేసే సందర్భంలో మాత్రమే హక్కుల్ని ఈ విధంగా కాల రాయడం సాధ్యమవుతుంది. మానవ హక్కుల ఉద్యమంలోని ఇతర విముక్తి లక్ష్యాలకు, పర్యావరణానికి సంబంధం ఇక్కడే కనిపిస్తుంది.

ప్రత్యామ్నాయం కోసం జరిగే ప్రయత్నంలో ఈ హక్కులకు తగిన స్థానం ఇవ్వడం చాలా అవసరం. పర్యావరణ సమస్యల పరిష్కారంలో మౌలిక అంశాలుగా గుర్తించాల్సింది 1) మనుగడ 2) సమూహం. దీన్ని మానవ హక్కుల భాషలోకి అనువదించి చెప్పాలంటే-

I. ప్రజల వాస్తవ పరిస్థితులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ ఒత్తిడులకు లొంగి వారు తమ హక్కుల్ని వదులుకుంటున్నారో గుర్తించాలి.

II. పర్యావరణ పరిధిని ప్రకృతి అన్ని పార్శ్వాలకూ వర్తించేలా విస్తృత పరచాలి. దాని సంరక్షణలో సామూహిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.

## 16.10 ముగింపు

రియో సదస్సు పర్యావరణం కంటే ఆర్థిక వ్యవస్థ మీద ఎక్కువ దృష్టిని కేంద్రీకరించిందనే అభిప్రాయం ఉంది.

సంపన్న దేశాలు, ముఖ్యంగా అమెరికా ఈ సదస్సు ఉద్దేశ్యాన్నే దెబ్బతీశాయి. ప్రత్యామ్నాయం గురించి ఆలోచించకుండా గాట్‌లోని కొన్ని అంశాలను మళ్లీ ఒప్పందంగా తీసుకువచ్చారనే విమర్శ ఉంది. వాణిజ్య ఒప్పందాలకు కూడా రియో సదస్సును వాడుకున్నందువల్ల పర్యావరణ సమస్యలకు చెప్పుకోదగ్గ పరిష్కారాలను యిది సాధించలేక పోయిందని భావిస్తున్నారు.

అన్ని జీవరాశుల ఆరోగ్య జీవన హక్కుకు గుర్తింపు లభించాలంటే చర్చా దృక్పథంలో చాలా మార్పు అవసరం. రియో ప్రాపంచిక దృక్పథంలోని పరిమితులు దాని ఎజెండాని నిర్దేశిస్తున్నాయి. రియో సదస్సు స్వేచ్ఛా మార్కెట్ చట్రంలో ఒక ముందడుగే. అయితే మార్కెట్ చట్రానికి ఉండే హ్రస్వదృష్టి కారణంగా, దానిమీదే ఆధారపడటం పర్యావరణ పరిరక్షణకు వినాశకరం కాగలదు. విపరీతమైన పేదరికంలో ఉన్న బ్రెజిల్ వంటి రుణ గ్రస్త దేశంలోని ఒక రైతుకు గానీ కూలీకిగానీ మార్కెట్ దృక్కోణం సూచించే స్వల్ప కాలిక పరిష్కారం అడవుల నరికివేతే కావచ్చు. బాకీల వసూలు విషయంలో ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మార్కెట్ దృక్కోణంలో హేతుబద్ధంగా కనిపించే స్వల్పకాలిక దృష్టితో పెడుతున్న ఒత్తిడి పరోక్షంగా అటువంటి దేశాలలో అడవుల విధ్వంసానికి దారి తీస్తుందని చెప్పవచ్చు.

ధరలు పెరిగినప్పుడు పెట్టుబడిదారులు కొత్త సాంకేతిక ఆవిష్కరణ చేపడతారని చరిత్ర తెలియ జేస్తుందనేది సత్యమే. కానీ ఈ కొత్త సాంకేతిక ప్రక్రియలు అందరికీ మేలు చేస్తాయనేది రుజువయిన సత్యమేమీకాదు. స్వేచ్ఛను కేవలం ఒక పరికరంగా చూడడం వల్ల మార్కెట్ దృక్పథం సాంకేతిక ఆవిష్కరణల ప్రయోజనాన్ని చాలా పరిమితం చేస్తుంది. సాంకేతిక ఆవిష్కరణను 'ఉపయోగం' అనే కోణం నుండి చూడకుండా, మనుషులందరి సుఖ సౌఖ్యాల కోసం ప్రకృతితో సాధించే సంఘర్షించి ఉన్నత స్థాయి సమతుల్యాన్ని ప్రక్రియగా చూసినట్టయితే అదనపు ఉత్పత్తి కోసం ప్రకృతిని దోచుకునే వైఖరి స్థానంలో స్వేచ్ఛను మరింత పెంచుకునే వైఖరిని అలవరచుకోవచ్చు. ఈ వైఖరిలో స్వేచ్ఛ దానంతటదే విలువయిన విషయం. ఈ రకంగా చూసినప్పుడు సాంకేతిక ప్రక్రియలు కేవలం ఆర్థిక విషయాలు కావనీ సాంస్కృతిక విషయాలనీ అర్థం అవుతుంది. సాంకేతిక ప్రక్రియలకూ ప్రకృతికీ మధ్యనున్న సంబంధాన్ని తిరగరాయాలని చూస్తున్న పర్యావరణ ఉద్యమం, భౌతిక ప్రపంచానికీ ప్రత్యామ్నాయ సాంస్కృతిక దృక్కోణానికీ మధ్య వారధి నిర్మించే మానవ హక్కుల చైతన్య కోణానికి ప్రతినిధి అని అర్థం చేసుకోవచ్చు.

ప్రస్తుతం ఉనికిలో ఉన్న మార్కెట్ దృక్కోణం పర్యావరణాన్ని వాడకపు దృష్టితో చూస్తుంది కాబట్టి మనుషులకు ఎంత ఉపయోగపడుతుందనేదే ప్రపంచానికి ఉండే విలువ అని అది భావిస్తుంది. ఇది వినాశకరమైన వైఖరి. ప్రపంచంలోని ఇతర ప్రాణుల హక్కులనిది గుర్తించదు. పైగా, భవిష్యత్ తరాలు ఏం కోరుకుంటాయో తెలీదు కాబట్టి ప్రపంచానికి వారు ఇయ్యబోయే విలువ ఇప్పటి విలువలో ఇమిడి ఉందనుకోవడం అర్థరహితం. కాబట్టి స్వేచ్ఛా విపణిలో జరిగే ఒప్పందమూ ఏకపక్షమైనదే. అందులో ప్రస్తుత పరిస్థితుల ఒత్తిడులకు గానీ భవిష్యత్ తరాల హక్కులకుగానీ చోటులేదు.

పర్యావరణానికి హానికరమైన ఉత్పత్తులనూ వ్యర్థ పదార్థాలనూ పేద దేశాలకు తరలించడం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని పటాన్‌చెరువు ప్రాంతంలో, పాశ్చాత్య దేశాలలో నిషేధించిన మందులను ఉత్పత్తి చేస్తుండడం దీనికొక నిదర్శనం. అసమానత్వం వల్ల బలహీన వర్గాలనూ ప్రకృతినీ దోచుకోవడం విపరీతంగా పెరుగుతుంది.

వర్తక వాణిజ్యాల చట్రంలో దేశాల మధ్య సంబంధాలు ఏర్పరచుకుంటున్న ప్రస్తుత పరిస్థితులలో అభివృద్ధి చెందిన దేశాలకూ వర్ధమాన దేశాలకూ మధ్య పరస్పర విశ్వాసం, నమ్మకం కొరవడ్డాయి. పర్యావరణ సమస్యల పేరుమీద వర్ధమాన దేశాలు నిధులు పొందాలని చూస్తుండగా కాలుష్యం పేరుమీద నిషేధాలూ పరిమితులూ ప్రయోగించి తమ వాణిజ్య గుత్తాధిపత్యాన్ని సాగించుకోవాలని అభివృద్ధి చెందిన దేశాలు చూస్తున్నాయి. సారాంశంలో పర్యావరణ సమస్యలు అవ్యక్తంగానే ఉండి పోతున్నాయి.

మానవ హక్కుల కోణం నుండి చూసినప్పుడు పర్యావరణాన్ని గౌరవించని పెరుగుదల ప్రకృతి మీద ప్రజలమీద హింసను ప్రయోగించే ప్రక్రియగా కనిపిస్తుంది. రియో సదస్సులో ఇటువంటి ముఖ్యమైన ప్రశ్నలకు చోటులేకుండా పోయింది.

BRAOU

అసమానతల మీద ఆధారపడ్డ అభివృద్ధి నమూనాలు సమాజంలో ఉన్న అసమానతల కారణంగా వర్ధిల్లుతాయి. దీనికి విరుగుడు సహకార దృక్పథంలో ఉంది. అయితే మనిషినీ ప్రకృతినీ కలుపుకునే పర్యావరణ కేంద్రమైన దృక్పథం ఉంటేనే అదిసాధ్యం అవుతుంది. కాలుష్యం లేని పర్యావరణంతో సహా సకల మానవ హక్కుల లేమికీ కారణం దోపిడీ, పెత్తందారీ వ్యవస్థలలో ఉంది. కాబట్టి పర్యావరణ సమస్యలకు పరిష్కారం ప్రభుత్వాలు బహుళపక్షంగా చేసుకునే వాణిజ్య ఒప్పందాలకంటే ప్రజల ప్రజాతంత్ర, సమానతా పోరాటాలలో ఉంది.

పర్యావరణ విలువలు మార్కెట్ ప్రయోజనాలను ప్రకృతికి లోబరుస్తాయి, భవిష్యత్ తరాల ప్రయోజనాలను గుర్తిస్తాయి. అయితే పర్యావరణ వాదులు మానవ నాగరికతా విజయాలను లెక్కలోకి తీసుకోకుండ ప్రకృతిని తమ నమూనాగా తీసుకొని (వెనక్కి తిరిగి ప్రకృతి సిద్ధమైన జీవితంలోకి పోతామని) వాదించడం సరయినది కాదు. స్వేచ్ఛ విపణి సిద్ధాంత వేత్తలు మనిషికీ ప్రకృతికీ మధ్య తమ నమూనాకంటే భిన్నమైన సంబంధాలు ఉండగలవని గుర్తించకుంటే తమ నమూనాయే 'సహజం' అనడం తప్పయినట్టే ఇది కూడ తప్పు. ఒక సమాజంలో ప్రచారంలో ఉండేవైఖరిలో సామాజిక, రాజకీయ, ఆర్థిక చారిత్రక సందర్భాన్ని బట్టి ఉంటాయి. కాబట్టి అన్ని రకాల పెత్తందారీ వ్యవస్థలనూ నిర్మూలించినప్పుడే అభివృద్ధికీ ప్రకృతికీ మధ్య నున్న వైరుధ్యాన్ని పరిష్కరించి మనిషికీ ప్రకృతికీ మధ్య ఆరోగ్యకరమైన సంబంధాన్ని నెలకొల్పడానికి కావలసిన పరిస్థితులు ఏర్పడతాయి. ఆ నేపథ్యంలో మాత్రమే మానవ హక్కుల భావనలో భాగంగా పర్యావరణ హక్కులకు నిర్దిష్టమైన స్థానం ఉండగలదు.

## 16.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1. 'రియో సదస్సు ఆమోదించిన ఒప్పందాలు, ఎజెండా మానవ హక్కుల పరిధిని విస్తృత పరిచాయి' - వివరించండి.
2. మానవ హక్కుల దృక్పథం నుంచి చూసినప్పుడు రియో చర్చనీయాంశాల చట్రానికి ఉన్న పరిమితులేమిటి? పర్యావరణ సమస్యల పరిష్కారానికి అవలంభించగల ప్రత్యామ్నాయ పద్ధతులేమిటి?
3. రియో సదస్సు యొక్క లోపాలను ఎత్తి చూపుము.

BRAOU

## 16.12 చదవదగిన పుస్తకాలు


1. Akshay jaitly and Pradipto Ghosh (ed) (1993)
   *The Road from Rio,* Tata Energy Research Institute, New Delhi
2. (1992); Agenda-21; *Rio Declaration, united nations conference on environment and development*, Rio-De Jamiero
3. Daniel Headrick (1988): *Tentacles of Progress,* Oxford University Press; New York
4. David Moberg (1991): *"Environments and the markets",* Dissent, pp. 511-20.
5. John Bellamy Foster (1195): *The Vulnerable Planet: A Short Economic History of the Environment,* Monthly Review Press, New York.

# భాగం 17: బీజింగ్ ప్రపంచ మహిళా సదస్సు 1995

విషయక్రమం


17.0 ఉద్దేశం

17.1 పరిచయం

17.2 స్త్రీల పరిస్థితి: ప్రపంచ దృశ్యం

17.3 బీజింగ్ సదస్సు: ముఖ్య సమస్యలు

17.3.1 ఆందోళనకర విషయాలు

17.3.2 లక్ష్యాలు-మార్గాలు

17.4 బీజింగ్ సదస్సు:కార్యాచరణ వేదిక

17.4.1 స్త్రీలకు స్వాధికారం

17.4.2 స్త్రీల హక్కులు: హింస, వివక్ష

17.4.3 స్త్రీల హక్కులు: అభివృద్ధి నమూనా

17.4.4 స్త్రీల హక్కులు : స్వేచ్ఛ, సమానత్వం

17.4.5 స్త్రీలు-పర్యావరణం

17.5 బీజింగ్ సదస్సు-భారతీయ ఎజెండా

17.6 కార్యాచరణ వేదిక : విమర్శనాత్మక విశ్లేషణ

17.7 బీజింగ్ సదస్సు: ఎన్జీవో ఫోరం

17.8 స్త్రీల పట్ల వివక్ష నిర్మూలనకు ఒప్పందం

17.9 ముగింపు

17.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

17.11 సంప్రదింపు గ్రంథాలు


BRAOU

## 17.0 ఉద్దేశం

**ముఖ్యంగా మూడు విషయాలు చెప్పడం ఈ పాఠం ఉద్దేశం. అవి-**

- ప్రపంచంలో స్త్రీల పరిస్థితి ఎలా ఉందో, వారు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలేమిటో స్థూలంగా పరిచయం చేయడం.
- బీజింగ్ సదస్సుకు ముందు స్త్రీల అభ్యున్నతికి అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కృషిని, వెలువడిన పత్రాలను క్లుప్తంగా వివరించడం
- బీజింగ్ సదస్సు ఆమోదించిన కార్యాచరణ వేదికలోని అంశాలను తెలియజేయడంతో పాటు దానిని విమర్శనాత్మకంగా విశ్లేషించడం.

## 17.1 పరిచయం

అంతర్జాతీయ మహిళా ఉద్యమ చరిత్రలో 1975 సంవత్సరానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. అది అంతర్జాతీయ మహిళా సంవత్సరమే కాక అంతర్జాతీయ మహిళా దశాబ్దపు ఆరంభ సంవత్సరం కూడా. బీజింగ్ వైపు తొలి అడుగు వేసింది అప్పుడే. ఆ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి మెక్సికో నగరంలో మొదటిసారిగా ప్రపంచ మహిళా సమావేశాలను నిర్వహించి బీజింగ్‌కి నాంది పలికింది. రెండో సారి సమావేశాలు 1980లో కోపెన్‌హాగన్‌లో జరిగాయి. దానిలోనే మహిళల అభివృద్ధికి అంతర్జాతీయ స్థాయిలో మొదటి కార్యాచరణ ప్రణాళిక (Programme of Action) రూపొందింది. ప్రభుత్వేతర సంస్థలకు (ఎన్‌జివోలకు) మొదటిసారి వేదిక లభించింది కూడా యిక్కడే. దీనివల్ల అనేక నెట్‌వర్క్‌లకు సావకాశం ఏర్పడింది. 1985లో కెన్యాలోని నైరోబిలో మూడో సమావేశాలు జరిగేనాటికి ఈ నెట్ వర్క్‌లు చాలా విస్తరించాయి. ఎన్‌జివో వేదిక కూడా విస్తృతమై ఎందరినో కలుపుకుంది. ఇక్కడ జరిగిన చర్చలలో స్త్రీలు తమ జీవితాలను ప్రభావితం చేస్తున్న అనేక సమస్యల మీద కొత్త దృక్పథాలను వినిపించారు. ఇవే భవిష్యత్ వ్యూహాలు (Forward Looking Strategies) అనే పేరుతో ఒక పత్రంగా వెలువడ్డాయి.

అంతర్జాతీయ మహిళా ఉద్యమంలో కనిపించే క్రియాశీలతకు, సృజనాత్మకత, వైవిధ్యాలకు ఈ సమావేశాలు, ఎన్‌జివో వేదిక రెండూ సారవంతమైన భూమికను కల్పించాయి. ఈ నేపథ్యంలో నాలుగవ ప్రపంచ మహిళా సదస్సు 1995 సెప్టెంబర్‌లో చైనా రాజధాని బీజింగ్‌లో జరిగింది.

ప్రపంచ సమావేశాలకు మొత్తం 189 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. వీరంతా కలిసి కార్యాచరణ వేదిక (Platform for Action) నొకదాన్ని రూపొందించారు. అన్ని దేశాలనూ దృష్టిలో పెట్టుకుని రచించిన దీర్ఘకాలిక లక్ష్యాల సమాహారం ఇది. 2000 సంవత్సరం వరకు అనుసరించాల్సిన విధానాలకు, ప్రణాళికలకు ఇది ప్రాతిపదిక పత్రం లాంటిది. బీజింగ్ సదస్సు కోసం జరిగిన అన్ని ఏర్పాట్లలోను, బీజింగ్ సదస్సులోను తరచూ వినబడిన కీలకమైన పదం ఒకటుంది. ఆ పదం పేరు 'ప్రక్రియ' (Process) (ప్రాసెస్). కిందినుంచి పై వరకు ప్రతి విషయంలోను 'ప్రక్రియ'కు చాలా ప్రాధాన్యం యిచ్చారు. ఇది స్త్రీలను, స్త్రీల సంఘాలను శక్తివంతం చేయగల చర్యగా, వారి మధ్య సహకారాన్ని పెంపొందించగల చర్యగా భావించారు. ప్రక్రియ పట్ల శ్రద్ధ వహించినందువల్ల బీజింగ్ సమావేశాల ఎజెండాను నిర్ణయించడంలోను, కార్యక్రమాలను రూపొందించడంలోను ప్రపంచమంతటి నుండి ఎక్కువమంది స్త్రీలు నిజమైన అర్థంలో పాల్గొనగలిగారు. వారు పాల్గొనే వీలు కోసం అనేక కొత్త నిర్మాణాలను, పనిముట్లను, సంస్థాగత ఏర్పాట్లను కూడా రూపొందించారు. వీటిని అవకాశంగాతీసుకుని జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లో మహిళలు-వెనకబడిన స్త్రీలు, యువతులు, వృద్ధులు, బాలికలతో సహా- అందరి గొంతులూ వినబడేలా ఉద్యమాలను నిర్మించగలిగారు. ప్రపంచ స్థాయిలో చెప్పాలంటే స్త్రీలు ఐక్యరాజ్యసమితి వ్యవస్థ మీదే చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపగలిగారు. ఐక్యరాజ్య సమితి, తర్వాత అనేక అధికార బృందాలలో మహిళా కార్యకర్తలను చేర్చుకోవడం దీని ఫలితమే.

BRAOU

## 17.2 స్త్రీల పరిస్థితి: ప్రపంచ దృశ్యం

బీజింగ్ సదస్సు వివరాల్లోకి వెళ్లేముందు ఆ సదస్సునాటికి ప్రపంచ వ్యాప్తంగా, స్త్రీల పరిస్థితి ఎలా ఉందో క్లుప్తంగా తెలుసుకుందాం.

1. మొత్తం శ్రమలో స్త్రీల వాటా 60 శాతం ఉంటేమొత్తం భూమిలో వారు యాజమాన్యం వహిస్తున్నది ఒక్క శాతానికి మాత్రమే. ప్రపంచ ఆదాయంలో కూడా వారి వాటా కేవలం పదిశాతం.

2. ప్రపంచంలో వందకోట్ల మంది దాకా పేదలుంటే వారిలో దాదాపు 60 శాతం మంది స్త్రీలే. అంతే కాదు, మళ్లీ వారిలోని నిరుపేదలలో స్త్రీల శాతం 70 దాకా ఉంది.

3. స్త్రీలు చేసే ఇంటిచాకిరి, పిల్లల సంరక్షణ, వ్యవసాయం తదితర శ్రమలను లెక్కలోకి తీసుకోక పోవడం వలన, వాటికి వేతనం ఇవ్వక పోవడం వలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి ఏటా 11 వేల కోట్ల అమెరికన్ డాలర్ల విలువైన వనరులు జమ కాకుండా పోతున్నాయి.

4. ఏ దేశంలోనూ స్త్రీలకు సమానపనికి సమాన వేతనం లభించడం లేదు. (ఒకే రకమైన పనికి స్త్రీలకు పురుషుల కంటే సగటున 30-40 శాతం తక్కువ లభిస్తోంది).

5. దాదాపు అన్ని దేశాలలో స్త్రీలు పురుషుల కంటే ఎక్కువ గంటలు పనిచేస్తారు. ఇంటి పనులు, మార్కెట్ పనులు కలిపి చూస్తే వారు పురుషుల కంటే 12 శాతం ఎక్కువ సమయం పని చేస్తారు.

6. వర్ధమాన దేశాలకు చెందిన గ్రామీణ స్త్రీలు నీళ్లు, వంటచెరకు తేవడానికి పురుషుల కంటే పదిరెట్లు ఎక్కువ గంటలు పనిచేస్తారు. (పురుషులు 0.9 గంటలు పనిచేస్తే స్త్రీలు 9.7 గంటలు పనిచేస్తారు).

7. వర్ధమాన దేశాల ఆహారోత్పత్తిలో సగం స్త్రీలే చేస్తారు.

8. భారతదేశంలో 75 శాతం వరినాట్ల పని, 60 శాతం కోతల పని, 33 శాతం నూర్పిళ్లపని స్త్రీలే చేస్తారు.

9. ప్రపంచంలోని నాలుగోవంతు కుటుంబాలను స్త్రీలే పోషిస్తున్నారు.

10. ప్రాథమిక విద్య అందుబాటులో లేని వందకోట్లకు పైగా వయోజన నిరక్షరాస్యులలో మూడింట రెండు వంతుల మంది స్త్రీలే.

11. దక్షిణాసియా దేశాల స్త్రీలలో ముడింట రెండు వంతుల మంది నిరక్షరాస్యులు.

12. ప్రాథమిక పాఠశాలకు కూడా వెళ్లలేని పిల్లలు ప్రపంచంలో 13 కోట్ల మంది ఉంటే వారిలో అధికశాతం ఆడపిల్లలే.

13. గర్భధారణ సమస్యల వల్ల ఏటా ఐదులక్షల మంది స్త్రీలు, గర్భస్రావాల వల్ల ఏటా మరో లక్షమంది స్త్రీలు చనిపోతున్నారు.

14. ప్రపంచ స్త్రీలలో ఐదోవంతు నుంచి సగం మంది వరకు పెళ్లయ్యాక కుటుంబ హింసకు గురవుతున్నారు.

15. ప్రపంచంలోని 2.3 కోట్లమంది శరణార్థులలో 80 శాతం మంది స్త్రీలు, లేదా వారి మీద ఆధారపడి జీవిస్తున్న పిల్లలు. వీరు పేదరికం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరాశ్రయంతో పాటు అంగవైకల్యం వల్ల, అత్యాచారాలను ప్రత్యక్షంగా చూడడం వల్ల కలిగిన మనో వైకల్యం వల్ల కూడా బాధలు పడుతున్నారు.

16. యుద్ధ సమయాలలో స్త్రీలను చిత్రహింసలు పెట్టడం, ఎత్తుకుపోవడమే కాక వారిపై రేప్‌ను ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. యుద్ధాలకు, ఇతరత్రా ఘర్షణలకు దారితీసే నిర్ణయాలలో వారి పాత్ర ఏమీ ఉండకపోయినా ఆ సమయాలలో కుటుంబాలను పోషించే పూర్తి బాధ్యత మాత్రం వారిమీదే పడుతోంది.

17. మూడింట ఒక వంతు మంది స్త్రీలు చిన్నతనంలో గానీ, యుక్తవయస్సులో గానీ లైంగిక వేధింపులకు గురవుతున్నారు.

18. ఏటా పది లక్షల మంది పిల్లల్ని బలవంతంగా వ్యభిచారంలోకి దింపుతున్నారు. వీరిలో అత్యధిక భాగం అమ్మాయిలే. బాల వ్యభిచారుల సంఖ్య ఆసియాలో అయితే మరీ ఎక్కువ.

## 17.3 బీజింగ్ సదస్సు: ముఖ్య సమస్యలు

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలు ఏఏ సమస్యలతో బాధపడుతున్నారో వాటి గురించి ప్రభుత్వాల మధ్య, ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య చాలా చర్చలు జరిగాకే ఏకాభిప్రాయ పత్రాలుగా బీజింగ్ ప్రకటన, కార్యాచరణ వేదిక వెలువడ్డాయి. ఇదివరకే చెప్పినట్టు 1995 సెప్టెంబర్ 4-15 తేదీల మధ్య జరిగిన ఈ నాలుగో ప్రపంచ మహిళా సదస్సుకు 189 దేశాల ప్రతినిధులు,

BRAOU

ఐక్యరాజ్యసమితి పరిశీలకులు హాజరయ్యారు. వీరంతా చర్చించి, ఆమోదించిన పత్రాలు ఇవి. జెండర్ సమానత్వం మీద, స్త్రీలకు జరగాల్సిన న్యాయం మీద, స్వాధికారం (Empowerment) మీద ఇప్పటివరకు ఇంత బలమైన పత్రాలు ప్రభుత్వాల నుంచి ఎప్పుడూ వెలువడక పోవడమే కాదు ఎప్పుడూ ఆమోదించబడలేదు కూడా.

ప్రపంచాన్ని స్త్రీల కళ్లనుంచి చూడమని చెపుతున్న సందర్భం ఇది. అందువల్లే గత ఐక్యరాజ్యసమితి సమావేశాలలో తాము సాధించుకున్న ప్రయోజనాలను స్త్రీలు ఈ రోజు బీజింగ్ ప్రకటన, కార్యాచరణ వేదిక రూపంలో సుస్థిరం చేసుకోగలిగారు. ఈ పత్రాల రూపకల్పనలో మహిళా ఉద్యమాల, నెట్‌వర్క్‌ల, ఎన్‌జీవో సంఘాల ప్రభావం చాలా ఉంది. వీటికి మరో ప్రత్యేకత కూడా ఉంది. అదేమిటంటే ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఇంతమంది, ఇంత విస్తృతంగా పాల్గొని, చర్చించి, రూపొందించిన పత్రాలు ఇవేనని చెప్పొచ్చు. అలాగే ఐక్యరాజ్యసమితి చరిత్రలో ఆ సంస్థ పత్రాలను ఇంతమంది చదవడం కూడా ఇదేమొదటిసారి. కార్యాచరణ వేదికలో సమస్యల్ని వివరించడంతో పాటు చేయాల్సిన పనులను సూచించడం జరిగింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న సమస్యలను ఎన్‌జీవో సంఘాలు గుర్తించి, వాటిని ఒక పద్ధతి ప్రకారం రూపొందించి, వాటి పట్ల ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, అంతర్జాతీయ సంస్థలు జవాబుదారీ వహించేలా చేసాయి. 'ప్రపంచ వాతావరణం నానాటికీ దిగజారడానికి ప్రధాన కారణం ఉత్పత్తి, వినియోగాలపై ఆరోగ్యకరమైన విధానం లేక పోవడమే. ఈ విషయంలో, ముఖ్యంగా పారిశ్రామిక దేశాల వైఖరి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల దారిద్ర్యం, అసమానతలు పెరుగుతున్నాయి' వంటి విషయాలను ఇప్పుడు ప్రభుత్వాలు కూడా ఒప్పుకోక తప్పడం లేదంటే ఈ ఒత్తిడి ఫలితమే. అన్ని వయస్సుల్లోని ఆడవాళ్లు హింస, దోపిడీలతో సహా ఏయే సమస్యలు ఎదుర్కొంటున్నారో వాటిని కార్యాచరణ వేదిక పేరు పేరునా ప్రస్తావించింది. రేప్, జననాంగాల కత్తిరింపు, వ్యభిచారులుగా మార్చి విక్రయించడం, చిన్నపిల్లల్ని సైతం వేశ్యావృత్తిలోకి దించడం మొదలైన సమస్యలన్నీ ఈ పత్రంలో ఉన్నాయి.

బీజింగ్‌లో చర్చకు వచ్చిన సమస్యలను స్థూలంగా పరిశీలించితే ప్రపంచ వాస్తవికత పట్ల, స్థానిక నిర్దిష్టతల పట్ల స్త్రీలకున్న అవగాహన అర్థమవుతుంది.

## 17.3.1 ఆందోళనకర విషయాలు

1. స్త్రీలపై అనంతంగా పెరుగుతున్న దారిద్ర్య భారం.
2. విద్యా శిక్షణా రంగాలలో అసమానతలు, లోటుపాట్లు, అవకాశాల కొరత.
3. ఆరోగ్య తదితర సేవలలో అసమానతలు, లోటుపాట్లు, అవకాశాల కొరత.
4. స్త్రీలపై హింస.
5. స్త్రీలపై సాయుధ, ఇతర రకాల ఘర్షణల ప్రభావం. ముఖ్యంగా విదేశీ ఆక్రమణలో జీవించాల్సి వచ్చినప్పుడు వాళ్లకిది పెద్ద సమస్య.
6. అన్ని ఉత్పాదక పనులకు సంబంధించిన ఆర్థిక నిర్మాణాలలో, విధానాలలో, వనరుల లభ్యతలో ఉన్న అసమానతలు.
7. నిర్ణయాలు తీసుకోవడంలో, అధికారాన్ని పంచుకోవడంలో స్త్రీ పురుషుల మధ్య అన్ని స్థాయిలలో కనిపించే అసమానతలు.
8. స్త్రీల అభ్యున్నతికి దోహదం చేసే యంత్రాంగాలు అన్ని స్థాయిలలోనూ అతి కొద్దిగా ఉండడం.
9. స్త్రీల మానవ హక్కులకు గౌరవం, రక్షణ, ప్రోత్సాహం లేకపోవడం.
10. స్త్రీలను మూసపద్ధతిలో చిత్రీకరించడం, అన్ని కమ్యూనికేషన్ వ్యవస్థలలో -ముఖ్యంగా మీడియాలో స్త్రీల సంఖ్య, వారి ఉద్యోగావకాశాలు కూడా తక్కువగా ఉండడం.

BRAOU

11. సహజ వనరుల నిర్వహణలో, పర్యావరణ పరిరక్షణలో జెండర్ అసమానతలు.

12. ఆడపిల్లల పట్ల ప్రతి విషయంలో వివక్ష, వారి హక్కుల అతిక్రమణ.

ఈ ఒక్కొక్క విషయంలోను సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, లక్ష్యాలను ప్రతిపాదించడం జరిగింది. వీటి సాధనకు ఏవేం చేయాల్లో ఆ చర్యలను కూడా సూచించడం జరిగింది. వాటి జాబితా ఈ కింద ఉంది.

## 17.3.2 లక్ష్యాలు-మార్గాలు

### *1. స్త్రీలు-ఆస్తి*

పేద స్త్రీల అవసరాలను, చేస్తున్న పనులను దృష్టిలో పెట్టుకుని ఆర్థిక విధానాలను, అభివృద్ధి వ్యూహాలను రూపొందించాలి, అమలు చేయాలి, సమీక్షించాలి.

స్త్రీలు సమాన హక్కులు, ఆర్థిక వనరులు అనుభవించేందుకు వీలుగా చట్టాలను, పరిపాలనా పద్ధతులను సవరించాలి.

పొదుపు చేయడానికి, రుణం తీసుకోవడానికి స్త్రీలకు సౌకర్యాలు అందుబాటులో ఉండాలి.

స్త్రీల పేదరికాన్ని పోగొట్టేందుకు అవసరమైన పరిశోధనలు జరపాలి. జెండర్ ఆధారిత పరిశీలనా పద్ధతులను (Gender Based Methodologies) ప్రోత్సహించాలి.

### *2. స్త్రీలకు విద్య, శిక్షణ*

చదువుకోవడానికి సమాన అవకాశాలు కల్పించాలి.

నిరక్షరాస్యతను పూర్తిగా తొలగించాలి.

శాస్త్ర సాంకేతిక చదువులు, వృత్తి విద్యా శిక్షణ మరింతగా అందుబాటులో ఉండాలి.

వివక్ష చూపని విద్యను, శిక్షణా పద్ధతులను అభివృద్ధి చేయాలి.

విద్యా సంస్కరణలకు తగినన్ని వనరులు కేటాయించి, వాటి అమలును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి.

ఆడపిల్లలకు, ఆడవాళ్లకు కూడా జీవిత పర్యంతం చదువు, శిక్షణలకు అవకాశం కల్పించాలి.

### *3. స్త్రీలు-ఆరోగ్యం*

జీవితాంతం స్త్రీలకు సరైన, చౌకైన, మేలైన ఆరోగ్య సంరక్షణ అందుబాట్లో ఉండేట్లు చూడాలి. ఆరోగ్య సమాచారం, సంబంధిత సేవల స్థాయిని కూడా పెంచాలి.

స్త్రీల ఆరోగ్యానికి దోహదం చేయగల వ్యాధి నిరోధక చర్యలను పటిష్టంగా అమలు పరచాలి.

సుఖ వ్యాధులు, హెచ్ఐవి/ఎయిడ్స్ వంటి జబ్బుల విషయంలో, లైంగిక, పునరుత్పత్తులకు సంబంధించిన అనారోగ్యాల విషయంలో స్త్రీలను నొప్పించని రీతిలో కార్యక్రమాలను రూపొందించాలి.

స్త్రీల ఆరోగ్యానికి సంబంధించిన పరిశోధనల్ని పెంచాలి. దానితోపాటు ఆ సమాచారం వారికి విస్తృతంగా అందేలా చూడాలి.

స్త్రీల ఆరోగ్యానికి వనరుల్ని పెంచడమే కాక అవెలా ఖర్చవుతున్నాయో కూడా జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి.

BRAOU

## 4. స్త్రీలపై హింస

హింసను ఆపడానికి, నివారించడానికి సమగ్రమైన చర్యలు తీసుకోవాలి.

హింసకు గల కారణాలను, దాని పర్యవసానాలను, నివారణా చర్యల వల్ల కలగగల మేలును అధ్యయనం చేయాలి.

స్త్రీల శరీరాలతో వ్యాపారం చేయడాన్ని అరికట్టాలి. ఈ ఉచ్చులో చిక్కుకున్న స్త్రీలకు సహాయం చేయాలి.

## 5. స్త్రీలు-సాయుధ ఘర్షణ

విదేశీ సేనల ఆక్రమణలో, ఇతర సాయుధ సంఘర్షణల ప్రాంతంలో నివసించే స్త్రీలకు రక్షణ కల్పించాలి. వీటి పరిష్కారంలో స్త్రీలకు మరింత నిర్ణయాత్మక పాత్ర ఉండేలా చేయాలి.

సైనిక వ్యయాన్ని తగ్గించాలి. ఆయుధాల వ్యాపారాన్ని నియంత్రించాలి.

అహింసా పద్ధతుల ద్వారా వివాదాల పరిష్కారాన్ని ప్రోత్సహించాలి. ఘర్షణ తప్పనపుడు కనీసం మానవ హక్కుల ఉల్లంఘనలు సాధ్యమైనంత తక్కువ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

శాంతిని పెంపొందించడంలో స్త్రీల పాత్రను అధికం చేయాలి.

శరణార్థులైన స్త్రీలకు, నిర్వాసితులైన స్త్రీలకు రక్షణ, సహాయంతో పాటు ఏదైనా శిక్షణ కూడా ఏర్పాటు చేయాలి.

వలస దేశాలలో, స్వయం పరిపాలన లేని ప్రాంతాలలో నివసించే స్త్రీలకు సహాయం అందజేయాలి.

BRAOU

## 6. స్త్రీలు-ఆర్థిక వ్యవస్థ

స్త్రీలకు ఉపాధి అవకాశాలు, తగిన పని పరిస్థితులు, ఆర్థిక వనరుల మీద అధికారం కల్పించడం ద్వారా వారి ఆర్థిక హక్కుల్నీ, స్వాతంత్ర్యాన్నీ పెంపొందించాలి.

వనరులు, ఉపాధి మార్గాలు, మార్కెట్లు, వ్యాపారాలు స్త్రీలకు కూడా సమానంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

స్త్రీలందరికీ-ముఖ్యంగా అల్పాదాయ వర్గాల స్త్రీలకు వ్యాపార సేవలు, శిక్షణ, మార్కెట్లలోకి ప్రవేశించే పద్ధతులు, సంబంధిత సమాచారం, శాస్త్ర పరిజ్ఞానం అందజేయాలి.

స్త్రీల ఆర్థిక సామర్థ్యాన్ని, వారి కోసం ప్రత్యేక వాణిజ్య నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేయాలి.

వృత్తులలో వేర్పాటు పద్ధతిని తొలగించడమే కాక ఉద్యోగాలలో చూపిస్తున్న అన్ని రకాల వివక్షలకూ స్వస్తి చెప్పాలి.

స్త్రీ పురుషులిద్దరూ బయట పనులను, కుటుంబ బాధ్యతలను సామరస్యంగా నిర్వహించుకోగల పరిస్థితులను పెంపొందించాలి.

## 7. అధికారంలోను, నిర్ణయాధికారంలో పాత్ర

స్త్రీలకు అన్ని అధికార సంస్థల్లోనే కాక అన్ని నిర్ణయాధికారాలలో కూడా సమాన భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

నిర్ణయాలు తీసుకోవడంలో, నాయకత్వం వహించడంలో స్త్రీల సామర్థ్యాన్ని పెంపొందించాలి.

## 8. స్త్రీల అభివృద్ధికి అవసరమైన సంస్థాగత ఏర్పాట్లు

ఇందుకు జాతీయ స్థాయిలో కొత్త యంత్రాంగాలను, ప్రభుత్వ సంస్థలను నెలకొల్పాలి. ఉన్నవాటిని పటిష్టం చేయాలి. చట్టాలలో, ప్రభుత్వ విధానాలలో, కార్యక్రమాలలో, ప్రణాళికల్లో జెండర్ దృక్పథాన్ని అంతర్భాగం చేయాలి. ప్రతి రంగానికి సంబంధించి స్త్రీ పురుషులకు విడివిడి గణాంకాలను సిద్ధం చేయడం అవసరం. ప్రణాళికా రచనకు, ఫలితాల బేరీజుకు ఇది చాలా ఉపయోగపడగలదు.

## 9. స్త్రీల మానవ హక్కులు

సీడా (స్త్రీల పట్ల వివక్ష నిర్మూలనకు ఒప్పందం)తో సహా అన్ని మానవ హక్కుల ఒడంబడికలను పూర్తిగా అమలు పరచడం ద్వారా వారి మానవ హక్కులను పరిరక్షించి, పెంపొందించాలి.

చట్టంలోను, దాని అమలులోను స్త్రీల పట్ల వివక్ష లేకుండా, సమానత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

స్త్రీలకు చట్టాల పరిజ్ఞానం కల్పించడం చాలా అవసరం.

మీడియాలోను, మీడియా ద్వారాను, ఇతర కమ్యూనికేషన్ సాధనాల ద్వారాను స్త్రీలను స్త్రీల వ్యక్తీకరణకు, నిర్ణయాధికారానికి అవకాశాలు పెంచాలి. మీడియాలో స్త్రీలను మూసపద్ధతిలో కాకుండా వాస్తవికంగా చిత్రించేలా చూడాలి.

## 10. స్త్రీలు-పర్యావరణం

పర్యావరణానికి సంబంధించిన అన్ని స్థాయిల నిర్ణయాలలోను స్త్రీలు చురుకుగా పాల్గొనేలా చేయాలి.

ప్రకృతికీ ప్రజలకూ హానిచేయని అభివృద్ధి కోసం పర్యావరణ విధానాలు, కార్యక్రమాల రూపకల్పనలో స్త్రీల దృక్పథాన్ని తప్పనిసరిగా జోడించాలి.

స్త్రీల మీద అభివృద్ధి, పర్యావరణ విధానాల ప్రభావం ఎలా ఉందో బేరీజు వేయడానికి జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఇప్పుడున్న యంత్రాంగాలను పటిష్టం చేయాలి. లేనిచోట కల్పించాలి.

## 11. ఆడపిల్లలు

ఆడపిల్లల పట్ల చూపిస్తున్న అన్ని రకాల వివక్షలకూ స్వస్తి చెప్పాలి.

ఆడపిల్లలకు ప్రతికూలంగా ఉండే సాంస్కృతిక ధోరణులను, పద్ధతులను మార్చుకునేలా చేయాలి.

ఆడపిల్లల హక్కులను పరిరక్షించి పెంపొందించాలి. వాళ్ల అవసరాల గురించి, శక్తి సామర్థ్యాల గురించి సమాజానికి సరైన అవగాహన కలిగించాలి.

చదువుల్లో, నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడంలో, శిక్షణ ఇవ్వడంలో ఆడపిల్లల పట్ల చూపించే వివక్షల్ని తొలగించాలి.

ఆరోగ్యం, పౌష్టికాహార విషయాలలో కూడా పక్షపాత ధోరణులను తొలగించాలి.

ఆర్థిక దోపిడీని అరికట్టడంతో పాటు పని స్థలాలలో ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి.

ఎలాంటి హింసకూ తావు లేకుండా చేయాలి.

సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల పట్ల వారి అవగాహననూ భాగస్వామ్యాన్నీ పెంచాలి.

కుటుంబంలో ఆడపిల్లలకు సరైన స్థానం లభించేలా చర్యలు తీసుకోవాలి.

BRAOU

## 17.4 బీజింగ్ సదస్సు: కార్యాచరణ వేదిక

సందేశప్రకటన

### 17.4.1 స్త్రీలకు స్వాధికారం (Empowerment of Women)

స్త్రీలకు స్వాధికారం ఎలా సమకూర్చవచ్చో చెప్పే పత్రమే కార్యాచరణ ప్రణాళిక ఇదివరకే వచ్చిన 'భవిష్యత్ వ్యూహాల' పత్రాన్ని మరింత త్వరగా అమలయ్యేలా చూడడం దీని ఉద్దేశం. పబ్లిక్ రంగంలోను, ప్రైవేట్ రంగంలోను చురుకైన పాత్ర నిర్వహించడానికి స్త్రీలకు ఇప్పుడున్న అవరోధాలను తొలగించడం దీని లక్ష్యం.

కార్యాచరణ వేదిక స్త్రీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వ్యవహారాలలో సమాన నిర్ణయాధికారం ఉండేలా చూస్తుంది. ఇంటి నుంచి అంతర్జాతీయ వేదికల వరకు అన్నిచోట్లా అధికారాన్నీ, బాధ్యతనూ స్త్రీ పురుషులిరువురూ సమానంగా పంచుకోవాలనే సూత్రాన్ని నెలకొల్పడానికి ఇది కృషి చేస్తుంది.

స్త్రీల హక్కులు, బాలికల హక్కులు విశ్వ మానవ హక్కుల్లో అంతర్భాగమని, విడదీయలేనివని వియన్నా సదస్సు చేసిన ప్రకటనను ఇది వక్కాణించింది.

ఉమ్మడి సమస్యల మీద మగవాళ్లతో కలిసి పని చేయాల్సిన అవసరాన్ని ఇది గుర్తిస్తుంది. కొన్ని వర్గాల స్త్రీలకు స్వాధికారం కల్పించడంలో ఎక్కువ అవరోధాలు ఉన్నాయని కూడా గుర్తిస్తుంది. అలాగే స్త్రీల పరిస్థితులలో ఉన్న వైవిధ్యాన్ని ఇది గౌరవిస్తుంది.

ప్రజలంతా మానవ హక్కుల్ని, మౌలిక స్వేచ్ఛల్ని అనుభవించగల శాంతియుత మానవీయ ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అందరి క్రియాశీల సహకారం అవసరమని ఈ వేదిక భావిస్తుంది.

ఈ కార్యాచరణ వేదిక విజయం ప్రభుత్వాల మీద, అంతర్జాతీయ సంస్థల మీద, స్త్రీల అభివృద్ధి కోసం అన్ని స్థాయిల్లో జరగాల్సిన వనరుల సమీకరణ మీద, వాళ్ల పట్ల జవాబుదారీతనం పెంచే యంత్రాంగాలను అన్ని స్థాయిల్లో ఏర్పాటు చేయడం మీద ఆధారపడి ఉంటుంది.

ఇది 'సీడా'కు బలం చేకూర్చే పత్రం. నైరోబి సదస్సు ఆమోదించిన 'భవిష్యత్ వ్యూహాల' నుంచి, ఐరాస ఆర్థిక, సాంఘిక మండలి చేసిన తీర్మానాల నుంచి, అంతకుముందు జరిగిన అన్ని ఐరాస సమావేశాల్లో, శిఖరాగ్ర సదస్సుల్లో కుదిరిన ఒప్పందాల నుంచి ఈ 'వేదిక' అనేక విషయాలను స్వీకరించింది. వచ్చే ఐదేళ్లలో చేపట్టవలసిన ప్రధాన సమస్యలను ఇది ఎంతో స్పష్టతతో మన ముందుంచింది.

అన్ని మానవ హక్కుల్నీ, మౌలిక స్వేచ్ఛల్నీ అనుభవించగల పరిస్థితులు ఉన్నప్పుడే స్త్రీలు స్వాధికారతను సాధించుకోగలుగుతారు కాబట్టి తమ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు ఏమైనప్పటికీ రాజ్యాలు మతం, జాతి, సాంస్కృతిక విలువలతో పాటు ఈ హక్కులను, స్వేచ్ఛలను కూడా కాపాడాలని 'వేదిక' పేర్కొంది. స్త్రీల సమానత్వానికి, అభివృద్ధికి, శాంతికి దోహదం చేయడం రాజ్యానికున్న కర్తవ్యాలలో ఒకటని అది గుర్తు చేసింది.

### 17.4.2 స్త్రీల హక్కులు: హింస, వివక్ష

నైరోబీ సమావేశం (1985) తర్వాత ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో చాలా పెద్ద మార్పులే వచ్చాయి.

BRAOU

ఇవి స్త్రీల మీద మంచిచెడూ-రెండు రకాల ప్రభావాలూ చూపాయి. ఇప్పుడు అన్ని దేశాలూ గ్రామం నుంచి విశ్వం దాకా అన్ని స్థాయిలలో స్త్రీలను రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో సమానంగా, సంపూర్ణంగా పాల్గొనేలా చేయడం తమ ప్రాథమిక లక్ష్యమని ప్రకటించుకుని ఉన్నాయి. అలాగే లింగవివక్షను తొలగించడానికి కృషి చేయడం కూడా వారికిప్పుడు చాలా ముఖ్యమైన లక్ష్యమైంది.

ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా ప్రపంచంలో రకరకాల సాయుధ ఘర్షణలు, అంతర్యుద్ధాలు, టెర్రరిస్టు చర్యలు, దురాక్రమణ యుద్ధాలు అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయి. జాతి ప్రక్షాళన పేరుతో స్త్రీలు హత్యలకు, రేప్‌లకు, చిత్రహింసలకు, బలవంతపు గర్భధారణలకు, బలవంతపు గర్భస్రావాలకు గురవుతూనే ఉన్నారు. అందువల్ల స్త్రీల, బాలికల మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఉండాలంటే ప్రపంచ శాంతి నెలకొనడం చాలా అవసరం.

దీనికి తోడు సైనిక వ్యయం, ఆయుధాల ఉత్పత్తి, వ్యాపారాలు రానురాను పెరిగి సాంఘిక సంక్షేమానికి లభించే వనరులను తగ్గించేస్తున్నాయి. నిర్మాణ సర్దుబాట్ల పేరిట అమలవుతున్న విధానాల వలన కూడా సాంఘికాభివృద్ధి కుంటుపడింది. పేద ప్రజల సంఖ్య పెరిగింది.

జాతి, వయస్సు, సంస్కృతి, మతం, అంగవైకల్యం వగైరాలెన్నో స్త్రీల సంపూర్ణ సమానత్వానికి, అభివృద్ధికి అవరోధాలుగా ఉన్నాయని కార్యాచరణ వేదిక గుర్తించింది. అలాగే కుటుంబంలో వారి హోదా, జీవన పరిస్థితులు, వలసపోవాల్సి రావడం, జబ్బులు, పర్యావరణ విధ్వంసం, శారీరక హింస ఇవన్నీ కూడా వారి పురోగతికి ఆటంకాలుగా ఉన్నాయని పేర్కొంది.

## 17.4.3 స్త్రీల హక్కులు: అభివృద్ధి సమానా

అభివృద్ధికున్న సామాజిక పార్శ్వాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు. ఆర్థికాభివృద్ధి జరిగినంత మాత్రాన జీవన ప్రమాణాలు వాటంతట అవి మెరుగుపడవు. పడకపోగా చాలాసార్లు సామాజిక అసమానతలు, పరాయీకరణ పెరుగుతాయి కూడా. కాబట్టి స్త్రీ పురుషుల సమానత్వం, సామాజిక న్యాయం, సమతుల్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, శాంతి సామరస్యాల సాధన, మానవ హక్కుల పట్ల గౌరవం వీటన్నిటి మీద దృష్టి నిలిపే ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాల కోసం అన్వేషించడం చాలా అవసరం.

ప్రజాస్వామీకరణ కోసం ప్రపంచంలో ఎన్నో ఉద్యమాలు నడిచినా స్త్రీలకు పురుషులతో సమాన ప్రతిపత్తి అనేది ఇంకా సాధించాల్సిన లక్ష్యంగానే ఉండిపోయింది.

ఈ మధ్య కాలంలో ఆర్థిక మాంద్యం, రాజకీయ అస్థిరతలు కలిసి అభివృద్ధిని కుంటుపరిచి దారిద్ర్యాన్ని చాలా పెంచాయి. దాని ఫలితమే ఇప్పుడు ప్రపంచంలో ఉన్న వందకోట్ల మంది నిరుపేదలు. వారిలో స్త్రీలదే అత్యధిక మెజారిటీ అని వేరే చెప్పనవసరం లేదు. అయినా నిర్మాణ సర్దుబాట్ల పేరిట రూపొందించిన ఆర్థిక విధానాలేవీ స్త్రీల మీద, బలహీన వర్గాల మీద ఈ ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించేవి కావు.

దారిద్ర్యం, ముఖ్యంగా స్త్రీల దారిద్ర్యం, నిరుద్యోగం పెరుగుతున్నపుడు; పర్యావరణం శిథిలమవుతూ, హింస పెరుగుతూ ఉన్నపుడు; మానవాళిలో సగం మందిని అధికారం నుంచి, పరిపాలన నుంచి ఇప్పటికీ మినహాయిస్తున్నప్పుడు; అభివృద్ధి కోసం, శాంతి భద్రతల కోసం చేస్తున్న అన్వేషణను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు మహిళలకు చాలా ప్రతికూలంగా పని చేస్తున్నాయనేది నిస్సందేహం. ప్రభుత్వాలు సేవారంగం నుంచి తప్పుకుంటున్న కొద్దీ ఆ బాధ్యత స్త్రీల మీద ఎక్కువ పడుతోంది. ఆర్థిక మాంద్యం స్త్రీల ఉద్యోగావకాశాలను తగ్గించి వాళ్లను ఇంటికి పరిమితమై చేసే పనులకు లేదా పనికోసం వెతుక్కుంటూ వలసపోయేలాగా

BRAOU

చేస్తోంది. దీనివల్ల స్త్రీల మీద పని భారం చాలా పెరిగింది. అన్ని రకాల ఆర్థిక విధానాలు, నిర్మాణ సర్దుబాట్ల విధానాలు స్త్రీలను, ఆడపిల్లలను మరింత పేదరికంలోకి నెట్టి పరాయీకరణను పెంచుతున్నాయి.

స్త్రీలు వేతనాలు తీసుకొనీ, తీసుకోకుండానూ ఎన్నో పనులు చేసి ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తున్నారు. పేదరికాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రపంచంలో నాలుగోవంతు కుటుంబాలను స్త్రీలే పూర్తిగా నిర్వహిస్తున్నారు. మిగతా కుటుంబాలలో కూడా స్త్రీల ఆదాయం మీద ఆధారపడే కుటుంబాలు చాలానే ఉన్నాయి. వీటికి తోడు కుటుంబాల విచ్ఛిన్నం, వలసలు, అనేక కారణాల వలన ఊళ్లు వదిలి వెళ్లాల్సి రావడం, యుద్ధం మొదలైన వాటి వల్ల స్త్రీలే కుటుంబాలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు రాను రాను ఎక్కువవుతున్నాయి.

ప్రపంచశాంతి అవసరాన్ని స్త్రీలు గుర్తించారు. శాంతి ఉన్నప్పుడే ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమని తెలుసుకోవడం వల్ల ఇప్పుడు నిజానికి వాళ్లే శాంతి కోసం ఎక్కువ కృషి చేస్తున్నారు.

ప్రపంచ యువతలో 85 శాతం మంది (ప్రపంచ జనాభాలో సగంవాళ్లే) వర్ధమాన దేశాలలో జీవిస్తున్నారు కనుక ఆ దేశాల యువతులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం చాలా అవసరం. సంఘ జీవనంలోనే సమానత్వ సూత్రం ఇమిడి ఉండేలా చేయాలి.

## 17.4.4 స్త్రీల హక్కులు: స్వేచ్ఛ, సమానత్వం

ఆలోచనా స్వేచ్ఛను, అంతరాత్మ చెప్పినట్టు నడుచుకునే స్వేచ్ఛను, నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛను ఒక హక్కుగా ప్రపంచమంతా గుర్తించింది. నైతిక ఆధ్యాత్మిక జీవనానికి ఇవి స్త్రీపురుషులిద్దరికీ అవసరమైనవే. అయితే వీటిల్లో తీవ్రవాదం స్త్రీల స్వేచ్ఛను అరికట్టి, వారిమీద హింసకు, వివక్షకు దారి తీస్తున్నాయని గుర్తించడం అవసరం.

సమానత్వం కోసం స్త్రీలు ప్రారంభించిన ప్రయాణంలో అంతర్జాతీయ మహిళా దశాబ్దం, 'సీడా' ఒప్పందం, 'భవిష్యత్ వ్యూహాలు' మైలురాళ్ల వంటివి. నాలుగో ప్రపంచ మహిళా సదస్సు ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసికెళుతుందని అందరి నమ్మకం. ప్రభుత్వేతర సంస్థలు, ముఖ్యంగా స్త్రీల సంఘాలు, ఫెమినిస్టు బృందాలు స్త్రీల పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి చోదక శక్తిగా పనిచేస్తున్నాయి. ఈ ఎన్‌జీవోల ద్వారానే స్త్రీలు జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలను సైతం ప్రభావితం చేయగలుగుతున్నారు.

1975 తర్వాతే స్త్రీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించబడ్డాయి. పురుషులు మాత్రమే పనిచేసే రంగాలలోకి స్త్రీలకు ప్రవేశం లభించిందీ, పురుషులు కూడా ఇంటిపనిలో, పిల్లల సంరక్షణలో పాలుపంచుకోవాలని చెపుతున్నది అప్పటినుండే. అయినా స్త్రీ పురుషుల మధ్య ప్రతిభలో కనబడే తేడాలు ఇప్పటికీ శరీర సంబంధమైనవిగానే భావిస్తున్నారు తప్ప సమాజం వాళ్లనలా తయారు చేసిందని గుర్తించడం లేదు.

అలాగే నైరోబి సమావేశాలు జరిగి పదేళ్లయినా ఏ దేశ చట్ట సభలలోను స్త్రీల శాతం పదికి మించలేదు. ఐక్యరాజ్యసమితితో సహా అన్ని జాతీయ, అంతర్జాతీయ పరిపాలనా సంస్థలలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటోంది.

సమాజంలో కుటుంబానికి ఉన్న ప్రాముఖ్యం, కుటుంబంలో స్త్రీల పాత్రకున్న ప్రాముఖ్యం దృష్ట్యా కుటుంబ క్షేమానికి, సమాజాభివృద్ధికి వారు చేస్తున్న కృషిని గుర్తించి, ఆ విషయాన్ని ఏ భేషజాలూ లేకుండా బహిరంగంగా అంగీకరించాలి. స్త్రీలకున్న పునరుత్పత్తి పాత్ర కారణంగా వారి పట్ల వివక్ష చూపడం తగని పని.

వర్ధమాన దేశాలలో జనాభా పెరుగుదల తగ్గినప్పటికీ వాటి ప్రస్తుత జనాభాలో కూడా 40-50 శాతం మంది దాకా 15 ఏళ్ల లోపువాళ్లే ఉంటారు. అలాగే 2025 సంవత్సరం నాటికి 60 ఏళ్లు పై బడ్డ వాళ్లు 75 శాతం మంది దాకా ఈ దేశాలలో ఉంటారు. వీరందరి ఆలనాపాలనా చూడాల్సిన భారం స్త్రీల మీదే ఉంటుంది. ప్రభుత్వం గానీ, పురుషులుగానీ

BRAOU

ఈ బాధ్యతను పంచుకోరు కాబట్టి స్త్రీలకది తప్పనిసరవుతుంది.

జెండర్ సమస్య ఒక్కటే కాదు,స్త్రీలను ఒంటరితనానికి, పరాయిభావనకు గురి చేసే అంశాలు ఇంకా అనేకం ఉన్నాయి. మానవ హక్కులు, విద్య, శిక్షణ, ఉద్యోగావకాశాలు, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేక పోవడం ఇవన్నీ స్త్రీల ప్రగతికి ఆటంకాలే.

## 17.4.5 స్త్రీలు-పర్యావరణం

పర్యావరణ విధ్వంసం వల్ల మొత్తం మానవాళికీ నష్టం జరుగుతోంది కాని దానిలోనూ స్త్రీలకు జరిగే నష్టమే ఎక్కువ. కాలుష్యం, అడవుల నిర్మూలన, సముద్రతీర వనరుల నాశనం స్త్రీల ఆరోగ్యాన్ని, ఉపాధి అవకాశాలను బాగా దెబ్బ తీస్తున్నాయి.

పర్యావరణానికి దారిద్ర్యం వల్ల జరుగుతున్న నష్టం కంటే పారిశ్రామిక దేశాల అపరిమిత వినియోగ సంస్కృతి వల్ల కలుగుతున్న నష్టం ఎక్కువ. ఈ సంస్కృతి ఒకవైపు పేదరికాన్ని పెంచుతూ, మరోవైపు పర్యావరణాన్ని నాశనం చేస్తోంది.

ప్రపంచంలో అన్ని చోట్లా కుటుంబ వ్యవస్థలో మార్పులు వచ్చాయి. దానికి తోడు పెద్దఎత్తున జరుగుతున్న వలసలు, కొత్తచోట బతకాల్సి రావడం పురుషుల కంటే స్త్రీలకు ఎక్కువ కష్టాల్ని తెచ్చిపెడుతోంది. దీనివల్ల లైంగిక దోపిడీ కూడా పెరిగింది.

2000 సంవత్సరం నాటికి ఎయిడ్స్ కేసులు రెండు కోట్లకు చేరుకోనున్నాయి. వర్ధమాన దేశాలలో స్త్రీలకు, యువతులకు వస్తున్న సుఖ వ్యాధులు, ఎయిడ్స్ వ్యాధుల సంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది.

ప్రస్తుతమున్న సాంఘిక ఆర్థిక నిర్మాణాలు, సమాజం వైఖరి, వనరుల కొరత స్త్రీలను జీవిత పర్యంతం వివక్షకు గురి చేస్తున్నాయి. స్త్రీలను రక్షించాలంటే వాళ్ల చిన్నతనం నుంచే వీటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలి.

స్త్రీలు అన్నిట్లో సమాన భాగస్వాములుగా ఉండాలంటే ఆడపిల్లలుగా ఉన్నపుడే వారు తమ శక్తి సామర్థ్యాలను పరిపూర్ణంగా అభివృద్ధి చేసుకోగల వాతావరణాన్ని కల్పించాలి. వాళ్ల గౌరవానికి, మానవ హక్కులకు, మౌలిక స్వేచ్ఛలకు లోటు లేకుండా చూడాలి. పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య అందుబాటులో ఉండేట్టు చూడాలి. లైంగిక, ఆర్థిక దోపిడీ నుంచి వారికి విముక్తి కలిగించాలి.

BRAOU

## 17.5 బీజింగ్ సదస్సు: భారతదేశం ఎజెండా

బీజింగ్ సదస్సు కోసం భారత ప్రభుత్వం చాలా సమయం, వనరులు వెచ్చించి అధికార నివేదికను **(Country Report)** తయారు చేసింది. వివిధ రంగాలలో స్త్రీ పురుషుల ప్రస్తుత పరిస్థితిని విడివిడి గణాంకాలతో వివరించడమే కాక ఈ నివేదిక కొన్ని విషయాలకు గట్టిగా పూచీ పడింది. అవి-

- ★ స్థూల జాతీయోత్పత్తినుంచి విద్యకు కేటాయించే నిధులను ఆరు శాతానికి పెంచడం. పెంచిన నిధులలో స్త్రీల చదువుకు, ఆడపిల్లల చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం.
- ★ తల్లీ పిల్లల సంరక్షణ కార్యక్రమాలను దేశంలోని ప్రతి మారుమూల ప్రాంతానికి విస్తరింపచేయడం.
- ★ ప్రతి రంగంలోను, ప్రతి స్థాయిలోను స్త్రీలకు సంబంధించిన అన్ని అంశాలలో సలహాలిచ్చి ముందుకు తీసికెళ్లగలిగిన ఒక జాతీయ విధానాన్ని రూపొందించి అమలు చేయడం.
- ★ స్త్రీల మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఒక స్త్రీల హక్కుల కమిషనర్‌ను నియమించడం.

★ కార్యాచరణ వేదిక అమలును పర్యవేక్షించడానికి జాతీయస్థాయిలో ఒక సంస్థను నెలకొల్పడం.

ఆర్థిక పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాల (Structural Adjustment Programmes) గురించి మాట్లాడుతూ పేదల మీద, ముఖ్యంగా స్త్రీల మీద, పిల్లల మీద ఇవి చాలా ప్రతికూల ప్రభావం చూపాయని భారతీయ ప్రతినిధి బృందం నాయకుడు శ్రీ మాధవరావు సింధియా ఒప్పుకున్నారు. సాంఘిక రంగానికి పెట్టుబడి పెంచడం అవసరమని కూడా ఒప్పుకుంటూ భారత బడ్జెట్‌లో 41 శాతం నిధులు ఈ రంగానికే కేటాయించినట్లు చెప్పారు.

భారతదేశం పట్టుపట్టి మొదటిరోజే ఒక సవరణను ప్రతిపాదించింది.

దాని సారాంశం ఏమిటంటే పునరుత్పత్తితో సహా తమ జీవితానికి సంబంధించిన అన్ని అంశాలమీద స్త్రీలకు సంపూర్ణ హక్కులు ఉండాలని.

దారిద్ర్య నిర్మూలన, మానవ హక్కులు, హింస, టెర్రరిజం ప్రస్తుతం ముఖ్యమైన సమస్యలుగా ఉన్నాయి కాబట్టి ఆ ప్రకారమే భారతదేశం తన ప్రాధాన్యతలను నిర్ణయించుకుందని మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి సరళా గోపాలన్ చెప్పారు. మళ్లీ వీటిల్లో కూడా టెర్రరిజానికి సంబంధించిన తమ ఎజెండాను ముసాయిదాలో చేర్చాలని భారత అధికారులు ప్రయత్నించడం చాలా మంది విమర్శకు గురయింది. దీని వల్ల అసలు విషయం పక్కకు పోతోందని వాళ్లు అభిప్రాయ పడ్డారు.

అయితే ముసాయిదా కమిటీ సహాధ్యక్షురాలి హోదాలో భారతదేశం బీజింగ్ ప్రకటన రూపకల్పనలో చెప్పుకోదగ్గ పాత్రే నిర్వహించింది. కొన్ని విషయాల మీద కొన్ని దేశాలకున్న వ్యతిరేకత కారణంగా ఈ పని అంత సులువుగా సాగలేదని సంయుక్త కార్యదర్శి ఎస్.కె. గుహా ఒక సందర్భంలో అన్నారు. ఆ దేశాలలో అమెరికా ఒకటి. వనరుల విషయంలో అది ఏదో ఒక పేచీ పెడుతూనే వచ్చింది.

భారతదేశం నుండి వచ్చిన ప్రభుత్వ ప్రతినిధులు, ఎన్‌జివోలు కూడా ఈ సదస్సులో మొదటినుంచి చురుకైన పాత్ర నిర్వహించారు. అయితే ఇక్కడికి వచ్చిన 45 మంది మహిళా ఎం.పిలలో మాత్రం కొద్దిమందే చురుగ్గా కార్యక్రమాలలో పాల్గొన్నారు. దానికి కారణం ఈ సదస్సులో పాల్గొనడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని ఎవరూ తమకు సరిగ్గా ఇవ్వలేదని వీరిలో చాలామంది చెప్పారు.

పల్లెల నుంచి, మురికివాడల నుంచి, గిరిజన ప్రాంతాల నుంచి, ముఖ్యంగా అసలెవరూ ఎప్పుడూ పట్టించుకోని ఈశాన్య ప్రాంత రాష్ట్రాల నుంచి ఈసారి చాలామంది ప్రతినిధులు వచ్చారు. ఈ కోవకు చెందిన వాళ్లు ప్రపంచ బృందాలతో పోల్చితే భారత ఎన్‌జివో బృందంలోనే ఎక్కువ మంది ఉన్నారు.

## 17.6 కార్యాచరణ వేదిక: విమర్శనాత్మక విశ్లేషణ

స్త్రీల హక్కులు మానవ హక్కులనే విషయం కార్యాచరణ వేదిక నిర్ద్వందంగా పేర్కొంది. మానవ హక్కులు, మౌలిక స్వేచ్ఛలు మానవులందరి జన్మహక్కు అని, వాటి రక్షణ, అభివృద్ధి ప్రభుత్వాల మొట్టమొదటి కర్తవ్యం అని కూడా 'వేదిక' పేర్కొంది. మానవ హక్కుల విషయంలో సార్వజనీనత, నిష్పాక్షికత, సమదృష్టి ఉండాల్సిన అవసరాన్ని ఇది వక్కాణించింది. 'అన్ని మానవ హక్కులూ, అంటే అభివృద్ధి హక్కుతో సహా అన్ని పౌర, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులూ సార్వజనీనమైనవని, అవిభాజ్యమైనవని, పరస్పర ఆధారమైనవని, పరస్పర సంబంధమైన' వని ప్రపంచ మానవ హక్కుల సదస్సు వియన్నాలో చేసిన ప్రకటనతో ఇది పూర్తిగా ఏకీభవించింది. అయితే స్త్రీల మానవ హక్కుల పరిరక్షణ కోసం రిజర్వేషన్లను వీలైనంతవరకు ఉపయోగించుకోకపోవడం మంచిదని కార్యాచరణ వేదికలోని 218 అధికరణం చెప్పింది. ఎందుకంటే 'అంతర్జాతీయ మానవ హక్కుల ఒడంబడికలలో నిర్వచించబడిన స్త్రీల మానవ హక్కులను దేశాలు

BRAOU

పూర్తి స్థాయిలో గుర్తించి తమ చట్టాలలో, ఆచరణలో అంతర్భాగం చేసుకుంటే తప్ప ఈ హక్కులకు విడిగా (రిజర్వేషన్ల ద్వారా) విలువ ఉండద'ని అది పేర్కొంది. 'ఆచరణలో-అంటే కుటుంబం, పౌర వ్యవహారాలలో, నేరశిక్ష, కార్మిక, వాణిజ్య, పరిపాలనా నీతి నియమావళులలో ఈ హక్కులు భాగమై అమలవుతున్నపుడే వాటికి విలువ, లేకపోతే అవి నామమాత్రంగానే మిగిలిపోతాయి' అని చెప్పింది. ఇదివరకటి అంతర్జాతీయ హక్కుల పత్రాలను ఆధారం చేసుకుని బీజింగ్ సదస్సు 'స్త్రీలు, బాలికల మానవ హక్కులు విశ్వ మానవ హక్కులలో అంతర్భాగమని, తొలగించడానికి వీల్లేనివ'ని పునరుద్ఘాటించింది. 'స్త్రీలు, బాలికలు అన్ని మానవ హక్కులనూ, మౌలిక స్వేచ్ఛలనూ సమానంగా, సంపూర్ణంగా అనుభవించగలగడమనేది స్త్రీల అభ్యున్నతికి అవసరమైన విషయమే కాక అన్ని దేశాల ప్రభుత్వాలకూ, ఐక్యరాజ్య సమితికీ ఇప్పుడది ఎంతో ముఖ్యమైన లక్ష్యంగా ఉంద'ని కూడా సదస్సు గుర్తు చేసింది.

అయితే స్త్రీల మానవ హక్కుల మీద జరుగుతున్న ఈ చర్చ ప్రస్తుత సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు సంబంధించిన విధానాల రూపకల్పనలో, వాటిని అర్థం చేసుకునే ప్రమాణాలను ఏర్పరచుకోవడంలో కొన్ని సంక్లిష్టమైన అంశాలను లేవనెత్తింది. మరీ ముఖ్యంగా చారిత్రక పరిణామాల వలన హక్కుల నిర్వచనంలో, అమలులో పరస్పర విరుద్ధమైన ప్రాపంచిక దృక్పథాలు ఏర్పడి ఉన్న సమాజాలలో ఈ సంక్లిష్టత ఇంకా ఎక్కువ ఉంటుంది. సంస్కృతి, తదితర అన్ని విషయాలకు సంబంధించి సాధారణ ప్రమాణాలుగా భావింపబడే వాటన్నిట్లో ప్రశ్నించవలసిన అంశాలున్నాయని ఎత్తి చూపడం ఆధునీకరణ క్రమం చేస్తున్న ఒక ముఖ్యమైన పని. దీనికి ఒక ఉదాహరణ స్త్రీల మానవ హక్కుల చర్చలో సార్వజనీనతకు సాపేక్షికతకు మధ్య జరుగుతున్న సంవాదం. బీజింగ్‌కు హాజరైన ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రతినిధి బృందాలలో అన్ని మతాలకు, సంస్కృతులకు చెందిన సభ్యులు ఉన్నందువల్ల కార్యాచరణ వేదిక పత్రంలోను, ఇతర పత్రాలలోను ఈ రెండిట్లో ఏదో ఒక భావనకు ఎక్కువ ప్రాముఖ్యం కల్పించే ప్రయత్నాలు జరుగుతూనే వచ్చాయి.

మనుషులుగా పుట్టినందువల్లే స్త్రీలకు గానీ పురుషులకు గానీ హక్కులు లభిస్తాయనే నైతిక, తాత్విక దృష్టి అన్ని అంతర్జాతీయ హక్కుల ఉద్యమాలకు ఉందని కార్యాచరణ వేదిక స్పష్టంగానే పేర్కొంది. మానవ హక్కులు కాకతాళీయంగా వచ్చినవి కావని, సారాంశంలోనే అవి సాంఘిక హోదా, ఆర్థికవర్గం, సంస్కృతి, జాతీయత, మతం, జాతి, జెండర్‌లతో ముడిపడి ఉన్నాయని చెప్పింది. అందువల్ల ఆచార సంప్రదాయాలు లేదా చారిత్రక పరిస్థితులను కారణంగా చూపి హక్కులను కుదించడం సమర్థనీయం కాదని, అటువంటి చర్యలను సాధారణ విషయంగా చూసి వదిలేయకూడదని చెప్పింది. హక్కుల అతిక్రమణలు ఎప్పుడు ఎక్కడ జరిగినా వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అవుతుందనింది. అన్నిచోట్లా ఆచార సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యమే ప్రధానంగా హక్కుల వాతావరణాన్ని నిర్ణయిస్తాయి కాబట్టి చాలా విషయాలలో ఇవే ప్రభుత్వం మీద పరిమితుల్ని పెడతాయని 'వేదిక' గుర్తించింది. ముఖ్యంగా స్త్రీల మానవ హక్కుల కోసం ప్రభుత్వం సమీకరించగలిగిన సామాజిక, మానసిక సాధనాలపై ఇవి పరిమితుల్ని విధిస్తాయని చెప్పింది. సంస్కృతుల్లో తేడాల్ని బట్టి ఈ పరిమితుల్లో కూడా తేడాలుంటాయి. అందువల్ల హక్కుల అతిక్రమణ జరుగుతున్న సామాజిక వాతావరణాన్ని బట్టి ప్రతి రాజకీయ వ్యవస్థ వాటిని సరిదిద్దే పద్ధతుల్ని కనుగొని, అమలు చేయాలి. సాపేక్షికతకు అర్థం ఇదే. సార్వజనీన వాదం స్త్రీల మానవ హక్కుల సారాంశంతో ముడిపడి ఉండగా సాపేక్షికతా వాదం సాధనాలకు సంబంధించినది.

గమ్యానికీ వ్యూహానికీ మధ్య స్పష్టంగానే కనిపిస్తున్న ఈ తేడా ఇటీవల పితృస్వామ్యాన్ని సంప్రదాయవాదాన్ని వెనకేసుకొస్తూ పాశ్చాత్యేతర దేశాల నుండి వినబడుతున్న వాదనల్లో మాత్రం లేదు. ముఖ్యంగా రెండు విషయాల్లో విభేదాలు బాగా కనిపిస్తున్నాయి. ఒకటి-మానవ హక్కుల సార్వజనీనత విషయంలో దీని అర్థాన్ని కుదించివేయడానికి కొన్ని ప్రభుత్వాలు, మత వర్గాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఇది బీజింగ్‌లోను ఇతర అంతర్జాతీయ సమావేశాలలోను కూడా కనిపించింది. అయితే బీజింగ్ సదస్సు ఇందుకు అంగీకరించలేదు.

రెండోది-సాపేక్షికతా వాదాన్ని ఉపయోగించి గత కొన్నేళ్లుగా హక్కులనేవి సంస్కృతిని బట్టి, చరిత్రను బట్టి ఉంటాయని చేస్తున్న వాదన విషయంలో, ఉదారవాద ధోరణిలో చూస్తే ఇది వైవిధ్యానికి సంబంధించిన భావన, పాశ్చాత్య సాంస్కృతికాధిపత్యాన్ని అడ్డుకోవడానికి ఉద్దేశించిన భావన. అయితే స్త్రీలకు సార్వజనీన మానవ హక్కులు ఉండడానికి

BRAOU

వీల్లేదని భావించే ప్రభుత్వాలు, మతాలు ఈ వాదాన్ని ఉపయోగించుకుని ఆహక్కులు తమ సంస్కృతులకు, మతాలకు భిన్నమైనవని తిరస్కరిస్తున్నారు. సంప్రదాయ వాదులకు ఆధునిక వాదులకు మధ్య ఇది ఇప్పటికీ వివాదాస్పదమైన విషయమే అయినప్పటికీ ఒక సూత్రంగా నిర్ణయించుకునే సంప్రదాయవాదాన్ని అంతర్జాతీయ మానవ హక్కుల పత్రాల నుండి తొలగించారు.

సాపేక్షికతకు సార్వజనీనతకు మధ్య జరుగుతున్న ఈ చర్చ ఒక తక్షణావసరాన్ని ముందుకు తెచ్చింది. అదేమిటంటే-బీజింగ్ కార్యాచరణ వేదికలోను, సీడా తదితర ముఖ్యమైన ఒడంబడికలలోను ఉన్న హక్కుల గురించి అట్టడుగు స్థాయివాళ్లకు తెలియ జెప్పడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రభుత్వాలు, మానవ హక్కుల కార్యకర్తలు చేయాల్సిన కృషిని ఇది ముందుకు తెచ్చింది. ఈ చైతన్యం కలిగించాలంటే ప్రత్యేక మానవ హక్కుల విద్యా కార్యక్రమాన్ని చేపట్టాలి. అది అనియత పద్ధతిలో జీవితపర్యంతం కొనసాగేలా రూపొందించాలి. సార్వజనీనతకు పాశ్చాత్య పరిభాషలో ఉన్న అర్థాన్ని తొలగించడం కూడా ముఖ్యమైన పనే. ఇందుకు ఒక మార్గం ఏమిటంటే స్త్రీల మానవ హక్కుల్ని ప్రపంచం తన బాధ్యతగా తీసుకుని ఆచరణ రూపం ఇవ్వడం.

***కార్యాచరణ వేదికలో ఉన్న బలహీనతల్ని కూడా క్లుప్తంగా చెప్పుకుందాం.***

★ లైంగిక హక్కులు లేదా లైంగిక ఇష్టాయిష్టాల గురించి ఇందులో స్పష్టమైన ప్రస్తావన లేదు.

★ సమాచార సేకరణలో ఉపయోగించే జాతి (Race), సాంస్కృతిక జాతి (Ethnicity) వంటి స్పష్టమైన పదాల స్థానంలో 'జనాభా సంబంధిత అంశాలు' (Demographic Factors) అనే అస్పష్టమైనపదాన్ని పెట్టడం సముచితంగా లేదు.

★ నిర్వాసిత స్త్రీల గురించి సమగ్రమైన దృక్పథం కనిపించలేదు.

★ మూలవాసులు (Indigenous People) అనడానికి బదులు ప్రజలు అనీ, కుటుంబం అనడానికి బదులు కుటుంబాలు అనీ వాడి ఉండాల్సింది. కుటుంబంలో అనేక రకాలు ఉన్నాయి కాబట్టి కుటుంబాలు అని వాడడమే సబబు.

# 17.7 బీజింగ్ సదస్సు: ఎన్‌జీవో ఫోరం

BRAOU

ఈ సదస్సు సెక్రటరీ జనరల్ గెర్ట్రూడ్ మోంగెల్లా మాటల్లో చెప్పాలంటే 'ఎన్నడూ సమానత్వం అనుభవించని వాళ్లను సమానుల్ని చేయాలనుకునే విప్లవం ఇది. తరతరాలుగా ఏమీ దక్కని వాళ్లకు ప్రపంచ వనరుల్లో న్యాయమైన వాటా ఇప్పించాలనుకుంటున్న విప్లవం ఇది. అనంత కాలం నుంచి నిర్వహిస్తున్న అనుచర పాత్ర నుండి విముక్తి చేసి స్త్రీలను నాయకులుగా, నిర్ణయాధికారులుగా మార్చాలనుకుంటున్న విప్లవం ఇది'.

ఎన్‌జీవో ఫోరం ఆశయ ప్రకటన
'స్త్రీ పురుషుల్లారా!
కలిసికట్టుగా ముందుకొచ్చి
ప్రపంచ నిర్మాణాలన్నిటినీ సవాలు చేయండి
ప్రతి ప్రక్రియనూ ప్రశ్నించండి
అన్నిటినీ మార్చి కొత్తవి సృష్టించండి
స్త్రీలకు స్వాధికారం ఉన్నప్పుడే
ఇది సాధ్యమని మరువకండి
మా లక్ష్యం సమానత్వం, శాంతి
న్యాయం, సంపూర్ణ భాగస్వామ్యం'.

1995 నాటి స్త్రీల పరిస్థితిపై ఎన్‌జివో వేదిక నిర్వహించిన సమావేశం అసాధారణమైనది. దీనిలో 30,000 మందికి పైనే స్త్రీలు పాల్గొని రికార్డు సృష్టించారు. పరిచయాలు పెంచుకోవడాని, ఒకర్నించి ఒకరు నేర్చుకోవడానికి, కలిసి పనిచేయడానికి ఈ సమావేశం చాలా అవకాశాలు కల్పిస్తుంది కాబట్టే ఇదివరకటి ఎన్‌జివో వేదికలకు వచ్చినట్టే దీనికీ చాలామంది వచ్చారు.

మహిళా ఉద్యమం తన ఎజెండాలను నిర్ణయించుకోవడానికి కూడా ఈ వేదిక అవకాశం కల్పిస్తుంది. నైరోబీ తర్వాత గడచిన పదేళ్లలో జరిగిన అన్ని ఐక్యరాజ్యసమితి సమావేశాలలోను మహిళా ఎన్‌జివోలు, స్త్రీల సమస్యల్ని చేపట్టే ఇతర సంఘాలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తూ వచ్చాయి. ఈ సమావేశాలలో అన్ని దేశాల ప్రభుత్వాలూ స్త్రీల జీవితాలను, వారి కుటుంబాలను, వారి సమాజాలను ప్రభావితం చేసే నిర్ణయాలనేకం తీసుకుంటుంటాయి. అందువల్ల ఈ సమావేశాలన్నిట్లో తమ గొంతు వినబడాల్సిన అవసరముందని స్త్రీలు భావిస్తున్నారు. అందుకే అనేక విషయాలపై ముఖ్యంగా పర్యావరణం, మానవ హక్కులు, జనాభా, అభివృద్ధి, పిల్లల హక్కులు, వెనకబడిన చిన్న దీవి రాజ్యాల భవిష్యత్తు మొదలైన వాటిపై వారు ఈ సమావేశాలలో పాల్గొని తమ జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందరితో పంచుకున్నారు. దీనికంటే శక్తివంతంగా వాళ్లు చేసిన మరో పని ఏమిటంటే ప్రస్తుత చట్టాలన్నిటికీ సవాలు చేయడం, అన్ని అంశాలలోనూ స్త్రీల దృక్పథాన్ని చేర్చే గట్టి ప్రయత్నం చేయడం.

అంతర్జాతీయ సమస్యలపై ఎన్‌జివోల అభిప్రాయాలను ప్రభుత్వాలు చర్చించేందుకు ఐక్యరాజ్య సమితి సమావేశాలు ఎలా ఉపయోగపడతాయో అలాగే ఎన్‌జివో వేదికలో కూడా కొత్త సమస్యల్ని బయటికి తీసుకురావడానికి, ప్రస్తుత సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలను బేరీజు వేసుకోవడానికి చోటు లభిస్తుంది. దానివల్ల అన్ని స్థాయిల్లోనూ తమ పనితీరు మెరుగుపడుతుందని ఎన్‌జివోలు భావిస్తారు. బీజింగ్‌లోనూ అదే జరిగింది.

ఈ సమావేశానికి ముందు ఎన్‌జివో వేదిక ఐదు ప్రాంతీయ సమావేశాలను నిర్వహించింది. ఇవి 1993 నుండి 1995 మధ్య కాలంలో జరిగాయి. వాటికి కూడా స్త్రీలు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రాంతీయ సమస్యలను, అవసరాలను వివరించారు.

ఆసియా పసిఫిక్ ప్రాంతియా సమావేశం మొత్తం 12 సమస్యల్ని గుర్తించింది. తమ ప్రాంతంలో అభివృద్ధి చాలా అసమానంగా ఉందని చెపుతూ వారు ప్రస్తుత అభివృద్ధి నమూనాను తీవ్రంగా ప్రశ్నించారు.

లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల ప్రాంతీయ సమావేశం స్త్రీలపై జరుగుతున్న హింసకు, ప్రజాస్వామ్యానికి, రాజకీయ భాగస్వామ్యానికి, నిర్మాణ సర్దుబాట్లకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చింది.

యూరప్, ఉత్తర అమెరికా దేశాల స్త్రీలు శాంతికి, స్త్రీల మానవ హక్కులకు, రాజకీయ భాగస్వామ్యానికి, ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యం ఇచ్చారు.

మధ్య, తూర్పు యూరపు దేశాల స్త్రీలు ప్రధానంగా స్త్రీల పరిస్థితుల పట్లే ఆందోళన వెలిబుచ్చారు. అరబ్ దేశాల స్త్రీలు పర్యావరణం, రాజకీయ భాగస్వామ్యం, ఆర్థికాభివృద్ధి, ఇంటా బయటా శాంతి తమ ప్రధాన డిమాండ్లుగా చెప్పారు.

ఆఫ్రికా స్త్రీలు శాంతి, మానవ హక్కులతోపాటు దారిద్ర్య నిర్మూలనకు, ఆడపిల్లల సమస్యకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఉమ్మడి సమస్యల గురించి చర్చించి ఉమ్మడి వ్యూహాలను రూపొందించుకోవడానికి ఈ ప్రాంతీయ ఎన్‌జివో వేదికలు బాగా ఉపయోగపడ్డాయి. అయితే ఎక్కువ సమస్యలు ఒకే రకమైనవి కావడం వలన అన్ని ప్రాంతీయ వేదికలూ కలిసి ఉమ్మడిగానే వాటికి అక్షరరూపం ఇచ్చి బీజింగ్‌లో సమర్పించాల్సి వచ్చింది. ఆర్థికరంగంలో ప్రపంచీకరణ, సామాజిక రంగంలో ఛాందసవాదం పెరిగిపోతుండడం, మరోవైపు సాంకేతిక రంగం స్వభావంలో వస్తున్న మార్పులు, దాని వేగం, పాత రాజకీయ వ్యవస్థలు, కూటములు విచ్ఛిన్నమై కొత్తవి పుట్టుకు రావడం, ప్రపంచంలోని ప్రతి మూలనూ చేరుకోగలుగుతున్న ఈనాటి మీడియా ద్వారా సాంస్కృతిక ఏకీకరణకై జరుగుతున్న ప్రయత్నాలు, స్త్రీలపై మానవ హక్కుల అతిక్రమణలు ఏ మాత్రం

BRAOU

తగ్గక పోవడం, అన్ని వర్గాల, అన్ని వయస్సుల స్త్రీలకు దీనివల్ల కలుగుతున్న భయం-వీటన్నిటి మధ్య స్త్రీలు బీజింగ్‌లో కలిసి కూర్చుని భవిష్యత్తు పట్ల తమకున్న ఆశల్ని, భయాల్ని కలబోసుకున్నారు.

ఈ చర్చలు రెండు అవసరాల్ని ముందుకు తెచ్చాయి. ఒకటి-స్త్రీల జీవితాలను ప్రభావితం చేసే ప్రపంచ శక్తులపై స్త్రీల దృష్టినుంచి జరపాల్సిన విశ్లేషణను. రెండు-స్త్రీలు ఎదుర్కొనే సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను. ఎప్పుడూ బాధితులుగానే కాకుండా పరిష్కర్తలుగా కూడా తమకు గుర్తింపు ఉండాలని వాళ్లిప్పుడు కోరుతున్నారు.

ప్లీనరీ సమావేశాల్లో ప్రధానంగా ఈ రెండిటి మీదే దృష్టిపెట్టడం జరిగింది. మానవ సమాజాలమీద ముఖ్యంగా స్త్రీలమీద ప్రభావం చూపే ప్రపంచ శక్తుల విశ్లేషణతో ఇవి తమ పనిని ప్రారంభించాయి. వాటి మూలాలను, పర్యవసానాలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాయి. ఈ శక్తులకు విరుగుడుగా వచ్చిన వ్యూహాల నుండి గుణపాఠాలు తీసుకునే ప్రయత్నం చేశాయి. స్థానిక, ప్రాంతీయ, భవిష్యత్ తరాల దృక్పథాల నుండి వీటిని పరిశీలించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించాయి. సమస్యల విశ్లేషణలోనూ, పరిష్కారాల అన్వేషణలోనూ 'ప్రపంచాన్ని స్త్రీల కళ్లనుండి చూస్తే' ఎలా ఉంటుందో తెలుసుకోవడం కోసమే ప్లీనరీలను ఈ విధంగా ఏర్పాటు చేశారు.

ఈ సమావేశాలకు ప్రపంచంలోని అన్ని చోట్లనుండి ప్రముఖులైన మహిళా నాయకులు చాలామంది వచ్చారు. వారిలో మూలవాసులతో పని చేసేవాళ్లు, అట్టడుగు స్థాయి కార్యకర్తలు, యూనివర్సిటీలకు, పరిశోధనా సంస్థలకు, మీడియాకు, యువజన బృందాలకు, అంతర్జాతీయ సంస్థలకు, చర్చిలకు, కార్మిక సంఘాలకు, ప్రభుత్వానికి, స్వలింగ సంపర్క సంఘాలకు, వృద్ధమహిళా గ్రూపులకు, వికలాంగ స్త్రీల సంస్థలకు చెందినవాళ్లంతా ఉన్నారు. వాళ్లందరూ స్త్రీల జీవితాలలో గణనీయమైన మార్పులు తీసుకురావడానికి గత కొన్ని దశాబ్దాలుగా కృషి చేస్తున్న కార్యకర్తలే.

## 17.8 స్త్రీలపట్ల వివక్ష నిర్మూలనకు ఒప్పందం (CEDAW)

BRAOU

బీజింగ్ కార్యాచరణ వేదికతో పాటు స్త్రీలకు ముఖ్యమైన పనిముట్టుగా ఉపయోగపడగల మరో పత్రం సీడా ఒప్పందం. దీన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1979 డిసెంబర్‌లో ఆమోదించింది. 20 సభ్యదేశాలు సంతకాలు పెట్టాక 1981 సెప్టెంబర్ నుండి అది అమలులోకి వచ్చింది. ఐక్యరాజ్యసమితిలోని మొత్తం 189 దేశాలలో ఇప్పటికి 132 దేశాలు దీనిమీద సంతకాలు పెట్టాయి. బీజింగ్ సదస్సుకు కొంచెం ముందు దీనిని ఆమోదించిన దేశాలలో భారతదేశం కూడా ఒకటి.

దీన్ని స్త్రీల హక్కులకు సంబంధించిన ఒక సమగ్రపత్రమని చెప్పొచ్చు. ఇది స్త్రీలను లబ్ధిదారులుగా కాకుండా హక్కుదారులుగా చూస్తుంది. స్త్రీ పురుషుల సమానత్వం దీని ప్రాతిపదిక సూత్రం కాబట్టి మానవ హక్కుల సిద్ధాంతాన్ని, కార్యాచరణను కూడా ఇది విస్తృతపరుస్తుంది. స్త్రీల అసమానత్వం సాంఘికంగా తయారుచేయబడి వ్యవస్థీకృతంగా కొనసాగుతోందని, స్త్రీల పట్ల వివక్షను తొలగించడం అత్యంత ముఖ్యమైన విషయమని ఈ ఒప్పందం భావిస్తుంది. వివక్షను అది ఈ కింది విధంగా నిర్వచించింది. 'లింగం ఆధారంగా చూపే వ్యత్యాసాలు, విధించే పరిమితులు, ఆంక్షలు స్త్రీల పట్ల వివక్షగా భావించబడతాయి. స్త్రీలు (వారి వివాహ హోదాతో నిమిత్తం లేకుండా) రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పౌర, తదితర రంగాలలో స్త్రీపురుష సమానత్వం ప్రాతిపదికగా అన్ని మానవ హక్కుల్ని, మౌలిక స్వేచ్ఛల్ని అనుభవించగలగాలి. ఆ అనుభవాన్ని, గుర్తింపును నిరాకరించడం వివక్షగా భావింపబడుతుంది.'

స్త్రీల హక్కుల అమలులో జవాబు దారీతనం కోసం సీడా వాటికి శాసనరూపం ఇచ్చి తీరాలని చెప్పింది. స్త్రీ పురుషుల్ని అసమానులుగా, మూస పాత్రలుగా తయారుచేసే ఆచారాలు, సంప్రదాయాలు, సాంస్కృతిక పద్ధతులు స్త్రీలకు ఎంత హాని కలగజేస్తున్నాయో ఇది గుర్తించింది. అందువల్ల ప్రైవేట్ పబ్లిక్ రంగాలనే విభజననే సీడా తోసిపుచ్చింది. ప్రైవేట్ కూడా పబ్లిక్కేనని, అది రాజకీయమేనని సీడా వక్కాణించింది. స్త్రీల పౌర, రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కులు విడివిడి విషయాలు కావు, అవి అవిభాజ్యమైన హక్కులను చెప్పింది. అనుభవంలోని హక్కులకు, చట్టాల ద్వారా సంక్రమించిన

హక్కులకు మధ్యనున్న తేడాను ఇది గుర్తించింది. స్త్రీలు వర్తమానంలో అనుభవిస్తున్న వివక్షల్నే కాకుండా గతంలో అనుభవించిన వివక్షల్ని కూడా ఇది పరిగణనలోకి తీసుకుంది. వీటిని చక్కదిద్దేందుకు నిర్మాణాత్మక చర్యలు అవసరమని భావించింది. ఆచరణలో స్త్రీలకు సమాన హక్కులు ఉండాలంటే ఏమేం చేయాలో ఒప్పందంలోని నాలుగో భాగంలో పేర్కొన్నారు. జరిగిన తప్పుల్ని చక్కదిద్దే చర్యలతో పాటు స్త్రీలను కేంద్రంగా తీసుకుని ఎలాంటి అభివృద్ధి విధానాలను రూపొందించాలో దీనిలో వివరంగా ఉంది. అన్నిట్లోకి స్త్రీల సమానత్వం పట్ల రాజ్యం బాధ్యత వహించేలా చేయడం సీడా ఘనవిజయం. భవిష్యత్తులో స్త్రీలకది చాలా శక్తివంతమైన పనిముట్టుగా ఉపయోగపడగలదు. ఈ ఒప్పందాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలకే ఉండడం వలన అవి ఎప్పటికప్పుడు సీడా అమలు పర్యవేక్షణకు ఏర్పడిన కమిటీకి తమ నివేదికల్ని సమర్పిస్తూ ఉండాలి.

అన్ని స్థాయిల్లోను నిర్ణయాధికారాలలో సమానత్వం ఉండాలనే ప్రతిపాదన ఎవరి నుంచి ఎటువంటి సవాలు లేకుండా ఆమోదింపబడటం సీడాకు సంబంధించిన మరో విశేషం.

## 17.9 ముగింపు

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు ఇక్కడ కూడా ఎవరి మాట చెల్లుబాటు అవుతుందా, ఎవరి అభిప్రాయం పైచేయి అవుతుందా అని చూసుకున్నారు కాని బీజింగ్ కొచ్చిన స్త్రీలు, ఎన్జీవోలు మాత్రం రాజకీయ ఆర్థిక విభేదాలతో నిమిత్తం లేకుండా కలిసిమెలిసి పనిచేశారు. పరిచయాలు పెంచుకుని నెట్‌వర్క్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఉదాహరణకు భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు కాశ్మీర్ గురించి వాదించుకుటుండగా ఈ రెండు దేశాల నుంచి వచ్చిన స్త్రీలు ఆ ఘర్షణలకు స్వస్తి చెప్పాలని ప్రచారం చేస్తూ కనిపించారు. మరో ఉదాహరణ ఏమిటంటే సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఫ్రెంచ్ ప్రభుత్వం తమ దేశ స్త్రీల, ఎన్జీవోల నిరసనను పట్టించుకోకుండా పసిఫిక్‌లోని ఒక దీవిలో అణుపరీక్షలు జరిపితే అణ్వస్త్రాలను వ్యతిరేకించే స్త్రీలందరూ కలిసి బీజింగ్‌లో పెద్ద పెట్టున తమ ఆగ్రహం తెలియజేశారు.

కార్యాచరణ వేదిక అమలుకోసం ప్రాంతీయ స్థాయిల్లో, జాతీయ స్థాయిల్లో చేసే పోరాటాలతో పాటు స్త్రీలు అంతర్జాతీయ స్థాయిలో కూడా సమాన మానవ హక్కుల కోసం నిరంతరం జాగరూకతతో ఉండాల్సిన అవసరముంది. అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యం.

BRAOU

## 17.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

### *I. ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తుల్లో సమాధానాలు వ్రాయుము*

1. ఐక్యరాజ్యసమితి స్త్రీల కోసం ఇంతవరకు జరిపిన నాలుగు ప్రపంచ సదస్సుల నుండి ఏఏ పత్రాలు వెలువడ్డాయి? వాటి వివరాలు రాయండి.

2. బీజింగ్ సదస్సులో ముఖ్య సమస్యలుగా గుర్తింపబడిన వాటి గురించి క్లుప్తంగా రాయండి.

3. కార్యాచరణ వేదిక సారాంశాన్ని రాసి, బీజింగ్‌లో ముఖ్య సమస్యలుగా గుర్తించినవాటికి అది చూపే పరిష్కారాలను తెలపండి

### *ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు రాయండి*

1. కార్యాచరణ వేదికలో ఉన్న లోటుపాట్లేమిటి?

2. బీజింగ్‌లో భారతీయ ఎజెండా ఏమిటి? అది ముఖ్య సమస్యలన్నిటిని పరిగణనలోకి తీసుకుందా?

3. ఎన్జీవో ఫోరం అంటే ఏమిటి? ఐక్యరాజ్యసమితి సమావేశంలో దాని పాత్ర ఏమిటి?

## 17.11 సంప్రదింపు గ్రంథాలు


From Vienna to Beijing: *The Copenhagen Hearing on Economic Justice and Women's Human Rights,* Centre for Women's Global Leadership, Copenhagen, March 1995.

Mahnaz Afkhami, Universality and Relativism in the Beijing Platform for Action Awid News: *The Newsletter of the Association for Women in Development,* Vol. 10:1, March 1996.

Look at the World Through Women's Eyes: *Final Report of the NGO Forum on Women,* Beijing '95.

Shanthi Dairiam, *'The UN Convention of the Elimination of all Forms of Discrimination Against Women',* IWRAW -Asia Pacific, 1994.

*Indian NGOs Report on CEDAW,* Coordination Unit Fourth World Conference on Women Beijing '95

*Eva Friedlander, ed.Look at the World Through Women's Eyes: Plenary Speeches from the NGO Forum on Women, Beijing '95. NGO Forum on Women,* Beijing '95 Inc: 1996.

*Looking at the World thorugh Women's Eyes: An Indian View,* Coordination Unit, Fourth World Conference on Women-Beijing, 1995.



Lesson Writer : Kalpana Kannabiran, "Asmita"

Translator: Vemana Vasanthalaxmi


BRAOU

# భాగం 18 : నూతన ప్రపంచ వ్యవస్థ-మానవ హక్కులు, కొత్త ధోరణులు

విషయక్రమం:


18.0 ఉద్దేశం

18.1 పరిచయం

18.2 ప్రచ్ఛన్నయుద్ధం-అనంతర దశ

18.3 వియన్నా సదస్సు-విశ్వమానవ హక్కుల సమస్య

18.4 వియన్నా సదస్సు-సామాజిక, ఆర్థిక హక్కులు

18.5 జాతుల పోరాటాల సమస్య

18.6 ప్రజాస్వామ్యం, అభివృద్ధి-మానవ హక్కులు

18.7 సదస్సు ఇతర విధానాలు

18.8 ముగింపు

18.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

18.10 సంప్రదింపు గ్రంథాలు


## 18.0 ఉద్దేశం

### ఈ భాగం చదివిన తర్వాత మీరు

- కొత్త ప్రపంచ వ్యవస్థ రూపు దిద్దుకున్న తీరు తెన్నులను తెలుసుకుంటారు.
- వియన్నా సదస్సు చర్చించిన విశ్వ మానవ హక్కుల సమస్యలను తెలుసుకుంటారు.
- జాతుల పోరాటాల సంఘర్షణల్లో మానవ హక్కుల ఉల్లంఘన గురించి తెలుసుకుంటారు.

## 18.1 పరిచయం

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత విస్పష్టంగా బహిర్గతమైన, ప్రపంచ వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపిన సంచలన సంఘటనలు 1989 నుంచీ అనేకం జరిగాయి. సోవియెట్ యూనియన్ పతనమవడంతో తూర్పు యూరప్‌లో కమ్యూనిస్టుల గుత్తాధిపత్యం అంతమైంది. ఈ పరిణామం కొత్త జాతి రాజ్యాలు ఏర్పాటు అన్న ప్రాతిపదికన జాతుల పోరాటాలు ప్రబలడానికి దారితీసింది. తూర్పు యూరప్ అంతటా జాతుల సంఘర్షణలు చుట్టు ముట్టడంతో చాలా దేశాలు తమతమ సరిహద్దు రేఖలను కూడా మార్చుకోవాల్సి వచ్చింది. తూర్పు యూరప్‌లో ఈ పరిస్థితి వుండగా, పశ్చిమ యూరప్ తద్భిన్నంగా, ఐక్య బలాన్ని పెంచుకనే దిశగా, రాజకీయ, ఆర్థిక ఏకీకరణ దిశగా కదిలింది. సహజంగానే ఈ నూతన పరిణామాలన్నీ మానవహక్కుల ఉద్యమంపై ప్రభావాన్ని పడవేశాయి. మానవహక్కుల ఏజెండాలో ఇవి పాత సమస్యలకు సరికొత్త నిర్వచనాలు రూపొందించుకోవడం, కొత్త సమస్యలను యోచించడం, కొత్త ప్రాధాన్యతలు రూపొందించుకోవడం అన్న అంశాలుగా వున్నాయి.

BRAOU

# 18.2 ప్రచ్ఛన్న యుద్ధం-అనంతర దశ

ఒకప్పటి అగ్రరాజ్యం, సోవియెట్ యూనియన్ కుప్పకూలడం అన్నదే 1990లో ప్రపంచ రాజకీయాల్లో అత్యంత నాటకీయ పరిణామమని చెప్పవచ్చు. అయితే సోవియెట్ యూనియన్ ప్రచ్ఛన్న యుద్ధానికి ఎందుకు తలవంచిందన్న విషయాలను పక్కన బెడితే, దీనివల్ల మొత్తంగా బలాల సమీకరణల్లో వచ్చిన మార్పులేమిటి? సహజంగానే అవి ప్రపంచ దృక్పథంతో పరిశీలించినప్పుడు మానవ హక్కుల ప్రాధాన్యతలపై కలగజేసిన ప్రభావం ఏమిటి? అన్నవి పరిశీలనాంశాలు. సోవియెట్ యూనియన్ వెనుకంజతో సహజంగానే ఇంకొక అగ్రరాజ్యమయిన అమెరికా సాపేక్షిక బలాబలాలను పెంచిందని చెప్పవచ్చు. ఇదే సమయంలో జపాన్, యూరోపియన్ యూనియన్‌ల ఆర్థిక సంపత్తి వల్ల ప్రపంచం ఏకధృవ ప్రపంచంగా మారుతున్నదా లేదా భిన్న కేంద్రాల సముదాయమవుతున్నదా? అన్న విషయం యోచించాలి. అయితే ఇప్పటి పరిస్థితుల మేరకు ఆర్థిక, వ్యూహాత్మక, సైనిక శక్తిలో అమెరికాను మించిన శక్తి లేదన్నది, అమెరికా అగ్రరాజ్యాన్ని ఈ విషయాల్లో సవాల్ చేసే మరే శక్తి లేదన్నది వాస్తవం. ఈ విధంగా ప్రచ్ఛన్న యుద్ధానంతర దశలో అమెరికా తిరుగులేని అగ్రరాజ్యంగా రూపొందింది.

ఆధిపత్య భావనలను వివిధ స్థాయిలలో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఆలోచనా ధోరణుల స్థాయిలో కూడా ఆధిపత్య భావజాలం పనిచేస్తుంది. ఇది మానవ హక్కుల క్రియాశీలతతో మార్పు తెస్తుంది. సహజంగానే మానవ హక్కుల విషయంలో అమెరికా ప్రాధాన్యతలు మన ప్రజాచైతన్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా ప్రపంచ మానవ హక్కుల ఏజెండా అమెరికా మానవ హక్కుల ఏజెండాకు కొనసాగింపుగా మారుతుంది.

సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో జాతుల పోరాటాల సమస్యలు కూడా తలెత్తాయి. ఆయా జాతులు యూనియన్‌లో వున్నంత కాలం తాత్కాలికంగా మరచిపోయిన స్వయం నిర్ణయాధికార హక్కు సమస్య మళ్లీ ముందుకు వచ్చింది. ఫలితంగా జాతుల స్వయం నిర్ణయాధికార హక్కును కోరే రాజకీయ అసమ్మతి వాదులను రాజ్యం అణచివేసేందుకు ప్రయత్నించడంతో సరికొత్తగా హక్కుల ఉల్లంఘనలకు ఆస్కారం ఏర్పడింది. ప్రచ్ఛన్న యుద్ధానంతర దశలో అమెరికా గుత్తాధిపత్యం కఠిన వాస్తవమే అయినప్పటికీ, మరోవైపు అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేసేందుకు ఇతరేతర దేశాలన్నీ ఐక్య కార్యాచరణకు నడుం కడుతున్నాయి. అలీన ఉద్యమం ఇందులో ప్రముఖమైంది. విశ్వ జనాభాలో ఒకటింట మూడువంతుల జనాభా పరిధిలోకి వచ్చే అలీన ఉద్యమం అమెరికా ఆధిపత్యంపై ఒక స్వతంత్ర సవాల్‌గా చెప్పవచ్చు. కడచిన కొద్ది సంవత్సరాలలో మరీ ముఖ్యంగా 1990లో అలీన ఉద్యమం 'ఉత్తర, దక్షిణాది దేశాల సమస్యలలో జోక్యం చేసుకొని, ఒక నిరసన ఉద్యమంగా రూపుదిద్దుకుంటున్నది. ప్రాక్, పశ్చిమ దేశాల సమస్యలు ప్రచ్ఛన్న యుద్ధానంతరం క్రమ క్రమంగా తెరమరుగు అవడంతో ఇప్పుడు అలీన ఉద్యమం ఫలితంగా ఉత్తర, దక్షిణాది దేశాల సమస్యలు ప్రధానంగా ఏజెండాపైకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సంఖ్యాపరంగా చిన్నవే అయినప్పటికీ, పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించిన ఉత్తరాది దేశాలకు, కేవలం ప్రాథమిక ఉత్పత్తుల రంగంలో మాత్రమే వుండి అభివృద్ధిలేని, దారిద్ర్య దేశాలయిన దక్షిణాది దేశాలకు మధ్య గండి ఏర్పడింది. ఫలితంగా అలీనోద్యమం మానవ హక్కులలో ఆర్థిక, సామాజిక హక్కులు కూడా అంతర్భాగమే అన్న అంశాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తేగలిగింది. అమెరికా మానవ హక్కుల ఏజెండాలో ఈ అంశమే పరిగణనలోకి రాలేదు.

ఈ పరిణామాలు ఇలా వుండగా, ప్రచ్ఛన్న యుద్ధానంతర పరిణామాల్లో 1992లో యూరోపియన్ ఆర్థిక సమైక్యత (EEC) ఫలితంగా ఏర్పడిన యూరప్ రాజకీయ సమైక్యత కూడా ఎన్నదగిన పరిణామం. సమైక్య యూరఫ్ అమెరికా కన్నా, సోవియెట్ యూనియన్ కన్నా బలమైన శక్తిగా రూపుదిద్దుకున్నది. ప్రపంచ వ్యాప్తంగా వున్న సోషల్ డెమొక్రటిక్ పార్టీల ఏజెండా, ప్రపంచ కార్మికుల, ట్రేడ్ యూనియన్‌ల విధానాలు, వ్యూహాల నేపథ్యంలో ఐక్య యూరప్ నిర్మితం అవుతున్నది. ఫలితంగా యూరప్ సమైక్యత ప్రాదుకున్న కొద్దీ మానవ హక్కులలో సామాజిక ఆర్థిక అంశాల ప్రాధాన్యత పెరగ గలదని భావించవచ్చు.

ఈ పరిణామాలన్నీ రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన సామాజిక, రాజకీయ క్రమాన్ని మార్చి వేసింది.

BRAOU

అట్లాగే సోవియెట్ యూనియన్ పతనంతో అప్పటిదాకా వున్న కమ్యూనిస్టు ఆధిపత్యాన్ని కూడా ప్రపంచీకరణ, పెట్టుబడి దారీ విధానం,పరిధిల్లో రూపుదిద్దుకుంటున్న ఐక్య యూరప్ విధానాలు బద్దలు కొట్టాయి. ఈ కారణంగానే మాజీ కమ్యూనిస్టు దేశాలన్నీ 'మార్కెట్ ఎకానమీ' వేపు మొగ్గుచూపుతున్నాయి. అయితే, ఈ పరిస్థితులు తప్పని సరిగా రాజకీయ ఉదారవాదం వేపు, ప్రజాస్వామ్యీకరణవేపు తప్పని సరిగా దారి తీయాలన్నదేమీ లేదు. 1989లో చైనాలోని తియానన్మెన్ స్క్వేర్‌లో ప్రజాస్వామ్య వాదులపై జరిగిన దమనకాండ ఇందుకు ఓ సూచిక. చైనాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు జరిగిన ఈ ఉద్యమంలో మానవ హక్కుల ఉద్యమంలో ఒక మలుపు. 1993 వియన్నా సదస్సులో ఈ వైఖరిని సమర్థించారు.

# 18.3 వియన్నా సదస్సు - విశ్వ మానవ హక్కుల సమస్య

మానవ హక్కులు, సార్వత్రికమైనవని విశ్వ మానవాళికి సంబంధించినవని వియన్నా సదస్సు ప్రకటించింది. పౌరులకు హక్కులు నిరాకరించడంతో ఆయా రాజ్యాలు సార్వభౌమాధికారం అనే ధోరణిని సాకుగా చూపడాన్ని వియన్నా సదస్సు తిరస్కరించింది. మానవ హక్కుల అమలుకు సంబంధించి అంతర్జాతీయ ఆందోళనల ముందు సార్వభౌమాధికారం అనే సాగు బలహీనంగా వెలవెల పోయిందని, వియన్నా సదస్సులో ఇదే ఆసక్తికరమైన అంశమని కెవిన్ బోయ్‌లే ప్రకటించారు. ఏ రాజ్యానికి చెందిన మానవ హక్కులయినా ప్రపంచ దేశాలన్నింటికి సంబంధించినవే అని వియన్నా సదస్సు విస్పష్టంగా ప్రకటించింది.

ఈ దశలో చైనాతో పాటు పలు ఆసియా దేశాలు పాశ్చాత్య నమూనా సమాజాలకు సార్వత్రిక ప్రాధాన్యత లేనందువల్ల ఇతర సమాజాలలోని ప్రత్యేకతలయిన జాతీయ, ప్రాంతీయ, చారిత్రక, సాంస్కృతిక, మతపరమైన తేడాలు వున్నందువల్ల ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల విషయంలో దేశీయ విధానాలు అవసరమని వాదించాయి. ఒకే సార్వత్రిక విధానం కన్నా ఆయా వైవిధ్యాల వల్ల మానవ హక్కులు దేశీయంగా వుండాలని ఈ దేశాలు కోరాయి. వియన్నా సదస్సు ఈ అంశాన్ని గుర్తించింది. అయితే, ప్రపంచ దేశాలన్నీ మానవ హక్కులను సార్వత్రిక హక్కులుగానే గుర్తించాలని, అన్ని దేశాలు సమాన స్థాయిలో మానవ హక్కులు అమలు పరచాలని వియన్నా సదస్సు స్పష్టం చేసింది.

# 18.4 వియన్నా సదస్సు-సామాజిక, ఆర్థిక హక్కులు

వియన్నా సదస్సు విశ్వమానవాళికి సంబంధించిన మానవ హక్కులపై అనుసరించినవైఖరి ఆసియా దేశాల డిమాండ్‌ను తిరస్కరించింది. అదే సమయంలో సామాజిక, ఆర్థిక హక్కులను కాదని రాజకీయ, పౌరహక్కులకు పెద్దపీట వేయాలన్న అమెరికా వాదనను కూడా వియన్నా సదస్సు తిరస్కరించిందని చెప్పవచ్చు. ఒక పౌరుని పౌర, రాజకీయ హక్కుల అణచివేతకు ఎంత ప్రాధాన్యం వుందో, ఆర్థిక హక్కుల అణచివేతకు కూడా అంతే ప్రాధాన్యం వుందని వియన్నా సదస్సు స్పష్టం చేసింది. మానవ హక్కులు సార్వత్రికమైనవి, విభజించరానివి, పరస్పరసంబంధమైనవి ఈ సదస్సు వక్కాణించింది. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధం పౌర, రాజకీయ హక్కులకు, ఆర్థిక, సామాజిక హక్కులలో ఏది ముఖ్యమనే అపరిష్కృత వివాదాల్ని రేపింది. అలాగే అభివృద్ధి హక్కుకు సంబంధించి కూడా ఈ వివాదం ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో కొనసాగింది. ఆర్థిక, సామాజిక హక్కులకు సంబంధించి అమెరికా ఆలోచనా విధానం సోషలిస్టు రాజ్యాలతో విభేదించింది. ఘర్షణ పడింది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా స్వయంగా, ఆర్థిక, సామాజిక హక్కులు, రాజకీయ, పౌర హక్కులు పరస్పర సంబంధితమైనవని అంగీకరించడం ప్రచ్ఛన్నయుద్ధానంతరం వచ్చిన ఒక సానుకూల విజయమని కెవిన్‌బోయ్‌లే అభివర్ణించారు.

ఇదే కాకుండా, అభివృద్ధి చెందుతున్న దేశాల అన్ని రుణాలను చెల్లింపుల వాయిదా వేయాలని వియన్నా సదస్సు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేయడంతో మానవ హక్కులలో ఆర్థిక కోణానికి మరింత బలం చేకూరింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించివున్న దారిద్ర్యం, మానవహక్కులను అనుభవించడానికి ఒక అడ్డంకి అని సదస్సు వెల్లడించింది. మానవహక్కులు, ఆర్థిక కోణాలు అన్న ఈ కొత్త వాదన ఈ రకంగా ప్రపంచ రాజకీయాలలో చర్చనీయాంశంగా మారింది.

BRAOU

దక్షిణాది దేశాలు అభివృద్ధి చెందేందుకు హక్కు కలిగి ఉన్నారని, రాజకీయ స్థిరత్వానికి, పౌర, రాజకీయ హక్కులను గౌరవించడానికి, సామాజిక, ఆర్థిక హక్కులకు తప్పనిసరిగా హామీ పడాలని ఉత్తరాది దేశాలు అంగీకరించడం ఈ సదస్సులో గుర్తు పెట్టుకోవాల్సిన పరిణామమని కెలిన్ బోయ్‌లే వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో స్థిర అభివృద్ధి సాధనకు ప్రజలు, స్వయంగా నిర్ణయాధికారం కలిగి వున్న ఒక ప్రజాస్వామ్య సమాజం కావాలని దక్షిణాది దేశాలు కూడా అంగీకరించడం ఈ సదస్సు మరో విజయమని 'బోయ్‌లే' అన్నారు.

## 18.5 జాతుల పోరాటాల సమస్య

సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నం, తత్ఫలితంగా తూర్పు యూరప్‌లో చెలరేగిన జాతుల సంఘర్షణలవల్ల వియన్నా సదస్సు స్వయం నిర్ణయాధికారం, జాతివివక్ష, పరజాతి ద్వేషం, అసహనంలకు సంబంధించి తప్పనిసరి మాట్లాడవలసిన అగత్యం ఏర్పడింది. అయితే తూర్పు యూరప్, ఆసియా, ఆఫ్రికాలలో చెలరేగిన జాతి పోరాటాలు, సంఘర్షణలు ఫలితంగా జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి వియన్నా సదస్సు సత్వర సమాధానాలేవీ ప్రకటించలేదు. స్వయం నిర్ణయాధికార హక్కుకు సంబంధించిన అంశం నిజానికి ఎప్పటికన్నా ఎక్కువ అవసరంగా మారింది. ఎందుకంటే, రాజ్యాలు కుప్ప కూలడం కన్నా, జాతుల సంఘర్షణల్లోనే ఈనాడు మానవ హక్కుల ఉల్లంఘనలు అతిగా జరుగుతున్నాయి. సోమాలియా, లైబేరియా, రువాండా, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాలలో రాజ్యం కన్నా సంఘర్షణలవల్లనే హక్కుల ఉల్లంఘనలు ఎక్కువని తేలింది. అయితే, సార్వభౌమాధికార రాజ్యాల రాజకీయ ఐక్యత, ప్రాదేశిక సమగ్రతలు, సమాన హక్కులను కాపాడినప్పుడు జాతుల సంఘర్షణలకు వాటిని విస్మరించరాదని సదస్సు సూచించింది. ఈ విధంగా ఒక దేశంలోని అందరికీ అన్ని హక్కులూ సమానంగా వుండాలని సదస్సు సూచించింది.

## 18.6 ప్రజాస్వామ్యం–అభివృద్ధి–మానవ హక్కులు

మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, అభివృద్ధికి వున్న సంబంధాన్ని కూడా వియన్నా సదస్సు మరో విధానంగా ప్రకటించింది. అభివృద్ధికి కేంద్ర బిందువు మానవుడే అని, ఆయా రాజ్యాలు విధుల నిర్వహణకే హామీ పడాలని సదస్సు పేర్కొన్నది. ప్రాథమిక వనరులు, విద్య, ఆరోగ్యం, ప్రజాసేవలు, ఆహారం, గృహవసతి, ఉపాధి, ఆదాయ న్యాయబద్ధ విభజన తదితర అంశాల్లో అందరికీ సమాన అవకాశాలను రాజ్యం హామీ పడాలని వియన్నా సదస్సు ప్రకటించింది. అలాగే, ప్రజాస్వామ్య పునాది, చట్టపరమైన సమర్థ సంస్థలు, సమాన స్థాయిలో స్త్రీ, పురుషుల సమాన భాగస్వామ్యం అభివృద్ధికి అవశ్యమని కూడా ఈ సదస్సు వెల్లడించింది.

## 18.7 సదస్సు ఇతర విధానాలు

వియన్నా సదస్సు పై అంశాలతో పాటు, స్వదేశీ ప్రజల హక్కులు, మైనారిటీలు, స్త్రీలు, బాలలు, వికలాంగులకు సంబంధించి కూడా పలు విధానాలు ప్రకటించింది. ప్రపంచ మంతటా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్న అంశాలైన జాతి విద్వేషం, వినశలను నియంత్రించాల్సిన అవసరముందని కూడా సదస్సు అభిప్రాయ పడింది. చిత్ర హింసలు, దుర్మార్గాలు, మూకుమ్మడి హత్యలు, అదృశ్యాలకు సంబంధించి కూడా వియన్నా సదస్సు ఆందోళన ప్రకటించింది. వీటిని అరికట్టడానికి సమర్థవంతమైన న్యాయ చట్టాలను రూపొందించాలని సదస్సు ప్రతిపాదించింది.

## 18.8 ముగింపు

మారుతున్న ప్రపంచ వ్యవస్థ, మానవ హక్కులపై దాని ప్రభావాన్ని ఈ పాఠంలో చర్చించాం. మారిన ప్రపంచ అధికార

BRAOU

నిర్మాణాలు, మానవ హక్కుల ప్రామాణికతలను పురోగతిలోకి తీసుకు వెడుతున్న విషయాన్ని ఈ పాఠంలో చూశాం.

మారిన ప్రపంచ వ్యవస్థలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వైవిధ్యాలు మానవ హక్కులను రూపొందిస్తాయన్న విషయమై అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాల మధ్య ఒక అసహజ వాతావరణాన్ని సృష్టించినప్పటికీ వియన్నా సదస్సు ఒక రకంగా ఈ రెండు భేదాలమధ్య అవగాహనను సమతుల్యాన్ని సాధించిందని చెప్పవచ్చు. ఇంకా రూపుదిద్దుకోవాల్సివున్న నూతన ప్రపంచ వ్యవస్థలోని సంఘర్షణలను, ఆందోళనలను వియన్నా సదస్సు పలు రకాలుగా ప్రతిబింబించింది. అదే సమయంలో ప్రపంచ రాజకీయాల్లో 1989 నుంచి జరుగుతున్న పరిణామాలు ఇప్పటికీ చర్చనీయాంశమేనని, పాత వ్యవస్థ హామీలు, విధానాలు కనుమరుగై కొత్త వ్యవస్థ ఏర్పాటు కనుక వాటిని పూర్తిగా త్య జీకరించలేమని వియన్నా సదస్సు వెల్లడించింది. ఈ రకంగా వియన్నా సదస్సుకు కొత్త సీసాలో పాత సారా అని అభివర్ణించవచ్చు. అయితే వియన్నా సదస్సుకు కేవలం పలుకొత్త అంశాలను లేవనెత్తినందుకే కాకుండా, మానవ హక్కుల సాధారణ అవగాహనకు ఉపయోగపడే రీతిలో పాత చర్చలను పునర్ నిర్వచించినందుకు అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య ఒక వారధి నిర్మించే ప్రయత్నం చేసినందుకు గుర్తు పెట్టుకోవచ్చు.

## 18.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I.** *ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానం రాయండి*

1. ప్రచ్ఛన్న యుద్ధానంతర యుగంలో వెల్లడవుతున్న విశేషాలేవి? మీ ఉద్దేశంలో అవి మానవ హక్కులపై కలుగజేస్తున్న ప్రభావాలు ఏవి?

**II.** *ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో సమాధానం రాయండి*

1. మానవ హక్కులపై 1993 వియన్నా సదస్సు సాధించిన విజయాలేవి?
2. వియన్నా సదస్సులో మానవ హక్కులపై లేవనెత్తిన ప్రధాన అంశాలేవి?

BRAOU

## 18.10 సంప్రదింపు గ్రంథాలు


(1) 'ఫర్స్ జనరల్ ఓవర్‌వ్యూ ఆన్ ది పోస్ట్ కోల్డ్‌వార్ ఆర్డర్' ఆర్. చక్రవర్తి (పోస్ట్ కోల్డ్‌వార్ ఇంటర్నేషనల్ రిలేషన్స్: సమ్ ఆబ్జర్వేషన్స్) - జాదవ్‌పూర్ జర్నల్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, వాల్యూమ్ 1, 1995 (ఇనాగ్యురల్ ఇష్యూ)

(2) డెనిచ్, బోగ్డాన్, 'ది ఎండ్ ఆఫ్ ది కోల్డ్ వార్, యూరోపియన్ యూనిటీ, సోషలిజం, అండ్ ది షిఫ్టింగ్ గ్లోబల్ పవర్, యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసోటా ప్రెస్, మిన్న పొలిస్ 1990

(3) అర్జున్ దేవ్ అండ్ బ్రదర్స్. (కంపైల్డ్) హ్యూమన్ రైట్స్: ఎ సోర్స్ బుక్. ఎన్.సి.ఇ.ఆర్.టి *1996*, న్యూఢిల్లీ.

(4) కెలివ్‌బోయ్‌లే, స్టాక్ టేకింగ్ ఆన్ హ్యూమన్ రైట్స్, ది వరల్డ్ కాన్ఫరెన్స్ ఆన్ హ్యూమన్ రైట్స్ వియన్నా *1993*. పొలిటికల్‌స్టడీస్ వాల్యూమ్ *XLIII*, స్పెషల్ ఇష్యూ 1995 (పాలిటిక్స్ అండ్ హ్యూమన్ రైట్స్)

BRAOU

BRAOU

# అందరికీ అందుబాటులో ఉన్నత విద్య




డా॥ బి.ఆర్
అంబేద్కర్
సార్వత్రిక
విశ్వవిద్యాలయం

రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033

GDHR - ( T ) 03

# మానవ హక్కులు : ప్రపంచ పరిస్థితులు



డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం , హైదరాబాద్

## పాఠ్య నిర్మాతలు

**సంపాదకులు**

ఆచార్య వి.ఎస్. ప్రసాద్

**సహ సంపాదకులు**

ఘంటా చక్రపాణి

**రచయితలు**

ఆచార్య జి. హరగోపాల్

ఎ.సునిత

జె. ఇందిర

అంజన్ కుమార్ భాంజా

పూలపల్లి వెంకట రమణ

రతన్‌లాల్ హంగ్లూ

డా॥ ఎం. చెన్నబసవయ్య

**కార్యక్రమ సమన్వయకర్త**

ఘంటా చక్రపాణి

**అనువాదం**

కె. శ్రీనివాస్

అల్లం నారాయణ

ఐ.వి.వి. నాగసుందరి

***ముఖచిత్రం***

చంద్ర

BRAOU

---

**డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం,**

హైదరాబాద్

ప్రథమ ముద్రణ, 2001

---

**©2001, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం.**

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నయినా ఉపయోగించదలచుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

---

ఇతర వివరాలకు : **డైరెక్టర్ (అకడమిక్), డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.**

ప్రొ. జి. రాంరెడ్డిమార్గ్, రోడ్ నెం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాదు - 500 033.

Lr. No.135/Dr.BRAOU/DMP/PTG/F.No. 07/J.O.No.605/2001-2002 dt:3-8-2001 Copies:500

Printed at M/s. Sai Krupa Offset Printers, Musheerabad, Hyd. Ph : 7641033.

# పరిచయం

ఇది మానవ హక్కుల యుగం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో, అన్ని సమాజాల్లో ఇప్పుడు మానవ హక్కులు ఒక ప్రధానమైన చర్చనీయాంశం. ఒక రకంగా చెప్పలంటే గడిచిన సహస్రాబ్దిని మనం మానవ హక్కుల సహస్రాబ్దిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే మానవ హక్కుల భావన వికసించింది, విస్తరించింది ఈ సహస్రాబ్దిలోనే.

మానవ జాతిలో హక్కుల భావన తొలిసారిగా మొలకెత్తిన 13వ శతాబ్ది తొలిరోజుల నుంచి ఈనాటి 21వ శతాబ్ది ఆరంభం దాకా మానవ హక్కుల ఉద్యమం అనేక పరిణామాలకు గురి అయ్యింది. అనేక సిద్ధాంతాలు, అనేక ధోరణులు, దృక్పథాలు చారిత్రక భావనలు మానవ హక్కుల భావనకు మరింత పదును పెట్టాయి. పరిపుష్టం చేశాయి. ఇప్పుడు మన దేశంలాంటి అనేక దేశాలు, ఆ దేశాల ప్రజల చేతుల్లో మానవ హక్కులు ఒక వజ్రాయుధం అయ్యింది. ఒక మహోజ్వల ఉద్యమంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఈ ఉద్యమంలో అగ్రభాగాన వుంది.

ఈ నేపథ్యంలో మానవ హక్కుల భావనను జనబాహుళ్యానికి తెలియపరచడం బాధ్యతగా భావించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మానవ హక్కుల విద్యా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఒక డిప్లొమాను ప్రవేశపెట్టాలని విశ్వవిద్యాలయం నిర్ణయించింది. మానవ హక్కుల సంఘం (NHRC) పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా విద్యా కార్యక్రమంలో చేర్చడంతోపాటు, దేశంలోనే తొలిసారిగా ఒక పూర్తిస్థాయి డిప్లొమాను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగులో మీ కందిస్తోంది.

ఐదు కోర్సులుగా వున్న డిప్లొమా కార్యక్రమంలో మానవ హక్కులు: ప్రపంచ పరిస్థితులు ఒక కోర్సుగా చేర్చడం జరిగింది. ఈ కోర్సుకు ఒక సంపుటంగా మీకు అందిస్తున్నాం. ఇందులోని అధ్యయనాంశాలను మొత్తం ఐదు ఖండాలుగా విభజించడం జరిగింది.

అవి : 1. మానవ హక్కులు: స్థితిగతులు
2. పారిశ్రామిక సమాజాలు
3. సామ్యవాద సమాజాలు
4. అభివృద్ధి చెందుతున్న సమాజాలు
5. హక్కుల పరిరక్షణ క్రమం

ఈ ఐదు ఖండాల్లో మొత్తం 14 అధ్యయన భాగలు (యూనిట్లు) వున్నాయి. వీటిని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహకారంతో ఆయా రంగాల మేధావులు, మానవ హక్కుల ఉద్యమాలలో భాగస్వాములైన కార్యకర్తలు ఇతర వృత్తి నిపుణులు అధ్యాపకులతో రూపొందించడం జరిగింది. ఈ ప్రయత్నంలో మానవ హక్కుల పై తొలిసారి ఒక డిప్లొమాను రూపొందించిన సార్వత్రిక విశ్వవిద్యాలయంగా డా.. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ పాఠ్యాంశాలు కూడా తెలుగులో మొదటిసారిగా వెలువడుతున్న సమాచారం. ఈ పాఠ్యాంశాల అధ్యయనం ద్వారా మానవ హక్కుల పట్ల అవగాహనతో పాటు విద్యార్థులకు ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడే అవకాశం వుంది. అలాగే మానవ హక్కుల కార్యకర్తలకు, ఆ ఉద్యమంలో మమేకమైన వారికి ఈ కార్యక్రమం మార్గ నిర్దేశం చేస్తుతం

BRAOU

# విషయసూచిక


## ఖండం – I : మానవ హక్కులు – స్థితిగతులు

భాగం : 1 మానవ హక్కులు – ప్రస్తుత స్వరూపం

## ఖండం – II : పారిశ్రామిక సమాజాలు

భాగం : 2 అమెరికా, బ్రిటన్‌లలో మానవ హక్కులు

భాగం : 3 కెనడాలో మానవ హక్కులు

భాగం : 4 తూర్పు – ఆగ్నేయ ఆసియా దేశాల్లో మానవ హక్కులు

భాగం : 5 కొరియాలో మానవ హక్కులు

## ఖండం – III : సామ్యవాద సమాజాలు

భాగం : 6 పూర్వపు సోవియట్ యూనియన్‌లో మానవ హక్కులు

భాగం : 7 చైనాలో మానవ హక్కులు

భాగం : 8 క్యూబా, పోలెండులో మానవ హక్కులు

## ఖండం – IV : అభివృద్ధి చెందుతున్న సమాజాలు

భాగం : 9 దక్షిణా ఫ్రికాలో మానవ హక్కులు

భాగం : 10 లాటిన్ అమెరికాలో మానవ హక్కులు

భాగం : 11 ఇస్లామిక్ సమాజాలలో మానవ హక్కులు

## ఖండం – V : హక్కుల పరిరక్షణ క్రమం

భాగం : 12 మానవ హక్కుల ఉద్యమాలు

భాగం : 13 మానవ హక్కుల కమిషన్లు

భాగం : 14 మానవ హక్కులు – అంతర్జాతీయ చట్టం


BRAOU

# ఖండం – I

# మానవ హక్కులు – స్థితిగతులు

BRAOU

ఇరవవ్యే శతాబ్దం చివరలో మానవ హక్కులకు ప్రాధాన్యత ఏర్పడింది. మానవ హక్కుల కోసం పోరాటాలు ఒకవైపు సాధించుకున్న హక్కులను అనుభవించేందుకు ఉద్యమాలు మరోవైపు ఏకకాలంలో కనిపిస్తున్న తరుణంలో మానవ హక్కుల స్థితిగతులను అధ్యయనం చేయటం అత్యంతావశ్యకం. 17వ శతాబ్దం చివరలో ప్రారంభమైన మానవ హక్కుల ఉద్యమాలునేడు సార్వజనిక రూపుదాల్చటం చెప్పుకోదగిన ముందడుగుగానే పరిగణించాలి. మొదటి ఖండంలో మానవ హక్కుల ప్రస్తుత స్వరూపం చర్చించబడింది. ఈ ఖండంలో ఒక భాగం వుంది. అవి :

- భాగం : 1 మానవ హక్కులు – ప్రస్తుత స్వరూపం

BRAOU

# భాగం – 1: మానవ హక్కులు - ప్రస్తుత స్వరూపం

విషయక్రమం :


1.0 ఉద్దేశం

1.1 పరిచయం

1.2 వియాన్నా సదస్సు : ప్రాపంచిక ధోరణులు

1.3 అంతర్జాతీయ మానవ హక్కులు : చారిత్రక నేపధ్యం

1.4 అరాచక ధోరణులు

1.5 మానవ హక్కుల క్షీణతకు కారణాలు

1.5.1 పాలకవర్గం విధానాల్లో, స్వరూప స్వభావాల్లో తలెత్తిన చీలిక

1.5.2 విఫలమైన సామ్యవాద ప్రయోగం

1.5.3 అదృశ్యం అవుతున్న సంక్షేమ స్వభావం – పరిణామక్రమంలో రాజ్యం

1.5.4 : అంతర్జాతీయ ఆర్థిక శక్తుల పాత్ర

1.5.5 : క్షీణించి పోతున్న ఐక్యరాజ్యసమితి, ఇతర సంస్థల పాత్ర

1.6 ప్రస్తుత ప్రపంచం ముందున్న సవాళ్ళు

1.7 ప్రజల్లో పెరుగుతున్న స్పృహ

1.8 ముగింపు

1.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు


## 1.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- అంతర్జాతీయ మానవ హక్కులకు గల చారిత్రక నేపధ్యాన్ని తెలుసుకుంటారు.
- మానవ హక్కుల క్షీణతకు గల కారణాలు వివరించ గలుగుతారు.
- మానవ హక్కులపై ప్రజలలో పెరుగుతున్న స్పృహను తెలుసుకుంటారు.

BRAOU

## 1.1 పరిచయం :

అంతర్జాతీయంగా మనవ హక్కుల పరిస్థితులు గమనిస్తే, అంత ప్రోత్సాహకరంగా లేవు. మానవ హక్కుల ఉల్లంఘనలు పెద్ద ఎత్తున చోటుచేసుకోవడం మన కళ్ళ ఎదుట కనబడుతున్న సత్యం. అంతేకాదు మానవుల కుండే ఆత్మ గౌరవం, స్థాయి హోదాలకు కూడా ఇసుమంత ప్రాధాన్యం లేకుండా పోవడాన్ని గుర్తించగలం. ఇలాంటి పరిస్థితులు లేని దేశం మనకు ఈ భూగోళం మీద కనబడదు. అయితే హక్కుల అతిక్రమణ స్థాయిలో తేడాలు ఉండవచ్చు. కాని మానవ హక్కులను హీనపరిచే సంస్కృతి అన్నిచోట్ల ఒకేలాగా ఉంది. పారిశ్రామిక సమాజాలతో నిండి ఉన్న అమెరికా, బ్రిటన్, జపాన్, కెనడా దేశాలు కూడా వాళ్ళ ప్రజలకు గౌరవ ప్రదమైన స్థాయిని ఇవ్వలేక పోతున్నాయి. అభివృద్ధి గాని, సాంకేతిక పరిజ్ఞానం గాని, సంపదలు గాని నిత్యజీవితంలో మానవునికి స్వేచ్ఛా, గౌరవాలను ఇవ్వడం లేదన్నది విస్పష్టమయింది. ఇక వర్ధమాన దేశాలు లేదా మూడవ ప్రపంచ దేశాలు మూడొంతులు వలసపాలనకు, దోపిడీకి అణచివేతలకు గురయినవే. వలసాధిపత్యాన్ని ఎదిరిస్తు, స్వేచ్ఛా స్వాతంత్ర్య పిపాసతో ఈ దేశాల్లోని ప్రజలు ఎంతో పట్టుదలతో స్వాతంత్రోద్యమాలను చేశాయి. విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అయితే అదే స్ఫూర్తిని పోరాటపటిమను స్వాతంత్ర్యానంతరం స్వేచ్ఛా తదితర హక్కులను పరిరక్షించడంలో వర్ధమానదేశాలు వైఫల్యం చెందుతున్నాయి. మానవ హక్కుల పరంగా ఎదురయిన వివిధ అనుభవాలపై ఈ పాఠ్యాంశం అన్ని కోణాల నుంచి పరిశీలించింది.

## 1.2 వియన్నా సదస్సు : ప్రాపంచిక ధోరణులు :

వియన్నా ప్రపంచ సదస్సు 1993లో జరిగింది. జాతీయ దేశాలు ఒక వర్గంగా నిలబడితే, స్వచ్ఛందసంస్థలు, మానవ హక్కుల బృందాలు, ప్రజాసంస్థలు మరోవైపు నిలబడ్డాయి. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన (యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్) వెలువడిన నేపథ్యాన్ని కూడా ఈ పాఠంలో చర్చించారు. అంతే కాదు 1993 సంవత్సరం, వియన్నాసదస్సు నాటి పరిణామాలను కూడా ఇందులో విపులీకరించారు. 1993 వియన్నా సదస్సు నాటి పరిస్థితులకు. 1948 నాటి స్థితిగతులకు కూడ హస్తి మసకాంతరం ఉంది. వీటిని ఒక్కసారి అవలోకించాలి.

## 1.3 అంతర్జాతీయ మానవ హక్కులు : చారిత్రక నేపథ్యం :

20వ శతాబ్దం మధ్యలో సాధించిన మానవ హక్కుల సాధన వెనుక ఎన్నో పోరాటాలు, త్యాగాలు, నిర్మాణాత్మకమైన కృషి దాగుంది. మధ్యయుగాల చరిత్రలో మానవులు సమిష్టిగా చేసిన ఉద్యమాలు కనిపిస్తాయి. సాంస్కృతిక పునరుజ్జీవనము, సంస్కరణోద్యమాలు, విజ్ఞాన దృష్టి మానవ హక్కుల, స్వేచ్ఛా స్వాతంత్రాల ఉద్దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళింది. ఇటలీలో 14వ శతాబ్దంలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనం, బ్రిటన్‌లో 1688లో తలెత్తిన "గ్లోరియస్ రెవల్యూషన్", 1776లో అమెరికా సంయుక్తరాష్ట్రాల స్వాంతంత్ర్య ప్రకటన, 1778లో ఫ్రెంచి జాతీయ అసెంబ్లీ చేపట్టిన "డిక్లరేషన్ ఆఫ్ రైట్స్ ఆఫ్ మ్యాన్" ప్రతి పాదన ఇవన్నీ మానవ హక్కుల స్పృహకు, ఉద్దేశ్యాన్ని, ఆవశ్యకతలను పెంచి పోషించడానికి మార్గాన్ని సుగమం చేశాయి. 18,19 శతాబ్దాల్లో

BRAOU

జరిగిన ఈ ఉద్యమాలు ప్రపంచ చరిత్ర పుటల్లో ఎంతో ముఖ్యమైన స్థానాన్ని సంతరించుకున్నాయి. పారిశ్రామిక విప్లవం మానవ హక్కుల ఆవశ్యకతకు ఒక స్పష్టమైన రూపునిచ్చిందని చెప్పాలి. మార్కెట్ విస్తరణ మూలంగానే సరళీకృత భావజాలం (లిబరల్ ఐడియాలజీ) పెంపొందింది. అదే సమయంలో కనీస హక్కుల రక్షణకు, మార్కెట్ శక్తుల పోకడలు ఏ మేరకు రక్షణను చేకూర్చగలవనే పలు అనుమానాలు, సందేహాలు కూడా రేకెత్తాయి.

మార్క్సిజం ఆలోచనాధోరణి కూడా అనూహ్యమైన ప్రభావాన్ని తీసుకొచ్చింది. సరళీకృత పెట్టుబడీ దారీ విధానంకు మల్లే కాకుండా, అంతర్జాతీయంగా అణచివేతకు గురయ్యే వర్గాల వైపు నుంచి మార్క్సిజం తత్వవేత్తలు ఆలోచించారు. మొత్తం ప్రపంచాన్ని వర్గపోరాటం వ్యతిరేకతతో కూడుకున్న సంబంధాల్లోకి నెట్టిందనేది మార్క్సిస్టుల గాఢాభిప్రాయం. మార్క్సిజం మూలసూత్రం, తత్వం, లక్ష్యం పీడిత వర్గాల విముక్తి. మార్క్సిస్టులు చెప్పిన అర్థంలో, చేసిన వ్యాఖ్యానాల్లో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు, న్యాయాల పరిధి, ఉద్దేశాలు చాలా విస్తృతమైనవి. ఈ నేపథ్యంలో వ్యక్తి సంక్షేమం నుంచి సమిష్టి సంక్షేమానికి మళ్ళడం జరిగింది. ఈ పోకడలు మానవ హక్కుల ఉద్దేశ్యానికి సరికొత్త దృక్పథాన్ని జోడించిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

మానవ హక్కులపై అనూహ్యమైన ప్రభావాన్ని చూపించిన మరో ముఖ్య అంశం ఉంది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలలో వలసపాలనకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు చేపట్టిన, విజయం సాధించిన ఉద్యమాలు కూడా మానవ హక్కుల పెంపుదలకు ఎంతగానో తోడ్పడ్డాయి. వలసపాలనలో ఏళ్ళ తరబడి మగ్గిపోయిన ప్రజలు తమ స్వేచ్ఛ, న్యాయాలను పొందాలని తహతహలాడారు. దాంతో మానవ హక్కుల సాధనకు పెద్ద ఎత్తునే ప్రజా ఉద్యమాలు పుట్టు కొచ్చాయి. ఎన్నో ఏళ్ళుగా అక్కడి ప్రజలను వలసపాలకులు అన్ని విధాలుగాను పీల్చి పిప్పి చేశారు. వారిని దోచుకున్నారు. మెల్లమెల్లగా మానవ సమాజంలో మార్పులు చోటు చేసుకోవడం ఆరంభించాయి. పురోగతి, అభివృద్ధి రంగాల్లో తప్పని సరిగా వత్తిడులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి. సమాజంలో భారీస్థాయిలో తలెత్తిన నూతన పరిణామాలు ఇవన్ని మానవ హక్కుల చరిత్రలో ప్రాధాన్యం పొందిన అంశాలు. రెండవ ప్రపంచయుద్ధానంతరం మరెన్నో ప్రశ్నలు తలెత్తాయి. అంతర్జాతీయ, చారిత్రక శక్తుల నేపథ్యంలోంచి కూడా మానవ హక్కుల ఉద్దేశ్యాలు రూపుదిద్దుకున్నాయి.

BRAOU

ఇవన్నీ కలిపి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన (యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్) గా 1948 డిసెంబరు 10న ప్రత్యక్షమైంది. ఇది మానవాళి సాధించిన అపూర్వ విజయం. దీనిపై చట్టం తీసుకురావాలనే డిమాండు ఏ మీ లేదు. ఒక ఉన్నత ఆదర్శం కోసం ప్రతి మనిషి సమాజం ప్రయత్నించాలనే దిశగా మానవ హక్కుల ఉద్యమం కొనసాగింది. మానవ హక్కులకు సుస్పష్టమైన, నిర్దిష్టమైన రూపం ఇచ్చిన చర్యగా అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనను అభివర్ణించవచ్చు. మానవ హక్కులను నిర్వచించాలంటే 'యుడి హెచ్ ఆర్' ని మాగ్నా కార్టాగా చెప్పాలి. మానవ కుటుంబం అంతా ఒకటే అందరికీ సమాన గౌరవం, సమానమైన హక్కులు ఉన్నాయని ప్రకటన విస్పష్టం చేసింది. ప్రపంచం అంతట స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, న్యాయానికి, శాంతి సౌభాగ్యాలు పునాది. ఇది "మానవ హక్కులపై చూపుతున్న చిన్న చూపును లోతుగా ఈ ప్రకటన అధ్యయనం చేసింది". "మానవహకులపై కనబరుస్తున్న ఈ ధోరణులే చివరకు అనాగరిక చర్యలకు పాల్పడేట్టు చేస్తోంది. మానవాళి ఆత్మ గౌరవాన్ని, ఉన్నత స్థాయిని, విలువల్ని హీన పరుస్తోంది" "మానవులంతా భావ ప్రకటనా స్వేచ్ఛ, నమ్మకం, భయాలకు అతీతమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్న కొత్త ప్రపంచంలో జీవించాలి" అని ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ప్రజలు కోరుకునే అత్యున్నత కోరిక ఇదే. హక్కులన్నీ ఎలాంటి ముందస్తు పరిమితులకు కూడా తలొగ్గి

కుండా అణచివేత, నియంతృత్వ పోకడలపై 'రెబెలియన్' కావాలని ఎదురు తిరగాలని ప్రకటన అభిప్రాయపడింది.

వియన్నా సదస్సు నాటికి ప్రపంచం మొత్తం అమానుషంగా తయారయింది. వివిధజాతులకు చెందిన పేదవర్గాల ప్రజల శరణార్థులు, వికలాంగులు, మహిళల స్థితిగతులు వర్ణించనలవిగాని విధంగా మారాయి. మానవ హక్కుల అతిక్రమణకు వీరి స్థితిగతులు అద్దం పడుతాయి. వీటి తో బాటు మరికొన్ని సంఘటనలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాం. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న క్రూరాతిక్రూరమైన పద్ధతులను ఇవి మన కళ్ళ ముందుంచుతాయి. మనం భావిస్తున్న ప్రపంచం ఎంత ఆందోళనకరంగా, అమానుషంగా, అనాగరికంగా తయారయిందో ఈ సంఘటనలు విస్పష్టం చేస్తాయి. వియాన్నా సదస్సులో దాదాపు 30 మంది మహిళలు తమపై జరుగుతున్న దురాగతాలను విపులంగా వెల్లడించారు. అత్యాచారానికి గురికావడం, కొన్ని సార్లు గ్యాంగ్ రేప్‌కు మహిళలు బలికావడం, ఇంకా వారిపై చోటు చేసుకుంటున్న పలురకాలైన హింసాత్మక చర్యలను ఆనాటి సదస్సు ముందర మహిళలు నిర్భీతిగా ఉంచారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలం నాటి నుంచి నేటి దాకా మహిళల దుస్థితి ఏంమారలేదు. నానాటికీ వారు నివసిస్తున్న పరిసరాలే వారికి ప్రభల శత్రువుగా మారాయి. అత్యాచారాలు, గ్యాంగ్ రేప్‌లు జరగటం ప్రపంచంలో నేడు సర్వసాధారణమై పోయాయి. భారీస్థాయిలో మహిళల పై జరిగిన అత్యాచారాల ములంగా బోస్నియాలో పెళ్ళికాని దాదాపు 30 వేల మంది యువతులు గర్భవతులయ్యారని అంచనాలు తెలుపుతున్నాయి. మూడేళ్ళ సమీరా అనే పసిపాపపై కూడా బోస్నియా సైన్యాం అత్యాచారం చేసింది. స్పృహ తప్పి, రక్తస్రావంతో ఉన్న తన బాధను తల్లి మిలిటరీ జనరల్ దగ్గరకు తీసుకువెళ్ళింది. తన తీవ్రవ్యతిరేకతను వెల్లడించింది. దురదృష్ట కరమైన విషయం ఏంటంటే ఆ బిడ్డ తల్లి సచ్చిజు కూడా పలుమార్లు సైనికుల చేతుల్లో అత్యాచారానికి గురైంది. ఈ సంఘటనలు ప్రపంచం మొత్తాన్ని కుదిపి వేసాయి. చివరకు వీరు పోరాటాలు ఉద్యమాల దారి పట్టారు. వీరి ఉద్యమాలు హింసాత్మకంగా పరిణమించాయి. మానవ సమాజంలో తలెత్తిన ఈ సంక్షోభ పరిస్థితులను అణచివేసేందుకు అధికారంలో ఉన్న వ్యక్తులు సైనిక చర్యలకు పూనుకున్నారు. దుర్మార్గాలకు పాల్పడడం సాగించారు. ఫలితంగా పరిస్థితులు మరింత తీవ్ర రూపం దాల్చాయి. అంతర్జాతీయ స్థాయిలో అధికమైన భయంకర దురాగతాలను కొన్నింటిని ఇక్కడ పేర్కొనాలి.

## 1.4 అరాచక ధోరణులు :

ఇరాన్‌లో ఖోమైనీ ప్రభుత్వం 14,028 గ్రామీణ ప్రజల్ని ఉరితీసింది. ఇందులో బలైపోయిన వారి వివరాల్ని మానవ హక్కుల బృందాలు సేకరించాయి. ఇక్కడ పోరాడుతు చనిపోయిన వారి సంఖ్య దాదాపు 70,000 మంది ఉన్నారు. అమరవీరులుగా వీళ్ళు నివాళులందుకున్నారు. ఇండోనేసియాలోని సైనిక ప్రభుత్వం రెండు లక్షల మంది అమాయకపు ప్రజల్ని పొట్టన పెట్టుకుంది. భాంజులో భద్రతాదళాలు 2,000 మంది నిండు ప్రాణాలు బలితీసుకున్నారు. ప్రపంచంలో సైనిక పాలన ఉన్న పలుప్రాంతాల్లో ఇదే రకమైన సంఘటనలు సర్వసాధారణమై పోయాయి. అంతర్గతంగా మానవ హక్కుల కోసం పోరాటాలు, ఉద్యమాలు ఉధృతం అవడంతో అక్కడి ప్రభుత్వాలు వీటిని అణచి వేసేందుకు కట్టడిలోకి తీసుకొని వారి పై క్రూరహింసను ప్రయోగిస్తున్నారు. ఈ ధోరణులు 45 దేశాల్లో కొనసాగుతున్నట్టు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదికలో పేర్కొన్నారు. రైతుల ఉద్యమాన్ని అణగదొక్కే నేపథ్యంలో ఫిలిప్పిన్స్ ప్రభుత్వం దాదాపు 340 మందిని అదృశ్యం చేసింది. మొరాకో మనుషుల అదృశ్యం 3 రకాలుగా మనకు కనిపిస్తుంది. రహస్యంగా పట్టుకోవడం ఒకటి కాన్సం ట్రేషన్ క్యాంపుల్లోకి తోయ్యడం



BRAOU

రెండవది. చంపేయడం మూడవ రకం. కాన్సంట్రేషన్ క్యాంపుల్లో ఉన్న నిర్బంధీకుల్ని జైళ్ళలో చితకగొట్టేవారు. మూత్రంతో సహా అశుభ్రమైన నీరును క్యాంపుల్లో ఉన్న వారి చే బలవంతంగా తాగించేవారు. అంతేకాదు నిర్బందీకుల పళ్ళను బలవంతంగా ఊడబెరకడం అక్కడ సర్వసాధారణం. తొమ్మిది సంవత్సరాల పాటు ఈ క్యాంపుల్లో ఉన్న మనుషులు అక్కడి హింసకు తాళలేక మానసికంగా, శారీరకంగా కృంగి కృశించి అనారోగ్యం పాలయ్యారు. వాళ్ళను విడుదల చేసిన తర్వాత సొంత ఊళ్ళల్లో ఉండే జనాలు, బంధువులు వారిని గుర్తించడం మాట అటుంచింది. తల్లి తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డను గుర్తించనే లేదంటే ఇక అక్కడ పరిస్థితుల గురించి వేరే చెప్పేదేముంది? నైజిరియా ప్రజల్ని విమానాల నుంచి పొరుగు దేశాల్లో దించేవారు. ఒక వేళ ఎవరైనా తిరిగి వచ్చినా వాళ్ళను ఆపేసినట్టు గానీ, హింసించినట్టుగా సాక్ష్యాలు, గుర్తింపులు ఉండేవి కావు.

యు. ఎస్ ఎ.కు చెందిన ఇద్దరు వ్యక్తులు సూడాన్‌లో అదృశ్యం అయ్యారు. ప్రజలు తిరగబడడంతో అక్కడి సైనిక ప్రభుత్వం వారిద్దరినీ ఉరితీసినట్టు ప్రకటించింది. అమెరికా డాలర్లు ఉన్న వ్యక్తుల్ని చంపేసిన సంఘటనలు కూడా అక్కడ కోకొల్లలు. అక్కడి మత ఛాందసవాదాన్ని ప్రశ్నించినందుకు గాను మరికొందరి ప్రాణాలను నిర్ధయగా బలితీసుకున్నారు. సైనిక దాడి జరుపడానికి కుట్రపన్నుతున్నారనే అనుమానంతో అక్కడ 25 మంది సైనికసిబ్బందిని విచక్షణా రహితంగా బలితీసుకున్నారు. మానవ హక్కుల సంఘటనల్ని నిషేదించిన ప్రత్యేకత కూడా సూడాన్ పాలకులకు ఉంది.

పాలస్తీనాలోని జెనిన్‌లో ఉన్న శరణార్థుల క్యాంపుల్లోకి బడిపిల్లల్ని కస్టడీలోకి తీసుకున్నారు. పిల్లల్ని చూడడానికి కూడా వారి తల్లి దండ్రుల్ని అనుమతించేవారు కాదు. గాటెమాలా సైన్యం ప్రజల్ని నరకయాతనలకు గురిచేయడంతో ఏమాత్రం తీసిపోలేదు. వీధి బాలురను హింసించడంలో వారిపై అత్యాచారం జరపడంతో, నిర్ధయగా వాళ్ళని చంపేయడంలో సైన్యం ఎత్తుకు పోయి వాళ్ళ చెవులను, నాలుకలను, కళ్ళను పీకేసేది. ఆ పసికందుల పట్ల క్రూరాతి క్రూరంగా, రాక్షసంగా ప్రవర్తించేది.

హింసకు, భయంకరమైన నరకయాతనకులోనయిన కొందరి వ్యక్తుల అనుభవాల్ని కూడా మనం ఇక్కడ ప్రస్తావించాలి. బోరైన్‌వెల్లేలోని తాత్కాలిక ప్రభుత్వం మాజీ ఆరోగ్య మంత్రి కెర్నె సావియాను అదుపులోకి తీసుకొని, ఆయన కాళ్ళు, చేతులు కట్టిపడేసి, రోడ్డువెంట ఈడ్చుకుంటు తీసుకు వెళ్ళింది. తర్వాత ఆయన శరీరం పై భాగంలో ఉన్న చర్మాన్నంతా చెక్కేసింది. తర్వాత బహిరంగంగా ఆయన్ని ఉరితీసింది. బ్రెజిల్‌లో పర్యావరణ హక్కుల గురించి పోరాడుతున్న ఒక కార్యకర్తను చంపేశారు. నిజాలను పత్రికలో రాసినందుకుగానూ టర్కీలో ఒక పత్రికా విలేఖరిని దారుణంగా హత్య చేశారు. స్వంత రాజకీయ అభిప్రాయాలున్నందుకుగాను దక్షిణ కొరియాలో ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టారు. ఇవన్నింటినీ విన్నప్పుడు మానవ హక్కుల అతిక్రమణలు అక్కడ ఎంత తీవ్రస్థాయిలో చోటు చేసుకుంటున్నాయో విస్పష్టమవుతోంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు సంబంధించి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. వర్ధమాన దేశాల్లోగాని మానవహక్కుల అతిక్రమణ తీవ్రత ఈ తీరులోనే ఉన్నాయి. పూర్వపు సోవియట్ యూనియన్‌తో చైనా, తూర్పు యూరప్ దేశాల్లో పరిస్థితులు కూడా ఆందోళన కరంగా ఉన్నాయి. రాజకీయ వ్యతిరేకత అణచివేత, వివిధ పద్ధతుల్లో హింస, హత్యలు ఎంతో ఆవేదనను రేకెత్తిస్తున్నాయి. ఈ దేశాల్లో భారీస్థాయిలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనల పై వియన్నా సదస్సులో పూర్తిస్థాయిలో చర్చలు జరిపారు. బీజింగ్‌రియో సదస్సుల్లో మానవ సమాజంలో తలెత్తుతున్న ప్రమాదకర పోకడలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అభివృద్ధిని ఇవి ఏ విధంగా ఆటంకపరుస్తున్నాయో కూడా ఈ రెండు సదస్సులు తీవ్రంగా అధ్యయనం చేశాయి.

BRAOU

## 1.5 : మానవ హక్కుల పరిస్థితి దిగజారి పోవడానికి కారణాలు :

ప్రపంచంలోని వివిధ దేశాల్లో మానవ హక్కుల దుస్థితి ఏ విధంగా ఉందో పైన పేర్కొన్న సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. మానవ జీవితం ఎటువైపు నుంచి చూసినా ప్రోత్సాహకరంగా లేదన్నది కూడా తేటతెల్లంగా అర్థమయింది.

మానవ హక్కులు నానాటికి ఎలా దిగజారిపోతు వచ్చాయో వెల్లడయింది. మానవహక్కుల ప్రాధాన్యం క్షీణించి పోవడానికి కారణాలు ఏమిటో తెలుసుకోవాలి. ఇలాంటి పరిస్థితులకు దారితీస్తున్న నేపథ్యాన్ని అంచనా వేయాలి. వీటిపై విస్తృత స్థాయిలో చర్చ జరగాలి. ప్రస్తుత పరిస్థితులను మెరుగుపరచడానికి ఎలాంటి ప్రత్యామ్నాయాలు, అవకాశాలు మనముందు ఉన్నాయి అన్న దానిని గమనించాలి.

మానవ హక్కులు నానాటికీ దిగజారిపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఇక్కడ అంత విస్తృత పరధిలో ఈ పార్శ్వాంశాన్ని మనం చర్చించలేము. కొన్నింటిని మటుకు ప్రస్తావిస్తున్నాం. భవిష్యత్తులో మానవ హక్కుల పరిరక్షణపై దృష్టి నిలుపుతున్న వ్యక్తులు, సమాజాలు, సంస్థలు, దేశాలు వీటిని తప్పని సరిగా పరిగణనలోకి తీసుకోవాలి.

BRAOU

**ప్రస్తుతం మానవహక్కులున్న పరిస్థితికి ప్రధాన కారణాలు :**

1. సామ్యవాద సమాజాలు కుప్పకూలిపోవడం
2. సంక్షేమ రాజ్య పంథా, కనుమరుగవుతుంది.
3. అంతర్జాతీయ ఆర్థికశక్తుల పాత్ర
4. పరిమితమై పోతున్న ఐక్య రాజ్యసమితి వంటి అంతర్జాతీయ ఏజెన్సీల పాత్ర
5. పాలకుల విధానాల్లో, స్వరూపస్వభావాల్లో తలెత్తిన చీలికలు.

### 1.5.1. పాలక వర్గం విధానాల్లో, స్వరూప స్వభావాల్లో తలెత్తిన చీలికలు

వలసాధిపతుల నుంచి అధికార పగ్గాలను చేపట్టిన పాలక గణం స్వేచ్ఛాయుత ప్రభుత్వాల ప్రభావంలో కొట్టుకు పోయింది. పాలకుల్లో సమ సమాజ పోకడలు కనబడుతాయి. రాజ్యాంగ బద్ధమైన పాలనా వ్యవస్థలను వీరు ఎంచుకున్నారు. తమ సమాజాల్లో సరికొత్త పరిస్థితులను సృష్టించాలని తెగ ఉబలాటపడ్డారు. ఈ నేపథ్యంలోంచే మానవ హక్కుల రక్షణకు బీజం పడిందని చెప్పవచ్చు. మానవ హక్కుల ఉద్దేశ్యాన్ని, ప్రాధాన్యతలను ఈ దిశగా మనం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అయితే ప్రజల జీవన విధానాల్లో విలక్షణమైన మార్పులేవీ రాలేదు. పైగా వర్ధమాన దేశాల సమాజాలు చీలికల దిశగా ప్రయాణించి నానాటికి అక్కడి పరిస్థితులు మరింత క్షీణించడం మొదలెట్టాయి.

వ్యక్తులు, కొన్ని వర్గాలు, తరగతుల వాళ్ళ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. వీరు మీడియాపై క్రమేణా పట్టు సంపాదించారు. అన్ని రకాల సమాచార సాధనాలు వీళ్ళ దృష్టి పథంనుంచి తప్పించు కోలేవు. దేశం వెలుపలి స్వార్థ పరశక్తులతో చేతులు కలపడానికి కూడా వీళ్ళు వెనుకంజ వేయలేదు. ఎన్నికల రాజకీయల్లో ధనమే రాజ్యం చేస్తోంది. ధనం మూలం మిదం జగత్ అన్న చందాణా రాజకీయ రంగం కూడా కలుషితమైంది. మెల్ల మెల్లగా పాలకులు తమ అధర్మ భావాలకు, సమసమాజ నిర్మాణ లక్ష్యాలకు నీళ్లొదిలారు. స్వాతంత్రానంతరం అతి స్వల్పవ్యవధిలోనే, అప్పులు, అవినీతి, అక్రమాలలో వీరు కొట్టుకు పోయారు. న్యాయబద్ధత వీళ్ళల్లో లోపించింది. ఇది సంక్షోభ పరిస్థితులకు దారితీసింది. అస్థిర వాతావరణం నలు వైపులా పరుచుకుపోయింది. ఇవి ప్రపంచం నలుదిశలలోని మానవ హక్కులకు ప్రాణాంతకంగా నిలబడ్డాయి. ప్రపంచంలోని బీద ప్రజలకు దారితెన్నూ, ఒక నిర్దిష్టమైన ఉనికి లేకుండా పోయాయి. జనాకర్షణ విధానాలకే పాలక వర్గాలు ప్రాధాన్యం ఇవ్వసాగాయి. అదను చూసుకొని వీళ్ళ చేతుల్లోంచి అధికారాన్ని ఆదేశ సైన్యాలు కబళించడం ఆరంభించాయి. నియంత్రణలు మత ఛాందస శక్తులు దేశాల్ని పరిపాలించడం మొదలెట్టాయి. అప్పటి నుంచి మానవ హక్కుల అతిక్రమణ ఈ ప్రాంతాల్లో సర్వసాధారణం అయిపోయింది.

సామ్యవాద సమాజాల్లోని మేధావీ వర్గం మానవ హక్కుల సమస్య పై రెండు వర్గాలుగా చీలిపోవడాన్ని గమనించవచ్చు. అయితే స్వాతంత్రానంతరం ఆ ధర్మాలకు తిలోదకాలిచ్చిన కొందరు పాలకులు అవినితికో లేదా అప్పుల సంక్షోభంలోనో కూరుకుపోయారు. ఫలితంగా అస్థిరత, గందరగోళ పరిస్థితులు ఎదురయి మానవ హక్కుల ఉనికికే ప్రమాదకరంగా పరిణమించాయి. మానవ హక్కుల పై సామ్యవాద సమాజాలు ఇరుపక్షాలుగా విడిపోయాయి. పౌర, రాజకీయ హక్కుల కన్నా ఆర్థిక హక్కుల అవసరాన్ని పాలక వర్గంలోని కొందరు మేధావులు వాదించారు. స్వేచ్ఛ అనేదాన్ని ఎప్పుడూ ఆర్థిక భద్రతలోంచే ఆలోచించడం జరుగుతోంది. అంతే తప్పించి రాజకీయ అధికారంలో పాలుపంచుకునే స్వేచ్ఛ ప్రస్తావనకే రానివ్వడం లేదు. దాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ప్రజా సమ్మతి రాజ్యాధికారానికి అవసరం. రాజ్యాధికారంకు లొంగి వుండే స్వేచ్ఛ విభిన్నంగా ఉంటుంది. వీటి పునాదుల్లోని బలహీనతల ములంగా ఆర్థిక, రాజకీయ రంగాలు రెండూ ఛిద్రం అవుతున్నాయి. ఫలితంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు కుప్పకూలి పోతున్నాయి. అయితే ఇక్కడ క్యూబా, చైనాలను మాత్రం మినహాయించాలి. ప్రస్తుతం చైనా పాలకులు నిర్ధిష్ట క్రమంలో నడిచే వేగవంతమైన అభివృద్ధి దిశగా దేశాన్ని నడిపిస్తున్నారు. పారిశ్రామికంగా అభివృద్ది చెందిన అమెరికా, పశ్చిమ యూరఫ్‌లలోని సమాజాలు అంతర్జాతీయంగా వాటి మార్కెట్లను విస్తరింప చేసుకొనే బృహత్తర కార్యక్రమంలో పడ్డాయి. వర్ధమాన దేశాలను కూడా తమదారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు ఉధృతం చేశాయి. బలహీన మేధో పాలక వర్గాలు వున్న వర్ధమాన దేశాలు చాలా వీటి ఉక్కు పిడికిళ్ళలోంచి తప్పించుకోలేక పోతున్నాయి. మార్కెట్‌ను పెంచుకోవాలనే తాపత్రయంలో ఆయాదేశాలు తమ సంక్షేమ ఖర్చు పై కోత పెట్ట సాగాయి. పాలకులు కార్మిక వర్గ హక్కులపై వేటు వేయడం ఆరంభించారు. ఫలితంగా ప్రపంచంలో అర్థం కాని సరికొత్త వాతావరణం అమలు కాసాగింది. అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల పరి రక్షణ అంటూ గొంతు చించు కుంటున్న చాలా దేశాలు తమ దేశం పరిస్థితుల దగ్గర కొచ్చే సరికే అణచివేత విధానాలను అనుసరించ నారంభించాయి. తమ దేశాల్లో మానవ హక్కులను ఉన్నత పీఠంపై ఉంచి ఇవి కాపాడు కోలేక పోతున్నాయి. ఈ పరిస్థితులు నిజంగా ఎవరికైనా ఆశ్చర్యాన్ని కలిగించడమే కాదు అందర్నీ అయోమయంలో పడేస్తున్నాయి.

BRAOU

### 1.5.2. విఫలమైన సామ్యవాద ప్రయోగం

సామ్యవాద పద్ధతి విఫలం కావడం వల్ల మానవ హక్కుల పరంగా తీవ్రమైన పరిస్థితులు ఎదురయ్యాయి. అభివృద్ధికి మానవ సమాజం ఎదుట కనబడుతున్న ఏకైకమార్గం పెట్టుబడీ దారి విధానమేనని వాదించిన వారున్నారు. మొత్తం అభివృద్ధిని చరిత్ర లక్ష్యంగా పేర్కొనడం వినే ఉంటారు. పశ్చిమ దేశాల సరళీ కృత రూపంలోని రాజకీయ స్వేచ్ఛను పరిరక్షించడానికి, మెరుగు పరచడానికి ఏవిధంగానూ దృష్టి కేంద్రీకరించలేదు. ఆదిశగా ఎలాంటి కృషిని కూడా చేపట్టలేదు. వేగవంతమైన అభివృద్ధి అన్న నినాదం మాటున ఉద్యోగుల, కార్మికుల ఆర్థిక హక్కులు నిలువునా దోపిడీకి గురవుతున్నాయి. సరళీకృత ఆర్థిక విధానాలు ప్రైవేటీ కరణం మాటున ఆర్థికాభివృద్ధిని ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) చేసే ప్రయత్నాలు అధికమయ్యాయి. వర్ధమాన దేశాలు, సంపన్న దేశాలకు మధ్య ఆర్థిక వ్యత్యాసాలు నానాటికీ తీవ్రతరం అయ్యాయి. స్వప్రయోజనాలు, లాభార్జన ఇవే ఉత్పత్తి శక్తులకు ప్రధానం అయ్యాయి. మరో వైపు నుంచి పేదరికం ఎక్కువయిపోతుంది. సమిష్టి జీవనం అన్న మాటకే అర్థం కనుమరుగయే దుస్థితి మొదలైంది. మానవ అవసరాలను చూడాలి అన్న వుద్దేశ్యమే తెరమరుగవుతోంది.

### 1.5.3 : అదృశ్యం అవుతున్న సంక్షేమస్వభావం – పరిణామక్రమంలో రాజ్యం

20వ శతాబ్దం మధ్య భాగంలో మానవ హక్కుల అంతర్జాతీయ ప్రకటన ను చేపట్టిన నాడు ప్రతి వ్యక్తిని రాజ్యం కాపాడాలి పరిరక్షించాలి అని పేర్కొనడమైంది. వారి మానవ హక్కులను పరిరక్షించాల్సింది కూడా రాజ్యమే ప్రజల సంక్షేమానికి అవసరమైన వాటన్నింటిని సమకూర్చాలి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల్లో మార్పులకు సంబంధించి రాజ్యం ప్రముఖ పాత్ర వహించాలి. ప్రజలందరి పురోభివృద్ధి సాధ్యం చేయాలనుకునే చోట వీటన్నింటిలోను మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అప్పుడే 'రాజ్యం'కు మంచి పేరు, ప్రతిష్ఠలు వస్తాయి 'తగిన గుర్తింపు' లభిస్తుంది. చాలా దేశాల్లో ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాల్లో ఈ కృషి అంతా మౌలిక స్థాయి నుంచీ మొదలవుతుంది. కొంతకాలం గడిచిన తర్వాత రాజ్యమే సమాజంలోని కొన్ని స్వార్థపరశక్తుల చేతుల్లో 'కీలుబొమ్మ'గా మారే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇదే సందర్భంలో 'రాజ్యం' దోపిడీకి కూడా గురవుతోంది.

రాజ్యం పాత్ర రాను, రాను పరిమిత అవసరంగా గమనిస్తాం. మార్కెట్ సామాజిక ఆర్థిక శక్తిగా పోతున్న ఆధిక్య ధోరణులే ఇందుకు కారణం అని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. నేడు ఎన్నో ముఖ్య నిర్ణయాలను తీసుకుంటున్నది కూడా రోజు, రోజుకీ విస్తరించబడుతున్న మార్కెట్ వ్యవస్థే! అంటే రాజ్యం కాదు. కేవలం 'రెగ్యులేటరీ అప్పారటస్' గా ఇది మారింది. అయితే న్యాయబద్ధత దీనికి అవసరం అవుతుంది. అప్పుడే 'రెగ్యులేటరీ' పాత్రను రాజ్యం వ్యవహరించ గలుగుతుంది. అయితే రాజ్యంకు ఇలాంటి వాతావరణంలో అంతటి అధికార సామర్థ్యం ఉందా? గతంలో రాజ్యానికున్న సంక్షేమ స్వభావంతో 'రెగ్యులేటరీ' విభాగం గా రాజ్యం మసలేది.

రాజ్యం న్యాయబద్ధతే సంక్షోభంలో పడ్డప్పుడు క్రమబద్ధీకరణ (ఆర్డర్) సాధించడం చాలా కష్టం పాలకచట్టాలతో పరిస్థితులు సులభంగా గట్టెక్కిచ్చేయ వచ్చునని భావించేవారు పూర్తిగా పొరబాటు పడ్డారన్న మాట. రాజ్యం 'రూల్ ఆఫ్ లా' ని వదిలి పెట్టే ప్రసక్తి లేదు కానీ..... ఈ పరిణామాలు న్యాయబద్ధ, రాజకీయ బద్ధ హక్కులను వదులుకోవాల్సిన పరిస్థితికి దారితీస్తున్నాయి. ఫలితంగా అధికార దాహం మానవ హక్కులను ప్రమాద పరిస్థితుల్లోకి నెడుతున్నాయి.

BRAOU

### 1.5.4 అంతర్జాతీయ ఆర్థిక శక్తుల పాత్ర

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రధానమైన పరిణామాలు ఎన్నో తలెత్తాయి. వీటిలో బహుళ పక్ష కంపెనీలు లేదా "ట్రాన్స్‌నేషనల్ కార్పోరేషన్స్" లాంటి ఆర్థిక శక్తులు బలం పుంజుకోవడం మొదలెట్టాయి. కొత్త అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు కూడా పుట్టుకు రావడం ఒక వైపు నుంచి ఆరంభించాయి. ఐక్యరాజ్యసమితి, దాని విభాగాలు మరోవైపు నుంచి విసర్జించసాగాయి. ఆర్థిక, ద్రవ్య సంస్థలు ఆర్థిక శక్తుల పాత్ర నిర్వహిస్తే సమితి, వాని అనుబంధ సంస్థలు నైతిక శక్తి (మొరల్ ఫోర్స్) గా నిలబడి పని చేయసాగాయి. బహుళపక్ష కంపెనీలు, కార్పోరేషన్లు కేవలం ఆర్థిక ప్రయోజనాలను విస్తృత పరచుకోవాలనే ఉద్దేశంతో వచ్చినవే. గతంలో వాటి దేశాల సరిహద్దులకే పరిమితం అయిన వాటి కార్యకలాపాలు ప్రస్తుతం దేశ పరిమితులను దాటి అంతర్జాతీయ రంగంలో బాగా పాదుకోవాలని ఇవి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. విజయవంతం అవుతున్నాయి కూడా. పారిశ్రామిక, పెట్టుబడీదారీ పరిణామాలే జాతీయ వాదానికి, జాతి- రాజ్యాలు (నేషన్-స్టేట్స్) ఏర్పడడానికి కారణమయ్యాయి. ఆర్థిక శక్తుల వ్యాప్తిలో రెండవదశే గ్లోబల్ విస్తరణ లేదా 'ప్రపంచీకరణ' ప్రయత్నాలు, వివిధ దేశాల మధ్య సేవలందిస్తున్న ట్రాన్స్-నేషనల్ కార్పొరేషన్ల దగ్గర వనరులు పుష్కలంగా ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా ఏర్పడ్డ చాలా దేశాలకన్నా కూడా వీటి దగ్గర వనరులు అధికసంఖ్యలో కేంద్రీకృతమై ఉండడం విశేషం. ఈ కార్పోరేషన్ల సంఖ్య రాను రాను బాగాపెరిగి సార్వభౌమాధికార తత్వానికే ప్రమాదకరంగా పరిణమించాయి. ప్రపంచదేశాల ప్రాదేశిక సమగ్రతలనే ఇవి దెబ్బతీస్తున్నాయంటే ఏ స్థాయిలో ఇవి ప్రపంచ మంతటా విస్తరించాయో మనకు అర్థం అవుతుంది. ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ చట్టాల్లో కొత్తరకం సమస్యలను ఇవి సృష్టిసున్నాయి. వివిధ దేశాల హక్కులకే ఇవి ఎసరు పెట్టడం మొదలెట్టాయి. ముఖ్యంగా వర్ధమాన దేశాలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అనుభవిస్తున్న ఇబ్బందులూ తీవ్రతరం అయ్యాయి.

ట్రాన్స్‌నేషనల్ కార్పోరేషన్ల దాడికి అదనంగా అంతర్జాతీయ ద్రవ్యసంస్థలైన ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచవాణిజ్య సంస్థ వంటి వాటి ఆర్థిక దోపిడీ కూడా వివిధ దేశాల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులపై తమ ప్రభావాన్ని చూపించసాగాయి. అన్ని దేశాల్లోని ఆర్థిక పరిస్థితులు ఒక విధమైన సంక్షోభంలో పడ్డాయి. కేవలం ఉత్పత్తుల పెంపుదల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థలు బాగుపడి పోయాయనుకుంటే పొరబాటే. వివిధ దేశాలు ఎదుర్కొంటున్న తీవ్ర పరిస్థితులను అడ్డం పెట్టుకుని రుణసంస్థలు ఆయాదేశాల ఆర్థిక, రాజకీయ విధానాలను వ్యవస్థలను తమ కనుసన్నల్లో మెలిగేట్టు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. విధాన నిర్ణయాల దగ్గర నుంచీ ప్రతి రంగంలోను ఇవి చొచ్చుకుపోతున్నాయి. తమ బలాన్ని, ప్రాధాన్యతలను నానాటికీ ఇవి పటిష్టం చేసుకుంటున్నాయి.

ఆర్థికంగా గానీ, సాంకేతిక పరిజ్ఞానం పరంగా గానీ మన ఆర్థిక వ్యవస్థల్లో వీటికి హద్దూ అదుపూ లేకుండా పోయింది. ఏ రంగంలో చూసినా వీటికి పై స్థాయి అయిపోయే పరిస్థితి నెలకొంది. ప్రజాభిప్రాయాన్ని గూడా తమకు అనుగుణంగా గుడ్డిగా మార్చుకోవాలనే రుణసంస్థల ప్రయత్నాలు పాక్షికంగా విజయవంత మయ్యాయని చెప్పాలి. దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలకు కూడా ముప్పుతెస్తున్న బహుళ పక్ష సంస్థలు, కార్పోరేషన్లు, ప్రపంచ రుణ సంస్థల 'దొరబాటు' పై ప్రజల మధ్య ఆరోగ్యకరమైన చర్చలే సాధ్యపడలేదు. విదేశీ సంస్థల వల్ల తలెత్తే విషమ పరిస్థితులు ఏంటి అన్న దానిని ఆలోచించేలోపే అత్యంత వేగంగా వీటి ప్రవేశం, వివిధ స్వదేశీరంగాలపై

BRAOU

పీటి దాడి జరిగిపోయింది. దేశంలోని 'సంపన్న వర్గాలకే ఈ పరిణామాలు లాభిస్తాయి. కనీస అవసరాలయిన తిండి, గుడ్డ కూడా లేని పేదల, నిర్భాగ్యుల బతుకులను ఇవి మరింత ఛిద్రం చేస్తాయో చెప్పాల్సిన పనిలేదు. ఇక వీరు అభివృద్ధిలో భాగస్వాములవడం కలలో మాటే. సంక్షేమరంగం పై ఖర్చు కూడా నానాటికీ తగ్గిపోతుంది. ఇది పేద ప్రజలపై పెద్ద వేటే. పేదలకుండే కనీస హక్కులు కూడా ఇక నుంచి అదృశ్యమయి పోతాయి. ఆర్థిక పాలన శక్తులు మరింత బలపడుతాయి.

### 1.5.5 క్షీణించి పోతున్న ఐక్యరాజ్య సమితి, ఇతర సంస్థల పాత్ర

కొత్తగా మనల్ని చుట్టుముట్టిన మార్కెట్, ఆర్థిక, శక్తుల ప్రభావం వల్ల 'నైతికత' అన్న దానికి అర్థం లేకుండా పోయింది. మానవాళి ప్రయోజనాలతో సంబంధంలేని ఒక రకమైన అభివృద్ధిని నేడు మనం చూస్తున్నాము. ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కుని పోయింది. దాని వివిధ కార్యకలాపాలకే కోతపడింది. సభ్యదేశాల మద్దతు అపురూపమైన సమితి, మరీ ముఖ్యంగా సంపన్నదేశాల తోడ్పాటు బాగా తగ్గి పోవడంతో, ఐక్యరాజ్యసమితి తన పరిధిని మరింత విస్తృత పరచుకునే సదవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రపంచబ్యాంకు (డబ్ల్యు.టి.ఓ.), అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) లకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. వాటిని నియంత్రించ గలిగే బలమైన అంతర్జాతీయ సంస్థ కరవైంది. పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే వివిధ దేశాల్లోని మానవ హక్కుల రికార్డులను ఐక్యరాజ్యసమితి కన్నా కూడా ఈ ద్రవ్య సంస్థలు పరిశీలిస్తుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఐదు దశాబ్దాల క్రితం ఎంతో ఉన్నత లక్ష్యాలతో, ప్రపంచ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పడ్డ ఐక్యరాజ్యసమితికి నేడు పట్టిన దుస్థితి ఇది. ఫలితంగా రానున్న కాలంలో మానవ హక్కుల కన్నా రాజకీయ, నైతిక ప్రమాణాలు ప్రమాదంలో పడనున్నాయి.

## 1.6. ప్రస్తుత ప్రపంచం ముందున్న సవాళ్ళు :

BRAOU

ఇంతటి దురదృష్టకర పరిస్థితులు అంతర్జాతీయంగా వివిధ దేశాల ప్రజలను వెన్నాడుతున్నా, ఒకే ఒక్క ఆనందకరమైన విషయం ఏమిటంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో అనూహ్యమైన ప్రగతిని మనం సాధించగలగడం. సాంకేతికాభివృద్ధి సహాయంతో వివిధ దేశాల్ని పట్టిపీడిస్తున్న పేదరికం, ఆకలి, దారిద్ర్యం వంటి సమస్యలను పరిమిత కాలంలో పరిష్కరించుకోగలం. అంతేకాదు ఆరోగ్య సంబంధంగా కూడా ప్రజలను చైతన్య వంతం చేయగలం. మానవ జీవితాన్ని సుఖమయం, సౌఖ్యవంతం చేసుకోగల వనరులు, ఉత్పత్తి అవకాశాలు నేటి ప్రపంచంలో పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం సంపదను వెనకేసుకున్నంతగా గతంలో కూడా ప్రజలు సంపాదించుకున్న దాఖలాలు లేవు. అయితే ప్రజల అభివృద్ధికి రాజకీయబలం పటిష్టమైన వ్యవస్థాగత యంత్రాంగం అవసరం. అవి ఉంటే పకడ్బందీగా సంపద వనరులు పంపిణీ అవసరమే కాకుండా సామాజిక వత్తిడుల నుంచి పురోభివృద్ధి దిశగా ప్రజల్ని క్రమపద్ధతిలో నడిపించే సదవకాశం ఉంటుంది.

## 1.7. ప్రజల్లో పెరుగుతున్న స్పృహ:

మానవ హక్కుల పరంగా ముందుకు పోవడానికి తీవ్ర ఆటంకాలు ఎదురవడాన్ని ప్రజలు గుర్తించారు. మానవ హక్కుల పరిరక్షణపై ఈ ధోరణులు వీరిలో మరింత స్పృహను రేకెత్తించాయి. ప్రస్తుతం ప్రజల్లో వీటికి సంబంధించి కనిపిస్తున్న చైతన్యాన్ని గతంలో ఇంత తీవ్రస్థాయిలో ఎన్నడు చూడలేదు. నేటి ప్రపంచాన్ని కొమ్ముకాస్తున్న పలు ఉద్యమాలు, పోరాటాలే ఇందుకు నిదర్శనం. మానవ హక్కుల ఉద్యమం ......, స్త్రీవాద ఉద్యమం......., పర్యావరణ ఉద్యమాలు ఇవన్నీ ప్రపంచ ప్రజానీకం పై అనూహ్యమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. సమకాలీన మానవ హక్కుల ఉద్యమాలు వివిధ రంగాలకు వివిధ రీతుల్లో వ్యాపించాయి. సాధారణ నిరసన ప్రదర్శనలు నిర్వహించే వరకు తన కార్యకలాపాల పరిధిని ఇది విస్తృతపరచుకొంది. వ్యక్తుల నుంచి, సమిష్టి ప్రాతినిధ్యం దాకా మానవ హక్కుల రక్షణ స్పృహ పెరిగింది. మానవ హక్కుల సమస్యల పై పోరాడుతున్న, వాటి పై ఆలోచిస్తున్న వ్యక్తులు, సంస్థలు భారీ సంఖ్యలో ఉన్నాయి. మానవాళి జరిపే పోరాటాలపై, చేపట్టే నిర్దిష్టమైన కార్యక్రమాల పైనే మానవ హక్కుల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## 1.8. ముగింపు:

అంతర్జాతీయంగా, మానవ హక్కుల రక్షణ అంతప్రోత్సాహకరంగా లేదు. ప్రపంచంలోని ప్రతి సమాజం మానవ హక్కుల ఉల్లంఘన చేదు అనుభవాలను తీవ్ర స్థాయిలోనే చవిచూసింది. సామ్యవాద శక్తుల ప్రయోగాలు విఫలం అవడం, వర్ధమాన దేశాల్లో పాలకవర్గాల్లో తలెత్తిన చీలిక ధోరణులు మానవ హక్కుల పరిస్థితిని మరింత క్షీణింపచేశాయి. దురవస్థలపాలు చేశాయి. ఇటీవల ఉధృతమైన ప్రైవేటీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు పలుదేశాల్లోని సంక్షేమ రాజ్య స్వభావాన్ని కనుమరుగయేట్టు చేస్తున్నాయి. అభివృద్ధి విధానాల్లో పేదల సమస్యలు విధాన కర్తలకు పూర్తిగా పట్టకుండా పోయాయి. మానవ హక్కుల, భవిష్యత్తు అశేష మానవాళి పైనే ఆధారపడి ఉంది. తమ ఉనికిని పటిష్టం చేసుకునే దిశగా దళిత వర్గాలు చేపట్టిన ఉద్యమాలు పేద ప్రజల్లో వారి హక్కుల పట్ల చైతన్యాన్ని స్పృహను రేకెత్తిస్తున్నాయి.

BRAOU

## 1.9. మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమధానం రాయండి**

1. మానవ హక్కుల ఉల్లంఘనలో చోటు చేసుకున్న గ్లోబల్‌ధోరణులను చర్చించండి.
2. ప్రపంచంలో పెరుగుతున్న అరాచకధోరణులకు కారణాలు ఏమిటి? వివరించండి?

**II ఈ క్రిందిప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి**

1. మానవ హక్కుల భవిష్యత్తులో ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) ప్రభావం ఎలా ఉంటుంది?
2. మానవ హక్కుల ఆవశ్యకతను తెలియజేసే చారిత్రక శక్తుల గురించి చర్చించండి?

BRAOU

# ఖండం – II

# పారిశ్రామిక సమాజాలు

ప్రపంచ దేశాలకు పునరుజ్జీవన కాంతులను అందించి, వలస సామ్రాజ్యవాద విధానాలతో తమ పారిశ్రామిక దేశాల లాభాల కోసం ప్రయత్నించిన దేశాలలో నేడు మానవ హక్కుల పరిస్థితి ఏవిధంగా వుందో తెలుసుకోవాల్సిన అవసరంవుంది. ఫ్రెంచి విప్లవం, అమెరికా విప్లవాలతో ప్రభావితమైన మానవ హక్కుల ప్రకటన ఆయా దేశాల ప్రజల హక్కులపై ఎటువంటి మార్పులు తీసుకువచ్చాయో అధ్యయనం చేయాల్సివుంది ఇందుకు సంబంధించి రెండవ ఖండంలో వివిధ పారిశ్రామిక సమాజాలలోని మానవ హక్కులు చర్చించబడ్డాయి. ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి.

అవి :

- భాగం : 2 అమెరికా, బ్రిటన్‌లలో మానవ హక్కులు
- భాగం : 3 కెనడాలో మానవ హక్కులు
- భాగం : 4 తూర్పు – ఆగ్నేయ ఆసియా దేశాల్లో మానవ హక్కులు
- భాగం : 5 కొరియాలో మానవ హక్కులు

B R A O U

BRAOU

# భాగం – 2 : అమెరికా, బ్రిటన్‌లలో మానవ హక్కులు

విషయక్రమం :


| | |
|---|---|
| 2.0 | ఉద్దేశం |
| 2.1 | పరిచయం |
| 2.2 | బ్రిటీష్ సామ్రాజ్యదేశాలు |
| 2.3 | కార్మికులు, ఉద్యోగులు |
| 2.4 | ఉత్తర ఐర్లాండ్ |
| 2.5 | స్త్రీల హక్కులు |
| 2.6 | మానసిక రోగులు, ఖైదీలు, స్వలింగ సంపర్కులు |
| 2.7 | నల్ల జాతీయులు, గృహకార్మికులు |
| 2.8 | అమెరికా సంయుక్త రాష్ట్రాలు |
| 2.9 | స్థానిక అమెరికన్లు |
| 2.10 | నల్ల జాతి ప్రజలు – కొనసాగుతున్న వర్ణ వివక్ష |
| 2.11 | అమెరికా మహిళలు – నిరంతర వివక్ష |
| 2.12 | బాలల హక్కులు |
| 2.13 | ముగింపు |
| 2.14 | మాదిరి పరీక్షా ప్రశ్నలు |


BRAOU

## 2.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్‌లలో మానవ హక్కుల స్థితిగతులపై పరిచయం చేసుకుంటారు.
- అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో మానవ హక్కుల స్థితిగతులను తులనాత్మకంగా పరిశీలిస్తారు.
- వివక్షకు గురవుతున్న అమెరికా మహిళల పరిస్థితిని అంచనా వేయగలుగుతారు.

## 2.1. పరిచయం :

మానవ హక్కులు అనగానే సామాన్యంగా మనకు తృతీయ ప్రపంచదేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలే గుర్తుకువస్తాయి. ఈ దేశాలలోని మానవహక్కుల స్థితిగతుల గురించే ప్రధానంగా చర్చ జరుగుతుంది. అభివృద్ధి పేరుతో ఈ దేశాలలో రాజ్యం అనుసరించే అణచివేత రూపాల మీద, సామాజిక అసమానతల మీదనే అందరి దృష్టి వుంటుంది. అంతేకాదు, ఈ అసమానతలు, అణచివేతల ఫలితంగా తలెత్తే మానవ హక్కుల ఉల్లంఘన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలకు, నివేదికల రూపకల్పనకు వాదోపవాదాలకు, చర్చకు, అంచనాలకు కేంద్ర బిందువుగా వుంటోంది. కాగా, తృతీయ ప్రపంచదేశాల మీద తాము రూపొందించిన మానవ హక్కుల విధానాలను రుద్దే అభివృద్ధి చెందిన దేశాలు, తాము పూర్తిస్థాయిలో మానవ హక్కులు సాధించినట్లు చెప్పుకుంటున్నాయి. అంతేకాక, ఈ మానవ హక్కుల విధానాలను తమ ప్రభుత్వాలు తూచ తప్పకుండా అనుసరిస్తున్నామని అభివృద్ధి చెందిన దేశాలు అనుకుంటున్నాయి. అందుకే, తమ దేశాలలో హక్కుల ఉల్లంఘన జరగడం లేదని దబాయిస్తున్నాయి. దీనివల్ల తమదేశాలలో ఏళ్ళతరబడి నిరాటంకంగా కొనసాగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను దాచిపెట్టవచ్చు ననుకుంటున్నాయి.

ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా దేశాలలోని నిరంకుశ, పెత్తందారీ ప్రభుత్వాలతో కుమ్మక్కై స్థానిక ప్రజాస్వామిక ఉద్యమాలను, నిరసనలను అణచివేసే చర్యలలో పాలుపంచుకుంటున్నామనే విషయాన్ని కూడా మరుగున పరచ వచ్చని ఈ దేశాలు భావిస్తున్నాయి. అందుకే, తమ వ్యాపార, వాణిజ్య ప్రయోజనాలకు భంగం కలుగుతాయనుకున్నప్పుడు ఈ దేశాలు నిస్సిగ్గుగా తృతీయ ప్రపంచ దేశాలలోని ప్రభుత్వాలు ప్రజలను ఎంతటి ఊచకోత కోసినా పట్టించుకోవు. పైగా, యునైటెడ్ నేషన్స్ ఈ ఊచకోత మీద విచారణ జరపకుండా ఈ అగ్రరాజ్యాలు అడ్డుకుంటాయి. ఇంకా ఒక అడుగుముందుకువేసి తమ ప్రయోజనాల కోసం తృతీయ ప్రపంచ దేశాల తీవ్రవాద సంస్థలకు రహస్యంగానూ, బహిరంగంగానూ ఆయుధాలు అందజేస్తున్నాయి. ఈ క్రమంలోనే, మానవ హక్కులు రాజ్యానికి పౌరులకు మధ్యవుండే సంబంధాల సారంగా కుదించాలనే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. మానవ హక్కులు పౌర సమాజాలకు సంబంధించిన అంశంగా చూడడానికి ఈ అగ్రరాజ్యాలు నిరాకరిస్తున్నాయి. తమ దేశాల్లోని మానవ హక్కుల పరిభాషలపట్ల డిమాండ్ల పట్ల ఉద్దేశపూర్వకంగానే ఈ దేశాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి.

అభివృద్ధి చెందిన దేశాలలో పౌరహక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన సుదీర్ఘ చరిత్ర ఉన్నప్పటికీ అక్కడ కొన్ని సెక్షన్ల ప్రజలకు నేటికీ అహక్కులు నిరాకరించబడుతున్నాయి. మానవ హక్కుల పరిరక్షణ ప్రభుత్వ పరిధిలోకి వస్తుందనే విషయం ఇంకా గుర్తింపు పొందడంలేదు. ప్రజాస్వామ్యవిలువలు గలిగిన సమాజాన్ని రూపొందించే బాధ్యతను, మానవ హక్కులు సంపూర్ణంగా అనుభవించగలిగే వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సిన అవశ్యకతను అభివృద్ధి చెందిన దేశాలు ఇంకా గ్రహించలేదు. మానవ హక్కులు రాజ్యానికి, సమాజానికి మధ్య వున్న సంబంధాల నుంచే చూడబడుతున్నది గానీ, విడిగా పౌరసమాజంలో హక్కులు ఏవిధంగా కాలరాచివేయబడుతున్నాయో ఈ దేశాల ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. వ్యక్తుల ప్రవర్తన, పక్షపాతవైఖరి, వివక్ష, సాంఘికంగా తక్కువ హోదా, హింస, ప్రైవేటు రంగంలో ఉపాధిసౌకర్యాల కొరత, సామాజిక సంబంధాలు మానవ హక్కులను ప్రభావితం చేస్తాయనే అంశాల్ని ఈ దేశాలు గమనంలోకి తీసుకోవడం లేదు. రాజ్యం తన కార్యకలాపాలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్నదా? లేదా? అన్నదే ముఖ్యం కాదు.

BRAOU

పౌరసమాజం ప్రజాస్వామిక విలువలతో కూడిన పరిపాలనలో వున్నదా? లేదా? అని పరిశీలించుకోవడం అంతే ముఖ్యం కాబట్టి, మొదటి ప్రపంచదేశాలు లేదా అభివృద్ధి చెందిన దేశాలు మానవ హక్కుల పరిరక్షణకు నిజమైన ప్రతినిధులా? కాదా? అని తేల్చుకోదలిచినపుడు ఆదేశాలలోని హక్కుల స్థితిగతుల్ని సామాజికనేపథ్యంలో పరిశీలించాల్సి వుంటుంది. అట్లాచూస్తే, మనకు మానవ హక్కులకు, సంపదకు మధ్య మరియు రాజ్యానికి, పౌరసమాజానికి మధ్యవున్న సంబంధం ఎలాంటిదో బోధపడుతుంది. ఈ పాఠ్యాంశం మీకు అలాంటి అవగాహన కలిగించేందుకే ప్రయత్నిస్తుంది.

## 2.2 బ్రిటీష్ సామ్రాజ్య దేశాలు (U.K) :

బ్రిటీష్ రాజ్యాంగంలో రాతపూర్వకంగా 'హక్కుల బిల్లు' లేదు. అందుకే పౌరహక్కుల కోసం జరుగుతున్న పోరాటాలు సరైన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. కాగా, ఈ రాజ్యాంగం పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందం (International Convenant on Civil and Political Rights) లోని మొదటి, రెండవ ఐచ్ఛిక ప్రోటోకాల్‌లను స్వీకరించడానికి నిరాకరించింది. అలాగే, యురోపియన్ మానవ హక్కుల సదస్సుకు (European Convention on Human Rights) చెందిన ఆరవప్రోటోకాల్‌ను కూడా త్రోసిపుచ్చింది. ఈ ప్రోటోకాల్ దేశంలో శాంతి నెలకొనివున్న సమయాల్లో మరణదండన విధించడాన్ని నిషేధిస్తుంది. కాగా, పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందంలోని కొన్ని ఆర్టికల్స్‌ను ఈ రాజ్యాంగం తిరస్కారభావంతో చూసింది. ఎందుకంటే నిందితులను నాలుగు నెలలలోపు న్యాయస్థానం ముందు హాజరుపరచాలని అవి రాజ్యాన్ని ఆదేశిస్తాయి. చివరకు, ఈ రాజ్యాంగం యురోపియన్ జైలు సూత్రాలను కూడా స్వీకరించలేదు. బహుశా, ఈ విషయాలు పరిశీలించిన ఎవరికైనా బ్రిటీష్‌దేశాలలో మానవహక్కుల పరిస్థితి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. ఈ దేశాల్లో మానవ హక్కులు నిరాకరించబడుతున్న వర్గాల్లో కార్మికులు, ఉత్తర ఐర్లాండ్ ప్రజలు, మహిళలు, ప్రాచీన తెగలు, ఆఫ్రికన్లు ఖైదీలు, స్వలింగసంపర్కులు, గృహకార్మికులు, మానసికవికలాంగులు ముఖ్యమైన వాళ్ళు.

BRAOU

## 2.3 కార్మికులు, ఉద్యోగులు :

కార్మికులు, ఉద్యోగులకు సంఘాలు కట్టే స్వేచ్ఛ లేకపోవడంతో వాళ్ళ హక్కులకు పూర్తి గ్యారంటీ లేకుండా పోయింది. ఆ హక్కులు ఏక్షణాన్నైనా హరించివేయబడవచ్చు. 1980లో మార్గరెట్ థాచర్ ప్రభుత్వం కార్మికుల హక్కులలో కోత విధించింది. అంతేగాక, కార్మికుల స్థితిగతులు పట్టించుకునే అధికారం కంపెనీ డైరెక్టర్లకే వదిలివేసింది. ఉద్యోగులకు హక్కులు పూర్తిగా నిరాకరించబడ్డాయి. ఉద్యోగుల సంక్షేమం కోసం రూపొందిన సామూహిక ఒప్పందాలు ఎప్పుడూ వాళ్ళకు ప్రయోజనాలు చేకూర్చిపెట్టలేదు. యూనియన్ గుర్తింపుకు సంబంధించిన ఎలాంటి ఒప్పందాన్నైనా యజమాని తిరస్కరించగలిగేవాడు. అలాచేసినందుకు, ఆయనకు ఏశిక్ష పడేది కాదు. ఒకవేళ పడ్డా కోర్టుకు నష్టపరిహారం చెల్లిస్తే సరిపోయేది. యజమానులను ఇది పెద్దగా ఇబ్బంది పెట్టే శిక్ష కాదు. కాగా, యూనియన్ ఏర్పాటును గుర్తించేలా చేయగలిగే ఒకే ఒక్క ఉపాధి యాక్ట్ (1980) కూడా రద్దు చేయబడింది. సభ్యుల హక్కులు కాపాడేందుకు కార్మిక సంఘ సభ్యుల హక్కుల కమీషన్ (Commission for the Rights of Trade Union) ఒకటి ఉండేది కానీ, దానికి చట్టపరమైన వెసులు బాటులేదు. 1980లో బ్రిటీష్ ప్రభుత్వం హక్కులను డిమాండ్ చేసే చట్టపరమైన యంత్రాంగాలన్నింటిని నిషేధించింది. ఎందుకంటే,

ఇవి ఉద్యోగుల్లో, కార్మికుల్లో ఐక్యత పెంపొందించేవి. కాగా, ప్రభుత్వం ఈ యంత్రాంగాల్ని మరో ప్రాంతానికి తరలించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం కుదిరిన ఐక్య ఒప్పందాల్లో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ ఒక షరతు కాబట్టి బ్రిటన్ ప్రభుత్వం ఈయంత్రాంగాల్ని ఆప్రాంతాల్లోకి తరలించవలసి వచ్చింది. ఇదిలావుంటే, ఉపాధ్యాయులకు సంబంధించిన హక్కుల యంత్రాంగం కూడా నిషేధానికి గురైంది. 1993లో కార్మికసంఘాల సంస్కరణ ఉపాధి బిల్లు (Trade Union Reform and Employment Bill) లో జరిగిన సవరణల వల్ల యాజమన్యానికి కార్మిక సంఘాల్లో చేరిన కార్మికులకు జరిమానా విధించే అధికారం, ఉద్యోగం నుంచి తొలగించే అధికారం వచ్చింది.

ఈ సవరణల వల్ల యజమానులు తమ ఇష్టం వచ్చిన రీతిలో పనివిధానాల్ని మార్చేందుకు యూనియన్ ప్రవర్తనానియమావళిలో మార్పులు చేసేందుకు అవకాశం చిక్కింది. చివరకు, అదనపు పనిగంటల చెల్లింపుల నిబంధనలు కూడా రద్దయ్యాయి. ఫలితంగా, కార్మికులు తరచూ ఉచితంగానే ఎక్కువ పనిగంటలు శ్రమించవలసి వస్తోంది. అంతేకాదు, ఈ సవరణలవల్ల కార్మిక సంఘాల డిమాండ్లు పూర్తిగా కుదించబడ్డాయి. ఆఖరుకు, మెటర్నిటీ లీవుల విషయంలోనూ పరిమితులు విధించబడ్డాయి. ఎవరైనా వ్యక్తులు కార్మికులను సంఘటితపరిచే మాటలు చెబితే వాళ్ళు యజమానుల చేతుల్లో వేధింపులకు గురయ్యేవారు. అట్లా వేధించే, అధికారాన్ని యజమానులకు చట్టమే ఇచ్చింది. కాగా, ఈ చర్యలన్నీ డిక్లరేషన్‌లోని సంఘటితమయ్యే హక్కును ఇచ్చే ఆర్టికల్ 20 (1) కి, కార్మిక సంఘాల ఏర్పాటు, సభ్యత్వం హక్కును ఇచ్చే ఆర్టికల్ 23 (4) కి వ్యతిరేకమైనవే.

## 2.4 ఉత్తర ఐర్లాండ్:

ఉత్తర ఐర్లాండ్‌లోని మానవ హక్కులు అతిక్రమించబడుతున్న విధానం ప్రపంచవ్యాప్తంగా నిరసనకు గురైంది. ఉదాహరణకు ఉత్తర ఐర్లాండ్‌లో ఖైదీల పట్ల నిర్లక్ష్యవైఖరిని, క్రూరమైన విచారణా విధానాన్ని, ప్రజాస్వామిక సంస్థలు, సంఘాలపట్ల అధికారులు అనుసరిస్తున్న పక్షపాతవైఖరిని, చట్టవ్యతిరేకమైన మరణదండనలను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అనే మానవ హక్కుల సంస్థ 1993లో రూపొందించిన ఒక నివేదికలో ఖండించింది. ఐర్లాండులో మానవ హక్కుల ఉల్లంఘన ఎంత తీవ్రస్థాయిలో జరుగుతున్నదో చెప్పడానికి ఇంత కన్నా వేరే ఆధారమేమీ అవసరం లేకపోవచ్చు.

1974లో రూపొందించిన టెర్రరిస్టు నిరోధక చట్టాన్ని అడ్డంపెట్టుకొని ఉత్తర ఐర్లాండ్ ప్రభుత్వం 1990 నాటికి ఏడువేలమంది ప్రజలను జైళ్ళలో పెట్టింది. విచారణ అనంతరం ఇందులో దోషులుగా నిరూపించబడ్డవారు అతికొద్దిమంది మాత్రమే. మెజారిటీ ఖైదీలకు ఈ కార్యకలాపాలతో ఇసుమంతైనా సంబంధం లేదు. కాగా, 1973లో టెర్రరిస్టు నేరాల్లో నిందితులుగా వున్న వారికోసం ప్రత్యేకమైన విచారణా పద్ధతిని కూడా రూపొందించారు. డిప్లాక్ కోర్టులు (Diplock Courts)గా పిలువబడే సింగిల్‌జడ్జి కోర్టుల్లో నిందితుల చేత బలవంతంగా నేరం ఒప్పించేవాళ్ళు. నిందితులకు న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే సౌకర్యం కూడా ఉండేదికాదు. కనీసం, వాళ్ళను ఎందుకు నిర్బంధించారో కూడా చెప్పేవారు కాదు. ఈ పద్ధతులన్నీ యునైటెడ్ నేషన్స్ నియమనిబంధనల్లోని పౌర, రాజకీయహక్కుల అంతర్జాతీయ ఒప్పందంలోని ఆర్టికల్ 14(3) కి, విచారణలో వున్న ఖైదీల నిర్బంధం, రక్షణకు సంబంధించిన బాడీ ఆఫ్ ప్రిన్సిపుల్‌లోని 18 వ సూత్రానికి, ఖైదీల స్థితిగతులకు సంబంధించిన స్టాండర్డ్ మినిమం రూల్స్‌లోని 92 వ నియమానికి వ్యతిరేకమైనవి.

BRAOU

టెర్రరిస్టు నిరోధక చట్టం కింద బందీలైన సుమారు పదిహేను వందల మంది ఖైదీలు తాము జైళ్ళలో వున్నపుడు భయంకరమైన వేధింపులకు గురయ్యామని చెప్పారు. ఫిర్యాదులను పరిశీలించేందుకు ఎలాంటి స్వతంత్ర విచారణ జరగలేదు. కానీ, విచిత్రంగా పోలీసుశాఖ, మొక్కుబడిగా ఒక దర్యాప్తు జరిపి చేతులు దులుపుకుంది. 1973 నాటికే పోలీసుల, రక్షణ దళాల చేతిలో అనుమానాస్పదస్థితిలో 350 మంది మరణించారు. ప్రభుత్వం నిర్వహించిన 'విచారణ' లో కేవలం ఒకే ఒక వ్యక్తి దోషిగా తేలాడు అంటే ఆవిచారణలోని చిత్తశుద్ధి ఏపాటిదో మనకు అవగతమౌతుంది. ఉత్తర ఐర్లాండులో జరిగే ఈ విచారణలు ఇంగ్లాండు, వేల్స్‌లోని విచారణలకు పూర్తి భిన్నంగా వుంటాయి. నేరానికి సంబంధించి ఎలాంటి తీర్పు చెప్పడానికైనా ఈ విచారణ సంఘాలకు అనుమతి లేదు. హత్యల్లో నిందితులైన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు విచారణ సంఘాల ముందు సాక్ష్యమివ్వాల్సిన అవసరం లేదు. పైగా ఈ అధికారులను కేవలం రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా ప్రశ్నించే హక్కు ఈ సంఘాలకు లేదు, మరోవైపు, నిందితుల కుంటుంబాలకు విచారణకు సంబంధించిన ఎలాంటి సమాచారం గానీ, ఖర్చులుగానీ అందేవికావు. పైగా రక్షణదళాలు ప్రభుత్వ అనుకూల దళాలతో ( Loyalist Parliamentary forcer) కుమ్మక్కై పౌరులను మతమార్చేవి. రక్షణదళాలు అధికారులు అనుమానాస్పద వ్యక్తులపై రూపొందించిన కొన్ని రహస్యఫైళ్ళను ఈ దళాలకు అందజేసినట్టు 1989లో కొన్ని ఆధారాలు దొరికాయి. ఈఫైళ్ళలో వున్న సమాచారం ఆధారంగా ఈ దళాలు పౌరులను హతమార్చేవి. ఈ ఘాతుకాలను విచారించేందుకు ఏర్పాటైన స్టీవెన్స్ విచారణ నివేదికలోని అంశాలను బయటకు రాకుండా తొక్కిపట్టేందుకు శతవిధాల ప్రయత్నాలు జరిగాయి. ఫలితంగా, ఈనివేదిక కేవలం సంక్షిప్తరూపంలోనే బయటకు వచ్చింది.

ఉత్తర ఐర్లాండులో ఎన్నో ప్రాథమిక హక్కులు అతిక్రమణకు గురయ్యాయి. జీవించే హక్కు, స్వేచ్ఛాహక్కు, రక్షణహక్కు, చిత్రహింసలు నిరోధించేహక్కు, అమానవీయమైన, అవమానకరమైన వేధింపులకు గురిచేయబడకుండా ఉండే హక్కు, సమాన న్యాయంహక్కు, చట్టంద్వారా రక్షణపొందే హక్కు, స్వేచ్ఛావిచారణహక్కు, దోషిగా రుజువయ్యే వరకు నిందితునిగా పరిగణింపబడే హక్కు, స్వేచ్ఛగా సంచరించే హక్కు, వాక్ స్వాతంత్ర్యపు హక్కులాంటి ఎన్నో హక్కులు ఇక్కడ హరించివేయబడ్డాయి.

BRAOU

## 2.5 స్త్రీల హక్కులు :

బ్రిటన్‌లోని కార్మిక శక్తిలో మహిళలు ఐదింటా రెండువంతులు వున్నారు. కానీ, పురుషులతో పోల్చుకుంటే వీళ్ళు సంపాదించేది నాలుగింటా మూడువంతులే. 16 నుంచి 60 సంవత్సరాల వివాహిత స్త్రీలలో 61 శాతం స్త్రీలు ఏదో ఒకపని చేసి డబ్బు సంపాదిస్తారు. వీళ్ళలోని చాలామంది సంపాదన కుటుంబ భారాన్ని మోసేందుకు అత్యంత అవసరమైనది. ఉద్యోగాల్లో స్త్రీ పురుషులకు సమానవేతనాలు చెల్లించాలని సమానవేతన యాక్టు (1970) ,లింగవివక్ష యాక్టు (1975) చెబుతున్నప్పటికీ అసమానతలు మాత్రం ఇంకా కొనసాగుతూనే వున్నాయి. విద్య, ఉద్యాగాల్లో అసమానతలు తొలగించడానికి ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం కలగడం లేదు. ముఖ్యంగా, పెన్షన్ స్కీం, రిటైర్మెంట్ ప్రణాళికల విషయంలో ఈ వివక్ష వుంది. స్త్రీలు పురుషులకంటే ముందే రిటైరమెంట్ తీసుకునేలా ఒత్తిడి చేయబడుతున్నారు. రిటైరమెంట్ వయసు స్త్రీలకు 60 ఏళ్ళు అయితే పురుషులకు 65 ఏళ్ళు. వీటికితోడు ఉద్యోగంలో స్త్రీల ఎదుగుదలకు కుటుంబ బాధ్యతలు ఆటంకంగా

మారుతున్నాయి. ఫలితంగా, రిటైరయ్యే సమయానికి వాళ్ళు ఎక్కువ మొత్తంలో పెన్షన్ పొందడానికి అవసరమయ్యే సర్వీసును పూర్తి చేయలేకపోతున్నారు. అధిక జీతభత్యాలు లభించేలా, ఇంజనీరింగ్ లాంటి కోర్సుల్లో స్త్రీలు ప్రవేశించడానికి బ్రిటన్‌లో వున్న విద్యావిధానాలు పరిమితులు విధించాయి. ఉద్యోగ నిర్వహణలో స్త్రీలకు మధ్యమధ్యన ఆటంకాలు ఎదురవుతాయి కనుక ఉన్నత స్థానాలకు వెళ్ళే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఫలితంగా, స్త్రీలు కిందిస్థాయి ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కావలసివస్తోంది. 1980 దశాబ్దం చివరినాటికి 75 శాతం మహిళలు క్యాంటిన్ అసిస్టెంట్, హెయిర్ డ్రెస్సర్, షాప్ అసిస్టెంట్ లాంటి ఉద్యోగాల్లో పనిచేస్తుంటే కేవలం పదిశాతం మహిళలు ఆర్కిటెక్ట్, న్యాయవాదవృత్తిలో కొనసాగుతున్నారు.

వివక్షకు గురికాకుండా రక్షించేందుకు చట్టాలు స్త్రీలకు చాలా అరుదుగా మాత్రమే సహకరిస్తాయి. న్యాయసహాయం కోరిన మహిళల్లో పదకొండుశాతం మాత్రమే ప్రయోజనం పొందగలుగుతున్నారు. పైగా, ఇంగ్లీషు చట్టం కొన్ని విషయాల్లో స్త్రీలకు, వ్యతిరేకంగా పనిచేస్తోంది. ఇంగ్లీషు స్త్రీ ఏదైనా ఒక కాంట్రాక్టు కుదుర్చుకోవలసివస్తే ఆమె విధిగా భర్త సంతకం తీసుకోవాలి. చివరకు, గ్యాస్, ఎలక్ట్రిక్ కంపెనీలకు సంబంధించిన కాంట్రాక్టయినా సరే. భర్త పన్నుల రాబడులను చూసే హక్కు చట్టపరంగా భార్యకులేదు. కానీ, ఆమెకు మాత్రం ఆపత్రాల్లో విధిగా భర్త సంతకం వుండాల్సిందే. ఇక, జాయింట్ అకౌంట్‌లో భార్య సక్రమంగా డబ్బు జమచేయకపోతే ఆసొమ్ము మొత్తం భర్తకే చెందుతుంది.

ఇదిలావుంటే, సమానవేతన చట్టం, లింగవివక్ష చట్టం సరిగ్గా అమలయేలా చూడడానికి ఏర్పాటయిన సమాన అవకాశాల కమీషన్‌కు (Equal Opportunity Commission) వున్న వనరులు, సిబ్బంది చాలా తక్కువ. ఇక, ఉద్యోగరంగంలో స్త్రీలపై ప్రయోగించబడుతున్న లింగవివక్షను పరిష్కరించేందుకై ఏర్పాటైన అడ్వైజరీ కన్సీలియేషన్ మరియు ఆర్బిట్రేషన్ సర్వీసు (Advisory Conciliation Arbitration Service) తన విధి నిర్వహణను పక్కనబెట్టి స్త్రీలకు అహేతుకమైన సలహాలు ఇచ్చి ఫిర్యాదులు ఉపసంహరించుకునేలా ఒత్తిడి తీసుకువచ్చింది.

BRAOU

## 2.6 మానసిక రోగులు, ఖైదీలు, స్వలింగ సంపర్కులు :

బ్రిటన్‌లో మానవహక్కులు కోల్పోతున్న మరో మూడు గ్రూపులు- రోగులు, ఖైదీలు, స్వలింగసంపర్కులు. మానసిక రుగ్మతలో బాధపడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు మానసిక ఆరోగ్య యాక్టు (1983) వీలుకల్పిస్తుంది. అదుపులోకి తీసుకున్న రోగి డిశ్చార్జికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలు ఈ యాక్టులో లేవు. అలాగే, ఒకవ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికి గల కారణాలు అతనికి చెప్పాలన్న నియమమేది ఇందులో లేదు. ఇది రోగి స్వేచ్ఛా హక్కుకు (ఆర్టికల్ 3 ప్రకారం) భంగ కరమైనది. కాగా, మానసిక రోగాలతో వ్యవహరించే క్రమంలో సెక్సిస్టు ధోరణులు, జాత్యహంకార ధోరణులు చోటుచేసుకుంటున్నాయి. అందుకే, పురుషుల కన్నా స్త్రీలనే అధికంగా ఈ మానసిక చికిత్సాలయాల్లో చేర్పించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. అంతేకాదు, చికిత్సాక్రమంలో స్త్రీ, పురుషుల మధ్య స్పష్టమైన వివక్ష ప్రదర్శిస్తున్నారు. మానసిక రోగులను నయంచేసే మందులలో మూడింటిలో రెండువంతులు మహిళలకు ఇస్తున్నారు. మహిళా రోగులను ఒంటరిగా ఉంచే చర్యలు కూడా చేపట్టడం లేదు. ఈ ఆసుపత్రులలో జరుగుతున్న అవకతవకలను పరిశీలించిన ఒక విచారణ సంఘం మహిళా రోగుల పరిస్థితి గురించి ఈ విధంగా అభిప్రాయపడింది. ఈ ఆసుపత్రులలో మహిళలకు ఇస్తున్న చికిత్స

పూర్తి అజ్ఞానంగా, అప్రామాణికంగా, అశాస్త్రీయంగా వుందని ఆనివేదిక పేర్కొంది. మైనారిటీగా వున్న సాంప్రదాయగిరిజన తెగలపై, ముఖ్యంగా నల్లజాతి ప్రజలపై ఈ చట్టాన్ని ఉపయోగించి వాళ్ళను మానసికరోగుల ఆసపత్రుల్లో నిర్బంధిస్తున్నారని మరో నివేదిక తెల్పింది. మానసిక రోగులుగా చిత్రించడమే కాదు, తాళాలు వేసిన వార్డుల్లో బృందాలుగా ఉంచి ఎక్కువ మోతాదుల్లో మందులు ఇస్తున్నారు. మానసిక రోగులుగా ముద్రపడి బయటకువచ్చాక నిరుద్యోగులుగా వుండిపోతున్న వీళ్ళకు ప్రభుత్వం ఉపాధికల్పించేందుకు ఏచర్యలు తీసుకోవడం లేదు. కనీసం నిత్యావసర వస్తువులు పొందే అవకాశాన్ని కల్పించే చట్టాలను కూడా రూపొందించలేదు. ఇక ఖైదీల విషయానికి వస్తే పశ్చిమ యూరప్ దేశాలలో బ్రిటన్‌లోనే ఎక్కువ మంది ఖైదీలు జైళ్ళలో మగ్గుతున్నారు. ఈ సంఖ్య సుమారు 55 వేలు, ఇందులో అధికశాతం ఖైదీలు విచారణలో వున్నవాళ్ళే, కాగితాల్లో ఈ ఖైదీలకు అన్ని హక్కులు, సౌకర్యాలు వున్నా ఆచరణలో మాత్రం వాళ్ళకు మొండిచెయ్యే ఎదురవుతుంది. ఖైదీలకు కల్పిస్తున్న ఆరోగ్య సౌకర్యాలు చాలా నాసిరకమైనవి. ఈ ఖైదీలను బయటి ప్రపంచంలో ఎలాంటి సంబంధం పెట్టుకోకుండా నిర్బంధిస్తున్నారు. చివరకు, 1991 నుంచి ఖైదీలకు వచ్చే ఉత్తరాల్ని సెన్సార్ చేయడం కూడా ఆరంభించారు. స్థానిక జైళ్ళలో పరిస్థితి ఇంతకన్నా ఘోరంగా వుంది. అపరిశుభ్రమైన భవనాలలో, దుర్భరమైన పరిసరాలతో, పరిమితికి మించిన ఖైదీలతో కిక్కిరిసిపోయి ఆ జైళ్ళు నరకకూపాలుగా మారిపోయాయి. పైగా, ఖైదీలను ఎక్కువ సమయం సెల్‌లలోనే నిర్బంధిస్తున్నారు. జైలు సిబ్బంది ప్రవర్తన కూడా చాలా నీచంగా, అనాగరికంగా వుంటుంది. స్థానిక జైళ్ళలో నిర్బంధానికి గురయ్యే రిమాండు ఖైదీలు ఈ పరిస్థితులకు తట్టుకోలేక తరచు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. జైళ్ళలో జరిగే కొట్లాటలు, దాడుల్లో పాల్గొనేది కూడా వీళ్ళే. ఈ జైళ్ళలో వుండే సుమారు 40 శాతం ఖైదీలు న్యూరోసిస్, సైకోసిస్ లాంటి మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. ఖైదీలకు జైలు అధికారులు కనీస వైద్యసౌకర్యాలు కూడా అందించరు. ఇక, మహిళా ఖైదీల పరిస్థితి మరింత దుర్భరంగా వుంటుంది. మగఖైదీలకు వున్న కొద్దిపాటి సౌకర్యాలు కూడా వీళ్ళకు వుండవు. పైగా, స్త్రీలను తమ స్వంత ప్రాంతాలకు చాలా దూరంగా తీసుకుపోయి నిర్బంధిస్తారు. బ్రిటీష్ జైళ్ళలో ఇతర దేశాలకు చెందిన ఖైదీలు సుమారు మూడువేల వరకు వుంటారు. ఈ ఖైదీలకు బ్రిటీష్ న్యాయ వ్యవస్థ గురించి ఏమీ తెలియదు. ఈ విషయంలో వీరికి సహాయాన్ని అందించే ఏర్పాట్లు కూడా లేవు. అంటే, స్థానిక చట్టాలు తెలియకవీళ్ళు ఏళ్ళ తరబడి జైళ్ళలో మగ్గిపోవలసిందేనన్నమాట.

## 2.7 నల్లజాతీయులు, గృహకార్మికులు :

బ్రిటన్‌లో జాత్యాహంకార ధోరణులు ఏళ్ళ తరబడిగా కొనసాగుతున్నప్పటికీ ఇటీవల కాలంలో అవి మరింత ఎక్కువయ్యాయి. నల్ల జాతీయుల హత్యలు, దాడులు, వేధింపులు తీవ్రతరమయ్యాయి. 1992 లో జాతుల కలహాల్లో ఎనిమిది మంది చనిపోయారు.

ఇతర దేశాల నుంచి ఇక్కడికి వచ్చి గృహకార్మికులుగా పనిచేస్తున్న వారికి ప్రత్యేక హక్కులంటూ ఏమి లేవు. తమ యజమాని దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతక వలసిందే. కాగా, ఒక సర్వేరూపొందించిన అంచనాల ప్రకారం 21.9 శాతం కార్మికులు జైళ్ళకు వెళ్ళి బానిస బతుకులు ఈడుస్తున్నారని తేలింది. 91.6 శాతం కార్మికుల బెదిరింపులు, అరుపులు, అవమానాలు, పేర్లతో పిలవబడడం లాంటి మానసిక వేధింపులకు గురవుతున్నారు. ఆరుశాతం స్త్రీలు లైంగిక వేధింపులకు లోనవుతున్నారు. 62.3 శాతం కార్మికులకు సరైన తిండికూడా లభించడం లేదు.

BRAOU

## 2.8 అమెరికా సంయుక్త రాష్ట్రాలు :

అమెరికా రాజ్యాంగం లింగ, వర్ణ, వర్గ వివక్ష లేకుండా పౌరులందరికీ సమానహక్కులు హామీ ఇస్తోంది. ఈ రాజ్యాంగపరమైన హామి లాంఛనంగానైనా పొందడానికి అక్కడి ప్రజలు సుధీర్ఘ కాలంగా, ఎన్నో పోరాటాలు చేయవలసివచ్చింది. అయితే, ఇక్కడ పకడ్బందీగా పనిచేస్తున్న న్యాయవ్యవస్థ, పౌరహక్కుల చైతన్యం వున్నప్పటికీ, ప్రజలు మానవ హక్కులను సంపూర్ణంగా అనుభవించలేకపోతున్నారు, ముఖ్యంగా, స్త్రీలు, నల్ల జాతీయులు, పేదలు, పిల్లలు, నిరాశ్రయులు, మానసికరోగులు. అమెరికా సమాజంలో వర్ణవివక్ష, సెక్సిజం, సంఘబహిష్కృతులపట్ల చిన్నచూపు ఇప్పటికీ క్రూరమైన రూపంలో కొనసాగుతూనే వుందంటే ఆశ్చర్యమేస్తుంది. కానీ, ఇది వాస్తవం దిగువతరగతిగా పిలువబడుతున్న వర్గం ప్రజలు సాంస్కృతికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా మెరుగైన జీవనం గడపలేని పరిస్థితులు నెలకొని వున్నాయి.

అందుకే, అంతర్జాతీయ మానవ హక్కుల పరిధిలోకి అమెరికా సంయుక్తరాష్ట్రాలు ఈ మధ్యేవచ్చి చేరాయి. పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందం (International Covenant on Civil & Political Rights) రూపుదిద్దుకోవడంలో అమెరికాయే ప్రధాన భూమిక పోషించినప్పటికీ ఆసిఫార్సులకు మాత్రం 1993 లో అంగీకారం తెలిపింది. కానీ, ఇంతవరకు అమెరికా మొదటి ఐచ్ఛిక ప్రోటోకాల్ మీద సంతకం చేయనేలేదు. దేశంలోని ఏ వ్యక్తి నుంచి అయినా ఫిర్యాదులు స్వీకరించి, విచారించే అధికారాన్ని ఆ ప్రోటోకాల్ మానవ హక్కుల కమిటీకి ఇస్తుంది. అమెరికా ప్రభుత్వం దేశంలోని మానవహక్కుల స్థితిగతులపై ఒక నివేదిక రూపొందించి 1995 లో మానవ హక్కుల కమిటికి సమర్పించింది. ఈనివేదికలో "వర్ణవివక్ష బానిసత్వం, జాతుల విభేదాలు రాజ్యమేలుతున్నాయని, ఒప్పందంలో పేర్కొన్న విధంగా ప్రజలు హక్కులు పొందలేకపోతున్నార"ని ప్రభుత్వం అంగీకరించింది. చాలాపరిమితులు, షరతులతో ఒప్పందాన్ని స్వీకరించిందంటే ఇంకా ఆదేశం మానవ హక్కుల సంరక్షణపట్ల తన పూర్తి సంసిద్ధతను ప్రకటించడానికి మీనమేషాలు లెక్కిస్తుందనే భావించవచ్చు. మరణశిక్ష విధించే హక్కు, ప్రస్తుతం వున్న చట్టాలను అనుగుణంగా గానీ, భవిష్యత్తులో రూపొందే చట్టాలకు అనుగుణంగాగానీ బాల ఖైదీలకు మరణదండన విధించే అధికారాన్ని అమెరికా తన వద్దేఅట్టిపెట్టుకుంది. అంతేకాక, బాల ఖైదీలను ఇతర ఖైదీలతో కలిపేసే హక్కు, యుద్ధ ప్రచారంలో పాల్గొనేలా చేసే హక్కును కూడా అమెరికా తన ఆధీనంలో ఉంచుకుంది.

BRAOU

## 2.9 స్థానిక అమెరికన్లు :

తరతరాలుగా అమెరికా భూభాగంలో నివాసముంటున్న అసలుసిసలైన గిరిజన తెగల ప్రజలే స్థానిక అమెరికన్లు. అమెరికాను నిర్మించే క్రమంలో వీళ్ళందరకూ ఊచకోతకు గురయ్యారు. ప్రస్తుతం సుమారుగా 542 అమెరికన్ తెగలు ఉనికిలో వున్నాయి. అమెరికా జనాభాలో వీళ్ళు 1.1 శాతం ఇందులో మూడువంతుల ప్రజల దారిద్ర్యరేఖకు ఆరోగ్యం కరువై దీనమైన బతుకీడుస్తున్నారు. అమెరికా చట్టం వీళ్ళకు ప్రత్యేక ప్రతిపత్తిని, అమెరికా పౌరసత్వాన్ని ఇచ్చింది. అయితే, ఈ ప్రత్యేక ప్రతి పత్తి చాలా పరిమితులతో వుండడం మూలాన భూములు, నీటిసౌకర్యాలపై అజమాయిషీ నిలుపుకోవడం గిరిజనులకు కష్టసాధ్యంగా వుంది. పైగా, నష్ట పరిహారం

చెల్లించకుండానే ఈ భూములను స్వాధీనం చేసుకునే అధికారాన్ని అమెరికా సమర్పించిన నివేదికపై గిరిజనుల హక్కులు చట్టపరమైనవీ, రాజ్యాంగబద్ధమైనవీ కావు అని వ్యాఖ్యానించింది. స్థానిక అమెరికన్లకు సంయుక్త రాష్ట్రాల ప్రజలకు మధ్య వున్న సంబంధాలు ప్రభుత్వ ప్రజాస్వామిక సూత్రాల మీద ఆధారపడినవి కాదు. ఇవి ప్రజల అనుమతితో రూపొందినవి కూడా కావు. అమెరికా కాంగ్రెస్‌కు వాణిజ్యాన్ని క్రమబద్ధీకంచేందుకు, గిరిజనులతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రాజ్యాంగం పరిమిత అధికారాలనే ఇచ్చింది. దీన్ని ఉపయోగించుకొని స్థానిక అమెరికా రాజ్యాలపై గిరిజనులపై అమెరికా ప్రభుత్వం విస్తృత అధికారాన్ని చెలాయించింది. రాజ్యాంగం నుంచిగానీ న్యాయవ్యవస్థ నుంచిగానీ, చివరకు స్థానిక ప్రజలనుంచి గానీ అంగీకారం లేకుండానే అమెరికా స్థానికుల హక్కుల విషయంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తించింది అని కూడా వ్యాఖ్యానించింది.

## 2.10 నల్లజాతి ప్రజలు : కొనసాగుతున్న వర్ణవివక్ష :

1980లలో అమెరికా రాజకీయ ఆర్థిక రంగం శ్రామిక ప్రయోజనాల దశను వదిలి పెట్టుబడి దారీ దశకు చేరుకోవడానికి ఉవ్విళ్లూరింది. "కూలిపోతున్న పారిశ్రామిక పునాదులను రక్షించుకోవడానికి అమెరికా ఆర్థికరంగం తక్కువవేతనాల పార్ట్‌టైం ఉద్యోగాల సంప్రదాయాన్ని ప్రవేశపెట్టింది. కొద్దికాలంలోనే ఈ సంప్రదాయం కూడా ప్రమాదంలో పడింది. ఉద్యోగస్థులను విచ్చలవిడిగా తొలగించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. విద్య, గృహవసతుల్లో సమానత్వం పాటిస్తామని ఇచ్చిన హామీకి అమెరికా ఫెడరల్, స్థానిక ప్రభుత్వాలు తిలోదకాలిచ్చి, అవకాశాలను అందిపుచ్చుకునే అర్హతలను కుదించి, అత్యవసరమైన సంక్షేమ కార్యక్రమాలను రద్దుచేసి కార్మికుల జీవితాల్లో దుర్భర దారిద్ర్యం నెలకొనడానికి ఇక్కడి ప్రభుత్వాలు తమ వంతు సహకారాన్ని అందించాయి. ఈ దారిద్ర్యం ముఖ్యంగా పట్టణప్రాంత నల్ల జాతీయులనే ఎక్కువ ప్రభావితం చేసింది". కాగా, కొద్దిపాటి మధ్యతరగతి నల్ల జాతీయులు మాత్రం ఫెడరల్ వ్యవస్థ అందించిన ఫలాలలో లాభపడి సాధారణ (యాంత్రికి) జీవన స్రవంతిలో కలిసిపోయారు. నల్ల జాతి పేదలు మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురై సమాజానికి దూరంగా ఉంచబడ్డారు. ఫలితంగా, వీళ్ళు విద్య, ఉద్యోగ, ఆరోగ్య, ఆదాయ, రాజకీయ, రక్షణ రంగాల్లో తగిన స్థానం పొందలేక వెనుకబడిపోయారు. ఆర్థిక సంక్షోభాల సమయంలో వీళ్ళు దుర్భరమైన దారిద్ర్యం అనుభవిసున్నారు. కాగా, వర్గము, వర్ణము రెండూ కలిసి నల్ల జాతి ప్రజలు పేదరికం నుంచి బయట పడకుండా చూడడానికి జాగ్రత్త పడుతున్నాయి.

1980 దశకం మధ్య కాలానికి మొత్తం నల్లజాతి అమెరికన్లలో మూడింట ఒకవంతు ప్రజలు 'నిరుపేదలు'గా గుర్తించ బడ్డారు. ఆరుసంవత్సరాలలోపు వున్న సగానికి పైగా నల్లజాతి బాలలు దారిద్ర్య రేఖకు దిగువనవున్న కుటుంబాల్లో నివసిస్తున్నారు. ఒకటిన్నర శాతం నల్లజాతీయులు నిరుద్యోగులుగా కాలం వెళ్ళదీస్తున్నారు. తెల్లజాతీయలతో పోల్చుకుంటే 56శాతం నల్లజాతీయులు సంపాదనా మార్గంలో వున్నారు కానీ, 1970 దశకం చివరిభాగంలో మధ్య తరగతి, కార్మికవర్గ నల్లజాతి కుటుంబాల ఆదాయం సుమారు వెయ్యిడాలర్లు తగ్గిపోయాయి. నల్లజాతీయులు తెల్లజాతీయుల కన్నా మూడు రెట్లు అధికంగా పేదరికంలో మగ్గుతున్నారు. ఈ పేదల్లో కూడా నల్ల జాతిపేదల ఆదాయం తెల్ల జాతిపేదలకన్నా 20 శాతం తక్కువగా వుంది.

నల్లజాతీయుల్లో అధికశాతం నిరక్షరాస్యులే అయినప్పటికీ 1990లలో వీళ్ళకు అందిన ప్రాథమిక, సెకండరీస్థాయి విద్యా ప్రమాణాలు చాలా నాసిరకమైనవి. సాంస్కృతిక విషయాకాల్లో కూడా నల్లజాతి విద్యార్థులు

BRAOU

చాలా వెనకబడివున్నారు. అక్షరాస్యత విషయంలో సగానికి పైగా నల్లజాతి టీనేజర్లు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. పోతే, గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ కోర్సుల్లో నల్లజాతీయుల సంఖ్య అతిస్వల్పంగా వుంది. కాగా, 1980 లలో పురోగమనంలో వున్న ఆర్థికరంగం కొత్తకొత్త ఉపాధి అవకాశాలను సృష్టించింది. అయితే, ఈ అవకాశాలు అందుకోవడానికి ఉన్నత సాంకేతిక నైపుణ్యం అవసరమైంది. సహజంగానే, నల్ల జాతీయులకు ఈ అర్హతలు ఉండే అవకాశం లేదు గనుక వాళ్ళు నిరుద్యోగులు, చిరుద్యోగులుగా మిగిలిపోవలసి వస్తోంది. పార్ట్‌టైం ఉద్యోగులుగా కాజ్‌వల్ లేబర్లుగా చేరి ఎలాంటి అదనపు సౌకర్యాలు పొందలేకపోయారు. నల్లజాతీయులు తెల్ల జాతీయుల కన్నా రెండున్నర శాతం అధికంగా నిరుద్యోగంతో బాధపడుతున్నారని 1990 లలోని ఒక సర్వే చెప్పింది. నల్లజాతి మహిళలు తక్కువ జీతభత్యాలు వుండే గుమస్తా, గృహకార్మిక వృత్తులలో మాత్రమే ఉపాధి పొందుతున్నారు.

అమెరికాలోని ఆరోగ్యరంగాన్ని పరిశీలిస్తే ఇటీవలి కాలంలో అక్కడ మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. కానీ, తెల్లజాతీయుల కన్నా నల్లజాతీయుల్లో ఈ మరణాలు రెండు నుంచి మూడు రెట్లు అధికంగా వున్నాయి. టి.బి. క్యాన్సర్ లాంటి ఇతర అనేక రోగాలు నల్ల జాతీయులకే అధికంగా వస్తున్నాయి. మరణాల సంఖ్య కూడా ఎక్కువగానే వుంది.

కాగా, తెల్ల జాతీయుల జీవితాల కన్నా నల్ల జాతీయుల జీవితాల్లో అభద్రత ఎక్కువ. 1982 లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం తెల్ల జాతీయుల కన్నా 33 శాతం అధికంగా నల్లజాతి ప్రజలు లైంగిక అత్యాచారం, దోపిడి, వేధింపులకు గురవుతున్నారు. తెల్ల జాతీయులకన్నా ఆరు రెట్లు అధికంగా హత్యలకు గురవుతున్నారు. 1987 లలో 15 నుంచి 19 సంవత్సరాలు వున్న నల్లజాతీయువకులు తెల్ల జాతీయులకన్నా పదిరెట్లు అధికంగా కాల్పులకు గురయ్యేవారు. మరో అయిదు రెట్లు అధికంగా జైళ్ళలో మగ్గేవారు. ప్రతి 21 మంది నల్ల జాతియుల్లో ఒకరు హత్యకు గురయ్యేవారు. అయితే, నల్లజాతీయులు మాదక ద్రవ్యాల వ్యాపారం, దొంగతనం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందునే ఈ పరిస్థితి ఉందేదని ఎవరైనా అనవచ్చు. కానీ, వాళ్ళు ఆస్థితికి నెట్టివేయబడిన సామాజిక కారణాలను మనం తప్పక అర్థం చేసుకోవాలి, నిరుద్యోగం, నైపుణ్యలోపం వల్ల ఉపాధికొరత, సాంఘిక బహిష్కరణ, ఉపాధిరంగాలలో అమానుషమైన పరిస్థితులు వాళ్ళను ఈ స్థితికి నెట్టాయి.

BRAOU

చట్టం నల్ల జాతీయులకు కల్పించే రక్షణ, ఇచ్చే భరోసా అంతంతమాత్రమే. పేదరికం కారణంగా ఫీజులు చెల్లించి ప్రైవేటు న్యాయవాదులను పెట్టుకోలేరు గాబట్టి వాళ్ళ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించేవాడు. ఒక పబ్లిక్ ప్రాసికూటర్‌కు ఇలాంటి విషయంలో ఎంత శ్రద్ధవుంటుందో తెలియంది కాదు. ఫలితంగా, నల్ల జాతి ప్రజలు చేసిన తప్పుకన్నా ఎక్కువ శిక్ష అనుభవించేవారు. కాగా, జనసాంద్రత అధికంగా వున్న ప్రాంతాల్లో (మురికి వాడలు, పారిశ్రామిక కాలనీలు) నివసించే నల్లజాతి ప్రజలే అధిక సంఖ్యలో ఎక్కువగా జైళ్ళ పాలవుతున్నారని ఒక నివేదిక పేర్కొంది.

## 2.11 అమెరికా మహిళలు : నిరంతర వివక్ష

అమెరికా మహిళలు ప్రపంచంలోని ఇతర దేశాల్లోని మహిళల కన్నా ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నారనే అపోహ ఒకటి వుంది. కానీ, అమెరికా స్త్రీలు నిరంతరం వివక్ష ఎదుర్కొంటూనే వున్నారు. అణుక్షణం స్త్రీల హక్కులు హరించి వేయబడుతూనే వున్నాయి. అమెరికాకు వంద సంవత్సరాల స్త్రీవిముక్తి ఉద్యమాల చరిత్ర వున్నా, స్త్రీలు ఇంకా ఎకువ మోతాదులో ఇంటాబయట హింసకు గురవుతూనే వున్నారు. ప్రతి ఏడాది ఒకటిన్నర మిలియన్ స్త్రీలు తమ భర్తల చేతుల్లో వేధింపులకు గురవుతున్నారు. అమెరికాలోని మొత్తం నేరాల్లో నాలుగోవంతు వివాహిత స్త్రీల మీద వారి భర్తలు ప్రయోగిస్తున్నవే. 1987లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పద్దెనిమిది సంవత్సరాలలోపు వయస్సున్న 38 శాతం స్త్రీలు అదేవయస్సున్న బంధువులు, పరిచయస్థులు, అగంతకుల చేతుల్లో అత్యాచారాలకు గురవుతున్నారు. తరతరాలుగా ఎలాంటి మార్పులకు లోనుగాకుండా వున్న కొన్ని సాంప్రదాయక చట్టాలు స్త్రీల పరిస్థితిని మరింత దుర్భరంగా మారుస్తున్నాయి. ఇళ్ళలో బందీలై, లైంగిక వేధింపులకు, కుటుంబ హింసకు లోనవుతున్న స్త్రీలు కోకొల్లలు.

ఆర్థికంగా చూస్తే స్త్రీలు మరింత దోపిడికి గురవుతున్నారని బోధపడుతుంది. అమెరికాలోని నూతన శ్రామిక వర్గంలో అధికశాతం మహిళలే. పార్ట్‌టైం ఉద్యోగాల్లో కూడా వీళ్ళే ఎక్కువ సంఖ్యలో వున్నారు. సంతానంలో తరుగుదల, విడాకుల పెరుగుదల స్త్రీలు పెద్ద ఎత్తున ఉపాధి రంగాలలోకి తరలిరావడానికి ముఖ్యకారణం, 1987లోని లెక్కల ప్రకారం అమెరికాలోని మొత్తం శ్రామిక వర్గంలో మహిళలు 45శాతం. కాగా, 16 ఏళ్ళు పైబడిన మహిళల్లో 68 శాతం ఏదో ఒక ఉద్యోగం చేస్తున్నారు. ఈ గణాంకాలు చూస్తే స్త్రీలు గతంలోకన్నా ఇపుడు ఆర్థికంగా స్వేచ్ఛ అనుభవిస్తున్నట్టే కనిపిస్తోంది. కానీ, వాస్తవానికి వీళ్ళలో స్వచ్ఛందంగా ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళకన్నా కుంటుంబ పరిస్థితుల్ని బట్టి ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళే ఎక్కువ. మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా చాలా పరిమితంగా వున్నాయి. కాగా, ఉద్యోగంతోపాటు స్త్రీలకు కుటుంబ చాకిరీ కూడా అదనంగా తోడవుతోంది. ఫలితంగా, ఉద్యోగాల్లో ఉన్నతి పొందడం అసాధ్యమైపోతుంది. మహిళలు అంతగా ప్రాముఖ్యతలేని దిగువస్థాయి లేబర్ మార్కెట్‌లలోనే ఉపాధి వెదుక్కోవలసి వస్తోంది. తక్కువవేతనాలు ఇచ్చి డబ్బు మిగుల్చుకోవాలనే ధోరణి వుండే మార్కెట్లలో సిక్‌లీవులు, సెలవు దినాల్లో వేతనాలు వుండవు. ఈ రంగంలో ఉద్యోగ భద్రత ప్రమోషన్లు కూడా చాలా తక్కువ. ఇలాంటి అభద్రతాభావ పరిస్థితుల్లో విడాకులు మహిళల జీవితాల్ని, వాళ్ళ పిల్లల భవిష్యత్తును దుర్భరంగా మారుస్తున్నాయి తప్ప, ఈ ఉపాధి అవకాశాలు వాళ్ళ జీవితాలను మెరుగు పరచడం లేదు. వయస్సు, సాంఘిక, ఆర్థిక హోదాలతో నిమిత్తం లేకుండా విడాకులు తీసుకున్న మహిళలందరి జీవన పరిస్థితులు దిగజారిపోయిన ఉదంతాలే ఎక్కువ. కాగా, అదే సమయంలో విడాకులు పుచ్చుకున్న పురుషుల జీవితాల్లో మాత్రం మెరుగుదల కనిపిస్తోంది. విడాకులు తీసుకున్న పురుషుల కన్నా స్త్రీల ఆదాయం దాదాపు 70% పడిపోయింది. ఇక సంపాదనా పరులైన సంతానం లేని తల్లులు అరకొర జీతాలతో కుటుంబాన్ని నెట్టుకురాలేక నెమ్మదిగా పేదరికంలోకి జారిపోతున్నారు.

ఇకపోతే, సుమారు 60% మహిళలు మెటర్నిటీ లీవులు పొందలేకపోతున్నారు. మిగిలిన 40%లో మూడింట ఒక వంతు స్త్రీలకు ప్రసవానంతరం అదే ఉద్యోగంలో చేరే అవకాశం ఉండడం లేదు. మానవ హక్కుల కమిటీకి ఐక్యరాజ్యసమితి సమర్పించిన నివేదికలో "కుటుంబ భారాన్ని మోయడానికి ఉద్యోగాల్లో చేరుతున్న

BRAOU

స్త్రీలు సంపాదన సంగతి ఏమోగాని, అదనపు దోపిడీకి గురవుతున్నారు". అని పేర్కొంది.

## 2.12 బాలల హక్కులు :

స్త్రీలు, అందులోనూ ప్రత్యేకంగా నల్లజాతిస్త్రీల హక్కులతో బాటు అమెరికాలో నేడు బాలల హక్కులు కూడా ఉల్లంఘనకు గురవుతున్నాయి. పారిశ్రామికీకరణ పొందిన ఎనిమిది దేశాల్లోని బాలల పేదరికాన్ని అంచనావేస్తూ, రూపొందించిన జాబితాలో అమెరికా చివరిస్థానంలో ఉంది. అమెరికాలోని ప్రతి ఐదుగురు బాలల్లో ఒకరు పేదరికం అనుభవిస్తున్నారు. తెల్ల జాతి బాలలకన్నా నల్లజాతి, స్థానిక అమెరికన్ తెగల బాలలు ఎక్కువ సంఖ్యలో మరణిస్తున్నారు. నిరాశ్రయ జనాభాలో నాల్గింటికి ఒక వంతు పిల్లలే. కాగా, అమెరికాలోని అధికశాతం బాలలు నిరక్షరాస్యత, అనారోగ్యాలతో బాధపడుతున్నారు.

సంక్షేమపథకాల రద్దు వల్ల ఏర్పడే దుష్ప్రభావం పిల్లల పైనే అధికంగా పడుతోంది. 1973లో ప్రభుత్వం 83.6 శాతం బాలలకు ఆర్థిక సహాయం అందించగా, అది 1987 నాటికి 59.6 శాతానికి పడిపోయింది. శిశువుల, బాలలకోసం చేపట్టే రోగనివారణా చర్యలు నానాటికీ క్షీణించిపోతున్నాయి. పట్టణ ప్రాంత పేదల్లో కేవలం 50 నుంచి 60 శాతం బాలలకే టీకాలు, వ్యాక్సిన్ల సౌకర్యం లభిస్తుంది. 1979 నుంచి 1988 నాటికి ఫెడరల్ ప్రభుత్వం ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్యకు అందిస్తున్న సహాయం 22 శాతానికి పడిపోయింది. ఫలితంగా పేద, నల్లజాతి పిల్లలకు అందుతున్న విద్యా ప్రమాణాలు ఒక్కసారిగా దిగజారిపోయారు.

## 2.13 ముగింపు :

మతాధిపతులు ఒకవ్యక్తి అనుభవించ వలసిన మానవ హక్కుల స్థాయి గురించి రూపొందించిన సూత్రాలను రాజ్యం యథాతథంగా ఆమోదించింది. ఫలితంగా సమాజంలోని మనుషుల ప్రవర్తన సంఘలక్షణాలు పరస్పరం ప్రభావితం చేసుకుంటాయనే అంశాన్ని విస్మరించింది. కాగా, ఈ రెండు దేశాలు అభద్రత, అనిశ్చితి, హింస, నిరుద్యోగం అనే అవలక్షణాలతో బాధపడుతున్న మానవ హక్కుల పరిరక్షణలో అగ్రస్థాయిలో వున్నట్టు పైకి కనబడుతోంది. అందుకే ఇవి క్షుణ్ణమైన పరిశీలనకు గురవుతున్నాయి.

రాజ్యం - పౌరుడు అన్న చట్రంలోంచి మానవ హక్కు స్థితి గతులను అంచనావేసే సూత్రం ఈ దేశాల విషయంలో పనికిరాదు. ఎందుకంటే, ఈ దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘన పౌరసమాజాలలో జరుగుతుంది కాబట్టి మానవ హక్కుల పరిరక్షణకు ఇక్కడి ప్రభుత్వాలు కాస్త శ్రద్ధ వహిస్తున్నా, స్త్రీలు, నల్లజాతీయులు, స్థానిక గిరిజన తెగల హక్కుల విషయంలో ఇంకా వెనుకబడే వున్నాయి.

ఈ దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనారూపాలు వేరుగా వున్నా, వాస్తవ పరిస్థితి మాత్రం మూడవ ప్రపంచ దేశాల కన్నా భిన్నంగా ఏమీ లేవు.

BRAOU

## 2.14 మాదిరి పరీక్ష ప్రశ్నలు :

**I** ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి

1. అమెరికా, బ్రిటన్‌లలోని మానవ హక్కుల స్థితిగతులు మూడవ ప్రపంచదేశాల్లోని స్థితిగతుల కన్నా ఎట్లా భిన్నంగా ఉన్నాయి?
2. అమెరికాలో ఏ ఏ వర్గాల ప్రజల మానవ హక్కులు ఏ విధంగా ఉల్లంఘనకు గురవుతున్నాయి?

**II** ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి

1. బ్రిటన్‌లో ఏ ఏ వర్గాల ప్రజల హక్కులు ఏ విధంగా ఉల్లంఘనకు గురవుతున్నాయి?
2. అమెరికాలో బాలల హక్కులను గురించి చర్చించండి.

BRAOU

# భాగం – 3 : కెనడాలో మానవ హక్కులు

విషయక్రమం :


3.0 ఉద్దేశం

3.1 పరిచయం

3.2 చరిత్ర – కెనడాలో వలస పాలన

3.3 బ్రిటిష్ పాలన

3.4 భాష

3.5 కెనడియన్ ఛార్టర్ ఆఫ్ రైట్స్ అండ్ ఫ్రీడమ్స్‌లో భాషా హక్కులు

3.6 సంస్కృతి

3.7 పర్యావరణ పరిరక్షణ – కెనడాలోని రాజకీయ వ్యవస్థలు – జేమ్స్ టీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కేసు పరిశీలన

3.8 కెనడాలో సమాఖ్య ధోరణి : దేశం (పాలిటీ)

3.9 బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభావం

3.10 జాతుల వైవిధ్యం – సమాఖ్య తత్త్వం

3.11 ముగింపు

3.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 3.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- కెనడాలో వలస పాలన చరిత్రను తెలుసుకుంటారు.
- కెనడాలో సమాఖ్యధోరణి అర్థం చేసుకుంటారు.
- కెనడాలోని జాతుల వైవిధ్యం వివరించగలుగుతారు.

## 3.1 పరిచయం:

సంపన్న దేశాలు మూడవ ప్రపంచ దేశాల లాగ మానవ హక్కులపై చర్చించిన సందర్భాలు చాలా తక్కువ. మానవ హక్కుల స్థాయీ తీరు తెన్నులకు సంబంధించి దేశానికీ దేశానికీ మధ్య తప్పనిసరిగా తులనాత్మకమైన తేడా ఉండితీరుతుంది. అలా ఆలోచించినప్పుడు ఒక దేశంలోని మానవ హక్కుల స్థితిగతులను చర్చించేటప్పుడు, చారిత్రక, రాజకీయ, ఆర్థిక, భౌగోళిక అంశాలన్నింటినీ పరిగణలోనికి తీసుకోవాలి. రకరకాల పౌర స్వేచ్ఛల గురించి ప్రథమ ప్రపంచ దేశాల్లో ఎన్నో పోరాటాలు జరిగాయి. కెనడా దేశాన్నే తీసుకుంటే ఎన్నో వలస ప్రభుత్వాల పాలనలో మగ్గింది. అయినా కూడా నేడు భారీస్థాయిలో మానవ హక్కుల ఉల్లంఘనకు అదే పాల్పడుతోంది. ప్రస్తుతం అది సర్వస్వాతంత్ర దేశం. కెనడాలోని మైనారిటీలు, మహిళలు, అక్కడి సమాజంలోని మరికొన్ని వర్గాలు మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి. ఆర్థికంగా పటిష్టమైన దేశం కెనడా, అయినా అక్కడ మానవ హక్కులు అతిక్రమణ జరుగుతుంది. దానికి గల కారణాలు ఏంటి అన్న ప్రశ్న తలెత్తుతోంది. అభివృద్ధి చెందిన దేశం కాబట్టి అక్కడి సమాజ స్వరూప స్వభావాలు మరింత ఉన్నతంగా ఉంటాయని ఊహిస్తాం. మానవ హక్కులపై రాజ్యం, పౌర సమాజం తీరుతెన్నులను అంచనా వేయాలి. ఈ సందర్భంలో వివిధ రకాలైన సామాజిక వివక్షలను అధ్యయనం చేయవలసి వస్తుంది. చారిత్రక దృష్టిలో, న్యాయ పరమైన చర్యల దిశ నుంచి పరిశీలించాలి.

## 3.2 కెనడాలో వలస పాలన:

ఉత్తర అమెరికాలోని స్వతంత్రదేశం కెనడా. భారత ఎస్కిమో సంచార జీవులు ఎన్నో వేల సంవత్సరాల క్రితం కెనడాకు వలస వెళ్ళారు. అలస్కా అని ఇప్పుడు పిలుస్తున్న ప్రాంతం నుంచి వీరు కెనడా వెళ్ళారు. వీరి పూర్వీకులు ఆసియా నుంచి ఉత్తర అమెరికాకు తరలిపోయారు. జాక్వెస్ కార్టియర్ అనే ఫ్రెంచి దేశస్థుడు 1534 సంవత్సరములో గల్ఫ్ ఆఫ్ సెయింట్ లారెన్స్ లో ప్రవేశించాడు. ఫ్రాన్సుకు దాన్ని కట్టబెట్టాలని ప్రయత్నించాడు. ఈ వలస ప్రాంతాల్లో ఒక దానిని సర్‌హంఫ్రీ గిల్‌బర్ట్ స్వాధీన పరుచుకున్నాడు. ఇంగ్లండ్ తొలి వలస ప్రభుత్వాన్ని ఈ ప్రాంతంలో ఆ దేశ పాలకులు నెలకొల్పారు. 17 వ శతాబ్దం ప్రారంభంలో ఉన్న వ్యాపారం లాభకరమైన వాణిజ్యంగా విలసిల్లుతోంది. అంతేకాదు ఈ కాలంలోని ఫ్రాన్సు, ఇంగ్లాండు దేశాల మధ్య ఆధిపత్యం పోరు చోటుచేసుకుంది. ఆ యుద్ధం చిట్ట చివరకు అంతర్జాతీయ స్థాయికి చేరుకొంది. ఇదే కాలంలో యుద్ధ ప్రభావం, వాటి మధ్యన ఉన్న అధికార ఆధిపత్యాల పోరు కెనడా దాకా వెళ్ళడమే కాదు, కెనడాపైనే ప్రభావం చూపించింది.

## 3.3 బ్రిటిష్ పాలన:

బ్రిటిష్ పాలనలో కెనడా ఎన్నో యుద్ధాలను చవిచూసింది. చివరకు 1814 సంవత్సరంలో బ్రిటిష్ వలస సంకెళ్ళ నుంచి కెనడా విముక్తి పొందింది. తర్వాత కాలంలో ఎప్పుడైతే హడ్సన్స్ కంపెనీ పరిధిలోని వాయువ్య ప్రాంతంలో వ్యాపారం పుంజుకుందో, అప్పటి నుంచే కెనడా ఆర్థిక రంగంలో అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకోవడం ఆరభించాయి. ఇక్కడి ప్రతి ప్రాంతంలోను సాంప్రదాయబద్ధమైన వలసపాలనా యంత్రాంగాన్ని

BRAOU

మనం చూస్తాం. ఈ కాలంలో నిజంగా ఎంతో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన అంటు పలు వలస పాలకులు పోటీ పడ్డం జరిగింది. ఇది చివరకు 1837 సంవత్సరంలో తిరుగుబాటుకు దారితీసింది. ఘోరవైఫల్యాన్ని చవిచూస్తూ 1938 సంవత్సరంలో ఈ ఉద్యమం తెరమరుగవుతూ అక్కడి బ్రిటిష్ పాలకులు కెనడా ప్రజాస్వామ్యం గురించి, ఫ్రెంచి జాతీయవాదం గురించిన డిమాండ్లను ఎదుర్కొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాల్సిన తీవ్ర పరిస్థితి వచ్చింది. ఇది చివరకు సమాజంలోని వివిధ జాతుల, మైనారిటీల కమ్యూనిటీల్లో అధికారం తీరుతెన్నులను మార్చి వేయడానికి దారితీసింది. ఇది చివరకు కెనడాను దిగువ కెనడా, ఎగువ కెనడా అనే రెండు విభాగాల్ని చేస్తూ యూనియన్ అఫ్ 1840 లో పొందుపరిచారు. ఫ్రెంచి కెనడాను బ్రిటిష్ నార్త్ అమెరికన్ జాతీయతతో కలపాలని ప్రయత్నించడం అయింది. ఉత్తర అమెరికాలోని వలసలనన్నింటినీ బ్రిటిష్ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ఇందులో మైనారిటీల సరియైన ఉనికి కోసం, వారి విస్మృత్తి కోసం, గుర్తింపు కోసం వాళ్ళ హక్కుల ఆవశ్యకతను గుర్తించాలన్నది ఒకటి బ్రిటిష్ నార్త్ అమెరికా చట్టం. 1867 ననుసరించి కెనడా దేశానికి, జాతీయాభివృద్ధి, స్వయం ప్రతిపత్తి, ఐక్యత పాత్రిపదికలుగా ఏర్పాటు చేసింది.

ప్రపంచ యుద్ధాల్ని తర్వాత దశలో చూస్తారు. ఇవి ప్రధాన రాజకీయ పరిణామాలుగా గుర్తించాలి. ఆ క్రమంలోనే కెనడా వేగంగా స్వతంత్ర ప్రతిపత్తి గల దేశంగా ఎదిగింది. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా కెనథా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొనవలసి వచ్చింది. యుద్ధం ముగింపు అయిన తర్వాత, కెనడా స్వతంత్ర ప్రతిపత్తిని మొత్తం ప్రపంచమే గుర్తించింది. 1927లో నానాజాతి సమితిలో ఇది సభ్యదేశం అయింది 1931 లో బ్రిటిష్ కామన్‌వెల్త్ ఆఫ్ నేషన్స్‌లో 'అటానమస్' సభ్యురాలయింది. రెండవ ప్రపంచయుద్ధానంతరము, జాతీయతాభావం అనేది బాగా పెరగడం కనబడుతుంది. 1946 లో ప్రత్యేక పౌరసత్వ చట్టం (సెడరేట్ సిటిజన్ షిప్ యాక్ట్) ను ప్రవేశ పెట్టారు. జాతి స్వతంత్రను ఇందులో నొక్కి చెప్పటం జరిగింది. 1945 సంవత్సరం తర్వాత నుంచి అంతర్జాతీయ వ్యవహారాలలో కెనడా ప్రముఖ పాత్రను వహించడం ఆరంభించింది.

BRAOU

వలస పాలనా చరిత్ర కెనడా రాజకీయ వ్యవస్థలో నిర్దిష్టమైన, స్థిరమైన కొన్ని రూపు రేఖలను తీసుకువచ్చింది. వీటిలో ప్రధాన లక్షణాలు కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిద్దాం.

- పాక్షిక – స్వతంత్ర రాజకీయ స్వరూపం ఉండడంలో ఎక్కువగా స్వయం ప్రతిపత్తి గల రాజకీయ సంస్థలు ఏర్పడ్డాయి.

- ప్రారంభంలో కెనడా అభివృద్ధికై క్యూబెకల్ లో కేంద్రీకృతమైన (సెంటర్డ్) ఫ్రెంచి ప్రభావం బాగా ఉంది. అదే నేడు కూడా కనిపిస్తోంది. ప్రత్యేక జాతీయ ప్రతిపత్తి డిమాండును కూడా ఇందులో నుంచి పుట్టుకొచ్చిందే.

- స్వాతంత్రం పొందిన తరువాత కూడా కెనడా బ్రిటిష్ రాజరిక నియంతృత్వంలో మగ్గింది. దీన్ని అడ్డం పెట్టుకొని కెనడా వ్యక్తిగత వ్యవహారాల్లో కూడా బ్రిటిష్ ప్రభుత్వం జోక్యం చేసుకోవడం మొదలు బెట్టింది. అది ఎంత దూరం వెళ్ళిదంటే కెనడా సార్వభౌమాధికారానికి కూడా చివరకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది.

ఇవి కొన్ని ముఖ్యమైన అంశాలు. ఇవి ఒక ఎత్తయితే, కెనడా సమాజం వైవిధ్యానికి నిలువెత్తు రూపు. విభిన్న సంస్కృతులు, సాంప్రదాయలు, నమ్మకాలను, ఇక్కడ మనము చూస్తాం. వీటితో బాటుగా పాశ్చాత్య సంస్కృతి కెనడా ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. అంతేకాదు రాజకీయ, భావజాల సంబంధమైన గుర్తింపు పోరాటాలు మొదలయ్యాయి. సమాజంలోని ప్రతి కమ్యూనిటీ న్యాయబద్ధమైన గుర్తింపుకోసము ప్రజలపై వారి నమ్మకాలపై వారి ప్రయోజనాలపై భౌతికమైన అణచివేత విధానాలను ప్రయోగించకూడదు.

రాజకీయ వ్యవస్థ కొన్ని నియమ నిబంధనలతో రూపుదిద్దుకున్నది. కాబట్టి కొన్ని ప్రజాస్వామిక చట్టాల ఉనికిని మనం ఇక్కడ చూస్తాం. కెనడా రాజకీయ స్వరూప స్వభావాల కనుగుణంగా చట్టాల రూపకల్పన చోటుచేసుకుంది. భారత దేశంలో కెనడా సంక్షేమ రాజ్యం కాదు. సరళత దీని ప్రధాన లక్షణం. ఉదార, పెట్టుబడి దారుల మధ్య సంక్లిష్టమైన పోరు ఇక్కడ చూస్తాం. పౌర సమాజంలో వైవిధ్యం కనబడుతుంది. ఇది ప్రగతిశీల రాజకీయ స్వభావాన్ని కోరుకుంటుంది. సమాజంలో చోటుచేసుకుంటున్న జాతి విద్వేషం, భాషావాదం, జాతుల ఘర్షణ, ప్రైవేటీకరణ, పితృస్వామిక ధోరణులపై ప్రగతిశీల రాజకీయ కార్యాచరణతో వ్యవహరించాలనే పోకడలను కెనడా పౌర సమాజంలో మనం చూస్తాం.

కెనడాలో పౌరహక్కులు తరుచూ అతిక్రమణ అవుతుంటాయి. మరీ ముఖ్యంగా మైనరిటీలు, మహిళలు, ఫ్రెంచి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నా క్యూబెక్ ప్రాంత ప్రజలు కూడా ఉన్నారు. కెనడాకు మొట్టమొదటగా వలస వచ్చింది వీరే. మైనారిటీలయిన వివిధ జాతులు, మహిళలు, హోమోసెక్సువల్స్, పిల్లలు వీరందరి హక్కులు ఉల్లంఘించబడుతున్నాయి. వీటిని కిందినుంచి పైదాకా చర్చించాల్సిన అవసరం ఉంది. కెనడా రాజకీయాల్లో భాష, సంస్కృతి, పాలన చాల సంక్లిష్టమైన అంశాలు. ఇవి పరస్పర అనుమానలకు అతీతంగా వ్యవహరించబడటం లేదు. ఈ విధంగా చూసినట్టయితే కెనడాకు స్పష్టమైన, నిర్దిష్టమైన జాతీయత లేదు. విభిన్న భాషలు, జాతులు, సంస్కృతుల నిలయం కెనడా. భిన్న ఆలోచన ధోరణులను కూడా నెలవు ఇది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం క్రింద కెనడా చాలా భాగం ఉంది.

BRAOU

## 3.4 భాష:

కెనడాలో రెండు ప్రధానమైన భాషలున్నాయి. అవి ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు. 61 శాతం మంది ప్రజలు మాతృ భాష ఇంగ్లీషయితే, 26 శాతం మంది ఫ్రెంచి భాష. మిగితా 13 శాతం ప్రజలు వివిధ రకాల మాతృభాషలు మాట్లాడుతారు. ఇక్కడ వాళ్ళంతా వలస వచ్చిన వాళ్ళే, వలసగా వచ్చి స్థిరపడిన వారి పిల్లల్లో ప్రధాన భాషలో ఇంగ్లీషు మాట్లాడేవారు ఎక్కువ.

ఇటీవల సంవత్సరాల్లో వారి వాడుక భాష, కెనడా మాతృభాషలలో చాల మార్పులు వచ్చాయి. క్వెబెక్‌లో ఫ్రెంచి భాష వ్యక్తీకరణ వచ్చి చేరింది. కెనడా మిగతా ప్రాంతాల్లో ఇది కనిపించదు. ఫ్రెంచి కెనడియన్లు, ద్విభాష విధానాన్ని పెద్ద బరువుగా భావిస్తున్నారు. వీరిలోని 43 శాతం మంది ద్విభాషా కేటగిరి క్రింద ఉన్నట్టు తమను తాము ప్రకటించుకున్నారు. కేవలం 8 శాతం అంగ్లేనియన్లే తమని 'బైలింగ్వియల్' గా పేర్కొన్నారు. మెల్ల మెల్లగా కెనడా రెండు భాషలు మాట్లాడే భౌగోళిక ప్రాంతాలుగా విభజించబడింది. ద్విభాషావిధానం క్విబెక్ బయట

మేధావి వర్గం సొత్తయింది. ఇంగ్లీషు కెనడియన్లు కూడా దీని వల్ల రాజకీయాల్లో పాలనాయంత్రాంగములో, జాతీయ సంస్థల్లో ప్రవేశిస్తున్నారు. జాతీయ స్థాయిలో చూసినట్టయితే పార్లమెంట్, పౌర సేవా విభాగము, ద్విభాషా సూత్రంతోనే నడుస్తున్నాయి. అయితే ఇది పేరుకు మాత్రమే. నిజానికి ఆంగ్లభాషే ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది.

కెనడాలో ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలతో పాటు, యుక్రైన్, ఇటలీ, చినో, పోర్చుగీసు, జర్మన్ వలస ప్రజల భాషలు వాడుకలో ఉన్నాయి. స్థానిక కెనడా ప్రజల భాషలు కూడా ఇక్కడ మనం చూస్తాం. ఉత్తర ప్రాంతాల్లో వాయువ్య ప్రదేశాల్లో వీరి సంఖ్య భారీ స్థాయిలో ఉంది.

ఇంత వైవిధ్యం పరచుకున్న కెనడాలో ప్రతి జాతి, భాష వర్గాలకు చెందిన విభిన్న లక్షణాలను చూస్తాం. ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు కాని ఇతర భాషలన్నా కేవలం ఇళ్ళల్లోనే మాట్లాడుకొంటారు. వారి వారి కమ్యూనిటీలకే ఇది పరిమితం అవుతాయి. తప్పించి బయట తమ భాషలను వివిధ జాతులకు చెందిన ప్రజలు మాట్లాడరు. స్థానిక ప్రభుత్వాల కార్యకలాపాలు కూడా ఇంగ్లీషు లేదా ఫ్రెంచి భాషల్లోనే నిర్వహించబడతాయి. ప్రజావాడుక భాషలో ప్రాంతీయ, వర్గ భాషా వ్యక్తీకరణలో తేడాలు కనిపిస్తాయి. దాన్ని బట్టి ఏ ప్రాంతానికి సంబంధించిన వాళ్ళో ఇట్టే చెప్పేయవచ్చు. గతంలో తూర్పు అంటోరియో, నానే పోటిమో, క్విబెక్ తూర్పు ప్రాంతాలలో గాక్లిక్ భాష మాట్లాడే స్కాట్లో ఉండేవారు. సాస్కోచీవాన్‌లోని అధికభాగం ప్రజలు, ఉత్తర అమెరికాలోని పచ్చికమైదాన ప్రాంత ప్రజలకు ఇంగ్లీషు లేదా ఫ్రెంచి వారసత్వ సంస్కృతీ, భాషా జ్ఞానం ఏమీ లేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఇతర భాషలను కూడా ఇక్కడ వదిలివెళ్ళింది. కాని అవి అవశేషాలు గానో, జానపద సంస్కృతీ చిహ్నాంగానో మిగిలాయి తప్పించి సాధారణ జీవనాన్ని కొనసాగించేందుకు భావ ప్రకటనా ఉపకరణాలుగా మాత్రం లేవు. అక్కడి స్థానిక ప్రజలు లేదా వలసగా వచ్చినవారు అంత ఒక్కటిగా కలిసే క్రమం ఇంకా కెనడాలో జరుగుతూనే ఉంది. వివిధ జాతులు, తెగలు, భాషా ది సంస్కృతులకు చెందిన ప్రజల మధ్య ఐక్యత, సామరస్య ప్రయత్నాలు ఇంకా ఒక రూపు పొందలేదు.

B R A O U

## 3.5 కెనడా ఛార్టర్ ఆఫ్ రైట్స్ అండ్ ఫ్రీడమ్స్‌లో భాషా హక్కులు :

హక్కులు, స్వేచ్ఛకు సంబంధించి కెనడా రూపొందించిన ఛార్టర్ అక్కడ రాజకీయాలపై ఎంతో ప్రభావాన్ని చూచిస్తోంది. రాజకీయ రంగంలో అనుహ్యామైన మార్పులకు కారణం అవుతుంది. ప్రధాన వర్గాలు, జాతులు రాజ్యాంగంలో గుర్తించబడ్డాయి. సెక్షన్ 20, 23 లతో వివిధ జాతుల భాషాపరమైన హక్కులను ప్రస్తావించారు. భాషా హక్కు అనేది కేవలం వ్యక్తిపరమైన ప్రాధాన్యతనే కాకుండా నిర్దిష్టమైన కమ్యూనిటీ ప్రాముఖ్యన్ని కూడా గుర్తిస్తుంది. వివిధ జాతుల 'గుర్తింపు' కు ఇది ఎంతో ప్రాణ ప్రదమైంది. భాషా హక్కుల ఛార్టర్ ఈ హక్కులకు సంబంధించి ప్రజలకు మార్గదర్శకంగా నిలబడతాయి. రాజకీయ వర్గాలు వీటిని పాక్షిక రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే సరళీ హాటికి స్వప్రయోజనాల రంగులు పులిమే ప్రమాదాలు లేకపోలేదు. ఇంకా సూటిగా చెప్పాలంటే భాషా హక్కులు కెనడా అంతర్గత రాజకీయాల్లో అంతః సూత్రాల్లో పాలనా వ్యూహాల్లో అనూహ్యామైన పాత్రను పోషిస్తున్నాయి. ఈ నేపథ్యం లోంచి గనుక చూసినట్లయితే, మానవ హక్కుల రాజకీయ సిద్ధాంతంలో అంతర్గత రాజకీయ విలువలు, వివిధ జాతుల వ్యూహాత్మక ప్రాధాన్యతలు కేంద్రబిందువు అవుతాయి.

## 3.6 సంస్కృతి :

కెనడా సంస్కృతి చాలా సంక్లిష్టమైంది. ఇక్కడ పెట్టుబడిదారీ, భూస్వామ్య విధానాలను చూస్తాం. చిన్ని కుటుంబాల జీవన శైలిని గమనిస్తాం. అంతే కాదు క్రైస్తవతత్వంతో పాటు ఉదారవాద ప్రజాస్వామిక పోకడలను గమనిస్తాం. అమెరికా సంయుక్తరాష్ట్రాల సంస్కృతీ నేపథ్యాని కన్నా కూడా కెనడా సాంస్కృతిక శైలి విభిన్నంగాని ఉంటుంది. వలస సంస్కృతి ప్రభావంను ఇక్కడ చూస్తాం. ఇక్కడి సంక్లిష్ట సాంస్కృతిక పోకడల వల్లనే కెనడా రాజకీయాలలో సోషలిస్ట్ పార్టీ ఉనికిని చూడగలం. సాంస్కృతికంగా, సామాజికంగా కూడా ఇక్కడ, ఇంగ్లండ్ ఫ్రెంచి దేశాలతో పోలిస్తే ఎంతో సమానత్వం ఉండడాన్ని గమనించగలం.

కెనడా సంస్కృతిలో మూడు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. సంపూర్ణ స్వారభౌమాధికార దేశంగా కెనడాకు తనదైన గుర్తింపు. జాతీయ సంస్కృతీ చిహ్నాలు తప్పనిసరిగా ఉండాలి ఇది మొదటి అంశం. సంస్కృతి అనేది ఇక్కడ ప్రధానంగా ఆర్థిక కార్యకలాపాలపై నడుస్తుంది. స్వదేశీ సంప్రదాయ పరిశ్రమల నుంచీ ప్రయోజనాలు పొందడానికి కెనడా చూస్తుంది. ఇది రెండవ అంశం. కెనడా సంస్కృతికి నిర్దిష్టమైన స్పష్టమైన అర్థం, పరమార్థం ఉండాలని ఆదేశం కోరుకుంటుంది. ఇది మూడవ ప్రధానమైన అంశం కెనడా సాంస్కృతిక ఉనికికి ప్రమాదంగా పరిణమించిన అంశం ఒకటుంది. కెనడా మీడియాపై అమెరికా ఉత్పత్తులు భారీ స్థాయిలో సాంస్కృతిక దాడి చేస్తున్నాయి. ఇది కెనడా ఆర్థిక వ్యవస్థను కూడా బాగా దెబ్బతీస్తోంది. అంటే ఆ దేశ సార్వభౌమాధికారానికే సవాలు విసురుతోంది. కెనడా అనుభవాల ప్రాతిపదికగా ఈ దాడులను ఎదుర్కోవలసి ఉంది. ఉపగ్రహ ప్రసారాలు టెలివిజన్‌కి కూడా విస్తరించడంతో అమెరికా ఉత్పత్తి సంస్కృతి దాడి మరింత తీవ్ర రూపం దాల్చింది. ఫలితంగా దక్షిణ ప్రాంతాల నుంచీ ఉత్తర ప్రాంతాలకు కూడా ఈ దాడి వ్యాపించింది. ఇన్యుట్, లెనీ గ్రామాలు కూడా అమెరికా టెలివిజన్ ప్రభావానికి గురయ్యాయి. హింస, అవాంఛనీయ వ్యక్తిగత సంబంధాలు, దురాశమొదలగునవి అంశాలు దూరదర్శనలో నిత్యం కనిపిస్తు అలాంటి నాగరికత వైపు స్థానిక ప్రజల మనసును మళ్ళేట్టు చేస్తున్నాయి.

BRAOU

కెనడా సంస్కృతిలో పితృస్వామిక ధోరణులు ప్రధానంగా అగుపిస్తాయి. దీనిపై మహిళా ఉద్యమం వ్యతిరకేత చాలా లోతుకంటా కనబడుతుంది. సమానత్వం తదితర ఉదారవాద పోకడలు వీరిలో చూస్తాం. ఉదారవాద ధోరణులు వ్యక్తిగత రాజకీయ, ఆర్థిక పునాదుల ప్రాతిపదికగా రూపుదిద్దుకొన్నవే. కెనడా స్త్రీలు పెద్ద ఎత్తున లైంగిక హింసకు గురవుతున్నారు. అంతేకాదు భర్తల నుంచి విడిపోయి ఒంటరి జీవితాన్ని గడుపుతున్నవారు. పెళ్ళి కాకుండానే తల్లులవుతున్న వారు చాలా మంది కెనడా సామాజిక జీవనంలో మనకు కనబడుతారు. వీటికి రకరకాలైన ప్రత్యామ్నాయాలను వివిధ మహిళ సంస్థలు వెల్లడిస్తున్నాయి. వాటిపై తప్పనిసరిగా చర్చ జరగాలి. లెస్బియనిజం, వ్యభిచారాన్ని చట్టబద్ధం చేయడం, వివాహానికి ముందర లైంగిక స్వేచ్ఛ వంటి అంశాలపై తీవ్రస్థాయిలో లోతుకంటా చర్చ జరగాల్సిన అవసరం చాలా ఉంది. వీటన్నింటికీ కెనడా సమాజం సరైన సమాధానాల రూపం వెతుకులాడుతుంది. కెనడా పౌర సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. స్త్రీ, పురుష సెక్సువాలిటీ (లైంగిక స్వేచ్ఛ) పై వ్యక్తిగతంగా చర్చలు చోటు చేసుకోవడమే కాకుండా, న్యాయవ్యవస్థలో కూడా ఇది ఎంతో ప్రాధాన్యత సంతరించుకోవడం విశేషం.

ఇలాంటి కేసుల్లో కెనడా మానవహక్కుల సంఘాలు చాలాసార్లు ఇబ్బందుల్లో పడ్డారు. మానవహక్కుల రక్షణ దిశగా సాగే పోరాటంలో విస్తృత స్థాయిలో సమాజ ప్రయోజనాలు కూడా దెబ్బతినకుండా వ్యవహరించాల్సిన బాధ్యత వీటిపై ఉంది. ఉదాహరణకు, అంటోరియా కమీషన్ ఒక కేసును చేబట్టింది. హామిల్టన్ నగర మేయర్‌కు వ్యతిరేకంగా ఒక సంస్థ కేసు దాఖలు చేసింది. గే సెలబ్రేషన్ చేసుకోవడానికి అనుమతివ్వమని ఆ సంస్థ కోరింది. ఇది చివరకు ప్రాంతీయ మండలి విచారణకు దారితీసింది. కేసు దాఖలు చేసిన సంస్థకు అనుకూలంగా తీర్పు వెలువడడంతో హామిల్టన్ మేయర్ ఆ సంస్థకు 5,000 డాలర్లు నష్ట పరిహారంగా చెల్లించాల్సి వచ్చింది.

పౌర సమాజంలో ఇలాంటి సంఘటనలు తలెత్తినప్పుడు సమాజం నైతిక నిబంధనావళి, నైతికవర్తనం కూడా ఇతి సహజంగా చర్చనీయాంశం అవుతాయి. ఇలాంటి సందర్భాలలో మానవ హక్కుల పోరాట సరళి మరింత లోతుగా కొనసాగాల్సి వస్తుంది. గేల హక్కులను నిరాకరించడం కూడా హక్కుల అతిక్రమణకు పాల్పడినట్టే అవుతుంది.

## 3.7 పర్యావరణ పరిరక్షణ – కెనడాలోని రాజకీయ సంస్థలు జేమ్స్ బే డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కేసు పరిశీలన :

భారీ ప్రాజెక్టుల నిర్మాణం ప్రజల జీవనంపై ప్రమాదకర ప్రభావాల్ని చూపుతోంది. ప్రధానంగా పచ్చిక మైదాన ప్రాంతాల్లో ఉండే ప్రజల జీవితాలు, ఉనికి, తదితర విషయాల్ని కూడా సహజవనరుల వినియోగంపై వాటి దోపిడీపై ఆధారపడి ఉంటాయి. క్రమబద్ధమైన – అభివృద్ధి పునాదిగా కెనడాలో అభివృద్ధి ప్రాజెక్టులను చేబడుతారని విశ్వసించాలి. భావితరాలకు ఉపయోగపడే వనరులపై ప్రాజెక్టు ప్రభావం ఏ రీతిలో వుంటుందన్నది కూడా అధ్యయనం చేయాలి. దానిననుసరించి ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాల్సి ఉంటుంది. అలాగే ప్రాజెక్టులు కట్టేటప్పుడు ఏ వర్గ ప్రజలు బాగా నష్టపోతారు అన్న విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. కేవలం ఆస్తిపాస్తుల, భూములు నష్టం గురించే కాకుండా ఆ ప్రాంత ప్రజల సాంస్కృతిక జీవన ఉనికికి ఏ విధమైన ఆటంకం కలగదు. అన్ని విషయాల్ని కూడా లోతుగా పరిశోధించాలి.

ఉత్తర క్యెబెక్‌లోని జేమ్స్‌బే ప్రాజెక్టు కిందకు దాదాపు 17,000 చదరపు కిలోమీటర్ల భూమి సాగుకు వస్తుంది. ఈ ప్రాంతంలో క్రీ. ఇన్యుట్ ప్రజలు జీవిస్తున్నారు. క్రీ జాతి ప్రజలు కొన్ని వేల సంవత్సరాలుగా జేమ్స్ బే ప్రాంతంలో జీవిస్తున్నారు. ఇన్యుట్ ప్రజలు దాదాపు 1,200 మంది ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. వేటాడడం, చేపలు పట్టడం వీరి జీవన మార్గం.

1971 లో క్యులెక్ ప్రభుత్వం జేమ్స్ బే డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ని ఏర్పాటు చేసింది. జల విద్యుత్ శక్తి ఉత్పాదన జేమ్స్‌బే ఎనర్జీ కార్పొరేషన్ లక్ష్యం. ఇక్కడి ప్రజలకు కేవలం వేటాడడం, చేపలు పట్టడం హక్కులు మాత్రమే ఉన్నాయని, భూమిపై హక్కు లేదని క్యూబెక్ శాసనసభ్యులు వాదించారు. ఆ ప్రాంత ప్రజల హక్కులకు నిర్దిష్టమైన గుర్తింపు ఏమి లేదు. అయినా కూడా కొంతమంది ప్రజల వత్తిడి మూలంగా అక్కడ ఫెడరల్ ప్రభుత్వం, ఈ అంశంపై తటస్థ విధానాన్ని అనుసరించడం ద్వారా క్రీ. ఇన్‌విట్ ప్రజలకు ఆర్థికంగా సహాయాన్ని అందించడానికి

BRAOU

ఆమోదించింది.

1975 లో జేమ్స్‌బే, నార్త్ క్విబెక్‌ల ఒప్పందం చోటుచేసుకుంది. దాని ప్రకారం అక్కడి ప్రజలు భూమిపై తమ హక్కును వదులుకోవాలి. అందుకు ప్రతిగా 5,250 చదరపు మైళ్ళ స్థలంపై యాజమాన్యంతో బాటు 60,000 చదరపు మైళ్ళ భూమిపై వారి జీవనం కొనసాగేందుకు రకరకాల పనులు అక్కడి ప్రజలు చేబట్టి నిర్వహించుకోవచ్చు. పది సంవత్సరాలు దాకా వాళ్ళకి 75 మిలియన్ డాలర్లు ద్రవ్యసహాయం కూడా అదనంగా అందుతుంది. అంతేకాదు హైడ్రో ఇతర రాయల్టీస్ కింద మరో 75 మిలియన్ డాలర్ల కూడా ఇక్కడ ప్రజలకు అందుతాయి. స్థానిక ప్రజలపై ప్రాజెక్టు నిర్మాణం చెడు ఫలితాలు చూపించకుండా ఉండేందుకు అక్కడి దీని నిర్మాణం ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టడానికి సంబంధించి వీళ్ళు కూడా తమ వంతు సహాయాన్ని అందించడానికి ఆమోదించారు కూడా. స్థానిక ప్రజల సహాయంతో పర్యావరణ పరిస్థితులను విజయవంతంగా ఎదుర్కోవడానికి కట్టుబడి ఉండాలని కూడా వీరు కోరుకుంటున్నారు.

1986 నాటికి హైడ్రో - క్విబెక్ అప్పు నానాటికీ నింగినంటుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఫేజ్ - 1 నిర్మాణం దాటి మిగతా పనులు ముందుకు సాగనేలేదు. ఇదే సమయంలో పర్యావరణ, స్థానిక ప్రజల మైదాన ప్రాంత హక్కులు ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయ్యాయి. ఎజెండాలో అక్కడి స్థానిక ప్రజలు స్వయం పరిపాలనను డిమాండ్ చేసారు కూడా. వీరి మధ్య చర్చలు రాజ్యాంగ చట్టం, 1982 ను లేవనెత్తింది. కాని రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రాంతీయ ప్రజలకు మధ్య చర్చలు విఫలమై ఒప్పందం కుదరక పోవడంతో, చట్టం వాస్తవ రూపు దాల్చలేకపోయింది. భూమిపై అధికారంకు సంబంధించి, ఏ మేర అది వర్తిస్తుందన్న దానిపై అక్కడి వనరుల అందుబాటుపై స్వంతప్రభుత్వ స్థాపనపై ఏకభిప్రాయం కుదరలేదు.

BRAOU

1989 లో బోరస్ ప్రభుత్వం గ్రేట్‌వేల్ నదిపై ప్రాజెక్టు నిర్మాణం కొనసాగిస్తానని ప్రకటించింది. దీనివల్ల క్రీ. ఇన్‌విట్ ప్రజలకు చెందిన దాదాపు 4,300 చదరపు కిలోమీటర్ల భూమి జలమయం అవుతుంది. క్రీప్రజలు ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించారు. జేమ్స్ బే - 1 డెవలప్‌మెంట్ వల్ల తలెత్తిన వినాశనాన్ని వాళ్ళు పేర్కొన్నారు. రిజర్వాయర్లలో చేపలపై మెర్క్యురీ ప్రభావం విపరీతంగా పడడాన్ని వీరు ఎంతో ఆందోళనతో ప్రశ్నించారు.

1990, వేసవి కాలంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలతో కూడిన 34 మంది సభ్యుల సంకీర్ణ ఒప్పందం ఒకటి జౌనీ బే - 2 నిర్మాణాన్ని వ్యతిరేకిస్తు ఏర్పడింది. నిర్మాణ పనుల్ని ఆపేయాలంటూ క్రీ ప్రజలు డిమాండ్ చేశారు. స్థానికంగా దీన్ని పెద్ద ఎత్తున చర్చనీయాంశం చేయడంతో వీరు విజయవంతం అయ్యారని చెప్పవచ్చు. ఫలితంగా జేమ్స్‌బే ఎనర్జీని తక్కువ రేటుతో అల్యూమినియం ప్లాంటుకు అమ్మేయడం జరిగింది. సెయింట్ లారెన్స్ ఒడ్డున ఇది ఉంది. మిగులు పదార్థాలను వీరు ఈ నదిలో వదిలి వేస్తున్నారు. 1991 మార్చిలో క్రీ ప్రజలు ఫెడరల్ కోర్టు రూలింగ్‌ను సాధించారు. ఫలితంగా, ఫెడరల్ ప్రభుత్వం, పర్యావరణ పరంగా అక్కడ తలెత్తే పరిణామాలపై అధ్యయనం చేబట్టాలని నిర్దేశించారు. అది కూడా జేమ్స్ బే - II నిర్మాణం మొదలుకోవడానికి ముందరే పూర్తవాలని కూడా స్పష్టం చేసింది.

న్యూ ఇంగ్లండులోని ఆర్థిక, పర్యావరణ వర్గాల పోరాట ఫలితంగా జేమ్స్ బే - II కట్టడ పనులు కనీసం

తాత్కాలికంగా నైనా ఆగిపోయాయి. డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఇక్కడి ప్రజలు నిర్వహించిన ప్రదర్శనలు అమెరికా ప్రజల అభిప్రాయాల్ని కూడా మార్చివేశాయి. మెసాల్ సూట్స్ శాసనసభలో 1994 ఏప్రియల్‌లో 25 వ చట్టాన్ని తీసుకువచ్చాడు. దాని ప్రకారం హైడ్రో క్విబెక్ బాండ్లుపై డబ్బును ఏ ప్రభుత్వ ఉద్యోగి పెట్టకూడదని స్పష్టం చేశారు.

జేమ్స్–బే II 2008 సంవత్సరానికి పూర్తి చేయాలని క్యుబెక్ ప్రభుత్వం కొత్తగా నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఈ సమస్య పరిష్కారం దిశగా కొద్దిగా కూడా కదలలేదు. జేమ్స్‌బే విద్యుత్ కోసం మళ్ళీ డిమాండ్ చేస్తే దీని నిర్మాణపనులు ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

## 3.8 కెనడాలో సమాఖ్య ధోరణి : దేశం (పాలిటి)

సామ్రాజ్యవాదం ఫలితంగా కెనడా ప్రాంతీయ సరిహద్దులు ఏర్పడ్డాయి. యూరఫ్ వాళ్ళు కెనడాలోకి ప్రవేశించక మునుపు ఇది విభిన్న రాజకీయ, సాంస్కృతిక విభాగాలుగా ఉండేది. కెనడాను తమ సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో తరచూ వివిధ యూరప్ దేశాల మధ్య యుద్ధాలు తలెత్తుతుండేవి. స్వాతంత్రసమరం తర్వాత ఉత్తరానికి మరిలింది. స్వాతంత్రానంతరం మరో స్వతంత్ర దేశంతో యుద్ధం ఎదురయింది. ప్రత్యేక వలసలుగా 75 సంవత్సరాలు కొనసాగిన తర్వాత యుద్ధం సంభవించింది. 1949 లో యూనియన్‌లో చేరడానికి న్యూఫోర్ట్‌ల్యాండ్‌కు ఎన్నో సంవత్సరాలు పట్టింది. భౌగోళిక విస్తరణ ఈ రీతిలో సంభవించడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఆర్థిక దృష్టితో చూస్తే సెయింట్ లారెన్స్ ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. సెయింట్ లారెన్స్ ఓడరేవు నుంచి ఈస్ట్ – వెస్ట్ వ్యాపార కార్యకలాపాలు దేశం మారుమూల ప్రాంతాలకు విస్తరించారు. ఫ్రెంచి – కెనడా ల మధ్య సంబంధాలు తీరు ఎప్పుడు సమస్యాత్మకంగానే నడుస్తూవచ్చాయి.

BRAOU

కెనడా సమాఖ్య ఎన్నో ప్రధాన సమస్యలను ఎదుర్కొంది. ఉత్తర – దక్షిణ ప్రాంతాలకు తూర్పు – పశ్చిమ ప్రాంతాలకు మధ్య ఘర్షణ. అలాగే క్యూబెక్ తనకు ప్రత్యేక గుర్తింపు కావాలంటూ చేస్తున్న డిమాండు, వివిధ ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్న స్వతంత్ర ప్రతిపత్తి స్వాతంత్ర పోరటాలు, వివిధ ప్రాంతాల్లో అసమాంతర ఆర్థిక పరిస్థితులు ఇవన్నీ కెనడాకు ఎదురయిన సమస్యలు. ఈ నాటికి కూడా కెనడా ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక, సామాజిక రంగాల్లో, మీడియాలో అమెరికా తన ఆధిక్యతను కొనసాగిస్తూనే ఉంది. కెనడా ఏనాడు పూర్తిగా స్వతంత్ర ప్రత్తిపత్తిని సాధించలేదని ఎంతో మంది రాజకీయ పండితులు అభిప్రాయం. అందరి అవసరాలను తీర్చిన, తమ సమాజంలో విస్తృత పరిధిలో ఉన్న అన్ని వర్గాల వారినీ గుర్తించిన కెనడాకు సంపూర్ణ స్వతంత్ర ప్రతిపత్తిని సాధ్యమయ్యే విషయం కాదన్నది వారి దృఢ అభిప్రాయం.

## 3.9 బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభావం :

కెనడా కాన్ఫెడరేషన్‌గా ఏర్పడి – ట్రాన్స్‌క్షనల్ – దేశంగా అభివృద్ధి చెందిన తర్వాత జాతీయతా భావాన్ని సృష్టించాల్సి వచ్చింది. సమాఖ్య అభివృద్ధి విధానాలు, జాతీయ పాఠాలు దీన్ని శాశ్వతంగా గానీ లేదా కనీసం

సంతృప్తికరస్థాయిలో గాని సాధించలేవు. ఫెడరేషన్ కేంద్రీకృత స్వభావంలో వున్న ప్రభుత్వాన్ని కలిగి ఉండి. వివిధ ప్రావిన్సులలో స్థిరమైన సమాజ రూపురేఖల్ని చూస్తాం. ప్రాంతీయ నాయకులు చాలా పటిష్టంగా వ్యవహరించేవారు. స్వతంత్ర పతిపత్తితో ప్రవర్తించేవారు స్థానికంగా చోటుచేసుకున్న ఐక్యత వల్లే ఇది సాధ్యపడేది. సమాఖ్య ప్రభుత్వాలలో తరచు తలెత్తే ఘర్షణలోంచి స్థానిక సంస్కృతిక పుట్టుకొచ్చేది. అందుకే వివిధ ప్రావిన్సులు అధిక్యత (అధికారం) వెంట పడేవి.

బ్రిటిష్ సామ్రాజ్యం ముగిసినా జాతీయ ప్రతిపత్తి కెనడా మౌలిక స్వరూపాన్ని మర్చుకోలేకపోయింది. వలసలు ఇంకా వీనిపై తన పట్టును కోల్పోలేదు. ప్రావిన్సీలకు వీటిపై నియంత్రణ ఉండేది. స్థానిక ప్రజల జాతికి మటుకు కాన్ఫిడరేషన్ పోయేది కాదు. స్థానికుల ఆసక్తి ప్రయోజనాలకనుగుణంగా పౌర సమాజంలోని సంస్థలు రూపురేఖలు ఉండేది. 1867 నాటికి కొన్ని అధికారాలు పోయినా, ఇప్పటికీ ప్రావిన్సుల్లోని సమాజం ఎలాంటి మార్పులకు లోనుకాలేదు.

## 3.10 జాతుల వైవిధ్యం – సమాఖ్యతత్త్వం :

కేంద్రీకృత ధోరణలు, ప్రాంతీయ జాతులు, వర్గాల వత్తిడులు నేటి ప్రపంచ రాజకీయాల్లో సమాంతరంగా కొనసాగుతున్నాయి. సరికొత్త ఆర్థిక బహుళజాతి మార్కెట్‌లో పటిష్టమైన వాణిజ్యాన్ని నెరపేందుకు సార్వభౌమాధికారం ఉన్న దేశాలు బలమైన ప్రాంతీయ బృందాలను ఏర్పాటు చేయాలనే ఉత్సుకతను చూపిస్తున్నాయి. అదే విధంగా మైనారిటీలు, ఉపజాతీయులు సమీకృతం అవుతున్నాయి. క్రమ నిర్దిష్ట అభిప్రాయాలను వారు బహిర్గతం చేయడం ఆరంభించారు. గతంలో వీరు నోరు విప్పి ఎరుగరు. తీవ్ర అణచివేతకు, నిర్లక్ష్యానికి భారీగా గురయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో, జాతి పోరాటాలు, వేర్పాటు ఉద్యమాలు ప్రపంచంలోని పలు ప్రాంతాలలో వ్యాప్తి చెందనారంభించాయి. వైవిధ్య పూరితమైన సమాజంలో వివిధ జాతుల గుర్తింపు పోరాటాలు తీవ్రతరం అయ్యాయి. రాజకీయంగా అవి సమాజంలో విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి కూడా. కెనడాలో మనం చూసే సమాఖ్యతత్వం రాజకీయంగా పాల్పడ్డ బేరసారాల ఫలితంగా రూపుదిద్దుకొన్నవే. సామ్రాజ్య వాద శక్తులు విరమించుకునే సమయంలో రాజకీయ పరిష్కారంగా కూడా ఇది మారింది. వివిధ వర్గాల నుండి వత్తిడులు ఎదురయినప్పుడు కూడా ఇదే మార్గదర్శకంగా రూపుదిద్దుకుంది. కేంద్రీకృత, వికేంద్రీకరణ లక్షణాలలో విధానస్థాయిలో కెనడా ప్రయోగాల్ని చేసిందని చెప్పవచ్చు. ఇప్పటికీ ఏకాభిప్రాయ సాధనతో ఇది వైఫల్యాన్నే ఎదుర్కొంటుంది. వివిధ పద్ధతుల ద్వారా వివిధ జాతుల జాతీయవాదం కూడా ఊపందుకుంది.

BRAOU

కెనడా తొలి 5 సంవత్సరాల కాలంలో అక్కడి రాజకీయ రంగంలో "జాయం" కు ప్రత్యేక ప్రాధాన్యమే కొనసాగింది. జాతుల గుర్తింపు పోరుకు నాంది పలికింది. క్యూబెక్ అంటోరియో, పశ్చిమ ప్రాంతాల్లో జాతుల గుర్తింపు పోరు మొదలయింది. ఆంగ్లో కెనడియ్లని సామ్రాజ్యవాదులు వీరి పోరును మరింత వృద్ధి చెందడానికి కారణం అయ్యారు. వీరు బ్రిటిష్ దిశగా దీన్ని ధృడంగా భావించడమే ఇందుకు కారణం. 1887 – 1991 లో హక్కుల ఉద్యమం నడుపుతున్న ఫ్రెంచి కెనడియన్ నాయకులు జాతులకు స్వతంత్ర ప్రతిపత్తిని రాజ్యాంగ బద్ధం చేయడం వల్లే వారి హక్కులకు రక్షణ సాధ్యం అవుతుందని అభిప్రాయపడ్డారు. క్యూబెక్ విజయంలో కూడా వీరు ఇదే అభిప్రాయాన్ని స్పష్టీకరించారు. వివిధ జాతుల వారి తమ ప్రాదేశిక హక్కుల కోసం పోరాడాలి. క్యూబెక్

ఒక్కటే ప్రత్యేక గుర్తింపు కోసం, ఉనికి కోసం పోరాడలేదు. కెనడా పశ్చిమ ప్రాంతంలో ప్రాంతీయ వెలివేత, దానిపై నిరసనలు కొన్నేళ్ళు దాకా కొనసాగాయి వెల్లువయ్యాయి. కెనడా స్థానిక ఇండియన్లు, ఇన్విల్లో (ఎస్కిమోలు) ల ప్రతినిధులు 1960 నుంచీ తమ ప్రజల హక్కుల కోసం, స్వయం నిర్ణయధికారం కోసం డిమాండ్ చేస్తున్నారు. ఉత్తర కెనడాలో భూములపై సంస్కరణ హక్కుల కోసం గుర్తింపుకోసం కూడా వాళ్ళు డిమాండులు చేస్తు వచ్చారు.

1763 లో న్యూ ఫ్రాన్సుకు బ్రిటిష్ హస్తగతం చేసుకున్నప్పుడు, క్యుబెక్ ఏర్పాటువాదం ఆరంభమైంది. అయితే ఆధునిక క్యుబెక్‌వేర్పాటువాదం 1960 నాటి – క్వైట్ రెవల్యూషన్ – ద్వారా చాలా తీవ్ర రూపు దాల్చింది. క్యూబెకుల ఉద్దేశంలో కెనడాలో రెండు దేశాలుగా విభజించబడింది. అవి : ఇంగ్లీష్, కెనడా, ఫ్రెంచి కెనడాలు ప్రస్తుతమున్న సమాఖ్య విధానం వీటిని ఎక్కువ నిరుద్యోగవైపుకు తోస్తోందని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు పెద్ద సంఖ్యలో అమెరికాకు వలసలు కూడా పోతున్నారు. కార్మిక రంగంలో ఫ్రాంకోఫోన్సు లకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. కెనడా బహుళ జాతీయులతో కూడిన వైవిధ్యతను కలిగి ఉన్న దేశం బహుముఖ త్వంలోంచే కెనడా తన ప్రత్యేకతను నిలుపుకోవాల్సి ఉంది. అందరికీ సమానమైన మానవ స్వేచ్ఛ ఉండాలి. కెనడాలోని వికేంద్రీకృత వ్యవస్థలు అందరిలో ప్రజాస్వామికంగా ఒప్పందాలు చేసుకోవాలి. అప్పుడే జాతీయ సమగ్రత సాధ్యం అవుతుంది. "సూపర్ నేషనలిజం" అనే మిధ్యావాదంతో పనేలేదు.

## 3.11 ముగింపు:

కెనడాలో మానవ హక్కుల పరిస్థితి ప్రస్తుతం చాలా దుర్భరంగా ఉంది. వలస పాలన వల్లో లేదా ఆధునికత్వం మూలంగానో మాత్రమే ఇవి తలెత్తినవి కావు. వలస పాలనకు ముందు అక్కడ ఉన్న విభిన్న సామాజిక – జాతుల వైవిధ్యం కూడా 'సంపూర్ణ జాతి'గా ఏర్పడే క్రమంలో ప్రాధాన్యం సంతరించుకుంటాయి. ప్రాదేశిక పునాదులపై రాజకీయాలు కొనసాగడం వల్ల సమాఖ్య ఉనికికే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. భాషా, మత, జాతి సంబంధమైన డిమాండ్లతో బాటు సమాఖ్య రాజకీయాల్లో ఉన్న వాళ్ళు లేని వాళ్ళ మధ్య ఆర్థిక వత్తిడులు ఎక్కువయ్యాయి. సంక్షోభాన్ని ఇది మరింత పెంచింది.

BRAOU

1960 నాటికి కెనడాలో చాలా ప్రొవిన్సులు మానవ హక్కుల నిబంధనావళిని చట్టబద్ధం చేశారు. కెనడాలో సమాన న్యాయ సూత్రం వ్యక్తిగత రాజకీయం ఆర్థిక సంప్రదాయాల పునాదుల్లోంచి చూడ్డం జరుగుతుంది. 1962 లో ఆంటారియో మానవ హక్కుల నిబంధనావళిని ప్రకటించారు. దీని 'ముందుమాట' లో – అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన – ను గూర్చి ప్రస్తావించారు. దాని ప్రకారం ఆంటారియో ప్రజావిధానం ఏంటంటే – ప్రతి మనిషి స్వేచ్ఛా జీవే. సమానత్వం ఉన్నవాడే వీటికి జాతి, మత, కుల, రంగు, పుట్టు పూర్వోత్తరాలతో సంబంధం లేదు. వీటన్నింటికీ అతీతంగా అన్ని రకాల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను, సమానత్వాన్ని ప్రజలు కలిగి ఉంటారు. కెనడా ఛార్టర్ ఆఫ్ రైట్స్ అండ్ ఫ్రీడమ్స్‌లో సెక్షన్ – 15 (1) ప్రకారం – చట్టం ముందు అందరూ సమానులే – అని స్పష్టం చేస్తోంది. అయితే ఇది ప్రభుత్వ రంగానికి తప్పించి, ప్రైవేట్ రంగానికి వర్తించదు. తర్వాత కెనడా మానవ హక్కుల చట్టంకు రూపకల్పన జరిగింది. దాని ప్రకారం లింగవివక్ష వల్ల, జాతి, కుటుంబం, వయో పరిమితుల వల్ల తలెత్తిన అంగవికలులో "ప్రైవేట్" వ్యక్తులు కారు అంగాలు కానే కారు.

స్థాయిలో జరుగుతున్న, హింసాత్మక సంఘటనలపై చట్టాలు, చాలా అనారోగ్యత సంఘాలు తగిన

స్పందనతో వ్యవహరించడం లేదని విమర్శ ఉంది. చెప్పుకోవడానికి మాత్రం పెద్ద సంఖ్యలోనే న్యాయపరమైన దక్షణ నిబంధనావళి ఉంది. - పేరుగొప్ప - ఊరు దిబ్బ - అన్న చందంగా అక్కడి పరిస్థితులు ఉన్నాయి. అంతేకాదు వ్యక్తికెదురయ్యే సమస్యల్లో జాతి కూడా ఒక ప్రధాన అంశమవుతుంది. తప్పించి కేవలం, అదే ప్రధాన అంశం కాదు. చారిత్రికంగా ఇబ్బందుల పాలైన వర్గాలకు, జాతులకు అమలులో ఉన్న శాసనాల ద్వారా సామాజిక కార్యక్రమాలకు చేపడుతున్నారు. ప్రస్తుతం పటిష్టమైన, నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితుల్లో మనం ఉన్నాం.

## 3.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. కెనడా రాజకీయ సంక్షోభానికి ఏవి ప్రధాన కారణాలుగా మీరు భావిస్తున్నారు ?
2. కెనడా పరిస్థితులను మానవ హక్కుల వాదనకు వర్తింపచేయండి. మానవ హక్కుల విస్తృతికి ఏవైన సూచనలు చేయండి?

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.**

1. కెనడా రాజకీయ చారిత్రక సందర్భాన్ని వివరించండి.
2. జేమ్స్ బే డెవలప్‌మెంట్ కేసును రాయండి.

BRAOU

# భాగం – 4: తూర్పు- ఆగ్నేయ ఆసియా దేశాల్లో మానవ హక్కులు

విషయక్రమం :

4.0 ఉద్దేశం

4.1 పరిచయం

4.2 జపాన్‌లో మానవ హక్కులు

4.2.1 బరకుమిన్

4.2.2 కొరియన్లు

4.2.3 అక్రమ కార్మికులు

4.2.4 మహిళలు

4.3 ఇండోనేషియాలో మానవ హక్కులు

4.3.1 రాజకీయ స్వేచ్ఛలు

4.3.2 భావ ప్రకటన స్వేచ్ఛపై అవరోధాలు

4.3.3 తూర్పు తైమూర్

4.3.4 కార్మికుల హక్కులు

4.4 ముగింపు

4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 4.0 ఉద్దేశం:

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- జపాన్, ఇండోనేషియా దేశాల్లోని మానవ హక్కుల పరిస్థితిని పరిచయం చేయగలుగుతారు.
- వివిధ మానవ హక్కుల ఉల్లంఘన సందర్భాలపై అవగాహన పొందుతారు.

## 4.1 పరిచయం:

తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాల్లోని మానవ హక్కుల అధ్యయనాన్ని పాశ్చాత్య సామ్రాజ్యవాదం, జపాన్ సామ్రాజ్యవాదాల కొనసాగింపు, రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆయా దేశాలు సాధించిన అనూహ్య ఆర్థికాభివృద్ధిల నేపథ్యంలో పరిశీలించాలి. ఈ దేశాల్లో అంతర్జాతీయ మానవ హక్కుల సమాజంలోకి జపాన్ నిరాసక్తంగా ప్రవేశించగా, ఇండోనేషియా ఆ ప్రవేశాన్ని సైతం తిరస్కరించింది. ఈ ప్రాంతంలోని అనేక ప్రభుత్వాలు "మానవ హక్కులు తమ

సంస్కృతులకు పరాయి అంశాలని' భావిస్తాయి. అయితే ఈ దేశాల్లో ఉద్భవించిన క్రియాశీల మానవ హక్కుల ఉద్యమాలు ఈ భావన సరైనది కాదని చాటాయి. ప్రభుత్వాలు పౌరసమాజంలోని సాంఘిక- ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ క్రమానుగత వ్యవస్థలను కాపాడు కోడానికి ప్రయత్నిస్తున్నాయనీ, అందువల్లనే ఈ క్రమానుగత వ్యవస్థలను సవాలు చేసే అవకాశమున్న మానవ హక్కులను ప్రజలకు నిరాకరిస్తున్నాయినీ మానవ హక్కుల ఉద్యమాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే అంతర్జాతీయ మానవ హక్కుల సమాజంలోకి జపాన్ ప్రవేశం ద్వారా ఆదేశంలోని అణచివేతకు గురైన వర్గాలు లాభం పొందగా, ఇండోనేషియా ప్రవేశ తిరస్కారంతో ప్రయోజనం శూన్యమై రాజ్యవ్యవస్థ పౌరసమాజాన్ని తెలివిగా బలప్రయోగం, క్రమబద్ధీ కరణలతో నిర్వీర్యం చేస్తుంది.

## 4.2 జపాన్‌లో మానవ హక్కులు :

అంతర్జాతీయ మానవ హక్కుల సమాజంలోకి జపాన్ నిరాసక్తంగా ప్రవేశించింది. అంతర్జాతీయ సాంఘిక, రాజకీయ హక్కుల ఒడంబడి కలపై జపాన్ 1976 లో సంతకం చేసి, 1978 లో పునరుద్ధరించింది. ఇదే క్రమంలో వివిధ వర్గాల ప్రజల వత్తిడిలతో అప్పటి నుంచీ ఇతర అంతర్జాతీయ ఒడంబడికలు, ప్రకటనలపై కూడా సంతకాలు, ఆమోదాలు చేస్తూనే ఉంది. జపాన్‌లోని నిరాదరణకు గురైన వర్గాల్లో బరాకుమిన్, మహిళలు, కొరియన్‌లు, విదేశీ కార్మికులు ప్రధానమైనవారు. వీరు జపాన్‌లోని ద్వంద్వ ఆర్థిక వ్యవస్థలో భాగమైన ద్వితీయ సెక్టర్‌లో పనిచేస్తారు.

### 4.2.1 బరకుమిన్

జపాన్‌లో అంటరానివారుగా పరిగణించబడే బరాకుమిన్ దాదాపు 6000 జిల్లాల్లో నివసిస్తారు. నిజానికి వారు జనాభారీత్యా మూడు మిలియన్లకు పైబడి ఉన్నా జపాన్ ప్రభుత్వ మాత్రం కేవలం 4,603 జిల్లాలను, 11,66,733 మంది జనాభాను మాత్రమే గుర్తించింది. ఏడో శతాబ్ద జాతి పునర్నిర్మాణంలో సమాజంలోని అట్టడుగు వర్గంగా స్థానం పొందిన ఈ వర్గాలు వివిదధ వృత్తుల్లో వున్నారు. ప్రధానంగా చనిపోయిన గుర్రాలు, పశువులను తీసివేయడం, చర్మాలను పదును చేయడం, దేవస్థానాలను శుభ్రం చేయడం, వెదురుతో నగిషీలు మొదలగునవి చేయడం లాంటి వృత్తుల్లో ఉంటారు. అయితే 1868 లో మెయిజీపునస్థాపితం తర్వాత దీన్ని అధికారికంగా రద్దు చేసినా, ఇది మరోక రూపంలో కొనసాగుతూనే ఉంది. వీరు నిర్బంధంగా శ్రామికులై, నిరంతరం నిరుద్యోగులుగా, చిరుద్యోగులుగా చిన్న చిన్న వ్యాపారులుగా జీవిస్తారు. పోరాటాల ఫలితంగా వీరి గృహవసతి, అక్షరాస్యతలలో కొద్ది మార్పు వచ్చినా, వివక్ష సందర్భాలు మాత్రం అంతం కాలేదు. ఈ వివక్షలు పెరుగుతూనే ఉంది ఇటీవలి కొన్ని సంవత్సరాల్లో మరింత ద్వేషపూరితంగా మారాయి. ఈ ద్వేష పూరిత సంఘటనలు 1985 లో 189 గా ఉన్నవి 1989 కి 323 కు పెరిగాయి. వివాహ, ఉద్యోగాల్లో ఈ వివిక్ష కొన సాగుతూనే ఉంది. ఎన్నో భారీ కంపెనీలు బరకు వర్గాల జాబితాలను తెప్పించుకుని వారికి ఉద్యోగ, పదోన్నతి అవకాశాలను తిరస్కరిస్తున్నాయి. ఇటీవలి కాలంలో వ్యక్తిగత కంప్యూటర్లు, రేడియో నెట్ వర్క్‌ల ద్వారా సరికొత్తరకం వివక్ష కూడా ప్రచారంలోకి వచ్చింది. ప్రసార మాధ్యమాల ద్వారా ఒసాకాలోని ఎన్నో బరకు వర్గాల పేర్లు, వారి ప్రధాన వృత్తులు, అలాగే అగౌరవ కరమైన వ్యాఖ్యలు ప్రసారమౌతాయి. వైర్‌లెస్ టెలిగ్రఫీ చట్టం కానీ, తపాలా, మంత్రిత్వశాఖగానీ దీన్ని నివారించడానికి నిర్దిష్టమైన మార్గాలు అన్వేషించలేదు. నిజానికి బరకు వర్గాల జాబితాల తయారీని

జపనీస్ చట్టాలు నిషేదించినప్పటికీ, చట్ట విరుద్ధంగా గూఢచార్లతో వ్యక్తిగత నేపధ్య పరిశోధన, కంపెనీలలో ఉద్యోగాల్లో వివక్ష, వివక్ష పూరితమైన ప్రకటనల పంపిణీ మొదలైన వాటి ఫలితంగా తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతూంది.

### 4.2.2 కొరియన్లు

జపాన్‌లో దాదాపు 6,80,000 మంది కొరియన్లు ఉండగా వారిలో 6,20,000 మంది శాశ్వత నివాసులు. 1952 లోని శాన్‌ఫ్రాన్సిస్కో సంధివరకూ వారిని జపాన్ దేశీయులు గానే భావించారు. కానీ, ఆశ్చర్యకంగా ఒక్కసారే ఆతరువాత వారంతా స్వదేశంలోనే విదేశీయులుగా మారారు. వారంతా స్వల్ప వ్యవధి కోసం జపాన్ దర్శించే విదేశీ పర్యటకుల మాదిరిగా విదేశీ రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలి. దేశం విడిచి వెళ్ళిన ప్రతి సారీ వారు పున ప్రవేశ అనుమతి పొందాలి. జపాన్ ప్రభుత్వం కొరియన్లను జాతీయస్థాయిలోకానీ, స్థానికంగా కానీ ప్రభుత్వోద్యోగులుగా నియమించరాదని ఒక విధాన నిర్ణయం తీసుకుంది. (అయితే పైపైకి విభిన్న ప్రకటనలు ఇస్తుంది.) దీని ఫలితంగా వారిలో 0.013 శాతం మాత్రమే ప్రభుత్వోద్యోగులు జపానీయులు మాత్రం 2.4 శాతం మంది వున్నారు. కొరయన్లను జాతీయస్థాయి విశ్వవిద్యాల యాల్లో బోధనకు అనుమతించినప్పటికీ, ప్రాధమిక, హై స్కూలు స్థాయిల్లో పూర్తిస్థాయి అధ్యాపకులుగా వారిని అనుమతించలేదు. ప్రభుత్వ ఆదర్శాన్ని జపాన్ ప్రైవేటు రంగం కూడా శ్రద్ధగా అవలంభిస్తోంది. ప్రైవేటు రంగంలో జపానీయులు 48 శాతం మంది కాగా కొరియన్లు 20 శాతం మంది మాత్రమే. వారిలో కూడా 40 శాతం మంది రెస్టారెంట్‌లు మొదలైన హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాల్లో ఉన్నారేకాని, 300 లేదా అంతకు పైబడిన కార్మిక కంపెనీల్లో కొరియన్ కార్మికుల శాతం ఉపేక్షించదగినదే.

### 4.2.3 అక్రమ కార్మికులు

జపాన్ కార్మిక ప్రమాణ చట్టాలు, ఉద్యోగ భద్రత చట్టం దేశంలోని జాతీయత, చట్ట స్థాయి భేదాలు లేకుండా కార్మికులందరికీ ఒకే విధంగా అనువర్తించి నప్పటికీ, సాంకేతికనైపుణ్యం లేని ఎంతో మంది విదేశీ కార్మికులకు మాత్రం నివాస అర్హత లేదు. దేశంలో 2,16,399 మంది చట్ట విరుద్ధంగా దేశంలో కొనసాగుతున్న తైవాన్, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, ఫిలిప్పైన్స్, మలేషియా, ఇరాన్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల జాతీయులు విదుశీయులు గానే కొన సాగుతున్నారు. వీరిలో చాలమంది జపాన్ యువత ఆసక్తి చూపని నిర్మాణపు పనులు, ఫ్యాక్టరీ పనులు ఇతర నైపుణ్యం లేని పనుల్లో ఉన్నారు. వారిలో చాల మంది అవే పనులకు జపాన్ కార్మికులు పొందే వేతనాల్లో 50 నుంచి 70 శాతం మాత్రమే పొందుతున్నారు. వీరిపనులకు సంబంధించిన ఒప్పందాలు చాల వరకు మౌఖికంగా ఉండి యజమానుల యిష్టాయిష్టాలకు అనుగుణంగా తొలగింపులు ఉంటాయి. వారు కనిష్ట వేతనాలకు అలవడినారు. జపాన్ కార్మికులతో పోల్చిత వీరిలో ప్రమాదాలరేటు కూడా అధికమే. దుర్భర పని పరిస్థితుల్లో పనులను చేపడతారు. కాబట్టి ప్రమాద సందర్భాల్లో ప్రమాద భీమాలను కోరరు. దానికి వారు అర్హులైనప్పటికీ, ఆవిషయాలు ఇమిగ్రేషన్ అధికారులకు తెలిస్తేతమను బలవంతంగా తమ దేశాలకు తరలిస్తారని వారు భీమా కోరరు. వీరిలో మహిళా విదేశీ కార్మికులు ఎక్కువ మంది (దాదాపు 55.6 శాతం) బార్‌లలో పని మనుషులుగా మారి లైంగిక వేధింపులకు గురి అవుతున్నారు. అంతేకాకుండా వ్యభిచారపు ఊబిలోకి నెట్టబడుతున్నారు.

BRAOU

### 4.2.4 మహిళలు

ఉద్యోగ విషయాల్లో స్త్రీ పురుషులకు సమాన అవకాశాలు ఆదరణలకు సంబంధించిన చట్టం స్త్రీ పురుషులకు విడివిడిగా నియామకపు పద్ధతులు ఉండడాన్నీ, వేదా కొన్ని ఉద్యోగాలకు కేవలం పురుషులనే ఎంపిక చేయడాన్ని నిషేదిస్తుంది. 1978 వరకు 91 శాతం కంపెనీల్లో స్త్రీలకు ఉద్యోగాలు మృగ్యం. 73 శాతం వాటిలో ప్రారంభ వేతక వ్యత్యాసాలు, 52 శాతం వాటిలో స్త్రీలకు పదోన్నతి లేకపోవడం, 77 శాతం వాటిలో పదవీ విరమణ పద్ధతుల్లో వ్యత్యాసాలు కాగా కేవలం 19.4 శాతం వాటిలో పదవీ విరమణ పద్ధతుల్లో వ్యత్యాసాలు కాగా 19.4 శాతం వాటిలో మాత్రమే సమాన శిక్షణ ఉంది. నిజానికి జపాన్‌లో మహిళల అక్షరాస్యతశాతం అధికంగా (97 శాతం) వున్నప్పటికీ, వారిలో 6.4 శాతం మాత్రమే సైంటిస్టులు, 2.4 శాతం ఇంజనీర్లు, 9 శాతం న్యాయవాదులు, 5.5 శాతం ఎగ్జిక్యూటివ్‌లు 5.2 శాతం సివిల్ సలహా ఉద్యోగాల్లో ఉన్నారు. మహిళల్లో అత్యధికులు సేల్స్, సర్వేసు, ఆఫీసు ఉద్యోగాల్లో స్థిరపడగా, 48 శాతం వ్యవసాయ కార్మికులుగా, 50 శాతం పైగా గుమాస్తా ఇతర సేవల విధులు 50 నుంచి 90 శాతం రబ్బరు. వస్త్ర పరిశ్రమల్లో వున్నారు.

జపాన్‌లో 50 శాతంపైగా మహిళలు ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ, ఆ ఉద్యోగాలు తాత్కాలికమైనవే. వివక్ష వారి విధుల ఆరంభంలోను, విధి నిర్వహణ సమయంలోను కూడా కొనసాగుతూనే ఉంది. మహిళల వాస్తవ పని పరిస్థితులను సర్వే చేసిన విద్యార్థి అధ్యయన బృందం వెల్లడి చేసిన అంశాల ప్రకారం ఉద్యోగాల ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు సంబంధించిన అంశాలను కాక వ్యక్తిగతమైన ప్రశ్నలు అడగడం, తల్లి దండ్రులతో నివసించే మహిళలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి, దూరంగా నివసించే వారిని ఉద్యోగాలకు అనుమతించకపోవడం, స్త్రీపురుషులకు ఉద్యోగ శిక్షణలను విడి విడిగా జరపడం ఉన్నాయి. మహిళలను కేవలం సహాయక విధులకు మాత్రమే నియమించడం, కొన్నిరకాల ఉద్యోగాలకు వారిని అనర్హులుగా చేయడం, చివరకు యూనివర్సిటిల మహిళా పట్ట భద్రులను ఉద్యోగాలకు, విధాలకు దూరంగా ఉంచడం జరుగుతూంది. స్త్రీ పురుషుల మధ్య ఉద్యోగ దర ఖాస్తులలో, వేతనాలలో వయస్సురీత్యావ్యత్యాసాలు ఉన్నాయి. ఎన్నో కంపెనీలు మహిళలు నివసించడానికి వసతి గృహాలను కల్పించడం లేదు. ఉద్యోగ సమాచార కరపత్రాలను కేవలం పురుషులకు మాత్రమే పంపి, నియామకపు పరీక్షలను స్త్రీ పురుషులకు విడివిడిగా నిర్వహించడం జరుగుతూంది. మహిళలకు కంపెనీలు దరఖాస్తులను పంపడానికి నిరాకరించడం, సోగో-షోవ్‌కు (మరింతబాధ్యతాయుతమైన) స్థానాలను ఆశించే మహిళలను పర్యవేక్షకుల ద్వారా, ఇంటర్వ్యూలు-వ్రాతపరీక్షల ద్వారా నిర్దిష్టంగా కట్టడి చేయడం జరుగుతూంది. ఈ విధానం ఫలితంగా కేవలం 10 శాతం స్థానాల్లో మాత్రమే మహిళలు ఉన్నారు. పరిపాలన ఉద్యోగాల్లో మహిళలపై కార్మికశాఖ చేసిన సర్వే ప్రకారం కంపెనీల్లో 30 శాతంలోపు వాటిలో మాత్రమే మహిళలు పరిపాలన సంబంధ ఉద్యోగాల్లో ఉండగా, 75 శాతం కంపెనీల్లో మహిళ పరిపాలన ఉద్యోగినులే లేరు.

కంపెనీలన్నింటిలో మహిళలను వివాహ సమయాల్లో, గర్భధారణ లేదా శిశు జనన సమయాల్లో ఉద్యోగాల నుంచి తొలగించడంపై నిషేదం ఉన్నప్పటికీ, వారిని ఆ సమయాల్లో ఉద్యోగాలు విడిచి వెళ్ళేలా ఒత్తిడి తేవడానికే మొగ్గు చూపుతున్నాయి. 1990లో జరిపిన ఒక సర్వే ప్రకారం, ఇంటర్వ్యూ చేసిన వారిలో 46.4 శాతం మంది తమ కంపెనీలకు మహిళలను నిర్బంధ పదవీ విరమణ వయస్సు రాకముందే రాజీనామా చేయించే సంప్రదాయం వున్నదని వెల్లడించారు. అదేవిధంగా, శిశు సంరక్షణ సెలవు చట్టం స్త్రీ పురుషులిద్దరికీ సెలవు అవకాశం కల్పించినప్పటికీ, ఆసెలవు కాలానికి వేతనాల భద్రత లేదు. ఫలితంగా స్త్రీ పురుషుల మధ్య వేతన వ్యత్యాసాలు ఎక్కువై మహిళలు ఉద్యోగాలనుంచి తప్పుకునే పరిస్థితికి దారి తీస్తూంది.

BRAOU

వివాహం, విడాకులు సంబంధించి కూడా వివక్ష పూరిత అంశాలు ఇంకా కొనసాగుతున్నాయి. మహిళల్లో వివాహ ఆమోద వయస్సు 16సం రాలు కాగా, పురుషుల్లో 18సం రాలు. అదే విధంగా స్త్రీ పురుషులు వివాహం తరువాత ఒకే ఇంటి పేరును కలిగి ఉండేలా నిర్ణయం తీసుకోవాల్సి ఉండడంతో 98 శాతం భార్యలు తమ భర్తల ఇంటి పేరునే కలిగి వున్నారు. విడాకుల అనంతరం మహిళలు 9నెలల వరకు తిరిగి వివాహం చేసుకోడానికి అనర్హులుకాగా, పురుషులకు అనిషేదం లేక ఎప్పుడైనా వివాహం చేసుకునే అవకాశం ఉంది.

## 4.3 ఇండోనేషియాలో మానవ హక్కులు :

ఏడు దేశాల ఆగ్నేయ ఆసియా కూటమిలో ఇండోనేషియాను కనిష్టస్థాయి ప్రజా స్వామ్య దేశంగా పేర్కొన వచ్చు 1965 సం॥లో సైన్యం అధికారం హస్తగతం చేసుకున్నప్పటి నుంచి ఇప్పటి దాక అదే పరిపాలిస్తూంది. ఈ పరిపాలనలో పెత్తనం చేసే ఒకే కుటుంబం - జనరల్ సుహార్తో కుటుంబం. ఎఫ్.క్లెయిర్‌మెంట్ మాటల్లో ఈ కుటుంబం వాణిజ్య, రాజకీయ పెత్తనం కలిగివుంది. రాజకీయ ఆర్థిక శక్తులు రెండూ ఈ కుటుంబంలోనే కేంద్రాకృత మైనాయి. ఇండోనేషియాలోని రాజ్యవ్యవస్థ అధికారయుతమై "ప్రజా భాగ స్వామ్యం అధికారికవ్యవస్థలతో నిండి, ప్రజలు ప్రత్యక్షంగా రాజకీయ నిర్ణయ ప్రక్రియల్లో పాల్గొనేవీలులేదు. ప్రజా భాగస్వామ్యం కేవలం రాజ్యం గుర్తించిన (లేదా అనుమతించిన) ప్రాతినిధ్య సంస్థల, వ్యవస్థల ద్వారా మాత్రమే జరుగుతుంది. ఇలా ప్రాతినిధ్య సంస్థల, వ్యవస్థలద్వారా కాక బహిర్గతంగా జరిగే ఏ భాగస్వామ్యమైనా చట్టవ్యతిరేకం కాబట్టి అది అక్రమమై, తీవ్ర వాదంగా పరిగణించ బడుతుంది".

ఇక్కడ రాజకీయ నిర్ణయాలను రాజ్య పరిపాలన వ్యవస్థలోని ఒక చిన్న సమూహం తీసుకుంటుంది. దీని ఫలితంగా సభ్య సమాజం దాదాపు పూర్తిస్థాయిలో రాజకీయరహితంగా మారింది. రెండోది, సామాజిక జీవనంలో సైన్యం పాత్ర సర్వ వ్యాప్తమై వక్ర రూపం దాల్చింది. అది దాదాపు అన్ని పరిపాలన స్థాయిలకు, పనులకు క్రమక్రమంగ విస్తరించి పౌరపాలనలో దాని చర్యలకు ప్రజలకు ఏ మాత్రం బాధ్యత వహించని విధంగా తయారైంది. మూడోది, అధికార సిద్ధాంతమైన "ఆర్థికాభివృద్ధి కోసం రాజకీయస్థిరత్వం" జనాభాలోని అనేక వర్గాలకు ఆ అభివృద్ధిని అందకుండా చేయడమేకాక, వారు తమ దురదృష్టాన్ని వ్యక్తి కరించడానికి కూడా అడ్డుపడుతూంది. ఆర్థికాభివృద్ధి పేరున ఎన్ని ప్రజా హక్కుల ఉల్లంఘనవైనా న్యాయబద్ధమే. ఈ అధికారయుత రాజకీయ ఆర్థిక వ్యవస్థ సభ్య సమాజాన్ని రాజకీయ రహితంగా మార్చడానికి ఫలితంగా పెద్ద ఎత్తున ప్రజా హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి.

అంతర్జాతీయ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడికపై ఇండోనేషియా సంతకం చేయలేదు. 5 సం॥ లలోపు పిల్లల్లో 50 శాతం మందికి సరైన పోషకాహారం లేదు. దాదాపు 50 శాతం జనాభా తక్కువస్థాయి ఉద్యోగులే. ఇండోనేషియా తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోని నీటి లాగింగ్‌లు వల్ల, భూమి హక్కులు లేక పోవడం వల్ల దుర్భర పరిస్థితుల్ని ఎదుర్కొనే వివిధ వర్గాల్లో వ్యవసాయ కార్మికులు, చిన్నరైతులు, గిరిజనులు వున్నారు. వీరిని భారీప్రాజెక్టుల నిర్మాణం పేరుతో, వ్యవసాయ భూముల అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ప్రోత్సహించే భూస్వాముల చేతిలో నిరాశ్రయులవుతున్నారు.

పౌర, రాజకీయ హక్కులైన సంఘాల ఏర్పాటు సమావేశాల నిర్వహణ, భావప్రకటన స్వేచ్ఛలను భారీస్థాయిలో అణచివేయడంతో ఎన్నో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ప్రతి పక్ష రాజకీయాలను

BRAOU

సహించారు. పత్రికా స్వాతంత్ర్యం చాల వరకు తగ్గించ బడింది. కార్మికులు తమ సంఘాలను ఏర్పాటు చేసుకోడానికి అనుమతి లేదు. మత పరమైన అల్ప సంఖ్యాక సంస్థలపై జోక్యం ఎక్కువై వారి స్వేచ్ఛ అడుగంటింది. తూర్పు తైమూర్ ప్రజల రాజకీయ ఆకాంక్షలను ఎన్నో కుయుక్తులతో అణచివేస్తున్నారు. నిజానికి ఎలాంటి అసంతృప్తి, నిరసన, వ్యతిరేకతనైనా బలప్రయోగం ద్వారా అణచివేస్తారు.

## 4.3.1 రాజకీయ స్వేచ్ఛల అణచివేత

జనరల్ సుహర్తో 32 సంవత్సరాలుగా ఎలాంటి సమర్థ ప్రతిపక్షం లేకుండా పరిపాలన చేశాడు. వ్యతిరేకతను, శక్తి వంతమైన ప్రతి పక్షాన్నీ గట్టిగా నిరంకుశ చట్టాలతో కట్టడి చేయడమే కాక, అది అవధులు దాటినప్పుడు నిరోధించడం కూడా జరుగుతుంది. దేశ రాజకీయ జీవనంలోకి చొచ్చుకుపోయి సర్వవ్యాప్తమైన సైన్య ప్రతిపక్షం ఎదగకుండా ఇంకా కట్టడి చేస్తూంది. ఇండోనేషియా అధికారవ్యవస్థ ఈ శతాబ్దంలో జరిపిన రాజకీయ మారణ హోమాల్లోని ఒక దాంట్లో దాదాపు 5 లక్షల మంది కమ్యూనిస్టులు, వారి సానుభూతి పరులు సైన్యం చేతిలో హతమయ్యారు. మిగిలిన ఒక మిలియన్ ప్రజలు జైళ్ళపాలుకాగా, వేలాది మంది జాడ తెలియకుండా అదృశ్యమయ్యారు. సజీవంగా మిగిలిన వారిని శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో వుంచి, వారిపై జీవితాంతం నిఘావుంచడం జరుగుతుంది. ఇలాంటి నిఘా ఇంకా కొన సాగుతూనే ఉంది. ఇటీ వలి కాలంలో కూడా అంటే 1993లో పాలన వ్యవస్థ ఒక ఆర్డర్ ద్వార భవిష్యత్‌లో ఉద్యోగులకు గతంలో కమ్యూనిస్ట్‌లతో సంబంధాలున్నాయో, లేవో క్షుణ్ణంగా విచారణ జరుపుతూ ఉండాలని ఆదేశించింది. అలాంటివారి తల్లి దండ్రులు గానీ, స్నేహితులుగానీ ఇండోనేషియా కమ్యూనిస్ట్ పార్టీ ద్వారా కమ్యూనిస్టులయితే వారిని బ్లాక్‌లిస్ట్‌లో వుంచాలి.

1967సం|| లో అధ్యక్ష పదవి చేపట్టిన సుహర్తో, రాజకీయ కార్యకలాపాలు నియంత్రణ చేయడానికి ఎన్నో చర్యలు చేపట్టాడు. రాజకీయ పార్టీలను మూడింటికి కుదించారు. ఒకే ఒక కార్మిక సంఘం ఉండడానికి అనుమతించారు. పత్రికలు ప్రచురణల నిమిత్తం లైసెన్స్ పొందాలి. పార్లమెంట్ సభ్యులు కాబోయ్ అభ్యర్థులను మిలటరీ ఇంటెలిజన్స్ సంస్థలు శల్యపరీక్షలు చేస్తాయి. ఎన్నికలలో పోరాడే రాజకీయ పార్టీలు ఎన్నో కఠిన తరమైన నిబంధనలను, ఆక్షేపణలను ఎదుర్కోవలసి ఉంది. వీటిలో ప్రస్తుత అధికార వ్యవస్థను ఎన్నికల ప్రచారంలో విమర్శించడాన్ని జాతి ప్రయోజనాలను దెబ్బతీసేదిగా, ప్రజలను తప్పుదోవపట్టించేదిగా, లేదా తిరుగుబాటును పురికొల్పేదిగా పరిగణించి కోర్టులలో ప్రాసిక్యూట్ చేయడానికి వీలు కల్పించడం మొదలైనవి వున్నాయి.

## 4.3.2 భావ, అభిప్రాయ ప్రకటన స్వాతంత్ర్యాలపై ఆటంకాలు

ఇండోనేషియాలో పత్రికా స్వాతంత్ర్యం చాలా పరిమితులకులోబడి వుంది. అధికార వ్యవస్థ యిష్టాలకు విరుద్ధంగా ఏదైనా ప్రచురిస్తే, ఆవార్తా పత్రికలను మూసి వేయడం, పత్రికా సంపాదకులను ప్రాసిక్యూట్ చేయడం జరుగుతుంది. సుహర్తో పాలనలోని అవినీతిపై కథనాలు ప్రచురించిన ఎందరో జర్నలిస్ట్‌లను బ్లాక్‌లిస్ట్‌లో వుంచారు. వారి బ్లాక్‌లిస్ట్‌లో ఉంచడమే కాక, ప్రాసిక్యూట్ చేసి ఎన్నో సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తుంది. అ ప్రచురణలకు లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుంది. 1991సం|| లో జకార్తాలోని ఆర్నోనెడో అత్మోవిలోటో అనేయువ పత్రిక సంపాదకుడు ఒక మాతాన్ని కించపరిచాడనే సాకుతో 5సం|| రాల కారాగార శిక్ష విధించింది. ఈ కేసులో విచారణను ప్రభుత్వం వక్రీకరించింది. 1994సం|| లో మూడు ప్రముఖ ఇండోనేషియన్ వార్త ప్రచురణలైన వార పత్రికలు టెంపో, ఎడిటర్ అనే వాటినీ, ఒక ప్రముఖ దినపత్రిక డెట్యూను ప్రభుత్వం నిషేధించింది. వీటిలో టెంపో పత్రిక అప్పటి పరిశోధన-సాంకేతిక శాస్త్ర మంత్రి బి.జె. హబీబీని విమర్శిస్తూ కథనాన్ని ప్రచురించింది.

BRAOU

జకార్తా కేంద్రంగా గల కార్యశాల స్వతంత్ర సంస్థ పిజార్ ఫౌండేషన్ నిర్వహించే కబర్ దారి పిజార్ అనే వార్త లేఖ సంపాదకుడు 'ట్రై అగస్' పత్రికల మూసివేతను ప్రజలు నిరసిస్తూ నోరువిప్పాలని కోరినందుకు ఇండోనేషియన్ క్రిమినల్ కోడ్‌లోని 154వ అధికారణ ప్రకారం విచారించి జైలు శిక్ష విధించారు. ఎలయన్స్ ఆఫ్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్స్ పేరుతో కొందరు పాత్రికేయులు ఒక స్వతంత్ర సంస్థలను నెల కొల్పే ప్రయత్నాలను ప్రభుత్వం అడ్డుకుంది. వారి ప్రచురణ 'ఇండిపెండెంట్'ను నిషేదించడం, తమసభ్యులకు ఈ విధులకు అనుమతించే పత్రికలను హెచ్చరించడం చేసింది. ఇవేకాక రాజకీయ వ్యాఖ్యలను విమర్శనాత్మకంగా, నూతనంగా బులెటిన్ రూపంలో ప్రచురించే కొందరు పాత్రికేయులపై వారు ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించి అడ్డంకులు సృష్టించింది.

విద్యా విషయక సెమినార్లలో కూడా భావ ప్రకటన స్వేచ్ఛ పై నిర్బంధమే. 1994సం॥ లో "ఇండోనేషియాలోని భూమి హక్కుల పై శాసనాల భిన్నత్వం" అనే అంశం పై ఇండోనేషియన్ లీగల్ ఎయిడ్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్న ఒక సెమినార్‌ను, నిర్వాహకులు పోలీసుల వద్ద అనుమతి పొందలేదనే కారణంతో జరగకుండా చేశారు. నిజానికి పోలీసులు ఎత్తి చూపిన అనుమతి నిబంధన విద్యా విషయక సెమినార్లకు వర్తించదు. 1995సం॥ లో ప్రభుత్వపు తూర్పు తైమూర్ విధానాన్ని తీవ్రంగా విమర్శించే డాక్టర్ జార్జి ఆదిత్ జోంగ్రో అనే సత్యవాకన విశ్వవిద్యాలయం అధ్యాపకునిపై ప్రజల్లో ప్రభుత్వాన్ని కించపరుస్తున్నట్లు అభియోగం మోపారు. నిజానికి సుహార్తో, అతని ప్రాణస్నేహితులపై అధ్యాపకుడు ఇండోనేషియన్ ఇస్లామిక్ యూనివర్సిటీలోని ఒక ఉపన్యాసంలో హాస్యపూరితంగా మాట్లాడాడు.

ఈ నిర్బంధాలేకాక, ఇండోనేషియా కమ్యూనిస్ట్ పార్టీ సానుభూతి పరులపై బహిరంగ వివక్ష విధానాన్ని అక్కడ అనుసరిస్తున్నారు. నిజానికి 1965సం॥ లోనే ఆ పార్టీని తుడిచిపెట్టినప్పటికీ, 1990వరకు ఎవ్వరైనా ఆపార్టీకి మద్దతు తెల్పినట్టు అనుమానించినా, ఏకుటుంబమైనా ఆపార్టీపై సాను భూతి కనపర్చినట్లు అనిపించినా, వారిని పరిశుభ్ర పరిసరాల పేరుతో కొన్ని ఉద్యోగాల నుంచి తొలిగించడం జరిగేది. 1990సం॥ లో మరో విధానాన్ని రూపకల్పన చేశారు. దాని ప్రకారం ప్రభుత్వోద్యోగులందరూ, ప్రభుత్వోద్యోగాన్ని ఆశించే అభ్యర్థులు, కొన్ని ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను ప్రత్యేక సమీక్ష ద్వారా ప్రభుత్వం పై వారి విధేయతను నిర్ధారించి, వారు స్త్రీకాని, పురుషుడుగాని) కమ్యూనిస్ట్ లేదా మార్క్సిస్ట్ బోధనలకు ప్రభావితమయ్యారో లేదో తెలుసుకోవడం జరిగేది. ఈ విధానం ప్రకారం మార్క్సిస్టు సాహిత్యాన్ని చదవడాన్ని కూడా ప్రభావితమైనట్లు గానే పరిగణించేవారు. ఫలితంగా అలా ప్రభావితులైనట్లు తేలిన వారందరి పైన వివక్ష చూపి నేరం మోపేవారు.

BRAOU

## 4.3.3 తూర్పుతైమూర్

1976సం॥ లో ఇండోనేషియా అక్రమంగా తనలో విలీనం చేసుకున్న ఈ భౌగోళిక ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘన అత్యధిక స్థాయిలో జరుగుతుంది. అనేక స్వాతంత్ర్యపోరాటాల అనంతరం ఇటీవలనే 2000సం లో ఈ ప్రాంతానికి ఇండోనేషియా అయిష్టంగా స్వాతంత్ర్యం ఇచ్చింది.

1976లో ఇండోనేషియా తనలో తూర్పు తైమూర్‌ను సంలీనం చేసుకున్నప్పుడు దాదాపు 1,75,000 మంది ప్రజలను కిరాతకంగా హత్యచేసింది. ఎంతో మంది జైళ్ళ పాలయ్యారు. అప్పటినుంచీ ఇండోనేషియా ఈ ప్రాంతంలో సైన్యాన్ని మోహరించింది. తూర్పుతైమూర్ స్వాతంత్ర్యం కోసం పోరాడే సంస్థ నిషేదిత "ఫ్రెటిలిన్"తో సన్నిహిత సంబంధాలుండే వ్యక్తులపై నిగూఢమైన నిఘా ఉంచడం జరుగుతుంది. న్యాయవిచారణ లేని హత్యలు, చిత్ర హింసలు, అదృశ్యమవడాలు, చట్ట విరుద్ధ అరెస్టులు-నిర్బంధాలు సంఘాల ఏర్పాటు, సమావేశాల నిర్వహణ,

భావప్రకటన స్వేచ్ఛలపై అడ్డంకులు మొదలైన మానవ హక్కుల ఉల్లంఘనలు అక్కడ సర్వసాధారణం. ఈ దుష్కృత్యాలకు పోలీసులు, సైన్యమే కాకుండా సాయుధులైన పౌర బృందాలు కూడా కారణమే.

తూర్పుతైమూర్‌లో స్వాతంత్ర్యం కోసం పోరాడే సంస్థ పేరు 'ఫ్రెటలిన్' 1976 నుంచీ ఆ సంస్థ రహస్య సంస్థ గానే కార్యకలాపాలు సాగిస్తోంది. ఎప్పుడైతే స్వాతంత్ర్యపోరాటం ఊపందుకుంటుందో, అప్పుడు సైన్య పౌరులపై దాడిని ఉధృతం చేస్తుంది. 1983లో ఫ్రెటలిన్ గెరిల్లాలు ఇండోనేషియన్ సైన్యం డివిజన్ పై దాడిచేసినప్పుడు, ప్రతీకారంగా సైన్య తిరిగి దాడిచేసి క్రారాస్‌లో దాదాపు 200 మంది గ్రామస్తులను చంపివేసింది. 1991లో నిరాయుధులైన ప్రదర్శన కారులపై సైన్య కాల్పులు జరిపి వందమందికిపైగా ప్రజలను చంపివేసింది. వీరిలో చాల మంది దెబ్బల బాధతో, కాల్పుల అనంతరం జరిపిన హింసతో చనిపోయారు. ఈ మారణ హోమంతో సంబంధంగల 9 మంది సైనికులపై, ఒక పోలీసుపై 1992లో విచారణ జరిపి ఎనిమిది నుంచి పద్దెనిమిది నెలల కాలం శిక్షలు విధించారు. ఇంతకూ వారిని శిక్షించింది వారి అవిధేయతకేకాని, కాల్పులు జరిపినందుకుకాదు. ఇటీవల 1995లో సైన్య ఆరుగురు పౌరులను 'డిలీకి' అవతల గల 'లిక్విక'లో తమపై జరిగిన దాడికి ప్రతీ కారంగా కాల్చిచంపింది.

ఈ చర్యలే కాకుండా సైన్యం ' నింజాస్ పేదా బు ఫోస్ ', అనే గంతలు ధరించి అకృత్యాలు జరిపే బృందాలను, ' పెముడా పెంకాశిల' అనే వినూత్న అధికార సంస్థను, ప్రోత్సహించి క్రియాశీల మద్దతు ఇస్తూంది. ఈ బృందాల్లోనివారు తూర్పుతైమూర్ స్వాతంత్ర్యానికి మద్దతు తెలిపుతున్నట్లు అనుమానిస్తున్న వారిపై దాడి చేయడాం, కిడ్నాపులు జరపడం చేస్తారు.

ఈ చర్యలే కాకుండా అధికార వ్యవస్థ దేశాంతర వాస కార్యక్రమాల్ని ప్రోత్సహించేది. దీని ప్రకారం వేలాది మంది ఇండోనేషియన్లు తూర్పుతైమూర్‌కు వలస వచ్చి త ద్వారా తైమూరేతరుల జనాభానిష్పత్తిని అధికం చేశారు. అలా వలస వచ్చిన వారిని, నిస్సారమైన భూములను అభివృద్ధి చేసే నిపుణులుగా చూపి, వారికి భూ బదలాయింపులు జరపడం జరుగుతూంది. నిజానికి వలస వచ్చిన రైతులకు ఆ పరిస్థితులపైగానీ, భూమి నిస్సారతపైగానీ అవగాహనే ఉండదు. ఈ విధంగా ఇచ్చిన భూములన్నీ 1975 ఆక్రమణ తరువాత తూర్పుతైమూరు ప్రజల నుంచి పునరావాసం పేరుతో బలవంతంగా ఖాళీ చేయించినవే. తరువాత వీటిని రాజ్యభూములుగా గుర్తించి అత్యధిక వేలం కోరిన వారికి అమ్మివేయడం జరిగింది.

అభివృద్ధి పేరుతో తూర్పుతైమూర్ ప్రజల భూమి, వనరులపై హక్కుల ఉల్లంఘన కొన సాగుతూంది. ఫలితంగా ఇండోనేషియా ప్రభుత్వం తైమూర్ సహజవనరులను అక్రమంగా వినియోగించు కుంటూంది. ప్రభుత్వం తైమూర్‌లోని చమురు వనరుల వెలికి తీతపై ఆస్ట్రేలియాతో ఒక ఒప్పందం పై సంతకాలు చేసింది. నిజానికి ప్రస్తుత అంతర్జాతీయ చట్టం ప్రకారం ప్రభుత్వానికి ఆహక్కులేదు. తైమూర్‌లోని మరో రెండు ప్రాజెక్టుల విషయంలో సైతం వచ్చిన అంతర్జాతీయ విమర్శలను పట్టించుకోడానికి ప్రభుత్వం ఇష్టపడలేదు. మొదటగా, అధ్యక్షుని కుమారునికి బంజరు భూమిగా, నిస్సారమైక భూమిగా ముద్రవేసి, బహుమతిగా, చెరకుతోటల పెంపకాన్ని అభివృద్ధి చేసేందుకు ఇచ్చిన 25,000 ట్రాక్‌ల భూమి వాస్తవంగా నిస్సారమైనదికాదు- బంజరూకాదు. ప్రజలు సాగుచేయడానికి అనుమతి నిరాకరించిన భూమి మాత్రమే ఇక రెండోది, తూర్పుతైమూర్ ప్రజలకు సమాన వాటాలను కేటాయించే విధంగా ప్రాచుర్యం కల్పించిన సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం. నిజానికి దీనిలో భాగస్వామ్యం పొందిన వారిలో ఎక్కువ మంది తూర్పుతైమూర్‌ను ఇండోనేషియాతో విలీనం చేయాలనే వాదనను బల పరిచేవారు, అధికార ఇండోనేషియా వ్యవస్థకు నమ్మకంగా విధేయులైన వారు వున్నారు. కాగా మిగిలిన షేర్లను సుహార్తో అంతరంగుకునికి ఒకరికి దక్కాయి.

ప్రజల రాజకీయ ఆకాంక్షల ప్రాతిపదికగా జరిగిన తూర్పుతైమూర్ స్వాతంత్ర్య ఉద్యమంపై ఇండోనేషియా ప్రభుత్వం నిరంకుశత్వం ప్రదర్శించింది. చివరకు ఉద్యమ ఉధృతికి, అంతర్జాతీయ సమాజపు ఒత్తిడికి తలవొగ్గి, ఇండోనేషియా నూతన అధ్యక్షుడు బి.జె. హబీబీ తూర్పుతైమూర్‌లో రిఫరెండం జరపడానికి అంగీకరించాడు. అయితే రిఫరెండం ప్రక్రియను నియంత్రించేలా తైమూరు వాసులను భయభ్రాంతులను చేయడం, వారి ఆస్తులను ధ్వంసంచేయడం, కిడ్నాప్‌లను ప్రోత్సహించడంతో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరిగింది. ఈ దశలో ఐక్యరాజ్యసమితి జోక్యం, ప్రత్యక్ష పర్యవేక్షణలతో ఆగస్టు 30,1999 జరిగిన ప్రజాభిప్రాయసేకరణలో దాదాపు 80 శాతం ప్రజలు స్వాతంత్ర్యాన్ని కోరుకున్నారు. అధికార మార్పిడి కూడా ప్రశాంతంగా జరగలేదు. ప్రస్తుతం తూర్పుతైమురన్‌ను ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో UNTAET (United Nations Transitional Administration for East Timor) ఉంచారు. అయినప్పటికీ పొరుగునగల ఇండోనేషియా అధికార దురహంకారం, సామ్రాజ్యవాద వైఖరితో తూర్పుతైమూర్ ప్రజలు అభద్రతాభావంతోనే ఉన్నారు. ఈ సందర్భంలో ప్రతి స్థాయిలోను మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. ఇంతలోనే ఇండోనేషియాలో కూడా ప్రజలు తిరుగుబాటు జరిపి వహీద్‌ను అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు.

## 4.3.4 కార్మికుల హక్కులు

ఇండోన్షియా సత్వర ఆర్థిక అభివృద్ధి, ఆదేశంలో కార్మికుల హక్కుల అణచివేత పునాదిగా జరిగింది. కార్మికుల హక్కులైన కనీస వేతనాలు, సంఘాల ఏర్పాటు, సమావేశ స్వేచ్ఛలను అణచివేయడం అక్కడ పరిపాటి నిజానికి ఈ హక్కుల పరిరక్షణకు చట్టాలున్నప్పటికీ, ఆచట్టాలు కారిక్మిక వివాదాల పరిష్కారంలో వివిధ మంత్రిత్వ శాఖలు, సైన్యం, పోలీసుల జోక్యానికి ఎంతో అవకాశం కల్పిస్తాయి. కార్మిక సంఘాల ఏర్పాటుపై ఎన్నో నిర్బంధాలు ఉన్నాయి. రాజ్యవ్యవస్థ ఒకే ఒక్క కార్మిక సంఘమైన "ఆల్ ఇండోనేషియన్ వర్కర్స్ ఫెడరేషన్" ను మాత్రామే గుర్తించింది. దాని పై కూడా ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. ఇటీవలనే 1993లో మార్సినా అనే మహిళ కార్మికురాలు తూర్పు జావాలోని సిదార్జో జిల్లాలోగల పోరోంగ్‌లోని పి.టి. కాటూర్‌పుత్ర గ్రామంలో గడియారాల తయారీ ఫ్యాక్టరీలో ఒక సమ్మెకు నాయకత్వం వహించినందుకు సమ్మె విరమణ అనంతరం హత్యకు గురైంది. 18 రాష్ట్రాల కార్మిక ప్రతినిధులతో "ప్రోస్పరస్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ ఇండోనేషియా" అనే ఒక జాతీయ స్వతంత్రకార్మిక సంఘం ఏర్పాటు ప్రయత్నాలను ప్రభుత్వం బాగా అడ్డుకుంది. ప్రబుత్వం ఆ సంఘాన్ని రిజిష్టర్ కానీయలేదు. దాని మొదటి జాతీయ కాంగ్రెస్‌ను నిషేదించింది. దానిలో పాల్గొన్న వారి పై బెదిరింపులు, విచారణలు, పీడింపులు ఎక్కువయ్యాయి.

ఇండోనేషియన్ ప్రభుత్వ కార్మిక సంఘాలపై అసహనానికి కారణం ఆసంఘాలు నిషేదిత ఇండోనేషియన్ కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నాయనే అనుమానం ఒకటి కాగా, కార్మిక చట్టాలు అమలు చేస్తే విదేశీ పెట్టుబడి తరలిపోతుందనే భయం ప్రత్యేకంగా పేర్కొనవచ్చు.

ఇండోనేషియన్ లీగల్ ఎయిడ్ ఫౌండేషన్ అనే స్వతంత్ర న్యాయవాదుల, న్యాయ నిపుణుల సంస్థ అభిప్రాయంలో ప్రభుత్వంలోని మానవ సామర్థ్య మంత్రి త్వశాఖ కార్మిక వివాదాల సంప్రదింపుల్లో రాజ్యతటస్థతను నిరోధించే విధంగా ఎన్నో నిబంధనలను జారీ చేసింది. వాటిలో ఎం. ఎం. ఆర్.నెం. పర్-03/ ఎం ఇ ఎన్ / 1993 స్వతంత్ర కార్మిక సంఘాలు రిజిష్టర్ కాకుండా అడ్డుకుంటుంది. ఎం.ఎం.ఆర్.నెం. కె.ఇ.పి.- 438/ ఎం ఇ ఎన్/ 1992 స్వతంత్ర కార్మిక సంఘాల ఏర్పాటులో మానవ సామర్థ్య మంత్రిత్వశాఖ, యాజమాన్యం, అధికార కార్మిక సంఘమైన ఎస్.పి.ఎస్. ఐల జోక్యానికి అవకాశం కల్పిస్తుంది. ఎం.ఎం. ఆర్ నెం. కె.ఇ.పి- 1108/

BRAOU

ఎం.ఇ.ఎన్/1986 సామూహిక లేఆఫ్‌ల విషయంలో కార్మిక సంఘాల పాత్రను తగ్గించి వేస్తుంది. అలాగే ఎం.ఎం. ఆర్. నెం. కె.ఇ.పి-04/86 వరుసగా అరు పనిదినాలు విధులకు హాజరు కాని (సమ్మె సందర్భంలోవలే) తొలగించే అధికారాన్ని కంపెనీలకు కల్పిస్తుంది. ఈ సందర్భంలో కార్మికుల గైర్హాజర్‌ను రాజీనామాగా పరిగణించ వచ్చు.

## 4.4 ముగింపు :

పైన జరిపిన చర్చ సందర్భంగా ఈ రెండు దేశాల్లోని మానవ హక్కుల ఉల్లంఘనలు విభిన్నమైనవి తెలుస్తుంది. జపాన్‌లోని పౌర సమాజం క్రియాశీలంగా ఉండి మానవ హక్కుల ఉల్లంఘన అంశాన్ని దేశీయంగా, అంతర్జాతీయంగా సమస్యగా తెలుపుతుంది. ఉల్లంఘనలు వివిధ రూపాల్లో ఉన్నప్పటికీ అనేక వర్గాలు అవగాహనతో ప్రభుత్వాన్ని జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హక్కుల అమలుకు వత్తిడి తెస్తాయి. అయితే రాజకీయ సిద్ధాంత ప్రాతి పదిక లేని ఇండోనేషియా పౌర సమాజాన్ని ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి పేరుతో పీడనలకు గురి చేసినా చైతన్యం ఆశించినంతగా లేదు. మానవ హక్కుల ఉల్లంఘనకు సాంఘిక రాజకీయనేపథ్యం కూడా ఒక ప్రధన కారణంగా నిలుస్తోంది. జపాన్‌లో క్రమానుగత సామాజిక వ్యవస్థ ఉల్లంఘనకు ప్రధన కారణమైనా ఉదారవాద రాజ్యాంగ పరిరక్షక నిబంధనలతో కొంతమేరకు పౌరసమాజం ఆవ్యవస్థకు సవాలు చేయగలిగింది. అయితే ఇండినేషియాకుగల వలసవాద నేపథ్యం, సర్వవ్యాప్తమైన సైనిక పాలన పాత్ర ఉల్లంఘనలకు కారణాలైనా సమాజం క్రియాశీలం కాకపోవడంతో రాజ్య అధికారయుత వాదానికి ఎదురు లేకుండా ఉంది. 1990 దశాబ్ది చివరలో ఇండోనేషియాలో వచ్చిన రాజకీయ మార్పులు ప్రజల్లో ఇప్పుడిప్పుడే మానవ హకుల పట్ల పెరుగుతున్న అవగాహనకు రాజకీయ చైతన్యానికి దర్పణం పడుతున్నాయి. ఈ రెండు దేశాల ఆధారంగా తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాల మానవ హక్కుల స్థాయిని అర్థం చేసుకోవచ్చు.

BRAOU

## 4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు వ్రాయండి.**

1. జపాన్‌లో బరకుమిన్, కొరియన్ల పై మానవ హక్కుల ఉల్లంఘనకుగల సాంఘిక, ఆర్థిక నేపధ్యాన్ని తెలపండి.
2. తూర్పుతైమూర్ ప్రధానంశంగా ఇండోనేషియాలో జరుగుతున్న మానవ హక్కుల పరిస్థితిని విశ్లేషించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు వ్రాయండి.**

1. జపాన్‌లో కొరియన్‌ల హక్కులస్థితిని వివరించండి.
2. ఆగ్నేయ ఆసియా దేశాల రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితుల నేపధ్యంలో మానవ హక్కుల స్థాయిని తెల్పండి.

# భాగం – 5 : కొరియాలో మానవ హక్కులు

**విషయక్రమం :**


5.0 ఉద్దేశం

5.1 పరిచయం

5.2 ఉత్తర కొరియా చారిత్రక నేపధ్యం

5.3 రాజ్య స్వభావం – రాజకీయ సంస్థలు

5.4 రహస్య సమాజం – సమాచార నిగూఢత

5.5 మానవ హక్కుల ఉల్లంఘన సందర్భాలు

5.5.1 ఆహార సమస్య

5.2 రాజకీయ స్వేచ్ఛ

5.3 పౌరస్వేచ్ఛలు

5.4 విదేశీయులపైదాడులు – అణుకార్యక్రమం

5.6 దక్షిణ కొరియా

5.6.1 వలసవాద చరిత్ర – మానవ హక్కులు

5.7 రాజ్యస్వభావం – రాజకీయ సంస్థలు

5.8 మానవ హక్కులకు పెరుగుతున్న ప్రాముఖ్యం

5.9 మానవ హక్కుల ఉల్లంఘన – సందర్భాలు

5.9.1 నల్ల చట్టాలు

5.9.2 కొరియా ఏకీకరణ వాదులు

5.9.3 కార్మికులు – హక్కులు

5.9.4 పౌర స్వేచ్ఛలు

5.9.5 రాజకీయ స్వేచ్ఛలు – పోలీసు పద్ధతులు

5.10 ముగింపు

5.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 5.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- ఉత్తర కొరియాలో మానవ హక్కుల ఉల్లంఘనల పరిస్థితి తెలుసుకుంటారు
- దక్షిణ కొరియాలో మానవ హక్కుల స్థితిగతులు వివరించగలుగుతారు.
- ఉత్తర కొరియాలో రాజకీయ స్వేచ్ఛకున్న అవరోధాలు గుర్తిస్తారు.

## 5.1 పరిచయం :

తూర్పు ఆసియాదేశలలో కొరియాకు ప్రత్యేక గుర్తింపువుంది. రెండో ప్రపంచ యుద్ధానంతారం జపాన్ వలసవాద పాలన నుంచి విముక్తి పొందిన కొరియా రెండు భాగలుగా విడదీయబడింది. ఉత్తర కొరియాను సామ్యవాద దేశాలు కమ్యూనిస్టు వ్యవస్థగా మారిస్తే, దక్షిణ కొరియాను పాశ్చాత్య దేశాలు రిపబ్లిక్‌గా మార్చాయి. ఈ రెండు కొరియాల మధ్య విభజన అనేక దుష్ఫలితాలకు దారితీయడమేగాక ఆయా దేశాల ప్రజల ప్రాథామిక హక్కులు హరించివేయబడ్డాయి. ఇందుకు సంబంధించిన అంశాలను చర్చించే ప్రయత్నమే ఈ భాగంలో చేయబడింది.

## 5.2 ఉత్తర కొరియా చారిత్రక నేపథ్యం :

డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ అఫ్ కొరియా (ఉత్తర కొరియా) తూర్పు ఆసియాలోని ఒక ద్వీప కల్ప దేశం. ఎంతో కాలం జపాన్ వలస వాద పాలనలో ఉండి, రెండో ప్రపంచ యుద్ధానంతరం 1948లో ఏర్పడింది. 38వ అక్షాంశరేఖ ఉత్తర, దక్షిణ కొరియాలను విడదీస్తుంది. దాదాపు 30 మిలియన్ల జనాభాతో వైవిధ్యాలు లేని ఏకీకృత జాతి ప్రజలు వున్నా, కొద్ది మంది చైనీయులు కూడా అల్పసంఖ్యాకులుగా ఉన్నారు. దాదాపు సంపూర్ణ అక్షరాస్య దేశం.

1950 సంవత్సరంలో ఉత్తర కొరియా, తన పొరుగు దేశమైన దక్షిణ కొరియాపై దాడి చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా అమెరికా జోక్యంతో వెనక్కి తగ్గింది. అయినప్పటికీ రెండు దేశాల మధ్య సంబంధాలు నిలిచిపోవడంతో కొన్ని వేల కుటుంబాలు, లక్షల మంది ప్రజలు బంధుత్వాలను తెంచుకుని జీవితాలు సాగిస్తున్నారు. ఒకే జాతి ప్రజలు ఈ కృత్రిమ విభజన, దాని అనంతరం రాజ్య కఠిన నిబంధనలతో తమవారికి దూరం కావడాన్ని అడ్డుకోడానికి అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రయాసపడుతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం 1948 సెప్టెంబర్‌లో అప్పటి సోవియట్ యునియన్, చైనా దేశాలు కిమ్ సంగ్ (Kim II Sung) నాయకత్వంలో రాజ్యం నెలకొల్పాయి. కీమ్‌సంగ్ ప్రయివేటు రంగాన్ని నిషేదించి, ఉత్తర కొరియాను సంపూర్ణాధికార రాజ్యంగా మార్చడానికి ప్రయత్నాలు చేశాడు తన పరిపాలన తత్త్వమైన జూఛ్ (Juche) అంటే మేము మాత్రమే అనే రాజకీయ సిద్ధాంతంతో ఆర్థిక స్వావలంబన మిషతో ప్రజల వ్యక్తిగత - పౌర జీవితాల్లో రాజ్యజోక్యానికి అవకాశం కల్పించాడు. ఈ సిద్ధాంత ఆధారంగా వ్యక్తిపూజకు, దానితో విభేదించిన వారి అణచివేతకు మార్గాలు వేశారు. ప్రజలను నియంత్రణ చేయడానికి రాజ్యన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుని ప్రచార సాధనాలను, వృత్తి ప్రదేశాలను, ప్రజల సామూహిక జీవన సంస్థలను వారిలో బానిసత్వం వృద్ధా చెందేలా మలచడానికి ప్రయత్నించాడు. అతని అనంతరం అతని కుమారుడు కిమ్ జాంగ్ (Kim Jung II) 1994లో నాయకుడైనా దాదాపు ఇవే పోకడలు కొనసాగుతున్నాయి.

BRAOU

## 5.3 రాజ్యస్వభావం – రాజకీయ సంస్థలు :

ఉత్తర కొరియా సంపూర్ణాధికార రాజ్యవ్యవస్థ పౌరుల హక్కులు రాజ్యపు వెసులు బాటు పై ఆధారపడి వుంటాయి. నిజానికి ప్రజలకు రాజ్యం కల్పించిన హక్కులు చాలా తక్కువ. కఠోరమైన నియమ నిబంధనలు, నియంత్రణలతో జీవించి ఈ ప్రజలకు తమ ప్రభుత్వాన్ని మార్చుకునే హక్కులేదు. ఎన్నికలయితే జరుగుతాయి కానీ అభ్యర్థులంతా ప్రధాన రాజకీయ పార్టీ కొరియన్ వర్కర్స్‌పార్టీ, ఇతర చిన్న పార్టీలవారే. కొరియన్ వర్కర్స్ పార్టీ ప్రభుత్వ ప్రధాన అంగాలన్నింటిపైనా ప్రభావం కలిగి ఉంటుంది. సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ (శాసన నిర్మాణ శాఖ) ప్రభుత్వ నిర్ణయాలకు చట్ట బద్ధతను చేకూరుస్తుంది. ప్రతి పక్ష పార్టీలు ఉండడం చట్టవ్యతిరేకం. ఫలితంగా వ్యవస్థీకృత అసంతృప్తి ఏ మాత్రం వున్నా అణచివేతలు, విస్తృత గూఢ చర్యలు, ఏకాంత వాస శిక్షలు మొదలైన విధానాలతో అదుపు చేస్తారు. కొరియన్ పీపుల్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజ్యాధి పతిగా ఉంటాడు. ఇతర ప్రభుత్వ అంగాలవలే, న్యాయశాఖను కూడా ప్రజలను నియంత్రణ చేయడానికి ఉపయోగించు కోవడం ఈ దేశంలో విశేషం క్రిమినల్ శాసనాల ప్రకారం కొన్ని స్థూలమైన రాజకీయ నేరాలు, రాజ్య విప్లవ వ్యతిరేక కార్యకలాపాలు చేసేవారిని ఏకపక్షంగా అరెస్ట్‌లు, నిర్బంధాలు, ఉరితీతలు చేయడానికి అవకాశం కల్పిస్తాయి.

అధికారులు ప్రజల నివాస ప్రాంతాలను నిరపేక్షంగా సోదా చేయడం, ఎలక్ట్రానిక్ గూఢ చర్యం జరపడం, ప్రజలను పర్యవేక్షించడానికి వ్యక్తుల పలలను నిర్మించడం ఈ దేశంలో పరిపాటి బడిలో పిల్లలు తమ ఇంటిలోని తల్లిదండ్రులపై విషయాలు నివేదించడాన్ని ప్రోత్సహిస్తారు. అధికార రేడియో, టెలివిజన్‌లు కూడా ఈ విషయంలో రాజ్యానికి ఉపకరిస్తాయి.

## 5.4 రహస్య సమాజం – సమాచార నిగూఢత :

ఉత్తర కొరియా రాజ్య వ్యవస్థ సమాచారాన్ని బహిర్గతం చేయదు. ప్రజల మానవ హక్కులు – స్వేచ్ఛలకు సంబంధించిన సమాచారం తెలుసుకోడానికి అంతర్జాతీయ సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. తెలుసుకున్న సమాచారం చాలా వరకు అనధికారమైనదే. ముఖ్యంగా హక్కులకు, స్వేచ్ఛలకు చెందిన సమాచారం నియంత్రణ అవుతుంది. కొన్ని సందర్భాల్లో అధికార కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ నివేదికలు మాత్రమే ఈ సమాచారానికి ప్రాతి పదికగా ఉంటాయి. దేశంలో జరిగే అరెస్ట్‌లు, నిర్బంధాలు, మరణశిక్షలు, రాజకీయ విచారణలు మొదలైన అంశాలపై సమాచారం దాదాపు మృగ్యం. ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమీషన్ వినతి మేరకు 1984లో అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడిక ననుసరించి ఉత్తర కొరియా తమ దేశంలోని మానవ హక్కుల పరిస్థితిపై ఒక నివేదిక సమర్పించింది. ఆ తరువాత వెల్లువగా వచ్చిన విమర్శల నేపథ్యంలో ఆ ఒడంబడిక నుంచి వైదొలుగుతానని హెచ్చరించింది. తిరిగి 1999లో ఆ ఒడంబడిక ప్రకారం రెండో నివేదికను అందజేస్తానని వాగ్దానం చేసినా ఇంత వరకూ సమాచారం బహిర్గతం కాలేదు.

BRAOU

## 5.5 మానవ హక్కుల ఉల్లంఘన సందర్భాలు :

ఉత్తర కొరియా ప్రధానంగా ఆహార సమస్య, విదేశీశత్రుత్వాలతో సతమతమౌతూ, ఈ సమస్యలతో దేశం నుంచి పారి పోయే వారిపట్ల, అ సంతృప్తివాదుల పట్ల, శ్రామిక వర్గాలు, యుద్ధ ఖైదీల పట్ల కఠిన తరమైన అంక్షలు విధించి మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు అంతర్జాతీయ సంస్థలు ( ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వాచ్ మొదలైనవి) పేర్కొంటున్నాయి. రక్షణ శాఖకు అధిక బడ్జెట్ పేరుతో అణువిధానం రూపొందించి ప్రజల కనీస అవసరాలకు తిలోద కాలిస్తున్నట్లు, ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుని ప్రజల జీవించే హక్కు హరించుకుపోతున్నట్లు సమాచారం ఉంది.

### 5.5.1 ఆహార సమస్య

ప్రపంచ ఆహార సంస్థ అభిప్రాయంలో ఉత్తర కొరియా కరువుకాటక పరిస్థితులు ఎదుర్కొంటూంది. ఐక్యరాజ్యసమితి అంచనాలో ఈ దేశాన్ని ఆహార సమస్య నుంచి తప్పించడానికి 95 మిలియన్ డాలర్ల అత్యవసర సహాయం కావాలి. దాదాపు రెండు మిలియన్ల ప్రజలు ఆకలి ప్రమాదంలో ఉన్నారు. అంతర్జాతీయ బాలల నిధి, యూరోపియన్ యూనియన్, ప్రపంచ ఆహార సంస్థ సంయుక్తంగా ఏడు సంవత్సరాలలోపు బాలల పోషణ పై జరిపిన సర్వేలో దాదాపు 16శాతం మంది బాలలు పోషకాహార లోపంతోను, 62 శాతం బాలలు అత్యల్ప శరీర భారంతోను బాధపడుతున్నారు. సమాజంలోని ఇతర వర్గాల పై సమాచారం లేకున్నా, యువకులు, పెద్దలు కూడా ఆహార సమస్యను తీవ్ర స్థాయిలో ఎదుర్కొంటున్నారు. మరణాల రేటు అధికమైంది. 1995 నుంచి ఈ రేటు క్రమంగా పెరుగుతూ వస్తూందని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ప్రజల జీవన పరిస్థితులను మెరుగు పరచడానికి, కనీస అవసరాలను అందించడానికి తద్వారా జీవించే హక్కును గౌరవించడానికి వ్యవస్థ చేసిన ప్రయత్నాలు మృగ్యం.

BRAOU

### 5.5.2 రాజకీయ స్వేచ్ఛ

ఉత్తర కొరియా క్రిమినల్ చట్టాలు కొన్ని స్థూలమైన రాజకీయ స్వేచ్ఛలను నేరాలుగా పరిగణిస్తాయి. వీటిలో ప్రభుత్వాన్ని విమర్శించడం, బిబిసి లాంటి విదేశీ ప్రసార మాధ్యమాలను వినడం, దేశం విడిచి వెళ్ళే ప్రయత్నాలు చేయడం మొదలైనవి ఉన్నాయి. ప్రభుత్వ ఆర్థిక విధానాలను విమర్శిస్తూ 1989లో గోడలపై పోస్టర్లు అంటిస్తున్న 40మంది ప్యాంగ్ యాంగ్ యూనివర్సిటీకి, కిమ్ ఛీక్ యూని వర్సిటీకి చెందిన విద్యార్థులు - అధ్యాపకులను నిర్బంధించినట్లు సమాచారం ఉంది. 1967 - 1977 సంవత్సరాల మధ్య నలుగురు ప్రముఖ రాజకీయ నాయకులు పాక్ కుమ్ ఛోల్, కిమ్ ఛాంగ్ బంగ్ రై ఛాంగ్ షిక్, లీయంగ్‌యూ రాజకీయ నిర్బంధంలో వున్నారు. వేలాది మంది సామాన్య ప్రజలు కూడా రాజకీయ నేరాల పేరుతో జైళ్ళలో మగ్గుతున్నారు. విదేశాల్లో నివసించే మాజీ ఖైదీల కథనం ప్రకారం రాజకీయ అసంతృప్తి వాదులుగా అను మానించిన వారిని శ్రామిక సంస్కరణ శిబిరాలకు తరలించి న్యాయ విచారణ లేకుండా కానీ లేదా విచారించినా నిర్దోషిత్వాన్ని ఒప్పు కోక కానీ నిర్బంధంలో ఉంచుతారు. వీరిని కొన్ని సందర్భాల్లో దేశంలోని అజ్ఞాత ప్రదేశాల్లో ఈ శిబిరాల్లో ఉంచుతారు. ఈ విధమైన శిబిరాలు దేశంలో దాదాపు 8 వరకూ ఉండ వచ్చుననీ, శారివాన్ యోడోక్ మొదలైన ప్రాంతాల్లో ఉన్నాయనీ, దాదాపు లక్ష మంది రాజకీయ నేరాల పేరుతో ఈ శిబిరాల్లో మగ్గుతున్నారని ఆమ్నెస్టీ పేర్కొంది. ఇక

జైళ్ళు-శిక్షల విషయాని కొస్తే, జైళ్ళ పరిస్థితి పాశమికమనీ, వేధింపులు నిత్యమనీ, కొన్ని సందర్భాల్లో సామూహిక మరణశిక్షలు ఉంటాయనీ పేర్కొంటారు. వ్యక్తులను కుటుంబాలను రాజకీయ నేరారోపణలతో ..శ్రమద్వారా పునర్విద్య.. (Re-educatio through labour) శ్రమద్వారా సంస్కరణ (Reformation through labour) పేరుతో శ్రామిక శిబిరాలకు తరలించి సంవత్సరాల పాటు నిర్బంధాలకు గురిచేస్తారు.

ఉత్తర కొరియా రాజ్య వ్యవస్థ ఆచరించే పాశవిక నిర్బంధాలకు, కఠోర నిబంధనలకు, నియంత్రణలకు గురికాలేక కొద్ది మంది దేశం విడిచి పోయే ప్రయత్నం చేస్తారు. సాధారణంగా వీరు చైనా, జపాన్, దక్షిణ కొరియాలలో చొరబాటుకు ప్రయత్నిస్తారు. అలాంటి దేశం విడిచి పోయే ప్రయత్నాన్ని ప్రభుత్వం చట్ట వ్యతిరేకం చేసి, ఆ ప్రయత్నంలో పట్టు బడిన వారిని నిరవధికంగా జైళ్ళలో ఉంచుతారు. ముఖ్యంగా ఆహార సమస్య ఎక్కువగా ఉండడంతో సరిహద్దు ప్రాంతాల్లో ఈ ప్రయత్నాలు పరిపాటి ఉత్తర కొరియా భద్రతా దళాలు కొద్ది మందిని పట్టుకోగా, చైనా భద్రతా దళాలు కొంత మందిని అక్రమ చొరబాటు నుంచి అడ్డుకుని తిరిగి ఆదేశానికి అప్పగిస్తారు. అలాంటి అన్ని సందర్భాలకు గురిచేయడం గానీ జరుగుతూ మానవ హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతూంది. ఇలాంటి వారిని చలికాలంలో మైనస్ 25 డిగ్రీల సెంటీగ్రేడ్ వాతావరణంలో సామూహికంగా జైలు శిబిరాల్లో ఉంచుతుంది. 1984 ఉత్తర కొరియా సైనిక సార్జెంట్ ఒక నావలో దాగి జపాన్ చేరుకుని, ఆశ్రయం కోరాడు. జపాన్ సైనిక పరిశోధన పత్రిక గుంజి కెంక్యూ (Gunji Kenkyu) జరిపిన ఇంటర్వ్యూలో ఆసార్జెంట్ ఉత్తర కొరియాలో దొంగతనం, రేప్, హత్య, రాజద్రోహం నేరాలన్నింటికీ బహిరంగ మరణశిక్షలు ఉంటాయని పేర్కొన్నాడు. హామ్‌క్యుంగ్ నామ్‌డో (Hamkyung-namdo) లోని ఉమ్ డోక్ మైన్ (Um Dok mine) లో హింసాత్మక ఉద్రిక్తతలు సృష్టించినందుకు 1982 నవంబరులో ఇద్దరు వ్యక్తులను బహిరంగంగా కాల్చిచంపాలని తీర్పు నిచ్చారని పేర్కొన్నాడు. ఇలాంటి బహిరంగ మరణ శిక్షలు హానియంగ్ గన్, (Haeneung -gun), హామ్‌క్యూంగ్ నామ్‌డో (HamKyung-namdo) లలో కూడా అదే సంవత్సరం జరిగినట్లు అనధి కారికంగా తెలుస్తూంది.

## 5.5.3 పౌర స్వేచ్ఛలు

ఇటీవలి కాలం వరకూ ఉత్తర కొరియాలో దేశంలోపల ప్రజలకు స్వేచ్ఛగా సంచరించే హక్కు ఉండేది కాదు. దేశ బాధ్యతలు, వివాహాలు, మరణాలు మొదలైన వాటికి సైతం ప్రజలు వేరే ప్రాంతాన్ని సందర్శించడానికి అనుమతి అవసరమయ్యేది. రాజకీయంగా అనుమానితులుగా ఉన్న పౌరుల నివాసాలు ప్రభుత్వం బలవంతంగా మార్చేది. మతాన్ని మొదటినుంచీ, అధికారికంగా నిరుత్సాహ పరిచినప్పటికీ కొద్దిమంది బౌద్ధులు, క్రిస్టియన్లు తమ మతాన్ని ఆచరిస్తారు. ఈ రెండు మతాలకు మాత్రమే రాజ్య అనుమతి ఉంది. అలాగే శ్రామిక వర్గాలకు ప్రాధాన్యంలేదు. జనరల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ కొరియా (General Federation of Trade Unions of Korea) మాత్రమే ఏకైక, చట్టబద్ధ శ్రామిక సంఘం. దాని అనుబంధ యూనిట్లన్నీ శ్రామికుల పర్యవేక్షణకు ఉంటాయి. సమ్మెలు, సామూహిక బేరసారాలు, ఇతర ముఖ్య కార్మిక సంఘ కార్యకలాపాలను రాజ్యం అనుమతించదు. సరిహద్దు ప్రాంతాల్లో స్త్రీలు, బాలికల అక్రమ వ్యాపారం సాగుతున్నట్లుగా సమాచారం ఉన్నట్లు అమ్నెష్టి తెలిపింది.

## 5.5.4 విదేశీయులపై దాడులు – అణుకార్యక్రమం

ఉత్తర కొరియా తన పొరుగు దేశాలైన జపాన్, దక్షిణ కొరియా ప్రజలపై తన దేశంలోను, బయట దాడులు చేసినట్లు సమాచారం ఉంది. వీరిని ఆయాదేశాల రహస్య ఏజెంట్లుగా గుర్తించి, వారిని నిర్బంధించడం,

BRAOU

పీడనలకు గురిచేయడం చేస్తుంది. 1988లో జపాన్‌కు చెందిన ఇద్దరు సముద్ర నావికులను ఇసాముబెనికో, యోషియో కురియూరా న్యాయ విచారణ జరుపకుండా గూఢచర్యం ఆరోపణ పై నిర్బందించింది. 1984 అక్టోబర్ 27న కొరియన్‌సెంట్రల్‌వార్తా ఏజెన్సీ కథనం ప్రకారం ఒక దక్షిణ కొరియా వ్యక్తిని గూఢచర్యం ఆరోపణలపై నిర్బంధించింది. 1983లో రంగూన్‌లో (బర్మా) ఇద్దరు ఉత్తరకొరియా సైనిక అధికారులు అని చెప్పుకున్న వ్యక్తులు బాంబు పేల్చి దక్షిణ కొరియాకు చెందిన నలుగురు కాబినెట్ మంత్రులతో సహా 17 మందిని ప్రాణాలు తీశారు. 1987 లో ఉత్తర కొరియా ఏజెంట్‌నని చెప్పుకున్న ఒక మహిళ 115 మంది ప్రయాణీకులు గల కొరియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో బాంబు పెట్టింది. 1988లో అమెరికా ఉత్తర కొరియాను ఉగ్రవాదం ప్రోత్సహించే రాజ్యాలలో ఒకటిగా జాబతాలో చేర్చింది. జపాన్ కొన్ని సంవత్సరాలు విమానాల రాక పోకలపై నిషేదం విధించింది.

ఉత్తర కొరియా ప్రపంచంలో అత్యధిక సైనిక బలగాలు గల రాజ్యాల్లో ఒకటి. వీటి నిర్వహణ కోసం రక్షణ శాఖ బడ్జెట్ పెంచుతూ ఉంటుంది. దీంతో మానవ జీవన స్థాయి అభివృద్ధికి అవసరమయ్యే ఆహారంలాంటి వాటిని ఉపేక్షించడంతో ఆర్థిక సంక్షోభం వచ్చింది. దీనికితోడు ఉత్తర కొరియా మొదటగా అణువ్యాప్తి నిరోధక Iä÷²ÉÜ ~Ï(NPT) సంతకాలుచేసి 1993లో తిరిగి ఒప్పందం నుంచి వైదొలగింది. ప్లూటోనియం ప్రోసెసింగ్ ప్రారంభించి, ప్రజల ఆహారసమస్య ఎక్కువ కావడంతో అమెరికా, కెనడా, యూరోపియన్ యూనియన్ దేశాలతో చర్చించి అణుకార్యక్రమాన్ని ఆపింది.

ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులను ఉత్తర కొరియా 1994 నుంచి ఆకళింపు చేసుకుంటూంది. సరళీకరణ చేసి, హక్కుల పై నిషేదాలను కూడా సడలిస్తూంది. 1990లో తిరిగి దక్షిణ కొరియాతో చర్చలు ప్రారంభించింది. 1999లో దాదాపు 80,000 మంది దక్షిణ కొరియా ప్రజల ఉత్తర కొరియా సందర్శించడానికి అనుమతించింది. అంతర్జాతీయ సమాజం వత్తిడి తన రాజ్యంలో ప్రజా అసంతృప్తి వెల్లువకు తలవొగ్గి మానవ హక్కుల్ని కూడా ఇటీవలె గౌరవిస్తూంది.

BRAOU

## 5.6 దక్షిణ కొరియా :

దక్షిణ కొరియా 1948వ సంవత్సరంలో జపాన్ వలస వాద పాలన నుంచి విముక్తి పొందింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం 38 డిగ్రీల సమాంతర అక్షాంశరేఖ సరిహద్దుగా ఒక స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. రష్యా, చైనా వంటి సామ్యవాద దేశాలు ఉత్తర కొరియాను కమ్యూనిస్ట్ వ్యవస్థగా మారిస్తే, పాశ్చాత్యదేశాల సాయంతో దక్షిణ కొరియా రిపబ్లిక్‌గా మారింది. దక్షిణ కొరియా జనాభాలో 37శాతం బౌద్ధులు, 26శాతం ప్రొటెస్టెంట్ క్రైస్తవులు, 5 శాతం రోమన్ కాథలిక్‌లు, 4 శాతం చైనా కన్ఫ్యూషియస్ భావాలవారు తదితరులు ఉన్నారు. 1950 సం..లో దక్షిణ కొరియాను ఉత్తర కొరియా ఆక్రమించే ప్రయత్నం చేసినప్పుడు ఐక్యరాజ్యసమితి ముసుగులో అమెరికా జోక్యం చేసుకుని దాన్ని విఫలం చేసింది. ఈ సందర్భంలో కొరియాసైన్యం చాలా వరకు ఉత్తర కొరియా చేతిలోకి వెళ్ళిపోవడంతో దక్షిణ కొరియా ఇతర దేశాలపై ఆధారపడక తప్పలేదు. అందువల్ల ఈ నాటికీ దక్షిణ కొరియా పొరుగురాజ్యం బూచి చూపి మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడీ కూడా న్యాయబద్ధత చేసుకుంటూంది.

### 5.6.1 వలసవాద చరిత్ర – మానవ హక్కులు

1910వ సంవత్సరంలో జపాన్, కొరియాను తనలో విలీనం చేసుకుని వలసవాద పాలన ప్రారంభించింది. టోక్యో కేంద్రంగా పాశవికతతో కొరియన్ భాషను, సంస్కృతిని తన సొంత సంస్కృతితో కబళించడానికి

ప్రయత్నించింది. వలసవాద పాలనలో ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధ కాలంలో దాదాపు ఒక లక్షమంది కొరియన్ మహిళలను సెక్స్‌బానిసలుగా వాడుకుంది. దీనికి ఇటీవలనే 1993లో జపాన్ ప్రధానమంత్రి దక్షిణ కొరియాకు చారిత్రక ప్రాయశ్చిత్తంగా క్షమాపణలు చెప్పుకున్నాడు.

## 5.7 రాజ్య స్వభావం–రాజకీయ సంస్థలు :

స్వతంత్ర రాజ్యంగా ఏర్పడిన తొలి దశాబ్దాల్లో దక్షిణ కొరియా ప్రజలు అధికారయుత వ్యవస్థల చేతిలో మానవ హక్కులను కోల్పోయినా, 1987 నుంచి ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. 1988లో నూతన రాజ్యాంగాన్ని ఆవిష్కరించారు. దాని ప్రకారం అధ్యక్షుని పదవీకాలం 5 సం..రాలుగాను, జాతీయ అసెంబ్లీని రద్దు చేసే అధికారం అధ్యక్షునికి లేకుండాను, స్వతంత్ర న్యాయ వ్యవస్థతో అధికార విభజన జరిగింది. మొదటి పన్నెండు సంవత్సరాలు సిన్‌మాన్ ర్హీ (Syngman Rhee) అణచివేత పద్ధతులతో పాలించాడు. దీనికి వ్యతిరేక్యంగా 1960లో వచ్చిన ఉద్యమంతో వైదొలిగాడు. తదనంతరం జరిగిన సైనిక తిరుగుబాటు ద్వారా జనరల్ పార్క్ ఛంగ్ హీ (General Park Chung Hee) రెండో అధికార యుత పాలన పరంపర కొనసాగించాడు. ఈ అణచివేత, మానవ హక్కుల ఉల్లంఘన కొనసాగి తారస్థాయిలో 1979లో హత్యకు గురయ్యాడు. దానితో జనరల్ ఛన్ డూ హాన్ (General Chum Doo Hwan) అధికారంలోకి వచ్చాడు. తిరిగి 1987 విద్యార్థుల నాయకత్వంలో వచ్చిన హింసాయుత ప్రదర్శనలు, జవాబుగా రాజ్యం పాశవికంగా చేసిన మానవ హక్కులపై ఎదురు దాడులతో జనరల్ రో టే వూ (General Roh Tae Woo) అధికారంలోకి వచ్చాడు. ఇక్కడ నుంచి ప్రజాస్వామ్యం బీజాలు బాగానాటు కున్నాయి. ఎన్నికల ద్వారా పదవిని చేపట్టి 1988 డిసెంబర్ 25 చేసిన ప్రసంగంలో, ..ఆర్థిక అభివృద్ధి పేరుతో అణచబడిన స్వేచ్ఛలు, మానవ హక్కులకు ఈ రోజు విముక్తి లభించింది. జాతీయ భద్రత పేరుతో జరుగుతున పీడనలు, పాశవికబలానికి ఈ రోజే చివరిరోజు.. అని పేర్కొని ప్రజాస్వామ్యంపై ఆశలుచిగురింపజేశాడు.

అదే సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన జాతీయ అసెంబ్లీ ఎన్నికల తరువాత అంతకు ముందు ప్రభుత్వాలపై గల అవినీతి, మానవహక్కుల ఉల్లంఘనలపై నిష్పాక్షిక విచారణ జరిపింది. దీనిలో క్వాంగ్జు సంఘటన (Kwangju) మానవ హక్కులకు సంబంధించి ప్రస్తావించాలి. 1980 మే నెలలో మిలటరీ పాలనకు వ్యతిరేకంగా నాలుగు రోజుల పాటు కాంగ్జు పట్టణంలో జరిగిన ప్రదర్శనలలో సైన్యం పౌరులను కాల్చి చంపడమే కాక, (అధికార అంచనాల్లో 170 మందిని చంపడం) ఎంతో మందిని దారుణంగా హింసించింది. సజీవులైన వారిని రాజకీయ ఖైదీలుగా మార్చి పరిశుద్ధత శిబిరాలకు (Purification Camps) ఈడ్చి హింసించినట్లు ఆరోపణలున్నాయి. 1988లో జాతీయ అసెంబ్లీ దీని పై విచారణ జరిపింది.

1922లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో కిమ్ యంగ్ శామ్ (Kim Young Sam) ఎన్నికయ్యాడు. దేశానికి మొట్టమొదటి సైనికేతర పౌర అధ్యక్షునిగా శామ్‌ని పేర్కొన వచ్చు. 1997 కిమ్ దే జంగ్ ఎన్నికయ్యారు.

దక్షిణ కొరియన్ న్యాయశాఖ స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. 1996లో ఒక అవినీతి కుంభ కోణంలో మాజీ అధ్యక్షుడైన ఛన్‌డూహాన్‌కు మరణశిక్ష, మరో మాజీ అధ్యక్షుడు రోటెవూకు 22సం..రాల జైలు శిక్ష విధించింది.

1997లో అధ్యక్షుడు కిమ్ చిన్నకుమారునికి లంచాలు, పన్ను ఎగవేత నేరాలపై మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

మానవ హక్కులకు సంబంధించి రాజకీయ సంస్థలైన శాసన నిర్మాణ శాఖ, కార్యనిర్వాహక వర్గం,

BRAOU

న్యాయశాఖ దేనికదే స్వతంత్రంగా వ్యవహరిస్తాయి.

అలాగే కొరియా సమాజంలో మానవ హక్కుల బృందాలు కూడా బహిరంగంగా కార్యకలాపాలు సాగించే అవకాశం ఉంది. మెరుగు పడిన మానవ హక్కుల పరిస్థితి, పొరుగు దేశ మైన ఉత్తర కొరియాతో సంబంధాలు పునరుద్ధరించడం మొదలైన అంశాలపై దక్షిణ కొరియా అధ్యక్షునికి 2000సం.. రపు నోబుల్ శాంతి పురస్కారం లభించింది.

## 5.8 మానవ హక్కులకు పెరుగుతున్న ప్రాముఖ్యం :

ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న మానవ హక్కుల ఆచరణ సంస్కృతికి అనుగుణంగా దక్షిణ కొరియాలో కూడా వీటి ప్రాముఖ్యం ఎక్కువైంది. 1999 అక్టోబర్‌లో దక్షిణ కొరియా ప్రభుత్వం మానవ హక్కుల పరిస్థితిపై అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడిక నిబంధనలకు అనుగుణంగా ఒక నివేదికను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిటీకి సమర్పించింది. నిజానికి నిర్ణీత కాలవ్యవధుల్లో సమర్పించవలసిన నివేదికల్లో ఇది రెండోది అంతేకాక కొన్ని సందర్భాల్లో 80 దశకం ఆఖరు భాగం నుంచి దేశంలో జరిగే రాజకీయ నేరారోపణలు, అణచివేతల పై అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ విచారణలపై ప్రభుత్వం స్పందించి జవాబు యిస్తుంది. 1987 నుంచి ఎంతో మంది రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. 1989లో అప్పటి అధ్యక్షుడు కనీసం ఆరు సందర్భాల్లో కొన్ని వందల మందిని విడుదల చేశాడు. అలాగే 1992లో కిమ్ యంగ్ శామ్ దాదాపు 42వేల మందికి క్షమాభిక్ష ప్రసాదించాడు. అది అలాగే కొనసాగి 1997లో అధ్యక్షుడు కిమ్ డె జంగ్ ఎంతో మందిని నేరాలనుంచి, జైలు శిక్ష నుంచి విముక్తి చేశాడు.

కిమ్ భద్రతా దళాలకు గల అంతర్గత గూఢ చర్యం అధికాలను తొలగించి, మిలటరీ శ్రేణుల్ని పునర్ నిర్మించి, అవినీతి వ్యతిరేక ప్రతినపూనాడు. మానవహక్కుల్ని ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం 1988 నుంచి ప్రారంభమైంది మ్యాంగ్ నోయోల్ అనే 16సం..రాల బాలుని ఒక హత్యకేసు వివరాల కోసం హింసించి నందుకు ముగ్గురు పోలీసు అధికారులకు కోర్టు 6సం..రాల వరకు జైలు శిక్ష విధించింది. అంతకు రెండు సంవత్సరాల ముందు ఒక పోలీసు అధికారి ఒక మహిళా నేరస్తురాలిని లైంగికవేధింపులకు గురిచేసినందుకు 1988 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు 5సం..రాల జైలు శిక్ష విధించింది. అమ్నెస్టీ నివేదికల ప్రకారం మరణశిక్షల సంఖ్యగణనీయంగా తగ్గింది.

## 5.9 మానవ హక్కుల ఉల్లంఘన–సందర్భాలు :

మానవ హక్కులపై ఒక ప్రక్క ప్రాముఖ్యం పెరుతున్నప్పటికీ, ఉల్లంఘన సందర్భాలు కూడా దక్షిణ కొరియాలో ప్రస్ఫుటంగానే ఉన్నాయి. దక్షిణ కొరియాలో మానవ హక్కులను హరించి వేసే నల్ల చట్టాలు ఇంకా అమల్లో వున్నాయి. నిజానికి ఎన్నో ప్రభుత్వాలు ఈ చట్టాల రద్దు లేదా సవరణలకు హామీలిచ్చినా, అవి నిలబెట్టు కోలేదు. ముఖ్యంగా జాతీయ భద్రత చట్టం, భద్రత గూఢ చర్య చట్టం రాజకీయ సంస్థల ప్రతిపత్తిని, మానవ హక్కుల విలువను కట్టి పడేస్తున్నాయి. ఇక రెండోది దక్షిణ కొరియన్లు కొరియా ఏకీకరణను కోరుకుంటున్నారు. ఈ ఏకీకరణసానుభూతి పరులను కమ్యూనిస్టులుగా, ఉత్తరకొరియా ఏ జెంట్లుగా చిత్రీకరించి వారిని హింసకు గురిచేయడాం జరుగుతుంది. ఇక మూడోది శ్రామిక వర్గం హక్కుల సమస్య ప్రపంచంలో పారిశ్రామిక అభివృద్ధిలో మొదటి పదిస్థానాల్లో దక్షిణ కొరియా వుంది. అందువల్ల ఈ పరిశ్రమల్లోని కార్మిక వర్గం అశాంతికి గురవుతుంది.



BRAOU

ఇటీవలి కాలంలో వారి హక్కులు సమస్యగా మారాయి. ఇక ఈ సందర్భాలను వాటిద్వారా ఉత్పన్నమయ్యే మానవ హక్కుల ఉల్లంఘనను విడివిడిగా పరిశీలిద్దాం.

## 5.9.1 నల్ల చట్టాలు

దక్షిణ కొరియాలో రాజ్యాంగం, రాజ్యస్వభావం మారినా మానవ హక్కులను నిరోధించే నల్లచట్టాలు ఇంకా చెలామణిలోనే ఉన్నాయి. ఈ చట్టాల ముసుగులో రాజకీయ అసంతృప్తి వాదులను, కార్మిక నాయకులను, కొరియా ఏకీ కరణ వాదులను ఇంకా నిర్బంధిస్తూనే ఉన్నారు. జాతీయ భద్రత చట్టం (National Security Law), భద్రతా గూఢచార్య చట్టం (Law on Assemblies and Demonstrations), పౌర భద్రత చట్టం (Public Security Law) మొదలైనవి కొన్ని మాత్రమే.

వీటిలో ఎక్కువగా జాతీయ భద్రతా చట్టం (NSL) ను ఉపయోగిస్తారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంటుంది. ఈ చట్టంలో ఆర్టికల్ 3 ప్రకారం..రాజ్యానికి వ్యతిరేకమైన సంస్థలను నిర్మించడం గానీ, వాటిలో సభ్యత్వ ముండడంగానీ నేరం.. అవుతుంది. అలాగే ఆర్టికల్ 7 ప్రకారం..రాజ్యవ్యతిరేక సంస్థలను ప్రస్తుతించినా, ప్రోత్సహించినా, మద్దతు తెలిపినా నేరం.. అవుతుంది. అదే నిబంధనలో శత్రువులకు సహాయం చేసే కార్యకలాపాలు నేరం అవుతాయి. ఇక భద్రత గూఢ చర్యం కొనసాగించవచ్చు. అలాగే వారు విడుదలైన అనంతరం తమకదలికలపై స్థానిక పోలీసులకు నిరంతరం సమాచారం అందిచాల్సి ఉంటుంది. ఒకనేరం ఫలితంగా శిక్ష అనుభవించిన ఖైదీలు అదేనేరాన్ని తిరిగి చేస్తారన్న అనుమానం వచ్చినప్పుడు న్యాయ మంత్రిత్వ శాఖ వారిని పౌరభద్రత చట్టం ప్రకారం (నివారక-నిర్బంధాన్ని) కొనసాగించవచ్చు. నిజానికి ఈ చట్టాల ముసుగులో ప్రభుత్వ సామాజిక, ఆర్థిక విధానాలు విమర్శించేవారిని నిర్బందిస్తారని ప్రభుత్వ సామాజిక, ఆర్థిక విధానాలు విమర్శించేవారిని నిర్బందిస్తారని ప్రతీతి. 1999సం.. అఖరు నాటికి దాదాపు 82మంది (62మంది విద్యార్థులు, 15మంది కార్మిక నాయకులు) అరెస్టు అయ్యారు. ఇదే చట్టాన్ని కొరియా ఏకీకరణ సానుభూతిపరలపై కూడా ప్రయోగిస్తారు. ఈ చట్టం కింద హోంగ్ క్యోసన్ (Hong Kyo Sun) అనే ఛకగాల్ పీ (Cheakgalpee) ప్రచురణ సంస్థ ప్రతినిధిని కమ్యూనిస్ట్ సాహిత్యం విక్రయిస్తున్న నేరంపై ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. అలాగే భద్రతా గూఢచర్యం చట్టం ముసుగులో మాజీ ఖైదీలను, వారికార్యకలాపాలను నియంత్రణ చేయడం, సమావేశాలు-ప్రదర్శనల్లో పాల్గొన కుండా చేయడం, ఇతర మాజీ ఖైదీలను వారు తరచు కలుసుకోకుండా చేయడం, వారి కార్యకలాపాలపై వారి ఇరుగుపొరుగు వారి నుంచి-సహోద్యోగుల నుంచి సమాచారం కోరడం మొదలైనవి ఉన్నాయి. చాలా సందర్భాల్లో ఈ చర్యలు వారి స్వేచ్ఛ-సంచారహక్కులకు విఘాతం కలిగిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. 1999సం..లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిటీ ఈ చట్టం కొనసాగింపు పై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. పౌరభద్రతా చట్టం కింద ఎటువంటి నేరారోపణలు లేకుండా ఆరునుంచి పదమూడు సంవత్సరాలు దాదాపు 50మంది ఎదుర్కొన్నారు. ఈ చట్టాలన్నింటిలో అరెస్టు అయిన వారి నుంచి నేరం ఒప్పు కునే విధంగా హింసించడం, విచారణ సందర్భాల్లో న్యాయవాదులకు అవకాశం లేకపోవడం పరిపాటి.

## 5.9.2 కొరియా ఏకీకరణ వాదులు

1948లో ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య కృత్రిమ విభజన జరిగినప్పటి నుంచీ లక్షలాది మంది ప్రజలు, వేలాది కుటుంబాలు బంధుత్వాలు తెంచుకోవల్సి వచ్చింది. దీనితో కొరియా ఏకీకరణను అన్ని తరాల వారు, రెండు కొరియాల్లోనూ అభిలషిస్తూనే ఉన్నారు. దీన్ని అడ్డుకునేందుకు ఉత్తర, దక్షిణ కొరియా రాజ్యవ్యవస్థలు

BRAOU

రెండూ ప్రజలపై ఎన్నో నియంత్రణలు చేస్తూనే ఉన్నాయి. 1996లో ఉత్తర కొరియా పట్ల సానుభూతి చూపే వారిని విచారించే నిమిత్తం జాతీయ భద్రత ప్రణాళిక ఏజెన్సీ పేరుతో ఒక భద్రతా వ్యవస్థను పునరుద్ధరించారు. దీనిలో భాగంగా జాతీయ పోలీసు శాఖలో కమ్యూనిస్ట్ వ్యతిరేక విభాగం పేరుతో ఒక ప్రతేక భద్రత దళాన్ని ఏర్పరచారు. ఈ దళం ఉత్తర కొరియా, కమ్యూనిస్టు, ఏకీకరణ, సానుభూతి పరులపై విచారణ జరిపి అరెస్టులు చేస్తూంది. చిత్ర మేమంటే, ఈ సమస్య రాజ్య స్వభావం 1988లో మారినా, ఇప్పటికీ కొనసాగుతూంది. ఈ అరెస్టులలో ప్రముఖమైనవిగా కొన్ని పేర్కొన వచ్చు. 1996లో ఏకీకరణ కోసం గొప్ప విద్యార్థి ప్రదర్శన పై దాడి చేసి దాదాపు 190మంది పై నేరాలు మోపి, జైలు శిక్ష విధించారు. ఈ ప్రదర్శనల పరంపర కొన సాగుతూనే ఉంది. చాలా సందర్భాల్లో భద్రతా దళాల జోక్యంతో ఇవి హింసాత్మకంగా కూడా మారతాయి. 1983లో ప్రొఫెసర్ కాంగ్ మాన్ కిల్, ప్రొఫెసర్ లీ యాంగ్ హీ, రివరెండ్ ఛో సీంగ్ హ్యూక్‌లు అరెస్టయ్యారు. కొరియా ఏకీకరణపై ఒక ప్రాజెక్టులో పరిశోధన చేసినందుకు వీరు జైలు పాలయ్యారు. వీరేకాక కొరియా యుద్ధ సమయంలో ఉత్తర కొరియా ఏజెంట్లుగా, గూఢచర్యం పేరుతో అరెస్టు అయిన వారు ఇప్పుడిప్పుడే విడుదలవుతున్నారు. 1988 జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఆరువేల మంది విద్యార్థులను ఏకీకరణ కోసం ప్రదర్శనలు చేసినందుకు అదుపులోకి తీసుకున్నారు. 1988 ఆగస్టులో ఛూ ఇన్ సోక్ అనే నాటక్ రచయిత టోంగిల్ బాబ్ (Tongil Bab) అనే ఏకీకరణ కథావస్తువుగా నాటక్ ప్రదర్శన చేసినందుకు అరెస్టు చేశారు. అమెరికా సందర్శకులు తెచ్చిన ఉత్తర కొరియా ఫిలిం స్లైడులు ప్రదర్శిస్తున్నందుకు షిన్ ఛుల్ హో (Shin-Chul-ho) అనే పాస్టర్‌ను, మరో నలుగురు చర్చి సభ్యులను 1988లో అరెస్టు చేశారు. యాంగ్ హాంగ్ గ్వాన్ (Yang Hong - gwan) అనే తత్త్వ శాస్త్రి విద్యార్థిని ఉత్తర కొరియా రేడియోవిని, దాన్ని ఆర్టికల్స్‌గా రాసినందుకు అరెస్టు చేశారు.

### 5.9.3 కార్మికులు – హక్కులు

దక్షిణ కొరియాలో చాలా కాలం కార్మిక సంఘాలకు గుర్తింపులభించేదికాదు. 1984సం..లో పీస్ మార్కెట్(ఛాంగ్యే) గార్మెంట్ వర్కర్స్ యూనియన్ తమ యూనియన్ చట్టబద్ధమైనదేనని ప్రచారం చేసుకోవడంతో ఆయూనియన్ నాయకులపై నిర్బంధాలు కొనసాగాయి. 1996డిసెంబర్ 26న రాజ్య శాసన నిర్మాణ శాఖ (జాతీయ అసెంబ్లీ) రహస్య సమావేశంలో కంపెనీలు కార్మికులను తొలగించే అధికారాలను కల్పిస్తు, సమ్మెల సందర్భాల్లో అంతకు ముందు మిలటరీ పాలనలో ఉన్న అధికారాలను పునరుద్ధరిస్తూ, కార్మికులను నిర్బంధించే జాతీయ భద్రత ప్రణాళిక ఏజెన్సీ అధికారాలను పునరుద్ధరిస్తూ చట్టాలు చేసింది. ఫలితంగా మూడువారాల పాటు కార్మికులు జాతీయ స్థాయి సమ్మెలు, ప్రదర్శనలు చేశారు. 1997జనవరిలో అధ్యక్షుడు ఈ శ్రామిక, భద్రత చట్టాలను జాతీయ అసెంబ్లీకి తిప్పిపంపుతానని వాగ్దానం చేసినా, అప్పటికే ఎంతో మంది కార్మిక నాయకుల పై పోలీసు నిర్బంధకాండ కొనసాగి సమస్య ఆగిపోయింది. గుర్తింపు పొందని యూనియన్లు చేసే సమ్మెలపై పోలీసుల దమనకాండ, జవాబుగా యూనియన్లు జరిపే హింస నిత్యకృత్యమైంది. 1997మార్చిలో కంపెనీల్లో బహుళ కార్మిక సంఘాల సమాఖ్య గుత్తాధిపత్యం ఉండేది. ఈ నిషేదం ఎత్తివేసినా స్వతంత్ర కొరియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ పై నిషేదం 1999డిసెంబర్ దాకా కొనసాగింది. నిజానికి ఆయూనియన్‌కు దాదాపు ఐదులక్షల డెబ్బై వేలకు పై బడి సభ్యులున్నారు. 1996 జాతీయ అసెంబ్లీ రహస్యంగా చేసిన చట్టాల అమలును కొద్ది కాలం నిలుపు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 1999లో ఉపాధ్యాయులు ఎంతో కాలంగా అభ్యర్థిస్తున్న కార్మిక సంఘాల ఏర్పాటును అనుమతించారు. అయితే ప్రభుత్వోద్యోగులు మాత్రం విశాలప్రాతి

BRAOU

పదిక సంఘాలుకు కాక, తమ పనిప్రదేశాల్లో మాత్రం చిన్న సంస్థలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. 1999లో కార్మిక సంఘాల సమ్మెల పట్ల ప్రభుత్వం తీవ్రంగా స్పందించి దానికి బాధ్యులైన కార్మిక నాయకులను అరెస్టులు చేయడం, పెద్ద ఎత్తున సమ్మెలను, ప్రదర్శనలను అడ్డుకునేందుకు భద్రతా దళాలను సమీకరించడం జరిగింది. ముఖ్యంగా ఏప్రిల్, మే (1999)లలో కొరియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ప్రభుత్వ - ప్రైవేటు రంగాల్లో పురికొల్పిన సమ్మెపై పోలీసులు పెద్ద ఎత్తున బలప్రయోగం చేశారని, దీనితో ఉద్రిక్తత - హింస చెలరేగిందని సమాచారం ఉంది. ఒక ప్రక్క సంఘాల ఏర్పాటు హక్కును గౌరవిస్తూనే, మరో ప్రక్క సమ్మెలు, ప్రదర్శన పై ఉక్కుపాదం మోపుతూంది.

## 5.9.4 పౌర స్వేచ్ఛలు

దక్షిణ కొరియాలో మత స్వాతంత్ర్యపు హక్కు ఉంది. అందువల్లనే సమాజంలో ఎన్నో మతాలు ఉన్నాయి. అయితే మహిళల పట్ల వివక్షలను పునరుద్ధరించి, ప్రోత్సహించే చట్టాలు, అలవాట్లు పెరుగుతున్నాయని 1999 అక్టోబర్‌లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిటి అభిప్రాయపడింది. మహిళలు సాంఘికంగా, ఉద్యోగ ప్రదేశాల్లో వివక్షను ఎదుర్కోడమే కాక, గృహ హింస పెద్ద ఎత్తున నిత్య కృత్యంగా జరుగుతూంటుందని సమాచారం. 1984 సెప్టెంబర్, నవంబర్‌లలో మూడు విడి విడి సంఘటనల్లో పోలీసులు సియోల్‌లో విద్యార్థినులను నిర్బంధించి, వస్త్రలను ఊడదీయడం, అవమానించడం, హింసించడం జరిగింది అమ్నెస్టి తెలిపింది. జైళ్ళలోని మహిళా ఖైదీల పరిస్థితి అగమ్యగోచరం. వారి ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాట్లు లేవు. గర్భిణి ఖైదీలకు ప్రత్యేక విభాగలు లేక, పోషక ఆహారం ఇవ్వక వారి ఏకాంతంలో ఉంచి చేతులకు సంకెళ్ళు, బేడీలు వేస్తున్నట్లు తెలుస్తుంది.

## 5.9.5 రాజకీయ స్వేచ్ఛలు – పోలీసుపద్ధతులు

కొరియాలో ప్రదర్శనలు, సమ్మెలు, హర్తాళ్‌లు, పత్రికా స్వాతంత్ర్యం మొదలైనవి రాజ్యాంగ రీత్యా అనుమతించారు. అయితే వాటిని అణచివేయడంలో పోలీసుల పాత్ర కూడా తక్కువేమీకారు. సంఘాలు కొన్నింటిని రాజ్యాంగ విరుద్ధాంగా ప్రకటించారు. నీటిలో యాంగ్‌నమ్ కమిటీ (Youngnam Committee) ఫైవ్ పీన్స్ సొసైటీ (Five Pines Society), పీపుల్స్ ఫ్రంట్ ఎగైనస్ట్ (People's Front Against Fascists and Imperialists), సౌత్ కొరియన్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (South Korea National Liberation Front) మొదలైనవి ఉన్నాయి. ఇవన్నీ కొరియా ఏకీకరణనుగానీ, కమ్యూనిస్టు రాజ్యవ్యవస్థ ఏర్పాటునుగాని అభిలషిస్తాయి.

మానవ హక్కుల సంస్థలు, సమూహాలు బహిరంగంగానే పనిచేసినా, కొన్ని సందర్భాల్లో వారిపై కూడా దమన కాండ కొనసాగుతూంది. 1997సెప్టెంబర్‌లో మానవ హక్కుల ఫిలం ఫెస్టివల్ ఏర్పాట్లు చూస్తున్న కార్యకర్తలను నిర్బంధించారు. అలాగే పన్నుల స్థాయిలకు వ్యతిరేకంగా ఉద్యమించిన క్రిస్టియన్ ఫార్మర్స్ మూమెంట్, కేథలిక్ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులను 1984లో అరెస్టు చేశారు. అదే సంవత్సరంలో తమ వృత్తి పరిస్థితుల మెరుగుకోసం ఉద్యమించిన టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులను అరెస్టు చేశారు. అంతేకాక వారినుంచి నేరాలను ఒప్పించడానికి శారీరకహింస, ఎలక్ట్రిక్ షాక్‌లు ప్రయోగించారు. అధ్యక్షుడు ఛున్ డూ హ్వాన్, జపాన్ పర్యటనకు వ్యతిరేకిస్తూ ఇక్యూమినికల్ యూత్ కౌన్సిల్ జరిపిన ప్రదర్శన కారులను అరెస్టు చేశారు. ఎన్నో సందర్భాల్లో పోలీసులు ఖైదీలను నిద్రలేమికి గురిచేయడం, మడమలపై తన్నడం, హింసించడం పరిపాటి జైలు పరిస్థితులు చాలా దారుణంగా ఉండి ఖైదీల సంస్కరణ అవకాశం మృగ్యం అవుతూంది. పోలీసులు, ఇతర అధికారులు పత్రికలను హెచ్చరిస్తూ స్వయం సెన్సార్ చేసుకోవాలని మొరపెడతారు. ఎన్నో సందర్భాల్లో పత్రికా

BRAOU

ప్రతినిధుల పై యాజమాన్యాల పై కేసులు జరుగుతూనే ఉంటాయి. రాజకీయ ఖైదీలను తలక్రిందులుగా వ్రేలాడదీసి, శిరస్సు భాగాన్ని నీటిలో ముంచి ఉంచడం ద్వారా 1987లో ఒక ఖైదీ ప్రాణాలు కోల్పోయాడు. రాజ్యాంగంలో, రాజ్యస్వభావంలో మార్పు వచ్చి అధికారయుత వాదం నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ వైపు మళ్ళినా, పోలీసులు-వారి స్నేలశైలిలో మార్పు ఆశించిన స్థాయిలో లేకపోవడం దక్షిణ కొరియాలోని దుస్థితి.

దక్షిణ కొరియా ప్రజలు రాజకీయ, పౌరస్వేచ్ఛలపై ఎన్ని నిర్బంధాలు ఎదుర్కొన్నా, ఆర్థికవ్యవస్థ పటిష్టమై ప్రపంచంలోని పదకొండవ పారిశ్రామిక, వ్యావసాయిన ఆర్థిక వ్యవస్థగా మారింది. నిజానికి స్వాతంత్ర్యానికి పూర్వం ఒక పేద వ్యవసాయ దేశం.

## 5.10 ముగింపు :

వలసవాద విముక్తిపొంది అర్ధశతాబ్దం పూర్తయినా ఉత్తర, దక్షిణా కొరియాలో సాధించాల్సినంతాగా అభివృద్ధి పొందకపోవడమేగాక ఆయా దేశాలలో అంతర్గత విబేధాలు, సిద్ధాంతాలు, సరిహద్దు వివాదాల నేపథ్యంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. మరోవైపు కొరియా ఏకీకరణ కావాలని కాంక్షించే ప్రజలువున్నారు. ఏది ఏమైనా రెండు కొరియాలలోనూ మానవ హక్కుల ఉల్లంఘలనలు జరుగుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ హక్కుల ఉల్లంఘనలే ఆయాదేశాలు ప్రజలను నిరాశా, నిస్పృహలకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితులు అధిగమించినపుడే కొరియా మరింత ముందడుగు వేసే అవకాశం వుంటుంది.

## 5.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. ఉత్తర కొరియాలో రాజకీయ హక్కుల ఉల్లంఘన సందర్భాలను చర్చించండి.
2. దక్షిణ కొరియాలోని నల్లచట్టాలను వివరించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి**

1. ఉత్తర కొరియా రాజకీయ సంస్థల గుర్చి పేర్కొనండి ?
2. కొరియా ఏకీకరణ వాదల అభిప్రాయాలేమిటి ?

BRAOU

BRAOU

# ఖండం – III

## సామ్యవాద సమాజాలు

పందొమ్మిదో శతాబ్దపు మధ్యభాగంలో పెట్టుబడిదారి విధానా దోపిడి వ్యవస్థను నిరసిస్తూ వచ్చిన మార్క్సిస్టు సిద్ధాంతం దోపిడిలేని ఒక ప్రత్యామ్నాయ సమాజాన్ని నూతనంగా ప్రతిపాదించింది. ఈ సిద్ధాంపు ప్రభావానికి లోనైన దేశాలు తమ సమాజాల మార్పుకోసం ఉద్యమించాయి. ఇరవవ్యే శతాబ్దంలోని ఉద్యమాల ఫలితంగా అనేక దేశాలలో సామ్యవాద సమాజాలు అవిర్భవించాయి. ఈ దేశాలలోని ప్రభుత్వాలు నియంతృత్వ పోకడలితో మానవ హక్కులను కలరిస్తున్నావని పాశ్చాత్య పెట్టుబడిదారి దేశాలు విమర్శించిన నేపథ్యంలో సామ్యవాద సమాజాలలోని స్థితిగతులను అధ్యయనం చేయడమే ఈ ఖండం లక్ష్యం. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. అవి:

- **భాగం : 6 పూర్వపు సోవియట్ యూనియన్‌లో మానవ హక్కులు**
- **భాగం : 7 చైనాలో మానవ హక్కులు**
- **భాగం : 8 క్యూబా, పోలెండులో మానవ హక్కులు**

BRAOU

BRAOU

# భాగం – 6 : పూర్వపు సోవియట్ యూనియన్‌లో మానవ హక్కులు

విషయక్రమం :

6.0 ఉద్దేశం
6.1 పరిచయం
6.2 పూర్వపు సోవియట్ యూనియన్‌లో మానవ హక్కులు
6.3 సోవియట్ రాజ్యాంగం – మానవ హక్కులు
6.4 సోవియట్ పౌరుల విధులు
6.5 సోవియట్ హక్కుల అమలు పరిశీలన
6.6 స్టాలినిజం దృక్పథం
6.7 ఎల్సిన్ – 1993 సోవియట్ అనంతర రాజ్యాంగం
6.8 ముగింపు
6.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 6.0 ఉద్దేశం:

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- పూర్వపు సోవియట్ యూనియన్‌లోని మానవ హక్కులు తెలుసుకుంటారు.
- మానవ హక్కులపై స్టాలినిజం దృక్పథం అవగాహన చేసుకుంటారు.
- 1993 సోవియట్ అనంతర రాజ్యాంగాన్ని చర్చించగలుగుతారు.

## 6.1 పరిచయం:

రష్యాలో అక్టోబర్ విప్లవం (1917 లో) విజయవంతమైన అనంతరం లెనిన్ సోవియెట్ యూనియన్‌ను ప్రకటించి ఆదేశంలో శ్రామిక వర్గ హక్కులు అన్న కొత్త అంశాన్ని ప్రపంచానికి వెల్లడిచేశారు. ఈ ప్రకటన సోవియట్ రాజ్యాంగానికి పీఠిక అయింది. మార్క్స్, ఎంగెల్స్‌లు యుటోపియన్ (ఊహాజనిత) సోషలిజాన్ని లెనిన్ సాఫల్యం చేశారు. ప్రపంచ చరిత్రలోనే శ్రమజీవి హక్కులు అన్న కొత్త మాట మానవ హక్కుల్లో కొత్త ఒరవడిని శ్రీకారం చుట్టింది. ఈ విధంగా ఉదారవాద పాశ్చాత్య ప్రజాస్వామ్యంలో ఎక్కడా ఊసుకూడా లేని శ్రమజీవి హక్కుల ప్రాతిపదికన సోవియట్ యూనియన్ రాజ్యాంగాలు రూపొందాయి. లెనిన్ ఆ తర్వాత స్టాలిన్ ఈ మానవ హక్కుల కొత్త రూపాలను ప్రచారం చేశారు. ఈ పాఠంలో సోవియట్ యూనియన్‌లో మానవ హక్కులు, పరిణామాలు,

చివరకు సోవియట్ యూనియన్ కుప్పకూలిన అనంతరం సంస్కరణలు ప్రస్తుత స్థితిగతుల విశ్లేషణ వుంటుంది.

## 6.2 పూర్వపు సోవియట్ యూనియన్‌లో మానవ హక్కులు :

అక్టోబర్ విప్లవం (1917) విజయవంతమైన తర్వాత శ్రామికవర్గ హక్కులు అన్న అంశమే లెనిన్ ఆలోచనల్లో ప్రధాన అంశమైంది 1918 జనవరిలో లెనిన్ పీడితుల, తాడితుల హక్కుల ప్రకటన ముసాయిదా ప్రకటించారు. లెనిన్ కోరికమేరకు ఈ ప్రకటన అనంతరం 1918లో రూపొంది 1918 జూలై, 19న అమలులోకి వచ్చిన సోవియెట్ రాజ్యాంగానికి పీఠిక అయింది. ఈ హక్కుల ప్రకటనను ఒక సోవియెట్ రచయిత ఈ విధంగా అభివర్ణించారు. లెనిన్ హక్కుల ప్రకటన మానవసమాజ చరిత్రలో మొట్టమొదటిసారి శ్రమజీవి హక్కుల ప్రకటనగా చెప్పవచ్చు ఈ ప్రకటన పెట్టుబడిని, సామ్రాజ్యవాదాన్ని వర్గాలను, మనిషి మనిషి దోపిడీ చేయడాన్నీ, ఉత్పత్తి సాధనాలు, శ్రామికులపై ప్రైవేటు యాజమాన్యాన్ని రద్దుచేయాలని పిలుపునిచ్చింది. ఈ ప్రకటన శ్రామికవర్గ సార్వభౌమాధికారాన్ని స్థాపించింది. అలాగే రష్యా అన్ని జాతుల శ్రామిక వర్గాల యూనియన్‌కు కూడా ఈ ప్రకటన స్థాపించింది. 1918 రాజ్యాంగంలో అధ్యాయం 5 (నిబంధన 13-19,22) లో శ్రామికుల చైతన్యానికి అసలైన స్వేచ్ఛ, అసలైన భావస్వేచ్ఛ, సమావేశాలు ఏర్పాటు చేసుకునే హక్కును పదిలపరచింది.

## 6.3 సోవియట్ రాజ్యాంగం – మానవ హక్కులు :

BRAOU

1918 సోవియట్ రాజ్యాంగం అధ్యాయం 4 లోని 13-19-22 నిబంధనల్లో శ్రామికుల చైతన్య స్వేచ్ఛ, సమావేశస్వేచ్ఛ, భావస్వేచ్ఛతోపాటు, పూర్తిస్థాయి సాధారణ విద్య, పనిహక్కు, అందరు పౌరులకు సమానహక్కు అల్పసంఖ్యాకుల అణచివేతలను ప్రకటించారు. రిపబ్లిక్ ప్రధాన చట్టాల వలె కాకుండా ఈ హక్కులన్నీ వాస్తవంగా అమలయ్యేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. వీటితోపాటు 60 విధులను కూడా ప్రకటించారు. వర్గశత్రువులు వారి ఆస్తులను స్వాధీనం చెయ్యాలని సూచించారు.

1924 రెండవ సోవియట్ రాజ్యాంగములో హక్కులన్నీ మారకుండా యధాతదంగా వున్నాయి. కానీ 1936 లో రూపొందించిన సోవియెట్ మూడవ రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులు – విధులను అధ్యాయం 10 లోని నిబంధనలు 118-133 లలోకి మార్చారు. ప్రస్తుతం శ్రామికులు అనుభవిస్తున్న హక్కులను వీటికి తోడు కలిపారు. శ్రామికులకు పనిహక్కు, ఉపాధి హామీ, పనికి సరైన వేతనం, విశ్రాంతి, సెలవుల హక్కు, వృద్ధాప్యంలో పరిరక్షించేహక్కు, వికలాంగులకు హక్కు, విద్యాహక్కు, మహిళలకు సమానత్వ సమానహక్కులు, చైతన్యస్వేచ్ఛ (చర్చిల నుంచి పాఠశాలలను వేరు చేయడం కూడా ఇందులో పేర్కొన్నారు.) మాట్లాడేహక్కు, సమైక్యంగా కార్మికులకు కూడగట్టేహక్కు, విదేశీ పౌరుల ఆశ్రయహక్కును వీటిలో కలిపారు. ఇక విధుల విషయానికి వస్తే (అధికరణ 130-33) లలో విధుల జాబితా రూపొందించారు. చట్టాలను పాటించడం, కార్మికవర్గ క్రమశిక్షణ పాటించడం, ప్రజాసంబంధ విధులను నిజాయితీగా నిర్వహించడం, ప్రజాసంపదలను పెంచి పోషించి, పరిరక్షించడం దీనికి వ్యతిరేకులను ప్రజాశత్రువులుగా పరిగణిస్తారు) సైనిక సేవలు, దేశరక్షణకు విధిగా నిలవాల్సిన విధికాగా అన్నింటికన్నా పెద్ద నేరం రాజద్రోహంగా ప్రకటించారు.

1977 లో ప్రకటించిన నాలుగవ సోవియట్ రాజ్యాంగంలో మూడవ రాజ్యాంగములో (1936) అధ్యాయం పదిలో వున్న హక్కులను రెండవ అధ్యాయంలోకి మార్చారు. 1936 లో కేవలం 12 వున్న హక్కుల అధికరణలను నాలుగవ రాజ్యాంగంలో 25 అధికరణల్లోకి మార్చి పూర్తి విస్తృత స్థాయిలో రూపొందించారు. 1977 రాజ్యాంగంలో పొందుపరిచిన కొన్ని హక్కులు విశేషంగా వున్నాయి ఉదాహరణకు గృహ నిర్మాణ హక్కు (అధికరణ 44) రాజ్యాన్ని నిలదీసే హక్కు, రాజ్యం నుంచి నష్టపరిహారం కోరే హక్కు (అధికరణ 57, 58) ఇట్లాంటివే.

"వ్యక్తిగౌరవం, పౌరుల హక్కులు, స్వేచ్ఛను కాపాడడం రాజ్య సంస్థలు, ప్రజాసంస్థలు, అధికారుల విధిగా ప్రకటించారు". (అధికరణ 58)

"సోవియట్ రిపబ్లిక్ పౌరులు అధికారుల చర్యలు, రాజ్యసంస్థలు, ప్రజాసంస్థలు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసే హక్కు కలిగి వుంటారు. చట్టం విధించిన సమయ పరిమితుల మేరకు పద్ధతులు, విధానాల మేరకు ఈ ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలి. ఈ మేరకు అధికారుల చర్యలు చట్టాన్ని ఉల్లఘించినట్లయితే, అధికారాలను అతిక్రమించినట్లయితే, వీటిపైన చట్టం పరిధుల్లో కోర్టుకు అప్పీలు చెయ్యాలి. అధికారుల విధి నిర్వాహణలో కానీ, చట్టవ్యతిరేక సంస్థల విధ్వంసంలోగానీ నష్టపోయిన తమ ఆస్తులకు సంబంధించి సోవియెట్ పౌరులు రాజ్యం నుంచి నష్ట పరిహారం కోరే హక్కు కలిగి వుంటారు.

నాలుగవ రాజ్యాంగంలో కొత్తగా చేర్చిన మరిన్ని హక్కుల్లో విదేశీయుల హక్కులు (అధికరణ 37), ఆరోగ్య పరిరక్షణ హక్కు (అధికరణ 42) సాంస్కృతిక సౌకర్యాలు పొందేహక్కు (అధికరణ 46) పరిశోధన హక్కు (అధికరణ 47) యాజమాన్యంలో భాగస్వామ్యహక్కు (అధికరణ 48) ప్రతిపాదనలు సమర్పించే హక్కు (అధికరణ 49) కుటుంబ పరిరక్షణ హక్కు (అధికరణ 53) వున్నాయి.

BRAOU

## 6.4 సోవియెట్ పౌరుల విధులు:

1977 రాజ్యాంగంలో హక్కులు అనుభవించడం, విధులు నిర్వర్తించడం వేరు వేరు కాదని ప్రకటించారు. (అధికరణ 59) రాజ్యాంగంలోని అధికరణలు 60-69 లలో విధులు పేర్కొన్నారు. (1) పని నిర్వర్తించేవిధి, కార్మిక క్రమశిక్షణ పాటించడం (అధికరణ 60), (2). సోషలిస్టు సంపద దురాక్రమణకు దూరంగా వుండడం, ప్రజాసంపదను పొందుచేసి పరిరక్షించే విధి (అధికరణ 61), (3). సైనిక బలగాల్లో చేరడం (అధికరణ 63) (4). యునైటెడ్ సోవియెట్ సోషలిస్టు రిపబ్లిక్ (యు.ఎస్.ఎస్.ఆర్.) గౌరవాన్ని, అధికారాన్ని కాపాడడం, ఇతర పౌరుల జాతిగౌరవాన్ని కాపాడడం, యు.ఎస్.ఎస్.ఆర్ జాతుల, జాతీయతల మధ్య స్నేహసంబంధాలను పెంచడం (అధికరణ 64), (5). ప్రజానియంత్రమ పాటించి, సంఘ వ్యతిరేక వర్తనపట్ల రాజీలేని ధోరణి ప్రదర్శించడం, (అధికరణ 65), (6). పిల్లలను సోషలిస్టు సమాజానికి తగిన విధంగా తీర్చిదిద్దడం, అలాగే పిల్లలు, తల్లిదండ్రుల పరిరక్షణ, వారికి సాయపడడం (అధికరణ 66), (7). ప్రకృతిని రక్షించడం, ఉత్పృష్టతను పరిరక్షించడం (అధికరణ 67), (8). సాంస్కృతిక సంపదను, చారిత్రక కట్టడాలను పరిరక్షించడంలో సాయపడడం (అధికరణ 68), (9). ప్రపంచ శాంతిని బలోపేతం చేసికాపాడడం, ఇందుకొరకు ఇతర దేశాలతో స్నేహసహకార

సంబంధాలు నెలకొల్పుకోవడం (అధికరణ 69). ఈ సాధారణ విధులు సమగ్ర విధులను పాటించినట్లయితే దానంతట దానిగా హక్కులను అనుభవించడం కూడా సాధ్యపడదని సోవియెట్ రాజ్యాంగం స్పష్టం చేసింది.

## 6.5 సోవియెట్ హక్కులు అమల పరిశీలన :

జారిస్టు పరిపాలన నేపథ్యంలో హక్కుల అమలు పరిశీలించినట్లయితే 1917 అక్టోబర్ విప్లవం అనంతరం సోవియెట్ యూనియన్‌లో సోవియెట్ పౌరులు వాస్తవంగా హక్కులు పొందారు. సోవియెట్ రాజ్యాంగంలో ఆర్థిక, సామాజిక - సాంస్కృతిక హక్కులు ప్రవేశపెట్టడం ఒక ప్రత్యేకత. ఇదేకాకుండా ఈ హక్కులు అసలు ఆనందాన్ని పొందడానికి తగిన పరిస్థితులు కల్పించకుండా గొప్ప విషయం. ప్రభుత్వమే హక్కుల్లో చాలావాటిని పొందడం (అపూర్వమైన, అతి ప్రధానమైన పనిహక్కు) వాస్తవమైనవి, వీటిని సామాజిక ప్రాధాన్యత వుంది. ఇదేకాకుండా 1977 రాజ్యాంగంలో చివరకు రాజ్యాన్ని నిలదీసే హక్కును కూడా ఇచ్చారు. కాగా హక్కులు, విధులు సమానమన్న భావనకు ఇతర రాజ్యాంగంల్లో కలుపగా 1977 రాజ్యాంగంలో వెల్లడిచేశారు. కాగా, హక్కులకు సంబంధించి సోవియెట్ విజయాలు చాలా వున్నాయి. వాటిని తిరస్కరించలేము. కాదనలేము. సోవియెట్ సమాజంలో ఆర్థిక, సాంస్కృతిక హక్కులు వాస్తవరూపం దాల్చాయి. నిరుద్యోగ నిర్మూలన, నిరక్షరాస్యత, వెనుకబడినతనాన్ని నిర్మూలించడం ప్రతిభావంతంగా జరిగింది. చమురు ఉత్పత్తి, ఉక్కు, అంతరిక్ష పరిశోధనలు లాంటి విషయాల్లో ఇందువల్ల సోవియెట్ యూనియన్ అనతికాలంలోనే అగ్రగామి అయింది. ఫలితంగా అతికొద్ది కాలంలోనే సోవియెట్ యూనియన్ ప్రపంచ నాయకురాలుగా అగ్ర రాజ్యంగా అవతరించింది. ఏ ప్రమాణాల ప్రకారమైన ఇవిగొప్ప విజయాలు. ఉచితవిద్య, ఆరోగ్య రక్షణ, వృద్ధాప్య పెన్షన్లు, చౌక గృహాలు, చౌక రవాణా సౌకర్యాలు ఇలాంటి పౌర సౌకర్యాలలో గణనీయమైన ప్రగతి సాధించారు. మహిళల స్థితిగతులు కూడా గణనీయంగా మారాయి.

BRAOU

## 6.6 స్టాలినిజం దృక్పథం (లెనిన్ ఆ తర్వాత) :

హక్కులు అనుభవించడం అన్నది వర్గ దృక్పథంతో కూడి వుంటుందని, సోవియెట్ రాజ్యాంగంలో శ్రామిక వర్గం, వాటి ప్రయోజనాలకే అతి ప్రాధాన్యత కలిగి వుంటాయని ప్రకటించారు. అలాగే సాధారణ సోషలిస్టు దృక్పథాన్ని విడనాడకూడదని, ప్రతి విషయంలోనూ సోవియెట్ కమ్యూనిస్టు పార్టీదే అంతిమ నిర్ణయమని ప్రకటించారు. ఇది లెనిన్ హయాంలోనే వుంది. సోషలిస్టు వ్యతిరేకతలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వుంటుందని ఈ కాలంలో ప్రకటించారు. 1917 డిసెంబరు నుండి 1922 ఫిబ్రవరి వరకు సోషలిస్టు వ్యతిరేకులయిన 2,80,000 మందిని శిక్షించినట్టు ఒక అంచనా. దీనితో జర్మనీ, పాశ్చాత్య దేశాల నుంచి హెచ్చరికలతో సోవియెట్ యూనియన్‌లో పార్టీ వేదికలపైనా, బహిరంగంగా చర్చలను లెనిన్ నిషేదించారు. ఈ నిషేధం స్వభావరీత్యా క్రూరమైనదిగా కఠినంగా, అసంతుష్టంగా వున్నప్పటికీ 1920 లో ఏర్పడిన పరిస్థితుల కారణంగా లెనిన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ నిషేదం తాత్కాలికమని త్వరలో ఎత్తివేస్తామని కూడా లెనిన్ ప్రకటించారు. ఆ తర్వాత దురదృష్టవశాత్తు లెనిన్ జబ్బుపడ్డారు. స్టాలిన్ హయాంలో ఈ నిషేదం శాశ్వతమయింది కాగా ఆ తర్వాత స్టాలినిస్టుల అతి, ప్రక్షాళనాధోరణులు మానవహక్కులకు, తీవ్ర విఘాతం కల్పించాయి. లెనిన్ హయాంలో రూపుదిద్దుకున్న ప్రజాస్వామ్య సాంప్రదాయాల పునరుద్ధరణ నమ్మకాలు క్రమ క్రమంగా అంతరించిపోయాయి.

స్టాలిన్ నేతృత్వంలో నిర్ణయాధికారంగా పూర్తిగా కేంద్రీకృతమైంది. ఏ కాస్త అసమ్మతినైనా స్టాలిన్ కఠినంగా అణచివేశారు. హక్కుల అణచివేతను సమర్థించుకోవడానికి స్టాలిన్‌కు అదనంగా సైద్ధాంతిక సమర్థనలు తోడయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆయా జాతులన్నీ మొత్తంగా వెళ్ళి పోవాలని స్టాలిన్ ఆదేశించారు. ఈ క్రమంలో క్రిమయన్‌టార్టార్లు మెఖేలియన్ టర్క్‌లు, వోల్గాజర్మన్లను సమూహాలను సమూహాలనే మధ్య ఆసియా ప్రాంతాలకు పంపించివేశారు. హక్కుల ఉల్లంఘన స్టాలిన్ హయాంలో సర్వసామాన్యమైంది. ఎలాంటి విచారణలేకుండా నిర్బంధించడం, నామమాత్రపు విచారణలు, బలవంతపు ఒప్పుకోళ్ళు, నిర్బంధ కార్మిక శిబిరాలైన సైబీరియా ప్రాంతాలకు పంపించడం చంపివేయడం లాంటి అణచివేతలతో ఒక బీభత్స వాతావరణం ఏర్పడింది. స్టాలిన్ హయాంలోనే సోవియెట్ కమ్యూనిస్టుపార్టీలు కేంద్ర కమిటీ సభ్యుల్లో 70 శాతం మందిని పార్టీ కాంగ్రెస ప్రతినిధుల్లో 80 శాతం మందిని అరెస్టు చేయడం లేదా కాల్చిచంపడం జరిగిందంటే, బీభత్సం ఏ స్థాయిలో వుండిందో ఆలోచించవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు అరెస్టు చేసి నిర్బంధ కార్మిక శిబిరాలకు తరలించిన వారిలో 90 శాతం మంది బతికి బట్టకట్టలేదు. అంతకు ముందు 1930 దశకం మధ్యలో కమ్యూనిస్టు పార్టీ పూర్తి సభ్యత్వంలో సగభాగాన్ని అంటే 1.2 మిలయన్ల పార్టీ సభ్యులను నిర్బంధించారు. వారిలో 50,000 మంది మాత్రమే అనంతరకాలంలో విముక్తి పొందారు. మిగతా చాలామందిని అయితే కాల్చివేయడమో లేదా నిర్బంధ శిబిరాల్లో వారు హతమవడమో జరిగింది. అర్థరాత్రి తలుపుకొట్టే అజ్ఞాతశక్తులు లక్షలాదిమందిని సైబీరియాకు తరలించాయి. రాజకీయ సంస్థలు, చట్ట నిబంధనలు, పౌరహక్కులకు ఖాతరు లేకుండా పోయింది. ఈ మొత్తం అణచివేతలో దాదాపు 20 మిలియన్ల ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఒక అంచనా. యుద్ధం తర్వాత మరింత అధికార కేంద్రీకరణ, నియంతృత్వాన్ని, అనుసరించారు.

సోవియెట్ యూనియన్‌లో బహుళపార్టీ వ్యవస్థలేని కారణంగానే సర్వసాధారణమైన రాజకీయహక్కులు స్వానుభవంలోకి రాలేదన్న భావన ఏర్పడింది. అక్కడ కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే పార్టీ. ఆ పార్టీ అభ్యర్థులు ప్రతి ఎన్నికల్లో 99.99 శాతం ఓట్లు సంపాదించగలిగారు. సోవియెట్ కమ్యూనిస్టు పార్టీ రాజకీయ సంస్థలైన సుప్రీం సోవియెట్, ప్రిసీడియాలు కోరలు లేని పాములై లాంచనప్రాయంగా తయారైనాయి. 1977 వరకు కమ్యూనిస్టు పార్టీ చివరకు రాజ్యాంగాన్ని కూడా ప్రస్తావించడం మానేసింది. కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మాత్రమే అత్యున్నత అధికారాలు గల శక్తులయ్యాయి.

ఈ రకంగా చూసినప్పుడు సోవియెట్ యూనియన్‌లో మానవహక్కులు, పౌర, రాజకీయహక్కులకు సంబంధించి జారిస్టు రష్యాతో పోల్చిచూసినప్పుడు ముందంజవేసినట్టు అగుపడినా, పాశ్చాత్య ఉదార ప్రజాస్వామ్యదేశాలతో పోల్చినప్పుడు ఈ విషయాల్లోచాలా వెనకబడిపోయింది. సిద్ధాంతానికీ, ఆచరణకీ మధ్య (ప్రపంచ వ్యాప్తంగా సాధారణమైనప్పటికీ) గండి పూడ్చరానిదైంది. రాజ్యాంగ సత్యాలు తరుచుగా రాజకీయ అసత్యాలుగా తయారయ్యాయి. ఇదిలావుండగా, 1936 రాజ్యాంగాన్ని స్టాలిన్ "ప్రపంచంలోనే తమ రాజ్యాంగం అతి గొప్ప ప్రజాస్వామ్య రాజ్యాంగం" అని అభివర్ణించారు. స్టాలిన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మేము మా సమాజాన్ని ఒక వ్యక్తి స్వేచ్ఛకు పరిమితం చేసి నిర్మించలేదు. మొత్తంగా మన మూర్తిమత్వాన్ని స్వేచ్ఛాయుతం చేసే దిశగా నిర్మించాం" అని చెప్పుకున్నారు. కానీ, ఆచరణలో మాత్రం స్టాలిన్ హయాంలో రాజ్యాంగం ఉత్తిలాంచనంగా అలంకారప్రాయంగా మిగిలింది. 1936 రాజ్యాంగంలో స్టాలిన్ హక్కులకు సంబంధించి ఒక పూర్తి అధ్యాయాన్ని చేర్చినప్పటికీ, వాస్తవ ఆలోచనా ధోరణి ఆచరణ మాత్రం వేరుగా వున్నాయి. ఐక్యరాజ్యసమితిలో సోవియెట్ శాశ్వత ప్రతినిధి, అనంతర సోవియెట్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన వైసిన్‌స్కీ 1948 లో

ఐక్యరాజ్యసమితిలో మాట్లాడుతూ, సోవియెట్ యూనియన్‌లో పౌరహక్కులకు తగిన ప్రతిపాదిక ఏదీలేదని వాదించారు.

సమాజం వర్గాలుగా విభజించి వున్నప్పుడు చరిత్రలో రాజ్యానికీ, వ్యక్తికీ మధ్య వైరుధ్యం ప్రస్ఫుటమౌతుంది. ఒక సమాజం పీడితులూ, పీడకులూ అన్న రెండు వర్గాలుగా విడిపోయిలేనప్పుడు ఈ వైరుధ్యం తొలగిపోతుంది. నాదేశంలో చరిత్ర ఈ సమస్యను ఇదివరకే పరిష్కరించింది. నాదేశంలో రాజ్యం, వ్యక్తి పరస్పర సౌహార్ధతలో వున్నారు. రాజ్యం, వ్యక్తి ప్రయోజనాలు రెండు ఒక్కటిగానే వున్నాయి అని వైసిన్స్కీ వివరించారు.

1953 లో స్టాలిన్ మరణించడంతో ఆయన వారసత్వం కూడా అంతరించింది. 1956లో జరిగిన 20 వ పార్టీ కాంగ్రెస్‌లో కృశ్చేవ్ రహస్య ప్రసంగంలో స్టాలిన్‌ను వ్యతిరేకించారు. స్టాలిన్ వ్యతిరేకత సోవియెట్‌లో కాస్త ఊపిరినిచ్చింది. కాని కృశ్చేవ్ తెంపరితనం స్థిరమైనదికాదు. ఫలితంగా స్టాలినిస్టు పద్ధతులు పూర్తిగా రద్దుకాలేదు. తన వ్యతిరేకులను అణచివేయడంలో కృశ్చేవ్ కూడా స్టాలిన్ బాటలోనే నడిచినట్టు దాఖలాలు కూడా వున్నాయి. 1957 లో పార్టీ వ్యతిరేక ముఠాలకు కృశ్చేవ్ స్టాలినిస్టు మార్గంలోనే దారికి తెచ్చుకోగలిగారు. ఇదేకాకుండా కృశ్చేవ్ గందరగోళమైన సంస్కరణలు అనేకం ప్రవేశపెట్టడంలో సర్వత్రా గందరగోళం అనిశ్చితి ప్రబలినాయి. 1964 లో కృశ్చేవ్‌ను కూలద్రోయడం ద్వారా బ్రెజ్నేవ్ ముఠా అధికారంలోకి రావడం, తద్వారా స్థిరత్వం రావడం సంభవించాయి. అయితే, తదనంతరం కూడా సామాన్యులను వేదించలేదు. కానీ, రాజకీయ అసమ్మతికి మాత్రం గడ్డురోజులు తొలగలేదు. సామాన్యమైన భీభత్సం ఇంకా తొలిగిపోలేదు. స్టాలినిస్టు మొరటు అణచివేత అయితే పోయింది కానీ, రాజ్యానికి సంబంధించి, సైద్ధాంతిక అవగాహనాలకు సంబంధించి మాట్లాడడమంటే చిక్కుల్లో ఇరుక్కోవడమన్న అభిప్రాయం కూడా తొలిగిపోలేదు. ఒక సోవియెట్ పౌరుడు రాజకీయంగా అసమ్మతి ప్రకటిస్తే అతను సమస్యల్లో చిక్కుకుంటాడన్నది మాత్రం వాస్తవంగానే వున్నది.

BRAOU

ఈ దిశనుంచి 1977 సోవియెట్ రాజ్యాంగం మాత్రం సోవియెట్ సమాజాన్ని అభివృద్ధి చెందిన సోషలిస్టు సమాజంగా, సోవియెట్ రాజ్యం, .. ప్రజలందరి రాజ్యం.. గా ప్రకటించింది. సోవియెట్ కమ్యూనిస్టుపార్టీ నాయకత్వ పాత్ర, మార్గదర్శకత్వం పెరిగిందే కానీ, తగ్గలేదని రాజ్యాంగం ప్రకటించింది. (పీఠిక, అధికరణలు 1, 6, 100). అయితే ఒకే ప్రణాళిక, ఒకే పార్టీ, కేంద్రీకృత వ్యవస్థ, బహుళ పార్టీ వ్యవస్థ లేకపోవడం, న్యాయ విధానం సర్వ స్వాతంత్ర్యం, రష్యా జాత్యహంకారం, రెండవ ప్రపంచ యుద్ధం లాంటి వైపరీత్యాలు సోవియెట్ యూనియన్ రాజ్యాంగంలోని హక్కులను పూర్తిగా పొందకుండా అడ్డుగోడలుగా నిలిచాయి.

బ్రెజ్నేవ్ కాలంలో కూడా మానవ హక్కుల ఉల్లంఘనలు పెరిగాయి. అసమ్మతిని బ్రెజ్నేవ్ కఠినంగా అణచివేశాడు. విచారణ లేకుండా నిర్బంధాలు రహస్య విచారణలు, మానసిక చిత్రహింసలు పెరిగాయి. 1975 లో బ్రెజ్నేవ్ హెల్సింకీ ఒప్పందంపై సంతకం చేశాడు. ఈ ఒప్పందంపై సంతకం చేసిన దేశాలన్నీ మానవ హక్కులకు నిబద్ధులయి వుండాలని తీర్మానించాయి. ఈ ఒప్పందం ప్రాథమిక ప్రకటన ఈ విధంగా వుంది.

..ఈ ఒప్పందంలో భాగస్వామ్యదేశాలు ప్రాథమిక స్వేచ్ఛలు, మానవహక్కులు, ఆలోచన విధానాల స్వేచ్ఛ, మత స్వేచ్ఛలతో పాటు అన్ని హక్కులను గౌరవిస్తాయి. ఈ దేశాలు పౌర, రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఇతర హక్కులను ప్రోత్సహించి, అమలు పరుస్తాయి. మానవుడి అభివృద్ధికీ, ఆత్మ గౌరవానికి తోడ్పడే ఈ హక్కులను

అవి కాపాడుతాయి...

అయితే, 1977 రాజ్యాంగంలో తాము వీటిలో చాలా హక్కులను పొందుపరిచామని బ్రెజ్నేవ్ సగర్వంగా ప్రకటించారు. కానీ తరుచుగా ఈ హక్కుల ఉల్లంఘనే జరిగింది. హెల్సింకీ ఒప్పందం అమలుకు ఏర్పాటు చేసిన .వాచ్ గ్రూప్. బ్రెజ్నేవ్ హయాంలో జరిగిన వివిధ మానవహక్కుల ఉల్లంఘన సంఘటనలను వెలుగులోకి తెచ్చింది. కానీ, నయాస్టాలినిజం సోవియెట్ యూనియన్‌లో పొడుకున్నది. అణచివేత మరింత తీవ్రమైంది. ఈ విషయాలపై కార్టర్ విమర్శను బ్రెజ్నేవ్ కఠినమైన పదజాలంతో తిప్పికొట్టారు. ఫలితంగా 1977 సోవియెట్ రాజ్యాంగం వాగ్దానాల్లో పొడవుగా, అమలులో పొట్టిగా తయారైంది. మరీ ముఖ్యంగా అసమ్మతి విషయంలో ఇది రుజువైంది.

1982 లో బ్రెజ్నేవ్ మరణానంతరం కె.జి.బి. మాజీ అధిపతి ఆందోపోవ్ సోవియెట్ అధికారాన్ని చేపట్టారు. ఆయన రాజకీయ సంస్కరణలకన్నా, ఆర్థిక సంస్కరణలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 1985 మార్చిలో గోర్బచెవ్ అధికారాన్ని చేపట్టారు. గోర్బచెవ్ హయాంలో పెరిస్త్రోయికా (పునర్నిర్మాణం), గ్లాస్‌నోస్ట్ (బహిరంగత) అన్న రెండు విధానాలను ప్రవేశపెట్టడంతో నిజమైన రాజకీయ సాఫల్యత సోవియెట్ యూనియన్‌లో ప్రారంభమైంది. రాజకీయ హక్కులు, బాహాటతలకు గోర్బచెవ్ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన హయాంలోనే రాజ్యాంగాన్ని కాపాడే అంగంగా ఒక రాజ్యాంగ కోర్టును ప్రారంభించారు. కానీ, సుదీర్ఘ అణచివేతలకు గురైవున్న సోవియెట్ ప్రజానీకం ఓరిమి వహించలేకపోయారు. వారు అతి త్వరగా అనేక హక్కులను డిమాండ్ చేశారు. గ్లాస్‌నోస్ట్‌ను జాతుల ప్రజల సోవియెట్ సోషలిస్టు రిపబ్లిక్ నుండి విడిపోవడానికి వాడుకున్నారు. ఈ బలగాలు క్రమక్రమంగా పుంజుకుని అదుపులేకుండా తయారవడంతో, పరిస్థితులు విషమించి 1991 డిసెంబర్‌లో సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమైంది. అయినప్పటికీ, సోవియెట్ పరిణామాలను పరిశీలించిన చాలామంది పరిశీలకులు అభిప్రాయం ప్రకారం ఇప్పటికీ అక్కడ పాతకాలపు ఆచరణలు కొనసాగుతున్నాయంటారు.

BRAOU

## 6.7 ఎల్సిన్ – 1993 సోవియెట్ అనంతర రాజ్యాంగం :

1993 జూన్‌లో ప్రెసిడెంట్ ఎల్సిన్ నేతృత్వంలో కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. ఈ రాజ్యాంగంలో అధ్యాయం 1 (అధికరణలు 1-37), అధ్యాయం 2 (అధికరణలు 38-54) వరకు హక్కుల సమగ్ర జాబితాలు పొందుపరిచారు. రష్యన్ రాజ్యం చట్టాల ఆధారంగా పరిపాలిస్తుంది అని ప్రకటించారు. రాజ్యాంగం ప్రధాన విలువలు, ..మానవులు, వారి ఆత్మ గౌరవం, వారి హక్కులు, స్వేచ్ఛలు.గా ప్రకటించారు. (అధికరణ 1) అధికరణ 8 లో ఇలా ప్రకటించారు. "రష్యన్ సమాఖ్యలో ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలను గుర్తించి, మానవహక్కుల ప్రపంచ ప్రకటన మేరకు వాటి అమలుకు హామీపెడుతున్నాం" సాధారణంగా అంతర్జాతీయ చట్టాలు, అంగీకరించిన పద్ధతులు, సూత్రాలకు కట్టుబడి వుంటాం. రష్యాలో పుట్టిన ప్రతి మనిషికీ ప్రాథమిక మానవహక్కులు, స్వేచ్ఛలకు హామీ పడుతున్నాం.. అని రాజ్యాంగంలో ప్రకటించారు. ప్రాథమిక హక్కుల నిబంధనలు స్థానిక ప్రభుత్వాలు, శాసన, కార్యనిర్వాహక అధికారాలకు కట్టుబడి వుంటాయి. ప్రతి మనిషికీ స్వేచ్ఛ, బాధ్యత వుంటుంది. (అధికరణ 11, 12) ఈ రాజ్యాంగంలో ఇచ్చిన హక్కుల జాబితా సమగ్రంగా వున్నది. అయితే, రష్యా దశాబ్దాలుగా (శతాబ్దాలుగా కూడా) ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతికి దూరంగా వున్నది. పాత అలవాట్లు మూలల్లో పేరుకుపోయి స్థిరపడ్డాయి. ఈ కొద్ది పరిమితులు మాత్రం అలాగే మిగిలాయి. అయినప్పటికీ రష్యన్

సమాజం పోల్చలేనంత బాహాటతకు లోనైంది. రష్యన్ ప్రజలు రాజకీయ చైతన్యం పెరిగింది. స్వేచ్ఛగా వందలాది రాజకీయల పార్టీలు ఉద్భవించాయి. ఒకటికన్నా ఎక్కువ అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికలు కూడా జరిగాయి. పత్రికలు పూర్తి స్వేచ్ఛ పొందాయి. అయినా ఇప్పటికీ ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలపై రాజ్యాధిపత్యం మాత్రం మింగుడుపడని అంశంగా వున్నది. 1996 లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఎల్సిన్‌కు ప్రధానంగా, ప్రత్యర్థి అభ్యర్థుల కన్నా ఎక్కువ ప్రచారం చేశారు. ప్రస్తుతం రష్యాలో పూర్తి మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామీకరణ విధానాలు సంధి దశలో వున్నాయి. పాత సోవియెట్ మార్కెట్ విధానాలు – నూతన ప్రజాస్వామ్య భావనలకు మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతుంది. ఇప్పటికైతే నూతన శక్తులే విజయం వైపు పరిగెడుతున్నాయి.

## 6.8 ముగింపు:

1918 సోవియెట్ యూనియన్ రాజ్యాంగంలో మొదటిసారిగా లెనిన్ పట్టుమేరకు పీడితుల, తాడితుల హక్కులను 70 చేర్చారు. 1918, 1924, 1936, 1977 లలో రూపొందించిన నాలుగు సోవియెట్ రాజ్యాంగాల్లో హక్కుల జాబితాలను విస్తృత పరిచారు. కానీ, సోవియెట్ పౌరులు కొన్ని ప్రత్యేక సామాజిక, ఆర్థిక హక్కులకు మాత్రమే పొందారు. స్టాలినిజంతో రాజకీయ హక్కులు మృగ్యమయ్యాయి. బహుళ రాజకీయ పార్టీలు వ్యవస్థ లేకపోవడం కూడా రాజకీయ హక్కుల లేమికి ఒక కారణం అయితే జారిస్టు రష్యాతో పోల్చినప్పుడు సోవియెట్ పౌరులు చాలా హక్కులను పొందారు. కానీ, పాశ్చాత్య ప్రజాస్వామ్య వ్యవస్థలతో చూసినప్పుడు హక్కుల విషయంలో వెనుకబడిపోయారు. ముఖ్యంగా రాజకీయ హక్కుల విషయంలో ఇది మరింత ప్రస్ఫుటంగా కనబడుతుంది. సోవియెట్ యూనియెన్ పతనానంతరం 1993 లో ఎల్సిన్ నేతృత్వంలో ఆమోదించిన రాజ్యాంగంలో హక్కుల జాబితాను మరింత పెంచారు. అయితే పాత, కొత్త రాజకీయ, సంస్కృతుల నేపథ్యంలో రష్యా ఇప్పుడు సంధికాలంలో వున్నది.

BRAOU

## 6.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి**

1. పూర్వపు సోవియెట్ యూనియన్‌లో మానవ హక్కుల విధానాలు – ఆచరణను విమర్శనాత్మకంగా పరిశీలించుము ?
2. మానవ హక్కుల వారసత్వానికి సోవియెట్ యూనియన్ ఏ మేరకు తోడ్పడింది ? అంచనా వేయండి ?

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి**

1. 1936, 1977 సోవియెట్ రాజ్యాంగాలలో ఇచ్చిన హక్కుల జాబితాను పోల్చి, భేదించి చర్చించండి?
2. సోవియెట్ అనంతర రాజ్యాంగం ఎప్పుడు రూపొందింది? కొత్తగా రాజ్యాంగంలో మానవహక్కుల నిబంధనలను చర్చించండి ?

# భాగం – 7 : చైనాలో మానవ హక్కులు

**విషయక్రమం :**


| | |
|---|---|
| 7.0 | ఉద్దేశం |
| 7.1 | పరిచయం |
| 7.2 | మానవ హక్కులపై మావో |
| 7.3 | మారో ముఖ్యమ్యైన సిద్ధాంతాలు |
| 7.4 | చైనా రాజ్యాంగాలు |
| 7.5 | చైనాలో హక్కుల అమలు తీరు – పరిశీలన |
| 7.6 | మానవ హక్కుల సిద్ధాంతం, ఆచరణలకు సంబంధించి సోషలిస్టు ప్రపంచపు భాగస్వామ్యం |
| 7.7 | ముగింపు |
| 7.8 | మాదిరి పరీక్షా ప్రశ్నలు |


BRAOU

## 7.0 ఉద్దేశం:

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- చైనాలో మానవహక్కుల సిద్ధాంతాలు తెలుసుకుంటారు.
- మావో ఝెడాంగ్ భావాలు అవగాహన చేసుకుంటారు.
- చైనాలో మానవహక్కుల అమలును విశ్లేషిస్తారు.

## 7.1 పరిచయం:

చైనా అధినేత మావో ఝెడాంగ్ రాజకీయాలు సమస్యలపై విస్తృత ఆలోచనా ధోరణులను ప్రకటించారు. చైనా మానవహక్కుల నేపథ్యంలో క్లుప్తంగా మావో ఆలోచణ విధానాన్ని తెలుసుకుందాం. ఐరోపాలు పూర్వపు యుగోస్లోవియా కూడా టిటో నేతృత్వంలో స్టాలిన్ విధానాలను వ్యతిరేకించింది. యుగోస్లోవియా ఒక మేరకు పాశ్చాత్యపోకడలు పోయింది. కానీ, చైనాను కూడా అనుసరించలేదు. మానవ హక్కులపై చైనా అధినేత మావో ఝెడాంగ్ ప్రత్యేకంగా పుస్తకాలేమి వెలువరించనప్పటికీ ఆయన రాజకీయ కార్యాచరణ, ఆచరణలో భాగంగా హక్కులకు సంబందించిన ప్రస్తావనలన్ని క్రోడీకరించి ఈ పాఠంలో తెలుసుకుందాం. మార్క్స్, ఎంగిల్స్, లెనిన్, స్టాలిన్‌ల అభిప్రాయాంతో ఏకీభవించిన మావోఝెడాంగ్ శ్రామిక వర్గ హక్కులకు సంబంధించిన అభిప్రాయాలు

ఈ పాఠంలో ఉంటాయి.

## 7.2 మానవ హక్కులపై మావో :

మానవహక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యంల గురించి మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు ప్రకటించిన భావాలను మావో ఏ మాత్రం విభేదం లేకుండా ప్రచారం చేశారు. 1960 కి పూర్వం మావో చైనా కమ్యూనిస్టులకు సోవియెట్ యూనియన్‌లో .మార్క్సియన్ సోషలిజం అమలవుతున్నందున అన్ని విధానాలలో సోవియెట్‌ను అనుసరించాలని బోధించాడు. మావో ప్రధానంగా క్రియాశీల రంగం కార్యకర్తగా ఉన్నందున ఆచరణ పైన ఎక్కువ శ్రద్ధ వహించారు. మానవ హక్కులపై మావో ప్రత్యేకంగా ఏమీ రాయనప్పటికీ, ఆయా సందర్భాలలో మావో ప్రకటించిన రాజకీయ సిద్ధాంతాలు, భావాలు, సమస్యల నుంచి ఆయన అభిప్రాయాలు వెల్లడయ్యాయి.

1949 కి పూర్వం మావో రచనలన్నీ .ప్రజాస్వామ్యం. .హక్కులు. స్వేచ్ఛ, ప్రజలు, ప్రజల ప్రజాస్వామ్యం అన్న విషయంపై వ్యాఖ్యానాలతో నిండి ఉన్నాయి. అయితే ఈ మాటాలేవి మావో అమూర్త సిద్ధాంత భావనలుగా గానీ, తత్వంగా గానీ ప్రకటించలేదు. అయా సమస్యలు చర్చించినప్పుడు వీటి ప్రస్తావన చేశారు. 1. మార్క్సిస్టు సిద్ధాంతం 2. మావోయిస్టు వ్యూహం ఎత్తుగడలు లాంటి విషయాల చర్చలో ఈ విషయాలపై చర్చ చేశారు.

చైనా సామ్యవాదం పొందాలంటే జపాన్ సామ్రాజ్యవాదాన్ని ఎన్ని సర్దుబాట్లతో నైనా సరే ఓడగొట్టాల్సిందే చాంగ్ కైషేక్ నేతృత్వంలోని .కొమింటాంగ్‌తో, జాతీయ బూర్జువాలతో చేతులు కలిపి, చివరకు తాత్కాలికంగా భూస్వాముల భూములు ఆక్రమణలు నిలిపివేసి అయినా సరే ఐక్య సంఘటనల ద్వారా జపాన్ సామ్రాజ్యవాదాన్ని తరిమి వేయాలని మావో ఉద్బోధించారు. ఈ సందర్భంలో ఆయన .ప్రజాపంథా. .ప్రజల ప్రజాస్వామ్య నియంతృత్వం., ప్రజల - అధికారం అన్న విషయాలపై పదేపదే చర్చించారు. అయితే ఈ మాటలు వాడిన చోట ఎక్కడ మావో సైద్ధాంతికంగా రాజీపడలేదు. ప్రజాస్వామ్యం అన్న మాట ప్రతీసారీ కేంద్రీకృత విధానంతో ముడిపెట్టి మాట్లాడేవారు. 1929లో మావో .అతి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ, "దిగువస్థాయిలో వ్యక్తిగత, పెట్టీ బూర్జువా వ్యతిరేకతలను ప్రోత్సహిస్తుంది" అన్నారు. అందువల్ల కేంద్రీకృత విధానాల మార్గదర్శకత్వం ప్రజాస్వామ్యం మాత్రమే వాంఛనీయం. పార్టీలో దిగువస్థాయి కార్యకర్తలు అధిష్టానం స్థాయిలో చేసిన నిర్ణయాలను అమలు పరచడానికి, అర్థం చేసుకోవడానికి మాత్రమే చర్చలు జరపాలని మావో అంటారు. ఒంటెత్తు పోకడలను వ్యక్తి వాదాన్ని, స్వీయ మానసిక ధోరణులను కూడా మావో ఈ సందర్భంగా వ్యతిరేకించారు. 1937 లో ..జపాన్ వ్యతిరేక ఐక్య సంఘటన..ను విస్తృతంగా నిర్మించడానికి ప్రజాస్వామ్యం స్వేచ్ఛ పరికరాలను మావో ప్రకటించారు. ఈ సందర్భంలో ఆయన న్యాయబద్ధంగా జరిపే బహుల పార్టీల ఎన్నికలు, స్వేచ్ఛాయుత పార్లమెంటు, నిజమైన ప్రజాస్వామ్య రాజ్యాంగం ప్రజాస్వామ్య విధానాలను నిజంగా అమలు పరిచే నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం సమావేశాలు, సంఘాలు కూడా నిజంగా పనిచేయడంలాంటివి మావో కోరుకున్నారు. అయితే ఇవన్ని కూడా జపాన్ సామ్రాజ్యవాదం నుంచి మాతృభూమిని రక్షించుకోవడానికి జరగాలని మావో వివరించారు.

"జపాన్ వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటన.. ప్రధాన కార్యక్రమం రాజకీయ విధానాల ప్రజాస్వామ్య పునర్నిర్మాణం, ప్రజలకు స్వేచ్ఛ, హక్కుల దిశగా ఉండాలి"

BRAOU

1937 లో ప్రజాస్వామ్య విప్లవం కోసం పోరాటం చేస్తున్న కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ పార్టీని ఉక్కులాగా దృడంగా తీర్చిదిద్దడానికి సమగ్రమైన ప్రజాస్వామ్య వ్యవస్థను విమర్శించే స్వేచ్ఛను, కేంద్రీకృత ప్రజాస్వామ్యం వెలుగులో అంతర్గత ప్రజాస్వామ్యంను వాగ్ధానం చేసింది. ఈ కాలంలో జాతీయ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, ప్రజల జరుగుబాటు..లు ప్రధాన లక్ష్యాంగా పార్టీ ప్రకటించింది.

అయితే ఇవన్ని పాశ్చాత్య తరహా ఉదారవాదానికి సూచనలా ? అంటే కాదు అనే చెప్పవచ్చు. 1937 లో ఉదారవాదంపై మావో నేరుగా వ్యాఖ్యానాలు చేశారు. ..ఉదారవాదం ప్రతికూలమైంది. ఉదాసీనమైంది. మార్క్సిజం క్రియాశీలమైంది. అనుకూలమైంది. అని ఆయన అన్నారు. ఉదారవాదంలో పార్టీ ఐక్యతను దెబ్బతీసే అతి హానికర సూత్రాలను మావో వెల్లడించారు. ఈ ఉదారవిధానాలు విప్లవాన్ని నిర్వహించి పార్టీ క్యాడర్‌లో ఉక్కు క్రమశిక్షణకు తూట్లు పొడుస్తుందని, పార్టీ సంస్థలను ప్రజలకు దూరం చేస్తుందని మావో అభిప్రాయం.. ఉదారవాదం అవకాశవాదానికి పరాకాష్ట మార్క్సిజంతో మౌలికంగా విభేదిస్తుంది.. అని ఆయన భావన. ఉదారవాదం పెట్టీ బూర్జువా స్వార్థం నుంచి పుట్టే ఆలోచనాధోరణి, అది స్వప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత కల్పించి, విప్లవ ప్రయోజనాలకు తర్వాతి ప్రాధాన్యత కల్పిస్తుంది. ఫలితంగా సైద్ధాంతిక, రాజకీయ, సంస్థాగత ఉదారవాదం ప్రబలిపోతుంది. ఉదారవాదాన్ని ప్రతి ఘటించడానికి ప్రతి మార్క్సిస్టు ఇవి ఆచరించాలని మావో వెల్లడించారు.

"ఒక కమ్యూనిస్టు విప్లవ ప్రయోజనాలే తన అసలు కర్తవ్యమని, స్వప్రయోజనాలు తర్వాతి విజయమని గుర్తించాలి. పార్టీ పట్ల నిజాయితీగా, విశ్వసంతో క్రియాశీలకంగా వ్యవహరించాలి. ఎల్లవేళలా, ఎక్కడైనా ఒక కార్యకర్త తప్పుడు ఆలోచనా ధోరణులపై ఆచరణపై దూరం కాకుండా చూడాలి. వ్యక్తికన్నా పార్టీ ముఖ్యమని తన కన్నా ఇతరులు ముఖ్యమన్న భావనలు పెంపొందించుకున్న వారే అసలు కమ్యూనిస్టు"

BRAOU

బ్రిటిష్ జర్నలిస్టు జేమ్స్ బెర్ట్రమ్‌కు 1937 అక్టోబర్ 25 న ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మావో ప్రజాస్వామ్యం. అర్థాన్ని వివరించారు. ఈ సందర్భంగా మావో ప్రజాస్వామ్య రిపబ్లిక్. స్వభావాన్ని వెల్లడించారు.

1. జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం సందర్భంలో ప్రభుత్వం రాజ్యం ఒక వర్గానికి మాత్రమే చెందినదిగా ఉండకూడదని, జపాన్ వ్యతిరేక వర్గాలకు ముఖ్యంగా కార్మికులు, రైతులు, పెటీ బూర్జువా వర్గాలకు ప్రాతినిధ్యం వహించేదిగా ఉండాలి.
2. వీటి సంస్థాగత నిర్మాణం .కేంద్రీకృత ప్రజాస్వామ్యంగా. ఉండాలి.
3. ఈ ప్రభుత్వం అవసరమైన రాజకీయ స్వేచ్ఛలు కల్పించాలి. .కేంద్రీకృత ప్రజాస్వామ్యం. అనే మాట పరస్పర వైరుధ్యమున్న మాట కానేకాదు వాస్తవం. ..నిజానికి ప్రజాస్వామ్యం, కేంద్రీకృతం రెండింటి మధ్య పూడ్చరాని గండీ ఏదీ లేదు. చైనాకు ఇవి రెండు కావలసిందే.

ఒక వేపు మేం ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం నిజంగా అందరికీ నచ్చినదై ఉండాలి. ఆ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసేందుకు ఆ ప్రభుత్వానికి మద్ధతు ఇచ్చేందుకు ప్రజలకు స్వేచ్ఛ ఉండాలి. తప్పని సరిగా ప్రభుత్వం జన బాహుళ్యం మద్ధతు కలిగి ఉండాలి. ఇది ప్రజాస్వామ్యానికి మా అర్థం. మరో వైపు ప్రజలు నిర్ణయించి, ఆమోదించిన విధానాల అమలుకు శాసనపరమైన కేంద్రీకృత వ్యవస్థ కూడా కావాలి. ప్రజామోదం

పొందిన విధానాలు ఏ మాత్రం వ్యతిరేకత లేకుండా సాఫీగా సాగాలంటే కేంద్రీకృత విధానాలు అవశ్యం. కేంద్రీకృత విధానం అసలు అర్థం ఇదే. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలు పరచడం ద్వారా మాత్రమే ఒక ప్రభుత్వం ధృడంగా ఉండగలదు. జపాన్ వ్యతిరేక యుద్ధంలో చైనా కు ఇలాంటి ప్రభుత్వమే అవసరం. - మావో.

చైనాలో సాధారణంగానే ప్రజాస్వామ్య పోకడలు లేనందున, వెనుకబడి ఉన్నందున, కమ్యూనిస్టు పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించింది. అతి ప్రజాస్వామ్యం ఉదారవాదాలు క్రమశిక్షణకు హాని చేస్తాయని అభిప్రాయపడింది. అలాగే, అంతర్గత ప్రజాస్వామ్యం, యుద్ధానికి సిద్ధం చేసేది. క్రమశిక్షణను కాపాడి, పార్టీని ముందుకు తీసుకుపోయేదిశగా ఉండాలని కమ్యూనిస్టు పార్టీ భావన.

చాలా మంది మేధావులు మానవహక్కుల ప్రతిస్పందనతో ఉంటారు. మేధావుల గురించి మావో భావనలు అనుకూల భావనలు ..మేధావులు, బుద్ధిజీవులు, జాతీయ, సామాజిక ఆస్థులు.. అని మావో భావన. అన్ని రకాల బుద్ధి జీవులను అభివృద్ధి చేసి, వారికి పునర్ అధ్యయన అవకాశం ఇచ్చి విప్లవం వేపు ఆకర్షించాలి. ..బుద్ధి జీవులు పాల్గొనడానికి విప్లవాలు విజయవంతం కావడం అసాధ్యం. కనుక పార్టీలోకి బుద్ధిజీవులను చేర్చుకోవడం కొనసాగించాలి. అయితే బూర్జువా ఆలోచనా ధోరణులు ఉన్న మేధాజీవులను దూరం కొట్టాలని, కొంచెం అనుమానస్పదంగా ఉన్నప్పటికి, పార్టీకి విశ్వాసపాత్రంగా ఉన్నవారిని చేరనీయాలని మావో సూచించారు. ఇప్పటికి శ్రామిక వర్గం బుద్ధి జీవులను అందించడం కష్టం కానీ, కార్మికుల సాంస్కృతిక స్థాయి పెంచడం ద్వారా ఆ వర్గంలోనూ బుద్ధిజీవులు వస్తారని, అందువల్ల ఇప్పటి మేధావులు కార్మికుల కోసం, విప్లవం కోసం, పనిచేయాలి. అదేసమయంలో శ్రామికులు మేధావులుగా, మేధావులు శ్రామికులుగా మారాల్సి ఉంటుంది. జాతి కోసం ప్రజల కోసం, మేధావులు కఠిన కృషి చేయ్యాలి. అని మావో అన్నారు.

BRAOU

మావో నూతన ప్రజాస్వామ్య (1940) భావన కార్మిక, కర్షక, మేధావుల ఉమ్మడిపాలనా భావనగా చెప్పవచ్చు. నూతన ప్రజాస్వామ్యాన్ని ఉమ్మడి ప్రజాస్వామ్య నియంతృత్వం. ఐక్య ప్రభుత్వం ..విప్లవ శక్తుల కూటమిగా కూడా అభివర్ణించవచ్చు. కాగా ఈ భావన రాజ్యానికి మూడో ప్రత్యామ్నాయ భావన అని వెనుకబడిన, వలస, నయావలస దేశాలకు ఇది ఉపయోగపడుతుందని ఈ విధానంలో ఒక పార్టీ కానీ, ఒకే వర్గం కానీ పాలన సాగించడానికి వీలు లేకుండా ఉంటుందని మావో ప్రతిపాదించారు. ఈ భావన అటు పాశ్చాత్య నమునాలకు ఇటు సోవియట్ కూటమి నమూనాలకు కూడా భిన్నమైంది. ఈ ప్రభుత్వం ఏర్పాటులో .వాస్తవిక, సార్వత్రిక, సమాన ఓటు హక్కు ప్రాతిపదికన జాతీయ స్థాయి నుంచి, స్థానిక స్థాయి దాకా ప్రజా కాంగ్రెస్‌లు ఏర్పాటు చేయాలి. మావో, తన ప్రతిపాదనల్లో జపాన్ వ్యతిరేక ఐక్యసంఘటన స్థాపించాలని కోరుకున్నారు. ఇందుకోసం ఒక నూతన ప్రజాస్వామిక రాజ్యాంగ ప్రభుత్వం ఏర్పాటు చేయ్యాలని కొందరిచేత కాకుండా, అందరు ప్రజల సమ్మతితో ఎన్నుకోవాలని ఆయన భావన.

మనం నూతన ప్రజాస్వామ్యం అని పిలుస్తున్న ప్రజాస్వామ్య ఐక్య సంఘటనలో శ్రామిక వర్గ నేతృత్వంలో మెజారిటీ ప్రజల ప్రభుత్వం ఈ నూతన ప్రభుత్వం కార్యనిర్వాహణ కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఈ అధికార నిర్మాణంలో సైనిక బలగాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. నిజానికి పాశ్చాత్య ప్రభుత్వాలన్నీ రిపబ్లిక్ లేబుళ్ళు తగిలించుకున్న నరహంతక ప్రభుత్వాలు ఈ ప్రభుత్వాలు ప్రజలకు ఒక స్వేచ్ఛా శకలాన్ని కూడా ఇవ్వడం లేదు. తద్విరుద్ధంగా చైనా ప్రభుత్వం ప్రజలకు సామాన్య పాలన, మెరుగైన బలగాలతో మంచి సేవలు అందిస్తుంది.

1945 లో మావో, ఐక్యత ప్రజాస్వామ్యం ప్రాతిపదికన ఒక విస్తృత్త కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ ప్రభుత్వం సర్వస్వతంత్ర స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య ఐక్య, సమర్థ కొత్త చైనా నిర్మించేందుకు అయన ప్రతిపాదన చేశారు. నూతన ప్రజాస్వామ్యం ప్రజలు స్వేచ్ఛగా అభివృద్ధి చెందడానికి వీలు కల్పిస్తుంది. అన్ని ప్రజాస్వామ్య పార్టీలు చట్టబద్ధతను గుర్తిస్తుంది. మాట్లాడే స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, సమావేశాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ, మన నమ్మకాలు, రాజకీయ అభిప్రాయాల స్వేచ్ఛతో పాటు ఒక వ్యక్తి స్వేచ్ఛ. ప్రజల అతి ప్రధానమైన స్వేచ్ఛ అని నూనత ప్రజాస్వామ్యం భావన. 1945 ఏప్రియల్ లో మావో, అన్ని మైనారిటీలను గుర్తిస్తు రాశారు. చైనా అన్ని జాతుల స్వేచ్ఛా సంఘటనగా మావో అభివర్ణించారు. మైనారిటీలకు అన్ని రకాల, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక హక్కులు కల్పిస్తూ, ఆయా జాతుల స్వయం పరిరక్షణకు స్వంత సైన్యాలు నిర్మించుకునేందుకు కూడా మావో ప్రతిపాదించారు. అయా అల్ప సంఖ్యాక వర్గాల మాట్లాడే భాష, లిపి, వారి అచార వ్యవహారాలు, మత విశ్వాసాలు, గౌరవించాలి. అని మావో భావించారు. చైనాతో 1949 ఏప్రిల్‌లో ప్రతిఘాత శక్తుల అణిచివేతకు చైనా ప్రజావిముక్తి సైన్యం ఏర్పాటుకు అధికారికంగా ప్రకటించారు. దీనితో ప్రజావిముక్తి సైన్యం, పరిశ్రమలు, దుకాణాలు, పాఠశాలలు, అస్పత్రులు, భూమి తదితరాలను స్వాధీనం చేసుకుని అధికారం కల్పించారు. ఇక్కడ ప్రభుత్వం లేదా హక్కుల ప్రస్తావన ఏదీలేదు. 1949 జూన్‌లో మావో ఈ విధంగా ప్రకటించారు. వర్గాలు అదృశ్యమయి తర్వాత, వర్గపోరాట పరికరాలయిన, పార్టీ, రాజ్యయంత్రాంగాలన్నీ క్రమానుగతంగా అదృశ్యమవుతాయి.. అన్నారు. అక్టోబరు విప్లవాన్ని ప్రస్తుతిస్తూ, లెనిన్, స్టాలిన్‌లు చైనాకు మార్క్సిజం, లెనినిజం ఆయుధాన్ని అందించారన్నారు. బూర్జువా ప్రజాస్వామ్యాన్ని తిరస్కరిస్తూ, శ్రామికవర్గం నేతృత్వంలోని ప్రజా రిపబ్లిక్‌ను ఆయన సమర్థించారు. కార్మికుల కర్షకుల ఐక్యతతో వారి నాయకత్వంలో శ్రామిక వర్గ నియంతృత్వం పాత్రిపదికన రాజ్యం ఏర్పాటు అంతకు మునుపటి రాజ్యాన్ని రద్దు పరుస్తుంది. మావో ప్రకటించారు. ..కమ్యూనిస్టు పార్టీ నా సామ్రాజ్యవాదులకు, వారి తైణతీలకు, స్వదేశీ విదేశీ తిరోగణన వాదులకు తప్ప ఎవరికీ వ్యతిరేకం కాదు.. చైనా భవిష్యత్తు శ్రామిక వర్గ నియంతృత్వంతో ముడిపడి ఉంది అని మావో అన్నారు. శ్రామిక వర్గ నియంతృత్వంలో ప్రజలకు మాత్రమే మాట్లాడే హక్కు ఉంటుంది. కానీ, తిరోగమన శక్తులకు లేదు.. అని ఆయన ప్రకటించారు. ప్రజలు అంటే ఎవరు ? అన్న విషయాన్ని సిద్ధాంతీకరించి ఈ క్రింది వారిని ప్రజలు అన్నారు.

1. శ్రామిక వర్గం
2. రైతాంగం
3. పట్టమ పెటీ బూర్జువాలు
4. జాతీయ బూర్జువాలు

ఈ ప్రజలు వారి స్వంత రాజ్య యంత్రాంగం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారు. పాలకవర్గ – బూర్జువాలు, సామ్రాజ్యవాద తైణాతీలు, భూస్వాములు, కొమింటాంగ్ ప్రతికూల శక్తులకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులపై. ప్రజలు. తమ నియంతృత్వాన్ని చెలాయిస్తారు. వారి ప్రవర్తన సక్రమంగా లేనప్పుడు వారిని శిక్షిస్తారు. హక్కులు కేవలం ప్రజలకు మాత్రమే అని మావో విస్పష్టంగా బోధించారు.

"ప్రజా సమూహంలో మాత్రమే ఎవరైతే మాట్లాడే హక్కు, సమావేశ హక్కు, సంఘాలు ఏర్పరచుకునే హక్కును కలిగి ఉంటారో వారికి మాత్రమే హక్కులు. ఈ ప్రజలకు మాత్రమే ఓటు హక్కు. కానీ ప్రతి ఘాత శక్తులకు మాత్రం కాదు. అందువల్ల ప్రజలకు ప్రజాస్వామ్యం ప్రతిఘాత శక్తులకు నియంతృత్వం అన్న రెండు

BRAOU

అంశాలతో కూడిందే ప్రజస్వామ నియంతృత్వం అన్న రెండు అంశాలతో కూడిందే ఈ ప్రజా ప్రజాస్వామ్య నియంతృత్వం" - మావో

"మీది నియంతృత్వం అవునండీ ! నిజమే మేము అదే అనేక దశాబ్దాలుగా చైనా ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులు వారిని ప్రజల ప్రజాస్వామ్య నియంతృత్వం వైపు నెట్టివేశాయి. అదికూడా ప్రతిఘాత శక్తులకు మాట్లాడే హక్కు లేకుండా చేయడానికి ప్రజలుకు మాత్రమే మాట్లాడే హక్కు వుండటానికి ఈ మార్గాన్ని ఎంచుకొన్నాం" - అన్నారు మావో.

అయినా వర్గ నియంతృత్వంలో ప్రజాస్వామ్య పద్ధతులను మావో అంగీకరించారు. ..వర్గ శత్రువులు బహిరంగంగా తిరుగుబాటు చేసేంతదాక, విద్రోహం సృష్టించేంతవరకు కేవలం నచ్చచెప్పటం మార్గాన్నే ఎంచుకోవాలి. కానీ, ఏది తప్పని సరి కాకూడదు అని మావో అన్నారు. వ్యతిరేకశక్తుల గూర్చి మావో ఇట్లా అంటారు.

"విప్లవ వ్యతిరేకులు శ్రమ ద్వారా నూతన మానవులుగా ఆవిర్భవించడానికి వారి మనుగడకు భూమిని పనిని కల్పిస్తాము. ఒకవేళ వారు పనిచేయడానికి నిరాకరిస్తే ప్రజాప్రభుత్వం వారితో బలవంతంగా పనిచేయిస్తుంది. గతంలో సైనిక అధికారులను బంధించినప్పుడు వ్యవహరించినట్టుగానే పార్టీ ప్రచారం, బోధనకు చేపడతాం. దీన్నే మీరు ..దాతృత్వం.. అంటే అనవచ్చు. అయితే ఇది మేం పార్టీ సభ్యులను చైతన్యవంతం చేయడానికి నిర్వహించే స్వీయ అధ్యయనం లాంటిదేమి కాదు" - మావో.

ఈ విధంగా వర్గ శత్రువులను, జాతీయ బూర్జువాలను నిర్మూలిస్తాం. తగ్గిస్తామని మావో ప్రకటించారు. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ మాకు ఉత్తమ గురువు. మేం వారినుంచి నేర్చుకుంటాం అని మావో అన్నారు.

1949 దాకా మావో రచనలన్నీ ఆయనకు ఒక సనాతన మార్క్సిస్టుగా చూపుతాయి. వ్యక్తిరాజ్య సంబంధాల విషయంలో ఆయనవన్ని నూతన ఆలోచనలుగా గోచరిస్తాయి. అదే సమయంలో ఆయన లెనిన్, స్టాలిన్‌ల సోవియెట్ నమూనా పూర్తిగా స్వంతం చేసుకున్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యం, హక్కులు, స్వేచ్ఛ, నియంతృత్వం అని మావో వాడిన మాటలు పూర్తిగా సిద్ధాంతీకరించిన మాటలు. మావో ఒక జాతీయ భాగస్వామ్య మార్క్సిస్టు కార్యకర్త సిద్ధాంతాల నిబద్ధత కలవారుగా పేర్కొనవచ్చు. హక్కులు స్వేచ్ఛలకు సంబంధించి ఆయన భావాలన్ని విస్తృతంగా, లోతైన తాత్విక దోరణులతో, ప్రాపంచిక దృక్పథంతో కూడి ఉన్నవి. కాగా జపాన్ సామ్రాజ్యవాదాన్ని తుద్దముట్టించాలన్న ఏకైక లక్ష్యంతో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, హక్కులు అన్ని విషయాలను మావో కక్ష పూరితంగా వ్యాఖ్యానించారన్న వ్యాఖ్యానాలు వున్నాయి. సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో కలిసి వచ్చే వర్గాన్నైనా కలుపుకోవడానికి ఆయన సిద్ధ పడ్డారు. ప్రజాస్వామ్యం అంటే ఇతరులు ఇతర వర్గాలలో కుమ్మక్కు కావడం లాంటింది. ఉదారవాదాన్ని మావో తిరస్కరించారు. శ్రామిక వర్గ నియంతృత్వం పై మావో భావనలన్నీ అక్టోబర్ విప్లవానంతరం సోవియట్ చర్యలతో పోల్చి చూపవచ్చు. మైనారిటీల పరిరక్షణ, జాతీయ స్వాభిమానాలకు సంబంధించిన మావో ఆలోచనలు కూడా సోవియట్ నమూనాలే.

BRAOU

## 7.3 మావో ముఖ్యమైన సిద్ధాంతాలు :

1). ప్రజాపంథా .. ప్రజల నుంచి ప్రజల వద్దకు..

2). విప్లవానికి మూలస్తంభంగా రైతాంగం.

3). సిద్ధాంతం – ఆచరణ

4). వైరుధ్యాల పరిష్కారం

5). శాశ్వత విప్లవం లేదా విప్లవం కొనసాగింపు (సాంస్కృతిక విప్లవం)

6). నూతన ప్రజాస్వామ్యం

7). ప్రజల ప్రజాస్వామ్య నియంతృత్వం. కానీ మావో తరుచుగా ప్రజాస్వామ్యాన్ని కేంద్రీకృతానికి ముడిపెట్టేవారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యమే ప్రజల వాంఛలను నెరవేరుస్తుందనీ బోధించేవారు.

మావో భావనలకు ముఖ్యంగా ఆయా సందర్భాల్లో ఆయన ఆలోచనల నేపథ్యంలో ఇక చైనా రాజ్యాంగ నిబంధనలు, మానవ హక్కులను పరిశీలిద్దాం.

## 7.4 చైనా రాజ్యాంగాలు – మానవ హక్కుల ప్రస్తావన :

1949 నుంచి చైనా నాలుగు రాజ్యాంగాలు రూపొందించింది. 1954, 1975, 1978, 1982 లో ఈ నాలుగు రాజ్యాంగాలు రూపకల్పన చేశారు. 1954 లో చైనా కమ్యూనిస్టు పార్టీలు వైస్ ఛైర్మన్ లీషావ్‌చీ ప్రధమ రాజ్యాంగం పరిచయ నివేధికలో ఈ విధంగా పేర్కొన్నారు.

BRAOU

"మా దేశంలో ప్రజలకు ఏ మాత్రం రాజకీయ అధికారం లేని స్థితి ఇక అంతమవుతుంది. ఉన్నత ప్రజాస్వామ్యాన్ని ఈ దేశం చవిచూసింది. గతంలో రాజ్య వ్యవహారాలలో ఏ మాత్రం సంబంధం లేని చాలా మంది ప్రజలు 'ఇప్పుడు దేశ రాజకీయ జీవితంలో భాగస్వాములవుతారు"

1954 రాజ్యాంగం అధికరణ ఒకటిలో మావో ఆలోచనా విధానాల మేరకు ఎర్ర చైనా శ్రామికవర్గం నేతృత్వంలో, కార్మిక, కర్షక ఐక్యతతో ప్రజల ప్రజాస్వామ్య రాజ్యంగా ఉంటుందని ప్రకటించారు. అధికరణ 2 లోనే చైనాలో అధికారమంతా ప్రజలకే చెందుతుందని ప్రకటించారు. అయితే ఈ అన్నమాటను సాధారణ అర్థంలో కాకుండా ఈ పాఠంలో మావో భావనల్లో పేర్కొన్నట్టుగా సిద్ధాంతీకరించిన ధోరణిలో తీసుకోవాలి. పాత ప్రజలను దోపిడీ చేసే గత రాజ్యపు అన్ని పద్ధతులను నిర్మూలించారు. అధికరణ 43 దేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా రాజ్యానికి సంబంధించింది. అయితే నాలుగు రకాల యజమాన్యాన్ని మాత్రం రాజ్యాంగంలో పేర్కొన్నారు. అధికరణ 8 లో ధనిక రైతాంగం ఆర్థిక వ్యవహారాలను రద్దు చేశారు (ధనిక రైతాంగాన్ని ప్రజా శతృవులుగా పరిగణించినందున వారికి హక్కులు నిరాకరించారు) అయితే వ్యక్తిగత ప్రైవేటు ఆస్థి, వారసత్వాన్ని మాత్రం అనుమతించారు. (అధికరణ 11-14) కానీ ఏ వ్యక్తి అయిన ప్రజా ప్రయోజనాలను ప్రైవేటు ఆస్థితో విచ్ఛినం చేయడాన్ని రాజ్యం నిరోధిస్తుంది. శ్రమ మాత్రమే గౌరవానికి గుర్తింపు కలిగి వుండి. వారి అభిప్రాయాలను, నిర్వహణను మన్నించాలని కోరారు. భూస్వాములు పెట్టుబడిదారులకు రాజకీయ హక్కులను నిరాకరించారు. వారిని సంస్కరించాలని తలపెట్టారు. (అధికరణ 19) ఎన్నికైన ప్రతినిధులను రీకాల్ చేసే హక్కు కల్పించారు. అధికరణలు 85-103 దాకా

ప్రాథమిక హక్కులు, విధులను పొందుపరిచారు. అవి (1). చట్టంముందు అందరికీ సమాన హక్కు (2). ఎంపిక చేసుకొనే హక్కు ఎన్నికయ్యే హక్కు (3). స్త్రీలకు సమాన హక్కు (4). భావ స్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛ ప్రదర్శన, ఊరేగింపు, సంఘం ఏర్పాటుచేసుకొనే హక్కు, సమావేశహక్కు, మత విశ్వాస హక్కులు, (సోవియట్ యూనియన్‌లో లాగా ఈ హక్కులు పొందడానికి రాజ్యం తగిన వసతులు కల్పిస్తుంది.) (5). వ్యక్తి స్వేచ్ఛ, అక్రమ నిర్బంధం నుంచి స్వేచ్ఛ వసతి స్వేచ్ఛ, నివాస మార్పిడి స్వేచ్ఛ (6). పని హక్కు, విశ్రాంతి హక్కు (7). వృద్ధాప్యం, అనారోగ్యం, వికలాంగులైన పక్షంలో భౌతిక సాయం హక్కు (8). విద్యా హక్కు (9). శాస్త్రీయ పరిశోధన, సాహిత్య కళా సృజనల్లాంటి ఇతర సాంస్కృతిక హక్కులు (10). పెళ్ళి, కుటుంబం తల్లీ, పిల్లల సంరక్షణ హక్కు (11). అధికారులకు వ్యతిరేకంగా విధి నిర్వహణా నిర్లక్ష్యం, చట్ట ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసే హక్కు (12). విదేశీయుల శరణార్థుల హక్కు.

విధుల జాబితా ఇది :

1. రాజ్యాంగానికి చట్టానికి కట్టుబడి వుండాలి.
2. పనిలో క్రమశిక్షణ పాటించాలి.
3. ప్రభుత్వ నియంత్రణ పరిరక్షణ
4. సామాజిక నీతిపై గౌరవం.
5. ప్రభుత్వ ఆస్థుల పరిరక్షణ
6. పన్నులు విధిగా చెల్లింపు
7. మాతృభూమి రక్షణ
8. సైనిక విధులు, విధుల నిర్వహణను బట్టి హక్కులు అనుభవించడం వుంటుంది.

1954 రాజ్యాంగంలో హక్కుల జాబితాలో విస్తృతంగా వుంది. అది ఎంత విశాలంగా వుందంటే పాశ్చాత్య దేశాలు చివరకు భారతదేశం రాజ్యాంగాలలో కూడా హక్కుల జాబితా ఇంత విస్తృతంగా లేదు. ఈ రాజ్యాంగంపై సోవియట్ రాజ్యాంగ ప్రభావం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. వాస్తవానికి 1954 చైనా రాజ్యాంగాన్ని 1936 స్టాలిన్ రాజ్యాంగం నమునాలో తీర్చిదిద్దారు. అయితే మాత్రంగా 1977 కి గానీ సోవియట్ రాజ్యాంగం చేర్చుకొని రాజ్యాన్ని కోర్టులో నిలదేసే హక్కును 1954లోనే చైనా రాజ్యాంగంలో పొందుపరిచారు.

BRAOU

1975 లో చైనా సోషలిస్టు దేశంగా మారుతున్న క్రమంలో కొత్త రాజ్యాంగం అవసరమని .చౌ ఎన్‌లై. ప్రకటించారు. 1975 లో నూతన రాజ్యాంగం ఆవిర్భవించింది. కేవలం 30 అధికరణలతో దీన్ని రూపొందించారు. మార్క్సిజం, లెనినిజం – మావో ఆలోచనా విధానం మన జాతికి సైద్ధాంతిక పునాది మార్గదర్శక విధానం ఈ విధానాల అమలుకు చైనా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహిస్తుంది. అని ప్రకటించారు. (అధికరణ 2) పౌరుల హక్కులను కుదించి, నివాస మార్పిడి, నివాస హక్కులకు, శాస్త్రీయ పరిశోధన, సాంస్కృతిక సృజనాత్మకత హక్కులను తీసివేశారు. విధులలో పనిలో క్రమశిక్షణ, ప్రభుత్వ నియంత్రణ పరిరక్షణ, సామాజిక నీతులను గౌరవించడం అన్న విధులను తీసివేశారు. ఈ రాజ్యాంగంలో సమ్మె చేసే హక్కు చేర్చడం ప్రధానాంశం. మిగితా హక్కులు, విధులు అన్నీ వుంచారు. 1960 మధ్యలోని సాంస్కృతిక విప్లవానికి కావలసిన మేరకు రాజ్యాంగంలోని హక్కులు, విధులను మార్పులు చేయడం, చేర్చడం జరిగింది.

మూడు సంవత్సరాల తర్వాత 1978 లో మావో నిర్యాణం అనంతరం చైనా రాజ్యాంగాన్ని మార్చారు. మావో అధినేతృత్వం వున్న కాలంలో మాదిరిగానే నూతన రాజ్యాంగంలో కూడా ..వేయి పూలు వికసించనీ, వేయి అలోచనలు వర్థిల్లనీ.. అన్న నినాదాన్ని రాజ్యాంగంలో వుంచారు. ఈ కాలంలోనే మావో తదనంతరం చైనాలో పాతుకున్న స్వేచ్ఛా విపణి ధోరణులు కనబడ్డాయి. అందుకే ఈ రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నతను పేర్కొన్నారు. తత్ఫలితంగానే వేతనాలు రాయితీలపై కోత విధించి, వృత్తి సామర్థ్యం పోటీని అనుమతించారు. సమ్మె హక్కు యథాతథంగా వుంచారు. విచిత్రంగా 1954 రాజ్యాంగంలోని చాలా నిబంధనలను మళ్ళీ రాజ్యాంగంలో చేర్చారు. అవి ఇవి. పని క్రమ శిక్షణ సంరక్షణ విధి, శాంతి భద్రతల పరిరక్షణ విధి, సామాజిక పరిరక్షణ విధి, 1978 రాజ్యాంగం చాలా స్పష్టంగా సాంస్కృతిక విప్లవం రేకెత్తించిన అలజడి ఒక అంతమవుతుందని పేర్కొన్నది. ఆధునీకీకరణ, ఆర్థిక వ్యవస్థలో మార్పులు, విదేశీ పెట్టుబడులకు ప్రోత్సాహం, కఠిన పరిశ్రమ తదనుగుణంగా రాయితీలు అన్నవి 1978 రాజ్యాంగంలో చేర్చారు.

1982 రాజ్యాంగం 56 అధికరణలతో రూపొందించారు. కార్మిక కర్షక ఐక్యతతో శ్రామిక వర్గ నియంతృత్వం అని ఒక పక్క అంటూనే ఈ రాజ్యాంగంలో ఆర్థిక వ్యవస్థ మార్పులు, అసమానతలు, రాయితీలు కూడా సమ్మిశ్రమంగా చేర్చారు. (అధికరణ 1) కొత్త మార్కెట్ ఆధారిత సోషలిజంతో అధికారం ప్రజలదే అన్న విషయానికి, వైరుధ్యం ఏది లేదని ప్రకటించారు. (అధికరణ 2) కేంద్రీకృత ప్రజాస్వామ్యం, దీనిలో ప్రజాస్వామ్యం కొరవడి, కేంద్రీకృతం ఎక్కువ అయిన స్థితిలో అధికరణ 3 లో చేర్చారు. అన్ని జాతులు సమానమేనని పేర్కొంటు, మైనారిటీల రక్షణకు రాజ్యాంగం హామీ పడింది. (అధికరణ 4) సోషలిస్టు న్యాయవ్యవస్థను హుందా అయిన ఏకీకృత న్యాయ వ్యవస్థగా పేర్కొంటూ ఎవరూ చట్టానికి అతీతులు కారని ప్రకటించారు. (అధికరణ 5) పౌరులు న్యాయబద్ధంగా సంపాదించిన ఆస్తిని కలిగివుండవచ్చునని ప్రకటించారు (అధికరణ 13), అలాగే అధికరణ 18 లో విదేశీ పెట్టుబడులను, ఉమ్మడి వ్యాపారాన్ని, ఆహ్వానించారు. అధికరణలు 19 నుంచి 22 వరకు విద్యాహక్కు, ఆరోగ్య, సాంస్కృతిక హక్కులు కల్పించారు. అధికరణ 28 లో ఇలా ప్రకటించారు.

BRAOU

"రాజ్యం శాంతిభద్రతలను కాపాడుతుంది. విప్లవ వ్యతిరేక కార్యకలాపాలను, దేశ ద్రోహాన్ని అణచివేస్తుంది. ప్రజాభద్రతకు వాటిల్లే హానిని, సోషలిస్టు ఆర్థిక విధానాన్ని విచ్ఛినం చేసే వారికి, నేర కార్యకలాపాలకు పాల్పడేవారిని రాజ్యం శిక్షిస్తుంది. నేరస్తులను సంస్కరిస్తుంది"

అయితే, ఈ అధికరణ అసలు ఆచరణలో దుర్వినియోగం అయ్యే అవకాశం వుంది. రాజ్యాంగం అధ్యాయనం 2 ( అధికరణ 33-56)లో పౌరుల హక్కులు విధుల జాబితా రూపొందించారు.

"ప్రతి పౌరుడు హక్కులు అనుభవించాలి. కానీ, రాజ్యాంగం చట్టం అభివర్ణించిన విధులను సమర్థంగా నిర్వహించినప్పుడు పౌరులకు హక్కులుసంప్రాప్తిస్తాయి. అని స్పష్టంగా పేర్కొన్నారు. అధికరణ 51 లో "పౌరులు అనుభవించే హక్కులు 1 రాజ్య ప్రయోజనాలు, సంఘ ప్రయోజనాలు ఇతర పౌరుల ప్రయోజనాలను కబళించేవిగా వుండరాదు.. అని పేర్కొన్నారు. ఈ రాజ్యాంగంలో చేర్చిన హక్కులు. 1. చట్టం ముందు అందరూ సమానులే. 2. ఓటు వేసే హక్కు, ఎన్నికయ్యే హక్కు 3. భావ స్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛ సంఘం హక్కు, ప్రదర్శన, ఊరేగింపు, మత విశ్వాసం హక్కు కల్పించారు. (అధికరణ 36) శాస్త్రీయ పరిశోధన, సాహిత్య, కళా, సాంస్కృతిక

సృజనాత్మక కార్యాచరణ హక్కు 4). అక్రమ నిర్బంధం మంచి వ్యక్తికి స్వేచ్ఛ 5). రాజ్యానికి సంబంధించిన ఏ సంస్థపైన అయినా, అధికారిపైనైనా విమర్శలు చేసే హక్కు. 6). రాజ్యం లేదా రాజ్య సంస్థల వల్ల హక్కులకు భంగం కలిగినప్పుడు నష్టపరిహారం కోరే హక్కు 7). పని హక్కు, విశ్రాంతి హక్కు 8). వృద్ధాప్యం, పదవీవిరమణ, వికలాంగులైనప్పుడు భృతి పొందే హక్కు 9). స్త్రీ, పురుష భేదం లేకుండా స్వేచ్ఛ కుటుంబం, తల్లీ పిల్లల సంరక్షణ విధి హక్కు.

విధులలో వీటిని చేర్చారు.

1). కుటుంబ నియంత్రణ విధిగా పాటించాలి.

2). మైనర్ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే విధి.

3). తల్లిదండ్రులకు మద్దతు సాయం నిధి (పిల్లలు, వృద్ధులు, స్త్రీలపై వేధింపులను నిషేధించారు)

4). దేశ ఐక్యతను కాపాడే విధి, రాజ్య రహస్యాలను కాపాడటం. ప్రజా ఆస్తులను పరిరక్షణ, కార్మిక క్రమశిక్షణ పాటించడం, సామాజిక నీతిపట్ల గౌరవం.

5). మాతృభూమి గౌరవాన్ని ప్రయోజనాలను, భద్రతను కాపాడటం

6). దండయాత్రలకు ప్రతిఘటన దేశ రక్షణకు సైన్యంలో చేరడం, మిలీషియాలో చేరడం.

7). పన్నుల చెల్లింపు

ఈ విధంగా నాలుగవ రాజ్యాంగంలో శాంతిభద్రతలు, క్రమశిక్షణ, కఠిన కృషికి పెద్దపీట వేశారు. 1954 రాజ్యాంగంలోని చాలా హక్కులను, మళ్ళీ ఈ రాజ్యాంగంలో చేర్చారు.

BRAOU

## 7.5 చైనాలో హక్కుల అమలు తీరు – పరిశీలన:

పూర్వపు సోవియెట్ యూనియన్ మాదిరిగానే చైనాలో కూడా హక్కుల అమలు తీరు ఘోరం, .మరీ ముఖ్యంగా రాజకీయ హక్కుల విషయంలో చైనా కూడా వెనుకబడివుంది. అయితే రాజకీయ వ్యతిరేకులను చంపడం మావో కన్నా సోవియట్‌లో స్టాలిన్ హయంలోనే ఎక్కువ జరిగినప్పటికినీ, చైనాలో రాజకీయ వ్యతిరేకులకు అవమానాలు, నిర్బంధాలు, చివరకు కొన్ని చావులు కూడా జరిగినట్లు వార్తలున్నాయి. కానీ చైనా లాంటి అతి పెద్ద జనాభా గల, పరిమాణం గల దేశంలో పని హక్కు, కల్పించడం, అమలు పరచడం మాత్రం ఒక అధ్భుతమే. అలాగే విద్యాహక్కు ప్రజా ఆరోగ్యం, వృద్ధాప్య సహాయ సౌకర్యాల పరికల్పనలో చైనా నిజాయితీగా వ్యవహరించింది. ఇది ఈ దేశ గొప్ప తనంగా చెప్పవచ్చు. కానీ ఒక సిద్ధాంతం. ఒకే పార్టీ, ఒకే ప్రణాళిక, మావో వ్యక్తిత్వ ఆరాధన, పట్టు విడుపులు లేని కేంద్రీకృత విధానాలు, ఉక్కు క్రమశిక్షణ, సాంస్కృతిక విప్లవం ఏర్పరిచిన చైనాలో బాధాకర పరిస్థితులను, తప్పుడు ప్రచారానికి అవకాశాన్ని కల్పించాయి. 1997 జూన్‌లో ప్రెసిడెంట్ జియాంగ్ జెమిన్ ప్రత్యర్థి కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు క్యియావోషి సాంస్కృతిక విప్లవాన్ని కల్లోలంగా వాఖ్యానించారు. కాగా చైనాలో విధులు చాలా ఎక్కువ. వాటిని సంతృప్తికరంగా నిర్వహించడం కష్టతరం. ఒక పౌరుడు సంతృప్తికరంగా విధులు నిర్వర్తించలేనప్పుడు వాటంతటవే హక్కులు కూడా పోతాయి. నిజానికి వ్యవస్థను విమర్శించనక్కరలేకుండానే కేవలం పాలనను విమర్శించినా కూడా ఒక పౌరుణి ద్రోహిగా, విప్లవ వ్యతిరేకిగా ప్రజా శత్రువుగా ముద్రవేసే అవకాశం ఏర్పడింది. ఇది కల్పితమైన ఊహకాదు. చైనాలో మావో ప్రారంభించిన .గొప్ప ముందంజ.. శ్రామిక వర్గ సాంస్కృతికి విప్లవం సమయంలో చాలా మంది దేశద్రోహులు, ప్రజా శత్రువులు, పెటుబడిదారీ తైనాతీలుగా

ముద్రలు వేయించుకొని దేశ బహిష్కారానికి గురయ్యారు. ఉరిశిక్షలకు బలయ్యారు. నిర్బంధాలకు గురయ్యారు. గొప్ప ముందంజ అతిగా జరిగినట్టు మావో, సాంస్కృతిక విప్లవంలో తప్పులు జరిగినట్లు . జియాంగ్ జెమిన్‌లు స్వయంగా అంగీకరించారు. ఇవ్వాల్టి దాకా పార్టీ మద్దతుదారుగా వున్నవారు రేపటికల్లా, ద్రోహి అయ్యే పరిస్థితులున్నాయి. కాగా మావో తనుకు వ్యతిరేకంగా వున్న వారిని అణచివేసేందుకు వారికి వ్యతిరేకంగా మరొకరిని ప్రోత్సాహించేవాడన్న అపవాదు ఉంది. ప్రధమ రాజ్యాంగకర్త లీషాన్‌చీ తొందరగానే అనుమానితుడు అయి సాంస్కృతిక విప్లవం కాలంలో దేశద్రోహి అనిపించుకున్నారు. మావో వారసుడుగా పేరుపడిన . లిన్ పియావో. ఒక విమాన ప్రమాదంలో అనూమానస్పదంగా మరణించాడు. ఆయన చైనా నుంచి వెళ్ళిపోతున్నప్పుడు ఇది జరిగిందని అంటారు. 1975 రాజ్యాంగకర్త షాంఘైలో రాడికల్ లీడర్‌గా పేరుపడిన . జాంగ్‌చుక్ కియావో. అనంతర కాలంలో గ్యాంగ్ ఆఫ్ ఫోర్ (దుష్టచతుష్టయం) లో ఒకడిగా అరెస్టయ్యాడు. పెట్టుబడి దారి విధానం పునరుద్ధానుడిగా డంగ్ సియావో సింగ్ కూడా నిందలకు గురయ్యాడు. పెద్దనాయకులను అలా ప్రక్కన పెడితే చాలా మంది పార్టీ మద్దతుదారులు కార్యకర్తలు కూడా విపరీతమైన వేధింపులకు గురయ్యారు. ఇటీవలి కాలంలో . సాంస్కృతిక విప్లవం పైన చాలా పుస్తకాలలో మానవహక్కులు రికార్డు ఏమంత బాగాలేదు. ఇప్పటికే చైనాకు మానవ హక్కుల ఉల్లంఘున దేశంగా ముద్ర వుంది. 1989 తియాన్మెన్ స్క్వేర్ ఉదంతం ఎనిమిదవ వార్షికోత్సవము జరపడానికి 55000 ల మంది విద్యార్థులు గుమికుడారు. ఇదో చిహ్నం. అంతర్జాతీయంగా చైనాకు తియాన్మెన్ స్క్వేర్ మరణకాండ చెడ్డపేరు తెచ్చిపెట్టింది. దాని తర్వాత కూడా అక్రమ నిర్బంధాలు, చిత్ర హింసలు వెలుగులోకి వస్తున్నాయి. చైనా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నదని అమెరికా అధ్యక్షులు జార్జి బుష్, కార్టర్ చివరకు క్లింటన్ దాకా విమర్శిస్తూనే ఉన్నారు. అయితే చైనా మాత్రం మానవహక్కులపై పాశ్చాత్యధోరణులను తిరస్కరిస్తూనే వుంది. పాశ్చాత్య దేశాలు డిమాండ్ చేస్తున్న వ్యక్తిగత, రాజకీయ హక్కుల కన్నా చైనాకు పని హక్కు, మనుగడ హక్కు, విద్యా, ఆరోగ్యం, నివాసం చాలా ముఖ్యమని చైనా అధికారికంగానే ప్రకటిస్తున్నది. అయితే కొత్తగా చైనాలో ప్రవేశించిన పెద్ద మొత్తాలలో విదేశీ పెట్టుబడులు ఆర్థికంగా పుంజుకోవడం, అంతర్జాతీయ మార్కెట్ ఎక్స్ఛేంజీలు కూడా చైనా పరిస్థితులలో పెద్దగా మార్పులు తీసుకురాలేదు. వాణిజ్య వ్యాపారాలను, రాజకీయాలకు తప్పించుకోవడానికి చైనా యూరోపియన్ యూనియన్, అమెరికాతో బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని సాకుగా ఉపయోగించుకున్నది. కాగా చైనా వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ( డబ్ల్యు. టి. ఓ) సభ్యత్వం మాత్రం, మానవ హక్కుల ఉల్లంఘునల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నది. 1997 లో చైనాలో జరిగిన మానవ హక్కుల కమీషన్‌లో డానిష్, డచ్చి ప్రభుత్వాలు, చైనాలో మానవ హక్కుల ఉల్లంఘనలు విమర్శించినందుకు చైనా ఈ రెండు దేశాలలో వాణిజ్య సంబంధాలను తెంచివేసుకున్నది. 1997 ఏప్రిల్‌లో హాలెండ్, డెన్మార్క్‌లను కూడా ఇదే విషయమై హెచ్చరించింది. ఫలితంగా మే 1997 లో జరిగిన యూరోపియన్ యూనియన్ సమావేశంలో చైనా ధోరణిని, చైనాలో మానవ హక్కుల ఉల్లంఘణను ఖండించింది. అమెరికా చైనాకు, మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎం.ఎఫ్.ఎన్) కితాబు ఇవ్వడానికి ప్రతి సంవత్సరము చైనా మానవ హక్కుల అమలు తీరును పరిశీలిస్తుంది.

1970 దాకా బహిర్ ప్రపంచానికి . చైనాలో ఏం జరుగుతుందో తెలియదు కానీ సమాచారం బహిరంగం కావడం, విస్తృతం కావడంతో ఇప్పుడిప్పుడే చైనా గురించి వెల్లడవుతుంది.

ఒక రకంగా అంతర్జాతీయ వత్తిడులు కూడా అనుకూలంగా పనిచేస్తున్నాయి. ఇందుకు సూచనగా 1997 ఏప్రిల్‌లో చైనా అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ మాట్లాడుతూ 1997 చివరికల్లా తాము ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులపై జరిగిన ఐక్యరాజ్యసమితి ఒడంబడికలపై సంతకం చేస్తామని హామీ ఇచ్చారు. ఇది మానవ

BRAOU

హక్కులకు ఒక శుభసూచకం.

## 7.6 మానవ హక్కుల సిద్ధాంతం, ఆచరణలకు సంబంధించి సోషలిస్టు ప్రపంచం భాగస్వామ్యం:

సోషలిస్టు ప్రపంచం మానవ హక్కులను, ఆర్థిక పరిస్థితులకు ముడిపెట్టింది. మానవుల ఏ హక్కు కూడా భౌతిక వాస్తవాలకు మించినది కాదని, ఒక సమాజంలో సాధారణ స్థాయి ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధి ముఖ్యమని సోషలిస్టు ప్రపంచం భావించింది. అలాగే మానవులకు ఉన్నతంగా తీసుకునే స్వాభావిక సార్వత్రిక హక్కులను విమర్శించింది. సాంఘికంగా ఒక మానవుడు అమూర్తంగా జీవించలేడు. అతను ఎల్లవేళలా ఒక వర్గానికి ప్రాతినిధ్యం వహించే సంఘ జీవి. ఒక వ్యక్తి వర్గం స్వేచ్ఛగా వుంటే ఆ వ్యక్తి కూడా స్వేచ్ఛగా వుంటాడన్నది సోషలిస్టుల భావన.

మానవ హక్కులకు సామాజిక సందర్భానికి ముడివేసి, హక్కులు, సాంఘీకమైనవి కాని, వ్యక్తిగతమైనవి కాని సోషలిస్టు ప్రపంచం భావన ఈ రకంగా వ్యక్తికన్నా సమాజం గొప్పది. వ్యక్తి సమాజం – రాజ్యం పరస్పరవైరుద్యాలు కలిగినవి ఎంతమాత్రం కాదు. వ్యక్తివాదన వర్గ సమాజంలో బూర్జువ దృక్పథం, మానవ హక్కులను రాజ్యానికీ, వ్యక్తికీ మధ్య సంబంధంగా చిత్రించడం సరిపోదు. అని సోషలిస్టు ప్రపంచం వాదించింది. రాజ్యం వర్గహింసలో తాత్కాలిక పరికరమేనని క్రమక్రమంగా రాజ్యం అంతరించిపోతుంది. కనుక మానవ హక్కులకు ఆర్థిక సామాజిక దృక్కోణం ఉండాలని వారి వాదన. వర్గ దృక్కోణం నుంచి హక్కులను పరిశీలించడం ఒక రకంగా కొత్తగాను, గొప్పగాను చెప్పవచ్చు.

సాంప్రదాయ మానవ హక్కులకు, అపూర్వ రీతిలో సోషలిస్టు ప్రపంచం మరికొన్ని హక్కులను కలిపింది. ప్రత్యేకంగా సోషలిస్టు ప్రపంచంలో మాత్రమే ఉండిన ఈ హక్కులు పనిహక్కు, విశ్రాంతి, సెలవు, విద్యా, ఆరోగ్యం, గృహ వసతి, వృద్ధాప్య ప్రపంచం కల్పించిన కొత్త హక్కులు వీటితో అట్టడుగున ఉన్న కార్మిక కర్షక వర్గాలు ఈ ప్రపంచంలో పాలకులు కావడమనే అద్భుతం జరిగింది.

ప్రపంచపటం మీద అప్పటిదాకా ఏకఛత్రాధిపత్యం వహించిన ఉదార దృక్పధాన్ని సోషలిస్టు ప్రపంచం తీవ్రంగా దుయ్యబట్టింది. హక్కులు ఎవరికీ, ఏ వర్గానికీ ? ఎవరి ప్రయోగల కోసం ? ఒక రాజు, ఒక నిరుపేద రాజకీయంగా సమానమేనా ? ఈ ప్రశ్నలకు సోషలిస్టు ప్రపంచం కటువైన సమాధానాలు చెప్పింది. వర్గసమాజంలో సమానత్వ హక్కు, అసమానమని, ఇవి కపట పూరితమని సోషలిస్టు ప్రపంచం తెగనాడింది.

అయితే మానవ హక్కుల ఆచరణ మాత్రం ముఖ్యంగా రాజకీయ హక్కులకు సంబంధించి సోషలిస్టు ప్రపంచంలో కొయ్య మిగిలిపోయింది. బహుళ రాజకీయ వ్యవస్థలను నిరాకరించినందు వల్ల ఈ ప్రపంచంలో కేవలం నియంతృత్వ పాలనలో మాత్రమే వినిపించే సంపూర్ణ ఏకాధిపత్యం ఉండే ప్రభుత్వాలు ఏర్పాటుకు దారితీసింది. ప్రపంచం ఇప్పటివరకు ఇలాంటి స్వయం సామర్థ్య బలమైన రాజ్యాలను చూడలేదు. వ్యక్తి పూర్తిగా కుదింపబడ్డారు. ఉత్పత్తి శక్తులపై యాజమాన్యం ఒక పార్టీ ఒకే సిద్ధాంతం, ఒకే ప్రణాళిక, కేంద్రీకృత వ్యవస్థల వల్ల ఇవి తుదకు శ్రామిక వర్గంపైనే నియంతృత్వానికి దారితీశాయి. స్టాలిన్, మావో వ్యక్తి ఆరాధన, అక్రమాలు భౌతికంగా విపరీతమైన నష్టాన్ని కల్గించారు. ఈ పరిణామాలు మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతం ప్రతిష్టను మంటగలిపాయి.

మానవ హక్కులకు పూర్తి వ్యతిరేకమయిన నియంతృత్వ పోకడలు, సోషలిస్టు పాలనలో పొడసూపాయి. మానవ హక్కుల సిద్ధాంతం, ఆచరణల మధ్య గండి పూడ్చరానిదైంది. సోవియెట్ యూనియన్, చైనా, తూర్పు ఐరోపా తదితర అన్ని సోషలిస్టు దేశాలలో రాజ్యాంగాలన్నింటిలోనూ, మానవ హక్కులను గొప్పగా ప్రవచించినప్పటికీ, ఆచరణలో వాటిని ఉల్లంఘించారు. అసమ్మతి ఏమాత్రం యోచన లేని .మూస. మనుషులుగా తయారు చేశారు. ప్రజలకు మానవ ప్రతిష్టలు, రాజకీయ హక్కులు నిరాకరించారు. కాగా, 1989లో తూర్పు ఐరోపాలు ప్రజాస్వామ్య విప్లవాలు, 1991 డిసెంబరులో సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నం, చైనాలో మార్కెట్ సోషలిజం ప్రవేశపెట్టటంతో సోషలిస్టు ప్రపంచం దరిదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. అయితే, ప్రపంచానికి పూర్తి కొత్త ప్రయోగంగా ఉన్న సోషలిస్టు ప్రపంచపు సైద్ధాంతిక అవగాహన అధ్యయనం చేయడానికి గొప్ప అంశం. మానవ హక్కులను కొత్త కోణంలో, మాననీయ ఉదారస్వభావంలో పరిచయం చేసింది. సోషలిస్టు ప్రపంచమే అనడంలో అతిశయోక్తి లేదు.

## 7.7 ముగింపు :

చైనాలో మానవ హక్కులకు సంబంధించిన అంశాలలో సోవియెట్ ప్రభావం ఉన్నదనడం నిర్వివాదాంశం. అయితే, చైనాలో మాత్రం మావో, మానవ హక్కులకు ..ప్రజాపంంథా.. నూతన ప్రజాస్వామ్యం, ప్రజా నియంతృత్వం అన్న మాటలను కలిపి, సైద్ధాంతిక అవగాహనతో .రాజ్యం. .ప్రజలు., .ప్రజాస్వామ్యం., .హక్కులు. అన్న కొత్త దృక్కోణాన్ని ఇచ్చారు. ప్రజల మీద ఎక్కువ శ్రద్ధ వహించిన ఈ భావనలు, అనంతరం సాంస్కృతిక విప్లవం మాత్రం చైనా ప్రజలకు దురదృష్టంగా పరిణమించింది. ఈ స్థితిలో మానవ హక్కులే మొదట మృగ్యమయ్యాయి. చైనాలో నాలుగు రాజ్యాంగాలలోనూ మానవ హక్కుల విస్తృత జాబితా ప్రకటించారు. అయితే ఆర్థిక, సామాజిక హక్కుల వరకు బాగానే అమలు చేసినా, రాజకీయ హక్కులు మాత్రం అసలిక్కడ అమలు కాలేదు. ఇక్కడ రాజ్యాంగ వాస్తవాలు, రాజకీయ వాస్తవాలు కాకుండా పోయాయి చైనాలో మానవహక్కుల అమలు మరో నాసిరకం కావడంతో ఈ దేశం సదా ప్రతిష్టకోసం పాకులాడవలసే వచ్చింది. ఒకటి ప్రపంచంలో సంబంధాలు, ఆర్థిక స్వావలంబన, పుంజుకుంటున్న ఆర్థిక వ్యవస్థలో వాణిజ్య అవశ్యకాలు, విదేశీ పెట్టుబడుల అవసరాల వల్ల చైనా బయట తన మానవ హక్కుల .రికార్డు. బాగుండాలని తాపత్రాయపడింది.

BRAOU

## 7.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి**

1. మానవ హక్కులపై మావో అభిప్రాయములకు విమర్శనాత్మకంగా పరిశీలించండి ?
2. చైనా 194, 1987 రాజ్యాంగంలోని మానవ హక్కుల నిబంధనలు పోల్చి చూడండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి**

1. మానవ హక్కుల సిద్ధాంతం, ఆచరణలలో సోషలిస్టు ప్రపంచం భాగస్వామ్యాన్ని వివరించండి ?

# భాగం – 8 : క్యూబా, పోలెండులో మానవ హక్కులు

విషయక్రమం :

8.0 ఉద్దేశం

8.1 పరిచయం

8.2 క్యూబా

8.2.1 విప్లవోద్యమానికి ముందు క్యుబా

8.2.2 విప్లవోద్యమ కాలంలో క్యూబాలోని మానవ హక్కులు సిత్థిగతులు

8.2.3 మానవ హక్కుల ఉల్లంఘున

8.3 పోలెండ్

8.3.1 సంక్షిప్త చరిత్ర

8.3.2 నాజీల నియంత్రణ పోలెండ్

8.3.3 మానవ హక్కుల పరిస్థితి

8.3.4 పోలెండ్‌లో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన పాత్ర

8.3.5 ప్రజాస్వామ్య దేశంగా పోలెండ్

8.3.6 యూదుల పట్ల వివక్ష

8.4 ముగింపు

8.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 8.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- సోషలిస్టు దేశాలైన క్యూబా, పోలెండులపై అవగాహన పెంపొందించుకుంటారు.
- విప్లవోద్యమ కాలంలో క్యూబాలోని మానవహక్కుల స్థితిగతులు తెలుస్తాయి.
- పోలెండులో ప్రజాస్వామ్యం బలపడిన తీరును తెలుసుకుంటారు.

## 8.1 పరిచయం:

సామ్యవాద దేశాలలో మరీ ముఖ్యంగా గతంలో సామ్యవాద దేశాలుగా ఉన్న వాటిలో మానవ హక్కుల అమలును దృష్టి పథంలో వుంచుకుని ప్రస్తుత భాగంలో క్యూబా పోలెండులను విశ్లేషించడం జరిగింది. భూగోళం యొక్క పశ్చిమ భాగంలో వున్న ఏకైక సంపూర్ణ సామ్యవాద దేశంగా క్యూబాకు పేరుంది. గతంలో ఉన్నటువంటి సామ్యవాద సోవియట్ కూటమిలో పోలెండు సభ్యదేశం. ఈ రెండు దేశాల్లో మానవహక్కుల అమలు ఏఏ రీతుల్లో ఎలా ఎదగగలిగాయన్న విషయాన్ని ఈ భాగం వివరిస్తోంది. అంతర్జాతీయంగా మానవహక్కుల్లో చోటుచేసుకొంటున్న ఆధిక్య ధోరణులను అవగాహనలోనికి తెచ్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ఈ విశ్లేషణ ఉపయోగపడుతుంది.

## 8.2 క్యూబా:

వెస్ట్ ఇండియా దీవుల్లో అతిపెద్ద దీవి రిపబ్లిక్ ఆఫ్ క్యూబా. ఇది 44,218 చదరపు మీటర్ల మేర విస్తరించి ఉంది. దీని జనాభా 10,90,000 వుంటుంది. వివిధ జాతులకు చెందిన ప్రజలు ఇక్కడ దాదాపు 42 శాతం దాకా వున్నారు. వీరిలో స్పెయిన్, ఆఫ్రికా, అమెరికా జాతీయులతో పాటు, సంకరజాతులు కూడా ఎక్కువగానే వున్నాయి. రోమన్ క్యాథలిక్ మతాన్ని అనుసరిస్తున్న వారు క్యూబాలో వున్నారు. అక్కడి ప్రజలు స్పానిష్ భాషను మాట్లాడతారు. క్యూబాలో అక్షరాస్యత రేటు 96 శాతం వుంది.

క్యూబాని గణతంత్ర ప్రభుత్వం, కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో మొత్తం 931 మంది సభ్యులుంటారు. అధ్యక్షుడు, కౌన్సిల్ సభ్యులు కార్యనిర్వాహక అధికారాన్ని కలిగి వుంటారు. వీరిరువురిలో పీపుల్స్ పవర్ నేషనల్ అసెంబ్లీ ఎన్నుకుంటుంది. అసెంబ్లీ సభ్యులను ప్రజలు ఎన్నుకుంటారు. పెద్దవాళ్ళకీ, పదహారేళ్ళు నిండిన వాళ్ళకీ ఓటు వేసే హక్కు వుంది. అయితే వీళ్ళు శాశ్వత వలస కోసం దరఖాస్తు పెట్టుకొనివారై వుండాలి. పోటీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు అధికారంలో వుంటుంది. అక్కడ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబా ఒక్కటే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ. పార్టీ ప్రథమ కార్యదర్శిగా కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌కు, దేశానికి అధ్యక్షుడుగా వ్యవహరిస్తారు కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌కు న్యాయ వ్యవస్థ లోబడి పని చేస్తుంది. సబార్డినేట్‌గా వ్యవహరిస్తుంది.

ఇక్కడ వున్న మిగతా రాజకీయ పక్షాల గురించి చెప్పాలంటే క్యూబాలో సోషల్ డెమోక్రాటిక్ పార్టీ వుంది. ఇది అజ్ఞాతనంలో వుంటూ పనిచేస్తోంది. ప్రభుత్వం గుర్తింపు దీనికి లేదు. సమిష్టి సమావేశాల్ని పార్టీ నిర్వహించదు. ఈ పార్టీ వ్యవస్థాపకుడు రుబెర్డోలాక్ ఎస్కోలోనా ఆ పార్టీలో చాలా మందికి తెలిసిన ఏకైక నాయకుడు అతడొక్కడే. మానవ హక్కుల పోరాటం మెల్లమెల్లగా అరంభమైంది. దేశంలోని మానవహక్కుల తీరుతెన్నుల గురించి అంతర్జాతీయ పరిశీలన జరగడాన్ని మెచ్చుకున్నారు. కొంతమంది వ్యక్తులను కస్టడిలోకి తీసుకున్నట్టు వెల్లడైంది.

BRAOU

## 8.2.1 విప్లవోద్యమానికి ముందు క్యూబా

విప్లవానికి ముందర క్యూబా చరిత్ర నిండా మానవ హక్కులను కాలారాచి వేసిన సంఘటనలే స్పెయిన్‌ల వలస పాలనలో వలసాధిపతులు ఇష్టం వచ్చినట్టు మానవ హక్కుల అక్రమణకు పాల్పడారు. స్థానిక ఇండియన్లు, ఆఫ్రికానుంచి వచ్చిన నల్లజాతి బానిసల మానవ హక్కులను నాటి పాలకులు క్రూరాతిక్రూరంగా హరించివేసారు. దాదాపు 50,000 మంది దేశీయ ఇండియన్లు హింసకు గురయ్యారు. కొలంబస్ వచ్చేనాటికి, దాదాపు 50 వేల మంది స్థానిక ఇండియన్లపై వలస పాలకులు తన ఉక్కు పిడికిలిని బిగించి, ఇళ్ళని కూకటి వేళ్ళతో సహా నాశనం చేసే దాకా వదిలిపెట్టలేదు. నిజం చెప్పాలంటే వలస పాలన వున్న క్యూబాలో చెరుకు పరిశ్రమ అభివృద్ధి చెందిందంటే అక్కడ వున్న, బానిస జనాభా చలవ వల్లే. రాత్రనకా, పగలనకా వాళ్లు పడ్డ కష్టం వల్లనే. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే క్యూబా దేశానికి ఆ పేరు వచ్చింది కూడా "ఇండియన్ క్యూబన్' నుంచే ఇక్కడ చోటు చేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘన పరికిస్తే ఎవ్వరైనా సిగ్గుతో తలవంచుకోవాల్సిందే. అంత ఘోరాతిఘోరంగా మానవ హక్కుల అతిక్రమణ క్యూబాలో చోటుచేసుకుంది.

విప్లవోద్యమానికి ముందర అక్కడ కొనసాగుతున్న అమానుషత్వ పోకడలను కేవలం కళ్ళప్పగిస్తూ చూస్తుని వూరుకోలేదు. ప్రతిఘటన ఆరంభమైంది. క్యూబా మేధా సంపత్తికి కొదవలేదు. పుష్కలంగా అందుబాటులో వుంది. వీళ్లు అయా దేశ ప్రజల్లో అదునాతమైన, అభివృద్ధి దాయకమైన విప్లవత్మాకమైన భావజాలాన్ని వ్యాపింపచేసారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను క్యూబాలోని ఆనాటి మేధావివర్గం తమ రచనలనే ఆయుధాలుగా ప్రయోగించారు. ఏన్నో ఏళ్ళ నుంచి తమపై కొనసాగుతున్న అణచివేత విధానాలపై వీరు తిరగబడ్డారు. స్పానిష్ అధిపతులు, యాంకో ఔత్సాహికులు, స్థానిక వర్గాల వారు ప్రచారం చేస్తూ వచ్చిన అభూత కల్పనలను తీవ్రస్థాయిలో కొట్టివేయడం ఆరంభించారు.

క్యూబాలో మేధావివర్గం సంఖ్య తక్కువగా వున్నా, దేశంలో మేధోవర్గాలపై అనూహ్య ప్రభావం తీసుకొచ్చిన ఘనత మటుకు వీరిదే.

BRAOU

## 8.2.2 విప్లవోద్యమకాలంలో క్యూబాలోని మానవ హక్కుల స్థితి గతులు

విప్లవోద్యమ క్యూబాలో మానవహక్కుల స్థితిగతులు ప్రమాణాలు వైవిధ్యమైన పోకడలు పోయాయి. విప్లవోద్యమంలోని పలు అంశాలు వీటిలో కనిపించడమే కాదు. నడిపేశైలి కూడా ప్రస్ఫుటమవుతోంది. వలస వచ్చిన వేలాది మంది క్యూబన్లు అజ్ఞాతంలోకి పోవడం చేస్తూ విప్లవ పరిస్థితి వెల్లడవుతుంది. విప్లవం తీవ్రత ఏ స్థాయిలో వుందో అవగతం అవుతోంది. అంతవరకూ సాధించిన విజయాల పట్ల ప్రశంసల వర్షం వెల్లువైంది. వైవిద్యమైన ప్రచారసరళి మూలంగా మానవహక్కులు సంక్లిష్ట రూపం సంతరించుకున్నాయి. వ్యతిరేకత వెల్లువైంది. అంతర్జాతీయ సంస్థలు అప్పటికప్పుడు చేపట్టిన పరిశీలనలకు తగినంత తోడ్పాటు అందలేదు. దీంతో అక్కడి మానవహక్కుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది.

క్యూబాలో మానవహక్కుల స్వరూప స్వభావాలు ప్రధానంగా ఫెడాలిస్మో భావజాలంతో ముడిపడి వున్నాయి. కాస్ట్రో వ్యక్తిగత చారిస్మా ఇందులో కలగలసి వుంది. క్యూబాలోని మానవహక్కులు మౌలిక రూపురేఖలు,

స్వరూప స్వభావాలు అర్థం చేసుకోవాలంటే విదేశీ, స్వదేశీ రాజకీయాలు, స్థానిక అభివృద్ధి తీరుతెన్నులు, ఆర్థికాభివృద్ధి స్థితిగతులు, కాస్ట్రో క్రింద పనిచేస్తోన్న విప్లవ మేధావుల స్వభావం ప్రవర్తనలు... వీటన్నింటిని పరిగణలోనికి తీసుకోవలసి ఉంటుంది.

మానవ హక్కుల స్థితిగతులపై ఇక్కడ భిన్నమైన వ్యాఖ్యానాలు వినిపిస్తున్నప్పటికీ మానవహక్కుల్లోని పలు సత్యాలు ఎంతో ప్రాధాన్యం వహిస్తాయి. క్యూబాలో విప్లవం సరికొత్త సమాజాన్ని మనముందు వుంచుతుంది. అన్ని వర్గాల వాళ్ళను ఒక చోట కూడగట్టింది. యువతరం, బడుగువర్గాలు విప్లవంలో ప్రముఖపాత్ర వహించారు. 1959 నుంచీ సమానత్వ పునాదులు సమాజంలో బలపడ్డం ఆరంభించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గతంలో కొనసాగిన అసమానతలు బాగా తగ్గాయి. అలాగే వర్గ విభేధాలు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. అయితే పూర్తిగా తొలిగిపోయయాని దీని అర్థం కాదు. గ్రామీణ ప్రాంతాలలో స్థిరమైన ఉద్యోగాలు లేవు. అయితే అస్థిర ఉపాది అవకాశాల స్థానంలో రాజ్యాంగబద్ధమైన ఉపాధి అవకాశాల్ని కల్పించడం జరిగింది. పట్టణ ప్రాంతాలకు మల్లే కాకుండా క్యూబా పల్లెపట్టు అంతా, ఆర్థిక వ్యవస్థ మార్పు చేర్పులకు గురవుతున్న సమయంలో, వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసాయి. పెద్ద ఎత్తున ఇక్కడ చేపట్టిన అక్షరాస్యతా ప్రచారం వల్ల నిరక్షరాస్యత శాతం అనూహ్యంగా 4 శాతానికి పడిపోయింది. ప్రాథమిక విద్యకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలందరు కూడా ప్రజారోగ్య సదుపాయాలను, స్వచ్ఛంద వైద్య సేవలను సమకూర్చారు. సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు క్యూబా వేదిక అయింది. చైనాలో భౌతికమైన శిక్ష వుంటే, క్యూబాలో అలాంటి శిక్షలేమి అమలులలో లేవు. మౌలికంగా క్యూబాలో మనకు కనిపించే మార్పులు ఇవి. అయితే పరిస్థితులు మాత్రం పూర్తిగా చక్కబడలేదు. విప్లవ క్యూబాలో భావజాల లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. సమాఖ్య తత్వానికి వ్యతిరేక ధోరణులను చూస్తాం. అలాగే అమెరికా వర్తక వ్యాపారాలు, ఆర్థిక దిగ్బంధనాలు కొనసాగింపు, ఆహారం, బట్టలు తదితర నిత్యావసర వస్తువులను రేషనింగ్‌గా ఇవ్వడం క్యూబాలో మనం చూస్తాం. అనాటి క్యూబాలో పావుట, మార్కెట్లో, రెస్టారెంట్లు ఎదుట ప్రజలు బారులు తీరి వుండడం సర్వసాధారణంగా కనబడే దృశ్యం.

B R A O U

### 8.2.3 మానవ హక్కుల ఉల్లంఘన

మానవ హక్కులను దృష్టిలో పెట్టుకుని చూస్తే, రాజకీయ ఖైదీలు కొందరిపై తీవ్రమైన శారీరిక హింసను ప్రయోగించారు.

1992, 1993 సంవత్సరాలలో ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి ప్రత్యేక నివేదికను సమర్పించండ జరిగింది. అక్కడివారు ఘోరంగా హింసకు గురి అవుతున్న మాట వాస్తవమేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 1993 లో వచ్చిన నివేదికలో ప్రధానమైన కొన్ని అంశాలతో బాటుగా, మరికొన్ని సిఫారసులను కూడా పేర్కొనడం జరిగింది.

మానవ హక్కులపై ఏర్పడ ఐక్యరాజ్యసమితి సంఘం క్యూబాలో మానవహక్కుల స్థితిగతులను క్రమబద్ధీకరించాలన్న దానిపై అంగీకరించడానికి క్యూబా ప్రభుత్వం మనస్సంగీకరించడం లేదు. స్పెషల్ రిపోర్టియర్‌కు ఏ విధంగానూ సహకరించలేదు. ఈ విషయంలో క్యూబా ప్రభుత్వ ధోరణిని మార్చాలని రిపోర్టియన్

శతవిధాలా ప్రయత్నించింది. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సంఘటనపై బహిరంగ చర్చలు జరపడం, కొన్ని సంఘటనలను ప్రత్యేకంగా ప్రస్తావించడం, వాటిపై నివేదికలనందించడం వంటి అంశాలను చేపట్టాలని ప్రయత్నాలు జరిగాయి. మానవహక్కుల సంఘం ఆదేశాలను అమలు పరచేందుకు క్యూబాలో పర్యటించే అవకాసం ఇవ్వవలసిందిగా ఆ రిపోర్టియర్ పలువార్లు కోరడం కూడా అయింది.

1993 సెప్టెంబరు నెల అరంభంలో క్యూబాలోని బిషప్పులు పెద్ద లేఖ నొకదానిని ప్రచురించారు. ఇందులో క్యూబాలో నెలకొన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను అన్ని వైపుల నుంచి అంచనావేసి వివరించారు. ఆ లేఖతో బాటు అనేక సంస్థలు సంతకాలతో వున్న ఒక డాక్యుమెంటు కూడా రిపోర్టియర్ కు అందింది. క్యూబాలో అసమ్మతి వాదులుగా వీరందరూ ముద్రపడ్డారు. లేఖలో, డాక్యుమెంటులో అనేక ప్రతిపాదనలు, సిఫారసులు చేసారు. వీటిని ప్రభుత్వం ముందు వుంచారు. బిషప్పులు చేసిన సిఫారస్సులు :-

నివేధికలో అన్ని అంశాలను చర్చించింది. పౌరులపై దృష్టి నిలిపింది. న్యాయం వీధి పాలవుతున్న తీరు, అది పనిచేస్తున్న వైనంకు సంబంధించి రాజ్యాంగ బద్ధమైన, చట్టబద్ధమైన అంశాలపై కూడా నివేదిక దృష్టి నిలిపింది. నివేదికాంశాలను వివరణాత్మకంగా, పరిశీలనాత్మకంగా విశ్లేషించడం జరిగింది.

## నివేదికలోని అంశాలు

(ఎ). ప్రధానమైన మానవ హక్కుల రూపకల్పన – అంటే పౌర, రాజకీయ హక్కులు, ఆర్థిక, సాంస్కృతిక హక్కులు.

(బి). భావ ప్రకటనా స్వేచ్ఛను వెల్లడిస్తున్న వారితో కలిసిమెలిసి మసలుతున్న పౌరులను శిక్షించడం, విచారించడం, హింసించడం వంటి పనులను ఆపేయాలి.

(సి). స్వతంత్ర్య సమూహాలకు చట్టబద్ధత కల్పించాలి. ముఖ్యంగా మానవ హక్కుల కోసం, కార్మిక వర్గ కార్యకలాపాలు చేపట్టి నిర్వహిస్తున్న సంస్థలకు చట్టబద్ధమైన గుర్తింపు నివ్వాలి. చట్టపరిధిలో వాళ్ళు సర్వస్వతంత్ర్యంగా వ్యవహరించగలగాలి.

(డి). అంతర్జాతీయ ఒడంబడిక ననుసరించి అమోదించిన పలు అంశాలను గౌరవించాలి.

(ఇ). జైలు నిర్వహణలో ట్రాన్స్‌ఫరెన్సీ వుండాలి. అప్పుడే ఖైదీలపై రానూరానూ పెరుగుతున్న హింసాత్మక చర్యలకు గండిపడుతుంది. అంతర్జాతీయ సంఘం రెడ్‌క్రాస్‌లో ఒప్పందం పునరుద్ధరించుకోవడం అంటే గొప్ప విజయాన్ని సాధించినట్టే. పలు జాతీయ బృందాలు ఎప్పుడు బడితే అప్పుడు జైళ్ళను సర్వస్వతంత్రంగా సందర్శించుకునే వీలు కలుగుతుంది.

(ఎఫ్). రాజకీయ దురుద్దేశంతో చేసిన దాడులపై, దేశం విడిచిపోవాలని ప్రయత్నించారన్న ఆరోపణలపై శిక్షలు పడిన ఖైదీల కేసులను పునర్ సమీక్షించాలి.

దేశ భద్రతా దళాలు, సైన్యం మితిమీరి ప్రదర్శిస్తున్న బలప్రయోగంపై దృష్టి నిలిపారు. ఎంతదూరం వీటి వ్యవహార సరళి వెళ్ళిందంటే ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి కూడా చొరబడేంతగా ఏజెన్సీలు వ్యవహరిస్తున్నాయి. దీనిని బట్టి అస్పష్టమైన భయాందోళనలేవో ప్రభుత్వాన్ని చుట్టుముడుతున్నట్టు తోస్తుంది. తెరవెనుక చట్ట విరుద్ధమైన నిషిద్ధ కార్యకలాపాలేవో జరుగుతున్నాయన్న ఉద్దేశం భద్రతా ఏజెన్సీల్లో నాటుకుపోయింది. ఎంతోమందిని ఖైదీ

BRAOU

చేసారు. ఆర్థిక, రాజకీయ, ఇతర కారణాలతో శిక్షను అనుభవిస్తున్న వారిని విడుదల చేసే ఉద్దేశం కూడా ఈ చర్య వెనుక కనిపిస్తుంది.

సిద్ధాంతపరమైన, రాజకీయ, మతపరమైన విశ్వాసాలపట్ల వివక్ష తొలగాలి. అప్పుడు ఎలాంటి పరిమితులకు తావులేని విధంగా క్యూబా ప్రజలు కలిసిపోతారు. ఇలాంటి లక్ష్యాలతో ఏర్పడ్డ సంస్థలన్నీ కలిసి ఏక నివేదికను ఒకదానిని కోరుకుంటున్నాయి అంతేకాదు తమ ఇతర డిమాండ్లను కూడా వినిపించాయి.

1. రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష
2. స్వేచ్ఛగా కలిసివుండగలిగేలా, మాట్లాడేలాగా, సమావేశాలు, సదస్సులు నిర్వహించుకొనగలిగేలాగే, శాంతియుత ప్రదర్శనలను జరుపుకునేలాగా పరిస్థితులను కల్పించాలి.
3. పత్రికారంగానికి, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసికోవడానికి, దేశంలోకి అనుకున్నప్పుడు ప్రవేశించగలగడం లేదా దేశం వీడివెళ్ళిపోవడానికి స్వేచ్ఛ నివ్వాలి.
4. సామాజికంగా, రాజకీయంగా చోటుచేసుకున్న, వివిధ రకాలైన వివక్షలను నిర్మూలించాలి.

దేశ స్వాతంత్ర్యాన్ని, స్వారభౌమాధికారాన్ని, జాతి ఉనికిని ఎల్లప్పుడు కాపాడడం.

ఇవన్నీ ఈ సంస్థలు కోరుతున్నాయి అంతేకాదు చట్టపరిధికిలోబడి అధికారులతో చర్చలకు కూడా తాము సిద్ధమని ప్రకటించాయి. క్యూబాలో మానవహక్కుల పరిస్థితిని చక్కదిద్దాలంటే అంతర్జాతీయ స్థాయిలో పకడ్బందీ అయినా నిర్మాణాత్మక చర్యలను చేపట్టాల్సి వుంటుందని .స్పెషల్ రిపోర్టియర్. అభిప్రాయపడుతున్నారు. ఇందులో బాగంగా ముఖ్యంగా క్యూబాను నమ్ముకున్న ప్రచ్ఛన్నయుద్ధ పోకడలను తొలగించాలి. ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా ఇచ్చిపుచ్చుకునే వైఖరిని, ఘర్షణలను చరమగీతం పాడేవిధంగా క్యూబా మెలగగలిగేట్టు ప్రయత్నాలు ఆరంభించడం.

BRAOU

క్యూబా దాని పొరుగుదేశాలతో ముఖ్యంగా అమెరికాలో నమ్మకమైన సంబంధాలను పెంపొందించుకునే దిశగా కొన్ని చర్యలను చేపట్టినట్టు రిపోర్టియర్ అభిప్రాయపడింది. మానవహక్కుల పరంగా సాధించిన అనుకూల అంశంగా దీన్ని చెప్పుకోవచ్చు. ఆర్థిక రంగంలో నైపుణ్యాన్ని, ఉత్పత్తిలో మెరుగుదలను తీసుకొచ్చేందుకు నూతన సంస్కరణలతో కూడిన కార్యక్రమాన్ని అంతర్జాతీయ వర్గాలు ప్రోత్సాహించాలి. ఫలితంగా మార్కెట్ శక్తులు బాగా బలం పుంజుకునే అవకాశం వుంటుంది. ప్రస్తుత విధానంలో తీసుకొచ్చిన మార్పులకు ఆటంకం కల్పించని రీతిలో ఒక పాలసీని చేపట్టాల్సిన అవసరాన్ని రిపోర్టియర్ ప్రస్తావించింది. బయట నియంత్రణపై వత్తిడి తీసుకురాకుడదని, అలా చేయడం వల్ల ఆర్థికంగానే కాకుండా, రాజకీయంగా కూడా క్యూబా దేశంలో అస్తవ్యస్త పరిస్థితులు తలెత్తగలవని రిపోర్టియర్ అభిప్రాయపడింది. అయితే ఈ అభిప్రాయంతో చాలామంది ఏకీభవించలేదు. అదే సమయంలో ఈ అంశం అవిభాజ్యమయిందనేది కూడా వీరు గుర్తిస్తున్నారు. వేరొక సందర్భంలో ఇదే అంశాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో కూడా ప్రస్తావించడం అయింది. క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక, వ్యాపార నిషేధాలను ఎత్తేయాల్సిన ఆవశ్యకత అన్న దానిపై ఒక తీర్మానాన్ని, చేపట్టటం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ అసెంబ్లీ, ఈ పరిమితులను వీలైనంత తొందరగా ఎత్తివేయాలని అమెరికాను కోరింది. లేకపోతే ఇతర దేశాలతో వున్న వ్యాపార సంబంధాలు వాటి ప్రాదేశిక సమగ్రతలు కూడా దెబ్బతినే అవకాశం వుందని భావించింది. మార్చి

10, 1993 న రిపోర్టియర్ తనకందించిన నివేదికను ఐక్యరాజ్యసమితికి చెందిన మానవ హక్కుల సంఘం పరిశీలించింది. యు.ఎన్.చార్టర్‌లోని 55, 56 అధికరణల కింద కట్టుబడి క్యూబా ప్రభుత్వం మానవహక్కుల సంఘంతో సహకరించాల్సిందిగా కోరింది. అంతేకాదు క్యూబాలో భావ ప్రకటన స్వేచ్ఛపై సమావేశాలపై రోజురోజుకీ ప్రభుత్వ ఉక్కు పిడికిలిని బిగిస్తుండడం మీద సమితి తన ఆందోళన వ్యక్తం చేసింది. స్పెషల్ రిపోర్టియర్ నివేదికను పూర్తిగా పరిశీలించిన సమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కులను క్రమబద్ధీకరించే క్రమంలో క్యూబా యు.ఎన్.తో సహకరించాలని సహాయపడాలని కోరింది.

సమితి మానవ హక్కుల సంఘంకు చెందిన స్పెషల్ రిపోర్టియర్ క్యూబాలో మానవహక్కుల పరిస్థితిని పూర్తిగా సమీక్షించిన తర్వాత 1995 మార్చిలో తన నివేదికను సమర్పించారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం నడుంకట్టిన పలువురు నాయకులను నియంతృత్వపోకడలతో క్యూబా ప్రభుత్వం ఖైదు చేయడంపై నివేదిక తన ఆందోళనను వ్యక్తం చేసింది. అలాగే అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనలో పేర్కొన్న విధంగా శాంతియుత విధానాల్లోనే ప్రాథమిక హక్కులు స్వేచ్ఛను అనుసరిస్తున్న, పాటిస్తున్న వారిపై కూడా క్యూబా తన నియంతృత్వపు విధానాల కొరడాను ఝుళిపిస్తూ, వాళ్ళను ఖైదీలను చేయడంపై ప్రశ్నించింది. క్యూబాలోని యు.ఎన్. మానవహక్కుల సంఘం రిపోర్టియర్‌ను అనుమతించాల్సిందిగా మరలా అక్కడి ప్రభుత్వాన్ని యు.ఎన్. కమీషన్ విన్నవించుకుంది. విజ్ఞాపనలు పెట్టుకొంది. క్యూబాను అతను పూర్తిగా సందర్శించే అవకాశాన్ని కలగజేయాల్సిందిగా కోరింది. అంతేగాదు మానవ హక్కుల పై కమీషనర్‌ను క్యూబా సందర్శించడానికి ఆహ్వానించాలని క్యూబా తీసుకున్న నిర్ణయాన్ని కూడా కమీషన్ మెచ్చుకుంది. గతంలో క్యూబా వైఖరికి ఇప్పుడు క్యూబా స్పందించిన తీరు పూర్తిగా భిన్నమైందంటూ కమీషన్ ఈ చర్యను అభివర్ణించింది.

క్యూబా ప్రభుత్వంతో, అక్కడి ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడాల్సిందిగా కమీషన్. స్పెషల్ రిపోర్టియర్.ను కోరింది. మానవహక్కులు అతిక్రమణ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, అంతర్జాతీయ ప్రమాణాలతో మానవహక్కులు ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అమలులో ఉన్నాయా ? లేదా ? అన్న విషయంపై పరిశీలన చేపట్టాల్సిందిగా కమీషన్ రిపోర్టియర్‌ను ఆదేశించింది. స్వేచ్ఛాయుతమైన, బావ ప్రకటనను ఎప్పుడుబడితే అప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలను కల్పించాల్సిందిగా, అనుమతించాల్సిందిగా క్యూబా ప్రభుత్వాన్ని కమీషన్ అభ్యర్థించింది. మానవహక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ఉద్యమకారులను ఇతరులను కూడా చెర నుంచి విముక్తిల్ని చేయాల్సిందిగా అది కోరింది. .ప్రమాదకారులుగా. ఎంచి కొందరికి కూడా స్వేచ్ఛను ప్రసాదించాలని క్యూబా ప్రభుత్వానికి విన్నవించుకుంది. అయితే పరిస్థితుల్లో వుహించినంత మెరుగుదల సంభవించలేదు. క్యూబాలో మానవ హక్కుల స్థితిగతుల్ని ఉదారవాదుల దృష్టితో చూస్తే సాధించినవి శూన్యమనే చెప్పాలి.

## 8.3 పోలెండ్:

పోలిష్ పీపుల్స్ రిపబ్లిక్ తూర్పు యూరప్‌లో బాల్టిక్ సముద్రం వద్ద ఉంది. చెకోస్లోవేకియా, జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్, గతంలో వున్న సోవియట్ యూనియన్ దీనికి సరిహద్దులుగా ఉన్నాయి. దీని మొత్తం

BRAOU

భూభాగం 120,729 చదరపు మైళ్ళు విస్తరించి వుంది. దీని జనాభా 38,385,00 1992 లెక్కల ప్రకారం ప్రతి చదరపు మైలుకు 317 మంది జనసాంద్రతను కలిగి ఉంది. పోతే దేశంలో 96 శాతం పోలిష్ జాతీయులే మిగతావాళ్ళు జర్మన్లు, ఉక్రేనియన్లు, బెలోరష్యన్లు, పోలెండ్ దేశ భాష పోలిష్. 93 శాతం మంది ప్రజలు రోమన్ క్యాథలిక్కులు. అక్షరాస్యతా రేటు 98 శాతం వరకూ ఉందని లెక్కలు వివరిస్తున్నాయి.

## 8.3.1 సంక్షిప్త చరిత్ర

పోలెండు పొరుగు దేశాలైన ఆస్ట్రియా, జర్మనీ, రష్యాల గుప్పెట్లో చాలా శతాబ్దాల పాటూ కొనసాగింది. ఆ దేశాల నియంత్రణ కింద నలిగిపోయింది. 1795 నుంచి ఉనికిలో వున్న పోలెండు. దాదాపు 25 శతాబ్దకాలంలో ప్రపంచ రాజకీయ పటంలోనే కనిపించలేదు. దీనికి ప్రధానకారణం అగ్రరాజ్యాలు పోలెండును తమ ఇష్టానుసారం భాగాలు చేసుకుని తమ అధికారం కింద అణగ ద్రొక్కడమే. పోలెండు తిరిగి సర్వస్వతంత్ర్యం పొందడానికి మొదటి ప్రపంచ యుద్ధం మంచి అవకాశంగా మారింది. 1918 నవంబర్ 11 నాటికి సర్వస్వతంత్ర దేశంగా పోలెండు నిలబడగలిగింది. వెర్సైల్స్ సంధి బాల్టిక్ సముద్రం దగ్గర ఉంది. పునర్ వ్యవస్థాపితం అవగలిగేట్లు చేసింది. సర్వస్వతంత్ర్య దేశంగా దీన్ని మలిచింది. అయితే అక్కడ వున్న విభిన్న జాతులు, భాషలు మాట్లాడేవారు, మైనారిటీలయిన జర్మన్లు, ఉక్రేనియన్లు, బెలోరష్యన్లు, లోథూనియన్లు, యూదుల తకితరాలు మధ్య ఎవరి ప్రయోజనాల కోసం వారు ఘర్షణలు పడుతుండండ పోలెండును పెద్ద తలనొప్పిగా పరిణమించింది.

రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ దీన్ని తన హస్తగతం చేసుకుంది. స్వతంత్ర్య పోలెండు ఏర్పాటుకు ఇది దారితీసింది. ఓడర్ మరియు నైసీ నదుల సరిహద్దున ఇది ఉంది. అమెరికా అధ్యక్షుడు హేరీ దీన్ ట్రూమన్, బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ, యు.ఎస్.ఎస్.ఆర్.కు చెందిన జోసెఫ్ స్టాలిన్‌కు మధ్య బెర్లిన్‌లో ఒక ఒప్పందం కుదిరింది. గతంలోని యు.ఎస్.ఎస్.ఆర్.లో చేసుకున్న సంధి ఫలితంగా పోలిష్ రష్యాల సరిహద్దు పరిమితులను దాటి విస్తరించింది. అదే సంవత్సరంలో పోలెండు ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వాన్ని పొందింది.

BRAOU

## 8.3.2 నాజీల నియంత్రణలో పోలెండ్

జర్మనీ – పోలెండ్‌ల మధ్య 1934 లో కుదిరిన ఒప్పందం ప్రకారం జర్మనీ పదిసంవత్సరాల పాటు పోలెండుపై ఎలాంటి దాడులకూ, అక్రమణలకు పూనుకోరాదు. అయితే 1939 లో అడాల్ఫ్ హిట్లర్ ఈ ఒప్పందానికి తిలోదకాలిచ్చి డాంజింగ్‌ను జర్మనీకి కట్టబెట్టాల్సిందిగా డిమాండ్ చేయడం అరంభించాడు. అయితే దీనికి పోలెండ్ అంగీకరించలేదు. ఫలితంగా సెప్టెంబరు 1, 1939న నాజీ సైన్యం పశ్చిమం వైపునుంచి వచ్చి పోలెండును ముట్టడించింది. సెప్టెంబరు 17 న సోవియెట్ సైన్యం తూర్పు వైపు నుంచి ప్రవేశించాయి. చివరకి జర్మనీ – రష్యాల మధ్య కుదిరిన ఒప్పందంను అనుసరించి పోలెండును సమభాగాలుగా చేసి రెండు అగ్రరాజ్యాలూ పంచుకున్నాయి. 1941 జూన్‌లో సోవియట్ యూనియన్‌పై జర్మనీ దాడి చేసిన తర్వాత మొత్తం పోలెండును జర్మనీ ఆక్రమించుకుంది. యుద్ధ సమయంలో నాజీ అధికార యంత్రాంగం పకడ్బందీ అయిన పథకంతో పోలెండ్‌లోని ప్రజలను ముకుమ్మడిగా దహనం చేసాయి. ఆకలిదప్పులకు గురిచేసాయి. అంతేకాదు కాన్సంట్రేషన్ క్యాంపులో ప్రజలను గదుల్లోకి నెట్టి, పొగవదిలి వాళ్ళు ఉక్కిరిబిక్కిరి అయి చచ్చిపోయేట్లు చేసారు. జర్మనీ అధికారగణం పోలెండు ప్రజలనుఘోరాతిఘోరంగా, రకరకాలుగా హింసించి మరీ చంపారు. దాదాపు లక్షమందికి

పైగా ప్రజలు మరణించారు. చివరికి అక్కడి పరిస్థితి దిగజారి, .అండర్ గ్రౌండ్. ఉద్యమానికి దారితీసింది. చివరకు ఆ ఉద్యమం 1944 లో .వార్సా. ఏర్పాటుకు దారితీసింది.

### 8.3.3 మానవహక్కుల పరిస్థితి

1945 నాటికి రష్యాసైన్యం జర్మన్ సైనిక దళాలను తరిమికొట్టింది. లుబ్లిన్‌లో ప్రాదేశిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొంది. 1947 లో ఎన్నికలు జరిగినప్పుడు రష్యా మద్దతుతో ..పోలిష్ కమిటీ ఫర్ నేషనల్ లిబరేషన్. పోలెండ్ ప్రొవిషనల్ ప్రభుత్వంగా తనను తాను ప్రకటించుకుంది. 1952 లో కొత్త రాజ్యాంగాన్ని చేపట్టారు. దానిననుసరించే పోలెండు కాస్తా పోలిష్ పీపుల్స్ రిపబ్లిక్‌గా మారింది. అదే సంవత్సరంలో పోలెండు వార్సా కూటమిలో చేరింది.

1980 లో తలెత్తిన ఆర్థిక క్షీణత ఫలితంగా పోలెండులో బందులు, దాడులు, దోపిడీలు ఊపందుకున్నాయి. గడేంన్స్‌గా పిలవబడే ఒకప్పటి డాన్‌జింగ్‌లో వోర్కర్స్ జాయింట్ కమిటీ పెద్ద ఎత్తున బందు నిర్వహించింది. లెక్‌వాలిస్సా నేతృత్వంలో గాప్నియా, సోపట్ ఓడరేవు సంఘాలు స్వేచ్ఛగా బందులు నిర్వహించుకునే హక్కును, స్వతంత్ర్యం సంఘాలను ఏర్పాటు చేసుకోగలిగేలాగ, అలాగే సెన్సార్‌షిప్‌ను నిషేదించడం, ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందేలాగా మీడియా అందుబాటు, రాజకీయ ఖైదీల విడుదలకు డిమాండ్ చేసారు. చివరకు గడాన్స్‌క్ ఒప్పందంపై సంతకాలు పెట్టడంలో కథ సుఖాంతం అయింది. స్వతంత్ర్య యూనియన్లు ఏర్పడడం, బంధులను నిరంతరాయంగా కొనసాగించడం కార్మికుల హక్కులుగా ఒప్పందం గుర్తించింది.

1980 సెప్టెంబరు 17 న ఎన్నో కార్మిక సంఘాలు కలిసి జాతీయ స్థాయిలో ఒక కాన్ఫెడరేషన్‌గా ఏర్పాడ్డాయి. చట్టబద్ధమైన గుర్తింపుకోసం దరఖాస్తు పెట్టుకున్నాయి. మొదట దీనికి గుర్తింపు నివ్వాలా వద్దా అని తీవ్రంగా గుంజాటన పడిన తర్వాత ఎట్టకేలకు అక్టోబర్ 29న చట్టబద్ధతను కల్పిస్తున్నట్టుగా ప్రకటించింది. 1981 ప్రారంభంలో కాన్ఫెడరేషన్ వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఐదురోజులే పనిదినాలుగా ప్రకటిస్తూ కాన్ఫడరేషన్ ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. 1981 డిసెంబరు 13 న తలెత్తనున్నాయనుకున్నా సంక్షోభ పరిస్థితి తృటిలో తప్పింది. పోలెండు అంతటా సైన్యం పాలనను స్టేట్ కౌన్సిల్ విధించింది. రాజకీయ, పౌర స్వేచ్ఛలను అనుమతించలేదు. అమలు కాకుండా అడ్డుకున్నారు. ఆపేసారు. 20 మంది సభ్యులతో కూడిన ..మిలటరీ కౌన్సిల్ ఆఫ్ నేషనల్ సాల్వేషన్.. విభాగాన్ని నెలకొల్పారు. దేశంలో శాంతిభద్రతలను కాపుకాయడామే దీనిపని. కార్మిక సంఘాల ఐక్యవేదికను నిషేదించారు. ఎంతోమంది రాజకీయ ఖైదీలతోపాటుగా కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులను కూడా జైళ్ళలోనే కస్టడీలో వుంచారు.

1982, అక్టోబర్ 8 న .సెమ్. ఒక చట్టాన్ని రూపొందించారు. దాన్ని అనుసరించి నమోదు అయిన అన్ని కార్మిక సంఘాలనూ రద్దు చేసారు. వీటిలో ఐక్యవేదిక (సాలిడారిటి) కూడా వుంది. దాంతో ఆగలేదు. సరికొత్త యూనియన్ సిస్టమ్‌ను చేపట్టారు. అది పనిచేస్తున్న చోట కార్మిక సంఘాలు ఏర్పాటును ఇది అనుమతిస్తుంది. అయితే దానికొక షరతును కూడా జోడించారు. అదేమిటంటే కమ్యూనిస్టుపార్టీకి కట్టుబడి వుంటామని ప్రమాణపూర్తిగా చెప్పాలి. 1982 డిసెంబరులో సైనిక పాలనను ఆపారు. అయితే 1983 జూలైలో సైనికపాలనను పూర్తిగా ఎత్తేసారు. బంధీలుగా వుంచిన అందరిని విడుదల చేసారు. లెక్‌వాలెస్సా తదితర .సాలిడారిట్.

BRAOU

నాయకులందరూ బయటకొచ్చినప్పటికీ వాళ్ళలో లెక్‌వాలేసా తప్పించి, పదకొండు మందిని మళ్ళీ వెంటనే కస్టడీలోకి తీసుకున్నారు. అంతేకాదు వారిపై రాజకీయ ఆరోపణలను కూడా దాఖలు చేసారు. ..గ్రూప్ ఆఫ్ లెవన్.. గా పిలువబడిన వీళ్ళను మళ్ళా 1984 జూలైలో విడదల చేసారు. 1983 నవంబరులో లెక్‌వాలెస్సాకు నోబెల్ బహుమతి వచ్చింది. బహుమతిని స్వీకరించేందుకు ఆయన భార్య ఓస్లోదాకా ప్రయాణించింది. 1984 అక్టోబరులో ఫాదర్ జార్జి పోపైలుజ్‌క్రోను కిడ్నాప్ చేసి తీసుకువెళ్ళి హత్యచేసారు. ఆయన .సాలిడారిటీ. మద్ధతుదారుడు. ఈ సంఘటన పోలిష్ ప్రజలను తీవ్ర ఆగ్రహావేశాలకు లోను చేసింది. పోలిష్ సెక్యూరిటీ పోలీసులకు సంబంధించిన నలుగురు అధికారులపై విచారణ జరిపి, శిక్ష విధించడం పోలిష్ జాతి చరిత్రలో మరిచిపోలేనటువంటి సంఘటన.

### 8.3.4 పోలెండ్‌లో యు.ఎన్.నిర్వహించిన పాత్ర.

మార్చి 10, 1982 నాటికి పోలెండు పెద్ద ఎత్తున చోటుచేసుకున్న మానవహక్కుల ఉల్లంఘనా సంఘటనలపై ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాదు సెక్రటరీ జనరల్ లేదా ఆయన నియమించిన అధికారి పోలెండులో వున్న మానవ హక్కుల స్థితిగతులపై కూలంకషంగా పరిశీలించాలని ఐక్యరాజ్యసమితి కమీషన్ విజ్ఞప్తి చేసింది. సెక్రటరీ జనరల్ పరిస్థితులనన్నింటిని క్షుణ్ణంగా గమనిస్తూ వచ్చారు. 1982 డిసెంబరు 21 న అండర్ సెక్రటరీ జనరల్ హ్యూగో గోబీని తన తరపున మానవహక్కుల అమలు కార్యక్రమాన్ని పరిరక్షించేందుకు నియమించారు.

1983లో కమిషన్ గోబ్బీ నుంచి నివేదికను అందుకుంది. పోలిష్ అధికార గణం తనకుగాని, సెక్రటరీ జనరల్‌కు గాని సరైన సహకారం తోడ్పాటు, సహాయం అందించలేమని ఆయన తన నివేదికలో స్పష్టం చేసారు. బయటవారి జోక్యం లేకుండా, తనదైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిని సాధించేందుకు పోలిష్ ప్రజలు సర్వస్వతంత్రులన్న అంశాన్ని కమీషన్ నొక్కి చెప్పింది. పోలిష్ అధికారుల తీరుపట్ల కమిషన్ తీవ్రంగా వ్యధ చెందింది. మానవ హక్కులపై పోలిష్ అధికారగణం చూపిస్తున్న నియంతృత్వ పోకడలను నియంత్రించాల్సిన అవసరాన్ని పేర్కొంది. ఈ విషయం ఎరిగి పోలిష్ అధికారులు వ్యవహరించాల్సి వుంది. దేశం సైనిక పాలనలో వున్నప్పుడు విధించిన కఠినమైన శిక్షలను తిరిగి సమీక్షించాలని కమిషన్ కోరుతోంది.

సస్పెన్షన్ తర్వాత సైనిక పాలన ఎత్తివేయడం వల్ల నిర్దిష్టమైన చర్యలకు చట్టబద్ధత కల్పించి వాటిని అమలు చేయడం మూలంగా తర్వాత క్షమాభిక్ష చట్టాలు అమలులోకి రావడం వల్ల పోలిష్ సమాజంలో వున్న విభిన్న వర్గాల మధ్య సదవగాహన, సహకారం సంయమనం సుసాధ్యం అయింది. దీనికి సంబంధించిన గణాంక వివరాలు కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. గణాంకాలకు సంబంధిన పోలికలు గమనించినట్టయితే, 1983 జనవరి 4 కి రాజకీయ కారణాలతో 15 వేల మందిని కస్టడిలో వుంచారు. అదీ 1984 ఫిబ్రవరి తాత్కాలిక కేసుల మీద, దాదాపు 281 మందిని మాత్రమే ఆపారు. మానవహక్కుల పరిశీలనలో సంతృప్తి కలిగించే అంశం వుంది.

పోలిష్ ప్రభుత్వం నుంచి అందిన కొన్ని సానుకూల ప్రతిస్పందనలు కమిషన్‌కు ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని

BRAOU

ఇచ్చింది. సైనిక పాలనలో కొంతమందిపై విధించిన భయంకరమైన జైలుశిక్షలను ఎత్తేయవలసిందిగా పోలిష్ ప్రభుత్వాన్ని కమీషన్ కోరింది. సమాచారం స్వేచ్ఛగా అందేందుకు వీలుకల్పిస్తూ వాటి మీద కొనసాగిస్తున్న పరిమితులను తీసివేయాలని ఇది కోరింది. అలాగే కార్మిక సంఘాల హక్కుల పునరుద్ధరణ పౌర స్వేచ్ఛను మరింత విస్తృతి చేయడం పార్లమెంటులో ఉన్నత సభను ఏర్పాటు చేయడం మొదలైనవన్నింటినీ పోలిష్ ప్రభుత్వం ముందు కమీషన్ ప్రస్తావించింది. ఐక్యరాజ్యసమితి, సంబంధిత మానవ హక్కులు సంఘాలు మానవహక్కుల పునరుద్ధరణ కోసంగా, పోలెండ్ ప్రభుత్వాలపై అనునిత్యం వత్తిడి తీసుకువస్తూనే వచ్చింది. సమితి చేపట్టిన కృషి నిష్ఫలం కాలేదు. పోలెండ్‌లో తర్వాత తలెత్తిన పలు పరిణామాలపై వీటి ప్రభావం బాగా వుంది.

## 8.3.5 ప్రజాస్వామ్య దేశంగా పోలెండ్

యాభై సంవత్సరాల కాలంలో మొదటిసారిగా పోలెండులో స్థానిక ఎన్నికలు 1990 మేలో జరిగాయి. .సాలిడారిటీ. 41 శాతం మేర సీట్లు సంపాదించింది. తన ఆరు సంవత్సరాల పదవీకాలం ముగియడానికి ముందే అంటే 1990 లో అధ్యక్షుడు జెరు జల్‌స్కీ పదవీ విరమణ చేయడంతో 1990 డిసెంబరులో రెండవ పర్యాయం ఓటింగులో లెక్ వాలెస్సా దాదాపు 74 శాతం మేర ఓట్లతో గెలిచి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991 అక్టోబరులో జరిగిన శాసనసభా ఎన్నికల్లో 29 పార్టీల్లో ఏ ఒక్కదానికీ మెజారిటీ రాలేదు. .సాలిడారిటీ. లోని గ్రూప్‌తో డెమోక్రటిక్ యూనియన్ అనే పార్టీ కలిసిపోయింది. మరో రెండు పార్టీలు సెమ్ అండ్ సెనేట్‌లలో అత్యధిక సంఖ్యలో సీట్లు సాధించాయి.

కొంతవరకు ప్రజాస్వామిక విధానం పునరుద్ధరింపబడిన రాజకీయంగా కల్లోల పరిస్థితులు పట్టువిడుపులు కనిపించని ప్రభుత్వ ఆర్థిక విధానాలు అలాగే కొనసాగాయి. 1992 సంవత్సరం పొడుగునా పెద్ద సంఖ్యలో బంధులు జరిగాయి. .సాలిడారిటీ. కూడా బంధులకు పిలుపునిచ్చింది. 1993 మే నెలలో ప్రధాని వాపన్నా సుబొక్కాపై సెమ్ అవిశ్వాస తీర్మానం కేవలం ఒక ఓటు తేడాతో చోటు చేసుకున్నప్పుడు. వాలెస్సా ఆమె రాజీనామాను ఆమోదించలేదు. ఛాంబర్‌ను రద్దు చేసి సరికొత్తగా ఎన్నికలను 1993, సెప్టెంబరులో ప్రకటించారు. వివిధ పార్టీల మధ్య రకరకాలైన ప్రయోజనాలతో, పొత్తుల ప్రవాహం కోసం అనూహ్యంగా రాజకీయ ఘర్షణ కూడా పోలెండులో అప్పుడు చోటుచేసికొంది. రాజకీయ అస్థిరత కూడా బాగా వ్యాపించి వుంది. ఎన్నికల ప్రవాసంతో ప్రజాస్వామీకరణ వాడుకలోకి వచ్చింది. మానవహక్కులపై అక్కడ కొనసాగిన ఉద్యమ నేపథ్యంలో దేశంలో తలెత్తిన ప్రధాన పరిణామంగా పలువురు భావించారు. అదే సమయంలో పోలెండు పలు అంతర్జాతీయ సంస్థలతో వివిధ ఒప్పందాలను కుదుర్చుకుంది. 1991 నవంబరులో యూరప్ మండాలిలలో పోలెండు కూడా సభ్యదేశం అయింది. అలాగే .నాటో. పార్టీ నర్‌షిప్‌ఫర్ పీస్.. కార్యక్రమంలో కూడా పోలెండు చేరింది. 1994 నవంబరులో చర్చలు జరిగాయి. యురోపియన్ యూనియన్ సంకీర్ణం సరికొత్త లక్ష్యాలతో కూడి ఏజెండాను రూపొందించుకుంది. సంస్కరణల పథంలో ఏజెండా రూపొందించడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా కొరవడిన స్థిరమైన నిర్ణయాలు వేగవంతమైన పనితీరుతో ముందుకు దూసుకుపోవాలని లక్ష్యంను పోలెండు పెట్టుకుంది. పోలెండు ఈ కార్యక్రమాలను చేపట్టడంలో దాగున్న ముఖ్య ఉద్దేశం యురోపియన్ యూనియన్‌లో సభ్యదేశం కావాలన్నదే సంస్కరణ పథంలో నడుస్తున్న పోలెండు అంతర్జాతీయంగా తనను తాను శక్తివంతమైన దేశంగా మలచుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది.

BRAOU

## 8.3.6 యూదుల పట్ల వివక్ష

పోలెండు రాజకీయ, ఆర్థిక సమస్యలను పక్కన పెడితే మరో ముఖ్యమైన సమస్యతో ఆ దేశం ఘర్షణ పడుతోందని స్పష్టమవుతోంది. యూదుల పట్ల వివక్ష ధోరణులు అక్కడ పెచ్చు పెరిగాయి. ఒకప్పుడు మూడు మిలియన్లదాక వుండే వారి సంఖ్య రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీల డెత్ క్యాంపుల్లో ఆకలి, హింసలకు గురై భారీ స్థాయిలో ప్రాణాలు కోల్పోయారు. 1967-68 నాటికి కేవలం 2,50,000 మంది మాత్రమే యూదు జాతీయులు మిగిలారు. అధికారం కోసంగా కమ్యూనిస్టు పార్టీలో చెలరేగిన పోరు, అధికారంలో ఒక వర్గం జాతి వ్యతిరేక విధానాలను అనుసరించడం వంటివి కూడా దాదాపు 9000 మంది యూదులు ఉద్యోగాలు పోగొట్టుకొని నిరాశ్రయులుగా నిలిచేట్టు చేసింది. వాళ్ల పౌరసత్వం రద్దు చేయడం, .వన్ వే ట్రావెల్. మాత్రమే వాళ్ళకు అందించడం దాదాపు 20,000 మంది యూదులు దేశం విడిచి వెళ్ళిపోవలసి వచ్చింది. పోలిష్ కమ్యూనిస్టు నాటి అధ్యక్షుడు వలడిస్లాగాముల్కా మద్దతుతో యూదు వ్యతిరేక ప్రచారం ఊపందుకుంది. పోలెండులో పార్టీ వేదికలపై, ఫాక్టరీ సమావేశాల్లో యూదులపై తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు కురిపించారు. ఉదారవాదులు, మేధావివర్గంపై యుద్ధాన్ని ఈ వర్గం ప్రకటించింది. మేధావి వర్గంలో అధిక సంఖ్యాకులు యూదులే.

అని రకాల జాతి వివక్షను నిర్మూలించాలనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో పోలెండుపై చేపుట్టిన నివేదికను జాతి వివక్ష కమిటీ పరిశీలించింది. పోలెండులో ఇంకా జాతి వివక్ష కొనసాగడాన్ని నివేదిక స్పష్టం చేసింది. జాతి, తెగల పేరుతో మానవులపట్ల వివక్షంగా ప్రవర్తించేవారిని శిక్షించేందుకు ఎలాంటి చట్టాలూ పోలెండులో లేవు. చట్టం ముందు అందరూ సమానులేనన్న అంశాన్ని దేశంలోని అన్ని సంస్థలూ పాటించాలని అక్కడి రాజ్యాంగబద్ధమైన కోర్టు స్పష్టం చేసింది. స్వతంత్ర్య న్యాయవ్యవస్థ కల్పించిన వ్యవస్థాగత గ్యారంటీలతో కూడిన సిస్టమ్‌ను పోలెండులో మనం చూస్తాం. ఇక్కడ కోర్టుల ద్వారా మాత్రమే న్యాయం అందడం కాకుండా, మానవహక్కుల కమీషనర్ లేదా .అంబుడ్స్‌మన్. ద్వారా కూడా న్యాయం అందుతుంది. చట్ట అతిక్రమణకు పాల్పడిన ఘర్షణలనే కాదు, సమిష్టి సంఘ జీవనానికి అటంకాలు, అడ్డంకులూ ఎదురైనా చర్యతీసుకునే అధికారాలు కమీషనర్‌కు వున్నాయి. వివక్షలు చూపించే కేసులు పోలెండులో తక్కువ. అవి కూడా సాధారణంగా జాతీయతకు సంబంధించిన కేసులు ఎక్కువగా వుంటాయి.

అంతర్జాతీయ మానవహక్కుల విషయానికి వస్తే, 1992 జూన్ సుప్రీంకోర్టు ప్రకటించిన నిర్ణయం ననుసరించి ఇకపై ఇలాంటి మానవహక్కుల కూటములన్ని సర్వస్వతంత్రగా వ్యవహరించవచ్చని హ్యూమన్ రైట్స్ ట్రీవాటీలకు చెందిన ప్రతినిధులు కమిటీకి స్పష్టం చేయడం జరిగింది. జాతి వివక్షపై అంతర్జాతీయ సదస్సు 1989 ఏప్రిల్‌లో రాజ్యాంగ సవరణ తీసుకురావడానికి ముందు రూపుదిద్దుకోవడం జరిగింది. పోలిష్ చట్టంలో తీసుకురావడం జరగలేదు. అయితే సదస్సుమట్టుకు సరికొత్త రాజ్యాంగాన్ని చేపట్టింది. సదస్సు చేపట్టిన నూతన రాజ్యాంగం ననుసరించి పోలెండ్ కుదుర్చుకున్న మానవహక్కుల ఒప్పందాలన్నింటిని సమాన తీరులో చూడ్డం జరుగుతుంది. అంతర్గత న్యాయక్రమంలో వాటిని భాగం చేస్తారు. ఎప్పుడు ఇవి ఆమోదించబడ్డాయి అన్న దానితో సంబంధం లేకుండానే అన్నింటికి దీన్ని వర్తింపచేయడం జరిగింది.

BRAOU

ప్రజాస్వామ్యం వైపుగా పోలెండులో చోటుచేసుకొంటున్న పలు పరిణామాల పట్ల కమిటీ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేసారు. మానవహక్కుల పరిరక్షణ పరంగా, అలాగే ప్రాథమిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాల రక్షణకు సంబంధించి, మానవ హక్కులకు సంబంధించి యూరోపియన్ కోర్టు జూరిస్‌డిక్షన్‌కు పోలెండు ఆమోదం, మానవ హక్కులకు సంబంధించి వ్యక్తిగతంగా పిటీషన్లను మానవ హక్కులపై ఏర్పాటు చేసిన యురోపియన్ కమీషన్‌కు నివేదించడం మొదలైనవన్ని ఆశావహమైన పరిణామాలుగా కమిటి సభ్యులు అభిప్రాయపడుతున్నారు. చట్టబద్ధమైన పాలన పునాదిగా పోలెండు పూర్తి ప్రజాస్వామ్య దేశం స్థాయికి ఎదిగిందనడానికి పూర్తి సాక్ష్యాధారాలు మనముందు కనిపిస్తున్నాయి.

## 8.4 ముగింపు :

ఈ భాగంలో సామ్యవాద దేశాలైన క్యూబా, పోలెండు దేశాలకు అమలులో వున్న మానవహక్కుల స్థితిగతులను చర్చించబడ్డాయి. విప్లవోద్యమానికి ముందు క్యూబాలోని పరిస్థితులు ఎలా ఉన్నయో తెలుసుకోగలిగినాము. విప్లవోద్యమ కాలంలో క్యూబాలో మానవహక్కుల స్థితిగతులను చర్చించుకున్నాము. మానవహక్కుల ఉల్లంఘనపై ఐక్యరాజ్యసమితి నివేదిక వాస్తవ పరిస్థితులను తెలియజేయగలిగింది. ఇదే తరహాలో పోలెండులోను మానవహక్కులు ఉల్లఘించబడుతున్నాయని ఐక్యరాజ్యసమితి గుర్తించి చర్చలు చేపట్టింది. ఈ రెండు సామ్యవాద దేశాలలోని మానవహక్కులపై ఒక సమగ్రమైన అవగాహన పెంపొందాల్సిన అవసరం వుంది. ఇటువంటి హక్కుల ఉల్లంఘనలు మానవహక్కులకు గల ప్రాధాన్యతను ప్రపంచానికి చాటి చెబుతాయి. వాటి పరిరక్షణ కోసం సమిష్టి కృషి అవశ్యకతను నినదిస్తాయి.

BRAOU

## 8.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి**

1. క్యూబాలోని మానవ హక్కులను చర్చించండి ?
2. పోలెండులోని మానవ హక్కుల పరిణామ చరిత్రను వివరించండి ?

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. విప్లవోద్యామానికి ముందు క్యూబాలోని పరిస్థితులు ఎటువంటివి ?
2. నాజీల నియంత్రణలోని పోలెండు పరిస్థితిని తెలపండి ?

# ఖండం – IV

# అభివృద్ధి చెందుతున్న సమాజాలు

పాశ్చాత్య దేశాల వలస, సామ్రాజ్యవాద విధాన దోపిడీకి గురైన దేశాలు రెండో ప్రపంచ యుద్ధానంతరం స్వాతంత్ర్యం పొందాయి. వలస విధానపు పోకడలకు ప్రత్యామ్నాయంగా రాజ్యాంగాలు ఏర్పడినా పాశ్చాత్య భావజాలం నేటికి వర్ధమాన దేశాలను పట్టిపీడిస్తుంది. ఫలితంగా ఈ దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు లెక్కకుమించి జరుగుతున్నాయి. ప్రభుత్వ పరంగా ఒకవైపు, సామాజిక ఆర్థిక వెనుక బాటు తనంగా మరోవైపు ఈ ఉల్లంఘనలు మానవ హక్కులపై ముప్పేటలా దాడి చేస్తున్నాయి. ఈ అంశాలను పరిశీలించడమే ఈ ఖండం ప్రధాన ఉద్దేశం. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి.

అవి :

- భాగం : 9 దక్షిణాఫ్రికాలో మానవ హక్కులు
- భాగం : 10 లాటిన్ అమెరికాలో మానవ హక్కులు
- భాగం : 11 ఇస్లామిక్ సమాజాలలో మానవ హక్కులు

BRAOU

BRAOU

# భాగం – 9 : దక్షిణాఫ్రికాలో మానవహక్కులు

విషయక్రమం :


9.0 ఉద్దేశం

9.1 పరిచయం

9.2 వలసవాదం

9.3 వర్ణ వివక్ష పాలన

9.4 నల్లవారి పోరాటాలు

9.5 నూతన రాజ్యాంగంలో మానవ హక్కులు

9.6 పౌరమరియు రాజకీయ హక్కులు

9.6.1 సమానత్వం

9.6.2 జీతవించే హక్కు

9.6.3 వ్యక్తి గత స్వేచ్ఛ, భద్రత

9.6.4 మతం, నమ్మకం, అభిప్రాయం

9.6.5 వాక్ స్వాతంత్రం

9.6.6 సమావేశం ప్రదర్శన, పిటిషన్

9.6.7 బందించబడిన, ఖైదు చేయబడిన, ఆరోపించబడినవారు.

9.6.8 ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు

9.7 ఇతర అంశాలు

9.8 ముగింపు

9.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు


BRAOU

## 9.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- దక్షిణాఫ్రికాలో అపార్థాయిడ్ పాలనకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటారు.
- అపార్థాయిడ్ పాలనకు వ్యతిరేకంగా నల్లవారిపోరాటాలు పరిశీలిస్తారు.
- నూతన రాజ్యాంగం ద్వారా నల్లవారు పొందిన మానవ హక్కులు అవగతమవుతాయి.

## 9.1 పరిచయం :

వర్ణవివక్ష (apartheid) దక్షిణాఫ్రికాలో మానవ హక్కుల సంస్కృతి వుండేదికాదు. వర్ణవివక్ష వ్యవస్థ దక్షిణాఫ్రికా సమాజంలో నిరంతరం అసహనం, హింసా సంస్కృతి, మెజారిటి ప్రజల జీవితాల పట్ల అగౌరవం పెంచి పోషిస్తూవుండేది. 1994లో మొట్ట మొదటి సారిగా నెల్సన్ మండేలా నాయకత్వంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి మానవ హక్కుల సంస్కృతిని పెంపొందించడానికి పునాదులు వెయబడినాయి. 1997లో దక్షిణాఫ్రికా రాజ్యాంగసభ ఆమోదించిన ప్రజాస్వామ్య బద్ధ రాజ్యాంగంలో మానవ హక్కులకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చినారు. ప్రస్తుత పాఠంలో వర్ణవిపక్షపాలనలో దక్షిణాఫ్రికా సమాజంలో ఏవిధంగా మానవ హక్కులు కాలరాయబడినాయి? వర్ణవివపక్షతకు వ్యతిరేకంగా మెజారిటి నల్లజాతి ప్రజలు సలిపిన పోరాట స్వభావ స్వరూపాలేమిటి? నూతన రాజ్యంగంలో పొదుపరచిన మానవ హక్కుల సూత్రాలేమిటి? మొదలగు వాటిని గురించి క్షుణ్ణంగా పరిశీలిద్దాం.

## 9.2 వలసవాదం :

ఆఫ్రికా ఖండంలో గల మొత్తం 53 దేశాలలో దక్షిణఫ్రికా ఒకటి. ఇది ఆఫ్రికా ఖండంలో అత్యంత దక్షిణ భాగంలో వుంది. దీని విస్తీర్ణం 1127.0వేల చదరపు కిలోమీటర్లు. దీనికి ఎల్లలుగా ఉత్తరాన నమీబియా, బోట్సువాన, జింబాబ్వే, మొజాంబిక్ దేశాలున్నాయి. దక్షిణాన, పడమరన హిందూమహా సముద్రం, తూర్పున అట్లాంటిక్ సముద్రం వున్నాయి. ఈ దేశం భూభాగం చుట్టూ వుండగా మధ్యలో రెండు చిన్న దేశాలు స్వాజీలాండ్ లెసోతోలు వున్నాయి 1980 జనాభాలెక్కల ప్రకారం మొత్తం 29 మిలియన్లలో నల్లజాతీయులు 26 మిలియన్లు (73.5%), 5నుండి6 మిలియన్ల తెల్లజాతీయులు, (15%) 3 మిలియన్ల కలర్డ్స్ (8.5%), 1నుండి 2 మిలియన్లు ఆసియావారు (3%) ఉన్నారు. దక్షిణాఫ్రికా భూభాగంలో అపారమైన ఖనిజ సంపదలున్నాయి. ముఖ్యంగా, వజ్రాలు, బంగారం, యురేనియం, క్రోమియం, ప్లాటినం, వనాడియం మొదలగునవి వున్నాయి.

BRAOU

వర్ణవివక్షపాలనలో పాఠశాలలో విద్యార్థులకు తెల్ల జాతీయులు రాకపూర్వం ఈ భూభాగంలో ప్రజలెవరూ నివసించె వారు కాదని బోధించేవారు. కాని ఇది వాస్తవం కాదు. తెల్లవారు రాకపూర్వం పలుశతాబ్దాల నుండి పలు ఆఫ్రికా జాతుల వారు నివాసమేర్పర్చుకున్నారు. ఈ జాతులలో ముఖ్యమైనవి, సోతోస్వానా, ఎన్‌గూని, స్వాజి, జూలూ, పోండో, టెంబూ, హోసా మొదలగునవి వేట, పశుపోషణ, వ్యవసాయం ముఖ్య వృత్తులుగా వీరు జీవనం సాగించేవారు. 17వ శతాబ్దం మధ్యభాగంలో డచ్ ఈస్ట్ ఇండియా కంపెని వారు కేప్ ఆఫ్ గాడ్ హోప్‌లో వ్యాపార స్థావరాలు ఏర్పచిన తరువాత క్రమంగా దక్షిణాఫ్రికాలో డచ్ వారి వలసలు మొదలైనాయి. (అంతకు మునుపు పోర్చుగీసు వారి వ్యాపార స్థావరాలున్నా వలసలు లేవు).

డచ్ వలసవాదులు తమకుతాము బోయర్లుగా (వ్యవసాయదారులు) పిలుచుకునేవారు. తరువాత వారికి వారు ఆఫ్రికాండర్స్‌గా నామకారణం చేసుకున్నారు. 20శతాబ్దంలో ఆఫ్రికాన్స్ అనే మాండలికాన్ని రూపొందించుకుని వారి భాష డచ్ భాషకు భిన్నమైందని చెప్పుకున్నారు. బోయర్స్‌కు డచ్ ఈస్ట్ యిండియా కాంపెనికి మధ్య తగాధాల వల్ల వీరు రాను రాను దక్షిణాఫ్రికా కోస్తాతీరంనుండి లోపలి భాగలకు చొచ్చుకుని

పోవడం ప్రారంభించారు. దీని ద్వారా స్థానిక ఆఫ్రికన్లను వారి హింసకు, యుద్ధాలకు గురిచేసి వారి నుండి భూములను కైవసం చేసుకోవడం మొదలుపెట్టారు. ఆధునిక మందుగుండు సామగ్రి కలిగియుండటం వల్ల బోయర్లు తమ ప్రయత్నాలలో సఫలమయ్యారు. 1881 వరకు ఈ ప్రక్రియ కొనసాగినప్పటి మొత్తం దక్షిణాఫ్రికా భూభాగం బ్రిటీష్ వారి రాక తరువాతనే తెల్లవారి ఆధీనంలోకి వచ్చింది. అపారమైన ఖనిజ సంపదలు బయల్పడడంతో బ్రిటీష్ వారి ఆసక్తి పెరిగింది. తద్వారా బ్రిటీష్ పెట్టుబడిదారి కార్యకలాపాలు పెరిగి ముఖ్యంగా వ్యవసాయంపైన ఆధారపడిన బోయర్లతో ఘర్షణలు మొదలైనాయి. ఇవి 1899 నుండి 1902 మధ్య యుద్ధాలకు దారి తీసి బోయర్ యుద్ధాలుగా పిలవబడ్డాయి.

వర్ణ వివక్షతకు పునాదులు వలసపాలనలోనే వేసినారు. బోయర్ యుద్ధాలలో బ్రిటీష్ వారు స్థానిక ఆఫ్రికన్లకు బోయర్లనుండి రక్షణనిస్తామని చెప్పి తరువాత బోయర్లతో 'శాంతి' ఒప్పందాలు కుదుర్చుకొని భవిష్యత్ దక్షిణాఫ్రికాను బోయర్లు, బ్రిటీష్ వలస ప్రజల ఇష్టా అయిష్టాలకు వదిలివేసించి. 1910 మేలో దక్షిణాఫ్రికా ఒక యూనియన్‌గా (Union of South Africa) అవతరించడంతో బ్రిటీష్ ప్రభుత్వం దక్షిణాఫ్రికాను వలసదేశం కాక ఒక స్వతంత్ర దేశంగా పరిగణించడం మొదలు పెట్టింది. 1961లో దక్షిణాఫ్రికా తెల్లజాతీయులు ఒక గణతంత్ర దేశంగా (Republic of South Africa) ప్రకటించడంతో అంతవరకు లాంఛన ప్రాయంగా వున్న బ్రిటీష్ రాచరిక పెత్తనం (మకుటం) సమసిపోయింది. ఈ ప్రక్రియను అధికార మార్పిడిగా చూడటం తప్పు. ఎందుకంటే 1993 వరకు పూర్తి అధికారం మైనారిటి తెల్లజాతి హస్తాలలోనే వుంది కనుక. 1913లో స్థానిక భూమి చట్టం (Native Land Act) ద్వారా అంతకు ముందే ఏర్పరిచిన నల్లజాతీయుల ప్రత్యేక స్థలాలను (Reserves) చట్టబద్ధం చేశారు. దీని ప్రకారం నల్లజాతీయులు రిజర్వుల వెలుపల భూములు కొనడానికి గాని అద్దెకు తీసుకోవడానికిగాని అర్హులుకారు. (అదేవిధంగా తెల్లజాతీయులు రిజర్వులలోని భూములను కొనడం, అద్దెకు తీసుకోవటూకూతదు). ఈ చట్టం 78 శాతం నల్లజాతి ప్రజానీకం కేవలం 7.3శాతం భూభాగంలోనే సర్దుకుపోయేట్టు సూత్రీకరించింది. 1936లో మరో స్థానిక ట్రస్ట్ మరియు భూమి చట్టం ( Native Trust and Land Act) ద్వారా రిజర్వుల భూభాగాన్ని 13.7 శాతానికి పెంచింది. ఈ భూభాగాలనే సంస్థాగత అపార్థాయిడ్ పాలనలో హోమ్ లాండ్స్ లేదా బంటుస్థాన్‌లుగా (నల్లజాతీయుల ప్రతేక రాష్ట్రాలు) నామకరణం చేశారు.

BRAOU

## 9.3 వర్ణ వివక్ష పాలన:

అపార్థాయిడ్ అంటే వేర్పాటు (Seperate) అని అర్థం. మొదట ఇది 1948 ఎన్నికలలో నేషనలిస్ట్ పార్టీ (NP) నినాదంగా ముందుకు వచ్చింది. దీని ద్వారా ముందు ముందు తెల్లజాతీయులు తమకంటూ ఒక ప్రత్యేక లక్షణాలను సంతరించుకుంటారు. నల్లవారు వేరుగా జీవిస్తారు అని ప్రచారం సాగింది. కాని అపార్థాయిడ్ నిజమైన అర్థాలు 1948 ఎన్నికల్లో నేషనలిస్టు పార్టి అధికారంలోకి వచ్చాక ప్రస్ఫుటమయినాయి.

1. 1950 చట్టం ద్వారా ప్రతిపక్షాలను అణచివేసే నెపంతో కమ్యూనిస్టుల అణచివేత చట్టం రూపొందించారు.
2. 1967 ఎటువంటి విచారణ లేకుండా నిర్బంధించే విధంగా చట్టాన్ని రూపొందించినారు.
3. వేరు వేరు జాతులకు వేరు వేరు కార్మిక సంఘాలు ఏర్పాటు
4. ఆఫ్రికన్ కూలీల భర్తీ, నియంత్రణకు ప్రత్యేక బ్యూరో ఏర్పాటు

5. పాస్‌లా చట్టం ద్వారా ఆఫ్రికన్ల కదలికలను నియంత్రించడం. దీని ప్రకారం 16 ఏండ్లు నిండిన ప్రతి ఆఫ్రికన్ స్త్రీ, పురుషుడు ఒక పాస్‌బుక్‌ను కలిగివుండాలి. దానిలో వారి పేరు, వేలిముద్రలు, పన్ను సక్రమంగా కడుతున్న వివరాలు, ఇతర ప్రాంతాల ప్రయాణానికి, పనిచేయడానికి అనుమతులు మొదలగునవి పొందు పరచబడి వుండేవి. వీటి ద్వారా కూలీల సరఫరా, నియంత్రణలే కాక పోలీసుల నియంత్రణకు కూడా ఉపయోగించేవారు. అపార్థాయిడ్ పాలన కాలంలో ఈ చట్టాన్ని ఉల్లఘించారంటూ ప్రతి సంవత్సరానికి 2,00,000పైగా నల్లజాతీయులను శిక్షలకు గురిచేసేవారని అంచనా.

6. ఆఫ్రికన్ల రిజర్వులను హోమ్ లాండ్స్ బంటూస్థాన్‌లుగా (బంటు ఆఫ్రికాన్లకు బోయర్లు పెట్టిన పేరు) నామకరణం చేసి కృత్రిమ నల్లజాతి స్వయంపాలిత ప్రాంతాలను ఏర్పరిచినారు. వీట్టిల్లో స్థానిక కౌన్సిళ్ళ తెగనాయకులకు మాత్రం ప్రాతినిధ్యం ఇచ్చి తెగల పాలనను ప్రవేశపెట్టినారు. ఈ విధంగా నల్లజాతి వారికి స్వయంపాలనాధికారాలు ఇచ్చినామని చాటి చెప్పుకున్నారు. తరువాత 1976లో ట్రాన్స్‌కీ అను బంటుస్తాన్ (ఎక్కువగా హోసా జాతి వారున్నది) కు స్వాతంత్ర్యాన్ని అపార్థయిడ్ ప్రభుత్వం ప్రకటించింది. అలాగే 1977లో బొపుతాట్స్‌వనకు 1979లో వెండాకు 1981లో ..సిస్‌కీ..కి స్వాతంత్రాన్ని ప్రకటింపచేశారు. కాని ఇది కేవలం నకిలీ స్వాతంత్ర్యం మాత్రమే.

పై అంశాలను పరిశీలించినట్లయితే అపార్థాయిడ్ పాలనలో రాజ్యాంగబద్ధంగా అన్ని రకాల మానవ హక్కులను కాలరాస్తూ జాతి విచక్షణను పాటించారో ప్రస్ఫుటమౌతుంది. ముఖ్యంగా బంటుస్థాన్ల ఆర్థికంగా పనిరాని, చెదురు మదురుగా ఉన్న కేవలం బంజరు భూమి ప్రాంతాలు. అక్కడ దారిద్ర్యం తప్ప ఇంకేమి వుండేది కాదు. వీటిని ముఖ్యంగా తెల్లజాతి వారికి ఎల్లప్పుడూ ఉపయోగపడే కూలీ రిజర్వులుగా తీర్చిదిద్దినారు. శాశ్వతంగా నల్లజాతీవారు ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా పకడ్‌బంది ఏర్పాట్లు చేసినారు. ఒక వేళ ఏ నల్లవాడైనా 72 గంటలు తన బంటుస్థాన్ వదలి వెళ్ళి వున్నట్లయితే దానికి సరైన లిఖిత పూర్వకమైన నమోదు తన పాస్ బుక్‌లో లేనట్లయితే అతడిని శిక్షార్హుడుగా పరిగణించేవారు.

BRAOU

## 9.4 నల్ల వారి పోరాటాలు :

మొదట బోయర్ల వలసలను తరువాత వర్ణవివక్షతను వ్యతిరేకిస్తూ మెజారిటి నల్లజాతీయులు మొదటినుండే పోరాడుతూ వచ్చారు. 1780 నుండి 1880 వరకు బోయర్ల భూ ఆక్రమాలకు వ్యతిరేకంగా హోసాలు, జూలు జాతి వారు భీకరమైన పోరాటాలు సలిపినారు. అయితే తెల్లవారి వద్దనున్న ఆధునిక యుద్ధ సామగ్రికి నల్లవారు బలైపోక తప్పలేదు. 1912లో ఆఫ్రికాన్ నేషనల్ కాంగ్రేస్ (ANC) ఏర్పాటయింది, 1919లో ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ వర్కర్స్ యూనియన్(ICU) 1921లో దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ (SACP) ఏర్పడినాయి. ఇవన్ని కలిసి పలు అంశాలపై పోరాటాలు సాగిస్తూ వచ్చారు. 1942-44 ప్రాంతంలో ఆఫ్రికాన్ శ్రామికులు 60 సమ్మెలు జరిపారు. 1946లో 1,00,000పై ఘని కార్మికులు వారానికిపై సమ్మె జరిపారు. 1948లో నేషనలిస్టు పార్టి అధికారంలోకి వచ్చి, అపార్థాయిడ్ సంస్థాగతమైనాక అన్ని రకాల ప్రజా తిరుగుబాట్లపై ఉక్కుపాదంతో అణచివేసినారు. 1950లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రేస్ కార్యక్రమాలు మరింత ఉధృతమయ్యాయి. 1955 జూన్ 25,26లో ఏ. ఎన్.సి. సభలకు దక్షిణాఫ్రికా అన్ని ప్రాంతాలనుండి 2,850

మంది ప్రతినిధులు పాల్గొన్నారు. దీనిలోనే ఏ. ఎన్. సి. ప్రసిద్ధ ..ఫ్రీడమ్ చార్టర్..ను ప్రకటించింది. దీనిని అపార్థాయిడ్ ప్రభుత్వం అత్యంత విశ్వాసఘాతుకమైన పత్రం గా (High Treason)పరిగణించి హింసను ఉధృతం చేసింది. 1960, మార్చి 21న జరిగిన శార్పెవిల్లి ఊరేగింపుపై జరిగిన పోలీసుకాల్పులలో 83 మంది నల్ల జాతీయులు మరణించారు. మరో 400పైగా గాయపడ్డారు. అంతకు ముందే అనగా 1950లో కమ్యూనిస్టు పార్టీని నిషేదించారు. బహిరంగ కార్యకలాపాలను నిషేదించడంతో 1961లో ఏ. ఎన్. సి.తన సాయుధ దళాన్ని ..స్పియర్ ఆఫ్‌ది నేషన్.. (Umkhomto we Sizwe) ఏర్పాటు చేసి సాయుధ పోరాటాన్ని ముమ్మరం చేసింది. ఏర్పరచిన 18 నెలలలోనే 150 మార్లు దేశమంతటా దాడులు జరిగాయి. 1963 జూలైలో రివోనియాలోని ఏ. ఎన్.సి. ముఖ్య కార్యాలయంపై దాడిచేసి నెల్సన్ మండేలతో సహా పలువురు నాయకులను నిర్బంధంలోకి తీసుకున్నారు. అప్పటినుండి 27 సంవత్సరాలు అనగా ఫిబ్రవరి 1990 వరకు నెల్సన్ మండేల దుర్భరమైన జైలు జీవితాన్ని అనుభవించారు.

నేతల నిర్బంధంతో పోరాటాలు సమసిపోలేదు పోగా మరింత తీవ్ర రూపం దాల్చినాయి. సాయుధదళం తన కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చింది. 1976 సోవేట్ విద్యార్థి తిరుగుబాటు తరువాత నల్లజాతీ పోరాటాలు మరింత విస్తృతమైనాయి. 1983 నుండి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యు.డి.యఫ్.) ఏర్పాటు, 1985 లో కాంగ్రెస్ ఆఫ్ సౌత్ ఆఫ్రికన్ ట్రేడ్ యూనియన్స్ ఏర్పాటుతో దేశమంతటా ప్రజా ఆందళోనలు రోజువారిగా మారినాయి. అయినా అపార్థాయిడ్ ప్రభుత్వం దిగిరాలేదు. అన్ని రకాల ఉద్యమాలను అణచివేయడం మినహాయించీ సంప్రదింపులు జరగలేదు. అంతర్జాతీయంగా ఐక్య రాజ్య సమితిలో (యు.ఎన్.ఓ.) ఆర్గనైజేషన్ ఆఫ్ ఆఫ్రికన్ యూనిటి (ఓ.ఏ.యు.), అలీనోద్యమం (నామ్) ఇతరత్రా అంతటా ప్రపంచ ప్రజాభిప్రాయం అమానుష అపార్థాయిడ్‌కు వ్యతిరేకంగా చెలరేగింది. ఐక్యరాజ్యసమితి ఆర్థిక ఆంక్షలను అమెరికా పాశ్చాత్య పెట్టుబడిదారి దేశాలు సరిగ్గా అమలు చేయలేదు. దానిని దక్షిణాఫ్రిక ఆర్థిక వ్యవస్థలో వారికున్న ఆస్తులు (2,000 పైగా ఈ దేశాలలోని కార్పోరేషన్‌లు దక్షిణాఫ్రికాలో పనిచేస్తున్నాయి.) ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాలు ముఖ్యకారణాలు. 1980 చివరి భాగం వరకు సమసిపోయిన ప్రచ్ఛన్న యుద్ధ ఛాయలు, అంతర్జాతీయంగా ఏర్పడిన నూతన పరిస్థితి, ప్రపంచ ప్రజాభిప్రాయానికి తలఒగ్గి అమెరికా, పాశ్చాత్యా దేశాల దక్షిణాఫ్రికా విధానంలో మార్పులు, పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లిన ప్రజా ఆందోళలకు తట్టుకోలేని పరిస్థితిలో అపార్థాయిడ్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. 1990 ఫిబ్రవరిలో ఏ.ఎన్.సి. ఇతర పార్టీలపై నిషేదాలు తొలగింపు, నెల్సన్ మండేలా విడుదలతో వెంటవెంటనే పరిస్థితులు మారుతూ వచ్చాయి. 1990 లో పలు రాజకీయ పక్షాల మధ్య చర్చలు మొదలైనాయి. 1991 లో కన్వెన్షన్ ఫర్ ఎ డెమోక్రాటిక్ సౌత్ ఆఫ్రికా (CODESA) ఆధ్వర్యంలో చర్చలు కూలంకశంగా నడిచాయి. 1992 అక్టోబరులో తెల్లజాతివారి రిఫరెండంలో అపార్థాయిడ్ వ్యవస్థను నిర్మూలించడానికి నిర్ణయం తీసుకున్నారు. 1994 ఏప్రిల్‌లో దక్షిణాఫ్రికాలలో మొట్టమొదటిసారిగా ప్రజాస్వామ్యబద్ధ ఎన్నికలు జరిగినాయి. మే నెలలో నెల్సన్ మండేలా అధ్యక్షునిగా ఎ.ఎన్.సి. అత్యధిక స్థానాలతో అన్ని పార్టీల గవర్నమెంట్ రాజ్యాంగ సభగా పనిచేసింది. 1997 ఫిబ్రవరి 4న నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

## 9.5 నూతన రాజ్యాంగంలో మానవ హక్కులు :

సుమారు అర్థ శతాబ్దం పైగా అపార్థాయిడ్ రాజ్యం ఐక్యరాజ్యసమితిని, ఐక్యరాజ్య మానవ హక్కుల

BRAOU

ప్రకటనను కమ్యూనిస్టు ప్రచారంగా ముద్రించి వాటిని బేఖాతరు చేస్తూ వచ్చింది. నూతన రాజ్యాంగంలో పొందుపరిచిన ..బిల్ ఆఫ్ రైట్స్.. శాసనాత్మకంగా అంతర్జాతీయ మానవ హక్కుల సూత్రాలను పరిణగించి సూత్రీకరించింది. 1994 లోనే మూడు ముఖ్యమైన మానవహక్కుల ఒప్పందాలను జాతీయ పార్లమెంటు ఆమోదించింది. (1). ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ ఆన్ ఏకనామిక్, సోషల్ అండ్ కల్చరల్ రైట్స్, (2). ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్, (3) కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్‌పార్మ్స్ ఆఫ్ రేషియన్ డిస్క్రిమినేషన్. 1995 లో (1). కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ది చైల్డ్, (2). కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్‌ఫార్మ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ అగెనెస్ట్ ఉమన్ మరియు జెనివా కన్వెన్షన్ ప్రోటోకోల్స్‌లను ఆమోధించింది. వీటిల్లోని ముఖ్యాంశాలన్ని నూతన రాజ్యాంగంలోని ..బిల్ ఆఫ్ రైట్స్.. లో చోటు చేసుకున్నాయి.

## 9.6 పౌర మరియు రాజకీయ హక్కులు :

దక్షిణాఫ్రికా నూతన రాజ్యాంగంలో పొందుపరచబడిన ..బిల్ ఆఫ్ రైట్స్..లో 19 డిసెంబరు 1966 న అమోదించబడిన 23 మార్చ్ 1976 లో అమలులోకి వచ్చిన ..ఇంటర్‌నేషనల్ కావెనాంట్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్.. లోని మూత సూత్రాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో ముఖ్యమైనవి (1). సమానత్వం (2). జీవించే హక్కు (3) వ్యక్తిగత స్వేచ్ఛా, భద్రత, (4). మతం, నమ్మకం, అభిప్రాయం, (5). వాక్ స్వాతంత్ర్యం, (6). సమావేశం, ప్రదర్శన, పిటిషనుకు సంబంధించిన స్వాతంత్ర్యం, (7). బంధించబడిన, ఖైదు చేయబడిన, ఆరోపింబడిన వారి స్వాతంత్ర్యం.

BRAOU

### 9.6.1 సమానత్వం

ప్రభుత్వంలోని అన్ని స్థాయిలలోని శాసనసభ, కార్యనిర్వాహక వర్గం, సమానత్వ భావనకు లోబడి ఉండాలి. సమాజంలోని ప్రతి వ్యక్తికి చట్టం సమానంగా వర్తిస్తుంది. సమానంగా రక్షిస్తుంది. జాతి, లింగం, రంగు, సామాజిక మూలం, సెక్సువల్ ఓరియంటేషన్, వయస్సు, వైకల్యం, మతం, అంతఃకరణ, నమ్మకం, సంస్కృతి, భాష పరమైన బేదభావాలు నిషేధం. దక్షిణాఫ్రికా రాజ్యాంగం ముఖ్యంగా రెండు విషయాలలో ఇతర ఆధునిక రాజ్యాంగాలలో కాని, ఇంత ముందు తెలిపిన కావెనాంట్‌లోగాని లేని అంశాలు, సెక్సువల్ ఓరియంటేషన్ మరియు వైకల్యంల పట్ల కూడా భేధభావాలకు నిషేదించడం విశేషం. దక్షిణాఫ్రికా మెజారిటి ప్రజలు వందల సంవత్సరాలుగా విచక్షణకు బలియైనందున వారిని సమానత్వ పరిధిలోకి తీసుకురావడానికి రాజ్యాంగం అఫిర్‌మేటివ్ యాక్షన్‌ను వర్తింపచేస్తుంది. భూములు కోల్పోయిన వారికి తిరిగి ఇచ్చివేయుటకు సంబంధించిన హక్కులు కూడా వున్నాయి. వీటికి సంబంధించి ఒక కమీషన్ ఏర్పాటు చేసి భూ పంపిణిని సక్రమంగా అమలు పరచేందుకు చర్యలు గైకొనాల్సిందిగా రాజ్యాంగం సూచించింది.

### 9.6.2 జీవించే హక్కు

జీవించే హక్కుకు సంబంధించి మాసాయిదా కమిటీలో మరణశిక్ష, గర్భస్రావం అంశాలపై చర్చ సాగించి కాని చివరకు ప్రతి వ్యక్తికి జీవించే హక్కును రాజ్యాంగం కల్పిస్తుంది అను అంశానికి పరిమితం చేశారు. కాని తరువాత రాజ్యాంగ కోర్టు జోక్యంతో మరణశిక్షను రద్దు చేయడం దక్షిణాఫ్రికా మానవహక్కుల చరిత్రలో ఒక మైలురాయిగా పరిగణించవచ్చు.

### 9.6.3 వ్యక్తిగత స్వేచ్ఛ భద్రత

ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ భద్రతను నూతన రాజ్యాంగం ప్రకటించింది. దీనిలో విచారణ లేకుండా నిర్బంధించడాన్ని నిషేదించారు. ఇది దక్షిణాఫ్రికా సందర్భంలో ముఖ్యమైనది. ఎందుకంటే గతంలో అంతర్గత భద్రతా చట్టం క్రింది కొన్ని వేల మంది రాజకీయ ఖైదీలను ఎటువంటి విచారణ లేకుండా నిర్బదించేవారు. రాజ్యాంగం చిత్రహింసను క్రూరమైన, అమానుషమైన లేదా హీనమైన విధంగా శిక్షించడాన్ని నిషేధించింది. ..చిత్రహింసను.. భౌతిక, మానసిక, ఉద్రేక పూరితమైన రకాలుగా నిర్వహించి నిషేదించడం జరిగింది.

### 9.6.4 మతం, నమ్మకం, అభిప్రాయం

రాజ్యాంగం స్వేచ్ఛగా ఆలోచించేందుకు అంతఃకరణ, మతంకు తగు రక్షణ కల్పించింది. ప్రత్యేకించి, "ఉన్న విద్యారంగంలో విద్యా విషయక స్వేచ్ఛ"ను కూడా ప్రస్థావించారు. ఆయా మతాలపై నమ్మకమున్నవారికి వాటికి సంబందిత వ్యక్తిగత, కుటుంబ చట్టాలు, సూత్రాలను రాజ్యాంగం గుర్తించింది. రాజ్య, రాజ్య సహాయాన్ని పొందే సంస్థలో మతపరమైన కార్యక్రమాల నిర్వాహణకు సంబందించి అవి సమానత్వ సిద్ధాంతంపై ఆధారపడాలని వాటిలో పాల్గొనడం స్వచ్ఛందంగా ఉండాలని పేర్కొనడం జరిగింది.

### 9.6.5 వాక్ స్వాతంత్ర్యం

వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను, వార్తా పత్రికల స్వేచ్ఛను, కళాత్మక సృజన, శాస్త్ర పరిశోధనల స్వేచ్ఛలను రాజ్యాంగంలో పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తన హక్కులను కాపాడుకునే ప్రక్రియలో రాజ్యంలోని అన్ని ప్రభుత్వ సంస్థల నుండి సమాచారం పొందే హక్కును ఇవ్వడం జరిగింది.

BRAOU

### 9.6.6 సమావేశం, ప్రదర్శన, పిటీషన్

శాంతియుతంగా ఆయుధాలు లేకుండా సమావేశమవడానికి రాజ్యాంగం అనుమతినిచ్చింది. అదే విధంగా శాంతియుతంగా ప్రదర్శనలు నిర్వహించడానికి, పిటీషన్లు ఇవ్వడానికి కూడా అవకాశాలు కల్పించింది. కాని దీనిని జాతీ తెగకు చెందిన పార్టీ ఎప్పుడూ దుర్వినియోగపరుస్తున్నది. ఈ పార్టీకి చెందిన కార్యకర్తలు ఎప్పుడూ తెగ సాంప్రదాయ ఆయుధాల పేరిట గొడ్డళ్ళు, ఇతర లోహ ఆయుధాలు బహిరంగంగా చేతబూని సమావేశాలు, ప్రదర్శనలో పాల్గొంటున్నారు. కావున ఇది ఒక సమస్యగానే ఉంటున్నది.

### 9.6.7 బంధించబడిన, ఖైదుచేయబడిన, ఆరోపించబడిన వారు

వీరికి సంబంధించి, చాలా విపులంగా చర్చించడం జరిగింది. "ప్రతి ఒక్కరికి పూర్తి సమానత్వ, న్యాయమైన ప్రజా విచారణ జరిగేటట్టు స్వతంత్ర్య నిష్పాక్షిక కోర్టుల వ్యవస్థలను ఏర్పాటు చేసింది" వ్యక్తులు. సంపూర్ణ విచారణ జరిగి నిందలు రుజువుకానంతవరకు నిర్దోషిగా పరిగణించాలని పేర్కొనడం జరిగింది. రాజ్యం అసహాయులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించేందుకు కూడా వీలు కల్పించారు.

### 9.6.8 ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు

ఏ.ఎన్.సి. రాజ్యాంగ కమిటీ అధ్యక్షుడు జోలా స్కేవియియా ఇలా అన్నారు. ..మాకు కూడు లేని స్వేచ్ఛ వద్దు, అదే విధంగా స్వేచ్ఛ లేని కూడు కూడా వద్దు.. కావున రాజ్యం ఉన్నటువంటి వనరులను గరిష్టంగా ఉపయోగించి ప్రధాన సామాజిక, విద్యా, ఆర్థిక, సంక్షేమ రంగాలలో అందరికి ఉపయోగపడే శాసనాల విధానాలు రూపొందించాలని రాజ్యాంగంలో పేర్కొన్నారు. వీటికి సంబంధించి కనీస పౌష్టికాహారం, ఉండటానికి ఇల్లు, విద్యాహక్కు, ఆరోగ్యహక్కు, పనిచేసే హక్కు, కనిష్ఠ ఆదాయ హక్కు, ప్రధాన సామాజిక సంక్షేమ హక్కులను ఇవ్వడం జరిగింది. ప్రతి ఒక్కరికి వారికిష్టమైన భాషను ఉపయోగించడానికి, సాంస్కృతిక కార్యక్రమాలలో, రంగాలలో పాల్గొనడాని స్వేచ్ఛను కల్పించింది. భాషకు సంబంధించి గతంలో కేవలం ఇంగ్లీషు, ఆఫ్రికన్స్ ( బోయర్ల భాష) లను మాత్రమే గుర్తింపు వుండేది. నూతన రాజ్యాంగం జాతీయ స్థాయిలో 11 భాషలకు అధికార భాషలుగా గుర్తింపునివ్వడం జరిగింది. పిల్లల హక్కులకు సంబంధించి రాజ్యాంగంలో విస్తృతంగా ప్రస్తావించారు. చిన్న పిల్లలకు మైనర్ స్థాయిని కల్పించి రక్షణ కల్పించడం, జాతీయతను పొందే హక్కు, ఆర్థిక, సామాజిక దోపిడి నుండి రక్షణ, పిల్లలకు పేరెంటర్ కేర్, భద్రత పౌష్టికాహారం, ఆరోగ్యం మొదలగువాటిని పొందుపరిచినారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణ, హేతుబద్ధమైన ప్రకృతి వనరుల వినియోగం కోసం రాజ్యం కృషి చేయాలని పేర్కొనడం జరిగింది.

## 9.7 ఇతర అంశాలు :

నూతన ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రక్రియలో తీసుకువచ్చిన మరో ముఖ్య అంశం 1995 ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ కోర్టు. ఈ కోర్టు తనకున్న న్యాయ సమీక్ష అధికారంతో ఇప్పటికే మానవ హక్కులకు సంబంధించి పలు తీర్పులు ఇచ్చింది. మరణశిక్ష రద్దు, బాల నేరస్థులపై భౌతిక శిక్షల రద్దు, రుణ సంబంధిత కేసులో సివిల్ శిక్షలను న్యాయవిరుద్ధంగా ప్రకటించడం, పోలీసు వివరణ పత్రాలు పొందే హక్కు మొదలగునవి ముఖ్యమైనవి. పోలీసు రంగంలో మాత్రం పలు సంస్కరణలు చేప్పటినప్పటికి ఇంకా సమస్యలు రూపుమాపబడలేదు. లాక్ అఫ్ మరణాలు, హింస, లంచగొండితనం కొనసాగుతున్నాయి. పోలిసులకు పౌరులకు మధ్య ఇంకా సరైన అవగాహన రూపొందలేదు. ఈ రంగంలో ఇంకా పలు సంస్కరణల ఆవశ్యకత వున్నది.

మానవ హక్కుల కమీషన్ ఏర్పాటు మరో ముందడుగు గాచెప్పవచ్చు. దీని ముఖ్య విధి పలు విధాలుగా మానవహక్కులను పెంపొందించడం, పార్లమెంటకు సూచనలివ్వడం, చట్టాలను సమీక్షించడం, మానవ హక్కుల ఉల్లంఘనలను పరిశోధించడం, భాదితులకు తగు సహాయాన్ని అందింపచేయడం మొదలగునవి. భూమి హక్కుల ప్రత్యార్పగా కమీషన్ (Commission on the Restitution land Rights) ఏర్పాటు చేసి దానికి మూడు ముఖ్య విధులను సూచించడం జరిగింది. అవి భూమి ప్రత్యర్పణం, భూముల పంపిణి, భూమి శిస్తు ( టెనెన్సి) క్లెయింలు సమర్పించడం జరిగింది. అయితే మొత్తం దేశంలో 3.4 మిలియన్ సంభావ్య క్లెయింలు వుండవచ్చని అంచనా. కమీషన్ ప్రస్తుతం వీటి పరిశీలనలో నిమగ్నమైవున్నది.

1996 లో పార్లమెంటు జెండర్ కమిషన్ చట్టాన్ని అమోదించి జెండర్ కమీషన్ ఏర్పాటు చేసింది. ఇది

BRAOU

జెండర్ సమానత్వ అంశాలను చూసుకుంటున్నది. నూతన ప్రభుత్వ ఏర్పాటు తర్వాత రాజకీయ చర్చలు, విధాన నిర్ధాయిక అంశాలలో మహిళలు పాల్గొనడం ఎక్కువవుతున్నది. 1994 మొదటి ప్రజాస్వామ్య ఎన్నికలలో 400 మంది సభ్యులు గల జాతీయ శాసనసభలో 101 మహిళలు, 90 సభ్యులు గల సెనేట్‌లో 16 మంది మహిళలు ఎన్నికైనారు. 4 గురు క్యాబినెట్, 8 మంది డిప్యూటి మినిష్టర్లు, జాతీయ శాసనసభ స్పీకర్లు, డిప్యూటి స్పీకర్ మహిళలు కావడం. 60 పార్లమెంటరీ కమీటీలలో 16 మంది మహిళా చేయిర్ పర్సన్‌లు ఇద్దరు రాజ్యాంగ కోర్టు జడ్జీలుగా మహిళలు ప్రాతినిధ్యం వహించడం విశేషం. రాజాకీయ రంగంలో ఇన్ని మార్పులు వచ్చినా వివిధ సామాజిక, ఆర్థిక, జాతుల స్థాయిలలో ఇంకా మహిళల పట్ల హింస కొనసాగుతున్నది. జెండర్ కమీషన్ వీటికి సంబంధించి పలు సంస్కరణలు సూచించింది.

అపార్థాయిడ్ పరిపాలన కాలంలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ఒక అంచానా వేయడానికి నూతన ప్రభుత్వం ..ట్రూత్ అండ్ రికన్సిలియేషన్ కమీషన్.. ను ఏర్పాటు చేయడం మరో ముఖ్య ప్రక్రియగా అభివర్ణించవచ్చును. ఈ కమీషన్‌కు 1 మార్చి 1960 నుండి 6 డిసెంబరు 1993 మధ్య కాలంలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలను పరిశీలించడానికి అధికారాలు ఇచ్చినారు. అయితే ఎవరైతే సంపూర్ణంగా వాస్తవాలను బహిర్గతం చేస్తారో వారికి క్షమాభిక్ష ప్రసాదించే అధికారాన్ని కూడా ఇచ్చారు. అదే విధంగా అపార్థాయిడ్ భాదితులను వెలివేసి వారికి మానవ, పౌర గౌరవాన్ని పొందే విధంగా చేయడం వారి అభిప్రాయాలను తెలుసుకొని వారు ఎటువంటి నష్ట పరిహారాన్ని కోరుకుంటున్నారో ప్రభుత్వానికి సూచనలివ్వడంపై బాధ్యతలు అప్పజెప్పినారు. పలు శ్రమలకోర్చి నొబెల్ శాంతి బహుమతి గ్రహీత డెస్‌మండ్ టూటూ నాయకత్వంలో కమీషన్ తన నివేదికను 2000 సంవత్సరంలో సమర్పించింది.

BRAOU

## 9.8 ముగింపు:

ఇటీవలి కాలం వరకూ కూడా దక్షిణాఫ్రికాలో మానవ హక్కుల చరిత్ర భయంకరంగా వుండింది. అపార్థాయిడ్ ప్రభుత్వపు అమానుష చర్యలు దక్షిణాఫ్రికా సమాజమంతటా స్వైర విహారం చేసినాయి. దక్షిణాఫ్రికా మెజారిటి ప్రజానీకానికి సమాజంలోని ఏ సంస్థలలోను ఎటువంటి స్థానం లేకుండింది. అందువల్ల వారికి రాజ్యాంగం, బిల్ ఆఫ్ రైట్స్ మొదలగు వాటి పట్ల ఎటువంటి అనుభవాలు లేకుండా వుండినాయి. ఇటీవలి కాలంలో 1994 లో మొదటి 1999 లో రెండవ ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా ప్రభుత్వంలో మెజారిటీ ప్రజలు పాలు పంచుకోగలగుతున్నారు. ఇంతవరకు నెల్సన్ మండేలా ప్రభుత్వం, తరువాత అధికారంలోకి వచ్చిన తాజో ఎమ్‌బెకి ప్రభుత్వం మానవహక్కుల రంగంలో సలుపుతున్న కృషి హర్షించదగినది. ఇంకా మానవహక్కుల పట్ల ప్రజాస్వామ్య భావనల పట్ల, రాజ్యాంగం పట్ల సమాజంలో తగు అవగాహన పెంపొందించడానికి శ్రమనొడ్డి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. దీనికి కేవలం ప్రభుత్వ వ్యవస్థ గాక, వార్తా పత్రికలు, ప్రభుత్వేతర సంస్థలు, సమాజంలో ఇతర సంఘాలు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం కూడా వుంది.

## 9.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. వర్ణవివక్షకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా నల్లవారు జరిపిన పోరాటాలు విశ్లేషించండి ?
2. దక్షిణాఫ్రికా నూతన రాజ్యాంగంలో చోటు చేసుకున్న మానవహక్కులను చర్చించండి ?

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.**

1. దక్షిణాఫ్రికాలో వలస వాద ప్రభావం చర్చించండి ?
2. దక్షిణాఫ్రికాలో అపార్థాయిడ్ పాలన మానవహక్కులను ఎలా కాలరాసిందో వివరించండి ?

BRAOU

# భాగం – 10 : లాటిన్ అమెరికాలో మానవహక్కులు

విషయక్రమం :


10.0 ఉద్దేశం

10.1 పరిచయం

10.2 లాటిన్ అమెరికాలో మానవ హక్కుల పరిస్థితి ఒక పరిశీలన

10.3 లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీసిన పరిస్థితులు

- 10.3.1 ఆర్థిక పరిస్థితి
- 10.3.2 ప్రభుత్వాధికారుల చిత్తశుద్ధిలో లోపాలు
- 10.3.3 గెరిల్లా గ్రూపుల ద్రవ్యసంస్థల పాత్ర
- 10.3.4 అంతర్జాతీయ ద్రవ్య సంస్థల పాత్ర

10.4 లాటిన్ అమెరికాలో మానవహక్కుల ఉల్లంఘనను నివారించడానికి చేపట్టిన చర్యలు

- 10.4.1 లాటిన్ అమెరికాలో సామాజిక ఉద్యమాలు
- 10.4.2 అంతర్జాతీయ సమాజం
- 10.4.3 యునైటెడ్ నేషన్స్
- 10.4.4 అమెరికా రాష్ట్రాల సంస్థ
- 10.4.5 యురోపియన్ యూనియన్
- 10.4.6 కెనడా, ఫ్రాన్స్, అమెరికాలు తీసుకున్న చర్యలు
- 10.4.7 మానవ హక్కుల పరిశీలన సంస్థ

10.5 లాటిన్ అమెరికా పట్ల అమెరికా విధానం

10.6 పర్యవేక్షణా హక్కు

10.7 ముగింపు

10.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 10.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీసిన పరిస్థితులను పరిశీలించడం
- లాటిన్ అమెరికాలో మానవహక్కుల ఉల్లంఘనను నిరోధించేందుకు తీసుకున్న చర్యలను చర్చించటం
- లాటిన్ అమెరికా విషయంలో యునైటెడ్ స్టేట్స్ అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించటం

## 10.1 పరిచయం:

ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న అనేక సామాజిక రాజకీయ మార్పులకు లాటిన్ అమెరికా ఒక సజీవ ప్రయోగశాల. సమకాలీన సమాజంలో ఎన్నో మార్పులకు ఇది వేదికగా ఉంది. కరడుగట్టిన సైనిక, నియంతృత్వ పాలన రద్దయి, ప్రజాప్రభుత్వాలు ఏర్పడడం ఇక్కడ ఇటీవల తలెత్తిన పరిణామం. అయితే లాటిన్ అమెరికా దేశాలలోని ప్రజాప్రభుత్వాలు కూడా ప్రజల, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజాహక్కులను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించడంలో విఫలమవుతున్నాయి. పైగా, ప్రజాస్వామ్యం ముసుగులో అణగారిన వర్గాల ప్రజల హక్కులను రోజురోజుకు హరించివేస్తున్నాయి. అందుకే, లాటిన్ అమెరికా దేశాలలో సంభవిస్తున్న ఈ పరిణామాలు, అక్కడ నెలకొన్న పరిస్థితులు పరిశోధకులకు, మానవహక్కుల, సామాజిక కార్యకర్తలకు ఆసక్తికరంగా మారాయి. ఫలితంగా ఈ ప్రాంతంలోని రాజకీయపరిణామాలు ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం తదితర అంశాలు ఎడతెగని చర్చకు గురవుతున్నాయి.

## 10.2 లాటిన్ అమెరికాలో మానవ హక్కుల పరిస్థితి : ఒక పరిశీలన :

BRAOU

లాటిన్ అమెరికా అంటే ఉత్తర అమెరికా, దక్షిణా అమెరికా, వెస్టిండీస్ దీవులలోని భూభాగంలోని స్పానిష్, పోర్చుగీసు, ఫ్రెంచి భాషలు మాట్లాడే ప్రజలు కలగలిసివున్న ప్రాంతం. గతంలో పుర్టోరికో, ఫ్రెంచి, వెస్టిండీస్ దీవులలోని ప్రాంతాలు కూడా దీని కిందకు వచ్చేవి. స్థానిక ప్రజలు వేలాది సంవత్సరాలుగా తమ హక్కులు కోల్పోయి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. చిత్రహింసలు. పోలీసు దాడులు, ఎన్నికల నిర్వహణలో అవకతవకలకు పాల్పడడం, ప్రసార మాధ్యమాలను బెదిరించడం ఇక్కడి అధికార వర్గాల, ప్రభుత్వాల ప్రత్యేకత. ప్రజలు తరతరాలుగా ఈ అన్యాయాన్ని అణచివేతను సహిస్తూనే వస్తున్నారు. పెరూలోని ఆల్‌బర్ట్ ఫ్యూజిమొరో ప్రభుత్వం అక్కడి న్యాయవ్యవస్థను అణచివేతకు పనిముట్టుగా వాడుకుంటూ మానవహక్కులను కాలరాచింది. ప్రజలపై చిత్రహింసను అతిసాధారణమైన విషయంగా మార్చింది. బ్రెజిల్, కొలంబియా, పెరూలాంటి దేశాలు ఇందుకు మినహాయింపేమీ కాదు. హండురస్, నికరగువా ప్రభుత్వాల పనితీరు కొంత మెరుగ్గా వున్నప్పటికీ అక్కడి సైనిక, పోలీసు యంత్రాంగాలూ మాత్రం యధేచ్ఛగా ప్రజల మీద అఘాయిత్యాలు కొనసాగించాయి. వాళ్ళకు ఎలాంటి శిక్షలు పడిన దాఖలాలు కూడా లేవంటే పరిస్తితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు. లాటిన్ అమెరికా దేశాలలోని పోలీసు యంత్రాంగం సమస్య పరిష్కారంలో కాకుండా సమస్యలు సృష్టించడంలో ప్రముఖ పాత్ర వహించాయి. పోలీసు యంత్రాంగం యావత్తు అవినీతి, లంచగొండితనంతో కుళ్లి కంపు కొడుతున్నాయని పరిశీలకులు తేల్చిచెప్పారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించేది. చట్టాన్ని అమలు చేయడం, మానవ హక్కులు పరిరక్షించడం పరస్పరం భిన్నమైన అంశాలని పోలీసులు భావించేవారు.

మానవహక్కుల ఉల్లంఘనలో సైన్యం పాత్ర కూడా తక్కువేమి కాదు. ఉదాహరణకు సైన్యం ఆధ్వర్యంలోని పారామిలటరీ దళాలు, .సామాజిక పరిశుద్ధి. పేరుతో వీధిబాలలపై, స్వలింగ సంపర్కులపై బిచ్చగాళ్ళపైతమ ప్రతాపాన్ని ప్రదర్శించేవారు. ఇలాంటి కార్యక్రమాలు యావత్ లాటిన్ అమెరికాలో నిరాటంకంగా సాగేవి. ఒక

వేళ ఎక్కడైనా వాళ్ళకు అవరోధం ఏర్పడినా సైనిక చట్టం ఎలాంటి శిక్షపడకుండా హామీ ఇచ్చేది.

ఈ ఆఘాయిత్యాలు, అత్యాచారాలు, అంతరంగిక భద్రత పేరుతో అడ్డూ అదుపు లేకుండా సాగేవి. పైగా ఈ అనధికార ప్రభుత్వాలు మానవహక్కుల ఉల్లంఘనను ఒక విధంగా విధానంగా చేపట్టేవి. ప్రజాస్వామ్య సంస్థల ఉనికిని ఏమాత్రం గుర్తించేవికావు. ఉదహరణకు హైతీలోని సైనిక ప్రభుత్వ బహిష్కారానికి గురైన అధ్యక్షుడు అరిస్టైడ్ మద్దతుదారులను తుదముట్టించేందుకు నీచాతినీచమైన చర్యలకు పాల్పడింది. జనరల్ రవూస్ సెడ్రాస్ ప్రభుత్వం తన రాజకీయ ప్రత్యర్థుల్ని తుడిచి పెట్టేందుకు విచ్చలవిడిగా శిక్షలు విధించింది. అదృశ్యం చేయడం, చిత్రహింసలు పెట్టడం, ప్రజల్లో భయభ్రాంతులు సృష్టించడం చేసేది.

ఈ ప్రాంతంలోని న్యాయవ్యవస్థ కూడా మానవహక్కుల పరిరక్షణలో పూర్తిగా విఫలమయ్యింది. మానవహక్కులపై చిన్న చూపు నెలకొన్ని వున్న వాతావరణంలో ఇది పనిచేసేది. అందుకే దాని పనితీరు చాలా పరిమితంగా ఉండేది. పెరూలోని రహస్య కోర్టులు, సైనిక ట్రిబ్యునళ్ళు పౌరులను టెర్రరిస్టు కార్యకలాపాల్లో నిందితులుగా ఇరికించి ఇష్టారాజ్యంగా ప్రవర్తించేవి. గాటిమలలోని న్యాయవ్యవస్థ సైన్యానికి జంకుతూ కార్యకలపాలు నిర్వహించేది. ఇకపోతే, లాటిన్ అమెరికాలో ఎన్నికయిన పౌర అధికారులు కూడా మానవహక్కుల విచారణకు సంబంధించిన తీర్పుల్లో జోక్యం కలిగించుకునే వారు. సైనిక చట్టాలు కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయడంలో విఫలమయ్యాయని అనేక పర్యాయాలు రుజువైంది. ఈ చట్టాలు నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించలేకపోయాయి. పైగా, ఇవి మానవ హక్కుల్ని కాలరాచిన వాళ్ళకు గొడుగుపట్టే విధంగా వుండేవి.

నిందితులు నేరాన్ని ఒప్పుకొనే తతంగంలో న్యాయ వ్యవస్థలోని లోపాలు స్పష్టంగా బయటపడేవి. ఇందుకు మెక్సికో చక్కని ఉదాహరణ. నేరాన్ని ఒప్పించడానికి ఈ దేశ పోలీసులు నిందితులను మానసికంగా, శారీరకంగా క్రూరమైన చిత్రహింసలకు గురిచేసేవారు. న్యాయాధిపతులు నిస్సిగ్గుగా పోలీసులనే సాక్ష్యులుగా పరిగణించి తీర్పులు చెప్పేవారు.

కొన్ని లాటిన్ అమెరికా దేశాల్లో భావప్రకటనా స్వేచ్ఛ కూడా హరించి వేయబడుతోంది. క్యూబా ఈ పనిని చాలా పకడ్బందీగా చేసుకుంటూ వస్తోంది. సైనిక అధికారుల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసారని చిలీ ప్రభుత్వం ఎందరినో అరెస్టు చేసి శిక్షలు విధించింది. ఇక, కొలంబియా ప్రభుత్వం ఏకంగా దేశంలోని నిరసన ప్రదర్శనలకు సంబంధించిన న్యూస్ ప్రోగ్రాముల ప్రసారాల్ని నిషేధించింది. ప్రజల దుర్భర జీవన పరిస్థితులకు ఈ ప్రదర్శనలు అద్దం పడతాయి. కాబట్టి అక్కడి ప్రభుత్వాలు ఈ పనిచేసాయి.

## 10.3 లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీసిన పరిస్థితులు :

లాటిన్ అమెరికాలో తరచు మానవహక్కులకు భంగం కలగడానికి అనేక పరిస్థితులు కారణమయ్యాయి. ఇప్పుడు ఆ ప్రాంతంలో నెలకొన్ని వున్న దయనీయమైన స్థితికి దారితీసిన కారణాలు ఇవి.

BRAOU

### 10.3.1 ఆర్థిక పరిస్థితి

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్ని వున్న ఆర్థిక సంక్షోంభం లాటిన్ అమెరికాలో ఆధిపత్యధోరణులు, పెత్తందారీ విధానాలు తలెత్తడానికి దారితీసాయి. కాకపోతే, వీటికి మరికొన్ని కారణాలుకూడా జతకూడాయి. సామాజిక సంక్షోభము, అస్థిరత్వము, ఆర్థిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అసమర్థత వీటిలో ముఖ్యమైనవి. కాగా, పాలకులకు వున్న పరిమితులు, విదేశీ ప్రయోజనాలు అదనంగా తోడయ్యాయి. కారణాలు ఏమయితేనేం వీటిని అడ్డం పెట్టుకొని పరిస్థితిని చక్కదిద్దే పేరుతో పెరూ, నికరాగువా, హైతీ తదితర దేశాల్లో సైనిక ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయి. స్థూలంగా ఈ ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభం నుంచి ఉద్భవించినవేనని చెప్పవచ్చు. అయితే, మానవహక్కుల పరిరక్షణలో ఈ ప్రభుత్వాలు కూడా పూర్తిగా విఫలమయ్యాయి.

లాటిన్ అమెరికాలో ఈ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాక తొలుత ఆర్థికాభివృద్ధి జరిగినట్టు కనిపించిన తరువాత్తరువాత అది వ్యతిరేక ఫలితాలనే ఇచ్చింది. ఈ ఫలితాలు ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మరింత దిగజార్చాయి. పెరిగిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ పతనం దుర్భర దారిద్ర్యానికి దారితీసాయి. ఇలాంటి పరిస్థితుల్లో లాటిన్ అమెరికా ప్రజల హక్కులు ప్రమాదంలో పడడమే కాదు, వాళ్ళు జీవించే హక్కును కూడా కోల్పోతున్నారు. ఈ పరిస్థితి మరింత ముదిరి ప్రజలు కనీసం మనుషులుగా కూడా పరిగణింపబడని స్థితికి నెట్టేయబడే ప్రమాదం త్వరలో ముంచుకురానుంది. లాటిన్ అమెరికాలో ప్రస్తుతం నెగడులా మండుతున్న సామాజిక కల్లోలాలకు ఈ పరిస్థితులు ఆజ్యంలా తోడవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అంటే, మునుముందు ధిక్కార స్వరాలు, వాటిని అంటిపెట్టుకొని వుండే అణిచివేత చర్యలూ పెరగడం ఖాయమన్న మాట. అదే సమయంలో ప్రభుత్వ సంస్థలు అస్థిరత్వానికి గురై గుణాత్మకమార్పు సాధించగలుగుతాయి.

BRAOU

### 10.3.2 ప్రభుత్వాధికారుల చిత్తశుద్ధిలో లోపాలు

మానవహక్కుల పరిరక్షణలోగాని, హక్కుల ఉల్లంఘనకు అడ్డుకట్టవేయడంలో గాని లాటిన్ అమెరికా దేశాల్లోని ప్రభుత్వాధికారుల్లో ఎలాంటి చిత్తశుద్ధీ కనిపించదు. క్యూబా ప్రభుత్వం అనుసరించిన విధానాలు ఇందుకు చక్కని ఉదాహరణ. ప్రజల స్వేచ్ఛాకాంక్షను నిరసన ధ్వనులను తొక్కిపట్టేందుకు, ప్రజాస్వామిక సంస్థలను లొంగదీసుకునేందుకు అక్కడి ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతుల్ని చేసే విధానాలు అనుసరిస్తోంది. ఎందరో స్వతంత్ర జర్నలిస్టులను క్యూబా ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోంది. డొమినికన్ రిపబ్లిక్ ప్రభుత్వం 1996 లో చట్టంతో సంబంధం లేకుండా మరణ దండనలు విధించింది. అంతేకాదు, ఇక్కడి పోలీసుల అఘాయిత్యాలకు అంతం అంటూ వుండేది కాదు. జైళ్ళ పరిస్థితి కూడా చాలా అధ్వాన్నంగా ఉండేది. హైతిలో మానవహక్కుల ఉల్లంఘనను అడ్డుకోవడానికి లాంఛనంగా చేపట్టిన చర్యలు ఎలాంటి ఫలితాలను ఇవ్వలేదు. ఇక, మెక్సికో, గాటిమల ప్రభుత్వాలు మానవ హక్కుల ఉల్లంఘనలో ఎంత పేరు మోసాయో వేరే చెప్పుకోనవసరం లేదు.

### 10.3.3 గెరిల్లా గ్రూపుల ఆవిర్భావం

లాటిన్ అమెరికా దేశాల్లోని గెరిల్లా గ్రూపులు అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలను తుంగలో తొక్కివేసే

విధంగా ప్రవర్తించాయి. ఈ గ్రూపులు సాధారణ పౌరులను చంపడం, ఇళ్ళు కూల్చివేయడం, ఆస్థులు ధ్వంసం చేయడం లాంటి పనులను యధేచ్ఛగా కొనసాగించేవి. పెరూలోని షైనింగ్‌పాత్ అనే గెరిల్లా గ్రూప్ స్థానిక అధికారులపై తమ ప్రతాపాన్ని ప్రదర్శించింది. అంతేకాదు, తమ రాజకీయ ప్రత్యర్థుల్ని అవమాన పరచడం, చేదించడం, మాట వినకపోతే హతమార్చడం లాంటి చర్యలకు పాల్పడింది. కొలంబియాలో విప్లవ సైనిక శక్తులు ఏకంగా ప్రజలను బందీలుగా పట్టుకొని హతమార్చే సంస్కృతిని అవలంబించాయి. ఇక, గాటిమలలోని గెరిల్లాదళాలు ప్రజలకు నిర్బంద పరిస్థితులు ఏర్పడతాయనే విషయాన్ని పరిగణలోనికి తీసుకోకుండానే సైనిక స్థావరాలపై విచ్చలవిడిగా దాడులు కొసాగించాయి. పైగా, ఈ దళాలు అమర్చిన మందుపాతరలకు అనేకమంది పౌరులు బలి అయిన ఘటనలు కూడా ఉన్నాయి.

## 10.3.4 అంతర్జాతీయ ద్రవ్య సంస్థల పాత్ర

మానవ హక్కులకు భంగం కలగడానికి అంతర్జాతీయ ద్రవ్యసంస్థల రంగప్రవేశం కూడా ఇతోధికంగా తోడ్పడింది. ఆర్థిక సంక్షోభ సమయంలో ముఖ్యంగా విదేశీరుణభారం తలకు మోపెడయ్యి దేశీయ ఆర్థిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నప్పుడు ఈ సంస్థలు ఆపద మొక్కులవాడిగా ఆ దేశాలలో అడుగుపెట్టాయి. సంక్షోభ స్థితి నుంచి గట్టెక్కించే పేరుతో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్) ఈ దేశాలపై అనేక ఆంక్షలు విధించింది. లాటిన్ అమెరికా దేశాలు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ ఆంక్షలకు తలొగ్గి కట్టుబడవలసి వచ్చింది. ఆర్థిక సర్దుబాటు పేరుతో రుణం పుచ్చుకున్న దేశం కోసం ఐ.ఎం.ఎఫ్. కొన్ని ప్యాకేజీలు ప్రకటించింది. వాటిని అమలు పరచాలని నిర్బందించింది. ప్రభుత్వ వ్యయం తగ్గించుకోవాలని, ప్రజా సంక్షేమంపై చేస్తున్నదంతా దుబారా అని తేల్చి చెప్పింది. ప్రభుత్వ రంగ సంస్థలలో పెటుబడిని నిషేధించింది. ఫలితంగా లాటిన్ అమెరికాలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. ఐ.ఎం.ఎఫ్. ఉద్యోగుల జీతభత్యాల్లో కూడా కోత విధించాలని చెప్పింది. కానీ, తగ్గిన జీతాలకు అనుగుణంగా ధరలు, పన్నులు మాత్రం తగ్గలేదు. చివరకు ఈ చర్యలన్నీ పేదరికం మరింత పెరగడానికి దారితీస్తాయి.

అంతేకాదు, ఈ చర్యల వల్ల రుణాల చెల్లింపుల విషయంలో పరిస్థితి మెరుగుపడుతున్నట్టుగా పైకి కనిపించినా సామాజిక, అసమానతలు అధికమవుతూ వచ్చాయి. ఫలితంగా, ఐ.ఎం.ఎఫ్. నుంచి రుణాలు పొందిన దేశాల మీద రోజురోజుకు ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. ఐ.ఎం.ఎఫ్. విధించిన షరతులు అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల సదస్సు ఉద్దేశాలకు వ్యతిరేకమైనవి కావడమే అందుకు ప్రధాన కారణం. ప్రతిపౌరుడు కనీస సౌకర్యాలతో జీవించే పరిస్థితులు కల్పించాలని ఆకాక్షించిన ఈ సదస్సు తీర్మానాలు ఐ.ఎం.ఎఫ్. షరతుల కారణంగా తుంగలో తొక్కివేయబడ్డాయి. పనిచేసే హక్కు, సరైన పని పరిస్థితులు కోరుకునే హక్కు, ఆరోగ్యహక్కు, చదువుకునే హక్కు, సాంఘిక భద్రతా హక్కులాంటి అనేకమైన హక్కులు ప్రమాదంలోకి నెట్టివేయబడ్డాయి.

## 10.4 లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘణ నివారించడానికి చేపట్టిన చర్యలు :

లాటిన్ అమెరికా భూభాగంలో మానవహక్కుల ఉల్లంఘన నానాటికీ అధికమవ్వడం జాతీయ ప్రభుత్వాల

BRAOU

అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షించింది. ఫలితంగా, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మానవహక్కుల పరిరక్షణకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. లాటిన్ అమెరికాలో మానవహక్కులకు తీవ్ర విఘాతం కలుగుతున్నదని రుజువైంది. కనుక జాతీయ ప్రభుత్వాలు వాటిని నివారించడానికి కొన్ని చర్యలు చేపట్టాయి బ్రెజిల్‌లోని ఫెర్నాండో హెన్రీక్యూ ప్రభుత్వం గత పాలకుల అనుసరించిన దుందుడుకు విధానాలను ఉపసంహరించుకోవడమే కాకుండా జాతీయ మానవ హక్కుల ప్రణాళికనొకదానిని రూపొందించింది. ఈ ప్రణాళిక కొన్ని ముఖ్యమైన మార్పులను తెచ్చింది. మానవహక్కులు ఉల్లఘించిన సైని, పోలీసు సిబ్బందిని విచారించే అధికారాన్ని సాధారణ కోర్టులకిచ్చింది. నిందితులను చిత్రహింసలు పెట్టడాన్ని నేరంగా పరిగణిస్తూ కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. అయితే, విషాదకర విషయం ఏమంటే బ్రెజిల్ సెనెట్‌లో ఈ ప్రణాళికకు సంబంధించిన ముసాయిదా తీర్మానం వీగిపోయింది. ఇదిలావుంటే, గాటిమల ప్రభుత్వం మానవహక్కుల పరిరక్షణలో భాగంగా గస్తీ దళాలను ఉపసంహరించుకొంది. ఈ దళాలు పదిహేనేళ్ళుగా ప్రజలను భయభ్రాంతుల్ని చేశాయి. సైన్యం చేసిన నేరాల్ని విచారించేందుకు గాటిమల ప్రభుత్వం సివిల్ కోర్టులకు అధికారాల్ని ఇచ్చింది. బొలివియాలో న్యాయశాఖ మంత్రి రెనెబ్లాటిల్ మాన్ కూడా మానవహక్కుల అతిక్రమణను ఆపడానికి కొన్ని చర్యలు చేపట్టారు. కోకా పండిస్తున్న ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘన మీద ఫిర్యాదులు స్వీకరించడానికి ఆయన ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. అలాగే మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టే విధానాలు, చట్టాలలో సంస్కరణలు చేపట్టారు. మెక్సికో, అధ్యక్షుడు ఎర్నెస్టో జెడిల్లో ఏకంగా తన ప్రసంగాల్లో మానవహక్కుల పరిభాషను ప్రయోగించడం ఆరంభించారు. పెరూ ప్రభుత్వం మానవహక్కుల పరిరక్షణ, పరిశీలన నిమిత్తం స్వతంత్ర అధికారులను నియమించింది.

కాగా, ఈ చర్యలేవి నిర్దిష్ట ప్రయోజనాలు సాధించలేకపోయినా ప్రజల్లో చైతన్యాన్ని మాత్రం తీసుకువచ్చాయి. కొన్ని కేసుల్లో దోషులకు శిక్షపడిన వైనం వాళ్ళలో ఆత్మవిశ్వాసం పెంపొందించింది. అప్పుడు వాళ్ళకు దశాబ్దాలుగా తమ హక్కులు ఎట్లా కాలరాచివేయబడ్డాయో అర్థమయింది. ఫలితంగా, లాటిన్ అమెరికా భూభాగంలో ఎక్కడబడితే అక్కడ సామాజిక ఉద్యమాలు బయలుదేరాయి.

BRAOU

## 10.4.1 లాటిన్ అమెరికాలో సామాజిక ఉద్యమాలు

లాటిన్ అమెరికాలో పెత్తందారీ, సైనిక ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నప్పుడే అనేక సామాజిక ఉద్యమాలు పుట్టుకువచ్చాయి. ఇక్కడి పాలకులు వ్యాపార సంస్కృతి పెంపొందించుకొని ప్రజాసంక్షేమానికి తిలోదకాలిచ్చారు. అయితే, వాళ్ల వ్యాపార సంస్కృతి వల్ల శ్రామికుల మీద అధిపత్యం చెలాయించగలిగారు. ఫలితంగా ఒక వైరుధ్యం తలెత్తింది. పెట్టుబడిదారీ దేశాల్లో వుండే ప్రజాస్వామిక, సంస్కృతికి ఈ పెత్తందారీ పాలనకు లంకె కుదరడం లేదు. అంటే, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రజాస్వామిక వ్యవస్థలకు, ఈ రాజకీయ రూపాలు తీర్చిదిద్దిన సామాజిక, వర్గ ప్రయోజనాలకు మధ్య సారూప్యం కుదరలేదు. ఫలితంగా, అతితక్కువ కాలంలోనే ఈ ప్రాంతంలో నిరసన ఉద్యమాలు తలెత్తాయి. కాగా, ఇవి పౌర సమాజాలను ముక్కలు ముక్కలు చేసాయి. ఈ ఉద్యమాల్లో కూడా పెత్తందారీ విధానాలు పొడసూపేవి. లాటిన్ అమెరికా పాలకులకు సంక్షేమ రాజ్య సంస్కృతి లేకపోవడం వల్ల ఈ ఉద్యమాలు కనీసమైన సామాజిక, అవసరాల కోసం పోరాడవలసి వచ్చింది. ఒకరకంగా ఈ పెత్తందారీ విధానాలే మానవహక్కుల ఆవశ్యకతను గుర్తించేలా చేశాయని చెప్పవచ్చు.

రాజ్యం తన విధానాలను సమర్థవంతంగా అమలు పరచడంలో విఫలమయింది. అందుకే పట్టణ ప్రాంతాల్లో సామాజిక ఉద్యమాలు ఉద్భవించాయి. ఆయా దేశాల్లో తరువాత్తరువాత బలపడిన విస్తృత సామాజిక ఉద్యమాలకు ఇవే పునాదులు వేశాయి. ఈ ఉద్యమాలు దారిద్ర్యం నుంచి పుట్టినవే కాదు, వాటికి ఆయా ప్రభుత్వాలు అనుసరించిన తప్పుడు విధానాలు కూడా తోడయ్యాయి. ఈ విధానాలే ఆ ఉద్యమాల డిమాండ్ల రూపకల్పనకు అవకాశమిచ్చాయి. పట్టణప్రాంత ఉద్యమాల్లో స్త్రీలు పెద్ద ఎత్తున పాలుపంచుకున్నారు. అయితే, ఈ నిరసలను సైనిక పాలకులు ఎప్పటికప్పుడు అణిచి వేయడానికే ప్రయత్నించారు. చిత్రహింసలు పెట్టి, భయకంపితుల్నిచేసి, స్త్రీలను తిరిగి ఇంటికి పనికి పరిమితం చేయాలని గిమ్మిక్కులు చేశారు. స్త్రీలు పెద్దఎత్తున ఉద్యమాలకు కదిలిరావడానికి సమాధానంగా సైన్యం లైంగిక ఆత్యాచారాలను, పసిపిల్లపై హింసను ఆయుధాలుగా ఉపయోగించింది.

## 10.4.2 అంతర్జాతీయ సమాజం

మానవ హక్కుల పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాలు నిజాయితీతో కృషి చేస్తున్నాయి. కాగా, ఈ కృషి చాలా నాటకీయంగా జరుగుతోంది. మానవహక్కులను అతిక్రమించిన వాళ్ళను, వాళ్ళు చేసిన నేరాలను బహిరంగంగా విమర్శించి, వాటికి ప్రచారం కల్పించి, అలాంటి తప్పులు మరొకరు చేయకుండా చూసే వాతావరణం నెలకొల్పాలని ఆదేశాలు ఆశిస్తున్నాయి. నేరగాళ్లకు శిక్షపడాలని, తమకు ఏర్పడిన దుస్థితి ఇతరులకు ఎదురుకాకుడదని బాధితులు కోరుకుంటున్నారు. అంతర్జాతీయ సమాజానికి, ఆయాదేశాలకు బాధితుల పట్ల వున్న దయా, సానుభూతి గతంలో జరిగిన అరచకాలను ప్రపంచం దృష్టికి తీసుకురావడానికి, నేరస్థులకు శిక్షపడేలా చేయడానికి ఉపయోగపడుతోంది. ఈ ప్రయత్నంగా, యునైటెడ్ నేషన్ (యు.ఎన్.) అమెరికా రాష్ట్రాల సంస్థ (ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్) ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లాంటి అంతర్జాతీయ సంస్థలు, అమెరికాలాంటి దేశాలు ముందు వరుసలో వున్నాయి మానవ హక్కుల పరిరక్షణ కోసం ఈ అంతర్జాతీయ సంస్థలు, దేశాలు క్రింద పేర్కొన్న విధంగా కృషి సలుపుతున్నాయి.

BRAOU

## 10.4.3 యునైటెడ్ నేషన్స్ (యు.ఎన్.) ఐక్యరాజ్యసమితి

గాటిమలలో ప్రభుత్వానికి, గెరిల్లాలకు మధ్య శాంతిచర్చలు జరిగేందుకు యునైటెడ్‌నేషన్స్ మధ్యవర్తిత్వం వహించింది. అంతేకాదు, ఈ దేశంలో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతున్న తీరుతెన్నులను జాగ్రత్తగా పరిశీలించింది. మినిగూహ అనే పేరుతో యునైటెడ్ నేషన్స్ ఈ మిషన్‌ను నిర్వహించింది. అదేవిధంగా, ఎల్ సాల్వెడార్‌లో ఓన్‌సూల్ పేరుతో మానవహక్కుల ఉల్లంఘనను పరిశీలించడానికి యునైటెడ్ నేషన్స్ కీలక పాత్ర వహించింది. కాగా, క్యూబా ప్రభుత్వం ఈ సంస్థను ఆదేశంలో అడుగుపెట్టకుండా నిషేదించింది. అయితే యునైటెడ్ నేషన్స్ అనుసంధాన కర్త గ్రోత్ తీసుకున్న చొరవ క్యూబాలో మానవహక్కుల పరిస్థితిని చక్కదిద్దేందుకు ఉపయోగపడింది. హైతిలో మాత్రం ఈ సంస్థ పనితీరు అసంతృప్తికరంగా ఉంది. సైనికబలగాల అఘాయిత్యాల్ని ఎదుర్కొనేందుకు అమెరికన్ స్టేట్స్ ఆర్గనైజేషన్‌తో కలిసి యునైటెడ్ నేషన్స్ చేపట్టిన కార్యక్రమం విఫలమవ్వడమే అందుకు కారణం. సైనికుల ఆగడాలను ఆరికట్టేందుకు ఈ సంస్థలు ఆయా దేశాల్లో ఉద్యోగులను

నియమించాలనుకున్నాయి. అయితే ప్రజాభిప్రాయాన్ని కూడగట్టుకోలేకపోయినందువల్ల ఆ ప్రయత్నాలకు నీళ్ళు వదులుకోవలసివచ్చింది. కానీ యునైటెడ్ నేషన్స్ తన కృషిని మాత్రం ఆపలేదు. హైతిమీద ఆర్థిక ఆంక్షలు విధించి దారిలోకి తెచ్చే ప్రయత్నాలు చేసింది. ఈ ఆంక్షలు తీవ్రతరం చేసేందుకు 1994 జూలై 31 న యునైటెడ్ నేషన్స్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని 940 అని వ్యవహరిస్తారు. మిలటరీ పాలకులకు ఏక్షణాన్నైనా అధికారంలోంచి దించే సత్తాను ఈ తీర్మానం యు.ఎన్.కి ఇస్తుంది. కాగా, యు.ఎన్. ఈ దేశంలో అంతకుపూర్వం చేపట్టిన కొన్ని చర్యలు ఇందుకు సహకరించాయి. మానవహక్కుల పరిరక్షణకు యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ హైతి అనే కార్యక్రమం, సివిపోల్ పేరుతో పౌర పోలీసులను ప్రవేశపెట్టడం ఆ సంస్థకు మంచిపేరు తెచ్చిపెట్టింది.

## 10.4.4 అమెరికా రాష్ట్రాల సంస్థ (ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ – ఎ.ఓ.యస్.)

అమెరికన్ రాష్ట్రాల సంస్థ ఆధ్వర్యంలో రెండు వేరు వేరు స్వతంత్ర సంస్థలు పనిచేస్తాయి. అందులో ఇంటర్ అమెరికన్ కోర్టు ఆఫ్ హ్యూమన్ రైట్స్ మొదటిది. ఈ సంస్థ నిర్వహించే ముఖ్యమైన పని మానవహక్కుల విషయంలో అమెరికా దృక్పథాన్ని చాటిచెప్పడం. ఇక మరో సంస్థ ఇంటర్ అమెరికన్ కమీషన్ అన్ హ్యూమన్ రైట్స్. ఇది పాక్షిక న్యాయ విచారణా సలహా మండలి. అంటే, ఈ సంస్థ పూర్తి చట్టబద్ధత లేకున్న కేసుల్ని విచారించి తీసుకోవలసిన చర్యల గురించి సిఫారుసులు చేసే అధికారం వుంటుంది. ఈ సంస్థ లాటిన్ అమెరికా దేశాల్లో మానవహక్కుల పరిరక్షణకు విశేష కృషి సలిపింది.

మానవహక్కుల ట్రిబ్యునళ్ళు సూచించిన సలహాలకు అనుగుణంగా ఇంటర్ అమెరికన్ కోర్టు తీర్పులు ఇస్తుంది. పెరూలోని ఎల్‌ఫ్రాంటాన్‌లో 1986 లో జైళ్ళలో జరిగిన అల్లర్లలో ఖైదీలను పోలీసులు హింసించిన పద్ధతులను ఈ కోర్టు తప్పుపట్టింది. ఈ తీర్పు 1995 లో వెలువడింది. అదే సంవత్సరం, కొలంబియా ప్రభుత్వం 1989 ఇసిద్రో కాలల్లెలో, మారియాడెల్ కార్మెన్ సాంటిన్‌లను అదృశ్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. మానవహక్కుల ఉల్లంఘనలో ఒక దేశం నిర్వహించిన పాత్రను ఖండిస్తూ తీర్పు చెప్పడం ఇదే మొదటిసారి.

ఇక, ఇంటర్ అమెరికన్ కమీషన్ కూడా తన పాత్రను సమర్థవంతగానే నిర్వహించింది. ఈ కమీషన్ మానవహక్కుల తీరు తెన్నులు పరిశీలించడానికి ఎన్నో కమిటీలు వేసింది. కొలంబియాలోని ట్రుజిల్లో ఊచకోత మీద కూడా కమిటీని వేసింది. 1994 జూలైలో క్యూబా ప్రభుత్వం 13 డి మార్జోటగ్ బోట్‌ను నీళ్ళలో ముంచేయడాన్ని కమీషన్ తీవ్రంగా ఆక్షేపించింది.

## 10.4.5 యూరోపియన్ యూనియన్

యూరోపియన్ యూనియన్ క్యూబాలో మానవ హక్కులను బహిరంగంగానే సమర్థించింది. దేశ బహిష్కరణకు గురై జైళ్ళలో మగ్గుతున్న అనేకమంది రాజకీయ ఖైదీలను బంధవిముక్తుల్ని చేయడానికి ఒత్తిడి తీసుకురావడంలో ఇది విజయవంతంగా పనిచేసింది. క్యూబా ప్రభుత్వ రంగ ప్రాజెక్టుల్లో యూరోపియన్లను పెట్టుబడులు పెట్టేలా చేసింది. తద్వారా, కనీస కార్మిక హక్కులు కూడా నిరాకరించిన క్యూబా ప్రభుత్వానికి ముకుతాడు వేయగలిగింది. ఇక, హైతిలో జైళ్ల పరిస్థితి మెరుగుపడేందుకు, జడ్జి పునశ్చరణకు యూరోపియన్

BRAOU

యూనియన్ విశేష కృషి సల్పింది. 1996 జూలైలో యూరోపియన్ యూనియన్ చిలీ ప్రభుత్వాన్ని ఆర్థిక సాంకేతిక, ఫైనాన్స్ రంగాలలో సహాయ సహకారాలు అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఫలితంగా, యురోపియన్ యూనియన్, సౌత్ కోన్ మార్కెట్ల మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాల్లో పాల్గొనే అవకాశం చిలీకి చిక్కింది. కాగా ప్రజాస్వామిక సూత్రాలను, ప్రాథమిక మానవహక్కులను గౌరవించడమే యూనియన్‌కు చిలీకి మధ్య కుదిర్చిన ఒప్పందంలో ముఖ్యసారాంశం.

### 10.4.6 కెనడా ఫ్రాన్సు, అమెరికాలు తీసుకున్న చర్యలు

1996 లో హైతికి వెళ్లి యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ హైతి ట్రూపులకు, పౌర పోలీసు దళాలకు కెనడా ఎంతో తోడ్పాటును అందజేసింది. హైతి న్యాయవ్యవస్థ పరిపుష్టం కావడాని కి కెనడా అన్నిరకాల సాంకేతిక సహాయాన్ని అందించింది. యూన్‌మిష్ ట్రూపులు పౌర పోలీసు దళాలకు ఫ్రెంచి కూడా తన వంతు సహాయం చేసింది. హక్కుల పరిరక్షణ కోసం అమెరికా కూడా మనస్ఫూర్తిగా సహకరించింది. ఉదహరణకు, మెక్సికో ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల సంస్కరణలకు క్లింటన్ ప్రభుత్వం పూర్తి తోడ్పాటును అందజేసింది. ఈ సంస్కరణల పరిమితుల గురించిగానీ, ప్రయోజనాల గురించిగానీ, బహిరంగ వ్యాఖ్యాలకు, విమర్శలకు దిగలేదు. పైగా, ఈ పనికోసం అమెరికా తన ఆధ్వర్యంలోని రెండు సంస్థలను (నేషనల్ డెమోక్రటిక్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిపబ్లికన్ ఇనిస్టిట్యూట్) పరిశీలకులనిగా పంపింది. ఈ సంస్థలు తొంబైమంది ప్రతినిధులతో మెక్సికో వెళ్ళి ఎన్నిక నిర్వహణను పరిశీలించి నివేదిక తయారు చేశాయి. అయితే, అమెరికా ఈ పని మానవహక్కుల మీద ప్రేమతో చేసిందని బావించనక్కరలేదు. స్వేచ్ఛా వాణిజ్యం కోసం మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని నిరోధించడం కోసం అమెరికా ఇంత తోడ్పాటును అందజేసిన అసలు సిసలైన రహస్యం.

### 10.4.7 మానవహక్కుల పరిశీలనా సంస్థ (హూమాన్ రైట్స్ వాచ్ ఆర్గనైజేషన్)

మానవహక్కుల పరిశీలనా సంస్థ ప్రపంచవ్యాప్తంగా సుమారు డెబ్బయ్ దేశాలలోని మానవహక్కుల అతిక్రమణ జరుగుతున్న తీరును పరిశీలిస్తుంది. ఈ సంస్థ వ్యక్తీకరణ స్వేచ్ఛ, ఆలోచనా స్వేచ్ఛ, సమానత న్యాయ హక్కులనూ, న్యాయ వ్యవస్థ పనితీరునూ పరిశీలిస్తుంది. చిత్రహింస, అదృశ్యం, హత్యల్ని వ్యతిరేకించడం, అక్రమ నిర్బంధం, మానవహక్కుల అతిక్రమణను ఖండించడం తదితర కార్యక్రమాలను చేపడుతుంది. అంతేకాదు, ఈ సంఘటనల్ని రికార్డు చేసి వాస్తవాలను ప్రపంచదృష్టికి తీసుకువెళ్ళేలా కృషి చేస్తుంది. లాటిన్ అమెరికాలో ఈ సంస్థ నిర్వహిస్తున్న పాత్ర చాలా కీలకమైనది. మెక్సికోలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న హింస, పోలీసు చిత్రహింసలు, న్యాయవ్యవస్థ వైఫల్యాలను ఈ సంస్థ గమనిస్తుంది. మెక్సికో ప్రజాస్వామిక న్యాయవాదుల సమాఖ్య (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ లాయర్స్) అంతర్జాతీయ కార్మిక హక్కుల నిధి. (ఇంటర్‌నేషనల్ లేబర్ రైట్స్ ఫండ్) తో కలిసి మానవహక్కుల పరిశీలన సంస్థ దక్షిణ అమెరికా స్వేచ్ఛా వాణిజ్య సమాఖ్య ప్రొవిజన్‌ల క్రింద కార్మిక హక్కుల పిటిషన్ వేసింది. అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్‌లోని జాతీయ పాలన కార్యాలయం ఈ పిటిషన్‌ను పరిశీలనకు స్వీకరించింది. మహిళాహక్కుల విషయంలో కూడా ఈ సంస్థ నివేదికలు రూపొందించిది. మెక్సికోలోని మాక్విలడోరా ప్రాంతంలో లింగవివక్ష అమలవుతున్న తీరు పరిశీలించింది. గర్భ పరీక్షలు జరిపి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్న వైనాన్ని ఈ నివేదికలో పొందుపరిచింది. అంతర్జాతీయ యంత్రాంగాన్ని ఉపయోగించుకొని ఈ సంస్థ బ్రెజిల్‌లో మానవహక్కుల ఉల్లంఘనను ప్రపంచం దృష్టికి తీసుకువచ్చింది.

BRAOU

## 10.5 లాటిన్ అమెరికా పట్ల అమెరికా విధానం :

అమెరికా పాలనాయంత్రాంగం ఈ ఖండంలోని మానవహక్కులను శ్రద్ధతో గమనించి ఎప్పటికప్పుడు స్పందిస్తూనే వున్నది. కానీ, మానవహక్కుల విషయంలో ఆ దేశం ఒక విధానాన్ని రూపొందించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. ఆర్థిక ఒప్పందాలే కార్మిక, మానవహక్కులపై అనుకూల ప్రభావాన్ని చూపి సత్ఫలితాలను ఇస్తాయని అమెరికా నమ్ముతున్నట్లు కనిపిస్తోంది. వాణిజ్యం సంబంధాలు మానవహక్కులపై గౌరవభావం ఏర్పడడానికి మార్గంగా ఉపయోగపడుతాయని అనుకుంటుంది. అందుకే, అది మానవహక్కుల పరిరక్షణకు విడిగా ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం లేదని భావిస్తోంది. కాగా, అమెరికా ప్రభుత్వం భావనలకు భిన్నంగా సెంట్రల్ ఇంటలీజెన్స్ ఏజెన్సీ (సి.ఐ.ఎ.) రక్షణ శాఖల యంత్రాంగం హక్కుల ఉల్లంఘన విషయంలో అంతంతగానే శ్రద్ధ కనబరిచాయి. పైగా, సి.ఐ.ఎ. సహాయంతో అమెరికా ప్రభుత్వం మానవహక్కులు కాలరాచిన హైతిపాలకులతో సత్ సంబంధాలు ఏర్పరచుకోవాలని చేసిన ప్రయత్నాలు నేరస్థులను శిక్షించడానికి అడ్డంకిగా మారింది. మానవహక్కులకు సంబంధించిన డాక్యుమెంట్లను సి.ఐ.ఎ. ప్రత్యేకమైనదిగా పరిగణించి విభజించకపోవడం వల్ల గాటిమల, హండరస్‌లలో విచారణా సక్రమంగా జరగలేదు. స్టేట్ డిపార్టమెంట్ ప్రయత్నించినప్పటకీ సి.ఐ.ఎ. డిఫెన్సు డిపార్టుమెంటులు వాటి విషయంలో సరైన ఆసక్తి కనబరచలేదు.

బొలివియాలో మానవహక్కుల సూత్రాలు మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలలో మరుగున పడిపోయాయి. బొలివియాలోని గ్రామప్రాంతాల్లో మాదక ద్రవ్యాలను నాశనం చేసే ప్రత్యేక దళాలకు అమెరికా నుంచి ఆర్థిక సహాయం, శిక్షణా అందేవి. ఈ దళాలు కోకా పండిస్తున్న ప్రాంతాల్లో భీభత్సాని సృష్టించేవి. స్థానికులను దండించడం, దొంగతనాలకు పాల్పడడం, ఇళ్లు సోదాచేయడం ఈ దళాలకు నిత్యకృత్యంగా మారిపోయాయి. కాగా అమెరికా డ్రగ్ ఎన్‌పోర్సుమెంట్ యంత్రాగానికి ఈ కార్యకలాపాలతో సన్నిహిత సంబంధాలుండేవని ఒక పరిశీలనలో తెలిందిు.

అమెరికా పాలనాయంత్రాంగం క్యూబా నిరంతరం ఆంక్షలు విధింస్తూనే వున్నది. ఈ ఆంక్షలు మానవహక్కుల పరిరక్షణకు ఏవిధంగాను పూచీపడడం లేదు. పైగా వీటివల్ల క్యూబాలో హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారం బయటకు రాకుండ అడ్డంకి ఏర్పడింది. ఆంక్షల వల్ల ఎప్పుడు కూడా పూర్తి ఫలితాలు దక్కలేదు. ఎందుకంటే ఆ ఆంక్షలు మానవహక్కుల పరిరక్షణ చత్రాలోంచి వచ్చిన విలువలు కావు. ఖచ్చితంగా చెప్పాలంటే అవి ఫీడర్ కాస్ట్రో ప్రభుత్వాన్ని కూలదోయడానికి పనిముట్టుగా ఉపయోగించుకోవడానికి ఉద్దేసించబడ్డయేగానీ మరో ప్రయోజనం కోసం కాదు. కాగా మనవ హక్కులు అతిక్రమిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు మద్దతుగా ఒక రహస్య విదానం పనిచేసేదని పై అంశాలు పరిశీలిస్తే తెలుస్తుంది. అయితే గత పాలకుల హయాంలో ఈ విదానాలు ఇంకా తీవ్రతతో వుండేవన్నది వాస్తవం కాగా, ప్రస్తుత పాలకులు ఈ విషయాన్ని అంగీకరించి బాద్యులను శిక్షించే బాధ్యతను నెత్తిమీద వేసుకున్నారు. కానీ ఆచరణలో అనుకున్న ఫలితాలు కనిపించడం లేదు.

ఇదిలావుంటే, అమెరికా విధానాల్లో కొన్ని అనుకూలంశాలు కూడా లేకపోలేదు. ఉదహారణకు 1994 లో అమెరికా ప్రభుత్వాల ఎల్‌సాల్వెడార్‌లో శాంతిస్థాపనకు పూర్తి మద్దతుగా నిలిచింది. గ్రూపో కొంజుంటో

BRAOU

ప్రభుత్వానికి ఆర్థికంగా సహకరించింది. ఈ సహకారం వల్ల సమకూడిన ధనాన్ని లాండ్ బ్యాంకుకు కేటాయించడం ద్వారా ఆ దేశం కొన్ని సున్నితమైన సమస్యలనుంచి బయడపడగలిగింది.

## 10.6 పర్యవేక్షణా హక్కు :

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్ని వున్న, ప్రజాస్వామిక వ్యవస్థలు లాటిన్ అమెరికాలో పౌర సమాజాలు అభివృద్ధి చెందడానికి దోహదం చేశాయి. ఇటీవల కాలంలో సాధారణ మానవహక్కుల సంస్థలు కూడా పౌర సమాజాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇందులో కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, ఇతరచిన్నా చితక సంస్థలు కూడా కలగలసి వున్నాయి. ఈ సంస్థలు, సంఘాలు ప్రజాస్వామిక విలువలను సాధించుకోవడానికి కృషిసల్పుతున్నాయి. కాగా, ప్రసార, ప్రచురణ మాధ్యమాలు అధికారదుర్వినియోగాన్ని వేయికళ్ళతో గమనిస్తుండడంతో పాటు ప్రత్యామ్నాయ ధృక్పధాలకు విశేషమైన ప్రచారం లభించేలాచూస్తున్నాయి. అయితే, ఇప్పటికీ ఈ ప్రాంతంలోని చాలా దేశాల్లో ఇలాంటి కార్యకలాపాలకు అవకాశం లేదు. చాలా దేశాలు మానవ హక్కుల పర్యవేక్షణపై పరిమితులు విధించాయి. ఫలితంగా, మానవ హక్కుల పర్యవేక్షకులు, ప్రతిపక్షనాయకులు, జర్నలిస్టుల, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, వాళ్ళ ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది.

క్యూబాలో మానవ హక్కుల పర్యవేక్షకులు నిషిద్ధ సంస్థల సభ్యులు నిత్యం అక్రమ అరెస్టులకు, భౌతికదాడులకు, బెదిరింపులకు గురవుతూ వుంటారు. మెక్సికో, కొలంబియాల్లో మానవ హక్కుల కార్యకర్తలు అక్రమనిర్బంధం, నిఘా, సోదాలు, ప్రాణహాని లాంటి ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు. గాటిమలలో 1984లో మొట్టమొదటి మానవ హక్కుల సంఘం ఏర్పడిన నాటినుంచి నేటి వరకు ఆసంఘాల సభ్యులు సైన్యం దాని ఏజెంట్ల చేతిలో పీడనకు గురవుతూనే వున్నారు. మ్యూచువల్‌సపోర్టు గ్రూప్ (GAM) అనే మానవ మక్కుల సంస్థ నాయకుడు పరోజ్ వాస్వేజ్ 1994 జూన్ 22న గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సంస్థ గాటిమలలోని అత్యంత పురాతనమైన మానవ హకుల సంస్థ, ఇక, పెరులో ప్రభుత్వం నియమించిన మానవ హక్కుల పర్యవేక్షకులు కూడా వేధింపులకు, బెదిరింపులకు లోనవుతున్నారు. పాస్కోలోని మానవ హక్కుల పరిరక్షక కమిటీ (CODEH-Pasco) సభ్యులు వేధింపులకు గురయ్యారు. ఇక, కొలంబియాలోని మానవ హక్కుల, స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాలకు ఎప్పుడూవిఘాతం ఏర్పడేది.

BRAOU

ఇదిలావుండగా, అనేక ప్రభుత్వాలు మానవ హక్కులు బలపడేందుకు స్వతంత్ర అధికారులను నియమించాయి అయితే, వీళ్ళు, ఇచ్చే సమాచారాన్ని ఆయా ప్రభుత్వాలు మానవ హక్కుల విఘాతకులను శిక్షించడానికి ఉపయోగిస్తున్నారా అన్నది వేరే విషయం హండరస్ ప్రభుత్వం జాతీయ మానవ హక్కుల కమీషన్‌కు రాజ్యాంగహోదా కలిపించింది. దేశంలోని హక్కులపై కొనసాగుతున్న దాడులను విచారించి, వాటిపై రిపోర్టులు తయారుచేసే అధికారం ఆ కమీషన్‌కు ఉంటుంది. ఇక, పెరూ పాలకులు డిఫెన్సర్ డెల్‌పుబ్లో అనే పేరుతో ఒక పదవిని సృష్టించారు. అయితే, దానికి కొన్ని పరిమితులు విధించారు. సైనిక స్థావరాల్లోకి వెళ్ళడానికి విచారణ సమయంలో సైనికాధికారుల నిర్బంధ సహకారం కోరడానికి ఈ కమీషన్‌కు అధికారాలు లేవు. ఇన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ మానవ హక్కుల కమీషన్ల అధికారులు చాలా ధైర్యంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.

ఏది ఏమైనా, లాటిన్ అమెరికాలోని చాలా దేశాల్లో ఏర్పాటయిన పౌరప్రభుత్వాలు సమాజంలోని అణగారిన ప్రజల హక్కులకు మాత్రం హామీ ఇవ్వలేక పోతున్నాయి. ఈ దేశాలు మానవ హక్కుల పరిరక్షణ విషయంలోనే కాదు, స్థిరమైన ఆర్థికాభివృద్ధి కోసం కూడా ఆసక్తికనబరచడంలేదు. పైగా, ఈ ప్రభుత్వాలు నాఫ్టా (NAFTA), మెర్కోసీర్, సాఫ్ట (SAFTA) లాంటి సంస్థలతో భాగస్వాముగా చేరి, దీనినే ఆర్థికాభివృద్ధిగా చూపుతున్నాయి. వాస్తవానికి, ఈ భాగస్వామ్యాల ప్రధాన ఉద్దేశం ఈ ప్రాంతాన్ని స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా మార్చడమే. ఫలితంగా, స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో పోటీ పెరుగుతుందని అక్కడి పాలకులు ఆశపడుతున్నారు.

## 10.7 ముగింపు

లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘన అన్నది కొత్త విషయమేమీకాదు. అది తరతరాలుగా కొనసాగుతూ వస్తున్నదే. పౌర ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత కూడా ఈ పరిస్థితిలో పౌరుల, ముఖ్యంగా అణగారిన ప్రజల హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్రాలు హరించివేయబడుతూనే వున్నాయి. లాటిన్ అమెరికా దేశాల్లోని సైనిక, పోలీసు దళాలు పౌరసమాజం ఆధీనంలోంచి తప్పించుకొని పూర్తిస్వేచ్ఛ అనుభవించగలుగుతున్నాయి. అందుకే, వాళ్ళు ఎన్ని ఘోరకృత్యాలు చేసినా తప్పించుకోగలుగుతున్నారు. ఈ ప్రాంతంలోని న్యాయవ్యవస్థ మానవ హక్కుల పరిరక్షణలో అసమర్థమైనదిగా, చేతగానిదిగా నిరూపించుకుంది. మానవ హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాధికారులు కూడా చిత్తశుద్ధి కనబరచలేకపోతున్నారు. కాగా, లాటిన్ అమెరికా దేశాలలో మానవ హక్కుల పరిస్థితి దిగజారడానికి ఆర్థిక సంక్షోభం ఒక కారణమైతే, కొత్తగా పుట్టుకు వచ్చిన గెరిల్లా దళాలు మరోకారణం వీటన్నింటి ఫలితంగానే, ఈ దేశాల్లో దిగజారుతున్న మానవ హక్కుల పరిస్థితిని మెరుగుపరచేందుకు, హక్కుల ఉల్లంఘనను సరిదిద్దేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు ఆరంభమయ్యాయి..

BRAOU

## 10.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

### I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో సమాధానం రాయండి

1. లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీసిన పరిస్థితులను విమర్శనాత్మకంగా విశ్లేషించండి?
2. లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘనను అడ్డుకునేందుకు తీసుకున్న చర్యలుసజావుగానే వున్నాయా?

### II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి

1. మానవ హక్కుల పరిరక్షణకు అమెరికా అనుసరించిన విధానాన్ని వివరించండి.
2. యునైటెడ్ నేషన్స్

# భాగం - 11 : ఇస్లామిక్ సమాజాలలో మానవ హక్కులు

విషయక్రమం :


11.0 ఉద్దేశం

11.1 పరిచయం

11.2 సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్తాన్‌లలో మానవ హక్కుల స్థితిగతులు

11.3 ముగింపు

11.4 మాదిరి పరీక్ష ప్రశ్నలు


## 11.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- ఇస్లామిక్ సమాజాలలోని మానవ హక్కుల స్థితిగతులు వివరించగలుగుతారు.
- సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్తాన్‌లలో మానవ హక్కులను అవగాహన చేసుకుంటారు
- ఇస్లామిక్ దేశాల ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల పరిరక్షణలో యు ఎన్‌డిహెచ్ ఆర్ పాత్రను తెలుసుకుంటారు.

BRAOU

## 11.1. పరిచయం :

1948, డిసెంబరు 10 నాటి "ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన" ఆధునిక అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంకు పునాదిలాంటిది. మానవ జీవితాలను, స్వేచ్ఛను, గౌరవ ప్రాధాన్యతను కాపాడే శక్తివంతమైన ఆయుధం ఇది. వివిధ మతాలు, జాతులు, విభిన్నతలు చోటు చేసుకున్న సమాజాల్లో ఏ రకమైన వివక్షకు మానవ హక్కుల ప్రకటన తావివ్వదు. మానవ హక్కుల ప్రకటన చేబట్టిన వెంటనే, వివిధ ముస్లిం దేశాల ప్రతినిధులు కూడా దీనిపై తమ దృష్టి నిలిపారు. కొన్ని ముస్లిం దేశాలు మటుకు యు ఎన్‌డి హెచ్ ఆర్ అమలు పై అభ్యంతరాలను లేవదీసాయి. ఇస్లామిక్ చట్టం "పరిషయత్" తో "యు ఎన్‌డి హెచ్ ఆర్" సరితూగలేదని ఆదేశాలు అభిప్రాయపడుతున్నాయి. "షరియత్" దేవుడి శాసనం (God of Law) అయితే, "యు ఎన్‌డి హెచ్ ఆర్" ముసాయిదాను రూపొందించింది సామాన్య మానవులన్నది ఈ దేశాల్లోని ముస్లిం వర్గాలు చేస్తున్న వాదన. "షరియత్" ప్రాధాన్యతను ముస్లిం ప్రజలు మరవకూడదన్న అభిప్రాయం మనకు ఇక్కడ ప్రతి ఫలిస్తోంది. అయితే తమ సమస్యల పరిష్కారానికి "షరియత్" మీద పూర్తిగా ఆధారపడడం వల్ల వాళ్ళకి ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. వాళ్ళ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ఈ విషయాన్ని ఆదేశాలు గ్రహించడం లేదు.

అయితే షరియత్ చట్టం పై "యు ఎన్‌డి హెచ్ ఆర్" పై చర్చలు కొనసాగుతునే ఉన్నాయి. ఈ రెంటికి మధ్య తలెత్తుతున్న ఘర్షణలకు బలమైన హేతువు కొరవడింది. లౌకిక రాజ్యంలో మతం సామాజిక జీవన ప్రవంతిని నిర్దేశించే విషయాన్ని వీరు గుర్తించారు. వ్యక్తుల మత నమ్మకాలపై ఎలాంటి పరిమితులను విధించడాన్ని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టం అనుమతించదు. మతస్వేచ్ఛను అనుభవించడానికి ఎలాంటి అర్హతలతోను పనిలేదు. "యు ఎన్‌డి హెచ్ ఆర్" లోని ఆర్టికల్ 18 ఎంతో ప్రాధాన్యత పొందింది. ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా ఆలోచించే హక్కు ఉంది. మతస్వేచ్ఛ ఉంది. కావాలంటే తన మతాన్ని విశ్వాసాన్ని తిరగ మార్చుకునే సంపూర్ణ అధికారం ప్రతి ఒక్కరికీ ఉంది. ఇలాంటి చర్యలను తనకు తానే తీసుకోవచ్చు. లేదా సమిష్టిగా తీసుకున్న నిర్ణయం కావచ్చు లౌకిక చట్టాలను మనం ప్రస్తావించేటప్పుడు ఏదైనా ఒక ప్రత్యేక మతానికి పెద్దపీట వేసే ప్రసక్తి ఉండదు. ఇలాంటి చోట్ల ఒక మతం గుప్పెట్లో రాజ్యం నడిచే అవకాశం ఉండదు. ఉండకూడదు కూడా. ముస్లింలు అలా కాదు. తాము ఇస్లాం మతస్థులమనే భావన వారిలో ఎల్లవేళలా ఉంటుంది. తాము ఆ మతానికే చెందిన వాళ్ళమనే గాఢ అభిప్రాయం వారి మనస్సుల్లో నాటుకుపోయి ఉంది. మత విశ్వాసం వేరు. చట్టం వేరు. చట్టం అన్ని మతాలకు అతీతంగా వ్యవహరించాలి దీన్ని నమ్మే కొంతమంది ముస్లింలు అంతర్జాతీయ చట్ట విధానాల్లో మతాన్ని సాధ్యమయినంత దూరం బెట్టాలని ధృఢంగా పెట్టుకొని ప్రతి ముస్లిం దేశంలో మానవ హక్కులపై పెద్ద ఎత్తున చర్చలు చోటుచేసుకున్నాయి. "షరియత్" మానవులుగా తమకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు, వ్యక్తిత్వం, జీవితాలకు పూర్తి స్థాయి రక్షణనే అందించలేదనే విషయాన్ని ముస్లింలు తెలుసుకున్నారు. వి.ఇ. మేయర్ మాటల్లో " ఇస్లాం మానవ హక్కుల ఉద్దేశ్యాన్ని అంతర్జాతీయ చట్టంతో పోలిస్తే" వాటి సాంప్రదాయక సంస్కృతిని పశ్చిమ దేశాల పరిధిలోంచి, ఆలోచనల్లోంచి నిర్ధారించలేరు. అయితే దిగుమతి చేసుకున్న చట్ట విధానాల పట్ల ముస్లింల ప్రతి స్పందన ఎలా ఉంటుందన్నది పరిశీలించాలి. జాతీయ న్యాయ విధానంలో వీటిని మార్పిడి చేయడం పై వీళ్ళ ఆలోచనలను గ్రహించాలి. జాతీయ న్యాయ పద్ధతుల్లో చేబట్టిన హక్కులు సర్వస్వతంత్రత ఉన్న సంస్థలవి. తమ చట్టాల్లో ఏవి చేర్చాలనే దాన్ని ముస్లిం దేశాలు స్వేచ్ఛగా ఎంపిక చేసుకొవచ్చు. ఇలా గనుక చూసినట్లయితే. ఈ హక్కులు ఇస్లామిక దేశాలకు బయట నుంచి దిగుమతి అయినవి. ఒక్క మాటలో చెప్పాలంటే సరికొత్తవే. ఇస్లాం సంస్కృతి సనాతనమైందన్న అభిప్రాయం రూఢీ అవుతుంది. ఆధునికత మాటున తలెత్తుతున్న రాజకీయ మార్పులను, సరికొత్త భావాలను వీటిని ఒక క్రమపద్ధతిలో అమలులోకి తెచ్చే సంస్థలను ఇస్లాం వ్యతిరేకిస్తుందనేది స్పష్టమవుతుంది అన్నారు. ఈ అభిప్రాయాన్ని కొంతమంది సంప్రదాయవాదులు, వర్గాలవాళ్ళు వ్యక్తం చేస్తున్నారు.

యు ఎన్‌డి హెచ్ ఆర్ పట్ల ముస్లిం దేశాల్లోని చాలామంది సానుకూలంగా స్పందించడానికి గల కారణాలను లోతుకంటా చర్చించాల్సి ఉంది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియాల్లో మానవ హక్కుల పరిస్థితిని పరిశీలద్దాం.

## 11.2 సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్థాన్‌లలో మానవ హక్కుల స్థితిగతులు :

సాంప్రదాయక ఇస్లామిక్ రాజకీయ వ్యవస్థలో చోటుచేసుకున్న అనైక్య పోకడలు, ఐరోపా వలస పాలన పట్ల ఉద్రిక్త మవుతున్న పోరాటం అక్కడి విద్యా, న్యాయ, పాలనా యంత్రాంగాలలో సరికొత్త మార్పులకు బాట వేసింది. పశ్చిమ దేశాల జీవన శైలి, లౌకిక తత్వపోకడలు ముస్లిం దేశాల్లో మెల్ల మెల్లగా వ్యాప్తి చెందసాగాయి. మారిన కాలానికి అనుగుణంగా, సౌదీ అరేబియా పాశ్చాత్య విధానాలను అనుసరించడం ఆరంభించింది. ఇస్లామిక్



BRAOU

చట్టం స్థానంలో పశ్చిమ దేశాల న్యాయ నిబంధనలు చోటు చేసుకో సాగాయి. నియంతృత్వ పాలకుల కింద ఉన్న అరబ్బులు తమ న్యాయవ్యవస్థలో చాలా లోటు పాట్లు ఉన్నాయని గ్రహించారు. ప్రజల ప్రాథమిక హక్కులకు స్వేచ్ఛకు గౌరవం అన్నది లేనే లేదనే అభిప్రాయం వారిలో కల్గింది. సౌదీసమాజంలో మహిళల పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. ఎందుకంటే అల్లా మాటున పాలకులు ఎంతటి చర్యలనైనా చట్ట బద్ధంగా చేపట్టవచ్చు. అప్పుడు ప్రజల ఇష్టా ఇష్టాలను కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. రాజు పట్ల ప్రజలు అణుకువగా మసలు కోవాలనేది రాజ శాసనంగా చలామణి అవుతుంది. కైరో ప్రకటనను పరిశీలిద్దాం సృష్టికర్త వేరు మానవుని విధులు, బాధ్యతలు, వత్తిడులు, సంకుచితత్వం సృష్టికర్తలో సరిపోని లక్షణాలు సెక్షన్ (ఎ) లోని ఆర్టికల్- 1 "అందరు మానవులు దేవుడి ముందు సమానులే అలాగే అందరికీ సమానమైన మౌలిక హక్కులు గౌరవం, బాధ్యతలు ఉంటాయని" పేర్కొంది. సెక్షన్ బిలో "సర్వ మానవులూ దేవుని బిడ్డలే" అని తెలిపింది. ఆర్టికల్ Iలో ఇస్లాం ప్రభుత్వంగా పేర్కొంది. ఆర్టికల్ - 5 సౌదీలో రాజరిక కుటుంబం గూర్చి వివరించింది. సౌదీ రాజరికానికి మత పరమైన తీరులో తలవొగ్గి విధిగా మసలాలని ఆర్టికల్ - 6 వివరిస్తుంది. రాజుకు అనుకువగా ఉండాలి. పవిత్ర ఖురాన్, ప్రాఫిట్ ఆఫ్‌సున్నాల కనుగుణంగా, వాటికి కట్టుబడి ఉన్నట్టు రాజకుటుంబానికి కూడా ఒదిగి ఉండాలి. రాజకుటుంబం ముందు అణిగి మణిగి ఉండడం అంటే, దేవుడికి కట్టుబడి ఉన్నట్లే. మత చట్టాలను ఆశ్రయించిన వారి జీవితాలకు రక్షణ, స్వేచ్ఛా, గౌరవం ఉంటుంది. అప్పుడు అధికారంలో చట్టబద్ధ స్థానం వీళ్ళు పొందగలుగుతారు. మహిళల, ముస్లిమేతరులకు, షియా మైనారిటీలకు ఎలాంటి హక్కులు సౌదీ చట్టంలో లేవు. చట్టంలోని 3 4 వ ప్రకరణ ప్రకారం ప్రతి పౌరుడు ఇస్లాం రక్షణకు బద్ధుడై ఉండాలి.

అయితే సౌదీలో అనూహ్యమైన మార్పులు వేగంగా చోటుచేసుకోవడం ప్రారంభించాయి. దాంతో ఎన్ని రోజులు మధ్యయుగాల నిరంకుశ పాలనకు బలికావాలనే వ్యతిరేకత ప్రజల్లో బాగా నాటుకుంది. యు ఎన్‌డి హెచ్ ఆర్ ప్రకటన మతాలకు అతీతంగా వ్యక్తుల స్వేచ్ఛ, స్వాతంత్ర్య, గౌరవాలను, జీవితాన్ని పరిరక్షించాలని ప్రతిపాదించడం అక్కడి ప్రజల ఆలోచనలను అనూహ్యమైన మలుపు తిప్పింది. సౌదీ అరేబియాలో కాకుండా, ఇతర ఇస్లామిక్ దేశాల్లో కూడా సార్వభౌమాధికారం వల్ల తమకు ఒరిగేదేమీ లేదని అంతేకాదు దేశానికి లేదా పార్లమెంట్‌కు పూర్తి అధికారాలు కట్టబెట్టినా తమకు ఎలాంటి ప్రయోజనాలు లేవనే ఉద్దేశం బాగా అధికమైంది. ఇస్లాం విశ్వాసం ప్రకారం, పూర్తి సార్వభౌమాధికారం, సంపూర్ణ ఆధిపత్యం దేవుని చేతుల్లో తప్పించి మరెవ్వరి చేతుల్లోను ఉండదు. ఇస్లాం రాజ్యంలో ఇస్లాం చట్టందే పై చేయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకలో తేవాలన్నది వీటి ఆలోచన.

ఇస్లాం రాజ్యాంగంలో రెండు ప్రధాన అంగాలున్నాయి. ఒకటి కార్యనిర్వాహక వర్గం. రెండవది న్యాయవ్యవస్థ మూడవ అంగమైన శాసన సభకు ప్రాధాన్యత లేదు. ఖురాన్ ప్రకారం శాసనాలకు రూపకర్త దేవుడే వాటిని అమలుచేసే అధికారం సుల్తాన్‌కే ఉంది. ఆయనిచ్చిన ఆదేశాల ద్వారానే అవి సుసాధ్యం అవుతాయి. ఇలాంటి సార్వభౌమధికారం ప్రజల ప్రాథమికమైన మానవ హక్కులకు గండి కొడుతుంది. మానవ హక్కులకు సంబంధించి ఆధునిక కాలానికి చెందని షరియత్‌లో సరైన స్పష్టమైన మార్గ దర్శక సూత్రాలు లేవన్న విషయాన్ని సాధారణ ప్రజలు గ్రహించారు. స్పష్టమైన సిద్ధాంతం కూడా సమకాలీన ఇస్లాంలో మనకు కనిపించదు. ఇరాన్ షరియత్‌కు చాలా ప్రాధాన్యం ఇస్తుంది. భూమిమీద ఇస్లామిక్ చట్టం మాత్రమే ఉందని వీరి గాఢ నమ్మకం. వీరి రాజ్యాంగంలో అర్థం లేని అనుమానాస్పదమైన విభాగాలను చాలా వాటిని చేర్చారు. ప్రజల హక్కులపై ప్రభుత్వం దాడి చేయడం ఆరంభించింది. ఇరాక్ తిరుగుబాటు తర్వాత కూడా అక్కడ తీవ్ర స్థాయిలో మానవ హక్కుల



BRAOU

ఉల్లంఘన చోటు చేసుకుంది. ఇక్కడ ఇరాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ – 4 ను ప్రస్తావించాలి. మానవ హక్కులను రక్షించడంలో ఇస్లామిక్ షరియత్ స్థానాన్ని ఇది తెలుపుతుంది. అంతేకాదు న్యాయ, ఆర్థిక, విధులు పరిపాలనా, సంస్కృతి, సైనిక, రాజకీయ చట్టాలు, నిబంధనలు గురించి కూడా ఇందులో ఉన్నాయి. కౌన్సిల్ ఆఫ్ గార్డియన్స్ లోని మత (క్లరికల్) సభ్యుడు తీర్పును వెల్లడిస్తాతడు ఫలితంగా ఇరాన్ ప్రజలకు రాజ్యాంగం కల్పించే రక్షణ అమలు పట్ల ఇరాన్ ప్రభుత్వం వ్యతిరేకతను సూచిస్తోంది. స్వేచ్ఛా పూరిత ఎన్నికలను ఇరాన్ మత పాలకులు పూర్తిగా తిరస్కరించారు. ఎన్నికలకు అవకాశం ఇస్తే మత పాలకులను ప్రజలు లక్ష్యపెట్టరనే భయం దీనికి కారణం. అయితే రాజ్యాంగ బద్ధమైన రక్షణ లేకపోవడం పై ప్రజలు బహిరంగ వ్యతిరేకతను వెల్లడిస్తున్నారు. దీంతో రాజ్యం ప్రజలపై అణచివేత చర్యలను చేపట్టింది. మానవ హక్కుల పై కూడా తీవ్ర దాడి చేయసాగింది. ఈ విధంగా ఇరాన్ ప్రభుత్వం అంతర్జాతీయ మానవ హక్కుల నియమనిబంధనల అతిక్రమణకు పాల్పడింది. అక్కడ ప్రజల మానవ హక్కులకు జరుగుతున్న అన్యాయాలపై ప్రతిఘటిస్తు, హక్కుల అమలుకు ఐక్యరాజ్య సమితి, అనేక పరిశీలక బృందాలు నడుం కట్టాయి. మహిళలు బయటకు రాకుండా ఇరాన్ పాలకులు కట్టడి చేస్తున్నారు. ఇంటా, బయటా కూడా మహిళలకు చట్టం ఎలాంటి రక్షణ, న్యాయం కల్పించడం లేదు. మహిళలను చదువుకోనీకుండా రకరకాల పద్ధతుల ద్వారా అడ్డుకట్టవేస్తున్నారు. ప్రతిష్టాకరమైన ఉద్యోగాలకు మహిళలను దూరంగా పెట్టారు. ఇక రాజకీయాల్లో గాని, ప్రభుత్వంలోగానీ మహిళలకు స్థానం లేనే లేదు. కోర్టుల్లో అటార్నీలుగా వ్యవహరించే అవకాశం స్త్రీలకు కరువైంది. మానవ హక్కుల అంతర్జాతీయ ఛార్టర్ వల్ల ఇరాక్ ప్రజలు చాలా మంది సద్భావన కలిగి ఉన్నారు. ఆధునిక కాలంలోని చాలా సమస్యలకు పరిష్కారాన్ని సూచించగల విస్తృతి మానవ హక్కుల ప్రకటనకుందని భావిస్తున్నారు. ప్రజల స్వేచ్ఛ రక్షణలకు యు ఎన్‌డి హెచ్ ఆర్‌ని ప్రధాన భూమికగా చేసుకోవాలని ఇరాన్ ప్రజలు భావించారు. ఇరాన్ రాజ్యం అనుసరిస్తున్న ఇస్లామిక్ ప్రకటనలో స్పష్టత లేదు. మత స్వేచ్ఛ విషయంలో నిర్దిష్ట ఉద్దేశం లేదు. మతస్వేచ్ఛ విషయంలో కప్పదాటు వ్యవహారశైలి కనబడుతుంది. మతమార్పిడిని ఇస్లాం అంగీకరించదు. మత స్వేచ్ఛ విషయంలో ఇస్లాం వర్గాల నుంచి మద్దతు సంపాదించ అసాధ్యం.

BRAOU

ఇస్లామిక్ మానవ హక్కుల ప్రకటన సమస్యల నిర్మూలనలో వైఫల్యం చెందింది. ఆధునిక కాలం ముందరి పరిస్థితులను సరళీకృతం చేయటంలో వెనుకంజ వేసింది. సానుభూతి కరవైంది అన్న భావాలు ప్రజల్లో ఆరంభమయ్యాయి. మానవ హక్కుల ఉల్లంఘన గురించి ఆయితుల్లా తెలెఘని మాట్లాడుతూ మతం పేరిట ప్రజలపై చట్టాల్ని రుద్దడం చాలా ప్రమాదకరమైన అణచివేత విధానం. సన్యాసులు రాజ్యపాలకులతో చేతులు కలిపి మతం పేరిట ప్రజలను ఎన్ని రకాల ఇబ్బందులు పెట్టాలో, కష్టాల పాలు చేయాలో అంతా చేశారు. వ్యతిరేకించే హక్కును, విమర్శించే చొరవను, స్వేచ్ఛగా మసలే అవకాశాన్ని లేకుండా ప్రజలకు లేకుండా చేశారు. ఇస్లాం శాంతికి, స్వేచ్ఛకు ఆహ్వానం పలుకుతుంది అందరూ అవకాశ వాదాన్ని పక్కన బెట్టాలి. వ్యక్తిగత ప్రయోజనాలపై దృష్టి కేంద్రీ కరించకూడదు. రాజ్యం అభిప్రాయాలకు, ఉద్దేశాలను దైవం పై రాజ్యాని కున్న నమ్మకాలను ప్రజలపై రుద్దకూడదు. మతం ముసుగులో చలాయిస్తున్న నియంతృత్వ పోకడలను స్వస్తి చెప్పాలి. శ్రామిక వర్గాల పై కొనసాగిస్తున్న అణచివేతను నిరసించడానికి అందరూ గొంతు కలపాలి ఖురాన్, మత ప్రవక్త సంప్రదాయాల నుంచీ ఇస్లాం పుట్టింది. అలాంటి ఇస్లాం విమర్శ హక్కును, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛను, చర్చలను అడ్డగించదు. ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కల్పిస్తుంది.

పాక్‌లో మానవ హక్కుల అతిక్రమణను గమనిస్తే, ఇస్లామిక్ దేశాలకు, ఇక్కడ పరిస్థితులకు పెద్ద తేడా కనబడదు. ఇంకా చెప్పాలంటే పాకిస్థాన్‌లో మానవ హక్కుల పరిస్థితులు మరీ ఘోరంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లో

తరచూ మతతత్వం పడగ విప్పడంతోను, పాలకులు, ప్రభుత్వాలు మారుతుండడంతో నిబంధనల అమలు సవ్యంగా లేదు. అరాచక పరిస్థితులు అక్కడ నెలకొని ఉన్నాయి. పాకిస్థాన్‌లోని విధాన సభ తన లక్ష్యం నెరవేర్చనే లేదు. రాజ్యాంగ మండలి ముసాయిదాను స్వీకరించిన పది రోజుల్లోనే గవర్నర్ జనరల్ కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీని అప్రజాస్వామిక విధానంలో రద్దు చేశారు. ఎంతో నియంతృత్వంగా ఈ చర్యకు పాల్పడ్డారు. దీంతో రాజ్యాంగ సంక్షోభాన్ని పాక్ ప్రజలు ఎదుర్కోవలసి వచ్చింది.

1958లో పాకిస్థాన్ అధ్యక్షుడు మిర్జా, జనరల్ మహమ్మద్ ఆయుబ్‌ఖాన్ 1956 రాజ్యాంగాన్ని కొట్టివేస్తు, దేశంలో సైనిక పాలన విధించారు. దీంతో పాక్ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను, ఇతర హక్కులు మరింత దిగజారాయి. జాతీయ, ప్రాంతీయ అసెంబ్లీలను రద్దు చేశారు. ప్రజల ప్రాథమిక హక్కుల్ని నిషేదించింది. ఇవే పరిస్థితులు 1962 దాకా కొనసాగాయి. జడ్. ఎ. భుట్టో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని 1973లో చేబట్టినా, కార్య నిర్వాహక, శాసన అధికారాలను ఆయన తన గుప్పెట్లోనే పెట్టుకున్నారు. ఆయన పాలనా కాలంలో కూడా మానవ హక్కుల ఉల్లంఘన తీవ్ర స్థాయిలో చోటు చేసుకొన్నాయి. చివరకు శాంతి భద్రతల పరిస్థితులు చేయిదాటి పోయాయి. ఇది మళ్ళీ దీర్ఘకాలం పాటు పాక్ సైనిక పాలనలో మగ్గే పరిస్థితులకు దారితీసింది. జియా ఉల్ హక్ 1977 జూలై నుంచి 1985 దాకా సైనిక పాలనకు నాయకత్వం వహించాడు.

1965లో ఇండో-పాక్ యుద్ధం జరిగింది. అప్పుడు పాక్ ప్రజలు ఎమర్జెన్సీని అనుభవించారు. వారి ప్రాథమిక హక్కులు గాలికి కొట్టుకు పోయాయి. రెండు దశాబ్దాల కాలం పాటు వారు తమకు పాక్ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులనే మరచిపోయారు. ఎన్నికైన ప్రభుత్వాలు అక్కడ ఉన్నా, తమకు తాము ప్రజాస్వామిక ప్రభుత్వాలుగా అవి ప్రకటించుకున్నా, ఎమర్జెన్సీ పాలనతోనే దేశ ప్రజలు మగ్గవలసి వచ్చింది. ప్రధానంగా పాక్ రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ ప్రభుత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఇస్లామిక్ దేశాల్లో కొందరు ఇలాంటి వ్యవస్థ తగినదని భావిస్తున్నారు. అయితే షరియత్ ప్రకారం, ఇస్లామిక్ దేశంలోని న్యాయవ్యవస్థ సర్వస్వతంత్రంగా పని చేయాలి.

దీనికి సంబంధించిన అంశాలను ప్రత్యేక ప్రకరణాలలో పేర్కొన్నారు కూడా. అయితే అవన్నీ కాగితాల మీదే తప్పించి వాస్తవంలో ఏనాడు అది సదయంగా వ్యవహరించిన జాడలేదు. మతతత్వం ఆధిపత్యం కింద న్యాయవ్యవస్థ రూపురేఖలు, నిబంధనలు కుంగి కృశించి పోతున్నాయి. ప్రజాస్వామ్యం ఇస్లామీకరణ పొందిందని చెప్పవచ్చు జియా ప్రభుత్వం పై తన పట్టు కోల్పోకుండా ఉండడం కోసం రాజ్యాంగంలోని 50 ప్రకరణల్లో పలు సవరణలకు పాల్పడ్డారు.

సైనిక దాడి తర్వాత జియా పాక్ అధ్యక్షుడయ్యారు. అధికారికంగా ఇస్లామ్ ప్రభావాన్ని తన చివరి క్షణాల దాకా ఆయన కొనసాగించారు. ఇస్లాం మతం కింద హక్కులను ఇవ్వ నిరాకరించనట్టయితే, దేశ విదేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘన చేస్తున్నదంటూ తీవ్ర విమర్శలకు గురవుతామన్న భయం పాక్ పాలకులకు ఉంది. కొన్నిసార్లు స్థానికంగా ప్రజల నుంచి ఆరోపణలకు గురయ్యే అవకాశం కూడా ఉందని, అప్పుడు మరీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని పాక్ పాలకులకు తెలుసు. అందువల్ల ఎంతో వ్యూహాత్మకంగా పక్కదారులు పట్టడం ప్రారంభించారు. రాజ్యాంగపరంగా సవాళ్ళను కొని తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయలేదు. అందులో భాగంగానే ఇస్లామీకరణ దిశగా చేబడుతున్న చర్యలను తక్కువ చేయబడకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఇంటా, బయటా మహిళల స్థానాన్ని ఇస్లాం పేరుతో అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్త్రీల విద్యావకాశాలను రకరకాలుగా

BRAOU

నియంత్రిస్తున్నారు. ఉన్నత పదవుల్లో మహిళలు కనిపించరు. ఇక్కడ రాజకీయాల్లో, ప్రభుత్వ నిర్వాహణలో వారిని పూర్తిగా పక్కన బెట్టిస్తారు. ఇరాన్‌లో మల్లే ఇక్కడ మహిళలు అటార్నీలుగా, న్యాయమూర్తులుగా వ్యవహరించే సావకాశాలే లేవు. న్యాయవ్యవస్థలో వారి సొంత గొంతుక వినబడే అవకాశమే లేదు, ఒక్క మాటలో చెప్పాలంటే న్యాయపరంగా మహిళల గొంతు నులిమేసారు. వారెప్పుడూ ఇంటా, బయటా, అన్ని రంగాల్లో కింద స్థాయిలోనే తమ బతుకులను ఈడ్చాలి కాలికింద చెప్పులా పడి ఉండాలి.

## 11.3 : ముగింపు :

పాకిస్థాన్, ఇరన్, సౌదీ అరేబియాల్లో ఇస్లాం మతం కన్నా పరిమితులను అడ్డుపెట్టుకుని రాజ్యాంగ అతిక్రమణలో అక్కడి ప్రభుత్వాలు సమర్థించు కుంటున్నాయి. ఇలాంటి అతిక్రమణల మూలంగా పాక్ లాంటి దేశాల్లో మరింత అరాచక పరిస్థితులు తలెత్తుతాయి. పాక్‌లో ఎంతో మంది కార్మికులు బానిసత్వంతో మగ్గుతున్నారు. షరీయత్ చట్టం అమలవుతున్న, ముస్లిం యజమానులు పెద్దలు, పిల్లల శ్రమను దారుణంగా దోచుకుంటున్నారు. ఉద్యోగంలో తమ డిమాండ్లను తెలిపే వాతావరణమే లేదు. వీరి స్వేచ్ఛ అణచి వేతకు గురవుతుంది. కనీసం మానవులుగా నిలదొక్కకునేందుకు కావల్సిన హక్కులు కూడా అక్కడి ప్రజలకు అపురూపం అయిపోయాయి. యు ఎన్ డి హెచ్ ఆర్ పై ఉన్న అపూర్వ విశ్వాసం, నమ్మకం మానవ హక్కుల కార్యకర్తలను మరింత ముందుకు నడిపిస్తోంది. మనవ హక్కుల అమలు పరంగా ప్రభుత్వాల పై వీరు వత్తిడి తీసుకు వస్తున్నారు. ప్రజల స్వేచ్ఛకు, జీవితాలకు రక్షణ కల్పించే మానవ హక్కుల అమలుకు అన్ని చట్టాలను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని మానవ హక్కుల కార్యకర్తలు న్యాయబద్ధంగా పోరాడుతున్నారు.

BRAOU

## 11.4 మాదిరి పరీక్ష ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధనం రాయండి**

1. ఇస్లామ్ సమాజంలో మానవ హక్కుల పరిస్థితి ఎలా ఉంది?
2. ఇస్లామిక్ చట్టం "షరియత్" లేదా యు ఎన్‌డి హెచ్ ఆర్ లపై ఆధారపడడం వల్ల ఆధునిక సమాజంలో చోటు చేసుకుటున్న మానవ హక్కుల ఉల్లంఘనకు అడ్డుకట్ట వేయగలమని మీరు అనుకుంటున్నారా? వివరించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి**

1. సౌదీ అరేబియా, పాక్, ఇరాన్ ఇస్లామిక్ దేశాల్లో ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, జీవితాన్ని పరిరక్షించడంలో యు ఎన్‌డి హెచ్ ఆర్ పాత్ర ఎంత?

# ఖండం – V

# హక్కుల పరిరక్షణ క్రమం

మానవ హక్కుల స్థితిగతులను పరిశీలించటం, మానవ హక్కుల సాధన ఒక దశ అయితే మానవ హక్కుల పరిరక్షణ క్రమం మరో దశ. హక్కులను పొందటంతోనే సరిపోదు. అవి ఉద్దేశించినవారికి అందుబాటులో స్వేచ్ఛగా వుండే పరిస్థితులు ఏవిధంగా వున్నయని పరిశీలించాలి. ఆ హక్కుల పరిరక్షణకోసం వస్తున్న ఉద్యమాలను వాటి స్వభావాన్ని ఈ ఖండా అధ్యమనం చేస్తుంది. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. అవి :

- భాగం : 12 మానవ హక్కుల ఉద్యమాలు
- భాగం : 13 మానవ హక్కుల కమిషన్లు
- భాగం : 14 మానవ హక్కులు – అంతర్జాతీయ చట్టం

BRAOU

BRAOU

# భాగం – 12 : మానవ హక్కుల ఉద్యమాలు

విషయక్రమం :

12.0 ఉద్దేశం
12.1 పరిచయం
12.2 మానవ హక్కుల ఉద్యమాలు - స్వభావం
12.3 అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమాలు
12.3.1 అమ్నెస్టీ ఇంటర్నేనల్
12.3.2 హ్యూమన్ రైట్స్‌వాచ్
12.3.3 ఆండియన్ కమీషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్
12.3.4 లీలియో బాసో ఇంటర్నేషనల్ లీగ్
12.3.5 ఇంటర్నేషనల్ లీగ్
12.3.6 ఇంటర్నేషనల్ కమీషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్
12.3.7 ఇంటర్ పార్లమెంటరీ యూనియన్
12.4 ఆదివాసీ తెగల హక్కుల ఉద్యమం - సర్వైవల్ ఇంటర్నేషనల్
12.5 యుద్ధ వ్యతిరేక - యుద్ధఖైదీల హక్కుల ఉద్యమాలు
12.5.1 ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్
12.5.2 అణుయుద్ధ వ్యతిరేక వైద్యుల ఉద్యమం
12.5.3 డాక్టర్స్ శాన్స్ ఫ్రాంటియర్స్
12.6 వర్ణ విచక్షణ- జాతివిచక్షణ వ్యతిరేక ఉద్యమాలు
12.6.1 యాంటి స్లేవరీ సొసైటీ
12.6.2 ఇంటర్నేషనల్ లీగ్ ఎగైనెస్ట్ రేసిజం
12.6.3 ఎఫార్డ్
12.7 అంతర్జాతీయ మహిళా ఉద్యమాలు
12.8 మతస్వేచ్ఛ ఉద్యమాలు
12.9 మేధోపర స్వేచ్ఛ ఉద్యమాలు
12.10 ముగింపు
12.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 12.0 ఉద్దేశం:

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమాలు వివరించగలుగుతారు.
- యుద్ధ వ్యతిరేక - యుద్ధ ఖైదీల హక్కుల ఉద్యమాలు తెలుసుకుంటారు.
- వర్ణ విచక్షణ - జాతి విచక్షణ వ్యతిరేక ఉద్యమాలు అర్థం చేసుకుంటారు.

## 12.1 పరిచయం :

మానవ హక్కుల ప్రాముఖ్యం, అవగాహన 20వ శతాబ్దంలో బాగా విస్తరించింది. నిజానికి మానవ హక్కుల ఉల్లంఘన కూడా ఇదే శతాబ్దంలో తీవ్ర స్థాయిలో జరిగింది. రెండు ప్రపంచ యుద్ధాలు, అణుబాంబు ప్రయోగాలు, అధికారయుత రాజకీయ సిద్ధాంతాలు (నాజీయిజం, ఫాసిజం) ఫలితంగా జరిగిన మారణకాండలు, వలసవాద విముక్తి పోరాటాల అణచివేత, స్వాతంత్ర్యానంతరం ఎన్నో దేశాల్లో మతాధిపతులు, సైనికాధికారులు బలప్రయోగంతో అధికారాలు చేజిక్కించు కోవడం ఫలితంగా ఏర్పడిన మారణ హోమాలు - ఇవన్నీ 20వ శతాబ్ది చరిత్రలో చీకటి చరిత్రలో చీకటి అధ్యాయాలు. అణచివేతకు నిరసనగా మానవ హక్కుల పరిరక్షణ కోసం వచ్చిన ఉద్యమాలు కూడా ఇదే శతాబ్దిలో ఎక్కువగానే వచ్చాయి. ఈ ఉద్యమాలు స్థానికంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా ఎదిగి అధికారయుత వాదాన్ని ప్రశ్నించే స్థితికి చేరుకున్నాయి.

ఈ ఉద్యమాలకు చారిత్రకనేపథ్యం, రాజకీయ సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులు ఆయా ప్రదేశాల్లో ఆలంబనగా నిలిచాయి. ఈ ఉద్యమాలు విశాల విస్తృత ప్రాతి పదిక పై మానవ హక్కులన్నింటినీ పరిరక్షించడానికి కంకణం కట్టుకున్నాయి. వీటిలో కొన్ని ఉద్యమాలు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన ప్రాతిపదికన మానవ హక్కుల నిర్వచనాన్ని ఆమోదించి, ఆహక్కుల ఉల్లంఘన సందర్భాలను అంతర్జాతీయ సమాజం ముందుకు తీసుకువస్తూండగా, కొన్ని ఉద్యమాలు కొన్ని వర్గాలు సమూహాల (మతపర, లింగపర, వృత్తిపర) హక్కుల కోసం పరిమిత చట్రంలో ఉద్యమిస్తున్నాయి.

మానవ హక్కుల ఉద్యమాలను, ఉద్యమాలు నిర్వహించే ప్రభుత్వేతర సంస్థలను వేరుగా భావించలేము. ఉద్యమాల అధ్యయనంలో సంస్థల ప్రస్తావన తప్పనిసరి అవుతుంది.

BRAOU

## 12.2 మానవ హక్కుల ఉద్యమాలు – స్వభావం :

మానవ హక్కుల ఉద్యమాలు రాజ్యాంగ బద్ధమైనవి. ఆయాదేశాల రాజ్యాంగాలు, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన (1948) నిర్వచనాన్ని ఆమోదించి దానికి అనుగుణంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ ఉద్యమాలు రాజ్యవ్యవస్థలను నడిపే రాజనీతి సిద్ధాంతాలను (ఉదారవాదం, సామ్యవాదం, సంపూర్ణాధికార వాదం) ఎనాడూ ప్రశ్నించలేదు. ఉద్యమాలు రాజ్యస్వభావాన్ని మాత్రమే ప్రశ్నిస్తాయి. ఉద్యమాల లక్ష్యాలు రాజ్యాంగాల లక్ష్యాలకు, ఐక్యరాజ్యసమితి ఆశయాలకులోబడి ఉంటాయి.

రెండోది, మానవ హక్కుల ఉద్యమాలు నిరంతరం కొనసాగుతూ శాశ్వతత్వాన్ని కలిగి ఉంటాయి. దీనిలో అంతర్భాగంగా మానవ హక్కుల ఉల్లంఘన సంఘటనలను, సందర్భాలను, వ్యక్తులను, సంస్థలను ప్రశ్నిస్తాయి. అంతేకాని పరిమిత సంఘటనల నేపథ్యంలో ఉద్యమించి, తాత్కాలిక ఉపశమనంతో ఉద్యమాలను ముగించలేదు. ఉల్లంఘన సంఘటనలను సవాలు చేసే పరంపర నిత్యం కొన సాగుతూనే ఉంటుంది.

ఉద్యమ పద్ధతులు వేరు వేరుగా ఉంటాయి. కొన్ని ఉద్యమాలు అంతర్జాతీయ సమాజం దృష్టికి ఒక దేశంలోని ఉల్లంఘన అంశాలను తీసుకువచ్చి, ఆప్రభుత్వానికి జాబులురాయించడం ఒకపద్ధతి. అలాగే ఉల్లంఘన అంశాలను అంతర్జాతీయ వేదికలపై ఎజెండాలో చేర్చి, చర్చించడానికి కృషిచేయడం, ఈ క్రమంలో అంతర్జాతీయ సంస్థలను ప్రభావితం చేయడం మరోపద్ధతి ఉల్లంఘన అంశాలను సంబంధిత ప్రభుత్వాలతో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా స్పర్శించడం ఇంకో పద్ధతి గమనించాల్సి దేమంటే ఉద్యమ పద్ధతులు అహింసాయుతమైనవి, రాజ్యాంగ బద్ధమైనవి మాత్రమే.

ఉద్యమాల పరిధి విషయ పూర్వకంగా, భౌగోళిక పరంగా వేరు వేరుగా ఉంటాయి. కొన్ని ఉద్యమాలు

ప్రపంచ మంతా విస్తరించి భౌగోళిక పరిమితులు లేకుండా సాగుతుండగా, మరికొన్ని ఉద్యమాలు తమఖండాలకు, దేశాలకు లేదా కొన్ని ప్రాంతాలకు పరిమితమౌతాయి.

అదే విధంగా కొన్ని ఉద్యమాలు మానవ హక్కులను మానవ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యల భూమికగా నిర్వచించి, వాటి పరిష్కారానికై విస్తృత కార్యక్రమంతో పాటుపడుతున్నాయి. అలాకాక, కొన్ని ఉద్యమాలు సమాజంలోని అణగారిన వర్గాలైన ఆదివాసీయులు, స్త్రీలు, మత-బాషాపరమైన అల్ప సంఖ్యకులు, జాతుల సమస్యలు-హక్కులకై పరిమిత స్థాయిలో ఉద్యమిస్తున్నాయి.

దాదాపు అన్ని మానవ హక్కుల ఉద్యమాలు తమ ఆర్థిక వనరులను తామే స్వచ్ఛంద సభ్యుల ద్వారా సేకరిస్తాయి. కొన్ని ఉద్యమాలు ప్రభుత్వాలనుంచి, రాజ్యవ్యవస్థలనుంచి నిధులు సేకరించ రాదనే నిబంధనను తమకుతామే విధించుకున్నాయి. ఉద్యమాల్లోకి వ్యక్తుల సభ్యత్వం, ఆర్థికవనరుల సేకరణల విషయంలో జాగ్రత్త వహించి ఆ అంశాలు తమ ఉద్యమలక్ష్యాలను నీరు కార్చకుండా చూసుకుంటాయి.

మానవ హక్కుల ఉద్యమాలు అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. వీటిలో కొన్నింటిని అగ్రరాజ్యాల అనుబంధ సంస్థలుగా ఎన్నో తృతీయ ప్రపంచ దేశాలు పేర్కొంటాయి. అలాగే దేశీయంగా నడిచే ఉద్యమాలు కూడా అసంతృప్తి రాజకీయ నిర్మాణాలకు అనుబంధంగా నడిచే ఉపరితల సంస్థలుగా (Frontal Organisations) పేర్కొనడం జరుగుతూంది. నిజానికి ఈ ఉద్యమాలు రాజ్యవ్యవస్థలను, దానికి అనుబంధంగా ఉండే రాజకీయ సంస్థలను, ఉల్లంఘనలు ప్రోత్సహించే సాంఘిక వ్యవస్థలను, వ్యక్తులను అందర్నీ ప్రశ్నిస్తాయి. అయితే ఈ ఉద్యమాలు కొన్ని రాజ్యహింస (State Violence) ని మాత్రమే ప్రశ్నించాలని అంటుండగా, మరికొని సమాజంలోని హింస-హక్కుల ఉల్లంఘన మూలలన్నింటినీ ప్రశ్నించాలని పేర్కొంటాయి.

BRAOU

## 12.3 అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమాలు:

మానవ హక్కుల ప్రకటన (1948) కి అనుగుణంగా అన్ని దేశాల్లో మానవ హక్కుల పై అనధికార పర్యవేక్షణతో, ఉల్లంఘాలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. ఈ ఉద్యమాలు ప్రజల మౌలిక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక హక్కులను ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు జరిగేలా ప్రభావితం చేస్తున్నాయి. రాజకీయ ఖైదీలు, జైళ్ళపరిస్థితులు, అక్రమనిర్బంధాలు, అణచివేతలు, చిత్ర హింస, రాజకీయ హత్యలు, మరణ శిక్షలు, స్వేచ్ఛ హక్కులు మొదలైన విస్తృత అంశాలపై ఈ ఉద్యమాలు పోరాడుతున్నాయి.

ఈ ఉద్యమాల్లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్‌వాచ్, ఆండియన్ కమీషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్, లిలియోబాసో ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ కమీషన్ ఆఫ్ జూరిస్ట్స్, ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ మొదలైనవి ముఖ్యమైనవి.

### 12.3.1 ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్:

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను మానవ హక్కుల ఉద్యమానికి మారు పేరుగా చెప్పవచ్చు. మానవ హక్కుల రంగంలో చేస్తున్న విశేషకృషికి 1977సం..లో నోబుల్ శాంతి బహుమతి కూడా పొందింది. ప్రపంచ వ్యాప్తంగా 140పైగా దేశాలలో మూడు లక్షల మందికి పైగా స్వచ్ఛంద కార్యకర్తలతో ఆమ్నెస్టీ మానవ హక్కుల ఉద్యమాన్నినడుపుతూంది. ఆమ్నెస్టీ చొరవతో ఎన్నో లక్షల మంది ఖైదీలకు స్వేచ్ఛ లభించింది. ఈనాడు మూడు ప్రధాన దేశాలకు అధిపతులుగావున్న ఒలిసెగన్ ఒబసాంజో (నైజీరియా), కిమ్ డే జంగ్ (దక్షిణ కొరియా), వాక్లేవ్ హావెల్ (ఛెక్ రిపబ్లిక్) - ఒకప్పుడు సంవత్సరాల తరబడి తమ దేశాల్లో రాజకీయ నేరాల ముసుగులో ఖైదీలుగా

ఉన్నప్పుడు ఆమ్నెస్టీ ఆయా ప్రభుత్వాలను వత్తిడి చేసి విడుదల చేయించింది. అంతేకాక చైనాలో జరిగే మారణ హోమాన్నీ, బ్రిటన్‌లో (ఉత్తర ఐర్లాండ్) నిత్యకృత్యమైన చిత్రహింసల పర్వాన్నీ, అమెరికాలో మరణ శిక్ష అమలును నిష్పక్షపాతంగా అంతర్జాతీయ సమాజం ముందు ఎండకట్టింది. రాజకీయ ఖైదీల విడుదలకు ఒక్కొక్క దేశానికి ఒక్కోపద్ధతి వరుసన పాటిస్తూ వారి విడుదలకు తద్వారా మానవ హక్కుల రక్షణకు విశ్వవాప్తంగా కృషి చేస్తూంది.

1961 మే 28వ తేదీన బ్రిటీష్ న్యాయవాది పీటర్ బెనన్‌సన్ (Peter Benenson) ఆమ్నెస్టీని లాంఛన ప్రాయంగా ఒక వార్త వ్యాసం ద్వారా ఆవిష్కరించి, మానవ హక్కుల పోరాటానికి సహాయం అందివాల్సిందిగా ప్రజలను అభ్యర్థించాడు. దానికి విశేష స్పందన లభించి, ఫలితంగా శాఖోప శాఖలై అంతర్జాతీయ ఉద్యమంగా నలభై సంవత్సరాలుగా కృషి చేస్తూంది.

ఆమ్నెస్టీ ప్రధానంగా సిద్ధాంతాల కోసం త్రికరణశుద్ధిగా, అహింసా మార్గంలో పోరాడే ఖైదీల విడుదల (Prisoners of Coscience)కు, ఇతర రాజకీయ ఖైదీల విడుదలకు, చిత్ర హింసలు - అమర్యాదాకర పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీనిలో భాగంగా జైళ్ళ పరిస్థితులు, మరణశిక్షలు, రాజకీయ హత్యలు, వ్యక్తుల రహస్య అదృశ్యాలు, సాయుధపోరాటాల్లో చట్ట విరుద్ధ హత్యలు, ఎన్‌కౌంటర్లు మొదలైన వాటికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజాన్ని జాగృత పరచి పోరాడుతుంది.

రాజ్యాలు అంతర్జాతీయ మానవ హక్కుల ఒడంబడికలపై సంతకాలు చేసినప్పుడు, ఆ ఒడంబడికలను అమలు చేయమని వారిని నైతికంగా ప్రభావం తెచ్చి ఆమ్నెస్టీ కోరుతుంది. ఒక వినూత్న సమూహ పద్ధతిలో రాజకీయ ఖైదీల విడుదలను కోరుతుంది. ప్రతి దేశంలోను ఆమ్నెస్టీ బృందాలు ఉంటాయి. ఈ బృందాల పనిని జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ఆమ్నెస్టీ సమన్వయ పరుస్తుంది. ఇలా కొన్ని వందల గ్రూపులు కొన్ని వేలమంది విడుదలకు కృషి చేస్తాయి. కేవలం ఖైదీల విడుదలలే కాక కొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సందర్భాలపై కూడా ఆమ్నెస్టీ కాన్ఫరెన్సులు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించింది. 1973లో చిత్రహింసలకు వ్యతిరేకంగా, 1976-77లో మరణ శిక్షకు వ్యతిరేకంగా కాన్ఫరెన్సులు నిర్వహించి సత్వర కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసింది.

రాజకీయ ఖైదీల విడుదల, వారికుటుంబాలకు ఆర్థికతోడ్పాటు మొదలైన అంశాలపై పోరాడేందుకు ఆమ్నెస్టీ నిధులను దాతలనుంచి, సభ్యులనుంచి స్వీకరిస్తుంది. ప్రభుత్వాల నుంచి, ఒకే ఆధారం నుంచి, నిధులు వసూళ్ళపై స్వయంగా నిషేధం విధించుకుంది.

BRAOU

## 12.3.2 హ్యూమన్‌రైట్స్ వాచ్ (Human Rights Watch)

1978వ సంవత్సరాంలో యూరోపు, మధ్య ఆసియా దేశాల్లో మానవ హక్కుల ఉద్యమంగా ప్రారంభమైంది. అప్పట్లో దీన్ని హెల్సింకీ వాచ్‌గా వ్యవహరించేవారు. ఆ తరువాత ఆఫ్రికా, అమెరికా, ఆసియా, మధ్య ఐరోపా, ఇతర ప్రాంతాలకు ఆఫ్రికా వాచ్, అమెరికా వాచ్, ఐరోపావాచ్, ఆసియావాచ్‌లపేరుతో పేరొంది, ఇటీవలనే హ్యూమన్ రైట్స్‌వాచ్‌గా మారింది.

హ్యూమన్‌రైట్స్ వాచ్ దాదాపు 75దేశాల్లో జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలపై నిత్యం, క్రమబద్ధమైన విచారణలు సాగించి ఆసమాచారాన్ని అంతర్జాతీయ సమాజం ముందు ఉంచుతుంది. నిర్ణీత కాల పరిధిలో, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో కృషి చేస్తూంది. రాజకీయ సిద్ధాంతాలకు, నమ్మకాలకు, భౌగోళిక ప్రాంతాలకు, జాతి మత సమూహాలకు సంబంధించిన మానవ హక్కులపై విశ్లేషణలు జరిపి ఉల్లంఘన సందర్భాలను ఆయా ప్రభుత్వాల వద్ద కార్యకర్తల ద్వారా, సభ్యుల ద్వారా దేత్యపరంగా ఉటంకిస్తుంది.

భావప్రకటన, ఆలోచన స్వాతంత్ర్యాలను, పౌరసమాజపు స్వేచ్ఛ ఆకాంక్షలను, చట్ట ప్రక్రియలను, హ్యూమన్ రైట్స్ వాచ్ గౌరవిస్తుంది. న్యూయార్క్, వాషింగ్టన్, లాస్ ఏంజిల్స్, లండన్, బ్రసెల్స్, మాస్కో, దుషాన్‌బి, రియోడి జనీరో, హాంగ్ కాంగ్ లకార్యాలయాల ద్వారా ఉద్యమాన్ని నడుపుతుంది.

రాజకీయ హత్యలు, వ్యక్తుల అదృశ్యాలు, చిత్రహింసలు, విచక్షణలు, ఏకపక్ష కారాగార శిక్షలు మొదలైన ప్రధాన మానవ హక్కుల అంశాలపై వివిధ దేశాల సమాచారాన్ని వార్షికంగా నివేదికల రూపంలో వెలువరిస్తుంది. తద్వారా ప్రభుత్వాలపై వత్తిడి తేవడం, అంతర్జాతీయ సమాజం ద్వారా అభిప్రాయాలను సమీకరించడం, సభ్యుల ద్వారా చట్ట బద్ధ పద్ధతులు ఆచరించడం చేస్తుంది. హ్యూమన్ రైట్స్ వాచ్ చొరవతో కొన్ని వందల మందికి స్వేచ్ఛ లభించింది.

అనేక ఫౌండేషన్‌ల ద్వారా, సభ్యుల ద్వారా ఆర్థిక వనరులను సమీకృతం చేసుకుంటుంది. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఏ ప్రభుత్వం నుంచి నిధులను సేకరించరాదని స్వయంగా నిబంధన విధించుకుంది.

### 12.3.3 ఆండియన్ కమీషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్ (Andean Commission of Jurists)

భౌగోళికంగా ఆండియన్ ప్రాంత (అమెరికా దేశాలు) ప్రజల మానవ హక్కులకై 1980లో కొలంబియాలలో ప్రారంభమైంది. ముఖ్యంగా 1970,80 దశకాల్లో దక్షిణ అమెరికా దేశాల్లో మారణ కాండలకు స్పందనగా ఏర్పడింది. మితవాద నియంతృత్వాలు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుని మారణ హోమాలు జరపడం, వ్యక్తులు అదృశ్యంకావడం, సామూహిక మానవ హక్కుల ఉల్లంఘనలు నిత్యకృత్యమైనప్పుడు ఆవిర్భవించిన ఉద్యమంగా దీన్ని పేర్కొనవచ్చు. పౌరసమాజం, సమన్యాయపాలన, మానవ హక్కులు – వాటి పరిరక్షణలకై ఉత్తర దక్షిణ అమెరికా దేశాల్లో ప్రభుత్వాలపై ప్రజలనుంచి, ఇతర ప్రభుత్వాల నుంచి, అంతర్జాతీయ సంస్థలనుంచి వత్తిడి తెచ్చి మానవ హక్కులను పరిరక్షిస్తుంది. దక్షిణ అమెరికా దేశాల్లో ప్రముఖంగా జరిగే మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారానికి కూడా ఈ ఉద్యమం వ్యతిరేకతను ప్రకటించింది. మానవ హక్కుల పరిస్థితిపై నెలవారీ, 3 నెలల, ఆరునెలల, వార్షిక నివేదికలు, న్యూస్‌లెటర్సు మొదలైనవాటిని ప్రచురిస్తుంది. మానవ హక్కుల పట్ల గౌరవం కల న్యాయవాదుల సమాఖ్యగా కూడా దీన్ని అభివర్ణిస్తారు.

### 12.3.4 లీలియో బాసో ఇంటర్నేషనల్ లీగ్ (Lelio Basso International League)

లీలియోబాసో అనే ఇటలీదేశపు న్యాయవాది 1976లో దక్షిణ అమెరికా, ఆఫ్రికా దేశాల మానవ హక్కుల పరిరక్షణకు ఈ ఉద్యమాన్ని స్థాపించాడు. ఇది ఇతర మానవ హక్కుల ఉల్లంఘనలకు మూలాలు సాంఘిక, ఆర్థికవ్యవస్థలో ఉంటాయనీ, అవ్యవస్థలను సరి చేస్తే తప్ప వీటి ఆపు చేయలేమని ఈ ఉద్యమం నమ్ముతుంది. కాబట్టి స్థూల ఆర్థిక సామాజిక సమస్యలనుండి మానవజాతిని విముక్తి చేసినప్పుడు హక్కులు వాటంతట అవే వృద్ధి చెందుతాయని ఈ ఉద్యమం భావిస్తుంది. ముఖ్యంగా బొలీవియా, చిలీ, ఉరుగ్వే, బ్రెజిల్, అల్జీర్స్ దేశాల్లోని ప్రజల సమస్యల పట్ల ఈ ఉద్యమం సానుభూతి చెంది, హక్కుల పరిరక్షణకు పాటుపడింది. రాజకీయ ఉద్యమాలే కాకుండా ప్రజల్ని హక్కులపట్ల, సమస్యలపట్ల విద్యావంతుల్ని చేయడం కూడా ఉద్యమంలో భాగమని లీగ్ నమ్ముతుంది.

### 12.3.5 ఇంటర్నేషనల్ లీగ్ (International League for Human Rights)

మానవ జాతి ఎదుర్కొనే ప్రధాన హక్కుల ఉల్లంఘనలైన రాజకీయ అణచివేత, జాతి-మత-వర్ణ విచక్షణ,

BRAOU

బానిసత్వం, మారణ హోమాలు, చిత్రహింస, న్యాయ విచారణ లేకుండా అక్రమ నిర్బంధాలు, దేశం విడిచిపోకుండా నిర్బంధం, వాక్స్వాతంత్ర్యం పత్రికా స్వాతంత్ర్యాలపై నిబంధనలు మొదలైన వాటిపై దాదాపు 80 దేశాల్లో లీగ్ పోరాడుతూంది. ఉల్లంఘనలపై ఐక్యరాజ్యసమితిలో, కౌన్సిల్ ఆఫ్ యూరోప్‌లో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్‌లో, అమెరికా ప్రాంత దేశాల సంస్థలో, ఆఫ్రికా దేశాల సంస్థలో, వివిధ ప్రభుత్వాలతో చర్చలు, సంప్రదింపులు జరుపుతుంది. రాజకీయ నేరాల విచారణ సందర్భంగా న్యాయవాదులను పంపుతుంది. ఉల్లంఘనల సమాచారాన్ని క్రోడీకరించి బులెటెన్లు, నివేదికల రూపంలో వెలువరిస్తుంది. మరణ శిక్షలను జీవిత కారాగార శిక్షలుగా మార్చడం, కుటుంబాలను పునరైక్యం చేయడం, రాజకీయ ఖైదీలను చెరనుండి విడిపించడం, దేశం వదలి పోవాలనుకునే వ్యక్తులకు సహాయం చేయడం, వర్ణ వివక్షణ ఎదుర్కొనే వారికి అండగా నిలవడం మొదలైన అంశాల్లో లీగ్ పాత్ర గణనీయమైనది. న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ఈ ఉద్యమం నడుస్తుంది.

### 12.3.6 ఇంటర్నేషనల్ కమీషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్ (International Commission of Jurists)

సమాజంలో ప్రజల మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులకు కీలక పాత్ర ఉన్నదని భావించి 1952లో స్విట్జర్లాండ్‌లో దీన్ని ప్రారంభించారు. ముఖ్యంగా యూరోపు, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో దాదాపు 25వేల మంది లాయర్లు ఈ ఉద్యమంలో భాగస్వాములు వివిధ దేశాల్లో రాజకీయ ఖైదీల విచారణకు హాజరుకావడం, డిఫెన్స్ న్యాయవాదులుగా పనిచేయడం, సాక్ష్యాలను సేకరించడం, ఖైదీలకుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేయడం ఈ ఉద్యమం చేస్తుంది. మానవ హక్కుల వృద్ధికి స్వతంత్ర న్యాయవ్యవస్థ అవసరాన్ని ఈ ఉద్యమం తెలియజేస్తుంది. దాదాపు 60 దేశాల్లో దీనికి సభ్యులున్నారు. అయితే కేవలం న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయ గ్రంథాలయాల అధికారులు, నిపుణులు మాత్రమే దీనిలో సభ్యులు. వివిధ దేశాల్లోని మానవ హక్కుల పరిస్థితిపై కాలను గతంగా నివేదికాలు, కొన్ని దేశాలపై ప్రత్యేక గ్రంథాలు ఈ ఉద్యమం విడుదల చేసి అంతర్జాతీయ సమాజాన్ని జాగృతం చేస్తుంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన ఆధారంగా వివిధ దేశాల రాజ్యాంగాల్లో మానవ హక్కుల ప్రకరణలను చేర్చడానికి న్యాయపరమైన సూత్రాలు, పద్ధతులు రచిస్తుంది. దీని ప్రధాన కార్యాలయం జెనీవాలో ఉంది.

BRAOU

### 12.3.7 ఇంటర్ పార్లమెంటరీ యూనియన్

అంతర్జాతీయ శాంతి, వివాదాల శాంతియుత పరిష్కారం, మానవ హక్కుల పరిరక్షణకు నెలకొల్పిన మొట్టమొదటి ఉద్యమంగా దీన్ని పేర్కొన వచ్చు. 1899లో ఫ్రాన్స్ దేశంలో ప్రారంభమై బాగావిస్తరించి దాదాపు 120 దేశాల్లో సభ్యత్వం కలిగి ఉంది.

పార్లమెంటీరియన్లు, శాసన సభ్యులు దీనిలో సభ్యులుగా ఉంటారు. ప్రజల మనో ఆకాంక్షలకు అనుగుణంగా మానవ హక్కులుండాలని ఈ సంస్థ వాదిస్తుంది సంబంధిత ప్రభుత్వాలను శాసన సభ్యుల ద్వారా ప్రభావితం చేస్తుంది. కొన్ని దేశాలకు ప్రత్యేక బృందాలను పంపి మానవ హక్కుల పై విచారణ చేస్తుంది. వివిధ దేశాల్లోని శాసన సభల్లో మానవ హక్కుల ఉల్లంఘనలపై ప్రభుత్వాలను ప్రశ్నించడం, తీర్మానాలు ప్రతిపాదించడం, అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేయడం ఈ ఉద్యమ పద్ధతులు ఐక్యరాజ్యసమితి, కౌన్సిల్ ఆఫ్ యూరోప్, అరబ్‌లీగ్, అమెరికా దేశాల సంస్థ, ఆఫ్రికా ఐక్యవేదికలకు సలహాదారుగా కూడా వ్యవహరిస్తుంది. మానవాళి సమస్యలకు శాంతియుత పరిష్కారాలు, మానవ హక్కుల పరిరక్షణ ఈ ఉద్యమ ధ్యేయాలు. ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాల్లో వలస వాద పాలనల అనంతరం వచ్చిన నూతన రాజ్య వ్యవస్థలపై దీని ప్రభావం ఉంది.

రాజ్యాంగాల్లో మానవ హక్కుల నిబంధనలు జోడించడం, వాటి అమలును సమీక్షించడం, ఉల్లంఘన సందర్భాలను ప్రభుత్వాల వద్ద ప్రస్తావించడం, కొన్ని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజపు మద్దతు సమీకరించడం దీని లక్ష్యాలు.

## 12.4 ఆదివాసి తెగల హక్కుల ఉద్యమం – సర్వైవల్ ఇంటర్నేషనల్:

(Survival International) : ప్రపంచంలోని ఆదిమజాతి తెగల ప్రజల జీవన పరిస్థితులు మెరుగు పరచడానికి, సంస్కృతి పరిరక్షించడానికి, హక్కుల పరిరక్షణకు 1969లో లండన్ కేంద్రంగా ఈ ఉద్యమం ప్రారంభమైంది. అభివృద్ధి పేరుతో జరిగే అడవుల నరికివేత, సంస్కృతి పరిరక్షణ పేరుతో రూపుమాపే తెగల విలువలు, జీవన స్రవంతిలో కలిసిపోయే తెగల వైద్య-న్యాయ వ్యవస్థలు మొదలైన ప్రక్రియలను ఆపి వివిధ ఆదిమ జాతి తెగల హక్కుల పరిరక్షణకు ఉద్యమించింది. తెగల సంస్కృతి పరిరక్షణలో భాగంగా వివిధ తెగల భాషలు, లిపిల అభివృద్ధికి కృషిచేస్తుంది. అర్జంట్ యాక్షన్ బలెటిన్ పేరుతో ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, జపనీస్, పోర్చుగీస్, స్పానిష్ భాషల్లో కాలక్రమంగా సమాచారం అందిస్తుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల తెగల ప్రజల హక్కుల ఉల్లంఘనలను ఆయా ప్రభుత్వాల దృష్టికి, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఐక్యరాజ్యసమితి, ఇతర ప్రాంతీయ మండళ్ళ దృష్టికి తెచ్చి పోరాడుతుంది. హక్కుల ఉల్లంఘనలపై పరిశోధన కూడా ఉద్యమంలో భాగంగా ప్రకృతి పర్యావరణంలపై గిరిజనుల జన్మహక్కులను ప్రభుత్వాలు చట్ట బద్ధంగా గుర్తించాలని ఈ ఉద్యమం డిమాండ్ చేస్తుంది.

## 12.5 యుద్ధ వ్యతిరేక – యుద్ధ ఖైదీ హక్కుల ఉద్యమాలు :

వివిధ దేశాల మధ్య ప్రాంతీయ స్థాయిలో, కొన్ని సందర్భాల్లో ప్రపంచ స్థాయిలో యుద్ధాలు జరిగినప్పుడు భారీస్థాయిలో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగి హక్కుల ఉల్లంఘనలు జరుగుతాయి. అలాగే కొన్ని దేశాల్లో జాతుల మధ్య అంతర్యుద్ధం జరిగినప్పుడు కూడా ఇలాంటి ఉల్లంఘనలే జరుగుతాయి. ఎంతో మంది సాధారణ ప్రజలు, సైనికులు, రాజకీయ కార్యకర్తలు ఎలాంటి నేరం లేకుండా సంవత్సరాల తరబడి ఖైదీలుగా ఉండడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతూంటుంది. కొన్ని వేలకుటుంబాలు నిరాశ్రయులవుతారు. రెండో ప్రపంచ యుద్ధం, తదనంతరం వచ్చిన వియత్నాం, ఉత్తర-దక్షిణ కొరియాల యుద్ధం, ఆఫ్రికా దేశాల్లో, శ్రీలంక తరహా జాతుల పోరాటాల్లో ఇలాంటి సామూహిక మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతూంటాయి. వీటిని అడ్డుకోడానికి, దానిలో నిరాశ్రయులైన ప్రజలకు, యుద్ధఖైదీలకు స్వేచ్ఛ అందించడానికి ఎన్నో అంతర్జాతీయ సంస్థలు కృషి చేస్తున్నాయి. వీటిలో 1. ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ 2. ఫిజిషియన్స్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ న్యూక్లియర్ వార్ 3. డాక్టర్స్ శాన్స్ ఫ్రాంటియర్స్ పేర్కొన వచ్చు. ఈ సంస్థల కార్యకలాపాలు భారీస్థాయిలో ఉద్యమ రూపంలో జరుగుతాయి.

### 12.5.1 ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ : (International Committee of the Red Cross)

ప్రపంచంలో దాదాపు 150 దేశాల్లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ పనిచేస్తుంది. మౌలికంగా యుద్ధాలు, అంతర్యుద్ధాలు, సాయుధపోరాటాల సమయాల్లో ప్రజలు, సైనికుల భౌతిక, బౌద్ధిక స్వేచ్ఛల గురించి రెడ్ క్రాస్ పోరాడుతుంది. 1863లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. 19వ శతాబ్దంలో రష్యా-టర్కిష్ యుద్ధం, ఒటమాన్ అంతర్యుద్ధాల్లో ప్రజల స్వేచ్ఛకై పోరాడింది. ఇరవయ్యవ శతాబ్దిలో మొదటి, రెండు ప్రపంచ యుద్ధాల్లో ఇరాన్, అర్జెంటీనా,

BRAOU

దక్షిణ అమెరికా దేశాలు, ఆసియా దేశాలైన జబోతి, యమన్, అరబ్‌దేశాలు, ఇండోనేషియా మొదలైన చోట్ల సంక్షేమ కార్యకలాపాల్లో పాల్గొన్నది. 1980వ దశకంలో వివిధ దేశాల్లోని అంతర్యుద్ధాల్లో చితికిన ప్రజలకు సేవలందించి ఓదార్చింది. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 300పైగా నిర్బంధ ప్రదేశాలను సందర్శించి 15వేలకు మందిపైగా రాజకీయ ఖైదీలతో ప్రత్యేకంగా మాట్లాడి విడుదలకు కృషి సల్పుతుంది. ఖైదీలను ప్రశ్నించే సందర్భంలో అధికారులు గానీ, సాక్షులుగానీ లేకుండా వారిని సంప్రదించి స్వయం నిర్ధారణ చేసుకుంటుంది. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాల్లో అంతర్యుద్ధాల్లో బందీలైన వ్యక్తులు-సైనికుల గురించి సెంట్రల్ ట్రేసింగ్ ఏజెన్సీ ద్వారా సమాచారం సేకరించి వారి విడుదలకు బృందాలను పంపి, ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో, దాని అనంతరం దాదాపు 14మిలియన్ల ప్రజలను చెరనుంచి విడిపించి, కుటుంబాలతో కలిపింది. రెడ్ క్రాస్ మానవ హక్కుల పరిరక్షణ కృషికి గుర్తింపుగా రెండుసార్లు 1917, 1944 సంవత్సరాల్లో నోబెల్ శాంతి పురస్కారం లభించింది.

యుద్ధాలు, అంతర్యుద్ధాలు సమయంలో రాజ్యవ్యవస్థలు అనుసరించాల్సిన మానవతా వాద నియమాలపై 1949 జెనీవా యుద్ధ చట్టాల ఒడంబడికలకు రెడ్ క్రాస్ రెండు అనుక్రమణికలు (Protocob) తయారు చేసింది. దీనిలో మొదటి ప్రొటోకాల్ ప్రకారం సాయుధపోరాటాల సమయంలో బలయ్యే సాధారణ ప్రజానీకాన్ని రక్షించే సూత్రాలున్నాయి. రెండో ప్రొటోకాల్ ప్రకారం సాయుధ పోరాటాల్లో నిరాయుధులై, బందీలుగా మారిన ఖైదీలపై చూపాల్సిన కనీస ఆదరణ నిబంధనలు ఉన్నాయి. రాజకీయ ఖైదీలు, యుద్ధఖైదీలను ప్రత్యక్షంగా కలిసి ఒక నివేదికను తయారు చేసి, సంబంధిత ప్రభుత్వాలకు అందిస్తుంది. ఈ నివేదికను రహస్యంగా ఉంచుతుంది. సాధారణంగా ఈ నివేదిక ఖైదీల రాజకీయ నేపథ్యాన్ని గానీ, వారి నిర్బంధంలోని చట్ట బద్ధతనుగానీ ప్రశ్నించదు.

తరువాత కాలంలో రెడ్ క్రాస్ కార్యకలాపాలు బాగావిస్తరించాయి. యుద్ధ సైనికుల, ఖైదీల శారీరక పరిస్థితిని బాగుచేయడం, శాంతి సమయాల్లో రాజకీయ ఖైదీల స్వేచ్ఛలకై పోరాడడం మొదలైనవి ఉన్నాయి. అంతేకాక ఆస్పత్రుల ఏర్పాటు, నర్సుల శిక్షణ, శిశుసంరక్షణ విద్యావ్యాప్తి, రక్తదానాలు పర్వత-సముద్రయాన ప్రయాణీకులను ప్రమాదాలనుంచి రక్షించడం, రక్తదానాలు, మొదలైన కార్యకలాపాలు సాగిస్తుంది. ఇటీవలికాలంలో ప్రకృతిపై పరీత్యాలు, మాదకద్రవ్యాలు, నిరుద్యోగం, బారి నుంచి ఉత్పన్నమయ్యే పీడనల నుంచి మానవ జాతిని రక్షించడం జరుగుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆరోగ్యం - సంక్షేమం, మరణరోగాలనుంచి రక్షించడం, వ్యాధి నిరోధక ప్రచారాలు-మందులు మొదలైనవి చేపట్టింది. అంతర్యుద్ధాల ఫలితంగా వలసలు పోయే కాందిశీకులు-వారి హక్కులు-స్వేచ్ఛ, జీవన పరిస్థితులను అంతర్జాతీయ సమాజానికి తెలుపుతుంది.

రెడ్ క్రాస్ వివిధ రాజ్యవ్యవస్థలతో ఘర్షణ పొందదు. హక్కుల ఉల్లంఘన సందర్భాలను రహస్యంగా ప్రభుత్వాలకు నివేదిస్తుంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఘర్షణల నివారిస్తుంది. రెడ్ క్రాస్ ఆర్థిక వనరులను ప్రభుత్వాల నుంచి స్వీకరిస్తుంది. దాని బడ్జెట్‌లో సగభాగం స్విట్జర్లాండ్ ప్రభుత్వమే భరిస్తుంది. ఇతర స్వచ్ఛంద విరాళాలు కూడా స్వీకరిస్తుంది. బహుశా ప్రభుత్వాలపై ఆర్థిక వనరులను ప్రభుత్వాల నుంచి స్వీకరిస్తుంది. ఇతర స్వచ్ఛంద విరాళాలు కూడా స్వీకరిస్తుంది. బహుశా ప్రభుత్వాలపై ఆర్థిక వనరులకు ఆధారపడడం వల్ల నివేదికలు రహస్యంగా వాటికే అందిస్తుంది కాని ప్రచురించదు.

BRAOU

### 1 2 . 5 . 2 అణుయుద్ధ వ్యతిరేక వైద్యుల ఉద్యమం : (International Physicians for the Prevention of Nuclear War)

మానవాళిని వినాశనంలోకి నెట్టే అణుయుద్ధం నుంచి రక్షించుకునే హక్కు, దాన్ని నివారించడానికి వివిధ ప్రభుత్వాలను ప్రభావితం చేసే హక్కు ప్రజల కుంటుందని ఈ ఉద్యమం నమ్ముతుంది. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో అమెరికా, రష్యా దేశాల్లోని వైద్యులు దీన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమ కృషికి గుర్తింపుగా 1985 సంవత్సరంలో నోబెల్ శాంతి పురస్కారం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 80 దేశాల్లో రెండు లక్షల మందికి పైగా వైద్యులు దీనిలో సభ్యులు అణుబాంబుతయారీ అణురియాక్టర్ల నిర్మాణం, అణ్వాయుధాల ప్రయోగాలను వ్యతిరేకిస్తుంది. అణ్వాయుధాలపై వెచ్చించే రాజ్యాలు తమ ఆర్థిక వనరులను ప్రజల ఆరోగ్యం–సంక్షేమ రంగాలకు మళ్ళించాలని డిమాండ్ చేస్తుంది. వైద్యులు తమ వృత్తి ఆరంభంలో తీసుకునే హిప్పోక్రటిక్ వాగ్దానం (Hippocratic Oath)కు అనుగుణంగా, అణుయుద్ధ ప్రమాదం సంభవిస్తూంటే నిశ్శబ్దంగా ఉండలేమనీ, హిరోషిమా ఘంటికలు ఇంకా మారు మ్రోగుతూనే ఉన్నాయి కాబట్టి ప్రభుత్వాలు జాగ్రత్తం కావాలని ఈ ఉద్యమం బోధిస్తుంది. మానవులకు యుద్ధ వ్యతిరేకంగా, శాంతియుతంగా జీవించే హక్కు ఉంటుందనీ, దీన్ని రాజ్యాలు గౌరవించి తీరాలనీ ఈ ఉద్యమం ఉద్బోదిస్తుంది.

### 1 2 . 5 . 3 డాక్టర్స్ శాన్స్ ఫ్రాంటియర్స్

ఇటీవలనే నోబెల్ శాంతి బహుమతి పొందిన ఉద్యమం. యుద్ధ సమయాల్లో అంతర్యుద్ధాల్లో గాయపడిన, గురియయిన ప్రజల హక్కులకై పోరాడుతుంది. 1990వ దశకంలో అఫ్ఘానిస్థాన్, అజర్‌బైజాన్, బోస్నియా–హెర్జగోవినా, రువాండ, సుడాన్ దేశాల్లో అంతర్యుద్ధాల పీడిత ప్రజలకు సేవలు చేసి, వారి హక్కుల పరిరక్షణకు అంతర్జాతీయ సమాజాన్ని చైతన్యం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా డెబ్బైపైగా దేశాల్లోని వైద్యులు, నర్సులు ఈ ఉద్యమ కార్యకర్తలు. ఈ ఉద్యమ కార్యకలాపాలు రెండు విధాలు ఒకటి గాయపడిన వారికి వైద్య సేవలద్వారా ప్రాణ భిక్ష, రెండోది యుద్ధ పరిసమాప్తికి ప్రభుత్వాలపై అంతర్జాతీయ సంస్థలపై వత్తిడి తెచ్చి, స్థానిక ప్రజల హక్కులను పరిరక్షించడం.

BRAOU

### 1 2 . 6 వర్ణ విచక్షణ– జాతి విచక్షణ వ్యతిరేక ఉద్యమాలు :

ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల్లో మొదలై విశ్వవ్యాప్తమైన వర్ణ విచక్షణ– జాతి విచక్షణలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. నిజానికి ఈ విచక్షణలు 19,20 శతాబ్ద మొదటి భాగాల్లో రాజ్యాల పాలన విధానాలుగా ఉండేవి. మధ్యయుగాల కాలం నుంచి వస్తున్న బానిసత్వం దీనిలో అంతర్భాగమైంది. మానవుల వర్ణం, జాతిప్రాతి పదికలుగా వారి మేధోశక్తులు నిర్ధారణ అవుతాయని అప్పట్లో ప్రచారంలో ఉండేది. దీనికి అనుగుణంగా శ్వేతజాతి శ్రేష్ఠత సిద్ధాంతం (Theory of Whiteman's Burden) లాంటి వాటిని కొన్ని జాతులు ప్రచారం చేశాయి. దీనికి వ్యతిరేకంగా ముఖ్యంగా నల్లజాతి ప్రజల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు ఆవిర్భవించాయి. మార్టిన్ లూథర్ కింగ్, ఫ్రాంజ్ ఫానన్, నెల్సన్ మండేలా, ఛేగువేరా లాంటి మేధావులు పోరాడారు. వీటిలో యాంటీ స్లేవరీ సొసైటీ, ఎఫార్డ్ (EAFORD), ఇంటర్నేషనల్ లీగ్ మొదలైనవి ముఖ్యమైనవి.

### 12.6.1 యాంటీ స్లేవరీ సొసైటీ

ఆఫ్రికా దేశాల్లో వలసవాద పాలనల్లో నలిగిపోయిన మానవ హక్కులకు పోరాడిన ఉద్యమం. బానిసత్వాన్ని, బానిసవ్యాపారాన్ని అరికట్టి స్వేచ్ఛ ప్రసాదించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. వివిధ దేశాల్లోని సభ్యుల ద్వారా బానిసత్వం పై నివేదికలు తయారు చేసి, వారికి స్వేచ్ఛ కల్పించడంలో ఆయా ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతుంది. బాని సత్వాలకు గురి అయిన కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం, స్వేచ్ఛ పొందిన వారికి పునరావాసం కల్పించడం, విద్యావ్యాప్తి, వర్ణవిచక్షణకు వ్యతిరేకంగా సమానత్వం కోసం పోరాడడం ఈ సొసైటీ ఉద్యమ లక్ష్యాలు.

### 12.6.2 ఇంటర్నేషనల్ లీగ్ ఎగైనస్ట్ రేసిజం : (International League Against Racism and Antisemitism)

జాతి, వర్ణ విచక్షణలను వ్యతిరేకించి, సమాజంలోని ప్రతి వ్యక్తికి ఆత్మగౌరవం, స్వాభిమానాలతో జీవితపు అస్తిత్వాన్ని సాధించే హక్కు (Right to Existence) ఉంటుందని లీగ్ నమ్ముతుంది. ముఖ్యంగా ఈ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో యూదుల దురాగతాలనుంచి, యూరోపియన్ల జాత్యహంకారం నుంచి నల్లజాతి ప్రజలు ఎదుర్కొన్న హక్కుల అణచివేతకు వ్యతిరేకంగా లీగ్ ఫ్రాన్స్‌లో ఏర్పడింది. దాదాపు నలభై దేశాల్లో లీగ్‌కు సభ్యులున్నారు. వర్ణ విచక్షణ విధానాలకు వ్యతిరేకంగా అగ్రరాజ్యాల్లో నల్లజాతి వారికి సంరక్షణలు కోసం లీగ్ పోరాడుతుంది.

BRAOU

### 12.6.3 ఎఫార్డ్ : (Elimination of All Forms of Racial Discrimination) (EAFORD)

వర్ణ విచక్షణ విధానానికి వ్యతిరేకంగా దాదాపు 25 దేశాల్లో ఈ ఉద్యమ సభ్యులున్నారు. 1976లో లిబియాలోని ట్రిపోలీలో ప్రారంభమైంది. యూదు ధార్మిక నమ్మకాల ప్రభావంతో వర్ణవిచక్షణకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఏకాభిప్రాయ సాధనకు, అన్ని రకాల వర్ణ విచక్షణల నిరోధానికి, వర్ణవిచక్షణపై పరిశోధన, ప్రచురణల ద్వారా సమాచార వ్యాప్తికి, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, మధ్య ఆసియా దేశాల్లోని ప్రజల మానవ హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తుంది. వర్ణ విచక్షణ నిరోధక భావజాల వ్యాప్తికి అనుగుణంగా అరబిక్, ఇంగ్లీషు, ఫ్రెంచి, పోర్చుగీసు, స్పానిష్ బాషల్లో గ్రంథాలకు అవార్డులు ఇవ్వడం మొదలైనవి చేస్తుంది. ఎఫార్డ్ కృషికి తార్కాణంగా ఎన్నో యూరోపియన్ దేశాల్లో వర్ణవిచక్షణకు వ్యతిరేకంగా ఆయా ప్రభుత్వాలు నల్ల జాతి ప్రజలకు కల్పించిన సంక్షేమ చర్యలను పేర్కొనవచ్చు. 1990వ దశకంలో ఇజ్రాయిల్-పాలస్తీనా సంఘర్షణ, దక్షిణ ఆఫ్రికా, నమీబియా దేశాల్లో వర్ణ విచక్షణ- జాతి విచక్షణ ప్రభుత్వా విధానాలకు వ్యతిరేకంగా అభిప్రాయాల్ని కూడ గట్టింది. దీని ప్రధాన కార్యలయం స్విట్జర్లాండ్‌లో ఉంది. వర్ణ విచక్షణ విధానం వివిధ దేశాల్లో ఎలా సాగుతుందో కొన్ని గ్రంథాల రూపంలో తెల్పింది.

## 12.7 అంతర్జాతీయ మహిళ ఉద్యమాలు :

ప్రపంచ జనాభాలో సగభాగం ఉన్న స్త్రీ జాతి విముక్తికి ఎన్నో ఉద్యాలు వచ్చాయి. గృహ హింస, లైంగిక వేధింపులు, పని ప్రదేశాల్లో వేధింపులు, అత్యాచారాలు, సాంఘిక విచక్షణలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమాలు పోరాడాయి. 19వ శతాబ్ది చివరి భాగం నుంచి ఈ ఉద్యమాలు ఒక వ్యవస్థీ కృత రూపంలో మొదలయ్యాయి. ఇంటర్నేషనల్ ఉమన్స్ సఫ్రేజ్ అలయన్స్, ఉమన్స్ ఇంటర్నేషనల్ లీగ్ మహిళా హక్కులకై పోరాడిన ఉద్యమాల్లో

ప్రముఖమైనవిగా తెల్పవచ్చు. ఇంటర్నేషనల్ ఉమన్స్ సఫ్రేజ్ అలయన్స్ (International Women's Suffrage Alliance) కృషి వలన ఎన్నో దేశాల్లో స్త్రీలు ఓటింగ్ హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు, ప్రభుత్వాలను, పదవులను పొందే హక్కు లభించాయి.

ఈ అలయన్స్ కృషివల్ల న్యూజిలాండ్‌లో 1893లో, ఆస్ట్రేలియాలో 1902లో డెన్మార్క్‌లో 1915లో, ఇంగ్లాండ్‌లో 1928లో, అమెరికాలో 1920లో, ఫ్రాన్స్‌లో 1949లో, ఇటలీలో 1945లో, స్విట్జర్లాండ్‌లో 1972లో స్త్రీలకు ఓటింగ్ హక్కులు లభించాయి.

అలాగే స్విట్జర్లాండ్ ప్రధాన కేంద్రంగా ఉమన్స్ ఇంటర్నేషనల్ లీగ్ పనిచేస్తూంది. స్త్రీ జాతి సమస్యలపై పోరాడడానికి, వివిధ అంతర్జాతీయ సంస్థల్లో, వేదికలపై మహిళల వాణి వినిపించడానికి కృషిచేస్తూంది. మహిళా హక్కుల ఉల్లంఘన సందర్భాలను ఆయా ప్రభుత్వాల వద్ద ప్రస్తావించి పరిష్కార మార్గాలు చూపుతుంది. ఈ ఉద్యమం విశాల మానవ సమాజంలో స్త్రీలను అంతర్భాగంగా గుర్తించి, ప్రపంచ శాంతి నిరాయుధీకరణ, స్వేచ్ఛ మొదలైన అంశాలపై కూడా పోరాడతుంది.

## 12.8 మత స్వేచ్ఛ ఉద్యమాలు :

ప్రపంచంలోని మానవాళికి మౌలిక అవసరాలు వస్తుపర అవసరాలతో పాటు ఆధ్యాత్మిక స్వేచ్ఛలు కూడా మానవ హక్కుల చట్రంలో అంతర్భాగం కావాలనీ ఎన్నో ఉద్యమాలు ఘోషించాయి. అయితే ఈ ఉద్యమాలు ఎక్కువ భావం క్రైస్తవ మత సంబంధమైనవి. తూర్పుయూరోపు దేశాల్లో రెండో ప్రపంచ యుద్ధానంతరం వచ్చిన సామ్యవాద రాజ్య వ్యవస్థలు మత స్వేచ్ఛ పై నిబంధనలు విధించడానికి వ్యతిరేకంగా ఈ ఉద్యమాలు ఉద్భవించాయి. అలాగే క్రైస్తవ మతంలోని సైద్ధాంతిక భేదాలు ప్రాతిపదికగా వచ్చిన వివిధ మత సమూహాలు-వ్యవస్థల మధ్య హింసాత్మక ఘర్షణలు, తద్వారా ఏర్పాడిన మానవ హక్కుల ఉల్లంఘనలను ఈ ఉద్యమాలు ఎత్తి చూపాయి. వీటిలో పాక్స్ క్రిస్టీ (Pax Christic) నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ప్రారంభమై తూర్పు, పశ్చిమ యూరోపు దేశాల్లో మతస్వేచ్ఛకై పోరాడుతూ జైళ్ళలో ఉన్న ఖైదీల హక్కులకై పోరాడుతుంది. పాంటిఫిషియల్ కమీషన్ (Pontificial Commission) ఇటలీలోని రోమ్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైంది. క్రైస్తవ మతంలోని కేథలిక్ వర్గ ప్రజల అభివృద్ధికి, మానవ హక్కుల పరిరక్షణకు దాదాపు 60 దేశాల్లో 1967 నుంచి పోరాడుతూంది. చర్చిమత బోధనల్లో మానవ హక్కుల అంశాలను గూర్చి చర్చ్-మానవ హక్కులు (Church and Human Rights) ప్రచురణ చేస్తుంది. యుద్ధం, శాంతి, ఆర్థికాభివృద్ధి మతస్వేచ్ఛల చట్రంలో మానవ హక్కుల అధ్యయనం జరగాలని భావిస్తుంది.

అలాగే వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ (World Council of Churches) మానవ హక్కుల పై నూతన అంశాలను క్రోడీకరించి మత బోధనల్లో భాగం చేస్తుంది. వివిధ దేశాల్లోన్ని చర్చిలు ద్వారా చిత్రహింసలు, రాజకీయ కారణాలు పై కారాగారాలు, రాజకీయ ఖైదీలు-మతస్వేచ్ఛలకై పోరాడుతుంది. అ సంతృప్తి చెందే హక్కు (Right to dissent) అందరికీ ఉంటుందనీ, అయితే దాని ప్రాతిపదికన వ్యక్తులను శిక్షించడం హక్కుల ఉల్లంఘనకు దారి తీస్తుందనీ భావిస్తుంది. కాందిశీకులకు, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు ఆర్థిక సహాయం కూడా అందిస్తుంది. వివిధ దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలను ఎలా ఫిర్యాదు చేయాలో వాస్తవ మార్గదర్శక సూచికను ప్రచురించింది. దీనితో పాటే మతస్వేచ్ఛకై లూథరన్ వరల్డ్ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రెలిజియస్ ఫ్రీడం, వరల్డ్ జ్యూవిష్ కాంగ్రెస్‌లు మానవ హక్కులకై పోరాడుతున్నాయి.

BRAOU

## 12.9 మేధోపర సేచ్ఛ ఉద్యమాలు :

నాగరిక సమాజ పురోగతికి అవసరమయ్యే మానవ మేధస్సు పూర్తిస్థాయి వినియోగం పై అంక్షలు, నిబంధనలు ఉండరాదని ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. వివిధమేధో రూపాలైన శాస్త్రం-సాంకేతిక విజ్ఞానం, సాహిత్యం, సంగీతం, కళలు, పత్రికా స్వాతంత్ర్యాలు మానవాళి అభ్యుదయానికి మార్గాలు చూపుతాయనీ, వీటిపై పరిమితులు విధించడం మానవ ప్రగతిని, దీనిలో అంతర్భాగమైన మానవ హక్కులను ఉల్లంఘించడమేననీ ఈ ఉద్యమాలు పేర్కొటాయి. వీటిలో ఇంటర్నేషనల్ కౌన్సిల్ అఫ్ సైంటిఫిక్ యూనియన్స్ (International Council of scientific unions) 1931లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. దాదాపు 68 దేశాల్లో వివిధ సంస్థలు, శాస్త్రవేత్తలు, సాంకేతికనిపుణులు సభ్యులుగా ఉన్న ఈ ఉద్యమంలో బ్రిటీష్ రాయల్ సొసైటీకి కూడా సభ్యత్వం ఉంది. వివిధ దేశాల్లో మేధోపరమైన పుస్తకాలు, కళలు, శాస్త్ర-సాంకేతిక అంశాలు, సాహిత్య-సంగీతాలను నిషేదించడాన్ని ఈ ఉద్యమం వ్యతిరేకిస్తుంది. మేధస్సుకు ప్రాదేశిక ఎల్లలు ఉండరాదనీ, శాస్త్రవేత్తలు-సాంకేతికనిపుణులు ప్రపంచంలో ఎక్కడైనా సంచరించేందుకు వీలుగా ఇమిగ్రేషన్ చట్టాలు ఉండాలనీ కౌన్సిల్ భావిస్తుంది. వర్ణ, జాతి, మత, లింగ విచక్షణలను కౌన్సిల్ వ్యతిరేకిస్తుంది. అలాగే ఇంటర్నేషనల్ పెన్ (International Pen) అనే ఉద్యమాన్ని 1921లో లండన్‌లో ప్రముఖ రచయిత జాన్ గాల్స్ వర్ధీ (John Galsworthy) ఆవిష్కరించాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రచయితలు, సంపాదకులు, అనువాదకులు, కవులు, కళాకారులు, చరిత్రకారులు, తాత్వికులు, శాస్త్రవేత్తల హక్కుల పరిరక్షణకై ఈ ఉద్యమం లక్ష్యాలు నిర్దేశించుకుంది. మానవ మేధస్సు అనే సంపద రాజకీయాలకు, అంతర్జాతీయ ఒడిదుడుకులకు అతీతమైనదని భావించే ఈ ఉద్యమం 82 దేశాల్లో ఉంది. ఆంగ్లం, ఫ్రెంచి భాషల్లో సంవత్సరానికి రెండుసార్లు మానవ హక్కుల స్థితిగతులపై పెన్ ఇంటర్నేషనల్ ప్రచురిస్తుంది. ఈ ఉద్యమానికి ఐక్యరాజ్యసమితి ఆర్థిక సాంఘిక సమితి, ప్రపంచ మేధోపర సంపదల సంస్థ, యునెస్కోలలో సలహా రూపక హోదా ఉంది. ప్రపంచంలోని సభ్యదేశాల్లో మేధోపర హక్కులను ఉల్లంఘనలు ఏర్పడినప్పుడు అంతర్జాతీయ సమాజాన్ని జాగృతం చేసి వివిధ ప్రభుత్వాలను, విశ్వవ్యాప్త సంస్థలను ప్రభావితం చేస్తుంది. ఇదే విధంగా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ అఫ్ యాక్టర్స్-మ్యుజీషియన్స్, ఇంటర్నేషనల్ ప్రెస్, యూనివర్సిటీ ప్రొఫెసర్స్-లెక్చరర్స్ అసోసియేషన్ మొదలైన ఉద్యమాలు కూడా మేధోస్వేచ్ఛకు పోరాడుతున్నాయి. వీటిలో వరల్డ్ కాన్ఫెడరేషన్ అఫ్ టీచింగ్ ప్రొఫెషన్స్ అనే సంస్థ కృషి గణనీయమైనది.

## 12.10 ముగింపు :

మానవ హక్కుల ఉద్యమాలు వివిధ హక్కుల ఉల్లంఘనలను వివిధ ప్రభుత్వాల వద్ద, అంతర్జాతీయ సమాజం ముందు ప్రస్తావించి ప్రజలను జాగృతం చేశాయి. వివిధ ప్రాంతీయ మానవ హక్కుల కమీషన్ల ముందు, అంతర్జాతీయ సంస్థల వద్ద ఉల్లంఘనలను తెలిపాయి. ఐక్యరాజ్యసమితి ఈ ఉద్యమాల కృషిని గుర్తించింది. ఈ గుర్తింపు ఆర్థిక సాంఘిక సమితి ద్వారా జరుగుతుంది. ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధానంతరం మానవ హక్కుల రంగంలో ఈ ఉద్యమాల కృషికి అవిపొందిన నోబెల్‌శాంతి పురస్కారం తార్కాణం. ఈ ఉద్యమాల ఫలితంగా ఎన్నో అంతర్జాతీయ ఒడంబడికలు, ఒప్పందాలు వచ్చాయి. ఈ ప్రభుత్వేతర సంస్థలు అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటుకు మానవాళిపై ఒత్తిడి తెస్తున్నాయి.

BRAOU

## 12.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. మానవ హక్కుల ఉద్యమాల లక్షణాలను, స్వభావాలను సంగ్రహంగా పరిశీలించండి.
2. మానవ హక్కుల పరిరక్షణలో ఆమ్నెస్టీ పాత్రను వివరించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ఇంటర్నేషన్ రెడ్ క్రాస్ గురించి వివరించండి.
2. మేధోపరమైన స్వేచ్ఛ ఉద్యమాలను తెలపండి

BRAOU

# భాగం – 13 : మానవ హక్కుల కమీషన్లు

విషయక్రమం :

13.0 ఉద్దేశం

13.1 పరిచయం

13.2 ఐక్యరాజ్యసమితి – మానవ హక్కుల కమీషన్లు

13.2.1 ఐక్యరాజ్యసమితి – మానవ హక్కుల కమీషన్

13.2.2 ఐక్యరాజ్యసమితి – మానవ హక్కుల కమిటీ

13.2.3 ఐక్యరాజ్యసమితి – మానవ హక్కుల కమీషనర్

13.2.4 అంతర్జాతీయ కార్మిక సంస్థ

13.2.5 అంతర్జాతీయ మహిళా కమీషన్

13.2.6 అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం

13.3 యూరోపియన్ మానవ హక్కుల కమీషన్

13.3.1 యూరోపియన్ మానవ హక్కుల ఒప్పందం

13.4 అంతర్ అమెరికా దేశాల మానవ హక్కుల కమీషన్

13.4.1 మానవ హక్కుల పై అమెరికా ప్రాంత దేశాల ఒప్పందం

13.5 ఆఫ్రికన్ మానవ ప్రజా హక్కుల కమీషన్

13.5.1 ఆఫ్రికన్ దేశాల మానవ హక్కుల పత్రం

13.6 జాతీయ మానవ హక్కుల కమీషన్

13.7 ముగింపు

13.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 13.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమీషన్లు గూర్చి వివరించగలుగుతారు.
- ఆఫ్రికాన్ మానవ ప్రజా హక్కుల కమీషన్ గూర్చి తెలుసుకుంటారు.
- యురోపియన్ మానవ హక్కుల కమిషన్ పనితీరును తెలుసుకుంటారు.

## 13.1 పరిచయం :

మానవ హక్కుల పై రెండో ప్రపంచ యుద్ధానంతరం ప్రజల్లో ఎంతో అవగాహన ఏర్పడింది. ఈ అవగాహనను గుర్తించిన ఎన్నో రాజ్యాలు, మరెందరోమేధావులు మానవ హక్కుల కల్పనకు, వాటి అమలుకు, ఆ అమలును విశ్లేషించడానికి యంత్రాంగాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఆ ప్రయత్నాల ఫలితంగా స్థానికంగా, జాతీయంగా, ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో కమీషన్లు, వాటినిర్మాణం, కార్యకలాపాల

పరిధి మొదలైన అంశాలు అధ్యయనం చేయడం ద్వారా స్థానికంగా- జాతీయంగా పనిచేసే కమీషన్ల స్వభావం కూడా తెలుసుకొవచ్చు. గ్లోబల్‌స్థాయిలో ఉన్న ఈ కమీషన్లు నిర్మాణపరంగా, విస్తరిస్తున్న కార్యకలాపాల పరుధుల పరంగా ఎంతో ప్రాముఖ్యాన్ని పొందాయి. వీటిలో కొన్ని అంతర్జాతీయ స్థాయిలో స్వతంత్ర దేశాల సభ్యత్వం ప్రాతిపదికన ఏర్పాటు కాగా, మరికొన్ని వివిధ ఖండాల్లో వారి ప్రాంతీయ ఒప్పందాల మూలంగా ఏర్పాటైనాయి. మరొక అంశం మానవ హక్కుల ఉల్లంఘన సందర్భాల్లో ఫిర్యాదులు స్వీకరించే పద్ధతుల్లో కూడా వీటి మధ్య భేదాలు ఉన్నాయి. కొన్ని కమీషన్లకు వాటి పరిధిలోని ప్రజలు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉండగా, మరికొన్ని కమీషన్లు తాము గుర్తించిన ఉల్లంఘన సందర్భాలను సభ్యదేశాల వద్ద ఉటంకించి నివారణోపాయాలు తెల్పుతాయి. వీటిలో ప్రపంచ స్థాయిలో ఐక్యరాజ్య సమితి నీడన పనిచేసే కమీషన్లు కొన్ని ఉన్నాయి.

1. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమీషన్ (1946) 2. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిటీ (1966) 3. అంతర్జాతీయ కార్మిక సంస్థ 4. అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం 5. ఐక్యరాజ్యసమితి మహిళ కమీషన్ మొదలైనవి.

ఇక ప్రాంతీయ స్థాయిలో వివిధ ఖండాల దేశాల ప్రభుత్వాలు, ప్రజలు ఒప్పందాల ప్రాతిపదికన కొన్ని కమీషన్లను నిర్మించుకున్నారు. వీటిలో 1. యూరోపియన్ మానవ హక్కుల కమీషన్ 2. అమెరికా ఖండ అంతర్ రాజ్యల మానవ హక్కుల కమీషన్ 3. ఆఫ్రికా దేశాల మానవ, ప్రజా హక్కుల కమీషన్ 4. జాతీయ మానవ హక్కుల కమీషన్‌మొదలైనవి ఉన్నాయి. ఇక వీటి నిర్మాణం, స్వభావం, పరిధి, పనితీరు మొదలైన అంశాలను పరిశీలిద్దాం.

## 13.2 ఐక్యరాజ్యసమితి వివిధ మానవ హక్కుల కమీషన్లు :

BRAOU

ఐక్యరాజ్యసమితి తన ప్రధానంగమైన ఆర్థిక సాంఘిక మండలి (Economic and Social Council) సహాయంతో మానవ హక్కులను పర్యవేక్షిస్తుంది. 1945లో తన ప్రకటనలో మానవ హక్కులను ప్రస్తావిస్తూ, అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, మానవ సంబంధ సమస్యలను పరిష్కరించే దిశలో మానవ హక్కుల అభివృద్ధి, పరిరక్షణ చేసి తద్వారా మత, భాష, లింగ, జాతి విభేదాలు లేకుండా ప్రజలకు మౌలిక స్వాతంత్రాలు సమకూర్చడమే తన ధ్యేయమని.. తెలిపింది. (ఆర్టికల్ 55)

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల పై తనకుగల గౌరవాన్ని, మక్కువను 1948లో ప్రపంచ హక్కుల ప్రకటన (Universal Declaration of Human Rights) ద్వారా వ్యక్త పరచింది. దీని ప్రాతిపదికన ఎన్నోదేశాలు, ముఖ్యంగా మూడో ప్రపంచదేశాలు తమ రాజ్యాంగాల్లో ప్రాథమిక హక్కులకు స్థానం కల్పించాయి. 1948 మానవ హక్కుల ప్రకటనలోని 3వ నిబంధన నుంచి 28వ నిబంధన వరకు వ్యక్తి, సామాజిక జీవనంలో అవసరమయ్యే ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులు పేర్కొంది.

మానవ హక్కులను పౌర, రాజకీయ హక్కులుగాను, ఆర్థిక, సాంఘిక సాంస్కృతిక హక్కులుగాను విభజించి, వాటి పరిరక్షణకు సభ్యరాజ్యాల అనుమతి పొందే నిమిత్తం 1966లో రెండు అంతర్జాతీయ ఒప్పందాల ముసాయిదాలను తయారు చేసింది. అదే క్రమంలో నిర్బంధశ్రమ (వెట్టిచాకిరి) నిరోధక ఒప్పందం, జాతి విధ్వంసక నిరోధక ఒప్పందం, మహిళలు, బాలికల అక్రమవ్యాపారం- వ్యభిచార నిరోధక ఒప్పందం, కాందిశీకుల స్థాయి ఒప్పందం, వర్ణవివక్షణ వ్యతిరేక ఒప్పందం, బాలల హక్కుల ఒప్పందం, సమగ్ర అణు పరీక్షల నిరోధక ఒప్పందం మొదలైనవి కొన్ని మాత్రమే.

ఐక్యరాజ్య సమితి కొన్ని ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, మానవ హక్కుల పట్ల తనకు గల గౌరవాన్ని చాటు కుంది. అంతర్జాతీయ స్థాయిలో శాంతి నెలకొనడానికి ప్రజల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు సరిగా ఉండడం ఎంతైనా అవసరమని సమితి భావిస్తుంది. పరిస్థితిని సరిచేయడం వ్యక్తులకు హక్కులతో

సాధికారత చేకూర్చడం ద్వారా మాత్రమే సాధ్యమని నమ్ముతుంది. ఈ క్రమంలో హక్కులు-శాంతికి గల సంబంధం లక్ష్యాలు-సాధనాల సంబంధంగా గుర్తెరిగింది. ప్రపంచ శాంతి అనే వినూత్న లక్ష్యానికి మానవ హక్కులు సాధనాలుగా ఎంచి, శ్రమిస్తోంది. అంతేకాక శాంతి లక్ష్యాలకు అనుబంధంగా మరెన్నో లక్ష్యాలను నిర్దేశించుకుంది.

పైన ఉదహరించిన లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థిక సాంఘిక సమితి మానవ హక్కుల పరి రక్షణకు కొన్ని కమీషన్లు ఏర్పాటు చేసింది. ఇవి 1. మానవ హక్కుల కమీషన్ 2. అల్ప సంఖ్యా వర్గ వివక్ష నిరోధక పరిరక్షక ఉప కమీషన్ 3. మహిళా స్థాయి, హోదా కమీషన్ 4. నేర నిరోధక-నియంత్రణ కమిటి 5. సాంఘిక అభివృద్ధి కమీషన్ ఈ కమిటీలు- కమీషన్లు కాలనుగతంగా మానవ హక్కులకు సంబంధించిన అంశాలపై నివేదికలు తయారు చేసి ఆర్థిక సాంఘిక మండలికి, తద్వారా ఐక్యరాజ్యసమితి సాధారణ సభకు బాధ్యతవహిస్తాయి.

ఇవే కాక ఐక్యరాజ్యసమితి వివిధ అంశాల పై చేసిన ఒడంబడికల అమలును పర్యవేక్షించేందుకు ఇతర కమిటీలను కూడా నియమించారు. వీటిలో

1. అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడిక (1966)ను అమలును పర్యవేక్షించడానికి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల కమిటీ (1985),
2. అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడిక (1966)ను పర్యవేక్షించడానికి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిటి (1976),
3. అంతర్జాతీయ బాలల హక్కుల ప్రకటన (1959)ని పర్యవేక్షించడానికి బాలల హక్కుల కమిటీ (1990),
4. మహిళలపై అన్నిరకాల వివక్షలను నిరోధించే అంతర్జాతీయ ఒడంబడిక (1979) అమలు తీరును పర్యవేక్షించడానికి మహిళ వివక్ష నిరోధక కమిటీ (1979)
5. అంతర్జాతీయ సకల జాతీవర్ణ వివక్ష విధానల నిర్మూలన ఒడంబడిక(1965) పర్యవేక్షణకు వర్ణ వివక్ష విధానాల నిర్మూలన కమిటి (1969)
6. అంతర్జాతీయ అమానవీయ, క్రూర చిత్రహింస వ్యతిరేక ఒప్పందం (1984)ను పర్యవేక్షించడానికి చిత్రహింసల వ్యతిరేక కమిటి (1987)
7. అంతర్జాతీయ జాతివివక్ష అణుపు-శిక్షల ఒడంబడిక (1973)ను గురించి గ్రూప్ ఆఫ్ త్రీ (Group of Three) 1976 అనే త్రిసభ్య సంఘం (జాతి వివక్షకు వ్యతిరేకంగా) ఏర్పాటు చేసింది.

ఈ కమిటీలు వివిధ అంశాలపై ఉన్న అంతర్జాతీయ ఒడంబడికల అమలు తీరును పర్యవేక్షిస్తాయి.

వీటిలో కొన్ని మానవ హక్కులపై సంగ్రహంగా, అన్ని అంశాలపై, విచారణ, పరిశోధన, వివరణ, అవగాహన, ప్రచారం కల్పిస్తాయి. వాటిని పరిశీలిద్దాం.

BRAOU

## 13.2.1 ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమీషన్

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమీషన్‌ను ఆర్థిక సాంఘిక సమితి ఫిబ్రవరి16, 1946 లో ఏర్పాటు చేసింది. సమితికి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలు, ఒప్పందాలు, మొదలైన అంశాలుపై సమాచారం అందించడానికి, అల్పసంఖ్యాకుల పరిరక్షణ, జాతి, లింగ, మత, బాషా భేదాలకు అతీతంగా మానవ హక్కుల అభివృద్ధి, ఇతర అంశాల పై నివేదికలు తయారు చేయడానికి దీనిని ఏర్పాటు చేశారు.

ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు దీనిలో సభ్యులుగా ఉంటాయి. ఈ సమితి అనేక ఉప కమీషన్లు, కమిటీలు, తాత్కాలిక కమిటీలతో పని చేస్తుంది. ఉదాహరణకు ఎన్నో తాత్కాలిక కమిటీలు చిలీ ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతాలు, నమీబియా, రొడిషియా మొ..న రాజ్యాల్లో మానవ హక్కుల ఉల్లంఘనపై ఏర్పడ్డాయి.

ఈ కమీషన్ మానవ హక్కుల ఉల్లంఘనల పై ఫిర్యాదులను (సమాచారాలను) స్వీకరిస్తుంది. అయితే ఈ ఉల్లంఘనలు ఒక వ్యవస్థలో..సామూహికంగా నిరంతరాయంగా జరిగే ఉల్లంఘన..ల స్వభావం కలిగి ఉండాలి. (a Consistent Pattern of Gross Violation) వ్యక్తిగతమైన ఫిర్యాదులు స్వీకరించదుకానీ ఆఫిర్యాదులు సామూహిక హక్కుల ఉల్లంఘన సరంపరలో భాగమైతే స్వీకరిస్తుంది. ఇక రెండోది, ఫిర్యాదులలో ఏయే హక్కుల ఉల్లంఘన జరిగిందో స్పష్టంగా తెలియ జేయాలి. ఉల్లంఘనకు గురైన హక్కు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనలో (1948) కానీ, వర్ణవివక్షణ నిరోధక ఒప్పందం (1965) లో కానీ, ఖైదీల కనీస ప్రామాణిక నిబంధన ఒప్పందం (1957)లో కానీ, అంతర్జాతీయ ఆర్థిక సాంఘిక సాంస్కృతిక హక్కుల ఒడంబడిక (1966)లోకానీ, అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడిక (1966)లో కాని ప్రస్తావించి ఉండాలి.

మూడోది, ఫిర్యాదును ఎవరైనా చేయవచ్చు ఉల్లంఘనకు సంబంధిన ఫిర్యాదులు ఒక వ్యక్తి కానీ, ఒక బృందం కానీ, ఒక సమూహం కానీ, ఒక సంస్థకానీ ఎవరైనా హక్కుల ఫిర్యాదులు చేయవచ్చు. ఆఫిర్యాదు వెంట ఉల్లంఘన జరిగినట్లు ఆధారాలుచూపాలి అంటే విశ్వసనీయ సమాచారం కానీ, పరోక్ష సమాచారంకానీ ఫిర్యాదుకు మద్దతుగా జోడించాలి.

నాలుగోది, ఫిర్యాదుకు మరే విధమైన న్యాయం జరిగే అవకాశం లేనప్పుడు మాత్రమే ఐక్యరాజ్యసమితి మానవ హకుల కమీషన్ స్వీకరిస్తుంది అంటే హక్కుల ఉల్లంఘనను విచారించే అన్ని రకాల న్యాయ పద్ధతులు ముగిసినప్పటికీ, న్యాయం జరగనట్లు భావిస్తే మాత్రమే ఫిర్యారును అనుమతిస్తారు అంటే ఫిర్యాదుదారులు తమ దేశంలోను, బయట వివిధ న్యాయ మార్గాల ద్వారా ప్రయత్నించాలి. చివరి అవకాశంగా మాత్రమే ఫిర్యాదును కమీషన్ స్వీకరిస్తుంది. అలాగే మిగిలిన మార్గాల్లో న్యాయం సమర్థవంతంగా లేనప్పుడు, విపరీత జాప్యం జరుగుతున్నప్పుడు కమీషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

ఫిర్యాదును స్వీకరించిన తరువాత కమీషన్ దానిపై విచారణ జరుపుతుంది. ఆ విచారణలో ఒక రాజ్యవ్యవస్థ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు రుజువైతే, దానిపై ఎలాంటి చర్య తీసుకోడానికైనా కమీషన్‌కు అధికార ముంటుంది. ఈ చర్య స్వభావం, పద్ధతి కమీషన్ స్వయం నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. అలాగే కొన్ని సందర్భాలో చర్య తీసుకొన కుండా కూడా ఉండవచ్చు.

BRAOU

### 13.2.2 ఐక్యరాజ్యసమితి మానవ హకుల కమిటీ

ఈ కమిటీ అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం (1966) పర్యవేక్షణకు 1976లో ఏర్పాటైంది. ఒప్పందంలోని నిబంధనలకు, దానిలో అంతర్భాగమైన ఆప్షనల్ ప్రాటోకాల్ (Optional Protocol)కు సమ్మతించే దేశాలు దీనిలో సభ్యదేశాలు ఈ సభ్యత్వం మూడు రకాలుగా ఉంటుంది. మొదటిది అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందంపై సంతకం చేసే దేశాలు రెండోది, ఈ ఒప్పందంలో అంతర్భాగమైన మొదటి ప్రాటోకాల్‌పై సంతకం చేసే దేశాలు. మొదటి ప్రాటోకాల్ ప్రకారం వివిధ దేశాల్లోని ప్రజలు, సంస్థలు, బృందాలు తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. ఈ నిబంధనకు సమ్మతించే దేశాలు మొదటి ప్రాటోకాల్‌దేశాలు మూడోది, ఈ ఒప్పందంలో అంతర్భాగమైనరెండో ప్రాటోకాల్‌సభ్యదేశాలు. ఈ రెండో ప్రాటోకాల్ ప్రకారం సభ్యదేశాలు తమ దేశాల్లో మరణ శిక్షను రద్దు చేయాలి. ప్రపంచంలో దాదాపు 141దేశాలు దీనిలో సభ్యదేశాలు రెండో ఆప్షనల్ ప్రాటోకాల్స్‌కు 5 మాత్రమే సభ్య దేశాలు.

మానవ హక్కుల కమిటీలో 18 మంది నిపుణులు ఉంటారు. ఈ నిపుణులు భౌగోళిక ప్రాతిపదికన ఉంటారు. ఒప్పందం మొదటి ప్రాటోకాల్ ప్రకారం వ్యక్తులు, సంస్థలు తమ దేశాల్లో జరిగే రాజకీయ, పౌర హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చు. అలాకాక ప్రాటోకాల్స్ పై సంతకం చేయక, కేవలం

ఒప్పందం పై మాత్రమే సంతకం చేసిన దేశాలు వార్షికంగా, కాలనుగతంగా తమ దేశాల్లోని పౌర, రాజకీయ హక్కులపై నివేదికలు అందించాల్సి ఉంటుంది. అలాగే ఇతర దేశాల్లోని ప్రజల మానవ హక్కుల ఉల్లంఘనపై ఒక దేశం ఫిర్యాదు చేయవచ్చు. అలాంటి అన్ని సందర్భాల్లోనూ,మానవ హక్కుల కమిటీ రాజ్య ప్రతినిధితో సమావేశమై నిజానిజాలు విచారించి నిర్మాణాత్మక సూచనలు ఇస్తుంది.

అలాగే ఆప్షనల్ ప్రొటోకాల్ దేశాల్లోని వ్యక్తులు చేసిన ఫిర్యాదులకు సంబంధించి రహస్య విచారణ జరుపుతుంది. వ్యక్తులు తమ దేశంలోని న్యాయవ్యవస్థలిన్నింటిలోను న్యాయం కోసం ప్రయత్నించి, విఫలమైనప్పుడు మాత్రమే కమిటీకి ఫిర్యాదు చేయాలి. ప్రతి సంవత్సరం దాదాపు ఇరవై వేలకు పైగా ఫిర్యాదులు మానవ హక్కుల కమిటీకి అందుతాయి.

## 13.2.3 ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమీషనర్

1993లో ప్రపంచ మానవ హక్కుల సమావేశం (వియన్నా కాన్ఫరెన్సు) స్ఫూర్తితో, మానవ హక్కుల కోసం పోరాడే కమీషన్లు, కమిటీలు, రాజ్యాలు, ప్రభుత్వేతర సంస్థలు, ప్రాంతీయ సంఘాల ప్రయత్నాలను సమన్వయం చేయడానికి 1994లో ఏర్పాటైంది. ఈ హై కమీషనర్ వివిధ దేశాలు, కల్లోలిత ప్రాంతాల్లోని మానవ హక్కులపై సమావేశాలు నిర్వహించి ఐక్యరాజ్యసమితికి నివేదిక సమర్పిస్తాడు. ముఖ్యంగా 1995 తరువాత రువాండ, బోస్నియా గెర్జగోవినా వంటి ప్రజాసమూహాల మానవ హక్కుల పై నివేదికలు తయారు చేయడమేకాక, వాటి పరిరక్షణకు చర్యలు సూచిస్తాడు. పదవీకాలం 4 సంవత్సరాలు. సభ్యదేశాలు మానవ హక్కుల ఒప్పందాలపై సంతకాలు చేసేలా ప్రయత్నాలు జరపడం మానవ హక్కుల అమలును పటిష్టపరిచే సూచనలు ఇవ్వడం, హక్కుల ఉల్లంఘనలు తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు రాజ్యాల దృష్టికి సమస్యలు తీసుకు వచ్చి పరిస్థితి సరిచేయడం, ప్రజాస్వామ్యందిశగా సభ్యదేశాలను ప్రోత్సహించడం, ఐక్యరాజ్యసమితిలో మానవ హక్కుల పై పోరాడే వివిధ కమిటీలు, కమీషన్లు, ప్రత్యేక కమిటీలు, ప్రతినిధుల కృషిని సమన్వయం చేయడం, చిత్రహింసలు, వ్యక్తులు నిర్బంధంగా అదృశ్యం కావడం లాంటి అంశాలను విచారించడం, వియన్నా సమావేశం కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం హై కమీషనర్ ప్రధాన విధులు.

BRAOU

## 13.2.4 అంతర్జాతీయ కార్మిక సంస్థ

ప్రపంచంలో శాశ్వతమైన, సార్వజనీనమైన శాంతి సాంఘిక న్యాయం ద్వారా మాత్రమే సాధ్యమౌతుందనే ప్రాథమిక లక్ష్యంతో 1919లో ఏర్పాటైంది. 1946లో ఒక ప్రత్యేక సంస్థగా మారింది. ప్రపంచశాంతి ప్రాతిపదిక అయిన సాంఘిక న్యాయం మానవ హక్కుల ద్వారానే లభిస్తుందని విశ్వసిస్తుంది. సామాజిక న్యాయంలో భాగంగా కర్మాగారాలు, గనులు, ఇతర రంగాల్లోని వ్యవస్థీ కృతమైన, కాని రంగాల్లో కార్మికుల హక్కులను గౌరవించాలని తెలుపుతుంది. పని ప్రదేశాల్లో సమానత్వం, వివక్ష లేక పోవడం లక్ష్యాలుగా కార్మికుల పనిపరిస్థితుల మెరుగుకు ఎన్నో అంతర్జాతీయ ప్రకటనలు, ఒడంబడికలు, ముసాయిదాలు తయారు చేసింది. శ్రమను వస్తుపరంచేయడం, భావ ప్రకటన స్వేచ్ఛ-సంస్థలను నిర్మించుకునే స్వేచ్ఛ లేకుండా చేయడం వంటి వాటి పై పోరాటం సాగిస్తుంది. కర్మాగారాల్లో శ్రామిక యాజమాన్య సంబంధాలు ప్రజాస్వామ్యీకరణ (Democratise) కావాలని వాదిస్తుంది. వర్ణ వివక్షణ నిరోధం, సమాన అవకాశాలు, సామూహిక బేరసారాలు, సంస్థలను ఏర్పరచుకునే స్వేచ్ఛలకై పోరాడుతుంది. బాలకార్మిక వ్యవస్థలను అడ్డుకోవడం, స్త్రీ పురుషులకు సమాన వేతనాలు, పదవీ విరమణ చేసిన కార్మికుల సంక్షేమం మొదలైన అంశాలపై అంతర్జాతీయ ముసాయిదాలను, ఒప్పందాలను తయారు చేసింది. పనిప్రదేశాల్లో రాజకీయ

అభిప్రాయం, జాతీయత, సాంఘిక మూలం, మతం, లింగం, వర్ణం ప్రాతి పదికన విచక్షణను వ్యతిరేకిస్తుంది.

అంతర్జాతీయ కార్మిక సంస్థకు కార్మిక సంఘాలు హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయవచ్చు. వాటిపై విచారణ జరిపి సభ్యదేశాలకు సూచనలు అందిస్తుంది. తూర్పుయూరోప్‌లో రష్యా, ఛకోస్లేవియా మొదలైన దేశాలు సామ్యవాద రాజ్యవ్యవస్థల్లో ఉన్నప్పుడు ఎన్నో కార్మిక సంఘాల గుర్తింపుకు, సమాన అవకాశాలకు, స్త్రీ పురుష సమానత్వానికి పోరాడింది. పశ్చిమ జర్మనీలో ప్రభుత్వం బెరూఫ్ స్వేర్ బోట్ (Beruf Swer bot) పాలన విధానం పేరుతో రాజకీయ కారణాలపై కొంతమందిని ప్రభుత్వ ఉద్యోగాల్లోకి అనుమతించక పోవడాన్ని విమర్శించింది. ఎన్నో దేశాలలో కర్మాగారాలు బాలకార్మికులను ప్రోత్సహించడం, వారిని ప్రమాదకర యంత్రాలు-పరిస్థితుల వద్దపని చేయించడం, వారిపై భౌతిక, లైంగిక అత్యాచారాలకు, హింసకు పాల్పడం వంటి వాటి నిరోధానికి కృషి చేస్తూంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ తన వార్షిక నివేదికను ఐక్యరాజ్యసమితి సాధారణ సభకు సమర్పిస్తుంది. అంతేకాక వివిధ దేశాల్లోని కార్మికుల పని పరిస్థితులపై సర్వేలు నిర్వహించి నివేదికలు నివేదికలు తయారు చేస్తుంది.

### 13.2.5. అంతర్జాతీయ మహిళ కమీషన్:

అంతర్జాతీయ మహిళ గౌరవహోదా కమీషన్ (UN Commission on the states on women) 1946 లో ఆర్థిక సాంఘుకసమితి ద్వారా ఏర్పాటైంది. కాలానుగతంగా ఐక్యరాజ్య సమితికి వివిధ దేశాల్లోని మహిళల స్థితిగతులపై నివేదికలు తయారు చేయడానికి, మహిళల రాజకీయ, విద్య, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల పునరుద్ధరణలో భాగంగా సమానత్వం, విపక్ష నిరోధం భూమికగా అంతర్జాతీయ ఒడంబడికలు తయారు చేయడానికి, వివిధ దేశాల్లోని మహిళల హక్కుల ఉల్లంఘనలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తెచ్చి సరిచేయడానికి, మహిళా సమస్యల పై అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించడానికి ఏర్పాటైంది.

హక్కుల ఉల్లంఘనలు వ్యక్తి గతంగా గానీ సంస్థల రూపంలో కానీ కమీషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. సభ్య దేశాల నుంచి వాటిపై వివరణలు పొంది, నిర్మాణాత్మక సూచనలు చేస్తుంది.

ఈ కమీషన్‌లో 45 మంది సభ్యులుంటారు. వీరిని ఆర్థిక సాంఘిక సమితి సభ్యులు ఎన్నుకుంటారు. వీరిలో 13 మంది ఆఫ్రికా నుంచి, 11 మంది ఆసియా నుంచి, 4 మంది తూర్పుయూరోప్ నుంచి, 9 మంది లాటిన్ అమెరికా దేశాలనుంచి 8 మంది పశ్చిమ యూరోప్ ఇతర ప్రాంతాలనుంచి వుంటారు.

ఈ కమీషన్ పరిధిలో వివిధ అంశాలపై వర్కింగ్ గ్రూపులు పనిచేస్తూవుంటాయి. ఇటీవల ఉద్యోగినులపై పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, గృహహింస, వివక్షలు మొదలైన అంశాలపై నివేదికను వెలు వరించింది. మహిళా ఉద్యోగినులకు మెటర్నిటీ సౌకర్యాలు, సర్వీసుభద్రత, పన్నుల రాయితీలపై పలుసూచనలు చేసింది.

### 13.2.6 అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం

నిజానికి అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటుకై సభ్యదేశాల మధ్య చర్చ జరుగుతోంది. 1998 జూలై 17న రోమ్‌లో 120 దేశాలు ఒక తీర్మానాన్ని ఆమోదిస్తూ అంతర్జాతీయ స్థాయిలో జరిగేనేరాలకు ఒక న్యాయస్థానం ఉండాలని భావించాయి. అంతర్జాతీయలా కమీషన్ సిఫార్సుమేరకు ఈ న్యాయ స్థానం ఏర్పాటు చేయాలని భావించి ఒక తాత్కాలిక చట్టాన్ని ఆమోదించాయి. ఈ కోర్టు తన పరిధిలో నాలుగు రకాల నేరాలను విచారిస్తుంది. 1. జాతి విధ్వంసక మారణహోమం మానవాళికి వ్యతిరేకమైన నేరాలు 3. యుద్ధ నేరాలు 4. దురాక్రమణనేరాలు ఈ కోర్టు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన చట్రంలో ఏర్పాటైనప్పటికీ, విధి విధానాలు ఎలా ఉండాలనే అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. కెనడా, జర్మనీ, బ్రిటన్ దేశాలు భద్రతామండలి

BRAOU

ప్రభావం సైతం దీనిపై లేకుండా సర్వస్వతంత్రంగా పూర్తి స్వయంప్రతిపత్తిలో పనిచేయాలని అభిలషిస్తుండగా, అమెరికా, చైనా, ఫ్రాన్స్ దేశాలు భద్రతా మండలికి అనుబంధంగా పనిచేస్తూ, మండలి వీటో విధానానికిలో బడి కోర్టు పనిచేయాలని సూచిస్తున్నాయి. ఇరాన్, ఇరాక్, లిబియా, ఇటీవలే భారత దేశం అసలు కోర్టు అవసరమే లేదని భావిస్తున్నాయి. దీని ప్రకారం ప్రజలు పైన పేర్కొన్న నేరాలు జరిగిన సందర్భంలో అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. వ్యక్తులు కానీ, సంస్థలు కానీ, సమూహాలుకానీ, పొరుగు దేశాలు కానీ ఒక దేశంలో జరిగే మానవ హక్కుల ఉల్లంఘనను కోర్టు దృష్టికి తేవచ్చు.

అయితే ఈ కోర్టు ఏర్పాటుకు ఆలస్యం జరగవచ్చు. కోర్టు ఏర్పాటులో భాగంగా కోర్టు విది విధానాల ఒప్పందాన్ని సభ్యరాజ్యాలు ( కనీసం 60 దేశాలు) ఆమోదించాలి. అయితే ఇప్పటి వరకూ 2 దేశాలు మాత్రమే ఆమోదించాయి.

## 13.3 యూరోపియన్ మానవ హక్కుల కమీషన్:

యూరోపియన్ మానవ హక్కుల కమీషన్ (European Commission of Human Rights) 1955 లో ఏర్పాటైంది. ఐరోపాఖండంలోని 32 దేశాలతో ఏర్పాటైన కౌన్సిల్ ఆఫ్ యూరోపియన్ 1954 సం.. లో ఐరోపాలో మానవ హక్కుల ఒప్పందాన్ని అంగీకరించింది. ఆ ఒప్పందంలో భాగంగా యూరోపియన్ మానవ హక్కుల కమీషన్ (European Commission of Human Rights) ఏర్పడింది. దీనిలో సభ్యదేశాల్లోని నేరాలపై విచారణ జరిపేందుకు ఒక న్యాయస్థానం కూడా ఏర్పాటు చేశారు. దానినే ఐరోపా మానవ హక్కుల న్యాయస్థానం (European Commission of Human Rights).

సభ్యదేశాల్లోని పౌరులు, పౌరసంఘాలు, సంస్థలు, రాజ్యాలు, ప్రభుత్వేతర సంస్థలు యూరోపియన్ మానవ హక్కుల ఒప్పందం (European Commission of Human Rights & II Protocob), మరి పదకొండు అనుక్రమణికల్లో పేర్కొన్న హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నట్లు భావిస్తే ఈ కమీషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదును వ్యక్తులేకాక, రాజ్యాలుకూడా పొరుగురాజ్యాలపై చేయవచ్చు. ఈ నిబంధన నేపథ్యాన్ని గమనిస్తే, రెండో ప్రపంచ యుద్ధకాలంలో కొన్ని యూరోపు దేశాల్లో ఫాసిజం, నాజిజం లాంటి అధికారయుతవాదాలు ప్రబలి, మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పటికీ పొరుగు రాజ్యాలు ఉదాసీనంతో వ్యవహరించడం ఫలితంగా లక్షలాదిమంది ప్రజలు జీవించే హక్కును కోల్పోయి, నిరాశ్రయులై జీవించడం మొదలైన అంశాలు స్ఫురిస్తాయి. అలాంటి సందర్భాలు తలెత్తకుండా కాలానుగతంగా మానవ హక్కుల పట్ల అప్రమత్తతతో వ్యవహరించడానికి, ఒక రాజ్యంలో జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలపై మరో రాజ్యం ఫిర్యాదు చేయవచ్చనే నిబంధన చోటు చేసుకుంది.

అలాగే యూరోపు ఖండంలోని 32 దేశాల పౌరులు తమ హక్కుల ఉల్లంఘనను ఈ కమీషన్ ఎదుట ప్రస్తావించవచ్చు. ఈ దేశాల్లోని రాజ్యాంగాలు, దేశాల మధ్య మానవ హక్కుల ఒప్పందానికి అనుగుణంగా సవరణలు చేయబడ్డాయి. అందువల్ల అన్ని దేశాల ప్రజలకు ఒకే ప్రామాణికతతో హక్కులు ఉంటాయి. వ్యక్తిగతమైన కేసుల నుంచి, సామూహిక దురంతాల వరకు అన్ని ఉల్లంఘనలపైన పౌరులు ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఫిర్యాదుదారుడు మొదటగా తమదేశంలో అన్ని న్యాయ అవకాశాలు వినియోగించుకొని, విఫలమై చివరి అవకాశంగా మాత్రమే కమీషన్‌ను ఆశ్రయించాలి. ఫిర్యాదు దారుడు వ్యక్తిగతంగా హక్కుల ఉల్లంఘనకు గురైనా, అతని బంధువు గురైనా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే వ్యక్తుల తరఫున న్యాయవాదులు కేసు దాఖలు చేయవచ్చు. అలాగే వ్యక్తికి ఏ హక్కులో ఉల్లంఘన జరిగిందో స్పష్టంగా పేర్కొనాలి. దానికి తగిన సమాచారం, అనుబంధాలు

BRAOU

ఫిర్యాదుకు జత చేయాలి.

### 13.3.1 యూరోపియన్ మానవ హక్కుల ఒప్పందం

(European Convention on Human Rights (1950)) : ఈ ఒప్పందంలో 66 నిబంధనలు, 11 అనుక్రమణికలు (Protocob) ఉన్నాయి. దాని ప్రవేశిక, సెక్షన్ ఒకటిలో 11 రకాల హక్కులను స్థూలంగా మానవ హక్కులుగా నిర్వచించారు. 7 రకాల ఆచారణ పద్ధతులను తెలిపారు. జీవించే హక్కు, చిత్రహింస, బానిసత్వం నుంచి స్వేచ్ఛ హక్కు, స్వేచ్ఛ, వ్యక్తి భద్రత హక్కు, నిష్పాక్షిక విచారణ, యుక్త ప్రక్రియల హక్కు, నిర్ణయాత్మక హక్కులు, సమావేశస్వేచ్ఛ, భావప్రకటన, వాక్ స్వాతంత్ర్యాలు, మతస్వేచ్ఛ, కుటుంబ జీవన హక్కు మొదలైనవి.

ఆర్టికల్ 25 ప్రకారం, ఒప్పందంలో భాగంగా పౌరుల ఫిర్యాదును విచారించే హక్కు కమీషనుకు ఉన్నట్లు రాజ్యాలు గుర్తించాలి. వ్యక్తుల ఫిర్యాదుల పై కమీషనుకు గల విచారణ హక్కును గుర్తి... ...జ్యాల్లోని ప్రజలు ఫిర్యాదులు చేయడానికి అనర్హులవేతారు.

దీనిలో ఒప్పందం ప్రకారం కమీషను విచారణ జరిపిన అంశాలపై తీర్పు మూడు రకాలుగా ఉంటుంది. 1. కక్షిదారుల మధ్య స్నేహ పూర్వక రాజీ 2. మానవ హక్కుల కోర్టు ఇచ్చే తీర్పు 3. కమీషనులో భాగమైన మంత్రుల కమిటీ నిర్ణయం.

నిజానికి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన కంటె కూడా ఈ ఒప్పందానికి నిర్ణయాత్మక పాత్ర ఉంది. ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం, పరిహారం అందజేయడంలో కమీషన్‌కు ఎక్కువ అధికారాలు కట్టబెట్టడం ఈ నిర్ణయాత్మకతకు ప్రాముఖ్యత. ఈ ఒప్పందానికి అనుగుణంగా ఎన్నో దేశాలు తమ రాజ్యాంగాలను సైతం సవరించుకున్నాయి.

BRAOU

## 13.4 అంతర్ అమెరికా దేశాల మానవ హక్కుల కమీషన్:

ఈ కమీషను అమెరికా ప్రాంత రాజ్యాల సంస్థ (Organisation of American States) 1978లో స్థాపించింది. మొదటలో కెనడా, క్యూబా తప్ప అన్ని దేశాలు సభ్యదేశాలుగా ఉండేవి. ఆ తరువాత కొన్ని దేశాలు తప్పుకున్నాయి. ప్రస్తుతం 20 దేశాలు దీనిలో సభ్యదేశాలుగా ఉన్నాయి. 1959 లో ఈ కమీషను మానవ హక్కుల పై అమెరికా ప్రాంత దేశాల ఒప్పందం (American Convention on Human Rights, 1969) - దాని అనుక్రమణిక (Protocob 1988) లకు అనుగుణంగా స్థాపించారు. దీనిలో అమెరికా దేశాల మానవ హక్కుల కోర్టు (Inter American Human Rights Court) ఒక అంతర్భాగం ఉత్తర, మధ్య, దక్షిణ అమెరికా దేశాల మానవ హక్కుల అభివృద్ధి, పరిరక్షణలకై ఈ కమీషన్లు స్థాపించారు. కమీషను విధులల్లో విచారణ, మధ్య వర్తిత్వం, సిఫార్సులు చేయడం, వాస్తవాల ప్రాతిపదికన నివేదికలు తయారు చేయడం మొదలైనవి. ఇక మానవ హక్కుల న్యాయస్థానం ( కమీషన్ నిర్మాణంలో భాగం) తన తీర్పులకు కట్టుబడి ఉంటాననే ప్రోటోకాల్ పై సంతకం చేసిన దేశాల్లోని నేరాలపై విచారణ జరిపి, మానవ హక్కుల ఉల్లంఘన సందర్భాల్లో అయా రాజ్యాలు చేల్లించాల్సిన పరిహారాలపై తీర్పునిస్తుంది.

ఈ కమీషన్‌కు యూరోపియన్ - ఇతర ప్రాంతీయ మానవ హక్కుల కమీషన్లకు ఎంతోతేడా ఉంది. మొదటగా అమెరికన్ కమీషన్ పద్ధతులు వేరు అంటే సభ్యదేశాలన్నీ కమీషన్ నిర్ణయాలను కట్టుబడి ఉండాలన్న

నిబంధనలేదు. అలాగే ఫిర్యాదు దారుల మానవ హక్కుల ఉల్లంఘనను కమీషన్ తనంతతానుగా పరిచేయలేదు. ఈ కమీషన్ నిర్ణయాలకు చట్టబద్ధతలేదు. వివిధ దేశాల్లో జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలను ఫిర్యాదులుగా పరిగణించక, కేవలం సమాచారంగా మాత్రమే పరిగణిస్తారు. ఉల్లంఘన సందర్భాల్లో జరిగే మంత్రుల స్థాయి సంప్రదింపుల సమావేశాలు సిఫార్సుల స్థాయిలో మాత్రమే ఉంటాయి.

వ్యక్తులు, సమూహాలు, సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు మానవ హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చు. దాని ఆధారంగా కమీషన్ సంబంధిత రాజ్యం నుంచి సమాచారాన్ని కోరి విచారణ జరుపుతుంది. ఉల్లంఘన నిరూపణ అయితే రాజ్యాలకు పరిహారం విషయంలో సూచనలు ఇస్తుంది. అయితే దీనిలో భాగమైన కోర్టు తీర్పులు కొన్ని ప్రభుత్వాలు తప్పని సరిగా ఆచరిస్తాయి.

కమీషన్ చరిత్రను పరిశీలించినట్లయితే, బ్రెజిల్‌లో చిత్రహింసలు విషయంలో క్యూబాలో చట్ట విరుద్ధ నిర్బంధాలు – అయాను పాల విషయంలో, బొలీవియాలో రైతు కూలీల మారణకాండ పై, చిలీలో జాతి దురంతాలు మానవ హక్కుల ఉల్లంఘనలపై స్పందించి అడ్డుకుంది.

అయితే ఈ కమీషన్ మానవ హక్కుల పరిరక్షణ వైఫల్యాల పరంపరకు తాట్టుకోలేక 1976లో కార్యనిర్వాహక కార్యదర్శి సియాన్ మైక్ బ్రైడ్ (Sean Mc Bride) రాజీనామా చేస్తూ ఇలా పేర్కొన్నాడు. .. అమెరికా ప్రాంత దేశాల సంస్థలోని సభ్యరాజ్యాలకు అంతర్ అమెరికా దేశాల మానవ హక్కుల కమీషన్ సామర్థ్యంపై ఆసక్తిలేదు. ఈ నిరాసక్తత ఫలితంగా ఎన్నో ప్రభుత్వాలు కమీషనుకు సహకరించడంలేదు ప్రభుత్వాలు సమాచారం కోరితే సమాధానంలో జాప్యం, అసంపూర్తి నివేదికాలు, కొన్ని సందర్భాల్లో సమాచారం అందించక నిశ్శబ్దంపాటించడం జరుగుతుంది.

అన్ని విజయాలు, మరెన్నోవైఫల్యాలు ఉన్నప్పటికీ ప్రాంతీయంగా అమెరికా ప్రాంత దేశాల్లో మానవ హక్కులపై అవగాహన కల్పించడానికి కమీషన్ కృషి చేస్తుంది.

### 13.4.1 మానవ హక్కుల పై అమెరికా ప్రాంత దేశాల ఒప్పందం (1969) – అను క్రమణికలు (1988)

(American Convention on Human Rights and Protocob) ఈ ఒప్పందం ప్రకారమే కమీషన్ నిర్మించబడింది. ఈ ఒప్పందాన్నే శాన్ జోస్ పాక్ట్ (Sam Jose Pact) అనికూడ వ్యవహరిస్తారు. 1969లో ఈ ఒప్పందం జరిగినా 1978లో అమల్లోకి వచ్చింది. 42వ నిబంధన ప్రకారం వార్షికంగా సభ్యదేశాలు మానవ హక్కుల పరిస్థితిపై నివేదికలు సమర్పించాలి. 46,47 నిబంధనల ప్రకారం మానవ హక్కుల పరిరక్షణకై ఏర్పడ్డ కమీషన్‌ను గుర్తించాలి. అయితే కమీషన్ సూచనలు అమలుపై దేశాలు స్వయం నిర్ణయం కలిగి ఉంటాయి. ఈ ఒప్పందం మానవ హక్కులతో పాటు కొన్ని విధులను కూడా జోడించింది. 32వ నిబంధన ప్రకారం ప్రతి వ్యక్తి మానవాళికి, సమాజానికి, కుటుంబానికి నిర్వర్తించాల్సిన బాధ్యతలు గుర్తెరగాలి. అలాగే సామాజిక భద్రత, ఇతరుల ప్రాణ రక్షణ, సాంఘిక సంక్షేమం, ప్రజాస్వామ్య సమాజం మొదలైన అంశాల్లో వ్యక్తుల హక్కులు – ఇతరుల హక్కులతో ఘర్షణ పడకుండా చూసుకోవడం పౌరుని బాధ్యత.

## 13.5 ఆఫ్రికన్ మానవ, ప్రజా హక్కుల కమీషన్:

ఆఫ్రికా ఖండ దేశాల్లో మానవ హక్కుల పరిరక్షణకు ఆఫ్రికా ఐక్య దేశాల సంస్థ (Organisation of African Unity) 1986లో ఈ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. మానవ హక్కులకు సంబంధించి ఆఫ్రికా దేశాల మానవ ప్రజా హక్కుల పత్రం (1981) ఆధారంగా ఈ కమీషన్ ఏర్పాటైంది. మానవ హక్కులకు, ప్రజా హక్కులకు గల

BRAOU

సంబంధాన్ని తెలుపుతూ సవివరంగా కమీషన్ అధికారాలు తెలిపింది.

పత్రంలోని 47-49 నిబంధనల ప్రకారం ఒక రాజ్యం మరో రాజ్యంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని భావించినప్పుడు కమీషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. అలాంటి సందర్భాల్లో సమస్య ఆరెండు రాజ్యాలు కలిసికానీ సమస్యను పరిష్కరించు కోవాలి. అలా కాక పోతే ఉల్లంఘన సందర్భలను ఐక్య ఆఫ్రికా సంస్థ రాజ్యాధిపతుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అలాగే కమీషన్‌కు వ్యక్తులు, సంస్థలు, సమూహాలు, ప్రభుత్వేతర సంస్థలు ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయవచ్చు. కమీషన్ సమావేశాల్లో సభ్యుల మధ్య ఓటింగ్ ద్వారా ఏయే ఫిర్యాదులు స్వీకరించాలో నిర్ణయిస్తారు. వాటిపై విచారణ జరిపి సంబంధిత రాజ్యాలకు సూచనలు అందిస్తారు. అయితే ఈ సూచనలు ఐక్య ఆఫ్రికా సంస్థ నివేదికల్లో ఇవ్వడంతో సభ్యరాజ్యలు వాటి అమలును నైతికంగా భావిస్తాయి.

ఈ కమీషన్‌లో 11మంది సభ్యులుంటారు. వీరు ఆఫ్రికా ఖండంలోని వివిధ దేశాలోల విద్యావేత్తలు, నాయకులు, నిష్పాక్షికతగలవారు, మానవ హక్కుల పై గౌరవం కల వారు అయి వుండాలి. కమీషన్‌కు ఛైర్మన్ ఉంటాడు.

## 13.5.1 ఆఫ్రికా దేశాల మానవ హక్కుల పత్రం

1981లో ఐక్య ఆఫ్రికా దేశాల సంస్థ ఈ పత్రాన్ని రూపొందించింది. దీనినే బంజుల్ (Banjul) ప్రకటన అని కూడా అంటారు. ఈ పత్రం ఉదారవాద హక్కులైన స్వేచ్ఛ హక్కు, భావ ప్రకటన హక్కు, వాక్ స్వాతంత్ర్యపు హక్కు మొదలైన వాటిని మానవ హక్కులుగా, సామ్యవాద హక్కులైన అభివృద్ధి, వలసవాదవ్యతిరేకత, వర్ణవిచక్షణ వ్యతిరేకత, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధి మొదలైన వాటిని ప్రజా హక్కులుగా పర్ణిస్తుంది. ఎన్నో సంవత్సరాల వలస వాద వ్యతిరేక పోరాటాలు, వర్ణ వివక్ష వ్యతిరేకత దీనిలో ప్రతిబింబిస్తాయి.

ప్రపంచంలో ఆఫ్రికా దేశాల వెనుక బాటు తనాన్ని గుర్తిస్తూ, అభివృద్ధి హక్కుగా ఉండాలని భావిస్తుంది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రకటన కంటే కూడా విపులంగా మానవుల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులను పేర్కొంది. నిజానికి రాజకీయ, పౌర హక్కుల ప్రాధాన్యం ఆర్థిక సామాజిక సాంస్కృతిక హక్కుల ద్వారానే సిద్ధిస్తుందని ఈ పత్రం విశ్వసిస్తుంది. ఈ ప్రకటనలో రెండో అధ్యాయం బాధ్యతలను గూర్చితెలియ జేస్తుంది. ఆబాధ్యతలు వ్యక్తి పరంగా, రాజ్యపరంగా కూడా వివరించింది. ఆఫ్రికా నాగరికతా, మానవాళికి అందించిన ఆఫ్రికా విలువలు కాపాడాలని పిలుపునిస్తుంది.

అయితే ఈ పత్రం అమలుకు ఉన్న కమీషన్ బలహీనమైంది. యూరోపియన్ కమీషన్ వలే దీనికి చట్టబద్ధత లేదు. ఉల్లంఘన సందర్భాలను సరిగా సవరించలేదు.

BRAOU

## 13.6 జాతీయ మానవ హక్కుల కమీషన్:

1993సం..లో వియన్నా (ఆస్ట్రియా) లో జరిగిన ప్రపంచ మానవ హక్కుల సదస్సు పిలుపు మేరకు వివిధ రాజ్యాలు తమ తమ దేశాల్లో జాతీయ మానవ హక్కుల కమీషన్లను ఏర్పాటు చేశాయి. దీనినే వియన్నా డిక్లరేషన్ అంటారు. దీనికి అనుబంధంగా భారత దేశంలో కూడా ఒక చట్టం చేశారు. (మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993). ఈ చట్టంలో భాగంగా జాతీయ స్థాయిలో ఒక మానవ హక్కుల కమీషన్, రాష్ట్రాల స్థాయిల్లో మానవ హక్కుల కమీషన్లు ఏర్పాటు చేయాలి. ఒక ఛైర్మన్, 7 గురు సభ్యులు దీనిలో సభ్యులుగా ఉంటారు. కమీషన్‌కు ఒక ప్రధాన కార్యదర్శి ఉంటాడు. ఛైర్మన్ సుప్రీంకోర్టు ప్రధానన్యాయ మూర్తి హోదాలో ఉంటాడు.

ప్రభుత్వం ద్వారా, సామాజిక పరంగా, వ్యక్తులు ఎదుర్కొనే మానవ హక్కుల ఉల్లంఘనలను విచారిస్తుంది.

అలాగే ఎన్నో దేశాల్లో మానవ హక్కుల కమీషన్లు ఏర్పాటయ్యాయి.

## 13.7 ముగింపు:

మానవ హక్కులపట్ల అవగాహన, ప్రాముఖ్యం రోజు రోజుకూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతోంది. దీన్ని గుర్తించి ఎన్నోన్నె కమీషన్లు అంతర్జాతీయంగా, ప్రాంతీయస్థాయిల్లో ఏర్పాటైనాయి. వీటి సమర్థత వాటి పనితీరుపై ఆధారపడి ఉంటుంది. ఈ కమీషన్లు కొన్ని నామ మాత్రమైన అధికారాలతో వుండగా, కొన్ని పటిష్టంగా పని చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని కమీషన్లు, యూరోపియన్ కమీషన్ పటిష్టంగా పనిచేస్తున్నాయి. ఇదే సందర్భంలో అమెరికా దేశాల కమీషన్, ఆఫ్రికా దేశాల కమీషన్ సామర్థ్యం పట్ల భిన్న అభిప్రాయాలున్నాయి. ఈ దశలోనే అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం రూపొందాల్సి ఉంది. ఈ కమీషన్ల ఏర్పాటు ప్రయత్నాల వల్లనే హక్కులపట్ల పెరుగుతున్న ప్రాముఖ్యత వెల్లడవుతుతోంది.

## 13.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు:

**I** **1. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి**

1. ఐక్యరాజ్య సమితి నేతృత్వంలోని మానవ హక్కుల కమీషన్ల పనితీరు తెల్పండి.
2. ఆఫ్రికా దేశాల మానవ హక్కుల కమీషన్ పరిధి, పనితీరు, స్వభావంలో భిన్నత్వాన్ని తెలపండి.

**II** **II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి**

1. యూరోప్ దేశాల మానవ హక్కుల ఒప్పందం
2. అంతర్జాతీయ మహిళా కమీషన్

BRAOU

# భాగం – 14 : మానవ హక్కులు : అంతర్జాతీయ చట్టం

విషయక్రమం :


14.0 ఉద్దేశం

14.1 పరిచయం

14.2 అంతర్జాతీయ చట్టం : అర్థం.

14.3 అంతర్జాతీయ చట్టం : మూలాలు

14.4 మానవహక్కులు : అర్థం

14.5 మానవహక్కుల అంతర్జాతీయీకరణ

14.6 అంతర్జాతీయ చట్టం : బలహీనతలు

14.7 మానవహక్కులకు అంతర్జాతీయ ఆమోదం

14.8 మానవహక్కులు, ఐక్యరాజ్యసమితి చార్టర్

14.9 మానవ హక్కుల అంతర్జాతీయ ప్రకటన

14.10 అంతర్జాతీయ మానవహక్కులు ఒడంబడికలు

14.11 మానవహక్కుల గురించిన ఇతర ఒడంబడికలు, డిక్లరేషన్లు

14.12 మానవహక్కుల ప్రమాణాలు

14.13 మానవహక్కుల అమలులో సమస్యలు

14.14 అమలు పరిచే విధానం : ఐక్యరాజ్యసమితి పాత్ర (ECOSOC)

14.15 మానవహక్కుల అంతర్జాతీయ ఒడంబడికలు అమలు విధానం

14.16 ముగింపు

14.17 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 14.0 ఉద్దేశం :

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

- మానవ హక్కులకు, అంతర్జాతీయ చట్టానికి ఉన్న సంబంధం గురించి తెలుసుకుంటారు.
- రెండో ప్రపంచ యుద్ధనంతర కాలంలో అంతర్జాతీయ చట్టం ఎలాపనిచేసిందో తెలుస్తుంది.
- మానవ హక్కులను అమలు పర్చడంలో ఐక్యరాజ్యసమితి పాత్ర

## 14.1 పరిచయం:

ఇక్కడ మొదట చర్చిస్తున్న భావన అంతర్జాతీయ చట్టం దాని స్వభావమేమిటి? అది ఎలా రూపొందుతుంది? అంతర్జాతీయ సమాజంలో దాని స్థానమేమిటి మొదలయిన విషయాలను అర్థం చేసుకున్న తరువాత అంతర్జాతీయ చట్టం మానవహక్కుల రక్షణలో ఎంతమేరకు సమర్థంగా వ్యవహరించగలదో తెలుసుకోవచ్చు. ఇక మానవహక్కుల సమస్య గురించి పరిశీలించేటప్పుడు ప్రమాణాలు ఏర్పాటు ప్రాముఖ్యం గురించి, ఈ హక్కులను అంతర్జాతీయ చట్టం అమలు చేస్తున్న తీరు గురించి పరిశీలిద్దాము.

## 14.2 అంతర్జాతీయ చట్టం: అర్థం

జె. ఎల్. బ్రియర్లీ ప్రకారం, దేశాల చట్టం (Law of nations) లేదా అంతర్జాతీయ చట్టం (International Law) అంటే సభ్యదేశాలు పరస్పరం వ్యవహరించుకునేటప్పుడు కట్టుబడివుండవలసిన నియమాలు, సూత్రాల సంపుటి. న్యాయశాస్త్రంలో ఒక ప్రత్యేక అంగంగా ఉన్న అంతర్జాతీయ చట్టం ఆధునికమయినది, 16, 17 శతాబ్దాలనుంచే ఇది రూపొందడం మొదలైంది. వివిధ జాతుల మధ్య సంబంధాలను నియంత్రించే నియమాలు ఏదో ఒక రూపంలో ఎప్పటినుంచో ఉనికిలో ఉన్నాయి కానీ, అంతర్జాతీయ చట్టం ప్రత్యేక స్వభావాన్ని ఆధునిక జాతి-దేశ (nation State) వ్యవస్థ ఆవిర్భావం తరువాతే గుర్తించవచ్చు. చట్టాలన్నిటికీ వెనుక ఉన్నది ఒకే స్ఫూర్తి. దేశంలోని ఒంటరి వ్యక్తి కానీ, ఇతర వ్యక్తులతో సంబంధంలో ఉన్న వ్యక్తి కానీ ప్రపంచాన్ని నియంత్రించే నియమం వ్యవస్థే తప్ప అరాచకం కాదని విశ్వసించాలి. ఇదే వివరణను అంతర్జాతీయ చట్టంలోని స్ఫూర్తికి కూడా వర్తింపజేయవచ్చు.

BRAOU

## 14.3 అంతర్జాతీయ చట్టం – మూలాలు:

అంతర్జాతీయ చట్టం ఎలా రూపొందింది అనే సమాచారాన్ని అంతర్జాతీయ న్యాయస్థానంలోని 38వ చట్టం ద్వారా గ్రహించవచ్చు. ఆ చట్టం ఇలా ఉంది:

అ. సర్వ సాధారణమైనవి కానీ, నిర్దిష్టమైనవి కానీ అంతర్జాతీయ ఒడంబడికలు (International Conventions) భాగస్వామ్యదేశాలన్నీ అంగీకరించినవి. అటువంటి ఒడంబడికలు వివాదంలో భాగమయిన దేశాలకు వర్తించే చట్టాలు అవుతాయి, అయితే అన్ని ఒడంబడికల్లోని అంశాలూ అంతర్జాతీయ చట్టంలో భాగమైపోవు. పెద్దసంఖ్యలో దేశాలు అంగీకరించిన ఒడంబడికలు మాత్రమే అంతర్జాతీయ చట్టంలో భాగంగా సర్వసాధారణ వ్యవహారంలోకి వస్తాయి. ఒక నిర్దిష్టమయిన విషయంలో ఏది చట్టం అని వారు తమ అవగాహనను ప్రకటించినప్పుడు కానీ, లేదా ఒక కొత్త అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పాటుచేసినప్పుడు కానీ అటువంటి ఒడంబడికలు జరుగుతాయి.

ఆ. సర్వసాధారణ వ్యవహారంలో ఉన్నదన్న సాక్ష్యం ఉన్న అంతర్జాతీయ సంప్రదాయాన్ని కూడా చట్టంగా పరిగణిస్తారు. సంప్రదాయం అంటే కేవలం ఆచరణలో ఉంటే సరిపోదు. దాన్ని పాటించేవారు దాన్ని విధిగా భావించాలి. దాన్ని ఉల్లంఘించినవారి మీద ఏదో ఒక రకమయిన ఆంక్షను విధించాలన్న అభిప్రాయం ఉండాలి.

ఇ. నాగరిక దేశాల్లో గుర్తించిన సాధారణ అంతర్జాతీయ న్యాయసూత్రాలు. వీటిలో అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించి జాతీయ కోర్టుల్లో అంగీకరించే సూత్రాలు కూడా ఉంటాయి.

ఈ. ఇంతకుముందున్న న్యాయసూత్రాలు, చట్టాలు, అటువంటి చట్టాలను, న్యాయశాస్త్రలను రచించిన వారు కూడా అంతర్జాతీయ చట్టానికి అనుబంధ మూలాలుగా ఉంటారు.

## 14.4 మానవ హక్కులు : అర్థం

విశాలమయిన అర్థం చెప్పుకోవాలంటే మానవ హక్కులు జాతీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక హద్దులు, విభేదాలు లేకుండా మనిషికున్న అవిభాజ్యమయిన హక్కులు. ఈ హక్కులు అంతర్జాతీయ సమాజం ఇచ్చే గుర్తింపు ద్వారా స్థిరపడిపోవాలని, పరిరక్షించబడాలని చాలాకాలంగా ప్రజలు కోరుకుంటున్నారు. అందుకే వాటిని అంతర్జాతీయ చట్టంలోని ఒక ముఖ్యమైన విషయంగా చేయవలసి వచ్చింది.

నిజానికి చాలా శతాబ్దాలుగా రాజకీయ ఆలోచనలు, ఆకాంక్షలు మౌలిక మానవ హక్కుల కోసం పడే ఆరాటం నుంచి రూపుదిద్దుకున్నవి. ప్రభుత్వాలు చేసే నిరంకుశ చట్టాలనుంచి రక్షణ కోసం, సమావేశం కావడానికి, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడానికి స్వేచ్ఛకోసం, చట్టబద్ధమైన పాలన కోసం, సార్వజనీన ఓటుహక్కుద్వారా, రహస్యబ్యాలట్ ద్వారా రాజకీయ హక్కుల వినియోగం కోసం చాలా కాలంగా తలెత్తిన డిమాండ్లు క్రమంగా జాతీయ స్థాయి హక్కుల ప్రకటనలుగానో, ఇతర రాజ్యాంగరక్షణల రూపంలోనో అవతరించాయి. కాబట్టి, మానవ హక్కుల కోసం పట్టింపు కొత్త విషయం కాదు. కేవలం రెండో ప్రపంచ యుద్ధానంతరం మాత్రమే తలెత్తిన లక్షణం కాదు.

BRAOU

## 14.5 మానవ హక్కుల అంతర్జాతీయీకరణ :

అయితే, మానవ హక్కుల పరిరక్షణ విషయంలో రెండో ప్రపంచయుద్ధానంతరకాలం ఏ విధంగా విశిష్టమైనది? – అన్న ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానం– ఇంతకాలం దేశ స్థాయిలో మానవ పరిస్థితుల మీద ఉన్న పట్టింపు రెండో ప్రపంచయుద్ధానంతరకాలంలో అంతర్జాతీయ స్థాయికి మొదటిసారిగా చేరింది. ఈ విషయంలో పెద్ద ముందడుగు ఏమిటంటే, ఇంతకాలం ఫలానా దేశపు ప్రజలు తమ ప్రభుత్వాన్నించి డిమాండ్ చేస్తూ వచ్చిన మానవ హక్కులను ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలు అన్ని దేశాల ప్రభుత్వాలనుంచీ డిమాండ్ చేస్తున్నారు. దీనికి అనేక రాజకీయ, న్యాయపరమయిన పర్యవసానాలున్నాయి. వాటినిక్కడ పరిశీలిద్దాము.

మానవహక్కులు ఒక జాతి–దేశం పరిధిలో ఉన్నంతకాలం వాటికి చారిత్రక, తాత్విక, సైద్ధాంతిక ప్రాముఖ్యం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఈ సమస్య అంతర్జాతీయీకరణ చెందేసరికి, ఇది మొత్తం అంతర్జాతీయ సమాజం పట్టించుకోవాల్సిన విషయం అయింది. ఒక ప్రత్యేకమయిన నిర్దిష్టమయిన జాతీయస్థాయి చట్టం, అంతర్జాతీయ వాస్తవంగా, పాక్షికంగానయినా అంతర్జాతీయ చట్టం ద్వారా క్రమబద్ధీకరణ జరిగే సమస్యగా పరిణమించింది.

## 14.6 అంతర్జాతీయ చట్టం : బలహీనతలు :

దేశాల ఆంతరంగిక చట్టాలతో పోలిస్తే, అంతర్జాతీయ చట్టం బలహీనమయినది కాబట్టి సార్వజనీన మానవ హక్కుల భావనను అంతర్జాతీయ చట్టం ద్వారా మాత్రమే పరిరక్షించగలమని భావించరాదని ఎవరైనా వాదించవచ్చు. ఈ విమర్శ తీసిపారేయదగినది కాదు. అయితే దాన్ని మరీ సాగదీయడం కూడా మంచిది కాదు. సార్వజనీన మానవ హక్కులు అంటే ఇవీ అని ఒక అంగీకారానికి రావడమే గొప్పవిషయం. రెండో ప్రపంచయుద్ధానంతరం ప్రపంచపటంలో ఉన్న సైద్ధాంతిక, రాజకీయ విభేదాలను దృష్టిలో పెట్టుకుంటే ఇటువంటి ఏకాభి ప్రాయం చిన్న విషయమేమీ కాదని అర్థమవుతుంది. మానవ హక్కుల రంగంలో ప్రమాణాల ఏర్పాటు విషయంలో ఈ ఏకాభిప్రాయం చాలా దోహదం చేసింది. 1948లో అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన (The Universal Declaration on Human Rights) జారీచేయడం ద్వారా అంతర్జాతీయ సమాజం కనీస అంగీకారయోగ్యమైన నైతిక ప్రమాణాలను కొన్నిటిని రూపొందించుకోగలిగింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు తమ పౌరుల విషయంలో అనుసరించవలసిన కనీస ప్రమాణాలు అవి. నిజానికి రెండో ప్రపంచయుద్ధానంతరం ఉనికిలోకి వచ్చిన చాలా నవ స్వతంత్ర దేశాలు, భారతదేశంతో సహా ఈ అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని అనేక అంశాలతో ప్రభావితమై తమ తమ దేశాల రాజ్యాంగాలను రచించుకున్నాయి. అంటే అంతర్జాతీయ చట్టం తాను స్వయంగా మానవ హక్కుల సమస్యను స్వీకరించడమే కాకుండా అనేక దేశీయ చట్టాలకు కూడా ప్రమాణాలను సిద్ధం చేసింది. కాబట్టి, అంతర్జాతీయ చట్టానికి నైతిక ప్రాధాన్యం మాత్రమే కాకుండా కనీసం పరోక్షంగానయినా న్యాయపరమయిన ప్రాధాన్యం ఉంది.

## 14.7 మానవ హక్కులకు అంతర్జాతీయ ఆమోదం:

మానవ హక్కుల వాదం, అంతర్జాతీయ ఆమోదం అనేవి ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి కానీ వీటి ప్రారంభం మాత్రం రెండో ప్రపంచయుద్ధం ముగింపుతో మరీ ముఖ్యంగా 1945లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చార్టర్ (The Charter of the United Nations) అమలులోకి వచ్చిన తరువాత జరిగింది. మానవ హక్కుల సారం చార్టర్‌లో అంతర్లీనంగా ఉంది. మానవ హక్కుల గురించి, అంతర్జాతీయ సమాజం సార్వజనీనత గురించి చార్టర్‌లో పొందుపరిచిన భావనలు 1948 నాటి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలో నిర్దిష్ట రూపాన్ని పొందాయి. ఆ భావనలు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 1966లో ఆమోదించిన ఒడంబడికలలో పునరుద్ఘాటించబడి, 1976 నుంచి అమలులోకి వచ్చాయి. 1968లో టెహరాన్ ప్రకటనలోను, 1977లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశం ఆమోదించిన తీర్మానంలోను అవే భావనలు తిరిగి వ్యక్తమయ్యాయి. మానవ హక్కులను అంతర్జాతీయీకరించి, వాటి పరిరక్షణకు తోడ్పడిన కొన్ని అంతర్జాతీయ పత్రాలను క్లుప్తంగా ఇక్కడ పరిశీలిద్దాము.

## 14.8 మానవ హక్కులు– ఐక్యరాజ్యసమితి చార్టర్:

రెండో ప్రపంచయుద్ధకాలంలోనూ, ఆ వెంటనే కొన్ని దేశాలు జరిపిన మానవ హక్కుల ఉల్లంఘనలను దృష్టిలో పెట్టుకుని ఐక్యరాజ్యసమితి చార్టర్ నిర్మాతలు మానవ హక్కుల పరిరక్షణను సమితి ముఖ్య లక్ష్యాలలో

BRAOU

ఒకటిగా చేర్చాలని సంకల్పించారు. శాన్‌ఫ్రాన్సిస్కో మహాసభలో చార్టర్‌లోని ఒకటవ ఆర్టికల్‌లోనే మానవ హక్కుల అంశాన్ని చేర్చారు. జాతి, మత, లింగ, భాషా వివక్ష లేకుండా అందరి మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛలను పరిరక్షించాలని, గౌరవించాలని ఆ ఆర్టికల్ పేర్కొన్నది. 68వ ఆర్టికల్‌లో మానవ హక్కుల పరిరక్షణకు, వికాసానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయమని ఆర్థిక, సామాజిక సమితిని ఆదేశించడం జరిగింది. మానవ హక్కుల గురించిన ముసాయిదా పత్రాన్ని రూపొందించడానికి ఈ సమితికి పూర్తి అధికారాన్ని ఇవ్వడం జరిగింది. రెండో సమావేశంలో కమిషన్ తన పత్రాన్ని మూడు భాగాలుగా రూపొందించాలని నిర్ణయించింది. ఒకటి ప్రకటన, రెండుబహుళ పక్ష సదస్సు, మూడు అమలు చర్యలు. బహుళ పక్ష సదస్సునే కోవనెంట్ అంటారు. తరువాత ఈ సదస్సులను రెండు జరపాలని నిర్ణయించారు.

## 14.9 మానవ హక్కుల అంతర్జాతీయ ప్రకటన :

మానవ హక్కుల అంతర్జాతీయ ప్రకటనలో 30 ఆర్టికల్స్ ఉన్నాయి. సాంప్రదాయిక పౌర, రాజకీయ హక్కులకు ఉన్నత స్థానాన్నిస్తూ మొదటి 21 ఆర్టికల్స్‌లో వాటిని పొందుపరిచారు. తరువాత ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు జాబితా ఇస్తూ వాటిని నిర్వచించారు. ఆ నిర్వచనాలు, హక్కులు ఇప్పటికీ అనేక దేశాల్లో వివాదాస్పదంగా ఉన్నాయి. 1948 డిసెంబర్ 10వ తేదీన 217 ఎ 3 తీర్మానంగా ఐక్యరాజ్యసమితి ఆమోదం పొందిన ఈ ప్రకటనకు వ్యతిరేకంగా ఓటువేసినవారు ఎవరూ లేరు కానీ, ఆరు కమ్యూనిస్టు దేశాలు, సౌదీ అరేబియా, దక్షిణ ఆఫ్రికా ఓటింగ్‌లో పాల్గొనలేదు.

## 14.10 మానవ హక్కుల అంతర్జాతీయ ఒడంబడికలు :
### (The International Covenants on Human Rights)

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ బడంబడిక (The International Covenant on Economic, Social And Cultural Rights) వాస్తవ రూపం తీసుకుని 1976 మార్చి 3 తేదీన అమలులోకి వచ్చింది. పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒడంబడిక (The International Covenant on Civil And Political Rights), ఐచ్ఛిక ఒప్పందం 1976 మార్చి 23 నాటినుంచి అమలులోకి వచ్చింది. ఈ రెండు ఒప్పంద పత్రాలు మొట్టమొదటి అంతర్జాతీయ మానవ హక్కుల నిబంధనా వళులుగా చెప్పవచ్చు. ఈ రెండు ఒడంబడికలు వాటి మీద సంతకాలు చేసిన భాగస్వామ్యదేశాలు విధిగా పాటించవలసి వుంటుంది.

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడికలో గుర్తించిన హక్కులలో ప్రజల స్వయం నిర్ణయాధికారం, సహజసంపదను, వనరులను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులలో స్త్రీ పురుషులకు సమానత్వం, కుటుంబానికి రక్షణ, సహాయం పొందే హక్కు, తగిన జీవన ప్రమాణంతో జీవించే హక్కు, అత్యున్నత స్థాయి భౌతిక, మానసిక ఆరోగ్యాన్ని పొందే హక్కు, విద్యా హక్కు, సాంస్కృతిక జీవనంలో పాలుపంచుకునే హక్కు, శాస్త్రవిజ్ఞాన ప్రగతి ఫలితాలను పొందే హక్కు ఉన్నాయి. ఆర్టికల్ 2 లోని రెండవ పేరా ప్రకారం ఒడంబడికలో పేర్కొన్న హక్కులను జాతి, వర్ణ, లింగ, భాషా, మత, రాజకీయ, అభిప్రాయ భేదాలతో నిమిత్తం లేకుండా, జాతి, సామాజిక స్థాయితో నిమిత్తం లేకుండా అందరికీ వర్తించేట్టు అమలుజరుపుతామని భాగస్వామ్య దేశాలు పూచీ పడతాయి.

BRAOU

పౌర, రాజకీయ హక్కుల ఒడంబడికలో కూడా 2 వ ఆర్టికల్ 2 వ పేరా ఎటువంటి వివక్షా లేకుండా అన్ని హక్కులను అందరికీ అమలుజరుపుతామని భాగస్వామ్య దేశాలు పూచీపడాలని ఉన్నది. ఈ ఒడంబడికలో గుర్తించిన హక్కులు : ప్రజల స్వయం నిర్ణయాధికారం, సహజసంపదను, వనరులను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులలో స్త్రీపురుషులకు సమానత్వం, జీవించే హక్కు, చిత్రహింసలనుంచి, క్రూరమయిన, అమానుషమైన లేదా అవమానకరమయిన పరిగణననుంచి లేదా శిక్షలనుంచి రక్షణ, బానిసత్వంనుంచి రక్షణ, వ్యక్తి స్వేచ్ఛకు, భద్రతకు రక్షణ, ఆ రక్షణ హక్కు లేనప్పుడు మానవత్వంతో, గౌరవంతో వ్యవహరింపబడే హక్కు, రాజ్యం భూభాగం స్వేచ్ఛగా సంచరించే హక్కు, దేశాన్ని వదిలి వెళ్లే హక్కు, కోర్టుల ముందు, ట్రిబ్యునళ్లముందు సమానత్వం, ఎక్కడయినా చట్టం ముందు వ్యక్తిగా పరిగణన, వ్యక్తిగత రహస్యాలు కలిగివుండే హక్కు, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, సంఘంగా ఏర్పడే హక్కు, కుటుంబానికి, పిల్లలకు రక్షణ, అల్పసంఖ్యాకవర్గాలకు రక్షణ ఉన్నాయి.

## 14.11 మానవహక్కుల గురించిన ఇతర ఒడంబడికలు, ప్రకటనలు :

పైన చెప్పిన రెండు ప్రకటనల్లో చేర్చిన అనేక హక్కులు ఆ తరువాత ఐక్యరాజ్యసమితి అధ్వర్యంలో వచ్చిన ప్రకటనల్లోను, ఒడంబడికల్లోనూ మళ్లీ మళ్లీ ప్రకటితమయ్యాయి. ఈ ప్రకటనలు ఒడంబడికలు లెక్కలేనన్ని వచ్చాయి. వీటిలో ఆప్రాత్యేక ప్రధాన్యం ఉన్న కొన్నింటిని గురించి చెప్పుకోవాలి. ఉదాహరణకు డిసెంబరు 14, 1960 నాడు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం – వలసదేశాలకు, వాటి ప్రజలకు స్వాతంత్ర్యం ఇవ్వడం గురించిన డిక్లరేషన్(సర్వసభ్యసమావేశం తీర్మానం 1514 (15)) – వల్ల ప్రజల స్వయం నిర్ణయాధికార భావనకు కొత్త బలం వచ్చింది. అన్ని రూపాల్లో ఉన్న వలసవాదాన్ని, దాని లక్షణాలను, అవశేషాలను శీఘ్రంగా, బేషరతుగా రూపుమాపాలని : ప్రజలను పరాయి పెత్తనంలో, దోపిడిలో ఉంచడం ప్రాథమిక మానవహక్కుల నిరాకరణే అవుతుందని డిక్లరేషన్ ప్రకటించింది. మానవహక్కులకు చెందిన రెండు ఒడంబడికలలోనూ అంతర్భాగంగా ఉన్న వివక్ష నివారణ అంశం అన్ని జాతి వివక్ష రూపాల నిర్మూలనపై ఐక్యరాజ్య సమితి ప్రకటనో (డిసెంబరు 21, 1965) లో మరింత స్పష్టం, ప్రస్ఫుటం అయింది. వర్ణవివక్షా నేరాల అణచివేత, శిక్షపై అంతర్జాతీయ ఒప్పందం (నవంబర్ 30, 1960), విద్యలో వివక్షపై ఒప్పందం (డిసెంబరు 18, 1960) ఇంకా అనేక ఇతర ఒప్పందాలు జాతి వివక్ష గురించి స్పష్టమైన ప్రకటనలు చేశాయి. బాలల హక్కుల గురించిన ప్రకటన (నవంబర్ 20, 1959) బాలల హక్కుల గురించిన ఒప్పందం (నవంబర్ 20, 1989) పిల్లల హక్కులను నొక్కిచెప్పాయి. బానిసత్వం, బలవంతపు చాకిరి, ఖైదీలతో వ్యవహరించేతీరు మొదలయిన అంశాల మీద కూడా ఒప్పందాలు, ప్రకటనలు జరిగాయి.

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులపై అంతర్జాతీయ ఒడంబడికలో చెప్పిన ఆర్థిక హక్కులను కార్మిక ప్రతినిధుల ఒప్పందం (1971 జూన్), కార్మిక సంబంధాల ఒప్పందం (జూన్ 27, 1978) వంటి తరువాతి అంతర్జాతీయ ఒప్పందాలలో పటిష్టపరచడం జరిగింది. వలసవెళ్ళిన కార్మికుల హక్కులు, ఏ దేశానికీ చెందని వారి, శరణార్థుల ప్రతిపత్తి గురించి, యుద్ధనేరాల గురించి, మానవజాతికే వ్యతిరేకంగా తలపెట్టిన పూచకోత, మారణహోమం వంటి నేరాల గురించి, యుద్ధ నేరస్థులతో వ్యవహరించవలసిన తీరు గురించి కూడా అనేక

BRAOU

అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి ప్రకటనలు వెలువడ్డాయి.

## 14.12 మానవహక్కుల రంగంలో ప్రమాణాలు :

మానవహక్కుల రంగంలో ఐక్యరాజ్యసమితి స్థిరపరిచిన ప్రమాణాలేమిటో ఇప్పుడు స్పష్టంగా ఉన్నాయి. అంతర్జాతీయ ప్రకటనలు చేయడం, సిఫారసులు చేయడం, కన్వెన్షన్లు, కోవెనెంట్లు, ప్రోటోకాల్స్ వంటి అంతర్జాతీయ ఒడంబడికలను రూపొందించి, ఆమోదింపజేయడం వంటివి ఐక్యరాజ్యసమితి అనుసరించిన ప్రమాణాలలో కొన్ని. వీటిలో అంతర్జాతీయ ఒడంబడికల్లోని అంశాలను వాటి మీద సంతకం చేసిన భాగస్వామ్యదేశాలు విధిగా పాటించితీరాలి. అంతర్జాతీయ ప్రకటనలు అంటే డిక్లరేషన్ విషయంలో అటువంటి కట్టుబాటులేదు. అయితే, డిక్లరేషన్లను లాంఛన ప్రాయమైన పవిత్రమైన సాధనాలుగా, అరుదుగా మాత్రమే వెలువరించే ఆశయాల ప్రకటనగా, ఉన్నతమయిన, శాశ్వతమయిన విలువల సంపుటిగా ఐక్యరాజ్యసమితి పరిగణిస్తుంది. కాబట్టి, ఆ ప్రకటన మీద సంతకాలు చేసే దేశాలు ఆయా విలువలను పాటిస్తాయని ఆశించడం జరుగుతుంది. ఇక సిఫార్సుల విషయంలో అవి డిక్లరేషన్ల కంటె తక్కువ లాంఛనప్రాయమైనవి, చట్టపరంగా సభ్యదేశాలు వాటిని పాటించనక్కరలేనివి.

మానవహక్కుల రంగంలో ప్రమాణాల ఏర్పాటులో ఐక్యరాజ్యసమితి ప్రగతి చాలా బాగున్నప్పటికీ, అంతవరకు మాత్రమే అయితే సరిపోదన్న భావన అంతటా పెరుగుతోంది. ప్రమాణాలను బాహాటంగా ఉల్లంఘించే దేశాల మీద చర్యలు తీసుకోవాలి. అందుకని వివిధ అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా ప్రకటనల ద్వారా కట్టుబడిన దేశాలు ఆ ఒప్పందాల్లోని, ప్రకటనల్లోని అంశాలను ఆచరించేట్టుచేయడానికి ఒక యంత్రాంగం కావాలి.

BRAOU

## 14.13 అమలులో సమస్యలు :

ఆలోచనలను, చట్టాలను, వాగ్దానాలను ఆచరణలోనికి తేవాలంటే కావలసిన పరిస్థితులు రెండు. ఒకటి, అమలు జరిపించే యంత్రాంగం, రెండు ఆయా చట్టాలలో, ఒప్పందాలలోని మాటలకున్న సమగ్ర అర్థం విషయంలో ఏకాభిప్రాయం. అంతర్జాతీయ స్థాయిలో మానవహక్కుల అమలు విషయానికి వచ్చేసరికి ఈ రెండు పరిస్థితులు లేవు. అమలు చేయించవలసిన సంస్థలకు ఆ అధికారం లేదు. ఒకే పదానికి వున్న విభిన్నార్థాల కారణంగా మానవహక్కుల చట్టాలు, ఒప్పందాలు అన్నీ పలచబడిపోతున్నాయి.

## 14.14 అమలు విధానం, ఐక్యరాజ్యసమితి (ఎకోసాక్) పాత్ర :

మానవ హక్కుల అంతర్జాతీయ పరిరక్షణ అంటే అర్థం అంతర్జాతీయ బాధ్యతలకు జాతీయ దేశాలు కట్టుబడి ఉండడం. అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన చట్టబద్ధంగా సభ్యదేశాల మీద ఎటువంటి బాధ్యత విధించదు కాబట్టి ఆ ప్రకటనలోని అంశాలను అమలు జరిపించడానికి వివిధ మార్గాల అన్వేషణ అవసరమయింది. వాటిని ఆర్థిక, సామాజిక మండలి (ఎకోసాక్) నిర్దేశించిన పద్ధతుల ద్వారా అమలు చేయించాలని భావించారు.

ఈ పద్ధతుల్లో ఉన్న లోపాల వల్ల, అంతర్జాతీయ ప్రకటనలో నిర్దేశించిన హక్కులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే ఉద్దేశ్యంతోనూ అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికలను ప్రారంభించారు. వీటి అమలుకు సంబంధించిన ఏర్పాట్లు ఒడంబడికల్లోనే అంతర్గతంగా ఉంటాయి. అందువల్ల, అంతర్జాతీయ చట్టం కింద మానవహక్కుల పరిరక్షణ.ఎటువంటి చర్యలు తీసుకున్నారని పరిశీలించాలంటే 'ఎకోసాక్' రూపొందించిన పద్ధతులను చూడాలి. వివిధ అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికల అమలుకు ఆయా ఒడంబడికల్లోనే కల్పించిన పద్ధతులేమిటో చూడాలి.

ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని 62 వ ఆర్టికల్ ప్రకారం, మానవహక్కుల, ప్రాథమిక హక్కుల పరిరక్షణకు, అమలు కావలసిన సిఫార్సులను చేయవలసిన బాధ్యత ఎకోసాక్‌ది. ఈ బాధ్యతను నెరవేర్చే పనిని ఎకోసాక్ తన ముఖ్యమైన అనుబంధసంస్థ 'మానవ హక్కుల కమిషన్' కు అప్పగించింది. 1956 నుండి 1971 మధ్యకాలంలో ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు నిర్ణీత వ్యవధిలో సమర్పించవలసిన తమ తమ దేశాల మానవహక్కుల స్థితిగతుల నివేదికలను కమీషన్ పర్యవేక్షించింది. ఈ నివేదికలను ఎకోసాక్ రూపొందించిన పద్ధతుల ప్రకారం తయారు చేయవలసి ఉంటుంది. 1959 నుంచి 1970 మధ్యకాలంలో మానవహక్కుల ఉల్లంఘనలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను కూడా కమీషన్ పరిశీలించింది. ఫిర్యాదుల పరిశీలనకు కూడా ఎకోసాక్ ఒక విధానాన్ని నిర్ణయించింది. మానవహక్కుల రంగంలో ఐక్యరాజ్యసమితి వ్యవస్థ అనుసరించిన అదుపు చర్యల్లో ఈ రెండు పద్ధతులు కీలకమయినవి.

అంతర్జాతీయ ప్రకటనలో పేర్కొన్న మానవహక్కుల ఉల్లంఘన జరిగినట్లు వచ్చిన ఆరోపణలు విచారణకు కమీషన్ ఎప్పటికప్పుడు తాత్కాలిక గ్రూపులను నియమించింది. మానవహక్కులు, ప్రాథమిక హక్కులకు సంబంధించిన వివక్షల నివారణకు, జాతి, వర్ణ, మత, భాషా, మైనారిటీల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలకు సంబంధించిన సిఫార్సులు చేసేందుకు కమీషన్ ఒక శాశ్వత ఉపసంఘాన్ని నియమించింది. ఈ సంఘం అంతర్జాతీయ ప్రకటన నేపధ్యంలో ప్రత్యేక అధ్యయనాలు కూడా జరుపుతుంది. వివిధ దేశాలలో ఉన్న విపక్షా విధానాలను అధ్యయనం చేయడానికి ప్రత్యేక నిపుణులను నియమించి, వారి నుంచి విలువైన నివేదికలను ఉపసంఘం స్వీకరించింది. ఉపసంఘం చేసిన పనుల్లో అతి ముఖ్యమైనది మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించడం. ఎకోసాక్ నిబంధనల ప్రకారం అటువంటి సమాచారాలు గోప్యమైనవి, గోప్యం కానివి అని రెండు తరగతులు. గోప్యమైన సమాచారాల జాబితాలో వివిధ ప్రయివేట్ సమావేశాల్లో కమీషన్‌కు అందే సమాచారం, ఆరోపణలకు సమాధానం కోరుతూ వివిధ దేశాల ప్రభుత్వాలకు రాసే లేఖలు ఉంటాయి. ఈ విషయాలకు సంబంధించిన అనుసరించవలసిన పద్ధతుల గురించి ఎకోసాక్ వివిధ తీర్మానాలలో పేర్కొన్నారు. ముఖ్యంగా 728 ఎఫ్ (1959), 1235 (1967), 1503 (1970) సెక్షన్లు ఈ పద్ధతుల గురించే చెబుతాయి. ఈ పద్ధతులను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ పెద్దగా ఫలితం లేదు. మానవహక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టే అధికారం తనకు లేదని ఎకోసాక్ భావిస్తున్నంతకాలం ఈ విషయంలో ఎటువంటి మెరుగుదల ఉండదు. ఈ పరిస్థితుల్లో ఫిర్యాదు చేసేవారికి, సంబంధిత ప్రభుత్వాలకు కమీషన్ సభ్యులకు సంధానకర్తగా మాత్రమే ఎకోసాక్ వ్యవహరించగలదు.

ఇక ఇప్పుడు మానవహక్కులకు అంతర్జాతీయ ఒడంబడికల్లో సూచించిన పద్ధతుల గురించి పరిశీలిద్దాము.

BRAOU

## 14.15 అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికల్లో అమలు పద్ధతులు :

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక ఒడంబడికలోని 16 వ ఆర్టికల్ ప్రకారం, ఒడంబడికలో సంతకాలు చేసిన దేశాలు తాము అంగీకరించిన విషయాలకు సంబంధించి తీసుకున్న చర్యలను, తాము ఆమోదించిన హక్కుల అమలులో సాధించిన పురోగతిని వివరిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలి. పౌర, రాజకీయ హక్కులకు సంబంధించిన ఒడంబడికలోని 40వ ఆర్టికల్‌లో కూడా ఇటువంటి నిబంధనే ఉన్నది. ఈ ఆర్టికల్ ప్రకారం – ఈ ఒడంబడికలో ప్రవేశించిన ఏడాదిలోగా ఒక నివేదిక సమర్పించాలి. ఆ తరువాత కమిటీ కోరినప్పుడల్లా నివేదికలు ఇవ్వాలి. ఇదికాక, 41వ ఆర్టికల్ ప్రకారం ఒడంబడికలోని భాగస్వామ్యదేశాలు ఒడంబడికలోని నిబంధనల ఉల్లంఘనల విషయంలో పరస్పరం చేసుకునే ఆరోపణలను కూడా స్వీకరించి, పరిశీలించే అధికారాన్ని కమిటీకి ఎప్పుడైనా ఇవ్వవచ్చు. ఈ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడికలోనే 1వ ఆర్టికల్‌లోని ఐచ్చిక నిబంధన ప్రకారం ప్రభుత్వాలు హక్కులు ఉల్లంఘనకు పాల్పడినట్టు వ్యక్తులు చేసే ఫిర్యాదులను కూడా కమిటీ పరిశీలనకు తీసుకోవచ్చు.

## 14.16 ముగింపు :

మానవహక్కుల పరిరక్షణలో అంతర్జాతీయ చట్టం ఎంతమేరకు సమర్థమైనదో పరిశీలించడానికి మనం ఈ పాఠంలో ప్రయత్నించాం. తిరుగులేని సార్వభౌమాధికారం అన్న భావన విషయంలో ఆయా దేశాలు ఎంతవరకు రాజీపడగలవు అన్నదాని మీద అంతర్జాతీయ చట్టం సమర్థత ఆధారపడి వుంటుందని మనం చెప్పుకోవచ్చు. మానవహక్కులను అంతర్జాతీయ చట్టం పరిధిలోని అంశంగా ఆమోదించడం అంటే దేశాల సార్వభౌమాధికార భావనను వదిలివేయడం కాదు. అయితే, మానవహక్కుల అంతర్జాతీయీకరణను ఆమోదించడం అంటే ఒక దేశం తన పౌరులతో ఎలా వ్యవహరిస్తుంది అన్నది అంతర్జాతీయ సమాజం కూడా పట్టించుకోదగ్గ విషయం అని అంగీకరించడమే అవుతుంది. కాబట్టి అది దేశాల సార్వభౌమాధికార భావనను ఎంతో కొంతమేరకు సడలిస్తుంది. తన సార్వభౌమాధికార హక్కుల గురించి ఎక్కువగా పరితపించే దేశాలకు ఇది నిజంగా గట్టి చిక్కే. అంతర్జాతీయ చట్టం మానవ హక్కుల నియంత్రణకు ఒక ముఖ్యమయిన సాధనం కావాలంటే సార్వభౌమాధికారానికి, మానవ హక్కులకు మధ్య ఎటువంటి వైరుధ్యం లేదన్న స్పృహ అంతర్జాతీయ సమాజంలో జీర్ణించుకోవలసిన అవసరం ఉన్నది.

BRAOU

## 14.17 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

**I ప్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. అంతర్జాతీయ చట్టం అంటే ఏమిటి ? అది ఎలా రూపొందిందో క్లుప్తంగా సూచించండి. దేశీయ చట్టాలతో పోలిస్తే అంతర్జాతీయ చట్టానికి ఉన్న బలహీనతలు ఏమిటి ?
2. మానవహక్కులను విశాలార్థంలో నిర్వచించండి. మానవహక్కుల పురోగతి విషయంలో రెండో ప్రపంచయుద్ధానంతర పరిస్థితి అంతకు మునుపటి పరిస్థితి కంటే గణనీయంగా భిన్నమైనదని ఎలా చెప్పగలరు?
3. మానవ హక్కుల అంతర్జాతీయీకరణ దేశాల సార్వభౌమాధికారానికి వ్యతిరేకమైనదా చర్చించండి.

**II క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. మానవహక్కులకు సంబంధించి జరిగిన వివిధ అంతర్జాతీయ ఒడంబడికలను పేర్కొనండి.
2. మానవహక్కుల రంగంలో ప్రమాణాలను ఏర్పరచడంలో ఐక్యరాజ్యసమితి సాధించిన ప్రధాన విజయాలను వివరించండి.
3. మానవహక్కుల అంతర్జాతీయ ప్రకటన వెలువడిన 50 ఏళ్ళలో జరిగిన కృషిని అంచనావేయండి.

BRAOU

# Model Question Paper

## Post Graduate Diploma in Human Rights

## Paper - III

## Human Rights - Global Experience

Max. Marks : 70

మొదటి విభాగం

(మార్కులు : 4x10=40)

ఈ క్రింది వాటిలో ఏవైనా నాలుగు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబు వ్రాయండి. ప్రతి ప్రశ్నకు 10 మార్కులు

1. అమెరికా, బ్రిటన్‌లలోని మానవ హక్కుల స్థితిగతులు మూడవ ప్రపంచదేశాల్లోని పరిస్థితులకన్నా ఎలా భిన్నంగా ఉన్నాయో పేర్కొనండి?
2. కెనడాలో రాజకీయ సంక్షోభానికిగల కారణాలు చర్చించండి?
3. మానవ హక్కుల వార సత్వానికి సోవియట్ యూనియన్ ఏమేరకు తోడ్పడింది? అంచనా వేయండి?
4. మానవ హక్కులపై మావో అభిప్రాయాలను విమర్శనాత్మకంగా పరిశీలించండి?
5. దక్షిణాఫ్రికా నూతన రాజ్యాంగంలో చోటు చేసుకున్న మానవ హక్కులను చర్చించండి?
6. ఇస్లామిక్ సమాజాలలోని మానవ హక్కుల స్థితిగతులు వివరించండి?
7. మానవ హక్కుల ఉద్యమాల లక్షణాలను, స్వభావాలను సంగ్రహంగా పరిశీలించండి?
8. ఐక్యరాజ్య సమితితో ముడిపడివున్న వివిధ మానవ హక్కుల కమిషన్ల గూర్చి చర్చించండి?

BRAOU

రెండవ విభాగము

(మార్కులు : 5x6=30)

ఈ క్రింది వాటిలో ఏవైనా ఐదుప్రశ్నలకు ఒక్కొక్కదానికి 20 పంక్తులలో జవాబు వ్రాయండి. ప్రతిప్రశ్నకు 6 మార్కులు

9. మానవ హక్కుల భవిష్యత్తుపై ప్రపంచీకరణ ప్రభావం చర్చించండి?
10. అమెరికాలో మహిళల నిరంతర వివక్ష గూర్చి పరిశీలించండి?
11. జపాన్‌లో కొరియన్‌ల హక్కుల పరిస్థితిని బేరీజు వేయండి?
12. ఉత్తర కొరియాలో మానవ హక్కుల ఉల్లంఘన సందర్భాలు పేర్కొనండి ?
13. పోలెండులోని మానవ హక్కుల పరిణామ చరిత్రను వివరించండి?
14. క్యూబాలో మానవహక్కుల స్థితిగతులు చర్చించండి?
15. దక్షిణాఫ్రికాలో వలసవాద ప్రభావం చర్చించండి?
16. లాటిన్ అమెరికాలో మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీసిన పరిస్థితులను విమర్శనాత్మకంగా పరిశీలించండి ?
17. హ్యూమన్ రైట్స్ వాచ్ గూర్చి వివరించండి ?
18. మానవ హక్కుల అంతర్జాతీయ కరణ దేశాల సార్వభౌమాధికారినికి వ్యతిరేకమైందా? చర్చించండి?

BRAOU

BRAOU

BRAOU